ప్రతి మనిషి తన జీవితంలో ఒక్కసారైనా పూర్తిగా
చదవవలసిన పరమోత్తమ గ్రంథం

ఓ౩మ్

సత్యార్థ ప్రకాశము

వేదాది వివిధ సచ్ఛాస్త్ర ప్రమాణ సమన్వితము

శిక్షా-ధర్మ-రాజనీతి-మతమతాంతర విషయక విశ్వకోశము

హిందీమూలం
మహర్షి స్వామి దయానంద సరస్వతి

తెలుగు అనువాదం
వాచస్పతి-విద్యావారిధి
సిద్ధాంతాలంకార-విద్యాభూషణ-ఆర్షవిద్యావినోద
వదరత్న డా॥ మర్రి కృష్ణారెడ్డి, M.A., M.Ed., Ph.D., D.litt.

మహర్షి దయానంద యశః ప్రకాశక స్తవం

వేదోద్ధారకులు - ఆర్య సమాజ సంస్థాపకులు
పరమహంస పరివ్రాజకాచార్యులు
హర్షి దయానంద సరస్వతి
1824-1883

భారతజాతి ఔన్నత్యం - భువనంలో ప్రభవాలని
పూర్వ పూర్వ వైభవమును - ప్రాభవముగ పొందాలని
అడుగంటిన వేద ధర్మ - మిలలో మరల వెలయాలని
కులమతభేదము కూకటి - వ్రేళ్ళతో పెకిలించాలని
వర్ణాశ్రమ ధర్మాలను - వరుసగ వెలియించాలని
దీనహీనమానవులను - దయతో దరి చేర్చాలని
జాతికి బట్టిన చెర - పీడన జ్వరమొదలాలని
ఆంగ్లభావజాలరోగ - మూల భిత్తి కదలాలని
స్వామి దయానందుడు తన - హృదయములో మదనపడి
మదనపడి మదనపడి - మదనపడి మదనపడి
వేదనతో సాధనతో - శోధనతో బోధనతో
ఋషియై మహాఋషియై - యిల వేదార్థము తెలిపినాడు
అడవులెన్నొ తిరిగి పుడమి - యిడుములెన్నొ తలదాల్చి
వేదశాస్త్రమర్మాలను - హృదివేదిలో సరిచూసి
వేదధర్మ స్థాపనకై - తనువాదిగ యెదురొడ్డి
వేదభాష్యరచనజేసి - వేదోద్ధరణంబు జేసి
సత్యార్థము తెలిపినాడు - మతములన్ని కూల్చినాడు
శాస్త్రార్థము గెల్చినాడు - కల్పితముల చీల్చినాడు
అజ్ఞానము వ్రేల్చినాడు - సుజ్ఞానము నిలిపినాడు
ధైర్యముతో తొడగొట్టి - శాస్త్రార్థము పిలిచినాడు
లంగోటును నదుముగట్టి - 'ఓం' ధ్వజమును చేతబట్టి
'కృణ్వంతో విశ్వమార్య' - మంటు ముందు సాగినాడు
గోరక్షణ జేసినాడు - నిజయజ్ఞము తెలిపినాడు
జడమతముల మర్మముల - గుట్టురట్టు చేసినాడు
గుండు గుత్తజేసి గుండు - సున్న జుట్టి వేసినాడు
చిల్లర మతముల పిల్లల - చేష్టలుగా నెంచినాడు
స్వాతంత్ర్యపు బీజాలను - ప్రతిహృదిలో నాటినాడు
స్వారాజ్యపు సమరానికి - పునాదులను వేసినాడు
బ్రహ్మచర్యవ్రతముతోడ - క్షత్రియులను కుదిపినాడు
సన్న్యాసపు దీక్షతోడ - సమాజమును లేపినాడు
ఇట్టి గట్టి దయానందు - నెట్టివారికైన పొగడ
తరమగునే తెరమరుగున - పడిపోవుట సాధ్యమగునె?
ఇవ్విధంబుగ దివ్యమగు శ్రీ - దయానందుని యశోగాథను
కొండ నద్దము జూపువిధముగ - నాదు హృ'దయ'ము 'నందు' జూపిత
చదివి ప్రేరణ పొంది వైదిక - ధర్మమార్గమునందు నడువుడు
జీవితమ్మొక దివ్యవాహన - మంటు వేదము చేత బూనుడు ॥

- డా॥ మట్టి కృష్ణారెడ్డి ఆర్య

తెలుగులో
నాలుగు వేదాలు
వేద భాష్యాలు

ఓ౩మ్

వేదం

మానవధర్మమునకు మూలం
సమస్తసత్యవిద్యల గ్రంథం
ఈశ్వరీయ జ్ఞానం
విశ్వవిజ్ఞానకోశం
సర్వశాస్త్రములకు ఆధారం
ప్రతివ్యక్తి చదువ దగినది
ప్రతిబడిలో బోధించ దగినది
ప్రతిగుడిలో స్థాపించ దగినది
ప్రతి ఇంట్లో ఉంచ దగినది
సత్యం - జ్ఞానం - అనంతం - బ్రహ్మ ప్రతివ్యక్తి వినదగినది

వేదాలు-అనంత జ్ఞానినిధులు

మానవజాతిని ఆదర్శవంతంగా తీర్చిదిద్దే విజ్ఞానగనులు
విశ్వములోని జ్ఞానవిజ్ఞానములకు మూలస్రోతస్సులు
సృష్టిరహస్యాలను ప్రకటించు జ్ఞానభాండాగారాలు
మానవజాతి సత్యకర్మలన్నింటికీ ప్రమాణాలు
సమస్తకళలను పరిఢవిల్లజేయు విద్యుల్లతలు
భారతీయతాత్త్విక జీవిత అంతర్వాహినులు
సామాజిక సాంకేతిక విజ్ఞాన బోధకములు
విశ్వసాహిత్య వికాసానికి మూలకందాలు
మానవజాతి మనుగడకు మూలాధారాలు
భారతీయ సంస్కృతికి మూలదర్పణాలు
సర్వదా ఆచరణీయ సన్మార్గబోధకములు
విశ్వమానవ మేధోవికాసానికి ప్రతీకలు
మానవత్వమునకు పట్టుకొమ్మలు
మానవ జీవితానికి దిక్సూచికలు
భువిని దివిగా మార్చు కావ్యాలు
మానవ జీవిత లక్ష్య సాధకాలు
సకలలోకధర్మసర్వస్వభూతాలు
సనాతనమైన జ్ఞాననేత్రాలు
నిత్యపారాయణగ్రంథాలు
జీవితగమ్యబోధకములు
జ్ఞానవిజ్ఞాన నిధులు
ముక్తినిర్దేశకములు
వేయిమాటలేల? అణువు మొదలు
విశ్వాంతరాళఖగోళరహస్యములు
సమస్తము వేదాలయందు నిక్షిప్తమైయున్నవి.

'వేదగిరి' నిర్మాణం
వేదాల ముద్రణం
వేదజ్ఞాన ప్రసరణం
వేదధర్మ విస్తరణం
వేదానికే
నా జీవిత సర్వస్వం అర్పణం



వేదోऽఖిలో
ధర్మమూలమ్

యజ్ఞో వై
శ్రేష్ఠతమం

వేదం
చదవండి
చదివించండి

సంస్కృత భాష్యం,
తెలుగు టీకా తాత్పర్యం,
ఆంగ్ల భావార్థం,
ఋషి, దేవత, చంధస్సు,
స్వరసహితంగా
మంత్రానుక్రమణికలతో

వేదమాత

గాయత్రీమహామంత్రము - గురుమంత్రము

ఋషిః - విశ్వామిత్రః, దేవతా - సవితా, ఛందః - గాయత్రీ, స్వరః - షడ్జః ॥

ఓం భూర్భువస్సువః । తత్సవితుర్వరేణ్యం
భర్గో దేవస్య ధీమహి । ధియో యో నః ప్రచోదయాత్ ॥

ఋ. 3.62.10., యజు. 3.35, 22.9, 30.2, 36.3, సామ. 1462.

భావార్థము:- ఓ సచ్చిదానంద స్వరూపా! నీ దివ్యము వరేణ్యమునైన శుద్ధవిజ్ఞాన స్వరూపమును మేము నిత్యము మా హృదయమున ధ్యానింతుము. మాకు సద్బుద్ధినిచ్చి సత్కర్మల నాచరించునట్లు అనుగ్రహింపుము.

సకల జ్ఞాన-వర ప్రదాయిని 'వేదమాత' ప్రార్థన

ఓం స్తుతా మయా వరదా వేదమాతా ప్రచోదయన్తాం। పావమానీ ద్విజానాం ఆయుః ప్రాణం
ప్రజాం పశుం కీర్తిం ద్రవిణం బ్రహ్మవర్చసం మహ్యం దత్త్వా వ్రజత బ్రహ్మలోకమ్ ॥ అథర్వ. 19-71-1

భావార్థము:- వరములనిచ్చు ఓ వేదమాతా ! మేము నిన్ను ప్రతినిత్యము మా హృదయమునందు ధ్యానించెదముగాక! నీవు మాకు దివ్యజీవనమగు ఆయువును, ప్రాణమును, సత్సంతానమును, పాడిపంటలను, కీర్తిని, ధనమును మరియు బ్రహ్మవర్చస్సును ఇచ్చి తదనంతరము శాశ్వతమగు బ్రహ్మలోకమును అనగా మోక్షానందమును ప్రసాదించుము.

వేదం - జీవన నాదం

మానవులందరూ వేదమును చదువవచ్చును

ఓం యథేమాం వాచం కల్యాణీమావదాని జనేభ్యః ।
బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయచార్యాయ చ స్వాయ చారణాయ ॥ యజు. 26-2

పరమేశ్వరుడు ఇట్లు ఉపదేశించుచున్నాడు. ఓ మానవులారా! నేను ఎట్లు ఈ సమస్త మానవులకొరకు సంసార సుఖమును, ముక్తిజ్ఞానమును ప్రసాదించునట్టి కల్యాణప్రదమగు ఋగ్వేదాది చతుర్వేదవాణిని ఉపదేశించుచున్నానో అటులనే మీరును ఈ చతుర్వేదములను సంపూర్ణముగా అధ్యయనం చేసి అందరికీ ఉపదేశింపుడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, అతిశూద్రులకును, వారి సేవకులకును, అన్ని వర్ణముల స్త్రీలకును అనగా మానవులందరికిని ఈ నాలుగు వేదములను ప్రసాదించితిని. అనగా మానవులందరు కుల, మత, ప్రాంత, వర్ణ, వర్గాది భేదములు లేకుండా వేదములను చదువుచు - చదివించుచు, వినుచు - వినిపించుచు జ్ఞానవిజ్ఞానములను వృద్ధిపరచుకొంటూ సదా దుఃఖములనుండి దూరులై అమృతానందమును పొందవలయునని అర్థము.

కృషి సమర్పణ

ఓం నమో వృద్ధాయ చ, ప్రథమాయ చ, జ్యేష్ఠాయ చ, పూర్వజాయ చ

- యజు. 16-30,32

వేదాది వివిధ సచ్ఛాస్త్ర ప్రమాణ సమన్వితంగా
వ్యష్టి, సమిష్టి నిత్యజీవన వ్యవహార సద్బోధకంగా
ధర్మాది రాజనీతి మతమతాంతర విషయక విశ్వకోశంగా
సత్యసనాతనవైదిక వర్ణాశ్రమ జీవనవిధానసర్వస్వంగా
సకలలోక జనకళ్యాణ సన్మార్గ సుబోధక సముచ్చయంగా
నిత్యసత్యాన్విత వేదతత్వార్థ ప్రకాశకంగా
సన్మార్గవాంఛిత సమస్తమానవాళికి నిత్యపారాయణగ్రంథంగా
సత్యంవలె శాశ్వతంగా అఖండితమై విరాజిల్లే

"సత్యార్థ ప్రకాశ" మనే మహోద్గ్రంథాన్ని
మానవలోకాని కందించిన మహామనీషి, మానవతావాది.
"మహర్షి దయానంద సరస్వతీస్వామి"వారి దివ్య పవిత్రాత్మకు ప్రణమిల్లుతూ,
దీన్ని మొట్టమొదట 1906లో (10 సముల్లాసాలు) తెలుగులోని కనువదించిన
స్వ. శ్రీ పండిత ఆదిపూడి సోమనాథరావు గారికి,
1912లో 11వ సముల్లాసాన్ని అనువదించిన స్వ. **శ్రీ పండిత ఆదిపూడి గోపాలరావు గారికి,**
1932లో 12,13,14 సముల్లాసాలను అనువదించి పరిపూర్ణం చేసిన
స్వ. శ్రీ పండిత ధూళిపేట రాజరత్నమాచార్యుల గారికి,
1940లో ఈ సత్యార్థ ప్రకాశాన్ని ఆమూలాగ్రం సంపూర్ణంగా సవరించిన పండితవరేణ్యులు,
వేద ప్రచారకులు **శ్రీ పండిత మదనమోహన విద్యాసాగర్ గారికి,**
సంస్కృతాంధ్రాంగ్లహిందీభాషాప్రవీణులైన స్వ. **శ్రీ వడ్లమూడి వెంకటరత్నం గారికి,**
వేదనిష్ఠాగరిష్ఠులు, యోగాభ్యాసనిరతులు, సకలశాస్త్ర పారంగతులు, ప్రస్థానత్రయ వ్యాఖ్యాతలు
మద్గురువరేణ్యులు స్వ. **శ్రీ పండిత గోపదేవశాస్త్రి దర్శనాచార్యులు గారికి,**
వేదధర్మ ప్రచారకులు స్వ. **శ్రీ పండిత వీరభద్రశాస్త్రి గారికి,**
సంస్కృతాంధ్ర విద్వాంసులు, నిరంతర వేదచింతకులు,
స్వ. శ్రీ పండిత విశ్వమిత్ర ఆచార్య గారికి, పరమయోగిని **మాతా రాజ్యలక్ష్మీదేవి గారికి.....**
వీరందరూ స్వర్గస్థులైనందున వీరి పవిత్రాత్మలకు ప్రణమిల్లుతూ..
వీరికి అనేకానేక శతసహస్రాధిక నమస్సులతో.....

- మట్టి కృష్ణారెడ్డి

ప్రతి మనిషి తన జీవితంలో ఒక్కసారైనా పూర్తిగా చదవవలసిన పరమోత్తమ గ్రంథం

ఓ౩మ్

సత్యార్థ ప్రకాశము

వేదాది వివిధ సచ్ఛాస్త్ర ప్రమాణ సమన్వితము

శిక్షా-ధర్మ-రాజనీతి-మతమతాంతర విషయక విశ్వకోశము

హిందీ మూలం

మహర్షి స్వామి దయానంద సరస్వతి

తెలుగు అనువాదం

వాచస్పతి-విద్యావారిధి

సిద్ధాంతాలంకార-విద్యాభూషణ-ఆర్షవిద్యావినోద

వేదరత్న డా॥ మర్రి కృష్ణారెడ్డి ఆర్య, M.A., M.Ed., Ph.D., D.lit.

సంపాదకురాలు

శ్రీమతి మర్రి రాధాదేవి (నిత్యాగ్నిహోత్రురాలు)

Tagore Publishing Hou

ఇది నా తొలి ప్రయత్నం

మహర్షి దయానందసరస్వతిగారు హిందీలో రచించిన "సత్యార్థప్రకాశం" అజ్ఞాన తిమిరనాశకం. దీని ప్రకాశం మానవజాతి పునర్నిర్మాణానికి, పురోగమనానికి మార్గదర్శకం. విశ్వమానవ జీవనవికాసానికి ఆశాకిరణం సనాతనమైన వైదికజీవన విధానానికి నిదర్శనం. ఆత్మవికాసానికి, ఆత్మోద్ధరణకు, జీవన సాఫల్యానికి సహకరించే సత్యజ్ఞాన ప్రకాశకం. ఇది సదా, సర్వథా, సమాజాన్ని మేల్కొల్పే నిత్యచైతన్యప్రకాశకం.

ఈ గ్రంథం 1875లో హిందీభాషలో ముద్రించబడింది. తర్వాత దేశవిదేశ భాషలలో అనువదింపబడి, రామాయణం భగవద్గీతల తర్వాత అత్యధికంగా జనాదరణను పొందిన గ్రంథం ఈ "సత్యార్థ ప్రకాశం." ఇది నూటికి నూరు శాతం సార్థక నామధేయం గల గ్రంథం.

ఇట్టి మహోన్నతమైన "సత్యార్థప్రకాశం" తెలుగుభాషలో అనువదింపబడి 100 సంవత్సరాలు దాటినా జనబాహుళ్యంలోనికి వెళ్ళలేకపోయింది. కారణం అది పండితభాషలో గ్రాంథికంగా ఉండటం. మిడిమిడి అక్షరజ్ఞానం ఉన్నవారికిది అంత తేలికగా అర్థంకాదు. భావం ఎంతో గొప్పగా ఉన్నా, భాష సామాన్యులకు అందుబాటులో లేకపోవడం వల్ల దీన్ని చాలామంది చదివి అర్థం చేసుకోలేకపోతున్నారు. వైజ్ఞానికంగా, తార్కికంగా ఆలోచించే ఈ కాలంలో ఇంత గొప్ప గ్రంథం విద్యావంతులకు చేరువకాలేకపోతున్నది.

నేను తెలుగులో వేదాలు, వేదభాష్యాలు మొదలగు వేదసాహిత్యాన్ని ముద్రిస్తుండటంవల్ల చాలామంది ఆర్యులు నన్ను "సత్యార్థ ప్రకాశాన్ని" సరళీకరించమని కోరారు. వేదప్రచారాన్ని, ఆర్యసమాజవిస్తారాన్ని దృష్టిలో పెట్టుకొని పూర్వులు అనువదించిన "సత్యార్థ ప్రకాశం" ప్రతులను సహాయకంగా తీసుకొని మూలగ్రంథాని కేమాత్రం తేడా రాకుండా సాధ్యమైనంతవరకు తేలిక భాషలో, సరళంగా, సుబోధకంగా ప్రతి సామాన్యుడు చదివి అర్థంచేసుకునే విధంగా నా శక్తికొలది ప్రయత్నించి, ముద్రించి మీ ముందుంచుతున్నాను.

పూర్వార్ధాన్ని (10 సముల్లాసాలు) 3 సంవత్సరాల క్రితమే సిద్ధం చేసాను. ఉత్తరార్ధం ఖండన మండనాలుండటం వల్ల అనువాదం క్లిష్టంగా ఉండడంతో ఇంతకాలం ప్రక్కన పెట్టాను. ఫిబ్రవరి (2017) మొదటివారంలో భాగ్యనగరంలో జరుగుతున్న జాతీయ ఆర్యవిద్వత్సమ్మేళనానికల్లా ముద్రించాలన్న తపనతో కొన్నిరోజులకు ముందే ఈ విషయం తెలువడం వల్ల, ఎక్కువ సమయం లేకపోవడం వల్ల ఉత్తరార్ధాని ఇంకా అందంగా సంశోధన చేయలేక పోయాను. అంతమాత్రాన భావానికేమాత్రం లోటు రాకుండా సాధ్యమైనంత వరకు సరళీకరణకు ప్రయత్నించాను. మలి ముద్రణలో ఇంకా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగలను.

13,14 సముల్లాసాలు బైబిలు ఖురానుకు చేందినవి కావడంవల్ల నేడు ప్రచారంలో ఉన్న బైబిలు ఖురానులను బట్టి ఉద్ధరణలుగా ఆ గ్రంథాలలో ఉన్న వాక్యాలనే యథాతథంగా ఇవ్వడం, ఆ సంఖ్యలనే వాడడం జరిగింది. ఇందులో ఇది విశేష కార్యం.

ఇందులోని గుణాలన్నీ మూలరచయిత, అనువాదకర్తలవి. భాష, భావాదిదోషాలు నావి.

ఇది సాహసమే ఐనా దుస్సాహసంకాదు. మద్గురువరేణ్యులు పండిత గోపదేవశాస్త్రిగారి శిష్యునిగా, ఋషిదయానందుని వారసునిగా, వేదభక్తునిగా, వేదధర్మ ప్రచారాసక్తునిగా ఈ కార్యం యథాశక్తి నా కర్తవ్యం.

భగవంతుడు సహకరించు గాక! ఆర్యజనులు ఆదరింతురు గాక !

30-1-2017, హైదరాబాద్.

– మర్రి కృష్ణారెడ్డి

ఓ౩మ్

సచ్చిదానందేశ్వరాయ నమో నమః

భూమిక

నేను ఈ 'సత్యార్థ ప్రకాశ' మను గ్రంథాన్ని రచించు సమయంలో, అంతకు పూర్వం కూడ సంభాషణలోనూ పఠన పాఠనాలలోనూ సంస్కృతభాషనే వాడేవాడిని. నా మాతృభాష 'గుజరాతి' కావడం చేత నాకు హిందీభాషలో సంపూర్ణ పరిజ్ఞానం లేకపోవుట చేతనూ అక్కడక్కడ భాషలో దోషాలేర్పడినవి. ఇప్పుడు హిందీభాషలో వ్రాయడం, మాట్లాడడం అభ్యాసమైంది. కావున ఈ గ్రంథాన్ని భాషావ్యాకరణానుసారంగా సవరించి ద్వితీయ ముద్రణ చేసాను. అక్కడక్కడ శబ్దాలను వాక్యాలను మార్చుట ఉచితమని భావించి రచనలో కొంత పరివర్తన చేసాను. అటుల చేయనిచో భాషాశైలిని మార్చుట కష్టమయ్యేడిది. అర్థం మాత్రం మార్చలేదు. కొన్ని విషయాలు మాత్రం విశేషించి వ్రాయబడినవి. ఇప్పుడు ప్రథమ ముద్రణలో జరిగిన దోషాలను సరిచేసి చక్కగా ముద్రించటం జరిగింది.

ఈ గ్రంథం పదునాలుగు సముల్లాసాలతో రచింపబడింది. మొదటి పది సముల్లాసాలు పూర్వార్ధంగాను, మిగిలిన నాలుగు సముల్లాసాలు ఉత్తరార్ధంగాను విభజింపబడింది. కొన్ని కారణాలచేత "చివరి రెండు సముల్లాసాలు, స్వమంతవ్యామంతవ్యప్రకాశం" అను నా సిద్ధాంతాలు, మొదటి ముద్రణలో ముద్రించలేదు. ద్వితీయముద్రణతో వాటిని చేర్చి ముద్రించితిని.

1.	ప్రథమ సముల్లాసంలో	ఈశ్వరుని 'ఓం'కారాది నామాల వ్యాఖ్య.
2.	ద్వితీయ సముల్లాసంలో	సంతాన శిక్షణ.
3.	తృతీయ సముల్లాసంలో	బ్రహ్మచర్యం, పఠనపాఠన వ్యవస్థ.
4.	చతుర్థ సముల్లాసంలో	వివాహం, గృహస్థాశ్రమాల వ్యవహారాలు.
5.	పంచమ సముల్లాసంలో	వానప్రస్థ, సన్యాసాశ్రమాల విధులు.
6.	షష్ఠ సముల్లాసంలో	రాజ ధర్మం.
7.	సప్తమ సముల్లాసంలో	వేదం, పరమేశ్వర విషయాలు.

8. అష్టమ సముల్లాసంలో	జగత్తుకు సంబంధించిన ఉత్పత్తి, స్థితి, ప్రళయాలు.
9. నవమ సముల్లాసంలో	విద్య, అవిద్య, బంధ మోక్షాల వ్యాఖ్యానం.
10. దశమ సముల్లాసంలో	ఆచార, అనాచారాలు; భక్ష్యాభక్ష్యాల విషయాలు.
11. ఏకాదశ సముల్లాసంలో	ఆర్యావర్తంలో గల మత మతాంతరాల ఖండన మండన విషయాలు.
12. ద్వాదశ సముల్లాసంలో	చార్వాక, బౌద్ధ, జైన మతాల విషయాలు.
13. త్రయోదశ సముల్లాసంలో	క్రైస్తవ మత విషయాలు.
14. చతుర్దశ సముల్లాసంలో	మహమ్మదీయుల మత విషయాలు వ్రాయబడినవి.

ఈ పదునాలుగు సముల్లాసాల తర్వాత ఆర్యుల సనాతన వేదవిహిత మతాన్ని గూర్చి విశేషంగా వ్యాఖ్య వ్రాసితిని. దీనిని సంపూర్ణంగా సత్యమని నేను నమ్ముచున్నాను.

సత్యములైన అర్థాలను తెలియజేయటానికే నేను ఈ గ్రంథాన్ని రచించుటలో ముఖ్య ప్రయోజనం. సత్యాన్ని సత్యంగా, అసత్యాన్ని అసత్యంగా తెలియజేయటమే 'సత్యార్థప్రకాశము' అని తలచితిని. సత్యాన్ని అసత్యంగా, అసత్యాన్ని, సత్యంగా తెలియపరచుట సత్యమనబడదు. ఒక పదార్థాన్ని గూర్చి ఉన్నదునట్లుగా చెప్పటం వ్రాయటం, అంగీకరించటం సత్యమనబడుతుంది. పక్షపాతంగలవాడు తన అసత్యాన్ని సత్యమని, విరుద్ధ మతములవారి సత్యాన్ని అసత్యమని నిరూపించుటకు ప్రయత్నిస్తాడు. కావున అతడు సత్యమతాన్ని స్వీకరించలేడు. కాబట్టి తమ ఉపదేశాలతో, రచనలతో సత్యాసత్యాల స్వరూపాన్ని మానవులందరి ముందుంచుట, తెలియపరచుట ఆప్తులగు విద్వాంసుల ముఖ్య కర్తవ్యం. అప్పుడే జనులు వివేకం కలిగి, తమ హితాహితాలను ఎరిగి, సత్యార్థాన్ని గ్రహించి, అసత్యార్థన్ని వదలి సదా ఆనందంగా ఉంటారు.

మానవుని ఆత్మ సత్యాసత్యాలను తెలిసికొనునదై ఉన్నది. అయినను స్వప్రయోజన సిద్ధి కొరకు పట్టుదలతోను, దురాగ్రహముతోను, అవిద్య మొదలగు దోషాల వలనను మానవుడు సత్యమును వీడి అసత్యమువైపు ఆకర్షితుడగుచుండును. కాని ఈ గ్రంథమునందు అట్టి ప్రవృత్తికి చోటు లేదు. ఒకరి మనస్సును నొప్పించటంగాని, ఒకరికి హాని కలిగించటం గాని ఈ గ్రంథం యొక్క ఉద్దేశ్యం కాదు. దేనివలన మానవజాతికి ఉన్నతి, ఉపకారం కలుగునో, సత్యాసత్యములను

మానవులు తెలిసికొని సత్యమును గ్రహించి అసత్యమును విడుతురో అదియే దీని ముఖ్యోద్దేశము. మానవజాతి ఉన్నతికి సత్యోపదేశానికి మించిన సాధనం మరొకటి లేదు.

ఈ గ్రంథ ముద్రణలో గాని, సవరణలో గాని పొరపాట్లుండినచో విద్వాంసులు వానిని తెలియపరచిన అవి సత్యములైనచో మలిముద్రణలో సవరింపబడును. ఎవరైనా పక్షపాత బుద్ధితో విపరీతపు సందేహాలు, ఖండన మండనాలు చేసినచో వానిపై దృష్టిపెటము. ఎవరైనా మానవహితాన్ని కోరి దేనినైనా తెలిపినచో అది సత్యమని తెలిసినపుడు అతని అభిప్రాయాన్ని స్వీకరిస్తాము.

ప్రస్తుతము ప్రతి మతంలో – సంప్రదాయంలో చాలా మంది విద్వాంసులున్నారు. వారు పక్షపాతరహితులై సర్వతంత్ర సిద్ధాంతాలను, అనగా ప్రజలందరు తమకనుకూలమైన సత్యాన్ని గ్రహించి, పరస్పర విరుద్ధాలైన వాటిని వదలి పరస్పర ప్రేమతో ప్రవర్తిస్తూ ఇతరులను కూడా అట్లే ప్రవర్తింపజేస్తే ఈ ప్రపంచానికెంతో మేలు కలుగుతుంది. వివిధ రకాల స్వార్థపరుల ఆగడాలు, విద్వాంసులలో, జ్ఞానులలో, సంఘ సంస్కర్తలలో గల పరస్పర విరోధాలవల్ల సంఘానికి సకాలంలో మార్గదర్శనం లభించకపోవడం వల్ల, అవిద్వాంసులు, అజ్ఞానులు, సంఘవిద్రోహక వ్యక్తులు విచ్చలవిడిగా తమ దురాగతాలను కొనసాగించడం వల్ల సమాజంలో శాంతి భద్రతలు నశించి అనేక విధాల దుఃఖాలు ప్రబలి, సుఖశాంతులు నశిస్తున్నాయి. ఈ హానియే మానవసమాజాన్ని దుఃఖసాగరంలో ముంచివేస్తున్నది.

సర్వజనహిత లక్ష్యంతో ప్రవర్తించువారికి కొందరు స్వార్థపరులు విరోధంతో అనేక విఘ్నాలను కలుగజేస్తారు. **"సత్యమేవ జయతే నానృతమ్, సత్యేన పంథా వితతో దేవయానః"**(ముండకోపనిషత్తు 3-1-6) అనగా "సర్వదా సత్యానికి విజయం, అసత్యానికి పరాజయం కలుగుతుంది. సత్యమే విద్వాంసులకు విశాలమైన మార్గం" అను ఈ దృఢనిశ్చయంతో ఆప్తపురుషులు పరోపకారం చేయుటలో తటస్థులై ఉండక సదా సత్యార్థాన్ని ప్రకటిస్తూండాలి.

"యత్తదగ్రే విషమివ పరిణామే- మృతోపమమ్" భగవద్గీత 18-27

"విద్యాధ్యయనం చేస్తున్నప్పుడు, ధర్మాన్ని ఆచరిస్తున్నప్పుడు, సత్కర్మను చేస్తున్నప్పుడు మొదట విషం వలె అనిపించినా తర్వాత అది అమృతతుల్య మౌతుంది" అని గీతవచనము. నిజానికిది ఒక నిశ్చితమైన అభిప్రాయం. ఈ విషయాలను మనస్సులో ఉంచుకొనే నే నీ గ్రంథాన్ని రచించాను. పాఠకులు, శ్రోతలును ప్రేమతో ఈ గ్రంథాన్ని చదివి ఇందులోని సత్యాసత్యాలను తెలిసికొని తమ ఇష్టానుసారం నచ్చినట్లు చేయాలి.

అన్ని మతాలలోగల సత్యవిషయాల నన్నింటినీ అనగా అవిరుద్ధాలగు వానిని స్వీకరించి, విరుద్ధాలైన వానిని అనగా మిథ్యావిషయములను ఖండించటమే ఈ గ్రంథం యొక్క ముఖ్యోద్దేశ్యం.

ఈ గ్రంథరచనలో మరొక అభిప్రాయమేమనగా! సమస్త మతమతాంతరాలలో రహస్యంగానూ, ప్రకటంగానూ ఉన్న దోషాలను, చెడువిషయాలను తెలియజేసి, విద్వాంసులు, అవిద్వాంసులు నైన సర్వసాధారణ మానవుల ముందుంచుటయే. దీనినందరూ చర్చనీయాంశంగా తీసుకొని అన్ని విషయాలను శ్రద్ధతో విచారించి, పరస్పరం ప్రేమతో సత్యాన్ని నిర్ణయించి తదనుకూలంగా మెలగాలి.

నేను ఈ ఆర్యావర్తమున జన్మించి, ఇక్కడనే నివసిస్తున్నా, ఈ దేశంలో అనేక మతాలలోగల అసత్యవిషయాలను పక్షపాతం లేకుండా ఉన్నదున్నట్లుగా ప్రకటించాను. మానవ సమాజోన్నతి కొరకు స్వదేశవాసులతో ప్రవర్తించునటులనే విదేశీయులతో కూడ ప్రవర్తించాను. అటులనే సజ్జను లందరూ ప్రవర్తించుట మంచిది. నేను కూడా ఏదో ఒక దేశము కొరకు మతంకొరకు పక్షపాతినైనచో, నేనును స్వమత స్తుతి, మండన, ప్రచారాలు చేస్తూ, పరమతాల నింద హాని విరోధాలను చేసేవాడను. కాని ఇవదంతా మానవత్వానికి తగని పని. క్రూరజంతువులు బలిష్ఠులై ఇతర జంతువులను హింసించి చంపివేయునట్లు, మానవ శరీరాన్ని ధరించినవారు కూడ అట్టి కర్మలే చేసినచో, వారు మానవ స్వభావం కలవారు కారు. పశుతుల్యులనబడుతారు. బలవంతుడై నిర్బలులను రక్షించువాడే మనుష్యుడు. స్వార్థవశుడై కేవలం పరులకు హానిజేయువాడు 'పశువులకు పెద్దన్నవంటివాడు' అనగా పశువులకన్న హీనుడని తెలుసుకోవాలి.

11 సముల్లాసాల వరకు ఆర్యావర్త దేశీయుల- భారతీయుల విషయంలో విశేషించి వ్రాసాను. ఈ సముల్లాసాలలో ప్రకాశితమైన సత్యమతం వేదోక్తమగుట వల్ల నేను అన్ని విధాలా దాన్ని అంగీకరింతును. నవీన పురాణాలలో, తంత్ర గ్రంథాలలో వ్రాయబడిన విషయాలు విడువదగిన వగుటచే వానిని ఖండించాను.

అటులనే ఇతరదేశాలకు చెందిన క్రైస్తవ మహమ్మదీయాలకాధారమైన బైబిలు, ఖురానులలోగల కొన్ని అసత్య విషయాలను కూడా నిష్పక్షపాతంగా వెల్లడిచేసాను.

పన్నెండవ సముల్లాసంలో కొంతవరకు వ్రాసిన చార్వాకమత క్షీణించిపోయినను, అనీశ్వరవాదాది విషయాలలో దానికిని, బౌద్ధ జైన మతాలకును ఎక్కువ సంబంధం కలిగి ఉన్నది

చార్వాకులు అందరికన్న గొప్ప నాస్తికులు. వారి చేష్టలను నిరోధించుట అవసరం. లేనిచో లోకంలో అనేక అనర్థాలకు అది కారణమౌతుంది.

బౌద్ధ జైనతాలు చార్వాక మతం వలెనే ఉండటంవలన వాటి గురించియు పన్నెండవ సముల్లాసంలో వ్రాసాను. బౌద్ధ జైనులకును చార్వాకులకును కొన్నింటిలో సామీప్యతలే గాక మరికొన్నింటిలో వ్యతిరేకత కూడ ఉన్నది. జైనులు కూడ అనేక విషయాలలో చార్వాకులతో మైత్రి కలిగియుండి, కొన్ని విషయాలలో మాత్రమే భేదం కలిగి ఉన్నారు. కావుననే జైనులది భిన్న శాఖగా లెక్కించబడుచున్నది. ఆ భేదాన్ని 12వ సముల్లాసంలో వ్రాసాను. అందులో దాన్ని యథాయోగ్యంగా లెక్కించబడుచున్నది. ఆ భేదాన్ని 12వ సముల్లాసంలో వ్రాసాను. అందులో దాన్ని యథాయోగ్యంగా తెలిసికొనండి. బౌద్ధ జైన చార్వాక మత విషయాలు, వానిలో గల భేదాలు కూడ అందే వ్రాయబడినవి.

వీనిలో బౌద్ధుట దీపవంశాది ప్రాచీన గ్రంథాలలో, 'బౌద్ధమత సంగ్రహం' "సర్వదర్శన సంగ్రహం"లో చూపబడిన అంశాలే ఇందు వ్రాయబడినవి. జైనుల సిద్ధాంత గ్రంథాలు ఈ క్రింద వ్రాయబడినవి.

వాటిలో నాలుగు మూల సూత్రాలు:- 1. ఆవశ్యక సూత్రాలు, 2. విశేష ఆవశ్యక సూత్రాలు, 3. దశవైకాలిక సూత్రాలు, 4. పాక్షిక సూత్రాలు.

పదకొండు అంగాలు:- 1. ఆచారాంగ సూత్రం, 2. సుగడాంగ సూత్రం, 3. థాణాంగ సూత్రం, 4. సమవాయాంగ సూత్రం, 5. భగవతీ సూత్రం, 6. జ్ఞాతాధర్మకథా సూత్రం, 7. ఉపాసక దశా సూత్రం, 8. అంతగడదశా సూత్రం, 9. అనుత్తరోవవాయీ సూత్రం, 10. విపాక సూత్రం, 11. ప్రశ్నవ్యాకరణ సూత్రం.

పన్నెండు ఉపాంగాలు:- 1. ఉపవాయీ సూత్రం 2. రావప్సేనీ సూత్రం, 3. జీవాభిగమ సూత్రం, 4. పన్నగణాసూత్రం, 5. జంబుద్వీప పన్నతీ సూత్రం, 6. చందపన్నతీ సూత్రం, 7. సూరపన్నతీ సూత్రం, 8. నిరియావలీ సూత్రం, 9. కప్పియా సూత్రం, 10. కపవడీసయా సూత్రం, 11. పూప్పియా సూత్రం, 12. పుప్ఫచూలియా సూత్రం.

ఐదు కల్పసూత్రాలు:- 1. ఉత్తరాధ్యయన సూత్రం, 2. నిశీథ సూత్రం, 3. కల్ప సూత్రం, 4. వ్యవహార సూత్రం, 5. జీతకల్ప సూత్రం.

అరు భేదాలు:- 1. మహానిశీథ బృహద్వాచనాసూత్రం, 2. మహానిశీథలఘువాచనా సూత్రం, 3. మధ్యమవాచనాసూత్రం. 4. పిండనిరుక్తిసూత్రం, 5. ఓఘనిరుక్తిసూత్రం, 6. పర్యూషణాసూత్రం.

దశ పయన్న సూత్రాలు:- 1. చతుస్సరణ సూత్రం, 2. పంచఖాణ సూత్రం, 3. తదులవైయాలిక సూత్రం, 4. భక్తి పరిజ్ఞాన సూత్రం, 5. మహాప్రత్యాఖ్యాన సూత్రం, 6. చంద విజయ సూత్రం, 7. గణీవిజయ సూత్రం, 8. మరణసమాధి సూత్రం, 9. దేవేంద్రస్తవన సూత్రం, 10. సంసార సూత్రం, వీనితోపాటు నందీ సూత్రం, యోగోద్ధార సూత్రాలు కూడ ప్రామాణికాలుగా అంగీకరిస్తారు.

పంచాంగాలు:- 1. పూర్వ గ్రంథాలన్నింటి టీక, 2. నిరుక్తి, 3. చరణీ, 4. భాష్యం. ఈ నాలుగు అవయవాలు, సర్వ మూలగ్రంథా లన్నియును కలిసి ఐదు పంచాంగాలనబడును. వీరి ధూంఢియాలు అవయవాల నంగీకరింపరు. ఇవేకాక మరి అనేక గ్రంథాలున్నవి. వానిని జైనులు అంగీకరింతురు. వీరి మతంపై 12వ సముల్లాసంలో విశేషంగా ఆలోచన – చర్చ చేయబడింది. అచటనే చూడుదు.

జైనమత గ్రంథాలలో లక్షల కొలది పునరుక్త దోషా లున్నవి. వీరి గ్రంథాలు ఇతర మతస్థుల చేతిలో చిక్కినను, వానిని ఇతరులెవరైనా ముద్రించినను, ఆ గ్రంథాలు తమకు ప్రమాణాలు కావని చెబుతారు. ఇటుల చెప్పుట వారి స్వభావము. ఇది వారి అజ్ఞానమే. ఆ గ్రంథాలను ఎవరైనా అంగీకరించినను, అంగీకరించకపోయినను అవి జైన గ్రంథాలు కాకుండా పోవు. వానిని ఏ జైనమతస్థుడు కాని, ఇతరులు కాని అంగీకరించనిచో అవి అగ్రాహ్యాలగును. కావున యే జైనుడు అంగీకరించని గ్రంథం వీనిలో ఏ వొక్కటీ లేదు. ఎవరు యే గ్రంథాల నంగీకరింతురో ఆ గ్రంథస్థ విషయాల ఖండన మండనాలు వారి కొరకే అని తెలియాలి. కాని ఆ గ్రంథాలనెరిగియు వానిని అంగీకరిస్తూనే, సభలలోనూ సంవాదాలలోనూ తిరుగబడెడి వారెందరో ఉన్నారు. కావున జైనులు తమ గ్రంథాలను దాచి ఉంచుతారు. ఇతర మతస్థులకు ఇవ్వరు, వినిపించరు, చదివించరు ఎందుకనగా వానిలో జైనులెవ్వరునూ కూడా సమాధానాలు చెప్పజాలని అసంభవ విషయాలున్నవి. అసత్యవిషయాలను విడిచిపెట్టుటయే దీనికి పరిష్కారము.

13వ సముల్లాసంలో క్రైస్తవ మతం గురించి వ్రాయబడింది. వీరు బైబిలును తమ మత గ్రంథంగా అంగీకరిస్తారు. వీరికి సంబంధించిన విశేష విషయాలన్నింటిని 13వ సముల్లాసంలోనే చూడగలరు.

14వ సముల్లాసంలో మహమ్మదీయుల మత విషయం వ్రాయబడింది. ఖురానును వీరు తమ మతానికి మూల గ్రంథంగా అంగీకరిస్తారు. వీరి మత విషయాల నన్నింటిని 14వ సముల్లాసంలోనే చూడగలరు. తరువాత వైదిక మత విషయం వ్రాయబడినది.

ఎవరైన ఈ గ్రంథకర్తనైన నా యొక్క అభిప్రాయాన్ని, లక్ష్యాన్ని తెలుసుకొనక విరుద్ధమైన మనస్సుతో చూచిననూ, ఆలోచించిననూ వారికి ఏ సత్య అభిప్రాయం కూడా బోధపడదు. కారణమేమంటే వాక్యార్థాన్ని గూర్చి తెలిసికోవాలంటే "అకాంక్ష, యోగ్యత, అసత్తి, తాత్పర్యము" అను ఈ నాలుగు విషయాలను తెలుసుకొనాలి. ఈ నాలుగు విషయాలపై మనస్సునుంచి శ్రద్ధగా ఈ గ్రంథాన్ని చదువువారికి ఇందలి అభిప్రాయాలు యథార్థంగా - వాస్తవంగా బోధపడుతాయి.

అకాంక్ష:- ఏదేని ఒక విషయం మీద వక్తకును, వాక్యములోని పదాలకును గల పరస్పర సంబంధం 'అకాంక్ష' అనబడును.

యోగ్యత:- దేనితో ఏది అగునో అదియే 'యోగ్యత' అనబడును. ఉదా:- నీటితో తడుపుట. అదియే యోగ్యత.

అసత్తి:- ఏ పదంతో ఏ పదానికి సంబంధముండునో ఆ పదాన్ని దానికి సమీపంలోనే చెప్పుట, వ్రాయుట 'అసత్తి' అనబడును.

తాత్పర్యం:- వక్త ఎందుకొరకు శబ్దాలను ప్రయోగించునో, ఉచ్చరించునో, వ్రాయునో దానితోనే ఆ శబ్ద, వచన, లేఖనాంశాలను యుక్తం చేయుట- కూర్చుట 'తాత్పర్యం' అనబడును.

వక్త యొక్క అభిప్రాయానికి విరుద్ధంగా కల్పన చేయు హతులు, దురాగ్రహులు అనేకమందున్నారు చాలామంది మొండి పట్టుదల గలవారుంటారు. ఇట్టివారు మతవాదులలో ఎక్కువగా ఉంటారు. మత దురభిమానం వల్ల వారి బుద్ధి అంధకారంలో చిక్కుబడి నష్టమైపోతుంది. కావున నేను పురాణాలను, జైనుల గ్రంథాలను, బైబిలును, ఖురానును మొదలగువాటిని మొదటనే చెడు దృష్టితో చూడక వానిలోని గుణాలను గ్రహించి దోషాలను మాత్రం ఎట్లు వదిలితినో అట్లే అందరును నా వలెనే మానవోన్నతి కొరకు ప్రయత్నం చేయాలి.

పైన తెలిపిన మతాలలోని దోషాలను కొన్నింటినే నేను ప్రకటించాను. వానిని చదివి పరిశీలించి జ్ఞానులగు వారందరు సత్య అసత్య విషయాలను నిర్ణయించి, సత్యాన్ని గ్రహించి

అసత్యాన్ని వీడి, విడిపింపజేయుటలో సమర్థులు కావాలి. ఎందుకనగా, మానవజాతిని వంచించి తప్పుడు మార్గాన్ని పట్టించి, విరుద్ధబుద్ధిని కలిగించి, పరస్పర శత్రుత్వాన్ని పుట్టించి వారిని పోట్లాడించి, తన్నుకొనునట్లు చేయుట విద్వాంసుల స్వభావానికి విరుద్ధమైనది.

ఈ గ్రంథాన్ని చూచిన అవిద్వాంసులు అజ్ఞానులు, మతాంధులు సరిగా విచారించకపోవచ్చును. వేరు విధంగా తలంచవచ్చును. కాని విద్వాంసులు బుద్ధిమంతులు నైనవారు యథాయోగ్యంగా దీని అభిప్రాయాన్ని తెలిసికొనగలరు. కావున ఈ నా పరిశ్రమ వ్యర్థము కాక సఫలమగునని తలంచి నా అభిప్రాయాలను సజ్జనులగువారి ముందుంచుచున్నాను.

సజ్జనులు దీనిని సరిగా చూచి ఇతరులకు చూపించి నా శ్రమను సఫలమొనర్చుదురుగాక! ఇటుల పక్షపాతాన్ని విడిచి సత్యార్థాన్ని ప్రకటించుట నాకును, మీకును ఇతర మహాశయులందరికీ ముఖ్యకర్తవ్యం.

సర్వాత్ముడు, సర్వాంతర్యామి, సచ్చిదానందస్వరూపుడునగు ఆ పరమాత్మ తన కృపతో ఈ నా ఆశయాన్ని విస్తృతపరచి, చిరస్థాయిగా చేయుగాక!

అలమతివిస్తరేణ బుద్ధిమద్వరశిరోమణిషు

బుద్ధిమంతులలో శ్రేష్ఠులైనవారికి ఇంతకంటే ఎక్కువగా వ్రాయవలసిన అవసరం లేదు.

ఇతి భూమిక.

दयानन्दसरस्वती

(స్వామి) దయానంద సరస్వతి

స్థానము:– మహారాణా గారి ఉదయపురము
భాద్రపదము శుక్ల పక్షము, విక్రమ సం. 1939

విషయ సూచిక

విషయం	పుట
కృతిసమర్పణ	iii
ఇది నా తొలి ప్రయత్నం	iv
భూమిక	v

ప్రథమోల్లాసము : 1 - 385

ప్రథమ సముల్లాసము

ఈశ్వరుని 'ఓం'కారాది నామాల వ్యాఖ్యానం	1
'ఓమ్' పద వ్యాఖ్య	2
మంత్రార్థం	3
'ఓమ్' పదానికి విస్తృత వ్యాఖ్య	6
మంత్రాలలో గల 'మిత్ర' మొదలైన నామాల వ్యాఖ్య	7
మిత్రాది నామాలు ఈశ్వర వాచకాలే	8
త్రివిధ తాపనివారణ	10
ఈశ్వరుని ఇతర నామాల వ్యాఖ్య	10
మంగళాచరణ సమీక్ష	21
నవీన మంగళాచరణ ఖండ	21

ద్వితీయ సముల్లాసము

మంచి సంతానము	23
గర్భాధానానికి పూర్వోత్తర కర్తవ్యాలు	23
ఉత్తమ సంతానప్రాప్తి విధి	24
ప్రసవసమయం తదుపరి కర్తవ్యాలు	24
ఐదు సంవత్సరాల వరకు తల్లి శిక్షణ	25
భూతప్రేత శబ్దార్థాలు	25
గ్రహశాంతి	27
జన్మపత్రం, జాతకం, సూర్యాది గ్రహాల సమీక్ష	27
శీతలా మంత్ర తంత్రాదులు	29
వీర్య రక్షణ లాభము	29
సంతాన పాలనం	30
విద్య నేర్పించని తల్లిదండ్రులు శత్రువులు	32

విషయం	పుట

తృతీయ సముల్లాసము

తల్లిదండ్రులు, ఆచార్యుడు - వారి కర్తవ్యాలు	33
గురుకులం	33
గాయత్రీ మంత్రం	34
స్నాన- ఆచమనాదులు	36
ప్రాణాయామ విధి	36
సంధ్య - బ్రహ్మయజ్ఞం	37
దేవయజ్ఞం - యజ్ఞపాత్రలు	38
అగ్నిహోత్రం	39
హోమం వలన లాభాలు	39
ఉపనయన అధికారం	40
బ్రహ్మచర్య కాలం	41
త్రివిధ బ్రహ్మచర్యం	41
శరీరావస్థలు - 4	43
స్త్రీ పురుషుల వివాహ కాలం	44
పఠన పాఠనాలు చేయువారి నియమాలు	44
యమ - నియమాల పాలన	45
యమాలు ఐదు విధాలు	45
బ్రాహ్మణ శరీర నిర్మాణం	46
సన్మాన త్యాగం	47
బ్రహ్మచారి కర్తవ్యాలు	48
శిష్యునకు ఆచార్యోపదేశం	49
ఆచార మహత్త్వం	50
ధర్మ లక్షణాలు	50
ధర్మానికి వేదప్రమాణం	51
అధ్యయనాధ్యాపనంలో పంచవిధ పరీక్షలు	51
ప్రమాణ లక్షణాలు	52
పదార్థతత్త్వజ్ఞానం వలన మోక్షప్రాప్తి	55
ద్రవ్యాలు వాని లక్షణాలు	56
ఆత్మ లక్షణం	58
గుణ లక్షణం	58

కర్మ లక్షణాలు 59
సమవాయ లక్షణం 60
కార్యకారణ సంబంధం 61
పరిమాణం రెండువిధాలు 61
అభావభేదాలు 61
పఠన పాఠన విధి 64
గ్రంథ ప్రామాణ్య విషయం 65
అనార్ష గ్రంథ పఠన హాని 65
పఠనీయ గ్రంథాలు 66
దర్శనాలు - ఉపనిషత్తులు 66
బ్రాహ్మణ వేదగ్రంథాలు 66
ఉపవేదాలు 67
దర్శనాల ప్రామాణిక భాష్యాలు 68
త్యాజ్య గ్రంథాలు 69
షడ్దర్శనాల అవిరోధం 70
పఠన పాఠనాలలో కలుగు విఘ్నాలు 71
స్త్రీ శూద్రులకు వేదాధికారం 72
విద్య - అక్షయకోశం 74
విద్యాదానం సర్వ శ్రేష్ఠం 74

చతుర్థ సముల్లాసము

గృహస్థమునకు అధికారి 75
సమీప వివాహ దోషాలు-దూరవివాహ గుణాలు 76
వివాహ విషయంలో స్త్రీ పురుషుల పరీక్ష 77
వివాహ వయస్సు 78
యువ వివాహంలో ప్రమాణం 81
వర్ణవ్యవస్థ 83
జన్మగత వర్ణవ్యవస్థలో దోషాలు 85
వర్ణ పరివర్తనంలో ప్రమాణం 86
వర్ణాల గుణకర్మలు 87
క్షత్రియ గుణకర్మలు 88
వైశ్య గుణ కర్మలు 89
శూద్రుని గుణకర్మలు 89
వివాహ లక్షణాలు 90
గర్భకాల కర్తవ్యాలు
స్త్రీ పురుషుల వ్యవహారాలు
నారీ సత్కారం
గృహిణి కర్తవ్యాలు
పొందవలసిన పదార్థాలు
లోకంలో వ్యవహరించే రీతి
పంచమహా యజ్ఞాలు
సంధ్యాగ్నిహోత్రాల సమయం
హోమ మంత్రాలు
పాషండి తిరస్కారం
పంచమహాయజ్ఞాల వలన కలిగే ఫలితాలు
గృహస్థుల సామాన్య కర్తవ్యాలు
దానానికి అయోగ్యులు
పాషండుల లక్షణాలు
ధర్మసంచయ విధం - దాని ఫలం
ధర్మాచరణం వల్లనే ముక్తి 102
సదాచార ఫలం 102
దురాచార ఫలం 106
అధ్యాపకులకు ఉండవలసిన లక్షణాలు 107
మూర్ఖుల లక్షణాలు 108
విద్యార్థుల దోషాలు 108
పునర్వివాహ నియోగ విషయం 110
నియోగం ఆపద్ధర్మం 114
రజో వీర్యాలు అమూల్యాలు 116
వివాహం యొక్క అవసరం 118
గృహస్థుల ఇతర కర్తవ్యాలు 119
వేదవిరుద్ధ వచనాలు అగ్రాహ్యాలు 120
గృహాశ్రమ శ్రేష్ఠత 120

పంచమ సముల్లాసము

వానప్రస్థ కాలం 122
వానప్రస్థ కర్తవ్యాలు 123
సన్న్యాస విధి 124
సన్న్యాసి విశేష ధర్మాలు 127
సన్న్యాస గ్రహణాధికారం 131

సన్న్యాసగ్రహణావశ్యకత 131
సంసారం మిథ్య కాదు 133
బ్రహ్మచర్యం నుండే సన్న్యాసాన్ని
తీసికొనే అధికారి 135

షష్ఠ సముల్లాసము

రాజ (క్షత్రియ) కర్తవ్యాలు 137
రాజ్యపరిపాలన క్రమం 137
సేన శస్త్రాస్త్రయుక్తంగా ఉండలి 139
సభాధికారులు - సభాసదులు 139
సభాపతి గుణాలు 140
రాజు - దండనీతి 140
రాజు - పరిషత్తు - పరిషత్తు యోగ్యత 142
వేదజ్ఞ సన్న్యాసి కథనం ప్రమాణం 143
రాజు - జితేంద్రియులైన సభాసదులు 143
అష్టాదశ (18) దుర్గుణాల నిషేధం 144
కామం నుండి పుట్టు 10 వ్యసనాలు 144
క్రోధం నుండి పుట్టే 8 వ్యసనాలు 145
రాజసభాసదులు -
మంత్రి ఉండవలసిన విధానం 146
దూత నియుక్తి 147
రాజు, మంత్రి, దూత - వారి అధికారాలు 147
దుర్గ భేదాలు - వాని ఉపయోగాలు 148
వివిధ - అధ్యక్షుల నియుక్తి 149
యుద్ధం చేసే విధానం 150
పురుషార్థాలు 152
రాజు మాయాచారి కాగూడదు 152
దొంగలను వశపరచుకోవాలి 153
ప్రజలను పీడింపరాదు 153
శాసన పద్ధతి 154
పన్నులు గ్రహించే విధానం 156
రాజు దినచర్య 157
మంత్రాలోచన చేసే విధానం 157
సంధి విగ్రహాది ఉపాయాలు 158
మిత్రులను, తటస్థులను, శత్రువులను
ఎలా చూడాలి? 161
దాడిచేయటానికి పూర్వ కర్తవ్యాలు 161
వ్యూహరచన 162
మిత్రుని లక్షణాలు 165
వివాద స్థానాలు 166
అష్టాదశ (18) వివాద స్థలాలలో
ధర్మంతో న్యాయం చెప్పటం 167
సాక్షులు 169
అబద్ధ సాక్ష్యానికి దండన విధి 172
దొంగతనం మొదలైన వానిలో దండన విధానం 173
వ్యభిచారులకు దండన 175
కాముకులైన రాజు, న్యాయాధీశులకు దండన 176
సముద్రమార్గం - పన్ను వ్యవస్థ 177
బాల వృద్ధ వివాహాలు 178

సప్తమ సముల్లాసము

ఈశ్వర వర్ణనం 179
33 దేవతలు 179
ఈశ్వర సిద్ధి-ప్రమాణాలు 181
ఈశ్వర వ్యాపకత 182
న్యాయం - దయ 183
ఈశ్వరుడు సర్వశక్తిమంతుడు 184
అవయవాలు లేని ఈశ్వరుడు ఎలా పనిచేస్తాడు? 191
ఈశ్వరుడు నిష్క్రియుడు నిర్గుణుడు కాడు 191
ఈశ్వర జ్ఞాన విషయం 192
ఈశ్వరాస్తిత్వం 192
ఈశ్వరావతార నిషేధం 193
అవతారవాదం 194
ఈశ్వరుడు పాపాలను క్షమించడు 195
జీవుని స్వాతంత్ర్యం 195
ఈశ్వరుడు జీవున్ని పుట్టింపడు 196
జీవేశ్వరుల భిన్నత్వ వర్ణనం 196
జీవుని లక్షణం 197
ఈశ్వరుని త్రికాల దర్శిత్వం 197
జీవేశ్వరుల సంబంధం 198

	198
తత్వమస్యాది వాక్యాలు	201
నవీన వేదాంతుల ఆరు పదార్థాలు - ఖండనం	203
అద్వైత శబ్దార్థం - సిద్ధి	205
భయంవలన అద్వైతసిద్ధి	206
ఈశ్వరుడు సగుణుడు-నిర్గుణుడు	207
వేదాలు ఈశ్వర ప్రకాశితాలు	207
వేదోపదేశం	209
వేదం - ఈశ్వర కృతం	210
వేదసంజ్ఞ	211
వేదశాఖలు	

అష్టమ సముల్లాసము

బ్రహ్మ జగత్కర్త	213
పరమేశ్వరుడు జగత్తుకు నిమిత్తకారణం	214
అనాది పదార్థాలు	214
ప్రకృతి స్వరూపం	215
జగదుత్పత్తికి మూడు కారణాలు	217
సృష్టి ప్రయోజనం	219
ఈశ్వరుడు సాకారుడా? - నిరాకారుడా?	220
కారణానికి కారణముండదు	222
సృష్టి - ఇతర మతాలు	222
జగత్తు అనాది కాదు	225
జీవుడు ఎన్నడూ ఈశ్వరుడు కాదు	226
సృష్టి రచన	229
మనుష్యుల ఆది సృష్టి - స్థాన నిర్ణయం	231
ఆర్యమ్లేచ్ఛాదుల వ్యాఖ్య	232
స్వరాజ్యమహత్త్వం	234
పృథివీధారణం	234
భూభ్రమణం	236

నవమ సముల్లాసము

'అవిద్య' లక్షణం	240
'విద్య' లక్షణం	240
నవీనవేదాంత మత సమీక్ష	241
ఆత్మ నిర్లేపత్వ ఖండనం	242

జీవుడు బ్రహ్మప్రతిబింబం కాదు
బంధ మోక్షాల వర్ణన
జీవునియొక్క సామర్థ్యం
ముక్తినుండి తిరిగి రావటం
ముక్తి కాలం
జీవుల కర్మానుసారం ముక్తి
జీవుడు ఈశ్వర సదృశుడెన్నడు కాదు
ముక్తి జన్మమరణం వంటిది కాదు
సాధన చతుష్టయం
ద్వితీయ సాధనం - వైరాగ్యం
మూడవ సాధనం - షట్క సంపత్తి
నాల్గవ సాధనం - ముముక్షుత్వం
అనుబంధ చతుష్టయం
శ్రవణ చతుష్టయం
ఇతర మతాలవారి 'ముక్తి' సమాలోచనం
జనన మరణాల సమీక్ష
కర్మానుసారమే భోగం
స్వర్గ నరకాలు

దశమ సముల్లాసము

వేదోక్త ధర్మసేవనం
మానవుని విశేష కర్తవ్యాలు
ఆచార మహత్త్వం
విదేశగమనంవలన ఆచారం నష్టమవుతుందా!
భక్ష్య-అభక్ష్య విషయాలు
భక్ష్య-అభక్ష్య భేదాలు
గోవు వలన లాభాలు - గోవధ వలన హాని
గోహత్యారంభం
పశురక్షణం
సహ భోజన దోషాలు
భార్యాభర్తలు ఒకరి ఎంగిలిని
మరొకరు తినకూడదు
ఆవు పేడ వలన కలిగే లాభాలు
వంటశాల - భోజన పద్ధతులు
ఆచార, అనాచార - భక్ష్యాభక్ష్యాలు

ఉత్తరార్థము: 286-656

ఏకాదశ సముల్లాసము

అనుభూమిక (1)	286
ఆర్యసార్వభౌమరాజ్యం	288
పూర్వకాలపు చక్రవర్తి రాజులు	290
ఆగ్నేయాది అస్త్ర శస్త్ర విద్యలు	290
ఆర్యావర్తం నుండే అన్ని భాషలు వ్యాపించినవి	291
ప్రాచీన జ్యోతిష యంత్రం	292
మహాభారత యుద్ధ ప్రభావం	293
నామధారి బ్రాహ్మణులు	293
బ్రాహ్మణుడే పోపు	294
రోము పోపుల మాయాలీలలు - మోసాలు	295
ఆర్యావర్తపు పోపులు	295
ఉత్తమ బ్రాహ్మణులు - వేద రక్షకులు	296
స్వార్థులైన బ్రాహ్మణులు	296
సత్యోపదేశం లేనందువలన అంధపరంపర	297
వామమార్గం-పంచమకారాలు	297
భైరవి, దేవి పేరిట వావివరుసలు లేకుండా చేసే కుకర్మలు	299
అశ్వమేధగోమేధ శబ్దార్థాలు	301
పాషాణాది మూర్తి పూజలు - జైనులు	303
శంకరాచార్యుల వేద పునరుద్ధరణ	304
జైనమత నిరాకరణం	304
వైదికమతోద్ధరణం	305
నవీన వేదాంతుల మతం	306
వ్యాసముని కృత వేదాంత సూత్రాలు	315
విక్రమాదిత్యుడు - భర్తృహరి	317
రుద్రాక్షధారణ మహాత్మ్యం	318
భగ్న, లింగపూజ	318
మహాభారతంలో వేల శ్లోకాలనుచేర్చటం	319
భోజరాజు సమయంలో యంత్రాలు	320
వైష్ణవ, శైవ మతాలు, పురాణాల ఆరంభం	320
వివిధ పురాణాలు	320
దేవీభాగవత గుణ దోష నిరూపణ	321
వైష్ణవమతము	323
బైరాగి- శిష్యులు	323
చక్రాంకితులైన వైష్ణవుల అద్భుత మాయలు	324
వైష్ణవుల గుర్తులు - మంత్రాలు	325
అతప్త తనుః- అర్థము	326
రామానుజ మత సమీక్ష	327
మూర్తి పూజ	327
నామస్మరణ చేసే పద్ధతి	329
అవతార వాదం	330
విగ్రహ పూజ సమీక్ష	330
భావన- అభిప్రాయం	331
ఆవాహన - విసర్జన	332
మూర్తి పూజా ఖండనం	333
మూర్తిపూజ పాపం	334
మూర్తిపూజ సోపానం కాదు - అది ఒక ఊబి	335
సాకారంలో మనస్సు స్థిరపడదు	336
మూర్తిపూజ వలన కలిగే దోషాలు	337
పంచాయతన పూజ	339
చమత్కారాల ఖండనం	341
గయాశ్రాద్ధం	342
కలకత్తా కాళీ, కంచి కామాక్షి	342
పూరి జగన్నాథుడు	343
రామేశ్వర లింగ చమత్కారం	345
సోమనాథ మందిరం	346
హరిద్వారం స్వర్గ ద్వారము కాదు	349
తీర్థనామ విమర్శ	350
మూర్తిపూజ - తీర్థాలు	352
గురు మహాత్మ్య విమర్శనం	354
పురాణ కర్తలెవరు?	355
వేదవ్యాసుడు	357
పురాణాల విమర్శ	357
శివ పురాణం - సృష్టి	358
భాగవత పురాణ సృష్టి	360

మార్కండేయపురాణం- రక్తబీజుడు	361
భాగవత సమాలోచన	362
జయ విజయులకు శాపం	362
వరాహము- హిరణ్యాక్షవధ	363
నృసింహుడు హిరణ్యకశ్యపుడు	363
పూతన అక్రూరులు	364
అజామీళుని కథ	365
భాగవతకర్త బోపదేవుడు	366
శ్రీకృష్ణుని చరిత్రకు కళంకం	367
శివపురాణం-జ్యోతిర్లింగాలు	367
స్త్రీ శూద్రులు - వేద పఠనాధికారం	367
గ్రహాలు - సమీక్ష	367
గ్రహఫలాలు	368
గ్రహాల ప్రసన్నత - అప్రసన్నత	369
గరుడ పురాణ విమర్శ	371
యముడు - యమలోకం	375
దానగ్రహీతల లక్షణాలు	375
దాతల భేదాలు	377
ఏకాదశ్యాది వ్రతాలు	378
లుప్తవేదశాఖలలో మూర్తిపూజ ఉన్నది	380
శాఖలు వేదాలు కావు	381
మూర్తిపూజలతో మహాపురుషుల నింద	381
మారణహోమాలు	383
మంత్ర తంత్ర ప్రయోగాలు	383
చోలీమార్గం, బీజమార్గం	384
శైవమత ఖండన	384
వైష్ణవమత విమర్శ	385
వైష్ణవ భేదాలు	387
ఖాఖీల సంప్రదాయం	388
'ఖాఖీ కథ'	388
వృద్ధ ఖాఖీ - శిష్యులు	390
కబీర పంథీ విమర్శ	392
నానక్ (పంథ్) సంప్రదాయకుల విమర్శ.	392
ఉదాసీ - నిర్మలులు	394
గురుగోవింద సింహ - పంచకకారాలు	
దాదూపంథీ	
రామస్నేహి పంథానుయాయుల విమర్శ	
వల్లభ సంప్రదాయం	
వల్లభ మంత్రం - సమీక్ష	
పుష్టిమార్గం కాదు - కుష్ఠమార్గం	
తను మనుధనాల అర్పణం	
ఇంటికి వచ్చిన గోసాయి లీల	
వీరు దక్షిణలను కోరు విధానము	
స్వామినారాయణ మత ఖండనము	
మాధ్వమతము - సమీక్ష	
లింగాంకిత మతము	
బ్రహ్మసమాజం - ప్రార్థనా సమాజం	
బ్రహ్మ సమాజ- ప్రార్థనా సమాజ దోషాల	
ఐరోపీయుల గుణ దోషములు	
ఉపాదానం లేక జగదుత్పత్తి కాదు	
భోగం- పాపనివృత్తి	
సీమితకర్మలకు అనంత ఫలము లభించదు	
పూర్వోత్తర జన్మలు	
ఉన్నతిని కోరువారు ఆర్యసమాజమున చేరుదు	
ధర్మము అందరికి ఒక్కటే	
ధర్మ జిజ్ఞాసువు- సంప్రదాయాలు	
ఏషణత్యాగ సన్న్యాసము	
ధనసారీ వంచకులు	
ఆర్యావర్త దేశీయ రాజవంశావళి	

ద్వాదశ సముల్లాసము

అనుభూమిక (2)	44[illegible]
చార్వాక మతం	44[illegible]
జడం నుండి చేతనం పుట్టదు	44[illegible]
పదార్థాలు అదృశ్యాలైనా - అభావం కాదు	44[illegible]
చార్వాక భేదం	45[illegible]
చార్వాక శబ్దార్థం	45[illegible]
బౌద్ధమతం	45[illegible]

బౌద్ధులలో నాలుగు భేదాలు	453
బౌద్ధమత సమీక్ష	455
తీర్థంకరులు - ద్వాదశాయతన పూజ	456
దుఃఖరూప ప్రపంచంలో ప్రవృత్తి ఎందుకు?	457
ద్వాదశాయయతన పూజ ముక్తి కాదు - భోగం	458
వివేకవిలాసంలోని బౌద్ధ సిద్ధాంతాలు	458
క్షణికవాద దోషాలు	460
జైన మత వర్ణనము	460
జైన సిద్ధాంతాలు	463
జైనులు బౌద్ధులు ఒక్కటే	464
మరి కొన్నిజైన సిద్ధాంతాలు	465
జీవుడు ఈశ్వరుడు కాలేడు	466
ఈశ్వర ప్రత్యక్షం	466
శబ్ద ప్రమాణం	466
అనాది పదార్థాలలో అన్యోన్యాశ్రయ దోషం లేదు	467
తీర్థంకరుడు ఈశ్వరుడు కాడు	468
ఆస్తిక నాస్తికుల సంవాదం	468
ఈశ్వరీయ వ్యవస్థ - కర్మఫలం	468
జీవుడు ఈశ్వరుడు కాడు	469
ఈశ్వరుడు నిష్క్రియుడు కాడు	469
ఈశ్వరుడు ఒక్కడే	471
ఈశ్వరుడు నిర్లిప్తుడు	472
సంసారం అనాది అనంతమా?	472
కర్తకు కర్త కారణానికి కారణం ఉండదు	477
జడపుద్గలం- పాపపుణ్యాలు	478
జగత్తు, జీవకర్మలు, బంధం అనాదులు కావు	478
సాధన - సాధ్యముక్తి నిత్యం కాదు	478
జీవ పరిమాణం	480
జైనులు అంగీకరించే ధర్మాలు	481
జైనమత ధర్మ ప్రశంస	482
మూర్తిపూజ ప్రారంభము	495
మూర్తిపూజ వలన జడత కలుగును	497
ప్రసిద్ధ జైననవకారమంత్రము	498
జైనుల ముక్తి వర్ణనము	501
పిండిచేయుట- రొట్టిచేయుట పాపము	503
శ్వేతాంబరులు - దిగంబరులు	503
అసంభవ సూర్యచంద్రులు	515
కేవలుని రాజనట భ్రమణము	516
సిద్ధశిల	517
కీటకాదుల పరిమాణము	518
కాలపరిమాణము	518

త్రయోదశ సముల్లాసము

అనుభూమిక (3)	521
క్రైస్తవ మతవిషయ సమీక్ష	523
నిర్గమకాండము	541
లేవీయ కాండము	546
సంఖ్యాకాండము	548
సమూయేలు రెండవ పుస్తకము	549
రాజుల పుస్తకము	550
జబూరు రెండవ భాగము	550
యోబు గ్రంథము	551
ప్రసంగి ఉపదేశ పుస్తకము	551
ముత్తయి సువార్త	552
మార్కు సువార్త	557
లూకా సువార్త	557
యోహాను సువార్త	557
యోహాను ప్రకటన వాక్యములు	569

చతుర్దశ సముల్లాసము

అనుభూమిక (4)	581
ముసల్మానుల మత విషయము	583
స్వమంతవ్యామంతవ్య ప్రకాశము	649-656

ఆర్య సమాజ నియమాలు

1. సమస్త సత్యవిద్యలకును, విద్యవలన నెరుంగదగు సర్వపదార్థములకును ఆదిమూలము పరమేశ్వరుడు.

2. ఈశ్వరుడు సచ్చిదానంద స్వరూపుడు, నిరాకారుడు, సర్వశక్తిమంతుడు, న్యాయకారి, దయాళువు, అజన్ముడు, అనాది, అనంతుడు, నిర్వికారుడు, అనుపముడు, సర్వాధారుడు, సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, అజరుడు, అమరుడు, అభయుడు, నిత్యుడు, పవిత్రుడు, సృష్టికర్తయునై యున్నాడు. అతనినే ఉపాసించుట యోగ్యము.

3. వేదము సత్యవిద్యల గ్రంథము. దీనిని చదువుట - చదివించుట, వినుట - వినిపించుట, ఆర్యులకందరికి పరమ ధర్మము.

4. సత్యమును గ్రహించుటకును, అసత్యమును త్యజించుటకును ఎల్లప్పుడును సిద్ధముగా నుండవలెను.

5. సకల కార్యములను ధర్మానుసారముగా అనగా సత్యాసత్యములను విచారించి చేయవలెను.

6. ప్రపంచమునకు ఉపకారము చేయుట, ఈ సమాజము యొక్క ముఖ్యోద్దేశ్యము.

7. అందరితో ప్రేమ పూర్వకముగ ధర్మానుసారముగ యథాయోగ్యముగ వ్యవహరింపవలెను.

8. అవిద్యను నశింపచేసి విద్యను పెంపొందింప జేయవలెను.

9. ప్రతివ్యక్తియు తన ఉన్నతితోనే సంతృప్తినొందక, అందరి ఉన్నతిలోనే తన ఉన్నతి కలదని తలంపవలెను.

10. సర్వహితకరములగు సామాజిక నియమములను పాలించుటలో పరతంత్రులై వ్యక్తి హితకరములగు నియమములందు స్వతంత్రు లగుట అందరికి తగును.

ఓ౩మ్

సచ్చిదానందేశ్వరాయ నమో నమః

సత్యార్థ ప్రకాశము

ప్రథమ సముల్లాసము

ఈశ్వరుని 'ఓం'కారాది నామాల వ్యాఖ్యానం

ఓమ్ శన్నో మిత్రః శం వరుణః శన్నో భవత్వర్యమా ।
శన్న ఇంద్రో బృహస్పతిః శన్నో విష్ణురురుక్రమః ॥

నమో బ్రహ్మణే నమస్తే వాయో, త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి, త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి, ఋతం వదిష్యామి, సత్యం వదిష్యామి, తన్మామవతు తద్వక్తారమవతు అవతుమామ్ అవతు వక్తారమ్ ॥ ఓమ్ శాంతిశ్శాంతిశ్శాంతిః ॥

తైత్తి. ఆరణ్యకం ప్రపాఠకం 7, అనువాకం 1 ॥

'ఓమ్' పద వ్యాఖ్య

అర్థం: (ఓమ్) ఈ **'ఓంకార'** శబ్దం పరమేశ్వరుని సర్వోత్తమ నామం. ఇందలి **'అ'** కార, **'ఉ'** కార, **'మ'** కారాలనే ఈ మూడక్షరాలు కలిస్తే**"ఓమ్"** కార నామం ఏర్పడుతుంది. ఈ వొక్క నామంవల్ల పరమేశ్వరునికి అనేక నామాలున్నట్లు తెలుస్తున్నది. ఉదా: **'అ'**కారంతో 'విరాట్, అగ్ని, విశ్వుడు' మొదలైన నామాలు; **'ఉ'**కారంతో 'హిరణ్యగర్భుడు, వాయువు, తైజసుడు' మొదలైన నామాలు; **'మ'** కారంతో 'ఈశ్వరుడు, ఆదిత్యుడు, ప్రాజ్ఞుడు' మొదలైన నామాలు గ్రహింపబడతాయి. వీటికి ఇటులనే వేదాది సచ్ఛాస్త్రాలలో స్పష్టంగా వ్యాఖ్యానాలు కూడా వ్రాయబడ్డాయి. కాబట్టి ప్రకరణానుసారంగా ఈ నామాలన్నీ పరమేశ్వరునివే అని తెలుసుకోవాలి.

ప్రశ్న:- పరమేశ్వరుని కంటె భిన్నమైన పదార్థాలకు **'విరాట్'** మొదలైన పేర్లు ఎందుకు లేవు? బ్రహ్మాండం, పృథివి మొదలైన పంచభూతాలు, ఇంద్రాది దేవతలు, వైద్యశాస్త్రంలోని శొంఠి మొదలైన ఓషధులకు ఈ పేర్లున్నవా? లేవా?

జవాబు:- ఉన్నవి. అట్లనే పరమాత్మకు కూడ ఉన్నవి.

ప్రశ్న:- ఈ పేర్లతో దేవతలను కూడా గ్రహించవచ్చునా? లేదా?

జవాబు:- మీరట్లా దేవతలనే గ్రహించాలను కొనుటకు ప్రమాణమేమి?

ప్రశ్న:- దేవతలందరు ప్రసిద్ధులు, ఉత్తములు కూడ. కాబట్టి నేను ఈ పేర్లతో వారిని కూడా గ్రహిస్తాను.

జవాబు:- అయితే, పరమేశ్వరుడు అప్రసిద్ధుడా? అతనికన్న ఉత్తములు కూడ ఉన్నారా? ఈ పేర్లు పరమేశ్వరునివి అని కూడ ఎందుకుభావించరు? పరమేశ్వరుడు అప్రసిద్ధుడు కానప్పుడు, అతనికి సమానుడు ఎవరు లేనప్పుడు, అతని కన్న ఉత్తముడు మరొకడు ఎవడుంటాడు? కాబట్టి ఈ విషయంలో మీరు చెప్పింది అసత్యం. మీరు ఇలా చెబితే అనేక దోషాలు సంభవిస్తాయి. ఉదా: **"ఉపస్థితం పరిత్యజ్యానుపస్థితం యాచత ఇతి బాధిత న్యాయః"** 'సమీపంలో ఉన్నదానిని వదలి దూరాన ఉన్నదానిని కోరుట' అనేది బాధిత న్యాయం. ఒకడు ఒక వ్యక్తికి భోజనపదార్థాన్ని ఇచ్చి 'భుజించుము' అని పలికాడు. కాని అతడు తన సమీపంలో ఉన్నదానిని వదలి లభించని ఆహారం కోసం అటు ఇటు తిరిగినచో అతన్ని ఎవ్వరూ బుద్ధిమంతుడనరు. అతడు సమీపంలో గల ఆహారాన్ని వదలి అక్కడలేని అప్రాప్త పదార్థాలను పొందుటకు శ్రమిస్తున్నాడు. కాబట్టి అతనిని 'బుద్ధిమంతు'డనరు. అలాగే మీ విషయం కూడ ఉన్నది. మీరూ విరాట్ మొదలైన నామాలతో 'ప్రసిద్ధుడు, ప్రమాణసిద్ధుడు' అగు పరమేశ్వరుని బ్రహ్మాండాది ఉపస్థితార్థాలను వదలి, 'అసంభవాలు, అనుపస్థితాలు' ఐన దేవతాదుల అర్థాలను గ్రహించుటకు శ్రమిస్తున్నారు. ఇందుకు ఒక ప్రమాణం కాని, యుక్తి కాని మీవద్ద లేదు.

"ఎక్కడ ఏది ప్రకరణమో అక్కడ దానినే గ్రహించటం యోగ్యం". ఒకడు తన సేవకునితో - **"హే భృత్య! త్వం సైంధవమానయ"** "ఓ సేవకుడా! సైంధవాన్ని తెమ్ము" అని చెప్పగా, అప్పుడా సేవకుడు ప్రకరణాన్ని (సందర్భాన్ని) దృష్టిలో ఉంచుకొని 'సైంధవం' అను పేరు 'గుఱ్ఱానికీ, ఉప్పుకీ' ఉన్నదని ఆలోచించి, తన యజమానికి ప్రయాణ సమయమైతే గుఱ్ఱాన్ని, భోజన సమయమైతే ఉప్పును తెస్తాడు. అలా చేయడం సరియైనది. ప్రయాణ సమయంలో ఉప్పును, భోజన సమయంలో గుఱ్ఱాన్ని తెస్తే అతన్ని యజమాని "నీవు బుద్ధిహీనుడవు. ప్రయాణ సమయంలో ఉప్పును, భోజనకాలంలో గుఱ్ఱాన్ని తెస్తే ఏం ప్రయోజనం? నీవు సమయ సందర్భాలు తెలిసినవాడవు కావు" అని కోపగించును. "సమయం సందర్భం తెలిసినచో ఏ సమయంలో దేనిని తేవాలో దానినే తెచ్చేవాడవు. నీవు ప్రకరణాలను అనుసరించి చేయలేదు. కావున నీవు మూర్ఖుడవు. నావద్ద నుండి వెళ్లి పో" అని పలుకును. 'ఏ స్థలంలో ఏ అర్థాన్ని గ్రహిస్తే మంచిదో అక్కడ ఆ అర్థాన్నే గ్రహించాలి' అని ఈ ఉదాహరణతో తేటతెల్లమైనది. కావున మీరూ, మేమూ, మనందరం అలాగే చేయాలి.

మంత్రార్థం

ఓం ఖం బ్రహ్మ ॥ 1 ॥ యజు. 40-17 ॥

వేదాలలో ఈ ప్రకరణంలో పరమేశ్వరుడికి"ఓం" మొదలైన పేర్లు అనేకాలున్నాయి. చూడండి.

ఓమిత్యేతదక్షరముద్గీథ ముపాసీత ॥ 2 ॥ ఛాందోగ్యోపనిషత్తు 1.1 ॥

ఓమిత్యేతదక్షరమిదం సర్వం తస్యోపవ్యాఖ్యానమ్ ॥ 3 ॥ మాండూక్యోపనిషత్తు ॥ 1 ॥

సర్వే వేదా యత్పదమామనంతి తపాంసి సర్వాణి చ యద్వదంతి।
యదిచ్ఛంతో బ్రహ్మచర్యం చరంతి, తత్తేపదం సంగ్రహేణ బ్రవీమ్యోమిత్యేతత్॥ ॥ 4 ॥

కఠోపనిషత్తు 2 వల్లి. మం. 15 ॥

ప్రశాసితారం సర్వేషామణీయాంసమణోరపి ।
రుక్మాభం స్వప్నధీగమ్యం విద్యాత్తం పురుషం పరమ్ ॥ 5 ॥ మను. అ. 12 శ్లో. 122 ॥

ఏతమగ్నిం వదంత్యేకే మనుమన్యే ప్రజాపతిమ్ ।
ఇంద్రమేకే పరే ప్రాణమపరే బ్రహ్మ శాశ్వతమ్ ॥ 6 ॥ మను. అ. 12 శ్లో. 123 ॥

స బ్రహ్మా స విష్ణుః స రుద్ర స్సశివస్సోఽక్షర స్స పరమః స్వరాట్ ।
స ఇంద్ర స్స కాలాగ్ని స్సచంద్రమాః ॥ 7 ॥ కైవల్యోపనిషత్తు 1 - 8 ॥

ఇంద్రం మిత్రం వరుణమగ్ని మాహురథో దివ్యస్ససుపర్ణో గరుత్మాన్ ।
ఏకం సద్విప్రా బహుధావదంత్యగ్నిం యమం మాతరిశ్వాన మాహుః ॥ 8 ॥

ఋ. మం. 1 సూ. 164 మం. 46

భూరసి భూమిరస్యదితిరసి విశ్వధాయా విశ్వస్య భువనస్య ధర్త్రీ ।
పృథివీం యచ్ఛ పృథివీం దృꣳహ పృథివీం మా హిꣳసీః ॥ 9 ॥

యజు. అ. 13 - మం. 18 ॥

ఇంద్రో మహ్నా రోదసీ పప్రథచ్ఛవ ఇంద్రః సూర్య మరోచయత్ ।
ఇంద్రే హ విశ్వా భువనాని యేమిర ఇంద్రే స్వానాస ఇందవః ॥ 10 ॥

సామ. 1588. ఉత్తరార్చికే ప్రపా. 7 త్రిక. 8 మం. 2 ॥

ప్రాణాయ నమో యస్య సర్వమిదం వశే ।
యో భూతః సర్వస్యేశ్వరో యస్మిన్త్సర్వం ప్రతిష్ఠితమ్ ॥ 11 ॥

అథర్వ. కాం. 11 సూ. 4 మం. 1॥

ఇలాంటి ప్రమాణాల ద్వారా 'ఓంకారాది నామాలతో పరమేశ్వరుడే గ్రహింపబడతాడు' అనటానికి ఈ ప్రమాణాలు వ్రాయబడ్డాయి. పరమేశ్వరుని నామాలన్నీ అర్థవంతాలే. లోకంలో దరిద్రునికిధనపతి' పేరున్నట్లు అతనికి నిరర్థకమైన పేర్లు లేవు. అతని నామాలు కొన్ని చోట్ల **'గౌణికాలు'**గా అనగా గుణాలను తెలిపేవిగా, కొన్ని చోట్ల 'కార్మికాలు' అనగా కర్మలను తెలిపేవిగా, మరికొన్ని చోట్ల 'స్వాభావికాలు' అనగా స్వభావాన్ని తెలిపేవిగా ఉన్నాయని తెలుస్తున్నది. ఇలా 'ఓమ్' మొదలైన నామాలు సార్థకాలని తెలుసుకోవాలి. అదెలాగంటే –

'ఓం ఖం'.... = "అవతీత్యోమ్. ఆకాశమివ వ్యాపకత్వాత్ ఖం, సర్వేభ్యో బృహత్త్వాద్బ్రహ్మ"

రక్షించుట వలన 'ఓం' అని, ఆకాశం వలె వ్యాపకుడు అవ్వటంవల్ల 'ఖం' అని, అందరికన్నా గొప్పవాడు అవ్వటంవల్ల 'బ్రహ్మ' అని ఈశ్వరునికి నామాలు. ॥ 1 ॥

(ఓ మిత్యే ....) ఓంకార నామం కలవాన్నీ, ఎన్నడూ నష్టం చెందని వాన్నీ ఉపాసించుటయే యోగ్యం. ఇతరులను ఉపాసింపకూడదు. ॥ 2 ॥

(ఓమిత్యేతత్ ...) సమస్త వేదాది శాస్త్రాలలో **'ఓంకారమే పరమేశ్వరుని ప్రధానమైన నిజమైననామం'** అని చెప్పబడింది. ఇతరాలన్నీ గౌణిక నామాలు - గుణబోధకాలు. ॥ 3 ॥

(సర్వే వేదా...) సమస్త వేదాలు, సర్వ ధర్మానుష్ఠాన రూప ధర్మాచరణాలు అన్నీ ఎవరి గురించి చెపూ ఎవరిని గౌరవిస్తున్నాయో, ఎవరిని పొందాలనే కోరికతో బ్రహ్మచర్యాశ్రమాన్ని అవలంభిస్తారో, అతని నామం 'ఓం' కారం అని చెప్పాలి. ॥4॥

(ప్రశాసితారం...) అందరికీ విద్యని ఇచ్చువాడూ, సూక్ష్మం కన్న సూక్ష్ముడూ, స్వప్రకాశ స్వరూపుడూ, సమాధిస్థ బుద్ధితో తెలుసుకొనుటకు యోగ్యుడూ అయిన ఆ పరమపురుషున్ని తెలుసుకోవాలి. ॥5॥

(ఏతమగ్నిం ...) స్వప్రకాశకుడు అవ్వటం వల్ల **'అగ్ని'**; విజ్ఞాన స్వరూపుడు అవ్వటం వల్ల **'మనువు'**; అందర్నీ పాలించటం వల్ల **'ప్రజాపతి'**; పరమైశ్వర్యవంతుడు అవ్వటం వల్ల **'ఇంద్రుడు'**; అందరికీ జీవనాధారుడు అవ్వటం వల్ల **'ప్రాణం'**; నిరంతరం వ్యాపకుడు అవ్వటం వల్ల **'బ్రహ్మ'** అని ఆ పరమాత్మునికి నామాలు. ॥ 6 ॥

(స బ్రహ్మ స విష్ణు...) సర్వజగత్తును పుట్టించటం వల్ల 'బ్రహ్మ'; సర్వత్ర వ్యాపకుడు కావటం వల్ల **'విష్ణువు'**; దుష్టులను దండించి ఏడ్పించువాడవ్వటం వల్ల **'రుద్రుడు'**; మంగళమయుడూ, సర్వజన కళ్యాణకారీ అవ్వటం వల్ల **'శివుడు'** అని అతడు చెప్పబడును.

"యః సర్వ మశ్నుతే న క్షరతి, న వినశ్యతి తదక్షరమ్"

"యః స్వయంరాజతే స స్వరాట్"

"యోఽగ్ని రివ కాలః కలయితా ప్రళయకర్తా స కాలాగ్ని రీశ్వరః" - సర్వత్ర వ్యాపకుడై అవినాశి అవ్వటం వల్ల **'అక్షరుడు'**; స్వయం ప్రకాశస్వరూపుడు అవ్వటం వల్ల **'స్వరాట్'**; ప్రళయంలోనూ అన్నిటికీ కాలుడై కాలానికి కూడా కాలుడవ్వటం వల్ల **'కాలాగ్ని'** అని పరమేశ్వరుడికి పేర్లు.

(ఇంద్రం మిత్రం...) ఒక్కటియేయై అద్వితీయ, సత్యబ్రహ్మ వస్తు వగుటచే అతనికి ఇంద్రాది సర్వ నామాలున్నవి. **"ద్యుషు శుద్ధేషు పదార్థేషు భవో దివ్యః"** ప్రకృత్యాది దివ్య పదార్థాలలో వ్యాప్తుడగుటచే **'దివ్యుడు'**. **"శోభనాని పర్ణాని పాలనాని పూర్ణాని కర్మాణి వా యస్య సః సుపర్ణః"**. - ఉత్తమ పాలన, ఉత్తమ పూర్ణ కర్మలు కలవాడవ్వడం వల్ల **'సుపర్ణుడు'**. **"యో గర్వాత్మా స గరుత్మాన్"** - ఎవరి ఆత్మ అనగా స్వరూపం మహత్తరమైనదో అతడు **'గరుత్మంతుడు'**. **"యో మాతరిశ్వా వాయురివ బలవాన్

స మాతరిశ్వా" – వాయువు వలె అనంత బలవంతుడు అవ్వటం వలన 'మాతరిశ్వుడు' అనీ ఆతనికి పేర్లు; మిగిలిన నామాలకు అర్థాలు ఇక ముందు వ్రాయబడతాయి. ॥ 8 ॥

(భూమి రసి...) "భవంతి భూతాని యస్యాం సా భూమిః" ఎవరిలో సమస్త భూతాలు అనగా ప్రాణులు ఉంటాయో ఆ పరమాత్మునకు 'భూమి' అని పేరు. మిగిలిన నామాలకు అర్థం ముందు వ్రాయబడతాయి. ॥ 9 ॥

(ఇంద్రో మహ్నా...) ఈ మంత్రంలోని 'ఇంద్రుడు' అనే పేరు పరమేశ్వరునిదే. కాబట్టి ఈ ప్రమాణం వ్రాయబడింది. ॥ 10 ॥

(ప్రాణాయ నమో...) శరీరం, ఇంద్రియాలు ప్రాణవశంలో ఉన్నట్లు పరమేశ్వరుని వశంలో జగత్తంతా ఉంది. కాబట్టి అతనికి 'ప్రాణం' అని పేరు. ॥ 11 ॥

ఇట్టి ప్రమాణాలకు సరియైన అర్థాలను తెలుసుకొంటే ఈ నామాలు అన్నీ పరమేశ్వరునివే అని తెలుస్తాయి. **'ఓం'** మరియు అగ్న్యాది నామాల ముఖ్యార్థాలచే పరమేశ్వరుడే గ్రహింపబడుతాడు. వ్యాకరణం, నిరుక్తం, బ్రాహ్మణాలు, సూత్రాదుల ద్వారా ఋషిమునుల వ్యాఖ్యానాలలో ఈ నామాలచే పరమేశ్వరునే గ్రహించినట్లు కనిపిస్తాయి. కాబట్టి అందరూ అలాగే గ్రహించుట మంచిది.

'ఓం' అను నామం కేవలం పరమేశ్వరునిదే. అగ్ని మొదలైన నామాలతో 'పరమేశ్వరు'నే గ్రహించుటకు ప్రకరణం, విశేషణాలు నియమకారకాలవుతాయి. ఎక్కడెక్కడ స్తుతి, ప్రార్థన, ఉపాసన మొదలైన ప్రకరణాలు సర్వజ్ఞ, వ్యాపక, శుద్ధ, సనాతన, సృష్టికర్త మొదలైన విశేషణాలు వ్రాయబడి ఉంటాయో ఆ యా స్థలాలలో ఈ నామాలతో పరమేశ్వరున్నే గ్రహించాలి.

తతో విరాడజాయత విరాజో అధి పూరుషః ॥ 1 ॥ యజు. 31-5 ॥

శ్రోత్రాద్వాయుశ్చ ప్రాణశ్చ ముఖాదగ్నిరజాయత ॥ 2 ॥ యజు. 31-12 ॥

తేన దేవా అయజన్త ॥ 3 ॥ యజు. 31-9 ॥

పశ్చాద్భూమి మథోపురః ॥ 4 ॥ యజు. 31-5 ॥

తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః । ఆకాశాద్వాయుః । వాయోరగ్నిః ।
అగ్నేరాపః । అద్భ్యః పృథివీ । పృథివ్యా ఓషధయః । ఓషధిభ్యోఽన్నమ్ । అన్నాద్రేతః ।
రేతసః పురుషః । స వా ఏష పురుషోన్నరసమయః ॥ 5 ॥

తైత్తిరీయ ఉపనిషత్తు. బ్రహ్మానందవల్లి (తైత్తిరీయ ఆరణ్యకము 8-2). అను. 5॥

ఇలాంటి ప్రమాణాలలో లౌకిక పదార్థాలకే విరాట్, పురుష, దేవ, ఆకాశ, వాయు, అగ్ని, జల, భూమి మొదలైన పేర్లు ప్రయోగింపబడ్డాయి. ఎలాగంటే ఉత్పత్తి, స్థితి, ప్రళయాలు అల్పజ్ఞ, జడ, దృశ్యాది విశేషణాలు గల చోట్ల పరమేశ్వరున్ని గ్రహింపకూడదు. అతడు ఉత్పత్తి మొదలైన

వ్యవహారాలకు అతీతుడు. పైన చెప్పబడిన మంత్రాలలో ఉత్పత్తి మొదలైన వ్యవహారాలున్నవి. కాబట్టి ఇక్కడ విరాట్ మొదలైన పేర్లతో పరమేశ్వరున్ని గ్రహింపక జగత్ పదార్థాలనే గ్రహించాలి. సర్వజ్ఞాది విశేషణాలు గల స్థలాలలో పరమేశ్వరున్ని; ఇచ్ఛా, ద్వేష, ప్రయత్న, సుఖ, దుఃఖ, అల్పజ్ఞాది విశేషణాలు గల స్థానాలందు జీవున్ని గ్రహించాలి. ఇటులనే సర్వత్ర తెలుసుకోవాలి. పరమేశ్వరునకు జన్మ మరణాదులు ఎన్నడూ జరుగవు. కాబట్టి జన్మాది విశేషణాలు గల 'విరాట్' మొదలైన పేర్లతో జగత్తులోని జడ, జీవాది పదార్థాలనే గ్రహించుట మంచిది. పరమేశ్వరుని గ్రహించుట తగదు.

ఇక **'విరాట్'** మొదలైన పేర్లతో పరమేశ్వరున్ని గ్రహించవలసిన విధానం ఈ క్రింద వ్రాయబడిన ప్రమాణాల ద్వారా తెలుసుకోండి.

'ఓమ్' పదానికి విస్తృత వ్యాఖ్య

1. అ = విరాట్, అగ్ని, విశ్వుడు:

విరాట్:– 'వి' ఉపసర్గ పూర్వక **'రాజృ – దీప్తౌ'** అను ధాతువుకు **'క్విప్'** ప్రత్యయం చేర్చినచో **'విరాట్'** శబ్దం ఏర్పడుతుంది. **"యో వివిధం నామ చరాచరం జగద్రాజయతి ప్రకాశయతి స విరాట్"** వివిధ రూపాలుగల జగత్తును ప్రకాశింప చేయువాడు అవటం వలన 'విరాట్' శబ్దంతో పరమేశ్వరుడే గ్రహింపబడును.

అగ్ని:– "అఞ్చు – గతిపూజనయోః" "అగ, అగి, ఇణ్ గత్యర్థక" ధాతువులతో 'అగ్ని' శబ్దం ఏర్పడుతుంది. **"గతేస్త్రయోఽర్థాః జ్ఞానం గమనం ప్రాప్తిశ్చేతి. పూజనం నామ సత్కారః", "యోఽఞ్చతి అచ్యతే అగత్యంగత్యేతి వా సోఽయమగ్నిః"** – జ్ఞాన స్వరూపుడు; సర్వజ్ఞుడు; తెలిసికొనుటకు, పొందుటకు, పూజించుటకూ యోగ్యుడైన ఆ పరమేశ్వరునికి 'అగ్ని' అని పేరు.

విశ్వుడు:– 'విశ–ప్రవేశనే' అను ధాతువుతో **'విశ్వ'** శబ్దమేర్పడుతుంది. **విశంతి ప్రవిష్టాని (భవన్తి) సర్వాణ్యాకాశాదీని భూతాని యస్మిన్ యో వాఽకాశాదిషు సర్వేషు భూతేషు ప్రవిష్టః స విశ్వ ఈశ్వరః"** ఆకాశం మొదలైన సర్వభూతాలు ఎవరిలో ప్రవేశిస్తున్నాయో, ఎవరు వీటన్నింటిలో వ్యాపించి ప్రవిష్టుడై ఉన్నాడో ఆ పరమేశ్వరునికి **'విశ్వుడు'** అని పేరు. ఇలా అనేక పేర్లు **'అ'**కారమాత్రతో గ్రహించబడతాయి.

2. ఉ = హిరణ్యగర్భుడు, వాయువు, తైజసుడు:

హిరణ్యగర్భుడు:– "జ్యోతిర్వై హిరణ్యం, తేజో వై హిరణ్య మిత్యైతరేయ శతపథ బ్రాహ్మణే", "యో హిరణ్యానాం సూర్యాదీనాం తేజసాం గర్భ ఉత్పత్తి నిమిత్త మధికరణం స హిరణ్యగర్భః" సూర్యాది తేజోవంతమైన లోకాలు పుట్టి ఎవని ఆధారంతో, ఎవని అధీనంలో ఉంటాయో, ఎవడు సూర్యాది తేజస్స్వరూప పదార్థాలకు 'గర్భం' అనగా ఉత్పత్తి, స్థితులకు స్థానమో ఆ పరమేశ్వరుడు 'హిరణ్యగర్భుడు' అనబడతాడు. దీనికి ఈ క్రింది యజుర్వేద మంత్రం ప్రమాణం.

హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్ ।
స దాధార పృథివీం ద్యాముతేమాం కస్మై దేవాయ హవిషా విధేమ ॥ యజు. 13-4 ॥

ఇత్యాది స్థలాలలో 'హిరణ్యగర్భుడు' పరమేశ్వరుడే అని తెలుసుకోవాలి.

వాయువు:- 'వా - గతిగంధనయోః' అను ధాతువువలన **'వాయు'** శబ్దం ఏర్పడుతుంది. **'గంధనం హింసనం' "యో వాతి చరాఽచరం జగ ద్ధరతి (జీవయతి ప్రలయతి) బలినాం బలిష్ఠః స వాయుః"** - చరాచర జగత్తును ధరించి, జీవన, ప్రళయాలను చేయువాడు, బలవంతులకన్న మించిన బలవంతుడు ఐన ఈశ్వరునికి **'వాయువు'** అని పేరు.

తైజసుడు:- 'తిజ - నిశానే' అను ధాతువు వలన 'తేజః' శబ్దం ఏర్పడుతుంది. దానికి పరమున **'తద్ధిత అణ్'** ప్రత్యయం చేర్చినచో **'తైజసః'** తైజసుడు అను శబ్దం సిద్ధిస్తుంది. తాను స్వయం ప్రకాశు దగుటచే సూర్యాదులను తేజస్సు గల లోకాలుగా ప్రకాశింపచేయటం వలన ఈశ్వరునికి 'తైజసుడు' అని పేరు. ఓంకారంలోని "ఉ"కార మాత్రచే ఈ నామార్థాలు గ్రహింపబడతాయి.

3. మ్ = ఈశ్వరుడు, ఆదిత్యుడు, ప్రాజ్ఞుడు:

ఈశ్వరుడు: 'ఈశ - ఐశ్వర్యే' అను ధాతువు వలన **'ఈశ్వర'** శబ్దమేర్పడుతుంది. **"య ఈష్టే సర్వైశ్వర్యవాన్ వర్తతే స ఈశ్వరః"** - సత్యవిచార శీలం, జ్ఞానం, అనంతమైన ఐశ్వర్యం కలవాడు అవటం వలన పరమాత్మునికి **'ఈశ్వరుడు'** అని పేరు.

ఆదిత్యుడు:- 'దో - అవఖండనే' అను ధాతువుకు నఞ్ ఉపసర్గ చేర్చితే **'అదితి'** అను పదం, దానికి పరమున తద్ధిత ప్రత్యయము చేర్చినచో **'ఆదిత్య'** శబ్దం సిద్ధిస్తుంది. **"న విద్యతే వినాశో యస్య సోఽయ మదితిః అదితిరేవ ఆదిత్యః"** - వినాశం ఎన్నడూ చెందనివాడవటం వల్ల ఈశ్వరునికి **'ఆదిత్యుడు'** అని పేరు.

ప్రాజ్ఞుడు:- "జ్ఞా - అవబోధనే" 'ప్ర' పూర్వక **'జ్ఞా'** ధాతువు నుండి 'ప్రజ్ఞ' అను శబ్దం సిద్ధమవుతుంది. దానికి తద్ధిత ప్రత్యయం చేర్చుటవలన'ప్రాజ్ఞ' శబ్దమేర్పడుతుంది. **"యః ప్రకృష్టతయా చరాఽచరస్య జగతో వ్యవహారం జానాతి స ప్రజ్ఞః, ప్రజ్ఞ ఏవ ప్రాజ్ఞః"** - నిర్భ్రాంత జ్ఞానయుక్తుడై, సమస్త చరాచర జగత్తుయొక్క వ్యవహారాలను ఉన్నదున్నట్లు తెలుసుకొనేవాడవటం వల్ల ఈశ్వరునికి **'ప్రాజ్ఞుడు'** అని పేరు. ఇట్టి నామార్థాలు **'మ'**కారమున గ్రహింపబడుతున్నవి. ఒక్కొక్క మాత్ర నుండి మూడు మూడు అర్థాలు ఇక్కడ వ్యాఖ్యానింపబడినట్లే **'ఓం'**కార నామం నుండి ఇతర నామార్థాలూ తెలియబడుచున్నవి.

మంత్రాలలో గల 'మిత్ర' మొదలైన నామాల వ్యాఖ్య

"శన్నో మిత్రః శంవరుణః" అనే మంత్రంలో గల మిత్రాది నామాలు కూడా పరమేశ్వరునివే. ఎందుకంటే ! శ్రేష్ఠుని కోసమే స్తుతి, ప్రార్థన, ఉపాసనలు చేయబడతాయి. గుణ, కర్మ, స్వభావాలలోనూ,

సత్య వ్యవహారాలలోనూ అందరికన్న గొప్పవానినే **'శ్రేష్ఠుడు'** అంటారు. శ్రేష్ఠులందరిలో అత్యంత శ్రేష్ఠున్ని 'పరమేశ్వరుడు' అంటారు. అతనికి సమానులు ఇంతవరకు ఎవ్వరూ లేరు. కాలేరు, కాబోరు. అతనికి సమానులే లేనపుడు అతనికన్న అధికులు ఎట్లు కాగలుగుదురు? సత్యం, న్యాయం, దయ, సర్వసామర్థ్యం, సర్వజ్ఞత్వం మొదలైన అనంత గుణాలు పరమేశ్వరునిలో ఉన్నట్లు, ఏ జడ పదార్థాలలోనూ, జీవులలోనూ లేవు. సత్యమైన పదార్థంలో గల గుణ, కర్మ, స్వభావాలు సత్యంగానే ఉంటాయి.

కాబట్టి పరమేశ్వరునియొక్క స్తుతి, ప్రార్థన, ఉపాసనలను మాత్రమే చేయుట మానవులందరికీ తగును. అతనికంటె భిన్నులైనవారిని ఉపాసింపరాదు. ఎలాగంటే పూర్వజులైన బ్రహ్మ, విష్ణువు, మహాదేవుడు మొదలైన మహాశయులు, విద్వాంసులు, దైత్య దానవాది నికృష్ట మానవులు, ఇతర సామాన్యజనులు పరమేశ్వరుని యందే విశ్వాసముంచి అతనిని గురించే స్తుతి, ప్రార్థన, ఉపాసనలు చేసారు. అతనికన్న భిన్నులైనవారిని చేయలేదు. అలాగే మనమందరం చేయటం యోగ్యం. దీనిని గురించి విశేషంగా **'ముక్తి - ఉపాసన'** అనే విషయంలో చర్చించబడ్డాయి.

మిత్రాది నామాలు ఈశ్వర వాచకాలే

ప్రశ్న:- మిత్రాది నామాలతో సఖుడు, స్నేహితుడు, ఇంద్రాది దేవతలు ప్రసిద్ధంగా వ్యవహరింపబడుట చూస్తున్నాం. కాబట్టి ఆ నామాలచే వారినే గ్రహించాలి.

జవాబు:- వారిని ఈ మంత్రంలో ఇక్కడ గ్రహించరాదు. ఒక మనిషి ఒకరికి మిత్రుడైన ఇతరులకు శత్రువుగాను, తటస్థుడుగాను ఉండుట చూస్తున్నాము. కాబట్టి ఇక్కడ ముఖ్యార్థంలో సఖాదులు గ్రహింపబడరు. పరమేశ్వరుడే సర్వజగత్తుకు నిశ్చిత మిత్రుడు. అతడు ఎవరికీ శత్రువుగాని, తటస్థుడు గానీ కాడు. అతని వలె ఇతర జీవులేవీ అలా ఉండవు. కావున ఇక్కడ పరమేశ్వరునే గ్రహించాలి. గౌణార్థంలో మిత్రాది శబ్దాలతో సహృదయులైన మానవులను గ్రహింపవచ్చు.

మిత్రుడు:- 'ఞిమిదా - స్నేహనే' అను ధాతువునకు పరమున ఔణాదిక **'క్త'** ప్రత్యయం చేరుటచే **'మిత్ర'** శబ్దమేర్పడుతుంది. **"మేద్యతి స్నిహ్యతి స్నిహ్యతే వా స మిత్రః"** అందరితో స్నేహం చేస్తూ, అందరితో ప్రేమింపబడే వాడవటం వలన ఆ పరమేశ్వరునికి 'మిత్రుడు' అని పేరు.

వరుణుడు:- "వృఞ్ - వరణే, వర - ఈప్సాయామ్" అను ధాతువునకు పరమున ఉణాది **'ఉనన్'** ప్రత్యయం చేర్చుట వలన **'వరుణ'** శబ్దం ఏర్పడుతుంది. **"యః సర్వాన్ శిష్టాన్ ముముక్షూన్ ధర్మాత్మనో వృణోత్యథ వా యఃశిష్టైర్ముముక్షుభిర్ధర్మాత్మభి ర్వ్రియతే వర్యతే వా స వరుణః పరమేశ్వరః"** శిష్టులైన యోగులు, విద్వాంసులు, ముక్తిని గోరువారిని, ముక్తజనులను, ధర్మాత్ములను స్వీకరించువాడును; శిష్టులచే, ముముక్షువులచే, ముక్తజనులచే, ధర్మాత్ములచే గ్రహింపబడువాడు అవటం వలన ఈశ్వరునికి 'వరుణుడు' అని పేరు. "అథవా వరుణోనామ వరః శ్రేష్ఠః" పరమేశ్వరుడు అందరికంటే శ్రేష్ఠుడు అవటం వలన అతనికి 'వరుణుడు' అని పేరు.

అర్యముడు:- **"ఋ - గతి ప్రాపణయోః"** అను ధాతువునకు పరమున **'యత్'** ప్రత్యయాన్ని చేర్చినచో **'అర్య'** శబ్దమేర్పడుతుంది. **'అర్య'** పూర్వక **'మాజ్ - మానే'** అను ధాతువునకు పరమున 'కనిన్' ప్రత్యయం చేరి **'అర్యమా'** శబ్దమేర్పడును. **"యో౽ర్యాన్ స్వామినో న్యాయాధీశాన్ మిమీతే మాన్యాన్ కరోతి సో౽ర్యమా"** సత్యాన్ని, న్యాయాన్ని చేయువాడు, మానవులకు మాన్యుడు, పాప పుణ్యాలను చేయువారికి ఫలాన్ని యథాయోగ్యంగా, సత్యంగా ఇచ్చేవాడూ అవటం వలన పరమేశ్వరునికి **'అర్యమా'** అని పేరు.

ఇంద్రుడు:- **'ఇది - పరమైశ్వర్యే'** అను ధాతువునకు పరమున **'రన్'** ప్రత్యయం చేర్చినచో **'ఇంద్ర'** శబ్దమేర్పడుతుంది. **"య ఇందతి పరమైశ్వర్యవాన్ భవతి స ఇంద్రః పరమేశ్వరః"** సమస్త ఐశ్వర్యాలు కలవాడవటం వలన పరమాత్ముడు 'ఇంద్రుడు' అనబడును.

బృహస్పతి:- **'బృహత్'** శబ్దం పూర్వం గల **'పా-రక్షణే'** అను ధాతువునకు పరమున **'డతి'** ప్రత్యయాన్ని చేర్చినచో, **'బృహత్'** లోని తకారం లోపించి, సుడాగమం అవటం వలన **'బృహస్పతి'** శబ్దమేర్పడుతుంది. **"యో బృహతా మాకాశాదీనాం పతిః స్వామీ పాలయితా స బృహస్పతిః"** గొప్పవారికంటె గొప్పవాడు, గొప్పనైన ఆకాశాది బ్రహ్మాండాలకు స్వామియూ అవటం వలన పరమేశ్వరునికి 'బృహస్పతి' అని పేరు.

విష్ణువు:- **"విష్ౢ-వ్యాప్తౌ"** అను ధాతువునకు **'ను'** ప్రత్యయాన్ని చేర్చినచో **'విష్ణువు'** అను శబ్దమేర్పడుతుంది. **"వేవేష్టి వ్యాప్నోతి చరా౽చరం జగత్ స విష్ణుః"** చరాచర జగత్తులో వ్యాపించి ఉండటం వలన పరమేశ్వరునికి **'విష్ణువు'** అని పేరు.

ఉరుక్రముడు:- **"ఉరుర్మహాన్‌క్రమః పరాక్రమో యస్య స ఉరుక్రమః"** అనంత పరాక్రమయుక్తుడవటం వలన పరమాత్మకు 'ఉరుక్రముడు' అని పేరు. పరమేశ్వరుడు **ఉరుక్రమః =** మహా పరాక్రమము గలవాడును; **మిత్రః =** అందరకు స్నేహితుడును, **అతడు, శం =** సుఖకారకుడు; **వరుణః =** సర్వోత్తముడగు **అతడు, శం =** సుఖ స్వరూపుడు; **అర్యమా =** న్యాయాధీశుడగు **అతడు, శం =** సుఖకారకుడు; **ఇంద్రః =** ఐశ్వర్యవంతుడగు **అతడు; శం =** సకల ఐశ్వర్యదాయకుడు; **బృహస్పతిః =** సర్వ అధిష్ఠాత యగు **అతడు, శం =** విద్యాప్రదుడు; **విష్ణు =** సర్వత్ర వ్యాపకుడును అగు ఆ పరమాత్మ, **నః =** మాకు కళ్యాణకారకుడు; **భవతు =** అగుగాక!

బ్రహ్మ:- వాయో! తే బ్రహ్మణే నమో౽స్తు = "బృహ బృహి - వృద్ధౌ" అను ధాతువు వలన **'బ్రహ్మ'** శబ్దము ఏర్పడుతుంది. అందరిని మించి విరాజిల్లువాడు, అందరికన్నా గొప్పవాడు, అనంత బలయుక్తుడు అయిన ఆ బ్రహ్మకు మా నమస్కారాలు. ఓ పరమేశ్వరా! **త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి =** అంతర్యామిరూపుడవు అవటం వలన నీవే ప్రత్యక్ష బ్రహ్మవు. **త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి =** ప్రత్యక్ష బ్రహ్మవని నేను నిన్నే అంటాను. ఎందుకంటే, నీవే సర్వత్ర వ్యాపించి ఉన్నావు. నీవే అందరికి నిత్యం లభించువాడవు. **ఋతం వదిష్యామి =** వేదంలోని యదార్థాలైన నీ ఆజ్ఞలను నేనందరికీ ఉపదేశిస్తాను. **సత్యం వదిష్యామి =** సత్యాన్నే చెబుతాను; సత్యాన్నే అంగీకరిస్తాను; సత్యాన్నే ఆచరిస్తాను

తన్మామవతు = కావున నీవు నన్ను కాపాడు. **తద్వక్తార మవతు** = సత్య వక్తనైన అప్పుడనైన నన్ను రక్షించు. నీ యాజ్ఞలలో నా బుద్ధి స్థిరమై ఎన్నడూ విరుద్ధంగా ఉండకుండా చూడు! నీ ఆజ్ఞయే ధర్మం. దానికి విరుద్ధమైనదే అధర్మం.

అవతు మామవతు వక్తారమ్ = రెండవ పర్యాయం ఈ వాక్యం అధికారార్థం పఠింపబడింది. ఉదా:- **"కశ్చిత్ కంచిత్ప్రతి వదతి త్వం గ్రామం గచ్ఛ గచ్ఛ"** ఇందు క్రియాపదం రెండుసార్లు ఉచ్చరించటం వలన "నీవు శీఘ్రంగా గ్రామానికి వెళ్ళు" అని తెలుస్తుంది. అలాగే ఇక్కడ "నీవు నన్ను తప్పనిసరిగా రక్షించు. అనగా ధర్మమందు సునిశ్చిత చిత్తుడనై అధర్మాన్ని ఏవగించుకొనునట్లు నాపై దయచూపుము. నీ మహోపకారాన్ని నేనెన్నడూ మరువను. నీకు నిరంతరం కృతజ్ఞుడనై ఉంటాను".

త్రివిధ తాపనివారణ

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః = ఇక్కడ మూడు సార్లు శాంతి శబ్దాన్ని పఠించుటలో ఈ ప్రయోజనమున్నది. ఈ లోకంలో త్రివిధ తాపాలు = అనగా మూడు విధాలైన దుఃఖాలున్నవి. అవి 1. ఆధ్యాత్మికం, 2. ఆధిభౌతికం, 3. అధి దైవికం. ఆత్మలో - శరీరంలో అవిద్య, రాగ, ద్వేష, మూర్ఖతల వల్ల, జ్వర పీడాదుల వల్ల కలిగే దుఃఖాన్ని 'ఆధ్యాత్మిక' తాపమంటారు. శత్రు, వ్యాఘ్ర, సర్పాదులచే కలిగినది 'అధి భౌతిక' తాపమంటారు. అతివృష్టి, అతిశీతలం, అత్యుష్ణం అను వీని వల్ల మనస్సు మొదలైన ఇంద్రియాల అశాంతి వల్ల కల్గేది 'అధి దైవిక' తాపమంటారు. ఈ మూడు విధాల దుఃఖాల నుండి మమ్ము నిరంతరం దూరముంచి, కళ్యాణకరమైన కార్యాలలో నిరంతరం మమ్ము ప్రవర్తింపచేయి. ఎలాగంటే నీవే కళ్యాణస్వరూపుడవు. నీవే సమస్తలోక కళ్యాణకారుడవు. నీవే ధార్మికులైన ముముక్షువులకు శుభాలను ఇచ్చువాడవు. నీవు స్వయంగా కరుణతో మా హృదయంలో ప్రకాశితుడ వగుము. నీ కృపవలన జీవులెల్లరు ధర్మాచరణ చేస్తూ, అధర్మాన్ని వీడి, పరమానంద ప్రాప్తితో దుఃఖాలకు దూరమగుదురు గాక!

ఈశ్వరుని ఇతర నామాల వ్యాఖ్య

సూర్యుడు:- "సూర్య ఆత్మా జగతస్తస్థుషశ్చ" ఇది యజుర్వేద 7-42 వచనం. **'జగత్'** అనగా చేతనాలు - ప్రాణులు చరించెడు దానికి జంగమములు - చరించేవి, తిరిగేవి అని అర్థం. **'తస్థుషః'** అనగా అప్రాణులను స్థావరాలు, జడపదార్థాలైన పృథ్వి మొదలైనవని అర్థం. జగత్, తస్థుషములకు రెండింటికి ఆత్మయై, స్వప్రకాశస్వరూపుడై, అన్నింటిని ప్రకాశింపచేయువాడవటం వలన పరమేశ్వరునికి **'సూర్యుడు'** అని పేరు.

పరమాత్మ:- "అత-సాతత్యగమనే" అను ధాతువు వలన **'ఆత్మ'** శబ్దమేర్పడును. **"యోఽతతి వ్యాప్నోతి స ఆత్మా"** జీవాది సర్వలోకంలో నిరంతరం వ్యాపకుడవటం వలన **'ఆత్మ'**. **"పరశ్చాసావాత్మా చ, య ఆత్మభ్యో జీవేభ్యఃసూక్ష్మేభ్యః పరోఽతిసూక్ష్మః స పరమాత్మా"** జీవులన్నింటిలో

ఉత్కృష్టుడును, జీవ, ప్రకృతి, ఆకాశములకన్న అతి సూక్ష్ముడు, జీవములన్నిటిలో అంతర్యామి ఆత్మ అవటం వలన ఈశ్వరునికి 'పరమాత్మ' అని పేరు.

పరమేశ్వరుడు:- సామర్థ్యం గలవానిని 'ఈశ్వరుడు' అంటారు. **"య ఈశ్వరేషు సమర్థేషు పరమః శ్రేష్ఠః స పరమేశ్వరః"** సమర్థులలో సమర్థుడై, సాటిలేనివాడు కావటంచేత అతనికి 'పరమేశ్వరుడు' అని పేరు.

సవిత:- "షుఞ్ - అభిషవే. షూఙ్ - ప్రాణి గర్భవిమోచనే" అను ధాతువుల వలన 'సవితా' శబ్దమేర్పడుతుంది. **"అభిషవః ప్రాణిగర్భవిమోచనం చోత్పాదనమ్. యశ్చరాచరం జగత్ సునోతి సూతే వోత్పాదయతి స సవితా పరమేశ్వరః"** సమస్త లోకాన్ని ఉత్పత్తి చేయుటచే పరమేశ్వరునికి 'సవిత' అని పేరు.

దేవుడు:- "దివు - క్రీడా విజిగీషా వ్యవహార ద్యుతి స్తుతి మోద మద స్వప్న కాంతి గతిషు" - అను ధాతువు వలన **'దేవ'** శబ్దమేర్పడును. క్రీడా = శుద్ధ జగత్తును క్రీడింపచేసేవాడు; **విజిగీషా** = ధార్మికులకు జయాన్ని కలిగింపవలెనను కోరికతో సర్వ వ్యవహార చేష్టల సాధన ఉపసాధనాలనిచ్చువాడు; **ద్యుతి** = స్వయంప్రకాశరూపుడై సమస్తాన్ని ప్రకాశింపచేసేవాడు. **స్తుతి** = ప్రశంసాయోగ్యుడు; **మోద** = తాను ఆనందస్వరూపుడు ఇతరులకు ఆనందాన్ని ఇచ్చువాడు;**మద** = మదముచే ఉన్మత్తులైనవారిని దండించువాడు; స్వప్న = అందరు శయనించుటకు రాత్రిని, ప్రళయాన్ని చేయువాడు; **కాంతి** = కామింపదగినవాడు, **గతి** = జ్ఞానస్వరూపుడు అవటం వల్ల ఆ పరమేశ్వరునికి 'దేవుడు' అని పేరు.

అథవా **"యో దీవ్యతి క్రీడతి స దేవః"** తన స్వరూపంలో తానే ఆనందంతో క్రీడించువాడు, ఇతరుల సహాయం లేకుండా సహజ స్వభావాన్ని క్రీడవలె లోకాన్ని సృజించి క్రీడలకు ఆధారమైనవాడు **'దేవుడు'; "విజిగీషతే స దేవః"** అందర్ని జయించేవాడు, స్వయంగా అజేయుడు అనగా అతన్ని ఎవరూ జయింపజాలరు; **"యో వ్యవహారయతి స దేవః"** న్యాయ, అన్యాయరూప వ్యవహారాలను తెలిసినవాడు, ఉపదేష్టయు; **"యశ్చరాచరం జగత్ ద్యోతయతి"** సర్వ ప్రకాశకుడు; **"యః స్తూయతే స దేవః"** మనుషులందరిచే ప్రశంసించదగినవాడు; నిందింప దగనివాడు; **"యో మోదయతి స దేవః"** స్వయంగా ఆనందస్వరూపుడై, దుఃఖాన్ని ఏమాత్రమూ లేనివాడై ఇతరులను ఆనందపరచువాడు; **"యో మాద్యతి స దేవః"** నిరంతరం హర్షం కలిగి, శోకం లేనివాడై, ఇతరుల దుఃఖాలను తొలగించి వారిని హర్షింపజేయువాడు; **"యః స్వాపయతి స దేవః"** ప్రళయకాలంలో జీవులన్నింటిని అవ్యక్త ప్రకృతిలో నిద్రింపజేయువాడు; **"యః కామయతే కామ్యతే వా స దేవః"** సమస్త సత్యకామములు గలవాడు. శిష్ట జనులచే పొందుటకు కోరబడువాడు; **"యో గచ్ఛతి గమ్యతే వా స దేవః"** అన్నింటిలో వ్యాపకుడై అందరిచే తెలిసికొనుటకు యోగ్యుడవటం వల్ల పరమేశ్వరునికి **'దేవుడు'** అని పేరు.

కుబేరుడు:- 'కుబి - ఆచ్ఛాదనే' అను ధాతువు వలన **'కుబేర'** శబ్దం ఏర్పడుతుంది, **"యః సర్వం కుమ్బతి స్వవ్యాప్త్యాచ్ఛాదయతి స కుబేరో జగదీశ్వరః"** తన వ్యాప్తిచే అన్నింటిని ఆచ్ఛాదన మొనర్చును కాబట్టి పరమేశ్వరునికి **'కుబేరుడు'** అని పేరు.

పృథివి:- 'పృథు - విస్తారే' అను ధాతువుచే 'పృథివీ' శబ్దమేర్పడింది. "యః పరతి సర్వం జగద్విస్తృణాతి తస్మాత్ స పృథివీ" విస్తారమైన జగమంతటినీ విస్తృతపరచువాడు అవటం వల్ల పరమేశ్వరునికి 'పృథివి' అని పేరు.

జలము:- 'జల - ఘాతనే' అను ధాతువు వల్ల 'జల' శబ్దమేర్పడుతుంది. "జలతి ఘాతయతి దుష్టాన్, సంఘాతయతి అవ్యక్తపరమాణ్వాదీన్ తద్ బ్రహ్మ జలమ్" దుష్టులను దండించువాడు, అవ్యక్తములైన పరమాణువులకు పరస్పర సంయోగ వియోగాలను కావించువాడవటం వల్ల పరమాత్మునికి 'జలము' అని పేరు.

"యద్వా యజ్జనయతి లాతి సకలం జగత్ తద్ బ్రహ్మ జలమ్" సమస్త విశ్వానికి జనకుడు, సమస్త సుఖాలనిచ్చువాడు కావటం వల్ల పరమేశ్వరునికి 'జలం' అని పేరు.

ఆకాశము:- 'కాశృ - దీప్తౌ' అను ధాతువు వలన 'ఆకాశ' శబ్దమేర్పడింది. "యః సర్వతః సర్వం జగత్ప్రకాశయతి స ఆకాశః" అన్నివైపుల నుండి సర్వజగమును ప్రకాశింపచేయువాడు కాబట్టి పరమాత్మునికి 'ఆకాశము' అని పేరు.

అన్నం:- 'అద - భక్షణే' అను ధాతువు నుండి 'అన్న' శబ్దమేర్పడుతుంది.

అద్యతేఽత్తి చ భూతాని తస్మాదన్నం తదుచ్యతే ।
అహమన్న మహమన్న మహమన్నమ్ ।
అహమన్నాదోఽహమన్నాదోఽహమన్నాదః ॥ తైత్తరీయ ఉపనిషత్ 2-10 ॥

అత్తా చరాఽచర గ్రహణాత్ ॥ వేదాంత దర్శనం 1-2-9 ॥

అన్నింటిని తనలో పెట్టుకొని, అన్నింటిని గ్రహించుటకు యోగ్యుడు, చరాచర జగాన్ని గ్రహించువాడు కావటం వల్ల ఈశ్వరునికి 'అన్న' 'అన్నాద' 'అత్తా' అను నామాలున్నాయి. ఇందు మూడుసార్లు గల పాఠము ఆదరమునకే. మేడిపండులో క్రిములు పుట్టి, అందులోనే ఉండి, అందులోనే నశించునట్లు పరమేశ్వరునిలోనే ఈ సర్వ జగత్తు యొక్క వ్యవస్థ ఉన్నది.

వసువు:- 'వస-నివాసే' అను ధాతువు వలన 'వసు' శబ్దమేర్పడుతుంది. "వసంతి భూతాని యస్మిన్నథవా యః సర్వేషు భూతేషు వసతి స వసురీశ్వరః" ఆకాశాది సర్వ భూతాలకు నివాసస్థానమైనవాడు, అన్నింటిలో నివసించువాడు కావటం వల్ల ఆ పరమేశ్వరునికి 'వసువు' అని పేరు..

రుద్రుడు:- "రుదిర్ - అశ్రు విమోచనే" అను ధాతువుకు పరమున 'ణిచ్' 'రక్' ప్రత్యయాలు చేర్చినచో 'రుద్ర' శబ్దమేర్పడుతుంది. "యో రోదయత్యన్యాయకారిణో జనాన్ స రుద్రః" దుష్టకర్మలను చేయువారిని ఏడ్పించేవాడు కావటం వల్ల పరమేశ్వరుడు 'రుద్రుడు' అనబడతాడు.

యన్మనసా ధ్యాయతి తద్వాచా వదతి, యద్వాచా వదతి తత్కర్మణా కరోతి,
యత్కర్మణా కరోతి తదభిసంపద్యతే ॥

ఇది యజుర్వేద బ్రాహ్మణ వచనం. జీవుడు మనస్సులో తలచిన దానిని వాక్కుతో చెబుతాడు. వాక్కుతో చెప్పిన దానిని కర్మద్వారా చేస్తాడు. కర్మతో చేసిన దానినే పొందుతాడు. తాను చేసిన కర్మలకు తగిన ఫలితాన్నే జీవుడు పొందుతాడని దీనివల్ల తెలుస్తున్నది. దుష్టకర్మలను చేయు జీవులు ఈశ్వరుని న్యాయరూప వ్యవస్థలో దుఃఖరూప ఫలాన్నే పొంది ఏడుస్తారు. వారిని ఈశ్వరుడే ఇలా ఏడ్పిస్తాడు. అందుచే పరమేశ్వరునికి 'రుద్రుడు' అని పేరు.

నారాయణుడు:- ఆపో నారా ఇతిప్రోక్తా ఆపో వై నరసూనవః ।
తా యదస్యాయనం పూర్వం తేన నారాయణః స్మృతః ॥ మను.అ.1 శ్లో.10 ॥

జలానికి, జీవులకు **'నారాః'** అను పేరున్నది. **'అయనము'** అనగా నివాస స్థానం కలవాడవటం వల్ల సర్వజీవులలో వ్యాపకుడైన పరమాత్మకు **'నారాయణుడు'** అని పేరు.

చంద్రుడు:- "చది - ఆహ్లాదే" అను ధాతువు వలన 'చంద్ర' శబ్ద మేర్పడుతుంది. **"యశ్చందతి చందయతి వా స చంద్రః"**ఆనందస్వరూపుడు, అందరికీ ఆనంద మిచ్చువాడు అవటంవల్ల ఈశ్వరునికి **'చంద్రుడు'** అని పేరు.

మంగళుడు:- "మగి గత్యర్థక" ధాతువునకు **'మంగేరలచ్'** అను ఉణాది సూత్రమునను సరించి అలచ్ ప్రత్యయం చేర్చుట వలన **'మంగళ'** శబ్దమేర్పడుతుంది. **"యో మంగతి మంగయతి వా స మంగలః"** మంగళస్వరూపుడై జీవులందరికీ మంగళ మొనర్చువాడు కాబట్టి ఆ పరమేశ్వరునికి **'మంగళుడు'** అని పేరు.

బుధుడు:- 'బుధ - అవగమనే' అను ధాతువు వలన **'బుధ'** శబ్దమేర్పడుతుంది. **"యో బుధ్యతే బోధయతి వా స బుధః"** స్వయంగా బోధస్వరూపుడై జీవులందరి బోధకు కారణమవటం వల్ల ఆ పరమేశ్వరునికి **'బుధుడు'** అని పేరు. **'బృహస్పతి'** నామానికి అర్థం పూర్వమే చెప్పబడింది.

శుక్రుడు:- "శుచిర్ - పూతీభావే" అను ధాతువు వలన **'శుక్ర'** శబ్దమేర్పడుతుంది. **"యః శుచ్యతి శోచయతి వా స శుక్రః"** అత్యంత పవిత్రుడు, తన సంగమమున జీవులను పవిత్రపరచువాడు అవటంవల్ల ఈశ్వరునికి **'శుక్రుడు'** అని పేరు.

శనైశ్చరః:- 'చర - **గతిభక్షణయోః'** అను ధాతువుకు పూర్వం **'శనైస్'** అను అవ్యయం ఉపపదంగా చేర్చుటవల్ల **'శనైశ్చరః'** అను శబ్దమేర్పడుతుంది. **"యః శనైశ్చరతి స శనైశ్చరః"**అన్నింటిలో సహజంగా ప్రాప్తుడైన ధైర్యవంతుడు, కాబట్టి ఆ పరమేశ్వరునికి **'శనైశ్చరుడు'** అని పేరు.

రాహువు:- 'రహ - త్యాగే' అను ధాతువు వలన **'రాహు'** శబ్దమేర్పడుతుంది. **"యో రహతి పరిత్యజతి దుష్టాన్ రాహయతి త్యాజయతి వా స రాహురీశ్వరః"**ఏకాంత స్వరూపుడూ, తన స్వరూపంలో

ఇతర పదార్థాలు సంయుక్తం కానివాడూ, దుష్టుల నుండి సజ్జనులను విడిపింపజేయువాడూ అవటం వల్ల పరమేశ్వరునికి 'రాహువు' అని పేరు.

కేతువు:- "కిత - నివాసే రోగాపనయనే చ" అను ధాతువు వలన 'కేతు' శబ్దమేర్పడింది. "యః కేతయతి చికిత్సతివా స కేతురీశ్వరః" సర్వలోకానికీ నివాసస్థానమైనవాడూ, సర్వరోగ రహితుడూ, ముముక్షువుల సర్వరోగాలను తొలగించువాడూ అవటం వల్ల ఆ పరమాత్మునికి 'కేతువు' అని పేరు.

యజ్ఞుడు:- "యజ - దేవపూజా సంగతీకరణ దానేషు" అను ధాతువు వలన 'యజ్ఞ' శబ్దమేర్పడుతుంది. 'యజ్ఞో వై విష్ణు' (శతపథ. బ్రా. కాం. 13 అ. 1. 8. 8) ఇది బ్రాహ్మణ గ్రంథవచనం, "యో యజతి విద్వద్భిరిజ్యతే వా స యజ్ఞః" జగత్పదార్థాల నన్నింటినీ సంయుక్త మొనర్చువాడు, విద్వాంసులందరికీ పూజ్యుడు, బ్రహ్మాది ఋషి మునులందరికీ పూజ్యుడుగా ఉండి, ఉంటూ, ఉండగలవాడు అవటం వల్ల, అంతట వ్యాపకుడవటం వల్ల, ఆ పరమాత్మకు 'యజ్ఞుడు' అని పేరు.

హోత:- "హు - దానాஉదనయోః ఆదానే చేత్యేకే" అను ధాతువు వలన 'హోత' శబ్దమేర్పడుతుంది. 'యో జుహోతి స హోతా' జీవులకు ఇచ్చే పదార్థాలను ఇచ్చువాడు, గ్రహించువానిని గ్రహించువాడు అవటం వల్ల ఆ పరమేశ్వరునికి 'హోత' అని పేరు.

బంధువు:- 'బంధ - బంధనే' అను ధాతువు వలన 'బంధు' శబ్దమేర్పడుతుంది. "యః స్వస్మిన్ చరాచరం జగద్బధ్నాతి బంధువద్ధర్మాత్మనాం సుఖాయ సహాయో వా వర్తతే స బంధుః" తనలో సమస్త లోకలోకాంతరాలను నియమంతో బంధించి, అవి తమ పరిధిని లేక నియమాలను ఉల్లంఘింపకుండునట్లు, సోదరుడు తన తోటి సోదరులకు సహాయ మొనర్చునట్లు, పృథివి మొదలైన లోకాలను ధరిస్తూ, రక్షిస్తూ సుఖాలను ఇచ్చేవాడు అవటం వల్ల పరమేశ్వరునికి 'బంధువు' అని పేరు.

పితా:- 'పా - రక్షణే' అను ధాతువు వలన 'పితా' శబ్దము మేర్పడుతుంది. "యః పాతి సర్వాన్ స పితా" తండ్రి తన సంతానంపై సదా కృపగలవాడై వారి ఉన్నతిని కోరి కాపాడునట్లు, అందరినీ రక్షించువాడు, జీవులందరికీ ఉన్నతిని కోరువాడు కాబట్టి అతనికి 'పిత' అని పేరు.

పితామహుడు:- 'యః పితౄణాం పితా స పితామహః' పితరులను పిత, తండ్రులకు తండ్రి అవటం వల్ల ఆ పరమేశ్వరునికి 'పితామహుడు' అని పేరు. "యః పితామహానాం పితా స ప్రపితామహః" పితామహులకును పిత అగుటచే అతడు 'ప్రపితామహుడు'.

మాతా:- 'మాఙ్ - మానే శబ్దే చ' అను ధాతువు వల్ల 'మాతా' శబ్దం ఏర్పడింది. "యో మిమీతే మానయతి సర్వాన్ జీవాన్ స మాతా" పూర్ణ కృపావతియైన తల్లి తన సంతాన సుఖాన్ని, ఉన్నతిని కోరునట్లు జీవులందరి ఉన్నతిని పరమేశ్వరుడు కూడ కోరుటచే అతనికి 'మాతా' అని పేరు.

ఆచార్యుడు:- 'చర - గతిభక్షణయోః' ఆఙ్ పూర్వకమైన ఈ ధాతువు వల్ల 'ఆచార్య' శబ్దమేర్పడుతుంది. "య ఆచారం గ్రాహయతి సర్వా విద్యా బోధయతి స ఆచార్య ఈశ్వరః" సత్య

ఆచారాన్ని గ్రహింపచేయువాడూ, సర్వ విద్యల ప్రాప్తికి హేతువై వానిని ప్రాప్తింపజేయువాడూ అవటంవల్ల [illegible] 'ఆచార్యుడు' అని పేరు.

గురువు:- 'గృ - శబ్దే' అను ధాతువు వల్ల 'గురు' శబ్దమేర్పడుతుంది. **"యో ధర్మాన్ శబ్దాన్ గృణాత్యుపదిశతి స గురుః" "స పూర్వేషామపి గురుః కాలేనానవచ్ఛేదాత్"** (యోగ. సమాధిపాదం. సూ. 26) సత్యధర్మప్రతిపాదకుడూ, సకల విద్యాయుక్తవేదాన్ని ఉపదేశించువాడూ, సృష్టి ఆరంభంలో అగ్ని, వాయువు, ఆదిత్య, అంగిరస, బ్రహ్మాది గురువులకు గురువు, నాశనమెన్నడూ లేనివాడు కాబట్టి పరమేశ్వరునికి 'గురువు' అని పేరు.

అజుడు:- "అజ - గతిక్షేపణయోః" "జనీ - ప్రాదుర్భావే" అను ధాతువుల వల్ల **'అజ'** శబ్దమేర్పడుతుంది. **"యోఽజతి సృష్టిం ప్రతి సర్వాన్ ప్రకృత్యాదీన్ పదార్థాన్ ప్రక్షిపతి జానాతి వా కదాచిన్నజాయతే సోఽజః"** ప్రకృతి యొక్క సర్వ అవయవాలైన ఆకాశాది భూతాల పరమాణువులను యథాయోగ్యంగా కలుపువాడూ, శరీరాలతో జీవులను సంబంధపరచి జన్మనిచ్చువాడూ, తాను ఎన్నడూ జన్మించనివాడు కాబట్టి ఈశ్వరునికి **'అజుడు'** అని పేరు.

బ్రహ్మ:- 'బృహ, బృహి వృద్ధౌ' అను ధాతువు వల్ల 'బ్రహ్మ' శబ్దమేర్పడుతుంది. **"యోఽఖిలం జగన్నిర్మాణేన బర్హతి (బృంహతి) వర్ధయతి స బ్రహ్మ"** సంపూర్ణ లోకాన్ని నిర్మించి వృద్ధిచేయువాడు కాబట్టి పరమేశ్వరునికి 'బ్రహ్మ' అని పేరు.

"సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" ఇది తైత్తిరీయోపనిత్తు వచనం.

"సన్తీతి సంతః తేషు సత్సు సాధు తత్సత్యమ్. యజ్జానాతి చరాచరం జగత్తత్ జ్ఞానమ్. న విద్యతేఽన్తోఽవధిర్మర్యాదా యస్య తదనంతమ్. సర్వేభ్యో బృహత్వాద్ బ్రహ్మ". అస్తిత్వంగల పదార్థాలను **'సత్'** అంటారు. వానిలో సాధువు అవటంవల్ల పరమేశ్వరుని పేరు**'సత్యం'**. సర్వాన్ని తెలుసుకొనేవాడు కాబట్టి అతనికి **'జ్ఞానం'** అని పేరు. అంతం, అవధి, మర్యాద అనగా పొడుగు, వెడల్పు, ఎత్తు, చిన్న, పెద్ద అను పరిమాణాలు లేనివాడు కాబట్టి పరమేశ్వరుని పేరు**'అనంతుడు'**. అందరికంటె, అన్నిటికంటె పెద్దవాడు అవటం వల్ల పరమేశ్వరునికి 'బ్రహ్మ' అని పేరు.

అనాది:- 'డుదాఞ్ - దానే' ఆఙ్ పూర్వకమైన ఈ ధాతువు వల్ల **'ఆది'** శబ్దం, పిమ్మట **'నఞ్'** పూర్వకమై **'అనాది'** శబ్దం సిద్ధిస్తుంది. **"యస్మాత్ పూర్వం నాస్తి పరం చాస్తి స ఆదిరిత్యుచ్యతే" "న విద్యతే ఆదిః కారణం యస్య సోఽనాదిరీశ్వరః"** పూర్వం ఏమీ లేకుండా పరంలో ఉండే దాన్ని **"ఆది"** అంటారు. ఆదికారణమేమీ లేనివాడు కాబట్టి పరమేశ్వరునికి 'అనాది' అని పేరు.

ఆనందుడు:- 'టునది - సమృద్ధౌ' ఆఙ్ పూర్వకమైన ఈ ధాతువు వల్ల **'ఆనంద'** శబ్దమేర్పడుతుంది. **"ఆనందంతి సర్వే ముక్తా యస్మిన్ యద్వా యః సర్వాన్ జీవాన్ ఆనందయతి స ఆనందః"** ఆనందస్వరూపుడూ, ముక్తజీవులకు ఆనందాన్నిచ్చువాడూ, ధర్మాత్ములకు ఆనందమును కలిగించువాడును కావున ఈశ్వరునకు **'ఆనందుడు'** అని పేరు.

సత్:- 'అస - భువి' ఈ ధాతువు వల్ల 'సత్' శబ్దం ఏర్పడుతుంది. "యదస్తి త్రిషు కాలేషు న బాధ్యతే తత్సద్బ్రహ్మ". భూత భవిష్యత్ వర్తమాన కాలాలలో నశించకుండా సదా ఉండువాడవటం వల్ల పరమేశ్వరుడు 'సత్' అనబడతాడు.

చిత్:- 'చితీ - సంజ్ఞానే' అను ధాతువు వల్ల **'చిత్'** శబ్దమేర్పడుతుంది. **"యశ్చేతతి చేతయతి సంజ్ఞాపయతి సర్వాన్ సజ్జనాన్ యోగిన స్తచ్చిత్పరంబ్రహ్మ".** చేతనస్వరూపులైన జీవులకు తెలివినిచ్చి సత్య అసత్యాలను తెలుసుకొనేవాడు అవటం వల్ల ఆ పరమాత్మునికి 'చిత్' అను నామం కలదు.

సచ్చిదానందస్వరూపుడు: ఈ మూడు సత్, చిత్ మరియు ఆనందమనే శబ్దాలు విశేషణాలుగా అతనికి ఉండటం వల్ల **'సచ్చిదానందస్వరూపుడు'** అని పరమేశ్వరుడు పిలువబడతాడు.

నిత్యుడు:- 'యో నిత్యధ్రువో౽చలో౽వినాశీ స నిత్యః' నిత్యుడు, ధృవుడు, నిశ్చలుడు, అవినాశీ అవటం వల్ల ఈశ్వరుడు **'నిత్యుడు'** అను శబ్దవాచ్యుడు.

శుద్ధుడు:- 'శుంధ - శుద్ధౌ' దీనినుండి **'శుద్ధ'** శబ్దమేర్పడింది. **"యః శుంధతి సర్వాన్ శోధయతి వా స శుద్ధ ఈశ్వరః"** స్వయంగా పవిత్రుడు, అశుద్ధుల నుండి వేరై అందరిని శుద్ధం చేయువాడు కాబట్టి ఆ ఈశ్వరునికి **'శుద్ధుడు'** అని పేరు.

బుద్ధుడు:- "బుధ - అవగమనే" అను ధాతువుకు 'క్త' ప్రత్యయం చేర్చుటవల్ల **'బుద్ధ'** శబ్దం ఏర్పడుతుంది. **"యో బుద్ధవాన్ సదైవ జ్ఞాతా౽స్తి స బుద్ధో జగదీశ్వరః"** సదా సర్వాన్ని తెలుసుకొనేవాడు కాబట్టి ఈశ్వరునికి **'బుద్ధుడు'** అని పేరు.

ముక్తుడు:- "ముచ్లృ - మోచనే" అను ధాతువు వల్ల **'ముక్త'** శబ్దం ఏర్పడుతుంది. **"యో ముంచతి మోచయతి వా ముముక్షూన్ స ముక్తో జగదీశ్వరః"** సర్వదా అశుద్ధుల నుండి వేరై ముముక్షువులను సర్వ క్లేశాలనుండి తొలగించువాడు కాబట్టి పరమాత్మునికి **'ముక్తుడు'** అని పేరు. **"అత ఏవ నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావో జగదీశ్వరః"** అందువల్ల పరమేశ్వరుడు నిత్యశుద్ధబుద్ధముక్త స్వభావుడై ఉన్నాడు.

నిరాకారుడు:- "నిర్, ఆఙ్ పూర్వక డుకృఞ్ - కరణే" అను ధాతువు వల్ల **'నిరాకార'** శబ్దం ఏర్పడింది. **'నిర్గత ఆకారాత్ స నిరాకారః'** ఆకారంలేనివాడు, శరీరాన్ని ఎప్పుడూ ధరించనివాడు కాబట్టి పరమేశ్వరునికి **'నిరాకారుడు'** అని పేరు.

నిరంజనుడు:- 'అఞ్జూ - వ్యక్తిమ్లక్షణకాంతిగతిషు' ఈ ధాతువు వలన **'అంజన'** శబ్దం ఏర్పడుతుంది. **'నిర్'** ఉపసర్గతో కలిసిన **'నిరంజన'** శబ్దమవుతుంది. **"అంజనం వ్యక్తిర్మ్లక్షణం కుకామనాభిః ఇంద్రియైశ్చప్రాప్తిశ్చేత్యస్మాద్యో నిర్గతః పృథగ్భూతః స నిరంజనః"** వ్యక్తి, ఆకృతి, మ్లేచ్ఛాచారం, దుష్టకామన, చక్షురాది ఇంద్రియ విషయాలు మొదలైన వాటి నుండి దూరంగా ఉండేవాడు కాబట్టి ఈశ్వరునికి **"నిరంజనుడు"** అని పేరు.

గణేశుడు-గణపతి:- **"గణ - సంఖ్యానే"** ఈ ధాతువు వల్ల 'గణ' శబ్దం ఏర్పడుతుంది. దీనికి పరంలో **'ఈశ'** లేక **'పతి'** శబ్దం చేర్చితే **'గణేశ', 'గణపతి'** అను శబ్దాలు ఏర్పడతాయి. **"యే ప్రకృత్యాదయో జడా జీవాశ్చ గణ్యంతే సంఖ్యాయంతే తేషామీశః స్వామీ పతిః పాలకో వా"** ప్రకృతి మొదలైన జడములకు జీవాది ప్రఖ్యాత పదార్థాలకన్నింటికి స్వామీ, పాలించువాడు కాబట్టి ఈశ్వరునికి **'గణేశుడు', 'గణపతి'** అను నామాలు ఉన్నవి.

విశ్వేశ్వరుడు:- **'యో విశ్వమీష్టే స విశ్వేశ్వరః'** సమస్త లోకానికి అధిష్ఠాత అవటంవల్ల ఈశ్వరునికి **'విశ్వేశ్వరుడు'** అని పేరు.

కూటస్థుడు:- **"యః కూటే నేకవిధ వ్యవహారే స్వస్వరూపేణైవ తిష్ఠతి స కూటస్థః పరమేశ్వరః"** వ్యవహారాలన్నింటిలో వ్యాప్తుడై, వాటికి ఆధారుడై ఏ వ్యవహారంలోనూ తన రూపాన్ని మార్చనివాడవటం వల్ల పరమేశ్వరుడు **'కూటస్థుడు'**.

దేవి:- 'దేవ' శబ్దానికి వ్రాసిన అర్థాలన్నీ **'దేవీ'** శబ్దానికి ఉన్నాయి. పరమేశ్వరునికి మూడు లింగాలలో నామాలున్నాయి. ఉదా: **"బ్రహ్మ చితిరీశ్వరశ్చేతి"** బ్రహ్మము నపుంసకం. చితి స్త్రీలింగం, ఈశ్వరుడు పుల్లింగం. దేవశబ్దం ఈశ్వరునికి విశేషణమైన **'దేవ'** అని, చితి శబ్దానికి విశేషణమైన **'దేవి'** అని అవుతుంది. కాబట్టి **'దేవి'** అని కూడా పరమేశ్వరునికి పేరు.

శక్తి:- 'శక్ఌ - శక్తౌ' అనే ధాతువు వల్ల **'శక్తి'** శబ్దం ఏర్పడుతుంది. **"యః సర్వం జగత్ కర్తుం శక్నోతి స శక్తిః"** సర్వలోకాన్ని నిర్మించు సమర్థత కలవాడు కాబట్టి పరమేశ్వరునికి **'శక్తి'** అని పేరు.

శ్రీ:- 'శ్రిఞ్ - సేవాయాం' ఈ ధాతువు వల్ల **'శ్రీ'** శబ్దం ఏర్పడుతుంది. **"యః శ్రీయతే సేవ్యతే సర్వేణ జగతా విద్వద్భిర్యోగిభిశ్చ స శ్రీరీశ్వరః"** సమస్త జగత్తుతో, విద్వాంసులతో, యోగిజనులతో సేవించబడు ఆ పరమాత్మకు **'శ్రీ'** అని పేరు.

లక్ష్మీ:- 'లక్ష - దర్శనాంకనయోః' అనే ధాతువు వల్ల **'లక్ష్మి'** శబ్దం ఏర్పడుతుంది. **"యో లక్షయతి పశ్యతి, అంకతే చిహ్నయతి చరాచరం జగదథవా వేదైరాప్తైర్యోగిభిశ్చ యో లక్ష్యతే స లక్ష్మీః సర్వ ప్రియేశ్వరః"** చరాచర జగమెల్లా చూస్తూ చిహ్నితం అనగా దృశ్యవస్తువుగా చేసేవాడూ, శరీరంలో కన్ను, ముక్కు మొదలైనవాటిని, వృక్షాలలో పత్ర, పుష్ప, ఫలమూలాదులను, పృథివీజలాలలో నలుపు, తెలుపు, ఎరుపు వర్ణాలు, మృత్తిక, పాషాణం, చంద్రసూర్యాది దృశ్యాలు చేసేవాడూ, సమస్త శోభలకు శోభనిచ్చేవాడూ, వేదాది శాస్త్రాలకు ధార్మిక విద్వాంసులైన యోగులకు లక్ష్యమైనవాడు అనగా చూడదగినవాడు. కాబట్టి పరమేశ్వరునికి **'లక్ష్మి'** అని పేరు.

సరస్వతీ:- 'సృ - గతౌ' ఈ ధాతువు నుండి 'సరస్' శబ్దం ఏర్పడి, దానికి **'మతుప్' 'ఙీప్'** ప్రత్యయాలు రెండూ చేరితే **'సరస్వతీ'** శబ్దం సిద్ధిస్తుంది. **"సరో వివిధం జ్ఞానం విద్యతే యస్యాం చితౌ సా సరస్వతీ"**. వివిధ విజ్ఞానం అనగా శబ్దం, అర్థం, వాటి సంబంధ ప్రయోగాల జ్ఞానం ఉన్నదున్నట్లు కలవాడు కాబట్టి పరమేశ్వరునికి **'సరస్వతీ'** అని పేరు.

సర్వశక్తిమంతుడు:- "సర్వాః శక్తయో విద్యంతే యస్మిన్ స సర్వశక్తిమానీశ్వరః" తన కార్యాన్ని చేయుటకు ఇతరుల సహాయాన్ని కోరనివాడూ, తన సామర్థ్యంతో పనులన్నీ చేయువాడు కాబట్టి పరమాత్మకు 'సర్వశక్తిమంతుడు' అని పేరు.

న్యాయకారీ:- 'ణీఞ్ ప్రాపణే' అనే ధాతువు వల్ల 'న్యాయ' శబ్దం ఏర్పడుతుంది. "ప్రమాణైరర్థపరీక్షణం న్యాయః" న్యాయసూత్రాలకు వాత్స్యాయనముని వ్రాసిన భాష్యంలో ఈ వచనం ఉంది. "పక్షపాతరాహిత్యాచరణం న్యాయః" ప్రత్యక్షాది ప్రమాణాలతో పరీక్షించి సత్యమని ఋజువైనదాన్ని పక్షపాతరహితమైన ధర్మంతో ఆచరించుట 'న్యాయ' మనబడుతుంది. **"న్యాయం కర్తుం శీలం యస్య స న్యాయకారీశ్వరః"** న్యాయం అనగా పక్షపాతరహిత ధర్మాన్ని ఆచరించే స్వభావంగలవాడు కాబట్టి ఈశ్వరునికి **'న్యాయకారీ'** అని పేరు.

దయాళువు:- **"దయ - దాన గతి రక్షణ హింసా దానేషు"** అనే ఈ ధాతువు వల్ల **'దయ'** శబ్దం ఏర్పడుతుంది. **"దయతే దదాతి జానాతి గచ్ఛతి రక్షతి హినస్తి యయా సా దయా, బహ్వీ దయా విద్యతే యస్య స దయాలుః పరమేశ్వరః"** అభయాన్ని ఇచ్చువాడు, సత్యాసత్య విద్యలన్నీ తెలియువాడు, సజ్జనులనందర్నీ రక్షించి దుష్టులందరినీ యథాయోగ్యంగా దండించేవాడు కాబట్టి పరమాత్మకు **'దయాళువు'** అని పేరు.

అద్వైతుడు:- **"ద్వయోర్భావః ద్వాభ్యామితం సా ద్వితా, ద్వీతం వా సైవ తదేవ వాద్వైతమ్. న విద్యతే ద్వైతం ద్వితీయేశ్వరభావో యస్మిన్ తదద్వైతమ్. అర్థాత్ సజాతీయవిజాతీయ స్వగత భేదశూన్యం బ్రహ్మ"** రెండూ ఉండటం, లేక రెండింటితో కలిసి ఉండటం **"ద్వితం"** లేక **"ద్వీత"**మనబడుతుంది. ద్వితమే ద్వైతం. అట్టి ద్వైతం లేనివాడవటంచేత అద్వైతం. తనవంటిదే మరొకటి ఉండుట సజాతీయం. తన కంటే భిన్నంగా వృక్ష, పాషాణాది జాతులు ఉండటం విజాతీయం. శరీరంలో కన్ను, ముక్కు, చెవి మొదలైన అవయవాల భేదం ఉండటం స్వగతం. ఇలా అతనికి రెండవ స్వజాతీయ ఈశ్వరుడు గాని, విజాతీయ ఈశ్వరుడు గాని తనలోనే వేరే తత్వాలు కలిగి ఉండటం గాని లేనందువలన ఈశ్వరునికి **'అద్వైతుడు'** అని పేరు.

నిర్గుణుడు:- **"గుణ్యంతే యే తే గుణా వా యై ర్గుణయంతి తే గుణాః. యో గుణేభ్యో నిర్గతః స నిర్గుణ ఈశ్వరః"** సత్వరజస్తమస్సులు; శబ్ద రూప, రస, స్పర్శ, గంధాది జడగుణాలు; అవిద్య, అల్పజ్ఞత, రాగ, ద్వేష, క్లేశాది గుణాలు లేనివాడు కాబట్టి ఈశ్వరుడు నిర్గుణుడు. ఇందుకు **"అశబ్దమస్పర్శమరూపమవ్యయమ్"**(1. కఠోపనిషత్తు. 3-15) మొదలైన ఉపనిషత్ ప్రమాణాలున్నవి. శబ్దస్పర్శరూపాది గుణరహితుడు కాబట్టి పరమాత్మకు **'నిర్గుణుడు'** అని పేరు.

సగుణుడు:- **"యో గుణైః సహ వర్తతే స సగుణః"** అన్నింటి జ్ఞానం, సర్వసుఖాలు, పవిత్రత, అనంతబలాది గుణాలు కలవాడు అవటంవలన పరమేశ్వరునికి **'సగుణుడు'** అని పేరు. పృథివి గంధాది గుణాలతో కూడినప్పుడు 'సగుణ'మని చెప్పబడినట్లు, పరమేశ్వరుడు జీవ, జగద్గుణాలు లేనివాడు కాబట్టి **'నిర్గుణుడు'** మరియు సర్వజ్ఞత్వాది గుణాలు కలవాడు కాబట్టి 'సగుణుడు' అనబడతాడు.

సగుణత్వం, నిర్గుణత్వం లేని పదార్థమొక్కటీ లేదు. ఉదా: చేతన గుణాలు లేనందుకు జడ పదార్థం 'నిర్గుణం', తన జడగుణాలు కలిగి ఉండటంవలన 'సగుణం'. ఇలానే జడ గుణాలు లేనందున జీవుడు 'నిర్గుణుడు'. తన గుణాలైన ఇచ్ఛాదులు కలిగి ఉండటం వలన 'సగుణుడు'. ఇదేవిధంగా పరమేశ్వరుడు 'సగుణుడు, నిర్గుణుడు' అని తెలుసుకోవాలి.

అంతర్యామి:- **"అంతర్యంతుం నియంతుం శీలం యస్య సోఽ యమంతర్యామీ"** ప్రాణులన్నింటిలో, అప్రాణిరూపమైన లోకంలో సర్వత్ర వ్యాపకుడై అన్నిటినీ నియమంలో ఉంచువాడు కాబట్టి పరమేశ్వరునికి **'అంతర్యామి'** అని పేరు.

యముడు:- **"యో ధర్మే రాజతే స ధర్మరాజః"**ధర్మంలోనే ప్రకాశించువాడు, అధర్మం లేనివాడు, ధర్మాన్నే ప్రకాశింపజేసేవాడు కాబట్టి పరమేశ్వరునికి **'ధర్మరాజ'**ని పేరు.

యమ ధర్మరాజు:- **'యము ఉపరమే'** అను ధాతువు వల్ల **'యమ'** శబ్దం ఏర్పడుతుంది. **"యః సర్వాన్ ప్రాణినో నియచ్ఛతి స యమః"** ప్రాణులన్నిటికీ కర్మఫలమొసగు వ్యవస్థ చేయువాడు, అన్యాయాలన్నింటికి దూరంగా ఉండేవాడు కాబట్టి పరమాత్మకు **'యముడు'** అని పేరు.

భగవానుడు:- **'భజ - సేవాయామ్'** అనే ఈ ధాతువు వల్ల **'భగ'** శబ్దం ఏర్పడుతుంది. దానికి **'మతుప్'** ప్రత్యయాన్ని చేర్చితే **'భగవాన్'** శబ్దమవుతుంది. **"భగః సకలైశ్వర్యం సేవనం వా విద్యతే యస్య స భగవాన్"** సకలైశ్వర్యాలు కలవాడు, భజించడానికి యోగ్యుడు కాబట్టి ఆ ఈశ్వరునికి **'భగవానుడు'** అని పేరు.

మనువు:- **'మన - జ్ఞానే'** అనే ఈ ధాతువు వల్ల **'మను'** శబ్దం ఏర్పడింది. **"యో మన్యతే స మనుః"** విజ్ఞానశీలుడు, మాన్యతకు యోగ్యుడు కాబట్టి ఈశ్వరునికి **'మనువు'** అని పేరు.

పురుషుడు:- **'పౄ - పాలనపూరణయోః'** అనే ధాతువు వల్ల **'పురుష'** శబ్దం ఏర్పడుతుంది. **"యః స్వవ్యాప్త్యాచరాఽ చరం జగత్పృణాతి పూరయతి వా స పురుషః"** సర్వ లోకాలలో పూర్ణుడై ఉండటం వలన ఆ పరమేశ్వరునికి **'పురుషుడు'** అని పేరు.

విశ్వంభరుడు:- **'డుభృఞ్ - ధారణపోషణయోః'** **'విశ్వ'** పూర్వకమైన ఈ ధాతువు వలన **'విశ్వంభర'** శబ్దం ఏర్పడుతుంది. **"యో విశ్వం బిభర్తి ధరతి పుష్ణాతి వా స విశ్వంభరో జగదీశ్వరః"** లోకాన్ని ధరించి పోషించువాడు కాబట్టి పరమేశ్వరునికి **'విశ్వంభరుడు'** అని పేరు.

కాలుడు:- **'కల సంఖ్యానే'** అనే ధాతువు వల్ల **'కాల'** శబ్దం ఏర్పడుతుంది. **"కలయతి సంఖ్యాతి సర్వాన్ పదార్థాన్ స కాలః"** లోకంలోని సర్వపదార్థాల, జీవుల సంఖ్య తెలిసుండి లెక్కిస్తాడు కాబట్టి పరమేశ్వరునకు **'కాలుడు'** అని పేరు.

శేషుడు:- **'శిష్ఌ - విశేషణే'** అనే ధాతువు వల్ల **'శేష'** శబ్దం ఏర్పడుతుంది. **"యః శిష్యతే స శేషః"** ఉత్పత్తి, ప్రళయాల నుండి శేషించి అనగా మిగిలి ఉంటుంది. కాబట్టి పరమాత్మకు **'శేషుడు'** అని పేరు.

ఆప్తుడు:- **'ఆప్ఌ - వ్యాప్తౌ'** అనే ధాతువు వల్ల **'ఆప్త'** శబ్దం ఏర్పడుతుంది. **"యః సర్వాన్ ధర్మాత్మన ఆప్నోతి వా సర్వైర్ధర్మాత్మభిరాప్యతే ఛలాదిరహితః స ఆప్తః"** సత్యోపదేశకుడు, సకల విద్యాయుక్తుడు, ధర్మాత్ములందరికీ లభించువాడు, ధర్మాత్ములచే పొందుటకు యోగ్యుడు మరియు ఛలకపటాదులు లేనివాడు కాబట్టి ఆ పరమాత్మకు **'ఆప్తుడు'** అని పేరు.

శంకరుడు:- **'డుకృఞ్ - కరణే'** **'శం'**పూర్వకమైన ఈ ధాతువువల్ల **'శంకర'** శబ్దం ఏర్పడుతుంది. **"యః శం కల్యాణం సుఖం కరోతి స శంకరః"** కళ్యాణం - అనగా సుఖాన్ని ఇచ్చువాడు కాబట్టి ఈశ్వరునకు **'శంకరుడు'** అని పేరు.

మహాదేవుడు:- **'మహత్'** శబ్దపూర్వకమైన **'దేవ'** శబ్దం వల్ల **'మహాదేవ'** శబ్దం ఏర్పడుతుంది. **"యో మహతాం దేవః స మహాదేవః"** గొప్పవారైన దేవతలకు దేవుడు. అనగా విద్వాంసులకు విద్వాంసుడు, సూర్యాది పదార్థాలకు ప్రకాశకుడు కాబట్టి ఆ పరమాత్మకు **'మహాదేవుడు'** అని పేరు.

ప్రియుడు:- **'ప్రీఞ్ - తర్పణే కాంతౌ చ'** అనే ధాతువు వల్ల **'ప్రియ'** శబ్దం ఏర్పడుతుంది. **"యః పృణాతి ప్రీయతే వా స ప్రియః"** ధర్మాత్ములను, ముముక్షువులను, శిష్టులను, ప్రసన్నులనుగా చేయువాడు, అందరిచే కోరదగినవాడు కాబట్టి పరమేశ్వరునికి **'ప్రియుడు'** అని పేరు.

స్వయంభువు:- **'భూ - సత్తాయామ్'** **'స్వయం'** పూర్వకమైన ఈ ధాతువు వల్ల **'స్వయంభూ'** శబ్దం ఏర్పడుతుంది. **"యః స్వయం భవతి స స్వయంభూరీశ్వరః"** తనంతట తాను ఉన్నవాడు, ఇతరులెవ్వరిచే ఎన్నడూ జన్మింపనివాడు కాబట్టి ఆ పరమాత్మకు **'స్వయంభువుడు'** అని పేరు.

కవి:- **'కు - శబ్దే'** ఈ ధాతువు వల్ల **'కవి'** శబ్దం ఏర్పడుతుంది. **"యః కౌతి శబ్దయతి సర్వా విద్యాః స కవిరీశ్వరః"** వేదం ద్వారా సర్వవిద్యలను ఉపదేశించువాడు, సర్వవేత్త కాబట్టి ఆ పరమేశ్వరునికి **'కవి'** అని పేరు.

శివుడు:- **'శివు - కళ్యాణే'** అనే ధాతువు వల్ల **'శివ'** శబ్దం ఏర్పడుతుంది. **"బహులమేతన్నిదర్శనమ్"** (ధాతుపాఠము 10-336) అనే ఈ సూత్రం వల్ల **'శివు'** ధాతువుగా అంగీకరింపబడుతుంది. కళ్యాణస్వరూపుడు, కళ్యాణకారి అవటంవల్ల పరమేశ్వరునికి **'శివుడు'** అని పేరు.

పరమేశ్వరునికి గల ఈ నూరు నామాలు అర్థసహితంగా వ్రాయబడ్డాయి. ఇవి గాక ఇంకా అసంఖ్యాకమైన నామాలున్నాయి. పరమేశ్వరునికి అనంతగుణ, కర్మ, స్వభావాలుండటం వలన అనంత నామాలు ఉన్నాయి. వానిలో ప్రతియొక్క గుణ, కర్మ, స్వభావాలకు ఒక్కొక్క నామం కలదు. వేదాది శాస్త్రాలలో అతని అసంఖ్యాక గుణ, కర్మ స్వభావాలు వ్యాఖ్యానించబడ్డాయి. కాబట్టి నేను ఇక్కడ వ్రాసిన ఈ నామాలు సముద్రమునందు ఒక నీటి బొట్టువలె ఉన్నవి. వీనిని చదివి చదివించుట వలన వీని అర్థం తెలుస్తుంది. ఇతర పదార్థాల జ్ఞానం కూడ వేదాది శాస్త్రాలను చదివినవారికే సంపూర్ణంగా తెలుస్తుంది.

మంగళాచరణ సమీక్ష

ప్రశ్న: ఇతర గ్రంథకర్తలు తమ గ్రంథాలలో మొదట, నడుమ, చివర భాగంలో మంగళాచరణ చేసినట్లు మీరెందుకు చేయలేదు?

ఉత్తరము: మనం అట్లా చేయకూడదు. మొదట, నడుమ, చివర భాగంలో మంగళాచరణం చేసిన ఆ గ్రంథంలో ఇతర భాగాలలో వ్రాయబడినవన్నీ అమంగళాలే అవుతాయి. **"మంగళాచరణం శిష్టాచారాత్ ఫలదర్శనాచ్ఛ్రుతితశ్చేతి"** అనే ఈ వచనం సాంఖ్యశాస్త్రం (5-1) లోనిది. న్యాయం, పక్షపాతరహితం, సత్యం, ఈశ్వరుని వేదోక్తమైన ఆజ్ఞను ఉన్నదున్నట్లు సదా సర్వత్ర ఆచరించుట మంగళాచరణం అనబడుతుందని పై వచనం యొక్క అభిప్రాయం. గ్రంథారంభం నుండి సమాప్తివరకు సత్యాన్ని ఆచరించటమే మంగళాచరణం. ఒకచోట మంగళం మరొకచోట అమంగళం వ్రాయుట మంగళాచరణం అనబడదు. మహాశయులైన మహర్షుల వాక్యాలను చూడండి: **"యాన్యనవద్యాని కర్మాణి తాని సేవితవ్యాని నో ఇతరాణి"** ఇది తైత్తిరీయోపనిషత్తులోని వాక్యం.

"ఓ సంతానములారా! అనవద్యం = అనిందనీయములు అనగా ధర్మయుక్త కర్మలనే మీరు చేయాలి. అధర్మాలైనవాటిని ఎన్నడూ చేయకూడదు".

నవీన మంగళాచరణ ఖండన

ఆధునిక గ్రంథాలలో **'శ్రీ గణేశాయ నమః', 'సీతారామాభ్యాం నమః', 'శ్రీ గురుచరణారవిందాభ్యాం నమః' 'హనుమతే నమః', 'దుర్గాయై నమః', 'వటుకాయ నమః', 'భైరవాయ నమః', 'శివాయ నమః', 'సరస్వత్యై నమః', 'నారాయణాయ నమః', 'రాధాకృష్ణాభ్యాం నమః'**మొదలైన వాక్యాలు కనిపిస్తాయి. ఇవి వేద, శాస్త్ర విరుద్ధాలవటం వలన బుద్ధిమంతులు వీటిని అజ్ఞానంగా భావిస్తారు. వేదాలు, ఋషుల గ్రంథాలలో ఎక్కడా ఇలాంటి మంగళాచరణం చేసినట్లు కనిపించదు. ఋషుల గ్రంథాలలో **'ఓం', 'అథ'** అను శబ్దాలుండటం కనిపిస్తాయి. చూడుడు:**'అథ శబ్దానుశాసనమ్' అథేత్యయం శబ్దోఽధికారార్థః ప్రయుజ్యతే** (వ్యాకరణ మహాభాష్యం).

'అథాతో ధర్మజిజ్ఞాసా' అథేత్యానంతర్యే వేదాధ్యయనానంతరమ్ (పూర్వ మీమాంస).

"అథాతో ధర్మం వ్యాఖ్యాస్యామః" అథేతి ధర్మకథనానంతరం ధర్మ లక్షణం విశేషేణ వ్యాఖ్యాస్యామః" (వైశేషిక దర్శనం).

"అథ యోగానుశాసనమ్" అథేత్యయమధికారార్థః. (యోగశాస్త్రం).

"అథ త్రివిధదుఃఖాత్యంతనివృత్తిరత్యంత పురుషార్థః" సాంసారిక విషయభోగానంతరం త్రివిధ **దుఃఖాత్యంత నివృత్యర్థః ప్రయత్నః కర్తవ్యః** (సాంఖ్య శాస్త్రం).

"అథాతో బ్రహ్మజిజ్ఞాసా" (వేదాంతసూత్రము).

"ఓమిత్యేతదక్షరముద్గీథముపాసీత" (ఛాందోగ్యోపనిషత్తు).

"ఓమిత్యేతదక్షరమిదం సర్వం తస్యోపవ్యాఖ్యానమ్" (మాండూక్యోపనిషత్తు).

ఇలాగే ఇతర ఋషిమునుల గ్రంథాలలో **'ఓం'** మరియు **'అథ'** అనే శబ్దాలే వ్రాయబడి ఉన్నవి. అలాగే నాలుగు వేదాల అరంభంలోనూ పరికించండి. **'అగ్నిమీళే'తో** ఋగ్వేదం; **'ఇషే త్వోర్జే త్వా'తో** యజుర్వేదం; **'అగ్న ఆయాహి'తో** సామవేదం; **'యే త్రిషప్తాః'తో** అథర్వవేదం ప్రారంభమైంది. వేదాలలో **'శ్రీగణేశాయ నమః'** మొదలైన శబ్దాలు ఎక్కడా లేవు. కొందరు వైదికులు వేదాల పఠన-పాఠనముల అరంభంలో **'హరిః ఓం'** అని వ్రాస్తారు. అలాగే చదువుతారు. పౌరాణికుల నుండి, తాంత్రికుల నుండి వీ రీ మిథ్యాకల్పనలను నేర్చినారు. వేదాది శాస్త్రాలలో **'హరిః'** శబ్దం అరంభంలో ఎక్కడా లేదు. కావున **'ఓం'** లేక **'అథ'** శబ్దాలనే గ్రంథాలలో వ్రాయాలి. ఈశ్వరుని విషయంలో ఈ కొంతమాత్రమే వ్రాసాను. ఇక ముందు శిక్షావిషయం వ్రాయబడుతుంది.

శ్రీమద్దయానంద సరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన
సత్యార్థప్రకాశంలో ఈశ్వరనామవిషయమను
ప్రథమ సముల్లాసం సంపూర్ణం.

ద్వితీయ సముల్లాసము

అథ శిక్షాం వ్యాఖ్యాస్యామః - శిక్షను గూర్చి చెబుతాము

మంచి సంతానము

"మాతృమాన్ పితృమానాచార్యవాన్ పురుషో వేద"

ఇది శతపథబ్రాహ్మణ వచనం.(14-6-10-2)

వాస్తవానికి 'తల్లి, తండ్రి, గురువు అను ఈ ముగ్గురు ఉత్తమ శిక్షకులు లభించినచో మనిషి జ్ఞానవంతుడవుతాడు. ధార్మిక విద్వాంసులైన తల్లిదండ్రులు గల సంతానం గొప్ప భాగ్యవంతమైనది. ఆ వంశం మిక్కిలి ధన్యమైనది. సంతానానికి తల్లివలన లభించేంత ఉపదేశం, ఉపకారం ఇతరులెవ్వరివలనా లభించదు. తల్లి సంతానం మీద ఉంచేంత ప్రేమ, వారికి చేసేంత మేలు ఇతరులెవ్వరూ చేయరు. అందుకే **'మాతృమాన్'** అనగా **"ప్రశస్తా ధార్మికీ మాతా విద్యతే యస్య స మాతృమాన్"** అని అంటారు. ప్రశంసనీయురాలూ, ధార్మికురాలూ, విద్వాంసురాలూ ఐన తల్లి లభించినవాడు **'మాతృమాన్'** అనబడును. గర్భాధానం మొదలుకొని సంపూర్ణవిద్యను పొందునంతవరకు సంతానానికి సత్ప్రవర్తననూ, సుశీలతనూ ఉపదేశించునట్టి తల్లియే ధన్యురాలు.

గర్భాధానానికి పూర్వోత్తర కర్తవ్యాలు

గర్భాధానానికి ముందుగాని, పిమ్మటగాని లేక గర్భాధాన సమయంలో గానీ తల్లిదండ్రులు మాదక ద్రవ్యాలను సేవించరాదు. మద్యాన్ని, దుర్గంధంతో కూడిన బుద్ధినాశక పదార్థాలను విడవాలి (త్యజించాలి). శాంతినీ, ఆరోగ్యాన్నీ, బలాన్నీ, బుద్ధినీ, పరాక్రమాన్నీ, సౌశీల్యాన్నీ, సభ్యతనూ పెంచు పాలు, పెరుగు నేయి, పండ్లు, కూరగాయలు, మధురమైన తినుభండారాలు శ్రేష్ఠమైన పదార్థాలను సేవించాలి. దీనివలన రజోవీర్యాలు దోషరహితాలై అత్యుత్తమ గుణాలు కలవిగా అవుతాయి.

ఉత్తమ సంతానప్రాప్తి విధి

ఋతుగమన విధి: రజోదర్శనమైన తర్వాత ఐదవదినం మొదలుకొని పదహారవ దినం వరకు ఋతుదాన సమయం ఉంటుంది. ఆ మొదటి నాలుగు దినాలను వదివేయాలి. ఇక మిగిలిన పన్నెండు దినాలలో ఏకాదశి, త్రయోదశిని విడిచి మిగిలిన పదిరాత్రులలో గర్భాధానం చేయాలి. ఇది ఉత్తమం రజోదర్శన దినం మొదలుకొని పదహారు రాత్రులు గడచిన తర్వాత సమాగమం చేయకూడదు. మళ్ళీ పైన చెప్పినట్లు ఋతుదాన సమయం రానంతవరకూ మరియు గర్భం ఏర్పడిన తర్వాత కూడా ఒక సంవత్సరం వరకూ సంగమం చేయరాదు. దంపతులు ఇరువురూ శారీరిక ఆరోగ్యం కలవారై, పరస్పరం ప్రసన్నత కలవారై ఎలాంటి దుఃఖాన్నీ పొందకుండా ఉండాలి.

చరక, సుశ్రుత గ్రంథాలలో చెప్పినట్లు భోజనాది నియమాలను పాటించాలి. మనుస్మృతిలో వ్రాయబడినట్లు స్త్రీ పురుషులు ప్రసన్నత కలిగి ప్రవర్తించాలి. గర్భాధానం జరిగిన తర్వాత స్త్రీ మిక్కిలి జాగ్రత్తగా జీవితాన్ని సాగించాలి. తర్వాత ఒక సంవత్సరం వరకు స్త్రీ పురుషునితో సంగమం చేయరాదు. మరల సంతానం కలిగేంతవరకు బుద్ధి, బలం, రూపం, ఆరోగ్యం, పరాక్రమం, శాంతి మొదలైన గుణాలను కల్గించే పదార్థాలను మాత్రమే సేవించాలి.

ప్రసవసమయం తదుపరి కర్తవ్యాలు

శిశువు పుట్టగానే నాడీ 'ఛేదనం' అనగా బొడ్డును కోయించి, మంచి సుగంధంతో కూడిన నీటితో శిశువుకు స్నానం చేయించి, సుగంధంతో కూడిన నేయి మొదలగు పదార్థాలతో హోమం - యజ్ఞం చేయాలి. (శిశువు జన్మించిన సమయంలో 'జాతకర్మ సంస్కారం' వేదోక్తంగా జరిపించాలి. అందుకు చేయవలసిన హవనాది కర్మలు **'సంస్కారవిధి'**లో సవిస్తరంగా వ్రాయబడినవి.)

తల్లికి కూడ స్నానభోజనాదులకు ఏర్పాట్లు యథాయోగ్యంగా తగినట్లుగా చేయాలి. దీనివల్ల తల్లీబిడ్డల శరీరాలు క్రమంగా ఆరోగ్యంగా బలంగా అవుతాయి. తల్లి తన పాలలో మంచి గుణాలు రావటానికి తగిన మంచి పదార్థాలను తినాలి. దీనికై భర్త లేదా ఆమె తల్లిదండ్రులు ఆమె భోజనానికై మంచి పదార్థాలను సేకరించి సమకూర్చి ఇవ్వాలి. బుద్ధినీ, పరాక్రమాన్నీ, ఆరోగ్యాన్నీ కలిగించే ఉత్తమ ఔషధాలను పరిశుద్ధ జలంలో నానబెట్టి, కాచి, వడగట్టి తీసిన రసాన్ని ఆవు పాలలో లేదా మేకపాలలో కలిపి దానికి సమానంగా నీరు చేర్చి శిశువుకు త్రాగించాలి. ప్రసవానంతరం మాతా శిశువులను పరిశుద్ధవాయువు గల ప్రదేశంలో ఉంచాలి. అక్కడ సుగంధ పదార్థాలను, సుందర వస్తువులను ఉంచాలి. శుభ్రమైన గాలి వీచుచోట్ల వారిని తిరుగనివ్వాలి. ఆవు పాలు లేదా మేకపాలు త్రాగించాలి. ఇలా చేస్తే తమ సంతానం దీర్ఘాయువు, బలపరాక్రమాలను పొంది అభివృద్ధిచెందుతాయి. వారి సంతానం కూడా ఉత్తమ బలపరాక్రమాలు గలవారై, దీర్ఘాయువు పొంది, ధార్మికులుగా ఉంటారు. స్త్రీ పురుషులిరువురు బ్రహ్మచర్యాన్ని పాటించాలి. అప్పుడే వారికి మరల ఉత్తమ సంతానం కలుగుతుంది.

ఐదు సంవత్సరాల వరకు తల్లి శిక్షణ

తల్లి తన సంతానానికి సదా ఉత్తమ శిక్షణనివ్వాలి. తమ బాలబాలికలను సభ్యతతో పెంచుతూ ఏ అవయవాలతోనూ కుచేష్టలు చేయకుండునట్లు చూడాలి. శిశువు మాట్లాడటం ప్రారంభించినప్పటినుండి తల్లి శిశువు నాలుక కోమలంగా, స్పష్టంగా ఉచ్చరించునట్లు ప్రయత్నించాలి. ప్రతి అక్షరం యొక్క 'స్థానం'ను 'ప్రయత్నం'ను తెలపాలి. ఉదా: 'ప' అను అక్షరానికి స్థానం 'ఓష్ఠం'. ప్రయత్నం 'స్పృష్టం' కాబట్టి రెండు పెదవులు కలిపి ఉచ్చరించాలి. ఇలాగే ఆ యా వర్ణాల స్థాన ప్రయత్నాలను తెలుసుకొని వాటిని స్పష్టంగా ఉచ్చరించేట్లు హ్రస్వ, దీర్ఘ, ప్లుతాక్షరాలను సరిగ్గా పలికేటట్లు నేర్పించాలి. మధుర, గంభీర, సుందరస్వరంతో ఉండునట్లు, అక్షరాలు, మాత్రలు, పదాలు, వాక్యాలు, సంధి, అవసానాలు మొ॥ అన్నీ వేరు వేరుగా వినబడేటట్లు ఉచ్చరింపజేయాలి.

పిల్లలు కొద్దికొద్దిగా మాట్లాడడం ఆరంభించగానే, పెద్దలు, పిన్నలు, పూజ్యులు, తల్లి, తండ్రి, రాజు, విద్వాంసులు మొదలైనవారి వద్ద మాట్లాడవలసిన పద్ధతిని, ప్రవర్తింపవలసిన విధానాన్ని కూర్చుండవలసిన తీరునూ బోధించాలి. దీనివల్ల వారు ఎక్కడ కూడా అనుచిత కార్యాలను చేయక అయోగ్యంగా వ్యవహరింపక అంతటా గౌరవాన్నే పొందుతారు. తమ సంతానం జితేంద్రియులై, విద్యాప్రియులై సత్సంగమందు అభిరుచి కలిగి ఉండునట్లు నిరంతరం ప్రయత్నించాలి. పనికిరాని ఆటలకు, జల్సాలకు, జూదాలకు దూరంగా ఉంచాలి. దురాశ, ఈర్ష్య, ద్వేషాదులు పిల్లలకు నేర్పరాదు. ఉపస్థేంద్రియాన్ని అనగా జననేంద్రియాన్ని తాకుచు, మర్దించటంవల్ల వీర్యక్షీణత, నపుంసకత్వం కలుగుతుంది. శరీరం బలహీనమౌతుంది. చేయి దుర్గంధమౌతుంది. కాబట్టి అలా తాకనివ్వరాదు. సదా సత్యభాషణం, శౌర్యం, ధైర్యం, ముఖ ప్రసన్నత మొదలైన సుగుణాలు కలిగి ఉండునట్లు తల్లి ప్రయత్నించాలి.

బాలబాలికలకు ఐదు సంవత్సరాల వయసు రాగానే వారికి దేవనాగరీ (హిందీ) అక్షరాలతో పాటు, ప్రాంతీయ (మాతృ) భాషాక్షరాలను, ఇతర దేశాల భాషాక్షరాలను కూడ నేర్పించాలి. తర్వాత మంచి శిక్షణను, విద్యను, ధర్మాలను తెలుపుతూ, పరమేశ్వరుడు, మాత, పిత, ఆచార్యుడు, విద్వాంసులు, అతిథి, రాజు, ప్రజలు, బంధువులు, సోదరీ సోదరులు, సేవకులు మొదలైనవారితో ప్రవర్తించవలసిన విధానాన్ని కూడా తెలుపు మంత్ర, శ్లోక, సూత్ర, గద్య, పద్యాలను అర్థసహితంగా కంఠస్థం చేయించాలి. ఇలా చేసిన వారి సంతానం ఏనాడూ ఏ ధూర్తుని దురుపదేశాలలో చిక్కుకోరు. విద్యకూ, ధర్మానికీ వ్యతిరేకమైన అయోమయంలో పడవేసే వ్యవహారాలను కూడా తెలపాలి. అందువలన వారు భూతప్రేతాది మిథ్యావిషయాలను, మూఢనమ్మకాలను విశ్వసింపక తార్కికులై సత్యాన్వేషణపరులౌతారు.

భూతప్రేత శబ్దార్థాలు

గురోః ప్రేతస్య శిష్యస్తు పితృమేధం సమాచరన్
ప్రేతహారైః సమం తత్ర దశరాత్రేణ శుధ్యతి ॥ మను–5–65 ॥

గురువు మరణించినపుడు అతని మృతక శరీరాన్ని 'ప్రేతం' అంటారు. దాన్ని దహనం చేసే శిష్యుడు ప్రేతహారులతో అనగా మృతకశరీరాన్ని మోసేవారితో పాటు పదవ దినాన శుద్ధుడౌతాడు. మృతక శరీరాన్ని 'ప్రేతం' అంటారనటానికి ప్రమాణంగా ఈ మనుస్మృతి శ్లోకం ఉదాహరణగా ఇవ్వబడింది. శుద్ధి విషయాన్ని తెలుపటానికి కాదు. 'ప్రేత' మనబడు మృతకశరీరం దహింపబడగానే గతించినదనే అర్థంలో **'భూతం'** అని అంటారు. అంటే ఫలానా పేరుగల వ్యక్తి ఉండెనని అర్థం. పుట్టినవారు అందరూ వర్తమానంలో ఉండి మరణించినపుడు భూతకాలానికి చెందినవారవుతారు. కావున వారిని **'భూతాలు'** అంటారు. బ్రహ్మ మొదలుకొని నేటివరకున్న విద్వాంసులందరి సిద్ధాంతమిదే. అనుమానం, సందేహం, దుస్సాంగత్యం, కుసంస్కారాలు కలవారికి భయ శంకారూపాలైన భూత, ప్రేత, శాకినీ, ఢాకినీ మొదలైన భ్రమజాలాలు ఉండటం చేత వారు అనేక దుఃఖాలను పొందుతారు.

ప్రాణి మరణించినపిదప ఆ జీవులు పాప పుణ్యవశంలో పరమేశ్వరుని న్యాయవ్యవస్థచే సుఖదుఃఖాలు అనే ఫలాలను అనుభవించటానికి వేరొక జన్మను ధరిస్తాయి. పరమేశ్వరుని ఈ నాశరహితమైన వ్యవస్థను ఎవరు నాశనం చేయగలరు? 'అజ్ఞానులు వైద్యశాస్త్రాన్ని, పదార్థ విజ్ఞానశాస్త్రాన్ని చదువక, జ్ఞానుల మాటలను వినక, సత్యాసత్యాలను విచారించక సన్నిపాత జ్వరాది శారీరిక రోగాలను, ఉన్మాదాది మానసిక రోగాలను సైతం **'భూతప్రేతాలు'** అంటారు. ఆ రోగులు ఔషధసేవనం, పథ్యాది తగిన వ్యవహారాలను తెలుసుకోలేక ధూర్తులు, మూర్ఖులు, మహామూర్ఖులు, అనాచారులు, స్వార్థపరులు అయిన మ్లేచ్ఛాది హీనజాతులపై విశ్వాసం కలవారై అనేక మోసాలకు, ఛలకపటాదులకు గురౌతున్నారు. వారిచ్చే ఉచ్ఛిష్ట (ఎంగిలి) భోజనాన్ని ప్రసాదంగా తింటూ, దారాలు, తాయెత్తులు మొదలైన మిథ్యామంత్ర తంత్ర యంత్రాలను కట్టించుకొంటూ తిరుగుతుంటారు. తమ ధనాన్ని నాశనం చేసుకొంటూ, సంతానానికి కూడా ఇట్టి దుర్దశను, రోగాభివృద్ధిని కలిగిస్తూ వారిని దుఃఖాలపాలు చేస్తూ తిరుగుతుంటారు.

అజ్ఞానులైన ధనవంతులు 'డబ్బును మూటకట్టుటలో మంచి నేర్పరులై, అందు మెలకువలు కలిగి కన్నులుండీ చూడజాలని మూర్ఖులై' తమవారిలో ఎవరికైనా ఏదైనా వ్యాధి సంక్రమించినపుడు ఈ దుర్బుద్ధిగల పాపాత్ములైన స్వార్థపరుల వద్దకు వెళ్ళి "ఓ మహారాజా! బాబా! గురూ! ఈ రోగికి ఏమో అయినది. మాకు తెలియటంలేదు. దయజేసి చెప్పండి" అని తమ కుమార్తెనో, కుమారున్నో, స్త్రీనో లేక పురుషున్నో చూపి అడుగుతారు. అప్పుడు వారు "ఈ రోగి శరీరంపై భూతమో, ప్రేతమో, భైరవుడో, శీతలాదేవియో మరెవరో ఆవహించినారు. మీరు తగిన ఉపాయం ఆలోచించకుంటే అది విడువదు. ప్రాణం కూడా తీస్తుంది. దీనికి కొంత నైవేద్యం, కానుకలు సమర్పించాలి. మేము మంత్ర జపాలు మొదలైన పురశ్చరణాలు చేసి దీనిని పారద్రోలగల" మని అంటారు. అపుడు ఆ బుద్ధిహీనులైన తల్లిదండ్రులు, వారి బంధువులు "అయ్యా! మా సర్వస్వాన్ని అర్పిస్తాము, ఈ రోగిని బాగుచేయండి" అని అంటారు. అప్పుడాధూర్తుల కోరిక నెరవేరుతుంది. వారు ఆ మూర్ఖులతో ఇలా అంటారు. "మంచిది. ఇంత సామగ్రి, ఇంత దక్షిణ తెచ్చి దేవతకు సమర్పించండి. గ్రహదానం చేయాలి" అని అంటారు. ఇలా చెప్పి ఆ రోగి ఎదుట డోలు, మద్దెలు, తప్పెటలు, తాళాలు మొదలైనవి వాయిస్తూ

వారిముందు పాడుతారు. అందులో ఒక పాషండుడు (మూర్ఖుడు) లేచి పిచ్చివాని వలె గంతులు వేస్తూ "నే నీతని ప్రాణాలే తీసికొంటాను" అని పలుకుతాడు. అపుడు ఆ మూర్ఖులైన తల్లిదండ్రులు మొదలైనవారు నీచులైన ఆ ధూర్తుల పాదాలపై పడి "మీకు కావలసినది అంతా తీసుకొని ఇతన్ని విడిచిపెట్టండి" అని ప్రార్థిస్తారు. అప్పుడు ఆ ధూర్తుడు "నేను హనుమంతుడను, నాకు మంచి మిఠాయి, నూనె, సింధూరం, పంద రొట్టెలు, ఎఱ్ఱని లంగోటి తీసుకురండి" అని కాని; "నేను దేవిని, నేను భైరవుడ్ని, నాలుగు సీసాల సారాయి, ఇరవై కోళ్ళు, ఐదు మేకలు, మిఠాయి, వస్త్రాలు నాకు ఇవ్వండి" అని కానీ పలుకుతాడు. అప్పుడు వారు "కావలసినవి అన్నీ తీసుకోండి" అని అంటారు. అప్పుడు ఆ ఉన్మత్తుడైన ధూర్తుడు మళ్ళీ నాట్యం చేస్తూ గంతులు వేస్తుంటాడు. అప్పుడు ఎవరైనా బుద్ధిమంతుడు ఆ ధూర్తునికి ఐదు చెప్పుదెబ్బలు, తన్నులు, చెంప దెబ్బలు తగిలించినచో వానిపై ఉన్న హనుమంతుడు, దేవి, భైరవుడు మొదలైనవి తక్షణమే ప్రసన్నమై పారిపోతాయి. "ఇవన్నీ ఆ ధూర్తులు ధనాదులను అపహరించుటకు చేసే మోసాలు మాత్రమే" అని తెలుసుకోవాలి.

గ్రహశాంతి

కొందరు మూర్ఖులు ఒకానొక గ్రహరూపుడైన జ్యోతిర్విదాసుని (జ్యోతిష్య శాస్త్రాన్ని తెలుసుకున్నవాని వలె కనిపించే మూర్ఖుని) వద్దకు తీసుకువెళ్ళి, "అయ్యా! ఇతనికి ఏమైందో చెప్పండి" అంటారు. అప్పుడు ఆ జ్యోతిర్విదాభాసుడు "సూర్యాది క్రూరగ్రహాలు ఇతన్ని పట్టి పీడిస్తున్నాయి. మీరు శాంతి, పూజాపాఠాలు, దానాలు చేస్తే ఇతనికి శాంతి సుఖాలు కలుగుతాయి. లేకపోతే ఇతనికి పీడ అధికమై మరణించనూవచ్చు" అనును. అప్పుడా జ్యోతిర్విదాభాసునితో తర్కంతో ఇట్లా అడగాలి:

అయ్యా! ఈ భూమి వలెనే సూర్యాదిగోళాలు జడాలు కదా! అవి వెలుతురును వేడిని తప్ప మరేమీ ఇవ్వవు కదా! కోపించి దుఃఖాన్ని, శాంతించి సుఖాన్ని ఇవ్వడానికి అవి చేతనాలా?

జ్యోతిర్విదాభాసుని ప్రశ్న: ఈ లోకంలో రాజు, ప్రజలు మొదలైనవారు సుఖ దుఃఖాలను పొందుతున్నారు. అవి గ్రహాల ఫలితాలు కావా?

తార్కికుని జవాబు: కావు. అవన్నీ వారి వారి పాప పుణ్యాల ఫలితాలే.

జ్యోతిర్విదాభాసుని ప్రశ్న: అయితే జ్యోతిశ్శాస్త్రం అసత్యమా?

తార్కికుని జవాబు: కాదు. అందులోని – అంక, బీజ, రేఖాగణిత విద్యలు సత్యాలు. ఇక ఫలిత విషయాలకు సంబంధించిన లీలలన్నీ అసత్యాలే.

జన్మపత్రం, జాతకం, సూర్యాది గ్రహాల సమీక్ష

జ్యోతిర్విదాభాసుని ప్రశ్న: జన్మ పత్రిక కూడా నిష్ఫలమేనా?

తార్కికుని జవాబు: అవును. దానిని **'జన్మపత్రిక'** అనుట కంటే **'శోకపత్రం'** అనుట మంచిది. ఎందుకనగా సంతానం కలిగినపుడు అందరికీ సంతోషం కలుగుతుంది. కాని ఆ ఆనందం జన్మపత్రిక

వ్రాయబడనంతవరకే, గ్రహాల ఫలితాలు విననంతవరకే ఉంటాయి. సంతానం కలిగినప్పుడు ఆ తల్లిదండ్రులతో పురోహితుడు "జన్మపత్రికను వ్రాయించు" దని చెప్తాడు. అప్పుడు ఆ తల్లిదండ్రులు అతనితో "అయ్యా! మీరే చక్కని జన్మపత్రికను వ్రాయండి" అని కోరుతారు. తల్లిదండ్రులు ధనవంతులైతే రంగురంగుల రేఖలతో; వారు దరిద్రులైతే సాధారణంగా జన్మపత్రికను సిద్ధం చేసి అతడు వినిపించుటనికి వస్తాడు. అప్పుడు ఆ శిశువు తల్లిదండ్రులు పురోహితుడైన జ్యోతిష్కుని ముందు కూర్చొని "ఇతని జన్మపత్రం బాగున్నది కదా?" అని ప్రశ్నిస్తారు. అప్పుడు ఆ జ్యోతిష్కుడు "అందులో ఏమున్నదో దానినే వినిపిస్తాను, వినండి. ఇతని జన్మగ్రహాలు చాలా బాగా ఉన్నాయి. మిత్ర గ్రహాలు కూడా చాలా అనుకూలంగా ఉన్నాయి. వాటి ఫలితంగా ఇతడు ధనాఢ్యుడై ప్రతిష్ఠగలవాడౌతాడు. ఏ సభలోకి ఇతడు పోయినను అందరిపై ఇతని ప్రభావం పడుతుంది. ఆరోగ్యం జ్ఞానం కలవాడై రాజసన్మానాన్ని పొందుతాడు" అని చెబుతాడు. ఆ మాటలను విన్న తల్లిదండ్రులు మొదలైనవారు జ్యోతిష్కుడిని "వహ్వా! వహ్వా! అయ్యగారూ! మీరు చాలా మంచివారు" అని మెచ్చుకొంటారు.

అప్పుడు ఆ జ్యోతిష్కుడు ఈ ప్రశంసల మాటలతో తనకు ఏమీ లాభం కలుగదని గ్రహించి "ఈ గ్రహాలు అన్నీ బాగానే ఉన్నాయి. కాని, కొన్ని గ్రహాలు క్రూరంగా ఉన్నాయి. ఆ క్రూర గ్రహాల ఫలితంగా ఇతనికి ఎనిమిదవయేట మృత్యుయోగమున్నది" అని చెప్తాడు. ఆ మాట వినగానే తల్లిదండ్రులు పుత్రుని పుట్టుకతో కలిగిన ఆనందాన్ని వీడి శోకసముద్రంలో మునిగిపోతారు. మరల ఆ జ్యోతిష్కునితో "అయ్యా! ఇప్పుడు మేమేమి చేయాలి?" అని అడుగుతారు. అప్పుడు అతడు 'ఏదైన ఉపాయమాలోచించా'లని పలుకుతాడు. "ఏ ఉపాయమున్నది" అని తల్లిదండ్రులు అంటారు. ఆ సమయంలో జ్యోతిష్కుడు "ఈ విధంగా దానం చేయండి. ఈ గ్రహాల మంత్రాలను జపం చేయించండి. నిత్యం బ్రాహ్మణులకు భోజనం పెట్టించండి. అలా చేయటంవల్ల నవగ్రహాల వలన కలుగు విఘ్నాలు తొలగిపోయే అవకాశమున్నది" అని పలుకుతాడు. "అవకాశం ఉన్నది" అను వాక్యం సందేహంగా చెప్పటంలో ఒక అభిప్రాయం లేకపోలేదు. బాలుడు మరణిస్తే 'మేమేమి చేయగలం? పరమేశ్వరునికి మించినవారెవరు?' అని అనగలరు. 'మే మెంతో ప్రయత్నించితిమి. మీరును కూడా చేయించితిరి. ఆతని కర్మ అటుల నున్నది. మనమేమి చేయగలం?' అని అంటారు. ఒకవేళ బాలుడు చావక బ్రతికినచో "చూడుడు! మా మంత్రప్రభావంతో దేవతల, బ్రాహ్మణుల శక్తివలన, మీ బాలుని బ్రతికించినా"మని చెబుతారు.

ఈ విషయంలో అపుడు ఇటుల చేయాలి. ఆ ధూర్తుల మంత్ర జపాదులచే ఏమియు ప్రయోజనం జరుగకున్నచో, వ్యయమైన డబ్బుకు రెండింతలు, మూడింతలు వారినుండి లాగుకొనాలి. ఒకవేళ బాలుడు బ్రతికినచో "బాలుడు తన కర్మవలన, పరమేశ్వరుని నియమంవలన బ్రతికినాడు. మీరు చేయుటవలన కాదు. ఎట్లన బాలుని కర్మను, పరమేశ్వరుని నియమాన్ని తొలగించు సామర్థ్యం ఎవరికీ లేదు" అని చెప్పి డబ్బును వారినుండి తిరిగి తీసికోవాలి.

ఇక కొందరు గురువులనబడేవారు కూడ గృహస్థుల నుండి పుణ్యదానాలు చేయించి వారే ఆ ధనాన్ని తీసికొంటారు. ఇట్టివారికి కూడ జ్యోతిష్కులకిచ్చిన సమాధానాన్నే ఇవ్వాలి.

శీతలా మంత్ర తంత్రాదులు

ఇక మిగిలినవి శీతల (అమ్మవారు), మంత్రాలు, తంత్రాలు, యంత్రాలు. ఇవన్నీ తంతులే - ఢోంగులే - బూటకాలే.

ఒకడిట్లంటాడు - "నేను మంత్రాన్ని జపించి తాయెత్తును గాని, యంత్రాన్ని గాని కట్టితినినా మంత్ర ప్రభావంతో మన దేవతలు గాని, పీరులు - పెద్దలు గాని ఆ మంత్ర యంత్రాల ప్రతాప ప్రభావం వల్ల అతనికి ఎలాంటి విఘ్నాలనూ కలిగింపరు" అని. వీరికి గూడ పై విధంగా ప్రత్యుత్తర మివ్వాలి.

"పరమేశ్వరుని నియమం నుండి, కర్మఫలం నుండి, మృత్యువు నుండి మీరిట్లు తప్పించగలరా? మీరిట్లు చేసినట్లైతే ఎందరో బాలబాలికలు మరణిస్తున్నారు గదా! మీ ఇంటిలో కూడ చనిపోవుచున్నారు గదా? మీరిట్లు చావకుండా బ్రతుకగలరా?" అని వారిని అడగాలి. అప్పుడు వారు ఏమియు అనజాలరు. ఇచ్చట తమదేమియు సాగదనియూ, తమ పప్పులు ఉడకవనియూ ఆ ధూర్తులు ఎరుగ గలరు. ఈ విధంగా ఈ మిథ్యావ్యవహారాల నన్నింటినీ విడిచిపెట్టాలి. ధార్మికులూ, లోకోపకార కర్మలు చేయువారూ, నిష్కపటంగా అందరికి విద్యను బోధించువారూ ఐన ఉత్తమవిద్వాంసులకు ప్రత్యుపకారసహాయం చేయాలి. మీరు లోకోపకారానికి చేయు పనులనూ ఎన్నడునూ విడువరాదు. రసాయన, మారణ, మోహన, ఉచ్చాటన, వశీకరణాది సమస్త లీలలను చెప్పి చేయువారిని, చేయించువారిని మహా పాపులుగా భావించాలి. ఇట్టి మిథ్యావిషయాలను గూర్చి బాల్యావస్థ యందే తమ సంతానానికి ఉపదేశించాలి. ఇట్లు చేసినచో తమ సంతానం భ్రమజాలములో పడి దుఃఖాల పాలు కారు.

వీర్య రక్షణ లాభము

"వీర్యాన్ని రక్షించుకొనుట వలన మిక్కిలి ఆనందము కలుగుననియు, దానిని నాశము చేసికొనుటవలన దుఃఖము అనుభవింపవలసి వచ్చు"ననియు పిల్లలకు తమ తల్లిదండ్రులు తెలుపాలి. "శరీరంలో వీర్యాన్ని సురక్షితంగా ఉంచుకొంటే ఆరోగ్యం, బుద్ధి, బలం, పరాక్రమం వృద్ధిజెంది సుఖాన్ని ఎక్కువగా పొందగలం. వీర్యరక్షణ చేసుకొన తలచినవారు విషయవాంఛలను కలిగించు కథలను వినకూడదు. కాముక జనులతో స్నేహం చేయరాదు. విషయవాసనలను ధ్యానింప కూడదు. స్త్రీ దర్శనం, వారిని ఏకాంతంలో కలుసుకొనుట, మాట్లాడుట, తాకుట మొదలైన కార్యాలు బ్రహ్మచారులు చేయరాదు. సదా ఉత్తమ శిక్షణను పొందుతూ పూర్ణవిద్యను నేర్వవలెను. శరీరంలోని వీర్యాన్ని నాశనం చేసుకొనువాడు నపుంసకుడై మహా చెడులక్షణాలు కలవాడౌతాడు. అతనికి ప్రమేహాదిరోగాలు కలుగుటచే దుర్బలుడు, నిస్తేజుడు, బుద్ధిహీనుడు, ఉత్సాహ, సాహస, ధైర్య, బల, పరాక్రమాది గుణాలు లేనివాడై నశిస్తాడు. మీరు ఈ ప్రథమ వయస్సులో సుశిక్షణను, విద్యను గ్రహించక, వీర్యాన్ని రక్షించుకొనక ఇట్టి తప్పిదాలను చేస్తే ఈ జన్మలో మరెన్నడూ ఇలాంటి అమూల్య

సమయం మీకు లభించదు. మేము గృహకార్యాలను చేస్తూ బ్రతికి ఉన్నపుడే మీరు విద్యను నేర్చి శారీరిక బలాన్ని పెంపొందించుకోవాలి" అని తల్లిదండ్రులు తమ సంతానానికి ఉపదేశించాలి. ఇలాంటివే ఇతర మంచి ఉపదేశాలను కూడ చేయాలి. అందుకొరకే 'మాతృమాన్, పితృమాన్' అను శబ్దాలు మొట్టమొదటనే చెప్పబడినవి. పుట్టినది మొదలు ఐదు సంవత్సరాల వరకు తల్లి, ఆరు నుండి ఎనిమిదవ యేటవరకు తండ్రి పిల్లలకు శిక్షణను ఇవ్వాలి. తొమ్మిదవ సంవత్సరం ఆరంభం కాగానే ద్విజులు తమ గృహంలో గల ఆడ – మగ పిల్లలకు ఉపనయనాన్ని చేసి పూర్ణవిద్వాంసులు, శిక్షకులు గాగల గురుకులానికి బాలురను, పూర్ణ విదుషీమణులు శిక్షకురాండ్రుగా గల గురుకులానికి బాలికలను పంపాలి. శూద్రాది వర్ణాలవారు బాలబాలికలకు ఉపనయనాన్ని చేయకుండానే విద్యాభ్యాసానికై గురుకులానికి పంపాలి. అక్కడ గురువులు వారికి కొంత సామాన్య శిక్షణనిచ్చి ఉపనయనం చేసి వేదాధ్యయనం చేయిస్తారు.

సంతాన పాలనం

సంతానాన్ని చదివించడంలో, విద్యను నేర్పించడంలో లాలన (లాడుగారాబము) చేయరాదు. శిక్షించువారి సంతానమే విద్య, సభ్యతలు కలిగి సుశిక్షణ కలదగును. ఈ విషయాన్ని వ్యాకరణ మహాభాష్యంలో –

సామృతైః పాణిభిర్ఘ్నంతి గురవో న విషోక్షితైః ।
లాలనాశ్రయిణో దోషా స్తాడనాశ్రయిణో గుణాః ॥

అర్థం: తమ సంతానాన్ని, శిష్యులను దండించు తల్లిదండ్రులు, ఆచార్యుడు "వారికి తమ చేతులతో అమృతపానాన్నే చేయిస్తున్నట్లు తలంచాలి. ఇక లాలించి బుజ్జగించువారు తమ సంతానానికి, శిష్యులకు విషాన్ని త్రాగించి నష్టపరచుచున్నారని గ్రహించాలి. లాలన వలన సంతానం, శిష్యులు దోషయుక్తులై దుర్జనులౌతారనీ, దండనవలన గుణవంతులై సజ్జనులౌతారనీ తెలియాలి. సంతానం, శిష్యులు కూడ దండనకు ప్రసన్నులుగా, లాలనకు అప్రసన్నులుగా ఉండాలి. తల్లిదండ్రులు, అధ్యాపకుడు పైకి భయపెట్టువారుగా కనిపిస్తూ, లోపల కృపాదృష్టి కలిగి ఉండాలి. ఈర్ష్యాద్వేషాలతో ఎన్నడూ బాలురను దండించరాదు".

చౌర్యత్యాగం – సత్యాచరణ గ్రహణం: ఇతర ధార్మిక శిక్షణతోపాటు "దొంగతనం, జారత్వం, సోమరితనం, ప్రమాదం, మాదకద్రవ్యాలను సేవించటం, అసత్యభాషణం, హింస, క్రూరత్వం, ఈర్ష్య ద్వేషం, మోహం మొదలైన దోషాలను వీడి సత్యాచారాన్ని గ్రహించాలి" అని బోధించాలి. ఎవరెదుటనైనా ఒకసారి దొంగతనంగాని, జారత్వంగాని, అసత్యభాషణాది కర్మలుగాని చేస్తే వారు తమ జీవితంలో అతన్ని ఎప్పుడూ నమ్మరు. అటులనే ఒక ప్రతిజ్ఞ చేసి, దానిని నెరవేర్చని వారికి కల్గునంత హాని మరెవ్వరికీ కలుగదు. ఎవరితో ఏ వాగ్దానం చేసినా దానిని పూర్తిచేయాలి. ఎవరితోనైన "నీకు ఈ వస్తువును ఫలానా సమయంలో ఇస్తాను", ఎవరితోనైన "నిన్ను ఫలానా సమయంలో కలుస్తాను"

అని వాగ్దానం చేస్తే వారితో ఆ సమయంలో తప్పక కలవాలి. అలా చేయనిచో అతన్ని ఎవ్వరూ నమ్మరు. కాబట్టి అందరూ సదా సత్యాన్ని పలుకుతూ సత్య ప్రతిజ్ఞాయుక్తులు కావాలి.

అభిమానాదుల వలన హాని: అభిమానం ఎవరికీ తగదు. ఎలాగంటే **"అభిమానః శ్రియం హంతి"** ఇది విదురనీతిలోని వచనం. అభిమానం అనగా అహంకారం. ఇది కలవారు తమ సర్వశోభలనూ, ఐశ్వర్యాన్నీ పోగొట్టుకొంటారు. కాబట్టి అభిమానం తగదు. ఛలం, కపటం, కృతఘ్నతల వలన తమ హృదయమే దుఃఖం చెందుతుంది. ఇక పరుల విషయంలో చెప్పవలసినదేముంటుంది? లోపల ఒకటి ఉంచుకొని బయటికి మరొకటి కనబరస్తూ ఇతరులను భ్రమింపచేసి, మోసపుచ్చి పరులకు కలుగు నష్టాన్ని లెక్కించక, తన ప్రయోజనాన్నే నెరవేర్చుకొనుట "ఛలం, కపటం" అనబడుతుంది. ఇతరులు తనకు చేసిన మేలును మరవటం 'కృతఘ్నత' అనబడుతుంది.

సామాన్య వ్యవహార శిక్ష: క్రోధం మొదలైన దుర్గణాలను, కటు వచనాలను మాని శాంతములైన మధుర వచనాలనే చెప్పాలి. బకవాదం చేయరాదు. అధిక ప్రసంగం మానాలి. చెప్పవలసిన దానికన్న ఎక్కువగాని, తక్కువ గాని చెప్పకూడదు. పెద్దలను గౌరవించాలి. వారు వచ్చినపుడు లేచి మొదట **'నమస్తే'** అని వందనం చేయాలి. వారిని ఉన్నత ఆసనంలో కూర్చుండబెట్టాలి. వారి ఎదుట ఉన్నత ఆసనంలో కూర్చోరాదు. సభలోనికి వెళ్ళినపుడు తనకు అర్హమైన చోట అనగా! ఎవరూ తనను లేపని స్థానంలో కూర్చోవాలి. ఎవరితోనూ విరోధం పెట్టుకోరాదు. సంపదలు గలవాడై, మంచి గుణాలను గ్రహించి, దోషాలను విడిచిపెట్టాలి. సజ్జనుల స్నేహం చేస్తూ దుష్టులకు దూరంగా ఉండాలి. మాతా పితలకు, ఆచార్యునకు, శరీరంతో, మనస్సుతో, ధనాది ఉత్తమ పదార్థాలతో ప్రీతిపూర్వకంగా సేవ చేయాలి

"యాన్యస్మాకం సుచరితాని తాని త్వయోపాస్యాని, నో ఇతరాణి" ॥ తై. ఉ. శిక్షావల్లి 11 ॥

దీని అభిప్రాయమిది - తల్లిదండ్రులు, ఆచార్యుడు తమ సంతానానికి, శిష్యులకు సదా సత్యోపదేశాలను చేయుటయే గాక వారితో "మా ధర్మయుక్తమైన మంచి ఆచరణాలనే మీరు గ్రహించాలి. మా దుష్టకార్యాలను విడిచిపెట్టండి" అని చెప్పాలి. "సత్యాన్ని తెలుసుకొని వాటిని ప్రకటిస్తూ ప్రచారం చేయండి. పాషండులు, దుష్టాచారులు అయిన వారిని విశ్వసించరాదు. తల్లిదండ్రులు, ఆచార్యుడు చేయమని ఆజ్ఞాపించిన ఉత్తమ కార్యాలనే ఇష్టానుసారంగా చేయండి" అని బోధించాలి. తల్లిదండ్రులు ధర్మం, విద్య, సదాచారాన్ని గూర్చిన విషయాలకు సంబంధించిన శ్లోకాలు, నిఘంటువు, నిరుక్తం, అష్టాధ్యాయి మరియు ఇతర సూత్రాలు, వేదమంత్రాలు కంఠస్థం చేయించి మరల వాటి అర్థాలు విద్యార్థులకు తెలియజేయాలి. ప్రథమ సముల్లాసంలో పరమేశ్వరుని గురించి వ్యాఖ్యానించిన విధంగా నమ్మి అతనినే ఉపాసించాలి.

ఆరోగ్యం, విద్య, బలం లభించునట్లు భోజనాచ్ఛాదనాది (భోజనం మరియు వస్త్ర ధారణాదులు) వ్యవహారాలను తల్లిదండ్రులు చేస్తూ తమ పిల్లలచే చేయించాలి. అనగా! ఆకలి కన్న కొంచెం తక్కువగా భుజించాలి. మద్యమాంసాన్ని సేవించరాదు. తెలియని లోతైన నీళ్లలోనికి దిగరాదు. ఎందుకంటే

జలజంతువుల వలన గాని ఇతర పదార్థాల వలన గాని దుఃఖం కలుగవచ్చు. ఈత రానిచో నీటిలో మునిగిపోవచ్చు. కాబట్టే **"నావిజ్ఞాతే జలాశయే"** (మను. 4-19) అని మనువు చెప్పాడు. తెలియని జలాశయం అనగా బావులు, తటాకాలు, చెరువులు నదులు మొదలైనవాటిలో దిగి స్నానం చేయరాదు.

"దృష్టిపూతం న్యసేత్పాదం వస్త్రపూతం జలం పిబేత్ ।
సత్యపూతాం వదే ద్వాచం మనః పూతం సమాచరేత్ ॥ మను. 6 - 46 ॥

"క్రింది వైపు దృష్టి పెట్టి ఎత్తుపల్లాలను చూస్తూ నడవాలి. వస్త్రంతో వడియగట్టిన నీటిని త్రాగాలి. సత్యంతో పవిత్రమైన వచనాలనే చెప్పాలి. పవిత్ర మనస్సుతో విచారించి, ఆలోచించి ఆచరించాలి" అని. ఇలా అనేక విధాలుగా సంతానానికి తల్లిదండ్రులు ఉపదేశించాలి.

విద్య నేర్పించని తల్లిదండ్రులు శత్రువులు

మాతా శత్రుః పితా వైరీ యేన బాలో న పాఠితః ।
న శోభతే సభామధ్యే హంసమధ్యే బకో యథా ॥ చాణక్యనీతి అ. 2. శ్లో. 11 ॥

విద్య నేర్పించని తల్లిదండ్రులు సంతానానికి శత్రువులు. ఎందుకంటే, హంసల నడుమ కొంగవలె, విద్య నేర్పబడని బాలుడు విద్వాంసుల సభలో తిరస్కరింపబడుతాడు, అవమానం పొందుతాడు. కాబట్టి తమ సంతానానికి తనుమనోధనములను వినియోగించి విద్యను, ధర్మాన్ని, సభ్యతను, ఉత్తమ శిక్షణను నేర్పించాలి. ఇలా చేయటం తల్లిదండ్రులకు పరమ కర్తవ్యం, పరమ ధర్మం, కీర్తిదాయకం.

బాలుర శిక్షణను గురించి ఇక్కడ కొద్దిగానే వ్రాయబడింది. బుద్ధిమంతులు దీని నుండే ఎక్కువగా తెలుసుకోవాలి. ఇకముందు అధ్యయన-అధ్యాపన విధి వ్రాయబడుతుంది.

శ్రీమద్దయానంద సరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన
సత్యార్థప్రకాశంలో బాలశిక్షా విషయం గల
ద్వితీయ సముల్లాసం సంపూర్ణం.

తృతీయ సముల్లాసము

అథాధ్యయనాధ్యాపనవిధిం వ్యాఖ్యాస్యామః

అధ్యయన, అధ్యాపన విధిని వివరిస్తాము

ఇక తల్లిదండ్రులు, ఆచార్యుడు - వారి ముఖ్య కర్తవ్యాలు

ఈ తృతీయ సముల్లాసంలో పఠనపాఠన విధిని వ్రాస్తున్నాము. 'ఉత్తమ విద్య, ఉత్తమ శిక్షణ, ఉత్తమ గుణకర్మ స్వభావాలు' అను ఆభరణాలతో తమ సంతానాన్ని అలంకరించటం తల్లిదండ్రులకు, ఆచార్యులకు, బంధువులకు ముఖ్యకర్తవ్యము. సువర్ణం, రజతం, మాణిక్యం, ముత్యం, పగడాలు మొదలైన రత్నాలతో నిర్మింపబడిన ఆభూషణాలను అలంకరించుకొంటే మానవుని ఆత్మ ఎప్పటికీ సుభూషితం కాదు. ఆభరణాలు ధరిస్తే దేహాభిమానం, అహంకారం, విషయాసక్తి, చోరభయం కలుగటయే కాక మృత్యువు కూడ సంభవిస్తుంది. ఈ ఆభరణాలను ధరించటం వలన దుష్టులతో పసిబిడ్డల ప్రాణాలు కూడా తీయబడటం ఈ లోకంలో మనం చూస్తూనే ఉన్నాం.

"విద్యావిలాస మనసో ధృతశీలశిక్షాః, సత్యవ్రతా రహిత మానమలాపహారాః ।
సంసారదుఃఖదళనేన సుభూషితా యే, ధన్యా నరా విహితకర్మ పరోపకారాః ॥

అర్థం: విద్యావిలాసంలో లగ్నహృదయులై, సచ్ఛీలస్వభావులై, సత్యభాషణాది నియమపాలకులై, నిగర్వులై, పవిత్రులై, పరుల దుర్గుణ మాలిన్యాలను పోగొట్టేవారై, సదా సత్యోపదేశాలనిస్తూ, విద్యాదానంతో ప్రపంచ మానవుల దుఃఖాలను దూరపరస్తూ సుభూషితులై, వేదవిహిత కర్మలతో పరోపకారం చేసే స్త్రీ పురుషులు ధన్యులు.

గురుకులం

పిల్లలకు ఎనిమిదేళ్ల వయసురాగానే బాలురను బాలుర గురుకులానికి, బాలికలను బాలికల గురుకులానికి పంపించాలి. దురాచారులైన గురువులవద్ద విద్యను నేర్పించరాదు. పూర్ణవిద్యావంతులైన ధార్మికులే చదివించుటకు, శిక్షణ నిచ్చుటకూ అర్హులు. ద్విజులు తమ

గృహంలోనే బాలకులకు బాలికలకు యథోచితరీతిలో యజ్ఞోపవీత సంస్కారం చేసి, ఆ యా గురుకులాలకు అనగా వారి వారి పాఠశాలలకు పంపించాలి. గురుకులాలు – పాఠశాలలు ఏకాంత ప్రదేశంలో ఉండాలి. బాలుర, బాలికల పాఠశాలలకు మధ్య రెండు క్రోసుల (4 కి.మీ.) దూరం ఉండాలి. బాలుర పాఠశాలలలో అధ్యాపకులు, సేవకులు మొదలైనవారందరు పురుషులే ఉండాలి. కన్యా పాఠశాలలలోనూ ఇలాగే అందరూ స్త్రీలే ఉండాలి. బాలికా పాఠశాలలకు ఐదేళ్ళ ప్రాయంగల బాలునిగాని, బాలుర పాఠశాలలకు ఐదు సంవత్సరాల బాలికను గాని పోనివ్వకూడదు. బ్రహ్మచర్య కాలంలో "పరస్పర దర్శనం, స్పర్శనం, ఏకాంతసేవనం, సంభాషణం, విషయ కథ, పరస్పర క్రీడ, విషయధ్యానం, సంగమం" అనే ఈ అష్టవిధమైథునాలకు బాలబాలికలను దూరంగా ఉంచాలి. ఉత్తమ విద్యావంతులై, సచ్ఛీలవంతులై, సుస్వభావులై, దృఢగాత్రులై, ఆత్మబలాన్ని ఆనందాన్ని బాలబాలికలు నిత్యం పొందేటట్లు, ఈ అష్టవిధ మైథునాలకు దూరంగా ఉండేటట్లు, గురువులు చూస్తూ ఉండాలి. పాఠశాలలు గ్రామానికి గాని, నగరానికి గాని ఒక ఆమడదూరంలో అనగా 12 కి.మీ. దూరంలో ఉండాలి. రాజుల బిడ్డలైనా, దరిద్రుల బిడ్డలైనా అందరికీ సమానంగానే వస్త్రాలను, ఆహార పానీయాలను, ఆసనాలను ఇవ్వాలి. వీరందరు తాపసికులుగా ఉండాలి. విద్యాభ్యాసం పూర్తి అయ్యేవరకు విద్యార్థుల తల్లిదండ్రులు తమ సంతానంతోగాని, సంతానం తమ తల్లిదండ్రులతో గాని కలువకూడదు. పరస్పరం ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా జరుపరాదు. ఎందుకంటే వారు కుటుంబ విషయాలను పట్టించుకోకుండా, కేవలం విద్యను మాత్రమే అభ్యసించటంలో మనస్సు పెట్టాలి. విద్యార్థులు బయట కెక్కడికైనా తిరగడానికి వెళ్ళినపుడు వారివెంట అధ్యాపకులుండాలి. దీనితో వారిలో ఎట్టి దుశ్చేష్టలుగాని, సోమరితనంగాని, పొరపాట్లు గాని జరుగటానికి అవకాశం ఉండదు.

"కన్యానాం సంప్రదానం చ కుమారాణాం చ రక్షణమ్" ॥ మను. 7-152 ॥

"బాలబాలికలకు ఐదు లేదా ఎనిమిదేళ్ల వయస్సు రాగానే వారిని ఇండ్లల్లోనే ఉంచుకొనకుండా పాఠశాలలకు తప్పనిసరిగా పంపించాలి. అలా పంపనివారు శిక్షార్హులని జాతి నియమం గాని, రాజనియమం గాని ఉండాలి" అని దీని అర్థం.

గాయత్రీ మంత్రం

బాలబాలికలకు యజ్ఞోపవీత సంస్కారాన్ని ఇంటిలోగాని పాఠశాలలలోగాని గురుకులంలోగాని చేయాలి. వారి తల్లిదండ్రులు లేదా అధ్యాపకులు గాయత్రీ మంత్రాన్ని అర్థసహితంగా ఉపదేశించాలి. ఆ మంత్రం ఇది –

ఓం భూర్భువః స్వః । తత్సవితుర్వరేణ్యం, భర్గో దేవస్య ధీమహి ।
ధియో యో నః ప్రచోదయాత్ ॥ యజు. 36-3 ॥

ఈ మంత్రంలో ప్రథమంలో 'ఓం' ఉన్నది. దీని అర్థం ప్రథమసముల్లాసంలో వ్రాయబడింది. అక్కడ దానిని తెలుసుకోవాలి. ఇక్కడ ఈ మూడు మహావ్యాహృతుల అర్థం సంక్షేపంగా వ్రాయబడును.

"భూరితి వై ప్రాణః". "యః ప్రాణయతి చరాచరం జగత్ స భూః స్వయంభూ రీశ్వరః" – సమస్త జగత్తుకు జీవనాధారుడై, ప్రాణానికంటె ప్రియుడై, స్వయంభువు అవటంవల్ల ప్రాణవాచకమైన **'భూః'** పరమేశ్వరునికి పేరు.

'భువరిత్యపానః'. యః సర్వం దుఃఖమపానయతి సోఽపానః – దుఃఖరహితుడై, తన సాంగత్యంలో ఉన్న సమస్త జీవులను దుఃఖాలనుండి దూరంగా ఉంచేవాడు కాబట్టి ఆ పరమేశ్వరునికి **'భువః'** అని పేరు.

'స్వరితి వ్యానః'. యో వివిధం జగత్ వ్యానయతి వ్యాప్నోతి స వ్యానః – అనేక విధాలుగా జగత్తులో వ్యాపించి, అన్నింటిని ధరించేవాడు కాబట్టి ఈశ్వరునికి 'స్వః' అని పేరు. ఈ మూడు వచనాలు తైత్తిరీయారణ్యకంలో రెండవ ప్రపాఠకంలో ఐదవ అనువాకంలో ఉన్నాయి. (7.5)

సవితుః = యః సునోత్యుత్పాదయతి సర్వం జగత్ స సవితా తస్య – సర్వజగదుత్పాదకుడు, సమస్తైశ్వర్యాలను ఇచ్చువాడు; **దేవస్య = యో దీవ్యతి దీవ్యతే వా స దేవః** – సమస్త సుఖాలను ఇచ్చువాడు, అందరిచే కోరబడువాడు అయిన పరమేశ్వరుని, **వరేణ్యమ్ = వర్తుమర్హమ్** – స్వీకరించుటకు యోగ్యాన్ని, శ్రేష్ఠాన్ని, **భర్గః = శుద్ధస్వరూపమ్** శుద్ధం, పవిత్రమైన **తత్** ఆ పరమాత్ముని చేతనబ్రహ్మస్వరూపాన్ని, మేము, **ధీమహి = ధరేమహి** – ధరిస్తాము. ఎందుకంటే? **యః = జగదీశ్వరః** – దేవుడైన ఆ పరమాత్మ, **నః – అస్మాకమ్** – మా, **ధియః = బుద్ధీః** – బుద్ధులను **ప్రచోదయాత్ = ప్రేరయేత్** – ప్రేరేపిస్తాడు కాబట్టి. అనగా చెడ్డకర్మల నుండి విడిపించి సత్కార్యాలలో ప్రవర్తింపజేస్తాడు.

"హే పరమేశ్వర! సచ్చిదానందస్వరూప! నిత్యశుద్ధబుద్ధ ముక్తస్వభావ! అజ! నిరంజన! నిర్వికార! సర్వాంతర్యామిన్! సర్వాధార ! జగత్పతే! సకల జగదుత్పాదక! అనాదే! విశ్వంభర! సర్వవ్యాపిన్ ! కరుణామృతవారిధే ! సవితుర్దేవస్య తవ యదోం భూర్భువః స్వర్వరేణ్యం భర్గోఽస్తి తద్వయం ధీమహి ధరేమహి ధ్యాయేమ వా. కస్మై ప్రయోజనాయేత్యత్రాహ – హే భగవాన్ ! యః సవితా దేవః పరమేశ్వరో భవానస్మాకం ధియః ప్రచోదయాత్. స ఏవాస్మాకం పూజ్య ఉపాసనీయ ఇష్టదేవో భవతు. నాతోఽన్యం భవత్తుల్యం భవతోఽధికం చ కఞ్చిత్ కదాచిన్మన్యామహే"

భావార్థం: ఓ మానవులారా! సర్వసమర్థులలో సమర్థుడు, సచ్చిదానందుడు, అనంతస్వరూపుడు, నిత్యశుద్ధబుద్ధముక్తస్వభావుడు, కృపాసాగరుడు, చక్కగా న్యాయమొనర్చేవాడు, జన్మమరణాది క్లేశరహితుడు, నిరాకారుడు, సర్వం తెలిసినవాడు, సర్వాన్ని ధరించిన తండ్రి, సృష్టికర్త, అన్నాదులచే విశ్వాన్ని పోషించువాడు, సకలైశ్వర్య సమన్వితుడు, శుద్ధచైతన్యస్వరూపుడు,

పొందుటకు తగిన యోగ్యులైన పరమేశ్వరుడు ఉన్నాడు. అలాంటి పరమాత్మనే మనం ధ్యానిద్దాము. ఆ పరమేశ్వరుడు అంతర్యామి అవటంవలన మనలను దుష్టాచారాల నుండి, అధర్మమార్గాల నుండి దూరంచేసి, శిష్టాచార సమన్వితమైన సత్యమార్గంలో నడిపిస్తాడు. అలాంటి పరమాత్మను వీడి అన్యులను ఎవరినీ ఏ పదార్థాన్నీ మేము ధ్యానించకుందుము గాక! ఎందుకంటే అతనితో సమానుడు, ఘనుడు ఎవరూ లేరు. అతడే మన తండ్రి, రాజు, న్యాయాధీశుడు. అతడే సమస్త సుఖాలను ఇచ్చేవాడు.

స్నాన- ఆచమనాదులు

ఈ విధంగా గాయత్రీమంత్రం ఉపదేశించి సంధ్యోపాసనకు సంబంధించిన స్నానం, ఆచమనం, ప్రాణాయామం మొదలైన క్రియలను నేర్పించాలి. శరీరంలోని బాహ్యావయవాలు స్నానంతో పరిశుభ్రమై ఆరోగ్యం కలవి అవుతాయి. కాబట్టి మొదట స్నానం అవసరం. ఇందుకు ప్రమాణం:-

"అద్భిర్గాత్రాణి శుధ్యంతి, మనః సత్యేన శుధ్యతి ।
విద్యాతపోభ్యాం భూతాత్మా, బుద్ధిర్ జ్ఞానేన శుధ్యతి ॥ మను. అ. 5. శ్లో. 109 ॥

నీటితో శరీర బాహ్యావయవాలు, సత్యాచరణతో మనస్సు, విద్యాతపస్సులతో అనగా అనేక విధాలైన కష్టాలకు ఓర్చి ధర్మాన్నే అనుష్ఠించటం వల్ల జీవాత్మ, జ్ఞానంతో అనగా పృథివి మొదలుకొని పరమేశ్వర పర్యంతం గల పదార్థాల వివేకంతో బుద్ధి దృఢనిశ్చయం కలిగి అన్నీ పవిత్రమౌతాయి. కాబట్టి భోజనానికి పూర్వం తప్పనిసరిగా స్నానం చేయాలి.

ఇక రెండవది ప్రాణాయామం. దీనికి ప్రమాణం:-

'యోగాంగానుష్ఠానాదశుద్ధిక్షయే జ్ఞానదీప్తిరావివేకఖ్యాతేః' ॥ యోగ. సాధనపాదం. 28 ॥

మానవుడు ప్రాణాయామం చేసేటపుడు ప్రతిక్షణం ఉత్తరోత్తర కాలంలో అనగా కాలం గడచిన కొద్దీ అతనిలోని అశుద్ధి నశిస్తూ జ్ఞానం ప్రకాశిస్తుంది. ముక్తి లభించేంత వరకు అతనికి ఆత్మజ్ఞానం నిరాటంకంగా వృద్ధిచెందుతుంది.

దహ్యంతే ధ్మాయమానానాం ధాతూనాం హి యథా మలాః ।
తథేంద్రియాణాం దహ్యంతే దోషాః ప్రాణస్య నిగ్రహాత్ ॥ మను. 6-71 ॥

అగ్నితో కరిగించడం వల్ల సువర్ణాది ధాతువుల మలినాలు నష్టమైఅవి పరిశుద్ధమైనట్లు ప్రాణాయామం వల్ల మనస్సు మొదలైన ఇంద్రియాల దోషాలు నశించి అవి నిర్మలమౌతాయి.

ప్రాణాయామ విధి

"ప్రచ్ఛర్దన విధారణాభ్యాం వా ప్రాణస్య ॥ యోగ. సమాధిపాదము సూ. 34 ॥

వమనం-వాంతి అయినప్పుడు ఆహార జలాలు అత్యంతవేగంగా బయటికి వెళ్ళినట్లు, ప్రాణవాయువును మిక్కిలి బలంతో బయటికి వదలి, దానిని యథాశక్తి వెలుపలనే ఆపాలి. వెలుపలికి వాయువు వదిలినపుడు మూలేంద్రియాన్నిపైకి లాగి ఉంచాలి. అలా లాగి ఉండగలిగి ప్రాణవాయువును వెలుపలనే ఎక్కువసేపు ఉంచాలి. ప్రాణవాయువు వెలుపల అధికసమయం ఉండటానికి ఇదే సరైన పద్ధతి. ఇక కష్టమని తోచినవెంటనే మెల్లమెల్లగా వాయువును లోనికి పీల్చుకొని ఊపిరితిత్తులు నింపి మరల అలాగే శక్తికొలది ఇష్టమున్నంతసేపు లోపల ఆపాలి. కోరిక, సామర్థ్యాన్ని అనుసరించి ఇలా ప్రాణాయామం చేసేటపుడు మనస్సులో **'ఓమ్' 'ఓమ్'** అని జపిస్తూ ఉండాలి. ఇలా చేస్తే మనస్సు పవిత్రమై నిశ్చలత్వాన్ని పొందుతుంది.

ప్రాణాయామం నాల్గు విధాలు: మొదటిది **'బాహ్యవిషయకం'.** అంటే వాయువును వెలుపలికి వదలి చాలాసేపు ఆపటం. రెండవది **'అభ్యంతరం'** అంటే లోపల ఆపగలిగినంతసేపు ప్రాణవాయువును ఆపటం. మూడవది **'స్తంభవృత్తి'** అంటే ఉన్నది ఉన్నట్లుగా ఎక్కడి వాయువును అక్కడే శక్తి కొలది ఆపటం. నాల్గవది **'బాహ్యాభ్యంతరాక్షేపి'** అంటే ప్రాణవాయువు వెలుపలికి రావాలనుకున్నప్పుడు దానినిలోపలనే ఆపుతూ తద్విరుద్ధంగా వెలుపలి నుండి వాయువును లోపలికి పీల్చాలి. ఇలాగే వెలుపలి నుండి లోపలికి గాలి పీల్చాలనుకున్నప్పుడు దానిని బయటనే ఆపాలి. పరస్పర విరుద్ధ క్రియలను చేస్తే ఉచ్ఛ్వాస నిశ్వాసల గతులు ఆగి ప్రాణం వశమవుతుంది. దీనివల్ల మనస్సు, ఇంద్రియాలు స్వాధీనంలో ఉంటాయి. బలం, పురుషార్థం పెరిగి బుద్ధి తీవ్రమై అది సూక్ష్మరూపాన్ని ధరిస్తుంది. కఠినమైన సూక్ష్మవిషయాలను కూడా అది శీఘ్రంగా గ్రహిస్తుంది. దీనివల్ల మనిషి శరీరంలో వీర్యం వృద్ధిచెందుతుంది. స్థిరమైన బలపరాక్రమాలు, జితేంద్రియత్వం కలుగుతుంది. సర్వ శాస్త్రాలు స్వల్పకాలంలోనే నేర్చుకొని జ్ఞాపకంలో ఉంచుకొంటాడు. ఇలాగే స్త్రీలు కూడా యోగాభ్యాసాన్ని చేయాలి.

ఇలా విద్యార్థులకు ప్రాణాయామవిధిని నేర్పించిన తర్వాత భోజనంపెట్టి, వస్త్రధారణ చేయు పద్ధతులను, కూర్చోవటం, లేవటం, మాట్లాడటం, చిన్నా పెద్దలతో యథాయోగ్యంగా ప్రవర్తించటం అనే విషయాలను ఉపదేశించాలి.

సంధ్య - బ్రహ్మయజ్ఞం

సంధ్యోపాసన: దీనిని 'బ్రహ్మయజ్ఞం' అని అంటారు. అరచేతిలో కొంచెం నీరు పోసుకొని ఆ నీటిని అరచేతి మొదలు మధ్యభాగంలో పెదవులను ఆనించి త్రాగుట**'ఆచమనం'** అంటారు. ఆ జలం కంఠం నుండి హృదయం వరకు తడుపునంత మాత్రమే ఉండాలి. అంతకు ఎక్కువ తక్కువ ఉండరాదు. దీనివల్ల కంఠంలోని కఫం, పిత్తం కొంత తొలగుతుంది.

'మార్జనం' అనగా ఎడమ అరచేతిలో కొంచెం నీరు పోసుకొని నడిమివ్రేలు, అనామిక (ఉంగరపు వ్రేలు) కొనలతో నేత్రాలు మొదలైన అంగాలను స్పర్శించాలి. దీనితో సోమరితనం దూరమవుతుంది. ఒకవేళ సమయానికి నీరు లేకపోతే మంత్రాలు చదివితే సరిపోతుంది. తర్వాత మంత్రపూర్వకంగా ప్రాణాయామాన్ని, మనసా పరిక్రమాన్ని, ఉపస్థానాన్ని విద్యార్థులకు నేర్పించాలి. తదుపరి పరమేశ్వరుని స్తుతి ప్రార్థన ఉపాసనలను నేర్పించాలి. తదనంతరం **'అఘమర్షణం'** అనగా పాపం చేయకూడదనే భావనతో ధ్యానం చేయాలి. ఈ సంధ్యోపాసన ఏకాంత ప్రదేశంలో, ఏకాగ్రచిత్తంతో చేయాలి.

"అపాం సమీపే నియతో నైత్యకం విధిమాస్థితః ।
సావిత్రీ మప్యధీయీత గత్వారణ్యం సమాహితః ॥ మను. 2-104 ॥

అర్థం: అడవిలో ఏకాంతప్రదేశానికి వెళ్ళి, సావధానులై, జల సమీపంలో కూర్చొని నిత్యకర్మ చేస్తూ 'సావిత్రీ' అనగా 'గాయత్రీ' మంత్రాన్ని అర్థంతో జపించాలి. దానిననుసరించి ప్రవర్తించాలి. ఈ జపాన్ని మనస్సుతో చేయటం ఉత్తమం.

దేవయజ్ఞం - యజ్ఞపాత్రలు

దేవయజ్ఞం: అగ్నిహోత్రం, విద్వాంసుల సాంగత్యం, వారి సేవ మొదలైన కార్యాలు **'దేవయజ్ఞం'** అనబడుతుంది. సంధ్యాగ్నిహోత్రాలను ప్రాతస్సాయంకాలంలోనే చేయాలి. రాత్రిని దినంతో, దినాన్ని రాత్రితో కలుపు సంధివేళలు రెండే కలవు. కనీసం ప్రతిదినం ఒక గంటసేపు ధ్యానం చేయటం అవసరం. యోగులు సమాధిస్థులై పరమాత్మను ధ్యానిస్తూ సంధ్యోపాసన చేయాలి. సూర్యోదయానంతరం, సూర్యాస్తమయానికి పూర్వమే అగ్నిహోత్రం చేయు సమయాలు. అగ్నిహోత్రం చేయటానికి లోహంతో గాని, మట్టితోగాని చేసిన ఒక యజ్ఞవేది యజ్ఞకుండం ఉండాలి. ఇది పై భాగంలో 12 లేక 16 అంగుళాల చదరం, అంతే లోతు కలిగి క్రింది భాగంలో 3 లేక 4 అంగుళాల చదరం కలిగి ఉండాలి. అంటే పై వెడల్పులో నాల్గవభాగం క్రింది వెడల్పు ఉండాలి. దీనిలో శ్రీగంధం, చందనం, మోదుగు, మామిడి, మేడి, రావి మొదలైన శ్రేష్ఠమైన కట్టెముక్కలు తెచ్చి తగినట్లు చిన్నవిగా, పెద్దవిగా చేసి ఉంచుకోవాలి. వీటిమధ్య అగ్నిని ఉంచి, సమిధలు అనగా పైన చెప్పిన కట్టెలను ఉంచాలి. ఒక ప్రోక్షనీ పాత్ర, ఒక ప్రణీతాపాత్ర, ఒక ఆజ్యస్థాలీ అనగా ఘృతపాత్రను బంగారంతోగాని, వెండితోగాని, కట్టెతో గాని చేయించిన ఒక చిన్న గరిటెను ఉంచుకోవాలి.

ప్రణీతాప్రోక్షణులలో జలాన్ని, ఘృతపాత్రలో నేయిని పోసి, వేడిచేసి ఉంచాలి. ప్రణీతాపాత్ర జలం ఉంచుకోవడానికి, ప్రోక్షణి చేయి కడుక్కోవటానికి, జలాన్ని సులభంగా తీసుకోవటానికి ఉపకరిస్తుంది. అనంతరం కాచిన ఘృతాన్ని బాగా పరీక్షించి చూచి, ఈ క్రింది మంత్రాలతో హోమం చేయాలి.

అగ్నిహోత్రం

ఓం భూరగ్నయే ప్రాణాయ స్వాహా। ఓం భువర్వాయవేఽపానాయ స్వాహా।
ఓం స్వరాదిత్యాయ వ్యానాయ స్వాహా।
ఓం భూర్భువః స్వరగ్నివాయ్వాదిత్యేభ్యః ప్రాణాపానవ్యానేభ్యః స్వాహా।

ఇలాంటి అగ్నిహోత్ర మంత్రాలను ఒక్కొక్కటి పఠిస్తూ ఒక్కొక్క ఆహుతిని ఇవ్వాలి. అధికంగా ఆహుతులు ఇవ్వదలిస్తే:

"విశ్వాని దేవ సవితర్దురితాని పరాసువ। యద్భద్రం తన్న ఆ సువ॥ యజు. 30-3॥

ఈ మంత్రంతో, పూర్వోక్త గాయత్రీ మంత్రంతో ఆహుతులను ఇవ్వాలి. **'ఓం' 'భూః' 'భువః' 'ప్రాణః'** మొదలైన పేర్లన్నీ పరమేశ్వరునివే. వీటి అర్థాలు పూర్వమే చెప్పబడ్డాయి. ఆత్మలో ఎలా జ్ఞానం కలిగితే అలాగే వాక్కుతో చెప్పాలి, వ్యతిరేకంగా పలుకరాదనీ **'స్వాహా'** శబ్దానికి అర్థం. సర్వప్రాణుల సుఖం కొరకు లోకంలోని సర్వపదార్థాలను పరమాత్ముడు సృజించినట్లు మానవులు పరోపకారాన్ని చేయాలి.

హోమం వలన లాభాలు

ప్రశ్న:- హోమం వలన లాభాలేమిటి?

జవాబు:- దుర్గంధంతో కూడిన వాయుజలాల వల్ల వ్యాధులు, వ్యాధుల వల్ల ప్రాణులకు దుఃఖం కలుగుతుంది. సుగంధ యుక్త వాయుజలాల వల్ల ఆరోగ్యం, ఆరోగ్యం వల్ల సుఖప్రాప్తి కలుగుతుంది. ఈ విషయం అందరికీ తెలిసిందే కదా! హోమం చేయడం వల్ల దుర్గంధం దూరమై శుద్ధవాయువు అంతటా వ్యాపిస్తుంది.

ప్రశ్న:- గంధం అరగదీసి ఇతరులకు పూయటంవల్ల, నెయ్యి మొదలైన వాటిని తినిపించడం వల్ల ఎంతో ఉపకారం జరుగుతుంది. వాటిని అగ్నిలో వేసి నష్టం చేయటం బుద్ధిమంతులపని కాదు.

జవాబు:- పదార్థ విజ్ఞానం తెలిస్తే మీరిట్లా మాట్లాడరు. హోమం చేయు స్థలంలో చూడండి. దూరంగా ఉన్నవారు తమ ముక్కులతో సుగంధాన్ని పీలుస్తారు. అగ్నిలో వేసిన పదార్థాలు సూక్ష్మమై వ్యాపించి, వాయువులో కలిసి పరిసరప్రాంతాలలోనే కాక దూరప్రదేశానికి వెళ్లి అక్కడి దుర్గంధాన్ని కూడా నివారిస్తుంది.

ప్రశ్న:- కుంకుమపూవు, కస్తూరి, సుగంధ పదార్థాలు, పుష్పాలు, అత్తర్లు మొదలైన వాటిని ఇంట్లో ఉంచితే వాయువు సుగంధితమై సుఖాన్నిస్తుంది కదా!

జవాబు:- ఈ సుగంధానికి ఇంట్లో ఉండే వాయువును బయటికి పంపి, పరిశుద్ధ వాయువును లోన ప్రవేశింపచేసే శక్తి లేదు. ఎందుకంటే ఈ సుగంధద్రవ్యానికి భేదకశక్తి లేదు.

వాయువును, దుర్గంధ పదార్థాలను ఛిన్నా భిన్నం చేసి, తేలిక పరచి, బయటికి పంపి, పవిత్రవాయువును లోన ప్రవేశపెట్టు శక్తి ఒక అగ్నికి మాత్రమే ఉంది.

ప్రశ్న:- మంత్రోచ్చారణ చేస్తూ హోమం చేస్తే కలిగే ప్రయోజనమేమి?

జవాబు:- ఆ మంత్రాలలో హోమంవలన కలుగు లాభాలను తెలిపే విషయాలున్నవి. మంత్రాలను చదవటం వలన అవి కంఠస్థమౌతాయి. ఇలా వేదాల పఠనపాఠనం, వాని రక్షణ జరుగుతుంది.

ప్రశ్న:- హోమం చేయకపోతే పాపం కలుగుతుందా?

జవాబు:- అవును. మానవుని శరీరం నుండి దుర్గంధం వెడలి, వాయుజలాలను మలినం చేసి, రోగోత్పత్తికి కారణమై ప్రాణులకు దుఃఖాన్ని కలిగిస్తుంది. ఎవరి శరీరం నుండి ఎంత దుర్గంధం వస్తుందో వారికి అంత పాపం కలుగుతుంది. ఆ పాప నివారణార్థం అంత సుగంధాన్ని, అంతకంటే అధికంగా వాయుజలాలలో వ్యాపింపచేయాలి. ఒకడు తినగలిగినంత నేతిని, సుగంధ పదార్థాలను హోమం చేస్తే లక్షల కొలది ప్రాణులకు ఉపకారం కలుగుతుంది. వాటిని ఒక్కడే భుజించినచో ఆ ఒక్కనికే సుఖం కలుగుతుంది. ఘృతాది ఉత్తమ పదార్థాలు మానవులు భుజిస్తే వారి శరీర, ఆత్మల శక్తులు అభివృద్ధి చెందుతాయి. కాని హోమం చేయటం వల్ల అంతకంటే ఎక్కువ ఎంతోమందికి లాభం కలుగుతుంది.

ప్రశ్న:- ప్రతి మనిషి ఎన్ని ఆహుతులివ్వాలి? ఒక్కొక్క ఆహుతి ప్రమాణం ఎంత?

జవాబు:- ప్రతి వ్యక్తి పదహారు ఆహుతుల నివ్వాలి. ప్రతి ఆహుతి కనీసము అరతులం ఉండాలి. ఇంతకన్నా ఎక్కువ ఇచ్చినా మంచిదే. అందుకే ఆర్యావర్త శిరోమణులైన మహాశయులు, ఋషులు, మునులు, రాజులు, మహారాజులు విశేషంగా హోమాలు చేస్తూ, చేయించారు. హోమాలు చేసే ప్రచారం ఉన్నంతకాలం ఆర్యావర్త దేశం రోగరహితమై, సుఖశాంతులతో ఉన్నది. నేడు కూడా హోమ ప్రచారం జరిగితే మళ్లీ అలాగే అవుతుంది.

ఈ రెండు యజ్ఞాలలో మొదటిది బ్రహ్మ యజ్ఞం. అధ్యయనం అధ్యాపనం, ఈశ్వర స్తుతి ప్రార్థన ఉపాసనా రూపమైన సంధ్యోపాసన చేయటం అనేది. ఇదే 'బ్రహ్మయజ్ఞం', **'అగ్నిహోత్రం'** మొదలుకొని **'అశ్వమేధ పర్యంతం'** గల యజ్ఞాలను చేయాలి. విద్వాంసుల సేవ సాంగత్యం అనేది రెండవదైన **'దేవయజ్ఞం'**. బ్రహ్మచర్యకాలంలో కేవలం బ్రహ్మయజ్ఞం, అగ్నిహోత్రం మాత్రమే చేయవలసి ఉంటుంది.

ఉపనయన అధికారం

"బ్రాహ్మణస్త్రయాణాం వర్ణానాముపనయనం కర్తుమర్హతి ।
రాజన్యోద్వయస్య । వైశ్యో వైశ్య స్యైవేతి। శూద్రమపి కులగుణసంపన్నం

మంత్ర వర్జమనుపనీత మధ్యాపయేదిత్యేకే" ॥

ఇది సుశ్రుత సూత్ర స్థానంలో ద్వితీయ అధ్యాయ వచనం.

అర్థం: బ్రాహ్మణుడు "బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య"లను మూడు వర్ణాల వారికీ; క్షత్రియుడు "క్షత్రియ వైశ్య"లకు; వైశ్యుడు తన 'వైశ్య'వర్ణం వారికి యజ్ఞోపవీత సంస్కారంచేసి చదివించవచ్చు. కులీనుడుగా, శుభలక్షణయుక్తుడుగా శూద్రుడు ఉంటే, మంత్రసంహితను విడిచి మిగిలిన సర్వశాస్త్రాల నతనికి నేర్పించవచ్చు.

బ్రహ్మచర్య కాలం

ఉపనయన సంస్కారం తర్వాత, ఐదవ లేక ఎనిమిదవ యేట బాలురు బాలుర పాఠశాలకు, బాలికలు బాలికల పాఠశాలకు పోయి, ఈ క్రిందివిధంగా, నియమపూర్వకంగా అధ్యయనాన్ని ఆరంభించాలి.

షట్త్రింశదాబ్దికం చర్యం గురౌ త్రైవేదికం వ్రతమ్ ।
తదర్ధికం పాదికం వా గ్రహణాంతికమేవ వా ॥ మను. అ. 3-1 ॥

ఎనిమిది సంవత్సరాల వయసునుండి, ఒక్కొక్క వేదాన్ని సాంగోపాంగంగా చదవటానికి 12 ఏళ్ల చొప్పున, మూడు వేదాలను చదవటానికి (36) ముప్పై ఆరేళ్లు పడుతుంది. ఈ ముప్పై ఆరు మరియు మొదటి ఎనిమిది ఏళ్లను కలిపి మొత్తం (44) నలభై నాలుగేళ్ల వయస్సు వచ్చే వరకుగాని; పద్దెనిమిదేండ్ల (18) బ్రహ్మచర్యాన్ని, మొదటి ఎనిమిది సంవత్సరాలు కలిపి (26) ఇరవై ఆరేళ్ల వయస్సు వచ్చేవరకు గాని; లేక విద్య సమాప్తం కానంతవరకు గాని బ్రహ్మచర్యాన్ని పాలించాలి.

త్రివిధ బ్రహ్మచర్యం

'కనిష్ఠం, మధ్యమం, ఉత్తమం' అని బ్రహ్మచర్యం మూడు విధాలు.

పురుషో వావ యజ్ఞస్తస్య యాని చతుర్వింశతి వర్షాణి తత్ప్రాతః సవనం,
చతుర్వింశత్యక్షరా గాయత్రీ గాయత్రం ప్రాతఃసవనం, తదస్య వసవోఽన్వాయత్తాః
ప్రాణా వావ వసవ ఏతే హీదం సర్వం వాసయంతి ॥ 1 ॥

తం చేదేతస్మిన్ వయసి కించిదుపతపేత్స బ్రూయాత్ప్రాణా వసవ ఇదం
మే ప్రాతఃసవనం మాధ్యందినం సవన మనుసంతనుతేతి మాఽహం ప్రాణానాం
వసూనాం మధ్యే యజ్ఞో విలోప్సీయేత్యుద్ధైవ తత ఏత్యగదో హ భవతి ॥ 2 ॥

అథ యాని చతుశ్చత్వారింశద్వర్షాణి తన్మాధ్యందినం సవనం
చతుశ్చత్వారింశదక్షరా త్రిష్టుప్ త్రైష్టుభం మాధ్యందినం సవనం

తదస్య రుద్రా అన్వాయత్తాః ప్రాణా వావ రుద్రా ఏతే హీదం సర్వం రోదయంతి ॥ 3 ॥

తం చేదేతస్మిన్ వయసి కించిదుపతపేత్స బ్రూయాత్ప్రాణా రుద్రా ఇదం మే మాధ్యందినం సవనం తృతీయ సవనమనుసంతనుతేతి మాహం ప్రాణానాం రుద్రాణాం మధ్యే యజ్ఞో విలోప్సీయేత్యుద్ధైవ తత ఏత్యగదో హ భవతి ॥ 4 ॥

అథ యాన్యష్టాచత్వారింశద్వర్షాణి తత్తృతీయసవనమష్టాచత్వారింశదక్షరా జగతీ జాగతం తృతీయ సవనం, తదస్యాదిత్యా అన్వాయత్తాః ప్రాణా వావాదిత్యా ఏతే హీదం సర్వమాదదతే ॥ 5 ॥

తం చేదేతస్మిన్ వయసి కించిదుపతపేత్స బ్రూయాత్ప్రాణా ఆదిత్యా ఇదం మే తృతీయసవన మాయురనుసంతనుతేతి మాహం ప్రాణానామాదిత్యానాం మధ్యే యజ్ఞో విలోప్సీయేత్యుద్ధైవ తత ఏత్యగదో హైవ భవతి ॥ 6 ॥ ఛాందోగ్యోపనిషత్తు 3-16 ॥

(1) **కనిష్ఠ బ్రహ్మచర్యం:** అన్నరసమయమైన 'పురి' అను దేహంలో శయనించు జీవాత్మయే పురుషుడు. ఇతడు యజ్ఞవాచకుడు. అంటే అత్యంత శుభగుణాలు, సత్కర్తవ్యాలు కలవాడు. ఇతడు 24 సంవత్సరాల వరకు బ్రహ్మచారిగా ఉండి జితేంద్రియుడై వేదాది సత్యవిద్యలను, సుశిక్షను గ్రహించాలి. తరువాత వివాహం చేసుకొని విషయలోలుడు, దుర్వ్యసనా పరుడు కాకుండా ఉన్నచో అతని శరీరంలో గల ప్రాణాలు శక్తివంతములై సమస్త శుభగుణాలు గలవి అవుతాయి.

(2) ఈ ప్రథమ వయస్సులోనే విద్యాభ్యాసంతో పాటు ఆచార్యుడు అతనికి మంచి శిక్షణ నివ్వాలి. బ్రహ్మచారి ఇలా ఈ ప్రథమ వయస్సులో సరైన బ్రహ్మచారిగా ఉంటే అతడు శారీరకబలాన్ని, ఆత్మ బలాన్ని, ఆరోగ్యాన్ని పొందుతాడని, ప్రాణాలు శుభగుణాలతో కూడి వశంలో ఉంటాయని, కృతనిశ్చయుడవుతాడని తెలుపాలి. "ఓ మానవులారా! మీరు కూడా ఇలాగే ఉండి సుఖాన్ని విస్తరింపచేయండి. 24 సంవత్సరాల వరకు బ్రహ్మచర్యాన్ని నష్టపరచక, ఆ తర్వాత గృహస్థాశ్రమం స్వీకరించినచో ఆరోగ్యవంతులై 70, 80 సంవత్సరాల వరకు జీవించగలరు" అని ఉపదేశించాలి.

(3) **మధ్యమ బ్రహ్మచర్యం:** 44 సంవత్సరాల వయస్సు వరకు బ్రహ్మచారిగా ఉండి విద్యాభ్యాసం నేర్చుకొన్న తర్వాత ప్రాణేంద్రియాంతఃకరణాలు, ఆత్మ శక్తివంతమై ఉంటాయి. అతడు సర్వ దుష్టులను ఏడ్పిస్తూ శ్రేష్ఠులను రక్షిస్తాడు.

(4) ఈ ప్రథమ వయస్సులో కొంత తపశ్చర్యజేసిన "ఆ రుద్రరూప ప్రాణయుక్త మధ్యమ బ్రహ్మచర్యం సిద్ధిస్తుంది" అని బ్రహ్మచారి తాను మొదట గ్రహించి ఇతరులకు ఇలా ఉపదేశించాలి. "ఓ బ్రహ్మచారులారా! మీరు ఈ బ్రహ్మచర్యాన్ని

వృద్ధిచేయండి. నే నీ బ్రహ్మచర్యానికి లోపం కలిగించక యజ్ఞరూపుడనై, గురుకులం నుండి వచ్చి సత్కార్యాలు చేయుచున్నట్లు మీరు కూడా చేయండి".

(5) **ఉత్తమ బ్రహ్మచర్యం:** 48 సంవత్సరాల పర్యంతం చేసే ఉత్తమ బ్రహ్మచర్యం మూడవది. 48 అక్షరాల జగతీఛందస్సువలె 48 సంవత్సరాల వరకు సరైన బ్రహ్మచర్యాన్ని పాటించేవారి ప్రాణాలు అనుకూలమై ఉండటంవలన వారు సకల విద్యలను శీఘ్రంగా గ్రహిస్తారు.

(6) ప్రథమ వయస్సులో సంతానానికి విద్య, సుగుణాలు బలపడుటకు వారిని తపస్వులుగా చేసి, ఆచార్యులు, తల్లిదండ్రులు వారికి సదుపదేశాలు చేయాలి. సంతానం కూడా తమంతట తామే అఖండిత బ్రహ్మచర్యాన్ని అవలంబించి, మూడవదైన ఉత్తమ బ్రహ్మచర్యాన్ని పాలించి, సంపూర్ణంగా నాలుగు వందల సంవత్సరాల పూర్ణాయువును పెంచుకోవాలి. అలాగే మీరు కూడా పెంచుకోండి. ఇలాంటి బ్రహ్మచర్యాన్ని అవలంబించి దానిని నష్టపరచనివారు సర్వరోగరహితులై, ధర్మార్థకామమోక్షాలను పొందుతారు.

శరీరావస్థలు - 4

చతస్రోఽవస్థా శరీరస్య వృద్ధిర్యౌవనం సంపూర్ణతా కిఞ్చిత్పరిహాణిశ్చేతి ।
ఆషోడశాద్వృద్ధిః । ఆపంచవింశతేర్యౌవనం । ఆచత్వారింశతః సంపూర్ణతా ।
తతః కించిత్పరిహాణిశ్చేతి ॥

పంచవింశే తతో వర్షే పుమాన్ నారీ తు షోడశే ।
సమత్వాగతవీర్యౌ తౌ జానీయాత్ కుశలో భిషక్ ॥

ఇది సుశ్రుత సూత్రస్థానంలో 35వ అధ్యాయంలోని 25వ వచనం.

'అర్థం':- శరీరానికి నాలుగు దశలున్నవి.

మొదటిది- "వృద్ధి":- ఇది 16 సంవత్సరాల నుండి 25 సంవత్సరాల వరకు ఉంటుంది. దీనిలో శరీర ధాతువులు అన్నీ వృద్ధిచెందుతాయి.

రెండవది- "యవ్వనం":- ఇది 25 సంవత్సరాలు ముగిసి, 26వ సంవత్సరం ఆరంభం అయ్యేటప్పుడు మొదలవుతుంది.

మూడవది- "సంపూర్ణత":- 25వ యేడు మొదలుకొని నలభై ఏళ్ల పర్యంతం ఇది ఉంటుంది. దీనిలో శరీరధాతువులు అన్నీ పుష్టిచెందుతాయి.

నాల్గవది- "కించిత్పరిహాణి":-నలుబది సంవత్సరాల బ్రహ్మచార్యంతో శరీరంలోని ధాతువులన్నీ

పుష్టిని చెంది పూర్ణత్వాన్ని పొందతాయి. తర్వాత ఇది శరీరంలో ఉండదు. అది స్వప్నంలోనో చెమట రూపంలోనో బయటికి పోతుంది. ఈ నలభైయవ సంవత్సరమే వివాహానికి ఉత్తమ సమయం. ఇంకా నలభై ఎనిమిదవ యేట వివాహమాడటం ఉత్తమోత్తమం.

స్త్రీ పురుషుల వివాహ కాలం

ప్రశ్న:- ఈ బ్రహ్మచర్య నియమం స్త్రీ పురుషు లిద్దరికీ సమానమా?

జవాబు:- సమానం కాదు. పురుషుడు 25 యేళ్ల వరకు బ్రహ్మచర్యం పాటిస్తే స్త్రీ 16 వత్సరముల వరకు, పురుషుడు 30 యేళ్ల వరకుంటే స్త్రీ 17 యేళ్ల వరకు; పురుషుడు 36 యేళ్ల వరకున్నట్లో స్త్రీ 18 యేళ్ల వరకు; పురుషుడు 40 యేళ్ల వరకు వున్న స్త్రీ 20 యేళ్ల వరకు; పురుషుడు 44 యేళ్ల వరకు వున్న స్త్రీ 22 యేళ్ల వరకు; పురుషుడు 48 యేళ్ల వరకు బ్రహ్మచారిగా వున్న స్త్రీ 24 యేళ్ల వరకు బ్రహ్మచర్యాన్ని పాలించాలి. వివాహం చేసుకోదలచిన పురుషుడు 48 సంవత్సరాల తరువాత, స్త్రీ 24 సంవత్సరాల తర్వాత బ్రహ్మచర్యాన్ని పాలించరాదు. ఇంతలోపే వివాహం చేసుకోవాలి. వివాహాన్ని చేసుకోదలచనివారు మరణపర్యంతం బ్రహ్మచారులుగా సంతోషంగా ఉండవచ్చును. పరిపూర్ణ విద్వాంసులు, జితేంద్రియులు, నిర్దోషులు, యోగులు అయిన స్త్రీ పురుషులే ఇలాఉండుటకు అర్హులు. కామోద్రేకాలను అణచి ఇంద్రియాలను వశంలో ఉంచుకొనుట అత్యంత కఠినమైన కార్యం.

పఠన పాఠనాలు చేయువారి నియమాలు

ఋతం చ స్వాధ్యాయ ప్రవచనే చ। సత్యం చ స్వాధ్యాయ ప్రవచనే చ। తపశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ। దమశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ। శమశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ। అగ్నయశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ। అగ్నిహోత్రం చ స్వాధ్యాయ ప్రవచనే చ। అతిథయశ్చ స్వాధ్యాయ ప్రవచనే చ। మానుషం చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజాచ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజనశ్చ స్వాధ్యాయప్రవచనే చ। ప్రజాతిశ్చ స్వాధ్యాయప్రవచనే చ। ఇది తైత్తరీయ ఉపనిషత్తు - ప్ర. 2 అను. 9 లోని వచనం.

ఈ నియమాలు అధ్యయనం - అధ్యాపనం చేసేవారికొరకున్నాయి.

(ఋతం చ ...) యథార్థమైన ఆచరణతో చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

(సత్యం చ ...) సత్యాచరణతో సత్యవిద్యలను చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

(తపశ్చ ...) తపస్వులై ధర్మానుష్ఠానం చేస్తూ చదువుతూ - చదివిస్తూ ఉండాలి

(దమశ్చ ...) బాహ్యేంద్రియాలను దురాచారాల నుండి నిరోధిస్తూ చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

(శమశ్చ ...) సమస్త దోషాలనుండి మనోవృత్తులను తొలగించి చదువుదూ - చదివిస్తూ ఉండాలి.

(అగ్నయశ్చ ...) ఆహవనీయాద్యగ్నులను, విద్యుత్తు మొదలైనవాటిని తెలుసుకుంటూ చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

(అగ్నిహోత్రం...) అగ్నిహోత్రం చేస్తూ చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

(అతిథయశ్చ...) అతిథులకు సేవ చేస్తూ చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

(మానుషం చ...) మానవ వ్యవహారాలను యథాయోగ్యంగా చేస్తూ చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

(ప్రజాతిశ్చ ...) సంతానాన్ని, రాజ్యాన్ని పాలిస్తూ చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

(ప్రజనశ్చ ...) వీర్యాభివృద్ధి, రక్షణ కావిస్తూ చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

(ప్రజాతిశ్చ...) తమ సంతానాన్ని, శిష్యులను పాలిస్తూ చదువుతూ - చదివిస్తూ ఉండాలి.

యమ - నియమాల పాలన

యమాన్ సేవేత సతతం న నియమాన్ కేవలాన్ బుధః ।
యమాన్ పతత్యకుర్వాణో నియమాన్ కేవలాన్ భజన్ ॥ మను. 4-204 ॥

యమాలు ఐదు విధాలు

తత్రాహింసాసత్యాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహా యమాః ॥ యోగ. సాధన, 2-30 ॥

అహింస = వైరత్యాగం; సత్యం = సత్యాన్నే నమ్ముతూ, పలుకుతూ ఆచరించుట; అస్తేయం = మనోవాక్కాయ కర్మలతో దొంగతనాన్ని చేయకుండుట; బ్రహ్మచర్యం = జననేంద్రియ సంయమనం; అపరిగ్రహం = అత్యంత లోభత్వాన్ని వీడి స్వాభిమానరహితుడవటం. ఈ ఐదు యమాలను నిత్యం అనుష్ఠించాలి.

నియమాలు ఐదు విధాలు:

శౌచసంతోషతపఃస్వాధ్యాయేశ్వర ప్రణిధానాని నియమాః ॥ యోగ. సాధన. 32 ॥

శౌచం = స్నానాదులచే పవిత్రత; సంతోషం = బాగా ప్రసన్నత కలిగి, సోమరితనాన్ని వీడి, పురుషార్థపరుడై, నష్టంలో శోకింపక, లాభంలో సంతోషింపకుండా ఉండుట; తపః = కష్టాలను అనుభవిస్తూ ధర్మకార్యాలను అనుష్ఠించుట; స్వాధ్యాయం = చదువుతూ, చదివిస్తూ; ఈశ్వర ప్రణిధానం = విశేష భక్తితో ఈశ్వరునికి ఆత్మను అర్పించటం. ఈ ఐదు నియమాలనబడతాయి. యమాలను వీడి కేవలం నియమాలనే సేవింపరాదు. ఈ రెండింటి నాచరించాలి. యమాలను పాటించక నియమాలను మాత్రమే అనుష్ఠించేవారు ఉన్నతిని చెందక అధోగతిపాలై లోకంలో పతితులౌతారు.

కామాత్మతా న ప్రశస్తా న చైవేహాస్త్యకామతా ।
కామ్యో హి వేదాధిగమః కర్మయోగశ్చవైదికః ॥ మను. అ. 2-2 ॥

అత్యంత కామాతురతగాని, అత్యంత నిష్కామతగాని ఎవరికీ శ్రేష్ఠం కాదు. కోరికే లేనప్పుడు ఎవరూ వేదజ్ఞానాన్ని పొందలేరు. అంతేకాక వేదవిహితాలైన ఉత్తమకర్మలను కూడ చేయలేరు.

బ్రాహ్మణ శరీర నిర్మాణం

స్వాధ్యాయేన వ్రతైర్హోమైస్త్రైవిద్యే నేజ్యయా సుతైః ।
మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః ॥ మను. 2-28 ॥

అర్థం: స్వాధ్యాయేన = సర్వవిద్యలను చదువుతూ, చదివిస్తూ; వ్రతైః = బ్రహ్మచర్య సత్యభాషణాది వ్రత నియమాలను పాలిస్తూ; హోమైః = అగ్నిహోత్రాది హోమాలు, సత్యగ్రహణం, అసత్య త్యాగం చేసి, సత్యవిద్యలను దానం చేస్తూ; త్రైవిద్యేన = వేదంలో చెప్పిన జ్ఞాన కర్మ ఉపాసనల, కర్మల నాచరిస్తూ, జ్ఞానవిద్యలను పొందుటచే; ఇజ్యయా = ప్రతి పక్షంలో చేయవలసిన యజ్ఞాలను చేయటంతో, సుతైః = సుసంతానాన్ని కనటంతో; మహాయజ్ఞైః = బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, బలి వైశ్వదేవయజ్ఞం, అతిథియజ్ఞాలను పంచ మహాయజ్ఞాలను చేయటం వలన; యజ్ఞైః = అగ్నిష్టోమాది యజ్ఞాలను చేస్తూ, శిల్పవిద్య విజ్ఞానాదులను సేవించటంతో ఈ శరీరం బ్రాహ్మీయమవుతుంది. అనగా వేదానికి, పరమేశ్వర భక్తికిని ఆధారరూపమైన బ్రాహ్మణశరీరంగా తయారవుతుంది. ఇన్ని సాధనాలు, ప్రయత్నాలు లేకుండా బ్రాహ్మణశరీరం తయారు కాలేదు.

ఇంద్రియాణాం విచరతాం విషయేష్వపహారిషు ।
సంయమే యత్నమాతిష్ఠేద్విద్వాన్ యంతేవ వాజినామ్ ॥ మను. 2-88 ॥

అర్థం:- సుశిక్షితుడైన సారథి అశ్వాలను తన వశంలో ఉంచుకొనునట్లు, దుష్కర్మల వైపుకు ఆకర్షిస్తూ విషయవాసనలలో విహరించు ఇంద్రియాలను నిగ్రహిస్తూ విద్వాంసుడు మనస్సును, తన వశంలో ఉంచుకోవాలి.

ఇంద్రియాణాం ప్రసంగేన దోషమృచ్ఛత్యసంశయమ్ ।
సన్నియమ్య తు తాన్యేవ తతః సిద్ధిం నియచ్ఛతి ॥ మను. 2-93 ॥

అర్థం:- ఇంద్రియవశుడైన జీవుడు నిశ్చయంగా అనేక దోషాలను చేస్తాడు. వాటిని తన వశంలో ఉంచుకొన్నవాడు సిద్ధిని పొందుతాడు.

వేదస్త్యాగశ్చ యజ్ఞాశ్చ నియమాశ్చ తపాంసి చ ।
న విప్రదుష్టభావస్య సిద్ధిం గచ్ఛంతి కర్హిచిత్ ॥ మను. 2-97 ॥

అర్థం:- దురాచారి, అజితేంద్రియుడు అయిన పురుషునికి వేదం, త్యాగం, యజ్ఞం, నియమం, తపస్సు వంటి సత్కర్మలు ఏవీ సిద్ధించవు.

వేదోపకరణే చైవ స్వాధ్యాయే చైవ నైత్యకే ।
నానురోధో౽ స్త్యనధ్యాయే హోమమంత్రేషు చైవ హి ॥ మను. 2-105 ॥

అర్థం:- వేదాలను చదవటానికి, చదివించటానికి సంధ్యోపాసనాది పంచమహాయజ్ఞాలను చేయటానికి, హోమ మంత్రపఠనానికి అనధ్యయనం - సెలవు అనేది లేదు. ఎందుకంటే:

నైత్యకే నాస్త్యనధ్యాయో బ్రహ్మసత్రం హి తత్ స్మృతమ్ ।
బ్రహ్మాహుతిహుతం పుణ్యమనధ్యాయవషట్కృతమ్ ॥ మను. 2-106 ॥

అర్థం:- నిత్యకర్మలలో అనధ్యాయం - సెలవు ఉండదు. ఉచ్ఛ్వాసనిశ్వాసాలను ఆపజాలం. అలాగే నిత్యకర్మలనూ ప్రతినిత్యం చేయాలి. వాటిని ఎన్నడూ మానకూడదు. అనధ్యాయంలో చేసిన అగ్నిహోత్రాది ఉత్తమ కర్మలు పుణ్యరూపాలే అవుతున్నాయి. అసత్యమాడుట ఎలా నిరంతరం పాపమో, సత్యం చెప్పటం ఎట్లా సదా పుణ్యమో, అలాగే కుకర్మలొనర్చుటలో సదా అనధ్యాయం, సత్కర్మలొనర్చుటలో సదా స్వాధ్యాయమే జరుగుతుంది.

అభివాదనశీలస్య నిత్యం వృద్ధోపసేవినః ।
చత్వారి తస్య వర్ధంతే ఆయుర్విద్యా యశో బలమ్ ॥ మను. 2-121 ॥

అర్థం:- సర్వదా (ఎల్లప్పుడు) వినయ విధేయతలు కలిగి సుశీలురై, విద్వాంసులను, వృద్ధులను నిత్యం సేవించేవారికి 'ఆయువు, విద్య, యశస్సు, బలం' అనే ఈ నాలుగు వృద్ధిచెందుతుంటాయి. అలా చేయనివారికి వృద్ధిచెందవు.

అహింసయైవ భూతానాం కార్యం శ్రేయోనుశాసనమ్ ।
వాక్ చైవ మధురా శ్లక్ష్ణా ప్రయోజ్యా ధర్మమిచ్ఛతా ॥ మను. 29-156 ॥

అర్థం:- వైరబుద్ధిని వదిలి, అందరికీ కల్యాణమార్గాన్ని ఉపదేశించటం విద్వాంసులకు, విద్యార్థులకు ధర్మం. ఉపదేశకుడు సదా మృదుమధురంగా, సౌశీల్యంగా మాట్లాడాలి. ధర్మోన్నతిని కోరువారు సదా సత్యాచరణపరులై సత్యాన్నే పలకాలి.

యస్య వాఙ్మనసే శుద్ధే సమ్యగ్ గుప్తే చ సర్వదా ।
స వై సర్వమవాప్నోతి వేదాంతోపగతం ఫలమ్ ॥ మను. 2-160 ॥

అర్థం:- వాక్కు మనస్సు పవిత్రంగా, సురక్షితంగా ఉంచుకొనేవారే వేదాలలో ఉన్న సిద్ధాంతరూప ఫలాన్ని (వేదాంతాన్ని) పొందగలరు.

సన్మాన త్యాగం

సమ్మానాద్ బ్రాహ్మణో నిత్యముద్విజేత విషాదివ ।
అమృతస్యేవ చాకాంక్షేదవమానస్య సర్వదా ॥ మను. 2-162 ॥

కీర్తిప్రతిష్ఠలను విషంలాగ తలచి, వానికి భీతిల్లుతూ, అగౌరవాన్ని, అవమానాన్ని అమృతంవలె భావించే బ్రాహ్మణుడే సమగ్రంగా వేదాన్ని, పరమేశ్వరుడిని తెలుసుకోగలడు.

అనేన క్రమయోగేన సంస్కృతాత్మా ద్విజః శనైః ।
గురౌ వసన్ సంచినుయాద్ బ్రహ్మాధిగమికం తపః ॥ మను. 2-146 ॥

ఇలా ఉపనయనాన్ని చేసుకొన్న ద్విజులైన బ్రహ్మచారీ బ్రహ్మచారిణులు, క్రమంగా వేదార్థ జ్ఞానరూపమైన ఉత్తమ తపస్సును వృద్ధిపరచుకోవాలి.

యోఽనధీత్య ద్విజో వేద మన్యత్ర కురుతే శ్రమమ్ ।
స జీవన్నేవ శూద్రత్వమాశుగచ్ఛతి సాన్వయః ॥ మను. 2-168 ॥

వేదాన్ని అభ్యసించక, అన్యకార్యాలను చేసే ద్విజుడు, తన పుత్ర పౌత్ర సహితంగా అతి శీఘ్రంగా శూద్రత్వాన్ని పొందుతాడు.

బ్రహ్మచారి కర్తవ్యాలు

వర్జయేన్మధుమాంసం చ గంధం మాల్యం రసాన్ స్త్రియః ।
శుక్తాని యాని సర్వాణి ప్రాణినాం చైవ హింసనమ్ ॥ మను. 2-177 ॥

బ్రహ్మచారి, బ్రహ్మచారిణి 'మద్యం, మాంసం, గంధం, పుష్పహారం,' రసాలు, స్త్రీ పురుషుల పరస్పర సాంగత్యం, పుల్లని పదార్థాలు, ప్రాణిహింస' అనే వీటిని విసర్జించాలి.

అభ్యంగమంజనం చాక్ష్ణోరుపానచ్ఛత్రధారణమ్ ।
కామం క్రోధం చ లోభం చ నర్తనం గీతవాదనమ్ ॥ మను. 2-178 ॥

శరీర మర్దనం, కారణం లేకుండా ఉపస్థేంద్రియాన్ని తాకుట; కన్నులకు కాటుక పెట్టుట; పాదరక్షలు, ఛత్రం ధరించుట; మరియు కామం, క్రోధం, లోభం, మోహం, భయం, శోకం, ఈర్ష్య ద్వేషం, నృత్యం, గానం, వాద్యవాదనాలు మొ॥ వాటిని వీడాలి.

ద్యూతం చ జనవాదం చ పరివాదం తథానృతమ్ ।
స్త్రీణాం చ ప్రేక్షణాలంభముపఘాతం పరస్య చ ॥ మను. 2-179 ॥

జూదమాడటం, పరుల గురించి చర్చించటం, నిందించటం, అసత్యమాడటం, స్త్రీదర్శనం, ఆశ్రయం, ఇతరులకు సదా హాని కలిగించే దుష్కార్యాలు మొదలైనవాటిని వీడాలి.

ఏకః శయీత సర్వత్ర న రేతః స్కన్దయేత్క్వచిత్ ।
కామాద్ధి స్కందయన్రేతో హినస్తి వ్రతమాత్మనః ॥ మను. 2-180 ॥

ఎప్పుడూ ఒంటరిగా నిద్రించాలి. వీర్యస్ఖలనాన్ని ఎప్పుడూ చేయరాదు. కోరి వీర్యస్ఖలనాన్ని చేస్తే తన బ్రహ్మచర్య వ్రతం భంగమైనదని తెలుసుకోవాలి.

శిష్యునకు ఆచార్యోపదేశం

వేదమనూచ్యాచార్యో౽న్తేవాసినమనుశాస్తి । సత్యం వద । ధర్మం చర । స్వాధ్యాయాన్మా ప్రమదః । ఆచార్యాయ ప్రియం ధనమాహృత్య ప్రజాతంతుం మా వ్యవచ్ఛేత్సీః । సత్యాన్న ప్రమదితవ్యం । ధర్మాన్న ప్రమది తవ్యం । కుశలాన్న ప్రమదితవ్యం । భూత్యై న ప్రమదితవ్యం । స్వాధ్యాయప్రవచనాభ్యాం న ప్రమదితవ్యమ్ ॥ 1 ॥

దేవపితృకార్యాభ్యాం న ప్రమదితవ్యమ్ । మాతృదేవో భవ । పితృదేవో భవ । ఆచార్యదేవో భవ । అతిథిదేవో భవ । యాన్యనవద్యాని కర్మాణి తాని సేవితవ్యాని, నో ఇతరాణి । యాన్యస్మాకం సుచరితాని తాని త్వయోపాస్యాని నో ఇతరాణి ॥ 2 ॥

యే కే చాస్మచ్ఛ్రేయాంసో బ్రాహ్మణాస్తేషాం త్వయాసనేన ప్రశ్వసితవ్యం । శ్రద్ధయా దేయం । అశ్రద్ధయా దేయం । శ్రియా దేయం । హ్రియా దేయం । భియా దేయం । సంవిదా దేయం । అథ యదితే కర్మ విచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్ ॥ 3 ॥

యే తత్ర బ్రాహ్మణాః సమదర్శినో యుక్తా అయుక్తా అలూక్షా ధర్మకామాః స్యుర్యథా తే తత్ర వర్తేరన్ । తథా తత్ర వర్తేథాః । ఏష ఆదేశః, ఏష ఉపదేశః ఏషా వేదోపనిషత్ । ఏతదనుశాసనమ్ । ఏవముపాసితవ్యం । ఏవముచైతదుపాస్యమ్ ॥ 4 ॥ తైత్తిరీయ శిక్షావల్లి. 10.

1. ఆచార్యులు తమ అంతేవాసులైన శిష్యులకు, శిష్యురాండ్రకు ఈ క్రింది విధంగా ఉపదేశించాలి.

   "నీవు సదా సత్యన్నే పలకాలి. ధర్మాన్నే ఆచరించాలి. సోమరితనాన్ని వదలి చదువుతూ చదివించాలి. సంపూర్ణ బ్రహ్మచర్యంతో సమస్త సత్యవిద్యలను గ్రహించి, ఆచార్యులకు ప్రియధనమొసగి, వివాహ మొనర్చుకొని సంతానాన్ని పొందండి. పొరపాటున కూడా సత్యాన్ని వీడకండి. ధర్మాన్ని త్యజించకండి. ఆరోగ్యాన్ని, చాతుర్యాన్ని నాశనం చేసుకోకండి. ఉత్తమ ఐశ్వర్యవృద్ధిని వీడకండి. పఠనపాఠనాలను ఏ మాత్రం వదలకండి.

2. దేవతలైన విద్వాంసులను, మాతాపితలను సేవించి పూజించుటలో పొరపాటును చేయకండి. విద్వాంసులను సత్కరించునట్లు మాతాపితలను, ఆచార్యులను, అతిథిజనులను సేవించి సత్కరించండి. అనిందితాలైన సత్యభాషణాది ధర్మయుక్తకార్యాలను చేయండి. వీటికి భిన్నంగా చేయకండి. మా సుచరిత్రం అనగా మేము చేయు ధర్మయుక్త మంచి కార్యాలను గ్రహించండి. మాలో గల పాపాచరణాలను ఎన్నడూ గ్రహించకండి.

3. సభలలో ఉత్తమ విద్వాంసులు, ధర్మాత్ములు అయిన బ్రాహ్మణుల సమీపంలో కూర్చొవాలి. వారినే విశ్వసించాలి. శ్రద్ధతో, అశ్రద్ధతోనైనా దానం ఇవ్వాలి. ప్రసన్నతతో ఇవ్వాలి. సిగ్గుతో ఇవ్వాలి. భయంతో ఇవ్వాలి. దృఢ ప్రతిజ్ఞతో ఇవ్వాలి. ఎప్పుడైనా మీకు కర్మను గురించి, శీలాన్ని గురించి, ఉపాసన గురించి, జ్ఞానాన్ని గురించి ఏ విధమైన సంశయం కలిగినా –

4. వివేకవంతులు, సమదర్శులు, పక్షపాతరహితులు, యోగులు, ఆర్ద్రచిత్తులు, ధర్మాభిలాషులు అయిన ధర్మాత్ములు చరించిన ధర్మమార్గంలో ప్రవర్తించండి. ఇదే ఆదేశం - ఆజ్ఞ. ఇదే సందేశం, ఇదే వేదోపనిషత్తు. ఇదే శిక్ష. దీనిని అనుసరించి ప్రవర్తించి మీ ప్రవర్తనను, జీవితాన్ని చక్కబరచుకొండి.

అకామస్య క్రియాకాచిద్దృశ్యతే నేహ కర్హిచిత్ ।
యద్యద్ధికురుతే కించిత్ తత్తత్కామస్య చేష్టితమ్ ॥ మను. 1-108, 109 ॥

లోకంలో కోరికలేకుండా ఏ పనీ జరుగదు. మనిషి చేసే ప్రతిక్రియ కామం యొక్క వ్యాపారమేకాని, వేరుకాదు.

ఆచార మహత్త్వం

ఆచారః పరమో ధర్మః శ్రుత్యుక్తః స్మార్త ఏవ చ ।
తస్మాదస్మిన్ సదా యుక్తో నిత్యం స్యాదాత్మవాన్ ద్విజః ॥ మను. 1-108 ॥

ఆచారాద్విచ్యుతో విప్రో న వేదఫలమశ్నుతే
ఆచారేణ తు సంయుక్తః సంపూర్ణఫలభాగ్భవేత్ ॥ మను. 1-109 ॥

వేదాలలో, వేదానుకూల స్మృతులలో ప్రతిపాదించబడిన ధర్మాచరణమొనర్చుట, అదే చెప్పుట, వినుట, వినిపించుట, చదువుట, చదివించుట, చేయుట చేయించుట ఇదే ధర్మం. కావున ఎల్లప్పుడూ ధర్మాచరణపరులు కావాలి. ధర్మాచరణరహితుడు వేదాలలో ప్రతిపాదింపబడిన ధర్మం వలన కలుగు సుఖరూప ఫలాన్ని పొందలేడు. విద్య నేర్చుకొని ధర్మాచరణ చేసేవాడే సంపూర్ణ సుఖాన్ని పొందుతాడు.

యోఽవమన్యేత తే మూలే హేతుశాస్త్రాశ్రయాద్ద్విజః
స సాధుభిర్బహిష్కార్యో నాస్తికో వేదనిందకః ॥ మను. 2-11 ॥

వేదాలను, ఆప్తులు రచించిన వేదానుకూలమైన శాస్త్రాలను అగౌరవపరచు వేదనిందకులైన నాస్తికులను జాతినుండి, సహపంక్తినుండి, దేశంనుండి బహిష్కరించాలి. ఎందుకంటే:-

ధర్మ లక్షణాలు

శ్రుతిః స్మృతిః సదాచారః స్వస్య చ ప్రియ మాత్మనః ।
ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్ ॥ మను. 2-12 ॥

1. **శృతిః** = వేదం; 2. **స్మృతిః** = వేదానుకూలమైన ఆప్తోక్తములైన మనుస్మృత్యాది శాస్త్రాలు; **3. సదాచారః** = సత్పురుషుల సనాతన ఆచారాలు అనగా వేదం ద్వారా పరమేశ్వర ప్రతిపాదిత కర్మలు; **4. స్వస్య చ ప్రియమాత్మనః** = తన ఆత్మకు ప్రియమైన సత్యభాషణం అను ఈ నాలుగు ధర్మ లక్షణాలు. వీని ద్వారానే ధర్మాధర్మాల నిర్ణయం జరుగుతుంది. "**పక్షపాత రహిత న్యాయం, సత్యగ్రహణం,**

సర్వథా అసత్యపరిత్యాగం" అను ఆచారమే ధర్మం. దీనికి భిన్నంగా "పక్షపాతం గల అన్యాయ ఆచరణం, సత్యాన్ని పరిత్యజించటం, అసత్యాన్ని గ్రహించటం అను కర్మలే అధర్మం".

ధర్మానికి వేదప్రమాణం

అర్థకామేష్వసకానాం ధర్మజ్ఞానం విధీయతే ।
ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం పరమం శ్రుతిః ॥ మను. 2-13 ॥

సువర్ణాది ఆభరణాలను ధరించటం, స్త్రీ సేవనాదులలో తగుల్కొననివానికే ధర్మజ్ఞానం కలుగుతుంది. ధర్మజ్ఞానాన్ని తెలుసుకొనదలచినవారు వేదాల మూలంగా ధర్మాన్ని నిర్ణయించుకోవాలి. వేదాలు లేకుండా ధర్మ అధర్మ నిర్ణయం కలుగదు.

ఈ విధంగా ఆచార్యుడు తన శిష్యులకు ఉపదేశించాలి. విశేషించి రాజు క్షత్రియులకువైశ్యులకు, ఉత్తమ శూద్రులకు విద్యాభ్యాసం తప్పక చేయించాలి. బ్రాహ్మణులే విద్యాభ్యాసమొనర్చి మిగతా క్షత్రియాదులు విద్య నభ్యసించకన్న విద్య, ధర్మం, రాజ్యం, ధనాదులు ఎప్పటికీ వృద్ధి చెందవు. బ్రాహ్మణులే రాజుల దగ్గర ఉద్యోగం సంపాదించుకుంటే వారు రాజులకు లోబడి ఉంటారు. బ్రాహ్మణులు ధనాదులకు లోబడితే అన్ని వర్ణాలూ చెడిపోతాయి. పైగా మిగతా వారు చదువుకోనందున వారు స్వాధ్యాయాన్ని వదిలేస్తారు. క్షత్రియాదులు విద్యావంతులైనచో బ్రాహ్మణులు అధికవిద్యాభ్యాసం చేసి ధర్మమార్గాన్ని పొందుతారు. క్షత్రియాది విద్వాంసుల ముందు వారు పాషండాది అసత్యవ్యవహారాలను చేయలేరు. క్షత్రియాదులు అవిద్వాంసులైతే బ్రాహ్మణులు తమ ఇష్టం వచ్చినట్లు చేస్తూ, చేయిస్తూ ఉంటారు. బ్రాహ్మణులు లోక కళ్యాణాన్ని కోరి క్షత్రియాదులకు వేదాది సత్యశాస్త్రాలను నేర్పించాలి. విద్యను, ధర్మాన్ని, రాజ్యాన్ని, ఐశ్వర్యాన్ని అభివృద్ధిపరచేవారు క్షత్రియాదులే. వారెన్నడూ భిక్షావృత్తిని అవలంబించరు. కాబట్టి వారు విద్యావ్యవహారాలలో పక్షపాతం కలిగి ఉండరు. సమస్త వర్ణాలవారు విద్యావంతులై, సుశిక్షితులై ఉన్న పాషండరూపమైన అధర్మయుక్త మిథ్యావ్యవహారాలను ఎవ్వరూ నడుపలేరు.

"క్షత్రియాదులను నియమంలోనడుపువారు 'బ్రాహ్మణులు, సన్న్యాసులు'. అట్లే ఆ బ్రాహ్మణులను, సన్న్యాసులను నియమంలో ఉంచేవారు క్షత్రియాదులు" అని దీనివలన తెలుస్తున్నది. కాబట్టి సమస్త వర్ణాల స్త్రీపురుషులలో విద్యా ధర్మాల ప్రచారం తప్పక జరగాలి.

అధ్యయనాధ్యాపనంలో పంచవిధ పరీక్షలు

అధ్యయనాన్ని - అధ్యాపనాన్ని బాగా పరీక్షించి జరపటం చాలా మంచిది. ఈ పరీక్షలు ఐదు విధాలు.

మొదటిది : ఈశ్వరుని గుణకర్మస్వభావాలకు, వేదాలకు అనుకూలమైనది సత్యం. తద్విరుద్ధమైనది అసత్యం అని తెలుసుకోవాలి.

రెండవది : సృష్టి క్రమానికి అనుకూలమైనది సత్యం. దానికి వ్యతిరేకమైనది అసత్యం. ఉదా:- తల్లిదండ్రుల సంయోగం లేకనే పుత్రుడు పుట్టాడని ఎవరేని చెప్పిన, అది సృష్టిక్రమానికి విరుద్ధమవటం వలన సర్వథా అసత్యమే.

మూడవది : ధార్మికులైన విద్వాంసులు, సత్యవాక్పరిపాలకులు, కపటరహితులైనవారు 'ఆప్తులు' అనబడతారు. వారి ఉపదేశాలకు అనుకూలమైనది గ్రాహ్యం. దానికి వ్యతిరేకమైనది అగ్రాహ్యం.

నాల్గవది : తన ఆత్మ పవిత్రతకు, విద్యకు అనుకూలమైనది సత్యం. అనగా, తనకు దుఃఖం అయిష్టమైనట్లు ఇతరులకు తనకు ఇష్టమైనది కూడా సుఖాన్ని కలిగిస్తుందని గుర్తించటం.

ఐదవది : "ప్రత్యక్షం, అనుమానం, ఉపమానం, శబ్దం, ఐతిహ్యం, అర్థాపత్తి, సంభవం, అభావం" అను ఎనిమిది ప్రమాణాలు ఉన్నాయి. ఈ పరీక్షలద్వారా పఠన పాఠనాలను పరీక్షించుకోవాలి.

ప్రమాణ లక్షణాలు

ఈ ప్రత్యక్షాది ప్రమాణాలకు ఈ క్రింద వ్రాయబడిన లక్షణ సూత్రాలు న్యాయశాస్త్ర ప్రథమ, ద్వితీయ అధ్యాయాలకు చెందినవి.

1. ప్రత్యక్షం : **ఇంద్రియార్థసన్నికర్షోత్పన్నం జ్ఞానమవ్యపదేశ్య మవ్యభిచారి వ్యవసాయాత్మకం ప్రత్యక్షమ్** ॥ న్యా. అ1 - ఆ1, సూ 4 ॥

శ్రోత్రం (చెవి), త్వక్కు (చర్మం), చక్షువు (కన్ను), జిహ్వా (నాలుక), ఘ్రాణం (ముక్కు) అను ఈ ఐదు ఇంద్రియాలకు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలతో అవ్యవహిత సంబంధం అనగా ఆవరణ రహితమైన సంబంధం కలిగినపుడు ఆ ఇంద్రియాలతో మనస్సుకు, మనస్సుతో ఆత్మకు సంయోగం కలిగినపుడు 'ఇది పటం', 'ఇది ఘటం' అను జ్ఞానం కలుగుతుంది. దానినే ప్రత్యక్షమంటారు. కానీ అది వ్యపదేశ్యం అనగా సంజ్ఞాసంజ్ఞి (సాంకేతిక) సంబంధం వలన ఏర్పడు జ్ఞానంవలె ఉండకూడదు. ఉదాహరణకు జలం తెమ్మని ఒకడనగా వాడు జలనామం గల పదార్థాన్ని తెచ్చి సమీపంలో ఉంచుట ప్రత్యక్షమనబడును. అలా కాక **'జ-ల-ము'** అను అక్షరాలు వ్రాసి తెచ్చిన జలమను పదార్థం ప్రత్యక్షం కాదు. శబ్దంచే కలుగు జ్ఞానం శబ్దప్రమాణ విషయమవుతుంది. ఈ ప్రత్యక్షం **'అవ్యభిచారి'**గా ఉండాలి.

అవ్యభిచారి: ఎవరైనా రాత్రివేళ ఒక స్తంభాన్ని గాంచి పురుషుడని తలంచిరనుకొండి. దానిని పగటిపూట చూచినపుడు రాత్రివేళ తలంచిన పురుషజ్ఞానం నశించి స్తంభజ్ఞానం కలుగుతుంది. ఇలా వినాశమైన జ్ఞానాన్ని **'వ్యభిచారి'** అంటారు. ప్రత్యక్షజ్ఞానం ఇట్టి వినాశజ్ఞానంగా ఉండరాదు. మరియు ఇది **'వ్యవసాయాత్మకం'**గా ఉండాలి.

వ్యవసాయాత్మకం: ఒకడు దూరంలో ఉండి నదీ సమీపంలో ఇసుకను చూసి 'అక్కడ వస్త్రాలా లేక ఎండనా? జలమా? లేక ఏదైననా?' అని కానీ 'అక్కడ నిలిచున్నవాడు దేవదత్తుడా?' లేక యజ్ఞదత్తుడా? అని గాని సంశయంగా పలికిన అది ప్రత్యక్షజ్ఞానం కాదు. సంశయాత్మక జ్ఞానం ప్రత్యక్షం అనబడదు. కాబట్టి అవ్యపదేశ్యం, అవ్యభిచారి. నిశ్చయాత్మకం అయిన జ్ఞానమే ప్రత్యక్ష జ్ఞానం అనబడుతుంది.

(2) అనుమానం: అథ తత్పూర్వకమ్ త్రివిధమనుమానం
పూర్వవచ్ఛేషవత్సామాన్యతో దృష్టం చ ॥
న్యాయ. అ1 ఆ1 సూ-5 ॥

ప్రత్యక్షపూర్వకం - అనగా ఒక వస్తువు సంపూర్ణంగా గాని లేక దాని యొక భాగంగా గాని ఎక్కడో ఒకచోట, ఎప్పుడో ఒకప్పుడు కనబడియుండి తర్వాత మరొకచోట ఆ వస్తువు యొక్క ఒక భాగం కనబడినచో మిగత కనబడని పదార్థంయొక్క జ్ఞానం కలుగుట **'అనుమానం'** అనబడుతుంది. ఉదా: పుత్రుని చూచి తండ్రిని, పర్వతాదులలోని పొగను చూచి అగ్నిని, లోకంలోని సుఖదుఃఖాలను చూసి పూర్వజన్మను తెలుసుకొంటాము. ఇలాంటి జ్ఞానం దేనివలన కలుగుతుందో అదే **'అనుమాన ప్రమాణం'** అనబడుతుంది.

ఈ అనుమాన ప్రమాణం మూడు విధాలు

(అ) పూర్వవదనుమానం: పూర్వ = కారణ, 'పూర్వవత్ అనుమానం - కారణవత్ అనుమానం' అనగా కారణం చూసినచో కార్యజ్ఞానం కలగటం. ఉదా: మేఘాలను చూసి వర్షాన్ని, వివాహాన్ని చూసి సంతానోత్పత్తిని, చదివే విద్యార్థిని చూసి విద్యను నిశ్చయిస్తాము. కారణ దర్శనంలో కార్యజ్ఞానం కలగటం **'పూర్వవత్'** అనుమానం.

(ఆ) శేషవదనుమానం: శేషం = కార్యం. కార్యప్రత్యక్షంవలన కలుగు కారణ జ్ఞానం శేషవదనుమానం. అంటే కార్యాన్ని చూసి కారణాన్ని తెలుసుకోవటం **'శేషవత్'** అనుమానం అనబడుతుంది.

ఉదా: నదీప్రవాహం ఉప్పొంగుట చూసి పైన కురిసిన వర్షాన్ని, పుత్రుని చూసి తండ్రిని, సృష్టిని చూచి అనాది కారణాన్ని, తత్కర్తయైన ఈశ్వరుని, సుఖదుఃఖాలను చూసి పాపపుణ్యాలు కారణాలని తెలుసుకోవటం. ఈ జ్ఞానాలు అన్నీ **'శేషవదనుమాన ప్రమాణం'** వల్లనే కలుగుతాయి.

(ఇ) సామాన్యతోదృష్టానుమానం: సామాన్యం = సాధర్మ్యం - సమాన ధర్మం. దీని ప్రత్యక్షంవలన కలిగిన జ్ఞానం **'సామాన్యతోదృష్టానుమానం'** అనబడుతుంది.

ఒకటి మరొకదానికి కార్యంగాని, కారణంగాని కాకున్నా, ఆ రెండింటికీ ఏదో ఒక సమాన ధర్మం ఉంటుంది. ఉదా: నడువకపోతే ఎవరూ ఒక స్థలం నుండి మరొక స్థలానికి పోలేరు. ఇలాగే ఇతరులు నడువకుండా పరస్థలానికి వెళ్లలేరని ఊహించటం.

అనుమాన శబ్దార్థం: "అను అర్థాత్ ప్రత్యక్షస్య పశ్చాన్మీయతే జ్ఞాయతే యేన తదనుమానమ్" అను = తరువాత – ప్రత్యక్షం తరువాత దేని మూలాన ఊహించి విషయం తెలిసికొనబడుతుందో అది **'అనుమాన ప్రమాణం'** అనబడుతుంది. ప్రత్యక్షానంతరం ఉత్పన్నమవటం వలన దీనిని **'అనుమానం'** అంటారు. పొగను ప్రత్యక్షంగా చూడకుండా కనబడని అగ్ని జ్ఞానం కలుగదు. కొంత ప్రత్యక్షమైన తర్వాతనే**'అనుమానం'** కలుగుతుంది. ఇలా ధూమం – పొగ ప్రత్యక్షమవుతుంది. తదుపరి కనబడని అగ్నిజ్ఞానం కలుగుతుంది. ధూమం అనుమాన ప్రమాణం. అలా అగ్ని ఉన్నదనే జ్ఞానం అనుమితి = అనుమాన ప్రమాణం వలన కలిగిన జ్ఞానం.

(3) ఉపమానం: ప్రసిద్ధసాధర్మ్యాత్ సాధ్యసాధన ముపమానమ్ ॥

న్యా.అ1–ఆ1, సూ. 6 ॥

ప్రసిద్ధమైన సాధర్మ్యప్రత్యక్షం వలన సిద్ధపరచలేని సాధ్యాన్ని – అంటే – సాధించవలసిన పదార్థం యొక్క జ్ఞానాన్ని కలిగించే సాధనాన్ని **'ఉపమానం'** అంటారు. **"ఉపమీయతే యేన తదుపమానమ్"** దేనితో ఉపమింపబడుతుందో అది ఉపమానమనబడుతుంది. ఒకడు తన సేవకునితో **"విష్ణు మిత్రుని పిలువు"** అన్నాడు. అపుడతడు "నేను అతనిని ఎన్నడూ చూడలేద"ని పలికాడు. అప్పుడు ఆ యజమాని "దేవదత్తుని వలెనే విష్ణుమిత్రుడుండు"నని పలుకగా అతడు వెళ్ళి దేవదత్తుని వంటి వ్యక్తిని విష్ణుమిత్రుడని నిశ్చయించుకొని పిలుచుకొని వచ్చాడు. ఇలానే గోవు వలె "గవయ" మృగముండునని చెప్పగా అడవికేగి ఆవువలెనే ఉండు జంతువును చూసి అది 'గవయ'మని అనుకున్నాడు. దీనిని ఉపమానమంటారు.

(4) శబ్దప్రమాణం: ఆప్తోపదేశః శబ్దః ॥ న్యా. అ1 – ఆ1, సూ 7 ॥

ఆప్తుని ఉపదేశం శబ్దప్రమాణం. ఉపదేశమనగా వాక్యం. పూర్ణ విద్వాంసుడు, ధర్మాత్ముడు, పరోపకార ప్రియుడు, సత్యవాది, పురుషార్థి, జితేంద్రియుడు, తాను తెలుసుకొన్న దానిని, సుఖపడిన దానిని ఇతరులకు చెప్పాలనే కోరికతో ప్రేరితుడై సర్వమానవుల కళ్యాణార్థం ఉపదేశించేవాడు, పృథ్వీ నుండి పరమేశ్వరుని వరకు గల సర్వపదార్థాల జ్ఞానాన్ని కలిగి ఉపదేశించేవాడు**'ఆప్తుడు'** అనబడుతాడు. ఇట్టి పురుషుని ఉపదేశం, పూర్ణాప్తుడగు పరమేశ్వరుని ఉపదేశమైన వేదం**'శబ్దప్రమాణం'** అనబడుతుంది.

(5) ఐతిహ్యం:– న చతుష్ట్వమైతిహ్యార్థాపత్తి సంభవాభావ ప్రామాణ్యాత్ ॥

న్యా.అ2–ఆ2, సూ1 ॥

"ఇతి హ ఆస" అనగా 'ఇలా ఉంది'. **'అతడు ఇలా చేసాడు'** అని చెప్పబడు ఒకానొక పురుషుని జీవన చరిత్రం **'ఐతిహ్యం'** అనబడుతుంది. ప్రమాణాలు నాలుగే కాదు. ఐతిహ్యం, అర్థాపత్తి, సంభవం, అభావం అని మరి నాలుగు ప్రమాణాలున్నాయి అని సూత్రాభిప్రాయం.

(6) అర్థాపత్తి:– "అర్థాదాపద్యతే సా అర్థాపత్తిః" కేనచిదుచ్యతే 'సత్సు ఘనేషు వృష్టిః **సతికారణే కార్యం భవతీతి. కిమత్ర ప్రసజ్యతే. అసత్సు ఘనేషు వృష్టిరసతి కారణే చ కార్యం న**

భవతీతి' ఒకడు ఒకనితో ఇలా అన్నాడు. "మేఘాలుంటే వర్షం పడుతుంది. కారణాలుంటే కార్యమవుతుంది. ఈ వాక్యం వలన మేఘాలు లేకుండా వర్షం కురియనట్లు కారణం లేకుండా కార్యం జరుగ"దనీ చెప్పకుండానే తెలుస్తుంది. ఇదే అర్థాపత్తి. ఒక వాక్యార్థం వలన మరొక జ్ఞానం కలుగుతుంది. అందుకు వేరే వాక్యం ప్రయోగింపనవసరం లేదని భావం.

(7) సంభవం:- "సంభవతి యస్మిన్ స సంభవః" సృష్టి క్రమానికి అనుకూలమైనది సంభవం. దానికి విరుద్ధమైనది అసంభవం. ఉదా: 'తల్లిదండ్రులు లేకుండా సంతానం కలిగింది. చచ్చినవానిని బ్రతికించారు. పర్వతాన్ని ఎత్తాడు. సముద్రంలో రాళ్ళను తేల్చాడు. చంద్రున్ని ముక్కలుగా చేసాడు. పరమేశ్వరుడు అవతారమెత్తాడు. మానవునికి కొమ్ములుండుట చూచాను. గొడ్రాలు తన కుమారునికి లేదా కుమార్తెకు వివాహం చేసింది' అని ఇలా ఎవరేని అన్నా అవన్నీ అసంభవాలని తెలుసుకోవాలి. ఇవన్నీ సృష్టిక్రమానికి విరుద్ధాలు. దేనితో ఏది కలుగునో అది సంభవం. అవినాభావి అయిన ఒకదాని సత్తాగ్రహణం వలన మరొక దాని సత్తాగ్రహణం సంభవమనబడుతుంది.

(8) అభావం:- 'న భవతి యస్మిన్ సోఽ భావః' లేనిది అభావమనబడుతుంది. ఒకడు ఒకనితో 'ఏనుగును తెమ్మన్నాడు. అక్కడ ఏనుగు లేనందున అతడు దానిని ఉన్నచోటు నుండి తెచ్చాడు.

ఇలా ప్రమాణాలు ఎనిమిది విధాలు. శబ్దప్రమాణంలో ఐతిహ్యం, అనుమాన ప్రమాణంలో 'అర్థాపత్తి, సంభవ, అభావాలను' చేర్చి గణించిన నాలుగే ప్రమాణములవుతాయి. ఇట్టి ఐదు విధాల పరీక్షలతో సత్యాసత్యాల నిర్ణయం చేయవచ్చును. మరొక విధంగా చేయ వీలు లేదు.

పదార్థతత్త్వజ్ఞానం వలన మోక్షప్రాప్తి

ధర్మ విశేషప్రసూతాత్ ద్రవ్యగుణ కర్మ సామాన్య విశేష సమవాయానాం పదార్థానాం సాధర్మ్య వైధర్మ్యాభ్యాం తత్త్వజ్ఞానాన్నిఃశ్రేయసమ్ । వైశేషికం అ1 - ఆ1, సూ 4 ॥

మానవుడు ధర్మాన్ని యథాయోగ్యంగా విధిపూర్వకంగా అనుష్ఠించినందువలన పవిత్రుడై పదార్థాలలోని సాధర్మ్య వైధర్మ్య జ్ఞానంతో వాని తత్త్వజ్ఞానం - స్వరూపాన్ని తెలిసికొన్నందుకు నిఃశ్రేయసం - ముక్తిని పొందుతాడు.

పదార్థాల సాధర్మ్యం - సమాన ధర్మం, వైధర్మ్యం - విరుద్ధ ధర్మాన్ని తెలుసుకొన్నప్పుడే వాని స్వరూప జ్ఞానం కలుగుతుంది.

'ద్రవ్యాలు, గుణాలు, కర్మలు, సామాన్యాలు, విశేషాలు, సమవాయం' అనేవి ఆరు పదార్థాలు. అందు పృథివ్యాదులు ద్రవ్యాలు, రూపరసాదులు గుణాలు. ఉత్క్షేపణాదులు క్రియలు. ద్రవ్యత్వాదులు సామాన్యాలు. సమవాయం సంబంధం విశేషాలు - పరమాణుగతాలు. వీటిలోగల సాధర్మ్య వైధర్మ్యాలను వాటి స్వరూపాన్ని తెలుసుకొంటే గాని మోక్షం సిద్ధించదని సూత్రాభిప్రాయం.

సాధర్మ్యం అనగా తుల్యధర్మం. పృథ్వి జడం, జలం జడం. ఈ జడత రెండింటిలోని తుల్య ధర్మం. పృథ్వి కఠోరం. జలం కోమలం. కఠినత, కోమలత అనేవి ఈ రెండింటిలోని విరుద్ధ ధర్మాలు – వైధర్మ్యాలు. ఇలా ద్రవ్య, గుణ, కర్మ సామాన్య, విశేష సమవాయాలు ఏడు పదార్థాల తత్త్వ స్వరూప జ్ఞానం వలన మోక్షం సిద్ధిస్తుంది.

ద్రవ్యాలు: పృథివ్యాఽఽపస్తేజోవాయురాకాశం కాలోదిగాత్మా మన ఇతి ద్రవ్యాణి ॥

వైశేషిక అ1–ఆ1, సూ5 ॥

"పృథ్వి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, కాలం, దిక్కు ఆత్మ, మనస్సు" అని ద్రవ్యాలు తొమ్మిది విధాలు.

ద్రవ్య లక్షణాలు:

క్రియాగుణవత్సమవాయికారణమితి ద్రవ్యలక్షణమ్ ॥ వైశేషిక అ1 – ఆ1, సూ 15 ॥

'క్రియాశ్చ గుణాశ్చ విద్యంతే యస్మిన్ తత్ క్రియాగుణవత్' క్రియలు, గుణాలు మరియు కేవలం గుణాలు కలది ద్రవ్యం. 'పృథ్వి, జలం, అగ్ని, వాయువు, మనస్సు, ఆత్మ' అను ఈ ఆరు ద్రవ్యాలు క్రియలు, గుణాలు కలవి. 'ఆకాశం, కాలం, దిశ' అను ఈ మూడు క్రియలు లేకుండా కేవలం గుణాలు కలవి.

సమవాయి:– 'సమవేతుం శీలం యస్య తత్సమవాయి. ప్రాగ్వృత్తిత్వం (కారణం) కారణత్వం, సమవాయి చ తత్కారణం చ = సమవాయి కారణం' 'లక్ష్యతే యేన తల్లక్షణమ్' తన కారణాలలో విడదీయడానికి వీలుకాని సమవాయ బంధంలో కలియు స్వభావం కలది సమవాయి. కార్యానికి పూర్వముండేది కారణం. దానినే ద్రవ్యమంటారు. నేత్రముతో రూపం గ్రహించబడినట్లు దేనితో లక్ష్యం గ్రహింపబడునో అది 'లక్షణం' అనబడుతుంది.

ద్రవ్యాలు వాని లక్షణాలు

రూపరసగంధస్పర్శవతీ పృథివీ ॥ వైశేషిక అ2 – ఆ1, సూ 1 ॥

'రూపం, రసం, గంధం, స్పర్శ' అను గుణాలు కలది పృథ్వి. దానిలో గల రూప, రస స్పర్శలు అగ్ని, జల, వాయువుల కలయికతో ఏర్పడ్డాయి.

వ్యవస్థితః పృథివ్యాం గంధః ॥ వైశేషిక అ2 – ఆ2, సూ 2 ॥

పృథ్విలో 'గంధం' స్వాభావిక గుణం. అలాగే జలంలో రసం, అగ్నిలో రూపం, వాయువులో స్పర్శ, ఆకాశంలో శబ్దం స్వాభావికాలు.

రూపరస స్పర్శవత్య ఆపో ద్రవాః స్నిగ్ధాః ॥ వైశేషిక అ2 – ఆ1, సూ 2 ॥

రూప, రస, స్పర్శలు; ద్రవత్వం, కోమలత్వాన్ని కలది జలం. జలానికి స్వాభావిక గుణం 'రసం' మాత్రమే. రూప, స్పర్శలు అగ్నివాయువుల కలయికతో కలిగినవి.

అప్పు శీతతా ॥ వైశేషిక అ2 - ఆ2, సూ 5 ॥

జలానికి శీతలత్వం స్వాభావిక గుణం.

తేజో రూపస్పర్శవత్ ॥ వైశేషిక అ2 - ఆ1, సూ 3 ॥

రూపం, స్పర్శ కలది అగ్ని. 'రూపం' అగ్ని యొక్క స్వాభావిక గుణం. స్పర్శ గుణం వాయువు కలయికతో ఏర్పడింది.

స్పర్శవాన్ వాయుః ॥ వైశేషిక అ2 - ఆ1, సూ 4 ॥

వాయువు 'స్పర్శ' గుణం కలది. దీనిలో ఉండు ఉష్ణత్వ, శీతలత్వాలు అగ్ని జలాల సంయోగంతో కలుగుతుంది.

త ఆకాశే న విద్యంతే ॥ వైశేషిక అ2 - ఆ1, సూ 5 ॥

రూపం, రసం, గంధం, స్పర్శ అను గుణాలు ఆకాశంలో లేవు. కాని 'శబ్దం' మాత్రం ఆకాశం యొక్క గుణం.

నిష్క్రమణం ప్రవేశనమిత్యాకాశస్య లింగమ్ ॥ వైశేషిక అ2 - ఆ1, సూ 20 ॥

ప్రవేశించుటకు, వెడలుటకు వీలు కలది ఆకాశం.

కార్యాంతరాప్రాదుర్భావాచ్చ శబ్దః స్పర్శవతామగుణః ॥ వైశేషిక అ2 - ఆ1, సూ 25 ॥

ఇతర పృథ్వీ మొదలైన కార్యాలలో ప్రకటం కానందున 'శబ్దం' స్పర్శాది గుణాలు గల భూమ్యాదుల గుణం కాదు. అది ఆకాశ గుణమే.

అపరస్మిన్నపరం యుగపచ్చిరం క్షిప్రమితి కాలలింగాని ॥ వైశేషిక అ2 - ఆ2, సూ 6 ॥

ముందు, వెనుక, ఒకేసారి, ఆలస్యం, శీఘ్రం మొదలైన ప్రయోగాలు దేనిలో జరుగుతాయో దానిని 'కాలం' అంటారు.

నిత్యేష్వభావాదనిత్యేషు భావాత్కారణే కాలాఖ్యేతి ॥ వైశేషిక అ2 - ఆ2, సూ 9 ॥

నిత్య పదార్థాలలో ఉండక, అనిత్య పదార్థాలలో ఉండేది కాబట్టి కారణానికే కాలసంజ్ఞ కలదు.

ఇత ఇదమితి యతస్తద్దిశ్యం లింగమ్ ॥ వైశేషిక అ2 - ఆ2, సూ 10 ॥

ఇట నుండి ఇది తూర్పు, దక్షిణం, పడమర, ఉత్తరం, మీద, క్రింద అను వ్యవహారం దేనివలన కలుగుతుందో అది 'దిశ' అనబడుతుంది.

ఆదిత్యసంయోగాద్భూతపూర్వాద్భవిష్యతో భూతాచ్చ ప్రాచీ ॥ వైశేషిక అ2 - ఆ2, సూ 14 ॥

ప్రథమంలో ఏవైపున సూర్యుని సంయోగమవుతుందో ఇకముందు ఆ వైపునకు 'పూర్వదిశ - తూర్పు' అని పేరు. సూర్యుడు అస్తమించు దిశ పడమర అనబడుతుంది. పూర్వాభిముఖంగా నిలుచుంటే కుడిచేతివైపును దక్షిణమనీ, ఎడమచేతివైపును ఉత్తరమనీ చెబుతారు.

ఏతేన దిగంతరాలాని వ్యాఖ్యాతాని ॥ వైశేషిక అ2 - ఆ2, సూ 16 ॥

'తూర్పు దక్షిణలు కలిసిన మూల ఆగ్నేయం. దక్షిణ పడమరలు కలిసిన మూల నైఋతి. పడమర ఉత్తరాలు కలిసిన మూల వాయవ్యం, ఉత్తరం తూర్పు కలిసిన మూల ఈశాన్యం' అని చెప్పబడుతుంది.

ఆత్మ లక్షణం

ఇచ్ఛాద్వేష ప్రయత్న సుఖదుఃఖజ్ఞానాన్యాత్మనో లింగమితి ॥న్యాయ. అ1 - ఆ1, సూ 10 ॥

'ఇచ్ఛ, ద్వేషం, ప్రయత్నం, సుఖం, దుఃఖం, జ్ఞానం' అను ఈ ఆరు గుణాలు కలది జీవాత్మ వైశేషిక దర్శనంలో ఈ క్రింది విశేషాలున్నవి.

ప్రాణాఽపాననిమేషోన్మేషజీవన మనోగతీంద్రియాంతర్వికారాః సుఖ దుఃఖే చ్ఛాద్వేష ప్రయత్నాశ్చాత్మనోలింగాని ॥ వైశేషిక అ3 - ఆ2, సూ 4 ॥

ప్రాణః = లోపలి నుండి వాయువును వదలటం - నిఃశ్వాసం; అపానః = వెలుపలి నుండి వాయువును లోనికి తీసుకోవటం - ఉచ్ఛ్వాసం; నిమేషః = కంటిరెప్పలు వాల్చటం; ఉన్మేషః = రెప్పలు పైకెత్తటం; జీవనం = ప్రాణాన్ని ధరించటం; మనః = మననం చేయటం, అనగా ఆలోచనా జ్ఞానం; గతి = యథేష్టగమనం, ఇంద్రియాలు = విషయాలలో ఇంద్రియాలను చేర్చి వానిని గ్రహించటం; అంతర్వికారః = ఆకలి, దప్పిక, జ్వరము, పీడ మొదలైన వికారాలను చెందటం; సుఖం, దుఃఖం, ఇచ్ఛాద్వేష, ప్రయత్నాలు అనేవి అన్నీ ఆత్మ చిహ్నాలు - గుణాలు - లింగాలు.

యుగపత్ జ్ఞానానుత్పత్తిర్మనసో లింగమ్ ॥ న్యాయ అ1 - ఆ1, సూ 16 ॥

ఒకేసమయంలో రెండు పదార్థాల జ్ఞానాన్ని గ్రహించేది మనస్సు. ఇలాగే ద్రవ్యాల స్వరూపలక్షణాలు చెప్పబడ్డాయి. ఇపుడు గుణాలు చెప్పబడతాయి.

గుణ లక్షణం

రూపరసగంధస్పర్శాః సంఖ్యాః పరిమాణాని పృథక్త్వం సంయోగ విభాగౌ పరత్వాఽపరత్వే బుద్ధయః సుఖదుఃఖే ఇచ్ఛాద్వేషౌ ప్రయత్నాశ్చ గుణాః ॥ వైశేషిక అ1 - ఆ1, సూ 6 ॥

'రూప, రస, గంధ, స్పర్శలు, సంఖ్యలు పరిమాణాలు, పృథక్త్వం, సంయోగ విభాగాలు, పరత్వ అపరత్వాలు, బుద్ధులు, సుఖదుఃఖాలు, ఇచ్ఛాద్వేషాలు, ప్రయత్నాలు, గురుత్వ, ద్రవత్వ స్నేహ, సంస్కార, ధర్మ, అధర్మ, శబ్దాలు' అను ఈ 24 గుణాలు అని చెప్పబడ్డాయి.

ద్రవ్యాశయ్యగుణవాన్ సంయోగవిభాగేష్వకారణమనపేక్ష ఇతి గుణలక్షణమ్ ॥

వైశే. అ1 - ఆ2, సూ 16॥

తాను ద్రవ్యాన్ని ఆశ్రయించి, ఇతర గుణాలను ధరించక, సంయోగవిభాగాలకు కారణం కాక అంటే ఒకదానిని మరొకటి అపేక్షింపక ఉంచేది 'గుణం' అనబడుతుంది.

శ్రోత్రోపలబ్ధిర్బుద్ధినిర్గ్రాహ్యః ప్రయోగేణాऽభిజ్వలిత ఆకాశదేశః శబ్దః ॥ మహా భాష్యే ॥

చెవితో పొందదగినదై, బుద్ధితో గ్రహింపయోగ్యమై, ప్రయోగం వలన ప్రకటితమై, ఆకాశం నివాస స్థానంగా కలది 'శబ్దం' అనబడుతుంది. నేత్రముతో చూడబడునది 'రూపం'. జిహ్వాతో తెలుసుకోబడునది తీపి మొదలైనవి 'రసం'. ముక్కుతో తెలుసుకోబడునది 'గంధం'. చర్మంతో గ్రహించబడునది 'స్పర్శ'. ఒకటి, రెండు మొదలగు లెక్కకు ఆధారమైనది 'సంఖ్య'. తేలిక, బరువు అను తూనికను తెలిపేది 'పరిమాణం'. ఒకటి మరొకదాని నుండి వేరవటం 'పృథక్త్వం'. ఒకటి వేరొకదానితో కలవటం 'సంయోగం'. కలిసున్నవి అనేక ముక్కలుగా విడిపోవుట 'విభాగం'. దీనికిది ముందు అనేది 'పరం'. దీనికిది వెనుక అనేది 'అపరం'. మంచి చెడు జ్ఞానం కలిగించేది 'బుద్ధి'. ఆనందానికి 'సుఖం' అని పేరు. క్లేశానికి 'దుఃఖం' అని పేరు. 'ఇచ్ఛ' అంటే రాగం. 'ద్వేషం' అంటే విరోధం. 'ప్రయత్నం' అంటే అనేక విధాల పురుషార్థం. 'గురుత్వం' అంటే భారం. 'ద్రవత్వం' అంటే కరగటం. 'స్నేహం' అంటే ప్రీతి, జిగురుతనం. సంస్కారం అంటే ఇతర పదార్థ సంయోగంతో ఏర్పడు వాసన. 'ధర్మం' అంటే న్యాయాచరణం. 'అధర్మం' అంటే అన్యాయాచరణం. కఠినత్వానికి వ్యతిరేకమైనది కోమలత్వం. ఇవి ఇరువై నాలుగు (24) గుణాలు.

ఉత్క్షేపణమవక్షేపణమాకుంచనం ప్రసారణం గమనమితి కర్మాణి ॥

వైశేషిక అ1–ఆ1, సూ 7 ॥

ఉత్క్షేపణమ్ = పైకి ఎత్తడం; అవక్షేపణమ్ = క్రిందికి దింపడం; ఆకుంచనం = ముడుచుకోవటం; ప్రసారణం= వ్యాపింపజేయటం; గమనమ్ = వచ్చుట, పోవుట, తిరుగుట మొదలైనవి కర్మలనబడతాయి.

కర్మ లక్షణాలు

ఏకద్రవ్యమగుణం సంయోగవిభాగేష్వనపేక్షకారణమితి కర్మలక్షణమ్ ॥

వైశేషిక అ1–ఆ1,సూ 1 ॥

"ఏకం ద్రవ్యమాశ్రయః ఆధారో యస్య తదేకద్రవ్యం । న విద్యతే గుణో యస్య యస్మిన్ వా తదగుణం । సంయోగేషు విభాగేషుచాऽపేక్షారహితం కారణం తత్కర్మలక్షణమ్" అథవా యత్క్రియతే తత్కర్మ. లక్ష్యతే యేన తల్లక్షణమ్ । కర్మణో లక్షణం కర్మలక్షణమ్"

ఒక ద్రవ్యాన్ని ఆశ్రయించి, గుణరహితమై, సంయోగ విభాగాలను కలిగించటంలో అపేక్షారహితకారణం – క్రియ– 'కర్మ' అనబడుతుంది.

ద్రవ్యగుణకర్మణాం ద్రవ్యం కారణం సామాన్యమ్ ॥ వైశేషిక అ1–ఆ1, సూ 18 ॥

ద్రవ్యం – కార్యద్రవ్యాలకు, గుణాలకు, కర్మలకు సమవాయి కారణం. కాబట్టి ద్రవ్యగుణకర్మలకు మూడింటికీ ద్రవ్యం 'సామాన్యం'.

ద్రవ్యాణాం ద్రవ్యం కార్యం సామాన్యం ॥ వైశేషిక అ1–ఆ1, సూ 23 ॥

ద్రవ్యం వలన ద్రవ్యాలు పుడతాయి. మృత్తిక వలన ఘటం, తంతువుల వలన పటం (వస్త్రం) కాబట్టి ద్రవ్యం వలన కార్యద్రవ్యాలు పుట్టడం 'సామాన్య ధర్మం'.

ద్రవ్యత్వం గుణత్వం కర్మత్వం చ సామాన్యాని విశేషాశ్చ ॥ వైశేషిక అ1–ఆ2, సూ 5 ॥

"ద్రవ్యాలలో ద్రవ్యత్వం, గుణాలలో గుణత్వం, కర్మలలో కర్మత్వం" అనేవి సామాన్యాలనీ, విశేషాలనీ చెప్పబడతాయి. ద్రవ్యాలలో ద్రవ్యత్వం సామాన్యం. గుణత్వ కర్మత్వాలకన్న ద్రవ్యత్వం విశేషం. ఇలాగే సర్వత్ర తెలుసుకోవాలి.

సామాన్యం విశేష ఇతి బుద్ధ్యపేక్షమ్ ॥ వైశేషిక అ7–ఆ2, సూ 3 ॥

'సామాన్యం, విశేషం' అనునవి బుద్ధిని అపేక్షించి ఉంటవి. మనుష్యలలో మనుష్యత్వం సామాన్యం. ఇది పశుత్వాదులకంటే విశేషం. స్త్రీత్వ పుంస్త్వాలలో బ్రాహ్మణత్వ, క్షత్రియత్వ, వైశ్యత్వ శూద్రత్వాలు కూడ విశేషాలే. బ్రాహ్మణులలో బ్రాహ్మణత్వం సామాన్యం. ఇది క్షత్రియాదులను బట్టి విశేషం. ఇదేవిధంగా అంతట ఊహించవచ్చును..

సమవాయ లక్షణం

ఇహేదమితి యతః కార్యకారణయోః స సమవాయః ॥ వైశేషిక అ7–ఆ2, సూ 26 ॥

కారణాలలో అంటే 'అవయవాలలో అవయవి', కార్యాలలో 'క్రియ క్రియావంతం', 'గుణం గుణి', 'జాతి – వ్యక్తి', 'కార్యం కారణం', 'అవయవం అవయవి' అను వీనిలో పరస్పరం కలిసి ఉన్నట్లు చేసే నిత్య సంబంధమే 'సమవాయం' అనబడుతుంది. ఇతర వేరు వేరు ద్రవ్యాలకు గల పరస్పర సంబంధం 'సంయోగం అనబడుతుంది. ఈ సంయోగసంబంధం అనిత్యం.

ద్రవ్యగుణయోః సజాతీయారంభకత్వం సాధర్మ్యమ్ ॥ వై.శే.అ.1.ఆ.1.సూ.9 ॥

ద్రవ్యానికి గుణానికి గల సమాన జాతీయ కార్యారంభాన్ని 'సాధర్మ్యం' అంటారు. పృథ్విలో జడత్వ ధర్మాన్ని ఘటాదికార్యోత్పాదకత్వ స్వసదృశ ధర్మమున్నట్లు జలంలో జడత్వం, హిమాది స్వసదృ కార్యారంభం ఉన్నది. ఇలాగే పృథ్వితో జలానికి, జలంతో పృథ్వికి తుల్య ధర్మమున్నది.

ఇలాగే గుణాలు – కారణగుణాలు, కార్యాలలో సజాతీయ గుణాంతరాలను కలిగిస్తాయి. కారణంలో ఉన్న తెలుపురంగు కార్యంలో తన జాతికి చెందిన తెలుపురంగునే కలిగిస్తుంది.

"ద్రవ్యగుణయోర్విజాతీయారంభకత్వం వైధర్మ్యమ్" ॥

ద్రవ్యగుణాలకు విరుద్ధ ధర్మం, విరుద్ధ కార్యారంభకత్వాన్ని 'వైధర్మ్యం' అంటారు. పృథ్విలో గల కఠినత్వ, శుష్కత్వ, గంధవత్వ (వాసనగలది) ధర్మాలు జలానికి విరుద్ధమైనవి. జలంలో గల ద్రవత్వ, కోమలత్వ, రసత్వ ధర్మాలు పృథ్వికి విరుద్ధమైనవి.

కార్యకారణ సంబంధం

కారణభావాత్కార్యభావః ॥ వైశేషిక అ4-ఆ1, సూ 3 ॥

కారణమున్నప్పుడే కార్యమేర్పడుతుంది.

న తు కార్యాభావాత్కారణాభావః ॥ వైశేషిక అ1-ఆ2, సూ 2 ॥

కార్యం లేనందున కారణానికి అభావముండదు. ఉదా: కుండ లేనంత మాత్రాన మట్టి లేకుండా పోదు.

కారణాఽభావాత్కార్యాభావః ॥ వైశేషిక అ1-ఆ2, సూ 1 ॥

కారణం లేకుంటే కార్యమెన్నడు ఉండదు.

కారణగుణపూర్వకః కార్యగుణో దృష్టః ॥ వైశేషిక అ2-ఆ1, సూ 24 ॥

ఉపాదాన కారణాలలో ఎలాంటి గుణాలుంటాయో కార్యంలో అలాంటి గుణాలే ఉంటాయి.

పరిమాణం రెండువిధాలు

అణుమహదితి తస్మిన్ విశేషభావాత్ విశేషాభావాచ్చ ॥ వైశేషిక అ7-ఆ1, సూ 11 ॥

అణు = సూక్ష్మం; మహత్ = గొప్పది అని పరిమాణాలు రెండు విధాలు. త్రసరేణువు 'లిక్ష' కంటె చిన్నది. ద్వ్యణుకం కంటె పెద్దది. అలాగే పర్వతాలు పృథ్వి కంటె చిన్నవి. చెట్లకంటె పెద్దవి.

సత్తా :- సదితి యతో ద్రవ్యగుణకర్మసు సా సత్తా ॥ వైశేషిక అ1-ఆ2, సూ 7 ॥

ద్రవ్య, గుణ, కర్మలతో 'సత్' శబ్దం అన్వితమై ఉంటుంది. 'సద్ద్రవ్యమ్, సద్గుణః సత్కర్మ' - సద్ద్రవ్యం, సద్గుణం, సత్కర్మమని యీ వర్తమాన కాలవాచికమైన 'సత్' శబ్దమన్నిటిలోనూ అన్వయిస్తుంది. ఇలాంటి అనువృత్త బుద్ధిని కలిగించేదే 'సత్తా సామాన్యం' అనబడుతుంది.

భావోఽనువృత్తేరేవ హేతుత్వాత్సామాన్యమేవ ॥ వైశేషిక అ1-ఆ2, సూ 4 ॥

అన్నింటితోనూ అనువర్తమానమైన ఈ సత్తారూప భావం 'మహాసామాన్యం' అనబడుతుంది. ఈ క్రమం భావరూప ద్రవ్యాలకు మాత్రమే ఉంటుంది.

అభావభేదాలు

అభావం ఐదు విధాలు.

1. **క్రియాగుణవ్యపదేశాభావాత్ప్రాగసత్ ॥** వైశేషిక అ9-ఆ1, సూ 1 ॥

ఉత్పత్తికి పూర్వం కార్యద్రవ్యం లేదు. క్రియాగుణాల విశేష నిమిత్తాలు లేనందున 'ప్రాగసత్' అనగా ఉత్పత్తికి పూర్వం లేనిదని చెప్పబడుతుంది. ఘటవస్త్రాదులు ఉత్పత్తికి పూర్వముండవు. దీనిని 'ప్రాగభావం' అంటారు.

2. సదసత్ ॥ వైశేషిక అ9–ఆ1, సూ 2 ॥

ఉండి లేకుండా పోవునది. పుట్టి నశించునది. ఘటముత్పన్నమై నశించినచో ఆ యభావం 'ప్రధ్వంసాభావం' అనబడుతుంది.

3. సచ్చాసత్ ॥ వైశేషిక అ9–ఆ1, సూ 4 ॥

ఉండి లేనిది. "అగౌరశ్వోఽనశ్వో గౌః" ఇది గుఱ్ఱం, ఆవు కాదు; ఇది ఆవు, గుఱ్ఱం కాదు; అన్నప్పుడు గుఱ్ఱంలో ఆవు, ఆవులో గుఱ్ఱం లేదనీ, ఆవులో ఆవు యొక్క భావం, గుఱ్ఱంలో గుఱ్ఱం యొక్క భావమున్నదని తెలుస్తుంది. ఇదే 'అన్యోన్యాభావం'.

4. యచ్చాన్యదసదతస్తదసత్ ॥ వైశేషిక అ9–ఆ1, సూ 5 ॥

పైన చెప్పిన మూడు భావాలకు భిన్నమైనది 'అత్యంతాభావం'.

ఉదా: నరశృంగం = మనుష్యుని కొమ్ము; ఖపుష్పం = ఆకాశపుష్పం; వంధ్యాపుత్రుడు = గొడ్రాలి కొడుకు మొదలైనవి. ఇవెప్పుడూ ఉండనివని తెలుసుకోవాలి.

5. నాస్తి ఘటో గేహ ఇతి సతో ఘటస్య గేహసంసర్గప్రతిషేధః ॥

వైశేషిక అ9–ఆ1,సూ 10 ॥

ఇంటిలో కుండ లేదంటే మరొకచోట ఉందని అర్థం. అన్యత్ర ఉండు ఘటానికి ఇంటిలో కుండకు సంబంధం లేదని తెలుస్తున్నది. దీనిని 'ప్రతిషేధాభావం' అంటారు. ఇట్లా అభావం ఐదు విధాలు.

ఇంద్రియదోషాత్సంస్కార దోషాచ్చావిద్యా ॥ వైశేషిక అ9–ఆ2, సూ 10 ॥

ఇంద్రియ దోషాల వల్ల, సంస్కార దోషాల వల్ల 'అవిద్య' కలుగుతుంది.

తద్దుష్టం జ్ఞానమ్ ॥ వైశేషిక అ9–ఆ2, సూ 11 ॥

'దుష్టం' అనగా విపరీత జ్ఞానం, 'అవిద్య' అంటారు.

అదుష్టం విద్యా ॥ వైశేషిక అ9–ఆ2, సూ 12 ॥

'అదుష్టం' దుష్టం కానిది అనగా యదార్థజ్ఞానం 'విద్య' అంటారు.

పృథివ్యాదిరూపరసగంధస్పర్శా ద్రవ్యానిత్యత్వాదనిత్యాచ్చ ॥ వైశేషిక అ7–ఆ1, సూ 2 ॥

ఏతేన నిత్యేషు నిత్యత్వముక్తమ్ ॥ వైశేషిక అ7–ఆ1, సూ 3 ॥

కార్యరూప పృథివ్యాది పదార్థాలు అనిత్యాలు అవటం వలన వాని గుణాలైన రూప, రస, గంధ, స్పర్శాదులు అనిత్యాలే. కారణరూప పృథివ్యాది నిత్య పదార్థాలలో గల గంధాది గుణాలు నిత్యాలు.

సదకారణవన్నిత్యమ్ ॥ వైశేషిక అ 4-ఆ 1, సూ 1 ॥

ఒక వస్తువు ఉనికి ఉన్నదై కారణం లేనిదైతే అది నిత్యమంటారు. దీనిని బట్టి 'సత్కారణవదనిత్యమ్' ఉండి కారణం కలదైతే అనిత్యమవుతుంది.

అస్యేదం కార్యం కారణం సంయోగి విరోధి సమవాయి చేతి లైంగికమ్ ॥
వైశే. అ9 - ఆ2, సూ1 ॥

"దీనికి ఇది కార్యం లేక కారణం" అనటం వలన 'సమవాయి, సంయోగి, ఏకార్థ సమవాయి, విరోధి' అనే నాల్గు ప్రకారాల లైంగిక జ్ఞానం లింగలింగి సంబంధం వలన ఏర్పడుతుంది. "ఆకాశం పరిమాణం కలది" ఇది 'సమవాయి'. శరీరం చర్మం కలిగి ఉన్నది. ఇది 'సంయోగి'. వీనికి నిత్య సంయోగమున్నది. ఏకార్థంలో రెండుండటం 'ఏకార్థసమవాయి'. ఉదా: కార్యరూపస్పర్శ కార్య ద్రవ్యానికి లింగం. ఇది ఏకార్థసమవాయి. కురిసిన వర్షం కురియబోవు వర్షానికి విరోధి. ఇది విరోధి లింగం. అవిద్యమాన వృష్టికి మరుదభ్రసంయోగం విరోధిలింగం.

వ్యాప్తి:- నియత ధర్మ సాహిత్యముభయోరేకతరస్య వా వ్యాప్తిః ॥ నిజశక్త్యుద్భవమిత్యాచార్యాః ॥ ఆధేయశక్తియోగ ఇతి పంచశిఖః ॥ సాంఖ్యసూత్రం.॥ అ5 - సూ 29, 31, 32 ॥

సాధ్య సాధనాలు అంటే సాధించవలసినవి మరియు సాధించేవి అనే ఈ రెండింటి సహచర్యంగాని, కేవలం సాధనం యొక్క నిశ్చిత ధర్మసాహచర్యం గాని 'వ్యాప్తి' అంటారు. ఉదా: ధూమానికి అగ్నికి గల సాహచర్యం. ॥29 ॥

వ్యాప్యమైన ధూమం తన నిజశక్తితో పుడుతుంది. దేశాంతరంలో దూరంగా లేచిపోవునపుడు అచట అగ్ని లేకున్నా కూడా ధూమం స్వయంగా ఉండగలుగుతుంది. దీనినే 'వ్యాప్తి' అంటారు. అగ్నిలోగల ఛేదన, భేదన సామర్థ్యాన్ని జలాది పదార్థాలు ధూమరూపాన్ని చెందుతున్నాయి. ॥ 31 ॥ మహత్త్వాది పదార్థాలలో ప్రకృత్యాదులకు గల వ్యాపకతా ధర్మానికి, బుద్ధ్యాదులలో గల వ్యాప్యతా ధర్మానికి గల సంబంధాన్ని 'వ్యాప్తి' అంటారు. ఆధేయరూపమైన శక్తికీ, ఆధారరూపమైన శక్తిగల పదార్థానికి ఉన్న సంబంధం ఇలాంటిదే. ॥ 32 ॥

ఇలా శాస్త్ర ప్రమాణాదులతో పరీక్షించి చదవాలి, చదివించాలి. వేరే విధంగా విద్యార్థులకు సత్యజ్ఞానం ఎప్పుడూ కలుగదు. చదివించవలసిన గ్రంథాలను పైన చెప్పిన విధంగా పరీక్షించి అవి సత్యాలని ఋజువైనపుడు ఆ గ్రంథాలనే చదివించాలి. ఈ పరీక్షలకు విరుద్ధమైన పుస్తకాలను చదువకూడదు, చదివించకూడదు. ఎందుకంటే:

"లక్షణ ప్రమాణాభ్యాం వస్తు సిద్ధిః" లక్షణ ప్రమాణాలతోనే వస్తువు సిద్ధిస్తుంది.

'గంధవతీ పృథ్వీ' అను లక్షణంతో పృథ్వికి 'గంధం' ఉన్నదని తెలుస్తుంది. ఇలాంటి లక్షణం మరియు ప్రత్యక్షాది ప్రమాణాలతో సత్యాసత్యాల పదార్థాల నిర్ణయం జరుగుతుంది. ఇవి లేకుండా నిర్ణయం జరగదు.

పఠన పాఠన విధి

ఇపుడు 'పఠనపాఠనవిధి' చదవవలసిన పద్ధతి, చదివించే విధానాన్ని వ్రాస్తున్నాను.

మొదట పాణినిముని రచించిన శిక్షాసూత్రాల ప్రకారం అక్షరాల స్థాన, ప్రయత్న, కరణాలను నేర్పించాలి. 'ప'కు ఓష్ఠం స్థానం, స్పృష్టం ప్రయత్నం, జిహ్వ చేసే క్రియ కరణం. ఇలా అక్షరాల ఉచ్చారణాన్ని యథాయోగ్యంగా తల్లిదండ్రులు, ఆచార్యుడు నేర్పించాలి.

వ్యాకరణం: తర్వాత వ్యాకరణంలో అష్టాధ్యాయీ సూత్రాలు 'వృద్ధిరాదైచ్' మొదలైనవి మొదట కంఠస్థం చేయించాలి. ఆ తర్వాత **'వృద్ధిః, ఆత్, ఐచ్ వా ఆదైచ్'** అని పదచ్ఛేదాన్ని; **'ఆచ్చ ఐచ్చ ఆదైచ్'** అని సమాసాన్ని; **'ఆదైచాం వృద్ధిసంజ్ఞా క్రియతే'** అంటే **'ఆ' 'ఐ' 'ఔ'** లకు **'వృద్ధిసంజ్ఞ'** అని అర్థాన్ని తెలపాలి. **'తః పరోయస్మాత్స తపరస్తాదపి పరస్తపరః'** 'త'కారానికి పరంగా ఉండేది, పరంలో తకారం కలది, రెండూ 'తపర' అనబడతాయి.

ఉదా: 'భాగః' ఇందు 'భజ్' ధాతువుకు 'ఘఞ్' ప్రత్యయం పరమై 'ఘ్, ఞ్'లకు 'ఇత్సంజ్ఞ' కలిగి అవి లోపింపగా 'భజ్, అ' అని ఏర్పడుతుంది. తర్వాత 'జ'కారానికి పూర్వంలో గల 'భ'కారంలోని 'అ'కారానికి వృద్ధిసంజ్ఞ కలిగి 'భాజ్' అవుతుంది. ఆ తర్వాత 'జ'కారం 'గ'కారంగా మారి ప్రత్యయమైన 'అ'కారంతో కలిసి 'భాగః' అనే రూపంగా సిద్ధిస్తుంది.

'అధ్యాయః' ఈ శబ్దంలో 'అధి' పూర్వక 'ఇఙ్' ధాతువులోని హ్రస్వ 'ఇ'కారానికి పరంలో 'ఘఞ్' ప్రత్యయం చేరటంవలన వృద్ధి సంజ్ఞయై 'ఐ'గా మారుతుంది. తర్వాత అది 'ఆయ్' రూపం చెంది అధితో కలిసి 'అధ్యాయః' అవుతుంది.

'నాయకః' శబ్దం 'ణీఞ్' ధాతువులోని 'ఈ' కారం 'ణ్వుల్' ప్రత్యయం చేరటం వలన 'ఈ'కారానికి వృద్ధియై 'ఐ'కారం వచ్చి అది 'ఆయ్'గా మారి 'నాయకః' అనే రూపం ఏర్పడుతుంది.

ఇలాగే 'స్తావకః' 'స్తు' ధాతువుకు 'ణ్వుల్' ప్రత్యయం పరమవటం వలన హ్రస్వ ఉకారానికి 'ఔ' వృద్ధియై 'ఆవ్' ఆదేశమవుతుంది. తర్వాత అకారంతో కలిసి 'స్తావకః' శబ్దమవుతుంది.

'కారకః' శబ్దం 'కృఞ్' ధాతువుతో ఏర్పడుతుంది. ఈ ధాతువుకు 'ణ్వుల్' ప్రత్యయం పరమైనపుడు, ఇత్సంజ్ఞచే ప్రత్యయంలోని 'ణ్, ల్' లు లోపించి 'వు' స్థానంలో 'అక' ఆదేశమవుతుంది. తర్వాత ధాతువులోని 'ఋ'కారం వృద్ధిచెంది 'అర్'గా మారి 'కారకః' రూపం సిద్ధిస్తుంది.

ఈ విధంగా పూర్వపరాలలో వచ్చే సూత్రాల కార్యాల నన్నింటినీ తెలపాలి. పలకపై వ్రాసి రూపాలను ఇలా అని చూపించాలి. "భజ్+ఘఞ్ + సు" ను వ్రాసి మొదట ఘకార, ఞకారాలు లోపించటం వలన 'భజ్ + అ + సు" అయినదనీ, తర్వాత 'భ'కారంలో గల 'అ'కారానికి వృద్ధి,

జకారానికి గకారమాదేశం జరిగి 'భాగ్+అ+సు' అయినదనీ, ఆ తర్వాత అకారంతో కలిసి 'భాగ+సు' రూపమై, ప్రత్యయంలోని ఉకారం ఇత్సంజ్ఞచే లోపించి 'స'కారానికి 'రు'ఆదేశమై దానిలో గల ఉకార మిత్సంజ్ఞచే లోపించగా 'భాగర్' అయినదనీ తర్వాత 'ర'కారానికి విసర్గ ఆదేశమై 'భాగః' రూపం సిద్ధించిందని తెలపాలి.

ఇలా ఆ యా సూత్రాలతో జరుగు కార్యాలను తెలిపి, చదివి, చదివించి, వ్రాసి, వ్రాయిస్తూ సిద్ధి కార్యాలను చేయిస్తే అతి శీఘ్రంగా దృఢజ్ఞానం కలుగుతుంది. ఒకమారు ఇలా అష్టాధ్యాయిని చదివించి, అర్థసహితంగా ధాతుపాఠాన్ని, దశ లకారాల రూపాలను, ప్రక్రియ సహితంగా సామాన్య సూత్రాలను, అంటే సూత్రాల ఉత్సర్గాన్ని, ఎందుకంటే 'కర్మణ్యణ్' కర్మ ఉప పదంగా ఉన్న ధాతువులన్నింటికి 'అణ్' ప్రత్యయమవుతుందనీ (ఉదా: కుంభకారః) తర్వాత అపవాద సూత్రమైన **'ఆతోఽనుపసర్గే కః'** ఉపసర్గ భిన్నమైన కర్మ ఉపపదంగా ఉంటే ఆకారాంత ధాతువుకు 'క' ప్రత్యయం అవుతుందని తెలపాలి. బహువ్యాపకాలైన కర్మోపపదాలు గల ధాతువులన్నింటికి 'అణ్' ప్రత్యయం వస్తుంది. ఇక పూర్వసూత్రంలో చెప్పినట్లు అల్పవిషయాలైన కొన్నింటికి అంటే ఆకారాంత ధాతువులకు మాత్రమే 'క' ప్రత్యయం వస్తుంది. చక్రవర్తి యొక్క రాజ్యంలో చిన్న చిన్న మాండలిక రాజులకు, భూస్వాములకు ప్రవృత్తి ఉండునట్లు, మాండలిక రాజుల రాజ్యంలో చక్రవర్తికి ప్రవృత్తి ఉండదు. ఇదే విధంగా సామాన్యములైన ఉత్సర్గ సూత్రాలపై అపవాద సూత్రాలప్రవృత్తి ఉండునట్లు, అపవాద సూత్రాలలో ఉత్సర్గ సూత్రాల ప్రవృత్తి ఉండదు.

గ్రంథ ప్రామాణ్య విషయం

ఈ విధంగా పాణిని మహర్షి తన అష్టాధ్యాయిలోని నాలుగువేల సూత్రాలలో సమస్త శబ్దార్థ సంబంధాల విద్యను ప్రతిపాదించాడు. మొదట ధాతుపాఠాన్ని చదివించి తర్వాత ఉణాది గణ పాఠాన్ని చదివిస్తూ సుబంత పదాలను అన్నింటినీ చక్కగా నేర్పించాలి. రెండవసారి శంకా, సమాధాన, వార్తిక, కారిక, పరిభాషా సహితంగా అష్టాధ్యాయిని చదివిస్తూ ద్వితీయానువృత్తిని కావించాలి.

తర్వాత మహాభాష్యాన్ని చదివించాలి. బుద్ధిమంతులు, పురుషార్థులు, నిష్కపటులు, విద్యావృద్ధిని కోరువారు చదువుతూ, చదివిస్తూ ఉంటే ఒకటిన్నర సంవత్సరకాలంలో అష్టాధ్యాయిని, ఒకటిన్నర సంవత్సరంలో మహాభాష్యాన్ని చదివి మూడేళ్లలోనే పూర్ణ వ్యాకరణ పండితులు అవుతారు. ఇలాంటివారు సులభంగా వ్యాకరణ సహాయంతో వైదిక, లౌకిక శబ్దాలను తెలుసుకొని ఇతర శాస్త్రాలను సహజంగా, శీఘ్రంగా చదివి - చదివించగలరు. వ్యాకరణశాస్త్రం, నేర్చుకోవటంలో జరిగేంత గొప్ప పరిశ్రమ ఇతర శాస్త్రాలను నేర్చుకొనేటప్పుడు అంతపరిశ్రమ అవసరముండదు.

అనార్ష గ్రంథ పఠన హాని

ఇలా మూడేళ్లలో వీనిని చదవటంవలన కలిగే జ్ఞానం కుగ్రంథాలైన సారస్వత చంద్రిక, కౌముది, మనోరమాది వ్యాకరణ గ్రంథాలను 50 వత్సరాలు చదివినా లభించదు. మహాశయులైన మహర్షులు

సహజశైలిలో గొప్ప విషయాలను తమ గ్రంథాలలో తెలియపరచినట్లు క్షుద్రాశయులైన మనుష్యులు తమ కల్పిత గ్రంథాలలో తెలుపలేరు. సాధ్యమైనంతవరకు సుగమంగా, కొద్ది సమయంలో గ్రహింపచేయటం మహర్షుల ఆశయం. క్షుద్రాశయులైనవారు సాధ్యమైనంతవరకు కఠినంగా రచించాలని అనుకుంటారు. అలాంటి వారి గ్రంథాలు చదివితే, కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లు, గొప్ప పరిశ్రమతో స్వల్పలాభం మాత్రమే కలుగుతుంది. సముద్రంలో మునిగి గవ్వలను పొందినట్లు, ఋషి గ్రంథాలను చదివితే ఒకే మునకలో బహుమూల్య రత్నాలు అనేకాలు దొరుకుతాయి. లాభం అధికంగా ఉంటుంది.

వ్యాకరణం చదివిన తర్వాత యాస్కముని రచించిన నిఘంటువు – నిరుక్తం, ఆరు లేక ఎనిమిది నెలలలో అర్థసహితంగా చదవాలి, చదివించాలి. నాస్తిక కృతాలైన అమరకోశాదులను నేర్చుకోవటానికి అనేక సంవత్సరాలు వ్యర్థపరచకూడదు.

తర్వాత పింగళాచార్యుడు రచించిన ఛందో గ్రంథం నుండి వైదిక, లౌకిక ఛందస్సులను నాలుగు నెలలలో తెలుసుకొని నవీన శ్లోక రచనా రీతిని నేర్చుకోవాలి. అల్పబుద్ధులు రచించిన గ్రంథాలైన వృత్తరత్నాదులను నేర్చుకోవటంలో అనేక సంవత్సరాలు వ్యర్థపరచరాదు.

పఠనీయ గ్రంథాలు

తదనంతరం దుష్టవ్యసనాలను తొలగించు ఉత్తమ సభ్యతను కలిగించు మనుస్మృతి, వాల్మీకి రామాయణం, మహాభారతంలోని ఉద్యోగపర్వంలో గల విదురనీతి మొదలైన ఉత్తమ ప్రకరణాలను చదివించాలి. విద్యార్థికి కావ్యపద్ధతితో అంటే పదచ్ఛేదం, పదార్థోక్తి, అన్వయం, విశేష్య విశేషణ భావార్థాలతో అధ్యాపకులు నేర్పించాలి. విద్యార్థులు నేర్చుకోవాలి. వీటిని ఒక సంవత్సరంలో చదవాలి, చదివించాలి.

దర్శనాలు - ఉపనిషత్తులు

అనంతరం 'పూర్వమీమాంస, వైశేషికం, న్యాయం, యోగం, సాంఖ్యం, వేదాంతం', అనే ఆరు శాస్త్రాలను ఋషికృత వ్యాఖ్యాసహితంగా గాని ఉత్తమ విద్వాంసులు రచించిన సరళ వ్యాఖ్యాయుక్తంగా గాని చదివి, చదివించాలి. వేదాంతసూత్రాలను చదవటానికి పూర్వమే 'ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, ఐతరేయ, తైత్తిరీయ, ఛాందోగ్య, బృహదారణ్యకాలు' అనే పది ఉపనిషత్తులను చదివి ఆరు శాస్త్రాల భాష్యాలను, వృత్తిసహితంగా సూత్రాలను రెండు సంవత్సరాలలో చదవాలి, చదివించాలి.

బ్రాహ్మణ వేదగ్రంథాలు

ఆ తర్వాత ఆరు సంవత్సరాలలోపల "ఐతరేయ, శతపథ, సామ, గోపథాలు అనే నాలుగు బ్రాహ్మణ గ్రంథాలతో పాటు నాలుగు వేదాలను స్వర, శబ్ద, అర్థ, సంబంధ, క్రియా సహితంగా చదవాలి చదివించాలి.

ఇందుకు ప్రమాణం:

"స్థాణురయం భారహారః కిలాభూదధీత్య వేదం న విజానాతి యోఽర్థమ్ ।
యోఽర్థజ్ఞ ఇత్సకలం భద్రమశ్నుతే నాకమేతి జ్ఞానవిధూతపాప్మా ॥ నిరుక్త. 1. 18 ॥

వేదాన్ని స్వరంతో మాత్రమే పఠించి కంఠస్థం చేసి అర్థాన్ని తెలుసుకోలేనివాడు కొమ్మలను, ఆకులను, పూవులను, పండ్లను మోయు, వృక్షంవలె; ధాన్యాది భారముల మోయు పశువులవలె కేవలం భారవాహకుడు అంటే బరువు మోయువాడే అవుతాడు. వేదాన్ని చదివి అందులోని అర్థాలను సరిగా తెలుసుకొనేవాడు సంపూర్ణానందాన్ని పొంది, జ్ఞానం వలన పాపవిముక్తుడై, పవిత్రమైన ధర్మాచరణ ప్రభావంతో మరణానంతరం సర్వానందాన్ని పొందుతాడు.

"ఉత త్వః పశ్యన్న దదర్శ వాచముత త్వః శృణ్వన్న శృణోత్యేనామ్ ।
ఉతో త్వస్మై తన్వం వి సస్రే జాయేవ పత్య ఉశతీ సువాసాః ॥
ఋగ్వే. మం. 10 - సూ 71, మం. 4 ॥

అవిద్వాంసుడు వింటూ వినడు. చూస్తూ చూడడు. చెప్తూ చెప్పడు. అనగా విద్వాంసుడు కానివాడు వేదవిద్యారహస్యాన్ని తెలుసుకోలేడు. సుందర వస్త్రాభూషణాలను ధరించి తన పతిని కోరు స్త్రీ తన భర్త ఎదుట తన శరీరాన్ని, స్వరూపాన్ని ప్రకాశపరచునట్లు, శబ్ద, అర్థ, సంబంధాలను బాగా తెలిసిన విద్వాంసునికి విద్య కూడ తన స్వరూపాన్ని ప్రకాశపరుస్తుంది. అవిద్వాంసులకు కాదు.

"ఋచో అక్షరే పరమే వ్యోమన్యస్మిన్దేవా అధి విశ్వే నిషేదుః ।
యస్తన్న వేద కిమృచా కరిష్యతి య ఇత్తద్విదుస్త ఇమే సమాసతే ॥
ఋగ్వే. మం. 1 - సూ 164, మం. 39 ॥

సర్వ వ్యాపకుడు, నాశరహితుడు సర్వోత్కృష్టుడైన పరమేశ్వరునిలో పృథ్వీ సూర్యాది సర్వ లోకాలూ, విద్వాంసులందరూ వున్నారు. అతనిలోనే సర్వవేదాల తాత్పర్యమున్నది. అలాంటి పరబ్రహ్మను తెలియని వానికి ఋగ్వేదాదుల పఠనం వలన సుఖమేమీ లభించదు. వేదాలను అర్థయుక్తంగా చదివి ధర్మాత్ములు, యోగులై ఆ బ్రహ్మను తెలుసుకొనేవారు పరమేశ్వరునిలో స్థితులై ముక్తిరూపంగా పరమానందాన్ని అనుభవించగలరు. కాబట్టి అర్థ జ్ఞాన సహితంగా పఠన పాఠనాలు ఉండాలి.

ఉపవేదాలు

ఇలాగే నాలుగు వేదాలను పఠించి, ఆయుర్వేదానికి చెందిన చరక, సుశ్రుతాది ఋషి, ముని ప్రణీతములైన వైద్యశాస్త్రాలను, అర్థ, క్రియ, శస్త్ర, ఛేదన, లేపన, చికిత్స, నిదాన, ఔషధ, పథ్య, శారీర, దేశ, కాల, వస్తువుల గుణజ్ఞాన పూర్వకంగా వాటిని నాలుగేళ్లలో చదవాలి, చదివించాలి. తదనంతరం ధనుర్వేదాన్ని నేర్చుకోవాలి. ఇది రాజ్యసంబంధమైన విద్య. ఇది రెండు విధాలుగా ఉన్నది. మొదటిది రాజపురుష సంబంధమైనది. రెండవది ప్రజా సంబంధమైనది. రాజ కార్యాలలో

సర్వసేనాధ్యక్షుని విషయాలు, శస్త్రాస్త్ర విద్యలు, నానావిధాల వ్యూహరచనా అభ్యాసాలు చేరి ఉన్నాయి. యుద్ధంలో శత్రువులను ఎదురించుటకు ఏర్పరచుకొనే సేనావ్యూహాన్ని ఈనాడు 'కవాతు' సైనికశిక్షణ అంటారు. వీటిని బాగా నేర్చుకొన్న తర్వాత ప్రజాపాలన అభివృద్ధిగావించు విధానాలను తెలుసుకొని న్యాయపూర్వకంగా ప్రజల నందరినీ ప్రసన్నులుగా ఉంచాలి. దుష్టులను యథాయోగ్యంగా దండించి, శ్రేష్ఠులను పాలించు పద్ధతుల నన్నింటిని నేర్చుకోవాలి. ఈ రాజవిద్యను రెండేళ్లలో నేర్చుకొని గాంధర్వవేదం అనబడే గానవిద్యను, 'స్వర, రాగ, రాగిణీ, సమయ, తాళ, గ్రామ, తాన, వాదిత్ర, నృత్య, గీత' ఆది భేదాలను సరిగ్గా నేర్చుకోవాలి. ముఖ్యంగా సామవేద గానాన్ని వాదిత వాద్య పూర్వకంగా అభ్యసించి నారదసంహితాది ఆర్ష గ్రంథాలను చదవాలి. వేశ్యల యొక్క, బైరాగుల యొక్క విషయాసక్తిని కలిగించే గార్దభ స్వరాల వంటి వ్యర్థాలాపాలను ఎప్పుడూ అభ్యసించరాదు. శిల్పవిద్య అనబడే అర్థవేదాన్ని, పదార్థ, గుణ, విజ్ఞాన, క్రియాకౌశలాలతో గ్రహించి, అనేక విధాలైన పదార్థాల నిర్మాణాన్నీ, పృథ్వి నుండి ఆకాశ పర్యంతంగల పదార్థాల విద్యనూ సమగ్రంగా నేర్చుకొని ఐశ్వర్యాన్ని అభివృద్ధి చేసుకొని విద్యను తెలుసుకోవాలి. తర్వాత రెండేళ్లలో జ్యోతిశ్శాస్త్రమైన సూర్య సిద్ధాంతాది గ్రంథాలను పఠించి అందులోని బీజగణిత, అంకగణిత, భూగోళ, ఖగోళ, భూగర్భ విద్యలను నేర్చుకోవాలి.

ఆ తర్వాత అనేక విధాలైన చేతిపనులను, యంత్ర పరిశ్రమాలను అభ్యసించాలి. గ్రహ, నక్షత్ర, జన్మపత్ర, రాశి, ముహూర్తాల ఫలాన్ని తెలిపే గ్రంథాలు అసత్యాలని గ్రహించి వాటిని ఎప్పుడూ చదవకూడదు, చదివించకూడదు.

ఇలా ఇరవై లేక ఇరవై ఒక్క సంవత్సరాలలోనే సంపూర్ణ విద్యను, ఉత్తమ శిక్షణను పొంది, మానవులందరు కృతకృత్యులై సదా ఆనందాన్ని పొందునట్లు చదివేవారు, చదివించేవారు ప్రయత్నం చేయాలి. ఈ విధంగా లభించేంత విద్య ఇతర విధాల వల్ల వందేళ్లలో కూడా లభించదు.

ఋషులు గొప్ప విద్వాంసులు, సర్వశాస్త్రవేత్తలు, ధర్మాత్ములు కావటం వలన వారు రచించిన గ్రంథాలనే చదవాలి. పక్షపాతబుద్ధి గలవారై అల్పశాస్త్రాలనే పఠించినవారు ఋషులు కారు. అలాంటివారు రచించిన గ్రంథాలూ వారివలెనే పక్షపాతసహితంగా ఉంటాయి. కాబట్టి వాటిని పఠించరాదు.

దర్శనాల ప్రామాణిక భాష్యాలు

వ్యాసమునికృత వ్యాఖ్యాసహితంగా 'జైమిని పూర్వమీమాంసను', ప్రశస్తపాదభాష్యంతో 'కణాదముని కృత వైశేషికాన్ని', వాత్స్యాయన మునికృత భాష్యంతో 'గౌతమముని కృత న్యాయసూత్రాలను', వ్యాసమునికృత భాష్యంతో 'పతంజలి యోగసూత్రాలను', భాగురిమునికృత భాష్యంతో 'కపిలుని సాంఖ్యసూత్రాలను', వాత్స్యాయనమునికృతభాష్యం లేక బోధాయనమునికృత భాష్యంతో 'వ్యాసముని వేదాంతసూత్రాలను' వృత్తి సహితంగా చదవాలి, చదివించాలి. ఇలాంటి సూత్రాలను కల్పమనే అంగంలో కూడా లెక్కించాలి.

'ఋగ్యజుస్సామాథర్వము'లను నాలుగు వేదాలు ఈశ్వరకృతాలు. 'ఐతరేయ, శతపథ, సామ, గోపథము'లను నాలుగు బ్రాహ్మణాలు; 'శిక్షా, కల్పం, వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు, జ్యోతిషం' అనే ఆరు వేదాంగాలు, వేదోపాంగాలు అనబడే 'మీమాంసాది ఆరు శాస్త్రాలు' 'ఆయుర్వేదం, ధనుర్వేదం, గాంధర్వవేదం, అర్థవేదం' అనే నాలుగుఉపవేదాలు మొదలైనవి ఋషిమునికృత గ్రంథాలు.

వీటిలో కూడా వేదవిరుద్ధమైన వాటిని త్యజించాలి. వేదాలు ఈశ్వరకృతాలవటం వలన భ్రాంతిరహితాలై, స్వతః ప్రమాణాలై ఉన్నాయి. వేదానికి ప్రమాణం వేదమే. బ్రాహ్మణాది గ్రంథాలు వేదాధీన ప్రమాణాలు కలవి అవటం వలన ఇవి పరతః ప్రమాణాలు. వేదాన్ని గురించిన విశేషవ్యాఖ్య 'ఋగ్వేదాది భాష్య భూమిక'లో కలదు. అక్కడ చూడండి.

త్యాజ్య గ్రంథాలు

చదువకూడని గ్రంథాలగురించి సంక్షిప్తంగా వ్రాయబడును. ఈ క్రింద తెలిపిన గ్రంథాలన్నీ చాలా కల్పితాలని గుర్తించాలి.

వ్యాకరణంలో 'కాతంత్రం, సారస్వతం, చంద్రిక, ముగ్ధబోధ, కౌముది, శేఖరం, మనోరమాదులు'. కోశంలో 'అమరకోశాదులు' **ఛందోగ్రంథాలలో** 'వృత్తరత్నాకరాదులు' **శిక్షలో** "అథ శిక్షాం ప్రవక్ష్యామి పాణినీయం మతం యథా" అనేవి. **జ్యోతిషంలో** 'శీఘ్రబోధ. ముహూర్త చింతామణి' మొదలైనవి. **కావ్యాలలో** 'నాయికాభేద, కువలయానంద, రఘువంశ, మాఘ, కిరాతార్జునీయాదులు' **మీమాంసలో** 'ధర్మసింధు. వ్రతార్కాదులు' **వైశేషికంలో** 'తర్కసంగ్రహాదులు'. **న్యాయంలో** 'జాగదీశీ' మొదలైనవి. **'యోగంలో** హఠప్రదీపికాదులు'. **సాంఖ్యంలో** 'సాంఖ్య తత్వ కౌముది' మొదలైనవి. **వేదాంతంలో** 'యోగవాసిష్ఠం, పంచదశి' మొదలైనవి. **వైద్యంలో** 'శార్ఙ్గధరాదులు'. **స్మృతులలో** 'మనుస్మృతి'లోని ప్రక్షిప్తశ్లోకాలు ఇతరస్మృతులన్నీ, తంత్ర గ్రంథాలు. పురాణాలు, ఉపపురాణాలు, తులసీదాసు రామాయణం. రుక్మిణీ మంగళాది, సర్వభాషా గ్రంథాలు మొదలైనవి అన్నీ కపోలకల్పితాలైన మిథ్యాగ్రంథాలు.

ప్రశ్న:- ఈ గ్రంథాలలో ఏ కొంచమైనను సత్యం లేదా?

జవాబు:- సత్యం కొంచెమే ఉన్నది. దానితోపాటు అధికంగా అసత్యం ఉన్నది. **"విషసమ్పృక్తాన్నవత్ త్యాజ్యాః"** విషం కలిసిన పాయసాన్ని విడిచిపెట్టినట్లు ఈ గ్రంథాలను త్యజించవలసిందే.

ప్రశ్న:- మీరు పురాణాలను, ఇతిహాసాలను నమ్మరా?

జవాబు:- నమ్ముతాం. కాని అసత్యాలను నమ్మక సత్యాన్నే నమ్ముతాం.

ప్రశ్న:- ఏవి సత్యాలు? ఏవి అసత్యాలు?

జవాబు:- **"బ్రాహ్మణానీతిహాసాన్ పురాణాని కల్పాన్ గాథా నారాశంసీరితి"** ఇది గృహ్య

సూత్రాలలోని వచనం. ఐతరేయ, శతపథాది బ్రాహ్మణ గ్రంథాలకే 'ఇతిహాస, పురాణ, కల్ప, గాథ, నారాశంసీ' అనే ఐదు పేర్లున్నాయి. శ్రీమద్భాగవతాదులకు పురాణాలన్న పేరు లేదు.

ప్రశ్న:- త్యజించవలసిన గ్రంథాలలోని సత్యాలను ఎలా గ్రహించరు?

జవాబు:- అందులో గల సత్యాలు వేదాది సత్యశాస్త్రాలలోనివే. అందులోని మిథ్యా విషయాలు రచయితల కపోలకల్పితాలు. ఎవరైనా ఈ మిథ్యాగ్రంథాలలో గల సత్యాన్ని తెలుసుకోవాలని ప్రయత్నిస్తే మిథ్యావిషయాలుకూడా అతని కంఠంలో తగుల్కొంటాయి. **"అసత్యమిశ్రం సత్యం దూరతస్త్యాజ్యమితి"** అంటే 'అసత్యాలు గల గ్రంథంలోని సత్యాన్ని విషంతో కూడిన అన్నం వలె దూరంగా త్యజించాలి.'

ప్రశ్న:- మీ మత మేమి?

జవాబు:- మా మతం వేదం. వేదంలో చెప్పిన విధంగా కర్తవ్యాలను ఆచరించటం, త్యాజ్యాలను, మిథ్యలను, విడిచిపెట్టటం. అందుకే మాకు వేదం మాన్యం ప్రమాణం.

ఈ విధంగా అంగీకరిస్తూ మానవులందరూ విశేషంగా ఆర్యులు ఐకమత్యంతో కలిసిమెలసి ఉండాలి.

షడ్దర్శనాల అవిరోధం

ప్రశ్న:- ఇతర గ్రంథాలలో సత్యాసత్యాలు పరస్పర విరుద్ధాలన్నట్లు మీరు చదువుమని చెప్పిన, శాస్త్రాలలో కూడా ఉన్నాయి. సృష్టి విషయంలో ఆ ఆరు శాస్త్రాలలో పరస్పర విరోధం కనిపిస్తుంది. మీమాంస కర్మతో, వైశేషికం కాలంతో, న్యాయం పరమాణువులతో, యోగం పురుషార్థంతో, సాంఖ్యం ప్రకృతితో, వేదాంతం బ్రహ్మతో సృష్టి జరిగిందని చెబుతున్నాయి. ఇది విరోధం కాదా?

జవాబు:- వీటిలో విరోధం లేదు. సాంఖ్య, వేదాంతాలలో తప్ప మిగిలిన నాలుగు శాస్త్రాలలో సృష్ట్యుత్పత్తితి ప్రసిద్ధంగా వ్రాయబడలేదు. మీకు విరోధమంటేమిటో, అవిరోధమంటేమిటో తెలియదు. విరోధం ఏ విషయంలో ఉంటుంది? ఒకే విషయమంలోనా? లేక భిన్న విషయాల లోనా?

ప్రశ్న:- ఒకే విషయంలో అనేకుల పరస్పర విరుద్ధాభిప్రాయాలను 'విరోధం' అంటారు. వీటిలో సృష్టివిషయంలో విరోధమున్నది.

జవాబు:- విద్య ఒకటా లేక అనేకమా? ఒకటే అయితే వ్యాకరణం, వైద్యం, జ్యోతిషం మొదలైన విషయాలు ఎందుకున్నాయి? ఒక విద్యలో ఆ విద్యకు సంబంధించిన అవయవాల ప్రతిపాదన ఒకదాని కంటె మరొకటి భిన్న భిన్నంగా చేయబడుతుంది. అలాగే, సృష్టివిద్య యొక్క విభిన్నాలైన అవయవాల ఆరింటిని ఆరు శాస్త్రాలు ప్రత్యేకంగా ప్రతిపాదిస్తున్నాయి. కాబట్టి వీటిలో విరోధమేమీ లేదు. కుండను చేయుటకు 'కర్మ, కాలం, మన్ను, ఆలోచన, సంయోగ వియోగాది పురుషార్థాలు, ప్రకృతి గుణాలు, కుమ్మరివాడు కారణాలు' అయినట్లు సృష్టికి కారణాలైన 'కర్మ' యొక్క వ్యాఖ్య వైశేషికంలో, 'ఉపాదాన కారణం' యొక్క వ్యాఖ్య న్యాయంలో, 'పురుషార్థం' యొక్క వ్యాఖ్య యోగంలో,

'తత్వముల అనుక్రమానుసారమైన పరిగణన' యొక్క వ్యాఖ్య సాంఖ్యంలో, 'నిమిత్తకారణుడైన పరమేశ్వరు'ని వ్యాఖ్య వేదాంతశాస్త్రంలో కలదు. ఇలా వీటిలో విరోధమేమీ లేదు. వైద్యశాస్త్రంలో 'రోగనిదానం, చికిత్స, ఔషధం, పథ్యం' మొదలైన విషయాలు వేరు వేరు ప్రకరణాలలో చెప్పినా రోగనివృత్తి కావించటమే అన్నింటి సిద్ధాంతం. అలాగే సృష్టికి ఆరు కారణాలున్నాయి. ఆ కారణాలలో ఒక్కొక్కదానిని గురించి ఒక్కొక్క శాస్త్రకారుడు వ్యాఖ్యానించాడు. కావున వీటిలో ఏమాత్రం విరోధం లేదు. దీనిని గురించిన విశేష వ్యాఖ్యను ఎనిమిదవ సముల్లాసములో చదువగలరు.

పఠన పాఠనలలో కలుగు విఘ్నాలు

పఠన-పాఠనాలలో కలిగే విఘ్నాలను విడవాలి. "దుష్టులైన కాముక జనుల సహవాసం, మద్యపానం, వేశ్యాగమనం మొదలైన దుర్వ్యసనాలు; ఇరవై ఐదేళ్ల పూర్వం పురుషునికి, పదహారేళ్లకు పూర్వం స్త్రీలకు జరిగే బాల్యవివాహాలు; పూర్ణ బ్రహ్మచర్యాన్ని పాటించకుండుట, రాజు, తల్లిదండ్రులు, విద్వాంసునియందు, వేదాదిశాస్త్రాలలో ప్రేమలేకుండుట, అతి భోజనం, అతి జాగరణం, చదవటంలో, చదివించటంలో, పరీక్షించటంలో, పరీక్షనొసగటంలో ఆలస్య కపటాదులు కలిగి ఉండటం. అన్నింటికన్న మిన్నగా విద్యాలాభం నెరుగకుండటం, బ్రహ్మచర్యాన్ని, వీర్యం, బలం, బుద్ధి పరాక్రమం, ఆరోగ్యం, రాజ్యం, ధనం మొదలైనవి అభివృద్ధి చెందుతాయని అంగీకరించకుండటం, ఈశ్వరధ్యానం వీడి అన్య పాషాణాది జడవిగ్రహాలను దర్శించి పూజించుటకై వ్యర్థంగా కాలాన్ని గడపటం, తల్లిదండ్రులను, అతిథిని ఆచార్యుని, విద్వాంసులను సత్యమూర్తులని తలచే వారి సేవాసత్సంగాలను చేయకుండటం, వర్ణాశ్రమధర్మాలను వీడి ఊర్ధ్వపుండ్రాలను, త్రిపుండ్రాలను, తిలకాన్ని, మెడలో మాలలను ధరించటం, ఏకాదశి, త్రయోదశి మొదలైన వ్రతాలను నమ్ముతూ చేయటం, కాశి మొదలైన తీర్థాల వలన, రామ, కృష్ణ, నారాయణ, శివ, భగవతీ, గణేశాది నామస్మరణం వలన పాపాలు తొలగుతాయని విశ్వసించటం, మూర్ఖుల ఉపదేశాలను విని విద్యను నేర్చుకోవటంలో అశ్రద్ధ చూపటం, విద్య, ధర్మం, యోగం, పరమేశ్వరోపాసనం లేకుండానే, అజ్ఞానాలతో నిండిన పురాణాలని పిలువబడు భాగవతాదులలోని కథలు వినిన ముక్తి కలుగునని నమ్మటం, భోజనాన్ని ధనాదులను సంపాదించుటలో నిమగ్నమై విద్యలో ప్రీతి కలిగిఉండకపోవటం, అటు నిటు వ్యర్థంగా తిరగటం" మొదలైన మిథ్యావ్యవహారాలు విద్యనేర్చుకోవటంలో, నేర్పించటంలో విఘ్నాలు కలిగిస్తాయి. ఈ వ్యవహారాలలో చిక్కుకున్నవారు బ్రహ్మచర్యాన్ని, విద్యవలన కలిగే లాభాలను పొందక మూర్ఖులై, రోగగ్రస్తులై ఉంటారు.

నేటి సంప్రదాయవాదులు, స్వార్థపరులైన బ్రాహ్మణులు మొదలైనవారు ఇతరులను విద్య నేర్చుకోకుండా చేసి, సత్సంగాలకు పోనివ్వక తమ మోసాలలో బంధించి (జిక్కించుకొని) వారి శరీరాన్ని, మనస్సును, ధనాన్ని నష్టపరుస్తారు. క్షత్రియాది వర్ణాలవారు చదివితే విద్వాంసులై తమ పాషండజాలం నుండి దూరమవుతారని, తమ ఛలకపటాలను తెలుసుకొని తమకు అవమానం కలిగిస్తారని భావించి విద్యను బోధించారు. కావున రాజూ, ప్రజలూ పైన తెలపిన విఘ్నాలను దూరం చేసి తమ బాలబాలికలను విద్వాంసులుగా చేయుటకై తనుమనోధనంతో ప్రయత్నించాలి.

స్త్రీ - శూద్రులకు వేదాధికారం

ప్రశ్న:- స్త్రీలూ, శూద్రులూ వేదం చదువవచ్చా? వీరు చదివితే మేమేమి చేయాలి? 'వీరు చదవాలి' అనటానికి ప్రమాణాలు కూడా లేవు. "స్త్రీ శూద్రౌ నాధీయాతామితి శ్రుతేః" అంటే స్త్రీలు శూద్రులు చదువకూడదని శ్రుతి కూడా నిషేధిస్తున్నది గదా?

జవాబు:- స్త్రీపురుషులందరూ అంటే ప్రతి మనిషికీ చదవటానికి అధికారమున్నది. మీరు చెప్పిన శ్రుతి వాక్యం మీ కపోలకల్పనయే. ఇది ఏ ప్రామాణిక గ్రంథంలోనూ లేదు. యజుర్వేదంలోని ఇరవైఆరవ అధ్యాయంలో రెండవ మంత్రంలో మానవులందరూ వేదాది శాస్త్రాలను చదవటానికి, వినటానికి అధికారం కల్గి ఉన్నారని ప్రమాణమున్నది:

యథేమాం వాచం కల్యాణీమావదాని జనేభ్యః ।
బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయ చార్యాయ చ స్వాయ చారణాయ ॥ యజు. 26-2 ॥

పరమేశ్వరుడు చెబుతున్నాడు:- యథా = ఎలా నేను; జనేభ్యః = మానవులందరికొరకు ఇమాం = ఈ; కల్యాణీమ్ = కల్యాణమంటే ఐహిక పరలోక సుఖాన్ని ఇచ్చే; వాచమ్ = ఋగ్వేదాది నాలుగువేదాలలో గల వాణిని; ఆవదాని = ఉపదేశిస్తున్నాను. అలాగే మీరూ చదివి, చదివించండి.

ప్రశ్న:- ఈ సందర్భంలో ఎవరైనా ఇలా ప్రశ్నించగలరు. స్మృత్యాది గ్రంథాలలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకే వేదం చదటానికి అధికారమున్నది. కాబట్టి ఈ మంత్రంలోగల 'జన' శబ్దం నుండి ద్విజులనే గ్రహించాలి. స్త్రీలను, శూద్రాది వర్ణాల వారిని కాదు.

జవాబు:- చూడండి పరమేశ్వరుడు స్వయంగా ఇలా చెబుతున్నాడు.

బ్రహ్మరాజన్యాభ్యాం = నేను బ్రాహ్మణులకు, క్షత్రియులకు; అర్యాయ = వైశ్యులకు; శూద్రాయ = శూద్రులకు స్వాయ = వారి స్త్రీలకు, సేవకులకు; అరణాయ = అతిశూద్రాది జనులకు వేదాలను ప్రకాశపరచినాను. మానవులందరూ వేదాలను చదివి, చదివించి, విని, వినిపించి, విజ్ఞానాన్ని పెంపొందించుకొని, మంచిమాటలను గ్రహించి, చెడుమాటలను విడిచి, దుఃఖాల నుండి తొలగి ఆనందాన్ని పొందాలి.

ఇప్పుడు చెప్పండి. మీమాట వినాలా? లేక పరమేశ్వరునిదా? పరమేశ్వరుని మాటే తప్పక పాటించదగింది. ఇంత చెప్పినా అంగీకరించనివారు నాస్తికులు అనబడతారు. **"నాస్తికో వేదనిందకః"** వేదాలను నిందిస్తూ వాటిని అంగీకరించనివారు నాస్తికులనబడతారు. ఏమి? పరమేశ్వరుడు శూద్రుల మేలును కోరడా? వేదాలను శూద్రులు చదువకూడదని, వినకూడదని నిషేధించి ద్విజులకే అలాంటి అధికారాన్ని ఇవ్వటానికి పరమేశ్వరుడు పక్షపాతియా? శూద్రులు చదువకూడదని, వినకూడదని పరమేశ్వరుని అభిప్రాయమే అయితే వారి శరీరాలలో చెవులు, నాలుక సృజించపకుండా ఉండేవాడు. పృథ్వి, జలం, అగ్ని, వాయువు, చంద్రుడు, సూర్యుడు మొదలైన అన్నాదిపదార్థాలను పరమాత్ముడు అందరి కొరకు సృజించినట్లు వేదాన్ని కూడా జనులందరికీ ప్రకాశపరచినాడు.

ఎక్కడైనా నిషేధముంటే దాని అభిప్రాయం ఇది: చదివినా, చదివిస్తున్నా ఏమాత్రం గ్రహించని బుద్ధిహీనులైన మూర్ఖులనే శూద్రులంటారు. అలాంటి వారు చదవటం వ్యర్థమే అవుతుంది. ఇక

స్త్రీలు చదువరాదని నిషేధించటం మీ మూర్ఖత, స్వార్థత, బుద్ధిహీనతల ప్రభావమే. చూడండి! 'కన్యలు చదువుకోవాలి' అనటానికి వేదంలో ప్రమాణమున్నది.

బ్రహ్మచర్యేణ కన్యా యువానం విందతే పతిమ్ ॥ (అథర్వ. కాం. 11 మం. 18 ॥)

బాలురు బ్రహ్మచర్యాన్ని అవలంబించి సంపూర్ణ విద్యను నేర్చుకొని సుశిక్షితులై తమకు అనుకూలవతియైన యువతిని, విద్వాంసురాలును, ప్రియురాలును, తనతో సమానురాలైన స్త్రీని వివాహమాడునట్లు; కన్యా = కుమారి; బ్రహ్మచర్యేణ = బ్రహ్మచర్యాన్ని అవలంబించి, వేదాది శాస్త్రాలను చదివి, పూర్ణ విద్యను నేర్చి, ఉత్తమ శిక్షణను పొంది, యువతియై, పూర్ణయువావస్థలో, తనతో సమానుడు, ప్రియుడు, విద్వాంసుడునగు యువానమ్ = పూర్ణయువావస్థలో గల పురుషుని; పతిం విందతే = పతిగా పొందాలి. కావున స్త్రీలు కూడా బ్రహ్మచర్యాన్ని పాటించి తప్పక విద్యను నేర్చుకోవాలి.

ప్రశ్న:- స్త్రీలు కూడ వేదాన్ని చదవాలా?

జవాబు:- తప్పక చదవాలి. చూడండి శ్రౌత సూత్రాలలో ఏమున్నదో -

"ఇమం మంత్రం పత్నీ పఠేత్" అని కలదు. అంటే యజ్ఞంలో స్త్రీ ఈ మంత్రాన్ని చదవాలని అర్థం. స్త్రీలు వేదాది శాస్త్రాలను చదువకపోతే యజ్ఞ సమయంలో స్వరసహితంగా మంత్రాలను ఉచ్చరిస్తూ, సంస్కృత భాషను ఎలా మాట్లాడగలదు? భారతీయ నారీమణులలో రత్నాలవంటివారైన గార్గి మొదలైన స్త్రీలు వేదాది శాస్త్రాలను చదివి పూర్ణవిదుషీమణులుగా అయినట్లు శతపథ బ్రాహ్మణంలో స్పష్టంగా వ్రాయబడి ఉన్నది. పురుషుడు విద్వాంసుడై, స్త్రీ అవిద్యావతి అయిననూ, స్త్రీ విద్వాంసురాలై పురుషుడు అవిద్వాంసుడైననూ గృహంలో ప్రతి నిత్యం దేవాసుర సంగ్రామమే జరుగుతుంది. సుఖమనేది ఉండదు. స్త్రీ చదువనిచో కన్యాపాఠశాలలో అధ్యాపికలు ఎక్కడి నుండి వస్తారు? రాజకార్యాలు న్యాయాధీశత్వం మొదలైనవి, భర్తను భార్య, భార్యను భర్త ప్రసన్నులుగా ఉంచవలసిన గృహస్థాశ్రమ కార్యాలు, స్త్రీ అధీనంలోనే ఉండాల్సిన సమస్త గృహకార్యాలు విద్య లేకుండా ఎన్నడు కూడా బాగా జరగలేవు.

ఆర్యావర్తంలో రాజపురుషులు, స్త్రీలు ధనుర్వేదాన్ని అనగా యుద్ధవిద్యను బాగా తెలుసుకొని ఉన్నారు. అలా నేర్వకున్న దశరథ మహారాజు వెంట యుద్ధంలోనికి కైకేయి పోయి ఉండేది కాదు. యుద్ధం కూడా చేసేది కాదు. అందువల్లనే బ్రాహ్మణ స్త్రీలు సమస్త విద్యలను, క్షత్రియ స్త్రీలు సమస్త విద్యలతో పాటు యుద్ధాన్ని రాజవిద్యా విశేషాలను వైశ్య స్త్రీలు వ్యవహార విద్యను, శూద్ర స్త్రీలు పాకాది సేవా విద్యలను తప్పక నేర్చుకోవాలి.

పురుషులు కనీసం వ్యాకరణాన్ని, ధర్మాన్ని, ఇతర వ్యవహార విద్యలను నేర్చుకోవాలి. స్త్రీలుకూడా వ్యాకరణాన్ని, ధర్మాన్ని, వైద్యాన్ని, గణితాన్ని, శిల్పవిద్యలను తప్పక నేర్చుకోవాలి. వీటిని నేర్చుకోకపోతే సత్యం అసత్యాల నిర్ణయాన్ని, పతి మొదలైనవారికి అనుకూలంగాప్రవర్తించటం, యథా యోగ్యంగా సంతానాన్ని కని, పాలించి పెద్ద చేసి సుశిక్షణ గలవారినిగా చేయటం, గృహకార్యాలన్నింటిని బాగా చేయటం, చేయించటం, వైద్య విద్య నేర్చుకొని గృహంలోనివారికి ఎన్నడూ రోగాలు రాకుండేటట్లు, అందరు ఎల్లప్పుడు ఆనందంగా ఉండేటట్లు ఔషధ ప్రాయంగా భోజన పానీయాలను సిద్ధం చేయటం చేయించటం జరగవు.

శిల్పవిద్య తెలియకపోతే గృహనిర్మాణాన్ని చేయలేరు. వస్త్ర ఆభూషణాలను చేసుకోలేరు, చేయించలేరు. గణిత విద్య రానిచో లెక్కలు తెలుసుకోలేరు, తెలపలేరు. వేదాది శాస్త్ర విద్యలను నేర్చుకోకపోతే ఈశ్వరున్ని, ధర్మాన్ని గ్రహించలేరు. అధర్మం నుండి ఎన్నడూ తొలగలేరు. తమ బాలబాలికలకు బ్రహ్మచర్యాన్ని, ఉత్తమ విద్యా శిక్షణలను ఇచ్చి వారి శరీరంలోనూ, ఆత్మయందూ సంపూర్ణబలాన్ని పెంపొందింపజేయు తల్లిదండ్రులే ధన్యవాదాలకు అర్హులు. వారే కృతకృత్యులు. ఇలాంటి సంతానమే తమ తల్లి, తండ్రి, అత్త, మామ, రాజు, ప్రజలు, ఇరుగుపొరుగు, ఇష్టమిత్రులు, సంతానం మొదలైనవారితో ధర్మానుసారంగా యథాయోగ్యంగా ప్రవర్తిస్తారు.

విద్య - అక్షయకోశం

ఇది అక్షయకోశం. దీని నెంత వ్యయం చేసినా వృద్ధి చెందుతూనే ఉంటుంది. ఇతర ధనాది కోశాలు వ్యయం చేసిన కొద్దీ తగ్గిపోతాయి. పాలివారు కూడా ధనములో నుండి తమ భాగాన్ని తీసుకొంటారు. కాని, ధనము విద్యాధనాన్ని దొంగలు అపహరించలేరు. పాలివారు పంచుకోలేరు. అక్షయకోశమైన ఈ విద్యానిధిని రక్షిస్తూ వృద్ధిచేసేవారు విశేషంగా రాజూ ప్రజలే అని తెలుసుకోవాలి.

కన్యానాం సంప్రదానం చ కుమారాణాం చ రక్షణమ్ ॥ మను. 7 - 152 ॥

బాలబాలికలను నియమిత కాలం వరకు బ్రహ్మచర్యపాలనం చేయించి విద్వాంసులుగా చేయటం రాజు యొక్క ధర్మం. ఈ అజ్ఞను ఉల్లంఘించే తల్లిదండ్రులకు రాజదండన విధించాలి. రాజాజ్ఞ ప్రకారంగా ఎనిమిదేళ్ల తర్వాత బాలబాలికలు తమ గృహాలలో ఉండక గురుకులాలలో నివసిస్తూ విద్యను అభ్యసించాలి. సమావర్తన సమయం రానంతవరకు గురుకులంలోనే ఉండాలి. అంతలోపల వివాహాన్ని చేయరాదు. చేసుకోరాదు.

విద్యాదానం సర్వశ్రేష్ఠం

సర్వేషామేవ దానానాం బ్రహ్మదానం విశిష్యతే ।
వార్యన్నగోమహీవాసస్తిలకాంచనసర్పిషామ్ ॥ మను. 4-233 ॥

లోకంలో చేయబడే 'జలం, అన్నం, గోవులు, పృథ్వి, వస్త్రాలు, నువ్వులు, సువర్ణం, ఘృతం' మొదలైన దానా లన్నింటిలోనూ 'వేదవిద్యాదానం మిక్కిలి శ్రేష్ఠమైనది'. కాబట్టి సాధ్యమైనంతవరకు తనుమనుధనాలతో విద్యాభివృద్ధికై యత్నించాలి. యథాయోగ్యంగా బ్రహ్మచర్యం, విద్య, వేదోక్త ధర్మాలు ప్రచారంలో గల దేశమే భాగ్యవంతమైనదేశము.

బ్రహ్మచర్యాశ్రమ శిక్షణ ఇక్కడ సంక్షిప్తంగా వ్రాయబడింది. ఇకముందు చతుర్థ సముల్లాసంలో సమావర్తనం, వివాహం, గృహస్థాశ్రమ విషయాలు వ్రాయబడుతాయి.

శ్రీమద్దయానంద సరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన
సత్యార్థప్రకాశంలో శిక్షా విషయక
తృతీయ సముల్లాసం సంపూర్ణం.

చతుర్థ సముల్లాసము

అథ సమావర్తన - వివాహ గృహాశ్రమవిధిం వక్ష్యామః
ఇక సమావర్తన, వివాహ, గృహస్థాశ్రమ విధులను వివరిస్తాము

గృహస్థమునకు అధికారి

వేదానధీత్య వేదౌ వా వేదం వాపి యథాక్రమమ్ ।
అవిప్లుతబ్రహ్మచర్యో గృహస్థాశ్రమమావిశేత్ ॥ మను. 3.2 ॥

శాస్త్ర విధి ననుసరించి బ్రహ్మచర్యకాలంలో ఆచార్యునికి అనుకూలంగా ప్రవర్తించి, ధర్మానుసారంగా నాలుగు వేదాలను లేదా మూడు వేదాలనైనా, రెండు లేక ఒక వేదాన్నైనా సాంగోపాంగంగా చదివి, అఖండ బ్రహ్మచర్యాన్ని పాటించి స్త్రీ పురుషులు గృహస్థాశ్రమంలో ప్రవేశించాలి.

తం ప్రతీతం స్వధర్మేణ బ్రహ్మదాయహరం పితుః ।
స్రగ్విణం తల్ప ఆసీనమర్హయేత్ప్రథమం గవా ॥ **మను. 3-3**

వేదాధ్యయనరూప ధర్మాన్ని చక్కగా పాటించి బ్రహ్మదాయమనబడే విద్యారూప భాగాన్ని గ్రహించిన బ్రహ్మచారిని తండ్రిగాని, గురువుగాని ఉన్నతాసనముపై కూర్చుండబెట్టి పూలమాలతో అలంకరించి, గోదానవ్రతం చేయించాలి. ఈ బ్రహ్మచారిని కన్యయొక్క తండ్రి కూడా గోదానంతో సత్కరించాలి.

గురుణానుమతః స్నాత్వా సమావృత్తో యథావిధి ।
ఉద్వహేత ద్విజో భార్యాం సవర్ణాం లక్షణాన్వితామ్ ॥ మను. 3-4

గురువుయొక్క ఆజ్ఞతో స్నానం చేసి, గురుకులంనుండి అనుక్రమపూర్వకంగా సమావర్తన

సంస్కారమును చేసుకొని వచ్చిన బ్రహ్మచారి స్వవర్ణము అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యవర్ణాలకు చెందినవారు తమ వర్ణానికి అనుకూలమైన, సుందర లక్షణాలు కలదైన కన్యను వివాహమాడాలి.

అసపిండా చ యా మాతురసగోత్రా చ యా పితుః ।
సా ప్రశస్తా ద్విజాతీనాం దారకర్మణి మైథునే ॥ మను. 3-5

తల్లికి సపిండురాలు (తల్లివంశానికి చెందినది) కానిది, తండ్రికి సగోత్రురాలు కానటువంటి కన్యను వివాహమాడటం మంచిది.

దీనివలన ప్రయోజనమేమంటే -

'పరోక్షప్రియా ఇవ హి దేవాః ప్రత్యక్షద్విషః ॥ శత 14-6-11-2 ॥

పరోక్ష (కనపడని) పదార్థంలో ప్రీతి ఉన్నట్లు, ప్రత్యక్షమందు ఉండదనటం నిశ్చిత సత్యం. పంచదార, పటికబెల్లంయొక్క గుణాలను విని, దానిని ఎప్పుడూ తిననివారి మనస్సు ఎప్పుడూ దానిలోనే లగ్నమై ఉన్నట్లు, ఏదైనా పరోక్షవస్తువు యొక్క ప్రశంసను విన్నప్పుడు దానిని పొందాలి అన్న కోరిక బలంగా కలుగుతుంది. కాబట్టి తన గోత్రానికి, తల్లి వంశానికి దగ్గరి సంబంధం లేని, దూరస్థురాలైన కన్యను వరుడు వివాహమాడాలి. సమీప లేక దూర వివాహాల వలన కలుగు లాభనష్టాలను గురించి సంక్షిప్తంగా క్రింద వ్రాస్తాము.

సమీప వివాహ దోషాలు - దూర వివాహ గుణాలు

ఒకటి:- బాల్యావస్థలో కలిసిమెలిసి ఉన్న బాలబాలికలు పరస్పరం పోట్లాడుతూ, ఆడుకుంటూ, ప్రేమించుకొంటూ ఉండటం సహజం. దీనివలన ఒకరికొకరు పరస్పర గుణ, దోష, స్వభావాలను, బాల్యావస్థలోని విపరీత ఆచరణాలను తెలుసుకొంటారు. చిన్నతనంలో పరస్పరం నగ్నంగా ఉండటాన్ని కూడా చూస్తూ ఉంటారు. అలాంటివారికి పరస్పరం వివాహం జరిగితే వారిలో ప్రేమలు అంతగా ఉండలేవు.

రెండు:- నీటిలో నీరు కలసిన విలక్షణ గుణం ఏర్పడదు. అలాగే ఒకే గోత్రం గల, పితృవంశం వారితో గాని, మాతృవంశంవారితో గాని పరస్పర వివాహం జరిగితే, వారి శరీరధాతువులలో మార్పు జరుగనందున ఉన్నతి కలుగదు.

మూడు:- పాలలో పంచదార గాని శొంఠి మొదలైన ఔషధాలు గాని కలిసినచో ఉత్తమ గుణం ఏర్పడుతుంది. అలాగే వేరువేరు గోత్రాలు కల్గి మాతృపితృవంశాలకు చెందని స్త్రీ పురుషులు వివాహమాడటం మిక్కిలి ఉత్తమం.

నాలుగు:- ఒక దేశంలోని రోగి మరొక దేశంలోనికి వెళ్ళి వాయుసేవనం చేయటం వలన, ఆహార పానీయాలలోని మార్పుల వలన రోగరహితుడవుతాడు. కాబట్టి దూరదేశాలలోనివారితో వివాహాలు జరపటం మిక్కిలి గుణదాయకం.

ఐదు:- సమీపసంబంధంతో ఒకరికొకరు దగ్గరగా ఉండటం వలన పరస్పరం సుఖదుఃఖాలను తెలుసుకొనటం వాటితో విరోధాలు పెట్టుకొనటం సంభవమవుతుంది. ఇలా దూరదేశస్థులవారితో జరగదు. దూరస్థులతో వివాహమైతే చాలా దూరం వరకు ప్రేమలత కూడ వ్యాపిస్తుంది. అలా దగ్గరి వివాహాలలో జరగదు.

ఆరు:- దూర సంబంధం వలన దూరదేశాలకు వెళ్ళటం, అక్కడ ఉండే మనుషులతో, పదార్థాలతో సంబంధం ఏర్పడటం సులభంగా కలుగుతుంది. దగ్గరి వివాహాలలో ఇలా జరగదు. అందుకే,

దుహితా దుర్హితా దూరే హితా భవతీతి ॥ నిరుక్త 3-4 ॥

కన్యకు వివాహం దూరదేశస్థ వ్యక్తితో జరిగిన హితకారి అవుతుంది. అలాగే దగ్గరివారి వివాహంలో జరగదు. కాబట్టే కన్యకు 'దుహిత' అని పేరు. దూరంలో ఉండి హితం చేస్తుందని 'దుహిత' పదానికి అర్థం.

ఏడు:- కన్యయొక్క తండ్రి కుటుంబం పేదరికంతో ఉండటం వలన కన్య తన పుట్టినింటికి వచ్చినప్పుడల్లా ఆమెకు ఏదో ఒకటిచ్చి పంపవలసిన స్థితి తల్లిదండ్రులకు కలుగుతుంది. సమీపంలో ఉండడంవలన పుట్టింటికి రాకపోకలు కూడా ఎక్కువగా జరగటం సామాన్యం. కన్య తండ్రి ఇంటికి వచ్చినపుడల్లా ఆమెకు ఏమైన ఇవ్వవలసి వస్తుంది.

ఎనిమిది:- సమీప వివాహాన్ని చేసుకోవటంవల్ల కన్య తమ పుట్టింటి సహాయం లభిస్తుందనుకొని గర్వం చెందుతుంది. ఎప్పుడైనా ఇరువురిలో అభిప్రాయ భేదాలు కలిగితే వెంటనే స్త్రీ తన తల్లిగారింటికి వెళ్ళిపోతుంది. పరస్పర నిందలు అధికమవుతాయి. విరోధాలు కూడా పెరుగుతాయి. ఎందుకంటే సామాన్యంగా స్త్రీల స్వభావం తీక్ష్ణంగా, కోమలంగా ఉంటుంది. ఈ కారణాల వలన తండ్రి గోత్రం గలవారితో, తల్లి యొక్క ఆరు తరాల వారితో, సమీప దేశస్థులతో వివాహం చేసుకోవటం మంచిది కాదు. ఇలా ఎన్నో కారణాలను ఊహించవచ్చు.

వివాహ విషయంలో స్త్రీ పురుషుల పరీక్ష

1. **మహాన్త్యపి సమృద్ధాని గోऽజావి ధన ధాన్యతః ।**
స్త్రీసంబంధే దశైతాని కులాని పరివర్జయేత్ ॥ మను. 3-6

ధనం, ధాన్యం, గోవులు, మేకలు, ఏనుగులు గుఱ్ఱాలు, రాజ్యం, ఐశ్వర్యం మొదలైనవి ఎంత సమృద్ధిగా కలిగి ఉన్నా వివాహసంబంధంలో ఈ క్రింద వ్రాయబడిన పది వంశాలవారిని వదలిపెట్టాలి.

2. **హీన క్రియం నిష్పురుషం నిశ్ఛందో రోమశార్శసమ్ ।**
క్షయ్యామయావ్యపస్మారిశ్విత్రికుష్ఠికులాని చ ॥ మను. 3-7 ॥

సత్క్రియలు జరగని, సత్పురుషులు లేని, వేదాధ్యయనం చేయని కులాలలో; శరీరంపై దీర్ఘరోమాలు, మూలవ్యాధి, క్షయ, దమ్ము, దగ్గు, అజీర్ణ రోగము, మూర్ఛ, శ్వేతకుష్ఠ గల వంశాలలో పుట్టిన కన్యలతో, వరులతో వివాహం జరగకూడదు. ఎందుకంటే ఈ దుర్గుణాలు, రోగాలు వివాహం చేసుకొన్నవారి వంశంలోకి ప్రవేశిస్తాయి. కాబట్టి ఉత్తమ వంశంలోని బాలబాలికలకే పరస్పరం వివాహం జరగాలి.

3. **నోద్వహేత్కపిలాం కన్యాం నాఽధికాంగీం న రోగిణీమ్ ।**
నాలోమికాం నాతిలోమాం న వాచాటాం న పింగళామ్ ॥ మను. 3-8 ॥

కపిల (పీత) వర్ణం ఉన్నదాన్ని, పురుషుని కన్న ఎత్తు, లావు అధిక బలిష్ఠమైన శరీరం ఉన్నదాన్ని, రోగం ఉన్నదాన్ని, శరీరంపై అధికంగా రోమాలు ఉన్నదాన్ని, పూర్తిగా రోమాలు లేనిదాన్ని, వదరుబోతు, పిల్లికన్నుల దాన్ని వివాహం చేసుకోవద్దు.

4. **నర్క్ష వృక్షనదీనామ్నీం నాంత్యపర్వతనామికామ్ ।**
న పక్ష్యహి ప్రేష్యనామ్నీం న చ భీషణనామికామ్ ॥ మను. 3-9 ॥

అశ్విని, భరణి, రోహిణీదేవి, రేవతీబాయి, చిత్ర మొదలైన నక్షత్రాల పేర్లు ఉన్నదాన్ని తులసి, బంతి, గులాబి, చంపా, చమేలీ మొదలైన వృక్షాల పేర్లు ఉన్నదాన్ని; గంగ, యమున మొదలైన నదుల పేర్లు ఉన్నదాన్ని; చాండాలి మొదలైన హీనజాతి అంత్య పేర్లు ఉన్నదాన్ని; వింధ్య, హిమాలయ మొదలైన పర్వత పేర్లు ఉన్నదాన్ని; కోకిల, గోరువంక మొదలైన పక్షుల పేర్లు ఉన్నదాన్ని; నాగిని, భుజంగాది మొదలైన సర్పాల పేర్లు ఉన్నదాన్ని; మాధవదాసి, మీరాదాసి మొదలైన దాసీ పేర్లు ఉన్నదాన్ని, భీమకుమారి, చండిక, కాళి మొదలైన భీషణ పేర్లు ఉన్నదాన్ని వివాహం చేసుకోవద్దు. ఎందుకంటే ఈ పేర్లు కుత్సితములై ఉండటమే కాక, ఇతర పదార్థాలకు చెందివై ఉన్నాయి.

5. **అవ్యంగాంగీం సౌమ్యనామ్నీం హంసవారణగామినీమ్ ।**
తనులోమకేశదశనాం మృద్వంగీ ముద్వహేత్ స్త్రియమ్ ॥ మను. 3-10

వంకరటింకరలేని, సుందరమైన, చక్కని, సరళమైన, కోమలమైన అవయవాలు ఉన్నదాన్ని; యశోద, సుఖద మొదలైన సుందరమైన పేర్లు ఉన్నదాన్ని; హంసగమనం, గజ గమనం ఉన్నదాన్ని; సూక్ష్మమైన రోమాలు కలిగి అందమైన కేశాలు (వెంట్రుకలు), కోమలమైన దంతాలు ఉన్నదాన్ని, మృదువైన శరీరాంగాలు ఉన్నదాన్ని వివాహం చేసుకోవాలి.

వివాహ వయస్సు

ప్రశ్న:- వివాహానికి ఏ సమయం, ఏ పద్ధతి మంచిది?

జవాబు:- పదహారవ ఏటి నుండి ఇరవై నాలుగేళ్ల వరకు కన్య, ఇరవై ఐదవ (25)

ఏట నుండి నలభై ఎనిమిదవ (48) ఏటి వరకు పురుషుడు వివాహం చేసుకోవడానికి ఉత్తమ సమయం. ఏ దేశంలో ఇలాంటి శ్రేష్ఠమైన వివాహ పద్ధతి, బ్రహ్మచర్యం, విద్యాభ్యాసం అధికంగా ప్రచారంలో ఉంటుందో ఆ దేశం సుఖసంతోషాలతో తులతూగుతుంది. ఎక్కడ బ్రహ్మచర్యం, విద్యాభ్యాసం లేకుండానే బాల్యావస్థలో అయోగ్యులకు వివాహం చేస్తారో ఆ దేశం దుఃఖసముద్రంలో మునిగిపోతుంది. బ్రహ్మచర్యంతో విద్యాగ్రహణం పూర్తిచేసిన తర్వాత వివాహం చేసికొనే పద్ధతి ఉన్నప్పుడే అన్ని విషయాలు చక్కబడతాయి. ఈ పద్ధతి చెడితే అన్నీ చెడిపోతాయి.

ప్రశ్న:- **అష్టవర్షా భవేద్గౌరీ నవవర్షా చ రోహిణీ ।**
దశవర్షా భవేత్కన్యా తత ఊర్ధ్వం రజస్వలా ॥ 1 ॥

మాతా చైవ పితా తస్యా జ్యేష్ఠో భ్రాతా తథైవ చ ।
త్రయస్తే నరకం యాంతి దృష్ట్వా కన్యాం రజస్వలామ్ ॥ 2 ॥

పారాశరీ స్మృతి, లఘు పాఠము అధ్యా. 7 శ్లోకం 6, 8

ఇందులో మొదటి శ్లోకం పారాశరీ, రెండవ శ్లోకం శీఘ్రబోధలో వ్రాయబడి ఉన్నాయి. వీటి అర్థం ఇది: కన్యను ఎనిమిదవయేట 'గౌరి' అనీ, తొమ్మిదవయేట 'రోహిణి' అనీ, పదవయేట 'కన్య' అనీ తర్వాత 'రజస్వల' అనీ చెప్తారు. పదేళ్లు వచ్చేలోపు వివాహం చేయకపోతే రజస్వల కన్యను చూసిన తల్లిదండ్రులు, పెద్దన్న, ఈ ముగ్గురు నరకాన్ని పొందుతారు.

సమాధానం: బ్రహ్మోవాచ - బ్రహ్మ పలికెను:

ఏకక్షణా భవేద్గౌరీ ద్విక్షణేయం తు రోహిణీ ।
త్రిక్షణా సా భవేత్కన్యా హ్యత ఊర్ధ్వం రజస్వలా ॥ 1 ॥

మాతా పితా తథా భ్రాతా మాతులో భగినీ స్వకా ।
సర్వే తే నరకం యాంతి దృష్ట్వా కన్యాం రజస్వలామ్ ॥ 2 ॥

ఇది సద్యోనిర్మిత బ్రహ్మపురాణ వచనం

అర్థం:- పరమాణువు ఒకచుట్టు తిరగటానికి పట్టు కాలాన్ని క్షణమంటారు. కన్య పుట్టిన మొదటి క్షణంలో 'గౌరి' అనీ, రెండవ క్షణంలో 'రోహిణి' అనీ, మూడవ క్షణంలో 'కన్య' అనీ, నాల్గవ క్షణంలో 'రజస్వల' అనీ చెప్పబడుతుంది. ఆ రజస్వల కన్యను చూసిన ఆమె తల్లి, తండ్రి, అన్న, మేనమామ, అక్క మొదలైనవారందరూ నరకానికి పోతారు.

ప్రశ్న:- ఈ శ్లోకాలు ప్రమాణాలు కావు?

జవాబు:- ఎందుకు కావు? బ్రహ్మయొక్క శ్లోకాలే ప్రమాణాలు కానప్పుడు మీవి కూడా ప్రమాణాలు కావు.

ప్రశ్న:- వహ్వా? పరాశర, కాశీనాథులవారివి ప్రమాణాలు కావా?

జవాబు:- వహ్వారే! మీరు బ్రహ్మవి కూడా ప్రమాణాలనరా? పరాశరకాశీనాథుల కన్న బ్రహ్మ గొప్పవాడు కాడా? మీరు బ్రహ్మ శ్లోకాలను అంగీకరిస్తే మేము కూడా పరాశర, కాశీనాథుల శ్లోకాలను అంగీకరిస్తాము.

ప్రశ్న:- మీ శ్లోకాలు అసంభవాలు అవటం వలన ప్రమాణాలు కావు. ఎందుకంటే, జనన సమయంలోనే వేలకొద్ది క్షణాలు గడచిపోతాయి. అప్పుడు ఈ వివాహం ఎలా జరుగుతుంది? ఆ సమయంలో వివాహం జరిగినా కలిగే ప్రయోజనం ఏమీ ఉండదు.

జవాబు:- మా శ్లోకాలు అసంభవాలైతే మీవి కూడా అసంభవాలే. ఎందుకంటే, ఎనిమిది, తొమ్మిది, పదవ సంవత్సరాలలో వివాహం చేయటం నిష్ఫలమే. పదహారేళ్ళ తర్వాత స్త్రీకి, ఇరవై నాలుగేళ్ళ తర్వాత పురుషునికి వివాహం జరిగితే అది మంచిది. అప్పుడు పురుషుని వీర్యం పరిపక్వమై శరీరం బలిష్ఠమవుతుంది. స్త్రీ యొక్క గర్భాశయం, శరీరం సంపూర్ణబలం కలిగి ఉండటం వలన ఉత్తమ సంతానం కలుగుతుంది.

ఎనిమిదవయేట కన్యకు సంతానోత్పత్తి కలగటం అసంభవమైనట్లు, కన్యలకు గౌరి, రోహిణి అను పేర్లు పెట్టడం కూడా అయుక్తమే. కన్య ఎరుపు వర్ణం కలది గాక నల్లగా ఉంటే 'గౌరి' అని పేరు పెట్టడం వ్యర్థం. ఇక గౌరి మహాదేవుని భార్య. 'రోహిణి' బలదేవుని భార్య. పౌరాణికులైన మీరు వారిని మాతృసమానంగా చూస్తారు. కన్యలను 'గౌరీ' మొదలైన భావనతో చూసిన, వారితో వివాహమాడటం ఎలా సంభవమవుతుంది? అది ధర్మయుక్తం కాలేదు కదా! కాబట్టి మీ రెండు శ్లోకాలూ, మా రెండు శ్లోకాలూ మిథ్యలే. 'బ్రహ్మోవాచ' అను పేరుతో మేమెలా శ్లోకాలను వ్రాసామో అలాగే వారు కూడా పరాశరాదుల పేరుతో వ్రాసారు. అందుకే ఈ ప్రమాణాలను విడిచి వేదప్రమాణంతో అన్ని కార్యాలను చేయండి. చూడండి మనువేమంటున్నాడో!

త్రీణి వర్షాణ్యుదీక్షేత కుమార్యృతుమతీ సతీ ।
ఊర్ధ్వం తు కాలాదేతస్మాద్విన్దేత సదృశం పతిమ్ ॥ మను. 9-90 ॥

కన్య రజస్వల అయిన తరువాత మూడేళ్ల వరకు పతి కొరకు నిరీక్షించి గుణకర్మస్వభావాలతో తనతో సమానుడైన భర్తను పొందాలి. ప్రతినెల రజోదర్శనమవుతుంది. అలాగే మూడేళ్లలో 36 సార్లు రజస్వల అవుతుంది. ఆ తర్వాత వివాహమాడటం యోగ్యం. అంతకుపూర్వం వివాహం చేసుకోకూడదు.

కామమామరణాత్తిష్ఠేద్గృహే కన్యర్తుమత్యపి ।
న చైవైనాం ప్రయచ్ఛేత్తు గుణహీనాయ కర్హిచిత్ ॥ మను. 9-89 ॥

పరస్పర విరుద్ధ గుణాలు, కర్మలు, స్వభావాలు కలవారికి వివాహం చేయరాదు. తమ వంటి గుణకర్మస్వభావాలు కలవారు దొరకకపోతే మరణపర్యంతం యువతీ యువకులు

బ్రహ్మచారులుగా వివాహరహితులుగా ఉన్నా సరే. ప్రమాదం లేదు. కాని యుక్తవయస్సు రాకపూర్వంగాని, అసమానమైన వారితో గాని వివాహం చేయటం సరికాదని తెలుసుకోవాలి.

ప్రశ్న:- వివాహం తల్లిదండ్రుల అధీనంలో జరగాలా? లేక యువతీయువకుల అధీనంలోనా?

జవాబు:- వివాహం యువతీ యువకుల - కన్యావరుల అధీనంలోనే జరగాలి. తల్లిదండ్రులు చేయదలచిన కన్యావరుల ఇష్టం లేకుండా జరపకూడదు. కన్యావరులు ప్రసన్నత కలవారై వివాహం చేసుకొంటే, వారిలో విరోధాలు తక్కువగా ఉంటాయి. అలాంటి వారికి ఉత్తమ సంతానం కలుగుతుంది. అప్రసన్నతతో వివాహం చేసుకొంటే నిత్యం వారికి దుఃఖాలే కలుగుతాయి. వివాహం వధూవరులకు సంబంధించినది. అందులో తల్లిదండ్రులకు ఎలాంటి ప్రయోజనమూ లేదు. ఎందుకంటే వధూవరులు పరస్పరం ప్రసన్నులుగా ఉంటే వారికే సుఖం కలుగుతుంది. విరోధం కలిగి ఉంటే వారికే దుఃఖం కలుగుతుంది.

సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ ।
యస్మిన్నేవ కులే నిత్యం కళ్యాణం తత్ర వై ధ్రువమ్ ॥ మను. 3-60 ॥

భార్యతో భర్త, భర్తతో భార్య ఎల్లప్పుడు సంతోషంతో ఉన్న ఆ కుటుంబంలో నిత్యం ఆనందం, లక్ష్మి, కీర్తి నివాసముంటాయి. విరోధం, కలహాలు గల కుటుంబంలో దుఃఖం, దారిద్ర్యం, నింద మొ॥ నివసిస్తాయి.

కాబట్టి, ఆర్యావర్తదేశంలో పరంపరగా వస్తున్న స్వయంవర వివాహ పద్ధతిలో వివాహం జరగటం ఉత్తమం. విద్య, వినయం, శీలం, రూపం, వయస్సు, బలం, వంశం, శరీర పరిమాణాలు యథాయోగ్యంగా గల యువతీ యువకులే వివాహం చేసుకోవాలి. ఇద్దరిలో అనైక్యత - భేదం ఉంటే వారికి వివాహం వలన సుఖం ఏమాత్రం కలుగదు. బాల్యావస్థలో వివాహమాడితే సుఖముండదు.

యువ వివాహంలో ప్రమాణం

యువా సువాసాః పరివీత ఆగాత్స ఉ శ్రేయాన్భవతి జాయమానః ।
తం ధీరాసః కవయ ఉన్నయన్తి స్వాధ్యో3మనసా దేవయంతః ॥ 1 ॥

॥ ఋ. మండ. 3 సూ. 8. మం. 4 ॥

ఆ ధేనవో ధునయంతామశిశ్వీః సబర్దుఘాః శశయా అప్రదుగ్ధాః ।
నవ్యానవ్యా యువతయో భవన్తీర్మహద్దేవానామసురత్వమేకమ్ ॥ 2 ॥

॥ ఋ. మండ. 3 సూ. 55 మం. 16 ॥

పూర్వీరహం శరదః శశ్రమాణా దోషా వస్తోరుషసో జరయంతీః ।
మినాతి శ్రియం జరిమా తనూనామప్యూ ను పత్నీర్వృషణో జగమ్యుః ॥
॥ ఋ. మండ.1 సూ.179 మం. 1 ॥

ఏ పురుషుడు, పరివీతః = అన్ని విధాల యజ్ఞోపవీతధారియై బ్రహ్మచర్య సేవనంలో ఉత్తమ విద్యా శిక్షణను పొంది; సువాసాః = సుందర వస్త్రాలను ధరించి; బ్రహ్మచర్యయుక్తుడై యువా = పూర్ణ యవ్వనం గలవాడై విద్యార్జన చేసి గృహస్థాశ్రమంలోకి; అగాత్ = వస్తే; స, ఉ = అలాంటివాడే రెండవదైన విద్యాజన్మలో; జాయమానః = ప్రసిద్ధుడై; శ్రేయాన్ = అతిశయ శోభాయుక్తుడు, మంగళకారి కూడా; భవతి = అవుతాడు; స్వాధ్యః = బాగా ధ్యానయుక్తమైన, మనసా = విజ్ఞానంతో; దేవయన్తః = విద్యావృద్ధిని కోరు; ధీరాసః = ధైర్యవంతులు; కవయః = విద్వాంసులు; తం = ఆ పురుషుని; ఉన్నయంతి = ఉన్నత శీలునిగా చేసి ప్రతిష్ఠితుని చేస్తారు. బ్రహ్మచర్యాన్ని ధరించి ఉత్తమ విద్యాశిక్షణలను పొందక బాల్యకాలంలో వివాహం చేసుకొనేవారు నష్టభ్రష్టులై విద్వాంసులలో ప్రతిష్ఠను పొందలేరు. ॥ 1 ॥

అప్రదుగ్ధాః = పాలుపిండని, ధేనవః = ఆవుల వలె; అశిశ్వీః = బాల్యావస్థను దాటిన; సబర్దుఘాః = అన్నివిధాల ఉత్తమ వ్యవహారాలు పూర్తిచేస్తాడు; శశయాః = కుమారావస్థను పూర్తిచేసిన; నవ్యానవ్యాః = నవీనములైన శిక్షణలతో, అవస్థలతో పూర్ణులై; భవంతీః = వర్తమానులైన; యువతయః = పూర్ణ యవ్వనం గల స్త్రీలు; దేవానామ్ = బ్రహ్మచర్య సునియమాలతో పూర్ణవిద్వాంసులైనవారి; ఏకమ్ = అద్వితీయమైన; మహత్ = గొప్ప; అసురత్వమ్ = ప్రజ్ఞా శాస్త్ర శిక్షణతో ప్రజలను రమింపచేసే భావార్థాన్ని తెలిసినవారై యవ్వనం గల భర్తలను పొంది; ఆధునయన్తామ్ = గర్భధారణం చేయాలి. మరచి కూడా బాల్యదశలో తమ మనస్సులో ఏ పురుషున్నీ తలవకూడదు. కారణమేమంటే, ఈ కర్మయే ఈ లోకంలో, పరలోకంలో సుఖాన్ని కలిగించేది. బాల్యదశలో వివాహం జరిగితే పురుషునికన్న ఎక్కువ నష్టం స్త్రీకే కలుగుతుంది. ॥ 2 ॥

ను = శీఘ్రంగా; శశ్రమాణాః = అత్యంత శ్రమచేసే; వృషణః = వీర్యసేచనంలో సమర్థులు; పూర్ణ యువావస్థ కలవారు అయిన పురుషులు; పత్నీః = యువావస్థలో హృదయాలకు ప్రియం కలిగించే స్త్రీలను; జగమ్యుః = పొంది పూర్ణ శతవర్షాలు, లేదా అంతకన్న ఎక్కువ ఆయువును పొంది ఆనందాన్ని అనుభవిస్తారు. పుత్రపౌత్రాదులతో కూడి ఉంటారు. ఈ విధంగా స్త్రీ పురుషులు నిరంతరం ప్రవర్తించాలి. పూర్వీః = పూర్వంలో గల; శరదః = శరదృతువులు; జరయన్తీః = వృద్ధావస్థను ప్రాప్తింపచేసే; ఉషసః = ప్రాతఃకాల వేళలను; దోషాః = రాత్రి; వస్తోః = పగలు; తనూనామ్ = శరీరాల యొక్క; శ్రియమ్ = శోభను; జరిమా = అతిశయమైన వృద్ధత్వం బలాన్ని, శోభను; మినాతి = దూరం చేయునట్లు; అహమ్ = నేను (స్త్రీ లేక పురుషుడు); ఉ = బాగా; అపి = నిశ్చయంగా బ్రహ్మచర్యంతో విద్యాశిక్షణలను శారీరిక, ఆత్మిక బలాన్ని పొంది యువావస్థలో

వివాహమాడతాను. దీనికి విరుద్ధంగా ప్రవర్తించటం వేదవిరుద్ధం. కాబట్టి అలాంటి వివాహం ఎప్పుడూ సుఖదాయకం కాలేదు. ॥ 3 ॥

ఈ దేశంలోని ఋషులు, మునులు, రాజులు, మహారాజులు, ఆర్యజనులు బ్రహ్మచర్యంతో విద్యను నేర్చుకొన్న తర్వాతనే స్వయంవర వివాహాన్ని చేసుకొన్నారు. అలా జరిగినంతకాలం ఈ దేశం నిరంతరం ఉన్నతినే పొందుతుంది. బ్రహ్మచర్యంతో విద్యను నేర్చుకోక, బాల్యదశలో పరాధీనులై తల్లిదండ్రుల ఇష్టానుసారం వివాహాలు చేసుకోవటం ఆరంభమైనప్పటి నుండి క్రమంగా ఆర్యావర్తదేశానికి హాని కలుగసాగింది. కాబట్టి సజ్జనులు ఈ దుష్టకార్యాన్ని వీడి పూర్వోక్త ప్రకారంగా స్వయంవర వివాహాలను వర్ణానుక్రమంగా చేయించాలి. వర్ణవ్యవస్థ గుణ, కర్మ, స్వభావానుసారంగా ఉండాలి.

వర్ణవ్యవస్థ

ప్రశ్న:- తల్లిదండ్రులు బ్రాహ్మణులైతే వారి సంతానం కూడ బ్రాహ్మణులే అవుతారు కాని, అన్య వర్ణస్థులైన తల్లిదండ్రులకు కలిగిన సంతానం బ్రాహ్మణులెపుడైనా అవుతారా?

జవాబు:- అవును. అవుతారు. చాలామంది అయ్యారు. అవుతున్నారు. ఇకముందుకూడ అవుతారు. ఛాందోగ్యోపనిషత్తు (4–4)లో గల జాబాలఋషి అజ్ఞాతకులంవాడు. మహాభారతం (అనుశా.ప.అ.4) లోని విశ్వామిత్ర మహర్షి క్షత్రియవర్ణంవాడు. మాతంగ ఋషి (మహా.భా.అను. 27–8) చాండాల కులంలోనివాడు. వీరందరు బ్రాహ్మణులైనారు. ఉత్తమ విద్యాస్వభావాలు కలవారు ఏ కులంవారైనా నేడు బ్రాహ్మణులు అవటానికి యోగ్యులు. మూర్ఖులు శూద్రులవటానికి తగినవారు. ఇలాగే భవిష్యత్తులోనూ అవ్వగలరు.

ప్రశ్న:- భేష్, రజోవీర్యాలతో ఏర్పడిన శరీరం మార్పుచెంది ఇతర రెండవ వర్ణానికి యోగ్యంగా ఎలా అవుతుంది?

జవాబు:- బ్రాహ్మణ శరీరం రజోవీర్యాలతో ఏర్పడదు. కేవలం శరీరమే ఏర్పడుతుంది. చూడండి.

స్వాధ్యాయేన జపైర్హోమైస్త్రైవిద్యేనేజ్యయా సుతైః ।
మహాయజ్ఞైశ్చ యజ్ఞైశ్చ బ్రాహ్మీయం క్రియతే తనుః ॥ మను. 2–28 ॥

దీని అర్థం ఇంతకుపూర్వమే తెలుపబడింది. ఇక్కడ కూడా సంక్షేపంగా తెలుపబడుతుంది. స్వాధ్యాయేన= చదువుతూ, చదివిస్తూ; జపైః = విచారణ చేస్తూ, చేయిస్తూ; హోమైః = నానావిధ హోమాలను చేస్తూ; త్రైవిద్యేన = సంపూర్ణ వేదాల శబ్ద, అర్థ, సంబంధ, స్వరోచ్చారణ సహితంగా చదివి చదివిస్తూ; ఇజ్యయా = పౌర్ణమాసేష్టి మొదలైనవి పూర్వోక్తవిధిపూర్వకంగా చేస్తూ; సుతైః = ధర్మానుసారంగా సంతానోత్పత్తిని కావిస్తూ; మహాయజ్ఞైశ్చ = పూర్వోక్త బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, పితృయజ్ఞం, బలివైశ్వదేవయజ్ఞం,

అతిథియజ్ఞాలను చేస్తూ; యజ్ఞైశ్చ = అగ్నిష్టోమాది యజ్ఞాలు, విద్వాంసుల సాంగత్యం, సత్కారం, సత్యభాషణం, పరోపకారాది కర్మలు చేస్తూ, సంపూర్ణంగా శిల్పవిద్యాదులను నేర్చుకొని, దుష్టాచారాన్ని వీడి, శ్రేష్ఠాచారంలో ప్రవర్తించుటచేత ఇయం = ఈ; తనుః = శరీరం; బ్రాహ్మీ = బ్రాహ్మణునిదిగా; క్రియతే = చేయబడు తుంది.

అయితే మీరీ శ్లోకాన్ని అంగీకరిస్తారా? లేదా?

ప్రశ్న:- అంగీకరిస్తాను.

జవాబు:- అంగీకరిస్తే రజో వీర్యాల కలయికతో వర్ణవ్యవస్థ ఏర్పడుతుందని ఎలా అనుకుంటున్నారు?

ప్రశ్న:- ఇలా నే నొక్కడనే అంగీకరించటంలేదు. ఎందరో పరంపరగా దీన్ని అంగీకరిస్తున్నారు కదా? మీరు పరంపరగా వచ్చేదాన్ని కూడా ఖండిస్తారా?

జవాబు:- లేదు. కాని, మీ అజ్ఞానాన్ని విపరీతబుద్ధిని అంగీకరించక దాన్ని ఖండిస్తున్నాం.

ప్రశ్న:- మాది అజ్ఞాన మనటానికి, మీది సుజ్ఞానమనటానికి ప్రమాణమేమి?

జవాబు:- ఇందుకు ప్రమాణమిదే. ఐదారు తరాల నుండి వచ్చిన దాన్నే మీరు సనాతనమంటున్నారు. ఇక మేమో! వేదం, సృష్టి పుట్టినప్పటి నుండి నేటివరకు పరంపర అంటున్నాం. చూడండి! లోకంలో ఒకడి తండ్రి శ్రేష్ఠుడైన వాని పుత్రుడు దుష్టుడుగా, పుత్రుడు శ్రేష్ఠుడైన తండ్రి దుష్టుడుగా, కొన్నిచోట్ల ఇద్దరూ దుష్టులుగానో, శ్రేష్ఠులుగానో ఉండటం కనిపిస్తున్నది. మీరు భ్రమలో ఉన్నారు. మనుమహారాజు ఏమన్నాడో చూడండి.

యేనాస్య పితరో యాతా యేన యాతాః పితామహాః ।
తేన యాయాత్సతాం మార్గం తేన గచ్ఛన్న రిష్యతే ॥ మను. 4-178 ॥

"సత్పురుషులైన తల్లిదండ్రులు, తాతముత్తాతలు ప్రవర్తించిన మార్గంలో వారి సంతానం కూడ నడవాలి. దుష్టులైన తండ్రి తాతలు వెళ్ళిన మార్గంలో ఎప్పుడూ పోకూడదు. ఉత్తములైన ధర్మాత్ములు నడచిన మార్గంలో పోయేవారు ఎన్నడూ దుఃఖాన్ని పొందరు". దీనిని మీరు అంగీకరిస్తారా? లేదా?

ప్రశ్న:- అవునవును. అంగీకరిస్తాము.

జవాబు:- చూడండి. ఇదే కాదు. పరమేశ్వరునితో ప్రకాశితమైన వేదోక్తమార్గం సనాతనమైనది. దానికి విరుద్ధమైనది ఎన్నడూ సనాతనమనబడదు. ఇలా అందరూ అంగీకరించాలా? లేదా? తప్పక అంగీకరించాల్సిందే.

అలా అంగీకరించనివారికి ఇలా చెప్పండి. తండ్రి దరిద్రుడై కొడుకు ధనాఢ్యుడైతే తండ్రి యొక్క దారిద్ర్యంపై అభిమానం కల్గి కొడుకు తన ధనాన్ని పారేసుకోవాల్సిందేనా? ఎవని తండ్రైనా గ్రుడ్డివాడైతే అతని కొడుకు కూడా గ్రుడ్డివాడు కావాలా? తండ్రి కుకర్మలు చేసేవాడైతే కొడుకు కూడ దుష్కర్మలు చేయాల్సిందేనా? అలా చేయరాదు. తల్లిదండ్రుల యొక్క ఆ యా ఉత్తమ కర్మలను ఆచరిస్తూ, దుష్టకర్మలను పూర్తిగా వదలాలి.

జన్మగత వర్ణవ్యవస్థలో దోషాలు

రజోవీర్య యోగంతోనే వర్ణాశ్రమ వ్యవస్థ ఏర్పడుతుందని, గుణకర్మ స్వభావ యోగంతో కాదని అనేవారితో ఇలా ప్రశ్నించాలి.

బ్రాహ్మణుడు తన వర్ణాన్ని వీడి నీచులైన అంత్యజుడిగానో, క్రైస్తవునిగానో, మహమ్మదీయునిగానో మారినచో, అతనిని బ్రాహ్మణుడని ఎందుకు అంగీకరించరు? అతడు బ్రాహ్మణకర్మలను విడవటం వలన బ్రాహ్మణుడు కాడనే కదా మీరంటున్నారు? అలాగే బ్రాహ్మణాది ఉత్తమ కర్మలను చేసేవారినే బ్రాహ్మణులని, అలాగే ఉత్తమ గుణకర్మ స్వభావాలు కలిగిన వారు కూడా ఉత్తమ వర్ణస్థులవుతారని, ఉత్తమ వర్ణాల వారు నీచకార్యాలను చేస్తే నీచవర్ణంలో లెక్కించాలని తెలుస్తున్నది.

ప్రశ్న:- **బ్రాహ్మణోఽస్య ముఖమాసీద్ బాహూ రాజన్యః కృతః ।**
ఊరూ తదస్య యద్వైశ్యః పద్భ్యాం శూద్రోఽజాయత ॥ యజు. 31 - 11 ॥

దీని అర్థం ఇది. బ్రాహ్మణుడు ఈశ్వరుని ముఖం నుండి, క్షత్రియుడు బాహువుల నుండి, వైశ్యుడు తొడల నుండి, శూద్రుడు పాదాల నుండి జన్మించారు. ముఖమెన్నడూ భుజం మొదలైనవి కాలేదు. భుజాలు మొదలైనవి ముఖం కాలేవు. అలాగే బ్రాహ్మణుడు క్షత్రియాది వర్ణాలవాడు కాలేడు. క్షత్రియాదులు బ్రాహ్మణులు కాలేరు.

జవాబు:- ఈ మంత్రానికి మీరు చెప్పిన అర్థం సరైనది కాదు. ఈ మంత్రంలో పురుషపదం యొక్క అనువృత్తి కలదు. ఆ పురుషుడు నిరాకారుడు, వ్యాపకుడైన పరమాత్మ. ఆ నిరాకార పరమ పురుషునికి ముఖాది అంగాలు ఉండవు. ముఖాదులైన అవయవాలు కలవాడు వ్యాపకుడైన పురుషుడు కాలేడు. వ్యాపకుడు కానప్పుడు అతడు సర్వశక్తిమంతుడు, జగాన్ని సృజించేవాడు, ధరించేవాడు, ప్రళయకర్త, జీవుల పాపపుణ్యాలను తెలుసుకొని తగిన ఫలాన్ని ఇచ్చేవాడు, సర్వజ్ఞుడు, జన్మం లేనివాడు మొదలైన విశేషణాలు కలవాడెప్పుడూ కాలేడు.

కావున ఈ మంత్రానికి అర్థం ఇది:

అస్య = పూర్ణవ్యాపకుడైన పరమాత్ముని సృష్టిలో అందరిలో ముఖ్యుడు ముఖసదృశుడు; బ్రాహ్మణః = బ్రాహ్మణుడు; బాహూ = "బాహుర్వై బలం" (శత. బ్రా. 5-4-1-1) "బాహుర్వై

వీర్యం" (శత. 6-3-2-35) బలం, వీర్యం అనేవారికి 'బాహువు'లని పేరు. అది అధికంగా ఎవరిలో ఉంటుందో వారు, రాజన్యః = క్షత్రియులు; ఊరూ = నడుముకు క్రిందిభాగంతో మోకాళ్లకు పైభాగంలో ఉండేవి. ఊరువులు-తొడలు. సమస్త దేశాలలోనికి ఊరువుల బలంతో పోయి, పదార్థాలను సేకరిస్తూ వచ్చేవాడు; వైశ్యః= వైశ్యుడు; పద్భ్యాం = పాదాలవలె అల్ప గుణాలు గలవారు శూద్రులు. ఇతర చోట్ల, శతపథ బ్రాహ్మణాదులలో ఈ మంత్రానికి ఇలాగే అర్థం చెప్పబడింది.

ఉదా:- "యస్మాదేతే ముఖ్యాస్తస్మాన్ముఖతో హ్యసృజ్యంత" ఇత్యాది. తై. సం. 3-1-14 ॥

ముఖ్యులు కాబట్టి ముఖం నుండి జన్మించినవారని అభిప్రాయం. కాబట్టి ఇలా చెప్పటమే తగినది. ముఖం శరీరాంగాలన్నింటిలో శ్రేష్ఠమైనది. అలాగే పూర్ణవిద్య, ఉత్తమ గుణ కర్మ స్వభావాలు కలిగి ఉండటం వలన బ్రాహ్మణుడు మానవ జాతిలో ఉత్తముడు అనబడతాడు. పరమేశ్వరుడు నిరాకారుడు అవటంవలన అతనికి ముఖాది అంగాలు ఉండవు. ఒకవేళ ముఖాదుల నుండి జన్మించినారనంటే గొడ్రాలి కొడుకుకు వివాహమైన దనటం లాగే ఉంటుంది. ముఖం మొదలైన అవయవాల నుండి బ్రాహ్మణాదులు జన్మించినారంటే ఉపాదాన కారణం వల్లనే బ్రాహ్మణాదుల యొక్క ఆకారాలు తప్పక అలాగే ఉండాలి. ముఖంయొక్క ఆకారంలాగా గుండ్రంగా ఉండాలి. అలాగే వారి శరీరం కూడా ముఖాకృతి వలె గుండ్రంగా ఉండాలి. క్షత్రియుల శరీరాలు భుజాల లాగ, వైశ్యుల శరీరాలు తొడల లాగ, శూద్రుల శరీరాలు పాదాలలాగ ఆకారం కలిగి ఉండాలి. కాని ఇలా లేవు. ముఖాదులనుండి జన్మించటం వలన బ్రాహ్మణాది సంజ్ఞలు కలిగాయని ఎవరైనా అంటే వారికి ఇలా చెప్పాలి: ఒకవేళ ముఖాదుల నుండి పుట్టినవారు బ్రాహ్మణాదులైన కావచ్చు. కాని మీరు ముఖాదుల నుండి పుట్టలేదు కదా? అందరిలాగే మీరు కూడా తల్లి గర్భాశయం నుండి జన్మించారు. ముఖాదుల నుండి జన్మించకయే బ్రాహ్మణాది సంజ్ఞలు కలవారమని వ్యర్థంగా అభిమానం చెందుతున్నారు. మీరు చెప్పిన అర్థం వ్యర్థమైనది. మేము చెప్పిన అర్థమే సత్యమైనది.

వర్ణ పరివర్తనంలో ప్రమాణం

శూద్రో బ్రాహ్మణతామేతి బ్రాహ్మణశ్చైతి శూద్రతామ్ ।
క్షత్రియాజ్జాతమేవన్తు విద్యాద్వైశ్యాత్తథైవ చ ॥ మను. 10 - 65 ॥

శూద్ర కులంలో పుట్టినవాడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యవర్ణాల వారితో సమానమైన గుణ, కర్మ స్వభావాలు కలవాడైతే ఆ శూద్రుడు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యవర్ణాలలో చేరుతాడు. అలాగే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలలో జన్మించి శూద్రుని వంటి గుణ, కర్మ స్వభావాలు కలవారు శూద్రులు అవుతారు. క్షత్రియ, వైశ్యవర్ణాలలో జన్మించి, బ్రాహ్మణ లేక శూద్ర వర్ణాల వారితో సమానంగా వున్నవారు బ్రాహ్మణులో లేక శూద్రులో అవుతారు. నాలుగు వర్ణాలలో ఏ యే వర్ణాలతో సమానంగా ఏ యే స్త్రీ పురుషులుంటారో వారు ఆ యా వర్ణాలలో లెక్కింపబడతారు.

ధర్మచర్యయా జఘన్యో వర్ణః పూర్వం పూర్వం వర్ణమాపద్యతే జాతిపరివృత్తౌ ॥ 1 ॥
అధర్మచర్యయా పూర్వో వర్ణో జఘన్యం జఘన్యం వర్ణమాపద్యతే జాతిపరివృత్తౌ ॥ 2 ॥

(ఆపస్తంబ ధర్మ 2-5-10, 11)

ధర్మాచరణంవలన నీచ వర్ణాలవారు తమ కన్న ఉత్తమమైన వర్ణాలను పొందగలరు. ఎవరు ఏ దానికి యోగ్యులో వారిని ఆ వర్ణంలోనే లెక్కించాలి. ॥ 1 ॥

అలాగే ఉత్తమ వర్ణాలవారు అధర్మాచరణం వలన తమ క్రింది నీచవర్ణాలను పొంది వారిలోనే లెక్కించబడతారు. ॥ 2 ॥

పురుషులకు గల వర్ణవ్యవస్థే స్త్రీలకు కలదని తెలుసుకోవాలి. ఇలా ఉంటే అన్ని వర్ణాల వారు తమ తమ గుణ, కర్మ స్వభావాలు కలవారై శుద్ధంగా ఉండగలరు. అప్పుడు బ్రాహ్మణ వర్ణంలో ఎవ్వడూ క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాల వంటివాడుండడు. వర్ణసంకరం కలుగజాలదు. కావున ఏ వర్ణం కూడా అయోగ్యతకు, నిందలకు గురికాలేదు.

ప్రశ్న:- ఒకనికి ఒకే కుమారుడు, లేదా ఒకే కూతురు కలదనుకోండి. వారు ఇతర వర్ణాలలో చేరితే ఆ తల్లిదండ్రుల సేవ ఎవరు చేస్తారు. అలాగైతే వారి వంశచ్ఛేదం కాదా? దీనికి ఏమైనా వ్యవస్థ ఉన్నదా?

జవాబు:- దీనివలన ఎవరికీ సేవాభంగంగాని, వంశచ్ఛేదంగాని ఏమీ జరగదు. అట్టి వారికి వారిసంతానానికి బదులు వారు వారి స్వవర్ణములకు తగిన ఇతరుల సంతానము నిచ్చి విద్యాసభగాని, రాజసభగాని వ్యవస్థ చేయగలదు. వ్యవస్థ వలన లభిస్తుంది. కాబట్టి ఎట్టి అవ్యవస్థయు జరగదు. కన్యలకు పదహారవ యేట, పురుషులకు ఇరవై ఐదవ యేట జరిగే పరీక్షలో గుణకర్మ స్వభావాలను అనుసరించి వారి వారి వర్ణవ్యవస్థ గురువు చేయాలి. ఇదే క్రమంలో బ్రాహ్మణునికి బ్రాహ్మణస్త్రీతో, క్షత్రియునికి క్షత్రియస్త్రీతో, వైశ్యునికి వైశ్యస్త్రీతో, శూద్రునికి శూద్ర స్త్రీతో వివాహం జరపాలి. అప్పుడే పరస్పర ప్రీతి, ఆ యా వర్ణాల కర్మలు యథాయోగ్యంగా జరుగగలవు. ఈ నాలుగు వర్ణాల వారి కర్తవ్యకర్మలు, గుణాలు ఈ విధంగా ఉన్నాయి.

వర్ణాల గుణకర్మలు

నాలుగు వర్ణాల వారి కర్తవ్యకర్మలు, గుణాలు వివరింపబడతాయి.

బ్రాహ్మణ గుణకర్మలు:

1. **అధ్యాపనమధ్యయనం యజనం యాజనం తథా ।**
   దానం ప్రతిగ్రహశ్చైవ బ్రాహ్మణానామకల్పయత్ ॥ మను. 1-88 ॥

2. **శమో దమస్తపః శౌచం క్షాంతిరార్జవమేవ చ ।**
   జ్ఞానం విజ్ఞానమాస్తిక్యం బ్రహ్మకర్మ స్వభావజమ్ ॥ భగవద్గీత. 18 - 42 ॥

'చదవటం, చదివించటం, యజ్ఞం చేయటం, చేయించటం, దానమివ్వటం, తీసుకోవటం' అను ఈ ఆరు బ్రాహ్మణుల కర్మలు. కాని "ప్రతిగ్రహః ప్రత్యవరః" (మను.10-109)॥ అనగా తీసుకోవటం నీచకర్మ॥ 1॥

శమః = మనస్సుతో చెడుకర్మలను చేయక, దాన్ని అధర్మంలో ఎన్నడూ ప్రవర్తింపనీయకుండటం; దమః = శ్రవణ, చక్షురాది ఇంద్రియాలను అన్యాయ ఆచరణం నుండి నిరోధించి ధర్మంలో నడపటం; తపః = నిరంతరం బ్రహ్మచర్యంలో జితేంద్రియుడై ధర్మానుష్ఠానం చేయటం.

ఇక శౌచం:

అద్భిర్గాత్రాణి శుధ్యంతి మనః సత్యేన శుధ్యతి ।
విద్యాతపోభ్యాం భూతాత్మా బుద్ధిర్జ్ఞానేన శుధ్యతి॥ మను. 5-109॥

జలంతో శరీర బాహ్యాంగాలు, సత్యాచారంతో మనస్సు, విద్యాధర్మానుష్ఠానంతో జీవాత్మ జ్ఞానంతో బుద్ధి పవిత్రమవుతాయి. లోపల గల రాగద్వేషాలను, వెలుపల గల మలినాలను దూరంచేసి శుద్ధంగా ఉండటం, అనగా వివేకబుద్ధితో సత్యాన్ని గ్రహించి అసత్యాన్ని త్యజిస్తూ, సత్యాసత్యాలను నిశ్చయించి పవిత్రుడవటం.

క్షాంతి = నిందాస్తుతులు, సుఖదుఃఖాలు, శీతోష్ణాలు, ఆకలిదప్పులు, హానిలాభాలు, మానావమానాలు, హర్షశోకాలు మొదలైనవాటిని వీడి దృఢనిశ్చయం కలిగి ఉండటం; ఆర్జవం = కోమలత, నిరభిమానం; సరళత = సరళస్వభావంతో కుటిలత మొదలైన దోషాలను వీడటం; జ్ఞానం = సమస్త వేదాది శాస్త్రాలను సాంగోపాంగంగా చదివి చదివించే సామర్థ్యం, జడాన్ని జడమనీ, చేతనాన్ని చేతనమనీ తెలుసుకొని, అంగీకరించి, సత్యాన్ని నిర్ణయించే వివేకం; విజ్ఞానం = పృథ్వి నుండి పరమేశ్వరుని వరకు గల పదార్థాలను అన్నింటిని విశేషరూపంలో తెలుసుకొని, వాటిని యథాయోగ్యంగా ఉపయోగించుట; ఆస్తిక్యం = వేదం, ఈశ్వరుడు, ముక్తి పునర్జన్మ, ధర్మం, విద్య, సత్సంగం, మాతాపితల, ఆచార్యుల, అతిథుల సేవను వీడకపోవడం. వీటిని ఎప్పుడూ నిందించకుండా ఉండడం అనే ఈ పదిహేను గుణ, కర్మలు బ్రాహ్మణ వర్ణస్థులైనవారికి తప్పక ఉండాలి.

క్షత్రియ గుణకర్మలు

1. **ప్రజానాం రక్షణం దానమిజ్యాధ్యయనమేవ చ ॥**
   విషయేష్వప్రసక్తిశ్చ క్షత్రియస్య సమాసతః ॥ మను. 1-89॥

2. **శౌర్యం తేజో ధృతిర్దాక్ష్యం యుద్ధే చాప్యపలాయనమ్ ।**
   దానమీశ్వరభావశ్చ క్షాత్రం కర్మ స్వభావజమ్ ॥ భగవద్గీత 18-43॥

ప్రజానాం రక్షణం = న్యాయంగా ప్రజలను రక్షించటం, పక్షపాతం వీడి శ్రేష్ఠులను సత్కరిస్తూ, దుష్టులను తిరస్కరిస్తూ అందరినీ చక్కగా పాలించటం; దానం = విద్యాధర్మాలలో ప్రవృత్తి కలిగి, సుపాత్రులైనవారి సేవలో ధనాది పదార్థాలను వ్యయమొనర్చటం; ఇజ్యా = అగ్నిహోత్రాది యజ్ఞాలను చేస్తూ, చేయించటం; అధ్యయనం = వేదాది శాస్త్రాలను చదువుతూ, చదివించటం; విషయేషు అప్రసక్తిః= శబ్దాది విషయాలలో తగుల్కొనక జితేంద్రియుడై నిరంతరం శారీరిక, ఆత్మిక బలాన్ని కలిగియుండటం ॥ 1 ॥

శౌర్యం = వందలకొలది శత్రువులతో ఒంటరిగా యుద్ధం చేయటంలో భయపడకపోవడం; తేజః = దీనత్వం లేకుండా సదా తేజస్వియై ప్రగల్భంగా, దృఢంగా ఉండటం; ధృతిః = ధైర్యవంతుడుగా ఉండటం; దాక్ష్యం = రాజప్రజాసంబంధ వ్యవహారాలలో, సర్వశాస్త్రాలలో అతి చతురుడుగా ఉండటం; యుద్ధే = యుద్ధంలో దృఢంగా నిశ్శంకతో ఉండి దానినుండి ఎప్పుడూ తొలగక, పారిపోకుండా ఉండటం, నిశ్చయంగా విజయం కలిగి తాను రక్షింపబడునట్లు యుద్ధం చేయటం, అవసరమనిపించినపుడు శత్రువులను మోసగించి పారిపోవునట్లు నటిస్తే విజయం కలుగుతుందని భావిస్తే అలాగే చేయటం; దానం = దానశీలత కలిగి ఉండటం; ఈశ్వరభావః = పక్షపాతరహితుడై అందరితో యథాయోగ్యంగా ప్రవర్తించటం, విచారించి ఇస్తూ, ప్రతిజ్ఞను పూర్తి చేయటం, ప్రతిజ్ఞాభంగాన్ని ఎన్నడూ చేయకుండటం అనే ఈ పదకొండు క్షత్రియుల గుణ, కర్మలు ॥ 2 ॥

వైశ్య గుణ కర్మలు

పశూనాం రక్షణం దానమిజ్యాధ్యయనమేవ చ ।
వణిక్పథం కుసీదం చ వైశ్యస్య కృషిమేవ చ ॥ మను. 1 – 90 ॥

పశూనాం రక్షణం = గోవులు మొదలైన పశువుల పాలన పోషణతో వాటిని వృద్ధిచేయటం; దానం = విద్యాధర్మాలను వృద్ధిచేయటానికి, చేయించటానికి ధనాదులను వ్యయం చేయటం; ఇజ్యా = అగ్నిహోత్రాది యజ్ఞాలను చేయటం; అధ్యయనం = వేదాది శాస్త్రాలను చదువటం; వణిక్పథం = అన్ని విధాలైన వ్యాపారాలను ధర్మబద్ధంగా చేయటం; కుసీదం = నూటికి ఒకటి, రెండు, మూడు రూపాయల కంటె అధికంగా వడ్డీని తీసుకోకుండా ఉండటం, ఒక రూపాయకు నూరేళ్ళు దాటినా రెట్టింపు కంటె ఎక్కువ కాకుండునట్లు వడ్డీ తీసుకోవటం, ఇవ్వటం; కృషిం = వ్యవసాయం చేయటం, చేయించడం అనేవి వైశ్యుల గుణకర్మలు.

శూద్రుని గుణకర్మలు

ఏకమేవ హి శూద్రస్య ప్రభుః కర్మసమాదిశత్ ।
ఏతేషామేవ వర్ణానాం శుశ్రూషామనసూయయా ॥ మను. 1-91 ॥

'నింద, ఈర్ష్య, అభిమానం మొదలైన దోషాలను వీడి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యుల సేవను చక్కగా చేస్తూ, దానితోనే తన జీవిక నేర్పాటు చేసుకోవటం' శూద్రునికి తగును. ఇదొక్కటే శూద్రుని గుణకర్మ.

ఇలా సంక్షేపంగా నాలుగు వర్ణాల వారి గుణకర్మలు వ్రాయబడ్డాయి.

ఏ పురుషునిలో ఏ యే వర్ణాల గుణకర్మలుంటాయో వాటి ననుసరించి, ఆ యా వర్ణాధికారమిచ్చే వ్యవస్థ ఉంటే మానవులందరూ ఎల్లప్పుడు ఉన్నతశీలురౌతారు. అప్పుడే తమ సంతానం మూర్ఖత్వాది దోషగుణాలు కలిగి ఉంటే శూద్రులౌతారని ఉత్తమ వర్ణాలవారికి భయముంటుంది. సంతానం కూడా ఉత్తమ ప్రవర్తన, విద్య లేకుంటే శూద్రులం కాగలమని భయపడతారు. నీచ వర్ణస్థులలో కూడ ఉత్తమ వర్ణస్థులం కావాలనే ఉత్సాహం పెరుగుతుంది. విద్య, ధర్మాల ప్రచారం చేసే అధికారం బ్రాహ్మణులకే ఇవ్వాలి. ఎందుకంటే వారు పూర్ణవిద్వాంసులై, ధార్మికులై ఆ కార్యాన్ని యథాయోగ్యంగా చేయగలరు. క్షత్రియులకు రాజ్యాధికారాన్ని ఇస్తే ఎన్నడూ రాజ్యానికి హాని, విఘ్నాలు సంభవించవు. వ్యవసాయం, పశు పాలన మొదలగు అధికారాలు వైశ్యులకు ఇవ్వాలి. వారు ఈ కార్యాన్ని బాగా చేయగలుగుతారు. శూద్రునికి సేవాధికారం ఇవ్వాలి. అతడు విద్యాహీనుడై అజ్ఞానిగా ఉంటాడు. కాబట్టి విద్యాసంబంధ కార్యాలను ఏమీ చేయలేడు. కేవలం శారీరిక కార్యాలనే చేయగలుగుతాడు. ఇలా వర్ణాలనన్నింటినీ తమ తమ అధికారాలలో ప్రవర్తింపజేయటం రాజు మొదలైన సభ్యజనుల కర్తవ్యం.

వివాహ లక్షణాలు

బ్రాహ్మో దైవస్తథైవార్షః ప్రాజాపత్యస్తథాఽసురః ।
గాంధర్వో రాక్షసశ్చైవ పైశాచశ్చాష్టమోఽధమః ॥ మను. 3-21 ॥

'బ్రాహ్మం, దైవం, ఆర్షం, ప్రాజాపత్యం, ఆసురం, గాంధర్వం, రాక్షసం, పైశాచం' అని వివాహం ఎనిమిది విధాలు.

ఈ వివాహాల వ్యవస్థ ఇలా ఉన్నది:

1. కన్య, వరుడు యథావిధిగా బ్రహ్మచర్యంతో పూర్ణ విద్వాంసులు, ధార్మికులు, సుశీలురై పరస్పర ప్రసన్నత కలవారై వివాహమాడటం 'బ్రాహ్మం' అంటారు.
2. ఏదేని బృహద్యజ్ఞంలో ఋత్విక్కులు కర్మలు చేయుచుండగా కాబోవు అల్లునికి అలంకారవతి అయిన కన్యను ఇవ్వటం 'దైవ వివాహం' అంటారు.
3. వరుని నుండి ఏదైనా కొంత తీసుకొని వివాహం చేయటం 'ఆర్షం' అంటారు.
4. ధర్మాభివృద్ధి కొరకు ఇద్దరు వివాహం చేసుకొంటే 'ప్రాజాపత్యం' అంటారు.

5. వరునికి కన్య యొక్క తండ్రి కొంత ధనమిచ్చి వివాహం చేయటం 'ఆసురం' అంటారు.

6. నియమం, సమయ నిర్ణయం లేకుండా, ఏదో ఒక కారణంతో వరుడు, కన్య తమ కోరిక చొప్పున పరస్పరం కలియుట 'గాంధర్వం' అంటారు.

7. యుద్ధం చేసి బలాత్కారంగా కన్యను లాగుకొనిపోయో, మోసం చేసో కన్యను గ్రహించటం 'రాక్షసం' అంటారు.

8. నిద్రించినపుడు గాని, త్రాగిన మైకంలో ఉన్నప్పుడు గాని, ఉన్మత్తత కలిగి ఉన్నప్పుడుగాని కన్యతో బలాత్కారంగా సంయోగంచేసి వివాహమాడటం 'పైశాచం' అంటారు.

ఈ వివాహాలన్నింటిలో 'బ్రాహ్మ' వివాహం సర్వోత్కృష్టమైనది. 'దైవ, ప్రాజాపత్యాలు' మధ్యమాలు. 'ఆర్ష, ఆసుర, గాంధర్వాలు' నికృష్టాలు. 'రాక్షసం' అధమం. 'పైశాచం' మహా భ్రష్టమైనది. కాబట్టి కన్యావరులకు వివాహానికి ముందు ఏకాంతంలో కలవటానికి అవకాశం ఇవ్వకూడదు. ఎందుకంటే, యువావస్థలో స్త్రీ పురుషులు ఏకాంతంలో కలుసుకోవటం దోషాలకు కారణమౌతుంది.

కన్యావరులకు వివాహసమయం ఆసన్నం కాగానే బ్రహ్మచర్యాశ్రమ సమాప్తికి, విద్యాపూర్తికి ఒక సంవత్సరం గాని, ఆరు నెలలు గాని శేషించి ఉండగా కన్య యొక్క వరుని యొక్క ఛాయా చిత్రాలను అనగా "ఫొటో" తీయించాలి. కన్యయొక్క అధ్యాపికల వద్దకు వరుని యొక్క ఛాయా చిత్రాన్ని, వరుని అధ్యాపకుల వద్దకు కన్యయొక్క ఛాయాచిత్రాలను పంపాలి. ఎవరి ఛాయాచిత్రాలు లభిస్తాయో వారి జన్మచరిత్ర పుస్తకం పుట్టినప్పటి నుండి వివాహసమయం వరకు గల చరిత్రను తెప్పించి అధ్యాపకులు చూడాలి. కన్యావరులయొక్క గుణ, కర్మ, స్వభావాలు సమానంగా ఉండి, వారికి వివాహమవటం తగునని అనుకున్నప్పుడు, కన్యావరుల ఛాయాచిత్రాలు, జన్మచరిత్రలను పరస్పరం చూసుకోవడానికి ఇవ్వాలి. తర్వాత వారి అభిప్రాయాలను తెలుపుమని చెప్పాలి. వారు ఇద్దరూ పరస్పరం వివాహమాడటానికి అంగీకరిస్తే వారిరువురికి సమావర్తనం ఒకే సమయంలో జరపాలి. అధ్యాపకుల సమక్షంలోనే వివాహం కావాలని వారు కోరితే అలాగే వివాహం జరిపించాలి. లేకపోతే కన్య యొక్క పుట్టింట వివాహం జరపటం మంచిది. అధ్యాపకుల ఎదుట గాని, కన్య యొక్క తల్లిదండ్రుల ఎదుటగాని, భద్రపురుషుల సమక్షంలో గాని, కన్యావరులు పరస్పరం మాట్లాడుకొనేటట్లు చేసి, రహస్య విషయాలు ఏవైన అడగాలనుకున్నప్పుడు సభలో కాగితంపై వ్రాసి ఒకరికొకరు ఇచ్చుకొని ప్రశ్నోత్తరాలు జరుపుకొనేటట్లు చేయాలి. చదివిన విషయాలలో శాస్త్రార్థం కూడా చేయించాలి. ఇద్దరిలో దృఢమైన ప్రేమ కలిగిన మీదట వివాహం చేసికోవటం ఇష్టం అయితే నాటినుండి వారి భోజన పానీయాలకు తగిన ఉత్తమ వ్యవస్థ చేయాలి. బ్రహ్మచర్యంతో విద్యాధ్యయన రూప

తపశ్చర్యవలన, దుర్బలమైన వారి శరీరాలు పౌష్టికాహారంతో దినదినప్రవర్ధమానమై చంద్రునికళ వలె వృద్ధి చెందుతూ, కొద్దిరోజులలోనే పుష్టిగలవవుతాయి. తర్వాత కన్య రజస్వలయై శుద్ధియైనపుడు వివాహవేదికను నిర్మించి, మండపాన్ని అలంకరించి అనేక సుగంధాది ద్రవ్యాలతో, ఘృతాదులతో హోమంచేసి, విద్వాంసులైన స్త్రీపురుషులను యథాయోగ్యంగా సత్కరించాలి. తదుపరి ఋతుదానం చేయడానికి తగినదని అనుకుంటే ఆ రోజున 'సంస్కారవిధి' అను పుస్తకంలో గల విధి ప్రకారంగా అన్ని క్రియలను, అందరి యెదుట పాణిగ్రహణపూర్వక వివాహ విధిని పూర్తిచేసి తర్వాత మధ్యరాత్రి గాని, పదిగంటల సమయంలోగాని నూతన దంపతులను ప్రసన్నతతో ఏకాంతసేవనం చేయడానికి పంపించాలి.

విధి ప్రకారంగా పురుషుడు వీర్యస్థాపన, స్త్రీ వీర్యాకర్షణ చేయాలి. బ్రహ్మచర్యంలో రక్షించుకొన్న వీర్యాన్ని సాధ్యమైనంతవరకు వ్యర్థం చేయకూడదు. ఎందుకంటే అలాంటి రజోవీర్యాలతో కలుగు సంతానం అపూర్వమైనదై, ఉత్తమమైనదై ఉంటుంది. వీర్యం గర్భాశయంలో ప్రవేశించు సమయంలో స్త్రీ పురుషులు ఇద్దరూ స్థిరంగా ఉండి నాసికకు ఎదురుగా నాసికను, నేత్రాలకు ఎదురుగా నేత్రాలను ఉంచి, అత్యంత ప్రసన్న చిత్తంగలవారై, శరీరాలను కదల్పక చక్కగా పరుండాలి. తర్వాత పురుషుడు తన శరీరాన్ని సడలించాలి. వీర్యప్రాప్తి సమయంలో స్త్రీ అపానవాయువును పైకి పీల్చాలి. యోనిని పైన సంకోచపరచి వీర్యాన్ని లోనికి ఆకర్షించి గర్భాశయంలో స్థిరపరచుకోవాలి.

తర్వాత ఇద్దరూ శుద్ధజలంతో స్నానం చేయాలి. విద్వాంసురాలైన స్త్రీకి గర్భమేర్పడిన విషయం అప్పుడే తెలుస్తుంది. కాని ఒక నెల తదుపరి రజస్వల కాకపోతే గర్భమేర్పడిందని నిశ్చయించాలి. శొంఠి, కుంకుమపూవు, అశ్వగంధి, పెన్నేరు గడ్డ, చిన్న ఏలకులు చూర్ణంగా చేసి పంచదారతోపాటు కలిపి వేడిచేసిన పాలు మొదటనే తెచ్చి ఉంచుకొని, చల్లారిన తర్వాత ఇష్టానుసారంగా త్రాగి, వేరు వేరు పడకలపై నిద్రించాలి. గర్భాధాన క్రియ జరిపినప్పుడల్లా ఈ విధినే అనుసరించాలి.

ఒక నెల తదుపరి రజస్వలకాకపోతే గర్భమేర్పడింది అనుకొని, నాటినుండి ఒక సంవత్సర కాలం స్త్రీ పురుషునితో సంగమం చేయకూడదు. ఇలా చేస్తే కలిగే సంతానం ఉత్తమంగా ఉంటుంది. మళ్లీ రెండవసారి కూడా ఉత్తమ సంతానమే కలుగుతుంది. లేకపోతే వీర్యం వ్యర్థమైపోతుంది. ఇద్దరి ఆయువు తగ్గిపోతుంది. అనేక ప్రకారాలైన రోగాలు కలుగుతాయి. అయితే ఈ సమయంలో భార్యాభర్తలిద్దరూ పరస్పర భాషణాదులు, ప్రేమయుక్త వ్యవహారాలను తప్పక చేయాలి.

గర్భకాల కర్తవ్యాలు

పురుషుడు తన వీర్యాన్ని కాపాడుకోవటానికి, స్త్రీ తన గర్భాన్ని రక్షించుకోవటానికి తగిన భోజనపానీయాలనే సేవించాలి. అందువలన పురుషుని వీర్యం స్వప్నంలోనూ నష్టం కాదు. స్త్రీ

గర్భంలోని శిశువు శారీరికంగా అత్యుత్తమ రూపలావణ్యాలు కలిగి, పుష్టి, బలం, పరాక్రమంతో కూడి, పదవనెలలో పుడతాడు. నాల్గవనెల నుండి గర్భాన్ని కాపాడుతూ, ఎనిమిదవనెల నుండి విశేషంగా రక్షించాలి. గర్భవతియైన స్త్రీ విరేచక పదార్థాలను, రూక్షమైన వాటిని (ఉప్పు, కారం, పులుపు, చేదు ఎక్కువగా గల), మాదకద్రవ్యాలను, బుద్ధిని, బలాన్ని నాశనంచేసే పదార్థాలను భుజించకూడదు. నెయ్యి, పాలు, మంచి బియ్యం, గోధుమలు, పెసలు, మినుములు మొదలైన ఆహారపదార్థాలను దేశకాలాలకు అనుగుణంగా సేవించాలి.

గర్భం ఏర్పడిన నాల్గవ మాసంలో 'పుంసవనం', ఎనిమిదవ మాసంలో సీమంతోన్నయనంను విధిపూర్వకంగా చేయాలి. సంతానం జన్మించగానే తల్లీ, బిడ్డల శరీరాలను మిక్కిలి జాగ్రత్తగా రక్షించాలి. శిశువుయొక్క బొడ్డును మొదట కోమలమైన సన్నని దారంతో కట్టి నాలుగు అంగుళాలు విడిచి బొడ్డును కోయాలి. ఒక రక్తం బొట్టు కూడా క్రింద పడిపోకుండేట్లు బొడ్డును గట్టిగా కట్టి ఉంచాలి. బాలెంత స్త్రీలు సేవించవలసిన శొంఠిపాకం గాని 'సౌభాగ్యశొంఠి' పాకం గాని ముందే సిద్ధం చేసుకొని ఉంచాలి. ఆ సమయంలో స్త్రీ గోరువెచ్చని సుగంధపు నీటితో స్నానం చేయాలి. శిశువుకు కూడ స్నానం చేయించాలి.

తదుపరి ఆ స్థలాన్ని శుభ్రంచేసి ద్వారం ముందు భాగంలో సుగంధ పదార్థాలతో కూడిన ఘృతాదులతో హోమం చేయాలి. అనంతరం శిశువు యొక్క చెవిలో తండ్రి'వేదోఽసీతి' అనగా 'నీ నామం వేదం' అని చెప్పాలి. శిశువు నాలుకమీద బంగారు సన్నని కడ్డీని నేతిలో గాని, తేనెలో గాని ముంచి, **'ఓం'** అక్షరాన్ని వ్రాసి ఆ తేనెను లేక నేతిని, కడ్డీతోనే చప్పరింప చేయాలి. తర్వాత శిశువును తల్లికి ఇవ్వాలి. శిశువు పాలు త్రాగదలిస్తే తల్లియే పాలివ్వాలి. తల్లికి పాలు లేకపోతే, ఆవుపాలను త్రాగించాలి. తర్వాత శుభ్రమైన గదిలో ఉంచి, అందులో వాయువు శుభ్రంగా ఉండటానికి ప్రాతఃకాలం మరియు సాయంకాలంనందు సుగంధంతో కూడిన నెయ్యితో హోమం చేస్తూ ఉండాలి. తన శరీరం పుష్టి చెందుటకు స్త్రీ అనేక విధాలైన ఉత్తమ భోజనం చేస్తూ యోని సంకోచాది క్రియలను చేస్తూ ఉండాలి. ఆరవ దినంలో స్త్రీ గదినుండి బయటకు రావచ్చు. శిశువు యొక్క పెంపకంలో ఎట్టి అనుచిత వ్యవహారం జరగరాదు. అందుకు తగిన ఆహార పానీయాల వ్యవహారం కూడా యథాయోగ్యంగా ఉండాలి. తర్వాత **'సంస్కారవిధి'**లో వ్రాసిన రీతిగా నామకరణాది సంస్కారాలను నియమిత కాలంలో జరపాలి. ఒక సంవత్సరం తరువాత స్త్రీ రజస్వలయై శుద్ధి చెందిన తర్వాత, పూర్వం లాగే ఋతుదానం చేయాలి.

స్త్రీ పురుషుల వ్యవహారాలు

ఋతుకాలాభిగామీ స్యాత్ స్వదారనిరతః సదా । మను. 3-45 ॥

బ్రహ్మచార్యేవ భవతి యత్ర తత్రాశ్రమే వసన్ ॥ మను. 3-50 ॥

తన భార్యతోనే ప్రసన్నుడై ఋతుగామి యైనవాడు గృహస్థుడైననూ బ్రహ్మచారితో సమానుడే.

సంతుష్టో భార్యయా భర్తా భర్త్రా భార్యా తథైవ చ ।
యస్మిన్నేవకులే నిత్యం కల్యాణం తత్ర వై ధ్రువమ్ ॥ మను. 3-60 ॥

ఏ కుటుంబంలో భార్యతో భర్త, భర్తతో భార్య మిక్కిలి ప్రసన్నంగా ఉంటారో ఆ కులం సర్వ సౌభాగ్యాలకు, ఐశ్వర్యాలకు నిలయమౌతుంది. నిత్యం కలహాలు జరుగు కులంలో దౌర్భాగ్యం, దారిద్ర్యం స్థిరపడుతుంది.

యది హి స్త్రీ న రోచేత పుమాంసన్న ప్రమోదయేత్ ।
అప్రమోదాత్పునః పుంసః ప్రజనం న ప్రవర్తతే ॥ మను. 3-61 ॥

తన భర్తను ప్రేమించి అతన్ని ప్రసన్నునిగా చేసుకొనని స్త్రీ పట్ల భర్త అప్రసన్నుడుగా ఉండటంవలన అతనికి కామం జనించదు.

స్త్రీయాం తు రోచమానాయాం సర్వం తద్రోచతే కులమ్ ।
తస్యాం త్వరోచమానాయాం సర్వమేవ న రోచతే ॥ మను. 3-62 ॥

స్త్రీ ప్రసన్నంగా ఉంటే కుటుంబమంతా ప్రసన్నంగా ఉంటుంది. ఆమె అప్రసన్నురాలుగా ఉంటే ఆ కుటుంబంలోని వారందరూ అప్రసన్నులై దుఃఖాన్ని పొందుతారు.

నారీ సత్కారం

పితృభిర్భ్రాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా ।
పూజ్యా భూషయితవ్యాశ్చ బహుకల్యాణమీప్సుభిః ॥ మను. 3-55 ॥

తండ్రి, సోదరుడు, భర్త, మరిది మొదలైనవారు స్త్రీలకు సత్కారపూర్వకంగా ఆభూషణాలను ఇచ్చి వారిని ప్రసన్నులుగా ఉంచాలి. అధిక కల్యాణం కోరువారు నిరంతరం ఇలాగే చేయాలి.

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతాః ।
యత్రైతాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రాఽఫలాః క్రియాః ॥ మను. 3-56 ॥

ఏ గృహంలో స్త్రీలు పూజింప - సత్కరింపబడతారో ఆ గృహంలో దేవతలు సంచరిస్తారు. అక్కడ పురుషులు విద్యాయుక్తులై 'దేవ' నామం కలవారై ఆనందంతో క్రీడిస్తారు. ఏ గృహంలో స్త్రీలకు సత్కారం జరగదో అక్కడ జరుగు పనులన్నీ నిష్ఫలాలవుతాయి.

శోచంతి జామయో యత్ర వినశ్యత్యాశు తత్కులమ్ ।
న శోచన్తి తు యత్రైతా వర్ధతే తద్ధి సర్వదా ॥ మను. 3-57 ॥

ఏ కులంలో స్త్రీలు శోకాతురులై దుఃఖాన్ని అనుభవిస్తారో ఆ కులం శీఘ్రంగా నష్టభ్రష్టమవుతుంది. ఏ కులంలో, గృహంలో స్త్రీలు ఆనందంతో ఉత్సాహ, ప్రసన్నతలు కలిగి ఉంటారో ఆ కులం నిరంతరం అభివృద్ధి చెందుతుంది.

తస్మాదేతాః సదా పూజ్యా భూషణాచ్ఛాదనాశనైః ।
భూతికామైర్నరైర్నిత్యం సత్కారేషూత్సవేషు చ ॥ మను. 3-59 ॥

ఐశ్వర్యాన్ని కోరు పురుషులు, సత్కార, ఉత్సవ, పర్వ సమయాలలో వస్త్ర ఆభూషణాలతో మధురమైన భోజన పానీయాలతో స్త్రీలను సత్కరించాలి.

'పూజ' అను శబ్దానికి 'సత్కారం' అని అర్థం. ఉదయ సంధ్యా సమయంలో, సాయం సంధ్యా సమయంలోనూ సంధ్యాగ్నిహోత్రాల తర్వాత ప్రేమపూర్వకంగా పరస్పరం 'నమస్తే' అని పలుకుతూ అభివాదనపూర్వకంగా సత్కరించుకోవాలి. ఈ విషయాలనెన్నడూ మరువరాదు.

గృహిణి కర్తవ్యాలు

సదా ప్రహృష్టయా భావ్యం గృహకార్యేషు దక్షయా ।
సుసంస్కృతోపస్కరయా వ్యయే చాముక్తహస్తయా ॥ మను. 5-150 ॥

స్త్రీలెల్లప్పుడు మిక్కిలి ప్రసన్నతతో గృహకార్యాలలో నేర్పుకలిగి, పదార్థాలన్నింటినీ శుభ్రంగా ఉంచుతూ గృహాన్ని పరిశుభ్రంగా ఉంచాలి. ఖర్చుపెట్టవలసి వచ్చినప్పుడు మిక్కిలి ఉదారగుణం కలిగి అవసరమైనవాటికే ఖర్చుపెట్టాలి. వస్తువులన్నింటిని పవిత్రంగా ఉంచాలి. శారీరిక, మానసిక రోగాలు కలుగకుండునట్లు, ఔషధరూపంగా వంటలను సిద్ధం చేయాలి. ఖర్చులకు లెక్కలను సరిగ్గా వ్రాసిపెట్టి తన పతి మొదలగువారికి వినిపించాలి. ఇంట్లోని పనివారితో యథాయోగ్యంగా పనులు చేయించాలి. ఏ పనీ చెడకుండా చూడాలి. ఇవన్నీ గృహిణి కర్తవ్యాలు.

పొందవలసిన పదార్థాలు

స్త్రియో రత్నాన్యథోవిద్యా సత్యం శౌచం సుభాషితమ్ ।
వివిధాని చ శిల్పాని సమాదేయాని సర్వతః ॥ మను. 2-240 ॥

ఉత్తమ స్త్రీలు, అనేక రకాల రత్నాలు, విద్య, సత్యం, పవిత్రత, సుభాషితం, నానాప్రకారాలైన శిల్పవిద్యలు, చేతిపనులు మొదలైన వాటిని అన్ని దేశాల నుండి, మానవులందరి నుండి గ్రహించాలి.

లోకంలో వ్యవహరించే రీతి

సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ న బ్రూయాత్ సత్యమప్రియమ్ ।
ప్రియం చ నానృతం బ్రూయాత్ ఏష ధర్మః సనాతనః ॥ మను. 4-138 ॥

ఎల్లప్పుడూ అందరికీ హితం కలిగించే ప్రియమైన సత్యాన్నే చెప్పాలి. అప్రియసత్యం చెప్పరాదు. ఇతరులను ప్రసన్నం చేయటానికి అసత్యాన్ని ఎన్నడూ చెప్పరాదు. మెల్లకంటివాడిని చూపి 'నీవు మెల్లకంటివాడివి' అని అనవద్దు.

భద్రం భద్రమితి బ్రూయాద్భద్రమిత్యేవ వా వదేత్ ।
శుష్కవైరం వివాదం చ న కుర్యాత్కేనచిత్సహ ॥ మను. 4-139 ॥

అందరికీ హితాన్ని కలిగించే భద్రవచనాలనే మాట్లాడాలి. అపరాధం లేకుండా ఎవరితోనూ శుష్క వైరం, వ్యర్థమైన పోట్లాట పెట్టుకోరాదు. ఎవరితోనూ వివాదం - కుతర్కం చేయకూడదు. ఇతరులకు హితాన్ని కలిగించే మాటలను వారు చెడుగా భావించినా తప్పక చెప్పాలి.

పురుషా బహవో రాజన్ సతతం ప్రియవాదినః ।
అప్రియస్య తు పథ్యస్య వక్తా శ్రోతా చ దుర్లభః ॥ ఉద్యోగపర్వమున విదుర నీతి ॥37-15॥

ఓ ధృతరాష్ట్రా! ఇతరులను నిరంతరం సంతోషపెట్టుటకు ప్రియంగా మాట్లాడు ప్రశంసకులు లోకంలో ఎందరో ఉన్నారు. కాని వినటానికి అప్రియంగా తోచినను కల్యాణాన్ని కలిగించే వాక్కును చెప్పేవాడు, దానిని వినేవాడు దుర్లభులే. ముఖమెదురుగా ఎదుటివారి దోషాలను చెప్తూ తన దోషాలను వినటం, పరోక్షంలో ఇతరుల గుణాలను ప్రశంసించటం సత్పురుషులు చేయవలసిన పని. సమ్ముఖంలో పొగడుతూ పరోక్షంలో తప్పులెత్తి చూపటం దుష్టుల లక్షణం. ఇతరుల నుండి తన దోషాలను అడిగి తెలుసుకొని వాటిని తొలగించుకొన్నవాడు గుణవంతుడౌతాడు. ఇలా చేయనివాడు గుణవంతుడవటం అసంభవమే. ఎప్పుడూ ఇతరులను నిందించరాదు. **"గుణేషు దోషారోపణమసూయా, దోషేషు గుణారోపణమప్యసూయా" "గుణేషు గుణారోపణం దోషేషు దోషారోపణం చ స్తుతిః".** గుణాలలో దోషాలను, దోషాలలో గుణాలను ఆరోపించటం**'నింద'** అవుతుంది.. గుణాలను గుణాలనీ దోషాలను దోషాలనీ చెప్పటం **'స్తుతి'** అవుతుంది.

బుద్ధివృద్ధికరాణ్యాశు ధన్యాని చ హితాని చ ।
నిత్యం శాస్త్రాణ్యవేక్షేత నిగమాంశ్చైవ వైదికాన్ ॥ మను. 4-19 ॥

శీఘ్రంగా బుద్ధిని, ధనాన్ని, హితాన్ని వృద్ధిచేసే శాస్త్రాలను, వేదాలను నిత్యం వినాలి, వినిపించాలి. బ్రహ్మచర్యాశ్రమంలో చదివినవాటిని స్త్రీలు పురుషులు నిత్యం మననం చేస్తూ, చదివించాలి.

యథా యథా హి పురుషః శాస్త్రం సమధిగచ్ఛతి ।
తథా తథా విజానాతి విజ్ఞానం చాస్య రోచతే ॥ మను. 4-20 ॥

ఏ విధంగా మానవుడు శాస్త్రాలను యథాతథంగా తెలుసుకొంటాడో అదే విధంగా అతని విద్యా విజ్ఞానాలు అభివృద్ధి చెందుతాయి. వాటిలోని రుచిని కూడా పొందుతాడు.

పంచమహా యజ్ఞాలు

ఋషి యజ్ఞం దేవయజ్ఞం భూతయజ్ఞం చ సర్వదా ।
నృయజ్ఞం పితృయజ్ఞం చ యథాశక్తి న హాపయేత్ ॥ మను. 4-21 ॥

అధ్యాపనం బ్రహ్మయజ్ఞః పితృయజ్ఞశ్చ తర్పణమ్ ।
హోమో దైవో బలిర్భౌతో నృ యజ్ఞోఽ తిథిపూజనమ్ ॥ మను. 3-70 ॥

స్వాధ్యాయేనార్చయేతర్షీన్ హోమైర్దేవాన్ యథావిధి ।

పితౄన్ శ్రాద్ధైశ్చ నౄనన్నైర్భూతాని బలికర్మణా ॥ మను. 3-81 ॥

1. ఋషి యజ్ఞం:- వేదాది శాస్త్రాలను చదవటం, చదివించటం, సంధ్యోపాసన, యోగాభ్యాసం 'ఋషియజ్ఞం' అంటారు.

2. దేవ యజ్ఞం:- విద్వాంసుల సాంగత్యం, వారి సేవ, పవిత్రతను, దివ్యగుణాలను అలవర్చుకోవటం, దాతృత్వం, విద్యను అభివృద్ధి చేయటం, అగ్నిహోత్రం చేయటం **'దేవయజ్ఞం'** అంటారు. ఈ రెండు యజ్ఞాలను ప్రాతఃకాలంలో, సాయంకాలంలో చేయాలి.. వీటి గురించి బ్రహ్మచర్య విషయంలో వ్రాయబడింది.

సంధ్యాగ్నిహోత్రాల సమయం

1. సాయం సాయం గృహపతిర్నో అగ్నిః ప్రాతః ప్రాతః సౌమనసస్య దాతా ॥ 1 ॥
2. ప్రాతః ప్రాతర్గృహపతిర్నో అగ్నిః సాయం సాయం సౌమనసస్య దాతా ॥ 2 ॥

అథర్వ. 19-7 సూ. 55-3-4 ॥

3. తస్మాదహోరాత్రస్య సంయోగే బ్రాహ్మణః సంధ్యాముపాసీత ।
ఉద్యంతమస్తం యాంతమాదిత్యమభిధ్యాయన్ ॥ 3 ॥

షడ్వింశబ్రాహ్మణే 4-5 ॥తై.ఆ.2-2 ॥

4. న తిష్ఠతి తు యః పూర్వాం నోపాస్తే యస్తు పశ్చిమామ్ ।
స సాధుభిర్బహిష్కార్యః సర్వస్మాద్ద్విజకర్మణః ॥ మను. 2-103 ॥

సాయంకాలంలో చేసిన హోమంలోని హుతద్రవ్యం ప్రాతఃకాలంవరకు వాయు శుద్ధిని చేస్తూ సుఖకారి అవుతుంది. ॥ 1 ॥

ప్రాతఃకాలంలో అగ్నిలో వేసిన హుతద్రవ్యం సాయంకాలపర్యంతం వాయువును శుద్ధిచేస్తూ బలాన్ని బుద్ధిని, ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. ॥ 2 ॥

కాబట్టి దివారాత్రుల సంధివేళలలో అంటే సూర్యోదయ, సూర్యాస్తమయ సమయాలలో పరమేశ్వరుని ధ్యానం, అగ్నిహోత్రం తప్పక చేయాలి. ॥ 3 ॥

సాయం ప్రాతఃకాలాలలో సంధ్య అగ్నిహోత్రాలను చేయనివారిని ద్విజకార్యాలన్నింటి నుండి సజ్జనులు బహిష్కరించాలి. అతనిని శూద్రునివలె లెకించాలని అర్థం ॥ 4 ॥

ప్రశ్న:- త్రికాల సంధ్య ఎందుకు చేయరాదు?

జవాబు:- మూడు వేళల్లో సంధి జరగదు. సాయం ప్రాతఃసమయంలోనే రెండుసార్లు మాత్రమే ప్రకాశానికి, అంధకారానికి సంధి జరుగుతుంది. దీనిని అంగీకరించక మధ్యాహ్నకాలంలో మూడవ సంధ్యను చేసేవారు మధ్యరాత్రిలో సంధ్యోపాసన ఎందుకు చేయరు? మధ్యరాత్రిలోను చేయదలచిన ప్రతిజాము జాముకు, గడియ గడియకు, గంటగంటకు, క్షణ క్షణానికి, సంధి జరుగుతుంది. కాబట్టి

ఎప్పుడూ సంధ్యోపాసన చేస్తూనే ఉండాలి. ఇలా చేయటం అసాధ్యం. మధ్యాహ్న సంధ్యకు ఏ శాస్త్రములోనూ ప్రమాణం లేదు. కావున రెండు వేళలందే సంధ్య, అగ్నిహోత్రం చేయటం సముచితం. మూడవ వేళలో చేయరాదు. మూడు కాలాల యొక్క భేదం భూతభవిష్యద్వర్తమానాలను బట్టి ఏర్పడింది కాని సంధ్యోపాసనల భేదంవల్ల కాదు.

3. పితృ యజ్ఞం:- ఇందు విద్వాంసులైన దేవతలను, ఋషులను, తల్లి, తండ్రి మొదలైన పితరులను, వృద్ధులను, జ్ఞానులను, పరమయోగులను సేవించటం జరుగుతుంది. 'శ్రాద్ధం, తర్పణం' అని పితృయజ్ఞం రెండు విధాలు. 'శ్రత్' అనగా సత్యం. "**శ్రత్సత్యం దధాతి యయా క్రియయా సా శ్రద్ధా, శ్రద్ధయా యత్క్రియతే తచ్ఛ్రాద్ధమ్**'' ఏ క్రియతో సత్యం తెలుస్తుందో దాన్ని 'శ్రద్ధ' అనీ, శ్రద్ధతో చేసేపనిని 'శ్రాద్ధం' అనీ చెప్తారు. "**తృప్యంతి తర్పయంతి యేన పితౄన్ తత్తర్పణమ్**" జీవించి ఉన్న తల్లి, తండ్రి మొదలైన పితరులు ఏ పనులవలన తృప్తిచెంది ప్రసన్నులౌతారో దానిని '**తర్పణం**' అంటారు. అయితే ఇవి బ్రతికి ఉన్నవారికే. చనిపోయినవారికి కాదు.

దేవ తర్పణం:

ఓం బ్రహ్మాదయో దేవాస్తృప్యంతామ్ । బ్రహ్మాదిదేవ పత్న్యస్తృప్యంతామ్ ।
బ్రహ్మాదిదేవసుతాస్తృప్యంతామ్ । బ్రహ్మాదిదేవగణాస్తృప్యంతామ్ ॥
ఇతి దేవతర్పణమ్ ॥ (ఆశ్వలాయనగృహ్యసూత్రము. 3-4)

"విద్వాంసో హి దేవాః" ఇది శతపథబ్రాహ్మణ వచనం (శత. 3-7-3-10). విద్వాంసులే '**దేవతలు**' అంటారు. సాంగోపాంగంగా నాలుగువేదాలు తెలిసిన వారిని '**బ్రహ్మ**' అంటారు. అంతకన్నా తక్కువ చదివినవారిని దేవతలు లేక విద్వాంసులు అంటారు. వారివల్లనే విద్వాంసురాలైన స్త్రీలను '**బ్రాహ్మణి**' అనీ 'దేవి' అనీ చెప్తారు. వీరందరికి వీరితో సమానులైన వీరి పుత్రులకు, శిష్యులు మరియు సేవకాగణానికి సేవ చేయాలి. దీనినే '**శ్రాద్ధం, తర్పణం**' అంటారు.

ఋషి తర్పణం:

ఓం మరీచ్యాదయ ఋషయస్తృప్యంతామ్ । మరీచ్యాద్యృషిపత్న్యస్తృప్యంతామ్ ।
మరీచ్యాద్యృషిసుతా స్తృప్యంతామ్ । మరీచ్యాద్యృషిగణాస్తృప్యంతామ్ ॥ఇతి ఋషితర్పణమ్ ॥
(ఆశ్వ.గృ.సూ. 2-4)

బ్రహ్మ ప్రపౌత్రుడైన మరీచిలాగా విద్వాంసులై చదివించాలి. వారి వలెనే విద్యావంతురాండ్రై, స్త్రీలు కన్యలకు విద్యాదానం చేయాలి. వారికి సమానులైన పుత్రులు, శిష్యులు, అలాగే సేవకాగణం మొదలైనవారిని సేవించి సత్కరించటం '**ఋషితర్పణం**' అంటారు.

పితృతర్పణం:

ఓం సోమసదః పితరస్తృప్యంతామ్ । అగ్నిష్వాత్తాః పితరస్తృప్యంతామ్ । బర్హిషదః పితరస్తృప్యంతామ్

సోమపాః పితరస్తృప్యంతామ్। హవిర్భుజః పితరస్తృప్యంతామ్ । ఆజ్యపాః పితరస్తృప్యంతామ్ । సుకాలినః పితరస్తృప్యంతామ్ । యమాదిభ్యోనమః యమాదీంస్తర్పయామి । పిత్రే స్వధా నమః పితరం తర్పయామి। పితామహాయ స్వధా నమః పితామహం తర్పయామి । ప్రపితామహాయ స్వధానమః ప్రపితామహం తర్పయామి। మాత్రే స్వధా నమః నమో మాతరం తర్పయామి । పితామహ్యై స్వధా నమః పితామహీం తర్పయామి । ప్రపితామహ్యై స్వధా నమః ప్రపితామహీం తర్పయామి ।

స్వపత్న్యై స్వధా నమః స్వపత్నీం తర్పయామి । సంబంధిభ్యః స్వధా నమః సంబంధినస్తర్పయామి। సగోత్రేభ్యః స్వధా నమః సగోత్రాం తర్పయామి ॥ ఇతి పితృతర్పణమ్ ॥ (అశ్వ. గృ.సూ. 2-4)

"యే సోమే జగదీశ్వరే పదార్థవిద్యాయాం చ సీదంతి తే సోమసదః"పరమాత్మునిలో, పదార్థవిద్యలో నిపుణులైనవారిని 'సోమసదులు' అంటారు. "యైరగ్నేర్విద్యుతో విద్యాగృహీతా తే అగ్నిష్వాత్తాః" 'అగ్ని' అనగా విద్యుదాది పదార్థాలను తెలిసినవారిని **'అగ్నిష్వాత్తులు'** అంటారు.

"యే బర్హిషి ఉత్తమే వ్యవహారే సీదంతి తే బర్హిషదః"ఉత్తమ విద్యావృద్ధియుక్తమైన వ్యవహారాలలో ఉండే వారిని **'బర్హిషదులు'** అంటారు. **"యే సోమమైశ్వర్య మోషధీరసం వా పాంతి పిబంతి వా తే సోమపాః"** ఐశ్వర్యాన్ని రక్షిస్తూ మహౌషధి రసపానాన్ని రోగరహితులై, ఇతరుల యైశ్వర్యాన్ని రక్షించే వారికి ఔషధాలను ఇచ్చి రోగాలను నాశనం చేసేవారిని **సోమపులు'** అంటారు. **"యే హవిర్హోతుమత్తు మర్హం భుంజతే భోజయంతి వా తే హవిర్భుజః"** మత్తుపదార్థాలను, హింసాకారక ద్రవ్యాలను వీడి భుజించేవారిని **'హవిర్భుజులు'** అంటారు. **"య ఆజ్యం జ్ఞాతుం ప్రాప్తుం వా యోగ్యం రక్షంతి వా పిబంతి త ఆజ్యపాః"** తెలుసుకొనేవారిని రక్షిస్తూ ఘృతదుగ్ధాది పదార్థాలను త్రాగేవారు **'ఆజ్యపులు'**, **"శోభనః కాలో విద్యతే యేషాం తే సుకాలినః"** శ్రేష్ఠ ధర్మాలను ఆచరించడానికి మంచి సమయం కలవారు **'సుకాలినులు'**, **"యే దుష్టాన్ యచ్ఛంతి నిగృహ్ణంతి తే యమా న్యాయాధీశాః"** దుష్టులను దండించి శ్రేష్ఠులను పాలించే న్యాయకారులు **'యములు'**.

"యః పాతి స పితా" సంతానాన్ని అన్న సత్కారాలతో రక్షించే తండ్రి 'పిత'. **"పితుః పితా పితామహః. పితామహస్య పితా ప్రపితామహః"** పిత యొక్క పిత 'పితామహుడు', పితామహుని పిత 'ప్రపితామహుడు'. **"యా మానయతి సా మాతా"** అన్నసత్కారాలతో సంతానానికి మాన్యతనిచ్చేది 'మాతా', **"యా పితుర్మాతా సా పితామహీ. పితామహస్య మాతా ప్రపితామహీ"**. తండ్రి యొక్క తల్లి 'పితామహి', పితామహుని తల్లి 'ప్రపితామహి'.

తన భార్య, సోదరి, సంబంధీకులు, ఒకే గోత్రంవారు, అన్య భద్ర పురుషులు, వృద్ధులు మొదలైనవారికి అత్యంత శ్రద్ధతో అన్న వస్త్రాలను, సుందర ప్రయాణ సాధనాలను మొదలైన వాటిని ఇచ్చి వారికి బాగా తృప్తి కలిగించాలి. ఏ యే కర్మలతో వారి ఆత్మ తృప్తిచెంది శరీరం ఆరోగ్యంగా ఉంటుందో ఆ యా కర్మలనే ప్రీతిపూర్వకంగా చేస్తూ వారిని సేవించటం'శ్రాద్ధం', **'తర్పణం'** అంటారు.

4. బలి వైశ్వదేవం: వంట సిద్ధమైన తర్వాత భోజనార్థం వండిన పదార్థాలలో పులుపు, కారం, ఉప్పు కలిపిన వాటిని విడిచిపెట్టి నెయ్యి, తీపితో కూడిన అన్నాన్ని తీసుకొని పొయ్యిలోని అగ్నిని

బయటికి తీసి దానిలో నిమ్నలిఖిత మంత్రాలతో ఆహుతులను ఇవ్వాలి. మిగిలిన దానిని కొన్ని భాగాలు చేయాలి.

వైశ్వదేవస్య సిద్ధస్య గృహ్యేఽగ్నౌ విధిపూర్వకమ్ ।
ఆభ్యః కుర్యాద్దేవతాభ్యో బ్రాహ్మణో హోమమన్వహమ్ ॥ మను. 3-84 ॥

పాకశాలలో భోజనార్థం వండిన పదార్థాలతో దివ్యగుణాలు కలగటానికి ఆ పాకశాలలోని అగ్నిలోనే నిమ్నలిఖిత మంత్రాలతో విధిపూర్వకంగా హోమం చేయాలి.

హోమ మంత్రాలు

ఓం అగ్నయే స్వాహా । సోమాయ స్వాహా । అగ్నిషోమాభ్యాం స్వాహా । విశ్వేభ్యో దేవేభ్యః స్వాహా ధన్వంతరయే స్వాహా । కుహ్వై స్వాహా । అనుమత్యై స్వాహా । ప్రజాపతయే స్వాహా । సహ ద్యావాపృథివీభ్యాం స్వాహా । స్విష్టకృతే స్వాహా ॥ మను. 3-85, 86

ప్రజ్వరిల్లు అగ్నిలో స్వాహాకారం కలిగిన పై ప్రతి మంత్రంతో ఒక్కొక్క ఆహుతి నివ్వాలి. తర్వాత పళ్లెంలో గాని నేలపై విస్తరి పరచి గాని తూర్పుదిశాది క్రమంగా ఈ మంత్రాలతో అన్నభాగాలను పెట్టాలి.

ఓం సానుగాయేంద్రాయ నమః । సానుగాయ యమాయ నమః । సానుగాయ వరుణాయ నమః। సానుగాయ సోమాయ నమః । మరుద్భ్యో నమః । అద్భ్యో నమః । వనస్పతిభ్యో నమః । శ్రియై నమః । భద్రకాల్యై నమః । బ్రహ్మపతయే నమః । వాస్తుపతయే నమః । విశ్వేభ్యో దేవేభ్యో నమః । దివాచరేభ్యో భూతేభ్యో నమః । నక్తంచారిభ్యో భూతేభ్యో నమః । సర్వాత్మభూతయే నమః ।

ఈ భాగాలను ఎవరికైన అతిథికి ఇచ్చి భుజించమనాలి. లేదా అగ్నిలోనే వేయాలి. తర్వాత లవణ అన్నం అనగా ఉప్పు అన్నం, శాకం రొట్టె మొదలైనవి తీసుకొని భూమిపై ఆరు భాగాలుగా విడవాలి. ఇందుకు ప్రమాణం:

శునాం చ పతితానాం చ శ్వపచాం పాపరోగిణామ్ ।
వాయసానాం క్రిమీణాం చ శునకైర్నిర్వపేద్భువి ॥ మను. 3-92 ॥

ఈ ప్రకారంగా "శ్వభ్యో నమః । పతితేభ్యో నమః । శ్వపగ్భ్యో నమః । పాపరోగిభ్యో నమః । వాయసేభ్యో నమః । క్రిమిభ్యో నమః" అని పెట్టి తర్వాత వాటిని దుఃఖితునకు, ఆకలిగొన్నవారికి, కుక్క, కాకి మొదలైన వారికి పెట్టాలి. ఇక్కడ 'నమః' శబ్దానికి 'అన్నం' అని అర్థం. 'కుక్క పాపి, చండాలుడు, పాపరోగి, కాకి, చీమలు మొదలైన క్రిములకు అన్నం పెట్టాలి' అని మనుస్మృతి మొదలైనవాటిలో విధించబడింది. ఇటుల హోమం చేయటం వలన పాకశాలలోని వాయువు పరిశుద్ధమవుతుంది. తెలియకుండా కనబడని జీవులను చంపటం జరుగుతుంది. కాబట్టి జీవహింసకు ప్రత్యుపకారము చేయుటయను ప్రయోజనముకూడా సిద్ధిస్తుంది.

5. అతిథి యజ్ఞం: నిశ్చితమైన తిథి లేకుండా వచ్చేవాడిని 'అతిథి' అంటారు. అకస్మాత్తుగ ధార్మికులు, సత్యోపదేశకులు, అందరి ఉపకారానికై సర్వత్ర పర్యటనచేసే పూర్ణవిద్వాంసులు, పరమ యోగులు, సన్న్యాసులు గృహస్థుల దగ్గరకు వస్తే వారికి మొదట పాద్యం, అర్ఘ్యం, ఆచమనీయమనే మూడు విధాల జలమివ్వాలి. తర్వాత సత్కారపూర్వకంగా ఆసనంపై కూర్చోబెట్టి, ఆహార పానీయాలు మొదలైన ఉత్తమపదార్థాలతో సేవాశుశ్రూషలను చేసి, వారిని ప్రసన్నులను చేయాలి. అనంతరం వారి సత్సంగంలో ధర్మ, అర్థ, కామ, మోక్షాలను పొందటానికి వీలైన జ్ఞాన, విజ్ఞాన సంబంధమైన ఉపదేశాలను విని, వారి సదుపదేశానుసారంగా తమ ప్రవర్తనను తీర్చిదిద్దుకోవాలి. సమయానుసారంగా గృహస్థులు, రాజులు మొదలైనవారు అతిథులవలె సత్కరింపదగినవారైఉంటారు.

పాషండి తిరస్కారం

పాషండినో వికర్మస్థాన్ బైడాలవృత్తికాన్ శఠాన్ ।
హైతుకాన్ బకవృత్తీంశ్చ వాఙ్మాత్రేణాపి నార్చయేత్ ॥ మను. 4-30 ॥

పాషండినః = వేదనిందకులు, వేదవిరుద్ధమైన ఆచరణగలవారు; వికర్మస్థాన్ = వేదవిరుద్ధ కర్మలను చేసేవారు, మిథ్యాభాషణాలు కలవారు; బైడాలవృత్తికాన్ = పిల్లి దాగి, పొంచుకొని ఉండి హఠాత్తుగా ఎలుకపై బడి చంపి తినేటట్లు వర్తించేవారు; శఠాన్ = హఠులు, దురాగ్రహులు, అభిమానులు, తమకు తెలియకున్నా ఇతరులు చెప్పిన దానిని కూడ విననివారు; హైతుకాన్ = కుతర్కం చేసేవారు, వ్యర్థంగా వాదించువారు, నేటి నవీన వేదాంతుల వలె తామే బ్రహ్మమనీ, జగత్తు మిథ్యయనీ చెప్పేవారు, వేదాది శాస్త్రాలు, ఈశ్వరుడు కల్పితమని ప్రలాపం చేసేవారు; బకవృత్తీన్ = కొంగ ఒకకాలు పైకెత్తి ధ్యానించేటట్లు నటించి హఠాత్తుగా చేపల ప్రాణాన్నితీసి తన స్వార్థాన్ని నెరవేర్చుకొనేటట్లు వుండే నేటి బైరాగులు మొదలైన హఠులు, దురాగ్రహులు వేదవిరోధులు. ఇలాంటివారిని మాటలతో కూడా సత్కారం చేయకూడదు. వీరికి సత్కారం చేసిన వీరు అభివృద్ధి చెంది లోకాన్ని అధర్మయుక్తం చేస్తారు. తాము అవనతిని పొందు కార్యాలను చేయటమే కాక తమతోపాటు సేవకులను కూడా అవిద్యారూప మహాసాగరంలో ముంచేస్తారు.

పంచమహాయజ్ఞాల వలన కలిగే ఫలితాలు

'బ్రహ్మయజ్ఞం' వల్ల విద్య, ఉత్తమశిక్షణ, ధర్మం, సభ్యత మొదలైన శుభగుణాలు వృద్ధిచెందుతాయి.

'అగ్నిహోత్రం' వల్ల వాయువు, వృష్టి జలం శుద్ధమై వర్షం వల్ల లోకానికి సుఖం కలుగుతుంది. శుద్ధవాయువును శ్వాసిస్తూ స్పృశించటంవల్ల, దానితో కూడిన ఆహార పానీయాలను సేవించటం వల్ల ఆరోగ్యం, బుద్ధి, బలం పరాక్రమం వృద్ధిచెంది; ధర్మ, అర్థ, కామ, మోక్షాల అనుష్ఠానం పూర్తి అవుతుంది. కాబట్టి దీనిని **'దేవయజ్ఞం'** అంటారు.

'పితృ యజ్ఞం'లో తల్లిదండ్రులను, జ్ఞానులను, మహాత్ములను సేవిస్తే జ్ఞానం వృద్ధిచెందుతుంది. కావున సత్యాసత్యాల నిర్ణయం తెలుసుకొని సత్యాన్ని గ్రహించి, అసత్యాన్ని త్యజించి సుఖంగా

ఉంటారు. తల్లిదండ్రులు తమ సంతానానికి, ఆచార్యులు తమ శిష్యులకు చేసిన సేవ, శ్రమలకు బదులుగా వారిని సేవించటమేగాక తమ కృతజ్ఞత చూపటం కూడ దీనివలన జరుగుతుంది.

'బలివైశ్వదేవ యజ్ఞం' యొక్క ఫలితం ఇదివరకే చెప్పబడింది.

'ఉత్తములైన అతిథులు' లభించేంతవరకు లోకోన్నతి కలుగదు. వారు దేశవిదేశాలలో పర్యటన చేస్తూ సత్యోపదేశం చేస్తే పాషండం అభివృద్ధిచెందదు. సర్వత్ర గృహస్థులకు సహజంగా సత్యవిద్యా ప్రాప్తి కలుగుతుంది. మానవులందరిలో ఒకేధర్మం స్థిరంగా ఉంటుంది. అతిథులు లేకపోతే గృహస్థులకు సందేహ నివృత్తి కలగదు. సందేహాలు పోకపోతే దృఢనిశ్చయం ఏర్పడదు. నిశ్చయం లేకుండా సుఖం లభించదు.

గృహస్థుల సామాన్య కర్తవ్యాలు

బ్రాహ్మే ముహూర్తే బుధ్యేత ధర్మార్థౌ చానుచింతయేత్ ।
కాయక్లేశాంశ్చ తన్మూలాన్ వేదతత్త్వార్థమేవ చ ॥ ॥ మను. 4-92 ॥

రాత్రి సమయంలో నాల్గవ ఝాము-నాలుగు గడియల రాత్రి ఉండగానే అంటే తొలికోడి కూచినప్పుడు లేదా 3 గంటలకే నిదుర మేల్కొని, అవశ్యకమైన కాలకృత్యాలు తీర్చుకొని, ధర్మార్థాలను, శరీర రోగాల నిదానాన్ని, విచారించి పరమాత్ముని ధ్యానం చేయాలి. అధర్మాచరణాన్ని ఎన్నడూ చేయరాదు. ఎందుకంటే:

నాధర్మశ్చరితో లోకే సద్యః ఫలతి గౌరివ ।
శనైరావర్తమానస్తు కర్తుర్మూలాని కృంతతి ॥ ॥ మను. 4-172 ॥

చేసిన అధర్మం ఎన్నడూ నిష్ఫలం కాదు. అధర్మం చేసినపుడు వెంటనే దాని ఫలితం లభించదు. కాబట్టి అజ్ఞానులు అధర్మాన్ని చేయటానికి భయపడరు. అధర్మాచరణం మెల్లమెల్లగా సుఖం యొక్క మూలాలనే కత్తిరించివేస్తున్నదని నిశ్చయంగా తెసులుకోవాలి.

అధర్మేణైధతే తావత్తతో భద్రాణి పశ్యతి ।
తతః సపత్నాన్ జయతి సమూలస్తు వినశ్యతి ॥ ॥ మను. 4-174 ॥

అధర్మాత్ముడు ధర్మమర్యాదను వీడి, చెఱువుకట్ట తెగినప్పుడు నీరు నాలుగువైపుల వ్యాపించేటట్లు మిథ్యాభాషణం, కపటం, పాషండం అంటే రక్షించే వేదాలనే ఖండించటం, విశ్వాస ఘూతాది కృత్యాలతో పరుల పదార్థాలను ఆక్రమించుకొని మొదట వృద్ధి చెందుతుంది. ధనాది ఐశ్వర్యాలతో ఆహార, పానీయ, వస్త్ర, ఆభూషణ, యాన, స్థాన, మాన, ప్రతిష్ఠలను పొందుతారు. అన్యాయంతో శత్రువులను జయిస్తారు. తర్వాత వేళ్ళు నరకబడిన చెట్టు పడిపోవునట్లు శీఘ్రంగా అధర్మాత్ముడు నష్టభ్రష్టడవుతాడు.

సత్యధర్మార్యవృత్తేషు శౌచే చైవారమేత్సదా ।
శిష్యాంశ్చ శిష్యాద్ధర్మేణ వాగ్బాహూదరసంయతః ॥ మను. 4-175 ॥

విద్వాంసుడు వేదోక్త సత్య ధర్మాలను ఆచరిస్తూ, పక్షపాతాన్ని వీడి సత్యాన్ని గ్రహిస్తూ అసత్యాన్ని పరిత్యజించి, న్యాయరూపమైన వేదోక్త ధర్మాలను ఆర్యులవలె ఆచరిస్తూ ధర్మప్రకారంగా శిష్యులకు శిక్షణ నివ్వాలి.

ఋత్విక్పురోహితాచార్యైర్మాతులాతిథిసంశ్రితైః ।
బాలవృద్ధాతురైర్వైద్యైర్జ్ఞాతిసంబంధిబాంధవైః ॥ 1 ॥

మాతాపితృభ్యాం యామీభిర్భ్రాత్రా పుత్రేణ భార్యయా ।
దుహిత్రా దాసవర్గేణ వివాదం న సమాచరేత్ ॥ 2 ॥ మను. 4-179, 180 ॥

ఋత్విక్ = యజ్ఞం చేయించేవాడు; పురోహితః = సదా ఉత్తమ ప్రవర్తనను బోధించేవాడు; ఆచార్యః = విద్యను నేర్పేవాడు; మాతులః = మేనమామ; అతిథిః = రాకపోకలకు నిశ్చితమైన తిథి లేనివాడు అంటే సన్న్యాసి, లోకోపకారి; సంశ్రితః = తనను ఆశ్రయించేవాడు; బాలః = బాలుడు; వృద్ధః = ముసలివాడు; ఆతురః = పీడితుడు; వైద్యః = ఆయుర్వేదం తెలిసినవాడు; జ్ఞాతిః = స్వగోత్రీకుడు, స్వవర్ణస్థుడు; సంబంధీ = మామ మొదలైనవారు; బాంధవః = మిత్రులు ॥1॥

మాతా = తల్లి; పితా = తండ్రి; యామీ = అక్క; భ్రాతా = అన్న; పుత్రేణ = కుమారునితో; భార్యా = ఇల్లాలు; దుహిత్రా = కూతురు; దాసవర్గేణ = సేవకులు మొదలైనవారితో వివాదం అనగా విరుద్ధంగా ఎప్పుడూ పోట్లాడటం తగదు ॥2॥

దానానికి అయోగ్యులు

అతపాస్త్వనధీయానః ప్రతిగ్రహరుచిర్ద్విజః ।
అంభస్య శ్మప్లవేనేవ సహ తేనైవ మజ్జతి ॥ మను. 4-190 ॥

అతపాః = బ్రహ్మచర్యం, సత్యభాషణాది తపస్సులేనివాడు; అనధీయానః = అధ్యయనం చేయనివాడు; ప్రతిగ్రహరుచిః = ధర్మం పేరుతో అధికంగా ఇతరుల నుండి దానం తీసుకొనేవాడు అనే ఈ ముగ్గురూ రాతి నావతో సముద్రాన్ని దాటేవాడిలాగ తమ దుష్టకర్మల వలన దుఃఖసాగరంలో మునిగిపోతారు. వారు మునగటమేకాక దాతలను కూడా ముంచేస్తారు.

త్రిష్వప్యేతేషు దత్తం హి విధినాప్యర్జితం ధనమ్ ।
దాతుర్భవత్యనర్థాయ పరత్రాదాతురేవ చ ॥ మను. 4-193 ॥

ధర్మంతో సంపాదించిన ధనాన్ని పైన తెలిపిన ముగ్గురకూ దానమిస్తే ఆ దానం, ఈ జన్మలోనే దాతను నాశనం చేస్తుంది. దానం తీసుకొన్నవారిని పరజన్మలో నాశనం చేస్తుంది. దాత, ప్రతిగ్రహీత అజ్ఞానులైతే:

యథా ప్లవే నౌపలేన నిమజ్జత్యుదకే తరన్ ।
తథా నిమజ్జతోఽధస్తాదజ్ఞౌ దాతృప్రతీచ్ఛకౌ ॥ మను. 4-194 ॥

రాతి నావపై కూర్చొని జలాన్ని దాటేవారు అందులో మునిగిపోయినట్లు, అజ్ఞానులైన దాతలు, గ్రహీత కూడా అధోగతి చెంది దుఃఖాన్ని పొందుతారు.

పాషండుల లక్షణాలు

ధర్మధ్వజీ సదా లుబ్ధశ్ఛాద్మికో లోకదంభకః ।
బైడాలవ్రతికో జ్ఞేయో హింస్రః సర్వాభిసంధకః ॥ 1 ॥

అధోదృష్టిర్నైష్కృతికః స్వార్థసాధనతత్పరః ।
శఠో మిథ్యా వినీతశ్చ బకవ్రతచరో ద్విజః ॥ 2 ॥ మను. 4-195, 196 ॥

ధర్మధ్వజీ = ధర్మాన్ని ఏమాత్రం ఆచరించక ధర్మం పేరుతో ఇతరులను మోసగించేవాడు, సదా లుబ్ధః = నిరంతరం లోభం కలవాడు; ఛాద్మికః = కపటం కలవాడు; లోకదంభకః = ప్రపంచజనుల ముందు తన గొప్పలు చెప్పుకొనేవాడు; హింస్రః = ప్రాణులను హింసించేవాడు, అన్యులపట్ల వైరబుద్ధి కలవాడు; సర్వాభిసంధకః = మంచివారితోను, చెడ్డవారితోను సంబంధం పెట్టుకొనేవాడు, బైడాల వ్రతికః = గోడమీద పిల్లిలాగ ఉండే ధూర్తుడు 'నీచుడు' అని తెలుసుకోవాలి. ॥ 1 ॥

అధో దృష్టిః = కీర్తికోసం క్రిందిచూపు కలవాడు; నైష్కృతికః = కొద్ది అపరాధానికి ప్రాణాలు తీసేంత ఈర్ష్యాళువు; స్వార్థసాధనతత్పరః = కపటం, అధర్మం, విశ్వాసఘాతాలతో తన ప్రయోజనాలను సాధించుకొను చతురుడు; శఠః = తన మాట అసత్యమైనా హఠం వీడనివాడు; మిథ్యావినీతః = లోన కపటం కలిగి పైకి శీల, సంతోష, సాధుత్వాలు కలవాడిలాగ నటించేవాడు; బకవ్రతః = కొంగజపంచేసే వాడిని నీచుడనీ గ్రహించాలి. ఇట్టి లక్షణాలు కలవారినే పాషండులంటారు. వీరిని నమ్మకూడదు. వీరికి సేవ చేయకూడదు. వారి దగ్గరకు వెళ్ళరాదు. తమ దగ్గరకు రానివ్వరాదు.

ధర్మసంచయ విధం - దాని ఫలం

ధర్మం శనైః సంచినుయాత్ వల్మీకమివ పుత్తికాః ।
పరలోకసహాయార్థం సర్వభూతాన్యపీడయన్ ॥ మను. 4-238 ॥

చెదలు పుట్టను పెట్టినట్లు ఇతర ప్రాణులను పీడించకుండ, పరలోకంలో అంటే పరజన్మలో కూడా సుఖాన్ని పొందటానికి స్త్రీలు, పురుషులు ఇద్దరూ మెల్లమెల్లగా ధర్మాన్ని సంపాదించాలి.

నాముత్ర హి సహాయార్థం పితా మాతా చ తిష్ఠతః ।
న పుత్రదారం న జ్ఞాతిర్ధర్మస్తిష్ఠతి కేవలః ॥ మను. 4-239 ॥

పరజన్మలో తల్లి, తండ్రి, పుత్రుడు, భార్య, బంధువులు ఎవ్వరూ సహాయపడలేరు. కేవలం తాను చేసిన ధర్మమొక్కటే తోడ్పడుతుంది.

ఏకః ప్రజాయతే జంతురేక ఏవ ప్రలీయతే ।
ఏకోనుభుంక్తే సుకృతమేక ఏవ చ దుష్కృతమ్ ॥ మను. 4-240 ॥

జీవుడు ఒంటరిగానే జన్మిస్తాడు. ఒంటరిగానే మరణిస్తాడు. తాను చేసిన పుణ్యఫలమైన సుఖాన్ని ఒంటరిగానే అనుభవిస్తాడు. అలాగే పాపఫలమైన దుఃఖాన్ని కూడా ఒంటరిగానే అనుభవిస్తాడు.

ఏకః పాపాని కురుతే ఫలం భుంక్తే మహాజనః ।
భోక్తారో విప్రముచ్యంతే కర్తా దోషేణ లిప్యతే ॥ మహాభా. ఉద్యో. ప్రజా. 33-41 ॥

కుటుంబంలో ఒక్కడు పాపం చేసి తెచ్చినటువంటి పదార్థాలను కుటుంబంలోని వారందరూ అనుభవిస్తారు. ఆ పదార్థాలను అనుభవించేవారు దోషభాగులు కారు. కేవలం అధర్మాన్ని ఆచరించిన కర్తే పాపాల ఫలితాన్ని అనుభవిస్తాడు.

మృతః శరీరముత్సృజ్య కాష్ఠలోష్టసమం క్షితౌ ।
విముఖా బాంధవా యాంతి ధర్మస్తమనుగచ్ఛతి ॥ మను. 4-241 ॥

మరణించినవారి శరీరాన్ని ఒక మట్టిముద్దవలె భూమిపై విడిచి (భూమిలో పాతి లేదా కాల్చి) విముఖులై చుట్టాలు వెనక్కితిరిగి పోతారు. అతని వెంట ఎవ్వరూ వెళ్ళరు. కాని, ఒక్క ధర్మం మాత్రమే అతని వెంట వెళుతుంది.

ధర్మాచరణం వల్లనే ముక్తి

తస్మాద్ధర్మం సహాయార్థం నిత్యం సంచినుయాచ్ఛనైః ।
ధర్మేణ హి సహాయేన తమస్తరతి దుస్తరమ్ ॥ మను. 4-242 ॥

కాబట్టి, పరలోకం అంటే పరజన్మలోనూ సుఖం లభించటానికి నిత్యం ధర్మాన్ని క్రమంగా సంపాదించుకోవాలి. ఎందుకంటే, ధర్మసహాయంతోనే జీవుడు గొప్ప దుస్తరమైన దుఃఖసాగరాన్ని దాటగలడు.

ధర్మప్రధానం పురుషం తపసా హతకిల్బిషమ్ ।
పరలోకం నయత్యాశు భాస్వన్తం ఖశరీరిణమ్ ॥ మను. 4-243 ॥

ధర్మాన్నే ప్రధానమని తలంచి, ధర్మానుష్ఠానంతో పాపాలను పోగొట్టుకొన్నవారు ధర్మమే స్వరూపంగా, ఆకాశమే శరీరంగా గల పరమదర్శనీయుడైన పరమాత్మను శీఘ్రంగా పొందుతారు.

సదాచార ఫలం

దృఢకారీ మృదుర్దాంతః క్రూరాచారైరసంవసన్ ।
అహింస్రో దమదానాభ్యాం జయేత్స్వర్గం తథావ్రతః ॥ మను. 4-246 ॥

సదా దృఢకారి, కోమలస్వభావుడు, జితేంద్రియుడు, హింసకులకు, క్రూరులకు, దుష్టాచారులకు ఎప్పుడూ దూరంగా ఉండేవాడైన అయిన ధర్మాత్ముడు మనస్సును జయించి విద్యాది దానాలను చేయటంలో సుఖాన్ని పొందుతాడు.

వాచ్యార్థా నియతాః సర్వే వాఙ్మూలా వాగ్వినిస్సృతాః ।
తాంస్తు యః స్తేనయేద్వాచం స సర్వస్తేయకృన్నరః ॥ మను. 4-256 ॥

ఏ వాణిలో సకలార్థాలు - సర్వ వ్యవహారాలు నిశ్చితమవుతున్నాయో ఆ వాణే వారికి మూలం. వ్యవహారాలన్నీ వాణితోనే సిద్ధిస్తాయి. అలాంటి వాణిని తస్కరించేవాడు అంటే అసత్య భాషణాలాడేవాడు సమస్త చౌర్యాది పాపాలను చేసేవాడవుతాడు.

ఆచారాల్లభతే హ్యాయురాచారాదీప్సితాః ప్రజాః ।
ఆచారాద్ధనమక్షయ్యమాచారో హన్త్యలక్షణమ్ ॥ మను. 4-156 ॥

కాబట్టి, మిథ్యాభాషణ రూపమైన అధర్మాన్ని విడిచి, బ్రహ్మచర్య జితేంద్రియత్వ ధర్మాచరణం కలిగితే పూర్ణాయుష్యం, ఉత్తమ సంతానం, అక్షయమైన ధనం లభిస్తుంది. ధర్మాచరణాన్ని ప్రవర్తిస్తూ దుష్టలక్షణాలను నాశనం చేసేవారి ఆచరణాన్నే నిరంతరం అవలంబించాలి.

దురాచార ఫలం

దురాచారో హి పురుషో లోకే భవతి నిందితః ।
దుఃఖభాగీ చ సతతం వ్యాధితోఽల్పాయురేవ చ ॥ మను. 4-157 ॥

దురాచారియైన వాడు లోకంలో సజ్జనుల మధ్య నిందను పొంది దుఃఖాన్ని అనుభవిస్తాడు. అలాంటివాడు నిరంతరం వ్యాధిపీడితుడై, అల్పాయువు కలవాడౌతాడు. కాబట్టి ఈ క్రింద చెప్పబోయే ప్రయత్నాన్ని చేయాలి.

యద్యత్పరవశం కర్మ తత్తద్యత్నేన వర్జయేత్ ।
యద్యదాత్మవశం తు స్యాత్తత్తత్సేవేత యత్నతః ॥ మను. 4-159 ॥

పరాధీనమైన కర్మలను ప్రయత్నపూర్వకంగా విడిచి, స్వాధీనాలైన కర్మలనే ప్రయత్నంతో చేయాలి.

సర్వం పరవశం దుఃఖం సర్వమాత్మవశం సుఖమ్ ।
ఏతద్విద్యాత్సమాసేన లక్షణం సుఖదుఃఖయోః ॥ మను. 4-160 ॥

పరాధీనమైనవన్నీ దుఃఖమే. స్వాధీనమైనదంతా సుఖమే. ఇదే సంక్షేపంగా సుఖదుఃఖాల లక్షణమని తెలుసుకోవాలి. కాని పరస్పరము అధీనాలైన కార్యాలను తమ తమ ఆధీనంలోనే చేయాలి. స్త్రీ పురుషుల వ్యవహారం పరస్పరం అధీనమై ఉండాలి. అంటే స్త్రీ పురుషునితో, పురుషుడు స్త్రీతో ప్రియాచరణ కలిగి అనుకూలంగా ఉండాలి. వ్యభిచారం గాని, విరోధం గాని ఎప్పుడూ చేయరాదు. పురుషుని ఆజ్ఞ ప్రకారం గృహకార్యాలు స్త్రీకి, వెలుపలి కార్యాలు పురుషుని ఆధీనంలో ఉండాలి. దుష్టవ్యసనాలలో చిక్కుకోకుండా పరస్పరం ప్రయత్నించాలి. వివాహం అవగానే స్త్రీ పురుషునికి, పురుషుడు స్త్రీకి అమ్ముడు పోయినట్లు నిశ్చయించుకోవాలి. స్త్రీపురుషుల హావభావాలు, నఖశిఖ పర్యంతంగల వీర్యాదులన్నీ పరస్పరాధీనమై పోతున్నాయి. స్త్రీ పురుషులు ప్రసన్నత లేకుండా ఏ

వ్యవహారాలు చేయకూడదు. అందులో ముఖ్యంగా అప్రియకారకాలయిన వ్యభిచారం, వేశ్యాగమనం, పరపురుష గమనం, పరసతి గమనం వదలి సతీపతులిద్దరూ నిరంతరం ప్రసన్నులుగా ఉండాలి.

బ్రాహ్మణవర్ణానికి చెందిన పురుషులు బాలురను, స్త్రీలు బాలికలను చదివించాలి. అనేక విధాలైన ఉపదేశాలతో, వక్తృత్వంతో వారిని విద్వాంసులుగా చేయాలి. పతి సతికి పూజనీయుడైన 'దేవుడు', సతి పతికి పూజనీయురాలగు 'దేవి'. గురుకులంలో ఉన్నంతకాలం అధ్యాపకులను తల్లిదండ్రుల వలె భావించాలి. అధ్యాపకులు కూడా తమ శిష్యులను సంతానం వలెనే చూసుకోవాలి.

అధ్యాపకులకు ఉండవలసిన లక్షణాలు

ఆత్మజ్ఞానం సమారంభస్తితిక్షా ధర్మనిత్యతా ।
యమర్థానాపకర్షంతి స వై పండిత ఉచ్యతే ॥ మహా. ఉద్యో. విదు. అ. 33 - 20 ॥

ఆత్మజ్ఞానం కలవాడు, సోమరితనం లేనివాడు, సుఖదుఃఖాలు, హానిలాభాలు, మానావమానాలు, నిందాస్తుతులలో హర్షశోకాలు పొందనివాడు, ధర్మమందే నిత్యం స్థిరుడై ఉండేవాడు, కామ విషయాలకు సంబంధించిన పదార్థాలతో మనస్సు ఆకర్షించబడనివాడు 'పండితుడు' అనబడును.

నిషేవతే ప్రశస్తాని నిందితాని న సేవతే ।
అనాస్తికః శ్రద్ధధాన ఏతత్పండిత లక్షణమ్ ॥ మహా. ఉద్యో. విదు. అ. 33 - 21 ॥

సదా ధర్మయుక్త కర్మలనాచరిస్తూ, అధర్మకార్యాలను విడిచి, ఈశ్వరుడు, వేదం, సత్యాచరణ మొదలైన వాటిని నిందించకుండా, ఈశ్వరునిపట్ల మిక్కిలి శ్రద్ధాళువై ఉండటం ఇవన్నీ పండితుల కర్తవ్య కర్మలు.

క్షిప్రం విజానాతి చిరం శృణోతి, విజ్ఞాయ చార్థం భజతే న కామాత్ ।
నాసంపృష్టో హ్యుపయుంక్తే పరార్థే, తత్ప్రజ్ఞానం ప్రథమం పండితస్య ॥ మహా. ఉద్యో. విదు. అ. 33-27॥

కఠిన విషయాన్ని కూడా తొందరగా గ్రహించటం, చాలాకాలం వరకు శాస్త్రాలను చదవటం, వినటం, విచారించటం, గ్రహించినదాన్ని పరోపకారానికై వినియోగించటం, తన స్వార్థానికై ఏ పనినీ చేయకపోవడం, ఇతరుల విషయాలలో, సమయంగాని సమయంలో వారు అడుగకుండానే సలహాలు గాని, అభిప్రాయం గాని ఇవ్వకపోవడం అనే ఈ జ్ఞానాలు పండితునికి ప్రథమంలో ఉండవలసినవి.

నాప్రాప్యమభివాంఛంతి నష్టం నేచ్ఛంతి శోచితుమ్ ।
ఆపత్సు చ న ముహ్యంతి నరాః పండితబుద్ధయః ॥ మహా. ఉద్యో. విదు. అ. 33 - 28 ॥

'పొందటానికి తగనిదానిని కోరుకోకపోవడం, నష్టమైనదానికి శోకించకపోవటం, ఆపత్కాలంలో వ్యాకులత చెందకపోవటం' అనే లక్షణాలు కలవాడే బుద్ధిమంతుడైన 'పండితుడు'.

ప్రవృత్తవాక్ చిత్రకథ ఊహవాన్ ప్రతిభానవాన్ ।
ఆశు గ్రంథస్య వక్తా చ యః స పండిత ఉచ్యతే ॥ మహా. ఉద్యో. విదు. అ 33-33 ॥

అన్ని విద్యలలో, ప్రశ్నోత్తరాలలోనూ మిక్కిలి నిపుణమైన వాణి గలవాడు, విచిత్రంగా ఊహించి శాస్త్ర ప్ర[illegible]ణాలను చెప్పేవాడు, యథాయోగ్యంగా తర్కించేవాడు, స్మృతిగలవాడు, గ్రంథాలలోని యథార్థమైన అర్థాన్ని తొందరగా చెప్పేవాడు 'పండితుడు' అవుతాడు.

శ్రుతం ప్రజ్ఞానుగం యస్య ప్రజ్ఞా చైవ శ్రుతానుగా ।
అసంభిన్నార్యమర్యాదః పండితాఖ్యాం లభేత సః ॥ మహా. ఉద్యోగ. విదు. అ. 33 - 34 ॥

విన్న సత్యార్థాలకు అనుకూలంగా ఉండే ప్రజ్ఞగలవాడు, బుద్ధికి అనుకూలంగా ఉండే శ్రవణం గలవాడు, శ్రేష్ఠులు, ధార్మికులు అయిన ఆర్యుల ఆచార మర్యాదలను భగ్నం చేయనివాడు 'పండితుడు' అనబడుతాడు.

ఈ లక్షణాలు గల స్త్రీలు పురుషులు చదివించే దేశంలో 'విద్య, ధర్మం, ఉత్తమ ఆచారం వృద్ధిచెందుతూ ప్రతినిత్యం ఆనందం వర్ధిల్లుచుండును.

మూర్ఖుల లక్షణాలు

అశ్రుతశ్చ సమున్నద్ధో దరిద్రశ్చ మహామనాః ।
అర్థాంశ్చాఽకర్మణా ప్రేప్సుర్మూఢ ఇత్యుచ్యతే బుధైః ॥ మహా. ఉద్యోగ. విదు. అ. 33 - 35 ॥

ఏ శాస్త్రాన్నీ చదువక, వినక మిక్కిలి గర్వంతో ఉండేవాడూ, దరిద్రుడుగా ఉండి గొప్ప గొప్ప కోరికలు కోరేవాడూ, పనిచేయకుండా ఫలితాన్ని, పదార్థాలను పొందదలచేవాడూ మూర్ఖుడని బుద్ధిమంతులంటారు.

అనాహూతః ప్రవిశతి అపృష్టో బహు భాషతే ।
అవిశ్వస్తే విశ్వసితి మూఢచేతా నరాధమః ॥ మహా. ఉద్యోగ. విదు. అ. 33 - 41 ॥

ఆహ్వానించకుండానే సభలలోకి, గృహాలలోకి ప్రవేశించేవాడూ, ఉన్నతాసనంలో కూర్చోవాలనుకునేవాడూ, అడుగకుండానే సభలలో అధికంగా ప్రసంగించేవాడూ, విశ్వసించదగని వ్యక్తిని, వస్తువును విశ్వసించేవాడూ మూర్ఖుడనబడుతాడు. ఇలాంటి వ్యక్తి మానవులందరిలో నీచుడని తెలుసుకోవాలి.

ఇలాంటి వ్యక్తులు అధ్యాపకులుగా, ఉపదేశకులుగా, గురువులుగా, మాననీయులుగా ఉంటే అక్కడ అవిద్య, అధర్మం, అసభ్యత, కలహం, విరోధం, జగడం అధికమై దుఃఖమే వృద్ధిచెందుతుంది.

విద్యార్థుల దోషాలు

ఆలస్యం మదమోహౌచ చాపల్యం గోష్ఠి రేవ చ ।
స్తబ్ధతా చాభిమానిత్వం తథాఽత్యాగిత్వమేవ చ ।
ఏతే వై సప్తదోషాః స్యుః సదా విద్యార్థినాం మతాః ॥ మహా. విదు.. అ. 40-5 ॥

'ఆలస్యమ్ = ఆలస్యం అనగా శరీరంలోను బుద్ధిలోను జడత, సోమరితనం, మత్తు; మోహః = ఏదైనా విషయంలో తగుల్కొని ఉండటం, చపలత, వ్యర్థమైన కథలను చెప్పటం, వినటం, చదువుతూ - చదివిస్తూ ఆగిపోవటం, అభిమానం, త్యాగం లేకపోవడం' అనే ఈ ఏడు దోషాలు విద్యార్థులలో ఉండకూడదు. ఇలాంటి వారికి విద్య రాదు.

సుఖార్థినః కుతో విద్యా కుతో విద్యార్థినః సుఖమ్ ।
సుఖార్థీ వా త్యజేద్విద్యాం విద్యార్థీ వా త్యజేత్సుఖమ్ ॥ మహా.విదు.ప్ర.అ. 40-6 ॥

సుఖభోగాలను అనుభవించగోరువారికి విద్య ఎక్కడ? విద్య నేర్చుకొనే వారికి సుఖమెక్కడ? కాబట్టి విషయ సుఖార్థులు విద్యను, విద్యార్థులు విషయసుఖాలను విడవాలి. ఇలా చేయకపోతే విద్య ఎన్నటికీ రాదు. ఈ క్రిందిలక్షణాలు గలవారికే విద్య వస్తుంది.

సత్యే రతానాం సతతం దాంతానామూర్ధ్వరేతసామ్ ।
బ్రహ్మచర్యం దహేద్రాజన్ సర్వపాపాన్యుపాసితమ్ ॥ మహా.అను ప. 75-37 ॥

నిరంతరం సత్యాచారంలో ప్రవృత్తులై, వీర్యాన్ని ఎన్నడూ అధఃస్ఖలితం చేయకుండా జితేంద్రియులై ఉండేవారే నిజమైన బ్రహ్మచారులు. వారే విద్వాంసులు అనబడతారు.

కాబట్టి శుభ లక్షణాలు కలవారిగా అధ్యాపకులు, విద్యార్థులు ఉండాలి. విద్యార్థులు సదా సత్యవాదులు, సత్యమానులు, సత్యకారులు, సభ్యత, జితేంద్రియత్వం, సుశీలత్వాది శుభగుణయుక్తులు; శారీరిక, ఆత్మిక బలాలు కలిగి సమగ్ర వేదాది శాస్త్రాలలో విద్వాంసులయ్యేటట్లు అధ్యాపకులు యత్నించాలి. వారి కుచేష్టలను తొలగించి విద్యనేర్పటానికి సదా ప్రయత్నిస్తుండాలి. విద్యార్థులు కూడా సదా జితేంద్రియులై, శాంతులై, చదివించే వారిపట్ల ప్రీతిగలవారై, విచారశీలురై, పరిశ్రమించే వారై ఉండటానికి పురుషార్థం చేయాలి. అలా చేసినవారికి పూర్ణవిద్య, పూర్ణాయుష్యం, పరిపూర్ణ ధర్మం, పురుషార్థాలు అలవడతాయి. ఈ విధంగా చేయించటం బ్రాహ్మణవర్ణస్థుల పని.

క్షత్రియుల కర్తవ్య కర్మలు రాజధర్మంలో చెప్పబడతాయి.

బ్రహ్మచర్యాదులతో వేదాదివిద్యలను నేర్చుకొని, వివాహం చేసుకొని, దేశభాషలనూ, అనేక ప్రకారాలైన వ్యాపారరీతులనూ, వారి భావాలనూ గుర్తించి, అమ్మటం కొనటం ద్వీపాంతరాలలోకి వెళ్ళిరావడం, లాభార్థం పనులను ఆరంభించటం, పశుపాలనం, వ్యవసాయాన్ని నేర్పుతో చేయటం, చేయించటం; ధనాన్ని వృద్ధిచేయటం విద్య, ధర్మాల ఉన్నతికై వ్యయం చేయటం, సత్యవాదులు నిష్కపటులై సత్యంగా వ్యాపారాలనన్నింటిని చేయటం నష్టం రాకుండా పదార్థాలను కాపాడటం మొదలైనవి వైశ్యుల కర్మలు.

అన్ని సేవాకార్యాలలో చతురత కలిగి, పాకవిద్యలో నిపుణత్వం కలిగి, అత్యంత ప్రేమతో ద్విజుల సేవ చేస్తూ వారినుండి తన జీవనోపాధిని పొందటం, శూద్రుని కర్మ. ద్విజులు అతనికి ఆహారపానీయాలు, వస్త్రాలు, నివాసస్థానం, వివాహాది కార్యాలకయ్యే ధనాన్ని ఇవ్వాలి. లేదంటే మాసిక వేతనమైనా ఇవ్వాలి.

నాలుగు వర్ణాలవారు పరస్పరం ప్రీతి కలిగి, ఉపకారం, సజ్జనత్వం కలవారై, సుఖదుఃఖాలలోనూ, హానిలాభాలలోనూ, ఐకమత్యంగా ఉంటూ, తను మనోధనాలను వెచ్చించి రాజ్యంయొక్క ప్రజలయొక్క ఉన్నతికి పాటుపడాలి.

స్త్రీ పురుషులలో వియోగం ఎన్నడూ కలుగరాదు. ఎందుకంటే -

పానం దుర్జనసంసర్గః పత్యా చ విరహోఽటనమ్ ।
స్వప్నోఽన్యగేహవాసశ్చ నారీ సందూషణాని షట్ ॥ మను. 9-13 ॥

"మద్యపానం, గంజాయి మొదలైన మాదకద్రవ్యాలనూ, దుష్ట పురుషుల సాంగత్యాన్నీ, పతి వియోగం, ఒంటరిగా అటునిటు వ్యర్థులైన పాషండులు మొదలైనవారి దర్శనవేపంలో తిరుగుతుండటం, పరుల గృహంలో నిద్రించటం, నివసించటం" అనే ఆరు దుర్గణాలు స్త్రీలను దూషితం చేస్తాయి. ఇవి పురుషులను కూడా చెడగొడతాయి. భార్యాభర్తల వియోగం రెండు విధాలుగా ఉంటాయి. ఒకటి కార్యార్థం దేశాంతరాలకు వెళ్ళినపుడు జరుగుతుంది. మరొకటి మృత్యువువలన కలుగుతుంది. పతి దూరదేశం వెళ్ళినపుడు తన భార్యను వెంట తీసుకొని వెళ్ళటం మంచిది. అందువలన ఈ ఇద్దరికీ వియోగం ఎప్పుడూ జరుగదు.

పునర్వివాహ నియోగ విషయం

ప్రశ్న:- స్త్రీ పురుషులకు బహు వివాహాలవటం మంచిదా? కాదా?

జవాబు:- ఒకే సమయంలో బహువివాహాలు జరుగకూడదు.

ప్రశ్న:- వేరు వేరు సమయాలలో అనేక వివాహాలు చేసుకోవచ్చా?

జవాబు:- చేసుకోవచ్చు.

యా స్త్రీ త్వక్షతయోనిః స్యాత్ గతప్రత్యాగతాపి వా ।
పౌనర్భవేన భర్త్రా సా పునః సంస్కారమర్హతి ॥ మను. 9-176 ॥

స్త్రీ పురుషులకు కేవలం పాణిగ్రహణ సంస్కారమే జరిగి వారికి సంయోగం కాకపోతే అంటే అక్షతయోని స్త్రీ, అక్షతవీర్యుడు పురుషుడైతే వారికి అన్య స్త్రీ పురుషులతో పునర్వివాహం చేయవచ్చు. కాని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలలో క్షతయోని స్త్రీకి, క్షతవీర్యుడైన పురుషునికి పునర్వివాహం అవ్వకూడదు.

ప్రశ్న:- పునర్వివాహంలోని దోషాలేమిటి?

జవాబు:- మొదటిది: కోరినపుడల్లా పురుషుని స్త్రీ, స్త్రీని పురుషుడు వీడి ఇతరులతో సంబంధం పెట్టుకొంటారు. కాబట్టి స్త్రీ పురుషులలో ప్రేమ తగ్గిపోతుంది.

రెండవది:- భర్తయో, భార్యయో మరణించిన తర్వాత రెండవ వివాహం చేసుకోవాలనుకున్నప్పుడు మొదటి భార్య యొక్కయో, లేక మొదటి భర్త యొక్కయో ఆస్తిపాస్తులను సంబంధీకులు తీసుకుంటారు. అప్పుడు వారి కుటుంబాలలో గొడవలు జరుగుతాయి.

మూడవది:- అనేక ఉత్తమ వంశాల పేరు, ఊరు లేకుండా పోతుంది. వారి ఆస్తులు ఛిన్నాభిన్నమైపోతాయి.

నాల్గవది:- పతివ్రత, పత్నీవ్రత ధర్మాలు అడుగంటుతాయి. ఈ దోషాల వలన ద్విజులలో పునర్వివాహాలు - అనేక వివాహాలు ఎప్పుడూ జరగకూడదు.

ప్రశ్న:- వంశచ్ఛేదనమైనప్పుడు వారి కులం నష్టమవుతుంది. స్త్రీ పురుషులు వ్యభిచారాది కర్మలు చేసి గర్భపాతనాది దుష్టకార్యాలు చేయగలరు. కాబట్టి పునర్వివాహం జరగటమే మంచిది కదా!

జవాబు:- కాదు. స్త్రీ పురుషులు బ్రహ్మచర్యంతో ఉంటే ఎలాంటి ఉపద్రవాలు జరగవు. తమ కుల పరంపరను కాపాడుకోవాలంటే తమ స్వజాతికి చెందిన బాలున్ని దతత్త తీసుకోవచ్చు. అలా వంశం నిలుస్తుంది. వ్యభిచారాది దోషాలు జరగవు. బ్రహ్మచర్యంతో ఉండలేనివారు నియోగపద్ధతితో సంతానోత్పత్తిని పొందవచ్చు.

ప్రశ్న:- పునర్వివాహానికీ, నియోగానికీ గల భేదమేమిటి?

జవాబు:- మొదటిది: వివాహమాడిన కన్య తన తండ్రి గృహాన్ని విడిచి పతి గృహానికి వెళుతుంది. ఆ తర్వాత ఆమెకు తండ్రితో విశేష సంబంధం ఉండదు. నియోగంలో విధవా స్త్రీ తన వివాహిత పతి గృహంలోనే ఉంటుంది.

రెండవది: వివాహిత స్త్రీ యొక్క పిల్లలు వివాహిత పతికి దాయభాగులవుతారు. నియోగంలో విధవా స్త్రీ యొక్క సంతానం వీర్యదాతయొక్క సంతానం అనలేరు. అతని గోత్రానికి చెందదు. అతని ఆస్తికి అధికారీ కాదు. ఆ పిల్లలు మృతపతికి చెందినవారై, అతని గోత్రీకులై, అతని ఆస్తికి దాయభాగులవుతారు. అతని గృహంలోనే ఉంటారు.

మూడవది: వివాహిత స్త్రీ పురుషులు పరస్పరం ఒకరికొకరు సేవ, పాలనం చేసుకోవటం తప్పనిసరి అవుతుంది. కాని నియుక్త స్త్రీ పురుషుల సంబంధం ఇలా ఉండదు. ఎందులోనూ వారి కే సంబంధముండదు.

నాల్గవది: వివాహిత స్త్రీ పురుషుల సంబంధం మరణపర్యంతం ఉంటుంది. నియుక్త స్త్రీ పురుషుల సంబంధం కార్యమైన తర్వాత ఉండదు.

ఐదవది: వివాహిత స్త్రీ పురుషులు తమ గృహకార్యాలను నెరవేర్చుకోవటానికి నిరంతరం యత్నిస్తారు. నియుక్త స్త్రీ పురుషులు ఎవరి ఇంటి పనిని వారే చేసుకొంటారు.

ప్రశ్న:- వివాహం మరియు నియోగం యొక్క నియమాలు ఒకే తీరుగా ఉంటాయా? లేక వేరు వేరుగా ఉంటాయా?

జవాబు:- కొంత భేదం ఉన్నది. కొంత ఇంతకు పూర్వమే చెప్పబడింది. వివాహిత స్త్రీ పురుషులిద్దరూ కలిసి దశసంతానం వరకు కంటారు. నియుక్త స్త్రీ పురుషులు ఇద్దరు లేక నలుగురి కంటే ఎక్కువ సంతానం కనటానికి వీలులేదు. కుమారీ కుమారులకు వివాహమై అందు ఎవరైన చనిపోతే వారు నియోగం చేసుకొంటారు. వివాహం జరగని కుమారీ కుమారులకు నియోగం జరగదు. అనగా పెళ్ళికాని అమ్మాయికి- భార్య చనిపోయిన పురుషునికీ, భర్త చనిపోయిన స్త్రీకీ- పెళ్ళికాని అబ్బాయికీ లేదా పురుషునికి నియోగం జరుగరాదు. వివాహిత స్త్రీ పురుషులు సదా కలిసిఉండేట్లు నియుక్త స్త్రీ పురుషులు కలిసి ఉండరు. ఋతుదాన సమయంలో తప్ప మరెప్పుడూ వారు కలవరాదు. స్త్రీ తన కొరకు నియోగం చేసుకొంటే రెండవ గర్భం వరకు ఆ స్త్రీ పురుషుల సంబంధం ఉండకూడదు. పురుషుడు తన కొరకు నియోగం చేసుకొన్నా గర్భం ఏర్పడినప్పటి నుండే వారి సంబంధం విడిపోతుంది. కానీ ఆ నియుక్త స్త్రీయే రెండుమూడేండ్ల వరకు ఆ బాలలను పెంచి నియుక్త పురుషునకు ఇవ్వాలి.

ఇలా ఒక విధవా స్త్రీ తన కొరకు ఇద్దరిని, ఇతరుల కొరకు ఇద్దరిద్దరు చొప్పున నలుగురు నియుక్త పురుష/లకు, సంతానాన్ని కనవచ్చు. ఇలాగే భార్య చనిపోయిన పురుషుడు తన కొరకు ఇద్దరిని మరియు ఇతర నలుగురు విధవలకు ఇద్దరిద్దరి చొప్పున సంతానోత్పత్తి చేయవచ్చు. ఇలా కలిసి పదిపదిమంది సంతానాన్ని కనటానికి వేదాజ్ఞ ఉంది.

ఇమాం త్వమింద్ర మీఢ్వః సుపుత్రాం సుభగాం కృణు ।
దశాస్యాం పుత్రానా ధేహి పతిమేకాదశం కృధి ॥ ఋ.మం.10 సూ.85 మం.45 ॥

హే మీఢ్వ ఇంద్ర = వీర్యసేచనంలో సమర్థుడవైన, ఐశ్వర్యయుక్తుడవైన ఓ పురుషుడా! నీవు ఈ వివాహిత స్త్రీని, లేక విధవా స్త్రీలను శ్రేష్ఠపుత్రులు గలవారిగా, సౌభాగ్యవతులుగా చేయుము. ఈ వివాహిత స్త్రీయందు పదిమంది పుత్రులను కనుము. పదకొండవదిగా భార్యను చేసుకో. ఓ స్త్రీ! నీవును వివాహితడు లేక నియుక్త పురుషుల వలన దశసంతానాన్ని కనిపెట్టు. పదునొకండవ వాడిగా భర్తను అనుకో. ఈ వేదాజ్ఞ ప్రకారం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణస్థులైన స్త్రీ పురుషులు, దశసంతానాన్ని కనాలి. అంతకంటె అధికంగా కనకూడదు. అధికంగా కంటే సంతానం నిర్బలులు, అల్పాయువు గలవారు, రోగులునై వృద్ధావస్థలో అనేక దుఃఖాలను పొందుతారు.

ప్రశ్న:- ఈ నియోగం వ్యభిచారం వలెనే కనిపిస్తున్నది.

జవాబు:- వివాహం కానివారు కలిస్తే వ్యభిచారమంటారు. నియుక్తులు కానివారు కలిసినా వ్యభిచారమంటారు. నియమం ప్రకారంగా వివాహమైతే వ్యభిచారమనరు. అలాగే నియమంప్రకారంగా నియోగం జరిగినా దానిని 'వ్యభిచారం' అనటానికి వీలు లేదు. తన కన్యతో వేరొక కుమారునిని

శాస్త్రోక్త విధిపూర్వకంగా వివాహం జరిగి సమాగమమైన అది వ్యభిచారం, పాపం కాదు. అందు సిగ్గు(లజ్జ) కలుగదు. అలాగే వేదశాస్త్రోక్త పద్ధతిలో నియోగం జరిగినా అది కూడా వ్యభిచారం, పాపం కాదు. సిగ్గు (లజ్జ) కూడా కలుగదు.

ప్రశ్న:- బాగానే ఉన్నది. కాని ఇది వేశ్యావృత్తిలాగ కనిపిస్తున్నది.

జవాబు:- కాదు. వేశ్యాసమాగమంలో ఒక నిశ్చిత పురుషుడు గాని, నియమం గాని లేదు. నియోగంలో వివాహం లాగానే ఒక నిశ్చిత పురుషుడు, ఒక నిశ్చిత నియమం కలదు. వివాహపూర్వకంగా జరుగుక్రియకు లజ్జ కలుగునట్లు, నియోగంలోనూ లజ్జ ఉండదు. వ్యభిచారులైన స్త్రీ పురుషులు వివాహమైన తర్వాత అలాంటి కుకర్మను వదిలేస్తారా?

ప్రశ్న:- మాకు నియోగ విషయం పాపమని తోస్తున్నది.

జవాబు:- నియోగ విషయం పాపమని అనుకున్నప్పుడు వివాహాన్ని కూడా పాపమని ఎందుకనుకొనరు? నిజానికి నియోగాన్ని ఆపితేనే పాపం కలుగుతుంది. ఎందుకంటే ఈశ్వరుని సృష్టిక్రమానుసారం స్త్రీ పురుషుల స్వాభావిక వ్యవహారం ఆగదు. కేవలం వైరాగ్యం గల పూర్ణ విద్వాంసులే దీనికి అతీతులు. గర్భపాతనాది భ్రూణహత్యలను, విధవల యొక్క విధురుల యొక్క మహా సంతాపాన్ని మీరు పాపమని భావించరా? యువావస్థలో ఉన్నవారి మనస్సులలో సంతానోత్పత్తికై, విషయవాంఛాపూర్తికై కోరికలు కలిగిన, రాజ్యవ్యవహారాలయొక్క జాతివ్యవహారాలయొక్క ప్రతిబంధకాల వలన రహస్యంగా వ్యభిచారాది కుకర్మలను చేస్తుంటారు. ఈ వ్యభిచారాది కుకర్మలను ఆపటానికి నియోగమొక్కటే శ్రేష్ఠమైన ఉపాయం. జితేంద్రియులుగా ఉండదలచినవారు వివాహం గాని, నియోగం గాని లేకుండా ఉంటే మంచిదే. అలా కాకపోతే వారికి వివాహం గాని, ఆపత్కాలంలో నియోగం గాని తప్పక జరగాలి. దీని వల్ల వ్యభిచారం తగ్గిపోతుంది. ప్రేమవలన ఉత్తమసంతానం కలిగి మానవాభివృద్ధి జరుగుతుంది. భ్రూణహత్యలు పూర్తిగా తగ్గిపోతాయి. నీచపురుషులతో ఉత్తమ స్త్రీ కలయిక, వేశ్యాది నీచస్త్రీలతో ఉత్తమ పురుషుల కలయిక అనబడే వ్యభిచార రూప కుకర్మ ఉత్తమ కులాలలో కళంకం. వంశోచ్ఛేదం, స్త్రీ పురుషుల సంతాపం, గర్భపాతకాది కుకర్మలు వివాహం వల్ల, నియోగం వల్ల తొలగిపోతాయి.

ప్రశ్న:- నియోగంలో ఉండవలసిన నియమాలేమిటి?

జవాబు:- వివాహం జరిగినట్లు నియోగం కూడా ప్రసిద్ధంగా జరగాలి. వివాహంలో భద్ర పురుషుల అనుమతి, కన్యావరుల యొక్క ప్రసన్నత ఉండునట్లు నియోగంలోనూ ఉండాలి. నియోగం చేసుకోదలచిన స్త్రీ పురుషులు తమ కుటుంబంలోని స్త్రీ పురుషుల ఎదుట "సంతానోత్పత్తికై మే మిరువురం నియోగం చేసుకొంటున్నాము" అని ప్రకటించాలి. "నియోగం యొక్క నియమం పూర్తైన తర్వాత మే మిరువురం సంయోగం చేయము" అని, "అలా విరుద్ధంగా ప్రవర్తిస్తే పాపులమై జాతి లేక రాజ దండనకు పాత్రులమవుతా" మని, " గర్భధారణ కోసం నెలకొక పర్యాయమే మాకలయిక, గర్భధారణ జరిగిన తర్వాత ఒక సంవత్సరం వరకు వేరుగా ఉంటాము" అని ప్రతిజ్ఞ చేయాలి.

ప్రశ్న:- నియోగం తమ వర్ణంలోనే జరగాలా? లేక అన్యవర్ణాల వారితో కూడా జరగవచ్చా?

జవాబు:- తమ వర్ణంలో గాని, తమ కంటె ఉత్తమ వర్ణస్థులైన పురుషులతో గాని జరుగవచ్చు. అంటే వైశ్య స్త్రీ వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ పురుషులతోను క్షత్రియ స్త్రీ క్షత్రియ, బ్రాహ్మణ పురుషులతోను, బ్రాహ్మణ స్త్రీ బ్రాహ్మణుని తోను నియోగం చేసుకోవాలి. వీర్యం సవర్ణానికి గాని, ఉత్తమ వర్ణానికి గాని చెందినదైయుండాలి. తమకంటె తక్కువవర్ణస్థులది కాకూడదు. ధర్మంప్రకారం వేదోక్త రీతిగా, వివాహం గాని, నియోగం గాని చేసుకొని సంతానోత్పత్తి చేయటమే సృష్టిలో స్త్రీ పురుషుల యొక్క ప్రయోజనం.

ప్రశ్న:- పురుషుడు రెండవ వివాహాన్ని చేసుకోవచ్చు. కాబట్టి అతనికి నియోగంతో పనేమిటి?

జవాబు:- ద్విజులైన స్త్రీ పురుషులు ఒకేసారి వివాహం చేసుకోవాలని పునర్వివాహం చేసుకోకూడదని వేదాది శాస్త్రాలలో ఉంది. దీనిని ఇంతకు పూర్వమే తెలిపాము. కుమారీకుమారులకు వివాహం జరగటం న్యాయం. కుమారునికి విధవా స్త్రీ తోను, విధురునితో కన్యకు వివాహం జరగటం అన్యాయం, అధర్మం. విధవా స్త్రీ తో వివాహం చేసుకోవటానికి పురుషుడు ఇష్టపడనట్లు భార్య చనిపోయిన పురుషునితో వివాహమాడటానికి కుమారి కూడా ఇష్టపడదు. వివాహితుడైన పురుషుని ఏ కుమారీ కన్యయు, విధవా స్త్రీని ఏ బ్రహ్మచారీ కోరరు. కాబట్టే స్త్రీ పురుషులకు నియోగం చేసుకొనే అవశ్యకత కలుగుతుంది. ఎటువంటివారికి అటువంటివారితో సంబంధం కలగటం ధర్మం.

ప్రశ్న:- వివాహానికి వేదాది శాస్త్రప్రమాణాలున్నట్లు నియోగానికీ ప్రమాణాలున్నాయా?

జవాబు:- అనేక ప్రమాణాలు ఉన్నాయి. చూడండి:

కుహ స్విద్దోషా కుహ వస్తోరశ్వినా కుహాభిషిత్వం కరతః కుహోషతుః ।
కో వాం శయుత్రా విధవేవ దేవరం మర్యం న యోషా కృణుతే సధస్థ ఆ ॥ ॥ 1 ॥

ఋ. 10-40-2 ॥

ఉదీర్ష్వ నార్యభి జీవలోకం గతాసుమేతముప శేష ఏహి ।
హస్తగ్రాభస్య దిధిషోస్తవేదం పత్యుర్జనిత్వమభి సం బభూథ ॥ ॥ 2 ॥ ఋ. 10-18-8 ॥

ఓ, అశ్వినా = స్త్రీ పురుషులారా! ఎలా, దేవరం విధవేవ = దేవరుని, విధవ మరియు; యోషా మర్యన్న = వివాహిత స్త్రీ తన భర్తను; సధస్తే = సమాన స్థానం శయ్యలో ఒకచోట కలిసి సంతానోత్పత్తిని; ఆకృణుతే = అన్ని విధాల చేస్తారో అలాగే మీ రిద్దరు స్త్రీ పురుషులు; కుహస్విద్దోషా = రాత్రియందు ఎక్కడ మరియు కుహవస్తః = పగలెక్కడ నివసించారు?; కుహాభిషిత్వమ్ = ఎక్కడ పదార్థాల సంపాదనను; కరతః = చేసుకొన్నారు? మరియు కుహోషతుః = ఏ సమయంలో ఎక్కడ నివసించారు?; కోవాం శయుత్రా = మీ శయన స్థానమెక్కడ? అలాగే మీరెవరు? ఏ దేశమందుండేవారు?

ఈ మంత్రంవలన దేశ విదేశాలలో ఎక్కడైనా స్త్రీ పురుషులు కలిసే ఉండాలని తెలుస్తున్నది. వివాహిత పతిని లాగే నియుక్త పతిని గ్రహించి విధవా స్త్రీ సంతానోత్పత్తి చేసుకోవాలి.

ప్రశ్న:- మరిది లేకపోతే నియోగం ఎవరితో చేసుకోవాలి?

జవాబు:- దేవరునితో చేసుకోవాలి. దేవర శబ్దాన్ని మీరు భావించినట్లు మరిదే అని అర్థం కాదు. నిరుక్తంలో చూడండి:

దేవరః కస్మాత్ ద్వితీయో వర ఉచ్యతే ॥ నిరు. 3-15 ॥

విధవ యొక్క రెండవ పతినే 'దేవరుడు' అంటారు. అతడు మరిది కావచ్చు, బావ కావచ్చు. లేక తన వర్ణంలోనివాడో, ఉత్తమ వర్ణంలోనివాడో కావచ్చు. ఎవరితో నియోగం జరుగుతుందో అతనినే 'దేవరుడు' అంటారు.

ఓ, నారీ = విధవా నీవు; ఏతంగతాసుమ్ = ఈ మరణించిన భర్త యొక్క ఆశను విడిచి; శేషే = మిగతా పురుషుల నుండి; అభిజీవలోకమ్ = బ్రతికిఉన్న మరొకపతిని; ఉపైహి = పొందుము; మరియు ఉదీర్ష్వ = ఈ విషయాన్ని ఆలోచించి నిశ్చయించుకో; హస్తగ్రాభస్య దిధిషోః = విధవవైన నీకు మరల పాణిగ్రహణం చేయు నియుక్త పతియొక్క సంబంధానికై నియోగం జరిగితే; ఇదం = ఈ జనిత్వం = జన్మించిన సంతానం (ఆ నియుక్త) పత్యుః = పతికిచెందిన వాడవుతాడు; నీ కొరకు నీవు నియోగం చేసుకొంటే ఈ సంతానం; తవ = నీది అవుతుంది. ఇలా నిశ్చయంతో; అభిసమ్, బభూథ = ఉండు. నియుక్త పురుషుడు కూడా ఇదే నియమాన్ని పాటించాలి.

అదేవృఘ్న్యపతిఘ్నీ హైధి శివా పశుభ్యః సుయమా సువర్చాః ।
ప్రజావతీ వీరసూర్దేవృకామా స్యోనేమమగ్నిం గార్హపత్యం సపర్య ॥ ॥3॥
అథర్వ. 14-2-18 ॥

హే అపతిఘ్న్యదేవృఘ్ని = పతికిని; దేవరునికి సుఖాన్ని ఇచ్చే ఓ స్త్రీ నీవు; ఇహ = ఈ గృహస్థాశ్రమంలో పశుభ్యః = పశువులకు; శివా = కల్యాణం కలిగించేదానవు; సుయమాః = బాగా ధర్మనియమాలలో నడుచుకొను; సువర్చాః = రూపం, సర్వశాస్త్రాలలోని విద్య కలిగినట్టి; ప్రజావతీ = ఉత్తమ పుత్రపౌత్రాదులతో కూడినట్టి ; వీరసూః = శూరవీరులైన పుత్రులను కనటానికి; దేవృకామా = దేవరుని కామించుదానవు; స్యోనా = సుఖాన్ని ఇచ్చేదానవు, పతిని లేక దేవరుని; ఏధి = పొంది; ఇమం = ఈ; గార్హపత్యం = గృహస్థసంబంధమైన; అగ్నిమ్ = అగ్నిహోత్రాన్ని సపర్య = సేవించు.

తామనేన విధానేన నిజో విందేత దేవరః । మను. 9-61

అక్షతయోనియైన స్త్రీ విధవయైతే ఆమె పతియొక్క తమ్ముడు కూడా ఆమెను వివాహం చేసుకోవచ్చు.

ప్రశ్న:- పురుషుడు గాని, స్త్రీ గాని ఎన్నిసార్లు నియోగం చేసుకోవచ్చు? వివాహిత, నియుక్త పతుల యొక్క పేర్లు ఏమిటి?

జవాబు:- **సోమః ప్రథమో వివిదే గంధర్వో వివిద ఉత్తరః ।**
తృతీయో అగ్నిష్టే పతిస్తురీయస్తే మనుష్యజాః ॥ ఋ. మం. 10-85-40 ॥

హే స్త్రీ! = ఓ స్త్రీ ! తే = నీయొక్క; ప్రథమః = మొదటి వివాహిత; పతిః = పతి, నిన్ను విన్దే = పొందును, అతనిపేరు; సోమః = సుకుమారగుణయుక్తుడవటంతో 'సోముడు' అంటారు, రెండవవాడు నియోగాన్ని; వివిదే = పొందితే అతడు గన్ధర్వః = ఒక స్త్రీతో సంభోగం చేసినవాడు కాబట్టి 'గన్ధర్వుడు'; తృతీయ ఉత్తరః = ఇద్దరి తర్వాత మూడవపతి అవుతాడు. అతడు అగ్నిః = అ... ఉష్ణత్వం కలిగి ఉండటంవలన 'అగ్ని' సంజ్ఞ కలవాడు; తే = నీయొక్క; తురీయః = నాల్గవ వానినుండి పదకొండవ వరకు నియోగం వలన కలిగే పతులు; మనుష్యజాః = 'మనుష్యనామము' కలవారు. "ఇమాం త్వమింద్ర" అను మంత్ర ప్రకారముగ పదకొండవ పురుషుని వరకు స్త్రీ నియోగం చేసుకోవచ్చు. అలాగే పురుషుడు కూడా పదకొండవ స్త్రీ వరకు నియోగం చేసుకోవచ్చు.

ప్రశ్న:- ఏకాదశ శబ్దంతో పదిమంది పుత్రులనీ పదకొండవవాడు భర్త అని ఎలా గణించరాదు?

జవాబు:- అలాగే అర్థంచెప్పిన "విధవేవ దేవరమ్" "దేవరః కస్మాద్ద్వితీయో వర ఉచ్యతే" "అదేవృఘ్ని" మరియు "గంధర్వో వివిద ఉత్తరః" మొదలైన వేద ప్రమాణాలకు విరుద్ధార్థమవుతుంది.

నియోగం ఆపద్ధర్మం

దేవరాద్వా సపిండాద్వా స్త్రియా సమ్యఙ్నియుక్తయా ।
ప్రజేప్సితాధిగంతవ్యా సంతానస్య పరిక్షయే ॥ 1 ॥ మను. 9-59 ॥

జ్యేష్ఠో యవీయసో భార్యాం యవీయాన్వాగ్రజస్త్రియమ్ ।
పతితౌ భవతో గత్వా నియుక్తావప్యనాపది ॥ 2 ॥ మను. 9-58 ॥

ఔరసః క్షేత్రజశ్చైవ ॥ 3 ॥ మను. 9-159.

'సపిండ' అంటే పతియొక్క ఆరుతరాలలో పతియొక్క తమ్మునితోగాని పతియొక్క అన్నతోగాని, స్వజాతీయునితో గాని, ఉత్తమజాతి పురుషునితో గాని విధవా స్త్రీ నియోగం చేసుకోవాలి. విధురుడు గాని, విధవగాని సంతానోత్పత్తిని కోరితేనే నియోగం జరగటం మంచిది. సంతానం పూర్తిగా లేనప్పుడు మాత్రమే, నియోగం జరగాలి.

ఆపత్కాలంలో సంతానోత్పత్తి కోరికతో భార్యభర్త తమ్మునితో (మరిదితో) గాని, అన్నతో గాని నియోగం చేసుకొని, సంతానోత్పత్తి జరిగిన పిదప, మళ్లీ వారు నియుక్తులై సమాగమం చేస్తే పతితులౌతారు. నియోగం యొక్క అవధి రెండవ పుత్రుడు గర్భంలో ఉండేంతవరకే ఉంటుంది. అలాగే ఆ తర్వాత వారు సమాగమం చేయరాదు. ఇద్దరి కొరకు నియోగం జరిగితే నాల్గవ గర్భం వరకు అవధి ఉంటుంది. అనగా పూర్వోక్త రీతిగా దశ సంతానం కలిగేంత వరకు ఉండవచ్చు. తదుపరి విషయాసక్తిగా పరిగణింపబడుతుంది. అందువల్ల వారు పతితులుగా లెక్కింపబడతారు. వివాహిత స్త్రీ పురుషులును పదవ గర్భమైన తరువాత కూడా అధికంగా సమాగమం చేస్తే కాముకులు, నిందితులు అవుతారు. వివాహం, నియోగం సంతానం కొరకే చేయబడుతుంది. కామక్రీడల కొరకు కాదు.

ప్రశ్న:- పతి మరణించిన తర్వాత నియోగం జరగాలా? లేక బ్రతికి ఉండగా కూడా జరుగవచ్చునా?

జవాబు:- బ్రతికి ఉన్నప్పుడు కూడా జరుగవచ్చు..

అన్యమిచ్ఛస్వ సుభగే పతిం మత్ ॥ ఋ. 10-10-10 ॥

పతి సంతానోత్పత్తిని చేయటంలో అసమర్థుడైనపుడు తన స్త్రీకి "హే సుభగే! = భాగ్యాన్ని కాంక్షించే ఓ స్త్రీ!; నీవు మత్ = నాకంటె; అన్యం = ఇతర పతిని; ఇచ్ఛస్వ = కోరుకొనుము; ఎందుకంటే ఇప్పుడు నాతో సంతానోత్పత్తి కలుగుననే ఆశ వదిలిపెట్టుము" అని ఆజ్ఞాపించాలి. అపుడు స్త్రీ రెండవ వానితో నియోగం చేసుకొని సంతానోత్పత్తిని పొందాలి. కాని ఆమె ఆ మహాశయుడైన తన వివాహిత భర్త యొక్క సేవలోనే తత్పరురాలై ఉండాలి. అలాగే స్త్రీ రోగాది దోషాల వలన సంతానాన్ని కనటంలో అసమర్థురాలైనపుడు తన భర్తకు ఇలా అనుమతిని ఇవ్వాలి. "ఓ స్వామీ! నాతో సంతానిన్ని కనాలనే కోరిక వీడి ఇతర విధవా స్త్రీతో నియోగం చేసుకొని సంతానాన్ని కనండి.

ఇలాగే పాండురాజు భార్యలు కుంతీ, మాద్రులును నియోగం చేసుకొని సంతానాన్ని కన్నారు. చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు మరణించిన తర్వాత వేదవ్యాసుడు తన సోదరుల భార్యలతో నియోగాన్ని చేసి అంబికయందు ధృతరాష్ట్రుని అంబాలికయందు పాండురాజును, దాసియందు విదురుని పుట్టిస్తాడు. ఇలాంటి ఇతిహాస విషయాలు కూడా దీనికి ప్రమాణాలుగా ఉన్నాయి.

ప్రోషితో ధర్మకార్యార్థం ప్రతీక్ష్యోఽష్టౌ నరః సమాః ।
విద్యార్థం షడ్ యశోఽర్థం వా కామార్థం త్రీంస్తువత్సరాన్ ॥ 1 ॥

వంధ్యాష్టమేఽధివేద్యాబ్దే దశమే తు మృతప్రజాః ।
ఏకాదశే స్త్రీ జననీ సద్యస్త్వప్రియవాదినీ ॥ మను. 9-76, 81 ॥

వివాహిత పతి ధర్మకార్యం కొరకు పరదేశం వెళితే ఎనిమిదేళ్ల వరకు, విద్యను, కీర్తిని సంపాదించటాకి వెళితే ఆరేండ్ల వరకు, ధనాలను సంపాదించకోరి పోతే మూడేండ్ల వరకు భార్య భర్త రాకకొరకు ఎదురుచూస్తే తర్వాత నియోగం చేసుకొని సంతానాన్ని కనాలి. వివాహిత పతి రాగానే నియుక్త పతిని విడిచిపెట్టాలి. ॥ 1 ॥

ఇలాగే పురుషునికి నియమాలున్నాయి. వివాహమైన తర్వాత ఎనిమిదేళ్ల వరకు స్త్రీకి గర్భం కలుగకపోతే అంటే స్త్రీ గొడ్రాలైన ఎనిమిదేళ్ల వరకు, సంతానం కలిగీ మరణిస్తున్న పదేళ్లకు, పుట్టినపుడల్లా నాడుబిడ్డలే కలుగుతూ పుత్రులు కలుగకున్న పదకొండవ యేట వరకు చూసి, లేదా అప్రియంగా మాట్లాడేదైతే వెంటనే ఆ స్త్రీని వీడి, రెండవ స్త్రీతో నియోగం చేసుకొని సంతానాన్ని కనాలి. ॥2॥

పురుషుడు కూడా మిక్కిలి దుఃఖం కలిగించేవాడైతే, అతనిని విడిచి రెండవ పురుషునితో నియోగం చేసుకొని సంతానాన్ని కనటం స్త్రీకి కూడ తగును. అలా కన్న సంతానాన్ని వివాహిత పతికి

దాయభాగులుగా చేయాలి. ఇత్యాది ప్రమాణాలతో, యుక్తులతో స్వయంవర వివాహాలను, నియోగాలను చేసుకొని తమ తమ వంశాలను వృద్ధిచేసుకోవాలి. వివాహితపతికి పుట్టినఔరస పుత్రుడు' తండ్రియొక్క ఆస్తికి స్వామియైనట్లు నియోగం వలన పుట్టిన **'క్షేత్రజులు'** కూడా మరణించిన తండ్రికి దాయభాగులవుతున్నారు.

రజో వీర్యాలు అమూల్యాలు

రజో వీర్యాలు అమూల్యములైన రత్నాలని స్త్రీ పురుషులు జ్ఞాపకముంచుకోవాలి. ఇలాంటి అమూల్య రజో వీర్యాలను పరస్త్రీల, వేశ్యల, దుష్టపురుషుల సంగమంలో నష్టపోవువారు మహామూర్ఖులు. అజ్ఞానులైన రైతులు తోటమాలులు కూడా తమ పొలాలను, తోటలను విడిచి ఇతర చోట్ల బీజాలను నాటరు. సాధారణమైన బీజాలనే వ్యర్థపుచ్చనపుడు, సర్వోత్తమమైన మానవశరీరరూప వృక్షంయొక్క బీజాన్ని కుక్షేత్రంలో పోగొట్టుకొనేవారు మహామూర్ఖులే అవుతారు. ఎందుకంటే దాని ఫలం వారికి లభించదు. **"ఆత్మా వై జాయతే పుత్రః"** (శతపథ. 14-6-4-26) ఇది బ్రాహ్మణగ్రంథ వచనం.

అంగాదంగాత్సంభవసి హృదయాదధిజాయసే ।
ఆత్మాసి పుత్ర మా మృథాః స జీవ శరదః శతమ్ ॥ సా. వేద బ్రాహ్మణం. 1-5-17 ॥

ఇది సామవేద బ్రాహ్మణవచనం. "ఓ పుత్రా! నీవు అంగ, అంగాల నుండి పుట్టే వీర్యంవలన హృదయంనుండి పుట్టినావు. కాబట్టి నీవు నా ఆత్మవు. నా కంటె పూర్వమే మరణించకు. నూరేళ్ల వరకు జీవించు."

దేనితో ఉత్తములైన మహాత్ముల, మహాశయుల శరీరాలు ఉత్పన్నములౌతాయో అలాంటిదానిని వేశ్యాది దుష్టక్షేత్రంలో విత్తటం, దుష్టబీజాలను ఉత్తమక్షేత్రాలలో విత్తటం మహా పాపం.

వివాహం యొక్క అవసరం

ప్రశ్న:- వివాహమెందుకు చేసుకోవాలి? దీనివలన స్త్రీ పురుషులు ఇరువురు బంధనాలకు లోనై సంకుచితులై దుఃఖాన్ని అనుభవించవలసి వస్తుంది. కాబట్టి ఎవరికి ఎవరితో ఎంతవరకు ప్రేమ కలుగుతుందో అంతవరకు వారు కలిసుండి అది లేనపుడు విడిపోయిన ఏమి జరుగుతుంది?

జవాబు:- ఇది పశుపక్షాదుల వ్యవహారం. మానవులది కాదు. మానవులలో వివాహ నియమం లేకుంటే గృహస్థాశ్రమంయొక్క అత్యుత్తమ వ్యవహారాలన్నీ నష్టభ్రష్టములైపోతాయి. ఒకరి సేవ మరొకరు చేయరు. వ్యభిచారం పెరిగి, రోగాలు ఏర్పడి, నిర్బలత్వం, అల్పాయుష్యం గలవారై శీఘ్రంగా మరణిస్తారు. ఎవరికీ భయ లజ్జాదులుండవు. వృద్ధావస్థలో ఎవరూ ఎవరికీ సేవ చేయరు. మహా వ్యభిచారం వృద్ధి చెందుతుంది. అందరూ రోగులు, బలహీనులు, అల్పాయువు కలవారై పోవటంతో వర్ణాలన్నీ నశించిపోతాయి. ఎవరూ మరొకరి ఆస్తిపాస్తులకు యజమానులు కాలేరు. ఎవరికీ ఏ వస్తువు పైనా దీర్ఘకాలం అధికారముండదు. ఇలాంటి దోషాలను తొలగించటానికి వివాహం జరగటం సర్వథా యోగ్యం.

ప్రశ్న:- ఒకే వివాహం జరిగితే ఒక పురుషునికి ఒకే భార్య, ఒక స్త్రీకి ఒకే భర్త ఉంటాడు. స్త్రీ గర్భవతి గాని, దీర్ఘ రోగి గాని ఉంటే లేక పురుషుడు దీర్ఘ రోగి అయితే యువావస్థలో ఉన్న ఆ స్త్రీ పురుషులు బ్రహ్మచర్యంతో ఉండలేనప్పుడు ఏమి చేయాలి?

జవాబు:- దీనికి నియోగ విషయంలో సమాధానం ఇవ్వబడింది. స్త్రీ గర్భవతిగా ఉన్నప్పుడు ఒక సంవత్సరం సమాగమం చేయకూడదు. ఒకవేళస్త్రీ రోగగ్రస్తురాలుయినపుడు పురుషుడు, పురుషుడు దీర్ఘ రోగియైనపుడు స్త్రీ ఎవరితోనైనా నియోగం చేసుకొని, వారికొరకే సంతానాన్ని కనాలి. కాని వేశ్యాగమనాది వ్యభిచారమెన్నడూ చేయకూడదు.

గృహస్థుల ఇతర కర్తవ్యాలు

సాధ్యమైనంతవరకు అనగా వీలయినంతవరకు తనకు అవసరమే లేని వస్తువులను కోరకుండటం, ప్రాప్తించినదానిని రక్షించటం, రక్షితమైన దానిని వృద్ధిజేయటం, వృద్ధిచెందిన దానిని దేశోపకార కార్యాలలో వినియోగించటం గృహస్థులకు మంచిది. అన్నివిధాలుగా పూర్వోక్త రీతిగా తమ తమ వర్ణాశ్రమ వ్యవహారాలను, అత్యుత్సాహపూర్వక ప్రయత్నాలతో నెరవేరుస్తూ, ప్రయత్నించి, అన్నివిధాలుగా ఎల్లప్పుడు తనుమనుధనాలతో పరమార్థాలను సాధించాలి. తమ తల్లిదండ్రులకు, అత్తమామలకు అన్నివిధాల సేవ చేయాలి. మిత్రులు, ఇరుగు పొరుగువారు, రాజు, విద్వాంసులు, వైద్యుడు, సత్పురుషులు మొదలైనవారితో ప్రీతి కలిగి ఉండాలి. దుష్టులు, అధర్మావలంబులైనవారిని ఉపేక్షించాలి. అంటే ద్రోహం వీడి వారిని బాగుచేయటానికి యత్నించాలి. సాధ్యమైనంత వరకు ప్రేమతో సంతానాన్ని విద్వాంసులుగా, సుశిక్షితులుగా చేయటానికి, చేయించటానికి ధనాది పదార్థాలను వ్యయం చేసి వారిని పూర్ణ విద్వాంసులుగా, సుశిక్షాయుక్తులుగా చేయాలి. ధర్మయుక్త వ్యవహారాలను చేస్తూ మోక్షాన్ని కూడ సాధించాలి. దాన్ని పొందితే మానవుడు పరమానందాన్ని అనుభవించగలడు.

ఈ క్రింది విధాలైన శ్లోకాలను నమ్మకూడదు:

పతితోఽపి ద్విజః శ్రేష్ఠో న చ శూద్రో జితేంద్రియః ।
నిర్దుగ్ధా చాపి గౌః పూజ్యా న చ దుగ్ధవతీ ఖరీ ॥ 1 ॥

అశ్వాలంభం గవాలంభం సన్న్యాసం పలపైత్రికమ్ ।
దేవరాచ్చ సుతోత్పత్తిం కలౌ పంచ వివర్జయేత్ ॥ 2 ॥

నష్టే మృతే ప్రవ్రజితే క్లీబే చ పతితే పతౌ ।
పంచస్వాపత్సు నారీణాం పతిరన్యో విధీయతే ॥ 3 ॥

ఇవి కపోల కల్పిత పారాశరీ (8–33 ॥ 4 – 30) శ్లోకాలు. దుష్టకర్మలను చేసే ద్విజుడు శ్రేష్ఠుడనీ, శ్రేష్ఠకర్మలు ఆచరిస్తూ జితేంద్రియుడైన శూద్రున్ని, నీచునిగా భావిస్తే ఇంతకన్న మిక్కిలి అన్యాయం, పక్షపాతం, అధర్మం మరొకటి ఉంటుందా? పాలిచ్చినా, ఇవ్వకున్నా ఆవులు గోపాలురతో పోషించబడినట్లు చాకలి, కుమ్మరి మొదలైనవారికి గాడిద పోషించదగినది కాదా? ఈ దృష్టాంతం కూడా విషమమైనది. సరియైనది కాదు. కారణమేమన – ద్విజులు, శూద్రులు మనుష్యజాతివారు.

గోవు, గాడిద పశుజాతికి చెందినవి. కొంతవరకు పశుజాతితో దృష్టాంతంలోని ఏకదేశం దార్ష్టాంతంలో దొరికినా దీని ఆశయం అయుక్తమవటానికి ఈ శ్లోకం విద్వాంసులకు అంగీకరించదగినది ఎంతమాత్రమూ కాదు. ॥ 1 ॥

'అశ్వాలంభం' అంటే గుఱ్ఱాన్ని చంపి హోమం చేయటం, 'గవాలంభం' అనగా గోవును చంపి హోమం చేయటం. ఈ రెండూ వేదవిహితాలే కానపుడు దీన్ని కలియుగంలో నిషేధించబడినవని అనడంలో అర్థమేమిటి? కలియుగంలో నిషేధింపబడినవని అంగీకరిస్తే ద్వాపర, త్రేతాయుగాలలో విధింపబడినదనీ అంగీకరించాలి. ఇలాంటి దుష్టకర్మలు ఆ శ్రేష్ఠయుగాలలో ఉండటం సర్వథా అసంభవం. వేదాదిశాస్త్రాలలో సన్న్యాసం యొక్క విధి కలదు. అది నిషేధించబడినదనటం అర్థరహితమైనది. మాంసనిషేధం ఉన్నది సర్వదా నిషేధింపబడే ఉన్నది. దేవరునితో పుత్రులను కనటం వేదంలో వ్రాయబడి ఉంది. ॥ 2 ॥

పతి దేశాంతరగతుడైనపుడు ఇంటిలో ఉన్న భార్య నియోగం చేసుకొనిన అదే సమయంలో వివాహిత పతి వస్తే ఆమె ఎవరి భార్య అవుతుంది? ఎవరైనా వివాహిత పతికే భార్య అవుతుందని చెప్తారని మేము అంగీకరిస్తాము. కాని, ఇలాంటి వ్యవస్థ 'పారాశరీ'లో వ్రాయబడలేదు. ఇదేగాక స్త్రీకి ఆపత్కాలాలు ఈ అయిదింటి కంటె ఎక్కువ లేవా? దీర్ఘ రోగియైనపుడు, కలహించినపుడు ఏమి కావాలి?

ఇలాంటి ఆపత్కాలాలు అనేకాలున్నాయి గదా! కాబట్టి ఇటువంటి శ్లోకాలను ఎన్నటికీ విశ్వసించకూడదు. ॥ 3 ॥

వేదవిరుద్ధ వచనాలు అగ్రాహ్యాలు

ప్రశ్న:- ఏమండీ! మీరు పరాశరముని వచనాలను కూడ నమ్మరా?

జవాబు:- వేదవిరుద్ధమైనది ఎవరి వచనమైనా నమ్మము. ఇది పరాశరవచనం కూడ కాదు. బ్రహ్మోవాచ, వసిష్ఠ ఉవాచ, రామ ఉవాచ, శివ ఉవాచ, విష్ణువు ఉవాచ, దేవ్యువాచ ఇత్యాది శ్రేష్ఠుల పేర్లతో గ్రంథరచనను చేస్తారు. సర్వజనమాన్యులైన వారిపేర గ్రంథాలు రచిస్తేనే లోకమంతా నమ్ముతుందని దానివలన తమకు పుష్కలంగా జీవిక లభిస్తుందని భావించి అనేక అనర్థకాలైన కథలు గల గ్రంథాలను రాస్తారు. కాబట్టి కొన్ని ప్రక్షిప్త శ్లోకాలను తొలగించగా మిగిలిన మనుస్మృతే వేదానుకూలమైనది. ఇతర స్మృతులు కావు. ఇలాగే ఇతర కల్పిత గ్రంథాలను గురించి తెలుసుకోండి.

గృహాశ్రమ శ్రేష్ఠత

ప్రశ్న:- గృహాశ్రమం అన్నిటికన్న చిన్నదా? పెద్దదా?

జవాబు:- తమ తమ కర్తవ్య కర్మలలో అన్నీ గొప్పవే. కాని -

యథా నదీనదాః సర్వే సాగరే యాంతి సంస్థితిమ్ ।
తథైవాశ్రమిణః సర్వే గృహస్థే యాంతి సంస్థితిమ్ ॥ మను. 6-90 ॥

నదీనదాలు ప్రవహించి సముద్రాన్నిచేరి స్థిరపడినట్లు గృహస్థుల ఆశ్రయంలోనే ఆశ్రమాలన్ని స్థిరంగా ఉంటాయి. ఈ ఆశ్రమం లేకుండా ఏ ఆశ్రమంయొక్క వ్యవహారం సిద్ధించదు.

యథా వాయుం సమాశ్రిత్య వర్తన్తే సర్వ జంతవః ।
తథా గృహస్థమాశ్రిత్య వర్తన్తే సర్వ ఆశ్రమాః ॥ మను. 3-77 ॥

వాయువును ఆశ్రయించి ప్రాణులన్నీ జీవిస్తాయి. అలాగే గృహస్థుల ఆశ్రయంలో బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్న్యాసులు అంటే అన్ని ఆశ్రమాలవారూ స్థిరపడతారు.

యస్మాత్రయోఽప్యాశ్రమిణో దానేనాన్నేన చాన్వహమ్ ।
గృహస్థేనైవ ధార్యంతే తస్మాజ్జ్యేష్ఠాశ్రమో గృహీ ॥ మను. 3-78 ॥

'బ్రహ్మచారులు, వానప్రస్థులు, సన్న్యాసులు' అనే ఈ మూడు ఆశ్రమాల వారికి ధన, అన్న వస్త్రాలను ఇచ్చి ప్రతిదినం గృహస్థుడు పోషిస్తున్నాడు. కాబట్టే గృహస్థాశ్రమం జ్యేష్ఠ ఆశ్రమం. అంటే అన్ని వ్యవహారాలలో దురంధరమైనదని చెప్పబడుతుంది.

స సంధార్యః ప్రయత్నేన స్వర్గమక్షయమిచ్ఛతా ।
సుఖం చేహేచ్ఛతా నిత్యం యోఽధార్యో దుర్బలేంద్రియైః ॥ మను. 3-79 ॥

కాబట్టి, మోక్షాన్ని మరియు సంసారసుఖాన్ని కోరేవారు ప్రయత్నపూర్వకంగా గృహస్థాశ్రమాన్ని ధరించాలి. దుర్బల ఇంద్రియాలు, భీరువులు, నిర్బలులు అయిన స్త్రీ పురుషులు గృహస్థాశ్రమం ధరించటానికి అయోగ్యులు. దానిని బాగా నిర్వహించాలి.

కాబట్టి లోకంలో గల వ్యవహారాలన్నింటికి ఆధారం గృహస్థాశ్రమమే. ఇది లేకపోతే సంతానోత్పత్తి కలగదు. అప్పుడు బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్న్యాస ఆశ్రమాలుండటానికి వీలే లేదు. గృహస్థాశ్రమాన్ని నిందించేవారే నిందనీయులు. అలాగే ప్రశంసించేవారే ప్రశంసనీయులు. స్త్రీ పురుషులు ఇద్దరూ పరస్పరం ప్రసన్నులు, విద్వాంసులు, పురుషార్థపరులు, సర్వ వ్యవహారజ్ఞులు అయినపుడే గృహస్థాశ్రమంలో సుఖాన్ని పొందగలరు. కాబట్టి బ్రహ్మచర్యం, పూర్వోక్త స్వయంవర వివాహం గృహస్థాశ్రమ సుఖానికి ముఖ్యకారణమని తెలుసుకోవాలి.

సంక్షేపంగా సమావర్తనం, వివాహం, గృహస్థాశ్రమానికి సంబంధించిన విషయాలు వ్రాయబడ్డాయి. ఇకముందు వానప్రస్థ, సన్న్యాస విషయాలు వ్రాయబడతాయి.

శ్రీమద్దయానంద సరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన
సత్యార్థప్రకాశంలో సమావర్తన, వివాహ, గృహస్థాశ్రమ విషయాలు గల
చతుర్థ సముల్లాసం సంపూర్ణం.

పంచమ సముల్లాసము

అథ వానప్రస్థ సన్న్యాసవిధిం వక్ష్యామః
ఇక వానప్రస్థ, సన్న్యాస విధిని వివరిస్తాము

వానప్రస్థ కాలం

బ్రహ్మచర్యాశ్రమం సమాప్య గృహీ భవేత్, గృహీ భూత్వా
వనీ భవేత్ వనీభూత్వా ప్రవ్రజేత్ ॥ శత.బ్రా. కాం.14॥

బ్రహ్మచర్యాశ్రమాన్ని పూర్తి చేసుకొని గృహస్థుడై వానప్రస్థుడు కావాలి. వానప్రస్థుడై సన్న్యాసి కావాలి. ఇది క్రమపూర్వకమైన ఆశ్రమ విధానం. దీన్ని అనుసరించటం మానవులంద కర్తవ్యం.

ఏవం గృహాశ్రమే స్థిత్వా విధివత్స్నాతకో ద్విజః ।
వనే వసేత్తు నియతో యథావద్విజితేంద్రియః ॥ మను. 6-1॥

ఈ ప్రకారంగా స్నాతకుడై అనగా బ్రహ్మచర్యపూర్వకంగా గృహస్థాశ్రమంలో ప్రవేశించి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య లను ద్విజులు గృహాశ్రమంలో ఉండి నిశ్చితాత్ములై యథారీతిగా ఇంద్రియాలను జయించి తదుపరి వనంలో నివసించాలి.

గృహస్థస్తు యదా పశ్యేద్వలీపలితమాత్మనః ।
అపత్యస్యైవ చాపత్యం తదారణ్యం సమాశ్రయేత్ ॥ మను. 6-2॥

తన తలవెంట్రుకలు నెరవటం, శరీరంపై ముడుతలు ఏర్పడటాన్ని చూసి, కుమారునికి కుమారుడు కలుగగానే గృహస్థుడు వనానికి వెళ్ళి నివసించాలి.

సంత్యజ్య గ్రామ్యమాహారం సర్వం చైవ పరిచ్ఛదమ్ ।
పుత్రేషు భార్యాం నిక్షిప్య వనం గచ్ఛేత్సహైవ వా ॥ మను. 6-3॥

గ్రామసంబంధమైన సమస్త ఆహార వస్త్రాలను, ఉత్తమోత్తమ పదార్థాలను వీడి, పుత్రుల వద్ద భార్యను విడిచో లేదా తనవెంట తీసుకొనో వనానికి వెళ్ళి నివసించాలి.

అగ్నిహోత్రం సమాదాయ గృహ్యం చాగ్నిపరిచ్ఛదమ్ ।
గ్రామాదరణ్యం నిఃసృత్య నివసేన్నియతేంద్రియః ॥ మను. 6-4 ॥

సాంగోపాంగ సహితంగా వేదాది గ్రంథాలనూ, అగ్నిహోత్రాన్నీ తీసుకొని గ్రామాన్ని వదలి దృఢ ఇంద్రియాలు కలవాడై అరణ్యానికి వెళ్లి నివసించాలి.

మున్యన్నైర్వివిధైర్మేధ్యైః శాకమూలఫలేన వా ।
ఏతానేవ మహాయజ్ఞాన్నిర్వపేద్విధిపూర్వకమ్ ॥ ॥ మను. 6-5 ॥

అనేక రకాలైన సామలు, యవలు మొదలగు అన్నపదార్థాలతో కందమూల ఫల పుష్పాదులతో పూర్వోక్తములగు పంచమహాయజ్ఞాలను అతిథి సేవలు మొదలగు వానిని చేస్తూ తన జీవితాన్ని గడపాలి.

వానప్రస్థ కర్తవ్యాలు

స్వాధ్యాయే నిత్యయుక్తః స్యాద్దాంతో మైత్రః సమాహితః ।
దాతా నిత్యమనాదాతా సర్వభూతానుకంపకః ॥ **॥ మను. 6-8 ॥**

స్వాధ్యాయము అనగా చదువుట, చదివించుటలో నిత్యము నిమగ్నుడైనవాడు, జితాత్ముడు, అందరకు మిత్రుడు, ఇంద్రియ దమనశీలుడు, విద్యాది దానాలను చేయువాడు, అందరిపట్ల దయగలవాడై ఎవరినుండీ ఏదీ తీసికొనకుండా జీవితాన్ని గడపాలి.

అప్రయత్నః సుఖార్థేషు బ్రహ్మచారీ ధరాశయః ।
శరణేష్వమమశ్చైవ వృక్షమూలనికేతనః ॥ మను. 6-26 ॥

శరీరసుఖానికై ఎక్కువగా ప్రయత్నింపక, భార్యతోడుగా ఉన్ననూ, బ్రహ్మచర్యంతో ఉంటూ విషయలోలుడు కాకుండా ఉండాలి. భూమిపైనే నిద్రించాలి. తన ఆశ్రితుల పట్ల, స్వంత వస్తువులపట్ల మమకారాన్ని పెట్టుకోరాదు. వృక్షముల మూలమందే నివసించాలి.

తపఃశ్రద్ధే యే హ్యుపవసన్త్యరణ్యే శాంతా విద్వాంసో భైక్షచర్యాం చరంతః ।
సూర్యద్వారేణ తే విరజాః ప్రయాంతి యత్రాఽమృతః స పురుషోహ్యవ్యయాత్మా ॥
॥ ముండ.ఖం.2 మం.11 ॥

శాంతులగు విద్వాంసులు వనములో తపము, ధర్మానుష్ఠానాన్ని చేస్తూ, సత్యమందు శ్రద్ధ

గలవారై భిక్షాటన చేస్తూ వనాల్లో నివసిస్తారు. నాశరహితుడు, పూర్ణపురుషుడు, హానిలాభరహితుడునైన ఆ పరమాత్మను నిర్మలులై, ప్రాణద్వారంలో పొంది ఆనందిస్తారు.

అభ్యా దధామి సమిధమగ్నే వ్రతపతే త్వయి ।
వ్రతం చ శ్రద్ధాం చోపైమీన్ధే త్వా దీక్షితో౽ అహమ్ ॥ ॥ యజు. అ. 20 మం. 24 ॥

"నేను అగ్నిలో హోమం చేసి, దీక్షితుడనై వ్రతాన్ని, సత్యాచరణాన్ని, శ్రద్ధను పొందుతాను" అని నిశ్చయం కలవాడై వానప్రస్థుడవటం ఉచితం. అనేక విధాలైన తపశ్చర్య, సత్సంగం, యోగాభ్యాసాన్ని చేస్తూ, సువిచారంతో జ్ఞానాన్ని, పవిత్రతను పొందాలి. తర్వాత సన్న్యాసాన్ని తీసుకోవాలనే కోరిక పుట్టినప్పుడు, భార్యను పుత్రుల వద్దకు పంపివేసి సన్న్యాసాన్ని స్వీకరించాలి. ఇది సంక్షేపంగా వానప్రస్థ విధి.

సన్న్యాస విధి

వనేషు చ విహృత్యైవం తృతీయం భాగమాయుషః ।
చతుర్థమాయుషో భాగం త్యక్త్వా సంగాన్ పరివ్రజేత్ ॥ మను. 6-33 ॥

ఈ ప్రకారంగా వనంలో ఆయువులో మూడవ భాగం అంటే యాభై సంవత్సరాల నుండి డెబ్బై ఐదు సంవత్సరాల వరకు (50-75) వానప్రస్థుడిగా ఉండి, ఆయువులోని నాల్గవభాగంలో అంటే 75 సంవత్సరాలు దాటిన తర్వాత సర్వసంగాలను విడిచి పరివ్రాట్ - సన్న్యాసి కావాలి.

ప్రశ్న:- గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమాలను అవలంబించకుండానే సన్న్యాసాశ్రమాన్ని స్వీకరిస్తే పాపం కలుగుతుందా? లేదా?

జవాబు:- కలుగుతుంది, కలుగదు కూడా.

ప్రశ్న:- ఇలా రెండు విధాల సమాధానాన్ని ఎందుకు చెబుతున్నారు?

జవాబు:- రెండు విధాల చెప్పటం లేదు. ఎందుకంటే బాల్యావస్థలో విరక్తుడై సన్న్యాసాన్ని తీసుకొని తర్వాత విషయాలలో తగుల్కొనినవాడు మహాపాపి అవుతాడు. అలా తగుల్కొననివారు మహా పుణ్యాత్ములు, సత్పురుషులు అవుతారు.

యదహరేవ విరజేత్తదహరేవ ప్రవ్రజేద్వనాద్వా గృహాద్వా బ్రహ్మచర్యాదేవ ప్రవ్రజేత్ ॥

ఇది బ్రాహ్మణగ్రంథ వచనం.

వైరాగ్యం కలిగిన దినంనాడే బ్రహ్మచార్యాశ్రమం నుండైనా గృహస్థంనుండియైనా, వనంనుండియైనా సన్న్యాసాన్ని తీసుకోవాలి. మొదట సన్న్యాసం తీసుకొనే క్రమం (మను : 6 -33) చెప్పబడింది. ఈ క్రమానికి వికల్పంగా వానప్రస్థం చేయకుండానే గృహస్థాశ్రమం నుండే సన్న్యాసం గ్రహింపవచ్చు. ఇది రెండవ పక్షం, ఇక

మూడవ పక్షంలో: పూర్ణవిద్వాంసుడు, జితేంద్రియుడు, విషయభోగాలలో కోరిక లేనివాడు, పరోపకారం చేయాలనే కోరిక గలవాడు బ్రహ్మచర్యాశ్రమం నుండే సన్న్యాసాన్ని గ్రహింపవచ్చు. వేదాలలోనూ **'యతయః, బ్రాహ్మణస్య విజానతః'** ఇత్యాది పదాలతో సన్న్యాస విధానం తెలుపబడింది.

నావిరతో దుశ్చరితాన్నాశాంతో నా సమాహితః ।
నాశాంతమానసో వాపి ప్రజ్ఞానేనైనమాప్నుయాత్ ॥ ॥ కఠో.వ. 2. మం. 24 ॥

దురాచారంనుండి తొలగనివాడు, అశాంతుడు, యోగి కానివాడు, మనశ్శాంతి లేనివాడు సన్న్యాసాన్ని గ్రహించి ప్రజ్ఞానంతో పరమాత్మని పొందలేడు. కాబట్టి:

యచ్ఛేద్వాఙ్మనసీ ప్రాజ్ఞస్తద్యచ్ఛేద్ జ్ఞాన ఆత్మని ।
జ్ఞానమాత్మని మహతి నియచ్ఛేత్తద్యచ్ఛేచ్ఛాంత ఆత్మని ॥ కఠోప. వల్లీ 3. మం. 13 ॥

బుద్ధిమంతుడైన సన్న్యాసి అధర్మంనుండి వాక్కును, మనస్సును నిరోధించి జ్ఞానమందు, ఆత్మయందు పెట్టాలి. అలాంటి జ్ఞానంగల స్వాత్మను పరమాత్మయందుంచాలి. ఆ విజ్ఞానాన్ని శాంతస్వరూపమైన ఆత్మలో స్థిరంగా ఉంచాలి.

పరీక్ష్య లోకాన్ కర్మచితాన్ బ్రాహ్మణో నిర్వేదమాయాన్నాస్త్యకృతః కృతేన ।
తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ॥

ముండకో. ఖం. 2. మం. 12 ॥

'లౌకిక భోగాలన్నీ కర్మసంచితాలు' అని తెలుసుకొనిన బ్రాహ్మణుడు వైరాగ్యం చెంది సన్న్యాసం పొందాలి. ఎందుకంటే అకృతుడు – చేయబడని ఆ పరమాత్మ, కృతం – కేవలం కర్మతో పొందజాలడు. అందుకే వేదవిదుడై, పరమేశ్వరుని తెలుసుకొన్న గురువు వద్దకు చేతిలో ఏదైనా అర్పించటానికి అనగా సమిధలు మొదలైన వాటిని తీసుకొని విజ్ఞానమెరుగుటకు వెళ్ళాలి. వెళ్ళి తన సందేహాలను నివారించుకోవాలి. ఈ క్రింద చెప్పబడినవారి సాంగత్యాన్ని ఎన్నడూ చేయకూడదు:

అవిద్యాయామంతరే వర్తమానాః స్వయం ధీరాః పండితమ్మన్యమానాః ।
జంఘన్యమానాః పరియంతి మూఢా అంధేనైవ నీయమానా యథాంధాః ॥ ముండకో. ఖం.2 మం.8 ॥

అవిద్యలో క్రీడిస్తూ, తమకు తామే ధీరులమనీ, పండితులమనీ అనుకునేవారు మూర్ఖులు. వీరు నీచగతిని పొందుతారు. ఇలాంటివారు 'గ్రుడ్డివాని వెనుకబోవు గ్రుడ్డివాడు దుర్దశను పొందునట్లు దుఃఖాన్నే పొందగలరు.

అవిద్యాయాం బహుధా వర్తమానా వయం కృతార్థా ఇత్యభిమన్యంతి బాలాః ।
యత్కర్మిణో న ప్రవేదయంతి రాగాత్ తేనాతురాః క్షీణలోకాశ్చ్యవంతే ॥

ముండకో. ఖం2 మం.9 ॥

అనేక విధాలైన అవిద్యలలో రమిస్తూ బాలబుద్ధిగలవారు తమను తాము కృతార్థులమని అనుకుంటారు. కేవలం కర్మకాండులైనవారు రాగంతో మోహితులై దానిని తెలుసుకోలేరు. తెలుసుకోనివ్వరు. వీరు కర్మాతురులై జన్మమరణరూప దుఃఖంలో పడిపోతారు. కాబట్టి:

వేదాంతవిజ్ఞానసునిశ్చితార్థాః సన్న్యాసయోగాద్యతయః శుద్ధసత్వాః ।
తే బ్రహ్మలోకేషు పరాంతకాలే పరామృతాః పరిముచ్యంతి సర్వే ॥

ముండకో. ఖం.2 మం.6 ॥

'వేదాంతం' అనగా పరమేశ్వర ప్రతిపాదక వేదమంత్రాల అర్థజ్ఞానంలోనూ, ఆచారంలోనూ బాగా నిశ్చితులై, సన్న్యాసయోగంలో సన్న్యాసులు శుద్ధాంతఃకరణం కలవారవుతారు. వారు పరమేశ్వరునిలో ముక్తిసుఖాన్ని పొంది దానిని అనుభవిస్తారు. తర్వాత ముక్తి సుఖంయొక్క పరిమితి పూర్తికాగానే తిరిగి లోకంలో జన్మిస్తారు. ముక్తి కలుగకుండా దుఃఖం నశించదు. ఎందుకంటే:

న వై సశరీరస్య సతః ప్రియాప్రియయోరపహతిరస్త్యశరీరం ।
వావసంతం న ప్రియాప్రియే స్పృశతః ॥ ఛాందో. అ.8 ఖం. 12-1 ॥

దేహధారులైన మానవులు సుఖదుఃఖాల నుండి వేరుగా ఎన్నడూ ఉండజాలరు. శరీరరహితమైన జీవాత్మ ముక్తిలో సర్వవ్యాపకుడైన పరమేశ్వరునితో శుద్ధమై ఉంటుంది. అప్పుడతనికి సాంసారిక సుఖదుఃఖాల అనుభవం ఉండదు. కాబట్టి:

లోకైషణాయాశ్చ విత్తైషణాయాశ్చ పుత్రైషణాయాశ్చోత్థాయాథ
భైక్షచర్యం చరన్తి ॥ శతపథ. కాం. 14-6-4-1 ॥

లోకేషణ = లోకంలోని ప్రతిష్ఠాలాభాలు, విత్తేషణ = ధనంతో కలిగే భోగం, మానం; పుత్రేషణ = పుత్రాదుల మీద మోహం మొదలైనవాటికి దూరంగా ఉండి సన్న్యాసులు భిక్షావృత్తి కలవారై దివారాత్రాలు మోక్షాన్ని సాధించటంలో తత్పరులై ఉంటారు.

ప్రాజాపత్యాం నిరూప్యేష్టిం తస్యాం సర్వవేదసమ్ ।
హుత్వా బ్రాహ్మణః ప్రవ్రజేత్ ॥ యజుర్వేద బ్రాహ్మణము ॥ (న్యాయ వాత్స్యా.భా.4-1-62)

ప్రాజాపత్యాం నిరూప్యేష్టిం సర్వవేదసదక్షిణామ్ ।
ఆత్మన్యగ్నీన్సమారోప్య బ్రాహ్మణః ప్రవ్రజేద్గృహాత్ ॥ మను. 6-38 ॥

ప్రజాపతి అయిన పరమేశ్వరుని పొందుటకొరకు ఇష్టి - యజ్ఞం చేసి, దానిలో యజ్ఞోపవీతం, శిఖాది చిహ్నాలు వదిలి, ఆహవనీయాది పంచాగ్నులను, ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలను పంచప్రాణాలలో ఆరోపించి బ్రహ్మవిదుడైన బ్రాహ్మణుడు గృహంనుండి వెడలి సన్న్యాసి కావాలి.

యో దత్త్వా సర్వభూతేభ్యః ప్రవ్రజత్యభయం గృహాత్ ।
తస్య తేజోమయా లోకా భవంతి బ్రహ్మవాదినః ॥ మను. 6-39 ॥

సర్వ ప్రాణులకు అభయదానమొసగి గృహంనుండి వెడలిన సన్న్యాసి బ్రహ్మవాదియై అనగా పరమేశ్వరప్రకాశితమగు వేదోక్త ధర్మాదివిద్యలను ఉపదేశిస్తారు. అలాంటి సన్న్యాసికి ప్రకాశమయమైన ముక్తి యొక్క ఆనందస్వరూప లోకం లభిస్తుంది.

సన్న్యాసి విశేష ధర్మాలు

ప్రశ్న: సన్న్యాసియొక్క ధర్మాలేవి?

జవాబు:- పక్షపాత రహితమైన న్యాయాచరణం, సత్యగ్రహణం, అసత్య పరిత్యాగం, వేదోక్తమైన ఈశ్వరుని ఆజ్ఞాపాలనం, పరోపకారం, సత్యభాషణాది లక్షణాలుగల ధర్మం అన్ని ఆశ్రమాలవారికి అంటే మానవులందరికీ ఒక్కటే. కాని సన్న్యాసులకు ఈ క్రింది విశేషధర్మాలున్నాయి:

దృష్టిపూతం న్యసేత్పాదం వస్త్రపూతం జలం పిబేత్ ।
సత్యపూతాం వదేద్వాచం మనః పూతం సమాచరేత్ ॥ మను. 6-46 ॥

సన్న్యాసి బాటలో నడిచినపుడు అటు-ఇటు చూడక క్రింద నేలపై దృష్టినిబెట్టి నడవాలి. ఎప్పుడూ వస్త్రంతో వడగట్టిన నీరే త్రాగాలి. నిరంతరం సత్యాన్నే చెప్పాలి. సర్వదా మనస్సుతో విచారించి సత్యాన్ని గ్రహిస్తూ అసత్యాన్ని విడిచిపెట్టాలి.

క్రుధ్యంతం న ప్రతి క్రుధ్యేదాక్రుష్టః కుశలం వదేత్ ।
సప్తద్వారావకీర్ణాం చ న వాచమనృతాం వదేత్ ॥ మను. 6-48 ॥

ఉపదేశసమయంలో, సంవాదాలలో ఎవరైనా కోపాన్ని చెంది నిందిస్తే సన్న్యాసి అతనిపై కోపాన్ని చూపకూడదు. అతని కల్యాణానికే సదా ఉపదేశిస్తుండాలి. పంచజ్ఞానేంద్రియాలు, మనస్సు బుద్ధి

అనే సప్తేంద్రియాలకు తెలిసిన అనృతవాక్కులను పలుకరాదు.

అధ్యాత్మరతిరాసీనో నిరపేక్షో నిరామిషః ।
ఆత్మనైవ సహాయేన సుఖార్థీ విచరేదిహ ॥ మను. 6-49 ॥

తన ఆత్మలో, పరమాత్మునిలో స్థిరుడై, అపేక్షారహితుడై, మద్యమాంసాలను వర్జించి, ఆత్మ సహాయంతోనే సుఖార్థియై, ఈ లోకంలో ధర్మాన్ని, విద్యను వృద్ధిచేయటానికి నిరంతరం ఉపదేశాన్ని చేయు నిమిత్తమే సంచరించాలి.

క్లృప్తకేశనఖశ్మశ్రుః పాత్రీ దండీ కుసుంభవాన్ ।
విచరేన్నియతో నిత్యం సర్వభూతాన్యపీడయన్ ॥ మను. 6-52 ॥

కేశాలను, నఖములను, గడ్డాన్ని, మీసాన్ని కొరిగించుకొని, సుందరమైన పాత్రను, దండమును, కాషాయవర్ణం గల వస్త్రాలను ధరించి, నిశ్చిత ఆత్ముడై, ప్రాణులను పీడించకుండా సర్వత్ర సంచారాన్ని చేయాలి.

ఇంద్రియాణాం నిరోధేన రాగద్వేషక్షయేణ చ ।
అహింసయా చ భూతానామమృతత్వాయ కల్పతే ॥ మను. 6-60 ॥

అధర్మాచరణ చేయకుండా, ఇంద్రియాలను నిరోధించి, రాగద్వేషాలను వీడి, వైరం లేకుండా అన్ని ప్రాణులతో వర్తిస్తూ మోక్షంకొరకు సామర్థ్యాన్ని పెంచుకోవాలి.

దూషితోఽపి చరేద్ధర్మం యత్ర తత్రాశ్రమే రతః ।
సమః సర్వేషు భూతేషు న లింగం ధర్మకారణమ్ ॥ మను. 6-66 ॥

అన్ని ఆశ్రమాలవారితో వర్తించేవాడు కాబట్టి, లోకంలో తనను ఎవరైనా దూషించినా, భూషించినా లెక్కించక, సన్న్యాసి అన్ని ప్రాణుల పట్ల పక్షపాతం లేకుండా ప్రవర్తిస్తూ, తాను ధర్మాత్ముడై ఇతరులను ధర్మాత్ములను చేయటానికి ప్రయత్నించాలి. తాను దండం, కమండలం, కాషాయ వస్త్రాలు మొదలైన చిహ్నాలు ధరించడమే ధర్మానికి కారణాలు కావని నిశ్చయంగా తెలుసుకోవాలి. మానవులందరికీ సత్యోపదేశం, విద్యాదానం చేస్తూ వారికి ఉన్నతిని కలిగించాలి. ఇదే సన్న్యాసియొక్క ముఖ్య కర్తవ్యం.

ఫలం కతకవృక్షస్య యద్యప్యంబుప్రసాదకమ్ ।
న నామగ్రహణాదేవ తస్య వారి ప్రసీదతి ॥ మను. 6-67 ॥

మురికినీటిలో చిల్లగింజను అరుగదీసి కలిపితే నీరు తేరుకొంటుంది. అలా చేయక కేవలం చిల్లగింజ పేరు చెప్పినంత మాత్రాన ఆ నీరు శుద్ధంకాదు.

ప్రాణాయామా బ్రాహ్మణస్య త్రయోఽపి విధివత్కృతాః ।
వ్యాహృతిప్రణవైర్యుక్తా విజ్ఞేయం పరమం తపః ॥ మను. 6-70 ॥

కాబట్టి బ్రాహ్మణుడు అంటే బ్రహ్మవిదుడైన సన్న్యాసి ఓంకారపూర్వకంగా సప్తవ్యాహృతులతో విధిపూర్వకంగా యథాశక్తి ప్రాణాయామాన్ని చేయాలి. మూడింటికన్న తక్కువగా ప్రాణాయామాన్ని ఎప్పుడూ చేయకూడదు. ఇదే సన్న్యాసియొక్క పరమతపం.

దహ్యంతే ధ్మాయమానానాం ధాతూనాం హి యథా మలాః ।
తథేంద్రియాణాం దహ్యంతే దోషాః ప్రాణస్య నిగ్రహాత్ ॥ మను. 6-71 ॥

ఎలాగైతే అగ్నిలో తపింపచేసి కరిగించినపుడు ధాతువుల మలినాలు నష్టమవుతాయో. అలాగే ప్రాణనిగ్రహం వలన మనస్సు మొదలైన ఇంద్రియాల దోషాలూ భస్మీభూతాలౌతాయి.

ప్రాణాయామైర్దహేద్దోషాన్ ధారణాభిశ్చ కిల్బిషమ్ ।
ప్రత్యాహారేణ సంసర్గాన్ ధ్యానేనానీశ్వరాన్ గుణాన్ ॥ మను. 6-72 ॥

కాబట్టి సన్న్యాసులు ప్రతి నిత్యం ప్రాణాయామంతో ఆత్మ, అంతఃకరణం మరియు ఇంద్రియాల దోషాలను ధారణతో పాపాన్ని ప్రత్యాహారంతో సంగదోషాన్ని ధ్యానం వలన అనీశ్వరగుణాలు అంటే హర్ష, శోకాలు, అవిద్యాది జీవుని దోషాలను భస్మమొనర్చుకోవాలి.

ఉచ్చావచేషు భూతేషు దుర్జ్ఞేయామకృతాత్మభిః ।
ధ్యానయోగేన సంపశ్యేద్ గతిమస్యాంతరాత్మనః ॥ మను. 6-73 ॥

అయోగులకు, అవిద్వాంసులకు తెలియశక్యంకాని, సూక్ష్మ స్థూల పదార్థాలలో గల పరమాత్మవ్యాప్తిని సన్న్యాసి ధ్యానయోగంవలన చూడాలి. అలాగే తన ఆత్మయొక్క అంతర్యామియైన పరమేశ్వరునియొక్క గతిని చూడాలి.

అహింసయేంద్రియాసంగైర్వైదికైశ్చైవ కర్మభిః ।
తపసశ్చరణైశ్చోగ్రైస్సాధయంతీహ తత్పదమ్ ॥ మను. 6-75 ॥

సర్వ ప్రాణులయెడ వైరం వదిలి, ఇంద్రియాలను విషయాల నుండి తొలగించి, వేదోక్త కర్మలను, అత్యధిక తపశ్చర్యను చేసే పూర్వోక్తసన్న్యాసియే ఈ లోకంలో తాను మోక్షపదాన్ని చేరి ఇతరులను చేర్పిస్తాడు. అన్యులెవరూ అలా చేయలేరు.

యదా భావేన భవతి సర్వభావేషు నిస్పృహః ।
తదా సుఖమవాప్నోతి ప్రేత్య చేహ చ శాశ్వతమ్ ॥ మను. 6-80 ॥

సన్న్యాసి సర్వ పదార్థాలలో నిస్పృహ కలిగి కాంక్షారహితుడై - కోరిక లేనివాడై బాహ్యాభ్యంతర వ్యవహారాలలో పవిత్ర భావం కలిగి ఉంటే, ఈ దేహమున్నప్పుడూ, మరణించినా, నిరంతరం సుఖాన్నే పొందుతాడు.

చతుర్భిరపి చైవైతై ర్నిత్యమాశ్రమిభిర్ద్విజైః ।
దశలక్షణకో ధర్మః సేవితవ్యః ప్రయత్నతః ॥ మను. 6-81 ॥

కాబట్టి 'బ్రహ్మచారి, గృహస్థుడు, వానప్రస్థుడు, సన్న్యాసి' అనే నాలుగు ఆశ్రమాలవారు ప్రయత్నంతో క్రింద వ్రాయబడిన దశ లక్షణాలు గల ధర్మాన్ని సేవించాలి.

ధృతిః క్షమా దమోఽ స్తేయం శౌచమింద్రియనిగ్రహః ।
ధీర్విద్యా సత్యమక్రోధో దశకం ధర్మలక్షణమ్ ॥ మను. 6-91 ॥

1. ధృతిః = ఎల్లప్పుడు ధైర్యాన్ని కలిగి ఉండటం; 2. క్షమా=నిందాస్తుతులు, మానావమానాలు, హానిలాభాలు మొదలైన ద్వంద్వాలలోనూ సహనశీలుడుగా ఉండటం; 3. దమః = నిరంతరం మనస్సును ధర్మమందు పెట్టి అధర్మంనుండి తొలగించటం, అనగా అధర్మాన్ని చేయాలనే కోరికలేకుండా చేయటం; 4. అస్తేయమ్ = దొంగతనాన్ని వీడటం, ఆజ్ఞలేకుండా, ఛల, కపట, విశ్వాసఘాతాలతో, ఇతర వ్యవహారాలతో, లేక వేదవిరుద్ధమైన ఉపదేశాలతో పరుల పదార్థాలను గ్రహించటం దొంగతనమంటారు. దానిని విడిచిపెట్టటం అస్తేయమంటారు. 5. శౌచం = రాగాన్ని, ద్వేషాన్ని, పక్షపాతాన్ని విడిచి అంతరంగ పవిత్రతను, జలం మొదలైన వాటితో వెలుపలి పవిత్రతను కలిగి ఉండటం; 6. ఇంద్రియ నిగ్రహః = అధర్మాచరణ నుండి ఇంద్రియాలను తొలగించి ధర్మమందే నిరంతరం నడపటం; 7. ధీః = మాదక ద్రవ్యాన్ని, బుద్ధినాశక పదార్థాలను, దుష్టుల స్నేహాన్ని, అలస్య ప్రమాదాలను వీడి శ్రేష్ఠపదార్థాలను సేవిస్తూ, సత్పురుషుల సాంగత్యంలో, యోగాభ్యాసంతో బుద్ధిని వృద్ధిచేసుకోవటం; 8. విద్యా = పృథివి మొదలుకొని పరమేశ్వరునివరకు గల పదార్థాల యథార్థజ్ఞానం కలిగి వాటితో యథాయోగ్యంగా ఉప- కారాన్ని పొందుట విద్య. దీనికి విపరీతమైనది అవిద్య. 9. సత్యం = ఆత్మలో ఉన్నట్లు మనస్సుతో, మనస్సులో ఉన్నట్లు వాణితో, వాణితో చెప్పినట్లు కర్మలతో ప్రవర్తించటం సత్యం. పదార్థాన్ని ఉన్నదున్నట్లు తెలుసుకొని, అలాగే చెప్పటం, అలాగే చేయటం సత్యం; 10. అక్రోధః = కోపం మొదలైన దోషాలను వీడి శాంతాది సుగుణాలను గ్రహించటం అక్రోధం. ఇదే ధర్మలక్షణం. ఇలాంటి దశ లక్షణాలు గల, పక్షపాతం లేని న్యాయాచరణ ధర్మాన్ని నాలుగు ఆశ్రమాల వారు సేవించాలి. ఈ వేదోక్తధర్మంలోనే తాను నడుస్తూ, ఇతరులకు తెలిపి నడిపించటం సన్న్యాసుల యొక్క విశేష ధర్మం.

అనేన విధినా సర్వాంస్త్యక్త్వా సంగాన్ శనైః శనైః ।
సర్వద్వంద్వవినిర్ముక్తో బ్రహ్మణ్యేవావతిష్ఠతే ॥ మను. 6-92 ॥

ఈ విధంగా మెల్లమెల్లగా సమస్త సంగ దోషాలను వీడి, హర్ష శోకాది ద్వంద్వాలనన్నింటి నుండి తొలగి, సన్న్యాసి బ్రహ్మయందే అవస్థితుడవుతాడు. గృహస్థాది ఆశ్రమాలలోనివారికి వ్యవహారాలన్నింటిలో గల సత్యాన్ని నిశ్చయపరచి, అధర్మవ్యవహారాలనుండి వారిని దూరంచేసి,

సర్వ సంశయాలను నివారించి, సత్య ధర్మయుక్త వ్యవహారాలలో వారిని ప్రవృత్తపరచటమే సన్న్యాసులయొక్క ముఖ్య కర్తవ్యం.

సన్న్యాస గ్రహణాధికారం

ప్రశ్న:- సన్న్యాసాన్ని బ్రాహ్మణులే గ్రహించాలా? క్షత్రియాదులు గ్రహించకూడదా?

జవాబు:- బ్రాహ్మణులకే అధికారమున్నది. అన్ని వర్ణాలలోను పూర్ణ విద్వాంసుడు, ధార్మికుడు, పరోపకార ప్రియుడైనవారినే 'బ్రాహ్మణుడు' అంటారు. భోగమునందు వైరాగ్యంకలుగక, పూర్ణవిద్యను సంపాదించక, ధర్మంనందు, పరమేశ్వరునియందు నిష్ఠ అనేవి లేకుండా సన్న్యాసాన్ని గ్రహిస్తే ప్రపంచానికి ఎక్కువగా ఉపకారం జరగదు. కాబట్టి బ్రాహ్మణుడికే సన్న్యాసాధికారం కలదనీ, ఇతరులకు లేదనీ లోకంలో చెబుతున్నారు. ఇందుకు మనువుయొక్క ప్రమాణం కూడ కలదు:

ఏషవోఽభిహితో ధర్మో బ్రాహ్మణస్య చతుర్విధః ।
పుణ్యోఽక్షయ ఫలః ప్రేత్య రాజధర్మం నిబోధత ॥ మను. 6-97 ॥

"ఓ ఋషులారా! 'బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాసాలు' అనే నాలుగు ఆశ్రమాలను స్వీకరించటం బ్రాహ్మణుని ధర్మం. ఇక్కడ వర్తమానంలో పుణ్య స్వరూపాన్ని శరీరాన్ని వీడిన తర్వాత ముక్తిరూపమైన అక్షయ ఆనందాన్ని ఇచ్చేది సన్న్యాస ధర్మం. ఆ పైన రాజధర్మాలను నాతో వినుడు' అని ఋషులతో మనువు అంటున్నాడు.

దీనిని బట్టి సన్న్యాస స్వీకారానికి ముఖ్యంగా బ్రాహ్మణునకే అధికారం కలదనీ, క్షత్రియాదులకు లేదని తెలుస్తున్నది.

సన్న్యాసగ్రహణావశ్యకత

ప్రశ్న:- సన్న్యాసాన్ని స్వీకరించవలసిన అవసరమేమి?

జవాబు:- శరీరంలో శిరస్సుయొక్క అవసరమున్నట్లు ఆశ్రమాలలో సన్న్యాసాశ్రమంయొక్క అవసరమెంతో ఉంది. ఇది లేకుండా విద్య, ధర్మం ఎన్నడూ వృద్ధి చెందదు. ఇతర ఆశ్రమాలవారికి విద్యాగ్రహణం, గృహకృత్యాలు, తపశ్చర్యాదులు ఉండటం వలన అవకాశం - సమయం చాలా తక్కువగా ఉంటుంది. పక్షపాతాన్ని వీడి ప్రవర్తించటం ఇతర ఆశ్రమాలవారికి దుష్కరం. సన్న్యాసి అన్నిటినుండి విముక్తుడై జగత్తునకు ఉపకారం చేయునట్లు ఇతర ఆశ్రమాలవారు చేయలేరు. సత్య విద్యవలన పదార్థ విజ్ఞానాన్ని ఉన్నతం చేయటానికి ఎంత సమయం సన్న్యాసులకు లభిస్తుందో అంత సమయం ఇతర ఆశ్రమాలవారికి లభించదు. బ్రహ్మచర్యంనుండే సన్న్యాసియై సత్యవిద్యతో జగత్తుకు ఎంత ఉన్నతి కలిగించగలడో, అంతగా గృహస్థ, వానప్రస్థాశ్రమాలు అవలంబించి సన్న్యాసియైనవాడు చేయలేడు.

ప్రశ్న:- సన్న్యాసాన్ని గ్రహించటం ఈశ్వరుని అభిప్రాయానికి విరుద్ధమైనది. మానవుల సంఖ్య వృద్ధిచేయటమే ఈశ్వరుని అభిప్రాయం. గృహాశ్రమమే చేయకపోతే అతనినుండి సంతానమే కలుగదు. సన్న్యాసాశ్రమమే ముఖ్యమై మానవులందరూ దానినే స్వీకరిస్తే మానవజాతియొక్క మూలమే విచ్ఛిన్నమవుతుంది.

జవాబు:- వివాహమైన చాలామందికి సంతానం కలుగదు. కొందరికి కలిగి శీఘ్రంగా మరణిస్తారు. అప్పుడు వారు పరమేశ్వరుని అభిప్రాయానికి విరుద్ధంగా నడచినవారే అవుతారు గదా!

"యత్నే కృతే యది న సిధ్యతి కోఽత్ర దోషః" ఇది ఒకానొక కవి వచనం. 'ప్రయత్నం చేసినా కార్యం సిద్ధించనిచో దోషమేమి?' అనగా దోషం లేదని భావం. కాని మేము చెప్పినది వినండి.

గృహస్థాశ్రమం వలన బహు సంతానం కలిగి పరస్పర విరుద్ధాచరణలతో కలహించి మరణిస్తే ఎంత గొప్ప హాని కలుగుతుంది? జ్ఞానవిరోధం వల్లనే కదా కలహాలు ఎక్కువవుతాయి? కాబట్టి సన్న్యాసి ఒక్కడు వేదధర్మాన్ని ఉపదేశించటంవలన ప్రజలలో ప్రేమాదులు పెరుగుతాయి. దాని వల్ల లక్షలాదిమందికి మేలుకలుగుతుంది. వేలకొలది గృహస్థులను సజ్జనులుగా తయారుచేస్తారు. ఇంతేగాక మానవులందరూ సన్న్యాసాన్ని స్వీకరించలేరు. విషయాసక్తి అందరినీ విడువదు. సన్న్యాసుల ఉపదేశాలను విని ధార్మికులైన మానవులందరు వారికి పుత్రసమానులే అని తెలుసుకోవాలి.

ప్రశ్న:- సన్న్యాసులు మాకు చేయవలసిన కర్తవ్యాలు ఏమీ లేవు. అన్నవస్త్రాలను సంపాదించి ఆనందంలో ఉండటమే మా పని. ఈ అవిద్యారూప సంసారంలో మా తలలను ఎందుకు నొప్పించుకోవాలి? మాకు మేము బ్రహ్మలమని సంతుష్టులమై ఉంటాము. ఎవరైనా వచ్చి అడిగితే వారికి కూడా "నీవు బ్రహ్మవు', నీకు పాపపుణ్యాలు అంటవు, శీతోష్ణాలు శరీరానికి, ఆకలిదప్పికలు ప్రాణానికి, సుఖదుఃఖాలు మనస్సుకి సంబంధించిన ధర్మాలు. జగత్తు మిథ్య, సర్వ జగద్వ్యవహారాలన్నీ కల్పితాలు - అబద్ధాలు. కాబట్టి వీటిలో చిక్కుకొనటం బుద్ధిమంతులపని కాదు. పాపపుణ్యాలు ఏవైనా కలిగితే అవి దేహేంద్రియాలకు సంబంధించినవి. ఆత్మవి కావు" అని ఇలా ఉపదేశిస్తాము. కాని మీరు విలక్షణమైనధర్మాన్ని చెప్పినారు. ఇప్పుడు మేము "ఏది సత్యం? ఏది అసత్యం? దేనిని మేము అంగీకరించాలి?"

జవాబు:- సన్న్యాసికి మంచికర్మలు కర్తవ్యాలు కావా? **"వైదికశ్చైవ కర్మభిః"** మను. 6-75. వైదికకర్మలు - ధర్మయుక్త సత్యకర్మలు సన్న్యాసులకు కూడా అవశ్యకర్తవ్యాలని మనువు వ్రాసినాడు కదా! భోజన భాజనాది కర్మలు వారు విడువగలరా? ఈ కర్మలను విడిచివారు పతితులు, పాపభాగులు కారా? గృహస్థుల నుండి అన్నవస్త్రాలను గ్రహిస్తారు గదా! వారికి ప్రత్యుపకారం చేయకుంటే మహాపాపులు కారా? కంటితో చూడటం, చెవితో వినటం జరుగని నాడు వాని ఉనికి వ్యర్థమవుతుంది. అలాగే సన్న్యాసులు సత్యోపదేశాలు చేయక, వేదాది శాస్త్రాలను విచారించి ప్రచారం చేయనిన్నాడు వారి ఉనికి ప్రపంచానికి వ్యర్థమైనభారం కాదా?

అవిద్యారూప ప్రపంచంలో తలను నొప్పించుకొనటమెందుకు? అని భావించేవారికి ఈ విషయాలు వ్రాసేవారు, ఉపదేశించే వారందరూ మిథ్యారూపులు, పాపాన్ని వృద్ధిచేసేవారుగానే కనిపిస్తారు.

సంసారం మిథ్య కాదు

శరీరం మొదలైనవాటితో చేయు కర్మలు అన్నీ ఆత్మకు సంబంధించినవే. వాటి ఫలాలను అనుభవించేది ఆత్మయే. జీవుని బ్రహ్మగా చెప్పువారే అవిద్యానిద్రలో మునిగి ఉన్నారు. ఎందుకంటే, జీవుడు అల్పుడు, అల్పజ్ఞుడు. బ్రహ్మం సర్వజ్ఞం, సర్వవ్యాపకం. నిత్యశుద్ధబుద్ధముక్త స్వభావయుక్తమై ఉన్నది. జీవుడు ఒకప్పుడు బద్ధుడు, మరొకప్పుడు ముక్తుడు అవుతున్నాడు. బ్రహ్మం సర్వవ్యాపకం. సర్వజ్ఞానం ఉండటంవలన బ్రహ్మకు అవిద్య ఎప్పుడూ అంటలేదు. ఇక జీవునకో 'ఒకసారి విద్య, మరొకసారి అవిద్య' ఉంటుంది. బ్రహ్మ జన్మమరణ దుఃఖాన్ని ఎప్పుడూ పొందలేదు, జీవునకు అది కలుగుతుంది. కాబట్టి వారి ఉపదేశం మిథ్యయే.

ప్రశ్న: "సన్న్యాసి సర్వకర్మవినాశి. అగ్నిని గాని, యే ధాతువును గాని ముట్టడు" అని చెపుతారు. ఇదెంతవరకు సత్యం?

జవాబు:– సత్యం కాదు. **"సమ్యఙ్నిత్యమాస్తే యస్మిన్ యద్వా సమ్యఙ్న్యస్యంతి దుఃఖాని కర్మాణి యేన స సన్న్యాసః, స ప్రశస్తో విద్యతే యస్య స సన్న్యాసీ"** బ్రహ్మయందు నిత్యం సంలగ్నమై ఉండి, దుష్టకర్మలను త్యజించి, ఉత్తమ స్వభావాలను కలిగి ఉన్నవాడు 'సన్న్యాసి' అనబడుతాడు. సుకర్మలను చేయువాడు, దుష్టకర్మలను నాశనం చేసేవాడు సన్న్యాసి అనబడతారు.

ప్రశ్న:– అధ్యాపనాన్నీ, ఉపదేశాన్నీ గృహస్థులునూ చేస్తారు. అపుడు సన్న్యాసియొక్క ప్రయోజనమేమి?

జవాబు:– సత్యోపదేశాన్నీ అన్ని ఆశ్రమాలవారూ చేయాలి, వినాలి. ఎంత సమయం, నిష్పక్షపాతం సన్న్యాసులకుండునో అంత గృహస్థులకుండదు. బ్రాహ్మణులైనవారిలో పురుషుడు పురుషులకు, స్త్రీలు స్త్రీలకు సత్యోపదేశాన్ని చేస్తూ, చదివించాలి. పర్యటనలు చేయడానికి, సన్న్యాసులకు దొరుకునంత సమయం గృహస్థులైన బ్రాహ్మణులకు ఎప్పుడూ దొరకదు. బ్రాహ్మణుడు వేదవిరుద్ధమైన ఆచరణగలవాడైనచో అతన్ని సన్న్యాసియే ఆజ్ఞాపించి బాగుచేయగలడు. కాబట్టి 'సన్న్యాసి' ఉండటం అవసరం.

ప్రశ్న:– "ఏక రాత్రిం వసేద్ గ్రామే" ఇత్యాది వచనాల ప్రకారం సన్న్యాసి ఒకచోట ఒకరాత్రి మాత్రమే ఉండాలి. అధికంగా నివసించకూడదు.

జవాబు:– ఈ మాట కొన్ని విషయాలలో మంచిదే. అతడు ఒకేచోట నివసించినచో ప్రపంచానికి జగత్తునకు ఉపకారం జరుగజాలదు. ఆ స్థలంపై అతనికి అభిమానమేర్పడుతుంది. రాగద్వేషాలు

కూడ పెంపొందుతాయి. ఒకచోటనే ఉంటే విశేషంగా ఉపకారం జరుగుతుందని భావిస్తే, అక్కడ ఒ ండవచ్చు. జనకమహారాజు యొక్క సభలో నాలుగుమాసాల వరకు పంచశిఖులు, సంవత్సరాల కొద్దీ ఇతర సన్న్యాసులు నివసించేవారు. "ఒకేచోట నివసింపరాదు" అనే మాటను నేటి పాషండులైన సంప్రదాయవాదులు కల్పించారు. ఎందుకంటే సన్న్యాసి ఒకేచోట ఎక్కువ కాలమున్నాచో వారి పాషండం ఖండింపబడి అది వృద్ధి పొందదని వారి అభిప్రాయం.

ప్రశ్న:-యతీనాం కాంచనం దద్యాత్తాంబూలం బ్రహ్మచారిణామ్ ।
చౌరాణామభయం దద్యాత్స నరో నరకం వ్రజేత్ ॥ లఘుపరాశర 151 (1-60)

ఇలాంటి వచనాలలోని అభిప్రాయాన్ని అనుసరించి సన్న్యాసులకు సువర్ణదానం చేసిన దాత నరకానికి పోతారని తెలుస్తున్నది.

జవాబు:- దీన్ని కూడా వర్ణాశ్రమవిరోధులైన సంప్రదాయవాదులు, స్వార్థబుద్ధి గల పౌరాణికులు కల్పించినారు. "సన్న్యాసులకు ధనం లభించిన తమను అధికంగా ఖండించెదరనీ, తమకు గొప్ప హాని సంభవించుననీ, వారు తమ అధీనంలో ఎన్నడూ ఉండజాలరనీ, భిక్షాది వ్యవహారాలు తమ అధీనంలో ఉన్నప్పుడే వారికి భయముండుననీ" వీరి అభిప్రాయం. మూర్ఖులు, స్వార్థులు అయిన వారికి దానం చేయటం మంచిదని అనుకున్నప్పుడు విద్వాంసులు, పరోపకారులు అయిన సన్న్యాసులకు ఇచ్చిన దోషం ఏమాత్రం ఉండదు. చూడండి:

"వివిధాని చ రత్నాని వివిక్తేషూపపాదయేత్ ॥ మను. 11-6 ॥

'అనేక విధాలైన రత్న, సువర్ణాది ధనాన్ని, వివిక్తేషు = సన్న్యాసులకు ఇవ్వాలి". కాబట్టి మీరు చెప్పిన శ్లోకం కూడా అనర్థకమైనదే అవుతుంది. ఎందుకంటే "సువర్ణాన్ని దానంచేసిన యజమాని నరకానికి పోతే, వెండి, ముత్యాలు, వజ్రాలు మొదలైనవి ఇచ్చేవారు స్వర్గానికి పోగలరు" అని అర్థం వస్తుంది.

ప్రశ్న:- ఆ పండితుడు దాన్ని చెప్పినపుడు పొరపాటు చేసినాడు. అది **"యతి హస్తే ధనం దద్యాత్"** అని ఉండాలి. అనగా 'సన్న్యాసుల చేతికి ధనమిచ్చినవాడు నరకానికి పోతాడు అని ఉండాలి.

జవాబు:- ఇది కూడ అవిద్వాంసుని కపోల కల్పనయే. చేతికి ధనమిచ్చిన దాత నరకానికి పోయిన, పాదాలపై పెట్టిన, మూటగట్టి ఇచ్చిన స్వర్గానికి పోవునని అర్థమౌతుంది. అందుకే ఇలాంటి కల్పనలను నమ్మరాదు. కాని సన్న్యాసి తన యోగక్షేమాలకు మించి అధికంగా ధనముంచుకొంటే దొంగలతో పీడింపబడటమే కాక దానిపై మోహితుడు కూడా అవుతాడన్నది వాస్తవమే. విద్వాంసుడైనవాడు అయోగ్య వ్యవహారం ఎన్నడూ చేయడు. మోహంలోనూ చిక్కుకోడు. ఎందుకంటే

అతడు బ్రహ్మచర్యంలోను, గృహాశ్రమంలోను భోగాలనన్నిటిని అనుభవించి, అన్నిటిని చూసి ఉన్నాడు. బ్రహ్మచర్యంనుండే సన్న్యాసియైన అతడు పూర్ణవైరాగ్యాలుగలవాడై ఉండటం వలన వీనిలో చిక్కుకోడు.

ప్రశ్న:- శ్రాద్ధంలో సన్న్యాసులు వచ్చినా, భోజనం చేసినా వారి పితరులు పరుగెత్తిపోతారనీ, నరకంలో పడతారనీ జనులు చెబుతున్నారు. ఇది నిజమేనా?

జవాబు:- చనిపోయిన పితరులు రావటం, పెట్టిన శ్రాద్ధం మరణించిన పితరులకు ముట్టుట పూర్తిగా అసంభవం, వేదానికి, యుక్తికి విరుద్ధమవటం వలన ఇది మిథ్య. వారు రావటమే జరగనప్పుడు పారిపోయే దెవరు? పాపపుణ్యాలను అనుసరించి ఈశ్వరుని వ్యవస్థ ప్రకారం మరణించిన తర్వాత జీవుడు మరల జన్మ ఎత్తుతాడు. అపుడు వారెట్లు రాగలరు? కాబట్టి ఇది కూడా పొట్టబోసికొను పౌరాణికుల యొక్క బైరాగుల యొక్క మిథ్యాకల్పనయే. కాని, సన్న్యాసి వెళ్ళినచోట వేదాదిశాస్త్రాలకు విరుద్ధమైన మృతక శ్రాద్ధం జరగదు. కాబట్టి పాషండం పారిపోగలదనటం మాత్రం సత్యం.

బ్రహ్మచర్యం నుండే సన్న్యాసాన్ని తీసికొనే అధికారి

ప్రశ్న:- బ్రహ్మచర్యం నుండే సన్న్యాసాన్ని గ్రహిస్తే వారి నిర్వహణ జరగటం కష్టం. కామాన్ని నిరోధించటం మిక్కిలి కష్టం. కాబట్టి గృహాశ్రమం, వానప్రస్థం స్వీకరించిన తర్వాతనే వృద్ధాప్యంలో సన్న్యాసి అవటం మంచిది.

జవాబు:- నిర్వహించుకోలేనివారు, ఇంద్రియాల జయింపజాలనివారు బ్రహ్మచర్యంనుండి సన్న్యాసాన్ని తీసుకోలేరు. కాని ఇంద్రియాలను నిరోధించే శక్తిగలవారు ఎందుకు తీసుకోరాదు? కామ విషయాల దోషాలను, వీర్యసంరక్షణ గుణాలను బాగా తెలిసినవారు విషయాసక్తులు కాలేరు. వారి వీర్యం ఆలోచనాగ్నికి ఇంధనం వంటిది. అది ఆలోచనలోనే వ్యయమవుతుంది. రోగికి వైద్యునియొక్క ఔషధాలయొక్క ఆవశ్యకత ఉన్నట్లు ఆరోగ్యవంతునికి ఉండదు. అలాగే విద్యాధర్మాల వృద్ధిని, ప్రపంచానికి ఉపకారం చేయు ప్రయోజనంగల స్త్రీ పురుషులు వివాహాన్ని చేసుకోకూడదు. పంచశిఖాది పురుషుల లాగా, గార్గి మొదలైన స్త్రీల లాగా వారుండవచ్చు. కాబట్టి బ్రహ్మచర్యంపై అధికారం కలవారు సన్న్యాసులవటం ఉచితమే. 'సన్న్యాసి' అవటానికి అధికారం లేనివారు దానిని స్వీకరిస్తే తాము మునిగిపోవటమే గాక ఇతరులను కూడా ముంచేస్తారు. చక్రవర్తి అయిన రాజు, 'సమ్రాట్టు' అయినట్లు 'పరివ్రాట్' సన్న్యాసియే అవుతాడు. రాజు తన దేశంలోనే తనవారిచేతనే సత్కారాన్ని పొందగలడు, కాని సన్న్యాసి సర్వత్ర పూజ్యుడవుతాడు.

విద్వత్త్వం చ నృపత్వం చ నైవతుల్యం కదాచన ।
స్వదేశే పూజ్యతే రాజా విద్వాన్ సర్వత్ర పూజ్యతే ॥ చాణక్యనీతి 3 ॥.

ఇది చాణక్యనీతిశాస్త్రంలోని శ్లోకం. విద్వాంసునికి, రాజుకి సమానత ఎప్పుడూ ఉండదు.

ఎందుకంటే రాజు తన రాజ్యంలోనే సత్కారాలను పొందగలుగుతాడు. విద్వాంసుడు సర్వత్ర సత్కారాన్ని ప్రతిష్ఠను పొందుతాడు.

కాబట్టి విద్యను నేర్చుకోవటానికి, సుశిక్షణను పొందటానికి, బలవంతుడవటానికి బ్రహ్మచర్యం అవసరం. అన్ని విధాలైన ఉత్తమ వ్యవహారాలను నెరవేర్చటానికి గృహస్థాశ్రమం అవసరం. ఆలోచన, ధ్యానం, విజ్ఞానం వృద్ధిచేసుకోవటానికి, తపశ్చర్య చేయటానికి వానప్రస్థం కావాలి. వేదాది సత్యశాస్త్రాలను ప్రచారం చేయటానికి, ధర్మ వ్యవహారాలను గ్రహించి దుష్టవ్యవహారాలను త్యజించటానికి, సత్యోపదేశం గావించి అందరినీ నిస్సందేహులుగా చేయటం మొదలైన మంచి పనులకు సన్న్యాసాశ్రమం కావాలి. సన్న్యాసికి ముఖ్య ధర్మాలైన సత్యోపదేశాలను చేయనివారు పతితులై నరకంలో పడిపోతారు. సత్యోపదేశం, శంకాసమాధానం, వేదాది సత్య శాస్త్రాలను చదివించటం, వేదోక్తధర్మాన్ని వృద్ధిచేయటానికి ప్రయత్నించటం, ప్రపంచానికి ఉన్నతి కలిగించటం మొదలైనవి చేయటం సన్న్యాసుల కర్తవ్యం.

ప్రశ్న:- సన్న్యాసులతో పాటు ఇతరులైన సాధువులు, బైరాగులు, గోసాయిలు మొదలైనవారిని కూడా సన్న్యాసాశ్రమంలోనివారిగా లెక్కించాలా?

జవాబు:- లెక్కించకూడదు. వారిలో సన్న్యాసుల లక్షణ మొక్కటి కూడా లేదు. వారు వేదవిరుద్ధ మార్గంలో ప్రవర్తిస్తూ తమ సంప్రదాయపు గురువుల మాటనే వేదంకన్న మిన్నగా నమ్ముతారు. తమ మతాన్నే పొగుడుతారు. మిథ్యా ప్రపంచంలో చిక్కుకొని తమ స్వార్థసిద్ధికై ఇతరులను తమ మతంలో చేర్చుకొంటారు. ప్రపంచంలో బాగుచేయుమాట అటుంచి, తప్పుడు మార్గాన్ని పట్టించి దానిని అధోగతి పాలుచేసి, తమ ప్రయోజనాన్ని నెరవేర్చుకొంటారు. కాబట్టి వీరిని సన్న్యాసాశ్రమంలోనివారిగా పరిగణింపరాదు. కాని వీరు 'స్వార్థ ఆశ్రమంవారనటం నిజం. దీనిలో సందేహమేమీ లేదు. స్వయంగా ధర్మమార్గాన్ని ప్రవర్తిస్తూ, అలాగే ప్రపంచాన్ని కూడా నడిపించేవారు ఈ జన్మలోనూ, పరజన్మలోనూ తాము స్వర్గం అనగా సుఖాన్ని అనుభవించటమే గాక ఇతర ప్రజలను గూడ అనుభవించేలా చేస్తారు. అలాంటి ధర్మాత్ములైన జనులనే 'సన్న్యాసు లనీ, మహాత్ములు అనీ' చెబుతారు.

ఇక్కడ సంక్షేపంగా వానప్రస్థ సన్న్యాసాశ్రమవిధులు వ్రాయబడ్డాయి. ఇకముందు రాజ ప్రజా ధర్మ విషయం వ్రాయబడుతుంది.

శ్రీ మద్దయానందసరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన

సత్యార్థప్రకాశంలో వానప్రస్థ, సన్న్యాసాశ్రమ విషయాలు గల

పంచమ సముల్లాసం సంపూర్ణం

షష్ఠ సముల్లాసము

అథ రాజధర్మాన్ వ్యాఖ్యాస్యామః - ఇక రాజధర్మాలను చెప్తాము

రాజ (క్షత్రియ) కర్తవ్యాలు

మనుమహారాజు ఋషులతో ఇలా చెప్పాడు:

రాజధర్మాన్ ప్రవక్ష్యామి యథావృత్తో భవేన్నృపః ।
సంభవశ్చ యథా తస్య సిద్ధిశ్చ పరమా యథా ॥ మనుస్మృతి. 7-1 ॥

బ్రాహ్మం ప్రాప్తేన సంస్కారం క్షత్రియేణ యథావిధి ।
సర్వస్యాస్య యథాన్యాయం కర్తవ్యం పరిరక్షణమ్ ॥ మను. 7-2 ॥

నాలుగు ఆశ్రమాల, నాలుగు వర్ణాల వారి ఆచార వ్యవహారాలను గురించి ఇంతవరకు చెప్పాను. ఇప్పుడు రాజధర్మాలను గురించి చెప్తాను. ఎలాంటివాడు రాజుగా ఉండాలి? అతడు ఎలా ఉండాలి? అతనికి పరమసిద్ధి ఎలా లభిస్తుంది? అనే విషయాల నన్నింటినీ వివరంగా చెప్తాను. ॥ 1 ॥

శ్రేష్ఠ విద్వాంసుడు బ్రాహ్మణుడయినట్లు, మంచి విద్వాంసుడు, సుశిక్షితుడైనవాడు క్షత్రియుడై రాజ్యాన్ని రక్షించాలి. యథావిధిగా ప్రజలకు న్యాయాన్ని కలిగించాలి. ॥2 ॥

రాజ్యపరిపాలన క్రమం

మూడు సభలు: విద్యార్యసభ - ధర్మార్య సభ - రాజార్య సభ

త్రీణి రాజానా విదథే పురూణి, పరి విశ్వాని భూషథః సదాంసి ॥

ఋ.మం.3. సూ.38. మం.6 ॥

ఈశ్వరుడు ఇలా ఉపదేశిస్తున్నాడు. రాజానా = రాజు, ప్రజలు కలిసి; విదథే = సుఖాన్ని కలిగించే, విజ్ఞానవృద్ధికారకమైన రాజుకు, ప్రజలకు సంబంధించిన వ్యవహారంలో; త్రీణి సదాంసి = విద్యార్యసభ, ధర్మార్యసభ, రాజార్యసభ అనే ఈ మూడు సభలను ఏర్పాటు చేసుకొని; పురూణి

= అనేక విధాలుగా; విశ్వాని = సమస్త ప్రజాసంబంధంగల మానవుల ప్రాణాలను; పరిభూషథః = అన్ని వైపుల నుండి - విద్య, స్వాతంత్ర్యం, ధర్మం, సుశిక్షణ, ధనాలతో అలంకరించాలి.

తం సభా చ సమితిశ్చ సేనా చ ॥ అథర్వ. కాం. 15. సూ.9. మం. 2 ॥

తం = ఆ రాజధర్మాన్ని; సభా చ = మూడు సభలు; సమితిశ్చ = సంగ్రామాది వ్యవస్థ మరియు సేనా చ = సేన కలిసి పాలించాలి.

సభ్య సభాం మే పాహి యే చ సభ్యాః సభాసదః ॥ అథర్వ కా. 19. సూ. 55 మం. 5 ॥

రాజు సభాసదులనందరిని ఇలా ఆజ్ఞాపించాలి. సభ్యః = సభకు యోగ్యుడవైన ఓ ముఖ్య సభాసదుడా! నీవు మే = నా; సభామ్ = సభయొక్క ధర్మయుక్త వ్యవస్థను; పాహి = పాలించు; చ = మరియు; యే = ఎవరు; సభ్యాః = సభా యోగ్యులైన; సభాసదః = సభాసదులున్నారో వారుకూడ సభయొక్క వ్యవస్థను పాలించాలి. రాజును, సభాసదులును ఇలా ఉండాలి. ఒక్కనికే స్వతంత్ర రాజ్యాధికారం ఇవ్వకూడదని దీని అభిప్రాయం. రాజు సభాపతి కావాలి. అతని అధీనంలో సభా, సభ అధీనంలో రాజు, రాజు మరియు సభ ప్రజలయొక్క అధీనంలో, ప్రజలు రాజసభయొక్క అధీనంలో ఉండాలి.

అలా చేయకపోతే:

రాష్ట్రమేవ విశ్యాహన్తి తస్మాద్రాష్ట్రీ విశం ఘాతుకః ।
విశమేవ రాష్ట్రాయాద్యాం కరోతి తస్మాద్రాష్ట్రీ విశమత్తి న పుష్టం పశుం మన్యత ఇతి ॥

శత. కాం. 13. 2. 3.

రాజవర్గం ప్రజలకు లోబడక స్వతంత్రంగా స్వాధీనంగా ఉంటే, రాష్ట్రమేవ విశ్యాహన్తి = (రాజు) రాజ్యంలో ప్రవేశించి ప్రజలను నాశనం చేస్తాడు. అందుకే ఒకే రాజు స్వాధీనతలో రాజ్యముంటే అతడు ఉన్మత్తుడై; రాష్ట్రీ విశం ఘాతుకః = ప్రజానాశకుడవుతాడు. అంటే; విశమేవ రాష్ట్రాయాద్యాం కరోతి = ఆ రాజు ప్రజలనే తినేస్తాడు. (మిక్కిలిగా పీడిస్తా డని అర్థం) అందుకే ఏ ఒక్కనిని కూడా రాజ్యంలో స్వాధీన - స్వతంత్ర - నియంత పాలకునిగా చేయకూడదు. సింహం, మాంసాహారులైన క్రూర జంతువులు బలిసి బాగా నున్న పశువును జంపి తినునట్లు; రాష్ట్రీ విశమత్తి = స్వతంత్రుడైన రాజు ప్రజలను నాశనం చేస్తాడు. అతడు తన కన్న అధికులుగా ఎవరినీ ఉండనివ్వడు. ధనవంతులను దోచుకొని, అన్యాయంగా వారిని దండించి తన ప్రయోజనాన్ని నెరవేర్చుకొంటాడు. కాబట్టి -

ఇంద్రో జయాతి న పరా జయాతా అధిరాజో రాజసు రాజయాతై ।
చర్కృత్య ఈడ్యో వంద్యశ్చోపసద్యో నమస్యో భవేహ ॥ అథర్వ. కాం. 6. 98. 1 ॥

ఓ మానవులారా! ఇహ = ఈ మనుష్య సముదాయంలో; ఇంద్రః = పరమైశ్వర్యకర్తయై శత్రువులను; జయాతి = జయించగలిగితే; న పరాజయాతై = శత్రువుల వలన పరాజయాన్ని

పొందడో; రాజను = రాజులలో; అధిరాజః = అందరికన్నా మించి విరాజిల్లుతూ; రాజయాతై = ప్రకాశమానుడైనవాడు; చర్కృతః = సభాపతి అవటానికి మిక్కిలి యోగ్యుడు; ఈడ్యః = ప్రశంసనీయ గుణ, కర్మ, స్వభావాలు కలవాడు; వంద్యః = సత్కరింపదగినవాడు; చోపసద్యః = సమీపించటానికి, శరణు పొందటానికి యోగ్యుడు; నమస్యః = అందరికీ మాననీయుడు; భవ = అవుతాడో అట్టివాడినే సభాపతిగా - రాజుగా చేసుకోవాలి.

ఇమం దేవా౾ అసపత్నం సువధ్వమ్ మహతే క్షత్రాయ, మహతే జ్యైష్ఠ్యాయ మహతే జానరాజ్యాయేంద్రస్యేన్ద్రియాయ ॥ యజు 9-40 ॥

హే దేవాః = విద్వాంసులైన రాజ ప్రజాజనులారా! మీరు; ఇమమ్ = ఇలాంటి పురుషుని; మహతే క్షత్రాయ = గొప్ప చక్రవర్తి రాజ్యానికై; మహతే జైష్ఠ్యాయ = అన్నిటికన్నా గొప్పదవటాకై; మహతే జాన రాజ్యాయ = గొప్ప గొప్ప విద్వాంసులు గల రాజ్యాన్ని పాలించటానికి; ఇంద్రస్యేంద్రియాయ = పరమైశ్వర్యాలతో కూడిన రాజ్యాన్ని ధనాన్ని పాలించటానికి; అసపత్నగ్ం సువధ్వం = సమ్మతి తెలిపి సర్వత్ర పక్షపాత రహితుడైన, పూర్ణవిద్యా వినయయుక్తుడైన, అందరికీ మిత్రుడైన రాజును సర్వాధికారిగా భావించి సమ్మతిపూర్వకముగా అంగీకరించి సమస్త భూగోళమును శత్రురహితంగా చేయుడు.

సేన శస్త్రాస్త్రయుక్తంగా ఉండాలి

స్థిరా వః సంత్వాయుధా పరాణుదే వీళూ ఉత ప్రతిష్కభే ।
యుష్మాకమస్తు తవిషీ పనీయసీ మా మర్త్యస్య మాయినః ॥ ఋ. 1-39-2 ॥

ఈశ్వరుడు ఇలా ఉపదేశిస్తున్నాడు: ఓ రాజపురుషులారా!; వః = మీయొక్క ఆయుధాః= ఆగ్నేయాది అస్త్రాలు, శతఘ్నీ తోపులు, ఫిరంగులు తుపాకులు, ధనుస్సులు, బాణాలు, కరవాలాలు మొదలైన శస్త్రాస్త్రాలు; పరాణుదే = పరాజితులను చేయటానికి; ఉతప్రతిష్కభే = మరియు అడ్డగించటానికి - నిరోధించటానికి ఉన్నాయి; వీళూ = ప్రశంసించబడినవారు; స్థిరా = దృఢమైనవారు; సంతు = అగుడు; యుష్మాకమ్ = మీయొక్క తవిషీ = సైన్యం; పనీయసీ = ప్రశంసించదగినది; అస్తు = అగును గాక! దానితో మీరు సదా విజయాన్ని పొందుదురుగాక! కాని; మా మర్త్యస్య మాయినః = నిందితుడు, అన్యాయరూప కార్యాలను చేయువానికి పూర్వోక్త ఆయుధాలు వుండకూడదు. మానవులు ధార్మికులుగా ఉన్నంతకాలమే రాజ్యం అభివృద్ధి చెందుతుంది. వారు దుష్టాచారులైనచో రాజ్యం నష్టభ్రష్టమైపోతుంది.

సభాధికారులు - సభాసదులు

మహావిద్వాంసులను 'విద్యాసభ'కు అధికారులుగా, ధార్మికులైన విద్వాంసులను 'ధర్మసభ'కు అధికారులుగా ప్రశంసనీయులైన ధార్మిక పురుషులను 'రాజసభ' కు సభాసదులుగా, అందరిలోనూ సర్వోత్తమ గుణకర్మ స్వభావాలుగల మహాపురుషుని రాజసభకు పతిగాను ఎన్నుకొని అన్ని విధాల

ఉన్నతిని సాధించాలి. మూడు సభలయొక్క సమ్మతితో ఏకాభిప్రాయంతో ఉత్తమ నియమాలను ఏర్పర్చుకొని ఆ నియమాలయొక్క అధీనంలో రాజు - ప్రజలు అందరూ ప్రవర్తించాలి. అందరి హితాన్ని కలిగించే కార్యాలలో సమ్మతి - సభామోదం కలిగి ఉండాలి. సర్వహితాన్ని గావించటానికి పరతంత్రులై, ధర్మయుక్తములైన సొంతకార్యాలలో స్వతంత్రులుగా ఉండాలి. సభాపతియొక్క గుణాలు క్రింద తెలిపిన విధంగా ఉండాలి.

సభాపతి గుణాలు

ఇంద్రాऽనిలయమార్కాణామగ్నేశ్చ వరుణస్య చ ।
చంద్రవిత్తేశయోశ్చైవ మాత్రా నిర్హృత్య శాశ్వతీః ॥ మను. 7-4 ॥

సభాపతియైన రాజు, ఇంద్ర అనగా విద్యుత్తులాగ శీఘ్రంగా ఐశ్వర్యాన్ని సంపాదించేవాడూ, వాయువులాగ అందరికి ప్రాణప్రియుడూ, హృదయంలోని మాటను ఎరుగువాడూ, యమునిలాగ పక్షపాత రహితుడై, న్యాయాధీశుడై, సూర్యునిలాగా విద్యను, ధర్మాన్ని, న్యాయాన్ని, ప్రకాశపరిచేవాడూ, అవిద్య అనే అంధకారాన్ని, అన్యాయాన్ని నిరోధించేవాడూ, అగ్నిలాగా దుష్టులను భస్మం చేసేవాడూ, వరుణునిలాగా దుష్టులను అనేక ప్రకారాలుగా బంధించేవాడూ, చంద్రునిలాగా శ్రేష్ఠులకు ఆనందాన్ని ఒసగువాడూ, కుబేరునిలాగా కోశాన్ని నింపువాడై ఉండాలి.

తపత్యాదిత్యవచ్చైష చక్షూంషి చ మనాంసి చ ।
న చైనం భువి శక్నోతి కశ్చిదప్యభివీక్షితుమ్ ॥ మను. 7-6 ॥

సూర్యునిలాగా ప్రతాపియై, అందరి బాహ్యాభ్యంతర మనస్సులను తన తేజస్సుతో తపింప చేసేవాడై, పృథ్విలో ఎవరిచేతను తీక్ష్ణదృష్టితో చూడబడనివాడైనవాడే సభాపతిగా ఉండాలి.

సోऽగ్నిర్భవతి వాయుశ్చ సోऽర్కః సోమః స ధర్మరాట్ ।
స కుబేరః స వరుణః స మహేంద్రః ప్రభావతః ॥ మను. 7-7 ॥

తన ప్రభావంతో అగ్ని, వాయు, సూర్య, సౌమ్యులలాగా, ధర్మప్రకాశకుడు, ధనవర్ధకుడు, దుష్టులను బంధించేవాడు, గొప్ప ఐశ్వర్యశాలియై ఉంటే అతడే సభాపతి రాజు అవటానికి అర్హుడు.

ఇక నిజమైన రాజు ఎలా ఉండాలో క్రింద సప్రమాణంగా వివరించబడింది.

రాజు - దండనీతి

స రాజా పురుషో దండః స నేతా శాసితా చ సః ॥
చతుర్ణామాశ్రమాణాం చ ధర్మస్య ప్రతిభూః స్మృతః ॥ మను. 7-17 ॥

'దండమే రాజు, పురుషుడు అదే న్యాయప్రచారకర్త. అందరినీ శాసించేది. అదే నాలుగు వర్ణాలను, నాలుగు ఆశ్రమాలను ధర్మంలో నడపు బాధ్యత కలిగిన'దని తెలియాలి.

దండః శాస్తి ప్రజాః సర్వా దండ ఏవాభిరక్షతి ।
దండః సుప్తేషు జాగర్తి దండం ధర్మం విదుర్బుధాః ॥ మను. 7-18 ॥

దండమే శాసనకర్త. ప్రజల నందరినీ కాపాడేది. నిద్రించేవారిలో నిరంతరం మేలుకొని - ఉండునదే దండం. అందుకే బుద్ధిమంతులు దండాన్నే ధర్మమని చెప్పారు.

సమీక్ష్య స ధృతః సమ్యక్ సర్వా రంజయతి ప్రజాః ।
అసమీక్ష్య ప్రణీతస్తు వినాశయతి సర్వతః ॥ మను. 7-19 ॥

బాగా విచారించి ధరించిన దండమే ప్రజలనందరినీ ఆనందపరుస్తుంది. విచారించకుండ ప్రయోగించబడితే అదే అన్ని దిక్కులనుండి అన్ని విధాలుగా రాజును నాశనం చేస్తుంది.

దుష్యేయుః సర్వవర్ణాశ్చ భిద్యేరన్సర్వసేతవః ।
సర్వలోకప్రకోపశ్చ భవేద్దండస్య విభ్రమాత్ ॥ మను. 7-24 ॥

దండం లేకపోతే వర్ణాలన్నీ దూషితమౌతాయి. మర్యాదలన్నీ చిన్నాభిన్నమౌతాయి. యథోచితమైన దండనలేకపోతే అందరూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తారు.

యత్ర శ్యామో లోహితాక్షో దండశ్చరతి పాపహా ।
ప్రజాస్తత్ర న ముహ్యంతి నేతా చేత్సాధు పశ్యతి ॥ మను. 7-25 ॥

కృష్ణవర్ణం కలిగి రక్తనేత్రాలతో ఉండే భయంకర పురుషునిలాగా దండనీతి పాపాలను నాశనం చేసే విధంగా ప్రవర్తిస్తే ప్రజలు మోహాన్ని వీడి ఆనందాన్ని పొందుతారు. కానీ దండం నడిపేవాడు పక్షపాతంలేని విద్వాంసుడై ఉండాలి.

తస్యాహుః సంప్రణేతారం రాజానం సత్యవాదినమ్ ।
సమీక్ష్యకారిణం ప్రాజ్ఞం ధర్మకామార్థకోవిదమ్ ॥ మను. 7-26 ॥

దండాన్ని నడిపేవాడు సత్యవాదీ, ఆలోచించి చేసేవాడూ, బుద్ధిమంతుడూ, ధర్మ, అర్థ, కామాలను సిద్ధించుకోవడంలో పండితుడైనైన రాజే దండాన్ని ప్రవర్తింపచేయతగినవాడని విద్వాంసులు అంటారు.

తం రాజా ప్రణయన్సమ్యక్ త్రివర్గేణాభివర్ధతే ।
కామాత్మా విషమః క్షుద్రో దండేనైవ నిహన్యతే ॥ మను. 7-27 ॥

దండాన్ని బాగా నడిపించేవాడు ధర్మ, అర్థ, కామాలయొక్క సిద్ధిని అభివృద్ధి చేయగలడు. విషయలంపటుడు, వక్రమార్గుడు, ఈర్ష్య చెందేవాడు, క్షుద్రుడు, నీచబుద్ధిగలవాడు న్యాయాధీశుడైన రాజైతే అతనిని ఆ దండమే నాశనం చేస్తుంది.

దండో హి సుమహత్తేజో దుర్ధరశ్చాకృతాత్మభిః ।
ధర్మాద్విచలితం హన్తి నృపమేవ సబాంధవమ్ ॥ మను. 7-28 ॥

ఎంతో గొప్ప తేజోమయమైన దండాన్ని అవిద్వాంసులు, అధర్మాత్ములు ధరించలేరు. ఒకవేళ అలాంటివాడు ధరిస్తే ఆ దండం ధర్మరహితుడైన రాజును కుటుంబసహితంగా నాశనం చేస్తుంది.

సోऽసహాయేన మూఢేన లుబ్ధేనాకృతబుద్ధినా ।
న శక్యో న్యాయతో నేతుం సక్తేన విషయేషు చ ॥ మను. 7-30 ॥

ఎందుకంటే, ఆప్తపురుషుల సహాయం లేకుండా, విద్య, సుశిక్షణ పొందకుండా, విషయ భోగాలలో ఆసక్తిని కలిగి ఉండే మూర్ఖుడు న్యాయంతో దండాన్ని నడపటానికి ఎప్పుడూ సమర్థుడు కాలేడు.

శుచినా సత్యసంధేన యథాశాస్త్రానుసారిణా ।
ప్రణేతుం శక్యతే దండః సుసహాయేన ధీమతా ॥ మను. 7-31 ॥

పవిత్రాత్ముడై, సత్యాచారణ కలిగి సత్పురుషుల సాంగత్యాన్ని చేసేవాడే నీతిశాస్త్రానుకూలంగా శ్రేష్ఠపురుషుల సహాయంతో న్యాయరూప దండాన్ని నడుపటంలో సమర్థుడు.

రాజు - పరిషత్తు - పరిషత్తు యోగ్యత

సైనాపత్యం చ రాజ్యం చ దండనేతృత్వమేవ చ ।
సర్వలోకాధిపత్యం చ వేదశాస్త్రవిదర్హతి ॥ మను. 12-100 ॥

'సర్వసేనాధిపత్యం', 'సేనాధిపతులపై రాజ్యాధికారం', 'దండంపెట్టే వ్యవస్థకు సంబంధించిన కార్యాలపై ఆధిపత్యం', 'సర్వజనులపై సర్వాధీశ రాజ్యాధికారం' అనే ఈ నాలుగు అధికారాలలో సంపూర్ణంగా వేదశాస్త్రాలను చదివిన ప్రవీణులను, పూర్ణవిద్వాంసులను, ధర్మాత్ములను, జితేంద్రియులను, సుశీలురను నియమించాలి. 'ముఖ్యసేనాధిపతి, ముఖ్యన్యాయాధీశుడు, ముఖ్యరాజ్యాధికారి అయిన ప్రధాని మరియు రాజు' అనే ఈ నలుగురు అన్నివిద్యలలో పూర్ణవిద్వాంసులై ఉండాలి.

దశావరా వా పరిషత్ యం ధర్మం పరికల్పయేత్ ।
త్ర్యవరా వాపి వృత్తస్థా తం ధర్మం న విచాలయేత్ ॥ మను. 12-110 ॥

కనీసం పదిమంది విద్వాంసులతో, అంతకన్న తక్కువైతే ముగ్గురు విద్వాంసులతో సభా వ్యవస్థను చేయాలి. ఆ ధర్మవ్యవస్థను ఎవ్వరూ ఉల్లంఘించకూడదు.

త్రైవిద్యో హైతుకస్తర్కీ నైరుక్తో ధర్మపాఠకః ।
త్రయశ్చాశ్రమిణః పూర్వే పరిషత్స్యాద్దశావరా ॥ మను. 12-111 ॥

ఈ సభలో నాలుగువేదాలు, న్యాయశాస్త్రం, నిరుక్తం, ధర్మశాస్త్రం మొదలైన వాటిని ఎరిగిన

విద్వాంసులు సభాసదులుగా ఉండాలి. వారు బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థాశ్రమాలకు చెందినవారై ఉండాలి. ఇలాంటి విద్వాంసులు కనీసం పదిమంది ఉన్నప్పుడే అది 'సభ' అనబడుతుంది.

ఋగ్వేదవిద్యజుర్విచ్చ సామవేదవిదేవ చ ।
త్ర్యవరా పరిషజ్జ్ఞేయా ధర్మసంశయనిర్ణయే ॥ మను. 12-112 ॥

ఆ సభలో ఋగ్వేద, యజుర్వేద, సామవేదాలను తెలిసిన ముగ్గురు సభాసదులు ఉండేటట్లు వ్యవస్థ చేయాలి. అట్టి సభ చేయు వ్యవస్థను ఎవ్వరూ ఉల్లంఘించరాదు.

వేదజ్ఞ సన్న్యాసి కథనం ప్రమాణం

ఏకోఽపి వేదవిద్ధర్మం యం వ్యవస్యేద్ద్విజోత్తమః ।
స విజ్ఞేయః పరో ధర్మో నాజ్ఞానాముదితోఽయుతైః ॥ మను. 12-113 ॥

అన్ని వేదాలూ తెలిసినవాడు, ద్విజులలో ఉత్తముడైన సన్న్యాసి ఒక్కడు చేసిన ధర్మ వ్యవస్థే మిక్కిలి శ్రేష్ఠమైనది. అజ్ఞానులైనవారు వేలకొలది, లక్షల కొలది, కోట్ల కొలదిమంది కలిసి చేసిన వ్యవస్థను ఎన్నడూ అంగీకరించకూడదు.

అవ్రతానామమంత్రాణాం జాతిమాత్రోపజీవినామ్ ।
సహస్రశః సమేతానాం పరిషత్త్వం న విద్యతే ॥ మను. 12-114 ॥

బ్రహ్మచర్యం, సత్యభాషణాది వ్రతాలు, వేదవిద్య, ఆలోచన అనేవి లేకుండా, పుట్టుకతోనే శూద్రులలాగా ప్రవర్తించేవారు వేలకొలదిగా కలిసినా అది 'సభ' అనబడదు.

యం వదంతి తమోభూతా మూర్ఖా ధర్మమతద్విదః ।
తత్పాపం శతధా భూత్వా తద్వక్తౄననుగచ్ఛతి ॥ మను. 12-115 ॥

అవిద్యగల మూర్ఖులు, వేదాన్ని తెలియనివారు దేనిని ధర్మమంటారో దానిని ఎన్నడూ అంగీకరించకూడదు. ఎందుకంటే మూర్ఖులు చెప్పిన ధర్మాన్ని అనుసరించేవారికి అనేకవిధాలుగా పాపం చుట్టుకొంటుంది. కాబట్టి విద్యార్యసభ, ధర్మార్యసభ, రాజార్యసభ ఈ మూడింటిలోనూ మూర్ఖులను చేర్చుకోరాదు. వాటిలో నిరంతరం విద్వాంసులకు, ధార్మికపురుషులకు మాత్రమే స్థానం ఉండాలి.

రాజు - జితేంద్రియులైన సభాసదులు

త్రైవిద్యేభ్యస్త్రయీం విద్యాం దండనీతిం చ శాశ్వతీమ్ ।
ఆన్వీక్షకీం చాత్మవిద్యాం వార్తారంభాంశ్చ లోకతః ॥ మను. 7-43 ॥

నాలుగు వేదాలలోని కర్మోపాసనా జ్ఞానవిద్యలను తెలిసినవారినుండి ఈ మూడు విద్యలను

అంటే సనాతనదండనీతిని, న్యాయవిద్యను, ఆత్మవిద్యను - అంటే పరమాత్మ గుణకర్మస్వభావాలను ఉన్నదున్నట్టు తెలుసుకొనేవాడు బ్రహ్మవిద్యను మరియు లోకవార్తల ఆరంభాన్ని అంటే ప్రజలతో ప్రవర్తించే పద్ధతిని, నేర్చుకొనేవారే సభాసదులు, సభాపతులుగా కావాలి.

ఇంద్రియాణాం జయే యోగం సమాతిష్ఠేద్దివానిశమ్ ।
జితేంద్రియో హి శక్నోతి వశే స్థాపయితుం ప్రజాః ॥ మను. 7-44 ॥

సభాసదులు, సభాపతీ జితేంద్రియులై నిరంతరం ధర్మమందే ప్రవర్తిస్తూ అధర్మం నుండి తొలగి, ప్రజలను తొలగిస్తూ ఉండాలి. రాత్రింబగళ్ళు నియమితవేళల్లో యోగాభ్యాసాన్ని చేస్తూ ఉండాలి. జితేంద్రియుడై తన ఇంద్రియాలు అనే ప్రజలను జయించలేనివాడు వెలుపలి ప్రజలను స్వాధీనపరచుకొనటానికి ఎన్నడూ సమర్థుడు కాలేడు.

అష్టాదశ (18) దుర్గుణాల నిషేధం

దశ కామజ - అష్ట క్రోధజ దుర్గుణాలు

దశ కామసముత్థాని తథాష్టౌ క్రోధజాని చ ।
వ్యసనాని దురంతాని ప్రయత్నేన విసర్జయేత్ ॥ మను. 7-45 ॥

కామసంబంధమైన పది, క్రోధసంబంధమైన ఎనిమిది దుర్వ్యసనాలను దృఢమైన ఉత్సాహం కలవారై ప్రయత్నపూర్వకంగా విడవాలి. ఇతరులచే విడిపించాలి. ఈ దుర్వ్యసనాలలో చిక్కుకొన్నవాడు వాటినుండి విడిపించుకోవటం చాలా కష్టం.

కామజేషు ప్రసక్తో హి వ్యసనేషు మహీపతిః ।
వియుజ్యతేఽర్థధర్మాభ్యాం క్రోధజేష్వాత్మనైవ తు ॥ మను. 7-46 ॥

కామంతో ఉత్పన్నమైన దుర్వ్యసనాలలో చిక్కిన రాజు అర్థం - రాజ్య ధనాలను, ధర్మాన్ని కోల్పోతాడు. ఇక క్రోధంనుండి పుట్టే దుర్వ్యసనాలలో చిక్కినవాడు శరీరాన్ని కూడ పోగొట్టుకొంటాడు.

కామం నుండి పుట్టు 10 వ్యసనాలు

మృగయాక్షో దివాస్వప్నః పరివాదః స్త్రియో మదః ।
తౌర్యత్రికం వృథాట్యా చ కామజో దశకో గణః ॥ మను. 7-47 ॥

'వేటాడటం, పాచికలాడటం (జూదమాడటం), పగలు నిద్రించటం, కామకథ, పరనింద, స్త్రీలతో అతిగా సమాగమం, మద్యం, నల్లమందు, భంగు, గంజాయి మొదలైన మాదక ద్రవ్యాలను సేవించటం, వాద్యం వాయించటం, నాట్యమాడటం, నాట్యమాడించటం వీనిని పాడటం, వినటం, చూడటం వృథాగా అటు ఇటు తిరగటం' అనేవి కామంనుండి పుట్టిన వ్యసనాలు.

క్రోధం నుండి పుట్టే 8 వ్యసనాలు

పైశున్యం సాహసం ద్రోహ ఈర్ష్యాసూయార్థదూషణమ్ ।
వాగ్దండజం చ పారుష్యం క్రోధజోఽపి గణోఽష్టకః ॥ మను. 7-48 ॥

'పైశున్యం అనగా చాడీలు చెప్పటం; ఆలోచన విడిచి పరస్త్రీతో బలాత్కారంగా చెడుపని చేయటం; ద్రోహం కలిగి ఉండటం. ఈర్ష్య అంటే ఇతరుల బాగును చూసి ఓర్వలేకపోవటం, అసూయ అంటే దోషాలలో గుణాలనూ గుణాలలో దోషాలనూ ఆరోపించటం, అర్థదూషణం అనగా అధర్మకార్యాలలో ధనాలను వ్యయం చేయటం, కఠినంగా మాట్లాడటం, నిరపరాధుల పట్ల పరుషవాక్కులు ఉపయోగించటం, వారిని విశేషంగా దండించటం' అనే ఈ ఎనిమిది వ్యసనాలు కోపంవలన పుడతాయి.

ద్వయోరప్యేతయోర్మూలం యం సర్వే కవయో విదుః ।
తం యత్నేన జయేల్లోభం తజ్జావేతావుభౌ గణౌ ॥ మను. 7-49 ॥

ఈ కామ, క్రోధ వ్యసనాలకు మూలమై మానవులనందరినీ దుర్గుణాలలోకి నెట్టేది "లోభ"మని విద్వాంసులందరూ తెలుసుకోవాలి. కాబట్టి లోభగుణాన్ని ప్రయత్నంతో వదలిపెట్టాలి.

పానమక్షాః స్త్రియ శ్చైవ మృగయా చ యథాక్రమమ్ ।
ఏతత్కష్టతమం విద్యాచ్చతుష్కం కామజే గణే ॥ మను. 7-50 ॥

కామసంబంధమైన వ్యసనంలో 'మత్తుపదార్థాలను సేవించటం, జూదమాడటం, విశేష స్త్రీ సంగమం, వేటాడటం' అనే ఈ నాలుగు మహా దుష్టవ్యసనాలు.

దండస్య పాతనం చైవ వాక్పారుష్యార్థ దూషణే ।
క్రోధజేఽపి గణే విద్యాత్కష్టమేతత్త్రికం సదా ॥ మను. 7-51 ॥

క్రోధసంబంధమైన దుర్వ్యసనాలలో 'నిరపరాధులను దండించటం, పరుషవాక్కులు పలకటం, అన్యాయ కార్యాలలో ధనాలను వ్యయం చేయటం' అనే ఈ మూడు మహాదుఃఖకరాలైన దోషాలు.

సప్తకస్యాస్య వర్గస్య సర్వత్రైవానుషంగిణః ।
పూర్వం పూర్వం గురుతరం విద్యాద్వ్యసనమాత్మవాన్ ॥ మను. 7-52 ॥

ఈ ఏడు దుర్వ్యసనాలు కామ, క్రోధ దోషాలనుండి లెక్కించబడ్డాయి. 'వ్యర్థ వ్యయం కంటే కఠోరవచనం, కఠోరవచనం కంటే అన్యాయంగా దండించటం, దానికంటే వేటాడటం, వేటాడటం కంటే అతిగా స్త్రీ సంగమం, దానికంటే జూదం, జూదం కన్నా మద్యాదిసేవనం' అనేవి ఒకదాని కంటే ఒకటి గొప్ప వ్యసనాలు.

వ్యసనస్య చ మృత్యోశ్చ వ్యసనం కష్టముచ్యతే ।
వ్యసన్యధోఽధోవ్రజతి స్వర్యాత్యవ్యసనీ మృతః ॥ మను. 7-53 ॥

దుర్వ్యసనాలలో చిక్కటం కన్న చావడమే మేలు. ఎందుకంటే దురాచారి అయిన పురుషుడు జీవించేకొద్దీ పాపాలే చేసి ఇంకా నీచగతిని అంటే అధిక దుఃఖాన్ని పొందుతాడు. ఏ దుర్వ్యసనం లేనివాడు మరణించియూ సుఖాన్నే అనుభవిస్తాడు. కాబట్టి మద్యపానాది దుర్వ్యసనాలలో ఎన్నడూ చిక్కుపడక వాటికి దూరంగా ఉంటూ, ధర్మయుక్త గుణకర్మస్వభావాలతో సర్వదా ప్రవర్తించటం మానవులందరికీ, ముఖ్యంగా రాజుకు చాలా మంచిది.

రాజసభాసదులు - మంత్రి ఉండవలసిన విధానం

మౌలాన్ శాస్త్రవిదః శూరాన్ లబ్ధలక్ష్యాన్ కులోద్గతాన్ ।
సచివాన్ సప్త చాష్టౌ వా ప్రకుర్వీత పరీక్షితాన్ ॥ మను. 7-54 ॥

స్వరాజ్య-స్వదేశంలో జన్మించినవారు, వేదాదిశాస్త్రజ్ఞులు, శూరవీరులు, వ్యర్థమైన ఆలోచన చేయని లక్ష్యంగలవారు, ఉత్తమ వర్ణస్థులు, సుపరీక్షితులు, ఉత్తమ ధార్మిక చతురులు అయిన సచివులను అంటే మంత్రులను ఏడుగురిని కానీ, ఎనిమిది మందిని గానీ నియమించాలి.

అపి యత్సుకరం కర్మ తదప్యేకేన దుష్కరమ్ ।
విశేషతోఽసహాయేన కింతు రాజ్యం మహోదయమ్ ॥ మను. 7-55 ॥

తగిన సహాయం లేకుండా సుగమమైన పనిని ఒక్కడే చేయటం కఠినమైనపుడు గొప్ప రాజ్యకార్యాలు ఒక్కనితో ఎలా కాగలవు? కాబట్టి ఒక్కనినే రాజును చేయటంకాని, ఒక్కని బుద్ధిమీదనే రాజ్యకార్యం ఆధారపడి ఉండటం కాని మంచిది కాదు.

తైః సార్ధం చింతయేన్నిత్యం సామాన్యం సంధివిగ్రహమ్ ।
స్థానం సముదయం గుప్తిం లబ్ధప్రశమనాని చ ॥ మను. 7-56 ॥

సభాపతియైన రాజు ప్రతిదినం ఆ యా రాజ్యకార్యాలలో కుశలురు, విద్వాంసులు అయిన మంత్రులతో కూడి; సంధిః = ఎవరితో మైత్రిచేయాలి?; విగ్రహం = ఎవరితో విరోధించాలి?; స్థానం = స్థితి అంటే సమయాన్ని గుర్తించి ఎప్పుడు ఊరకుండాలి? ఎవరితో తటస్థంగా ఉండి స్వరాజ్యాన్ని కాపాడుకోవాలి?; గుప్తిమ్ = మూల సైన్యాన్ని, కోశాన్ని ఎలా రక్షించాలి?; లబ్ధప్రశమనాని = స్వాధీనమైన దేశంలో శాంతిని స్థాపించి నిరుపద్రవంగా ఎలా చేయాలి? అనే ఈ ఆరు విషయాలను ఎల్లప్పుడూ బాగా ఆలోచించాలి.

తేషాం స్వం స్వమభిప్రాయముపలభ్య పృథక్ పృథక్ ।
సమస్తానాం చ కార్యేషు విదధ్యాద్ధితమాత్మనః ॥ మను. 7-57 ॥

ఆ యా సభాసదుల నుండి వేరు వేరుగా వారి వారి అభిప్రాయాలను తెలుసుకొని, అధిక సంఖ్యాకుల అభిప్రాయానుసారం తనకు, ఇతరులకు హితాన్ని కలిగించేవారినే అధికారులుగా నియమించాలి.

అన్యానపి ప్రకుర్వీత శుచీన్ ప్రాజ్ఞానవస్థితాన్ ।
సమ్యగర్థసమాహర్తౄనమాత్యాన్ సుపరీక్షితాన్ ॥ మను. 7-60 ॥

పవిత్రాత్ములు, బుద్ధిమంతులు, దృఢచిత్తులు, పదార్థాలను సేకరించుటలో అతి నిపుణులు, సుపరీక్షితులు అనేవారిని కూడా మంత్రులుగా నియమించుకోవాలి.

నివర్తేతాస్య యావద్భిరితికర్తవ్యతా నృభిః ।
తావతోఽ తంద్రితాన్ దక్షాన్ ప్రకుర్వీత విచక్షణాన్ ॥ మను. 7-61 ॥

సోమరితనం లేనివారు, బలవంతులు, మిక్కిలి చాతుర్యం కలవారు అయిన ప్రధానపురుషులను, అధికారులుగ, రాజ్యకార్యసిద్ధికి అవసరమైనంత మందిని నియమించాలి.

తేషామర్థే నియుంజీత శూరాన్ దక్షాన్ కులోద్గతాన్ ।
శుచీనాకరకర్మాంతే భీరూనంతర్నివేశనే ॥ మను. 7-62 ॥

తమ అధీనంలో ఉండే శూరవీరులు, బలాఢ్యులు, ఉత్తమకులంలో పుట్టినవారు, పవిత్రులును అయిన సేవకులను గొప్పగొప్ప పనులలో, భయపడు పిరికివారిని లోపలి కార్యాలలో నియమించాలి.

దూత నియుక్తి

దూతం చైవ ప్రకుర్వీత సర్వశాస్త్రవిశారదమ్ ।
ఇంగితాకారచేష్టజ్ఞం శుచిం దక్షం కులోద్గతమ్ ॥ మను. 7-63 ॥

ఉత్తమకులంలో పుట్టిన చతురుడు, పవిత్రుడు, హావభావ చేష్టలతో ఎదుటివారి హృదయాన్ని, ఇకముందు జరుగనున్నవాటిని గ్రాహించేవాడు, శాస్త్రాలన్నిటిలో విశారదుడు అయినవారిని 'దూత'గా రాజు నియమించుకోవాలి.

అనురక్తః శుచిర్దక్షః స్మృతిమాన్ దేశకాలవిత్ ।
వపుష్మాన్వీతభీర్వాగ్మీ దూతో రాజ్ఞః ప్రశస్యతే ॥ మను. 7-64 ॥

రాజకార్యాలలో మిక్కిలి ఉత్సాహం కలవాడు, ప్రీతిగలవాడు, నిష్కపటియు, పవిత్రాత్ముడు, చాతుర్యం కలవాడు, స్మరణశక్తిగలవాడు, దేశకాలాలను గుర్తించి ప్రవర్తించేవాడు, సుందరరూపుడు, నిర్భయుడు, మంచివక్తయైన వ్యక్తియే రాజుకు 'దూత' అవటానికి తగినవాడు.

రాజు, మంత్రి, దూత - వారి అధికారాలు

అమాత్యే దండ ఆయత్తో దండే వైనయికీ క్రియా ।
నృపతౌ కోశరాష్ట్రే చ దూతే సంధివిపర్యయౌ ॥ మను. 7-65 ॥

అమాత్యునకు అంటే మంత్రికి దండణాధికారాన్ని ఇవ్వాలి. దండంలో వినయక్రియ ఉండాలి. అమాత్యునకు అంటే మంత్రికి దండణాధికారాన్ని ఇవ్వాలి. దండంలో వినయక్రియ ఉండాలి. రాజు అధీనంలో కోశం, రాజకార్యం ఉండాలి. సభ అన్యాయరూపమైన దండన జరుగకూడదు. రాజు అధీనంలో కోశం, రాజకార్యం ఉండాలి. సభ

అధీనంలో సమస్త కార్యాలు కూడా ఉండాలి. ఇతరులతో సంధి విగ్రహాలను అంటే మైత్రి విరోధాలను చేసే అధికారం 'దూత'కు ఇవ్వాలి.

దూత ఏవ హి సంధత్తే భినత్త్యేవ చ సంహతాన్ ।
దూతస్తత్కురుతే కర్మ భిద్యంతే యేన వా న వా ॥ మను. 7-66 ॥

శత్రువులతో సంధి, మిత్రులుగా నటించే దుష్టులలో పరస్పర వైరం కల్పించగల నేర్పుగలవాడ్జే దూతగా ఉండాలి. కాబట్టి అతడు శత్రువులలో పరస్పర వైమనస్యం కలిగించాలి.

బుద్ధ్వా చ సర్వ తత్త్వేన పరరాజచికీర్షితమ్ ।
తథా ప్రయత్నమాతిష్ఠేద్యథాత్మానం న పీడయేత్ ॥ మను. 7-68 ॥

సభాపతి, సభాసదులు, దూత మొదలైనవారు శత్రువుల రాజ్యవిషయాలను యథార్థంగా తెలుసుకొని, తమకు అపాయం కలుగకుండేటట్లు ప్రయత్నం చేయాలి.

దుర్గ భేదాలు - వాని ఉపయోగాలు

ధనుర్దుర్గం మహీదుర్గమబ్దుర్గం వార్క్షమేవ వా ।
నృదుర్గం గిరిదుర్గం వా సమాశ్రిత్య వసేత్పురమ్ ॥ మను. 7-70 ॥

సుందరమైన అరణ్యాలు గల ప్రదేశంలో; ధనుర్దుర్గం = ధనుర్ధారులతో ప్రవేశించటానికి వీలుకానిదీ; మహీదుర్గం = మట్టితో నిర్మించబడినదీ; అబ్దుర్గం = చుట్టూ అఖాతాలలో (లోతైన కాల్వలు) నీరు నింపబడినదీ; వార్క్షమ్ = నాలుగు దిక్కుల వనం గలదీ; నృదుర్గమ్ = నాలుగు దిశలలో సైన్యం కలదీ; గిరిదుర్గం = అన్నివైపుల కొండలుగల చోట నడుమ కోటను నిర్మించి రాజు దాని మధ్యలో నగరాన్ని నిర్మించాలి.

ఏకః శతం యోధయతి ప్రాకారస్థో ధనుర్ధరః ।
శతం దశసహస్రాణి తస్మాద్దుర్గం విధీయతే ॥ మను. 7-74 ॥

నగరానికి నాలుగువైపులా ప్రాకారాన్ని కట్టాలి. దాని మీదనుండి ధనుర్ధారీ, శస్త్రయుక్తుడైన ఒక్కొక్క వీరుడు వంద మందితో, వంద మంది పదివేల మందితో యుద్ధం చేయు విధంగా దుర్గం నిర్మించాలి.

తత్స్యాదాయుధసంపన్నం ధనధాన్యేన వాహనైః ।
బ్రాహ్మణైః శిల్పిభిర్యంత్రైర్యవసేనోదకేన చ ॥ మను. 7-75 ॥

ఆ దుర్గం 'శస్త్రాస్త్రాలు, ధనధాన్యాలు, వాహనాలు, చదివించే, ఉపదేశం చేసే బ్రాహ్మణులు, చేతిపనివారు, అనేక విధాలైన కళాయంత్రాలు, భోజనపదార్థాలు, గడ్డి, నీరు' మొదలైన వాటితో సంపన్నంగా, పరిపూర్ణంగా, ఉండాలి.

తస్య మధ్యే సుపర్యాప్తం కారయేత్ గృహమాత్మనః ।
గుప్తం సర్వర్తుకం శుభ్రం జలవృక్షసమన్వితమ్ ॥ మను. 7-76 ॥

ఆ దుర్గం లోపల జలవృక్షపుష్పాలు అన్నీ అన్నివిధాల సురక్షితములై ఉండాలి. అన్ని ఋతువులలో సుఖకారకమై రాజకార్యాలన్నీ నిర్వహించే వీలైనట్టి శ్వేతవర్ణం గల గృహాన్ని తన కొరకు నిర్మించుకోవాలి.

తదధ్యాస్యోద్వహేద్భార్యాం సవర్ణాం లక్షణాన్వితామ్ ।
కులే మహతి సంభూతాం హృద్యాం రూపగుణాన్వితామ్ ॥ మను. 7-77 ॥

బ్రహ్మచర్యంతో విద్యనేర్చుకొని, రాజకార్యాలను చేసి, తర్వాత సౌందర్యవతి, గుణవతి, హృదయానికి అత్యంతప్రియురాలు, ఉత్తమవంశంలో పుట్టినదీ, సుందర లక్షణవతీ అయిన క్షత్రియకన్య తనకు అనుకూలమైన విద్యాది గుణకర్మస్వభావాలు కలదానిని వివాహం చేసుకోవాలి. తర్వాత ఇతర స్త్రీలందరూ తాను కోరదగనివారని ఎంచి వారివైపు చూడకుండా ఉండాలి.

పురోహితం ప్రకుర్వీత వృణుయాదేవ చర్త్విజమ్ ।
తేఽస్య గృహ్యాణి కర్మాణి కుర్యుర్వైతానికాని చ ॥ మను. 7-78 ॥

అగ్నిహోత్రం, పక్షేష్టి మొదలైన యజ్ఞాలను చేయటానికి, రాజకార్యాలనన్నింటిని చేయటానికి పురోహితుని, ఋత్విజులను నియమించాలి. రాజు తానెల్లప్పుడు రాజకార్యాలలో నిమగ్నుడై ఉండాలి. 'దివారాత్రాలు రాజకార్యంలో నిమగ్నుడై వారిని చెడిపోకుండా ఉండేటట్లు చూడటమే రాజుకు సంధ్యోపాసనాది కర్మ' అని తెలుసుకోవాలి.

వివిధ - అధ్యక్షుల నియుక్తి

సాంవత్సరికమాప్తైశ్చ రాష్ట్రాదాహారయేద్బలిమ్ ।
స్యాచ్చామ్నాయపరో లోకే వర్తేత పితృవన్నృషు ॥ మను. 7-80 ॥

సంవత్సరపు పన్నును ఆప్తపురుషులద్వారా తీసుకోవాలి. సభాపతి అయిన రాజు, ప్రధాన పురుషులు, వేదానుకూలంగా నడుస్తూ ప్రజలపట్ల తండ్రిలాగా ప్రవర్తించాలి.

అధ్యక్షాన్ వివిధాన్ కుర్యాత్తత్ర తత్ర విపశ్చితః ।
తేఽస్య సర్వాణ్యవేక్షేరన్నృణాం కార్యాణి కుర్వతామ్ ॥ మను. 7-81 ॥

రాజకార్యాలను నిర్వహించటానికి వివిధ అధ్యక్షులను సభ నియమించాలి. వీరు ఆ యా అధికారుల ఆజ్ఞల ప్రకారంగా ప్రవర్తిస్తూ తమ తమ కర్తవ్యాలను యథావిధిగా ఆచరిస్తున్నారా? లేదా? అని విచారించి సక్రమంగా ప్రవర్తించేవారిని సత్కరిస్తూ, విరుద్ధంగా ప్రవర్తించేవారిని యథాయోగ్యంగా దండిస్తూ ఉండాలి. ఇదే వీరి కర్తవ్యం.

ఆవృత్తానాం గురుకులాద్విప్రాణాం పూజకో భవేత్ ।
నృపాణామక్షయో హ్యేష నిధిర్బ్రాహ్మోఽ విధీయతే ॥ మను. 7-82 ॥

ఎల్లప్పుడు రాజులకు అక్షయకోశంవంటిదైన వేదప్రచారాన్ని చేయటానికి యథావిధిగా బ్రహ్మచర్యాన్ని అవలంబించి గురుకులంలో వేదాదిశాస్త్రాలను చదివి, వచ్చే వారిని, వారి గురువులను రాజు మరియు సభ, యథాయోగ్యంగా సత్కరించాలి. ఇలా చేస్తే రాజ్యంలో విద్యావృద్ధి అవటమే కాక రాజ్యం అత్యున్నతిని పొందుతుంది.

యుద్ధం చేసే విధానం

సమోత్తమాధమైర్ రాజా త్వాహూతః పాలయన్ ప్రజాః ।
న నివర్తేత సంగ్రామాత్ క్షాత్రం ధర్మమనుస్మరన్ ॥ మను. 7-87 ॥

ఎప్పుడైనా తనకంటే హీనుడుగాని, సమానుడు గాని, అధికుడు గాని యుద్ధానికి పిలిస్తే ప్రజాపాలకుడైన ఆ రాజు క్షత్రియధర్మాన్ని అనుసరించి యుద్ధం చేయటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. తనకు విజయం లభించునట్లు మిక్కిలి నేర్పుతో యుద్ధం చేయాలి.

ఆహవేషు మిథోఽ న్యోన్యం జిఘాంసంతో మహీక్షితః ।
యుధ్యమానాః పరం శక్త్యా స్వర్గం యాంత్యపరాఙ్ముఖాః ॥ మను. 7-89 ॥

సంగ్రామంలో ఒకరిని మరొకరు చంపుతారని భయపడక, వెనుదీయక శక్తికొలది యుద్ధం చేయాలి. అలాంటి రాజులే సుఖాన్ని పొందుతారు. అందులకు ఎన్నడూ విముఖుడు కాకూడదు. శత్రువును ఓడించటానికి తాను దాగి ఉండవలసి వచ్చినా అలాగే చేయాలి. శత్రువును జయించటానికి అలా చేయటం దోషం కాదు. కోపంతో సింహం ముందుకు దూకి శస్త్రాగ్నిలో భస్మమై పోవునట్లు రాజు మూర్ఖతతో చెడిపోరాదు.

న చ హన్యాత్ స్థలారూఢం న క్లీబం న కృతాంజలిమ్ ।
న ముక్తకేశం నాసీనం న తవాస్మీతి వాదినమ్ ॥ మను. 7-91 ॥

యుద్ధసమయంలో యుద్ధంతో సంబంధంలేక దూరంగా నిలుచుండేవారిని, నపుంసకులను, చేతులు జోడించినవారిని, తల విరబోసుకొన్నవారిని, కూర్చున్నవారిని, శరణుజొచ్చినవారిని చంపకూడదు.

న సుప్తం న విసన్నాహం న నగ్నం న నిరాయుధమ్ ।
నాయుధ్యమానం పశ్యంతం న పరేణ సమాగతమ్ ॥ మను. 7-92 ॥

నిద్రపోయేవారిని, మూర్ఛను పొందినవారిని, నగ్నంగా ఉన్నవారిని, చేతిలో ఆయుధం లేనివారిని, యుద్ధాన్ని చూస్తుండేవారిని, శత్రువువెంట ఊరక వచ్చినవారిని చంపరాదు.

నాయుధవ్యసన ప్రాప్తం నార్తం నాతిపరిక్షతమ్ ।
న భీతం న పరావృత్తం సతాం ధర్మమనుస్మరన్ ॥ మను. 7-93 ॥

ఆయుధపు దెబ్బలతో బాధపడినవారిని, దుఃఖితులను, మిక్కిలి గాయం తగిలినవారిని, భీతి చెందినవారిని, పారిపోయేవారిని, సత్పురుషులైనవారిని యోధులు ధర్మాన్ని జ్ఞాపకం చేసుకొంటూ ఎన్నటికీ చంపరాదు. వారిని బంధించి కారాగారగృహంలో పెట్టి వారికి భోజనాలను యథారీతిగా ఇవ్వాలి. గాయపడినవారికి చికిత్స చేయించాలి. వారిని దుఃఖపెట్టకూడదు. ఎగతాళి చేయరాదు. వారితో తగిన పనులనే చేయించాలి. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు, ఆకలి దప్పికలతో ఉన్నవారు, శోకంతో ఉన్నవారు మొదలైనవారిపై ఆయుధాన్ని ప్రయోగించరాదు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. వారి పిల్లలను తమ సంతానం లాగానే పెంచాలి. వారి స్త్రీలను కూడా పోషించాలి. కామ ఆసక్తిగల దృష్టితో వారిని ఎన్నడూ చూడరాదు. రాజ్యం చక్కబడినపుడు, మరల దాడి చేయరనే నమ్మకం కలిగినమీదట వారిని సత్కారపూర్వకంగా విడిచిపెట్టి వారి దేశానికి గాని, వారి ఇంటికి గాని పంపించాలి. వీరితో ఇకముందు అపాయం కలుగునని తోచినవారిని ఎల్లప్పుడు కారాగారంలోనే ఉంచాలి.

యస్తు భీతః పరావృత్తః సంగ్రామే హన్యతే పరైః ।
భర్తుర్యద్దుష్కృతం కించిత్తత్సర్వం ప్రతిపద్యతే ॥ మను. 7-94 ॥

భయపడి పారిపోయినా, శత్రువుతో చంపబడినా, అట్టి భృత్యుడు తన రాజు పట్ల చేసిన అపరాధానికి దండనీయుడే అవుతాడు.

యచ్చాస్య సుకృతం కించిదముత్రార్థముపార్జితమ్ ।
భర్తా తత్సర్వమాదత్తే పరావృత్తహతస్య తు ॥ మను. 7-95 ॥

పారిపోవటం వలన చంపబడిన భృత్యుని పుణ్యఫలమంతా నశిస్తుంది. అతనికి సుఖమేమీ లభించదు. ఈ లోకంలోనూ, పరలోకంలోనూ సుఖంకలిగించే ఆతని ప్రతిష్ఠ అతని స్వామిని చేరుతుంది. ధర్మంగా యథారీతిని యుద్ధం చేసేవానికే ప్రతిష్ఠ కలుగుతుంది.

రథాశ్వం హస్తినం ఛత్రం ధనం ధాన్యం పశూన్ స్త్రియః ।
సర్వద్రవ్యాణి కుప్యం చ యే యజ్జయతి తస్య తత్ ॥ మను. 7-96 ॥

శత్రువు నోడించి, రథం, గుఱ్ఱం, ఏనుగు, గొడుగు, ధనం, ధాన్యం, గోవు మొదలైన పశువులు, స్త్రీలు, తక్కిన అనేకవిధాలైన ద్రవ్యాలు, నేయి, నూనె మొదలైన పదార్థాలను యుద్ధంలో జయించిన సైనికులకుగాని, సేనాధ్యక్షులకు గాని ఇవ్వాలి. ఈ వ్యవస్థను ఎన్నటికీ భంగపరచరాదు.

రాజ్ఞశ్చ దద్యురుద్ధారమిత్యేషా వైదికీ శ్రుతిః ।
రాజ్ఞా చ సర్వయోధేభ్యో దాతవ్యమపృథగ్జితమ్ ॥ మను. 7-97 ॥

సైనికులును తాము జయించిన పదార్థాలలో పదహారవభాగాన్ని రాజుకు ఇవ్వాలి. రాజును అందరు కలిసి జయించిన ధనంలో పదహారవభాగాన్ని సైనికులకు ఇవ్వాలి. యుద్ధంలో ఎవరైనా చనిపోతే వారి భార్యకు, సంతానానికి గాని వారి భాగమివ్వాలి. వారి భార్యను బిడ్డలను తగినట్లు పోషించాలి. వారి పుత్రులు సమర్థులైతే వారికి తగిన అధికారాలివ్వాలి. రాజ్యవృద్ధిని, ప్రతిష్ఠను, విజయాన్ని, ఆనందాభివృద్ధిని కోరేవారెవ్వరూ ఈ మర్యాదను ఎప్పుడూ ఉల్లంఘించరాదు.

పురుషార్థాలు

అలబ్ధం చైవ లిప్సేత లబ్ధం రక్షేత్ప్రయత్నతః ।
రక్షితం వర్ధయేచ్చైవ వృద్ధం పాత్రేషు నిఃక్షిపేత్ ॥ మను. 7-99 ॥

రాజు, రాజసభ తమకు లేనిదానిని పొందటానికి కోరాలి. లభించినదానిని ప్రయత్నంతో రక్షించాలి. రక్షించినదానిని వృద్ధిపరచాలి. వృద్ధిపరచిన ధనాన్ని వేదవిద్యలో, ధర్మప్రచారంలో విద్యార్థులను, వేదమార్గ ఉపదేశకులను, అసమర్థులైన అనాథలను పోషించటానికి ఉపయోగించాలి.

ఏతచ్చతుర్విధం విద్యాత్ పురుషార్థప్రయోజనమ్ ।
అస్య నిత్యమనుష్ఠానం సమ్యక్కుర్యాదతంద్రితః ॥ మను. 7-100 ॥

అలబ్ధమిచ్ఛేద్దండేన లబ్ధం రక్షేదవేక్షయా ।
రక్షితం వర్ధయేద్వృద్ధ్యా వృద్ధం దానేన నిఃక్షిపేత్ ॥ మను. 7-101 ॥

ఈ చతుర్విధ పురుషార్థ ప్రయోజనాలను గుర్తించాలి. సోమరితనాన్ని వీడి పురుషార్థాలను ప్రతినిత్యం చక్కగా అనుష్ఠించాలి.

అప్రాప్తమైన దానిని దండం- ధర్మం, న్యాయంతో పొందటానికి ప్రయత్నించాలి. లభించినదానిని ప్రతినిత్యం ప్రయత్నంతో రక్షించుకోవాలి. రక్షించినదానిని వడ్డీ వ్యాపారాలతో వృద్ధిపరచుకోవాలి. ఇలా వృద్ధిచెందిన ధనాన్ని పూర్వోక్తమార్గంలో వ్యయపరచాలి.

రాజు మాయాచారి కాగూడదు

అమాయయైవ వర్తేత న కథంచన మాయయా ।
బుధ్యేతారిప్రయుక్తాం చ మాయాన్నిత్యం స్వసంవృతః ॥ మను. 7-104 ॥

ఎవరితోనూ కపటంతో ప్రవర్తించరాదు. నిష్కపటంగా సదా ప్రవర్తించాలి. ప్రతినిత్యం తనను తాను రక్షించుకొంటూ శత్రువులు చేసే మోసాలను గుర్తిస్తూ వానిని తొలగించ ప్రయత్నించాలి.

నాస్య ఛిద్రం పరో విద్యాచ్ఛిద్రం విద్యాత్పరస్య తు ।
గూహేత్కూర్మ ఇవాంగాని రక్షేద్వివరమాత్మనః ॥ మను. 7-105 ॥

ఏ శత్రువు కూడ తన దోషాలను అంటే దుర్బలతను గుర్తించకుండునట్లు చేసి తాను స్వయంగా శత్రువు .యొక్క దోషాలను తెలుసుకొనుచుండాలి. తాబేలు తన అవయవాలను గుప్తంగా ఉంచుకొనునట్లే, శత్రువులు ప్రవేశించకుండా రహస్యద్వారాలను గుప్తంగా ఉంచాలి.

బకవచ్చింతయేదర్థాన్ సింహవచ్చ పరాక్రమేత్ ।
వృకవచ్చావలుంపేత శశవచ్చ వినిష్పతేత్ ॥ మను. 7-106 ॥

ధ్యానం- తపస్సులో ఉన్నట్లు నటిస్తూ కొంగ చేపలను పట్టుకోవటానికి పొంచి ఉన్నట్లుగా రాజు అర్థాన్ని సంగ్రహించ ఆలోచించాలి. ద్రవ్య పదార్థాలను, బలాన్ని పెంపొందించుకొని శత్రువును జయించటానికి సింహంలాగా పరాక్రమించాలి. చిరుతపులిలాగా దాగి శత్రువులను పట్టుకోవాలి. సమీపించిన బలాఢ్యుడైన శత్రువునుండి కుందేలులాగా దూరంగా పారిపోయి ఆ తర్వాత వారిని మోసగించి పట్టుకోవాలి.

దొంగలను వశపరచుకోవాలి

ఏవం విజయమానస్య యేఽ స్య స్యుః పరిపంథినః ।
తానానయేద్వశం సర్వాన్ సామాదిభిరుపక్రమైః ॥ మను. 7-107 ॥

యది తే తు న తిష్ఠేయురుపాయైః ప్రథమైస్త్రిభిః ।
దణ్డేనైవ ప్రసహ్యైతాంశ్చనకైర్వశమానయేత్ ॥ మను. 7-108 ॥

ఇలా విజయాన్ని పొందిన సభాపతియొక్క రాజ్యంలో దోపిడిగాండ్రు, బందిపోటుదొంగలుంటే వారిని, సామ = సామ (మంచి) వాక్కులతో తమలో చేర్చుకోవాలి. దాన = ఏదైనా ఇచ్చియు, భేద = వారిలో చీలికలు కలిగించైనా వశపర్చుకోవాలి. వీటితో వశం కాకపోతే అత్యంత కఠిన దండనతో వశపర్చుకోవాలి.

యథోద్ధరతి నిర్దాతా కక్షం ధాన్యం చ రక్షతి ।
తథా రక్షేన్నృపో రాష్ట్రం హన్యాచ్చ పరిపంథినః ॥ మను. 7-110 ॥

ధాన్యాన్ని సేకరించేవారు పొట్టును, తాలును వేరుచేసి బియ్యాన్ని విరుగకుండా రక్షించేటట్లు రాజు కూడా దోపిడిదొంగలను చంపి లేదా దూరంచేసి రాజ్యాన్ని రక్షించాలి

ప్రజలను పీడింపరాదు

మోహాద్రాజా స్వరాష్ట్రం యః కర్షయత్యనవేక్షయా ।
సోఽ చిరాద్భ్రశ్యతే రాజ్యాజ్జీవితాచ్చ సబాంధవః ॥ మను. 7-111 ॥

మోహంవలన, ఆలోచించక చేసే పనులవలన రాజ్యాన్ని దుర్బలపర్చే రాజు తాను బంధువులతోపాటు జీవితం నుండీ, రాజ్యం నుండీ భ్రష్టుడవుతాడు.

శరీరకర్షణాత్ప్రాణాః క్షీయంతే ప్రాణినాం యథా ।
తథా రాజ్ఞామపి ప్రాణాః క్షీయంతే రాష్ట్రకర్షణాత్ ॥ మను. 7-112 ॥

శరీరాలను కృశింపచేయటంవలన ప్రాణులయొక్క ప్రాణాలు క్షీణించునట్లు ప్రజలను దుర్బలపరచినచో రాజుతోపాటు అతని ప్రాణాలైన సైన్యాదిబలం కూడా బంధుసహితంగా నష్టమవుతుంది.

శాసన పద్ధతి

రాష్ట్రస్య సంగ్రహే నిత్యం విధానమిదమాచరేత్ ।
సుసంగృహీతరాష్ట్రో హి పార్థివః సుఖమేధతే ॥ మను. 7-113 ॥

కాబట్టి రాజు మరియు రాజసభ యథావిధిగా రాజ్యకార్యాలు నెరవేరేటట్లు ప్రయత్నించాలి. రాజ్యాన్ని పరిపాలించటానికి సర్వవిధాల తత్పరుడైన రాజుకు సదా సౌఖ్యాభివృద్ధి కలుగుతుంది.

ద్వయోస్త్రయాణాం పంచానాం మధ్యే గుల్మమధిష్ఠితమ్ ।
తథా గ్రామశతానాం చ కుర్యాద్రాష్ట్రస్య సంగ్రహమ్ ॥ మను. 7-114 ॥

కాబట్టి రెండు, మూడు, అయిదు, వంద గ్రామాల మధ్య ఒక రాజ్యస్థాపన ఏర్పరచి అందులో అర్హత కలవారిని, చక్కగా కార్యాలను చేసేవారిని భృత్యులుగా, రాజపురుషులుగా నియమించి సమస్త రాచకార్యాలను పూర్తిచేయాలి.

గ్రామస్యాధిపతిం కుర్యాద్దశగ్రామపతిం తథా ।
వింశతీశం శతేశం చ సహస్రపతిమేవ చ ॥ మను. 7-115 ॥

ఒక్కొక్క గ్రామంలో ఒక్కొక్క ప్రధానపురుషుని ఉంచాలి. ఇలా పది గ్రామాలకు రెండవ ప్రధానపురుషుని, ఇలా ఇరవై గ్రామాలకు మూడవ ప్రధానపురుషుని, ఇలా వందగ్రామాలకు నాల్గవ అధికారిని, ఇలా వేయి గ్రామాలకు ఐదవ అధికారిని నియమించాలి. ఉదాహరణకు నేడు ఒక గ్రామానికి ఒక పట్వారి, అట్టి పది గ్రామాలకు ఒక పోలీసు కార్యాలయం, ఇలా రెండు పోలీసు కార్యాలయాలకు ఒక తహసీల్లు కార్యాలయం, ఇలా పది తహసీలు కార్యాలయాలకు ఒక జిల్లా ఏర్పరచబడింది. ఈ పద్ధతి మన మనుధర్మశాస్త్రాలనుండి గ్రహించిన రాజనీతి విధానమే.

గ్రామదోషాన్ సముత్పన్నాన్ గ్రామికః శనకైః స్వయమ్ ।
శంసేద్గ్రామదశేశాయ దశేశో వింశతీశినే ॥ మను. 7-116 ॥

వింశతీశస్తు తత్సర్వం శతేశాయ నివేదయేత్ ।
శంసేద్గ్రామశతేశస్తు సహస్రపతయే స్వయమ్ ॥ మను. 7-117 ॥

ఇదేవిధంగా ఒక్కొక్క గ్రామాధిపతి ప్రతినిత్యం గ్రామంలో జరిగే దోషాలను రహస్యంగా దశ

గ్రామాల అధికారికి తెలిపేలా వ్యవస్థను చేయాలి. అతడు ఆ పది గ్రామాల సమాచారాన్ని ప్రతిదినం ఇరవై గ్రామాల అధికారికి తెలియచేయాలి. ॥ 116 ॥

ఇలాగే ఇరవై గ్రామాల సంగతులను ప్రతిదినం ఇరవై గ్రామాల అధికారి శతగ్రామాధిపతికి తెలపాలి. ఇలాగే శతగ్రామాధిపతి సహస్రగ్రామాధిపతికి శతగ్రామాలలోని విషయాలను తెలపాలి. సహస్ర గ్రామాధిపతి దశసహస్రగ్రామాధిపతికి, అతడు లక్షగ్రామాలకు అధికారి అయిన రాజ్యసభకు ప్రతినిత్యం వర్తమాన విషయాలను తెలుపాలి. ఈ రాజ్యసభలన్నీ మహారాజ్యసభకు అంటే సార్వభౌమాధికారం గల చక్రవర్తికి సమస్తభూగోళపు సమాచారాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలి. ॥ 117 ॥

తేషాం గ్రామ్యాణి కార్యాణి పృథక్కార్యాణి చైవ హి ।
రాజ్ఞోఽన్యః సచివః స్నిగ్ధస్తాని పశ్యేదతంద్రితః ॥ మను. 7-120 ॥

పదివేల గ్రామాలకు ఇద్దరు చొప్పున సభాపతులను నియమించాలి. వీరిలో ఒకడు రాజసభను, రెండవవాడు సమస్త న్యాయాధీశాది రాజపురుషుల కార్యాలను సదా సోమరితనాన్ని వదిలి సంచరిస్తూ చూస్తుండాలి.

నగరే నగరే చైకం కుర్యాత్సర్వార్థ చింతకమ్ ।
ఉచ్చైః స్థానం ఘోరరూపం నక్షత్రాణామివ గ్రహమ్ ॥ మను. 7-121 ॥

పెద్ద నగరాలలో ఒక్కొక్క విచారణ సభకు సుందర గృహాన్ని నిర్మించాలి. అది ఉన్నతంగా విశాలంగా నక్షత్రాలలో చంద్రునిలాగా ప్రకాశమైనదిగా ఉండాలి. అందులో సర్వవిద్యా పరీక్షలను చేసే విద్యావృద్ధులు కూర్చొని ఆ యా విషయాలను ఆలోచించాలి. వీరు రాజుకు, ప్రజలకు ఉన్నతిని కలిగించేటట్లు నియమాలను చేస్తూ విద్యను ప్రకాశింపజేయాలి.

స తానను పరిక్రామేత్సర్వానేవ సదా స్వయమ్ ।
తేషాం వృత్తం పరిణయేత్సమ్యగ్రాష్ట్రేషు తచ్చరైః ॥ మను. 7-122 ॥

ప్రతిదినం సంచరించేటట్టి సభాపతి తన అధీనంలో విభిన్నవర్గాలకు చెందిన గూఢచారులను దూతలుగా నియమించుకోవాలి. వీరి ద్వారా సమస్త రాజపురుషుల యొక్క ప్రజలయొక్క గుణదోషాలను రహస్యంగా తెలుసుకోవాలి. అపరాధాలు చేసినవారిని దండిస్తూ, సుగుణాలున్నవారిని సన్మానించాలి.

రాజ్ఞో హి రక్షాధికృతాః పరస్వాదాయినః శఠాః ।
భృత్యా భవంతి ప్రాయేణ తేభ్యో రక్షేదిమాః ప్రజాః ॥ మను. 7-123 ॥

రాజు ఎవరికి ప్రజలను రక్షించే అధికారం ఇస్తారో వారు ధార్మికులు, సుపరీక్షితులైన విద్వాంసులు, ఉత్తమ వర్ణసులు ఉండాలి. వీరి అధీనంలో తరచుగా శఠులను, పరవస్తువులను అపహరించే చోరులను, దోపిడిగాండ్రను కూడా నౌకరులుగా ఉంచి వారిని దుష్కర్మలనుండి రక్షించటానికి

రాజభృత్యులుగా చేయాలి. అంతేకాక వారిని విద్వాంసులైన రక్షణాధికారుల ఆధీనంలో ఉంచి వారినుండి ప్రజలను యథారీతిగా రక్షించాలి.

యే కార్యి కేభ్యోఽ ర్థమేవ గృహ్ణీయుః పాపచేతసః ।
తేషాం సర్వస్వ మాదాయ రాజా కుర్యాత్ప్రవాసనమ్ ॥ మను. 7-124 ॥

వాది ప్రతివాదుల నుండి గుప్తధనం తీసుకొని పక్షపాతంతో అన్యాయం చేసే రాజపురుషుల యొక్క సర్వస్వాన్నీ లాక్కొని యథాయోగ్యంగా దండనవిధించి, మళ్లీ తిరిగి రాజానంత దూర ప్రదేశంలో వారిని వదిలివేయాలి. ఇలా వారికి శిక్ష విధిస్తే వారిని చూసి ఇతర రాజపురుషులు కూడా అలాంటి దుష్కార్యాలను చేయరు. దండిస్తేనే వారు రక్షింపబడుతారు. ఆ రాజపురుషులు యోగ క్షేమాలతో ధనం కలిగి ఉండే విధంగా కావలసిన ధనాన్ని, భూమిని రాజ్యం నుండి వారికి ఇవ్వాలి. అది మాసిక రూపంగానో, వార్షికంగానో, ఒకేసారిగానో వారికి లభించాలి. వృద్ధులైనవారికి కూడా సగం జీతం లభించాలి. ఇది వారు జీవించినంతవరకే లభించి తర్వాత ఆపివేయబడేటట్లు శ్రద్ధ వహించాలి. వారి సంతానానికి వారి వారి గుణాలను అనుసరించి సత్కారం చేయటం లేదా ఉద్యోగ మిచ్చి ఆదరించేలా చూడడం చేయాలి. వారి పిల్లలు సమర్థులైయ్యేంత వరకు, వారి భార్యలు జీవించినంతవరకు, అందరికీ వారి యోగ్యతానుసారంగా రాజునుండి ధనం లభించాలి. వారి భార్యలు, పిల్లలు చెడ్డవారైతే వారికి ఏ సహాయమూ లభించకూడదు. ఇలాంటి నీతిని రాజు సదా అవలంబించాలి.

పన్నులు గ్రహించే విధానం

యథా ఫలేన యుజ్యేత రాజా కర్తా చ కర్మణామ్ ।
తథాఽ వేక్ష్య నృపో రాష్ట్రే కల్పయేత్సతతం కరాన్ ॥ మను. 7 - 128 ॥

రాజు, కార్యకర్తలైన రాజపురుషులు, ప్రజలును సుఖస్వరూపఫలంతో కూడి ఉండేటట్లు ఆలోచించి, రాజు మరియు రాజసభ రాజ్యంలో పన్నులను విధించుకోవాలి.

యథాల్పాఽ ల్పమదన్త్యాఽ ద్యం వార్యోకోవత్సషట్పదాః ।
తథాఽ ల్పాఽ ల్పో గ్రహీతవ్యో రాష్ట్రాద్రాజ్ఞాబ్దికః కరః ॥ మను. 7-129 ॥

జలగ, దూడ, తుమ్మెద భోజ్య పదార్థాలను కొద్ది కొద్దిగా భుజించునట్లు రాజు ప్రజలనుండి అతి స్వల్పంగా వార్షిక పన్ను తీసుకోవాలి.

నోచ్ఛిన్ద్యాదాత్మనో మూలం పరేషాం చాతితృష్ణయా ।
ఉచ్ఛిందన్హ్యాత్మనో మూలమాత్మానం తాంశ్చ పీడయేత్ ॥ మను. 7-130 ॥

మిక్కిలి లోభంతో తన మరియు ఇతరుల సుఖమూలాన్ని ఎప్పుడూ విచ్ఛిన్నం అంటే నష్టపరచరాదు. ఎందుకంటే! సుఖమూలాన్ని ఛేదించే కార్యవ్యవహారం తనకూ, ఇతరులకూ బాధనే కలిగిస్తుంది.

తీక్ష్ణశ్చైవ మృదుశ్చ స్యాత్కార్యం వీక్ష్య మహీపతిః ।
తీక్ష్ణశ్చైవ మృదుశ్చైవ రాజా భవతి సమ్మతః ॥ మను. 7-140 ॥

కార్యాణుగునంగా తీక్ష్ణుడు మరియు, కోమలుడైనట్టి రాజు దుష్టులకు తీక్ష్ణుడుగా, శ్రేష్ఠులకు కోమలుడుగానైన మిక్కిలి గౌరవనీయుడవుతాడు.

ఏవం సర్వం విధాయేదమితి కర్తవ్యమాత్మనః ।
యుక్త శ్చైవాప్రమత్తశ్చ పరిరక్షేదిమాః ప్రజాః ॥ మను. 7-142 ॥

ఈ విధంగా రాజ్యంలో ఆ యా ఏర్పాట్లు చేసి సదా వాటికి తగినట్లుగా, ఎలాంటి పొరపాట్లు జరుగకుండునట్లుగా ప్రజలను నిరంతరం పాలించాలి.

విక్రోశన్త్యో యస్య రాష్ట్రాద్ధ్రియంతే దస్యుభిః ప్రజాః
సంపశ్యతః సభృత్యస్య మృతః స న తు జీవతి ॥ మను. 7-143 ॥

భృత్యులతో పాటు రాజు చూస్తుండగా ప్రజల పదార్థాలను, ప్రాణాలను, దొంగలు అపహరించినట్లైతే అలాంటి రాజు భృత్యామాత్య (సేవకులు మరియు మంత్రులు) సహితంగా బ్రతికి ఉండియూ మరణించినవారితో సమానుడని తెలుసుకోవాలి. అట్టి రాజు మహాదుఃఖాన్ని పొందుతాడు.

క్షత్రియస్య పరో ధర్మః ప్రజానామేవ పాలనమ్ ।
నిర్దిష్టఫలభోక్తా హి రాజా ధర్మేణ యుజ్యతే ॥ మను. 7-144 ॥

కాబట్టి, ప్రజలను పాలించటమే రాజుల పరమధర్మం. మనుస్మృతి సప్తమాధ్యాయంలో వ్రాయబడినట్లు సభ నియమించిన విధంగా పన్నును తీసుకొనే రాజు ధర్మయుక్తుడై సుఖాన్ని పొందుతాడు. దీనికి విరుద్ధంగా చేసే రాజు దుఃఖాన్ని అనుభవిస్తాడు.

రాజు దినచర్య

ఉత్థాయ పశ్చిమే యామే కృతశౌచః సమాహితః ।
హుతాగ్నిర్బ్రాహ్మణాంశ్చార్చ్య ప్రవిశేత్స శుభాం సభామ్ ॥ మను. 7-145 ॥

జాము రాత్రి ఉండగానే మేల్కొని, శౌచాది కాలకృత్యాలను తీర్చుకొని, సావధానుడై పరమేశ్వర ధ్యానం, అగ్నిహోత్రం, ధార్మికవిద్వాంసుల సత్కారం మొదలైన వాటిని చేయాలి. ఆ తరువాత భుజించి సభలో ప్రవేశించాలి.

మంత్రాలోచన చేసే విధానం

తత్ర స్థితః ప్రజాః సర్వాః ప్రతినంద్య విసర్జయేత్ ।
విసృజ్య చ ప్రజాః సర్వా మంత్రయేత్సహమంత్రిభిః ॥ మను. 7-146 ॥

ఆ సభలోకి వచ్చిన ప్రజలను గౌరవించాలి. తర్వాత వారిని పంపించి ముఖ్యమంత్రితో రాజ్యకార్యాలను గురించి ఆలోచించాలి.

గిరిపృష్ఠం సమారుహ్య ప్రాసాదం వా రహోగతః ।
అరణ్యే నిఃశలాకే వా మంత్రయేదవిభావితః ॥ మను. 7-147 ॥

ఆ తరువాత ముఖ్యమంత్రితో కలిసి వెళ్ళి పర్వతశిఖరంలో గాని, ఏకాంతమందిరంలో గాని, అడవిలో మానవులెవ్వరూ లేని ఏకాంతప్రదేశంలో గాని కూర్చొని విరుద్ధ అభిప్రాయాలను విడిచి అతనితో ఆలోచించాలి.

యస్య మంత్రం న జానంతి సమాగమ్య పృథగ్జనాః ।
స కృత్స్నాం పృథివీం భుంక్తే కోశహీనోఽపి పార్థివః ॥ మను. 7-148 ॥

ఏ రాజుయొక్క గంభీర ఆలోచనలను ఇతర ప్రజలు కలిసి తెలుసుకోలేరో అంటే ఎవరి ఆలోచనలు గంభీరాలై, పవిత్రాలై, పరోపకారార్థాలై సదా గుప్తంగా ఉంటాయో అలాంటి రాజు ధనహీనుడైనా, పృథ్వీపై గల సమస్త రాజ్యాలను పాలించే సమర్థుడు. కాబట్టి సభాసదుల అనుమతి లేకుండా తనంతట తాను ఏ కార్యాన్నీ చేయరాదు.

సంధి విగ్రహాది ఉపాయాలు

ఆసనం చైవ యానం చ సంధి విగ్రహమేవ చ ।
కార్యం వీక్ష్య ప్రయుంజీత ద్వైధం సంశ్రయమేవ చ ॥ మను. 7-161 ॥

'ఆసనం' = స్థిరత్వం; యానం = శత్రువులతో యుద్ధం చేయటానికి వెళ్ళటం; సంధి = వారితో స్నేహం చేయటం; విగ్రహం = దుష్టులైన శత్రువులతో పోట్లాడటం; ద్వైధం = తన సైన్యాన్ని రెండు భాగాలుగా చేసి విజయాన్ని పొందటం; సంశ్రయం = తాను బలహీనుడైనపుడు ప్రబలుడైన ఇతర రాజును ఆశ్రయించటం' అనే ఈ ఆరువిధాలైన కర్మలను ఆలోచించి వాటిలో తగినదానిని చేయటం సమస్త రాజాది రాజపురుషులు లక్ష్యమందుంచుకోదగిన విషయం.

సంధిం తు ద్వివిధం విద్యాద్రాజా విగ్రహమేవ చ ।
ఉభే యానాసనే చైవ ద్వివిధః సంశ్రయః స్మృతః ॥ మను. 7-162 ॥

'సంధి విగ్రహం, యానం, ఆసనం, ద్వైధీభావం, సంశ్రయం' అనే ఈ ఆరు రెండు-రెండు విధాలుగా ఉంటాయి. దీనిని రాజు యథారీతిగా తెలుసుకోవాలి.

సమానయానకర్మా చ విపరీతస్తథైవ చ ।
తదా త్వాయతిసంయుక్తః సంధిర్జ్ఞేయో ద్విలక్షణః ॥ మను. 7-163 ॥

సంధి:- శత్రువులతో స్నేహం చేయటం లేక వారితో విరుద్ధంగా ఉంటూ వర్తమానంలో, భవిష్యత్కాలంలో చేయవలసిన కార్యాలను విడువకుండా చేయటం. ఇలా సంధి రెండు విధాలుగా చెప్పబడింది.

స్వయం కృతశ్చ కార్యార్థమకాలే కాల ఏవ వా ।
మిత్రస్య చైవాపకృతే ద్వివిధో విగ్రహః స్మృతః ॥ మను. 7-164 ॥

విగ్రహం:- కార్యసిద్ధికై ఉచిత, అనుచిత సమయాలలో తాను స్వయంగా విరోధం చేయటం, మిత్రునికి అపకారము చేయు శత్రువుతో విరోధము చేయుట అని రెండు విధాలు.

ఏకాకినశ్చాత్యయికే కార్యే ప్రాప్తే యదృచ్ఛయా ।
సంహతస్య చ మిత్రేణ ద్వివిధం యానముచ్యతే ॥ మను. 7-165 ॥

యానం:- అకస్మాత్తుగా ఏదైనా కార్యం సంభవించినపుడు, 'ఏకాకిగా గాని, మిత్రునితో కలిసిగాని, శత్రువుపై దండెత్తటం' అని యానం రెండు విధాలుగా చెప్పబడింది.

క్షీణస్య చైవ క్రమశో దైవాత్పూర్వకృతేన వా ।
మిత్రస్య చానురోధేన ద్వివిధం స్మృతమాసనమ్ ॥ ॥ మను. 7-166 ॥

ఆసనం:- తాను ఏ కారణంతోనైనా 'క్రమంగా క్షీణించి నిర్బలుడైనపుడు గాని, మిత్రునితో అడ్డగింపబడినపుడు' గాని తన స్థానంలో స్థిరంగా ఉండటం అని 'ఆసనం' రెండు విధాలు.

బలస్య స్వామినశ్చైవ స్థితిః కార్యార్థ సిద్ధయే ।
ద్వివిధం కీర్త్యతే ద్వైధం షాడ్గుణ్యగుణవేదిభిః ॥ మను. 7-167 ॥

ద్వైధం:- 'కార్యసిద్ధికై సేనాపతులను, సైన్యాన్ని రెండు భాగాలుగా చేసి విజయాన్ని సాధించటం' అని ద్వైధం రెండు విధాలు.

అర్థసంపాదనార్థం చ పీడ్యమానః సః శత్రుభిః ।
సాధుషు వ్యపదేశార్థం ద్వివిధః సంశ్రయః స్మృతః ॥ మను. 7-168 ॥

సంశ్రయ:- ఏదైనా ప్రయోజనాన్ని సిద్ధింపజేసుకోవటానికి, 'బలాఢ్యుడైన రాజునో లేక ఒకానొక మహాత్మునినో శత్రువుతో పీడింపబడకుండేటట్లు శరణువేడటం' అని సంశ్రయం రెండు విధాలు.

యదావగచ్ఛేదాయత్యామాధిక్యం ధ్రువమాత్మనః ।
తదా త్వేచాల్పికాం పీడాం తదా సంధిం సమాశ్రయేత్ ॥ మను. 7-169 ॥

ఇప్పుడే యుద్ధం చేస్తే నష్టం కలుగుతుందని, తర్వాత యుద్ధం చేస్తే తనకు వృద్ధి, విజయప్రాప్తి కలుగుతుందనీ తెలిసినపుడు శత్రువుతో సంధి చేసుకొని తగిన సమయంవరకు ధైర్యంగా ఉండాలి.

యదా ప్రహృష్టా మన్యేత సర్వాస్తు ప్రకృతీర్భృశమ్ ।
అత్యుచ్ఛ్రితం తథాత్మానం తదా కుర్వీత విగ్రహమ్ ॥ మను. 7-170 ॥

తాను, తన ప్రజలు, తన సేనయు అత్యంత ప్రసన్నులుగా, ఉన్నతశీలురుగా, శ్రేష్ఠులుగా ఉన్నారని తెలిసినపుడే శత్రువుతో యుద్ధం చేయాలి.

యదా మన్యేత భావేన హృష్టం పుష్టం బలం స్వకమ్ ।
పరస్య విపరీతం చ తదా యాయాద్రిపుం ప్రతి ॥ మను. 7-171 ॥

తన బలం - సైన్యం హర్షం, పుష్టి కలిగి ప్రసన్నంగా ఉన్నదనీ, శత్రుబలం తన కంటే దుర్బలంగా ఉన్నదనీ తెలిసినప్పుడే శత్రువుపైకి యుద్ధానికి పోవాలి.

యదా తు స్యాత్పరిక్షీణో వాహనేన బలేన చ ।
తదాసీత ప్రయత్నేన శనకైః సాంత్వయన్నరీన్ ॥ మను. 7-172 ॥

సైన్యంలో వాహనబలం క్షీణించినపుడు శత్రువును మెల్లమెల్లగా ప్రయత్నంతో శాంతపరుస్తూ తన స్థానంలోనే స్థిరంగా ఉండాలి.

మన్యేతారిం యదా రాజా సర్వథా బలవత్తరమ్ ।
తదా ద్విధా బలం కృత్వా సాధయేత్కార్య మాత్మనః ॥ మను. 7-173 ॥

శత్రువు అత్యంత బలాఢ్యుడని రాజు తెలుసుకొన్నప్పుడు, సైన్యాన్ని ద్విగుణంగా గాని ద్వివిధాలుగా గాని చేసి తన కార్యాన్ని సాధించాలి.

యదా పరబలానాం తు గమనీయతమో భవేత్ ।
తదా తు సంశ్రయేత్ క్షిప్రం ధార్మికం బలినం నృపమ్ ॥ మను. 7-174 ॥

అతి త్వరలో శత్రువు తనపై దండెత్తి వస్తారని తెలియగానే ధార్మికుడు, బలాఢ్యుడైన ఒక రాజును త్వరగా ఆశ్రయించాలి.

నిగ్రహం ప్రకృతీనాం చ కుర్యాద్యోఽరిబలస్య చ ।
ఉపసేవేత తం నిత్యం సర్వయత్నైర్గురుం యథా ॥ మను. 7-175 ॥

శత్రుబలాన్ని నిగ్రహించి అంటే అడ్డగించి ఆపిన తన ప్రజలను, సైన్యాన్ని అన్ని విధాల గురువులాగా భావించి నిత్యం సేవ చేయాలి.

యది తత్రాపి సంపశ్యేద్దోషం సంశ్రయకారితమ్ ।
సుయుద్ధమేవ తత్రాఽపి నిర్విశంకః సమాచరేత్ ॥ మను. 7-176 ॥

ఆశ్రయమిచ్చిన స్థలాలలోనూ దోషాలు కనిపిస్తే అక్కడ కూడా నిశ్శంకతో బాగా పోట్లాడాలి, అంటే చక్కదిద్దాలి.

ధార్మికుడైన రాజుతో ఎప్పుడునూ యుద్ధం చేయరాదు. అతనితో ఎల్లప్పుడు స్నేహాన్నే చేయాలి. రాజు, దుష్టుడు, ప్రబలుడైనప్పుడు పూర్వోక్త ఉపాయాలతో వానిని జయించటానికి ప్రయత్నించాలి.

మిత్రులను, తటస్థులను, శత్రువులను ఎలా చూడాలి?

సర్వోపాయై స్తథా కుర్యాన్నీతిజ్ఞః పృథివీపతిః ।
యథాస్యాభ్యధికా న స్యుర్మిత్రోదాసీనశత్రవః ॥ మను. 7-177 ॥

రాజనీతిని తెలిసిన పృథివీపతియైన రాజు తనకు మిత్రులు, తటస్థులు, శత్రువులు తనకంటే అధికులు కాకుండునట్లు అనేక ఉపాయాలతో మెలగాలి.

ఆయతిం సర్వకార్యాణాం తదాత్వం చ విచారయేత్ ।
అతీతానాం చ సర్వేషాం గుణదోషౌ చ తత్త్వతః ॥ మను. 7-178 ॥

వర్తమాన కాలంలో చేస్తున్న, భవిష్యత్తులో చేయవలసిన, భూతకాలంలో చేసిన సమస్త కార్యాలనూ, వానిలోగల యథార్థమైన గుణదోషాలనూ ఆలోచించాలి.

ఆయత్యాం గుణదోషజ్ఞ స్తదాత్వే క్షిప్రనిశ్చయః ।
అతీతే కార్యశేషజ్ఞః శత్రుభిర్నాభిభూయతే ॥ మను. 7-179 ॥

దోషనివారణకు, గుణాల స్థిరతకు వేగంగా ప్రయత్నించాలి. భావికాలంలో చేయవలసిన కార్యాలలోని గుణదోషాలను తెలుసుకొంటూ, చేసిన కార్యాలలో శేషించిన కర్తవ్యాలను తెలుసుకొంటూ ఉంటే రాజు శత్రువులతో ఎన్నడూ పరాజితుడు కాడు.

యథైనం నాభిసందధ్యుర్మిత్రోదాసీనశత్రవః ।
తథా సర్వం సంవిదధ్యాదేష సామాసికో నయః ॥ మను. 7-180 ॥

మిత్రులను, తటస్థులను, శత్రువులను అన్యథా ప్రవర్తించకుండా ఉండునట్లు దూతలను విశేషించి సభాపతిని రాజు వశపర్చుకోవాలి. ఏ మోహంలోనూ చిక్కరాదు. ఇదేసంక్షేపంగా న్యాయం- రాజనీతి.

దాడిచేయుటానికి పూర్వ కర్తవ్యాలు

కృత్వా విధానం మూలేతు యాత్రికం చ యథావిధి ।
ఉపగృహ్యాస్పదం చైవ చారాన్ సమ్యగ్విధాయ చ ॥ మను. 7-184 ॥

శత్రువుతో యుద్ధానికి పోయేటపుడు రాజు తన రాజ్యరక్షణకు ఏర్పాట్లు చేసి, దండయాత్రకు కావలసిన సమస్త వస్తు సామగ్రిని సమకూర్చుకొని, సర్వసైన్యాలను, వాహనాలను, శస్త్రాలను సమృద్ధిగా తీసుకొని నలువైపులనుండి సమాచారాలను తెచ్చే సమర్థులైన దూతలను రహస్యంగా నియమించిన తర్వాతనే శత్రువుపైకి యుద్ధానికి పోవాలి.

సంశోధ్య త్రివిధం మార్గం షడ్విధం చ బలం స్వకమ్ ।
సాంపరాయికకల్పేన యాయాదరిపురం శనైః ॥ మను. 7-185 ॥

స్థల(భూమి)మార్గం, జల మార్గం, వాయుమార్గం అనే మూడువిధాల మార్గాలను బాగు చేయించి స్థలమార్గంలో రథాలను, అశ్వాలను, గజాలను; జలమార్గంలో నౌకలను, ఆకాశమార్గంలో విమానాది ప్రయాణసాధనాలను తీలుసుకొనిపోవాలి. కాల్బలాన్ని, రథాలను, గజాలను, తురగాలను, శస్త్రాస్త్రాలను ఆహార పానీయాది పదార్థాలను వెంట ఉంచుకోవాలి. పూర్ణబలాన్ని తీసుకొని ఏదో ఒక నిమిత్తాన్ని తెలిపి నగరానికి దగ్గరగా మెల్ల మెల్లగా పోవాలి.

శత్రుసేవిని మిత్రే చ గూఢే యుక్తతరో భవేత్ ।
గతప్రత్యాగతే చైవ స హి కష్టతరో రిపుః ॥ మను. 7-186 ॥

శత్రువుతో ఆంతరంగికంగా కలిసియుండి, తనతో పైకి మిత్రునివలె ఉంటూ, రహస్యంగా శత్రువులకు సమాచారాలను చేరవేసేవారి రాకపోకలను కనిపెడుతూ ఉండాలి. వారితో మాట్లాడినప్పుడు మిగుల జాగ్రత్తగా సావధానులుగా ఉండాలి. లోపల శత్రువుగా పైకి మిత్రుడుగా ఉ ండే పురుషుడే గొప్ప శత్రువని తెలుసుకోవాలి.

వ్యూహరచన

దండవ్యూహేన తన్మార్గం యాయాత్తు శకటేన వా ।
వరాహమకరాభ్యాం వా సూచ్యా వా గరుడేన వా ॥ మను. 7-187 ॥

రాజపురుషులందరికీ యుద్ధవిద్యను నేర్పించాలి. తాను కూడా నేర్చుకోవాలి. ఇతర ప్రజలకు నేర్పించాలి. పూర్వశిక్షితులైన యోధులే చక్కగా యుద్ధం చేస్తూ, చేయించాలి. శిక్షణ నిచ్చునపుడు దండవ్యూహం = దండంలాగా; శకటేన = శకటం అనగా బండిలాగా; వరాహ = ఒకదాని వెనుక ఒకటి పరుగెత్తుతూ, మరొకప్పుడు అన్నీ కలిసి గుంపుగా ఏర్పడు పందులలాగా; మకర = నీటిలో మొసలి పోవునట్లు, సైన్యాన్ని ఏర్పర్చుకోవాలి; సూచీవ్యూహ = అగ్రభాగంలో సూక్ష్మంగా ఉండి రాను రాను పై భాగం సూదిలాగా స్థూలంగా సైన్యముండేలాగా శిక్షణనివ్వాలి. గరుడపక్షిలాగా పైకి, క్రిందకు ఆక్రమణ చేసేటట్లు స్యైన్యాన్ని సిద్ధంచేసి యుద్ధం చేయటానికి నేర్పించాలి.

యతశ్చ భయమాశంకేత్తతో విస్తారయేత్ బలమ్ ।
పద్మేన చైవ వ్యూహేన నివిశేత సదా స్వయమ్ ॥ మను. 7-188 ॥

ఏ పైపు భయం తోచునో ఆ వైపు సైన్యాన్ని విస్తరింపజేయాలి. సేనాధిపతులనందరినీ నాలుగువైపులందుంచి పద్మవ్యూహం - పద్మాకారంలాగా నాలుగువైపుల సైన్యాన్ని పెట్టి మధ్యలో తానుండాలి.

సేనాపతిబలాధ్యక్షౌ సర్వదిక్షు నివేశయేత్ ।
యతశ్చ భయమాశంకేత్ ప్రాచీం తాం కల్పయేద్దిశమ్ ॥ మను. 7-189 ॥

ఆజ్ఞల నిస్తూ, సైన్యంతో పాటు తాను కూడా యుద్ధం చేస్తూ, చేయించేట్టి వీరులైన సేనాపతులను సైన్యాధ్యక్షులను ఎనిమిదిదిక్కులలో ఉంచాలి. యుద్ధం జరుగు దిక్కునకే సమస్త సైన్యం యొక్క ముఖం ఉంచాలి. ఇతర దిశలలోనూ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి. అలా కాకపోతే వెనుకనుండో, ప్రక్కలనుండో శత్రువులు దెబ్బతీయటం సంభవిస్తుంది.

గుల్మాంశ్చ స్థాపయేదాప్తాన్ కృతసంజ్ఞాన్ సమంతతః ।
స్థానే యుద్ధే చ కుశలానభీరూనవికారిణః ॥ మను. 7-190 ॥

గుల్మం అంటే దృఢస్తంభాలవంటివారు, యుద్ధవిద్యలో సుశిక్షితులు, ధార్మికులు, స్థిరులు, యుద్ధం చేయటంలో దక్షులు, భయరహితులు, మనస్సులో ఎలాంటి వికారాన్ని పొందనివారు అయిన వీరులను సైన్యానికి నలుదిక్కుల నిలపాలి.

సంహతాన్ యోధయేదల్పాన్ కామం విస్తారయేద్బహూన్ ।
సూచ్యా వజ్రేణ చైవైతాన్ వ్యూహేన వ్యూహ్య యోధయేత్ ॥ మను. 7-191 ॥

అనేకులతో కొద్దిమంది యుద్ధంచేయవలసి వస్తే కలిసి యుద్ధం చేయాలి. అవసరమయితే శీఘ్రంగా వారితో యుద్ధక్షేత్రంలో విస్తరింపజేయాలి. నగరంలో గాని, దుర్గంలో గాని, శత్రుసేనలో గాని ప్రవేశించి యుద్ధం చేయవలసి 14 ఖండిస్తూ వచ్చినపుడు సూచీవ్యూహం పన్నాలి. లేదా రెండువైపుల ఖడ్గంలాగా వజ్రవ్యూహాన్ని ఏర్పరచి యుద్ధం చేస్తూ ప్రవేశిస్తుండాలి. ఇలా అనేక రకాలైన వ్యూహాలను నిర్మిస్తూ యుద్ధం చేయాలి. ఎదుట శతఘ్ని - ఫిరంగి గాని, భుశుండీ - తుపాకి గాని ప్రేలుతుంటే సర్పవ్యూహం - సర్పంలాగా క్రింద పండుకొని ప్రాకుతూపోవాలి. ఫిరంగులు సమీపించునపుడు వాటిని ప్రయోగించేవారిని కొట్టీ, బంధించీ, ఆ ఫిరంగుల ముఖాలను శత్రువులపైకి మరల్చి ఆ ఫిరంగులతోనే లేక ఆ తుపాకులతోనే శత్రువులను చంపాలి. లేదా వృద్ధులైనవారిని గుఱ్ఱాలపై స్వారీచేయించి ఆ ఫిరంగులముందు పరుగెత్తిస్తూ శత్రువులను చంపాలి. మధ్య మధ్యలో మంచి అశ్వారోహకులనుంచి ఒకేసారి దాడిచేసి శత్రుసైన్యాన్ని ఛిన్నాభిన్నంచేసి పట్టుకోవాలి లేదా పారద్రోలాలి.

స్యందనాశ్వైః సమే యుధ్యేదనూపే నౌద్విపైస్తథా ।
వృక్షగుల్మావృతే చాపైరసిచర్మాయుధైః స్థలే ॥ మను. 7-192 ॥

సమభూమిలో యుద్ధం చేయవలసి వస్తే రథ, అశ్వ, పదాతులతోనూ, సముద్రంలో నౌకలతోనూ, కొద్దిపాటి జలంలోనైనచో, ఏనుగులతోనూ, వృక్షాలపైనా, పొదలమాటున బాణాలతోనూ, ఇసుకప్రాంతాలలో కత్తులు, డాలులతోనూ యుద్ధంచేస్తూ, చేయించాలి.

ప్రహర్షయేద్బలం వ్యూహ్య తాంశ్చ సమ్యక్ పరీక్షయేత్ ।
చేష్టాశ్చైవ విజానీయాదరీన్ యోధయతామపి ॥ మను. 7-194 ॥

యుద్ధసమయంలో యుద్ధం చేసేవారిని ఉత్సాహపరుస్తూ, సంతోషపెట్టాలి. యుద్ధం ముగిసిన తర్వాత శౌర్యాన్ని, యుద్ధంలో ఉత్సాహాన్ని కలుగునట్లుగా వక్తృత్వంతో, ఆహార పానీయాలతో, శస్త్రాస్త్రాల సహాయంతో, ఔషధాలతో అందరి మనస్సులను ప్రసన్నపరచాలి. వ్యూహాలు పన్నకుండా యుద్ధంచేయరాదు, చేయించరాదు. యుద్ధం చేసే తన సైనికులు చక్కగా పోట్లాడుతున్నారా? లేక కపటంతో ఉన్నారా? అని తెలుసుకోవటానికి వారి ప్రవర్తనలను, చేష్టలను గమనిస్తూ ఉండాలి.

ఉపరుధ్యారిమాసీత రాష్ట్రం చాస్యోపపీడయేత్ ।
దూషయేచ్చాస్య సతతం యవసాన్నోదకేంధనమ్ ॥ మను. 7-195 ॥

ఎప్పుడైనా అధర్మయుక్తుడైన చూసినప్పుడు ఉచితమనంటే అతనిని నాల్గువైపులనుండి ముట్టడించి ఆపివేయాలి. అతని రాజ్యాన్ని పీడించి శత్రువుయొక్క ఆహారపదార్థాలను, జలాలను, ఇంధనాలను, గడ్డిగాదాలను నష్టపరచి పాడుచేయాలి.

భిన్ద్యాచ్చైవ తడాగాని ప్రాకారపరిఖా స్తథా ।
సమవస్కందయేచ్చైనం రాత్రౌ విత్రాసయే త్తథా ॥ మను. 7-196 ॥

శత్రువుల తటాకాలను త్రెంపి, నగర ప్రాకారాలను, పగులగొట్టాలి. రాత్రివేళ వారిని భయపెడుతూ జయించటానికి ఉపాయాలను ఆలోచించాలి.

ప్రమాణాని చ కుర్వీత తేషాం ధర్మ్యాన్యథోదితాన్ ।
రత్నైశ్చ పూజయేదేనం ప్రధానపురుషైః సహ ॥ మను. 7-203 ॥

జయించిన తరువాత వారితో ప్రతిజ్ఞాది ప్రమాణపత్రాలను వ్రాయించుకోవాలి. మంచిదని తోస్తే ఆ వంశానికి చెందిన మరొక ధార్మికపురుషుని రాజుగా చేయాలి. అతనితో "మీ ఆజ్ఞానుసారంగా ధర్మయుక్త రాజనీతితో న్యాయంగా ప్రజలను పాలిస్తాను" అని వ్రాయించుకోవాలి. ఇలాగే ఉపదేశించాలి. మళ్ళీ ఉపద్రవం కలిగించకుండా చూడటానికి ఒక రాజపురుషుని నియమించాలి. ఓడిపోయినవారిని ప్రధానపురుషులతో కలిపి రత్నాది ఉత్తమపదార్థాలతో సత్కరించాలి. వారి యోగక్షేమాలకు భంగం కలిగించే కార్యాలను చేయకూడదు. కారాగారగృహంలో ఉంచినా వారు పరాజయ శోకాన్ని వీడి ఆనందంతో ఉండేటట్లు యథాయోగ్యంగా సత్కారాలను చేయాలి.

ఆదానమప్రియకరం దానం చ ప్రియకారకమ్ ।
అభీప్సితానామర్థానాం కాలే యుక్తం ప్రశస్యతే ॥ మను. 7-204 ॥

ఎందుకంటే, లోకంలో ఇతరుల వస్తువులను గ్రహించటం అప్రీతికి, ఇవ్వడం ప్రీతికి కారణం. విశేషించి సమయోచితంగా కార్యాలను చేయటం, పరాజితులకు వారి మనోవాంఛిత పదార్థాల

నివ్వడం మిక్కిలి ఉత్తమం. వారినెప్పుడూ కోపగించరాదు. పరిహసింపరాదు. ఎగతాళి చేయరాదు. **"మేము మిమ్ము పరాజితులను చేసితి"**మని వారి ఎదుట ఎప్పుడూ పలుకరాదు.**'మీరు మా సోదరులు'** అనే మాటలతో సదా వారి గౌరవప్రతిష్ఠలను కాపాడాలి.

మిత్రుని లక్షణాలు

హిరణ్యభూమిసంప్రాప్త్యా పార్థివో న తథైధతే ।
యథా మిత్రం ధ్రువం లబ్ధ్వా కృశమప్యాయతిక్షయమ్ ॥ మను. 7-208 ॥

నిశ్చలుడు, స్థిరసంకల్పుడు, ప్రేమయుక్తుడు, భవిష్యద్విషయాల గురించి ఆలోచించేవాడు, కార్యాన్ని సాధించేవాడు సమర్థతగల మిత్రుడు దుర్బలుడైనప్పటికినీ అతని ద్వారా పొందునంతటి వృద్ధిని, బంగారాన్నీ, భూమినీ, పొందినా అంతటి వృద్ధిని అంతగా పొందలేడు.

ధర్మజ్ఞం చ కృతజ్ఞం చ తుష్టప్రకృతిమేవ చ ।
అనురక్తం స్థిరారంభం లఘుమిత్రం ప్రశస్యతే ॥ మను. 7-209 ॥

ధర్మం తెలిసినవాడు, కృతజ్ఞుడు అంటే చేసిన మేలును మరువనివాడు, ప్రసన్నస్వభావం కలవాడు, అనురాగి, స్థిరారంభుడైన చిన్న మిత్రున్ని పొందినా రాజు ప్రశంసితుడవుతాడు.

ప్రాజ్ఞం కులీనం శూరం చ దక్షం దాతారమేవ చ ।
కృతజ్ఞం ధృతిమంతం చ కష్టమాహురరిం బుధాః ॥ మను. 7-210 ॥

'బుద్ధిమంతుడు, ఉత్తమవర్ణస్తుడు, శూరవీరుడు, చతురుడు, దాత, ఉపకారం చేసినవారిని గుర్తించుకొనేవాడు, ధైర్యవంతుడునైన వ్యక్తిని శత్రువుగా చేసుకోరాదు. ఇలాంటి వారిని శత్రువులుగా చేసుకొనేవాడు నిరంతరం దుఃఖాన్ని అనుభవిస్తాడు' అనే విషయాన్ని ధృడంగా నమ్మాలి.

ఆర్యతా పురుషజ్ఞానం శౌర్యం కరుణవేదితా ।
స్థౌలలక్ష్యం చ సతతముదాసీనగుణోదయః ॥ మను. 7-211 ॥

ప్రశంసించదగిన గుణాలు కలవాడు, సజ్జన దుర్జనులయొక్క మంచిచెడ్డలయొక్క జ్ఞానం కలవాడు, శూరవీరత్వం, కరుణ కలిగి స్థూల లక్ష్యం కలవాడు అంటే పై పై మాటలను నిరంతరం వినిపించేవాడు 'తటస్థుడు' అవుతాడు.

ఏవం సర్వమిదం రాజా సహ సంమంత్ర్య మంత్రిభిః ।
వ్యాయమ్యాప్లుత్య మధ్యాహ్నే భోక్తుమంతఃపురం విశేత్ ॥ మను. 7-216 ॥

పూర్వోక్తంగా ప్రాతఃకాలంలో లేచి శౌచాది కృత్యాలు తీర్చుకొని, సంధ్యోపాసన,అగ్నిహోత్రాదులు చేసి, చేయించి, మంత్రులందరితో ఆలోచించి, సభకు వెళ్ళి సమస్త భృత్యులతో, సేనాధ్యక్షులతో కలిసి, వారిని సంతోషపరచి, అనేక విధాలైన వ్యూహ శిక్షణలను అంటే కవాతులను చేసి, చేయించి,

అశ్వ, గజ, గవాది శాలలను, శస్త్రాస్త్రాలు ఉంచే స్థలాలను, కోశాగారాలను, వైద్యాలయాలను చూసి, అన్నింటిపై ప్రతిరోజూ దృష్టి నుంచి, వాటిలో ఏవైనా దోషాలుంటే వాటిని తొలగించి, వ్యాయామశాలకు పోయి వ్యాయామం చేసి, మధ్యాహ్న సమయంలో భోజనం కోసం అంతఃపురానికి అంటే భార్యాపిల్లలు ఉండే నివాసస్థానానికి వెళ్ళాలి. తర్వాత సుపరీక్షితం, బుద్ధి బలపరాక్రమవర్ధకం, రోగ వినాశకాలైన అనేక ఆహారపదార్థాలను, వ్యంజనాలను, సుగంధిత పానీయాలను రసయుక్తములైన మిష్టాది ఉత్తమ పదార్థాలను భుజించి సదా సుఖంగా ఉండాలి. ఈ విధంగా సమస్త రాచకార్యాలను వృద్ధిచేయాలి.

పంచాశద్భాగ ఆదేయో రాజ్ఞా పశుహిరణ్యయోః ।
ధాన్యానామష్టమో భాగః షష్ఠో ద్వాదశ ఏవ వా ॥ మను. 7-130 ॥

వ్యాపారం చేసేవారి నుండి, శిల్పి జనుల నుండి బంగారు, వెండి మొదలైనవాటిపై వచ్చు లాభంలో 50వ భాగాన్నిగాని, బియ్యం మొదలైన ఆహారపదార్థాలనుండి 6వ భాగాన్ని గాని, 8వ భాగాన్ని గాని, 12వ భాగాన్ని గాని పన్ను తీసుకోవాలి. రైతులు మొదలైన ప్రజలు తినక, త్రాగక ధనహీనులై దుఃఖం చెందకుండునట్లుగా పన్నులను తీసుకోవాలి. ప్రజలు ధనాఢ్యులై, ఆరోగ్యవంతులై సమృద్ధంగా ఆహారపానీయాలు కలవారైనప్పుడే రాజుకు అధికాభివృద్ధి కలుగుతుంది. తన సంతానం వలెనే ప్రజలకు సుఖం కలిగించాలి. రాజును, రాజపురుషులను ప్రజలు తమ తండ్రివలెనే భావించాలి. "రాజులకు రాజైన రైతు మొదలైనవారినీ, పరిశ్రమ చేసేవారినీ" రక్షించేవాడే రాజు" అని చెప్పటం యథార్థ విషయమే. ప్రజలే లేకున్న రాజెవరికి? ఇక రాజే లేకున్న వారు ఎవరి ప్రజలని చెప్పాలి? ఈ ఇద్దరూ తమ తమ కార్యాలలో స్వతంత్రులుగా, ప్రీతితో కలిసి చేయవలసిన కార్యాలలో పరతంత్రులుగా ఉండాలి. ప్రజల సాధారణ అభిప్రాయాలకు విరుద్ధంగా రాజపురుషులు గాని, రాజుగాని, రాజాజ్ఞకు విరుద్ధంగా ప్రజలుగాని ప్రవర్తించకూడదు. ఇది రాజకీయమనబడే రాజుయొక్క స్వకీయకార్యం. దీనినే 'పాలిటిక్స్' అంటారు. దీనిని సంక్షేపంగా చెప్పాము. ఇంకను విశేషించి చూడదలచినవారు చతుర్వేదాలను, మనుస్మృతిని, శుక్రనీతిని, మహాభారతాదులలో చూసి నిశ్చయించుకోవాలి.

వివాద స్థానాలు

ప్రజలకు న్యాయం కలిగించదలచినవారు మనుస్మృతియొక్క అష్టమ, నవమ అధ్యాయాలలో ఉన్న పద్ధతుల ప్రకారంగా వ్యవహరించాలి. ఇక్కడ అలాంటి కొన్ని విషయాలను సంక్షేపంగా వ్రాస్తున్నాము.

ప్రత్యహం దేశదృష్టైశ్చ శాస్త్రదృష్టైశ్చ హేతుభిః ।
అష్టాదశసు మార్గేషు నిబద్ధాని పృథక్ పృథక్ ॥ మను. 8-3 ॥

దేశాచారాలకు సంబంధించిన, శాస్త్ర వ్యవహారాలకు సంబంధించిన హేతువులను దృష్టిలో పెట్టుకొని, సభ, రాజు, రాజపురుషులు అందరినీ ప్రతినిత్యం ఈ క్రింద వ్రాయబడిన 18 వివాదాస్పద విషయాలలో గల వివాదయుక్త కర్మలను నిర్ణయించాలి. శాస్త్రోక్త నియమాలు లభించనప్పుడు,

అలాంటివి కావలసిన ఆవశ్యకత ఏర్పడినపుడు రాజుకీ, ప్రజలకూ ఉన్నతి కలిగించునట్టి నియమాలను చేయాలి.

అష్టాదశ (18) వివాద స్థలాలలో ధర్మంతో న్యాయం చెప్పటం

తేషామాద్యమృణాదానం నిక్షేపోఽ స్వామీ విక్రయః ।
సంభూయ చ సముత్థానం దత్తస్యానపకర్మ చ ॥ మను. 8-4 ॥

18 వివాదాస్పద విషయాలు: వాటిలో 1. ఋణాదానం = అప్పిచ్చి పుచ్చుకొనే వివాదం; 2. నిక్షేపః = కుదువబెట్టటం - అనగా ఒకడు ఒకని వద్ద ఒక వస్తువును కుదవ బెట్టగా మళ్ళీ అతడు అడిగినప్పుడు తిరిగి ఇవ్వకపోవటం; 3. అస్వామి విక్రయః = వస్తువు యొక్క యజమాని లేనిదే దానిని అమ్మటం అంటే ఇతరుల వస్తువులను పరులకెవరికో అమ్మటం; 4. సంభూయ చ సముత్థానం = కొందరు కలిసి మెలిసి ఉండి అత్యాచారం చేయటం; 5. దత్తస్యానపకర్మచ = ఇచ్చిన వస్తువును తిరిగి ఇవ్వకపోవటం;

వేతనస్యైవ చాదానం సంవిదశ్చ వ్యతిక్రమః ।
క్రయవిక్రయానుశయో వివాదః స్వామిపాలయోః ॥ మను. 8-5 ॥

6. వేతనస్యైవ చాదానమ్ = వేతనాన్ని, జీతాన్ని తక్కువగా ఇవ్వటం, లేదా ఇవ్వకపోవటం; 7. సంవిదశ్చవ్యతిక్రమః = ప్రతిజ్ఞకు విరుద్ధంగా ప్రవర్తించటం; 8. క్రయవిక్రయానుశయః = వస్తువులను కొని అమ్మటంలో జగడమాడటం; 9. వివాదః స్వామిపాలయోః = పశువుయొక్క యజమానికి, దానిని పోషించేవానికి పోట్లాట.

సీమావివాదధర్మశ్చ పారుష్యే దండవాచికే ।
స్తేయం చ సాహసం చైవ స్త్రీ సంగ్రహణమేవ చ ॥ మను. 8-6 ॥

10. సీమావివాదః = సరిహద్దుల పోట్లాట; 11. ఒకరిని కఠినంగా దండించటం; 12. పరుషంగా మాట్లాడటం; 13. స్తేయం = దొంగతనం చేయటం; 14. సాహసం = ఒక పనిని బలాత్కారంగా చేయటం; 15. స్త్రీ సంగ్రహణమ్ = పరస్త్రీతో పరపురుషుడు వ్యభిచారం చేయటం.

స్త్రీపుంధర్మో విభాగశ్చ ద్యూతమహ్వాయ ఏవ చ ।
పదాన్యష్టాదశైతాని వ్యవహారస్థితా విహ ॥ మను. 8-7 ॥

16. స్త్రీ పురుషులు ధర్మాన్ని అతిక్రమించటం; 17. విభాగః = విభాగస్థులవటంలో వివాదం కలుగటం; 18. ద్యూతమాహ్వాయ = జడచేతన పదార్థాలను పందెమొడ్డి జూదమాడటం. ఈ 18 విధాల వివాదాలు పరస్పర విరుద్ధకార్యాలకు మూలాలు.

ఏషు స్థానేషు భూయిష్ఠం వివాదం చరతాం నృణామ్ ।
ధర్మం శాశ్వతమాశ్రిత్య కుర్యాత్కార్యవినిర్ణయమ్ ॥ మను. 8-8 ॥

ఈ వ్యవహారాలలో విశేషంగా వివాదం చేసినవారికి సనాతన ధర్మానుసారంగా న్యాయాన్ని కలిగించాలి. ఎవరి పట్లనూ ఎప్పుడూ పక్షపాతాన్ని కలిగి చూపరాదు.

ధర్మో విద్ధస్త్వధర్మేణ సభాం యత్రోపతిష్ఠతే ।
శల్యం చాస్య న కృంతంతి విద్ధాస్తత్ర సభాసదః ॥ మను. 8-12 ॥

సభలో అధర్మంతో ధర్మానికి ఆఘాతం కలిగినప్పుడు ఆ ధర్మకళంకం తొలగించకపోతే - అనగా అధర్మాన్ని ఖండించి ధర్మాత్మునికి గౌరవం, అధర్మాత్మునికి శిక్ష లభించకపోతే ఆ సభలో ఉన్న సభాసదులందరూ గాయపడినవారితో సమానులని భావించాలి.

సభాం వా న ప్రవేష్టవ్యాం వక్తవ్యం వా సమంజసమ్ ।
అబ్రువన్విబ్రువన్వాపి నరో భవతి కిల్బిషీ ॥ మను. 8-13 ॥

సభలో ఎప్పుడూ ప్రవేశించకూడదు. ప్రవేశిస్తే సత్యాన్నే చెప్పటం ధర్మాత్ములకు మంచిది. సభలో అన్యాయం జరుగుతూంటే చూసి మౌనంగా ఉండేవారూ, యథార్థమైన న్యాయానికి విరుద్ధంగా మాట్లాడేవారూ మహాపాపులుగా పరిగణించబడుతారు.

యత్ర ధర్మో హ్యధర్మేణ సత్యం యత్రానృతేన చ ।
హన్యతే ప్రేక్షమాణానాం హతాస్తత్ర సభాసదః ॥ మను. 8-14 ॥

సభాసదులు చూస్తుండగా సభలో అధర్మంతో ధర్మం, అసత్యంతో సత్యం పీడించబడినచో ఆ సభలో ఉన్న వారందరూ చనిపోయినవారితో సమానులే. వారిలో ఒక్కడూ జీవించి ఉండలేదని తెలుసుకోవాలి.

ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః ।
తస్మాద్ధర్మో న హంతవ్యో మా నో ధర్మో హతోఽవధీత్ ॥ మను. 8-15 ॥

చచ్చిన ధర్మం చంపినవానిని నాశనం చేస్తుంది. రక్షించబడిన ధర్మం రక్షించినవానిని కాపాడుతుంది. కావున ధర్మాన్ని చంపినచో అది మనలను చంపుతుందన్న భయం కలవారై ఎప్పుడూ ధర్మాన్ని చంపరాదు.

వృషో హి భగవాన్ ధర్మస్తస్య యః కురుతే హ్యలమ్ ।
వృషలం తం విదుర్దేవాస్తస్మాద్ధర్మం న లోపయేత్ ॥ మను. 8-16 ॥

సమస్త ఐశ్వర్యాలను ఇచ్చే, సుఖవర్షాలను కురిపించే ధర్మాన్ని నాశనం చేసేవానిని విద్వాంసులు వృషలుడు - అంటే శూద్రుడు, నీచుడు అని భావిస్తారు. అందుకే ధర్మలోపాన్ని కావించుట ఎవరికీ మంచిది కాదు.

ఏక ఏవ సుహృద్ధర్మో నిధనేఽప్యనుయాతి యః ।
శరీరేణ సమన్నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి ॥ మను. 8-17 ॥

ఈ ప్రపంచంలో మరణించిన తర్వాత మనవెంట వచ్చే సహృదయమైన మిత్రము ధర్మమొక్కటే. మిగిలిన సమస్త పదార్థాలూ, సదా వెంట ఉండే స్నేహితులునూ శరీరంతో పాటే విడిపోతారు. అందరి స్నేహం వదలిపోతుంది. కాని ధర్మంతో ఉన్న స్నేహం ఎప్పుడూ విడిపోదు.

పాదోఽ ధర్మస్య కర్తారం పాదః సాక్షిణమృచ్ఛతి ।
పాదః సభాసదః సర్వాన్ పాదో రాజానమృచ్ఛతి ॥ మను. 8-18 ॥

రాజసభలో పక్షపాతంతో అన్యాయం జరిగినప్పుడు ఆ అధర్మం నాలుగు భాగాలుగా ఏర్పడి అందు మొదటి భాగం అధర్మకర్తకు, రెండవభాగం సాక్షికి, మూడవభాగం సభాసదులకు, నాల్గవ భాగం సభాపతియైన రాజుకు చెందుతుంది.

రాజా భవత్యనేనాస్తు ముచ్యంతే చ సభాసదః ।
ఏనో గచ్ఛతి కర్తారం నిందార్హో యత్ర నింద్యతే ॥ మను. 8-19 ॥

ఏ సభలో నిందార్హులకు నింద, స్తుతింపదగినవారికి ప్రశంస, దండనార్హులకు దండన, మాన్యులకు మాన్యత కలుగుతుందో అక్కడ రాజు, సభాసదులు పాపరహితులై పవిత్రులౌతారు. పాపం చేసినవారికే పాపం లభిస్తుంది.

సాక్షులు

ఆప్తాః సర్వేషు వర్ణేషు కార్యాః కార్యేషు సాక్షిణః ।
సర్వధర్మవిదోఽ లుబ్ధా విపరీతాంస్తు వర్జయేత్ ॥ మను. 8-67 ॥

అన్ని వర్ణాలలో గల ధార్మికులు, విద్వాంసులు, నిష్కపటులు, సర్వధర్మాలను తెలిసినవారు, లోభరహితులు, సత్యవాదులు అయినవారే న్యాయవ్యవస్థలో సాక్ష్యమివ్వదగినవారు. వీనికి విరుద్ధంగా ఉన్నవారి సాక్ష్యాన్నెప్పుడూ తీసుకొనరాదు.

స్త్రీణాం సాక్ష్యం స్త్రియః కుర్యుర్ద్విజానాం సదృశా ద్విజాః ।
శూద్రాశ్చ సంతః శూద్రాణామంత్యానామంత్యయోనయః ॥ మను. 8-68 ॥

స్త్రీలకు సాక్షులు స్త్రీలు, ద్విజులకు సాక్షులు ద్విజులు, శూద్రులకు సాక్షులు శూద్రులు, అంత్యజులకు అంత్యజులే సాక్షులుగా ఉండాలి.

సాహసేషు చ సర్వేషు స్తేయసంగ్రహణేషు చ ।
వాగ్దండయోశ్చ పారుష్యే న పరీక్షేత సాక్షిణః ॥ మను. 8-72 ॥

బలాత్కార కార్యాలైన దొంగతనం, వ్యభిచారం, పరుషవాక్కులు, దండనార్హమైన అపరాధాలు మొదలైనవాటిలో సాక్షిని పరీక్షించవలసిన పనిలేదు. ఈ కార్యాలు రహస్యంగా జరుగును కాబట్టి సాక్ష్యం అవసరమని భావించకూడదు.

బహుత్వం పరిగృహ్ణీయాత్సాక్షిద్వైధే నరాధిపః ।
సమేషు తు గుణోత్కృష్టాన్ గుణిద్వైధే ద్విజోత్తమాన్ ॥ మను. 8-73 ॥

ఇరుపక్షాలలోని సాక్షులనుండి బహుపక్షానుసారంగా, తుల్యులైన సాక్షులలో ఉత్తమ గుణవంతుల సాక్ష్యానుకూలంగా, ఇరువైపుల సాక్షులు ఉత్తమ గుణవంతులు, సమానులైన ఋషులు మహర్షులు, యతులు అయిన ద్విజోత్తముల సాక్ష్యానుసారంగా న్యాయమొనరించాలి.

సమక్షదర్శనాత్సాక్ష్యం శ్రవణాచ్చైవ సిధ్యతి ।
తత్ర సత్యం బ్రువన్సాక్షీ ధర్మార్థాభ్యాం న హీయతే ॥ మను. 8-74 ॥

(1) సాక్షాత్తుగా చూడటం అనీ, (2) వినటం అనీ సాక్ష్యం రెండు విధాలుగా ఉంటుంది. సభలో ప్రశ్నించినపుడు సాక్షి సత్యాన్నే పలికితే అతడు ధర్మహీనుడు, దండింపదగినవాడు కాలేడు. అసత్యాన్ని చెప్పిన సాక్షులకు తగిన దండననివ్వాలి.

సాక్షీ దృష్టశ్రుతాదన్యద్విబ్రువన్నార్యసంసది ।
అవాఙ్నరకమాప్నోతి ప్రేత్య స్వర్గాచ్చ హీయతే ॥ మను. 8-75 ॥

రాజసభలోగాని, ఇతర ఉత్తమపురుషుల సభలోగాని సాక్షి తాను చూసినదానికి, విన్నదానికి విరుద్ధంగా చెబితే అతడు అవాఙ్నరకం అంటే నాలుకను కోసివేయటం వలన కలుగు దుఃఖరూప నరకాన్ని తన జీవితకాలం పొందాలి. లేకపోతే మరణించిన తరువాత సుఖహీనుడవుతాడు.

స్వభావేనైవ యద్ బ్రూయుస్తద్గ్రాహ్యం వ్యావహారికమ్ ।
అతో యదన్యద్విబ్రూయుర్ధర్మార్థం తదపార్థకమ్ ॥ మను. 8-78 ॥

సాక్షి చెప్పిన స్వాభావిక వ్యవహారసంబంధవిషయాలనే విశ్వసించాలి. దానికి భిన్నంగా ఇతరులు నేర్పించిన మాటలు చెబితే అవి వ్యర్థాలు అని న్యాయాధీశుడు గ్రహించాలి.

సభాంతః సాక్షిణః ప్రాప్తానర్థిప్రత్యర్థిసన్నిధౌ ।
ప్రాడ్వివాకోఽనుయుంజీత విధినాఽనేన సాంత్వయన్ ॥ మను. 8-79 ॥

వాది ప్రతివాదుల ఎదుట సభలో వచ్చిన సాక్షులను న్యాయాధీశుడు గాని, ప్రాడ్వివాక్కులు అంటే వకీళ్లుగాని, ఈ క్రింది విధంగా ప్రశ్నించాలి.

యద్ద్వయోరనయోర్వేత్థ కార్యేఽస్మిన్ శ్చేష్టితం మిథః ।
తద్బ్రూత సర్వం సత్యేన యుష్మాకం హ్యత్ర సాక్షితా ॥ మను. 8-80 ॥

ఓ సాక్షులారా! ఈ కార్యంలో ఈ ఇద్దరూ పరస్పరం చేసే చేష్టలను మీకు తెలిసినంతవరకు సత్యంగా చెప్పండి. ఎందుకంటే, మీరు ఈ కార్యంలో సాక్షులుగా ఉన్నారు.

సత్యం సాక్ష్యే బ్రువన్సాక్షీ లోకానాప్నోతి పుష్కలాన్ ।
ఇహ చానుత్తమాం కీర్తిం వాగేషా బ్రహ్మపూజితా ॥ మను. 8-81 ॥

సత్యం చెప్పిన సాక్షి జన్మాంతరంలో ఉత్తమలోకాలలో ఉత్తమ జన్మలను పొంది సుఖాన్ని అనుభవిస్తాడు. ఇహపర జన్మలలో ఉత్తమకీర్తిని పొందుతాడు. వేదంలో సత్కార తిరస్కారాలకు పలుకే కారణమని వ్రాయబడి ఉన్నది. సత్యాన్ని చెప్పేవాడు ప్రశంసితుడవుతాడు. అసత్యాన్ని చెప్పేవాడు నిందించబడతాడు.

సత్యేన పూయతే సాక్షీ ధర్మః సత్యేన వర్ధతే ।
తస్మాత్సత్యం హి వక్తవ్యం సర్వ వర్ణేషు సాక్షిభిః ॥ మను. 8-83 ॥

సత్యాన్ని చెబితే సాక్షి పవిత్రుడవుతాడు. సత్యాన్ని పలికిన ధర్మాభివృద్ధి జరుగుతుంది. కాబట్టి సమస్త వర్ణాలకు చెందిన సాక్షులు సత్యాన్నే చెప్పటం యోగ్యం.

ఆత్మైవ హ్యాత్మనః సాక్షీ గతిరాత్మా తథాత్మనః ।
మావమంస్థాః స్వమాత్మానం నృణాం సాక్షిణముత్తమమ్ ॥ మను. 8-84 ॥

ఆత్మకు సాక్షి ఆత్మయే. ఆత్మయొక్క గతి ఆత్మయే. దీనిని తెలిసిన ఓ మానవా! మనుష్యులందరికీ ఉత్తమ సాక్షి అయిన ఈ ఆత్మను అవమానించకు. ఆత్మ, మనస్సు, వాణిలో గలదే సత్యభాషణం. అదే సత్యం. తద్భిన్నమైనది మిథ్యాభాషణం.

యస్య విద్వాన్ హి వదతః క్షేత్రజ్ఞో నాభిశంకతే ।
తస్మాన్న దేవాః శ్రేయాంసం లోకేఽన్యం పురుషం విదుః ॥ మను. 8-96 ॥

ఇలా సత్యాన్నే చెప్పే పురుషుని గురించి విద్వాంసుడైన క్షేత్రజ్ఞుడు అంటే శరీరాన్ని గురించి సర్వం తెలిసినవాని ఆత్మ తనలో శంకించదు. దీనికి భిన్నంగా ఉండేవారిని ఉత్తమపురుషులుగా విద్వాంసులు అంగీకరించరు.

ఏకోఽహమస్మీత్యాత్మానం యత్త్వం కల్యాణ మన్యసే ।
నిత్యం స్థిత స్తే హృద్యేష పుణ్యాపేక్షితా మునిః ॥ మను. 8-91 ॥

కల్యాణాన్ని కాంక్షించే ఓ మానవుడా! "నే నొక్కడినే ఉన్నా"నని నీ ఆత్మలో అనుకుని అసత్యమాడటం మంచిది కాదు. నీ హృదయంలో అంతర్యామిరూపంలో రెండవ ఆత్మ అయిన పరమాత్మ నీ పుణ్యపాపాలను చూస్తూ మునివలె ఉన్నాడు. ఆ పరమాత్మునికి భయపడి ఎప్పుడూ సత్యాన్నే మాట్లాడుము.

లోభాన్మోహాద్భయాన్మైత్రాత్కామాత్క్రోధాత్తథైవ చ ।
అజ్ఞానాద్బాలభావాచ్చ సాక్ష్యం వితథముచ్యతే ॥ మను. 8-118 ॥

లోభం, మోహం, భయం, స్నేహం, కామం, క్రోధం, అజ్ఞానం, బాల్యత్వం కలవారై సాక్ష్యమిస్తే దానిని అసత్యమనే గ్రహించాలి.

అబద్ధ సాక్ష్యానికి దండన విధి

ఏషామన్యతమే స్థానే యః సాక్ష్యమనృతం వదేత్ ।
తస్య దండవిశేషాంస్తు ప్రవక్ష్యామ్యనుపూర్వశః ॥ మను. 8-119 ॥

వీరిలో ఏ సాక్షియైన ఎక్కడనైన అబద్ధమాడితే అతనికి ఈ క్రింద చెప్పబోయే అనేకవిధాలైన శిక్షలను వేయాలి.

లోభాత్సహస్రం దండ్యస్తు మోహాత్పూర్వం తు సాహసమ్ ।
భయాద్ద్వౌమధ్యమౌ దండ్యౌ మైత్రాత్పూర్వం చతుర్గుణమ్ ॥ మను. 8-120 ॥

లోభంతో అసత్యసాక్ష్యమిచ్చిన వానినుండి 15 రూపాయిల 10 అణాలు. (రు. 15-10 అణాలు) (1 అణా = 6 పైసలు, 4 అణాలు = 25 పైసలు, 1 రూపాయి = 16 అణాలు= 100 పైసలు) దండుగగా తీసుకోవాలి. మోహంతో అసత్యసాక్ష్యమిచ్చిన వానినుండి 3 రూపాయిల 2 అణాలు (రు. 3-అ2) దండుగగా తీసుకోవాలి. భయంతో అసత్యసాక్ష్యమిస్తే అతని నుండి 6 రూపాయిల నాలుగు అణాలు (రు. 6-అ4) దండుగగా తీసుకోవాలి. మిత్రత్వంతో మిథ్యాసాక్ష్యమిస్తే అతనినుండి 12 రూపాయిల ఎనిమిది అణాలు (రు. 12-అ8) దండుగగా తీసుకోవాలి.

కామాద్దశగుణం పూర్వం క్రోధాత్తు త్రిగుణం పరమ్ ।
అజ్ఞానాద్ద్వే శతే పూర్ణే బాలిశ్యాచ్ఛతమేవ తు ॥ మను. 8-121 ॥

కామంతో అసత్యసాక్ష్యమిచ్చిన వానినుండి 25 రూపాయిలు (25-00) దండుగగా తీసుకోవాలి. క్రోధంతో అబద్ధపు సాక్ష్యమిచ్చినవానినుండి 46 రూపాయిల 14 అణాలు (రు. 46-అ14) దండుగగా అజ్ఞానంతో అబద్ధపుసాక్ష్యమిచ్చిన వాని నుండి ఆరు రూపాయిలను (రు. 6-00) దండుగా బాల్యతనంతో మిథ్యాసాక్ష్యమిచ్చిన వాని నుండి ఒక రూపాయి తొమ్మిది అణాలు (రు. 1-అ9) దండుగా తీసుకోవాలి.

ఉపస్థముదరం జిహ్వా హస్తౌ పాదౌ చ పంచమమ్ ।
చక్షుర్నాసా చ కర్ణౌ చ ధనం దేహస్తథైవ చ ॥ మను. 8-125 ॥

ఉపస్థేంద్రియం, ఉదరం, నాలుక, హస్తాలు, పాదాలు, నేత్రాలు, నాసిక, కర్ణాలు, ధనం, శరీరం అనే ఈ పది స్థానాలు దండించగలవి. దండించవలసివస్తే వీనిపైననే దండించాలి.

అనుబంధం పరిజ్ఞాయ దేశకాలౌ చ తత్త్వతః
సారాఽపరాధౌ చాలోక్య దండం దండ్యేషు పాతయేత్ ॥ మను. 8-126 ॥

కొన్ని శిక్షలు ఇంతకు పూర్వం చెప్పబడినవి. ఇంకా కొన్ని చెప్పబడతాయి. ఉదాహరణకు లోభంతో తప్పు సాక్ష్యమిచ్చినవానికి 15 రూపాయల పది అణాల దండుగగా తీసుకోవాలని

చెప్పబడింది. కాని సాక్షి అత్యంత దరిద్రుడైతే ఆతనినుండి తక్కువగాను ధనాఢ్యుడైతే అతనినుండి రెండింతలు, మూడింతలు, నాల్గింతల వరకు కూడ దండుగగా తీసుకోవాలి. అంటే దేశం, కాలం, పురుషులను అనుసరించి, చేసిన అపరాధానికి తగిన విధంగా దండించాలి.

అధర్మదండనం లోకే యశోఘ్నం కీర్తినాశనమ్ ।
అస్వర్గ్యం చ పరత్రాపి తస్మాత్తత్పరివర్జయేత్ ॥ మను. 8-127 ॥

ఎవరైన ఈ లోకంలో అధర్మంగా దండిస్తే అతడు ఇంతకుపూర్వం తనకున్న ప్రతిష్ఠను పోగొట్టుకోవటమే గాక వర్తమాన, భవిష్యత్కాలంలో, పరజన్మలో లభించే కీర్తిని నాశనం చేస్తుంది. అది అతనికి పరజన్మలో కూడ దుఃఖాన్నే కలిగిస్తుంది. కాబట్టి అధర్మంగా ఎవరినీ దండించరాదు.

అదండ్యాన్దండయన్ రాజా దండ్యాంశ్చైవాప్యదండయన్ ।
అయశో మహదాప్నోతి నరకం చైవ గచ్ఛతి ॥ మను. 8-128 ॥

దండించదగినవారిని విడిచిపెట్టి దండించరాని వారిని శిక్షించే రాజు జీవితంలో గొప్ప నిందను పొందడమేగాక మరణానంతరం కూడా అధిక దుఃఖాన్ని అనుభవిస్తాడు. కాబట్టి ఎప్పుడైనా అపరాధం చేసినవారినే దండించాలి. నిరపరాధులను ఎన్నడూ శిక్షించరాదు.

దొంగతనం మొదలైన వానిలో దండన విధానం

వాగ్దండం ప్రథమం కుర్యాద్ధిగ్దండం తదనంతరమ్ ।
తృతీయం ధనదండం తు వధ దండ మతః పరమ్ ॥ మను. 8-129 ॥

ప్రథమంలో వాగ్దండన విధించాలి. అంటే అతనిని నిందించాలి. తర్వాత "నిన్ను ధిక్కరిస్తున్నాను, నీవు ఇలాంటి దుష్కార్యమేల చేసావు?" అని ధిగ్దండన గావించాలి. మూడవవైన 'ధన దండన' విధించి అతనినుండి ధనం తీసుకోవాలి. ఆ తర్వాత 'వధ దండనం' అంటే కొరడాలతో గాని, బెత్తాలతో గాని కొట్టటం లేక తల నరకటం - మరణదండన మొదలైనవి గావించాలి.

యేన యేన యథాంగేన స్తేనో నృషు విచేష్టతే ।
తత్తదేవ హరేదస్య ప్రత్యాదేశాయ పార్థివః ॥ మను. 8-334 ॥

దొంగ ఏ విధంగా ఏ యే అవయవాలతో, మనుష్యులతో విరుద్ధచేష్టలు చేస్తాడో, ఆ యా అవయవాలను మానవులందరికొక గుణపాఠం నేర్పటానికి రాజు ఛేదించాలి.

పితాచార్యః సుహృన్మాతా భార్యాపుత్రః పురోహితః ।
నాదండ్యో నామ రాజ్ఞోఽస్తి యః స్వధర్మే న తిష్ఠతి ॥ మను. 8-135 ॥

స్వధర్మనిరతులు కాకపోతే తండ్రి, ఆచార్యుడు, మిత్రుడు, తల్లి, భార్య, పుత్రుడు, పురోహితుడు మొదలైనవారందరూ రాజదండనకు అర్హులవుతారు. న్యాయపీఠంలో కూర్చొని న్యాయం చెప్పే రాజెవరిపైనా పక్షపాతాన్ని చూపరాదు. యథోచిత దండనమే ఇవ్వాలి.

కార్షాపణం భవేద్దండ్యో యత్రాన్యః ప్రాకృతో జనః ।
తత్ర రాజా భవేద్దండ్యః సహస్రమితి ధారణా ॥ మను. 8-336 ॥

సామాన్యజనులకు ఒక అపరాధంలో ఒక పైసా దండుగగా విధిస్తే అదే అపరాధానికి రాజుకు వేయి పైసల దండుగను విధించాలి. అంటే సాధారణ మానవుని కన్న రాజుకు వేయి రెట్లు ఎక్కువగా దండుగ ఉండాలి. ఇలాగే రాజుయొక్క మంత్రికి ఎనిమిది వందల రెట్లును, అతని కంటే తక్కువ వారికి ఏడువందల రెట్లును, వారికంటే తక్కువ వారికి ఆరువందల రెట్లను దండుగ వేయాలి. ఇదే విధంగా క్రింది ఉద్యోగులకు క్రమంగా తగ్గుతూ ఒక చిన్నపాటి సేవకునికి కనీసం ఎనిమిది రెట్ల శిక్ష కంటే తక్కువ ఉండరాదు. ప్రజలకన్న రాజోద్యోగులకు తక్కువ శిక్ష విధిస్తే వారు ప్రజలను నాశనం చేస్తారు. సింహం అధికదండనంచేత, మేక అల్పదండనం చేత వశమవుతుంది. కాబట్టి రాజు మొదలుకొని చిన్న సేవకుని వరకు గల రాజోద్యోగులు అపరాధాన్ని చేస్తే వారికి ప్రజలకన్న అధికంగా దండన విధించాలి.

అష్టాపాద్యంతు శూద్రస్య స్తేయే భవతి కిల్బిషమ్ ।
షోడశైవ తు వైశ్యస్య ద్వాత్రింశత్ క్షత్రియస్య చ ॥ మను. 8-337 ॥

ఇలా కొద్దిపాటి వివేకముండి దొంగతనం చేసే శూద్రునికి దొంగతనం కన్న ఎనిమిది రెట్లు, వైశ్యునికి పదహారు రెట్లు, క్షత్రియునికి ఇరువది రెట్లు దండన విధించాలి.

బ్రాహ్మణస్య చతుఃషష్టిః పూర్ణం వాపి శతం భవేత్ ।
ద్విగుణా వా చతుః షష్టిస్తద్దోషగుణవిద్ధి సః ॥ మను. 8-338 ॥

బ్రాహ్మణునికి అరవై నాలుగు రెట్లు, నూరురెట్లు, ఒకవంద ఇరవై ఎనిమిది రెట్లు గాని దండన ఉండాలి. అంటే ఎవరికి ఎంతెంత జ్ఞానం, ప్రతిష్ఠలు అధికంగా ఉంటాయో వారికి అపరాధంలో కూడా అంతే అధికంగా దండన ఉండాలి.

ఐంద్రం స్థానమభిప్రేప్సుర్యశశ్చాక్షయమవ్యయమ్ ।
నోపేక్షేత క్షణమపి రాజా సాహసికం నరమ్ ॥ మను. 8-334 ॥

ధర్మాన్ని ఐశ్వర్యాన్ని కాంక్షించే రాజు రాజ్యాధికారులు బలాత్కారంగా నేరాలు చేయు బందిపోటుదొంగలను శిక్షించటంలో ఒక్కక్షణం కూడ ఆలస్యం చేయకూడదు.

వాగ్దుష్టాత్తస్కరాచ్చైవ దండేనైవ చ హింసతః ।
సాహసస్య నరః కర్తా విజ్ఞేయః పాపకృత్తమః ॥ మను. 8-345 ॥

దుష్టవచనాలను చెప్పేవాడికంటే, దొంగతనం చేసేవాడికంటే, అపరాధం లేకనే శిక్ష వేసేవాడికంటే, సాహసించి బలాత్కారంగా నేరం చేసేవాడే గొప్ప పాపాత్ముడైడు.

సాహసే వర్తమానం తు యో మర్షయతి పార్థివః ।
స వినాశం వ్రజత్యాశు విద్వేషం చాధిగచ్ఛతి ॥ మను. 8-346 ॥

సాహసాలను చేసే పురుషుని దండించక సహిస్తే అలాంటి రాజు శీఘ్రంగా నాశనాన్ని పొందుతాడు. అతని రాజ్యంలో ద్వేషం చెలరేగుతుంది.

న మిత్రకారణాద్రాజా విపులాద్వా ధనాగమాత్ ।
సముత్సృజేత్ సాహసికాన్ సర్వభూతభయావహాన్ ॥ మను. 8-347 ॥

సర్వప్రాణులకు దుఃఖం కలిగించే దుస్సాహసికులు తన మిత్రుడైననూ, ధనవంతుడైననూ లక్ష్యంపెట్ట వారిని రాజు దండించాలి. బంధించక, ఛేదించక వారినెన్నడూ విడిచిపెట్టకూడదు.

గురుం వా బాలవృద్ధౌ వా బ్రాహ్మణం వా బహుశ్రుతమ్ ।
ఆతతాయినమాయాంతం హన్యాదేవావిచారయన్ ॥ మను. 8-350 ॥

గురువైనా, పుత్రులైనా బాలురైనా, తండ్రి మొదలగు వృద్ధులైనా, బ్రాహ్మణులైనా, బహుశాస్త్రాలను చదివిన వారైనా, విన్నవారైనా, ధర్మాన్ని విడిచి అధర్మమార్గంలో ప్రవర్తిస్తూ, ఇతరులను అపరాధం లేకుండానే హింసిస్తే, వారిని విచారించకుండానే చంపాలి. చంపిన తర్వాతనే వారినిగురించి ఆలోచించాలి.

నాతతాయివధే దోషో హంతుర్భవతి కశ్చన ।
ప్రకాశం వాఽప్రకాశం వా మన్యుస్తన్మన్యుమృచ్ఛతి ॥ మను. 8-351 ॥

ప్రసిద్ధంగానో, అప్రసిద్ధంగానో దుష్టులను చంపినవారికి పాపం కలుగదు. క్రోధం కలవారిని క్రోధంతోనే చంపాలి అంటే, క్రోధంతో క్రోధానికి యుద్ధం - పోట్లాట అని తెలియాలి.

యస్య స్తేనః పురే నాస్తి నాన్యస్త్రీగో న దుష్టవాక్ ।
న సాహసికదండఘ్నౌ స రాజా శక్రలోకభాక్ ॥ మను. 8-386 ॥

ఏ రాజుయొక్క రాజ్యంలో దొంగలు, పరస్త్రీలతో రమించేవారు, పరుషములైన దుష్టవచనాలు పలికేవారు, సాహసికులైన బందిపోటుదొంగలు, రాజాజ్ఞను భంగపరచే దోషులుండరో, ఆ రాజు అత్యంత శ్రేష్ఠుడు.

వ్యభిచారులకు దండన

భర్తారం లంఘయేద్యా స్త్రీ స్వజ్ఞాతిగుణదర్పితా ।
తాం శ్వభిః ఖాదయేద్రాజా సంస్థానే బహుసంస్థితే ॥ మను. 8-371 ॥

తన జాతి, గుణాలయొక్క గర్వంతో భర్తను విడిచి వ్యభిచారం చేసే స్త్రీని, అనేకమంది స్త్రీ పురుషుల సమక్షంలో బ్రతికుండగానే కుక్కలతో కరిపించి రాజు చంపించాలి.

పుమాంసం దాహయేత్పాపం శయనే తప్త ఆయసే ।
అభ్యాదధ్యుశ్చ కాష్ఠాని తత్ర దహ్యేత పాపకృత్ ॥ మను. 8-372 ॥

అలాగే తన భార్యను విడిచి పరస్త్రీతో గాని, వేశ్యతో గాని వ్యభిచారం చేసే పాపిని ఇనుపమంచానికి కట్టివేసి దానిని అగ్నితో ఎఱ్ఱగా కాల్పించి అనేకమంది పురుషుల సమక్షంలో బ్రతికి ఉండగానే భస్మం చేయాలి.

కాముకులైన రాజు, న్యాయాధీశులకు దండన

ప్రశ్న: రాజు గాని, రాణిగాని, న్యాయాధీశుడు గాని, అతని భార్య గాని వ్యభిచారాది కుకర్మలు చేస్తే వారిని దండించేవారెవరు?

జవాబు:- సభ దండించాలి. సామాన్య ప్రజలకంటే ఎక్కువగా వారికి దండన విధించాలి.

ప్రశ్న: రాజు మొదలైనవారు రాజసభనుండి దండనాన్ని ఎలా స్వీకరిస్తారు?

జవాబు:- రాజు కూడ ఒక పుణ్యాత్ముడు, భాగ్యశాలియైన మనిషే. అతనికి శిక్ష విధించకపోతే, అతడు దాన్ని స్వీకరించకపోతే ఇతరులు తమ శిక్షనెందుకంగీకరిస్తారు? ప్రజలందరూ, ప్రధాన రాజ్యాధికారీ, రాజసభ అందరూ కలిసి ధర్మానుసారంగా శిక్షించదలిస్తే రాజొక్కడేమి చేయగలడు? ఇలాంటి వ్యవస్థ లేకుంటే రాజు, ప్రధాని, సమర్థులైన రాజోద్యోగులందరూ అన్యాయాలను చేస్తూ, న్యాయ ధర్మాలను నిర్మూలించి సమస్త ప్రజలను సర్వనాశనం చేసి తాము కూడా నాశనమవుతారు. న్యాయయుక్త దండనే రాజనీ, ధర్మమనీ చెప్పే శ్లోకార్థాన్ని స్మరించండి. దానిని నష్టపరచేవారికంటే నీచుడు వేరొకడుండడు.

ప్రశ్న: ఇంత కఠినశిక్ష ఉండటం మంచిది కాదు. ఎందుకంటే మానవుడు ఏ అవయవాన్ని సృష్టించేవాడు గాని, జీవింపచేసేవాడు గాని కాడు. అందుకే ఇలాంటి శిక్ష ఇవ్వకూడదు.

జవాబు:- దీనిని కఠినశిక్ష అని భావించేవారు రాజనీతిని తెలియనివారే. ఒక్కరికి ఇలాంటి కఠిన శిక్ష లభిస్తే ఇతరులందరూ చెడుకార్యాలనుండి వైదొలగుతారు. చెడుకార్యాలను వీడి ధర్మమార్గంలో స్థిరంగా ఉండగలరు. వాస్తవానికి ఈ శిక్షలో ప్రజలందరి ఆవగింజంత భాగం కూడా రాదు. తేలికైన శిక్ష వేస్తే దుష్టకార్యాలు వృద్ధి అవుతాయి. మీరు ఏ దానిని తేలికైన శిక్ష అని చెబుతున్నారో అది కోట్ల కొలది రెట్లు అధికంగా ఉండటం వలన కోట్లకొలది రెట్లు కఠినంగా ఉంటుంది. అనేకమంది చెడుకార్యాలు చేసినపుడు వారికి కొద్ది కొద్దిగానైన శిక్ష ఇవ్వవలసి ఉంటుంది. అంటే ఒకరికి ఒక మణుగు (10 కిలోల బరువు) దండనా, వేరొకరికి పావు (రెండున్నర కిలోలు) దండనా వేస్తే రెండూ కలిసి మణుగుంబావు (పన్నెండున్నర కిలోల) దండన అవుతాయి. దానిని వారిద్దరికీ సమభాగం చేసిన ఒక్కొక్కరికి ఆరుంబావు కిలోల దండన అవుతుంది. ఇలాంటి తేలికైన దండనను దుష్టులు ఏ

మాత్రం లక్ష్యపెట్టరు. ఒకరికి ఒక మణుగు దండనా, వేయిమందిలో ప్రతి ఒక్కరికి ఒక్కొక్కపావు దండన విధించబడినదని అనుకోండి. అప్పుడు ఆ వేయిమంది దండనకలిసి మానవజాతిపై ఆరుమణుగుల పావు దండన పడుతుంది. కాబట్టి ఇదే అధికం, కఠినమవుతున్నది. ఒక్క మణుగు దండన ఒకరికిచ్చిన అది దానికంటే తక్కువై, తేలికైనదీ కాగలదు.

సముద్రమార్గం - పన్ను వ్యవస్థ

దీర్ఘాధ్వని యథాదేశం యథా కాలం తరో భవేత్ ।
నదీతీరేషు తద్విద్యాత్సముద్రే నాస్తి లక్షణమ్ ॥ మను. 8-406 ॥

మిక్కిలి పొడవైన మార్గాలలో, సముద్రాల రేవులలో, నదీనదాలలోని ఆ యా ప్రదేశాలయొక్క వైశాల్యాన్ని బట్టి పన్ను విధించాలి. మహాసముద్రంలో ఒక నిశ్చితమైన పన్ను విధించరాదు. కాబట్టి రాజుకు, గొప్ప గొప్ప నౌకలను సముద్రంపై నడుపువారికి లాభం కలుగునట్లుగా అనుకూలాన్ని బట్టి వ్యవస్థ చేయాలి. 'ప్రాచీన కాలంలో నౌకలు లేకపోయేవి' అని చెప్పేవారి మాటలు అసత్యాలని దీని ద్వారా తెలుసుకోవాలి. దేశదేశాంతరాలకు, ద్వీప ద్వీపాంతరాలకు నౌకలపై పోయి వచ్చే తన ప్రజలను సర్వత్ర రక్షిస్తూ రాజు వారికి ఏవిధమైన దుఃఖాన్ని కలిగించకూడదు.

అహన్యహన్యవేక్షేత కర్మాన్ తాన్వాహనాని చ ।
ఆయవ్యయౌ చ నియతావాకరాన్కోశమేవ చ ॥ మను. 8-419 ॥

రాజు ప్రతిరోజూ తన కార్యాలను ముగించుకున్న పిదప గజ, తురగాది వాహనాలను, ఆదాయవ్యయాలను, ధనరాశులను, రత్నాది నిధులను, ధనాగారాన్ని పర్యవేక్షిస్తూ ఉండాలి.

ఏవం సర్వానిమాన్రాజా వ్యవహారాన్సమాపయన్ ।
వ్యపోహ్య కిల్బిషం సర్వం ప్రాప్నోతి పరమాం గతిమ్ ॥ మను. 8-420 ॥

ఈ విధంగా రాజు సమస్త రాజ్యవ్యవహారాలను యథారీతిగా పూర్తిజేస్తూ, చేయిస్తుండటం వలన అతడు సమస్త పాపాల నుండి విముక్తుడై పరమగతియైన మోక్షసుఖాన్ని పొందుతారు.

ప్రశ్న: సంస్కృత విద్యలో రాజనీతి సంపూర్ణ ఉన్నదా? లేక అసంపూర్ణంగా ఉన్నదా?

జవాబు:- సంపూర్ణంగా ఉన్నది. ఈ భూగోళంలో ఎక్కడెక్కడ రాజనీతి నడచిందో, నడుస్తున్నదో, అదంతా సంస్కృతవిద్యనుండే గ్రహింపబడింది.ప్రత్యక్షంగా వ్రాయబడని విషయాలకొరకు -

ప్రత్యహం లోకదృష్టైశ్చ శాస్త్రదృష్టైశ్చ హేతుభిః ॥ మను. 8-3 ॥

అను ప్రమాణానుసారం, రాజుకు, ప్రజలకు సుఖకరాలు, ధర్మయుక్తములనీ అనుకున్న నియమాలను పూర్ణవిద్వాంసులు గల రాజసభ నిర్ణయించాలి.

బాల వృద్ధ వివాహాలు

ఈ క్రిందివాటిపై ప్రతి నిత్యం శ్రద్ధ వహించాలి. బాల్యదశలో వివాహం జరుగనివ్వకూడదు. యువావస్థలో పరస్పర ప్రసన్నత లేని వివాహాన్ని జరుపరాదు, జరిపించరాదు. యథారీతిగా బ్రహ్మచర్యాన్ని ఆచరిస్తూ ఆచరింపజేయాలి. శారీరిక, ఆత్మిక బలాలు సంపూర్ణంగా ఉండటానికి వ్యభిచారాన్ని, బహువివాహాలను ఆపివేయాలి. కేవలం విద్యా జ్ఞానాలతో ఆత్మబలాన్ని పెంచుకొని శరీరబలాన్ని సంపాదించకపోతే, వందల కొలది జ్ఞానులను, విద్వాంసులను ఒక్క బలిష్ఠుడైన పురుషుడు జయించగలడు. అలాగే కేవలం శారీరిక బలాన్నే పెంచుకొని, ఆత్మశక్తిని సంపాదించకపోతే, విద్య లేకుండా రాజ్యపాలనకు సంబంధించిన ఉత్తమ వ్యవస్థ ఎన్నడూ ఉండలేదు. వ్యవస్థయే లేకున్న అందరు పరస్పరం భేదాభిప్రాయం కలవారై, విరోధించి పోట్లాడుకొంటూ నష్టభ్రష్టులవుతారు. కాబట్టి ఎల్లప్పుడు శారీరిక, ఆత్మికశక్తులను వృద్ధిపరచుకోవాలి. వ్యభిచారం కంటే బలాన్ని, బుద్ధిని నాశనంచేసే విషయం మరేదీ లేదు. విశేషించి క్షత్రియులు దృఢగాత్రులై, బలిష్ఠులై ఉండాలి. వీరు విషయాసక్తులైతే రాజధర్మమే నశించిపోతుంది.

"యథా రాజా తథా ప్రజాః" చాణక్యనీతి 13-8.

అంటే 'రాజు ఎలా ప్రవర్తిస్తాడో అతని ప్రజలూ అలాగే ప్రవర్తిస్తారు' అనే విషయాన్ని మనస్సులో ఉంచు కోవాలి. రాజుగాని, రాజోద్యోగులుగాని దుష్టాచారులుగా ఉండరాదు. ప్రతినిత్యం ధర్మం కలిగి న్యాయంతో ప్రవర్తిస్తూ, అందరికీ ఆదర్శవంతులు కావాలి.

రాజధర్మాన్ని గురించి ఇక్కడ సంక్షిప్తంగా చెప్పబడింది. విశేషంగా తెలుసుకోవటానికి వేదాలను, మనుస్మృతిలోని సప్తమ, అష్టమ, నవమాధ్యాయాలను, శుక్రనీతిని, విదుర నీతిని, మహాభారతంలోని శాంతిపర్వంలోని రాజధర్మాన్ని, ఆపద్ధర్మం మొదలైన గ్రంథాలను పూర్ణరాజనీతి గలవారై మాండలికరాజులు, సార్వభౌమ చక్రవర్తులు రాజ్యపాలన చేయాలి.

"వయం ప్రజాపతేః ప్రజా అభూమ" (యజు. 18-29)

అను యజుర్వేదవచన ప్రకారంగా "మనం ప్రజాపతి యైన పరమేశ్వరుని ప్రజలం, పరమాత్మ మనకు రాజు. మనం అతనిసేవకులం, భృత్యులవంటి వారం అని తెలుసుకోవాలి. అతడు దయదలచి తన సృష్టిలో మనలను రాజ్యాధికారులుగా చేయుగాక! తన సత్యాన్ని, న్యాయాన్ని మన చేతులద్వారా ప్రవర్తింప చేయుగాక!

ఇకముందు ఈశ్వర, వేద విషయాలు వ్రాయబడతాయి.
శ్రీమద్దయానందసరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన
సత్యార్థప్రకాశంలో రాజధర్మ విషయాలు గల
షష్ఠ సముల్లాసం సంపూర్ణం.

సప్తమ సముల్లాసము

అథేశ్వర వేదవిషయం వ్యాఖ్యాస్యామః

ఈశ్వర, వేద విషయాలను వ్యాఖ్యానిస్తాము

ఈశ్వర వర్ణనం

ఋచో అక్షరే పరమే వ్యోమన్యస్మిన్ దేవా అధి విశ్వే నిషేదుః ।
యస్తన్న వేద కిమృచా కరిష్యతి య ఇత్తద్విదు స్త ఇమే సమాసతే ॥

ఋ. మం. 1. సూ. 164 మం. 39.

(ఋచో అక్షరే...) ఈ మంత్రానికి అర్థం బ్రహ్మచర్యాశ్రమశిక్షణలో తృతీయసముల్లాసంలో వ్రాయబడింది. సమస్త దివ్యగుణ, కర్మ, స్వభావ, విద్యాయుక్తుడై తనలో పృథ్వీ, సూర్యాది లోకాలను ధరించేవాడూ, ఆకాశంలాగా వ్యాపకుడూ దేవతలకందరికీ దేవుడైన పరమేశ్వరుని తెలుసుకోలేని, అంగీకరించని, ధ్యానించని మానవులు నాస్తికులు. వీరు మందమతులై నిరంతరం దుఃఖసాగరంలో మునిగి ఉంటారు. అతనిని తెలుసుకొన్నవారే సుఖపడతారు.

ప్రశ్న: ఈశ్వరులు అనేకులు ఉన్నారని వేదంలో కలదు. దీనిని మీరు అంగీకరిస్తారా? లేదా?

జవాబు:- అంగీకరించం. చతుర్వేదాలలో ఎక్కడ కూడా అనేక ఈశ్వరులున్నారని ప్రమాణాలు లేవు. ఈశ్వరుడు ఒక్కడే ఉన్నాడని అంతటా వ్రాయబడి ఉన్నది.

33 దేవతలు

ప్రశ్న: వేదాలలో అనేక మంది దేవతల గురించి వ్రాయబడి ఉంది. దీని అభిప్రాయమేమిటి?

జవాబు:- దేవత–దివ్యగుణాలు కలవారిని **'దేవతలు'** అంటారు. పృథ్వీ మొదలైనవి ఇలాంటివే. కాని వీనిని ఈశ్వరులని కాని, ఉపాసింపదగినవని కాని ఎక్కడా వ్రాయబడలేదు. ఈ మంత్రంలోనే

చూడండి! 'ఎవరిలో సమస్త దేవతలున్నాయో అతడే తెలియటానికి, ఉపాసించటానికి యోగ్యుడైన ఈశ్వరుడు' అని ఉన్నది. 'దేవత' శబ్దంతో ఈశ్వరుని గ్రహించటం మీ భ్రమయే.

పరమేశ్వరుడు దేవతలకు దేవుడవటంతో మహాదేవుడని చెప్పబడ్డాడు. అతడే సమస్త జగదుత్పత్తి స్థితి, ప్రళయాలకు కర్త, న్యాయాధీశుడు, అధిష్ఠాతయునై ఉన్నాడు. వేదాలలో 'త్రయస్త్రింశత్త్రిశతా' మొదలైన ప్రమాణాలు ఉన్నాయి. దీని వ్యాఖ్య శతపథబ్రాహ్మణంలో గలదు. ఇందులో 33 దేవతలని ఉన్నది. అవి 'పృథ్వి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాలు'. ఇవి సమస్త సృష్టికి నివాసస్థానాలవటం చేత వీటిని 'అష్ట వసువులు' అంటారు. 'ప్రాణం, అపానం, వ్యానం, ఉదానం, సమానం, నాగం, కూర్మం, కృకలం, దేవదత్తం, ధనుంజయం, జీవాత్మ' అనే ఈ 'పదకొండు రుద్రులు'.అంటే ఇవి శరీరాన్ని వీడునప్పుడు రోదింపజేస్తాయి - అంటే ఏడ్పిస్తాయి. ప్రాణులన్నింటి ఆయువును తీసుకొనిపోవటంచేత సంవత్సరంలోని పన్నెండు మాసాలను 'పన్నెండుగురు ఆదిత్యులు' అంటారు. పరమ ఐశ్వర్యానికి హేతువవటం చేత విద్యుత్తుకు 'ఇంద్రుడు' అని పేరు. యజ్ఞానికి 'ప్రజాపతి' అని పేరు. ఎందుకంటే, దానితో వాయువు, వృష్టిజలం, ఔషధాలు శుద్ధమౌతాయి. అంతేగాక విద్వాంసుల సత్కారం, అనేక ప్రకారాలైన శిల్పవిద్య ప్రజాపాలన మొదలగునవి యజ్ఞం వలన జరుగుతుంవి. ఈ 33ను (8 వసువులు, 11 రుద్రులు, 12 ఆదిత్యులు, 1 ఇంద్రుడు, 1 యజ్ఞం- ప్రజాపతి = 33) పూర్వోక్త గుణాలు కలిగి ఉండటం వలన 'దేవతలు' అంటారు. వీనికి స్వామి, అన్నిటికన్నా గొప్పవాడు అవటం చేత పరమాత్మేడఉపాసించదగిన 34వ దేవుడని శతపథంలో 14వ కాండంలో స్పష్టంగా వ్రాయబడి ఉన్నది. ఇదేవిధంగా ఇతరస్థలాలలోనూ వ్రాయబడి ఉంది. మీ రీ శాస్త్రాలను చదివితే వేదాలలో అనేక మంది ఈశ్వరులున్నారనే భ్రమలో పడేవారుకారు.

ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్ ।
తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్య స్విద్ధనమ్ ॥ యజు. 40-1 ॥

ఓ మానవులారా! ఈ బ్రహ్మండలోకంలో జగత్పదార్థాలన్నింటిలో వ్యాపించి వానిని నియమిస్తున్నవానిని 'ఈశ్వరుడు' అంటారు. అతనికే భయపడండి. అన్యాయంగా ఇతరుల ధనాన్ని కాంక్షించకండి. అన్యాయాన్ని త్యజించి న్యాయాచరణ రూప ధర్మం కలవారై ఆత్మతో ఆనందాన్ని అనుభవించండి.

అహం భువం వసునః పూర్వ్యస్పతిరహం ధనాని సం జయామి శశ్వతః ॥
మాం హవంతే పితరం న జంతవోఽహం దాశుషే విభజామి భోజనమ్ ॥

ఋ. 10-48-1 ॥

ఈశ్వరుడు మానవులందరికీ ఇలా ఉపదేశిస్తున్నాడు. ఓ మానవులారా! నేను ఈశ్వరుడ్ని అన్నింటి కంటె పూర్వం ఉన్నవాడను. సమస్త జగానికి పతిని. నేను సనాతనమైనవాడను. సమస్త

ధనాలను ఇచ్చేవాడిని కూడా నేనే. మీ తండ్రిని మీరు పిలుచునట్లుగా నన్నూ అలాగే పిలవాలి. నేను మీ అందరికీ సుఖాన్ని కలిగించేవాడ్ని. కాబట్టి ఈ లోకాన్ని పాలించటానికి అనేక విధాలైన భోజన పదార్థాలను సృష్టిస్తున్నాను.

అహమింద్రో న పరా జిగ్య ఇద్ధనం న మృత్యవేఽవతస్థే కదాచన ।
సోమమిన్మా సున్వంతో యాచతా వసు న మే పూరవః సఖ్యే రిషాథన ॥ ఋ. 10-48-5 ॥

నేను పరమ ఐశ్వర్యవంతుడైన జగత్ప్రకాశకుడను. నే నెప్పుడూ పరాజయాన్ని గాని, మృత్యువును గాని పొందను. నేనే జగద్రూప ధనానికి నిర్మాతను. అన్నింటినీ సృజించేవాడను నేనే అని తెలుసుకోండి. ఓ జీవులారా! ఐశ్వర్యప్రాప్తికి యత్నించే మీరు నా నుండే విజ్ఞానాది ధనాన్ని కోరుకోండి. నా మైత్రినుండి మీరు దూరం కారాదు.

అహం దాం గృణతే పూర్వ్యం వస్వహం బ్రహ్మ కృణవం మహ్యం వర్ధనమ్ ।
అహం భువం యజమానస్య చోదితాఽయజ్వనః సాక్షి విశ్వస్మిన్ భరే ॥ ఋ. 10-49-1 ॥

ఓ మానవులారా! సత్యభాషణ రూప స్తుతులను చేసేవారికి నేను సనాతన జ్ఞానాది ధనాలను ఇస్తాను. నేను బ్రహ్మను. అంటే వేదాలను ప్రకాశపరచినవాడను. నన్నుగురించి వేదం ఎంతోగొప్పగా తెలియజేస్తుంది. వేదం ద్వారానే సమస్త మానవుల జ్ఞానాన్ని వృద్ధిపరుస్తున్నాను. నేను సత్పురుషులకు ప్రేరకుడను, యజ్ఞాన్ని చేసేవారికి ఫలమిచ్చువాడను. ఈ విశ్వంలో గల సర్వకార్యాలను చేసేవాడను, ధరింసేవాడనూ నేనే. కాబట్టి నన్ను వీడి ఎవరినీ నా స్థానంలో అన్యులను పూజించకూడదు, అంగీకరించకూడదు.

హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్ ।
స దాధార పృథివీం ద్యాముతేమాం కస్మై దేవాయ హవిషా విధేమ ॥ యజు. 13-4 ॥

ఓ మానవులారా! పరమాత్ముడే సృష్టికి పూర్వం సూర్యాది ప్రకాశవంతమైన లోకాల ఉత్పత్తిస్థానానికి ఆధారుడై ఉన్నాడు. ఉత్పన్నమైనదానికీ, అవుతున్నదానికీ, కాగలదానికీ అతడే స్వామియై ఉండెను. ఉన్నాడు, ఉండగలడు. పృథ్వి మొదలుకొని సూర్యలోకపర్యంతంగల సృష్టినంతా రచించి అతడే ధరిస్తున్నాడు. ఆ సుఖస్వరూపుడైన పరమాత్ముని మేము భజించిన విధంగా మీరు కూడా భక్తితో సేవించండి.

ఈశ్వర సిద్ధి-ప్రమాణాలు

ప్రశ్న: మీరు 'ఈశ్వరుడు ఈశ్వరుడు' అని అంటున్నారే కాని అతడు ఉన్నాడని ఎలా ఋజువు చేయగలరు?

జవాబు:- ప్రత్యక్షాది ప్రమాణాలన్నింటితో.

ప్రశ్న: ఈశ్వరునియందు ప్రత్యక్షాది ప్రమాణాలెన్నడూ ఘటింపజాలవు.

జవాబు:- ఇంద్రియార్థసన్నికర్షోత్పన్నం జ్ఞానమవ్యపదేశ్య
మవ్యభిచారివ్యవసాయాత్మకం ప్రత్యక్షమ్ ॥ న్యాయ. అ-1-సూ. 4 ॥

ఇది గౌతమ మహర్షి కృత న్యాయదర్శనంలోని సూత్రం. శ్రోత్రం, చర్మం, చక్షువులు, జిహ్వ, ఘ్రాణం, మనస్సు అను ఇంద్రియాలకు శబ్ద, స్పర్శ రూప, రస, గంధ, సుఖ, దుఃఖ, సత్య, అసత్య విషయాలతో సంబంధం కలిగినప్పుడు పుట్టే జ్ఞానాన్ని ప్రత్యక్షమంటారు. అది భ్రమరహితమైఉండాలి. వాస్తవంగా ఇంద్రియాలకు, మనస్సుకు, గుణాలే ప్రత్యక్షమవుతాయి. గుణి (గుణాలు కలది) ప్రత్యక్షం కాదు. చర్మం మొదలైన నాలుగు ఇంద్రియాలతో స్పర్శ, రూప, రస, గంధాల జ్ఞానం కలిగి, గుణియైన పృథ్విని ఆత్మతో కూడిన మనస్సు ప్రత్యక్షం చేసుకొంటుంది. అలాగే ఈ ప్రత్యక్ష సృష్టిలో గల రచనా విశేషాలు, జ్ఞానాది గుణాలు ప్రత్యక్షమవటం వలన పరమేశ్వరుడు ప్రత్యక్షమౌతున్నాడు. ఆత్మ మనస్సును, మనస్సు ఇంద్రియాలను, ఏదైనా విషయంలో పెట్టినప్పుడు గాని, దొంగతనం మొదలైన దుష్టకార్యాలు గాని, పరోపకారాది ఉత్తమ కార్యాలు గాని చేయటానికి ఆరంభించిన మరుక్షణంలోనే జీవుని ఇచ్ఛాజ్ఞానాలు ఆ ఇష్టవిషయం వైపుకు ఆకర్షితమవుతాయి. ఆ సమయంలో, చెడుకార్యాలు చేసినపుడు అంతరాత్మలో భయం, సందేహం, సిగ్గు కలుగుతుంది. మంచిపని చేసినప్పుడు నిర్భయం, నిస్సందేహం, ఆనందోత్సాహాలు కలుగుతాయి. ఇలా ఇవి జీవాత్మనుండి కలగటం లేదు. అంతరంగంలో ఉన్న పరమాత్మ నుండే కలుగుతున్నాయి. జీవాత్మ పవిత్రుడై, పరమాత్ముని గురించి ఆలోచించటంలో నిమగ్నుడైతే, అతనికి ఆ క్షణంలోనే జీవాత్మ పరమాత్మలు ఇద్దరూ ప్రత్యక్షమవుతారు. ఇలా పరమేశ్వరుడు ప్రత్యక్షమైతే ఇక అనుమానాది ప్రమాణాలతో పరమేశ్వరుని తెలుసుకోవడంలో సందేహమేముంది? ఎందుకంటే కార్యాన్ని చూస్తే కారణాన్ని అనుమానిస్తాము కదా!

ఈశ్వర వ్యాపకత

ప్రశ్న: ఈశ్వరుడు వ్యాపకుడా? లేక ఏదైనా ఒక ప్రత్యేక స్థలంలో ఉంటాడా?

జవాబు:- అతడు వ్యాపకుడు. అతడు ఒకే చోట ఉంటే సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వనియంత, సర్వస్రష్ట, ప్రళయకర్త కాలేడు. కర్త లేని చోట క్రియ జరగటం అసంభవం.

ప్రశ్న: పరమేశ్వరుడు దయాళువు. న్యాయకారి. అవునా ? కాదా?

జవాబు:- అవును.

ప్రశ్న: ఈ రెండు గుణాలు పరస్పర విరుద్ధాలు. న్యాయం చేసిన దయ; దయను చూపిన న్యాయం జరగదు. కారణమేంటంటే! చేసిన కర్మలకు సమానంగా సుఖదుఃఖాలను ఇవ్వడమే 'న్యాయం' అవుతుంది. అపరాధికి దండనను ఇవ్వక వదలిపెట్టటం 'దయ' అవుతుంది.

న్యాయం - దయ

జవాబు:- న్యాయానికి, దయకు నామమాత్రంగానే భేదముంది. న్యాయం వలన కలిగే ప్రయోజనమే దయ వలన కూడ కలుగుతుంది. మానవుడు అపరాధాలను చేయటం మాని దుఃఖాన్ని పొందకుండుటయే దండన వలన కలుగే ప్రయోజనం. పరుల దుఃఖాలను తొలగించటమే 'దయ' అవుతుంది. దయకు న్యాయానికి మీరు చెప్పిన అర్థం సరైనది కాదు. ఎవడెంత చెడుపని చేస్తాడో వానికంతే శిక్ష వేయటం 'న్యాయం' అంటారు. అపరాధికి శిక్ష ఇవ్వకున్న 'దయ' నశిస్తుంది. ఒక అపరాధియైన బందిపోటుదొంగను విడిచిపెడితే వేలకొలది ధర్మాత్ములకు దుఃఖం కలిగించటమవుతుంది. ఒకనిని విడిచి వేలకొలది మనుష్యులకు దుఃఖాన్ని కలిగించే పని దయ ఎలా అవుతుంది? ఆ దొంగను కారాగారంలో బంధించి ఉంచి అతడు పాపాలు చేయకుండా చేయటం, అతనిపై దయ చూపిన వారమవుతాము. ఆ దొంగను చంపితే వేలకొలది ఇతర మానవులపై దయ చూపినట్లు అవుతుంది. అంతేకాని దండించక అపరాధిని విడిచిపెట్టటం దయకాదు.

ప్రశ్న: అలాగైతే దయ, న్యాయం అని రెండు శబ్దాలు ఎందుకున్నాయి? రెండింటి అర్థం ఒకటే అయితే రెండు శబ్దాలుండటం వ్యర్థమే కదా! ఒకే శబ్దం ఉండటం మంచిది. కాబట్టి దయ, న్యాయాల ప్రయోజనం ఒకటి కాదని తెలుస్తున్నది.

జవాబు:- ఏమిటి? ఒకే అర్థంలో అనేక శబ్దాలు, ఒకే శబ్దానికి అనేక అర్థాలు ఉండవా? ఉండకూడదా?

ప్రశ్న: ఉంటాయి.

జవాబు:- ఉంటే మీకు ఇలాంటి సందేహం ఎలా కలుగుతున్నది?

ప్రశ్న: లోకంలో వినటం చేత.

జవాబు:- లోకంలో సత్యాన్ని, అసత్యాన్ని రెండింటిని వింటున్నాము. కాని వానిని ఆలోచించి నిశ్చయించుకోవటం మన పని. ఈశ్వరుని సంపూర్ణ దయ ఎలాంటిదో చూడండి! అతడు సమస్త జీవుల ప్రయోజన సిద్ధికై జగత్తులోని పదార్థాలనన్నింటిని సృజించి ఇచ్చాడు. దీనికన్న మించిన గొప్ప దయ మరేముంటుంది? ఇక అతని న్యాయఫలితం కూడా ప్రత్యక్షంగా కనిపిస్తున్నది. సుఖదుఃఖాల వ్యవస్థ ఎక్కువ తక్కువ ఫలితాలను తెలియజేస్తున్నది. అందరికీ సుఖం కలగాలనీ, దుఃఖం తొలగాలనీ, మనస్సులో కోరుతూ, అలాగే పనిచేయటం 'దయ' అవుతుంది. బంధించటం, ఖండించటం, దండించటం మొదలైన బాహ్యచేష్టలను యథారీతిగా చేయటమే 'న్యాయం' అంటారు. పాపంనుండీ, దుఃఖంనుండీ అందరినీ దూరం చేయటమే ఈ రెండింటి ప్రయోజనం.

ప్రశ్న: ఈశ్వరుడు సాకారుడా? నిరాకారుడా?

జవాబు:- నిరాకారుడు. ఎందుకంటే సాకారుడైతే వ్యాపకుడు కాలేడు. వ్యాపకుడు కాకపోతే సర్వజ్ఞత్వాది గుణాలు ఈశ్వరునిలో ఘటించలేవు. పరిమిత పదార్థాలలోని గుణ, కర్మ, స్వభావాలు పరిమితాలుగానే ఉంటాయి. అది శీతోష్ణాలు, ఆకలి దప్పులు, రోగం, దోషం, ఛేదన, భేదనాలు మొదలైనవి లేనివాడు కాబట్టి ఈశ్వరుడు నిరాకారుడని నిశ్చయమవుతున్నది. అతడు సాకారుడైతే అతని ముక్కు, చెవి, కన్నులు మొదలైన అవయవాలను చేసేవాడు మరొకడు ఉండాలి. సంయోగంతో ఉత్పన్నమైన దానిని సంయుక్తపరచేవాడు, చేతనుడుగా తప్పక ఉండాలి. ఈశ్వరుడు తనంత తానే తన శరీరాన్ని పుట్టించుకొన్నాడని ఎవరైన చెప్పినా, అతడు శరీరస్థుడవటానికి పూర్వం నిరాకారుడే అని ఋజువవుతున్నది. అందుకే పరమాత్ముడు ఎన్నడూ శరీరాన్ని ధరించడు. అతడు నిరాకారుడు అవటం వలన సూక్ష్మ కారణాలనుండి జగత్తును స్థూలాకారంగా చేస్తాడు.

ఈశ్వరుడు సర్వశక్తిమంతుడు

ప్రశ్న: ఈశ్వరుడు సర్వశక్తిమంతుడా? కాడా?

జవాబు:- సర్వశక్తిమంతుడే. కాని మీరు సర్వశక్తిమంతుడు అనే శబ్దానికి అనుకొన్న అర్థంలో వాడు కాడు. 'ఈశ్వరుడు సృష్టించటం, పాలించటం, లయంచేయటం, జీవుల పాపపుణ్యాలకు తగిన వ్యవస్థ చేయటం' అనే తన కార్యాలలో ఎవరి సహాయాన్ని కించిన్మాత్రం కూడా తీసుకోడు. ఇదే అతడు సర్వశక్తిమంతుడు అనటానికి అర్థం. అతడు తన అనంత సామర్థ్యంతో తన కార్యాలనన్నింటినీ పూర్తిచేసుకొంటాడు.

ప్రశ్న: ఈశ్వరునికి పైన ఎవరూ లేరు. కాబట్టి అతడు తన ఇష్టం వచ్చినట్లుగా కోరినదల్లా చేయునని మేము అనుకుంటున్నాము.

జవాబు:- అయినా అతడు ఏమి కోరుతాడు? అతడు 'అన్నీ కోరుతూ అన్నీ చేయకలుగుతాడని మీరు అంటే, మిమ్ము ఇలా ప్రశ్నించవలసి వస్తుంది: ఈశ్వరుడు తనను తాను చంపుకొని అనేక ఈశ్వరులను సృజిస్తాడా? స్వయంగా, తాను అవిద్వాంసుడై దొంగతనం, వ్యభిచారాది పాపకర్మలు చేసి, దుఃఖాలను అనుభవిస్తాడా? ఇవన్నీ ఈశ్వరుని గుణ, కర్మ, స్వభావాలకు విరుద్ధమైనవి. మీరు అనుకున్నట్లుగా అతడన్నిటినీ చేయగలుగుతాడనటం ఎన్నడూ సంభవం కాదు. అందుకే సర్వశక్తిమంతుడు అనే శబ్దానికి మేము చెప్పిన అర్థమే సరైనది.

ప్రశ్న: పరమేశ్వరుడు ఆదియా? అనాదియా?

జవాబు:- అనాది. దేనికి ఆది గాని, కారణం గాని, సమంగాని ఉండదో అది అనాది అవుతుంది. ఇలాంటి అర్థాలు ప్రథమ సముల్లాసంలోనే వ్రాయబడ్డాయి. అక్కడ చూడండి.

ప్రశ్న: పరమేశ్వరుడు ఏమి కోరుతాడు?

జవాబు:- అందరి క్షేమాన్ని, సుఖాన్ని కోరుతాడు. ఎవరు ఏ పాపం చేసినా చేయకున్నా, తాను స్వతంత్రంగా ఎవరినీ పరాధీనం చేయడు.

ఈశ్వరస్తుతి ప్రార్థనోపాసనలు

ప్రశ్న: పరమేశ్వరుని స్తుతి, ప్రార్థన, ఉపాసనలను చేయాలా? లేదా?

జవాబు:- చేయాలి.

ప్రశ్న: స్తుతి మొదలైనవి చేస్తే ఈశ్వరుడు తన నియమాలను వీడి స్తుతి, ప్రార్థనలు చేసినవారి పాపాలను తొలగిస్తాడా?

జవాబు:- తొలగించడు.

ప్రశ్న: అలాగైతే స్తుతి ప్రార్థనలనెందుకు చేయాలి?

జవాబు:- వానిని చేస్తే కలిగే ఫలితం వేరే ఉన్నది.

ప్రశ్న: అదెలాంటి ఫలితం?

జవాబు:- స్తుతి వలన ఈశ్వరునిపట్ల ప్రీతి కలుతుగుంది. అతని గుణ, కర్మ, స్వభావాలను అనుసరించి తన గుణ, కర్మ, స్వభావాలను దిద్దుకోవటం జరుగుతుంది. ప్రార్థన వలన 'నిరభిమానం, ఉత్సాహం, అతని సహాయం లభిస్తుంది. ఉపాసన వలన పరబ్రహ్మతో స్నేహం, అతని సాక్షాత్కారం కలుగుతుంది'.

ప్రశ్న: వీటిని స్పష్టంగా తెలపండి?

1. ఈశ్వర స్తుతి:

జవాబు:- వినండి – స పర్యగాచ్ఛుక్రమకాయమవ్రణమస్నావిరగ్ం శుద్ధమపాపవిద్ధమ్ ।
కవిర్మనీషీ పరిభూః స్వయంభూర్యాథాతథ్యతోఽర్థాన్
వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః ॥ యజు. 40–8 ॥

ఆ పరమాత్ముడు అన్నింటిలో వ్యాపకుడు, శీఘ్రకారి, అనంతుడు, బలవంతుడు, శుద్ధుడు, సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వోపరి విరాజిల్లువాడు, సనాతనుడు, స్వయంసిద్ధుడు, పరమేశ్వరుడునై ఉన్నాడు. అనాది జీవరూపులైన తన ప్రజలకు తన సనాతన 'విద్య' అయిన 'వేదం' ద్వారా యథారీతిగా అర్థాన్ని బోధిస్తున్నాడు. దీనిని **'సగుణ స్తుతి'** అంటారు. ఆ యా గుణాలు గలవాడై పరమేశ్వరుని స్తుతించటం సగుణ స్తుతి. అకాయం = అతడు ఎన్నడూ శరీరాన్ని ధరించడు, జన్మించడు. అతనికి ఏ ఛిద్రాలు లేవు. నాడీ మొదలైనవాటితో బంధించబడడు. పాపాలను ఎన్నడూ చేయడు. అతనికి

క్లేశాలు, దుఃఖాలు, అజ్ఞానం ఎన్నడూ కలుగవు. ఇలా రాగద్వేషాది గుణాలకు భిన్నునిగా పరమేశ్వరుని భావించి స్తుతించటం 'నిర్గుణ స్తుతి' అంటారు. మన గుణ, కర్మ, స్వభావాలను అతని లాగే అనుకోవటం వీనికి ఫలితం. అతడు న్యాయకారి అయితే మనం కూడా న్యాయకారులమే కావాలి. కేవలం భట్రాజులవలె పరమేశ్వరుని గుణకీర్తన చేస్తూ శీలాన్ని, ప్రవర్తనను చక్కబరచుకోకపోతే అతనిని స్తుతించటం వ్యర్థమే అవుతుంది.

2. ఈశ్వర ప్రార్థన:

యాం మేధాం దేవగణాః పితరశ్చోపాసతే ।
తయా మామద్య మేధయాఽగ్నే మేధావినం కురు స్వాహా ॥ యజు. 32-14॥

అగ్నే = ప్రకాశ స్వరూపుడవైన ఓ పరమాత్మా! నీవు కృపాకటాక్షంతో విద్వాంసులు, జ్ఞానులు, యోగులు ఉపాసించునట్టి బుద్ధిని మాకు కలిగించి ఈ వర్తమాన సమయంలో మమ్ము బుద్ధిమంతులుగా చేయుము.

తేజోఽసి తేజో మయి ధేహి! వీర్యమసి వీర్యం మయి ధేహి ।
బలమసి బలం మయి ధేహి । ఓజోఽస్యోజో మయి ధేహి ।
మన్యురసి మన్యుం మయి ధేహి । సహోఽసి సహో మయి ధేహి ॥ యజు. 19-9 ॥

నీవు ప్రకాశ స్వరూపుడవు. దయతో నాలో కూడా ప్రకాశాన్ని నింపు. నీవు అనంత పరాక్రమయుక్తుడవు. నీ కృపాకటాక్షంతో నాకు కూడా సంపూర్ణ పరాక్రమాన్ని ఇవ్వు. నీవు అనంత బలం కలవాడవు. నాకు కూడా బలాన్ని ప్రసాదించు. నీవు అనంత సామర్థ్యం కలవాడవు. నాకు కూడా పూర్ణ సామర్థ్యాన్ని ప్రసాదించు. నీవు దుష్టకార్యాల పట్ల, దుష్టుల పట్ల క్రోధం కలవాడవు. నేను కూడా అలాగే ఉండునట్లు చేయి. నీవు నిందించేవారిని, స్తుతించేవారిని, నీ పట్ల అపరాధం చేసినవారిని సహించేవాడవు. దయతో నన్ను కూడా నీ లాగే సహించేవానినిగా చేయి.

యజ్జాగ్రతో దూరముదైతి దైవం తదు సుప్తస్య తథైవైతి ।
దూరంగమం జ్యోతిషాం జ్యోతిరేకం తన్మే మనః శివసంకల్పమస్తు ॥ యజు. 34-1 ॥

ఓ దయానిధీ! నీ కృపతో జాగ్రదవస్థలో నా మనస్సు దూర దూరాలకు పోతూ, దివ్యగుణయుక్తమై ఉన్నది. నిద్రించేటపుడు సుషుప్తిని పొందటమో లేక స్వప్నంలో దూరదూరాలకు పోవునట్లు నా మనస్సు వ్యవహరిస్తుంది. సర్వప్రకాశాలకు ప్రకాశమయిన నా మనస్సు 'శివ సంకల్పం' కలది అవుగాక! అంటే తనకూ ఇతర ప్రాణులకూ కల్యాణాన్ని కోరునదీ, ఎవరికీ ఎన్నడూ హానిగలిగించనిదీ అగుగాక!

యేన కర్మాణ్యపసో మనీషిణో యజ్ఞే కృణ్వంతి విదథేషు ధీరాః ।
యదపూర్వం యక్షమంతః ప్రజానాం తన్మే మనః శివసంకల్పమస్తు ॥ యజు. 34-2 ॥

ఓ సర్వాంతర్యామీ! కర్మచేసే ధర్మాత్ములైన విద్వాంసులు యజ్ఞాలలో, యుద్ధాలలో, ఏ మనస్సుతో కర్మలు చేస్తారో, అది అపూర్వసామర్థ్యం కలదై, ప్రజల హృదయాలలో పూజనీయమై ఉన్నది. నా మనస్సు కూడా అలాంటి ధర్మకార్యాలను చేసే కోరిక కలదై అధర్మాన్ని సర్వదా త్యజించి శివసంకల్పం కలది అగుగాక!

యత్ప్రజ్ఞానముత చేతో ధృతిశ్చ యజ్జ్యోతిరంతరమృతం ప్రజాసు ।
యస్మాన్న ఋతే కించన కర్మ క్రియతే తన్మే మనః శివసంకల్పమస్తు ॥ యజు. 34-3 ॥

శ్రేష్ఠజ్ఞానం కలదై, ఇతరులను జాగృతం చేసే నిశ్చయాత్మక ప్రవృత్తి కలదై, ప్రజా హృదయాలలో ప్రకాశయుక్తమై, నాశరహితమై ఉండునట్టి మనస్సు లేకుండా ఎవరు కూడా, ఏ కార్యాలను చేయలేరు. నా మనస్సు కూడా అలాంటి పవిత్రగుణాలను కాంక్షిస్తూ, దుర్గుణాలనుండి దూరమై శివసంకల్పం కలది అగుగాక!

యేనేదం భూతం భువనం భవిష్యత్పరిగృహీతమమృతేన సర్వం ।
యేన యజ్ఞస్తాయతే సప్తహోతా తన్మే మనః శివసంకల్పమస్తు ॥ యజు. 34-4 ॥

ఓ జగదీశ్వరా! సర్వయోగులు ఈ భూత, భవిష్యత్, వర్తమాన వ్యవహారాలను దేనితో తెలుసుకొంటారో నాశరహితుడైన జీవాత్మను పరమాత్మలో చేర్చి సర్వవిధాల త్రికాలజ్ఞునిగా ఏది చేస్తుందో జ్ఞానం, క్రియలును కలదై, పంచ జ్ఞానేంద్రియాలతో, బుద్ధితో, ఆత్మతో కలిసి ఏది ఉ ంటుందో; యోగరూప యజ్ఞాన్ని దేనితో వృద్ధిచేస్తారో అలాంటి నా మనస్సు యోగవిజ్ఞానాలతో కూడి, అవిద్యాదిక్లేశాల నుండి దూరంగా ఉండి శివసంకల్పం కలది అగుగాక!

యస్మిన్నృచః సామ యజూగ్ంషి యస్మిన్ప్రతిష్ఠితా రథనాభావివారాః ।
యస్మిన్శ్చిత్తగ్ం సర్వమోతం ప్రజానాం తన్మే మనః శివసంకల్పమస్తు ॥ యజు. 34-5 ॥

పరమ విద్వాంసుడవైన ఓ పరమేశ్వరా! రథచక్రం మధ్యలో ఉండే అడ్డాకుల లాగా ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం మరియు అథర్వవేదం దేనిలో ప్రతిష్ఠించబడి ఉన్నవో, దేనిలో సర్వజ్ఞుడు, సర్వ వ్యాపకుడు, సర్వప్రజా సాక్షియో, చిత్తచేతనం విదితమవుతందో అలాంటి నా మనస్సు నీ దయతో అవిద్యను నష్టపరచి సదా విద్యాప్రియమైనదై శివసంకల్పం కలది అగుగాక!

సుషారథిరశ్వానివ యన్మనుష్యాన్నేనీయతేఽభీశుభిర్వాజిన ఇవ ।
హృత్ప్రతిష్ఠం యదజిరం జవిష్ఠం తన్మే మనః శివసంకల్పమస్తు ॥ యజు. 34-6 ॥

ఓ సర్వ నియంతవైన ఈశ్వరా! పగ్గాలతో కట్టబడిన గుఱ్ఱాలను అశ్వనియంతయైన సారథి ఇటు-అటు నడుపు విధంగా, మనుష్యులను అటు-ఇటు త్రిప్పు మనస్సు హృదయంలో ప్రతిష్ఠితమై ఉన్నది. అత్యంత వేగాన్ని, గతిని కలదై ఉన్న ఈ నా మనస్సు సర్వేంద్రియాలను అధర్మాచరణం నుండి తొలగించి నిరంతరం ధర్మమార్గంలో నడుపునట్లు నీ కృపాకటాక్షాన్ని నాపై చూపించు.

అగ్నే నయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్ ।
యుయోధ్యస్మజ్జుహురాణమేనో భూయిష్ఠాంతే నమ ఉక్తిం విధేమ ॥ యజు. 40-16 ॥

ఓ సుఖప్రదాతా! ప్రకాశస్వరూపా! సర్వాన్ని తెలిసిన ఓ పరమాత్మా! మమ్ము శ్రేష్ఠమార్గంలో నడిపి సంపూర్ణ ప్రజ్ఞానమును మాకు అందజేయుము. కుటిల పాపాచరణమార్గం నుండి మమ్ము దూరం చేయుము. మమ్ము పవిత్రులుగా చేయుమని నిన్ను మేము వినయ విధేయతలతో చాలాచాలా స్తుతిస్తున్నాము.

మానో మహాంతముత మా నోఽ అర్భకం మా న ఉక్షంతముత మా న ఉక్షితమ్ ।
మా నోవధీః పితరం మోత మాతరం మా నః ప్రియాస్తన్వో రుద్ర రీరిషః ॥ యజు. 16-15 ॥

ఓ రుద్రుడా! దుష్టుల పాపాలకు దుఃఖస్వరూప ఫలమొసగి దుఃఖింపచేసే పరమేశ్వరా! నీవు మా పిన్నలను, పెద్దలను, మాతా పితరులను, ప్రియ బంధువర్గాన్ని, ఇతర శరీరధారులను చంపటానికి ప్రేరేపించకు. నీ శిక్షకు గురికాలేని మార్గంలో మమ్ము నడిపించు.

అసతో మా సద్గమయ, తమసో మా జ్యోతిర్గమయ, మృత్యో
ర్మాఽ మృతం గమయేతి ॥ శతపథబ్రాహ్మ. 14-3-1-30 ॥

"పరమ గురువైన ఓ పరమాత్మా! అసన్మార్గం నుండి తొలగించి మమ్ములను సన్మార్గులుగా చేయుము, అవిద్యాంధకారం నుండి విడిపించి విద్యారూప భానుని పొందేలా చేయుము. మృత్యురోగంనుండి దూరపరచి మోక్షానందరూపమైన అమృతాన్ని ప్రసాదించు."

ఏ యే దోషాలు, దుర్గుణాలు పరమేశ్వరునిలో లేవో అవి తనలో కూడ ఉండకూడదని పరమేశ్వరుని ప్రార్థించినపుడు ఆ ప్రార్థన విధిపూర్వకమైతే సగుణమనీ నిషేధపూర్వకమైతే నిర్గుణమనీ చెప్పబడింది. మానవుడు ఏది కావాలని ప్రార్థిస్తాడో దానికి తగినట్లు ప్రవర్తించాలి. సర్వోత్తమ బుద్ధిని పొందటానికి పరమేశ్వరుని ప్రార్థించినపుడు దానిని పొందటానికి తనకు చేతనైనంత ప్రయత్నం కూడా చేయాలి. పురుషార్థం చేస్తూ ప్రార్థించటం యోగ్యం. 'ఓ పరమేశ్వరా! నా శత్రువులను నాశనం చేయుము. నన్ను అందరికంటే గొప్పవాడిని చేయుము. ప్రతిష్ఠ నాకే కలగాలి. నా వశంలో అందరూ ఉండాలి' మొదలైన ప్రార్థనలనెన్నడూ చేయకూడదు. ఇలాంటి ప్రార్థనలను భగవంతుడంగీకరించడు. ఇద్దరు శత్రువులు పరస్పర నాశనానికై ప్రార్థిస్తే పరమేశ్వరుడు ఆ ఇద్దరినీ నాశనం చేయవలసినదేనా! ఎవరి

భక్తి ప్రేమలు అధికమో వారి ప్రార్థన సఫలమైతాయని ఎవరైనా అంటే ఎవరి భక్తి తక్కువో వారి శత్రువుకు తక్కువ నాశనమైనదని చెప్పవలసి వస్తుంది. ఇట్టి మూర్ఖపు ప్రార్థనలు చేస్తూ 'ఓ పరమేశ్వరా! మాకు రొట్టెలు చేసి తినిపించండి. నా గృహంలో ఊడ్చి, వస్త్రాలను ఉతికి, పొలం పనులు చేయండి' అని కూడ ఎవడైన ప్రార్థించగలడు. ఇలా పరమేశ్వరుడు అన్నిటిని చేస్తాడనే విశ్వాసంతో సోమరులై కూర్చునేవారు మహామూర్ఖులు. ఎందుకంటే 'పురుషార్థాలను చేయండి' అనే పరమేశ్వరుని ఆజ్ఞను ఉల్లంఘించేవారు ఎన్నడూ సుఖాన్ని పొందలేరు.

కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ం సమాః ॥ యజు. 40-2 ॥

మానవుడు వందసంవత్సరాలపర్యంతం అంటే జీవించినంతకాలం కర్మలను చేస్తూనే జీవింపగోరుకోవాలి, సోమరిగా ఎప్పుడూ ఉండరాదనీ పరమేశ్వరుడు ఆజ్ఞాపిస్తున్నాడు.

చూడండి! సృష్టిలో గల ప్రాణులు, అప్రాణులు (జడ చేతనాలు) అన్నీ తమ తమ కర్మలను, యత్నాలను చేస్తూనే ఉన్నాయి. పిపీలికాది ప్రాణులు నిరంతరం ప్రయత్నిస్తున్నాయి. పృథివ్యాది గోళాలు క్రమం తప్పకుండా నిరంతరం భ్రమణం చేస్తున్నాయి. వృక్షాలు నిరంతరం వృద్ధిచెందుతూ క్షీణిస్తున్నాయి. ఈ దృష్టాంతాలను మానవుడు కూడా గ్రహించటం యోగ్యం. పురుషార్థం చేసేవానికి ఇతరులు సహాయం చేస్తారు. ధర్మమార్గంలో పురుషార్థం చేసే పురుషునికి పరమేశ్వరుడు కూడా తోడ్పడతాడు. పనులు చేసేవారికే సేవకులు పనులు చేస్తారు. సోమరులవద్ద చేయరు. చూడాలనే కోరిక ఉండి, కన్నులున్నవారికి మాత్రమే చూపిస్తాము. గ్రుడ్డివారికి చూపము. ఇలాగే పరమేశ్వరుడు అందరికీ మేలు కలిగించే ప్రార్థనలను చేసినవారికే సహాయపడతాడు. హానికర కార్యాలలో తోడ్పడడు. బెల్లం తియ్యగా ఉంటుందని చెప్పినంత మాత్రాన నోరు తియ్యనవదు దానికై ప్రయత్నించేవానికి శీఘ్రంగానైనా, ఆలస్యంగానైనా బెల్లం లభిస్తుంది. తింటే దాని గుణం తెలుస్తుంది.

3. ఉపాసన:

మూడవది ఉపాసన: **సమాధినిర్ధూతమలస్య చేతసో నివేశితస్యాత్మని యత్సుఖం భవేత్ ।**
న శక్యతే వర్ణయితుం గిరా తదా స్వయం తదంతఃకరణేన గృహ్యతే ॥
(మైత్రాయణ్యుపనిషత్తు. 4-3-9 ॥)

ఇది ఉపనిషత్ వచనం. సమాధియోగంలో అవిద్యాది దోషాలు హరింపబడటంతో ఆత్మస్థుడై పరమాత్మునిలో చిత్తాన్ని లగ్నపరచేవానికి యోగంలో ఆనందం కలుగుతుంది. అది వాణితో వర్ణించటానికి వీలుకాదు. ఆ యొక్క ఆనందాన్ని జీవాత్మ తన అంతఃకరణంతోనే గ్రహిస్తుందిఉపాసన అనగా సమీపస్థుడవటం అని అర్థం. అష్టాంగయోగంతో పరమాత్ముని సమీపించటానికి,అతనిని సర్వ వ్యాపిగా, సర్వాంతర్యామిగా ప్రత్యక్షం చేసుకొనటానికి చేయవలసిన కార్యాలనన్నింటిని చేయాలి.

చేయవలసినవి ఇవి:

తత్రాఽహింసా సత్యాస్తేయబ్రహ్మచర్యాఽపరిగ్రహా యమాః ॥ యోగ. సాధనపాదం. 30 ॥

ఇత్యాది సూత్రాలు పాతంజల యోగశాస్త్రంలోనివి. ఉపాసనను ఆరంభించేవారు మొదట ఈ క్రిందివానిని పాటించాలి. 1. ఎవరితోనూ వైరభావాలను కలిగి ఉండరాదు. సదా అందరితో ప్రేమతో మెలగాలి. 2. ఎల్లప్పుడు సత్యాన్నే చెప్పాలి. అసత్యాన్ని ఎప్పుడూ పలుకరాదు. 3. దొంగతనం చేయకూడదు. సత్యవ్యవహారాలనే చేయాలి. 4. జితేంద్రియుడు కావాలి. 5. లంపటత్వం అనగా అత్యాసక్తిని వీడాలి. నిరభిమానుడుగా ఉండాలి. ఎప్పుడూ గర్వపడరాదు. ఈ ఐదు విధాలైన యమములు కలిసి ఉపాసనాయోగంలో 'ప్రథమాంగం' అవుతుంది.

శౌచసంతోషతపఃస్వాధ్యాయేశ్వరప్రణిధానాని నియమాః ॥ యోగ. సాధనపాదం. 32 ॥

1. రాగద్వేషాలను వదలి అంతరంగాన్ని, జలాలతో బాహ్యశరీరాన్ని పవిత్రంగా ఉంచుకోవాలి. 2. ధర్మంతో పురుషార్థం పొందటంవలన లాభం కలిగినప్పుడు ప్రసన్నతగాని, నష్టం వచ్చినపుడు అప్రసన్నతగాని చెందక ఎప్పుడూ ప్రసన్నుడై సోమరితనం విడిచి పురుషార్థం చేయాలి. 3. నిరంతరం సుఖదుఃఖాలను సహిస్తూ ధర్మానుష్ఠానాన్ని గావించాలి. అధర్మాన్ని ఆచరించరాదు. 4. నిరంతరం సత్యశాస్త్రాలనే చదువుతూ, చదివించాలి. సజ్జన సాంగత్యాన్ని చేయాలి. పరమాత్ముని పేరైన 'ఓమ్' నామాన్ని అర్థసహితంగా నిత్యం జపించాలి. 5. పరమేశ్వరుని ఆజ్ఞానుకూల ప్రవర్తనకై తన ఆత్మను సమర్పించుకోవాలి. ఈ ఐదు విధాలైన నియమాలు ఉపాసనాయోగం యొక్క 'ద్వితీయాంగం' అవుతుంది. మిగిలిన ఆరు అంగాలను గురించి యోగశాస్త్రంలో గాని, ఋగ్వేదాది భాష్యభూమికలో (ఉపాసనా విషయంలో) గాని చూడండి.

ఉపాసన చేయాలనుకున్నప్పుడు ఏకాంతంలో పరిశుద్ధ స్థలంలో ఆసనంపై కూర్చొని, ప్రాణాయామాలను చేసి, బాహ్యవిషయాలనుండి ఇంద్రియాలను మరల్చి, మనస్సును నాభి ప్రదేశంలోనో, హృదయంలోనో, కంఠంలోనో, నేత్రాలలోనో, శిఖయందో, వెన్నెముకలో ఒక స్థానమందో స్థిరంగా నిలిపి, ఆత్మ-పరమాత్మల వివేచన కావిస్తూ, సంయమి పరమాత్మునిలో లీనమై కావాలి. ఈ సాధనలను చేసినపుడు అంతఃకరణం పవిత్రము ఆత్మ, సత్యపూరితం అవుతుంది. ప్రతి రోజూ జ్ఞాన విజ్ఞానాలు అభివృద్ధి చెందటంతో ఉపాసకుడు ముక్తివరకు చేరతాడు. ఎనిమిది జాములలో ఒక గడియసేపైనా ఈ విధంగా ధ్యానించేవాడు సదా ఉన్నతిని పొందుతాడు. సర్వజ్ఞాది గుణాలతో పరమేశ్వరుని ఉపాసించటం 'సగుణోపాసన' అంటారు. శబ్ద, రూప, రస, గంధ, స్పర్శాది గుణ రహితునిగా అనుకొని, అతి సూక్ష్మమైన ఆత్మలో, బయటకు సర్వత్ర వ్యాపించిన పరమేశ్వరుని పట్ల దృఢచిత్తుడై ఉండటం 'నిర్గుణోపాసన' అంటారు. దీని ఫలితం చలితో బాధపడేవాడు అగ్ని సమీపం చేరగానే చలి దూరమైనట్లు పరమేశ్వర సమీపాన్ని చేరితే, దోషాలు దుఃఖాలు తొలగిపోయి అతని

గుణ, కర్మ, స్వభావాలతో సమానంగా పవిత్ర గుణ, కర్మ, స్వభావాలు జీవునికి కలుగుతాయి. కాబట్టి తప్పక పరమేశ్వరుని స్తుతి, ప్రార్థన, ఉపాసనలను చేయాలి. వీటి వలన కలుగు ఫలితాలతో పాటుగా ఆత్మబలం అధికమై పర్వత సమానమైన దుఃఖాలు ప్రాప్తించినా భయపడక అన్నింటిని సహిస్తూ శక్తిగలవాడవుతాడు. ఇది సామాన్యవిషయం కాదు. పరమేశ్వరుని స్తుతి, ప్రార్థన, ఉపాసనలను గావించనివాడు కృతఘ్నుడే గాక మహామూర్ఖుడు కూడ అవుతాడు. జీవుల సుఖానికై ఈ లోకాన్ని సమస్త పదార్థాలను సృజించి ఇచ్చిన పరమాత్మని గుణాలను మరవటం, ఈశ్వరునే నమ్మకపోవడం, కృతఘ్నతయే గాక మూర్ఖత్వం కూడా అవుతుంది.

అవయవాలు లేని ఈశ్వరుడు ఎలా పనిచేస్తాడు?

ప్రశ్న: పరమేశ్వరునికి చెవులు, కండ్లు మొదలైన ఇంద్రియాలే లేనపుడు అతడు ఇంద్రియాలు చేసే పనులను ఎలా చేస్తాడు?

జవాబు:- అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణః ।
న వేత్తి విశ్వం న చ తస్యాస్తి వేత్తా తమాహురగ్ర్యం పురుషం పురాణమ్ ॥
శ్వేతాశ్వతరోపనిషత్తు. 3-19 ॥

పరమేశ్వరునికి హస్తాలు లేవు. కాని తన శక్తిరూపమైన కరాలతో సమస్తాన్నీ సృజిస్తూ, గ్రహిస్తున్నాడు. పాదాలు లేకున్నా వ్యాపకుడవటం చేత అన్నింటికన్న అధికవేగం కలవాడు. కన్నులులేకున్నా అన్నింటిని చూస్తాడు. చెవులు లేకున్నా అందరి వచనాలను ఆలకిస్తాడు. అంతఃకరణం లేకున్నా సమస్త జగాన్ని తెలుసుకొంటాడు. అవధి సహితంగా అతనిని తెలిసినవారెవరూ లేరు. అతడు సనాతనుడు, అందరికంటే శ్రేష్ఠుడు, అందరిలోనూ సంపూర్ణుడవటంచేత 'పురుషుడు' అనబడతాడు. ఇంద్రియాలతో అంతఃకరణాలతో జరిగే కార్యాలన్నీ అతడు తన సామర్థ్యంతో చేస్తాడు.

ఈశ్వరుడు నిష్క్రియుడు నిర్గుణుడు కాడు

ప్రశ్న: అనేకులు అతనిని నిష్క్రియుడు, నిర్గుణుడని చెప్పుదురు కదా?

జవాబు:- న తస్య కార్యం కరణం చ విద్యతే న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే ।
పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ ॥ శ్వేతాశ్వ. 6-8॥

పరమేశ్వరుని వలన తద్రూప కార్యం ఏర్పడదు. అతనికి కరణాలు అంటే ఇతర సాధనాలు అపేక్షితాలు కావు. అతనితో సమానులు గాని అతని కంటె గొప్పవారు గాని లేరు. సర్వోత్తమ శక్తి అనబడే అనంతజ్ఞానం, అనంతబలం, అనంత క్రియలు అతని కుంటాయి. మిక్కిలి స్వాభావికంగా అవి అతనిలో ఉంటాయని చెప్పగా విన్నాము. పరమేశ్వరుడు క్రియారహితుడే అయితే లోకాల ఉత్పత్తి, స్థితి, లయాలు చేయలేడు. కాబట్టి అతడు విభుడు, చేతనుడు అవటం వలన అతనిలో క్రియలు ఉన్నాయి.

ప్రశ్న: అతడు క్రియలను చేసేవాడే అయితే అతని క్రియలు అంతాలా? అనంతాలా?

జవాబు:- ఆ యా దేశకాలాలలో ఎంత క్రియ చేయటం ఉచితమని భావిస్తారో అంతే క్రియనతడు చేస్తాడు. అధికంగా గాని అంతకంటే అల్పంగా గాని చేయడు. ఎందుకంటే అతడు విద్వాంసుడు.

ఈశ్వర జ్ఞాన విషయం

ప్రశ్న: పరమేశ్వరుడు తన అంతాన్ని తాను తెలుసుకో లేడా?

జవాబు:- పరమేశ్వరుడు పూర్ణజ్ఞానం కలవాడు. ఏ పదార్థం ఎలా ఉన్నదో దానిని అలాగే తెలుసుకోవటం జ్ఞానమంటారు. పరమేశ్వరుడు అనంతుడు. అతనిని అనంతుడని తెలుసుకోవటం జ్ఞానం. దానికి విరుద్ధంగా తెలుసుకోవటం అజ్ఞానమంటారు. అనంతుని అంతం గలవానిగా, అంతం గల వానిని అనంతునిగా భావించటం భ్రమ అని అంటారు. "యథార్థదర్శనం జ్ఞానమితి" ఏ దానికి ఎలాంటి గుణ, కర్మ, స్వభావాలున్నాయో, ఆ పదార్థాన్ని అలాగే తెలుసుకొని, అంగీకరించటం జ్ఞాన విజ్ఞానాలని చెప్పబడుతుంది. దీనికి వ్యతిరేకమైనది అజ్ఞానం. కాబట్టి:

క్లేశకర్మవిపాకాశయైరపరామృష్టః పురుష విశేష ఈశ్వరః ॥ యోగ. సమాధి. 24 ॥

అవిద్యాది క్లేశాలు లేనివాడు, శుభ-అశుభ, కుశల-అకుశల, ఇష్ట-అనిష్టాలు, మిశ్రమ ఫలదాయకాలైన కర్మలు, ఆ కర్మల వల్ల కలిగే వాసనలు లేనివాడు, సర్వజీవులకంటే విశిష్టుడు అయినవాడు **'ఈశ్వరుడు'** అనబడతాడు.

ఈశ్వరాస్తిత్వం

ప్రశ్న: ఈశ్వరాసిద్ధేః ॥ సాంఖ్య. 1-92 ॥

ఈశ్వరసిద్ధిలో ప్రత్యక్షప్రమాణం సంభవించదు. ప్రత్యక్ష ప్రమాణంతో ఈశ్వరుడు సిద్ధించలేదని భావం.

ప్రమాణాభావాన్న తత్సిద్ధిః ॥ సాంఖ్య 5-10 ॥

అతని సిద్ధి ప్రత్యక్షమే కానపుడు అనుమానాది ప్రమాణాలు కూడ ఈశ్వరసిద్ధికి తోడ్పడవు.

సంబంధాభావాన్నానుమానమ్ ॥ సాంఖ్య 5-11 ॥

వ్యాప్తిసంబంధమే లేనపుడు అనుమానం కూడ కలుగదు. ఇక ప్రత్యక్ష అనుమానాలు లేకుండటంతో శబ్ద ప్రమాణాలు ఘటించలేవు. ఈ కారణంతో ఈశ్వరసిద్ధి కాలేదు.

జవాబు:- ఇక్కడ ఈశ్వరసిద్ధిలో ప్రత్యక్ష ప్రమాణం లేదు. ఈశ్వరుడు జగత్తుకు ఉపాదానకారణం కూడ కాడు. పురుషుని కంటె (జీవునికంటె) విలక్షణుడు. సర్వత్ర పూర్ణుడు అవటం వలన పరమాత్మ 'పురుషుడు' అనబడ్డాడు. శరీరంలో శయనించడం వలన జీవుడు కూడా 'పురుషుడు' అనబడ్డాడు. కారణమేమన ఇదే ప్రకరణంలో ఇలా చెప్పబడింది.

ప్రధానశక్తియోగాచ్చేత్సంగాపత్తిః ॥ సాంఖ్య 5-8 ॥

పురుషునికి ప్రధానశక్తితో యోగమైతే పురుషునిలో సంగాపత్తి కలుగుతుంది. అంటే ప్రకృతి సూక్ష్మరూపం నుండి స్థూలమై కార్యరూపంలో పరిణమించినట్లుగా ఈశ్వరుడు సూక్ష్మంనుండి స్థూలుడై కార్యరూపంలో పరిణమించేవాడు కావలసి వస్తుంది. కాబట్టి ఈశ్వరుడు లోకానికి ఉపాదాన కారణం కాదు. నిమిత్తకారణమే.

సత్తామాత్రాచ్చేత్సర్వైశ్వర్యమ్ ॥ సాంఖ్య 5-9 ॥

చేతనంవలన (ఈశ్వరుని సత్తవలన) జగదుత్పత్తి జరిగితే, పరమేశ్వరుడు సమగ్ర ఐశ్వర్యయుక్తుడు అయినట్లు జగత్తుకూడా సకలైశ్వర్యయుక్తి కావాలి. కాని అలా లేదు. కాబట్టి ఈశ్వరుడు జగత్తుకు ఉపాదానకారణం కాదు. కేవలం నిమిత్తకారణుడే.

శ్రుతిరపి ప్రధానకార్యత్వస్య ॥ సాంఖ్య 5-12 ॥

ఉపనిషత్తు కూడా ప్రకృతే ప్రధానంగా జగత్తుకు ఉపాదానకారణమని చెబుతున్నది:

అజామేకాం లోహితశుక్లకృష్ణాం బహ్వీః ప్రజాః సృజ మానాం స్వరూపాః ॥

శ్వేతాశ్వతరోపనిషత్తు 4-5॥

జన్మరహితమైన సత్వరజస్తమోగుణరూపమైన ప్రకృతే స్వరూపాకారాలతో అనేక ప్రజా రూపం కలదవుతున్నది. ప్రకృతి పరిణామం కలది అవటం వలన అవస్థాంతరాన్ని వేరొకరూపాన్ని పొందుతుంది. పురుషుడైన భగవంతుడు అపరిణామి అవటం వలన అవస్థాంతరుడై ఇతర రూపాలను ఎన్నడూ పొందడు. ఎల్లప్పుడు కూటస్థుడై, నిర్వికారుడై ఉంటాడు. కాబట్టి కపిలాచార్యునెవరైనా అనీశ్వరవాది అని అంటే అతడే అనీశ్వరవాది అవుతాడు, కాని కపిలాచార్యుడు కాదు.

అలాగే ధర్మాలతో ధర్మి ఈశ్వరుడని మీమాంస శాస్త్రం తెలుపుతున్నది. వైశేషిక, న్యాయ శాస్త్రాలును 'పరమాత్మ'ను చెబుతున్నాయి. కాబట్టి ఆ శాస్త్రకారులు అనీశ్వరవాదులు కారు. **"అతతి సర్వత్ర వ్యాప్నోతీత్యాత్మా"** అనగా సర్వత్ర వ్యాప్తమై, సర్వజ్ఞత్వాది ధర్మయుక్తమై, సమస్త జీవులకు ఆత్మయై ఉండేదే ఈశ్వరుడని మీమాంసా, వైశేషిక, న్యాయశాస్త్రకారులు అంగీకరిస్తారు.

ఈశ్వరావతార నిషేధం

ప్రశ్న: ఈశ్వరుడు అవతారమెత్తుతాడా? లేదా?

జవాబు:- లేదు. అవతరించడు. కారణమేమంటే **'అజ ఏకపాత్'** (యజు. 34-57) **"స పర్యగాచ్ఛుక్రమకాయమ్"** (యజు. 40-8) ఇవి యజుర్వేద వచనాలు. ఇలాంటి వచనాలతో పరమేశ్వరుడు అవతరించడని-జన్మించడని సిద్ధమవుతున్నది.

ప్రశ్న: "యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత! ।
అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్ ॥ భగ. గీ. 4-7 ॥

ఎప్పుడెప్పుడు ధర్మానికి హాని-లోపం కలుగుతుందో అప్పుడప్పుడు నేను శరీరాన్ని ధరిస్తానని శ్రీకృష్ణుడన్నాడు కదా!

జవాబు:- ఈ మాట వేదవిరుద్ధమవటం చేత ప్రమాణం కాదు. శ్రీకృష్ణుడు ధర్మాత్ముడు 'ధర్మాన్ని రక్షించాలి' అని కోరుకుంటాడు. కాబట్టి 'నేను ధర్మం నశించినపుడు యుగయుగంలో జన్మించి శ్రేష్ఠులను రక్షించి, దుష్టులను శిక్షించి నాశనం చేస్తాను' అని అతడు అంటే దోషమేమీలేదు. ఎందుకంటే **"పరోపకారాయ సతాం విభూతయః"** పరోపకారానికై సత్పురుషుల తనునునోధనాలు ఉంటాయి. అంతమాత్రాన శ్రీకృష్ణుడు ఈశ్వరుడు కాడుగదా!

అవతారవాదం

ప్రశ్న: అలాగైతే లోకంలో ఇరవైనాల్గు ఈశ్వరావతారాలైనట్లు ఎలా అంగీకరిస్తున్నారు?

జవాబు:- వేదార్థాలను తెలుసుకోక, సంప్రదాయవాదుల తప్పుడు మార్గాలలో చిక్కి స్వయంగా అవిద్వాంసులవటం వలన వారి భ్రమజాలాలలో తగుల్కొని, ఇట్టి అప్రామాణికాలైన విషయాలను వింటూ వాటిని అంగీకరిస్తున్నారు.

ప్రశ్న: ఈశ్వరుడు అవతరించకుంటే రావణ, కంసాది దుష్టులు ఎలా నాశనమయ్యారు?

సమాధానం: జన్మించినవాడు తప్పక మరణిస్తాడు. ఈశ్వరుడు అవతరించి శరీరాన్ని ధరించకనే లోకాన్ని సృజించి, పోషించి, లయింప చేస్తున్నాడు. అతనిముందు రావణ కంసాదులు ఒక క్రిమికీటకాలతో సమానులు. అతడు సర్వవ్యాపకుడైనందుకు రావణ కంసాదుల శరీరాలలోనూ నిండి ఉన్నాడు. తాను అనుకున్న మరుక్షణంలోనే మర్మచ్ఛేదనం చేసి వారిని నాశనం చేయగలడు. ఆయన అంతటి గుణ, కర్మ, స్వభావయుక్తుడైన పరమాత్ముడు ఒక క్షుద్రజీవిని చంపటానికి జన్మించి మరణిస్తాడని చెప్పెడివారిని మూర్ఖులనక మరి ఏమని అనవచ్చు? భక్త జనోద్ధరణకై జన్మించినాడని, ఎవరైనా అంటే అది కూడా అసత్యమే. భక్తులు ఈశ్వరుని ఆజ్ఞానుసారంగా ప్రవర్తిస్తారు. వారిని ఉద్ధరించటానికి కావలసినంత సామర్థ్యం ఈశ్వరునిలో ఉన్నది. ఈ పృథ్వి, సూర్య, చంద్రాది లోకాలను సృజించి, ధరించి, ప్రళయం చేసేటటువంటి కర్మల కన్న రావణ కంసాదులను వధించటం, గోవర్ధనాది పర్వతాలను ఎత్తటం మొదలైనవి గొప్ప కార్యాలా? ఈ సృష్టిలో పరమేశ్వరుని కార్యాలను ఎవరైనా ఆలోచించి చూసిన **"న భూతో న భవిష్యతి"** అంటారు. అంటే ఈశ్వరునితో సమానులైనవారు లేరు, ఇకముందు ఉండరు.

యుక్తులతో కూడా ఈశ్వరుడు జన్మించగలడని బుజువు చేయలేము. అనంతాకాశం ఒకని గర్భంలోనికి వచ్చిందని కాని, ఒకడు తన పిడికిట ధరించాడని కాని ఎవరైనా పలికితే అది ఎప్పుడూ

సత్యం కాలేదు. ఎందుకంటే, ఆకాశం అనంతం. అది అన్నింటిలో వ్యాపించి ఉన్నది, కాబట్టి అది బయటికి రావడానికిగాని, లోనికి పోవటానికి గాని ఎన్నడూ సంభవించదు. అలాగే అనంతుడు, సర్వ వ్యాపకుడు అయిన పరమాత్ముడు 'వచ్చును, పోవును' 'పుట్టును - చచ్చును' అని చెప్పటం కూడా అసత్యమే. తాను లేని స్థలానికి రావటం, పోవటం సంభవిస్తుంది. ఈశ్వరుడు గర్భంలోనికి రావటానికి ముందు అక్కడ లేడా? 'గర్భం నుండి పోయినాడు' అంటే పోవడానికి పూర్వం బయట లేడా? ఈశ్వరుని విషయంలో ఇలా చెప్పడం విద్యావిహీనులకు తప్ప ఇతరులకు సాధ్యం కాదు. కాబట్టి ఈశ్వరుడు రావటం, పోవటం, జన్మించటం, మరణించటం అనేవి అసంభవాలు.

కావున 'ఏసు' మొదలైనవారు కూడా ఈశ్వరుని అవతారాలని భావించరాదు. ఎందుకంటే వీరందరూ "రాగ ద్వేషాలు, ఆకలిదప్పులు, భయాక్రోశాలు, సుఖదుఃఖాలు, జన్మమరణాలు మొదలైనవి కలవారు అవటం వలన మానవులు" అని తెలుసుకోండి.

ఈశ్వరుడు పాపాలను క్షమించడు

ప్రశ్న: ఈశ్వరుడు తన భక్తుల పాపాలను క్షమిస్తాడా? లేదా?

జవాబు:- క్షమించడు. పాపాలను క్షమిస్తే అతని న్యాయం నశిస్తుంది. పైగా మానవులందరూ మహా పాపులవుతారు. క్షమించాననే మాట వినగానే పాపం చేసేవారికి నిర్భయత్వం, ఉత్సాహం, ధైర్యం కలుగుతుంది. రాజు అపరాధాలను క్షమిస్తే దోషులు ద్విగుణీకృత ఉత్సాహంతో అధికంగా గొప్ప గొప్ప పాపాలను చేస్తారు. రాజు తమ అపరాధాలను క్షమిస్తాడనీ, చేతులుజోడించి వేడుకొంటే తమ అపరాధాలను మన్నిస్తాడనీ వారికి నమ్మకం కలుగుతుంది. అపరాధాలు చేయనివారు కూడా చేయటానికి భయపడక, పాపకార్యాలు చేయటంలో తత్పరులవుతారు. కాబట్టి కర్మలకు యథావిధిగా ఫలితాన్ని ఇవ్వటమే ఈశ్వరుని పని. క్షమించటం అతని పనికాదు.

జీవుని స్వాతంత్ర్యం

ప్రశ్న: జీవుడు స్వతంత్రుడా? పరతంత్రుడా?

జవాబు:- తన కర్తవ్యకర్మలలో జీవుడు స్వతంత్రుడు, ఈశ్వరుని వ్యవస్థలో పరతంత్రుడు, **'స్వతంత్రః కర్తా'** (1-4-54) ఇది పాణినీయ వ్యాకరణసూత్రం. స్వతంత్రుడు అనగా స్వాధీనుడైనవాడే కర్త అని దీని అర్థం.

ప్రశ్న: 'స్వతంత్రుడు' అని ఎవరినంటారు?

జవాబు:- శరీరం, ప్రాణాలు, ఇంద్రియాలు, అంతఃకరణం తన అధీనంలో కలవాడే 'స్వతంత్రుడు'. జీవుడు కర్మలను చేయటంలో స్వతంత్రుడు కాకున్న పుణ్యాపాపాల ఫలప్రాప్తి అతనికి కలుగలేదు. భృత్యుడు స్వామి ఆజ్ఞ ప్రకారంగా పనులను చేసి, సైనికుడు సేనాధిపతి ఆజ్ఞచే యుద్ధంలో

అనేకులను చంపి నిరపరాధులే అవుతారు. అలాగే పరమేశ్వరుని ప్రేరణతో అతని ఆధీనంలో కార్యాన్ని చేసిన జీవునికి పాపపుణ్యాలు అంటవు. వాని ఫలితాన్ని అనుభవించవలసినవాడు ప్రేరేపించిన పరమాత్ముడే అవుతాడు. స్వర్గ నరకాల- సుఖ దుఃఖాల ప్రాప్తి పరమేశ్వరునకే జరగాలి. ఒకడు ఏదో ఒక ఆయుధంతో ఒకరిని చంపితే చంపినవాడిని పట్టుకొంటారు, అతనికి శిక్ష ఇస్తారు. ఆయుధాన్ని బంధించి దానిని శిక్షించరు కదా? అలాగే జీవుడు పరాధీనుడైతే పాపపుణ్యాల ఫలభోక్త కాలేడు. కాబట్టి తన సామర్థ్యాన్ని అనుసరించి కర్మను చేయటంలో జీవుడు స్వతంత్రుడు. పాపాలు చేసిన తరువాత జీవుడు ఈశ్వరుని వ్యవస్థలో పరాధీనుడై పాపాల ఫలితాలను అనుభవిస్తాడు. కాబట్టి కర్మలను చేయటంలో జీవుడు 'స్వతంత్రుడు', పాపాల దుఃఖరూప ఫలితాన్ని అనుభవించటంలో అతడు 'పరతంత్రుడు'.

ఈశ్వరుడు జీవున్ని పుట్టించడు

ప్రశ్న: ఈశ్వరుడు జీవుని పుట్టించి అతనికి సామర్థ్యాన్ని ఇవ్వకపోతే అతడేమీ చేయలేడు. కాబట్టి పరమేశ్వరుని ప్రేరణ చేతనే జీవుడు కర్మలను ఆచరిస్తాడు కదా!

జవాబు:- జీవుడు ఎన్నడూ ఉత్పన్నుడు కాడు. అతడు అనాది. ఈశ్వరుని లాగా, జగత్తు యొక్క ఉపాదానకారణం లాగా జీవుడు నిత్యుడు. జీవుని శరీరాన్ని, ఇంద్రియగోళాలను పరమేశ్వరుడే సృజిస్తాడు. కాని అవి జీవుని అధీనంలో ఉంటాయి. మనో వాక్కాయాలచేత ఎవరైనా పాపపుణ్యాలను చేస్తే వాని ఫలాలను వారే అనుభవిస్తారు.

ఉదా: ఒకడు ఒక పర్వతం నుండి లోహాన్ని తీసాడు. ఒక వ్యాపారి ఆ లోహాన్ని తీసుకొని దుకాణంలో పెట్టాడు. ఆ దుకాణంనుండి దానిని ఒక కమ్మరి కొని ఖడ్గాన్ని నిర్మించాడు. అతనినుండి ఖడ్గాన్ని ఒక సైనికుడు కొని ఒకడిని చంపాడు. ఇపుడు రాజు దండించాలనుకుంటే లోహాన్ని ఉత్పత్తిచేసినవాడిని గాని, అంగడివాడిని గాని, కమ్మరివాడిని గాని, కత్తిని గాని పట్టుకొని శిక్షించడు. కత్తితో చంపినవాడినే శిక్షిస్తాడు. ఇదేవిధంగా శరీరాలను ఉత్పత్తి చేసిన పరమేశ్వరుడు జీవుని కర్మఫలాలను అనుభవించడు, జీవునితో అనుభవింపచేస్తాడు. పరమేశ్వరుడే కర్మలు చేసేవాడైనచో ఏ జీవుడూ పాపి అనబడడు. పరమేశ్వరుడు పవిత్రుడు, ధార్మికుడు అవటం వలన ఏ జీవున్ని కూడ పాపాలు చేయటానికి ప్రేరేపించడు. తన కార్యాలు చేయటంలో జీవుడు ఎలా స్వతంత్రుడో, అలాగే పరమేశ్వరుడు తన కార్యాలు చేయటంలో స్వతంత్రుడు.

జీవేశ్వరుల భిన్నత్వ వర్ణనం

ప్రశ్న: జీవేశ్వరుల స్వరూపాలు, గుణకర్మస్వభావాలు ఎలాంటివి?

జవాబు:- ఇద్దరు కూడా చేతనాస్వరూపులే. ఇద్దరి స్వభావాలూ పవిత్రం, అవినాశి, ధార్మికాదియుక్తములై ఉన్నవి. కాని సృష్టియొక్క ఉత్పత్తి, స్థితి, ప్రళయాలు అన్నింటిని నియమంలో

ఉంచటం, జీవులకు పాపపుణ్యాల ఫలాలను ఇవ్వటం, మొదలైన ధర్మయుక్త కర్మలు పరమేశ్వరునివి. సంతానోత్పత్తి చేయటం వారిని పోషించటం, శిల్పవిద్యాది శుభాశుభ కర్మలు జీవునివి. నిత్య జ్ఞానం, ఆనందం, అనంతబలం మొదలైనవి ఈశ్వరుని గుణాలు.

జీవుని లక్షణం

ఇచ్ఛాద్వేషప్రయత్నసుఖదుఃఖజ్ఞానాన్యాత్మనో లింగమితి ॥ న్యాయ. 1-1-10 ॥

ప్రాణాపాననిమేషోన్మేషజీవనమనోగతీంద్రియాంతరవికారాః సుఖదుఃఖేచ్ఛా
ద్వేషప్రయత్నాశ్చాత్మనో లింగాని ॥ వైశేషిక. 3-2-4 ॥

ఇచ్ఛా = సుఖాలనిచ్చే పదార్థాలను పొందాలనే కోరిక; ద్వేష = దుఃఖాలను కోరకపోవడం అను వైరభావం; ప్రయత్న = పురుషార్థాలను చేసే శక్తి; సుఖ = ఆనందం; దుఃఖ = విలాపం, అప్రసన్నత; జ్ఞాన = వివేకంతో తెలుసుకోవటం అను ఈ ఆరు గణాలు న్యాయ వైశేషికాలలో సమానంగానే చెప్పబడ్డాయి. వైశేషికంలో: ప్రాణ = ప్రాణవాయువును లోపలినుండి బయటికి వదలటం; అపాన = వెలుపలి నుండి ప్రాణ వాయువును లోనికి పీల్చుకోవటం; నిమేష = కనురెప్పలు మూయటం; ఉన్మేష = కనురెప్పలు తెరవటం; జీవనం = ప్రాణధారణం చేయటం - వృద్ధిక్షతప్రరోహణాదులు; మనః = నిశ్చయించటం, స్మరించటం, అహంకారం కలిగి ఉండటం; గతి = చలించటం; ఇంద్రియ = సర్వేంద్రియాలతో పనులు చేయటం; అంతర్వికారాః = అనేక విధాలుగా ఆకలి, దప్పి,హర్ష శోకాదులతో కూడి ఉండటం అనునవన్నీ జీవుని గుణాలుగా చెప్పబడ్డాయి. ఈ జీవాత్మ గుణాలు పరమాత్ముని గుణాల కంటె భిన్నమైనవి. ఆత్మ స్థూలమైనదికాదు. కాబట్టి ఈ గుణాల చేతనే అది తెలుస్తుంది.

దేహంలో ఆత్మ ఉన్నంతవరకు ఈ గుణాలు తెలియబడతాయి. అది శరీరాన్ని వీడగానే ఈ గుణాలు శరీరంలో ఉండవు. అది ఉన్నప్పుడు ఉండి, అది లేనప్పుడు లేకుంటే ఆ గుణాలు దానివే అవుతాయి. దీపం గాని, సూర్యుడు గాని లేకపోతే ప్రకాశాలు ఉండవు. అవి ఉంటే ప్రకాశాలు ఉంటాయి. అలాగే వాని వాని గుణాల ద్వారానే జీవాత్మ, పరమాత్మలు ఉన్నారని తెలుస్తుంది.

ఈశ్వరుని త్రికాల దర్శిత్వం

ప్రశ్న: పరమేశ్వరుడు త్రికాలదర్శి. కాబట్టి భవిష్యత్కాల విషయాలను కూడ అతడు తెలుసుకొంటాడు. అతడు నిశ్చయించిన విధంగానే జీవుడు చేస్తాడు. కావున జీవుడు స్వతంత్రుడు కాడు. ఈశ్వరుడు తన జ్ఞానంతో నిర్ణయించిన విధంగా జీవుడు చేస్తాడు. కాబట్టి జీవుని ఈశ్వరుడు దండించడు.

జవాబు:- ఈశ్వరుడు 'త్రికాల దర్శి' అనటం మూర్ఖత్వమే అవుతుంది. ఎందుకంటే, ఏది ఒకప్పుడుండి తర్వాత ఉండదో పుట్టి నశిస్తుందో దానిని భూతకాలమనీ, ఇంతవరకు లేక ఏది ముందు జరుగుతుందో దానిని భవిష్యత్‌కాలమనీ చెప్తారు. ఈశ్వరునికి ఏ జ్ఞానమైనా మొదట ఉండి తదుపరి ఉండదా? ఇపుడు లేకుండా ముందుంటుందా? అలా కాదు. పరమేశ్వరుని జ్ఞానం ఎప్పుడూ ఏకరసం, అఖండితమై ఉంటుంది. భూత, భవిష్యత్కాలాలు జీవునికొరకే ఉన్నాయి. జీవుని కర్మలను అనుసరించే త్రికాలజ్ఞానం ఈశ్వరునిలో ఘటిస్తున్నది. అది స్వయంగా లేదు. జీవుడు స్వతంత్రంతో ఎలా కర్మలను చేస్తాడో సర్వజ్ఞత్వంతో ఈశ్వరుడు వానిని అలాగే తెలుసుకొంటాడు. ఈశ్వరుడు తెలుసుకొనేటట్లుగా జీవుడు చేస్తాడు. అంటే భూత, భవిష్యత్, వర్తమానకాలాల జ్ఞానంలో, ఫలాన్ని ఇవ్వటంలోనూ ఈశ్వరుడు స్వతంత్రుడు. జీవుడు కించిన్మాత్రంగా వర్తమానుడై కర్మలు చేయటంలో స్వతంత్రుడు. ఈశ్వరుని జ్ఞానం అనాది అవటంవలన కర్మజ్ఞానంలాగానే అతని దండించే జ్ఞానంకూడా అనాదియే. అతని ఈ రెండు జ్ఞానాలు కూడా సత్యాలే. కర్మ జ్ఞానాలు సత్యమై దండనజ్ఞానమెపుడైనా మిథ్య అవుతుందా? కాదు. కాబట్టి దీనిలో దోషమేమీ లేదు.

జీవేశ్వరుల సంబంధం

ప్రశ్న: జీవుడు శరీరంలో భిన్నుడై విభుడై ఉన్నాడా? లేక పరిచ్ఛిన్నుడా?

జవాబు:- పరిచ్ఛిన్నుడు. జీవుడు విభుడే అయితే జాగ్రత్, స్వప్న, సుషుప్తులును జన్మ మరణాలు సంయోగ, వియోగాలు రావడం, పోవడం మొదలైనవి ఎన్నడూ జరుగవు. జీవుని స్వరూపం అల్పం, అంటే సూక్ష్మమైనది. అతడు అల్పజ్ఞుడు. ఇక పరమేశ్వరుడో సూక్ష్మాతి సూక్ష్మతరుడు, అనంతుడు, సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు. కాబట్టి పరమేశ్వరునికి, జీవునికి, వ్యాప్యవ్యాపక సంబంధం ఉంది.

ప్రశ్న: ఒక స్థలంలో ఒక వస్తువుంటే అక్కడ మరొక వస్తువుండలేదు. కాబట్టి జీవేశ్వరులకు సంయోగ సంబంధమే గాని, వ్యాప్యవ్యాపక సంబంధం ఉండదు.

జవాబు:- ఈ నియమం సమాన ఆకారం గల పదార్థాలలో ఉండగలదు. అసమానాకృతులు కలవానియందు కాదు. ఎట్లనగా ఇనుము స్థూలంగాను, అగ్ని సూక్ష్మంగాను ఉంటుంది. ఈ కారణం వల్లనే ఇనుములో విద్యుత్-అగ్ని వ్యాపించి ఒకే సమయంలో రెండు కలసి ఉంటాయి. అలాగే జీవుడు పరమేశ్వరుని కంటే స్థూలమైనవాడు. పరమాత్ముడు జీవునికంటే సూక్ష్ముడవ్వటం వలన వ్యాపకుడు. జీవుడు వ్యాప్యం. ఇలా జీవేశ్వరులకు వ్యాప్య వ్యాపక సంబంధం ఉన్న విధంగానే సేవ్యసేవక, ఆధార ఆధేయ, స్వామిభృత్య, రాజప్రజా, పితాపుత్ర సంబంధాలు ఉన్నాయి.

తత్వమస్యాది వాక్యాలు

ప్రశ్న: జీవేశ్వరులు వేరువేరుగా ఉందురన్నచో వేదములలోని ఈ మహా వాక్యాలకు అర్థమేమి?

ప్రజ్ఞానం బ్రహ్మ ॥ ఐతరేయోపనిషత్తు 5-3 ॥

అహం బ్రహ్మాస్మి ॥ బృహదారణ్యకోపనిషత్తు 1-4-10 ॥

తత్త్వమసి ॥ ఛాందోగ్యోపనిషత్తు 6-8-7 ॥

అయమాత్మా బ్రహ్మ ॥ 4 ॥ మాండూక్య. 2 ॥

జవాబు:- ఇవి వేదవాక్యాలు కానే కావు. ఇవి బ్రాహ్మణ గ్రంథాలలోని వచనాలు. ఏ సత్యశాస్త్రంలోనూ ఇవి మహావాక్యాలని వ్రాయబడలేదు. వీని అర్థం ఇది: అహమ్ = నేను, బ్రహ్మ = బ్రహ్మస్థునిగా; అస్మి = ఉన్నాను. ఇక్కడ తాత్స్థ్యోపాధి ఉన్నది. ఉదా: 'మంచాః క్రోశంతి' అనగా మంచెలు అరుస్తున్నాయి అన్నప్పుడు మంచెలు జడాలు. వానిలో అరిచే శక్తి లేనే లేదు. కామట్టి మంచెలమీదుండే మనుష్యులు అరుస్తున్నారని అర్థమవుతుంది. అలాగే ఇక్కడ కూడా గ్రహించాలి. ఎవరైనా సర్వపదార్థాలూ బ్రహ్మస్థాలే కదా! జీవుడు బ్రహ్మస్థుడనటంలో విశేషం ఏమిటి"? అని ప్రశ్నించవచ్చు. దానికి సమాధానం ఇది: అన్ని పదార్థాలు బ్రహ్మస్థాలే. కాని, సాధర్మ్యం కలిగి జీవుడు సమీపమందున్నట్లు మరేవి కూడా లేవు. జీవునికి బ్రహ్మజ్ఞానం కలగటం వలన ముక్తిలో బ్రహ్మతో సాక్షాత్ సంబంధం కలిగి ఉంటుంది. అందుకే జీవునికి బ్రహ్మతో తాత్స్థ్యం అంటే 'తత్సహచరితోపాధి' (కలిసి ఉండటం) గలదు. అంటే బ్రహ్మనికి జీవుడు సహచారి, జీవాత్మ పరమాత్మలు ఒక్కటి కాదు. ఎవరైనా "ఇతడూ నేనూ ఒక్కటే" అని పలికిన, వారు స్నేహితులు, అవిరోధులనే అర్థం. అలాగే సమాధిస్థుడై, ప్రేమబద్ధుడై జీవుడు పరమేశ్వరునిలో నిమగ్నుమైనపుడు "నేనూ బ్రహ్మ ఒక్కటే" అని అతడనవచ్చు. అంటే "అవిరోధులం, మిత్రులం, ఒకే అవకాశస్థులం" అనే దీని అర్థం. పరమేశ్వరుని గుణ, కర్మ, స్వభావాలకు అనుకూలంగా జీవుడు తన గుణ, కర్మ, స్వభావాలను చేసుకొన్నపుడు సాధర్మ్యం వలన బ్రహ్మతో జీవునికి ఏకత్వం అంటే 'బ్రహ్మ నేను ఒక్కటే' అని చెప్పగలుగుతాడు.

ప్రశ్న: మంచిది. మరి దీనికి అర్థం ఎలా చెప్పెదరు? తత్ = ఆ బ్రహ్మ; త్వం = జీవుడవైన నీవు; అసి = అయి ఉన్నావు. ఓ జీవుడా! త్వం = నీవు; తత్ = ఆ బ్రహ్మవై; అసి = ఉన్నావు. అని కదా ఈ వాక్యార్థం?

జవాబు:- మీరు 'తత్' శబ్దంతో 'బ్రహ్మ' అని కదా అర్థం చెబుతున్నారు. ఇక్కడ "బ్రహ్మ" అనే పదంయొక్క అనువృత్తి ఎక్కడి నుండి తెచ్చారు?

ప్రశ్న: సదేవ సోమ్యేదమగ్ర **ఆసీదేకమేవాద్వితీయం బ్రహ్మ** ॥

దీనికి పూర్వంలో ఉన్న వాక్యం నుండి.

జవాబు:- మీరు ఛాందోగ్యోపనిషత్తు కూడా చూడనేలేదు. చూస్తే అక్కడ లేనటువంటి 'బ్రహ్మ' శబ్దంయొక్క పాఠాన్ని ఉన్నదని అబద్ధమెలా చెప్తారు? ఛాందోగ్యోపనిషత్తులో: సదేవ **సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్** ॥ ఛాం. ప్ర. 6. ఖం. 2 మం. 1 ॥ అనే పాఠం ఉన్నది. అక్కడ బ్రహ్మ శబ్దం లేదు.

ప్రశ్న: 'తత్' శబ్దానికి మీరేమి అర్థం గ్రహిస్తారు?

జవాబు:- స య ఏషోణిమైతదాత్మ్యమిదగ్ం సర్వం
తత్సత్యగ్ం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో ఇతి ॥

ఛాం.ప్ర.6. ఖం. 8. మం.6,7 ॥

ఆ పరమాత్ముడు తెలుసుకోవటానికి యోగ్యుడు. అతడు అత్యంత సూక్ష్ముడు. ఈ జగత్తుకు, జీవునకు అతడే ఆత్మ. అతడే సత్యస్వరూపుడు. తన ఆత్మ తానే అయి ఉన్నాడు. ప్రియపుత్రుడవైన ఓ శ్వేతకేతూ!

తదాత్మకస్తదంతర్యామీ త్వమసి ॥ "ఆ అంతర్యామి అయిన పరమాత్మునితో నీవు కూడి ఉన్నావు" అని దీని అర్థం. ఈ అర్థమే ఉపనిషత్తులకు అనుకూలంగా ఉన్నది. ఎందుకంటే:

య ఆత్మని తిష్ఠన్నాత్మనోంతరో యమాత్మా న వేద యస్యాత్మా శరీరమ్ ।
ఆత్మనోంతరో యమయతి స త ఆత్మాంతర్యామ్యమృతః ॥

బృహదారణ్య. 3-7-22 ॥ (శతపథ.14-6-7-30)

ఇది బృహదారణ్యకంలోని వాక్యం. మహర్షి యాజ్ఞవల్క్యుడు తన భార్య అయిన మైత్రేయితో ఇలా చెప్పాడు. "ఓ మైత్రేయి! పరమేశ్వరుడు ఆత్మ, అంటే జీవునియందుండే జీవాత్మకంటే భిన్నుడుగా ఉన్నాడు. మూఢుడైన జీవాత్మ తనలో పరమేశ్వరుడు వ్యాపించి ఉన్నాడని గ్రహించలేదు. పరమేశ్వరునికి జీవాత్మ శరీరం అంటే శరీరంలో జీవుడుండునట్లు, జీవునిలో పరమేశ్వరుడు వ్యాపకుడై ఉన్నాడు. అతడు జీవునికి భిన్నుడుగా ఉండి. జీవుని పాపపుణ్యాలకు సాక్షియై వాని ఫలాన్ని జీవునికి ఇచ్చి నియమంలో ఉంచుతున్నాడు. అవినాశస్వరూపుడైన అతడు నీకూ అంతర్యామియైన ఆత్మే. కాబట్టి నీలో వ్యాపకుడై ఉన్న అతనిని నీవు గుర్తించు. ఇలాంటి వచనాలకు వేరే అర్థాన్ని ఎవరైన చేయగలరా?

"అయమాత్మా బ్రహ్మ" సమాధ్యవస్థలో యోగులకు పరమేశ్వరుడు ప్రత్యక్షమవుతాడు. అపుడు అతడు "నాలో వ్యాపించి ఉన్న బ్రహ్మయే సర్వత్ర వ్యాపకుడై ఉన్నాడు" అని చెప్తాడు. ఆధునికులైన వేదాంతులు జీవబ్రహ్మలను ఒకటిగా చేస్తున్నారు. వీరు వేదాంతశాస్త్రాన్నెరుగరు.

ప్రశ్న: **అనేన ఆత్మనా జీవేనానుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి ॥** ॥ ఛాం. ప్ర. 6. ఖం.3 మం.2 ॥

తత్సృష్ట్వా తదేవానుప్రావిశత్ ॥ తైత్తిరీయ - బ్రహ్మ. అను. 6 ॥

పరమేశ్వరుడు ఇలా చెబుతున్నాడు:

"నేను జగత్తును, శరీరాలను సృజించి, జగంలో వ్యాపకుడినై జీవరూపుడినై శరీరంలో ప్రవేశిస్తూ నామరూపాల వాఖ్య చేస్తాను".

"పరమేశ్వరుడు జగాన్ని, శరీరాన్ని సృజించి దానిలో అతడే ప్రవేశించాడు." ఇలాంటిశ్రుతులకు అర్థాన్ని వేరుగా మీరెలా చెప్పగలరు?

జవాబు:– మీరు పదాలను, పదార్థాలను, వాక్యార్థాలను తెలుసుకొంటే ఇలా అనర్థాలనెన్నడూ చేయరు. ఎందుకంటే, ఇక్కడ ఒకటి ప్రవేశం, రెండవది అనుప్రవేశం అంటే తర్వాత ప్రవేశించటం కలదని తెలుసుకోండి. ఈశ్వరుడు శరీరాలలో ప్రవేశించిన జీవులతో పాటు, అనుప్రవిష్ట (తోడుగా ఉండేవాడు – కలిసియుండేవాడు) సముద్రై వేదం ద్వారా సమస్త నామ, రూపాది విద్యలను ప్రకటిస్తాడు. 'శరీరంలో జీవుని ప్రవేశింపజేసి తాను జీవునిలో అనుప్రవిష్టుడవుతున్నాడు' అని తెలుసుకోండి. మీకు 'అను' శబ్దానికి అర్థం తెలిస్తే ఇలా విపరీతార్థాన్ని ఎన్నడూ చేయరు.

ప్రశ్న: **సోऽయం దేవదత్తో య ఉష్ణకాలే కాశ్యాం దృష్టః స ఇదానీం ప్రావృట్ సమయే మథురాయాం దృశ్యతే"** అంటే వేసవికాలంలో నేను కాశీలో చూసిన దేవదత్తునే వర్షాకాలంలో మథురలో చూశాను. ఇక్కడ ఆ కాశీదేశ, ఉష్ణకాలాలను వదిలి శరీరంలో లక్ష్యముంచిన దేవదత్తుడు లక్షితుడవుతాడు. అలాగే ఈ భాగత్యాగ లక్షణం (కొంత విడువటం మరి కొంత గ్రహించటం)తో ఈశ్వరుని పరోక్ష దేశ, కాల, మాయా, ఉపాధిని మరియు జీవుని వర్తమాన దేశ, కాల, అవిద్య, అల్పజ్ఞతోపాధిని వీడి, చేతనమాత్రమందే లక్ష్యముంచుటచే ఒకే బ్రహ్మవస్తువు రెండింటియందు లక్షితమతువున్నది. 'భాగ త్యాగ లక్షణం' అంటే కొంత గ్రహించి కొంత విడిచ్చిపెట్టటం అను దానిని బట్టి ఈశ్వరుని సర్వజ్ఞత్వాది వాచ్యార్థం (శబ్దార్థాలు)ను జీవుని అల్పజ్ఞత్వాది వాచ్యార్థం గల శబ్దార్థాలను విడిచి, చేతనమాత్ర లక్ష్యార్థాన్ని గ్రహించటంవలన అద్వైతం సిద్ధిస్తుంది. దీనికి మీరేమి చెప్పగలరు?

జవాబు:– మీరు జీవుని, పరమాత్మను నిత్యులని అంగీకరిస్తారా ? లేక అనిత్యులనా? మొదట చెప్పండి?

ప్రశ్న: ఈ ఇద్దరిని ఉపాధి జన్యులు, కల్పితులు అవటం వలన అనిత్యులని అంగీకరిస్తాము.

జవాబు:– ఆ ఉపాధిని నిత్యమని భావిస్తారా? లేక అనిత్యమనా?

నవీన వేదాంతుల ఆరు పదార్థాలు - ఖండనం

ప్రశ్న: మా మతంలో ఇలా చెప్పబడింది:

జీవేశౌ చ విశుద్ధా చిద్విభేదస్తు తయోర్ద్వయోః ।
అవిద్యా తచ్చితోర్యోగః షడస్మాకమనాదయః ॥ 1 ॥

కార్యోపాధిరయం జీవః కారణోపాధిరీశ్వరః ।
కార్యకారణతాం హిత్వా పూర్ణబోధోऽవశిష్యతే ॥ 2 ॥

ఇవి "సంక్షేప శారీరకం" మరియు "శారీరక భాష్యం"లలోని కారికలు. వేదాంతులమైన మేము "1 జీవుడు 2. ఈశ్వరుడు 3. బ్రహ్మ 4. జీవేశ్వరులకు గల విశేష భేదం. 5. అవిద్య - అజ్ఞానం, 6. అవిద్యా చేతనాల సంయోగం" అనే ఈ ఆరు పదార్థాలను అనాదులని అంగీకరిస్తాము.

ఇందులో 'బ్రహ్మ'మొకటే అనాది అనంతమైనది. మిగిలిన ఐదూ ప్రాగభావం వలె అనాది సాంతాలైనవి. అజ్ఞానమున్నంత వరకే ఈ ఐదుంటాయి. ఈ ఐదింటికి ఆది తెలియనందుకు ఇవి అనాదులు. జ్ఞానం కలిగిన తర్వాత ఇవి నశించటంవలన సాంతాలు అంటే నాశవంతాలని చెప్పబడినది.

జవాబు:- మీ ఈ రెండు శ్లోకాలూ అశుద్ధాలే. ఎందుకంటే, మీ మతంలో అవిద్యతో కూడక జీవుడును మాయతో కూడక ఈశ్వరుడును సిద్ధించలేరు. కాబట్టి "తచ్చితోర్యోగః" అని మీరు లెక్కించిన ఆరవ పదార్థం ఉండదు. ఎందుకంటే అది అవిద్యా, మాయలు ఈ రెండూ జీవేశ్వరులలో చరితార్థాలైనవి. మరియు బ్రహ్మ మాయా-అవిద్యలసంయోగం లేకుండా ఈశ్వరుడు ఏర్పడడు. కాబట్టి ఈశ్వరుని అవిద్యనుండి, బ్రహ్మనుండి వేరుగా లెక్కించటం వ్యర్థం. కాబట్టి బ్రహ్మ, అవిద్య అని రెండే పదార్థాలు అని మీ మతంలో సిద్ధిస్తాయి. ఆరు కావు.

ఇక, అనంతుడు, నిత్యుడు, శుద్ధుడు, బుద్ధుడు, ముక్తుడు, సర్వ వ్యాపకుడు అయిన బ్రహ్మలో అజ్ఞానం సిద్ధమైనప్పుడే మీరు చెప్పిన కార్యోపాధి ద్వారా జీవుడు, కారణోపాధి ద్వారా ఈశ్వరుడు సిద్ధమవుతుందని చెప్పవచ్చు. అతని ఏకదేశంలో స్వ ఆశ్రయం, స్వ విషయకమైన అజ్ఞానాన్ని అనాదిగా సర్వత్ర అంగీకరిస్తే బ్రహ్మమంతా శుద్ధం కాలేదు. ఏకదేశంలో అజ్ఞానాన్ని అంగీకరిస్తే, మాయజ్ఞానం పరిచ్ఛిన్నమవుతుంది. కాబట్టి అది బ్రహ్మంలో ఇటు అటు వస్తూ పోతూ ఉండగలదు. అది ఏ యే స్థానానికి పోతుందో అక్కడక్కడ బ్రహ్మ అజ్ఞానీ, ఏ యే స్థలాలను వీడునో ఆ యా స్థలాల బ్రహ్మ జ్ఞాని అవుతుంది. అలాగైతే ఏ స్థలంలోని బ్రహ్మ కూడా అనాది, శుద్ధుడు, జ్ఞానయుక్తుడని చెప్పబడలేదు. మరియు అజ్ఞానసీమయందున్న బ్రహ్మ అజ్ఞాని అవుతాడు. వెలుపల, లోపల ఉన్న బ్రహ్మ ముక్కలైపోతాడు. అంటే ఖండితుడవుతాడు. బ్రహ్మ ఖండితుడైతే నష్టమేమి? అని మీరంటే అతడు అఖండుడు గదా? అఖండత్వమాతనిలో లోపిస్తుంది. అఖండుడేయైతే అజ్ఞాని కాడు. జ్ఞానాభావం, విపరీతజ్ఞానం కూడ గుణాలు అవటం వలన ఏదో ఒక ద్రవ్యంతో నిత్యసంబంధం కలిగి ఉంటుంది. అలా అయితే, సమవాయ సంబంధం ఉండటం వలన అనిత్యమెన్నడూ కాలేదు. శరీరంలో ఒకచోట పుండు పుడితే శరీరమంతటా దుఃఖం వ్యాపిస్తుంది. అలాగే ఒకచోట అజ్ఞానం, సుఖ, దుఃఖ, క్లేశాలు ప్రాప్తించిన బ్రహ్మమంతా దుఃఖాది అనుభవాలతో నిండి ఉంటుంది. మరియు బ్రహ్మమంతాశుద్ధమని చెప్పలేము. అలాంటి కార్యోపాధి అంటే అంతఃకరణ ఉపాధి సంబంధంలో బ్రహ్మను జీవునిగా పరిగణిస్తే వ్యాపకుడా? లేక పరిచ్ఛిన్నుడా? అని మేము ప్రశ్నిస్తాము. అందుకు సమాధానంగా బ్రహ్మ వ్యాపకం, ఉపాధి మాత్రం పరిచ్ఛిన్నం-ఏకదేశి. ఆ ఉపాధీ ఒక్కటికాదు, అనేకంగా ఉందునందురేని అంతఃకరణం ఇటు అటు చలిస్తుందా? లేదా? తిరుగుతుందా లేదా? చెప్పండి.

ప్రశ్న: చలిస్తుంది–తిరుగుతుంది.

జవాబు:– అంతఃకరణంతో పాటు బ్రహ్మ కూడా చలిస్తుందా? లేక స్థిరంగా ఉంటుందా?

ప్రశ్న: స్థిరంగా ఉంటుంది.

జవాబు:– అలాగైతే అంతఃకరణం ఏ యే స్థలాలను వీడునో ఆ యా స్థలాలలో ఉన్న బ్రహ్మ అజ్ఞానరహితుడైన, ఏ యే స్థలాలకు అది చేరునో ఆ యా చోట్ల ఉన్న పరిశుద్ధ బ్రహ్మ అజ్ఞానీ కాగలదు, అట్లా ఒక క్షణంలో జ్ఞానిగా మరుక్షణంలో అజ్ఞానిగా బ్రహ్మ మారుతుంది. అందువల్ల మోక్షం, బంధం కూడా క్షణభంగురమే అవుతుంది. ఒకడు చూసినది మరొకని స్మరణకు రానట్లు నిన్న చూసిన వస్తువులు, విన్న మాటలు జ్ఞాపకముండవు. ఎందుకంటే నిన్న చూసినవి, దేశకాలాలు వేరు, స్మరించు దేశ కాలాలు వేరువేరైనాయి. బ్రహ్మ ఒక్కడేయైన సర్వజ్ఞుడేల కాదు?

"అంతఃకరణాలు భిన్నభిన్నాలుగా ఉండటం వలన అతడును విభిన్నుడౌతాడు" అని అంటే అతడు జడుడవుతాడు. అతనిలో జ్ఞానముండదు. కేవలం బ్రహ్మకుగాని, కేవలం అంతఃకరణానికి గాని జ్ఞానం కలుగదనీ, 'అంతఃకరణమందున్న చిదాభాసునికే జ్ఞానం కలుగుతుంది' అని తెలుసుకోవాలి. అందులోని అంతఃకరణం ద్వారా చేతనానికే జ్ఞానం కలిగినది కదా! అలాంటప్పుడు బ్రహ్మం–జీవుడి నేత్రం మొదలైన ఇంద్రియాలద్వారా అల్పుడు అనల్పుడు ఎలా అవుతున్నాడు? కాబట్టి బ్రహ్మన్ని కారణోపాధివలన, కార్యోపాధి యోగం వలన జీవుని చేయలేవు.

వాస్తవంగా బ్రహ్మకే ఈశ్వరుడని పేరు. బ్రహ్మ కంటే భిన్నమైన అనాది, అనుత్పన్న అమృతస్వరూపమైన జీవునికే జీవుడని పేరు. అలాకాక చిదాభాసుని పేరే జీవుడని మీరంటే అతడు క్షణభంగురం అవటం వలన నశించగలడు. అపుడు మోక్షసుఖాన్ని అనుభవించేవాడెవడు? కాబట్టి బ్రహ్మ జీవుడుగా గాని, జీవుడు బ్రహ్మగా గాని ఇంతకుముందు కాలేరు. ఇప్పుడు కారు. ఇకముందునూ కాబోరు.

అద్వైత శబ్దార్థం - సిద్ధి

ప్రశ్న: అలాగైతే -

సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్ ॥ ఛాందో 6–2–1 ॥

అని చెప్పినట్లు అద్వైతమెలా సిద్ధిస్తుంది? బ్రహ్మకంటే వేరుగా సజాతీయ, విజాతీయ స్వగతావయవభేదాలు లేనందున ఒకే బ్రహ్మం సిద్ధించును. జీవుడు మరొకడున్నాడన్నచో అద్వైత సిద్ధి ఎలా కలుగుతుంది?

జవాబు:– మీరు ఈ భ్రమలో పడి ఎందుకు భయపడుతున్నారు? విశేష్య విశేషణ విద్యా జ్ఞానాన్ని సంపాదించండి. దీని ఫలమేమనగా! **"వ్యావర్తకం విశేషణం భవతీతి"** అంటే విశేషణం భేదకారకం అని మీరంటే, దానికి తోడుగా **"ప్రవర్తకం ప్రకాశకమపి విశేషణం భవతీతి"** విశేషణం

ప్రవర్తకం ప్రకాశకం కూడ అవుతుందని తెలుసుకోండి. అప్పుడు అద్వైతపదం బ్రహ్మకు విశేషణమని మీకు తెలుస్తుంది. అనేక జీవులనుండి, తత్వాలనుండి బ్రహ్మను వేరుగా చూపటమే ఈ అద్వైత శబ్దంయొక్క వ్యావర్తక ధర్మం. బ్రహ్మ ఒక్కడే అనే ప్రవృత్తి కలిగించటమే ఈ విశేషణంలోని ప్రకాశకధర్మం. అదెలాగంటే: "**అస్మిన్నగరేఽ ద్వితీయో ధనాఢ్యో దేవదత్తః'. అస్యాం సేనాయామద్వితీయః శూరవీరఃవిక్రమసింహః**" అంటే ఈ "నగరంలో అద్వితీయ ధనాఢ్యుడు దేవదత్తుడు" అనీ, "ఈ సైన్యంలో అద్వితీయ శూరవీరుడు విక్రమ సింహుడు" అనీ ఎవరైన పలికిన ఈ నగరంలో దేవదత్తునితో సమస్థానుడైన ధనవంతుడు గాని, ఈ సైన్యంలో విక్రమసింహునితో సమానుడైన శూరవీరుడు గాని మరొకడు లేడనీ, తక్కువవారున్నారనే తెలుస్తుంది కదా! పృథివ్యాది జడపదార్థాలు, పశువులు మొదలైన ప్రాణులు, వృక్షాలు అక్కడ ఉన్నాయి. అవి లేవనటానికి వీలు లేదు. అలాగే బ్రహ్మతో సమానంగా జీవ, ప్రకృతులు లేవనీ, అవి అతనికంటే తక్కువనీ తెలియుచున్నది. దీనిద్వారా 'బ్రహ్మ ఒక్కడే అనీ, జీవులు, ప్రకృతిలో గల తత్త్వాలు అనేకాలు' అనీ సిద్ధిస్తున్నది. వీని నన్నింటినుండి వేరుచేసి బ్రహ్మయొక్క ఏకత్వాన్ని సిద్ధింపచేసేది 'అద్వైతం' లేక 'అద్వితీయం' అనే విశేషణమే. దీనివలన జీవుడు గాని ప్రకృతియొక్క కార్యరూప జగత్తుగాని నిషేధింపబడటం లేదు. అవి లేవనీ తెలుపబడటం లేదు. ఇవన్నీ ఉన్నాయి. కాని బ్రహ్మతో సమానం కాలేవు. దీనివలన అద్వైతసిద్ధికి గాని ద్వైతసిద్ధికిగాని ఎలాంటి హాని కలుగదు. భయపడకండి. తొందరపడక ఆలోచించి తెలుసుకోండి.

ప్రశ్న: బ్రహ్మనికి సంబంధించిన సత్, చిత్, ఆనందాలు అనేవానితో జీవునికి సంబంధించిన అస్తి, భాతి, ప్రియరూపాలకు ఏకత ఉన్నప్పుడు మీరెందుకు ఖండిస్తున్నారు?

జవాబు:- కొంచెం సమానధర్మాలు-సాధర్మ్యమున్నంత మాత్రాన ఏకత - సమావత్వం సిద్ధింపదు. పృథ్వి జడం, దృశ్యం. అలాగే జలం, అగ్ని మొదలైనవీ జడాలు, దృశ్యాలు. అంతమాత్రాన వీనిలో ఏకత్వంలేదు. ఏకత సిద్ధించదు. వీనిలో వైధర్మ్యాలు ఉన్నాయి. అంటే భేదకారకాలైన వైధర్మ్యం గంధం, కాఠిన్యత మొదలైన విరుద్ధగుణాలు పృథ్విలోను, రసత్వం, ద్రవత్వం, కోమలత్వం మొదలైన ధర్మాలు జలంలోను, రూపం, దాహకత్వం మొదలైన ధర్మాలు అగ్నిలోను కలవు. కాబట్టి వీనిలో ఏకత్వం లేదు.

మానవులు, క్రిమికీటకాలు కండ్లతో చూస్తాయి. నోటితో తింటాయి. పాదాలతో నడుస్తాయి. అయిననూ మానవుడు ద్విపాదాలు గల ఆకారంగలవాడు. కీటకాలు అనేక పాదాలుగల ఆకారం కలిగి ఉండటం వల్ల ఏకత వీనికి లేదు. ఇలాగే పరమేశ్వరుని అనంత జ్ఞానం, ఆనందం, బలం, క్రియలు, నిర్భ్రాంతిత్వం, వ్యాపకత్వం, జీవుని కంటె భిన్నాలైనాయి. జీవుని అల్పజ్ఞానం, అల్పబలం, అల్ప రూపం, సర్వభ్రాంతిత్వం, పరిచ్ఛిన్నత్వం మొదలైన గుణాలు బ్రహ్మ కంటే భిన్నాలైనాయి. కాబట్టి జీవ, పరమేశ్వరులు ఒక్కటి కాదు. ఎందుకంటే స్వరూపంలో పరమేశ్వరుడు అతి సూక్ష్ముడుగా, అతనికన్న కొంచెం స్థూలుడుగా జీవుడు ఉండటం వలన వీరు విభిన్నులే.

భయంవలన అద్వైతసిద్ధి

ప్రశ్న: **అథోదరమంతరం కురుతే అథ తస్య భయం భవతి ।**
ద్వితీయాద్వై భయం భవతి ॥ బృహ. ఉ. 1-4-2 ॥

"జీవబ్రహ్మలమధ్య భేదాన్ని అంగీకరించేవానికి భయం కలుగుతుంది." ఎందుకంటే రెండవవానివలననే అంటే ఇతరులనుండే గదా భయం కలుగుతుంది?

జవాబు:– దీని అర్థం ఇది కాదు. జీవుడు బ్రహ్మను నిషేధించినా ఏదో ఒక దేశంలో, కాలంలో పరిచ్ఛిన్నునిగా పరమాత్మను భావిస్తే, అతని ఆజ్ఞలకు, గుణ, కర్మ, స్వభావాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే, ఏ మానవునితోనైన వైరం పెట్టుకొన్నా, అతనికి భయం కలుగుతుంది. ద్వితీయ బుద్ధి అంటే ఈశ్వరునికి నాకు ఎలాంటి సంబంధం లేదు అని తలిస్తే, ఒకనితో నిన్ను ఏ మాత్రం లక్ష్యపెట్టననీ, నీవు నన్నేమీ చేయలేవనీ, ఇతరులతో పలికి హాని కలిగిస్తూ, దుఃఖపెడితే అతనివలన అతనికి భయం ఉంటుంది. ఎలాంటి అవిరోధం, శత్రుత్వం లేనివారు ఒకటిగా ఉంటారు. దేవదత్తుడు, యజ్ఞదత్తుడు, విష్ణుమిత్రుడు ముగ్గురూ ఒక్కటే అని లోకంలో చెప్పటం వింటాము. అంటే వారు అవిరోధులు – మిత్రులు అని అర్థం. విరోధంలేకపోతే సుఖం, విరోధం వలన దుఃఖం కలుగుతుంది.

ప్రశ్న: జీవ బ్రహ్మలు సదా, విడివిడిగానే ఉందునా? లేక అవి రెండూ కలిసి ఎప్పుడైనా ఒకటి అవుతాయా?

జవాబు:– ఇంతకుపూర్వమే కొంత సమాధానం చెప్పబడింది. సాధర్మ్యం – అన్వయ భావంతో వారిద్దరిలో ఐక్యత ఏర్పడుతుంది. ఆకాశంలో మూర్తపదార్థాలు జడత్వం కలిగి ఉండటం చేత, ఎప్పుడూ వేరుగా ఉండకపోవటంచేత ఏకత్వాన్ని కలిగి ఉంటాయి. ఆకాశానికి విభుత్వ, సూక్ష్మత్వ నిరాకార, అనంతాదిగుణాలున్నాయి. మూర్తపదార్థాలకు పరిచ్ఛిన్నత్వం, దృశ్యత్వం మొదలైన వైధర్మ్యాలుండటం వలన వాటికి ఆకాశానికి భేదం ఉన్నది. పృథివ్యాది ద్రవ్యాలు ఆకాశం నుండి ఎన్నడూ వేరుగా ఉండవు. ఎందుకంటే అన్వయం – అవకాశం ఆకాశం లేకపోతే మూర్తద్రవ్యాలు (ఆకారం – పదార్థాలు) ఎన్నడూ ఉండలేవు. కాని వ్యతిరేకం – స్వరూపంతో భిన్నత్వం కలిగి ఉండటం వలన వానిలో భిన్నత (వేరుగా, విడిగా) ఉండనే ఉంటుంది. అలాగే బ్రహ్మ వ్యాపకుడవటం వలన జీవుడూ, పృథివ్యాది పదార్థాలూ అతని నుండి వేరుగా ఉండలేవు. కాని వాని స్వరూపాన్ని అనుసరించి ఒకటి కూడా కావు. గృహనిర్మాణానికి పూర్వం భిన్న భిన్న ప్రదేశాలలో మన్ను, కఱ్ఱలు, ఇనుము మొదలైనవి ఆకాశమందే ఉన్నాయి. గృహ నిర్మాణానంతరంలో అవి ఆకాశంలోనే ఉన్నాయి. గృహం నష్టమైనపుడు ఆ గృహంయొక్క శిథిలభాగాలు అన్నీ భిన్న భిన్న ప్రదేశాలకు చేరుతాయి. అపుడు కూడా అవి ఆకాశంలోనే ఉంటాయి. అంటే త్రికాలాలలోనూ ఆకాశానికి భిన్నంగా అవి ఉండలేవు. స్వరూపంతో భిన్నాలుగా ఉండటం వలన అవి ఒకటిగా ఎన్నడూ ఉండలేవు, ఉండవు, ఉండబోవు. ఇదేవిధంగా జీవులు, సమస్త జగత్పదార్థాలు పరమేశ్వరునిలో వ్యాప్యంగా ఉండటం

వలన త్రికాలాలలో అవి పరమేశ్వరుని నుండి భిన్నంగా ఉండవు. స్వరూపంతో భిన్నాలవటం వల్ల అవి ఎన్నడూ ఒకటిగా కావు.

నేటి వేదాంతుల దృష్టి ఒంటికన్నుగలవానితో సమానంగా అన్వయం సాధర్మ్యాలనైపే ట్వే వ్యతిరేక భావం వైధర్మ్యం నుండి విడిపోయి తద్విరుద్ధంగా మారింది. సగుణ, నిర్గుణాలు అన్వయ, వ్యతిరేకాలు సాధర్మ్య వైధర్మ్యాలు విశేష్య విశేషణ భావాలు లేని పదార్థమే లేదు.

ఈశ్వరుడు సగుణుడు-నిర్గుణుడు

ప్రశ్న: ఈశ్వరుడు సగుణుడా? నిర్గుణుడా?

జవాబు:- సగుణుడు, నిర్గుణుడు.

ప్రశ్న: ఆహా? ఒక ఒరలో రెండు కత్తులు ఎప్పుడైనా ఉంటాయా? ఒకే పదార్థంలో సగుణత్వ నిర్గుణత్వాలు ఎలా ఉంటాయి?

జవాబు:- జడ వస్తువులకు రూపాది గుణాలు ఉన్నాయి. కాని చేతనానికి గల జ్ఞానాది గుణాలు వానిలో లేవు. అలాగే చేతనంలో ఇచ్ఛాది గుణాలున్నాయి. కాని జడాలయొక్క రూపాది గుణాలు లేవు. అందువలన **"యద్గుణైస్సహ వర్తమానం తత్సగుణమ్" "గుణేభ్యో యన్నిర్గతం పృథగ్భూతం తన్నిర్గుణమ్"** అంటే గుణాలతో కూడినది సగుణమనీ, గుణాలు లేనిది నిర్గుణమనీ చెప్పబడింది. తమ తమ స్వాభావిక గుణాలతో కూడి యుండి, ఇతర పదార్థాలలో విరోధిగుణాలు కలిగి ఉండుటవలన సర్వ పదార్థాలు సగుణ, నిర్గుణాలవుతాయి. కేవలం నిర్గుణత్వం గల పదార్థాలుగాని, కేవలం సగుణత్వం గల పదార్థాలుగాని లేవు. కాని ఒకేదానిలో సగుణత్వ, నిర్గుణత్వాలు సదా ఉంటాయి. అలాగే పరమేశ్వరుడు తన అనంత జ్ఞాన బలాది గుణాలు కలిగి ఉండటం వలన సగుణుడనీ, జడముల యొక్క రూపాది గుణాలు, జీవునియొక్క ద్వేషాది గుణాలు లేనివాడవటం వలన నిర్గుణుడనీ చెప్పబడింది.

ప్రశ్న: లోకంలో నిరాకారుడిని నిర్గుణుడనీ, సాకారుడిని సగుణుడనీ అంటారు. అంటే పరమేశ్వరుడు జన్మించనపుడు నిర్గుణుడనీ, అవతార మెత్తినపుడు సగుణుడనీ అంటారు కదా?

జవాబు:- ఇది కేవలం అజ్ఞానులు, అవిద్వాంసులు కల్పించినది. విద్య రానివారు పశువుతో సమానంగా ఇష్టంవచ్చినట్లు మాట్లాడతారు. సన్నిపాతజ్వరం కలవాడు పనికిమాలిన మాటలు పలుకునట్లుగా అవిద్వాంసులు పలికినా, వ్రాసినా అవి వ్యర్థాలే అని అనుకోవాలి.

ప్రశ్న: పరమేశ్వరుడు రాగం కలవాడా? లేక విరక్తుడా?

జవాబు:- అతడు రెండూ కాదు. తనకంటే భిన్నమైన ఉత్తమ పదార్థాలలో రాగం - కోరిక కలుగుతుంది, పరమేశ్వరునికంటే భిన్నంగా గాని, ఉత్తమంగా గాని ఏ పదార్థం లేదు. అందుచేత అతనిలో రాగం - కోరిక సంభవించదు. పొందిన దానిని వదలిపెట్టినవాడు విరక్తుడు అవుతాడు. ఈశ్వరుడు వ్యాపకుడవటం వలన ఏ పదార్థాన్నీ విడువలేదు. కాబట్టి అతడు విరక్తుడు కాదు.

ప్రశ్న: ఈశ్వరునికి ఇచ్ఛ - కోరిక ఉన్నదా? లేదా?

జవాబు:- జీవులలో చూడబడు ఇచ్ఛలవంటి ఇచ్ఛ పరమేశ్వరునిలో లేదు. ఇచ్ఛ అనగా కోరిక. ఇది అప్రాప్త వస్తువు అంటే దేని ప్రాప్తివలన సుఖవిశేషం లభిస్తుందో అలాంటి వస్తు విషయంలో కలుగుతుంది. కాని అతనికి అప్రాప్త పదార్థమనేది గాని, ఉత్తమ పదార్థమనేది గాని లేదు. పూర్ణ సుఖయుక్తుడవటం వలన అతనికి సుఖాభిలాష కూడా లేదు. కాబట్టి ఈశ్వరునిలో 'ఇచ్ఛ' ఉండటం అసంభవం. కాని అతనిలో 'ఈక్షణ' కలదు. సర్వవిద్యలను దర్శింపజేయటం, సమస్త సృష్టిని సృజించటం 'ఈక్షణ' అంటారు. ఇలాంటివన్నీ సంక్షిప్త విషయాలనుండి సజ్జనులు అధిక విస్తృతంగా ఆలోచించి తెలుసుకోవాలి.

ఇది సంక్షేపంగా ఈశ్వర విషయం. ఇక వేదవిషయాన్ని గురించి వ్రాస్తున్నాము.

వేదాలు ఈశ్వర ప్రకాశితాలు

యస్మాదృచో అపాతక్షన్ యజుర్యస్మాదపాకషన్ ।
సామాని యస్య లోమాన్యథర్వాంగిరసో ముఖమ్
స్కంభం తం బ్రూహి కతమః స్విదేవ సః ॥ అథర్వ కాం. 10 ॥ సూ. 7. మం. 20 ॥

ఏ పరమాత్మనుండి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వవేదం ప్రకాశితమైనవో అతడు ఏ దేవుడు? దీనికి సమాధానం: అన్నింటిని ఉత్పన్నం చేసి ధరింనట్టివాడే ఆ పరమాత్ముడు. అతడే వేదాలను ప్రకటిస్తాడని భావం.

స్వయంభూర్యాథాతథ్యతోఽర్థాన్ వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః ॥ యజు. 40-8 ॥

పరమేశ్వరుడు స్వయంభువు, సర్వ వ్యాపకుడు, శుద్ధుడు, సనాతనుడు, నిరాకారుడునైన్నాడు. అతడు సనాతన జీవరూప ప్రజల కల్యాణార్థమై యథారీతిగా వేదంద్వారా సమస్తసత్యవిద్యలను ఉపదేశిస్తున్నాడు.

ప్రశ్న: మీరు పరమేశ్వరుని సాకారునిగా అంగీకరిస్తున్నారా? లేక నిరాకారునిగనా?

జవాబు:- నిరాకారుడు అని అంగీకరిస్తున్నాం.

వేదోపదేశం

ప్రశ్న: నిరాకారుడైతే వేదవిద్యల ఉపదేశాన్ని, వర్ణాల ఉచ్చారణను ముఖం లేకుండా ఎలా చేసినాడు? ఎందుకంటే వర్ణాల ఉచ్చారణ చేయటంలో తాల్వాది స్థానాలు, జిహ్వాది ప్రయత్నాలు తప్పక జరగాలి కదా!

జవాబు:- పరమేశ్వరుడు సర్వశక్తిమంతుడు, సర్వవ్యాపకుడు కావటం వలన ముఖాదులు లేకుండానే తన వ్యాప్తి ద్వారా జీవులకు వేదవిద్యను ఉపదేశిస్తాడు. ఎందుకంటే, తన కంటె

భిన్నుడైనవానికి బోధించటానికే ముఖ, జిహ్వాదులతో పని తన కొరకు కాదు. జిహ్వ ముఖాల వ్యాపారం లేకుండానే, మనస్సులో అనేక కార్యవ్యవహారాలను గురించిన ఆలోచనలు, శబ్దోచ్చారణలు జరుగుతాయి. జిహ్వ, ముఖం, తాలువు మొదలైన స్థానాలు లేకుండానే, అనేక శబ్దాలు ప్రేక్షతో చెవులు మూసికొన్నా వినబడతాయి. అవి ఎలా ఏర్పడుతున్నాయో ఒకసారి చూడండి. అలాగే జీవులకు అంతర్యామిరూపంలో పరమేశ్వరుడు ఉపదేశిస్తాడు. కేవలం ఇతరులకు తెలియజేయటానికే ఉచ్చారణ చేయవలసిన అవసరముంటుంది.

పరమేశ్వరుడు నిరాకారుడు, సర్వవ్యాపకుడు కాబట్టే తన సర్వ వేదవిద్యల యొక్క ఉపదేశాన్ని జీవస్థ స్వరూపాన్ని జీవాత్మలలో ప్రకాశితం చెస్తాడు. తర్వాత దానిని మానవుడు తన నోటితో ఉచ్చరించి ఇతరులకు వినిపిస్తాడు. కాబట్టి ఈశ్వరునిలో ఈ దోషం కలుగదు.

ప్రశ్న: వేదాలను ఎవరి ఆత్మలందు ఎప్పుడు ప్రకాశింపజేశాడు?

జవాబు:- అగ్నేర్ ఋగ్వేదో వాయోర్యజుర్వేదః సూర్యాత్సామవేదః ॥ శత. 11-5-8-3 ॥

సృష్టి ఆరంభంలో పరమాత్ముడు అగ్ని, వాయువు, ఆదిత్య, అంగిరసులనే నలుగురు ఋషుల ఆత్మలలో ఒక్కొక్క వేదాన్ని ప్రకాశపరచినాడు.

ప్రశ్న: **యో వై బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ**
ప్రహిణోతి తస్మై ॥ శ్వేతాశ్వతర ఉప. ॥ 6-18 ॥

ఇది ఉపనిషత్ వాక్యం. మొదట బ్రహ్మయొక్క హృదయంలో వేదోపదేశం చేయబడినదని ఈ వాక్యంలో తెలుపబడింది. అగ్న్యాది ఋషుల ఆత్మలలో అని మీరేల అంటున్నారు?

జవాబు:- బ్రహ్మయొక్క ఆత్మలో అగ్న్యాది ఋషుల ద్వారా వేదాలు స్థాపింపబడినవని తెలుసుకోవాలి. మనుస్మృతిలో ఏమి వ్రాయబడిందో చూడండి:

"అగ్నివాయురవిభ్యస్తు త్రయం బ్రహ్మసనాతనమ్ ।
దుదోహ యజ్ఞసిధ్యర్థం ఋగ్యజుస్సామలక్షణమ్" ॥ మను. 1-23 ॥

పరమాత్ముడు సృష్టి ఆరంభంలో మానవులను సృజించి అగ్న్యాది నలుగురు మహర్షుల ద్వారా నాలుగు వేదాలను బ్రహ్మకు లభింపజేసాడు. ఆ బ్రహ్మ అగ్ని, వాయు ఆదిత్య, అంగిరసుల నుండి ఋగ్, యజుః, సామ, అథర్వ వేదాలను గ్రహించాడు.

ప్రశ్న: ఆ నలుగురియందే వేదాలను ప్రకాశపరిచాడు. ఇతరులయందు ప్రకాశపరచక పోవటం వలన ఈశ్వరుడు పక్షపాతి కాడా?

జవాబు:- కాదు. ఆ నలుగురే జీవులందరి కంటే పవిత్రాత్ములై ఉన్నారు. ఇతరులు వారివలె లేకున్నారు. అందువలప పవిత్రమైన విద్యను వారియందే వెల్లడించారు.

ప్రశ్న: ఇతర దేశభాషలలో వేదాలను వెల్లడించక సంస్కృతభాషలోనే ఎలా వెల్లడించారు?

జవాబు:- అన్యదేశభాషలో వెల్లడిస్తే ఈశ్వరుడు పక్షపాతి అవును. ఏ దేశభాషలో అవి వెల్లడించబడుతున్నవో ఆ భాష గలవారికి అవి సుగమంగా ఉంటుంది, విదేశీయులకు వేదాలు చదువటం, చదివించటంలో కఠినమవుతుంది. కాబట్టి సంస్కృతభాషలోనే వెల్లడించారు. అది ఏ దేశభాషా కాదు. వేదభాష ఇతర భాషలన్నింటికి మూలం. అందువలన దానిలోనే వేదాలు ప్రకటించబడ్డాయి. ఈశ్వరుని పృథివ్యాది సృష్టి, సమస్త దేశాలకు, దేశవాసులకు ఒకే విధంగా ఉండి, శిల్పవిద్యలకు మూలమైనట్లు, విద్యయొక్క భాషకూడా ఒకే విధంగా ఉండి తుల్య పరిశ్రమతో సమస్త దేశవాసులు చదువటానికి, చదివించటానికి తగ్గట్టు ఉన్నది. అందుకే ఈశ్వరుడు పక్షపాతి కాలేదు. ఇది సమస్త భాషలకు మూలమైనది.

వేదం - ఈశ్వర కృతం

ప్రశ్న: వేదం ఈశ్వరకృతమే అని, అన్యకృతం కాదని చెప్పటానికి ప్రమాణమేమి?

జవాబు:- ఈశ్వరుడు పవిత్రుడు. సర్వవిద్యలను తెలిసినవాడు. పరిశుద్ధ గుణ, కర్మ, స్వభావాలు కలవాడు. న్యాయకారి, దయాళువు, మొదలైన ఈశ్వర గుణ, కర్మ, స్వభావాలకు అనుకూల ప్రసంగాలు ఏ గ్రంథంలో ఉంటాయో అది ఈశ్వరకృతం. ఇందుకు భిన్నమైనవి కావు. సృష్టి క్రమానికి, ప్రత్యక్షాది ప్రమాణాలకు, ఆప్తులయొక్క పవిత్రాత్ములయొక్క వ్యవహారాలకు విరుద్ధం కాని ప్రసంగాలు కలది ఈశ్వరోక్తం. ఈశ్వరుని భ్రాంతిరహిత జ్ఞానం ఏ పుస్తకంలో ప్రతిపాదింపబడినదో అదే ఈశ్వరోక్తం. ఉన్నది ఉన్నట్లుగా ఈశ్వరుని సృష్టిని, కార్య-కారణాలను, జీవులను ప్రతిపాదించునటువంటిదే ఈశ్వరోక్తపుస్తకం. అది ప్రత్యక్షాది ప్రమాణ విషయాలకు అవిరుద్ధంగా ఉండి, శుద్ధాత్మయొక్క స్వభావానికి అనుకూలంగా ఉండాలి. ఈ విధంగా వేదాలు ఉన్నాయి. ఇతర బైబిల్, ఖురాన్ మొదలైన పుస్తకాలు ఇలా లేవు. పదమూడవ, పద్నాల్గవ సముల్లాసాలలో బైబిల్, ఖురానుల గురించి విపులంగా వ్యాఖ్యానించబడింది.

ప్రశ్న: ఈశ్వరునినుండే వేదాలు ప్రకటింపబడవలసిన అవసరమేమీ లేదు. క్రమంగా మానవులు జ్ఞానాన్ని వృద్ధిచేసుకొంటూ తదనంతరం పుస్తకాలు వ్రాసుకోగలరు.

జవాబు:- ఆ విధంగా ఎన్నడూ రచించలేరు. కారణం లేకుండా కార్యోత్పత్తి జరగటం అసంభవం. ఆటవిక మానవులు సృష్టిని చూసీ విద్వాంసులు కాలేరు. వారికి ఎవరైనా గురువులు లభిస్తే విద్వాంసులు కాగలరు. నేడు కూడా ఇతరులనుండి విద్యను నేర్వకుండా ఎవ్వరూ విద్వాంసులు కాలేరు. పరమాత్ముడు సృష్టి ఆరంభంలోని ఋషులకు వేదవిద్య నందించకపోతే వారు ఇతరులకు చదివించేవారు కారు. అప్పుడు అందరు అవిద్వాంసులుగానే ఉండేవారే. అప్పుడే జన్మించిన బాలునొకనిని ఏకాంత ప్రదేశంలోనో, అవిద్వాంసుల వద్దనో, పశువుల వద్దనో ఉంచితే, అతడు ఆ సాంగత్యాన్ని అనుసరించే ఉంటాడు. ఆటవికులైన భిల్లులు మొదలైనవారు దీనికి దృష్టాంతం.

అర్యావర్త దేశం నుండి విద్యను నేర్చుకోనంతవరకు, ఈజిప్టు, గ్రీకు, యూరపు మొదలైన దేశాలవారు విద్యాహీనులుగా ఉన్నారు. ఇంగ్లాండు నుండి కోలంబసు మొదలైన పురుషులు అమెరికా వెళ్ళనంతవరకు అక్కడివారు వేలకొలది, లక్షల కొలది సంవత్సరాలనుండి మూర్ఖులుగా, విద్యా విహీనులుగానే ఉన్నారు. తర్వాత వారు సుశిక్షణను పొంది విద్వాంసులైనారు. అలాగే పరమాత్మనినుండి సృష్ట్యాదిలో విద్యా శిక్షణలు లభించటం వలన ఉత్తరోత్తర కాలంలో ప్రజలు విద్వాంసులవుతూ వచ్చారు.

స పూర్వేషామపి గురుః కాలేనానవచ్ఛేదాత్ ॥ యోగ. సమాధి సూ. 26 ॥

వర్తమానకాలంలో మనం అధ్యాపకుల వద్ద చదువుకొని విద్వాంసులమైనట్లు సృష్ట్యారంభంలో జన్మించిన అగ్న్యాది ఋషులకు పరమేశ్వరుడే గురువు. అనగా చదివించినవాడు. అతడే ఆది గురువు. జీవుడు సుషుప్తి, ప్రళయాలలో జ్ఞాన రహితుడైనట్లు, పరమేశ్వరుడు కాలేడు. అతని జ్ఞానం నిత్యమైనది. కాబట్టి నిమిత్తం లేకుండా నైమిత్తిక ప్రయోజనం ఎప్పుడూ సిద్ధించలేదని నిశ్చయంగా తెలుసుకోవాలి.

ప్రశ్న: వేదాలు సంస్కృతభాషలో వెల్లడించబడ్డాయి. అగ్న్యాది ఋషులకు ఆ సంస్కృతభాష రాదుకదా! అపుడు వారెలా వేదార్థాలను తెలుసుకున్నారు?

జవాబు:- వారికి పరమేశ్వరుడు తెలియజేసాడు. ధర్మాత్ములు, యోగులు, మహర్షులు అయినవారు ఎప్పుడెప్పుడు ఏ యే అర్థాలను తెలుసుకొనే కోరిక గలవారై ధ్యానావస్థలో పరమేశ్వర స్వరూపంలో సమాధిస్థులవుతారో, పరమేశ్వరుడు ఆ అభీష్ట మంత్రాలను వాటి అర్థాలను అప్పుడు వారికి తెలుపుతాడు. అనేకుల ఆత్మలలో వేదార్థాలు ప్రకాశితం కాగానే ఋషులు, మునులు ఆ అర్థాలను ఋషి మునుల చరిత్రలతో పాటు గ్రంథాలుగా వ్రాసారు. వానినే 'బ్రాహ్మణాలు' అంటారు. బ్రహ్మ అనగా వేదం. దాని వ్యాఖ్యాన గ్రంథమవటం వలన 'బ్రాహ్మణ'మని పేరు కలిగింది. ఇంకా.

ఋషయో మంత్రదృష్టయః మంత్రాన్సమ్ప్రాదుః ॥ నిరు. 1-20 ॥

ఏ యే మంత్రార్థ దర్శనం ఏ యే ఋషికి కలిగిందో అంతకుపూర్వం ప్రకాశపరచని మంత్రార్థాలనే ఏ ఋషి మొదట వెల్లడించి ఇతరులకు బోధించాడో అప్పటినుండి ఆ మంత్రంతో పాటు ఆ ఋషి పేరు స్మరణార్థం వ్రాయబడుతున్నది. ఇట్టి ఋషులను ఎవరైనా మంత్రకర్తలు అన్నారో వారిని మిథ్యావాదులని అనాలి. ఋషులు కేవలం మంత్రార్థాలను వెల్లడించినవారే.

వేదసంజ్ఞ

ప్రశ్న: ఏ గ్రంథాలకు వేదమని పేరు?

జవాబు:- ఋక్, యజుః సామ, అథర్వ మంత్రసంహితలకు వేదమని పేరు. ఇతరాలను వేదం అనరు.

ప్రశ్న: **మంత్రబ్రాహ్మణయోర్వేదనామధేయమ్ ॥**

ఇలాంటి కాత్యాయనాది కృత ప్రతిజ్ఞాసూత్రాదులకు అర్థం ఏమని చెబుతారు?

జవాబు:- చూడండి. సంహితాపుస్తకాల ఆరంభంలోనూ, అధ్యాయాల సమాప్తిలోనూ 'వేదం' అను శబ్దం సనాతనంగా వ్రాయబడుతూ వస్తున్నది. బ్రాహ్మణగ్రంథాల ఆరంభాన్ని, అధ్యాయాల సమాప్తిలోగాని ఎక్కడా ఇలా వేదశబ్దం వ్రాయబడి లేదు. నిరుక్తంలో:

ఇత్యపి నిగమో భవతి ఇతి (చ) బ్రాహ్మణమ్ ॥ నిరుక్త. అ.5. ఖం. 3. 4 ॥

ఛందో బ్రాహ్మణాని చ తద్విషయాణి ॥ అష్టాధ్యాయి 4-2-66 ॥

వేదాలు మంత్రభాగాలనీ, బ్రాహ్మణాలు వ్యాఖ్యాన భాగాలనీ దీనితో స్పష్టంగా తెలుస్తున్నది. విశేషంగా ఈ విషయాన్ని తెలుసుకోదలచిన వారు నాచే రచించబడిన"**ఋగ్వేదాది భాష్య భూమిక**"ను చదవండి. అనేక ప్రమాణాలకు ఇది విరుద్ధమవటం వలన ఇది కాత్యాయన వచనం కాలేదని నిరూపణ చేయబడింది. బ్రాహ్మణాలను కూడా వేదమని అంగీకరిస్తే వేదాలు సనాతనం కాకుండా పోతాయి. ఎందుకంటే! బ్రాహ్మణ గ్రంథాలలో అనేక ఋషుల, మహర్షుల, రాజులు మొదలైనవారి చరిత్రలు వ్రాయబడి ఉన్నాయి. వ్యక్తులు జన్మించిన తరువాతనే వారి ఇతిహాసాలు వ్రాయబడతాయి. ఆ గ్రంథం కూడా వారు జన్మించిన తరువాతనే రచించబడుతుంది. వేదంలో ఎవరి ఇతిహాసం లేదు. ఏ యే శబ్దాలతో విద్యాబోధన జరుగుతుందో ఆ యా శబ్దాలే ప్రయోగింపబడ్డాయి. వేదంలో విశేష వ్యక్తుల పేర్లు గాని, విశేష కథా ప్రసంగాలు గాని లేవు.

వేదశాఖలు

ప్రశ్న: వేదాలకు ఎన్ని శాఖలు ఉన్నాయి?

జవాబు:- పదకొండువందల ఇరవై ఏడు శాఖలున్నవి.

ప్రశ్న: శాఖలు అని వేటినంటారు?

జవాబు:- వ్యాఖ్యానాలను శాఖలంటారు.

ప్రశ్న: వేదాల అవయవ భూతవిభాగాలనే శాఖలని లోకంలో విద్వాంసులు అంగీకరిస్తారు కదా!

జవాబు:- కొంచెం ఆలోచించటం మంచిది. ఎందుకంటే శాఖలన్నీ ఆశ్వలాయనాది ఋషుల పేర్లతో ప్రసిద్ధమై ఉన్నాయి. మంత్రసంహితలు పరమేశ్వరుని పేరుతో ప్రసిద్ధమై ఉన్నాయి. చతుర్వేదాలను పరమేశ్వర కృతాలని అంగీకరించినట్లు, ఆశ్వలాయనాది శాఖలు కూడా ఆ యా ఋషి కృతాలని అంగీకరించాలి. ప్రతి శాఖలోనూ వేద మంత్రాలను ప్రతీకలుగా ఇచ్చి వ్యాఖ్యానాలు చేసినారు. తైత్తిరీయ శాఖలో 'ఇషేత్వోర్జేత్వేతి' ఇత్యాది ప్రతీకల (మంత్ర భాగాల)ను మొదట వ్రాసిన తర్వాత వ్యాఖ్యానాలను చేసినారు. వేదసంహితలో ఎక్కడా ఇలాంటి ఏ ప్రతీకా పెట్టి వ్యాఖ్యానించబడలేదు. కాబట్టి పరమేశ్వర కృతమైన నాలుగు వేదాలు మూలవృక్షం. ఇక ఆశ్వలాయనాదులన్నీ శాఖలు. ఇవి ఋషి, మునికృతాలే కాని పరమేశ్వరకృతాలు కావు. దీనిని గురించి విశేషంగా తెలుసుకోదలచినవారు "ఋగ్వేదాది భాష్యభూమిక"ను చూడండి.

తల్లిదండ్రులు తమ సంతానంపై కృపాకటాక్షంగలవారై వారి ఉన్నతినే కోరునట్లు పరమాత్ముడు మానవులందరిపై దయగలవాడై వేదాలను ప్రకాశపరచినాడు. దీనివలన మానవులు అవిద్యాంధకార భ్రమజాలాల నుండి దూరులై విద్య అనే విజ్ఞానరూప సూర్యున్ని పొంది ఆనందాన్ని పొందుతూ విద్యాసుఖాలను వృద్ధిజేసుకొంటారు.

ప్రశ్న: వేదం నిత్యమా? అనిత్యమా?

జవాబు:- నిత్యం. ఎందుకంటే! పరమేశ్వరుడు నిత్యుడవటం వలన అతని జ్ఞానాది గుణాలు కూడా నిత్యాలే. నిత్య పదార్థాల గుణ, కర్మ, స్వభావాలు నిత్యాలే. అనిత్య ద్రవ్యాల గుణ, కర్మ స్వభావాలు అనిత్యాలు.

ప్రశ్న: ఈ పుస్తకం కూడా నిత్యమేనా?

జవాబు:- కాదు. పుస్తకం కాగితాలతోను సిరాతోను తయారైంది. అది నిత్యమెట్లా అవుతుంది? కాని అందలి శబ్దాలు, అర్థాలు, వాని సంబంధాలు మాత్రం నిత్యాలు.

ప్రశ్న: ఈశ్వరుడు ఆ ఋషులకు జ్ఞానాన్ని ఇచ్చి ఉండును. ఆ జ్ఞానంతో వారు వేదాలను రచించి ఉండవచ్చును?

జవాబు: జ్ఞేయం (తెలుసుకోబడింది) లేకుండా జ్ఞానముండదు. గాయత్ర్యాది ఛందాలతో, షడ్జాది ఉదాత్త అనుదాత్తాది స్వరాలతో, జ్ఞానపూర్వకంగా గాయత్ర్యాది ఛందాలతో కూడిన సర్వజ్ఞానయుక్త శాస్త్రాన్ని రచించే సామర్థ్యం సర్వజ్ఞుడైన పరమేశ్వరునికి తప్ప మరొకరికి లేదు. వేదాలను చదివిన తర్వాతే విద్యలను ప్రకాశపరచటానికి ఋషులు, మునులు వ్యాకరణం, నిరుక్తం, ఛందస్సు మొదలైన గ్రంథాలను రచించారు. పరమాత్ముడే వేదాలను ప్రకాశపరచకున్న ఎవ్వరూ ఏమీ చేయలేకపోయేవారు. కాబట్టి వేదం పరమేశ్వరోక్తం. ప్రజలందరు వీనిని అనుసరించే నడవాలి. మీ ధర్మమేది? అని ఎవరైనా ప్రశ్నిస్తే మాది వేదధర్మమనీ, వేదంలో గల విషయాలనే మేము అంగీకరిస్తామనీ సమాధానం చెప్పాలి.

ఇక్కడ సంక్షేపంగా 'ఈశ్వర' 'వేద' విషయాలు వ్యాఖ్యానించబడ్డాయి. ఇకముందు సృష్టి విషయం వ్రాయబడుతుంది.

శ్రీమద్దయానంద సరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన

సత్యార్థప్రకాశంలో ఈశ్వర, వేద విషయాలు గల

సప్తమ సముల్లాసం సంపూర్ణం.

అష్టమ సముల్లాసము

అథ సృష్ట్యుత్పత్తిస్థితిప్రలయ విషయాన్ వ్యాఖ్యాస్యామః
సృష్టి ఉత్పత్తి, స్థితి, ప్రళయములను వ్యాఖ్యానింతుము

బ్రహ్మ జగత్కర్త

ఇయం విసృష్టిర్యత ఆ బభూవ యది వా దధే యది వా న ।
యో అస్యాధ్యక్షః పరమే వ్యోమన్త్సో అంగ వేద యది వా న వేద ॥ ఋ. 10-129-7 ॥

హే అంగ = ఓ మానవా! ఈ వివిధ సృష్టి ఎవరితో ప్రకటించబడి ధరించబడిందో; ఎవడు దీని ప్రళయకర్తో, ఎవడు ఈ జగానికి స్వామియో; ఏ వ్యాపకునిలో సమస్త లోకాలు సృజించబడి, పోషించబడి, ప్రళయాలు పొందుతున్నాయో అతడే పరమాత్మ. అతనినే నీవు తెలుసుకో. ఇతరులను సృష్టికర్తలుగా భావించకు.

తమ ఆసీత్తమసా గూఢమగ్రేఽ ప్రకేతం సలిలం సర్వమా ఇదమ్ ।
తుచ్ఛ్యేనాభ్వపిహితం యదాసీత్తపసస్తన్మహినా జాయతైకమ్ ॥ ఋ. 10-129-3 ॥

ఈ సమస్త జగత్తు సృష్టికి పూర్వం అంధకారంతో వ్యాపించి రాత్రి రూపంలో తెలుసుకోవటానికి అయోగ్యమై ఉండెను. జగత్తంతా ఆకాశరూపంలో తుచ్ఛంగా అనంతుడైన ఆ పరమేశ్వరుని సమ్ముఖంలో ఏకదేశమై, ఆచ్ఛాదితమై ఉండెను. తదనంతరం పరమేశ్వరుడు తన సామర్థ్యంతో దీనిని కారణరూపం నుండి కార్యరూపానికి తెచ్చాడు.

హిరణ్యగర్భః సమవర్తతాగ్రే భూతస్య జాతః పతిరేక ఆసీత్ ।
స దాధార పృథివీం ద్యాముతేమాం కస్మై దేవాయ హవిషా విధేమ ॥ ఋ. 10-121-1 ॥

ఓ మానవులారా! సమస్త సూర్యాది తేజోవంతమైన పదార్థాలకు ఆధారుడు, ఏర్పడిన, ఏర్పడనున్న లోకాలకు అద్వితీయ పతియైన పరమాత్ముడే ఈ జగదుత్పత్తికి పూర్వంలో ఉన్నాడు. అతడే పృథ్వి

మొదలుకొని సూర్యునివరకు గల లోకాలను సృజించాడు. ఆ దేవుడైన పరమాత్ముని ప్రేమతో భజించండి.

పురుష ఏవేదగ్ం సర్వం యద్భూతం యచ్చ భావ్యమ్ ।
ఉతామృతత్వస్యేశానో యదన్నేనాతిరోహతి ॥ యజు. 31-2 ॥

ఓ మానవులారా! అన్నింటియందు పూర్ణుడైన పురుషుడు అవినాశ కారణుడై, జీవులకు స్వామియై పృథివ్యాది సమస్త జడ పదార్థాలకంటే, జీవులకంటే అతిరిక్తుడై ఉన్నాడు. ఆ పురుషుడే ఈ భూత, భవిష్యత్ వర్తమానాలందున్న జగాన్ని ఏర్పర్చేవాడు.

యతో వా ఇమాని భూతాని జాయంతే యేన జాతాని జీవంతి ।
యత్ప్రయన్త్యభిసంవిశంతి తద్విజిజ్ఞాసస్వ తద్బ్రహ్మ ॥ తైత్తరీయ. భృగువల్లీ. అను. 1 ॥

ఏ పరమాత్ముని రచనతో ఈ సమస్త పృథివ్యాది భూతాలు ఉత్పన్నమవుతున్నాయో, జీవిస్తూ ప్రళయాన్ని పొందుతున్నాయో అతడే బ్రహ్మ. అతనినే తెలుసుకొనుము.

జన్మాద్యస్య యతః ॥ వేదాంత. 1-2 ॥

ఈ జగత్తు ఎవరితో సృజింపబడి, ధరింపబడి ప్రళయాన్ని చెందుతుంతో అతడే తెలుసుకోవటానికి యోగ్యుడైన బ్రహ్మ.

పరమేశ్వరుడు జగత్తుకు నిమిత్తకారణం

ప్రశ్న:- ఈ సృష్టి పరమేశ్వరుని నుండి ఉత్పన్నమైనదా? లేక ఇతరుల నుండా?

జవాబు:- నిమిత్తకారణుడైన పరమాత్మునినుండి ఉత్పన్నమైనది. కాని దీని ఉపాదాన కారణం ప్రకృతి.

ప్రశ్న:- ప్రకృతిని పరమేశ్వరుడు సృజింపలేదా?

జవాబు:- సృజించలేదు. అది అనాది.

అనాది పదార్థాలు

ప్రశ్న:- 'అనాది' అని దేనినంటారు? అనాది పదార్థాలెన్ని?

జవాబు:- ఆది లేనిది అనాది. 'ఈశ్వరుడు, జీవుడు, జగత్కారణమైన ప్రకృతి' ఈ మూడూ అనాదులు.

ప్రశ్న:- దీనికి ప్రమాణమేమి?

జవాబు:- **ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే ।**
తయోరన్యః పిప్పలం స్వాద్వత్త్యనశ్నన్నన్యో అభిచాకశీతి ॥ ఋ. 1-194-20 ॥

ద్వా = ఈశ్వరుడు, జీవుడు అనే ఈ ఇద్దరూ; సుపర్ణా = చేతనత్వ, పాలనాది గుణాలతో సమానులు; సయుజా = వ్యాప్యవ్యాపక భావాలతో కూడి ఉన్నవారు; సఖాయా = పరస్పరమైత్రితో కూడిన సనాతనులు, అనాదులు; సమానమ్ = సమానమైనట్టి; వృక్షమ్ = అనాదియు, మూలరూప కారణాన్ని, శాఖారూప కార్యాలతో కూడిన వృక్షాన్ని అంటే స్థూలంగా ఉండి ప్రళయంలో ఛిన్నాభిన్నమగునది. ఇది మూడవదైన అనాది పదార్థమైన ప్రకృతి. ఈ మూడింటి గుణ, కర్మ, స్వభావాలు అనాదులే; తయోరన్యః = ఈ జీవ బ్రహ్మలలో ఒకడైన జీవుడు ఈ వృక్షరూప సంసారంలో పాపపుణ్య రూప ఫలాలను; స్వాద్వత్తి = బాగా అనుభవిస్తున్నాడు. రెండవవాడైన పరమాత్మ కర్మ ఫలాలను; అనశ్నన్ = అనుభవించక, నలుదిక్కుల - లోపల, బయట,అంతట ప్రకాశమానుడౌతున్నాడు. ఈశ్వరుని కంటే జీవుడు, జీవుని కంటే ఈశ్వరుడు, ఈ ఇద్దరి కంటే ప్రకృతి భిన్నస్వరూపం కలిగి ఉన్నాయి. ఈ మూడూ అనాదులే.

శాశ్వతీభ్యః సమాభ్యః ॥ యజు. 40-8 ॥ అనాది, సనాతనులైన జీవరూప ప్రజలకు వేదం ద్వారా పరమాత్ముడు సమస్త విద్యలను తెలియజేశాడు.

అజామేకాం లోహితశుక్లకృష్ణాం బహ్వీః ప్రజాః సృజమానాం స్వరూపాః ।
అజో హ్యేకో జుషమాణోఽనుశేతే జహాత్యేనాం భుక్తభోగామజోఽన్యః ॥శ్వేతా. ఉప. 4-5 ॥

ఇది శ్వేతాశ్వతర ఉపనిషత్ వాక్యం. 'ప్రకృతి, జీవుడు, పరమాత్మ' అను ఈ ముగ్గురు అజులు. వీనికి జన్మ ఉండదు. ఇవి ఎన్నడూ జన్మించవు. ఈ మూడు జగత్తుకు కారణాలు. వీనికి కారణం మరేదీ లేదు. ఈ అనాది అయిన ప్రకృతిని అనాది అయిన జీవుడు అనుభవిస్తూ, దానిలో చిక్కుకొంటున్నాడు. కాని పరమాత్ముడు దానిని అనుభవించడు, దానిలో చిక్కుకోడు.

ప్రకృతి స్వరూపం

ఈశ్వర, జీవ లక్షణాలను గూర్చి 7వ సముల్లాసంలో ఈశ్వర విషయంలో చెప్పాము. ఇపుడు ప్రకృతి లక్షణాలను తెలుపుతాము:-

సత్వ రజస్తమసాం సామ్యావస్థా ప్రకృతిః. ప్రకృతేర్మహాన్
మహతోఽహంకారోఽహంకారాత్ పంచతన్మాత్రాణ్యుభయమింద్రియం ।
పంచతన్మాత్రేభ్యః స్థూలభూతాని పురుష ఇతి పంచవింశతిర్గణః ॥ సాంఖ్య సూ. 1-61 ॥

సత్త్వం = పరిశుద్ధం; రజః = మధ్యమం; తమః = జాడ్యం అంటే జడత్వం అనే మూడు గుణాలు కల వస్తువులు కలసిన సంఘాతాన్ని 'ప్రకృతి' అంటారు. దాని నుండి మహత్తత్వమనే బుద్ధి, దాని నుండి అహంకారం, దాని నుండి పంచతన్మాత్రలు, సూక్ష్మభూతాలు, దశేంద్రియాలు, పదకొండవది మనస్సు, పంచతన్మాత్రల నుండి పృథివ్యాది పంచభూతాలను (ఇవి ఇరవై నాలుగు)నవి కలిగాయి. ఇరవై ఐదవ వాడు పురుషుడు అంటే జీవుడు లేదా పరమేశ్వరుడు. వీనిలో ప్రకృతి అవికారిణి. మహత్తత్వం, అహంకారం, పంచసూక్ష్మభూతాలు ప్రకృతి యొక్క కార్యాలే గాక ఇంద్రియాలకు,

మనస్సుకు, స్థూల భూతాలకు కారణాలై ఉన్నాయి. పురుషుడు దేనికీ ప్రకృతి - ఉపాదాన కారణం గాని దేనికీ కార్యం గాని కాదు.

ప్రశ్న:- స దేవ సోమ్యేదమగ్ర ఆసీత్ ॥ ఛాందో. 6-2-1 ॥
అసద్వా ఇదమగ్ర ఆసీత్ ॥ తైత్తిరీయ. బ్రాహ్మ ॥7 ॥
ఆత్మా వా ఇదమగ్ర ఆసీత్ ॥ బృహదా. 1-4-1 ॥
బ్రహ్మ వా ఇదమగ్ర ఆసీత్ ॥ శతపథ. 11-1-11-1 ॥

ఇవి ఉపనిషద్వాక్యాలు - ఓ శ్వేతకేతూ! ఈ జగత్తు సృష్టి అవటానికి పూర్వం, సత్, అసత్, ఆత్మ, బ్రహ్మరూపంలో ఉండెను. తర్వాత:-

తదైక్షత బహుః స్యాం ప్రజాయేయేతి ॥ ఛాందో. 6-2-2 ॥
సోఽకామయత బహుః స్యాం ప్రజాయేయేతి ॥ తైత్తి బ్రహ్మ. 6 ॥

ఇవి ఛాందోగ్య, తైత్తిరీయోపనిషత్తుల వచనాలు. ఆ పరమాత్ముడే తన కోరికతో అనేక రూపాలను దాల్చాడు.

సర్వం ఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తి కించన ॥

ఇది కూడా ఉపనిషత్ వాక్యమే. ఈ జగత్తంతా నిశ్చయంగా బ్రహ్మమే. అతనిలో ఇతర అనేక విధాలైన పదార్థాలు ఏవీ లేవు. అంతా బ్రహ్మరూపమే.

జవాబు:- ఎందుకీ వచనాలకు అపార్థాలను కలిగిస్తారు? ఆ ఉపనిషత్తులలోనే ఇలా ఉంది:-

(ఏవమేవ ఖలు) సోమ్యాన్నేన శుంగేనాపో మూలమన్విచ్ఛ. అద్భిస్సోమ్య శుంగేన తేజో మూల మన్విచ్ఛ. తేజసా సోమ్య శుంగేన సన్మూల మన్విచ్ఛ. సన్మూలాః సోమ్యేమాః సర్వాః ప్రజాః సదాయతనాః సత్ప్రతిష్ఠాః ॥

ఛాందో. ప్ర. 6 ఖం. 8 మం. 4 ॥

ఓ శ్వేతకేతూ! అన్నరూపమైన పృథ్వీ కార్యంనుండి జలరూప మూల కారణాన్ని తెలుసుకోండి. కార్యరూప జలంనుండి తేజోరూప మూలాన్ని, తేజోరూప కార్యంనుండి నిత్యప్రకృతి అయిన సద్రూపకారణాన్ని తెలుసుకోండి. ఈ సత్యస్వరూప ప్రకృతే సమస్త జగత్తుకు మూలాధారమై స్థితికి స్థానమై ఉన్నది. ఈ జగత్తంతా సృష్టికి పూర్వం అసద్రూపంలో జీవాత్మ, బ్రహ్మ, ప్రకృతులలో లీనమై ఉంది. అభావంగా లేదు. **'సర్వం ఖల్విదం'** అను వాక్యం "ఒకచోట ఉన్న ఇటుకను, మరొకచోట ఉన్న రాయిని చేర్చి భానుమతి ఇల్లు కట్టిన" దని అన్నట్లు చమత్కారంగా ఉన్నది. ఎందుకంటే:-

సర్వం ఖల్విదం బ్రహ్మ తజ్జలానితి శాంత్యుపాసీత ॥ ఛాందో 3-14-1 ॥
నేహ నానాస్తి కించన ॥ కఠోప. 2-4-11 ॥

శరీరావయవాలు శరీరంతో కూడి ఉన్నంతవరకు కార్యసాధకాలు. శరీరం నుండి వేరైతే అవి పనికిరానివి అవుతాయి. అలాగే ప్రకరణంలో ఉండే వాక్యాలు సార్థకాలు అవుతాయి. ప్రకరణం నుండి వానిని తొలగిస్తే, లేక ఇతర పదాలతో జోడిస్తే అపార్థాలైపోతాయి. దీని అర్థాన్ని వినండి:-

ఓ జీవుడా! ఏ బ్రహ్మతో ఈ జగత్తుకు ఉత్పత్తి, స్థితి, జీవనం కలుగుతుందో, ఎవడు సృజించి, ధరించటంతో ఈ సమస్త జగత్తు విద్యమానమవుతుందో బ్రహ్మతో సహచరితమై ఉందో, అలాంటి బ్రహ్మను వీడి ఇతరులను ఉపాసించకండి. ఈ చేతనామాత్ర అఖండమైన ఏకరస బ్రహ్మస్వరూపంలో అనేక వస్తువుల కలయిక లేదు. అవి అన్నీ వేరు వేరు రూపాలతో పరమేశ్వరుని ఆధారంతో ఉన్నవి.

జగదుత్పత్తికి మూడు కారణాలు

ప్రశ్న:- జగత్తుకు ఎన్ని కారణాలున్నాయి?

జవాబు:- నిమిత్త, ఉపాదాన, సాధారణ కారణాలని జగత్కారణాలు మూడు. తాను చేస్తే ఏదేని అవటం, తాను చేయకున్న ఏదీ కాకుండా ఉండటం, నిమిత్త కారణం. తాను ఇతరులతో చేయబడక, ఇతర పదార్థాలను రూపాంతరాలుగా మారునది ఉపాదాన కారణం. ఏది (సాధనం) లేకుండి ఏ వస్తువు ఏర్పడదో అది, సాధారణ కారణం అనబడుంది.

1. నిమిత్త కారణం:- ఇది రెండు విధాలు. (1) కారణంతో సమస్త సృష్టిని రచించి, ధరించి ప్రళయం చేసేసి, అన్నిటికి సంబంధించిన వ్యవస్థలను చేయు ముఖ్య నిమిత్త కారణం పరమాత్మ. (2) పరమేశ్వర సృష్టినుండి పదార్థాలను తీసుకొని అనేకవిధాల ఇతర కార్యాలను చేసే సాధారణ నిమిత్త కారణం జీవుడు.

2. ఉపాదాన కారణం:- సమస్త జగత్తును చేయటానికి సామగ్రి అయిన ప్రకృతి - పరమాణువులు ఉపాదాన కారణం. అది జడమవటం వలన, తనంత తాను మారలేదు. ఇతరులు చేసినచో తయారవుతుంది, మారిస్తే మారుతుంది, ఒక్కొక్క చోట జడంయొక్క నిమిత్తకారణంలో జడపదార్థాలు తయారౌతుంటాయి, మారుతుంటాయి. పరమేశ్వరునితో సృజించబడిన విత్తు పృథ్విపై పడి జలాన్ని పొందటంతో వృక్షాకారాన్ని ధరిస్తుంది. అగ్ని మొదలైన జడపదార్థాల సంయోగంతో నాశనం కూడా అవుతుంది. ఇవి నియమపూర్వకంగా తయారవటం, మారటం అనేది పరమేశ్వరుని మరియు జీవుని అధీనంలో ఉన్నది.

ఏదైనా ఒక వస్తువు నిర్మించబడునప్పుడు జ్ఞానం, దర్శనం, బలం, చేతులు మొదలైన అనేక సాధనాలు, దిశలు, కాలం, ఆకాశం అనేవి అవసరమవుతాయి. ఇవి సాధారణ కారణాలు. కుండను చేయటానికి కుమ్మరి నిమిత్త కారణం. మట్టి ఉపాదాన కారణం. కఱ్ఱ, చక్రం మొదలైనవి సామాన్య నిమిత్త కారణాలు. దిశ, కాలం, ఆకాశం, ప్రకాశం, కండ్లు, చేతులు, జ్ఞానం, క్రియ మొదలైననవి సాధారణ కారణాలు. ఇవి నిమిత్త కారణాలు కూడా అవుతున్నాయి. ఈ మూడు కారణాలు లేకుండా ఏ వస్తువు కూడా నిర్మించబడలేదు. మారలేదు.

ప్రశ్న:- నవీన వేదాంతులు కేవలం పరమేశ్వరుడొక్కడే జగత్తుకు అభిన్న నిమిత్త ఉపాదాన కారణమని అంగీకరిస్తారు కదా!

యథోర్ణనాభిః సృజతే గృహ్ణతే చ ॥ ముండకో. 1-1-7 ॥

ఇది ఉపనిషత్ వాక్యం. సాలెపురుగు బయటనుండేపదార్థాన్ని తీసుకొనకుండా తన లోపలి నుండి దారాన్ని తీసి గూడును అల్లుకొని తానే దానిలో క్రీడించునట్లు బ్రహ్మం కూడా తన నుండే జగత్తును సృజించుకొని, తానే జగదాకారుడై దానిలో తానే క్రీడిస్తున్నాడు. ఆ బ్రహ్మయే తాను అనేక రూపాలను ధరించాడు అంటే జగదాకారుడు కావాలని కోరుతూ, సంకల్పమాత్రంతోనే జగద్రూపుడయ్యాడు. ఎందుకంటే:-

ఆదావంతే చ యన్నాస్తి వర్తమానేఽపి తత్తథా ॥ గౌడపాదీయ కారికా శ్లోకం. 3 ॥

ఇది మాండూక్యోపనిషత్తుయొక్క కారిక. ఏది ప్రథమంలో ఉండదో అది అంతంలో కూడా ఉండదు. అది వర్తమానంలో కూడా ఉండదు. సృష్ట్యారంభంలో జగత్తు లేకుండా ఉన్నది. బ్రహ్మమున్నాడు. ప్రళయాంతంలో జగత్తు ఉండదు. బ్రహ్మం ఉంటుంది. అటులనే వర్తమానంలో జగత్తంతా బ్రహ్మమేల కాదు?

జవాబు:- మీరన్నట్లుగా, జగత్తుయొక్క ఉపాధానకారణం బ్రహ్మమైతే అతడు పరిణామి, అవస్థాంతర యుక్తుడు, వికారీ అవుతాడు. ఉపాదాన కారణం యొక్క గుణకర్మస్వభావాలు కార్యాలలో కూడా ఉన్నాయి.

కారణగుణపూర్వకః కార్యగుణో దృష్ట ॥ వైశేషి 2-1-24 ॥

ఉపాదాన కారణ గుణాలకు సమానమైన గుణాలు కార్యంలో ఉండును. 'బ్రహ్మ' సచ్చిదానంద స్వరూపుడు. కార్యరూపమైన జగత్తు అసత్తు, జడం, ఆనందరహితమై ఉన్నది. బ్రహ్మ అజుడు - జన్మ లేనివాడు. జగత్తుకు ఉత్పత్తి కలదు. బ్రహ్మ అదృశ్యుడు. జగం దృశ్యం. బ్రహ్మ అఖండుడు. జగత్తు ఖండరూపం కలది. బ్రహ్మనుండి పృథివ్యాది కార్యాలు ఉత్పన్నమైతే పృథివ్యాది కార్యాల యొక్క జడాది గుణాలు బ్రహ్మలో ఉండాలి. పృథివ్యాదులు జడాలైనట్లే బ్రహ్మం కూడా జడం కావాలి. పరమేశ్వరుడు చేతనమైనట్లే పృథివ్యాది కార్యాలు చేతనాలు కావాలి.

మీరు చూపిన సాలెపురుగు దృష్టాంతం కూడా మీ మతాన్ని సాధించేది కాదు. అది బాధించేదే. ఎందుకంటే జడరూప శరీరం తంతువుకు (దారంకు) ఉపాదాన కారణం. జీవాత్మ నిమిత్త కారణం. ఇది కూడా పరమాత్మని అద్భుత రచనా ప్రభావం. ఇలా ఇతర జంతువుల శరీరం నుండి జీవులు దారం తీయలేవు. ఇదేవిధంగా సర్వ వ్యాపకుడైన బ్రహ్మ తనలో వ్యాప్తమైన ప్రకృతి - పరమాణువు లనే కారణం నుండి స్థూలజగాన్ని సృజించి, దానిని లోపల స్థూలరూపంగా చేసి, తాను దానిలో వ్యాపకుడై సాక్షీభూతుడుగా, ఆనందమయుడుగా ఉన్నాడు.

పరమాత్ముడు "నేను సర్వజగాన్ని సృజించి ప్రసిద్ధుడ్ని కావాలి" అని ఈక్షించినపుడు అంటే అలా దర్శించి, అలా కోరినపుడు, అంటే జగముత్పన్నమైనపుడే జీవులయొక్క ఆలోచన, జ్ఞాన, ధ్యాన, ఉపదేశ శ్రవణాలలో పరమేశ్వరుడు ప్రసిద్ధుడై మిక్కిలి స్థూలపదార్థాలతో పాటు వర్తమానుడవుతున్నాడు. ప్రళయమైనపుడు ఆ ప్రళయరూప జగత్తును పరమేశ్వరుడు, ముక్తజీవులు తప్ప మరెవ్వరూ తెలుసుకోలేరు.

గౌడపాదుని ఈ కారిక భ్రమమూలకమైనది. ఎందుకంటే ప్రళయంలో జగత్తు ప్రసిద్ధంగా లేదు. సృష్టియొక్క అంతం నుండి అనగా ప్రళయ ఆరంభం నుండి మళ్లీ రెండవసారి సృష్టి జరగనంతవరకు జగత్కారణం సూక్ష్మంగాను, అప్రసిద్ధంగాను ఉంటుంది. ఎందుకంటే

తమ ఆసీత్తమసా గూఢమగ్రే ॥ ఋ. 10-129-3 ॥

ఇది ఋగ్వేదవచనం.

ఆసీదిదం తమోభూతమప్రజ్ఞాతమలక్షణమ్ ।
అప్రతర్క్యమవిజ్ఞేయం ప్రసుప్తమివ సర్వతః ॥ ॥మను. 1-5 ॥

ఈ లోకాలన్నీ సృష్టికి పూర్వం ప్రళయంలో అంధకారంతో ఆవృతమై ఆచ్ఛాదితమై ఉన్నాయి. ప్రళయారంభం తరువాత కూడా అలానే ఉంటాయి. ఆ సమయంలో ఎవరికి కూడా తెలుసుకొనుటకు, తర్కించుటకు ప్రసిద్ధ చిహ్నాలుగల ఇంద్రియాలు అనుకూలంగా లేవు. కాని వర్తమానకాలంలో తెలుసుకోబడుచున్నది. ఇపుడు ప్రసిద్ధ చిహ్నాలతో కూడిన ఇంద్రియాలు తెలుసుకోవటానికి యోగ్యంగా ఉన్నాయి.

ఈ కారిక రచయిత వర్తమానంలో జగత్తుండదని వ్రాసినాడు. అది పూర్తిగా అప్రమాణం. ఎందుకంటే, ప్రమాతా-తెలిసినవాడు కర్త. దేనిని ప్రమాణముల మూలంగా తెలుసుకొని దానిని పొందునో అది మరొక విధంగా ఎన్నడూ కాజాలదు.

సృష్టి ప్రయోజనం

ప్రశ్న:- జగత్తుని సృష్టించటంలో పరమేశ్వరునికి ఏమి ప్రయోజనం?

జవాబు:- సృష్టి చేయకుండుటలో ప్రయోజనమేమి?

ప్రశ్న:- సృష్టించకున్న తాను ఆనందంతో ఉండవచ్చు. జీవులకుకూడా సుఖ దుఃఖాలు కలుగకుండేవి.

జవాబు:- ఇది సోమరుల, ఆలసుల, దరిద్రుల మాట. పురుషార్థపరులు ఇలా అనరు. జీవులకు ప్రళయకాలంలో సుఖ దుఃఖాలేముంటాయి? సృష్టిలోని సుఖ దుఃఖాలతో పోలిస్తే సుఖం ఎన్నో రెట్లు అధికంగా ఉంటుంది. ఎందరో పవిత్రాత్ములైన జీవులు, ముక్తిసాధనలను చేసి మోక్షానందాన్ని

పొందుతారు. ప్రళయంలో సుషుప్తిలో లాగా, పనిపాటలు లేకుండా సోమరులుగా పడి ఉంటారు. ప్రళయానికి పూర్వపు సృష్టిలో జీవులు చేసిన పాపపుణ్య కర్మల ఫలితాన్ని ఈశ్వరుడు ఎలా ఇవ్వగలడు? దానిని జీవులు ఎలా అనుభవించగలరు?

ఎవడేని కండ్లుంటే ప్రయోజనమేమిటని అడిగితే 'చూడటం' అనే కదా చెప్పగలం. ఈశ్వరునిలో జగత్ రచన చేసే విజ్ఞానం, బలం, క్రియ ఉండీ జగదుత్పత్తిని చేయకపోతే వాని ప్రయోజనమేమి? ఏమీ ఉండదనే మీరు అనగలరు. జగాన్ని సృజించినపుడే పరమాత్ముని న్యాయ, ధారణ, దయాది గుణాలు సార్థకాలవుతాయి. అతని అనంత సామర్థ్యం జగదుత్పత్తి, స్థితి ప్రళయ వ్యవస్థలను చేసినపుడే సఫలమవుతాయి. నేత్రాల స్వాభావిక గుణం చూడటం. అలాగే పరమేశ్వరుని స్వాభావిక గుణం జగదుత్పత్తిని చేసి, జీవులందరికీ అసంఖ్యాకమైన పదార్థాలను ఇచ్చి, పరోపకారం చేయటం.

ప్రశ్న:- విత్తు ముందా? చెట్టు ముందా?

జవాబు:- విత్తు - బీజం ముందు. ఎందుకంటే విత్తు, హేతువు, నిదానం, నిమిత్తం, కారణం, ఇలాంటి శబ్దాలు ఏకార్థవాచకాలు. ఒకే అర్థాన్ని బోధిస్తాయి. బీజం (విత్తు) ముందు అని చెప్పటానికి కారణమేమిటంటే కార్యానికి ముందే కారణం ఉంటుంది.

ప్రశ్న:- పరమేశ్వరుడు సర్వశక్తిమంతుడు. కాబట్టి అతడు కారణాన్ని (ప్రకృతిని), జీవులను కూడా పుట్టించగలడు. పుట్టించకపోతే అతడు సర్వశక్తిమంతుడు కాలేడు.

జవాబు:- సర్వశక్తిమంతు డనే శబ్దానికి అర్థం పూర్వమే వ్రాయబడింది. అసంభవాలైనవాటిని చేసినపుడే సర్వశక్తిమంతుడంటామా? కారణం లేకుండానే కార్యాలు జరగడం అసంభయం అతడు కారణం లేకుండానే మరొక ఈశ్వరుని సృష్టించి తాను మృత్యువును పొందటం, జడుడు, అజ్ఞాని, దుఃఖితుడు, అన్యాయకారి, అపవిత్రుడు, దుర్మార్గుడు, మొదలైనవి అవుతాడా? స్వాభావిక నియమాలను అంటే అగ్నిలోని ఉష్ణాన్ని, జలంలోని శీతలత్వాన్ని, పృథివ్యాది సమస్త జడపదార్థాలను విపరీతగుణాలు కలవిగా పరమేశ్వరుడు కూడా చేయలేడు. ఈశ్వర నియమాలు సత్యాలు. పూర్ణమైనవి. కాబట్టి వాటిలో పరివర్తన చేయలేడు. పరమాత్ముడు ఇతరుల సహాయం లేకుండా తన కార్యాలన్నింటిని తానే పూర్తి చేసుకొంటాడని చెప్పటమే సర్వశక్తిమంతుడన్న శబ్దానికర్థం.

ఈశ్వరుడు సాకారుడా? - నిరాకారుడా?

ప్రశ్న:- ఈశ్వరుడు సాకారుడా ? నిరాకారుడా? నిరాకారుడైతే చేతులు మొదలైన సాధనాలు లేకుండా సృష్టిని రచించలేడు. సాకారుడైతే ఎలాంటి దోషాలుండవు.

జవాబు:- ఈశ్వరుడు నిరాకారుడు. సాకారుడు అంటే శరీరంతోకూడినవాడు పరమేశ్వరుడు కాలేడు. సాకారుడైతే పరిమిత శక్తి గలవాడు, దేశ కాల వస్తువులలో పరిచ్ఛిన్నుడు అవుతాడు. ఆకలి - దప్పికలు, ఛేదన - భేదనాలు (చీల్చబడటం మరియు విభజించబడటం), శీతోష్ణాలు, జ్వరపీడనాదులు

సహితం అతనికి ఉంటాయి. అపుడు అతనిలో జీవుని గుణాలు తప్ప ఈశ్వరుని గుణాలు ఘటించలేవు. మీరు, నేను, శరీరధారులం. సాకారులం. కాబట్టి మనం త్రసరేణువులను, అణువు పరమాణువులను, ప్రకృతిని పట్టుకొనలేము. ఆ సూక్ష్మ పదార్థాలను పట్టుకొని స్థూలంగా చేయలేము. అలాగే పరమేశ్వరుడు స్థూల శరీరధారియైతే ఆ సూక్ష్మ పదార్థాలతో స్థూల జగత్తును సృజించలేడు.

పరమేశ్వరుడు భౌతిక ఇంద్రియ గోళకాలైన హస్త పాదాది అవయవాలు లేనివాడు. అయినా కూడా అతనిలో అనంత శక్తి, బల, పరాక్రమాలున్నాయి. వానితోనే జీవుడు, ప్రకృతి ఎన్నడూ చేయలేని కార్యాలను అన్నింటిని చేయగలడు. అతడు ప్రకృతికంటే సూక్ష్మంగా ఉన్నప్పుడే - దానిలో వ్యాపించగలడు. దానిని పట్టుకొని జగదాకారంగా చేయగలడు. సర్వగతుడవటం వలననే అన్నింటిని ధరించి ప్రళయాన్ని చేయగలడు.

ప్రశ్న:- మానవుల తల్లిదండ్రులు సాకారులవటం వలన వారి సంతానం కూడా సాకారంగా ఉన్నది. వారు నిరాకారులైతే వారి బిడ్డలు నిరాకారులవుతారు. అలాగే పరమేశ్వరుడు నిరాకారుడైతే అతనితో రచించబడిన జగత్తు కూడా నిరాకారమే కావాలి కదా!

జవాబు:- మీ ప్రశ్న బాలుర ప్రశ్నవలె ఉన్నది. పరమేశ్వరుడు జగత్తు ఉపాదాన కారణం కాడనీ, నిమిత్తకారణుడనీ ఇంతకు పూర్వమే ప్రమాణాలలో చెప్పాము. స్థూలమైన ప్రకృతి-పరమాణువులు జగత్తుకు ఉపాదాన కారణం. అవి ఎప్పుడూ నిరాకారాలు కావు. పరమేశ్వరుని కంటే స్థూలమై ఇతర కార్యాల కంటే సూక్ష్మాకారం కలిగి ఉన్నాయి.

ప్రశ్న:- పరమేశ్వరుడు కారణంలేకుండా కార్యాన్ని చేయలేడా?

జవాబు:- చేయలేడు. అభావానికి భావం ఎప్పుడూ అసంభవం. అంటే లేనిది ఉండటం జరగలేదు. "నేను గొడ్రాలి పిల్లల వివాహం చూసాననీ, అతడు మానవుని కొమ్ముతో చేసిన ధనుస్సును ధరించాడనీ, వారిద్దరూ ఆకాశ పుష్పాల మాలలను ధరించారనీ, మృగ తృష్ణలోని జలంలో స్నానమాడారనీ, వారు గంధర్వనగరంలో నివసిస్తున్నారనీ, అక్కడ మేఘాలు లేకుండా వర్షాలు కురిసి భూమి లేకుండానే ఆహార పదార్థాలు పండుతాయనీ ఎవరైనా ప్రబోధనలు చేసినా, ఇవి అన్నీ అసంభవాలే అయినట్లు కారణం లేకుండా కార్యమవటం అసంభవం.

ఒకడు ఒకనితో ఇలా అన్నాడు. **"మమ మాతాపితరౌ న స్తోఽహమేవమేవ జాతః, మమ ముఖే జిహ్వా నాస్తి, వదామి చ"** అంటే "నాకు తల్లిదండ్రులు లేరు. వారు లేకుండానే జన్మించాను. నా నోటిలో నాలుక లేదు. కాని మాట్లాడుతున్నాను. పుట్టలో పాము లేదు. కాని బయటికి వచ్చినది. నేను గాని మీరు గాని ఎక్కడా లేము. కాని మనం వచ్చాం" అనే ఇలాంటి అసంభవ విషయాలన్నీ పిచ్చివారి మాటలనాలి.

కారణానికి కారణముండదు

ప్రశ్న:- కారణం లేకుండా కార్యం కాదేని కారణానికి కారణమేది?

జవాబు:- కేవలం కారణరూపాలైనవి వేరొక వాటికి అవి కార్యాలు కావు. ఒకదానికి కారణమై మరొకదానికి కార్యమవుతుందో అది వేరే పదార్థం. ఎలాగంటే పృథ్వి, గృహం మొదలైనవాటికి కారణం, జలాలకు కార్యమవుతుంది, కాని ఆదికారణమైన ప్రకృతి అనాది. దానికి కారణం ఉండదు.

మూలే మూలాభావాదమూలం మూలమ్ ॥ సాంఖ్య. 1-67 ॥

మూలానికి మూలం అంటే కారణానికి కారణం ఉండదు. ఆదికారణమే సమస్త కార్యాలకు కారణమవుతుంది. ఎందుకంటే! ఒక కార్యం ఆరంభమైన సమయంలో మొదట దానికి మూడు కారణాలు అవశ్యంగా ఉంటాయి. వస్త్రం నేయటానికి పూర్వం సాలెవాడు, నూలు, కండె మొదలైనవి ఉన్నపుడే వస్త్రం నేయబడుతుంది. అలాగే జగదుత్పత్తికి పూర్వం పరమేశ్వరుడు, ప్రకృతి, కాలం, ఆకాశం, జీవులు అనాదులుగా ఉన్నప్పుడే జగత్తు ఉత్పన్నమవుతుంది. ఇందులో ఏ వొక్కటి లేకున్నా జగత్తు ఏర్పడదు.

సృష్టి - ఇతర మతాలు

ఈ సృష్టివిషయంలో నాస్తికులు ఇలా అంటారు.

మొదటి నాస్తికుడు:- శూన్యం తత్వం భావోఽపి వినశ్యతి వస్తుధర్మత్వాద్వినాశస్య ॥
సాంఖ్య. 1-44 ॥

శూన్యం కూడ ఒక పదార్థమే. సృష్టికి పూర్వం శూన్యం ఉండేది. అంతంలో కూడా శూన్యమే ఉంటుంది. ఎందుకంటే భావమనబడే వర్తమాన ఉత్పన్న పదార్థాలన్నీ అభావాలై శూన్యమవుతాయి.

జవాబు:- ఆకాశాన్ని, అదృశాన్ని, అవకాశాన్ని, బిందువును 'శూన్యం' అంటారు. శూన్యం జడపదార్థం. ఈ శూన్యంలో సర్వ పదార్థాలు దృశ్యంగా ఉంటాయి. ఒక బిందువుతో రేఖ, రేఖలతో వృత్తం ఏర్పడునట్లు భూమి, పర్వతాలు ఈశ్వరునిచే రచించబడ్డాయి. అభావం నుండి భావం పుట్టదు. శూన్యాన్ని తెలియువాడు శూన్యం కాదు.

రెండవ నాస్తికుడు:- అభావాద్భావోత్పత్తిర్నానుపమృద్య ప్రాదుర్భావాత్ ॥
న్యాయ 4-1-14 ॥

అభావం నుండి భావం ఉత్పన్నమవుతుంది. గింజ నశించకపోతే అంకురోత్పత్తి జరగదు. గింజను పగులగొట్టి చూస్తే అందు అంకురం అభావమై ఉంటుంది. మొదట అంకురం లేదు. అది కనిపించనందుకే అభావం నుండే తర్వాత అది పుడుతున్నదని భావం.

జవాబు:- గింజను బ్రద్దలు కొట్టుకొని వెడలు నట్టి అంకురం మొదట గింజలోనే ఉంటుంది. అది లేకపోతే అది ఉత్పన్నం కాలేదు. అంటే అంకురం అందులోనే ఉన్నదని భావం.

మూడవ నాస్తికుడు:- ఈశ్వరః కారణం పురుషకర్మాఫల్యదర్శనాత్ ॥ న్యాయ 4-1-19 ॥

పురుషుడు కర్మచేయటం వలన కర్మలకు ఫలితం లభించదు. కారణమేంటంటే, ఎన్నో కర్మలు నిష్ఫలాలై పోవటం చూస్తున్నాం. అందుకే కర్మఫలాన్ని పొందటం ఈశ్వరాధీనమని ఊహించాలి. ఈశ్వరుడు తానివ్వదలచుకున్న కర్మలకే ఫలితమిస్తాడు. తానివ్వదలచని కర్మలకు ఫలితమివ్వడు. కాబట్టి కర్మఫలం ఈశ్వరాధీనం.

జవాబు:- కర్మఫలితం ఈశ్వరాధీనమే అయితే, కర్మలు లేకుండానే ఈశ్వరుడు ఫలితం ఎందుకివ్వడు? కాబట్టి మానవుడెలాంటి కర్మలను చేస్తాడో, అలాంటి ఫలితాన్నే ఈశ్వరుడిస్తాడు.

నాల్గవ నాస్తికుడు:- అనిమిత్తతో భావోత్పత్తిః కంటకతైక్ష్ణ్యాదిదర్శనాత్ ॥

న్యాయ. 4-1-22 ॥

నిమిత్తం లేకుండానే పదార్థోత్పత్తి జరుగుతుంది. తుమ్మచెట్టు మొదలైన చెట్లకు తీక్ష్ణాలైన మొనలు గల ముండ్లుండటం చూడండి. దీనివలన సృష్టి ఆరంభం జరిగినపుడల్లా నిమిత్తం లేకుండానే శరీరాది పదార్థాలు ఏర్పడుతున్నాయని తెలుస్తున్నది.

జవాబు:- దేనితో పదార్థం ఉత్పన్నమవుతుందో, అదే దానికి కారణం. ముండ్లు లేని చెట్లకు ముండ్లేల పుట్టవు? నిమిత్తం లేకనే పుట్టినచో అన్ని చెట్లలోనూ అవి ఏల పుట్టవు?

ఐదవ నాస్తికుడు:- సర్వమనిత్యముత్పత్తివినాశధర్మకత్వాత్ ॥ న్యాయ 4-1-25 ॥

సర్వ పదార్థాలు ఉత్పత్తి, వినాశాలు కలిగి ఉండటం వలన అనిత్యాలు.

శ్లోకార్ధేన ప్రవక్ష్యామి యదుక్తం గ్రంథకోటిభిః ।
బ్రహ్మ సత్యం జగన్మిథ్యా జీవో బ్రహ్మైవ నాపరః॥ ॥ బ్రహ్మనామావళి స్తోత్రం శ్లో॥ 20 ॥

నవీనవేదాంతులు ఈ ఐదవ నాస్తికకోటికి చెందినవారే. "బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య, జీవుడు బ్రహ్మకంటే భిన్నుడు కాడు. ఇదే కోట్లకొలది గ్రంథాల సిద్ధాంతం" అని వీరంటున్నారు.

జవాబు:- బ్రహ్మ సత్యం. జగత్తు పరిణామ నిత్యం. అది అనిత్యం కాదు. జీవుడు కూడా అనాది కావడం వల్ల నిత్యుడే.

ప్రశ్న:- అన్నింటి అనిత్యత నిత్యమయ్యేనేని సర్వం అనిత్యము కాదు. ఎలాగంటే అగ్ని కట్టెలను కాల్చి తాను కూడా నాశనమవుతుంది గదా!

జవాబు:- యథారీతిగా లభ్యమౌతున్న దానిని వర్తమాన కాలంలో అనిత్యమనిగాని, పరమ సూక్ష్మకారణాన్ని అనిత్యమని గాని చెప్పటం ఎన్నటికీ తగదు. నవీన వేదాంతులు బ్రహ్మనుండి జగదుత్పత్తిని అంగీకరిస్తారు. బ్రహ్మం సత్యమైతే అతని కార్యాలు అసత్యాలు ఎన్నడూ కావు. స్వప్నం వలె, రజ్జు సర్పాదుల వలె కల్పితమని అంటే అది కూడా పొసగదు. ఎందుకంటే! కల్పన అనేది గుణం. గుణం నుండి ద్రవ్యం ఉత్పన్నం కాదు. ద్రవ్యం నుండి గుణాలు వేరుగా ఉండలేవు. కల్పన

చేసేవాడు (బ్రహ్మం) నిత్యుడైతే అతని కల్పన కూడా నిత్యమై ఉండాలి. అలా కాకపోతే అతనిని కూడా అనిత్యునిగా అంగీకరించాలి.

చూడని వినని వస్తువెన్నడూ స్వప్నంలో కనిపించదు. జాగ్రదవస్థలో వర్తమాన సమయంలో సత్యపదార్థం ఉన్నది. దానితో సాక్షాత్ సంబంధం కలిగినపుడు ప్రత్యక్షాది జ్ఞానం ఏర్పడి దాని సంస్కారం అంటే వాసనారూప జ్ఞానం ఆత్మలో నిలిచి ఉంటుంది. స్వప్నంలో దానినే ప్రత్యక్షంగా చూస్తున్నాము. సుషుప్తి అంటే గాఢనిద్ర కలిగినపుడు బాహ్య పదార్థ జ్ఞానం లేనప్పటికీ బాహ్య పదార్థాలు ఉంటాయి. అలాగే ప్రళయంలో కారణద్రవ్యం వర్తమానమై ఉంటుంది. సంస్కారాలు లేకుండా స్వప్నం కలిగితే, పుట్టుగ్రుడ్డివాడికి రూప స్వప్నాలు కలగాలి. కాని అలా కలగటంలేదు. అందుచేత స్వప్నంలో వాటి జ్ఞానం మాత్రమే ఉంటుంది. పదార్థాలు అన్నీ వెలుపలనే ఉంటాయి.

ప్రశ్న:- జగత్తులోని పదార్థాలు స్వప్నంలోనూ, సుషుప్తిలోనూ అనిత్యాలు అయినట్లు జాగ్రదవస్థలోని పదార్థాలను కూడ స్వప్నంలోని వారి లాగానే అనుకోవాలి.

జవాబు:- అలా ఎన్నడూ అంగీకరించటానికి వీలులేదు. ఎందుకంటే! స్వప్న సుషుప్త్యావస్థలలో బాహ్య పదార్థాలయొక్క అజ్ఞానం (జ్ఞానలేమి) మాత్రమే ఉంటుంది. వాటి అభావం ఉండదు. ఒకనికి వెనుకవైపున ఉన్న చాలా పదార్థాలు అతనికి కనిపించవు. అంతమాత్రాన అవి అభావాలు కావు. అలాగే స్వప్న సుషుప్తుల విషయం. కాబట్టి బ్రహ్మ, జీవుడు జగత్కారణమైన ప్రకృతి ఇంతకు పూర్వం చెప్పినట్లు అనాదులు, నిత్యాలు, సత్యాలు కూడా.

ఆరవ నాస్తికుడు:- సర్వం నిత్యం పంచభూత నిత్యత్వాత్ ॥ న్యాయ 4-1-25 ॥

పంచభూతాలు నిత్యాలవటం వలన జగత్తంతా నిత్యమే.

జవాబు:- ఈ విషయం కూడా సత్యం కాదు. ఎందుంటే, ఏ పదార్థాల ఉత్పత్తికి వినాశనానికి కారణాలు చూస్తున్నామో అవి అనిత్యాలే. అవి నిత్యాలే అయితే సమస్త స్థూల జగత్తు, శరీరాలు, ఘట, పటాది పదార్థాలు పుట్టటం, నష్టమవటం మన కనులకు కనబడుతూనే ఉన్నది కదా! కాబట్టి కార్యపదార్థాలు - ఉత్పత్తి వినాశం కలవి ఎన్నడూ నిత్యమని భావించలేము.

ఏడవ నాస్తికుడు:- సర్వం పృథగ్ భావలక్షణపృథక్త్వాత్ ॥ న్యాయ 4-1-34 ॥

మనం చూసే భావ పదార్థాలు అన్నీ వేరువేరుగా ఉన్నాయి. అవి అవయవ పుంజాలు. ఏదీ కూడా ఒక్క పదార్థం కాదు. అవి అవయవ సముదాయమే కాని వాటిలో అవయవి అనేది ఏదీ లేదు. మనం చూసే పదార్థాలలో వేరుగా ఒక పదార్థం (అవయవి) కనిపించదు కదా!

జవాబు:- అవయవాలలో అవయవి ఒకటున్నది. వర్తమానకాలం, ఆకాశం, పరమాత్మ జాతి అనేవి వేరువేరు పదార్థాల సమూహాలలో వేరువేరుగా ఒక్కొక్కటే ఉన్నాయి. వాటినుండి వేరుగా ఏ ఒక్క పదార్థం ఉండలేదు. కాబట్టి అన్నీ వేరు వేరు పదార్థాలు కావు. కాని స్వరూపంతో వేరు వేరుగా ఉన్నా వాటిలో వేరు వేరుగా ఒక్కొక్క పదార్థం ఉన్నది.

ఎనిమిదవ నాస్తికుడు:- సర్వమభావః భావేష్వితరేతరాభావసిద్ధేః ॥ న్యాయ 4-1-39 ॥

పదార్థాలన్నింటిలోనూ ఇతరేతరాభావం సిద్ధించటంతో అన్నీ అభావరూపాలే. "అసశ్వో గౌః అగౌరశ్వః" ఆవు గుఱ్ఱం కాదు. గుఱ్ఱం ఆవు కాదు. అందుకే అన్నింటిని అభావరూపాలుగానే అంగీకరించాలి.

జవాబు:- సర్వ పదార్థాలలోనూ ఇతరేతరాభావానికి సంబంధం ఉండవచ్చు. కాని "గవి గౌరశ్వే అశ్వో భావరూపో వర్తత ఏవ" ఆవులో ఆవుభావం, గుఱ్ఱంలో గుఱ్ఱంభావం ఉన్నది. అభావం ఎన్నడూ ఉండలేదు. పదార్థాలకు భావమే ఉండకపోతే ఇతరేతరా భావం కూడా దేనిలో చెప్పబడుతుంది?

తొమ్మిదవ నాస్తికుడు:- స్వభావంవలననే జగదుత్పత్తి జరుగుతుంది. నీరు, అన్నం చేరి కుళ్ళితే క్రిములు ఉత్పన్నమలవుతాయి. బీజాలు భూమిపై బడి జలంతో కలసిన గడ్డి, చెట్లు మొదలైనవి మొలుస్తాయి. ఇలాగే పాషాణాదులును సముద్ర వాయువుల కలయికతో తరంగాలను తరంగాలనుండి సముద్రపు నురుగు; పసుపు, సున్నం, నిమ్మరసం కలసిన సింధూరం (కుంకుమ) ఏర్పడుతుంది. అలాగే లోకం తత్త్వాల స్వభావ గుణాల వలన ఏర్పడుతుంది. దీనిని చేసేవాడెవ్వడూ లేడు.

జవాబు:- స్వభావంతో జగదుత్పత్తి జరిగితే ఎప్పుడూ వినాశం కారాదు. వినాశం కూడా స్వభావం చేతనే అని అనుకుంటే ఉత్పత్తీ కాగూడదు. ఈ రెండు స్వభావాలు ఏక కాలంలో పదార్థాలలో ఉంటాయని భావించిన ఉత్పత్తి, వినాశాల వ్యవస్థ ఎన్నడూ ఏర్పడదు. నిమిత్తంవలన ఉత్పత్తి వినాశాలు జరుగుతాయని అనుకుంటే 'నిమిత్తం' ఉత్పత్తి వినాశాలను పొందే ద్రవ్యాల కంటే వేరుగా ఉంటుందని అంగీకరించాలి. స్వభావం వల్లనే ఉత్పత్తి, వినాశాలు జరుగుతుంటే ఒకే సమయంలో ఉత్పత్తి వినాశాలు జరగటం సంభవం కాదు. స్వభావం చేతనే ఉత్పన్నమైతే ఈ భూగోళానికి సమీపంలోనే ఇతర భూగోళాలు, చంద్ర సూర్యాదులు ఎలా ఉత్పన్నం కావు? దేని సంయోగంలో ఏది జనించాలో అదే జనిస్తున్నది. ఈశ్వరునితో ఉత్పన్నమైన బీజం, ఆహార పదార్థాలు, జలం మొదలైనవాటియొక్క సంయోగంతోనే గడ్డి, వృక్షాలు, క్రిమికీటకాలు ఉత్పన్నమవుతాయి. అవి లేకుండా కావు. పసుపు, సున్నం, నిమ్మరసం ఎక్కడో తామున్న ప్రదేశంనుండి వచ్చి తమంత తాము కలుసుకోవు. మరొకరు కలిపినప్పుడే కలుస్తాయి. వాటిని కూడా యథారీతిగా కలిపినప్పుడే సింధూరమవుతుంది. ఎక్కువ తక్కువలుగా, మరొక విధంగా కలిపిన సింధూరం కాదు. అలాగే ప్రకృతి పరమాణువులను, జ్ఞాన, యుక్తులతో పరమేశ్వరుడు కలపకపోతే జడ పదార్థాలు తాము స్వయంగా ఏ కొద్ది కార్యసిద్ధికైనా విశేష పదార్థాలుగా ఏర్పడలేవు. కాబట్టి స్వభావంతో సృష్టి ఏర్పడదనీ, పరమేశ్వరుని రచన చేతనే ఏర్పడుతుందని తెలుస్తున్నది.

జగత్తు అనాది కాదు

ప్రశ్న:- ఈ జగత్తుకు పూర్వం కర్త లేడు. ఇప్పుడూ లేడు. ఇక ముందూ ఉండలేడు. అనాది కాలం నుండి ఇది ఎలా ఉన్నదో అలాగే ఉన్నది. దీనికి ఎన్నడూ ఉత్పత్తి జరగలేదు. వినాశం కూడా ఎన్నడూ జరగదు.

జవాబు:- కర్త లేకుండా ఏ కార్యం గాని, క్రియాజన్య పదార్థం గాని ఏర్పడదు. పృథివ్యాది పదార్థాలలో సంయోగ విశేషంలో రచన ఏర్పడుతుండటం కనిపించడం వలన అవి అనాదులు కావు. సంయోగంతో ఏర్పడ్డవి సంయోగానికి పూర్వం ఉండవు. వియోగానంతరంలోనూ ఉండవు. కఠినాతి కఠినమైన పాషాణము, వజ్రము, ఉక్కు మొదలైనవాటిని పగులగొట్టి ముక్కలు ముక్కలుగా చేసో, కరిగించో, భస్మం చేసో చూడండి, వీటిలో పరమాణువులు వేరు వేరుగా ఉన్నాయా? కలిసి ఉన్నాయా? కలిసుంటే అవి కొంతకాలానికి తప్పక వేరువేరుగా కూడా అవుతాయి.

జీవుడు ఎన్నడూ ఈశ్వరుడు కాడు

ప్రశ్న:- అనాది ఈశ్వరుడెవ్వడూ లేడు. యోగాభ్యాసం వలన, అణిమాది ఐశ్వర్యాలను పొంది సర్వజ్ఞత్వాది గుణయుక్తుడై కేవలం జ్ఞానియైన జీవుడే పరమేశ్వరుడు అవుతాడు.

జవాబు:- అనాది ఈశ్వరుడు అయిన జగత్స్రష్ట లేనినాడు సాధనలతో సిద్ధించేట్టి జీవుల ఆధారం జీవనరూప జగత్తు, శరీరం, ఇంద్రియగోళకాలూ ఎలా ఏర్పడతాయి? ఇవి లేకపోతే జీవుడు కార్యసాధన చేయలేడు. సాధనమే లేకుంటే సిద్ధి ఎలా కలుగుతుంది?

జీవుడెలాంటి ప్రయత్నం చేసైనా సిద్ధిని పొందుతాడు, స్వయం సనాతనం, అనాదీ అనంత సిద్ధీ గల ఈశ్వరునితో సమానుడుగా ఏ జీవుడు కాలేడు. పరమావధివరకు జీవుడు జ్ఞానాన్ని వృద్ధిపరచుకొంటే పరిమిత జ్ఞానం, పరిమిత సామర్థ్యం కలవాడుగానే ఉంటాడు. అతడు అనంత జ్ఞానం, అనంత సామర్థ్యం కలవాడుగా ఎన్నడూ కాలేడు. నేటివరకు ఎవ్వరూ ఈశ్వరకృత సృష్టి క్రమాన్ని మార్చలేదు. ఇకముందు మార్చలేరు. అనాది సిద్ధుడైన పరమేశ్వరుడు జీవుడు నేత్రాలతో చూడటం, చెవులతో వినటాన్ని ఏర్పరచినాడు. దీనిని ఏ యోగి కూడా మార్చలేడు. జీవుడు ఎన్నటికీ ఈశ్వరుడు కాలేడు.

ప్రశ్న:- కల్ప కల్పాంతరాలలో ఈశ్వరుడు సృష్టిని విలక్షణాతి విలక్షణంగా సృజిస్తాడా? లేక ఒకే విధంగా రచిస్తాడా?

జవాబు:- ఇప్పుడు ఎలా ఉన్నదో అలాగే పూర్వంలో ఉన్నది. ఇకముందు కూడా అలానే ఉంటుంది. దానిలో భేదమేమీ కల్పించడు.

సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వమకల్పయత్ ।
దివం చ పృథివీం చాంతరిక్షమథో స్వః॥ ॥ ఋగ్వే. 10-190-3 ॥

ధాతా = పరమేశ్వరుడు పూర్వకల్పంలో సూర్య, చంద్ర, విద్యుత్, పృథ్వీ, అంతరిక్షాది పదార్థాలను నిర్మించినట్లుగా ఇప్పుడూ నిర్మించాడు. ముందుకూడా అలాగే చేస్తాడు. కాబట్టి పరమేశ్వరుని కార్యాలు పొరపాట్లు లేకుండా ఎల్లప్పుడూ ఒకే విధంగా ఉంటాయి. అల్పజ్ఞుడై, జ్ఞానమందు వృద్ధి క్షీణతలు గలవాని కార్యాలలో పొరపాట్లుంటాయి. ఈశ్వరుని కార్యాలలో అలా ఉండవు.

ప్రశ్న:- సృష్టి విషయంలో వేదాదిశాస్త్రాలలో విరోధం ఉన్నదా?

జవాబు:- విరోధంలేదు. అవిరోధమే ఉన్నది.

ప్రశ్న:- అవిరోధమే అయితే ఇదేమి?

తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః। ఆకాశాద్వాయుః। వాయోరగ్నిః। అగ్నేరాపః। అద్భ్యః పృథివీ। పృథివ్యా ఓషధయః। ఓషధిభ్యోఽన్నమ్। అన్నాద్రేతః। రేతసః పురుషః। స వా ఏష పురుషోఽన్నరసమయః॥ ॥ తైత్తి. బ్ర.వల్లీ. 1 ॥

ఆ పరమేశ్వరుడు ప్రకృతినుండి ఆకాశం - అవకాశం ఏర్పడింది. ఆకాశంలో సర్వత్ర కారణ రూప ద్రవ్యం వ్యాపించి ఉంటుంది. ఆ వ్యాపించిన కారణరూప ద్రవ్యాన్ని ఒకచోటికి చేర్చితే ఆకాశం - అవకాశం ఉత్పన్నమవుతుంది. వాస్తవంలో ఆకాశం ఉత్పన్నం కాదు. ఎందుకంటే ఆకాశం లేకపోతే ప్రకృతి - పరమాణువులు ఎక్కడ ఉంటాయి? ఆకాశం తరువాత వాయువు, వాయువు తరువాత అగ్ని, అగ్ని తరువాత జలం, జలం తరువాత పృథ్వి, పృథ్వి నుండి ఔషధాలు, ఔషధాల నుండి ఆహార పదార్థాలు, ఆహార పదార్థాలనుండి వీర్యం, వీర్యంనుండి పురుషుడు అంటే శరీరం ఉత్పన్నమౌతుంది. ఇక్కడ ఆకాశాది క్రమంలో; ఛాందోగ్యంలో, అగ్న్యాదిక్రమంలో ఐతరేయంలో; జలాదిక్రమంలో సృష్టి జరిగినట్లు ఉన్నది. వేదంలో ఒకచోట 'పురుషునినుండి' అనీ, మరొకచోట 'హిరణ్యగర్భాదులనుండి' అనీ, మీమాంసా శాస్త్రంలో 'కర్మనుండి' అనీ, వైశేషికంలో 'కాలంనుండి' అనీ, న్యాయశాస్త్రంలో 'పరమాణువుల నుండి' అనీ, యోగశాస్త్రంలో 'పురుషార్థం నుండి' అనీ, సాంఖ్యంలో 'ప్రకృతి నుండి' అనీ, వేదాంతంతో 'బ్రహ్మనుండి' సృష్టి జరిగినదనీ అంగీకరించబడింది. కాబట్టి ఇప్పుడు దేనిని సత్యమని, దేనిని అసత్యమని అనుకోవాలి?

జవాబు:- ఇందులో అన్నీ కూడా నిజాలే. ఏది కూడా అబద్ధం కాదు. దీనికి విపరీతంగా అనుకోవడమే అబద్ధం-అసత్యం. పరమేశ్వరుడు నిమిత్త కారణుడు. ప్రకృతి జగత్తునకు ఉపాదాన కారణం. మహాప్రళయం జరిగిన తర్వాత సృష్టి ఆకాశాది క్రమంలో జరుగుతుంది. ఆకాశానికి, వాయువుకు ప్రళయం కలుగక, అగ్న్యాదులకే ప్రళయం జరిగిన అగ్న్యాదిక్రమంలో, విద్యుదగ్ని కూడా నశించనప్పుడు జలక్రమంతో సృష్టి ఏర్పడుతుంది. అంటే ఆ యా ప్రళయాలలో ఏది నశిస్తుందో దానినుండే సృష్ట్యారంభమవుతుంది. పురుషుడు, హిరణ్యగర్భుడు మొదలైన పేర్లను గురించి ప్రథమ సముల్లాసముననే వ్రాయబడినది. ఆ నామములన్నియు పరమేశ్వరునివే. ఒకే కార్యమున, ఒకే విషయాన్ని గురించిన వ్యతిరేక వాదాలను విరోధం అంటారు. ఆరుశాస్త్రాలలోనూ, అవిరోధమే ఉన్నది. చూడండి. "కర్మ-చేష్ట లేకుండా జగంలో నేకార్యం జరగ"దని మీమాంసలోనూ "కాలం లేకుండా ఏదీ నియమించబడ"దని వైశేషికంలోనూ; "ఉపాదానకారణం లేకపోతే ఏదీ సృజించబడ"దని న్యాయంలోనూ; "విద్య, జ్ఞానం, ఆలోచన లేకుండా ఏదీ చేయబడలే"దని యోగంలోనూ, "తత్త్వాల సంయోగం జరగకపోతే సృష్టి ఏర్పడ"దని సాంఖ్యంలోనూ; "కర్త చేయకపోతే నే పదార్థం జనించ"దని

వేదాంతంలోనూ కలదు. ఇలా సృష్టి ఆరు కారణాలతో ఏర్పడుతున్నది. ఆ ఆరు కారణాలలో నుండి ప్రతి ఒక్క దాన్ని గురించి ఒక్కొక్క శాస్త్రం వివరించినది. అందు వాటిలో ఏ మాత్రం విరోధం లేదు. ఆరుగురు కలిసి ఒక ఇంటి కప్పును లేపి గోడలపై పెట్టినట్లుగా, సృష్టిరూప కార్యాన్ని గురించిన వ్యాఖ్య ఆరుగురు శాస్త్రకారులు కలిసి పూర్తిచేస్తారు.

ఐదుగురు గ్రుడ్డివాళ్లకు ఒక మందదృష్టి గల వారికి ఒకడు ఏనుగుయొక్క ఒక్కొక్క అవయవాలను చూపి ఏనుగు ఎలా ఉన్నదని అడిగాడు. వారిలో ఒకడు 'స్తంభంలాగా' ఉన్నదన్నాడు. రెండవవాడు 'చేటలాగా' ఉన్న దన్నాడు. మూడవ వాడు 'రోకలి లాగా' ఉన్నదన్నాడు. నాల్గవ వాడు 'చీపురు లాగా' ఉన్నదన్నాడు. ఐదవవాడు 'అరుగులాగా' ఉన్నదన్నాడు. ఆరవవాడు 'నల్లని నాల్గుస్తంభాలపై దున్నపోతువంటి ఆకారం కలిగి ఉన్న'దన్నాడు. ఇలాగే నవీన అనార్ష గ్రంథాలను చదివిన వారు ఋషి ప్రణీత గ్రంథాలను చదవక, క్షుద్రబుద్ధితో కల్పించిన నవీన సంస్కృత గ్రంథాలను, ఇతర భాషా గ్రంథాలను మాత్రమే చదివి, పరస్పరం నిందించుకోవటంలో తత్పరులై, అసత్య కలహాలు ఏర్పరిచారు. వీరి మాటలు బుద్ధిమంతులకుగాని, ఇతరులకు గాని అంగీకార యోగ్యాలుగా లేవు. గ్రుడ్డివాని వెనుక గ్రుడ్డివాడు పోయిన దుఃఖమే కలుగుతుంది. అలాగే అల్పవిద్య గలవారు, స్వార్థులు, ఇంద్రియలోలురు అయిన పురుషులు రచించిన చమత్కారాలు లోకాన్ని నాశనం చేస్తాయి.

ప్రశ్న:- కారణం లేకుండా కార్యం జరిగితే కారణానికి కారణ మేల ఉండదు?

జవాబు:- ఓ అమాయక సోదరులారా! కొంచెం మీ బుద్ధిని ఎందుకు ఉపయోగించరు? చూడండి. లోకంలో రెండువిధాలైన పదార్థాలే ఉన్నాయి. ఒకటి కార్యం. రెండవది కారణం. కారణం అనేది కార్యం కాలేదు. ఏ సమయంలో ఏది కార్యంగా ఉంటుందో అపుడు అది కారణం కాదు. మానవుడు సృష్టిని యథారీతిగా గుర్తించనంతకాలం అతనికి యథార్థ జ్ఞానం లభించదు.

నిత్యాయాః సత్త్వరజస్తమసాం సామ్యావస్థాయాః ప్రకృతేరుత్పన్నానాం పరమసూక్ష్మాణాం పృథక్పృథగ్వర్తమానానాం తత్త్వ పరమాణూనాం ప్రథమః సంయోగారంభః సంయోగవిశేషాదవస్థాంతరస్య స్థూలాకారప్రాప్తిః సృష్టిరుచ్యతే ॥

అనాది నిత్యస్వరూపమైన సత్వరజస్తమోగుణాల ఏకావస్థయైన ప్రకృతినుండి ఉత్పన్నమైనట్టి పరమ సూక్ష్మాలైన వేరు వేరు తత్త్వావయవాలు కలవు. వాటిలో ప్రథమంలో సంయోగం ఆరంభమవుతుంది. అలాంటి సంయోగ విశేషాలతో అవస్థాంతరాలు - అన్యాన్యాలైన అవస్థలను క్రమంగా అనగా ఇతరావస్థలను చెందుతూ, చెందిస్తూ సూక్ష్మస్థితినుండి స్థూలరూపాలను చెందుతూ, చెందిస్తూ విచిత్రరూపంలో ఈ సృష్టి ఏర్పడింది.

ఈ సూక్ష్మావయవాల ప్రథమ సంయోగంలో కలియునట్టి, కలుపునట్టి పదార్థం - సంయోగంలో ఆదీ, వియోగంలో అంతమైనది; విభాగం చేయటానికి వీలుకానిది కారణం అనబడుతుంది. సంయోగానంతరం ఏర్పడి, వియోగానంతరం అలాగే ఉండనిది కార్యం అనబడుతుంది. కారణానికి

కారణం, కార్యానికి కార్యం, కర్తకు కర్త, సాధనానికి సాధనం, సాధ్యానికి సాధ్యముంటుందని చెప్పేవాడు చూస్తున్న, గ్రుడ్డివాడు, వింటున్న చెవిటివాడు, తెలిసీ మూఢుడునై ఉన్నాడు. కన్నుకు కన్ను, దీపానికు దీపం, సూర్యునికి సూర్యుడు ఎప్పుడైనా ఉండగలదా! దేనినుండి ఒక వస్తువు ఉత్పన్నమవుతుందో అది దానికి కారణం. ఉత్పన్నమైనది కార్యం. ఇక కారణాన్ని కార్యరూపంగా చేసేవాడు కర్త అనబడుతాడు.

నాసతో విద్యతే భావో నాభావో విద్యతే సతః ।
ఉభయోరపి దృష్టో<u>న్తస్త్వనయో</u>స్తత్త్వదర్శిభిః॥ ॥ భగవద్గీత, 2-16 ॥

ఎప్పుడూ అసత్తుకు భావం వర్తమానస్థితి, సత్తుకు అభావం అనగా వర్తమానంగా ఉండక పోడటం జరగదు. ఈ రెండింటి స్వరూపాన్ని తత్త్వదర్శులు తెలుసుకొంటారు. దీనిని పక్షపాత బుద్ధిగలవారు, మొండి పట్టుదల గలవారు, అపవిత్రాత్ములు, అవిద్వాంసులు సహజంగా ఎలా తెలుసుకోగలరు? మానవులు విద్వాంసులై, సత్సంగం గలవారై, బాగా ఆలోచించకుంటే వారు సదా భ్రమజాలాలలో పడిపోతారు. సమస్త విద్యల సిద్ధాంతాలను తెలుసుకొన్నవారు, తెలుసుకోవటానికి ప్రయత్నించేవారు, తెలుసుకొని ఇతరులకు నిష్కపటంగా తెలియజేసేవారు ధన్యులు. ఏ కారణం లేకుండా సృష్టి జరిగిందని భావించేవారు ఏమీ తెలియనివారని గ్రహించాలి.

సృష్టి రచన

సృష్టి జరగవలసిన సమయంలో పరమాత్ముడు ఆ పరమ సూక్ష్మపదార్థాలను ఒకచోటికి చేరుస్తాడు. సృష్టియొక్క ప్రథమ అవస్థలో ప్రకృతి పరమసూక్ష్మ ప్రకృతి రూప కారణం నుండి కొంచెం స్థూలరూపం ఏర్పడుతుంది. దానినే 'మహత్తత్త్వం' అంటారు. దానికంటే కొంచెం స్థూలమైనదానిని 'అహంకారం' అంటారు. అహంకారం నుండి భిన్న భిన్నమైన 'ఐదు సూక్ష్మభూతాలు' 'శ్రోత్రం, త్వక్కు నేత్రం, జిహ్వా, నాసిక' అనే 'పంచ జ్ఞానేంద్రియాలు' 'వాక్కు (నోరు), హస్తాలు, పాదాలు, ఉపస్థ, గుదం' అనే పంచ 'కర్మేంద్రియాలు' 'పదకొండవదైన మనస్సు' కొంచం స్థూలంగా ఉత్పన్నం అవుతుంది. పంచ సూక్ష్మభూతాలనే 'తన్మాత్రలు' అంటారు. అవి రూపరసగంధస్పర్శ శబ్దాలు. ఈ పంచతన్మాత్రల నుండి అనేక స్థూలావస్థలు కలుగుతాయి. క్రమంగా అవే పంచభూతాలుగా మారుతాయి. వీనినే మనం ప్రత్యక్షంగా చూస్తాం. వీనినుండి అనేక విధాలైన ఔషధాలు, వృక్షాలు, వాటినుండి ఆహారపదార్థాలు, ఆహారపదార్థాల నుండి వీర్యం, వీర్యం నుండి శరీరాలు ఏర్పడతాయి. కాని ఆదిసృష్టి మైథునసృష్టి కాదు. స్త్రీ పురుషుల శరీరాలను పరమాత్ముడు సృజించి వాటిలో జీవుల సంయోగం చేసిన తర్వాతనే మైథునసృష్టి జరుగుతుంది.

శరీరంలో ఏ విధమైన జ్ఞానపూర్వక సృష్టి రచించబడిఉో ఒకసారి చూడండి. దీనిని విద్వాంసులు చూసి ఆశ్చర్యాన్ని చెందుతారు. లోపల ఎముకలను జోడించే నాడుల బంధనం, మాంస కండరాల పట్టీలు, చర్మపు కప్పు, ప్లీహం, యకృత్తు, శ్వాసకోశాలు, శ్వాసక్రియ, రక్తశోధన ప్రచాలనం,

హృదయస్థాపన, జీవసంయోజన, శిరోరూప మూలరచన, రోమాలు, నఖాలు, నేత్రంలో అతిసూక్ష్మాలైన సిరలను (రక్తనాళాలను) తంత్రుల వలె కూర్చటం, ఇంద్రియ మార్గాల ప్రకటన జీవుని జాగ్రత్, స్వప్న, సుషుప్త్యావస్థలు, భోగించటానికి స్థాన విశేషాల నిర్మాణం, సమస్త ధాతువుల వర్గీకరణ, కళాకౌశల స్థాపనాది అద్భుత సృష్టిని పరమేశ్వరుడు కాక మరెవరు నిర్మించగలరు?

ఇవే కాక అనేక విధాలైన రత్నాలు, ధాతువులతో అలంకృతమైన భూమి, వివిధ రకాలైన వటవృక్షాల బీజాలలో అతిసూక్ష్మమైన రచన, అసంఖ్యాకాలైన హరిత, శ్వేత, పీత, కృష్ణ, చిత్ర మధ్య రూపాలతో కూడిన పత్ర, పుష్ప, ఫల, మూల నిర్మాణం, మధుర, క్షార, కటు, కషాయ, తిక్త (చేదు), అమ్లాల వంటి వివిధాలైన రసాలు, సుగంధాది భరితమైన పత్ర, పుష్ప, ఫల, ఆహార పదార్థాలు, కందమూలాల నిర్మాణం, అనేకానేక కోట్లకొలది భూగోళ, సూర్య, చంద్రాది లోకాల నిర్మాణం, వాటిని ధారణ, చలన, నియమాలలో ఉంచటం మొదలైనవి పరమేశ్వరుడు తప్ప మరెవ్వరూ చేయలేరు.

ఒకడు ఒక పదార్థాన్ని చూసిన ద్వివిధ జ్ఞానం ఉత్పన్నమవుతుంది. 1. ఆ పదార్థ సంబంధ జ్ఞానం, 2. దాని రచనా నిర్మాణం కావించిన సృష్టికర్త జ్ఞానం. ఒక అందమైన ఆభూషణాలను అడవిలో చూసిన అది బంగారపు దనీ, దానిని ఒక నేర్పరియైన శిల్పి నిర్మించినాడనీ తెలుస్తున్నది. ఇలాగే అనేక విధాలైన సృష్టిలోని వివిధ పదార్థాలను సృజించేవాడు పరమేశ్వరుడని సిద్ధింప చేయవచ్చు.

ప్రశ్న:- మొదట మానవ సృష్టి జరిగిందా? పృథివ్యాదుల సృష్టియా?

జవాబు:- పృథివ్యాదుల సృష్టే మొదట జరిగింది. ఎందుకంటే పృథివ్యాదులు లేకుండా మానవుని స్థితి, పాలన, పోషణలు జరగలేవు.

ప్రశ్న:- సృష్ట్యాదిలో ఒకే మానవుడు సృజించబడినాడా? లేక అనేకులా?

జవాబు:- అనేకులు. ఈశ్వరీయ సృష్టిలో ఉత్పన్నమవటానికి యోగ్యమైన కర్మలు గల జీవులనే ఈశ్వరుడు సృష్టి ఆరంభంలో పుట్టిస్తాడు. ఎందుకంటే -

"మనుష్యా ఋషయశ్చ యే తతో మనుష్యా అజాయంత" అని యజుర్వేద వచనం కలదు.

ఈ ప్రమాణం ప్రకారంగా మొదట అనేకులు - వందల కొలదిగా, వేల కొలదిగా మానవులు జన్మించారనటం నిశ్చయం. ఈ సృష్టిలోని జనులను చూస్తే ఈ మానవులందరూ అనేక మాతాపితల సంతానమే అని నిశ్చయమవుతుంది.

ప్రశ్న:- సృష్టి ఆదిలో మనుష్యాదులు బాల్యావస్థలో సృష్టింపబడ్డారా? యువావస్థలోనా? వృద్ధావస్థలోనా? లేక మూడవస్థలలోనా?

జవాబు:- యువావస్థలో సృష్టించబడ్డారు. బాలకునిగా పుట్టిస్తే అతని పోషణకై మరొక మానవుడు అవసరమవుతాడు. వృద్ధావస్థలో సృజించబడినచో మైథున సృష్టి జరగదు. కాబట్టి యువావస్థలోనే అనగా యువతీ యువకులుగానే సృష్టించాడు.

ప్రశ్న:- సృష్టికి ఆరంభం ఎప్పుడైనా ఉన్నదా? లేదా?

జవాబు:- లేదు. పగలు తర్వాత రాత్రి, రాత్రి తర్వాత పగలు పగలుకు పూర్వం రాత్రి, రాత్రికి పూర్వం పగలు క్రమంగా ఒకే తీరుగా వస్తున్నాయి. ఇదేవిధంగా సృష్టికి పూర్వం ప్రళయం, ప్రళయానికి పూర్వం సృష్టి, సృష్టితర్వాత ప్రళయం, ప్రళయం తర్వాత సృష్టి. ఇలా సృష్టి చక్రం అనాది కాలంనుండి తిరుగుతున్నది. దీనికి ఆది కాని, అంతం కాని లేదు. పగలు, రాత్రుల యొక్క ఆరంభాలు, అంతాలు కనబడుతున్నవి. అలాగే సృష్టి, ప్రళయాలకు ఆది, అంతాలు కలవు. పరమాత్మ, జీవుడు, జగత్కారణమైన ప్రకృతి ఈ మూడూ స్వరూపంతో అనాది అయినట్లే, జగదుత్పత్తి, స్థితి, ప్రళయాలు ప్రవాహరూపంతో అనాదులు. నదియొక్క ప్రవాహం ఒకప్పుడు ఎండిపోతుంది. మరల వర్షాకాలంలో కనిపిస్తుంది. ఎండకాలంలో కనిపించదు. ఇలా ఒకసారి కనిపిస్తూ మరొకసారి కనిపించకుండా ఉండే వ్యవహారాలను ప్రవాహరూపంగా ఎంచాలి. పరమేశ్వరుని గుణ, కర్మ స్వభావాలు అనాదీయాలైనట్లుగా అతనితో చేయబడే జగదుత్పత్తి, స్థితి, ప్రళయాలు కూడా అనాదీయులే. ఈశ్వరుని గుణ, కర్మ, స్వభావాలకు ఎప్పుడూ ఆరంభంగాని, అంతంగాని లేన్నట్లే ఆతని కర్తవ్య కర్మలునూ లేదు.

ప్రశ్న:- ఈశ్వరుడు కొన్ని జీవులను మానవులుగా, కొన్నింటిని సింహాదిక్రూరజంతువులుగా, కొన్నింటిని హరిణాలుగా కొన్నింటిని ఆవు మొదలైన పశువులుగా, కొన్నింటిని వృక్షాలుగా, క్రిమి కీటకాలుగా జన్మింపజేసినాడు. దీనితో పరమాత్మునిలో పక్షపాతం కనిపిస్తున్నది.

జవాబు:- జీవులు పూర్వసృష్టిలో చేసిన కర్మలను అనుసరించి ఈ వ్యవస్థను ఈశ్వరుడు చేయటం వలన అతనిలో పక్షపాతం లేదు. కర్మలు లేకుండా జన్మను ఇస్తే పక్షపాతం అవుతుంది.

మనుష్యుల ఆది సృష్టి - స్థాన నిర్ణయం

ప్రశ్న:- మానవుల ఆదిసృష్టి ఏ స్థలంలో జరిగింది?

జవాబు:- త్రివిష్టపంలో జరిగింది. దీనినే 'తిబ్బతు', టిబ్బెట్టు అని అంటారు.

ప్రశ్న:- సృష్ట్యాదిలో ఒకే జాతి ఉందా? లేక అనేక జాతులా?

జవాబు:- ఒకే మానవజాతి ఉన్నది. తరువాత **"విజానీహ్యార్యాన్యే చ దస్యవః"** అనే ఋగ్వేద వచనం (1-51-8) ప్రకారంగా శ్రేష్ఠులకు ఆర్యులు, విద్వాంసులు, దేవతలనీ దుష్టులకు దస్యులు - దోపిడిదొంగలు, మూర్ఖులనీ పేర్లు కలిగినందుకు 'ఆర్యులు, దస్యులు' అను భేదం ఏర్పడ్డది. **"ఉత శూద్ర ఉతార్యే"** (అథర్వవేదం 19-62-1) ఆర్యులలో పూర్వోక్త ప్రకారంగా బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అని నాలుగు భేదాలయ్యాయి. ద్విజులైన విద్వాంసులను ఆర్యులనీ, అవిద్వాంసులైన శూద్రులను అనార్యులనీ చెప్పేవారు.

ప్రశ్న:- వారు ఇక్కడికి ఎలా వచ్చారు?

జవాబు:- ఆర్యులకు, దస్యులకు - అంటే విద్వాంసులు అనే దేవతలకు, అవిద్వాంసులు అనే అసురులకు పరస్పరం సదా జగడాలు - వివాదాలు జరిగేవి. ఉపద్రవాలు అధిక మైనపుడు భూగోళంలో ఉత్తమ భూఖండంగా దీనిని తలచి ఇక్కడికి వచ్చి నివసించారు. అందుకే దీనిపేరు ఆర్యావర్తమైంది.

ప్రశ్న:- ఆర్యావర్తపు అవధి ఎంతవరకు?

జవాబు:- **ఆసముద్రాత్తు వై పూర్వాదాసముద్రాత్తు పశ్చిమాత్ ।**
తయోరేవాంతరం గిర్యోరార్యావర్తం విదుర్బుధాః॥ ॥ మను. 2-22 ॥

సరస్వతీదృషద్వత్యోర్దేవనద్యోర్యదంతరమ్ ।
తం దేవనిర్మితం దేశమార్యావర్తం ప్రచక్షతే ॥ ॥ మను. 2-17 ॥

ఉత్తరంలో హిమాలయం, దక్షిణంలో వింధ్యాచలం, తూర్పుపడమరలలో సముద్రం, పశ్చిమంలో సరస్వతి అటక్‌నది, ఇది ఉత్తర పర్వతంలో పుట్టి దక్షిణ సముద్రంలో కలుస్తున్నది. తూర్పున బ్రహ్మపుత్ర అని పిలువబడు దృషద్వతీనది. ఇది నేపాలుయొక్క తూర్పున పర్వతంనుండి వెడలి బంగాళ, అస్సాంలకు తూర్పున మరియు బ్రహ్మదేశంలో (బర్మా)కు పశ్చిమ దిక్కున ప్రవహించి దక్షిణసముద్రంలో కలుస్తుంది. హిమాలయం యొక్క మధ్యరేఖ నుండి దక్షిణంలో పర్వతాల మధ్య వరకు, వింధ్యా రామేశ్వరాల మధ్యప్రదేశమంతా ఆర్యావర్తం అని అంటారు. ఇక్కడ దేవతలు - అంటే విద్వాంసులు అనే ఆర్యులు నివసించుటచే దీనికి ఆర్యావర్తం అనే పేరు కలిగింది.

ఆర్యమ్లేచ్ఛాదుల వ్యాఖ్య

ప్రశ్న:- అంతకు ముందు ఈ దేశానికి ఏ పేరుంది? అపుడు దీనిలో నివసించే వారెవరు?

జవాబు:- అంతకుపూర్వం ఈ దేశానికి ఏ పేరునూ లేదు. ఆర్యులకు పూర్వం ఈ దేశంలో నివసించే వారెవ్వరూ లేరు. ఆర్యులే సృష్టియొక్క ఆరంభంలో కొంత కాలానికి తర్వాత టిబెట్టునుండి చక్కగా ఈ దేశానికి వచ్చారు.

ప్రశ్న:- వీరు 'ఇరాన్' దేశంనుండి వచ్చారని కొందరంటున్నారు. అందుచేతనే వీరిపేరు ఆర్యులనీ, వీరికి పూర్వం ఇక్కడ ఆటవికులైన అసురులు, రాక్షసులు నివసించేవారనీ చెబుతారు. ఆర్యులు తమను దేవతలని చెప్పుకొంటారు. ఆర్యులకూ, దస్యులకు జరిగిన యుద్ధాన్నే దేవాసుర సంగ్రామమని కథలలో పేర్కొన్నారు.

జవాబు:- ఈ మాట పూర్తిగా అసత్యం. ఎందుకంటే

విజానీహ్యార్యాన్యేచ దస్యనో బర్హిష్మతే రంధయా శాసదవ్రతాన్॥ ॥ ఋ. 1-51-8 ॥
ఉత శూద్ర ఉతార్యే ॥ ॥ అథర్వ 19-62-1 ॥

అనే వేదప్రమాణాలు ఉన్నాయి. ధార్మికులు, విద్వాంసులు అయిన ఆప్త పురుషులను ఆర్యులనీ,

వీరికి వ్యతిరేకులైనవారిని దస్యులనీ అంటే దోపిడిగాండ్రు, దుష్టులు, అధర్మాత్ములు, అవిద్వాంసులు అనీ వ్రాయబడింది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య లనబడే ద్విజుల పేరు ఆర్యులు, మూర్ఖులైన శూద్రులను అనార్యులంటారని ఇలా వేదం చెబుతుండగా విదేశీయుల కపోల కల్పనలను బుద్ధిమంతులెప్పుడూ అంగీకరించరు. ఆర్యావర్తీయులైన అర్జునుడు, మహారాజులైన దశరథాదులు, హిమాలయ ప్రదేశంలో ఆర్యులకు మ్లేచ్ఛులు–అసురులు అనబడే దస్యులకు మధ్య జరిగిన దేవాసుర సంగ్రామాలలో ఆర్యులైన దేవతలను రక్షించటానికి, అసురులకు పరాజయాన్ని కలిగించటానికి తోడ్పడ్డారు. దానివలన ఆర్యావర్తానికి వెలుపల–బయట ఎనిమిది దిక్కులలో హిమాలయాలకు తూర్పున, ఆగ్నేయ, దక్షిణ, నైఋతి, పడమర, వాయవ్య, ఉత్తర, ఈశాన్య ప్రదేశాలలో మానవులు నివసిస్తున్నారని దీని వలన ఋజువవుతున్నది. వారి పేరే అసురులనీ తెలుస్తున్నది. హిమాలయ ప్రదేశంలో ఉన్న ఆర్యుల మీదికి ఎవరైన యుద్ధానికి దండెత్తి వస్తే ఇక్కడ రాజులు, మహారాజులు, ఉత్తరాది దేశాలలో ఉన్న ఆర్యులకు తోడ్పడుతున్నారు. శ్రీరామచంద్రుని కాలంలో దక్షిణంలో యుద్ధం జరిగింది. దానిని దేవాసుర సంగ్రామమన్నారు. దానిని రామ రావణ యుద్ధమనో, ఆర్య రాక్షసుల సంగ్రామమనో చెబుతారు. ఆర్యులు ఇరాన్ దేశంనుండి వచ్చారనీ, ఇక్కడ ఆటవికులతో పోట్లాడి జయం పొంది, వారిని తరిమేసి ఈ దేశానికి రాజులైయ్యారనీ, ఏ సంస్కృత గ్రంథంలోనూ, చరిత్రలోనూ లేదు. చరిత్ర ఇలా ఉండగా విదేశీయుల వ్రాతలెలా మాననీయాలవుతాయి? మరియు

మ్లేచ్ఛవాచశ్చార్యవాచః సర్వే తే దస్యవః స్మృతాః ॥ ॥మను. 10-45 ॥

మ్లేచ్ఛ దేశస్త్వతః పరః ॥ ॥మను. 2-23 ॥

అనీ కలదు. ఆర్యావర్తదేశం కంటే అన్యదేశాలను దస్యుదేశాలనీ, మ్లేచ్ఛ దేశాలనీ చెప్పబడింది. అందుకే ఆర్యావర్తానికి భిన్నమగు తూర్పు నుండి ఈశాన్య, ఉత్తర, వాయవ్య, పశ్చిమంలో గల దేశాలలోనివారు దస్యులు, మ్లేచ్ఛులు, అసురులనీ, నైఋతి, దక్షిణ ఆగ్నేయ దిశలలో, ఆర్యావర్తానికి అవల ఉండే అన్యదేశవాసులు రాక్షసులనీ ఋజువవుతున్నది. ఇప్పటికినీ చూడండి. హబ్షీలు, నీగ్రోలు మొదలైనవారి స్వరూపం భయంకరంగా, రాక్షసుల వలెనే కనబడతారు. ఆర్యావర్తానికి సరిగ్గా పాదం క్రిందవైపున నుండిన దేశానికి పాతాళమని పేరు. ఆ దేశస్థులనే 'నాగులు' అంటారు. ఆ దేశం ఆర్యావర్తీయుల పాదాలకు క్రిందివైపున ఉన్నది. దానిని నాగవంశపు రాజులు పాలిస్తుండేవారు. ఇదే నేటి అమెరికా. ఆ జాతికి చెందిన ఉలూపి అను కన్యనే అర్జునుడు వివాహమాడాడు. ఇక్ష్వాకులు మొదలుకొని కౌరవ పాండవుల వరకు, భూగోళమందంతట, ఆర్యుల రాజ్యాలే ఉన్నాయి. వేదప్రచారం కూడా కొద్దికొద్దిగా ఆర్యావర్తదేశం నుండి ఇతర దేశాలలో కూడా జరిగినట్లు తెలియుచున్నది. దీనికి ప్రమాణాలు ఉన్నవి. బ్రహ్మకు పుత్రుడు విరాటుడు. విరాటునికి మనువు, మనువుకి మరీచ్యాది పదిమంది పుత్రులున్నారు. వారికి స్వాయంభువాది ఏడుగురు రాజులు పుట్టి రాజ్యమేలారు. వారి సంతానమైన ఇక్ష్వాకాది రాజులే ప్రథమంలో ఆర్యావర్తాన్ని ఏలిన రాజులు.

స్వరాజ్యమహత్త్వం

ఇప్పుడు దురదృష్టంవల్ల, ఆర్యులయొక్క సోమరితనం వల్ల, పొరపొట్ల వల్ల, పరస్పర విరోధాల వల్ల, ఇతర దేశాలపై రాజ్యం చేసే మాట అటుంచి, ఆర్యావర్తంలో కూడా ఆర్యుల అఖండ, స్వతంత్ర, స్వాధీన, రాజ్యం లేకుండా పోయింది. ఉన్నదీ విదేశీయుల పాదాక్రాంతమైనది. కొందరు రాజులు మాత్రం స్వతంత్రంగా ఉన్నారు. దుర్దినాలు వచ్చినపుడు దేశవాసులు అనేక విధాలైన దుఃఖాలననుభవించవలసి వస్తుంది. ఎవరేమి చేసినా స్వదేశీ రాజ్యం అన్నిటికన్న సర్వశ్రేష్ఠంగా ఉంటుంది. మతమతాంతరాల మూర్ఖపు పట్టుదలలు లేకుండా, తన వారిపై గాని పరులపై గాని ఎట్టి పక్షపాతం చూపించకుండా, ప్రజలను మాతా పితరులవలె సమాన కృపతోనూ, న్యాయంతోనూ, దయతోనూ చూసే విదేశీయుల రాజ్యం స్వదేశీరాజ్యంలాగా పూర్ణ సుఖదాయకం కాలేదు. కాని ఇక్కడి భిన్న భిన్న భాషలు, విభిన్న విద్యాబోధనలు, పరస్పర విరుద్ధ వ్యవహారాలు తొలగటం దుష్కరం. ఇవి తొలగిపోనంతవరకు పరస్పరం చేసుకోవలసిన ఉపకారం, ఏకాభిప్రాయాల సిద్ధి కలగటం చాలా కష్టం. కాబట్టి వేదాది శాస్త్రాలలో వ్రాయబడిన వ్యవస్థలను, ఇతిహాసాన్ని గౌరవించటం భద్రపురుషుల కర్తవ్యం.

ప్రశ్న:- జగదుత్పత్తియై ఎంతకాలం గడచింది?

జవాబు:- జగదుత్పత్తి మరియు వేదాల ప్రకాశం జరిగి నూటతొంభైఏడు కోట్లపై కొన్ని లక్షల సంవత్సరాల కాలమైంది. దీనిని గురించిన విపుల వ్యాఖ్యానం నాచే వ్రాయబడిన ఋగ్వేదాది భాష్యభూమికలో వేదోత్పత్తి విషయంలో చూడండి. అనేక విధాలుగా ఇలా సృజించబడుతూ సృష్టి జరిగింది. అన్నిటికన్న అతి సూక్ష్మమై, విభజించటానికి వీలుకాని భాగాన్ని పరమాణువులంటారు. అరువది పరమాణువులు కలిసిన అణువవుతుంది. రెండణువులు ద్వ్యణుకమవుతుంది. ఇది స్థూలవాయువు. మూడు ద్వ్యణుకాలు కలది అగ్ని. నాలుగు ద్వ్యణుకాలు కలది జలం. ఐదు ద్వ్యణుకాలు కలది పృథ్వి. మూడు ద్వ్యణుకాలను త్రసరేణువు అంటారు. అది రెండింతలైతే పృథ్వి మొదలైన దృశ్య పదార్థాలు ఏర్పడతాయి. ఈ విధమైన క్రమంలో భూగోళాలను పరమేశ్వరుడు రచించాడు.

పృథివీధారణం

ప్రశ్న:- పృథ్విని ఎవరు ధరిస్తున్నారు? కొందరు సహస్ర ఫణాలు (పడగలు) గల శేష సర్పం శిరస్సున పృథ్వి ఉన్నదని అంటున్నారు. మరొకడు ఎద్దు కొమ్ములపై ఉన్నదనీ, మూడవవాడు దేనిమీద లేదనీ, నాల్గవవాడు వాయువుయొక్క ఆధారంతో ఉన్నదనీ, ఐదవవాడు సూర్యుని ఆకర్షణతో ఆకర్షించబడి తన స్థానంలో ఉన్నదనీ, ఆరవవాడు భూమి గొప్పభారం కలదవటంతో ఆకాశంలో క్రిందికి దిగిపోతున్నదనీ, ఇలా అనేకులు అనేక విధాల చెబుతున్నారు. వీటిలో ఏ దానిని సత్యమని అంగీకరించాలి?

జవాబు:- శేషుడను సర్పంపై, ఎద్దుకొమ్ములపై పృథ్వి ధరించబడి ఉన్నదనేవారితో ఇలా ప్రశ్నించాలి. సర్పంయొక్క, ఎద్దుయొక్క తల్లిదండ్రులు జన్మించినపుడు పృథ్వి దేనిపై ఉన్నది? సర్పం,

ఎద్దులు పుట్టినపుడు అవి దేనిపై ఉన్నాయి? అని ప్రశ్నించాలి. ఎద్దు కొమ్ములపై ఉన్నదనే ముసల్మానులు మారుమాట్లాడక నోరుమూసుకొంటారు. కాని సర్పం శిరస్సుపై ఉన్నదనేవారు మాత్రం సర్పం కూర్మం (తాబేలు)పై ఉన్నదనీ, కూర్మం జలంపై, జలం అగ్నిపై, అగ్ని వాయువుపై, వాయువు ఆకాశంలో ఉ న్నదనీ చెబుతుంటారు. ఇలాంటివారితో ఇవి అన్నీ ఏదానిపై ఉన్నవని ప్రశ్నించిన వారు తప్పక పరమేశ్వరునిపై ఆధారపడి ఉన్నదని అంటారు. శేషుడు, వృషభము ఎవరి సంతానమని అడిగితే శేషుడు కశ్యపకద్రువల సంతానమనీ, ఎద్దు ఆవుయొక్క సంతానమనీ చెబుతుంటారు. కశ్యపుడు మరీచి యొక్క మరీచి మనువు యొక్క మనువు విరాటుని యొక్క విరాటుడు బ్రహ్మ యొక్క సంతానం. బ్రహ్మ ఆదిసృష్టికి చెందినవాడు. శేషుడు జన్మించకపూర్వం ఐదు తరాలు గడిచాయి. ఇంత కాలంవరకు దానిని ఎవరు ధరించారు? కశ్యపుడు జన్మించే సమయంలో పృథ్వి దేనిపైఉన్నది? అని ఇలా ప్రశ్నించిన ప్రత్యుత్తర మివ్వజాలక వాదించటానికి ప్రయత్నించరు.

దీని వాస్తవాభిప్రాయమిది:- 'మిగిలిన' దానిని **'శేష'** మంటారు. ఒకానొక కవి **'శేషాధారా పృథివీత్యుక్తం'** అంటే శేషుని ఆధారంలో పృథ్వి ఉన్నదని చెప్పారు. మరొకడు అతని అభిప్రాయాన్ని గుర్తించక 'శేష' అనే శబ్దానికి సర్పమనే మిథ్యాకల్పన గావించాడు. పరమేశ్వరుడే ఉత్పత్తి, స్థితికి వేరుగా మిగిలి ఉంటాడు. కాబట్టే అతనిని **'శేషుడు'** అని అంటారు. అతని ఆధారంగానే పృథ్వి ఉన్నది:-

ఋగ్వేదము. 10-85-1 ॥

సత్యేనోత్తభితా భూమిః ॥

ఇది ఋగ్వేదవాక్యం. సత్యం = త్రికాలాలలో బద్ధుడుగానివాడు, అవినాశి అయిన పరమేశ్వరుడే భూమిని, ఆదిత్యుని, సమస్త లోకాలను ధరించాడు

ఋగ్. 10-31-8 ॥

ఉక్షా దాధార పృథివీముత ద్యామ్ ॥

ఇదీ ఋగ్వేద వాక్యమే. ఈ ఉక్షా శబ్దాన్ని చూసి కొందరు 'ఎద్దు' అనే అర్థాన్ని గ్రహించారు. ఎద్దుకు **'ఉక్షా'** అని పేరున్నది. కానీ ఇంత పెద్ద భూగోళాన్ని ధరించే సమర్థత ఎద్దుకు ఎక్కడ కలదు? అని ఆ మూఢులకు తెలియకున్నది. వర్షంతో భూగోళాన్ని తడుపువాడు అవటం వలన సూర్యునికి **'ఉక్షా'** అని పేరు కలదు. సూర్యుడు తన ఆకర్షణ శక్తితో పృథ్విని ధరిస్తాడు. కాని సూర్యాదులను ధరించేవాడు పరమేశ్వరుడు తప్ప మరెవ్వరూ లేరు.

ప్రశ్న:- ఇంత గొప్ప గొప్ప భూగోళాలను పరమేశ్వరుడు ఎలా ధరిస్తుండవచ్చు?

జవాబు:- అనంత ఆకాశంలో ఈ గొప్ప గొప్ప భూగోళాలు సముద్రంలో చిన్న నీటి బిందువుల లాగా కూడా లేవు. అలాగే అనంతుడైన పరమేశ్వరుని ఎదుట అసంఖ్యాకములైన లోకాలు ఒక పరమాణువు లాగా కూడ లేవని చెప్పవచ్చు. అతడు బయట, లోపల సర్వత్ర వ్యాపకుడు.'విభుఃప్రజాసు' (యజు. 32-8) పరమాత్ముడు ప్రాణులన్నింటిలో వ్యాపించి, అన్నింటిని ధరిస్తున్నాడని దీని అర్థం.

క్రైస్తవులు, ముసల్మానులు, పౌరాణికులు పరమేశ్వరుని'విభుడు' అని అనరు. అతడు విభుడు కాకపోతే ఈ సమస్త సృష్టిని అతడెన్నడూ ధరించలేడు. ఎందుకంటే వస్తువును పొందక ఎవడూ దేనినీ ధారణ చేయలేడు.

ఈ సమస్త లోకాలు పరస్పరం ఆకర్షణ శక్తితోనే ధరించబడుతున్నప్పుడు, పరమేశ్వరుడు ధరించవలసిన అవసరమేమి? అనీ కొందరు ప్రశ్నిస్తారు. అలాగైతే ఈ సృష్టి అనంతమా? లేక సాంతమా? అనంతమంటే ఆకారంగల పదార్థాలు ఎన్నడూ అనంతాలు కాలేవు, అంతం కలదంటే దానికి పరభాగ సీమలో అంటే ఎక్కడ ఇతర లోకాలు లేవో అక్కడ దేని ఆకర్షణతో ధరించబడతాయి? అన్నింటి సముదాయానికి సమష్టి అని పేరు. ఒకొక్క దానిని వేరువేరుగా చెప్పిన వ్యష్టి అనబడుతుంది. 'వన' మంతా 'సమష్టి' అవుతుంది. దానిలో ఒక్కొక్క వృక్షం 'వ్యష్టి' అవుతుంది. అలాగే భూగోళాలనన్నింటినీ సమష్టిగా లెక్కించి 'జగత్తు' అంటే ఆ సర్వజగత్తును ధరించి, ఆకర్షించునట్టి కర్త పరమేశ్వరుడు తప్ప మరెవ్వడూ కాలేడు. అందుకే సమస్త జగత్తును రచించేవాడే దానిని ధరిస్తున్నాడు.

స దాధార పృథివీం ద్యాముతేమాం **॥ యజు. 13-4 ॥**

ఇది యజుర్వేద వాక్యం. పృథివ్యాది ప్రకాశరహిత లోక లోకాంతర పదార్థాలను, సూర్యాది ప్రకాశసహిత లోకాలను, పదార్థాలను రచించి ధారణ చేసేవాడు పరమాత్ముడే. అతడు అన్నింటిలో వ్యాపించే ఉన్నాడు. అతడే జగత్తుకు కర్త, ధర్తయై ఉన్నాడు.

భూభ్రమణం

ప్రశ్న:- పృథివ్యాది లోకాలు తిరుగుతున్నాయా? లేక స్థిరంగా ఉన్నాయా?

జవాబు:- తిరుగుతున్నాయి.

ప్రశ్న:- కొందరు 'సూర్యుడు తిరుగుతున్నాడు' అనీ, 'పృథ్వి తిరగటం లేదు' అనీ చెప్తారు. మరికొందరు 'పృథ్వి తిరుతున్నది. సూర్యుడు తిరగటం లేదు' అనీ చెప్తారు. దీనిలో ఏ దానిని సత్యమని భావించాలి?

జవాబు:- ఈ రెండింటిలో సగం అసత్యంగా ఉన్నది. వేదంలో ఇలా వ్రాయబడి ఉన్నది

ఆయం గౌః పృశ్నిరక్రమీదసదన్మాతరం పురః । పితరం చ ప్రయన్త్స్వః ॥ యజు. 3-6 ॥

అంటే "ఈ భూగోళం జలంతో కూడి సూర్యునికి నాలుగువైపుల తిరుగుతున్నది." కాబట్టి భూమి తిరుగుతున్నదని చెప్పాలి.

ఆ కృష్ణేన రజసా వర్తమానో నివేశయన్నమృతం మర్త్యం చ ।
హిరణ్యయేన సవితా రథేనా దేవో యాతి భువనాని పశ్యన్ ॥ ॥ యజు. 33-43 ॥

సవితా = వర్షాదులకు కర్తయైన సూర్యుడు, ప్రకాశస్వరూపుడు, తేజోమయుడు, రమణీయ స్వరూపంకలవాడు. అతడు సర్వప్రాణులలో, అప్రాణులలో అమృతరూప వృష్టిద్వారా, కిరణాల ద్వారా, అమృతాన్ని పోసి, సమస్తమూర్తిమంతాలు అయి (ఆకారంగల) పదార్థాలను దర్శింపజేస్తూ, సమస్త లోకాలతోపాటు, ఆకర్షణ శక్తిగలవాడై తన పరిధిలో తిరుగుతున్నాడు. అతడు మరొక లోకంచుట్టు తిరగటం లేదు. అలాగే ఒక్కొక్క బ్రహ్మాండంలో ఒక్కొక్క సూర్య ప్రకాశకుడు. ఇతర లోకలోకాంతరాలన్నీ ప్రకాశ్యాలు - ప్రకాశింపచేయబడినవై ఉన్నాయి:-

దివి సోమో అధి శ్రితః ॥ అథ. 14-1-1 ॥

ఈ చంద్రలోకం సూర్యునితో ప్రకాశింపబడినట్లే పృథివ్యాది లోకాలు సూర్యుని ప్రకాశంతో ప్రకాశింపబడుతున్నాయి. అందువలన రాత్రింబవళ్లు ఏర్పడుతున్నాయి. పృథ్వి తిరుగుతున్నప్పుడు ఎంత భాగం సూర్యుని ముందుకు వస్తుందో, ఆ భాగాన్ని 'పగలు' అనీ, ఎంత భాగం వెలుతురు పడక మరుగునపడి ఉండునో అక్కడ 'రాత్రి' అనీ చెప్తారు. ఉదయం, అస్తమయం, సంధ్య, మధ్యాహ్నం, మధ్యరాత్రి మొదలైన సమయ విభాగాలు అన్ని దేశ దేశాంతరాలలో సదా వర్తమానమై ఉన్నాయి. ఆర్యావర్తంలో సూర్యోదయం అయినప్పుడు, పాతాళమనబడే అమెరికాలో సూర్యాస్తమయం అవుతుంది. అలాగే ఆర్యావర్తంలో అస్తమయమైతే పాతాళలోకంలో ఉదయమవుతుంది. ఆర్యావర్తంలో మధ్యాహ్నమో, మధ్యరాత్రో అయినపుడు పాతాళలోకంలో మధ్యరాత్రో, మధ్యాహ్నమో అవుతుంది. "సూర్యుడు తిరుగుతున్నాడు, భూమి తిరగటం లేదనేవారు అజ్ఞానం కలవారు. అలాగే అయితే అనేక వేల సంవత్సరాలకు ఒక పగలు రాత్రి ఏర్పడుతుంది. సూర్యునికి "బ్రధ్నః" అనే పేరున్నది. సూర్యుడు పృథ్వికంటే లక్షలరెట్లు అధికంగా, కోట్లకొలది క్రోసుల దూరంలో ఉన్నాడు. అందుకే అతడు బ్రధ్నుడు. ఆవగింజముందు పర్వతం తిరిగిన చాలాకాలం పడుతుంది. ఆవగింజ తిరగటానికి అంతకాలం పట్టదు. అలాగే భూమి తిరిగితే యథారీతిగా రాత్రింబగళ్ళు ఏర్పడతాయి. సూర్యుడు తిరిగితే ఏర్పడవు.

సూర్యుడు స్థిరంగా ఉన్నాడనేవారు కూడా జ్యోతిషశాస్త్రాన్ని తెలుసుకోలేరు. సూర్యుడు తిరుగకపోతే ఒకరాశిని వీడి మరొక రాశి స్థానాన్ని చేరలేడు. గొప్పభారంతో కూడిన పదార్థాలు తిరుగకుండా ఆకాశంలో నియమిత స్థానంలో ఎప్పుడూ ఉండలేవు. "భూమి తిరగటం లేదనీ క్రమంగా క్రిందికి పోతున్నదనీ, జంబూద్వీపానికి ఇద్దరు సూర్యులు, ఇద్దరు చంద్రులు ఉన్నారనీ జైనులు అనేవారు. ఇలానే వారు గాఢమైన భంగు మైకంలో లీనమై ఉన్నారు. ఎందుకంటే పృథ్వి తిరగక క్రిందికే క్రమంగా పోతుంటే దానికి చుట్టు నాలుగువైపుల వాయుచక్రమేర్పడనందున పృథ్వి ఛిన్నాభిన్నం కావలసివస్తుంది. క్రిందిభాగంలో ఉండేవారికి వాయుస్పర్శ అధికంగా కలుగుతుంది. మిగతావారికి వాయుగతి ఒకే విధంగా ఉంటుంది. ఇద్దరు సూర్యులు, ఇద్దరు చంద్రులుంటే రాత్రిగాని, కృష్ణపక్షంగాని కలుగక అస్తవ్యస్తమవుతుంది. కాబట్టి ఒక భూగోళానికి సమీపంలో ఒక చంద్రుడో ఇద్దరు చంద్రులో ఉండవచ్చు.. కాని అనేక భూముల మధ్య ఒకే సూర్యుడుంటాడు.

ప్రశ్న:- సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు అనే ఈ వస్తువులేమిటి? వాటిలో మానవాది సృష్టి ఉందా? లేదా?

జవాబు:- ఈ గోళాలన్నీ లోకాలే. వీటిలో మానవాది ప్రజలు ఉంటారు. ఎందుకంటే:-

ఏతేషు హీదగ్ం సర్వం వసుహితమేతే హీదగ్ం సర్వం వాసయంతే ।

తద్యదిదగ్ం సర్వం వాసయంతే తస్మాద్వసవ ఇతి ॥

శత. బ్రా. కాం. 14. ప్ర. 6 బ్రా. 9 కం. 4 ॥

"పృథ్వి, జలం, అగ్ని, వాయువు, ఆకాశం, చంద్రుడు, సూర్యుడు, నక్షత్రాలు" అనే వీటిని వసువులు అంటారు. వీటిలోనే సమస్త పదార్థాలు, సర్వప్రాణులు నివసిస్తాయి. అన్నింటినీ ఇవే వసింపజేస్తున్నాయి. ఇవి నివసించటానికి, నివసింపజేయటానికి ఉనికిపట్టువులు అవటం వలన వీటిని 'వసువులు' అంటారు. పృథ్వి వలెనే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు కూడా వసువులు అనబడ్డాయి. కాబట్టి వానిలోనూ ఇదే విధమైన ప్రజలుండటంలో సందేహం ఏమిటి? పరమేశ్వరునియొక్క ఈ చిన్నలోకమే మానవాది సృష్టిలో ఉండి ఉంటే మిగతా ఈ లోకాలన్నీ శూన్యాలుగా ఉంటాయా? పరమేశ్వరుని ఏ కార్యం కూడా నిష్ప్రయోజనమైనది కాదు. ఈ అసంఖ్యాక లోకాలలో మానవాది సృష్టి జరగకపోతే అతని కార్యమెలా సఫలమవుతుంది? అందుకే సర్వత్ర మానవాది సృష్టి ఉన్నది.

ప్రశ్న:- మానవాదుల ఆకారాలు, అవయవాలు, ఈ లోకంలో ఉన్నట్లే ఇతర లోకాలలోని వారికుంటాయా? లేక విపరీతంగానా?

జవాబు:- ఆకృతులలో కొంత భేదాలుండటానికి ఆస్కారముంది. ఈ భూమిపై గల చైనా, ఆఫ్రికా, ఆర్యావర్త, యూరపు దేశవాసుల రంగు రూపాలలోనూ, ఆకృతిలోనూ కొంత కొంత భేదం ఉన్నది. అలాగే లోక లోకాంతరాలలో ఉండే వారికి భేదాలు ఉంటాయి. ఈ లోకంలో, ఏ యే జాతుల సృష్టి ఉందో అలాగే ఇతర లోకాలలో కూడా ఆ యా జాతిసృష్టి ఉంటుంది. ఇక్కడ శరీరంలోని ఏ యే స్థానాలలో నేత్రాది అవయవాలున్నాయో, ఆ యా లోకాలలో, ఆ జాతి యొక్క అవయవాలు అలాగే ఉంటాయి. ఎందుకంటే:-

సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వమకల్పయత్ ।

దివం చ పృథివీం చాంతరిక్షమథో స్వః ॥ ఋగ్వే. 10 - 190- 3 ॥

ధాతా = పరమాత్ముడు పూర్వకల్పంలో ఎలా సూర్య, చంద్ర, ద్యౌ, భూమి, అంతరిక్షాలను, అక్కడ ఉండే సుఖకారక విశేష పదార్థాలను రచించినాడో ఈ కల్పంలో - ఈ సృష్టిలోనూ అలాగే సృజించినాడు. అలాగే సమస్త లోక లోకాంతరాలలోనూ సృజించినాడు. అతని సృష్టిలో భేదం కించిన్మాత్రం కూడా కలుగదు.

ప్రశ్న:- ఈ లోకంలో ఏ వేదాలు ప్రకాశింపబడ్డాయో అవే వేదాలు ఆ యా లోకాలలోనూ ప్రకాశపరచబడ్డాయా? లేదా?

జవాబు:- వాటినే ప్రకాశింపచేసినాడు. ఒక రాజు యొక్క రాజ్య వ్యవస్థ, రాజనీతి అతని అన్ని రాజ్యాలలో సమానంగానే ఉంటుంది. అలాగే రాజ రాజేశ్వరుడైన పరమాత్ముని వేదోక్తనీతి, అతని సృష్టిరూప రాజ్యమందంతటా ఒకే విధంగా ఉంటుంది.

ప్రశ్న:- ఈ జీవులు, ప్రకృతిలోని తత్త్వాలు, అనాదులై ఈశ్వరునితో సృజింపబడనప్పుడు వీటిపై ఈశ్వరునికి అధికారమెలా ఉంటుంది? అవన్నీ స్వతంత్రాలే కదా?

జవాబు:- రాజు, ప్రజలు సమకాలికులైనను రాజు యొక్క ఆధీనంలో ప్రజలందరూ ఉంటారు. అలాగే పరమేశ్వరుని ఆధీనంలో జీవులు, జడపదార్థాలు ఉన్నాయి. పరమేశ్వరుడు సృష్టినంతా సృజించేవాడు. జీవుల కర్మలకు ఫలాలను ఇచ్చేవాడు, యథావిధిగా అందరిని రక్షించేవాడు. అతడు అనంత సామర్థ్యం కలవాడు. అల్ప సామర్థ్యం గల జీవులు, జడపదార్థాలు అతని అధీనంలో ఎందుకుండవు? జీవుడు కర్మలు చేయటంలో స్వతంత్రుడైనా ఈశ్వరుని వ్యవస్థలో కర్మఫలాన్ని అనుభవించటంలో పరతంత్రుడే. కాబట్టి సర్వశక్తిమంతుడైన పరమేశ్వరుడే సృష్టికీ, సంహారానికీ, పరిపాలనకు, విశ్వానికీ కర్తయై ఉన్నాడు.

ఇలా సృష్ట్యుత్పత్తి, స్థితి, ప్రళయ విషయాలు సంక్షిప్తంగా వ్రాయబడ్డాయి..

ఇకముందు విద్య-అవిద్యల గురించీ, బంధ-మోక్షాల గురించీ వ్రాయబడతాయి.

శ్రీమద్దయానందసరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన సత్యార్థప్రకాశంలో

సృష్ట్యుత్పత్తి, స్థితి, ప్రళయాల గురించిన విషయాలు గల

అష్టమ సముల్లాసం సంపూర్ణం.

నవమ సముల్లాసము

అథ విద్యాఽ విద్యాబన్ధమోక్షవిషయాన్ వ్యాఖ్యాస్యామః

విద్య, అవిద్య, బంధ, మోక్షవిషయాలను వ్యాఖ్యానించెదము.

విద్యాం చాఽ విద్యాం చ యస్తద్వేదోభయగ్ం సహ ॥
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే ॥ యజు. 40-14 ॥

'విద్య, అవిద్య' అనే ఈ రెండింటి స్వరూపాన్ని ఒకేసారి తెలుసుకొన్న మానవుడు అవిద్య కర్మోపాసన వలన మృత్యువును దాటి, 'విద్య' యథార్థ జ్ఞానంతో మోక్షాన్ని పొందును.

'అవిద్య' లక్షణం

అనిత్యాశుచిదుఃఖానాత్మసు నిత్యశుచిసుఖాత్మఖ్యాతిరవిద్యా ॥
యోగ. సాధనపాదము. సూ. 5 ॥

అనిత్యమైన సంసారంలో, దేహాలను నిత్యమనీ - అంటే కనిపించు, వినిపించు తెలుసుకోదగ్గ కార్యజగత్తు ఎల్లప్పుడు ఉందనీ, యోగబలంలో దేవతల శరీరాలు ఎల్లప్పుడూ ఉంటాయనీ అనుకొంటూ విపరీత బుద్ధిని కలిగి ఉండటం అవిద్యలో మొదటి భాగం.

'అశుచి' అంటే మలమయాలైన స్త్రీ పురుషుల శరీరములందు, మిథ్యా భాషణాలు, దొంగతనం మొదలైన అపవిత్రాలను పవిత్రాలుగా అనుకోవడం రెండవ భాగం. అత్యంత విషయ వాసనారూప దుఃఖాలను సుఖమనీ అనుకోవడం మూడవ భాగం. అనాత్మయైన దానిలో ఆత్మ భావాన్ని ఉంచటం అవిద్యలో నాల్గవ భాగం. ఈ నాలుగు విధాలైన విపరీత జ్ఞానాన్నే 'అవిద్య' అంటారు.

'విద్య' లక్షణం

పై దానికి విపరీతమైనది - అంటే అనిత్యాన్ని అనిత్యమనీ, నిత్యాన్ని నిత్యమనీ, అపవిత్రాన్ని అపవిత్రమనీ, పవిత్రాన్ని పవిత్రమనీ, దుఃఖాన్ని దుఃఖమనీ, సుఖాన్ని సుఖమనీ, అనాత్మను అనాత్మయనీ, ఆత్మను ఆత్మ అనీ తెలిపేదాన్ని 'విద్య' అంటారు.

"వేత్తి యథావత్తత్త్వపదార్థస్వరూపం యయా సా విద్యా ।
యయా తత్త్వస్వరూపం న జానాతి భ్రమాదన్యస్మిన్నన్యన్నిశ్చినోతి యయా సాఽ విద్యా ॥"

పదార్థాలయొక్క యథార్థస్వరూపం దేనిమూలమున తెలియబడుతుందో అది విద్య, దేని మూలంగా తత్త్వస్వరూపం బోధపడదో, ఒకదానిలో ఇంకొకటిగా అన్యబుద్ధి కలుగునో అది 'అవిద్య' అనబడుతుంది.

ఇక్కడ మంత్రములోగల 'అవిద్య' శబ్దానికర్థం కర్మ, ఉపాసన. ఇది బాహ్య, అంతర క్రియా విశేషం అవటం వలన కర్మను, ఉపాసనను అవిద్య అని చెప్పారు. ఈ రెండూ జ్ఞాన విశేషాలు కావు. కాబట్టి పవిత్ర కార్యాలు, పరమేశ్వరోపాసన లేకుండా మృత్యు దుఃఖం నుండి తొలగలేరని ఈ మంత్రంలో చెప్పబడింది. అంటే పవిత్ర కర్మలు, పవిత్రోపాసన, పవిత్ర జ్ఞానం వలననే ముక్తి కలుగుతుంది. అపవిత్రాలైన మిథ్యాభాషణాది కర్మలవలన, పాషాణాది మూర్తులను ఉపాసించటంవలన, మిథ్యా జ్ఞానంవలన బంధం కలుగుతుంది. కర్మ, ఉపాసన, జ్ఞానరహితుడై ఏ మానవుడు ఉన్నతిని సాధించలేడు. కాబట్టి ధర్మయుక్తమైన సత్యభాషణాది కర్మలను చేయటం, అధర్మమైన మిథ్యా భాషణాదులను త్యజించటం ముక్తికి సాధనం.

నవీనవేదాంత మత సమీక్ష

ప్రశ్న:- ముక్తి ఎవరికి లభించదు?

జవాబు:- బద్ధులైన జీవులకు.

ప్రశ్న:- ఎవడు బద్ధుడు?

జవాబు:- అధర్మంలో, అజ్ఞానంలో చిక్కుకొన్న జీవుడు.

ప్రశ్న:- బంధ మోక్షాలు స్వభావంవలన కలుగుతాయా? లేక ఏదేని నిమిత్తంవలననా?

జవాబు:- నిమిత్తంవలన కలుగుతాయి. స్వాభావికంగా బంధమోక్షాలు కలిగితే అవి ఎన్నడూ నివృత్తి కాలేవు.

ప్రశ్న:- **న నిరోధో న చోత్పత్తిర్న బద్ధో న చ సాధకః ।**
న ముముక్షుర్న వై ముక్తిరిత్యేషా పరమార్థతా ॥ గౌడ కారిక. 2-32 ॥

ఇది మాండూక్యోపనిషత్తుపై గౌడపాదాచార్యులు వ్రాసిన కారిక. జీవుడు 'బ్రహ్మ' అవటం వలన వాస్తవానికి జీవునికి నిరోధం కలగదు. అంటే ఎన్నడూ ఆవరణలోనికి రాడు. జన్మించడు. బద్ధుడు కాడు. సాధకుడు కాడు. సాధించేవాడు కాడు. అతడు విముక్తి పొందవలెనని కోరడు. పరమార్థాన్ని బట్టి అతనికి బంధమే లేనపుడు, అతనికిక ముక్తితో పనేంటి?

జవాబు:- ఈ నవీన వేదాంతులు చెప్పే విషయం సత్యం కాదు. కారణమేమంటే, జీవుని స్వరూపం అల్పమవటం వలన ఆవరణలోనికి వస్తుంది. శరీరంతో పాటు ప్రకటరూపంలో జన్మిస్తుంది. పాపరూప కర్మల ఫలితమైన భోగరూప బంధనమందు చిక్కుకొంటుంది. దాని నుండి విడివడటానికి సాధన చేస్తాడు. దుఃఖాల నుండి దూరమవటానికి కోరుకొంటాడు. దుఃఖాలనుండి విముక్తుడై పరమానందస్వరూపుడు అయిన పరమేశ్వరుని పొందుతాడు. ముక్తిసుఖాన్ని అనుభవిస్తాడు.

ఆత్మ నిర్లేపత్వ ఖండనం

ప్రశ్న:- ఈ ధర్మాలు అన్నీ దేహానికీ, అంతఃకరణానికీ సంబంధించినవే కాని జీవునివి కావు. జీవుడు పాపపుణ్య రహితుడై సాక్షిగా ఉంటాడు. శీతోష్ణాలు శరీరాల ధర్మం. ఆత్మ కేవలం నిర్లేపం.

జవాబు:- శరీరం, అంతఃకరణం జడాలు. వానికి శీతోష్ణాల ప్రాప్తిగాని, భోగంగాని లేదు. వాటిని స్పర్శించే చైతన్యం గల మానవాది ప్రాణులకే శీతోష్ణాల జ్ఞానం, భోగం కలుగుతుంది. ప్రాణాలు కూడా జడాలే. వాటికి ఆకలి గాని, దప్పిక గాని ఉండదు. ప్రాణాలు గల జీవులకే ఆకలి, దప్పిక కలుగుతాయి. మనస్సు కూడా జడమే. దానికి హర్షం గాని, శోకంగాని కలగదు. కానీ మనస్సుతో జీవుడు హర్ష శోకాలను, సుఖదుఃఖాలను అనుభవిస్తాడు. బాహ్యకరణాలైన శ్రోత్రాది ఇంద్రియాలతో మంచి చెడు శబ్దాది విషయాలను గ్రహించి జీవుడు సుఖవంతుడు దుఃఖితుడు కూడా అవుతాడు. అలాగే అంతఃకరణంతో - అంటే మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారాలతో సంకల్ప వికల్పాలు, నిశ్చయం, స్మరణ, అభిమానాలు కలవాడై దండనకు, సత్కారానికి అర్హుడు అవుతున్నాడు. కత్తితో చంపినవాడు శిక్షింపబడతాడు. కత్తి శిక్షించబడదు. అలాగే, దేహేంద్రియాలతో, అంతఃకరణంతో, ప్రాణరూప సాధనలతో మంచి, చెడు కర్మలను చేసే జీవుడే సుఖదుఃఖాలననుభవిస్తాడు. జీవుడు కర్మకు సాక్షి కాడు. అతడు కర్మకు కర్తా, భోక్తా. అద్వితీయుడైన పరమాత్ముడు ఒక్కడే కర్మలకు సాక్షి. కర్మలను చేసే జీవుడే కర్మలలో లిప్తుడవుతాడు. కాని సర్వసాక్షి అయిన ఈశ్వరుడు కర్మ లిప్తుడు కాడు.

జీవుడు బ్రహ్మప్రతిబింబం కాదు

ప్రశ్న:- జీవుడు బ్రహ్మమునకు ప్రతిబింబం. అద్దం పగిలి ముక్కలైనపుడు బింబానికి నష్టం కలగదు. అంతఃకరణంలో బ్రహ్మంయొక్క ప్రతిబింబమైన జీవుడున్నంతవరకు అతడు అంతఃకరణోపాధి కలవాడుగా ఉంటాడు. అంతఃకరణం నష్టమైనపుడు జీవుడు ముక్తుడవుతాడు.

జవాబు:- ఇవి చిన్నపిల్లల మాటలు. సాకారాలయొక్క ప్రతిబింబాలు సాకారంలో ఉంటాయి. ముఖం, దర్పణాలు సాకారాలు. అవి వేరు వేరుగా ఉన్నాయి. అవి వేరుగా ఉంటేనే వాటి ప్రతిబింబం ఏర్పడుతుంది. బ్రహ్మ నిరాకారుడు, సర్వవ్యాపకుడు. కాబట్టి అతనికి ప్రతిబింబం ఏర్పడదు.

ప్రశ్న:- గంభీరమైన, స్వచ్ఛమైన జలంలో నిరాకారం, వ్యాపకం అయిన ఆకాశం యొక్క ప్రతిబింబం పడు విధంగానే స్వచ్ఛమైన అంతఃకరణంలో పరమాత్ముని ప్రతిబింబం ఏర్పడుతుంది. ప్రతిబింబాన్నే చిదాభాసుడంటారు.

జవాబు:- ఇదియూ పిల్లతనపు మిథ్యా ప్రలాపం. ఎలాగంటే, ఆకాశం దృశ్యమే కానపుడు దానిని ఎవరైనా కన్నులతో చూడగలరా?

ప్రశ్న:- పైన నీలంగా, ధూమ్రంగా కనిపించేది ఆకాశం కాదా?

జవాబు:- కాదు.

ప్రశ్న:- మరి అదేమిటి?

జవాబు:- పృథ్వి, జలం, అగ్నికి సంబంధించిన త్రసరేణువులు వేరువేరుగా కనిపిస్తున్నవి. అందు నీల వర్ణంగా కనిపించే భాగంలో అధికంగా వర్షించే జలమున్నది. అది మనకు నీల వర్ణంగా కనిపిస్తుంది. పృథ్వినుండి లేచిన ధూళి వాయువులో కలిసి పైన తిరుగుతూ మనకు ధూమ్ర-పొగ రూపంలో కనుపిస్తున్నది. వీని ప్రతిబింబాలే మనకు జలంలోను, దర్పణంలోను కనిపిస్తాయి. ఆకాశం ఎన్నడూ కనిపించదు.

ప్రశ్న:- ఘటాకాశం, మఠాకాశం, మేఘాకాశం, మహదాకాశం అనే భేదాలు వ్యవహారంలో ఉన్నట్లే బ్రహ్మకు బ్రహ్మాండోపాధి వలన ఈశ్వరుడనీ, అంతఃకరణోపాధి వలన జీవుడనీ పేర్లు ఏర్పడ్డాయి. ఘటాలు నష్టమైనపుడు అంతా మహదాకాశమే అనబడుతుంది.

జవాబు:- ఇది కూడా అవిద్వాంసులమాటే. ఎందుకంటే ఆకాశ మెప్పుడూ ఛిన్నాభిన్నం కాలేదు. వ్యవహారంలో కూడా 'ఘటాన్ని తెమ్ము' మొదలైన వాక్యాలు ప్రయోగించబడునే కాని ఘటాకాశాన్ని తెమ్మని ఎవ్వరు అనరు. కాబట్టి నీ మాట సరైనది కాదు.

ప్రశ్న:- సముద్రంలో మత్స్యాలు (చేపలు), కీటకాలు తిరిగినట్లుగా, ఆకాశంలో పక్ష్యాదులు విహరించినట్లుగా, చిదాకాశ బ్రహ్మలో అంతఃకరణాలు అన్నీ తిరుగుతాయి. అవి అన్నీ వాస్తవంగా జడాలే. అగ్నితో కూడిన లోహం అగ్ని వలె అయినట్లు, సర్వవ్యాపకుడైన పరమాత్ముని సత్తా వలన అంతఃకరణాలు చేతనాలవుతున్నాయి. అవి చలిస్తూ, తిరుగుతున్నా ఆకాశం, బ్రహ్మం నిశ్చలమై ఉన్నట్లే జీవుని బ్రహ్మమని అంగీకరించిన దోషం ఏమీ లేదు కదా?

జవాబు:- ఈ దృష్టాంతం కూడా సరైనది కాదు. ఎందుకంటే సర్వవ్యాపి అయిన బ్రహ్మ అంతఃకరణాలలో ప్రకాశమానుడై జీవుడైతే ఆతనిలో సర్వజ్ఞత్వాది గుణాలుండరుయా? ఉండవా? ఆవరణం ఉండటంచేత సర్వజ్ఞత ఉండదని అందురేని బ్రహ్మ ఆవృతుడై - ఆవరింపబడినవాడై ఉన్నందున అతడు ఖండితుడా? లేక అఖండుడా? 'అఖండుడు' అని అంటే అతని మధ్యలో ఎవరూ

ఆవరణ గాని, తెరగాని వేయలేరు. ఇక మధ్య తెరలేకపోతే సర్వజ్ఞత ఎలా ఉండదు? తన స్వరూపాన్ని మరచి అంతఃకరణంతో తిరుగుతున్నట్లు కనిపించునే కాని ఆ స్వరూపంలో లేదని మీరంటే అది కూడా సరైనది కాదు. స్వయంగా చలిస్తే అంతఃకరణం పూర్వ ప్రాప్తదేశాన్ని విడిచి, మునుముందుకు జరుగుతూ పోయినపుడు అక్కడక్కడ బ్రహ్మభ్రాంతుడు, అజ్ఞాని అవుతాడు. అంతఃకరణం విడిపోయిన భాగంలో బ్రహ్మ జ్ఞానీ, పవిత్రుడు, ముక్తుడు అవుతుంటాడు. ఇలా సర్వత్ర సృష్టికర్త అయిన బ్రహ్మను అంతఃకరణం చెడగొడుతుంది. ఇలా బంధమోక్షాలు కూడా క్షణ క్షణం జరుగుతూ, పోతూ ఉంటాయి. మీరన్నవిధంగానే జరిగితే ఏ జీవునికీ పూర్వం వినినది, చూసినది స్మరణకు రాకుండా పోతుంది. ఎందుకంటే గత క్షణంలో ఉన్న బ్రహ్మ మరుక్షణంలో ఉండటం లేదు. అంటే ఏ బ్రహ్మ చూసాడో ఇపుడు ఆ బ్రహ్మ లేడు. అందుకే బ్రహ్మ జీవుడుగా గాని జీవుడు బ్రహ్మగా గాని ఎన్నడూ కాలేరు. ఎప్పుడూ వీరిద్దరూ వేరువేరుగానే ఉంటారు.

ప్రశ్న:- ఇదంతా అధ్యారోపం మాత్రమే. ఒక వస్తువును మరొక వస్తువుగా అనుకోవటం అధ్యారోపమనబడుతుంది. అలాగే! బ్రహ్మ అనే వస్తువులో జగత్తును, దాని సమస్త జగద్వ్యవహారాలను అధ్యారోపంచేసి జిజ్ఞాసువుకు ఇలా బోధించాలి. కాని వాస్తవంగా అంతా బ్రహ్మే.

సిద్ధాంతి:- అధ్యారోపం చేసేవాడు ఎవడు?

నవీన వేదాంతి:- జీవుడు.

సిద్ధాంతి:- 'జీవుడు' అని ఎవరినంటారు?

నవీన వేదాంతి:- అంతఃకరణావచ్ఛిన్న చేతనాన్ని.

సిద్ధాంతి:- అంతఃకరణావచ్ఛిన్న చేతనం ఆ బ్రహ్మమేనా? మరొకటా?

నవీన వేదాంతి:- ఆ బ్రహ్మమే.

సిద్ధాంతి:- ఏమి? బ్రహ్మమే తనలో జగత్తుయొక్క మిథ్యాకల్పన గావించుకొన్నదా?

నవీన వేదాంతి:- అవును. దీనిచే బ్రహ్మకు కలుగు హాని యేమి?

సిద్ధాంతి:- మిథ్యాకల్పనలు చేసేవాడు అసత్యవాది కాడా?

నవీన వేదాంతి:- కాదు. మనస్సుతో, వాక్కుతో కల్పించబడి చెప్పబడినదంతా అసత్యమే.

సిద్ధాంతి:- అలాగైతే మనస్సుతో, వాక్కుతో మిథ్యాకల్పనలను చేసి, అసత్యమాడువాడూ అయిన బ్రహ్మ కల్పితుడు మిథ్యావాది అవుతాడా? లేదా?

నవీన వేదాంతి:- అవును. అది మాకు ఇష్టాపత్తియే.

సిద్ధాంతి:- ఆహా! అసత్యవాదులైన వేదాంతులారా! సత్య స్వరూపుడు, సత్య కాముడు, సత్య

సంకల్పుడునైన పరమాత్మను మీరు మిథ్యాచారిగా చేసారు. ఇది మీ దుర్గతికి కారణం కాదా? పరమేశ్వరుడు మిథ్యాసంకల్పుడనీ, మిథ్యావాది అనీ ఏ ఉపనిషత్తులో, ఏ మంత్రంలో, ఏ వేదంలో వ్రాయబడి ఉన్నది? "దొంగ పోలీసు అధికారికి దండన విధించా"డనే సామెత లాగ ఉన్నది. మీ మాట పోలీధికారి దొంగకు దండన విధించటం న్యాయం, ఉచితం. కాని దొంగే పోలీసు అధికారిని దండించటం పూర్తిగా విపరీతమైంది. అలాగే మీరు మిథ్యా సంకల్పులు, మిథ్యా వాదులు. మీ దోషాలు బ్రహ్మకూ ఉన్నాయని వ్యర్థంగా కల్పిస్తున్నారు. బ్రహ్మ మిథ్యాజ్ఞాని, మిథ్యావాది, మిథ్యాకారి అయితే అనంత బ్రహ్మమంతా అలాగే అయిపోతుంది. కాని అలా కాదు. ఎందుకంటే, అతడు ఏకరసుడు, సత్యస్వరూపుడు, సత్యాభిమాని, సత్యవాది, సత్యకారి. ఈ దోషాలన్నీ మీవే కాని బ్రహ్మవి కావు. దేనిని మీరు 'విద్య' అంటున్నారో అది అవిద్య. మీ అధ్యారోపం కూడా అసత్యమే. ఎందుకంటే! తాను బ్రహ్మ కాకున్నా తనను బ్రహ్మగా అనుకుంటే మిథ్యా జ్ఞానం కాక మరి ఏమవుతుంది? సర్వవ్యాపకుడైనవాడు ఎన్నడూ పరిచ్ఛిన్నుడు, అజ్ఞానీ కాలేడు. బంధంలో చిక్కుకోడు. అజ్ఞానీ పరిచ్ఛిన్నుడు అయినవాడు ఏకదేశస్థుడుగా, అల్పజ్ఞుడుగా, అల్పుడుగా ఉంటాడు. అల్పజ్ఞత జీవునిలోనే ఉంటుంది. సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడయిన బ్రహ్మలో అజ్ఞానం ఉండదు.

బంధ మోక్షాల వర్ణన

ప్రశ్న:- 'ముక్తి' అని దేనిని అంటారు?

జవాబు:- "ముంచంతి పృథగ్భవంతి జనా యస్యాం సా ముక్తిః"దేని నుండి జీవుడు విడిపోవటం జరుగుతుందో దానిని 'ముక్తి' అంటారు.

ప్రశ్న:- దేనినుండి విడుదల?

జవాబు:- దేని నుండి విడిపోవాలని జీవులందరూ కోరుకుంటారో దానినుండి.

ప్రశ్న:- దేని నుండి విడిపోవాలని కోరుకుంటారు?

జవాబు:- ఏది తొలగాలని అనుకుంటారో దానినుండి.

ప్రశ్న:- ఏది తొలగాలని అనుకుంటారు?

జవాబు:- దుఃఖంనుండి.

ప్రశ్న:- దానినుండి తొలగి దేనిని పొందుతారు? ఎక్కడ ఉంటారు?

జవాబు:- సుఖాన్ని పొంది, బ్రహ్మలోనే ఉంటారు.

ప్రశ్న:- ముక్తి గాని, బంధంగాని ఏ యే విషయాల వలన కలుగుతుంది?

జవాబు:- పరమేశ్వరుని ఆజ్ఞలను పాలించటం, అధర్మం నుండి, అవిద్య నుండి, దుస్సాంగత్యం

నుండి, కుసంస్కారం నుండి, దుర్వ్యసనాల నుండి దూరంగా ఉండటం, సత్య భాషణం, పరోపకారం విద్య, పక్షపాతం లేకుండటం, న్యాయం, ధర్మాన్ని వృద్ధిచేయటం, పూర్వోక్త ప్రకారంగా పరమేశ్వరుని స్తుతి, ప్రార్థనోపాసనాలు చేయటం, అంటే యోగాభ్యాసంచేయటం, విద్యలను నేర్వటం, నేర్పించటం, ధర్మంతో పురుషార్థాలను పొంది జ్ఞానోన్నతిని పొందటం, సర్వోత్తమ సాధనాలను చేయటం, నిష్పక్షపాతంగా న్యాయ ధర్మానుసారంగా చేయదలచిన కార్యాలను అన్నింటినీ చేయటం, ఇలాంటి సాధనలతో మోక్షం, వీటికి వ్యతిరేకంగా ఈశ్వరాజ్ఞలను భంగంచేయటం మొదలైన కార్యాల వలన బంధనం కలుగుతుంది.

ప్రశ్న:- ముక్తియందు జీవుడు లయమవుతాడా? లేక విద్యమానుడై ఉంటాడా?

జవాబు:- విద్యమానుడై ఉంటాడు.

ప్రశ్న:- ఎక్కడ ఉంటాడు?

జవాబు:- బ్రహ్మలో.

ప్రశ్న:- బ్రహ్మ ఎక్కడ ఉన్నాడు? ముక్తజీవునితో ఒకే స్థలంలో ఉంటాడా? లేక స్వేచ్ఛాచారియై సర్వత్ర విహరిస్తాడా?

జవాబు:- బ్రహ్మ సర్వత్ర సంపూర్ణుడు. అతనిలోనే ముక్తజీవుడు అవ్యాహత గతితో - ఆటంకం లేని గతితో విజ్ఞానానందమయుడై స్వతంత్రంగా విహరిస్తాడు.

ప్రశ్న:- ముక్త జీవునకు స్థూల శరీరం ఉంటుందా? ఉండదా?

జవాబు:- ఉండదు.

ప్రశ్న:- మరి అతడు సుఖాన్ని, ఆనందాన్ని ఎలా అనుభవిస్తాడు?

జవాబు:- అతనికి సత్యసంకల్పాది స్వాభావిక గుణ, సామర్థ్యాలు అన్నీ ఉంటాయి. భౌతిక సంబంధం ఉండదు.

శృణ్వన్ శ్రోత్రం భవతి. స్పర్శయన్ త్వగ్భవతి, పశ్యన్ చక్షుర్భవతి. రసయన్ రసనా భవతి. జిఘ్రన్ ఘ్రాణం భవతి. మన్వానో మనో భవతి, బోధయన్ బుద్ధిర్భవతి, చేతయంశ్చిత్తం భవత్యహం కుర్వాణోఽహంకారో భవతి ॥

శతపథ. కాం. 14-2-2-17 ॥ ఛాందోగ్య ప్రపా. 9-1-2 ॥

మోక్షంలో భౌతికశరీరంగాని ఇంద్రియాల గోళకాలుగాని జీవాత్మతో ఉండవు. తన స్వాభావిక పరిశుద్ధ గుణాలే ఉంటాయి. వినాలనుకున్నపుడు శ్రోత్రంగా, స్పర్శింపదలచినపుడు చర్మంగా, చూడ సంకల్పించినపుడు చక్షువుగా, రుచిచూడాలని కోరినపుడు నాలుకగా, ఆఘ్రాణించదలచినపుడు ఘ్రాణం

-నాసికగా, సంకల్ప వికల్ప సమయంలో మనస్సుగా, నిశ్చయించటానికి బుద్ధిగా, స్మరించటానికి చిత్తంగా, అహంకారార్థం అహంకార రూపుడుగా తన శక్తితో ముక్తిలో జీవాత్మ అవుతాడు. అపుడు సంకల్పశరీరం ఉంటుంది. శరీర ధారణంతో, ఇంద్రియ గోళాలతో జీవుడు స్వకార్యాలు చేసుకొనేటట్లు ముక్తిలో ఇవి లేకుండానే తన శక్తితో సమస్త ఆనందాలను అనుభవిస్తాడు.

జీవునియొక్క సామర్థ్యం

ప్రశ్న:- అతని శక్తి ఎంత? అది ఎన్ని విధాలు?

జవాబు:- ముఖ్యంగా ఒకే విధమైన శక్తి ఉన్నది. కాని బలం, పరాక్రమం, ఆకర్షణ, ప్రేరణ, గతి, భీషణత్వం, ఆలోచన, క్రియ, ఉత్సాహం, స్మరణ, నిశ్చయం, ఇచ్ఛ, ప్రేమ, ద్వేషం, సంయోగం, విభాగం, సంయోజకం, విభాజకం, శ్రవణం, స్పర్శణం, దర్శనం, ఆస్వాదనం, ఆఘ్రాణం, జ్ఞానం అనే ఈ ఇరవైనాలుగు విధాల సామర్థ్యంతోకూడి జీవుడుంటాడు. వీటితోనే ముక్తి ఆనందాన్ని అనుభవిస్తుంటాడు. ముక్తిలో జీవుడు లయమైతే ముక్తిసుఖం అనుభవించేవాడు ఎవడు? జీవుని నాశనాన్నే ముక్తి అని అనుకునేవారు మహా మూర్ఖులు. దుఃఖంనుండి విముక్తుడై ఆనందస్వరూపుడు, సర్వవ్యాపకుడు, అనంతుడు అయిన పరమేశ్వరునిలో జీవుడు ఆనందంగా ఉండటం ముక్తి అవుతుంది. వేదాంతంలోని శారీరిక సూత్రాలలో చూడండి.

వేదాంత. 4-4-10 ॥

అభావం బాదరిరాహ హ్యేవమ్ ॥

వ్యాసుని తండ్రి బాదరి ముక్తితో జీవునికి, అతనితో పాటు మనస్సుకు భావముంటుందని అంగీకరిస్తాడు. అంటే జీవుడు, మనస్సు లయము - నాశనం కావని పరాశరులు నమ్ముతున్నారు. అలాగే:-

వేదాంత. 4-4-11 ॥

భావం జైమినిర్వికల్పామననాత్ ॥

జైమిని ఆచార్యులు ముక్తపురుషునికి మనస్సుతోపాటుగా సూక్ష్మ శరీరం, ఇంద్రియాలు, ప్రాణం మొదలైనవి ఉంటాయని అంగీకరిస్తారు. వాని అభావాన్ని అంగీకరించరు.

వేదాంత. 4-4-12 ॥

ద్వాదశాహవదుభయవిధం బాదరాయణోऽతః ॥

వ్యాసముని ముక్తిలో భావాన్ని, అభావాన్ని రెండింటిని అంగీకరిస్తున్నాడు. అంటే ముక్తిలో పరిశుద్ధ సామర్థ్యంతో కూడి జీవుడు ఉంటాడనీ, అపవిత్రత, పాపాచరణం, దుఃఖం, అజ్ఞానాలు అతనికి అప్పుడు ఉండవనీ అంగీకరిస్తున్నాడు.

యదా పంచావతిష్ఠంతే జ్ఞానాని మనసా సహ ।
బుద్ధిశ్చ న విచేష్టతే తామాహుః పరమాం గతిమ్ ॥ కఠోప 2-3-10 ॥

పరిశుద్ధ మనస్సుతో కూడిన పంచేంద్రియాలు జీవునితో ఉండి, నిశ్చయబుద్ధి స్థిరమైనపుడు దానిని పరమగతి - అంటే మోక్షమంటారు.

య ఆత్మా అపహతపాప్మా విజరో విమృత్యుర్విశోకో విజిఘత్సోఽ పిపాసః సత్యకామః సత్య సంకల్పః సోఽన్వేష్టవ్యః స విజిజ్ఞాసితవ్యః సర్వాంశ్చ లోకానాప్నోతి సర్వాంశ్చ కామాన్ యస్తమాత్మానమను విద్య విజానాతీతి ॥

ఛాందోగ్య ప్రపా. 8 ఖం. 7. మం. 1 ॥

స వా ఏష ఏతేన దైవేన చక్షుషా మనసైతాన్ కామాన్ పశ్యన్ రమతే ॥
య ఏతే బ్రహ్మలోకే తం వా ఏతం దేవా ఆత్మానముపాసతే
తస్మాత్తేషాగ్ం సర్వే చ లోకా ఆత్తాః సర్వే చ కామాః స సర్వాగ్ం
శ్చ లోకానాప్నోతి । సర్వాగ్ంశ్చ కామాన్యస్తమాత్మానమనువిద్య విజానాతీతి ॥

॥ ఛాందోగ్య ప్రపా. 8 ఖం. 12. మం. 5-6 ॥

మఘవన్ మర్త్యం వా ఇదగ్ం శరీరమాత్తం మృత్యునా తదస్యాఽ
మృతస్యాశరీరస్యాత్మనోఽ ధిష్ఠానమాత్తో వై సశరీరః ప్రియా ప్రియాభ్యాం
న వై సశరీరస్య సతః ప్రియాప్రియయోరపహతిరస్త్యశరీరం వావ
సంతం న ప్రియాప్రియే స్పృశతః ॥ ఛాందోగ్య ప్రపా. 8 ఖం. 12. మం. 1 ॥

పరమాత్మను అపహతపాప్ముడు అంటే సమస్త పాపాలకు దూరుడు, పాపం లేనివాడు, ముసలితనం, మృత్యువు, శోకం, ఆకలి, దప్పిక మొదలైనవి లేనివాడు, సత్యకాముడు, సత్యసంకల్పుడు. అతన్నే అన్వేషించి, తెలుసుకొనే కోరిక కలిగి ఉండాలి. ఆ పరమాత్మను తెలిసికొని మోక్షసాధనాలను, తనను శుద్ధపరచుకొనుటనెరిగిన ముక్తజీవుడు పరమాత్ముని సంబంధముతో సమస్త లోకాలను, సమస్త కామాలను పొందుతాడు.

పరమాత్ముని తెలుసుకొని మోక్ష సాధనాలను, తనను శుద్ధం చేసుకొనటాన్ని తెలిసిన ముక్తజీవుడు, శుద్ధమైన దివ్య నేత్రాలతో, శుద్ధ మనస్సుతో కామాలను చూస్తూ, పొందుతూ, రమిస్తూ ఆనందిస్తాడు. బ్రహ్మలోకంలో - అంటే దర్శనీయుడైన పరమాత్మునిలో స్థిరుడై మోక్షాన్ని అనుభవిస్తాడు. ఈ పరమాత్ముడే అందరిలో అంతర్యామియై ఉన్నాడు. ముక్తిని పొందగోరు విద్వాంసులు అతనినే ఉపాసిస్తారు. అందువలన వారికి సమస్త లోకాలు, సర్వ కామాలు ప్రాప్తిస్తాయి. ముక్తజీవులు స్థూల శరీరాన్ని వీడి, సంకల్పమయమైన శరీరంతో ఆకాశంలో పరమేశ్వరునితో విహరిస్తారు. శరీరం గలవారు సాంసారిక దుఃఖాల నుండి విముక్తులు కాలేరు.

ఇంద్రునితో ప్రజాపతి ఇలా అన్నాడు. "పరమ పూజితుడవు, ధనయుక్తుడవు అయిన ఓ పురుషుడా!

ఈ స్థూలశరీరం మరణధర్మం కలిగి ఉన్నది. సింహం నోట్లో మేక ఉన్నట్లు ఈ శరీరం మృత్యుముఖంలో ఉన్నది. కాబట్టి ఈ మరణ ధర్మంగల శరీరం, శరీరం లేని జీవాత్మకు నివాస స్థానం. కాబట్టి ఈ జీవుడు సదా సుఖదుఃఖాలలో మునిగి ఉన్నాడు. ఎందుకంటే శరీరసహితులు సాంసారిక దుఃఖాల నుండి దూరులకారు. కాని శరీరరహితుడైన ముక్తజీవాత్మ బ్రహ్మలో ఉంటుంది. కాబట్టి అతనికి ప్రాపంచిక సుఖదుఃఖాల స్పర్శ కూడా ఉంటుంది. సదా ఆనందంలో ఉంటుంది.

ముక్తినుండి తిరిగి రావటం

ప్రశ్న:- జీవుడు ముక్తిని పొంది మళ్ళీ జన్మమరణరూపమైన దుఃఖంలోనికి ఎన్నడైనా వస్తాడా? లేదా?

ఎందుకంటే:-

న చ పునరావర్తతే న చ పునరావర్తత ఇతి ॥ ఛాందోగ్య ప్రపా. 8 ఖం. 15. మం. 1 ॥

అనావృత్తిః శబ్దాదనావృత్తిః శబ్దాత్ ॥ వేదాం. శారీరక సూత్రం. 4-4-22 ॥

యద్గత్వా న నివర్తంతే తద్ధామ పరమం మమ ॥ భగవద్గీత - 15-6 ॥

ఇలాంటి వచనాల వలన దేనినుండి నివృత్తులై మళ్ళీ సంసారంలోనికి ఎన్నడూ తిరిగిరారో, అదే ముక్తి అని తెలుస్తున్నది.

జవాబు:- ఇది సరైనది కాదు. వేదంలో ఈ మాట నిషేధించబడి ఉన్నది:-

కస్య నూనం కతమస్యామృతానాం మనామహే చారు దేవస్య నామ ।
నో మహ్యా అదితయే పునర్దాత్ పితరం చ దృశేయం మాతరం చ ॥ ఋగ్వే. 1-24-1 ॥

మేము ఎవరి నామాన్ని పవిత్రమని భావించాలి? నాశరహిత పదార్థాలలో వర్తమానుడై సదా ప్రకాశస్వరూపుడై ఉన్న దేవుడు ఎవడు? మోక్ష సుఖాన్ని అనుభవించేలా చేసి మళ్ళీ మాకు ఈ ప్రపంచంలో జన్మనిచ్చేవాడు, తల్లిదండ్రులను దర్శింపచేసేవాడు ఎవడు?

(ఈ పై మంత్రంలో ప్రశ్నలున్నాయి. వాటికి సమాధానాలు ఈ క్రింది మంత్రంలో ఉన్నాయి)

అగ్నేర్వయం ప్రథమస్యామృతానాం మనామహే చారు దేవస్య నామ ।
స నో మహ్యా అదితయే పునర్దాత్ పితరం చ దృశేయం మాతరం చ ॥ ఋగ్వే. 1-24-2 ॥

మనం ఈ సర్వప్రకాశ స్వరూపుడు, అనాది, సదా ముక్తుడు అయిన పరమాత్ముని నామాన్నే పవిత్రంగా తెలుసుకోవాలి. అతడే ముక్తిలో మనతో ఆనందాన్ని అనుభవింపజేసి, మళ్ళీ భూమిపై తల్లిదండ్రుల సంబంధంలో జన్మను పొంది, తల్లిదండ్రుల దర్శనం కలిగించే పరమాత్ముడు, అతడే ముక్తియొక్క వ్యవస్థను చేస్తూ సమస్తానికి స్వామియై ఉన్నాడు.

ఇదానీమివ సర్వత్ర నాత్యంతోచ్ఛేదః ॥ సాంఖ్య 1-160 ॥

ఇప్పుడు బంధ, ముక్తజీవులున్నట్లే సర్వదా ఉంటారు. బంధమోక్షాలకు ఎన్నడూ అత్యంత విచ్ఛేదం ఉండదు. బంధం కాని, మోక్షం కాని సదా ఉండదు.

ప్రశ్న:- **తదత్యంతవిమోక్షోఽ పవర్గః ॥** న్యాయదర్శ. 1-1-22 ॥

దుఃఖజన్మప్రవృత్తిదోషమిథ్యాజ్ఞానానాముత్తరోత్తరాపాయే తదనంతరాపాయాదపవర్గః ॥

న్యాయదర్శ. 1-1-2 ॥

దుఃఖంయొక్క అత్యంత విచ్ఛేదమే 'ముక్తి' అనబడుతుంది. మిథ్యాజ్ఞానమైన అవిద్య, లోభాది దోషాలు, విషయాలు, దుష్ట వ్యసనాలలో ప్రవృత్తి, జన్మం, దుఃఖం అనే వీటిలో ఉత్తరోత్తరంగా ఒకదాని వెనుక ఒకటి విడిపోయి పూర్వపూర్వాలు నివృత్తి అవటం వలననే శాశ్వత మోక్షం కలుగుతుంది. అంటే మిథ్యాజ్ఞానం పోయిన దోషాలు పోతాయి. అవి పోయిన ప్రవృత్తి పోతుంది. అది పోయిన జన్మం పోతుంది. అది పోయిన దుఃఖాలు పోతాయని అభిప్రాయం.

జవాబు:- అత్యంతం అనే శబ్దంతో అత్యంతాభావాన్నే గ్రహించవలసిన అవసరంలేదు. **"అత్యంతం దుఃఖమత్యంతం సుఖం వాస్య వర్తతే"** ఈ మానవునికి అత్యంత దుఃఖమో, అత్యంత సుఖమో ఉన్నది. ఇతనికి అధిక సుఖం, అధిక దుఃఖం ఉన్నదనే తెలుస్తున్నది. అలాగే ఇక్కడ కూడా అత్యంత శబ్దానికి అర్థం 'బహు' అని తెలుసుకోవాలి.

ముక్తి కాలం

ప్రశ్న:- ముక్తినుండి జీవుడు తిరిగి వస్తే అతడు ఎంతకాలం ముక్తిలో ఉన్నట్లు?

జవాబు:- తే బ్రహ్మ లోకే హ పరాంతకాలే పరామృతాత్ పరిముచ్యంతి సర్వే ॥

ముండక 3-2-6॥

ఇది ముండకోపనిషత్‌యొక్క వాక్యం. ముక్తజీవులు ముక్తిని పొంది బ్రహ్మలో ఒక పరాంతకాలం వరకు ఆనందాన్ని అనుభవించి తిరిగి మహాకల్పానంతరంలో మోక్షసుఖాన్ని వదలి సంసారంలోకి వస్తారు. మోక్షకాలపు లెక్క ఈ విధంగాఉన్నది:-

నలభైమూడు లక్షల ఇరవైవేల (43,20,000) సంవత్సరాలకు ఒక చతుర్యుగం. రెండువేల చతుర్యుగాలైన బ్రహ్మకు అహోరాత్రం. ఇలాంటి ముప్పై అహోరాత్రాలు కలిపి ఒక మాసం. ఇలాంటి పన్నెండు మాసాలకు ఒక సంవత్సరం. ఇలాంటి బ్రహ్మ శతసంవత్సరాలకు ఒక పరాంతకాలం. ఇంతకాలం మోక్షసుఖాన్ని అనుభవిస్తారు. దీనిని గణిత రీతిని చక్కగా తెలుసుకోండి.

1 చతుర్యుగం = 43,20,000 సం ॥, 1 బ్రహ్మ అహోరాత్రం = 2000 చతుర్యుగాలు,

1 పరాంతకాలం = 1 బ్రహ్మ శత సంవత్సరాలు = 100 × 12 × 30 × 2000

చతుర్యుగాలు = 64 × 106 × 4.32 × 106 సం॥ = 2.7648 × 1014 సం॥

ప్రశ్న:- మళ్ళీ జనన మరణాల పరంపరకు ఎన్నడూ రారనే కదా ప్రపంచ ప్రజలందరూ, గ్రంథకారులు అభిప్రాయపడుతున్నారు?

జవాబు:- అలా ఎన్నడూ జరగదు. జీవుని సామర్థ్యం శరీరాది పదార్థాలు, సాధనాలు పరిమితాలు. పరిమితమైనవాని ఫలితం అనంతంగా ఉండలేదు. అనంత ఆనందాన్ని అనుభవించటానికి, అపరిమిత సామర్థ్యం, అపరిమిత కర్మలు, అపరిమితమైన సాధనాలు జీవునిలో లేవు. కాబట్టి అనంతసుఖాన్ని అనుభవించలేడు. దేని సాధనాలు అనిత్యములో దాని ఫలితాలు కూడా అనిత్యములే. ముక్తినుండి జీవులు మళ్ళీ ప్రపంచానికి రాకపోతే, జీవులు నిశ్శేష్టులవటమేగాక ప్రపంచం నిశ్శేషమవుతుంది.

జీవుల కర్మానుసారం ముక్తి

ప్రశ్న:- ఎందరు జీవులు ముక్తి చెందుతారో అందరు క్రొత్త జీవులను ఈశ్వరుడు ప్రపంచంలో పుట్టిస్తాడు. కావున నిశ్శేషం కాదు.

జవాబు:- అలాగైతే జీవులు అనిత్యులవుతారు. పుట్టేది తప్పక నశిస్తుంది. మీ అభిప్రాయానుసారంగా జీవుడు ముక్తిని పొంది నశిస్తాడు. ముక్తి అనిత్యమైపోయింది. ముక్తిలో గుంపు ఎక్కువై త్రోపుడు అధికమవుతుంది. వచ్చేవారి సంఖ్య అధికమై పోయేవారి సంఖ్య అసలే ఉండకపోవడం వలన వృద్ధికి అంతమనేది ఉండదు. దుఃఖానుభవంలేనిదే, సుఖమనేది ఉండదు. కారం లేకున్న తీపియొక్క తీపి లేకపోతే కారంయొక్క రుచే తెలియదు. ఒక రుచికి మరొకటి విరుద్ధంగా ఉన్నపుడే, రెండింటియొక్క పరీక్ష జరుగుతుంది. ఒక మానవుడు సదా మధురాలైన పదార్థాలనే తిని త్రాగుతూ ఉన్నవానికి ఇతర రుచులన్నింటిని ఆస్వాదించేవానికి ఉన్నంత సుఖం ఉండదు. ఈశ్వరుడు అనంతాలైన కర్మలకు అనంతాలైన ఫలితాలనిస్తే అతని న్యాయం నశిస్తుంది. ఎవడెంత భారం మోయగలుగుతాడో వానిపై అంత భారాన్నే పెట్టటం బుద్ధిమంతుల పని. ఒక మణుగు భారాన్ని మోయగలిగేవాని తలపై పది మణుగుల భారం ఉంచేవాడు నిందితుడవుతాడు. అలాగే అల్పజ్ఞుడు, అల్ప సామర్థ్యాన్నిగల జీవునిపై అనంత సౌఖ్యభారాన్ని పెట్టటం ఈశ్వరునికి తగదు. క్రొత్త జీవులను ఈశ్వరుడు ఉత్పన్నం చేస్తే, ఏ కారణం వలన జీవులు ఉత్పన్నులవుతారో అది వ్యర్థమవుతుంది. ఎంత గొప్ప ధనాగారమైనా సరే దానిలో ఆదాయం లేకుండా వ్యయమే జరుగుతున్న అది ఎప్పుడో ఒకప్పుడు దివాలా తీయవలసి వస్తుంది. అందుకే ముక్తి చెందటం, తిరిగి అక్కడి నుండి రావటం అనే వ్యవస్థే బాగున్నది. కొద్దిరోజుల కారాగార శిక్ష కన్న ఆజీవన కారాగార దండన గాని, మరణ దండన గాని మంచిదని ఎవరైనా అనగలరా? ముక్తి నుండి రానే రాకుంటే జన్మం కారాగారంవంటిదవుతుంది. దీనికి గల వ్యత్యాసమేంటంటే అక్కడ కూలీపని చేయవలసి ఉండదు. బ్రహ్మలో లీనమవటం అంటే సముద్రంలో మునిగి చావటం అన్న యర్థం.

జీవుడు ఈశ్వర సదృశుడెన్నడు కాడు

ప్రశ్న:- పరమేశ్వరుడు నిత్యముక్తుడు. పూర్ణసుఖియైనట్లే జీవుడు కూడా నిత్యముక్తుడు, సుఖీ అయిన ఏమీ దోషమే ముండదు కదా?

జవాబు:- పరమేశ్వరుడు అనంతస్వరూపుడు. అనంతసామర్థ్యం కలవాడు. అనంత గుణ, కర్మ, స్వభావాలు కలవాడు అవటం వలన అతడెన్నడూ అవిద్యా సంబంధమైన దుఃఖబంధనాలకు గురికాడు. జీవుడు ముక్తుడైకూడ పరిశుద్ధ స్వరూపుడు, అల్పజ్ఞుడు, పరిమిత గుణ, కర్మ, స్వభావాలు కలవాడుగానే ఉంటాడు. పరమేశ్వరునివంటివాడు ఎన్నడూ కాలేడు.

ముక్తి జన్మమరణం వంటిది కాదు

ప్రశ్న:- అలాగైతే ముక్తి జన్మమరణాలతో సమానమే అవుతుంది. కాబట్టి దానికై శ్రమించటం వ్యర్థం.

జవాబు:- ముక్తి జన్మమరణాలవంటిది కాదు. ఎందుకంటే, ముప్పైఆరు వేల (36,000) సార్లు సృష్టి ప్రళయాలు అవటానికి ఎంతకాలం పడుతుందో అంతకాలం జీవులు ముక్త్యానందాన్ని అనుభవిస్తూ, దుఃఖాన్ని చెందకుండా ఉండటం అనేది స్వల్పవిషయమా? ఈ రోజు తిని త్రాగితే రేపు మరల ఆకలి అవుతూనే ఉన్నది కదా! మళ్ళీ దాన్ని తొలగించటానికి ఉపాయమెందుకు చేస్తావు? క్షుద్రాలైన ఆకలి, దప్పిక, ఐశ్వర్యాలు, రాజ్యం, ప్రతిష్ఠ, స్త్రీ, సంతానం మొదలైనవానికే ఇంతటి ప్రయత్నం అవసరమైతే ముక్తికై ఎంతగా ప్రయత్నించాలి? మరణించటం తప్పనిసరియైనప్పటికీ జీవనోపాయాలను చేస్తూనే ఉన్నాం. అలాగే ముక్తినుండి తిరిగి జన్మించవలసి వచ్చినా, దానికై ప్రయత్నించటం అత్యంతావశ్యకం కాదా?

సాధన చతుష్టయం

ప్రశ్న:- ముక్తికై చేయవలసిన సాధనాలు ఏవి?

జవాబు:- కొన్ని సాధనాలు ఇదివరకే వ్రాయబడ్డాయి. కాని విశేష ఉపాయాలు - ప్రయత్నాలు చెబుతున్నాను. ముక్తిని కోరేవాడు - ముముక్షువు దుఃఖఫలాన్ని ఇచ్చే మిథ్యాభాషణాది పాపకర్మలను వీడి, సుఖరూప ఫలాన్నిచ్చే సత్యభాషణాది ధర్మాచరణాన్ని తప్పక పాటించాలి. దుఃఖాలనుండి విడిపోయి, సుఖప్రాప్తిని పొందాలనేవాడు అధర్మాన్ని వీడి ధర్మాన్ని తప్పక పాటించాలి. దుఃఖానికి పాపాచరణ, సుఖానికి ధర్మాచరణ మూలకారణం.

సజ్జనుల సాంగత్యంవలన సత్య - అసత్యాలను, ధర్మ-అధర్మాలను, కర్తవ్య-అకర్తవ్యాలను వేరు వేరుగా తెలుసుకోవాలి. శరీరం, జీవుడు, పంచకోశాలు అనే వాటిని గూర్చి వివేచించి గ్రహించాలి.

పంచకోశాలు:

1. 'అన్నమయకోశం':- చర్మం మొదలుకొని అస్థివరకు గల సముదాయం. ఇది పృథ్వీ తత్వం కలది. ఇది అన్నమయకోశం.

2. 'ప్రాణమయ కోశం':- దీనిలో లోపలినుండి బయటికి వెళ్ళే 'ప్రాణం', బయటినుండి లోనికి పోవు 'అపానం', నాభిస్థానంలో ఉండి, శరీరమంతటా రసాన్ని వ్యాపింపజేసే 'సమానం', కంఠంలో ఉండి ఆహార పానీయాలను లోనికి ఆకర్షించి బలపరాక్రమాలను కలిగించే 'ఉదానం', శరీరం అంతటా వ్యాపించి జీవుడు శరీరంలో ఆ యా కర్మలను చేయటానికి తోడ్పడు 'వ్యానం', అను పంచ ప్రాణాలున్నాయి.

3. **'మనోమయకోశం':-** దీనిలో మనస్సుతో పాటు అహంకారం వాక్, పాద, పాణి, పాయు, ఉపస్థలను పంచ కర్మేంద్రియాలు ఉన్నాయి.

4. **'విజ్ఞానమయకోశం':-** దీనిలో బుద్ధి చిత్తం శ్రోత్ర, త్వక్, నేత్ర, జిహ్వా, నాసికలనే పంచ జ్ఞానేంద్రియాలు ఉన్నాయి. వీటితో జీవుడు జ్ఞానాది వ్యవహారాలను చేస్తాడు.

5. **'ఆనందమయ కోశం':-** దీనిలో ప్రీతి, ప్రసన్నత, అల్పానందం, అధికానందం, ఆనందానికి ఆధారమైన కారణరూప ప్రకృతి ఉంటుంది. ఈ ఐదూ 'పంచకోశాలు' అనబడతాయి. వీనితో జీవుడు సమస్త కర్మ, ఉపాసన, జ్ఞానాది వ్యవహారాలను చేస్తుంటాడు.

మూడు విధాలైన అవస్థలు:- ఒకటి జాగ్రదవస్థ, రెండవది స్వప్నావస్థ, మూడవది సుషుప్త్యవస్థ.

మూడు విధాలైన శరీరాలు:- ఒకటి కనిపించే **'స్థూలశరీరం'**, రెండవది పంచ ప్రాణాలు, పంచ జ్ఞానేంద్రియాలు, పంచసూక్ష్మభూతాలు, మనస్సు బుద్ధి అనే ఈ పదిహేడు తత్వాలతో కూడిన **'సూక్ష్మశరీరం'**. ఇది రెండు విధాలు. ఒకటి సూక్ష్మభూతాల అంశాలతో ఏర్పడిన**భౌతిక సూక్ష్మశరీరం'.** రెండవది జీవుని స్వాభావిక గుణరూపమైన **'అభౌతిక సూక్ష్మశరీరం'**. ఇది ముక్తిలో ఉంటుంది. ఈ అభౌతిక సూక్ష్మశరీరంతోనే జీవుడు ముక్తిలో సుఖాన్ని అనుభవిస్తాడు. ఈ ద్వివిధమైన సూక్ష్మశరీరం జన్మమరణాలలోని జీవునితో ఉంటుంది. మూడవది **'కారణశరీరం'** దీనిలో జీవుడు సుషుప్తిని - గాఢనిద్రను పొందుతాడు. ఇది ప్రాకృతికమవటం వలన సర్వత్ర వ్యాపించి 'విభువై' సమస్త జీవులకు ఒకే విధంగా ఉంటుంది. నాల్గవది **'తురీయ శరీరం'** అనబడుతుంది. దీనిలో జీవులు సమాధ్యవస్థను పొంది పరమాత్ముని ఆనందస్వరూపంలో నిమగ్నులవుతారు. ఈ సమాధి సంస్కారజన్యమైన శుద్ధ శరీరపరాక్రమం ముక్తిలోనే యథావిధిగా సహాయపడుతుంది.

ఈ సమస్త కోశాల నుండి, అవస్థల నుండి జీవుడు వేరుగా ఉన్నాడు. అవస్థల నుండి జీవుడు వేరుగా ఉన్నాడనే విషయం అందరికీ తెలిసిన విషయమే. ఎందుకంటే మృత్యువును పొందినపుడు

జీవుడు వెళ్ళిపోయాడని అందరూ అంటారు. ఈ జీవుడే అన్నింటిని ప్రేరేపించేవాడు, అన్నింటిని ధరించేవాడు, సాక్షి, కర్త, భోక్తయై ఉన్నాడు. జీవుడు కర్తా, భోక్తా కాడని చెప్పేవారు అజ్ఞానులు, అవివేకులనీ భావించండి. ఎందుకంటే జీవుడు లేకపోతే ఈ జడపదార్థాలన్నింటికి సుఖదుఃఖాల అనుభవంగాని, పాపపుణ్యాల కర్తృత్వం గాని ఎన్నడూ ఉండదు. వీటి సంబంధంచేతనే జీవుడు పాపపుణ్యాల కర్తా, సుఖ దుఃఖాల భోక్తా అవుతున్నాడు.

ఇంద్రియాలు అర్థాలతోను, మనస్సు ఇంద్రియాలతోను, ఆత్మ మనస్సుతోను సంయుక్తమైనపుడు జీవుడు ప్రాణాలను ప్రేరేపించి, మంచి, చెడు కర్మలను చేసినపుడు ఆత్మ బహిర్ముఖమవుతుంది. అప్పుడు మంచి కార్యాలు చేయునపుడు లోపలినుండి 'ఆనందం, ఉత్సాహం, నిర్భయత్వం' కలుగుతుంది. చెడు కార్యాలు చేయునపుడు 'భయం, శంక, లజ్జ మొదలైనవి' ఉత్పన్నమవుతాయి. ఇది అంతర్యామి అయిన పరమేశ్వరుని ప్రబోధం. ఈ ఆత్మ బోధకు అనుకూలంగా ప్రవర్తించేవాడే ముక్తి జన్యసుఖాన్ని పొందుతాడు. దీనికి విపరీతంగా ప్రవర్తించేవాడు బంధ జన్య దుఃఖాలను అనుభవిస్తాడు.

ద్వితీయ సాధనం - వైరాగ్యం

రెండవ సాధనం 'వైరాగ్యం':- వివేక బుద్ధితో సత్యాసత్యాలను వేరువేరుగా తెలుసుకొని, సత్యాచరణ చేస్తూ, అసత్యాచరణాన్ని త్యజించాలి. పృథ్వి మొదలుకొని పరమేశ్వర పర్యంతంగల పదార్థాలను వాటి గుణ, కర్మ, స్వభావాలను తెలుసుకొని, పరమాత్మని ఆజ్ఞలను పాలిస్తూ, ఉపాసనలో తత్పరుడవుతూ, అతనికి విరుద్ధంగా ప్రవర్తించక, సృష్టినుండి ఉపకారాన్ని పొందటం వివేకం - 'వైరాగ్యం' అవుతుంది.

మూడవ సాధనం - షట్క సంపత్తి

మూడవ సాధనం 'షట్క సంపత్తి':- అంటే ఆరు విధాలైన కర్మలను చేయటం. ఒకటి **శమం:-** తన ఆత్మను అంటే అంతఃకరణాన్ని అధర్మాచరణం నుండి తొలగించి సదా ధర్మాచరణంలో ప్రవర్తింపజేయటం. రెండవది **దమం:-** శ్రోత్రాది ఇంద్రియాలను, శరీరాన్ని వ్యభిచారాది దుర్వ్యవహారాలనుండి దూరంచేసి జితేంద్రియత్వాది శుభకర్మలలో ప్రవర్తింపజేయటం; మూడవది **ఉపరతి:-** దుష్టకర్మలు చేసే దుర్మార్గుల నుండి దూరంగా ఉండటం నాల్గవది**తితిక్ష:-** నిందాస్తుతులు, హాని లాభాలు ఎన్ని కలిగినా, హర్షశోకాలను వీడి ముక్తిసాధనాలందే నిరంతరం నిమగ్నమైయుండటం; ఐదవది **శ్రద్ధ:-** వేదాది సత్యశాస్త్రాలలో, వాటిని తెలిసిన పూర్ణ ఆప్తులు, విద్వాంసులు, సత్యోపదేష్టలు అయిన మహాశయుల వచనాలలో విశ్వాసముంచటం; ఆరవది**సమాధానం:-** చిత్తం యొక్క ఏకాగ్రత ఈ ఆరూ కలిసి మూడవ సాధనం అవుతుంది.

నాల్గవ సాధనం - ముముక్షుత్వం

నాల్గవ సాధనం ముముక్షత్వం:- ఆకలి దప్పులు ఉన్నవానికి అన్న జలాలు తప్ప మరొకటి ఇష్టం కాదు. అలాగే ముక్తిః ముక్తి సాధనాలలో, ముక్తిలో తప్ప మరొకదానిలో ప్రీతిలేకుండటం ముముక్షుత్వమనబడుతుంది. ఈ నాలుగు 'సాధనచతుష్టయం' అవుతుంది.

అనుబంధ చతుష్టయం

పైన తెలిపిన సాధన చతుష్టయం తర్వాత చేయవలసిన నాలుగు అనుబంధ కర్మలున్నాయి.

ఒకటి-అధికారి:- పైన తెలిపిన నాలుగు సాధనాలతో కూడిన పురుషుడే మోక్షానికి అధికారి అవుతాడు.

రెండవది 'సంబంధం':- బ్రహ్మ ప్రాప్తిరూప ముక్తి ప్రతిపాద్యమనీ వేదాదిశాస్త్రాలు ప్రతిపాదకాలనీ యథారీతిగా బాగా తెలుసుకొని అన్వితం చేయటం.

మూడవది 'విషయి':- సమస్త శాస్త్రాలకు ప్రతిపాదిత విషయం బ్రహ్మం. ఆ బ్రహ్మప్రాప్తిరూప విషయంగల పురుషునికి 'విషయి' అని పేరు.

నాల్గవది 'ప్రయోజనం':- సమస్త దుఃఖాల నివృత్తి జరిగి పరమానందాన్ని పొంది ముక్తిసుఖాన్ని అనుభవించటం అనే ఈ నాలుగు 'అనుబంధ చతుష్టయం' అవుతుంది.

శ్రవణ చతుష్టయం

శ్రవణ చతుష్టయం:- ఒకటి శ్రవణం:- విద్వాంసులెవరైనా ఉపదేశించునపుడు శాంతంగా ఏకాగ్రతతో, ధ్యానంతో వినాలి. విశేషంగా బ్రహ్మవిద్యను వినేటప్పుడు మిక్కిలి ధ్యానాన్ని పెట్టాలి. ఈ విద్య అన్ని విద్యలకంటే సూక్ష్మమైనది.

రెండవది 'మననం':- విన్న తర్వాత, ఏకాంత ప్రదేశంలో కూర్చొని, విన్నదాన్ని విచారించాలి. ఏ విషయంలోనైనా శంక - సందేహం కలిగితే గురువును అడగాలి. వింటున్నప్పుడే వక్త, శ్రోత ఉచితమని అనుకుంటే అడిగి సమాధానాన్ని తెలుసుకోవాలి.

మూడవది 'నిధిధ్యాసనం':- శ్రవణమననాలవలన ఒక విషయంలో నిస్సందేహం కలిగినపుడు ఏకాగ్రచిత్తుడై, సమాధిస్థుడై తాను విన్నది, మననం చేసినది, అలాగే ఉన్నదా లేదా అని ధ్యానయోగంతో తెలుసుకోవాలి.

నాల్గవది సాక్షాత్కారం:- పదార్థం యొక్క స్వరూపం, గుణాలు, స్వభావాన్ని ఉన్నది ఉన్నట్లుగా యథాతథంగా తెలుసుకోవటం. ఈ నాలుగూ 'శ్రవణ చతుష్టయం' అవుతాయి.

తమోగుణాలు-అంటే క్రోధం, మాలిన్యం, ఆలస్యం, ప్రమాదాలు మొదలైనవాటి నుండీ, రజోగుణాలు-అంటే ఈర్ష్య, ద్వేష, కామ, అభిమాన, నిక్షేపాది దోషాలనుండి దూరంగా వెళ్ళి, సత్త్వ గుణాలు అంటే, శాంత ప్రకృతి, పవిత్రత, విద్య, ఆలోచన మొదలైన గుణాలను కలిగి ఉండాలి.

మైత్రి = సుఖంగా ఉన్నవారితో మిత్రత్వం; **కరుణ** = దుఃఖంతో ఉన్నవారిపట్ల దయ; **ముదిత** = పుణ్యాత్ముల పట్ల సంతోషం; **ఉపేక్ష** = దుష్టాత్ముల పట్ల ప్రీతిగాని, వైరాన్నిగాని లేకుండా ఉండటం, అనే ఈ నాలుగు గుణాలను కలిగి ఉండాలి. ముముక్షువు అయినవాడు ప్రతినిత్యం కనీసం రెండు గంటలైనా తప్పకుండా ధ్యానాన్ని చేయాలి. దానివలన తన లోపలి మనస్సు మొదలైన పదార్థాలు సాక్షాత్కారాలవుతాయి.

చూడండి! మనం చేతనస్వరూపులం. కాబట్టే జ్ఞానస్వరూపులమై మనస్సుకు సాక్షిగా ఉన్నాము. మనస్సు శాంతంగా, చంచలంగా, ఆనందంగా, విషాదంగా ఉన్నపుడు దానిని యథారీతిగా చూస్తున్నాము. అలాగే ఇంద్రియాలు, ప్రాణాలు మొదలైనవానిని తెలిసికొంటూ, పూర్వం చూసినవాటిని స్మరిస్తూ, ఒకే సమయంలో అనేక పదార్థాలను తెలుసుకుంటూ, ధారణ, ఆకర్షణలను కావిస్తూ అన్నింటికి జీవుడు వేరుగా ఉన్నాడు. ఇలా వేరుగా ఉండకుంటే స్వతంత్రకర్తయై వానికి ప్రేరకుడు అధిష్ఠాతయూ ఎన్నటికీ కాలేడు.

అవిద్యాఽస్మితారాగద్వేషాభినివేశాః పంచక్లేశాః ॥ యోగశాస్త్రం 2-3 ॥

'అవిద్య, అస్మిత, రాగం, ద్వేషం, అభినివేశం' అనేవి పంచ క్లేశాలు. అవిద్యయొక్క స్వరూపం ఇంతకుపూర్వమే తెలుపబడింది. వేరుగా ఉండే బుద్ధిని ఆత్మకంటే భిన్నంగా అనుకోవడం **'అస్మిత'** అవుతుంది. సుఖప్రీతిని **'రాగం'** అంటారు. దుఃఖంలో అప్రీతి కలిగి ఉండటం **'ద్వేషం'**. ప్రాణి మాత్రులందరికి 'నేను సదా శరీరస్థుడనై చావకుండా ఉండాలి' అనే కోరిక ఉంటుంది. కాబట్టి మృత్యువంటే భయం కలుగుతుంది, ఈ మృత్యు దుఃఖ భయమే **'అభినివేశం'** అవుతుంది. యోగాభ్యాసం, విజ్ఞానం వలన ఈ పంచక్లేశాలను దూరపర్చుకొని బ్రహ్మప్రాప్తిని పొంది, ముక్తియొక్క పరమానందాన్ని అనుభవించాలి.

ఇతర మతాలవారి 'ముక్తి' సమాలోచనం

ప్రశ్న:- మీరు నమ్మే ముక్తిని ఇతరులెవ్వరూ నమ్మరు. చూడండి:- జైనులు శివపురానికి వెళ్ళి 'మోక్షశిలపై నిశ్శబ్దంగా కూర్చోవటమే మోక్షం' అంటారు. క్రైస్తవులు 'నాల్గవ ఆకాశాన్ని చేరి అక్కడ వివాహాలు, పోట్లాటలు, వాయిద్యాలు, సంగీతం, వస్త్రధారణాది ఆనందాన్ని భోగించటమే ముక్తి' అంటారు. ఇలాగే ముసల్మానులు 'ఏడవ ఆకాశాన్ని', వామమార్గులు 'శ్రీ పురాన్ని', శైవులు 'కైలాసాన్ని', వైష్ణవులు 'వైకుంఠా'న్ని, గోకులీయ గోసాయిలు గోలోకాన్ని చేరి అక్కడ సుందర స్త్రీలను, అహార పానీయాలను, వస్త్రాలను ఉత్తమ స్థానాలను పొంది ఆనందంగా ఉండటమే 'ముక్తి' అని భావిస్తారు. పౌరాణికులు "సాలోక్యం = ఈశ్వరుని లోకంలో నివసించటం; సానుజ్యం = తమ్మునిలాగా ఈశ్వరునితో కూడి ఉండటం; సామీప్యం = సేవకుని లాగా ఈశ్వరుని సమీపంలో ఉండటం; సాయుజ్యం = ఈశ్వరునిలో కలిసిపోవుట" అనే నాలుగు విధాల ముక్తిని అంగీకరిస్తారు. వేదాంతులు 'బ్రహ్మమందు లీనమవటాన్ని మోక్షం'గా భావిస్తారు.

జవాబు:- పన్నెండవ సముల్లాసంలో జైనుల విషయం, పదమూడవ సముల్లాసంలో క్రైస్తవుల విషయం, పద్నాల్గవ సముల్లాసంలో మహమ్మదీయుల విషయం వారి వారి ముక్తి మొదలైన విషయాలు విశేషంగా వ్రాయబడ్డాయి. వామమార్గులు శ్రీపురానికి వెళ్ళి అక్కడ లక్ష్మీదేవి వంటి స్త్రీలతో మద్యపానాన్ని చేస్తూ, మాంసాలను భుజిస్తూ, రాగభోగాలను అనుభవిద్దామని భావిస్తారు. ఇక్కడి భోగాలకన్న అక్కడ అవి విశేషమైనవి కావు. అలాగే మహాదేవుని వంటి, విష్ణువు వంటి స్వరూపం గలవారై పార్వతి, లక్ష్మీదేవి వంటి స్త్రీలతో కలసి ఆనందభోగాలను అనుభవిస్తారంటే అది ఇక్కడి ధనాఢ్యుల కంటే, రాజుల కంటే అధికమైనది కాదు. అక్కడ వ్యాధులుండవనీ ఎప్పటికీ యువావస్థయందే ఉంటారనీ ఇదే విశేషమని వారు వ్రాసారు. వారి ఈ మాటలన్నీ అసత్యాలు. 'భోగమెక్కడ ఉంటుందో రోగమక్కడ ఉంటుంది. ఎక్కడ రోగమో అక్కడ వృద్ధావస్థాదులు తప్పక ఉంటాయి'.

ఇక పౌరాణికులతో ఇలా అనాలి. మీరు నమ్ముతున్న చతుర్విధ మోక్షం క్రిమి కీటకాలకు, పశు పక్షాదులకు స్వతఃసిద్ధంగా కలుగుతున్నది కదా! ఎందుకంటే, సమస్త లోకాలు ఈశ్వరునివి. సమస్త జీవులు వానిలోనే నివసిస్తున్నాయి. అందుకే ఎలాంటి ప్రయత్నం లేకుండా అనాయాసంగా 'సాలోక్య' ముక్తి వీనికి ప్రాప్తిస్తున్నది. ఈశ్వరుడు సర్వత్ర వ్యాపించి ఉండటం వలన సర్వం అతనికి సమీపంలోనే ఉన్నందున 'సామీప్య' ముక్తీ స్వతఃసిద్ధంగా లభిస్తున్నది. జీవుడు ఈశ్వరుని కంటే సర్వ విధాల చిన్నవాడూ, చేతనుడూ అవటం వలన బంధువువంటివాడు. కాబట్టి 'సానుజ్య' ముక్తి ప్రయత్నించకుండానే సిద్ధిస్తుంది. సమస్త జీవులు సర్వ వ్యాపకుడైన ఈశ్వరునిలో వ్యాప్తులు అవటం వలన సంయుక్తులై ఉన్నారు. కాబట్టి 'సాయుజ్య' ముక్తి స్వతఃసిద్ధంగానే ఏర్పడి ఉన్నది.

ఇతర సామాన్యులైన నాస్తికులు 'మరణించిన తర్వాత తత్త్వాలలో తత్త్వాలు కలిగి ఉండటమే పరమ ముక్తి' కలుగుతున్నదని నమ్ముతున్నారు. ఇలాంటి ముక్తి కుక్కలకూ, గాడిదలవంటి పశువులకూ ప్రాప్తిస్తున్నది. ఇవన్నీ ముక్తులుకావు. ఇది ఒక విధమైన బంధనం. ఎందుకంటే వీరందరు 'శివపురం, మోక్షశిల, నాల్గవ ఆకాశం, ఏడవ ఆకాశం, శ్రీపురం, కైలాసం, వైకుంఠం, గోలోకం' మొదలైన స్థలాలలో ఏదో ఒక ప్రదేశాన్ని ముక్తి విశేషంగా భావిస్తారు. ఆ యా విశేష స్థానాలనుండి వారు వేరైతే వారి ముక్తి కూడా తొలగిపోతుంది. నాలుగు గోడల మధ్య 'దృష్టిబంధన' మనే ఏకాంత జైలుశిక్ష లాగా వీరూ బంధనంలోనే ఉంటారు. 'ముక్తి' అంటే ఇష్టం వచ్చిన చోట విహరిస్తూ, నిరాటంకంగా, నిర్భయంగా, నిశ్చయంగా, దుఃఖం లేకుండా ఉండటం అని అర్థం. 'జన్మం' అంటే ఉత్పత్తి, 'మరణం' అంటే ప్రళయం. సమయం వచ్చినపుడు జన్మమెత్తుతారనటం సత్యం.

జనన మరణాల సమీక్ష

ప్రశ్న:- జన్మం ఒక్కటా? అనేకాలా?

జవాబు:- అనేకాలు.

ప్రశ్న:- అనేకాలైతే పూర్వ జన్మమరణాల గురించిన విషయాలు ఎందుకు జ్ఞాపకముండవు?

జవాబు:- జీవుడు అల్పజ్ఞుడు. త్రికాలదర్శి కాదు. అందుకే జీవునికి పూర్వజన్మమరణాలను గురించిన స్మరణ ఉండదు. జ్ఞానం కలిగించే మనస్సు కూడా ఒకే సమయంలో రెండింటి జ్ఞానాన్ని కలిగించలేదు. పూర్వజన్మం మాట అటుంచండి. ఈ జన్మలో గర్భంలో జీవుడు ప్రవేశించినప్పటినుండి శరీరమేర్పడి జన్మించిన ఐదేండ్ల ప్రాయంవరకూ జరిగిన అనేక విషయాలు, సంఘటనలు ఎలా స్మరణకు రావు? జాగ్రత్, స్వప్నావస్థలలో అనేక వ్యవహారాలను ప్రత్యక్షంగా చూసి, వాటిని గాఢనిద్ర అనబడే సుషుప్త్యావస్థలో ఎలా స్మరించలేము? "పన్నెండేళ్లకు పూర్వం నీవేమి చేసావు? పదమూడవ యేట ఐదవ మాసంలో, తొమ్మిదవ రోజు పదిగంటల సమయంలో ప్రథమ నిమిషంలో నీవు ఏమి చేసావు? అపుడు నీ ముఖం, హస్తాలు, చెవులు, కండ్లు, శరీరం ఏవైపున, ఏ విధంగా ఉన్నాయి? ఆ సమయంలో నీ మనస్సులో ఏ ఆలోచన ఉన్నది?" అని ప్రశ్నించిన మన మేమీ ప్రత్యుతత్తర మీయలేము. ఈ శరీరంలో అంటే ఈ జన్మమందే ఇలాంటి స్థితి ఉంటే పూర్వజన్మ విషయాలను ఎందుకు స్మరించలేమని శంకించటం పసితనపు చేష్టయే అవుతుంది. ఆ విషయాలు స్మరణకు రాకుండటం వల్లనే జీవుడు సుఖంగా ఉన్నాడు. లేకపోతే ఆ యా జన్మల దుఃఖాలను స్మరిస్తూ మిక్కిలి దుఃఖితుడై మరణిస్తాడు. ఎవరైనా పూర్వజన్మలలోని సంఘటనలను తెలుసుకోవాలనుకున్నా తెలుసుకోలేరు. ఎందుకంటే జీవుడు అల్పమైన జ్ఞానం కలవాడు. వీనిని ఈశ్వరుడొక్కడే తెలుసుకొనే యోగ్యత కలవాడు. జీవునికి అలాంటి యోగ్యత లేదు.

ప్రశ్న:- జీవునికి పూర్వజ్ఞానంలేనపుడు ఈశ్వరుడు దండిస్తుంటే జీవులు ఎలా బాగుపడతారు? నేను ఈ పనులను చేసినందుకు ఈ దండన, ఈ ఫలితం లభించిందనే జ్ఞానం ఉన్నప్పుడే ఆ యా పాపాలను చేయకుండా తనను తాను రక్షించుకోగలడు.

జవాబు:- జ్ఞానం ఎన్ని విధాలని మీరు నమ్ముతున్నారు?

ప్రశ్న:- ప్రత్యక్షాది ప్రమాణాలతో ఎనిమిది విధాలుగా జ్ఞానముంటుంది.

జవాబు:- మీరు జన్మించినప్పటి నుండి ఆ యా సమయాలలో రాజ్యాన్ని, ధనాన్ని, బుద్ధిని, విద్యను, దారిద్ర్యాన్ని, నిర్బుద్ధిని, మూర్ఖత్వం మొదలైన సుఖదుఃఖాలను ఈ ప్రపంచంలో చూసి పూర్వజన్మ జ్ఞానాన్ని గురించి ఎందుకు తెలుసుకోరు? ఒక వైద్యునికీ, అవైద్యునికీ ఏదైనా వ్యాధి సంభవిస్తే ఆ వ్యాధి లక్షణాన్ని, కారణాన్ని వైద్యుడు గుర్తిస్తాడే కాని అవిద్వాంసుడైన 'అవైద్యుడు' గుర్తించలేడు. వైద్యుడు వైద్యశాస్త్రాన్ని అభ్యసించాడు. రెండవవాడు దానిని చదువలేదు. కాని జ్వరాది రోగాలు కలిగినప్పుడు అవైద్యుడు కూడా "నేను ఏదో అపథ్యం చేసాను, కాబట్టి నాకు ఈ రోగం కలిగింది అని తెలుసుకొంటాడు కదా! అదే విధంగా ప్రపంచంలో కనిపించే విచిత్రాలైన సుఖ దుఃఖాల వృద్ధి క్షయాలను చూసి అనుమానంతో పూర్వజన్మలు ఉన్నాయని ఎలా తెలుసుకోలేరు?

మరియూ పూర్వజన్మను అంగీకరించకుంటే పరమేశ్వరుడు పక్షపాతి అవుతాడు. ఎందుకంటే, పాపాలు లేకుండా దారిద్ర్యాది దుఃఖాలను, పూర్వ పుణ్యం లేకుండా రాజ్యాన్ని, ధనసంపదలను,

బుద్ధి మొదలైనవి అతడేల జీవునికి ఇచ్చాడు. పూర్వజన్మలలోని పాపపుణ్యాలను అనుసరించి జీవునికి దుఃఖాన్ని సుఖాన్ని ఇవ్వటం వల్లనే పరమేశ్వరుని న్యాయకారిత్వం యథారీతిగా ఉన్నది.

ప్రశ్న:- ఒకే జన్మం ఉంటే పరమేశ్వరుడు న్యాయకారి కావచ్చు. అందరికన్న ఉన్నత ఆధిపత్యంలో ఉన్న రాజు ఏది చేసిన అదే న్యాయం. తోటమాలి తన ఉపవనంలో చిన్న, పెద్దచెట్లను నాటుతాడు. కొన్నింటిని పెరికి పారవేస్తాడు. కొన్నింటిని రక్షిస్తూ వృద్ధిపరుస్తాడు. ఎవరి వస్తువును వారు తమ ఇష్టం వచ్చినట్లు ఉంచుకొంటారు. ఈశ్వరుడు తన ఇష్టం వచ్చినట్లు చేయవచ్చు. అతడు చేసే పనులకు న్యాయవిచారణ చేసి దండన ఇవ్వటానికి మరెవ్వరూ లేరుకదా! అతడు ఎవరికి భయపడతాడు?

జవాబు:- పరమాత్ముడు న్యాయాన్నే కోరుతాడు. న్యాయాన్నే చేస్తాడు. అన్యాయాన్ని ఎన్నడూ చేయడు. కాబట్టే అతడు పూజనీయుడు, గొప్పవాడు. న్యాయవిరుద్ధంగా చేస్తే అతడు ఈశ్వరుడే కాలేడు. తోటమాలి ఆలోచన లేకుండా పెట్టదగని స్థలంలో, మార్గం లేకుండా చెట్లను నాటుతూ, నరుకదగని వాటిని నరుకుతూ, పనికిరాని చెట్లను పెంచుతూ, ఉపయోగపడేవానిని పెంచకపోతే అతడు నిందితుడు అవుతాడు. అలాగే కారణం లేకుండా కార్యాలను చేస్తే ఈశ్వరునికి దోషం కలుగుతుంది. పరమేశ్వరుడు అవశ్యంగా న్యాయయుక్త కార్యాలనే చేస్తాడు. ఎందుకంటే అతడు స్వాభావికంగా పవిత్రుడు, న్యాయకారి. అతడు పిచ్చివానిలాగా కార్యాలు చేస్తే ప్రపంచంలోని శ్రేష్ఠన్యాయాధీశుల కంటే తక్కువవాడై అప్రతిష్ఠ కలవాడవుతాడు. ఈ ప్రపంచంలో యోగ్యతతోఉత్తమ కార్యాలను చేయనివారికి ప్రతిష్ఠను ఇస్తూ, దుష్టకార్యాలు చేయకున్నా దండన విధించేవాడు నిందనీయుడై అప్రతిష్ఠపాలు కాడా? కాబట్టి ఈశ్వరుడు అన్యాయాన్ని ఎన్నడూ చేయడు. అందువలననే అతడు ఎవరికీ భయపడడు.

కర్మానుసారమే భోగం

ప్రశ్న:- పరమేశ్వరుడు ముందే ఎవరికి ఎంత ఇవ్వాలని అనుకుంటే వారికి అంతే ఇస్తాడు. ఎంత పని చేయాలో అంతే చేస్తాడు.

జవాబు:- పరమేశ్వరుని ఆలోచనలు, క్రియలు జీవుల కర్మానుసారంగానే ఉంటాయి. వేరేవిధంగా ఉండవు. విపరీతంగా ఉంటే అతడే అపరాధీ, అన్యాయకారీ అవుతాడు.

ప్రశ్న:- పెద్దలకు పిల్లలకు సుఖ దుఃఖాలు ఒకే విధంగా ఉంటాయి. పెద్దవారికి పెద్ద చింత, చిన్న వారికి చిన్న చింత. ఒకానొక వ్యాపారి లక్షరూపాయల వివాద పరిష్కారానికై పల్లకిలో కూర్చొని తన గృహం నుండి వేసవికాలంలో న్యాయాలయానికి పోతుంటాడు. బజారునుండి అతడు పోతుండటం చూసి కొందరు అజ్ఞానులు "చూడండి పాపపుణ్యాల ఫలం! అతడు ఆనందంగా పల్లకిలో కూర్చున్నాడు. బోయిలు కాళ్ళకు చెప్పులు లేకుండా క్రిందా మీదా మాడ్చే ఎండలో మాడుతూ పల్లకిని మోస్తున్నారు" అని అంటారు. న్యాయాలయం సమీపించిన కొలది వ్యాపారికి అధిక దుఃఖం, సందేహం కలుగుతుంది. పల్లకిని మోసేవారికి ఆనందం కలుగుతుంది. న్యాయాలయం చేరగానే వ్యాపారి 'వకీలు' వద్దకు

వెల్లనా? 'కార్యాలయాధికారి' వద్దకు వెల్లనా? అని "ఈ రోజుల్లో వ్యాజ్యంలో గెలుస్తానో! ఓడుతానో! ఏమవుతానో!" అనీ, అటో ఇటో పోవటానికి ఆలోచిస్తుంటారు. పల్లకి మోసిన బోయీలు చుట్టలు కాలుస్తూ, పరస్పరం మాట్లాడుకొంటూ, ప్రసన్నులై ఆనందంగా నిద్రిస్తారు. గెలిస్తే వ్యాపారికి సంతోషాన్నీ, ఓడిపోతే అధిక దుఃఖాన్ని కలిగిస్తుంది. బోయీలు మాత్రం ఎప్పటిలాగే ఉంటారు. అలాగే సుందరమైన మృదుతల్పంలో (పడకపై) రాజు పడుకొన్నా శీఘ్రంగా అతనికి నిద్రరాదు. కూలీలు రాళ్ళపైనా, మిట్టపల్లాలు గల నేలపై పడుకొన్నా హాయిగా వెంటనే నిద్రిస్తారు. ఇలాగే సర్వత్ర ఉంటుందనీ బుద్ధిమంతులు తెలుసుకొంటారు

జవాబు:- ఇది అజ్ఞానుల తెలివి. ఒక వ్యాపారితో "నీవు పల్లకి మోయి" అనీ, ఒక బోయవానితో 'నీవు పల్లకి మోయక వ్యాపారివికమ్ము' అనుము. వ్యాపారి పల్లకిని మోయటానికి ఇష్టపడడు. బోయవాడు వ్యాపారి అవటానికి ఇష్టపడడు. సుఖ దుఃఖాలు అందరికీ సమానమే అయితే తమ తమ స్థితులను విడిచి పైవాడు క్రిందివాడుగా, క్రిందివాడు పైవాడుగా అవటానికి ఎందుకు ఇష్టపడరు? చూడండి:- ఒక జీవుడు పుణ్యాత్ముడూ, విద్వాంసుడూ, శ్రీమంతుడూ అయిన రాజుయొక్క భార్యగర్భంలో ప్రవేశిస్తాడు. మరొక జీవుడు మహాదరిద్రుడూ, గడ్డి అమ్ముకొని బ్రతుకు కూలిదాని గర్భంలో ప్రవేశిస్తాడు. ఒకనికి తల్లి గర్భంలో ప్రవేశించినప్పటి నుండి సర్వ సుఖాలు లభిస్తాయి. మరొకనికి సమస్త దుఃఖాలే కలుగుతాయి. ఒకనికి జన్మించగానే సుందర సుగంధయుక్త జలాలతో స్నానం చేయించి జాగ్రత్తగా నాడీఛేదన కావించి, యథాయోగ్యంగా దుగ్ధపానాలను కావిస్తారు. అతడు పాలు త్రాగదలిస్తే అతనికి యథేష్టంగా పాలలో చక్కెర కలిపి ఇస్తారు. అతనిని సంతోషపెట్టటానికి దాసీలు ఆటవస్తువులు, వాహనాలు, లాలన పాలనలు లభిస్తాయి. మరొకని పుట్టుక అడవిలో జరుగుతుంది. స్నానం చేయించటానికి నీరు దొరకదు. అతడు పాలు త్రాగాలనుకుంటే పాలకు బదులుగా పిడికిలి గ్రుద్దులు, అరచేతి దెబ్బలు తాకుతాయి. అత్యంత ఆర్తనాదంలో ఏడ్చినా ఎవ్వరూ ఆదరించరు. ఇలాంటి సుఖ దుఃఖాలు పాపపుణ్యాలు చేయకుండానే జీవునికి లభిస్తే పరమేశ్వరుని మీద దోషారోపణం జరుగుతుంది.

కర్మలు చేయకుండానే సుఖ దుఃఖాలు లభిస్తే జన్మాంతరంలోను పాపపుణ్యఫలంగా స్వర్గనరకాలు అనబడే సుఖదుఃఖాలు కూడా ఉండరాదు. ఎందుకంటే, కర్మలు లేకుండానే పరమేశ్వరుడు ఇక్కడ సుఖ దుఃఖాలను కలిగిస్తే జీవుని మరణానంతరం కూడా తాను అనుకున్నవారినే స్వర్గానికి, నరకానికి పంపగలడు. అలాగే అయితే జీవు లందరు అధర్మయుక్తులవుతారు. ధర్మంయొక్క ఫలితం లభించటంలో సందేహం ఉంటే ఇక ధర్మమెందుకు చేయాలి? పరమేశ్వరుడు తన ఇష్టం వచ్చినట్లు చేస్తే ఇక ఎవరికీ పాపకర్మలు చేయటంలో భయముండదు. లోకంలో పాపం అభివృద్ధియై ధర్మం క్షీణిస్తుంది. కాబట్టి పూర్వజన్మలోని పుణ్యపాపాలను అనుసరించి వర్తమాన జన్మను, వర్తమాన జన్మల కర్మలను అనుసరించి భవిష్యత్ జన్మ కలుగుతుందని అనుకోవాలి.

ప్రశ్న:- మానవ శరీరాలలోను, పశువులు మొదలైనవాని శరీరాలలోను ఒకేవిధమైన జీవులుంటారా? లేక భిన్న జాతిజీవులా?

జవాబు:- జీవులు ఒకే విధంగా ఉంటాయి. అనేకజాతులుండవు. కాని పాపపుణ్యాల సంయోగంలో పవిత్రులుగా, అపవిత్రులుగా ఉంటాయి.

ప్రశ్న:- మనుష్య శరీరంలోని జీవులు పశ్వాది శరీరంలోనికి, పశ్వాది శరీరగతజీవులు మనుష్యశరీరాలలోనికి, అలాగే స్త్రీల శరీరాలలోని జీవులు పురుషుల శరీరాలలోనికి, పురుషుల శరీరాలలోని జీవులు స్త్రీల శరీరాలలోనికి మారుతుంటాయా? లేదా?

జవాబు:- అవును. మారుతుంటాయి. పాపం అధికమై పుణ్యం క్షీణించినపుడు మానవుల శరీరంలోని జీవులు పశువులు మొదలైన నీచ శరీరాలను, ధర్మం అధికమై అధర్మం క్షీణించినపుడు దేవతలు అనబడే విద్వాంసుల శరీరాలను పొందుతారు. పాపపుణ్యాలు సమానంగా ఉన్నపుడు మానవజన్మ కలుగుతుంది. ఇందులోనూ పాప, పుణ్యాలు, 'ఉత్తమ, మధ్యమ, నికృష్టాలు (అధమం)గా' ఉంటే మానవులందరిలోను ఉత్తమ, మధ్యమ, అధమ శరీరాలు లభిస్తాయి. అధిక పాప ఫలితాన్ని పశువులు మొదలైన శరీరాలలో భోగించి, పాపపుణ్యాలు సమానాలు అయినపుడు మరల మానవ శరీరాలలోనికి జీవుడు వస్తాడు. పుణ్యఫలం అనుభవించిన తర్వాత మళ్ళీ మధ్యస్థ మానవ శరీరంలోనికి వస్తాడు.

శరీరం నుండి జీవుడు బయటకు వెళ్ళిపోవటం **'మృత్యువు'** అనబడుతుంది. జీవునికి శరీరంతో సంయోగం కలగటం **'జన్మం'** అవుతుంది. శరీరం విడిచినపుడు జీవుడు యమలోకంలో - అంటే ఆకాశంలోని వాయువులో ఉంటాడు. **'యమేన వాయునా'** (ఋ. 10-14-8. అథర్వ 20-141-2) వేదంలో యముడనే పేరు వాయువుకుంది. గరుడపురాణంలోని యముడు కల్పించబడినవాడు. దీనిని గురించిన ఖండన మండన విషయాలు పదకొండవ సముల్లాసంలో చూడండి. ధర్మరాజనగా పరమేశ్వరుడని అర్థం. అతడు జీవుని పాపపుణ్యాలను అనుసరించి జన్మను ఇస్తాడు. జీవుడు వాయు, అగ్ని, జలాల ద్వారనో, శరీర రంధ్రాల ద్వారనో, ఈశ్వరుని ప్రేరణతో పురుష శరీరంలోనికి ప్రవేశిస్తాడు. తర్వాత వీర్యంతో కలిసి స్త్రీ గర్భంలోనికి వెళ్లి, శరీరాన్నిధరించి బయటికి వస్తాడు. స్త్రీ గా జన్మించటానికి తగిన కర్మలు చేస్తే స్త్రీ శరీరంలోనికి, పురుష జన్మ మెత్తవలసిన కర్మలు చేస్తే పురుష శరీరంలోనికి ప్రవేశిస్తాడు. స్త్రీ పురుషుల సంబంధాన్ని, రజోవీర్యాలు సమానంగా కలిసిన నపుంసకుడుగా జన్మిస్తాడు. ఉత్తమ కర్మ, ఉపాసన, జ్ఞానాల ద్వారా ముక్తిని పొందనంతవరకు ఇలా అనేక విధాలైన జన్మ మరణాలను జీవుడు పొందుతుంటాడు. ఉత్తమ కర్మలను చేసినపుడే ఉత్తమ జన్మ ధరించి, ముక్తిని పొంది మహాకల్ప పర్యంతం జన్మమరణ దుఃఖాలు లేకుండా ఆనందంతో జీవుడుంటాడు.

ప్రశ్న:- ముక్తి ఒకే జన్మలో లభించునా? లేక అనేక జన్మలందా?

జవాబు:- అనేక జన్మలందు. ఎందుకంటే -

భిద్యతే హృదయగ్రంథిశ్ఛిద్యంతే సర్వసంశయాః ।
క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరాఽవరే ॥ ముండకో. 2-2-18 ॥

జీవుని హృదయానికి సంబంధించిన అవిద్య - అజ్ఞానరూపమైన గ్రంథి - ముడి ఖండించబడినపుడే సమస్త సంశయాలు ఛిన్నాభిన్నాలు అవుతాయి. దుష్టకర్మలు నశిస్తాయి. అప్పుడే తన ఆత్మకు బయట, లోపల వ్యాపించి ఉన్న పరమాత్మునిలో నివసిస్తాడు.

ప్రశ్న:- ముక్తిలో జీవుడు పరమేశ్వరునిలో లీనమవుతాడా? లేక వేరుగా ఉంటాడా?

జవాబు:- వేరుగా ఉంటాడు. లీనమైతే ముక్తి సుఖాన్ని ఎవడు అనుభవిస్తాడు? అలాగే అయితే ముక్తిసాధనాలు అన్నీ నిష్ఫలాలవుతాయి. అప్పుడది 'ముక్తి' అనలేము. దానిని జీవుని ప్రళయమని చెప్పాలి. పరమేశ్వరుని ఆజ్ఞలను పాలిస్తూ, ఉత్తమ కర్మలను చేస్తూ, సజ్జన సాంగత్యం కలిగి యోగాభ్యాసంలో పూర్వోక్త సాధనాలను అన్నింటిని చేసినపుడే జీవుడు ముక్తిని పొందుతాడు.

సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ యో వేద విహితం గుహాయాం పరమే వ్యోమన్ ।
సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి ॥ తైత్తి.ఆనంద. వ. 1-1 ॥

జీవుడు తన బుద్ధిలోనూ, ఆత్మలోనూ నివసించేట్టి సత్యం, జ్ఞానం, అనంతం ఆనంద స్వరూపం అయిన పరమాత్మను తెలుసుకొన్నపుడు, ఆ వ్యాపకరూపి అయిన బ్రహ్మమందుస్థితుడై ఆ విపశ్చితుడు - అంటే అనంతవిద్యాయుక్తుడైన బ్రహ్మతో పాటు సమస్త కామములను - కోరికలను అంటే ఏ యే ఆనందాన్ని పొంద కోరునో దానిని పొందుతాడు. ఇదే ముక్తి అవుతుంది.

ప్రశ్న:- శరీరం లేకుండా ప్రాపంచిక సుఖాలను అనుభవించలేము. ముక్తిలో శరీరం లేకుండా జీవుడు ఎలా ఆనందాన్ని అనుభవిస్తాడు?

జవాబు:- దీనికి సమాధానం పూర్వమే చెప్పబడింది. కొంత ఇక్కడ అధికంగా చెప్పబడింది. వినండి:- ప్రాపంచిక సుఖాలను శరీర ఆధారంలో అనుభవించినట్లు, పరమేశ్వరుని ఆధారంలో ముక్తియొక్క ఆనందాన్ని జీవాత్మ అనుభవిస్తుంది. ముక్త జీవుడు అనంత వ్యాపకుడైన బ్రహ్మలో స్వచ్ఛందంగా విహరిస్తాడు. శుద్ధజ్ఞానంతో సమస్త సృష్టిని చూస్తుంది. అన్య ముక్త జీవులతో కలుస్తుంది. సృష్టివిద్యను క్రమంగా తెలుసుకుంటూ, కనిపించునట్టి సమస్త లోకలోకాంతరాలన్నింటిలో విహరిస్తాడు. తన జ్ఞానంతో తెలుసుకొనే పదార్థాలను అన్నింటిని చూస్తాడు. అతనికి జ్ఞానం అభివృద్ధియైన కొద్దీ ఆనందం కూడా అధికమవుతుంది.

స్వర్గ నరకాలు

ముక్తిలో జీవుడు పవిత్రుడూ, నిర్మలుడూ అవటం చేత అతనికి పూర్ణజ్ఞానం కలుగుతుంది. కాబట్టి అతనికి సన్నిహిత పదార్థాల జ్ఞానం యథారీతిగా కలుగుతుంది. ఈ సుఖవిశేషాన్నే 'స్వర్గం' అంటారు.

విషయవాసనలో చిక్కుకొని విశేష దుఃఖాన్ని అనుభవించటమే 'నరకం' అంటారు.

'స్వః' అంటే సుఖం. 'స్వః సుఖం గచ్ఛతి యస్మిన్ స స్వర్గః' 'అతో విపరీతో దుఃఖ భోగో నరకః'. ఇది సామాన్య ప్రాపంచిక సుఖం, సామాన్య స్వర్గం. పరమేశ్వర ప్రాప్తి వలన కలిగే ఆనందమే విశేష స్వర్గమని చెప్పబడింది.

స్వాభావికంగా జీవులందరూ సుఖాన్ని పొందాలని కోరుకొంటారు. దుఃఖంనుండి తొలగిపోవాలని అనుకుంటారు. కాని ధర్మాచరణ చేయక పాపాలను విడువనంతవరకు వారికి సుఖం లభించటం, దుఃఖాలు విడిపోవటం జరుగదు. ఎందుకంటే కారణం ఉండునంతవరకు కార్యం నష్టం కాదు.

ఛిన్నే మూలే వృక్షో నశ్యతి, తథా పాపే క్షీణే దుఃఖం నశ్యతి ।

మూలాన్ని ఖండిస్తే వృక్షం నశించునట్లు, పాపాలు నశిస్తే దుఃఖం నష్టమవుతుంది. మనుస్మృతిలో పాపపుణ్యాల విధాలు అనేకాలుగా చెప్పబడినవి. చూడండి:-

మానసం మనసైవాయముపభుంక్తే శుభాऽశుభమ్ ।
వాచా వాచా కృతం కర్మ కాయేనైవ చ కాయికమ్ ॥ మను. 12-8 ॥

మానవుడు ఈ విధంగా ఉత్తమ, మధ్యమ, అధమ స్వభావాలను తెలుసుకొని ఉత్తమ శ్రేష్ఠ స్వభావాన్ని గ్రహించి మధ్యమ, అధమ స్వభావాలను త్యజించాలి.

జీవుడు మనస్సుతో చేసిన శుభాశుభా కర్మల ఫలితాన్ని మనస్సుతోనూ, వాక్కుతో చేస్తే వాక్కుతోనూ, శరీరంతో చేస్తే శరీరంతోనూ సుఖ దుఃఖాలను అనుభవిస్తాడని నిశ్చయంగా తెలుసుకోవాలి.

శరీరజైః కర్మదోషైర్యాతి స్థావరతాం నరః ।
వాచికైః పక్షిమృగతాం మానసైరంత్యజాతితామ్ ॥ మను. 12-9 ॥

మానవుడు శరీరంతో దొంగతనం, పరస్త్రీ గమనం, ఉత్తమ పురుషులను చంపటం మొదలైన దుష్ట కర్మలను చేస్తే వృక్షాది స్థావర జన్మను, వాక్కుతో చేసిన పాపకర్మలవలన పశుపక్ష్యాది జన్మలను, మనస్సుతో చేసిన దుష్టకర్మల వలన చాండాలాది జన్మలను పొందుతాడు.

యో యదైషాం గుణో దేహే సాకల్యేనాతిరిచ్యతే ।
స తదా తద్గుణప్రాయం తం కరోతి శరీరిణమ్ ॥ మను. 12 - 25 ॥

ఈ జీవుల దేహంలో ఏ యే గుణాలు అధికంగా ఉంటాయో అవి ఆ జీవుని తమతో సమానంగా చేసుకొంటాయి.

సత్త్వం జ్ఞానం తమోऽజ్ఞానం రాగద్వేషౌ రజఃస్మృతమ్ ।
ఏతద్ వ్యాప్తిమదేతేషాం సర్వభూతాశ్రితం వపుః ॥ మను. 12-26 ॥

ఆత్మలో అధిక జ్ఞానంకలిగినప్పుడు సత్త్వగుణమనీ, అజ్ఞానముంటే తమో గుణమనీ, రాగద్వేషాలలో ఆత్మ నిమగ్నమైతే రజోగుణమనీ తెలుసుకోవాలి. ఈ మూడు ప్రకృతి గుణాలు సమస్త ప్రాపంచిక పదార్థాలలో వ్యాపించి ఉన్నాయి.

తత్ర యత్ప్రీతిసంయుక్తం కించిదాత్మని లక్షయేత్ ।
ప్రశాంతమివ శుద్ధాభం సత్త్వం తదుపధారయేత్ ॥ మను. 12-27 ॥

గుణాలను తెలియువిధం:- ఈ త్రిగుణాల వివేకం ఈ క్రింది విధంగా తెలుసుకోవాలి. మనస్సు ప్రసన్నంగాను, ప్రశాంతంగాను ఉండి శుద్ధ భావయుక్తమై ప్రవర్తిస్తే సత్త్వగుణం ప్రధానంగాను, రజోగుణం, తమోగుణాలు అప్రధానంగాను ఉన్నాయనీ తెలుసుకోవాలి.

యత్తు దుఃఖ సమాయుక్తమప్రీతికరమాత్మనః ।
తద్రజోఽ ప్రతిపం విద్యాత్సతతం హారి దేహినామ్ ॥ మను. 12-28 ॥

ఆత్మా, మనస్సూ దుఃఖంతోకూడి ప్రసన్నత లేనివై విషయాలలో అటు ఇటు సంచరిస్తే రజోగుణం ప్రధానంగాను, సత్త్వగుణ, తమోగుణాలు అప్రధానంగాను ఉంటాయి.

యత్తు స్యాన్మోహసంయుక్తమవ్యక్తం విషయాత్మకమ్ ।
అప్రతర్క్యమవిజ్ఞేయం తమస్తదుపధారయేత్ ॥ మను. 12-29 ॥

ప్రాపంచిక పదార్థాలలో మోహంతో చిక్కుకొని ఉన్నపుడు, ఆత్మకు, మనస్సుకు కొంచెం కూడా వివేకముండదు. ఇవి విషయాసక్తి కలిగి తర్కించటానికి తెలుసుకోవటానికి వీలుగానివై ఉంటాయి. అపుడు తనలో తమోగుణం ప్రధానంగా ఉన్నదనీ సత్త్వ గుణ, రజోగుణాలు అప్రధానంగా ఉన్నాయనీ నిశ్చయంగా తెలుసుకోవాలి.

త్రయాణామపి చైతేషాం గుణానాం యః ఫలోదయః ।
అగ్ర్యో మధ్యో జఘన్యశ్చ తం ప్రవక్ష్యామ్యశేషతః ॥ మను. 12-30 ॥

ఇక ఈ మూడు గుణాలతో కలిగే ఉత్తమ, మధ్యమ అధమ ఫలాలను పూర్ణంగా చెబుతాను.

వేదాభ్యాసస్తపో జ్ఞానం శౌచమింద్రియ నిగ్రహః ।
ధర్మక్రియాత్మచింతా చ సాత్త్వికం గుణలక్షణమ్ ॥ మను. 12-31 ॥

వేదాభ్యాసం, ధర్మానుష్ఠానం, జ్ఞానవృద్ధి, పవిత్రభావం, ఇంద్రియనిగ్రహం, ధర్మకార్యం, ఆత్మచింతన అనేవే సత్త్వగుణ లక్షణాలు.

ఆరంభరుచితాఽ ధైర్యమసత్కార్యపరిగ్రహః ।
విషయోపసేవా చాజస్రం రాజసం గుణలక్షణమ్ ॥ మను. 12-32 ॥

రజోగుణం వృద్ధిచెంది సత్త్వతమోగుణాలు అంతర్భాగాలు అయినపుడు, కార్యారంభ రుచిత్వం, అధైర్యం, అసత్ కార్యాలను గ్రహించటం, నిరంతరం విషయాసక్తి కలిగి ఉండటం జరుగుతుంది. అప్పుడు తనలో రజోగుణం ప్రధానంగా ఉన్నదని తెలుసుకోవాలి.

లోభః స్వప్నోఽధృతిః క్రౌర్యం నాస్తిక్యం భిన్నవృత్తితా ।
యాచిష్ణుతా ప్రమాదశ్చ తామసం గుణలక్షణమ్ ॥ మను. 12-33 ॥

తమోగుణం అధికమై మిగతా రెండు సత్త్వరజోగుణాలు అంతర్భాగాలు అయినపుడు సమస్త పాపాలకు మూలమైన అత్యంత లోభం వృద్ధిచెందుతుంది. అత్యంత సోమరితనం, నిద్ర, ధైర్యనాశనం, క్రూరత్వం, నాస్తిక్యం - వేదంలో గాని, ఈశ్వరునిలోగాని శ్రద్ధ లేకుండటం, అంతఃకరణం యొక్క భిన్న భిన్న వృత్తులు, ఏకాగ్రతయొక్క అభావం, అనేక వ్యసనాలలో చిక్కుకొని ఉండటం అనేవి కలుగుతాయి. అపుడు ఇవి తమోగుణ లక్షణాలని తెలుసుకోవాలి.

యత్కర్మ కృత్వా కుర్వాంశ్చ కరిష్యంశ్చైవ లజ్జతి ।
తజ్జ్ఞేయం విదుషా సర్వం తామసం గుణలక్షణమ్ ॥ మను. 12-35 ॥

ఒక కార్యాన్ని చేసినప్పుడు, చేస్తున్నప్పుడు, చేయాలని అనుకున్నప్పుడు తన ఆత్మలో సిగ్గు, లజ్జ, అనుమానం, భయం కలుగునప్పుడు తనలో తమోగుణం ప్రబలంగా ఉన్నదని విద్వాంసులు తెలుసుకోవాలి.

యేనాస్మిన్కర్మణా లోకే ఖ్యాతిమిచ్ఛతి పుష్కలామ్ ।
న చ శోచత్యసంపత్తౌ తద్విజ్ఞేయం తు రాజసమ్ ॥ మను. 12-36 ॥

ఒక కార్యం చేసి లోకంలో పుష్కలమైన కీర్తిని కోరుతూ, దరిద్రావస్థలోనూ భట్రాజులకు తనను స్తుతించటానికై దానమివ్వటం మానేస్తే తనలో రజోగుణం ప్రబలంగా ఉన్నదని గుర్తించాలి.

యత్సర్వేణేచ్ఛతి జ్ఞాతుం యన్న లజ్జతి చాచరన్ ।
యేన తుష్యతి చాత్మాస్య తత్సత్త్వగుణలక్షణమ్ ॥ మను. 12-37 ॥

మానవుని ఆత్మ అన్నింటినీ తెలుసుకోవాలని అనుకుంటూ, గుణాలను గ్రహిస్తూ, సత్కార్యాలను చేయటానికి సిగ్గుపడక, ప్రసన్నత కలిగించే కార్యాలను చేస్తూ ధర్మాచరణలో అభిరుచిని కలిగి ఉంటే తనలో సత్త్వగుణం అధికంగా ఉన్నదని గుర్తించాలి.

తమసో లక్షణమ్ కామో రజసస్త్వర్థ ఉచ్యతే ।
సత్త్వస్య లక్షణమ్ ధర్మః శ్రైష్ఠ్యమేషాం యథోత్తరమ్ ॥ మను. 12-38 ॥

కామం తమోగుణ లక్షణం. అర్థసంగ్రహణం చేయాలనే కోరిక రజోగుణ లక్షణం. ధర్మకార్యాలు చేయటం సత్త్వగుణలక్షణం. కాని తమోగుణం కంటే రజోగుణం, రజో గుణంకంటే సత్త్వగుణం శ్రేష్ఠమైనది.

ఇప్పుడు ఏ యే గుణాలవలన జీవుడు ఏ యే గతిని పొందునో వాటిని క్రింద వ్రాస్తున్నాము:-

దేవత్వం సాత్త్వికా యాంతి మనుష్యత్వం చ రాజసాః ।
తిర్యక్త్వం తామసా నిత్యమిత్యేషా త్రివిధా గతిః ॥ మను. 12-40 ॥

సాత్త్వికులైనవారు (దేవత్వం) దేవతలు అంటే విద్వాంసులు అవుతారు. రజోగుణం కలవారు మధ్యమ మానవులు అవుతారు. తమోగుణం కలవారు నీచగతిని పొందుతారు.

స్థావరాః కృమికీటాశ్చ మత్స్యాః సర్పాశ్చ కచ్ఛపాః ।
పశవశ్చ మృగాశ్చైవ జఘన్యా తామసీ గతిః ॥ మను. 12-42 ॥

అత్యంత తమోగుణం కలవారు స్థావరాలైన వృక్షాలుగాను, క్రిమికీటకాలుగాను, మత్స్య సర్ప, కూర్మాలుగాను పశువులుగాను మృగాలుగాను జన్మిస్తారు.

హస్తినశ్చ తురంగాశ్చ శూద్రామ్లేచ్ఛాశ్చ గర్హితాః ।
సింహో వ్యాఘ్రా వరాహాశ్చ మధ్యమా తామసీ గతిః ॥ మను. 12-43 ॥

మధ్యమ తమోగుణం కలవారు ఏనుగులుగాను, అశ్వాలుగాను, శూద్రులుగాను, మ్లేచ్ఛులుగాను, నిందనీయమైన కార్యాలను చేసేవారుగాను, సింహం, పెద్దపులి, పందివంటి మృగాలుగాను జన్మిస్తారు.

చారణాశ్చ సుపర్ణాశ్చ పురుషాశ్చైవ దాంభికాః ।
రక్షాంసి చ పిశాచాశ్చ తామసీషూత్తమా గతిః ॥ మను. 12-44 ॥

ఉత్తమ తమోగుణం కలవారు కవిత్వం చెప్పి మానవులను స్తుతిస్తూ చారణులుగాను, అందమైన పక్షులుగాను, తమ సుఖానికై తమను తామే ప్రశంసించుకొనే డాంబికులుగాను, హింసించెడు రాక్షసులుగాను, పిశాచులుగాను, మత్తు పదార్థాలను సేవించే అనాచారులుగాను, అపవిత్రులుగాను జన్మిస్తారు. ఇవి అన్నీ ఉత్తమ తమోగుణకర్మల ఫలితం.

ఝల్లా మల్లా నటాశ్చైవ పురుషాః శస్త్రవృత్తయః ।
ద్యూతపానప్రవక్తాశ్చ జఘన్యా రాజసీ గతిః ॥ మను. 12-45 ॥

అత్యంత రజోగుణం కలవారు ఝల్ల = ఖడ్గాలతో సంహరించేవారుగా; గడ్డపారతో త్రవ్వి జీవించేవారుగా, మల్ల = నౌకలను నడుపువారుగా, నట = నాట్యంచేసే దొమ్మరులుగా, శస్త్రదారులుగా, భృత్యులుగా, మద్యపానాసక్తులుగా జన్మిస్తారు. ఇలాంటి జన్మలు నీచమైన రజోగుణ ఫలితం.

రాజానః క్షత్రియాశ్చైవ రాజ్ఞాం చైవ పురోహితాః ।
వాదయుద్ధప్రధానాశ్చ మధ్యమా రాజసీ గతిః ॥ మను. 12-46 ॥

మధ్యమ రజోగుణం కలవారు రాజులుగా, క్షత్రియులైన రాజులయొక్క పురోహితులుగా, వాద వివాదాలు చేసేవారిగా, దూతలుగా, న్యాయవాదులుగా, యుద్ధవిభాగానికి అధ్యక్షులుగా జన్మిస్తారు.

గంధర్వా గుహ్యకా యక్షా విబుధానుచరాశ్చ యే ।
తథైవాప్సరసః సర్వా రాజసీషూత్తమా గతిః ॥ మను. 12-47 ॥

ఉత్తమ రజోగుణం కలవారు, గంధర్వులుగా = గానంచేసేవారుగా, గుహ్యకులు = వాయిద్యాలు వాయించేవారుగా, యక్షులు = ధనాఢ్యులుగా, విద్వాంసులను సేవించేవారుగా, అప్సరసలు = ఉత్తమ రూపం గల స్త్రీలుగా జన్మిస్తారు.

తాపసా యతయో విప్రా యే చ వైమానికా గుణాః ।
నక్షత్రాణి చ దైత్యాశ్చ ప్రథమా సాత్త్వికీ గతిః ॥ మను. 12-48 ॥

ప్రథమ సత్త్వగుణం కలవారు తాపసికులుగా, యతులుగా, సన్న్యాసులుగా, వేదపాఠకులుగా, విమానచోదకులుగా, జ్యోతిష్యులుగా, దేహపోషణపరులైన మానవులుగా జన్మిస్తారు. ఈ జన్మలన్నీ ప్రథమ సత్త్వగుణకర్మల ఫలితమని తెలియాలి.

యజ్వాన ఋషయో దేవా వేదా జ్యోతీంషి వత్సరాః ।
పితరశ్చైవ సాధ్యాశ్చ ద్వితీయా సాత్త్వికీ గతిః ॥ మను. 12-49 ॥

మధ్యమ సత్త్వగుణంతో కూడిన కర్మలు చేసే జీవులు యజ్ఞకర్తలుగా, వేదార్థ విదులుగా, విద్వాంసులుగా, వేదాన్ని, విద్యుత్తును, కాలవిద్యను తెలిసినవారుగా, రక్షకులుగా, జ్ఞానులుగా, సాధ్యులు = కార్యసిద్ధికై యత్నించే అధ్యాపకులుగా జన్మిస్తారు.

బ్రహ్మా విశ్వసృజో ధర్మో మహానవ్యక్త మేవ చ ।
ఉత్తమాం సాత్త్వికీమేతాం గతిమాహుర్మనీషిణః ॥ మను. 12-51 ॥

ఉత్తమ సత్త్వగుణం కలవారు ఉత్తమ కర్మలను చేసేవారు బ్రహ్మ = సర్వవేదవేత్తగా, విశ్వసృజ = సమస్త సృష్టిక్రమ విద్యను తెలుసుకొని వివిధాలైన విమానాది యానాలను నిర్మించేవారుగా, ధార్మికులుగా, సర్వోత్తమ బుద్ధిగలవారుగా, అవ్యక్త జన్మనూ-ప్రకృతికార్యాన్ని తెలుసుకొని ప్రకృతిని వశపరచుకొంటారు.

ఇంద్రియాణాం ప్రసంగేన ధర్మస్యాసేవనేన చ ।
పాపాన్సంయాంతి సంసారానవిద్వాంసో నరాధమాః ॥ మను. 12-52 ॥

ఇంద్రియాలకు వశులై విషయాసక్తి కలవారు ధర్మాన్ని వీడి అధర్మాన్ని ఆచరించే అవిద్వాంసులైనవారు నీచమానవ జన్మలను, అత్యంత అధిక దుఃఖరూప జన్మలను పొందుతారు.

ఈ విధంగా సత్త్వ రజ స్తమోగుణాల వేగంవలన ఏ యే కర్మలను జీవుడు చేస్తాడో వానికి

తగిన ఫలితాలను పొందుతాడు. కాబట్టి ముక్తిని కోరువారు అంటే గుణాల స్వభావాలలో చిక్కుకొనక గుణాతీతులై, మహాయోగులై ముక్తికొరకు ప్రయత్నించాలి.

యోగశ్చిత్తవృత్తి నిరోధః ॥ యోగ. 1-2 ॥

ఇది పతంజలి యోగశాస్త్ర సూత్రం. మానవుడు రజోగుణ, తమోగుణాలతో కూడిన కర్మలనుండి మనస్సును నిరోధించి, తర్వాత శుద్ధ సత్త్వగుణయుక్తుడై, తదనంతరం దానినికూడా నిరోధించి, ఏకాగ్రతతో - అంటే ఒకే పరమాత్మునిలో, ధర్మయుక్త కార్యాలలోనూ, వాటి అగ్రభాగాలందు చిత్తాన్ని నిలిపి, అన్నివైపుల నుండి మనోవృత్తులను నిరోధించి ఉంచాలి.

తదా ద్రష్టుః స్వరూపేఽవస్థానమ్ ॥ యోగ. 1-3 ॥

చిత్తాన్ని ఏకాగ్రంచేసి నిరోధించినప్పుడే సర్వద్రష్టయైన ఈశ్వరుని స్వరూపంలో జీవాత్ముడు స్థితుడై ఉంటాడు. ఇలాంటి సాధనాలను ముక్తి కొరకై చేయాలి.

అథ త్రివిధదుఃఖాత్యంత నివృత్తి రత్యంత పురుషార్థః ॥ సాంఖ్య 1-1 ॥

ఇది సాంఖ్యసూత్రం. 'ఆధ్యాత్మికం' అనబడే శరీర సంబంధమైన బాధ, 'ఆదిభౌతికం' అనబడే ఇతర ప్రాణులనుండి కలగే దుఃఖం, 'ఆధిదైవికం' అనబడే అతివృష్టి, అతి తాపం, అతి శీతలం, ఇంద్రియాలయొక్క మనస్సుయొక్క చంచలత్వంతో కలగే దుఃఖాలు. జీవులు ఇలాంటి ఈ త్రివిధ దుఃఖాల నుండి తొలగి ముక్తిని పొందటమే అత్యంత పురుషార్థం.

ఇక ముందు ఆచార, అనాచార, భక్ష్య, అభక్ష్యాలను గురించి వ్రాస్తాము.

ఇది శ్రీమద్దయానంద సరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన

సత్యార్థప్రకాశంలో విద్యావిద్యబంధమోక్ష విషయాలు గల

నవమ సముల్లాసం సంపూర్ణం.

దశమ సముల్లాసము

అథాఽఽ చారానాచార భక్ష్యాఽ భక్ష్య విషయాన్ వ్యాఖ్యాస్యామః

ఆచార, అనాచార భక్ష్య-అభక్ష్య విషయాలు వివరింపబడును.

ధర్మయుక్త కార్యాచరణం, సుశీలత్వం, సజ్జన సాంగత్యం, సద్విద్యాగ్రహణంలో అభిరుచి మొదలైనవి **'ఆచార'** మనీ, వీనికి విపరీతాలైనవి **'అనాచార'** మనీ చెప్పబడింది. వాటిని గురించి ఇక్కడ వ్రాస్తున్నాము.

వేదోక్త ధర్మసేవనం

విద్వద్భిః సేవితః సద్భిర్నిత్యమద్వేషరాగిభిః ।
హృదయే నాభ్యనుజ్ఞాతో యో ధర్మస్తన్నిబోధత ॥ మను. అ 2-1. ॥

రాగద్వేష రహితులైన విద్వాంసులు ప్రతినిత్యం ఆచరించేదానిని, ఆత్మకు సత్యమైన కర్తవ్యమని తోచేదానిని మాననీయం, కరణీయం అని తెలుసుకొని ఆ ధర్మాన్ని మానవులు సదా ఆచరించి, దానిపైనే మనస్సును లగ్నం చేయాలి

కామాత్మతా న ప్రశస్తా న చైవేహాస్త్యకామతా ।
కామ్యో హి వేదాధిగమః కర్మయోగశ్చ వైదికః ॥ మను. అ 2-2 ॥

ఈ ప్రపంచంలో అత్యంత కామం-ఎక్కువ కోరికలు కలిగి ఉండటం గాని, నిష్కామం-పూర్తిగా కోరికలు లేకుండటంగాని శ్రేష్ఠం కాదు. వేదార్థజ్ఞానం, వేదోక్త కర్మలు మొదలైనవన్నీ కామం వల్లనే సిద్ధిస్తాయి.

సంకల్పమూలః కామో వై యజ్ఞాః సంకల్పసంభవాః ।
వ్రతాని యమధర్మాశ్చ సర్వే సంకల్పజాః స్మృతాః ॥ మను. అ 2-3 ॥

"నాకు ఏ కోరికలు లేవు, నేను నిష్కాముడను" అని ఎవరైనా పలికితే అదెన్నడూ సంభవం కాదు. ఎందుకంటే యజ్ఞాలు, సత్యభాషణాది వ్రతాలు, యమనియమరూప ధర్మాలు మొదలైనవన్నీ సంకల్పంతోనే జరుగుతున్నాయి.

అకామస్య క్రియా కాచిద్దృశ్యతే నేహ కర్హిచిత్ ।
యద్యద్ధి కురుతే కించిత్ తత్తత్కామస్య చేష్టితమ్ ॥ మను. అ 2-4 ॥

హస్తాలు, పాదాలు, నేత్రాలు, మనస్సు మొదలైన అవయవాల యొక్క కదలికలు అన్నీ కామం - కోరిక వల్లనే జరుగుతున్నాయి. కోరికే లేకపోతే కండ్లు తెరవటం, మూయటం కూడ జరగదు.

వేదోఽఖిలో ధర్మమూలం స్మృతిశీలే చ తద్విదామ్ ।
ఆచారశ్చైవ సాధూనామాత్మనస్తుష్టిరేవ చ ॥ మను. అ 2-6 ॥

కాబట్టి, సంపూర్ణంగా వేదాన్ని, మనుస్మృతిని, ఋషిప్రణీత శాస్త్రాలను, సత్పురుషుల ఆచారాన్ని సేవించాలి. ఏ కార్యాలు చేస్తే ఆత్మ ప్రసన్నంగా ఉంటుందో, ఏ పనులు చేయునపుడు భయం, శంక, సిగ్గు అనేవి కలుగవో అలాంటి కర్మలను ఆచరించాలి. మిథ్యాభాషణాలను ఆడినపుడూ, దొంగతనం మొదలైనవి చేయదలచినపుడూ ఆత్మలో భయం, శంక, సిగ్గు అనేవి తప్పక కలుగుతాయి. కాబట్టి అలాంటి కార్యాలు చేయటానికి యోగ్యం కానివి.

సర్వంతు సమవేక్ష్యేదం నిఖిలం జ్ఞానచక్షుషా ।
శ్రుతిప్రామాణ్యతో విద్వాన్ స్వధర్మే నివిశేత వై ॥ మను. అ 2-8 ॥

మానవుడు సంపూర్ణంగా శాస్త్రాలను, వేదాలను, సత్పురుషుల ఆచారాన్ని తన ఆత్మకు విరుద్ధంకాని విషయాలను చక్కగా ఆలోచించి, జ్ఞాననేత్రం కలవాడై, శ్రుతి ప్రమాణాలకు అనుగుణంగా స్వాత్మానుకూల ధర్మంలో ప్రవేశించాలి. (ఆచరించాలి).

శ్రుతిస్మృత్యుదితం ధర్మమనుతిష్ఠన్హి మానవః ।
ఇహ కీర్తిమవాప్నోతి ప్రేత్య చానుత్తమం సుఖమ్ ॥ మను. అ 2-9 ॥

వేదోక్త ధర్మానికి, వేదాలకు విరుద్ధాలు కాని స్మృతులు చెప్పిన ధర్మాన్ని అనుష్ఠించే మానవుడు ఈ లోకంలో కీర్తిని, మరణానంతరంలో సర్వోత్తమ సుఖాన్ని పొందుతాడు.

శ్రుతిస్తు వేదో విజ్ఞేయో ధర్మశాస్త్రం తు వై స్మృతిః ।
తే సర్వార్థేష్వమీమాంస్యే తాభ్యాం ధర్మో హి నిర్బభౌ ॥ మను. అ 2-10 ॥

యోఽవమన్యేత తే మూలే హేతుశాస్త్రాశ్రయాద్ద్విజః ।
స సాధుభిర్బహిష్కార్యో నాస్తికో వేదనిందకః ॥ మను. అ 2-11 ॥

వేదాన్ని '**శ్రుతి**' అని, ధర్మశాస్త్రాన్ని '**స్మృతి**' అని తెలుసుకోవాలి. వీని ద్వారా కర్తవ్యాకర్తవ్యాలను

అన్నింటిని నిశ్చయించుకోవాలి. వేదాలను గాని, వేదానుకూలాలైన ఆప్తుల గ్రంథాలనుగాని అవమానించే వారిని శ్రేష్ఠపురుషుల జాతి నుండి బహిష్కరించాలి. ఎందుకంటే, 'వేదాలను నిందించేవారు నాస్తికులు' అనబడుతారు.

వేదః స్మృతిః సదాచారః స్వస్య చ ప్రియామాత్మనః ।
ఏతచ్చతుర్విధం ప్రాహుః సాక్షాద్ధర్మస్య లక్షణమ్ ॥ మను. అ 2-12 ॥

"వేదం, స్మృతి, సత్పురుషుల ఆచారం, తన ఆత్మజ్ఞానానికి అవిరుద్ధమైన ప్రియాచరణం" అనే ఈ నాలుగు ధర్మ లక్షణాలు. అంటే వీటి ద్వారానే ధర్మం తెలుసుకోబడుతుంది.

అర్థకామేష్వసక్తానాం ధర్మజ్ఞానం విధీయతే ।
ధర్మం జిజ్ఞాసమానానాం ప్రమాణం పరమం శ్రుతిః ॥ మను. అ 2-13 ॥

ద్రవ్యలోభంలో గాని, కామమనబడే విషయవాసనలలో గాని చిక్కుకొననివారికే ధర్మజ్ఞానం కలుగుతుంది. ధర్మాన్ని తెలుసుకోవాలనుకునే వారికి వేదమే పరమ ప్రమాణం.

వైదికైః కర్మభిః పుణ్యైర్నిషేకాదిర్ద్విజన్మనామ్ ।
కార్యః శరీరసంస్కారః పావనః ప్రేత్య చేహ చ ॥ మను. అ 2-26 ॥

వేదోక్త పుణ్యరూప కర్మలతో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణాలవారు తమ సంతానానికి నిషేకాది సంస్కారాలు జరిపించాలి. ఇవి ఈ జన్మలోనూ, పరజన్మలోనూ మానవున్ని పవిత్రునిగా చేసేవి.

కేశాంతః షోడశే వర్షే బ్రాహ్మణస్య విధీయతే ।
రాజన్య బంధోర్ద్వావింశే వైశ్యస్య ద్వ్యధికే తతః ॥ మను. అ 2-65 ॥

బ్రాహ్మణులకు పదహారవ యేట, క్షత్రియులకు ఇరవై రెండవయేట, వైశ్యులకు ఇరవై నాల్గవ యేట కేశాంతం అనబనే ముండనం చేయించాలి. ఈ విధి జరిగిన తరువాత తిరిగి కేశాలు వచ్చినప్పుడు కేవలం శిఖను ఉంచి గడ్డం, మీసం, తలవెంట్రుకలను ఎల్లప్పుడు కొరిగించుకోవాలి. శీతప్రధాన దేశంలో ఇష్టానుసారంగా వెంట్రుకలు ఉంచుకోవచ్చు. అత్యుష్ణ దేశాలలో శిఖతో సహా వెంట్రుకలను అన్నింటిని ఛేదించాలి. తలపై వెంట్రుకలు అధికంగా ఉంటే ఉష్ణం అధికమవుతుంది. అందుకే బుద్ధి కూడా తగ్గుతుంది. గడ్డం, మీసాలు ఉంచుకొంటే భోజనపానాలు సరిగా జరగవు. వెంట్రుకలకు ఎంగిలి కూడా అంటుకుంటుంది.

మానవుని విశేష కర్తవ్యాలు

ఇంద్రియాణాం విచరతాం విషయేష్వపహారిషు ।
సంయమే యత్నమాతిష్ఠేద్విద్వాన్యంతేవ వాజినామ్॥ ॥ మను. అ 2-88 ॥

చిత్తాన్ని హరించే విషయాలలో ప్రవర్తించే ఇంద్రియాలను నిరోధించటానికే ప్రయత్నించాలి.

సారథి అశ్వాలను నిరోధిస్తూ చక్కని మార్గంలో నడుపునట్లుగా ఇంద్రియాలను తన వశంలోఉంచుకొని, అధర్మమార్గంనుండి వాటిని మరలించి ధర్మమార్గంలో నడపటమే మానవుని ముఖ్యాచారం.

ఇంద్రియాణాం ప్రసంగేన దోషమృచ్ఛత్యసంశయమ్ ।
సన్నియమ్య తు తాన్యేవ తతః సిద్ధిం నియచ్ఛతి ॥ మను. అ 2-93 ॥

ఎందుకంటే ఇంద్రియాలను విషయాసక్తిలోనూ, అధర్మమార్గంలోనూ నడిపిన మానవుడు నిశ్చయంగా 'దోషి' అవుతాడు. వీటిని జయించి ధర్మమార్గంలో నడిచినపుడే అభీష్ట సిద్ధిని పొందుతాడు.

న జాతు కామః కామానాముపభోగేన శామ్యతి ।
హవిషా కృష్ణవర్త్మేవ భూయ ఏవాభివర్ధతే ॥ మను. అ 2-94 ॥

అగ్నిలో ఇంధనాలను (కట్టెలను), ఘృతాన్ని (నేతిని) వేసిన కొద్దీ ఇంకా ప్రజ్వరిల్లునట్లు, కోరికలను అనుభవించిన కొద్దీ కామం వృద్ధి అవుతుంది కాని శాంతించదు. కాబట్టి మానవుడు విషయాసక్తి కలవాడు కాగూడదు.

వేదాస్త్యాగశ్చ యజ్ఞాశ్చ నియమాశ్చ తపాంసి చ ।
న విప్రదుష్టభావస్య సిద్ధిం గచ్ఛంతి కర్హిచిత్ ॥ మను. అ 2-97 ॥

జితేంద్రియుడు కాని పురుషుడిని 'విప్రదుష్టుడు' అంటారు. అలాంటి పురుషునికి వేదజ్ఞానం, త్యాగం, యజ్ఞం, నియమాలు, ధర్మాచరణ మొదలైనవి ఎంత ప్రయత్నించినా సిద్ధించవు. జితేంద్రియులైన ధార్మికులకే ఇవి సిద్ధిస్తాయి.

వశే కృత్వేంద్రియగ్రామం సంయమ్య చ మనస్తథా ।
సర్వాన్ సంసాధయేదర్థానక్షిణ్వన్ యోగతస్తనుమ్ ॥ మను. అ 2-98 ॥

పంచ కర్మేంద్రియాలను, పంచ జ్ఞానేంద్రియాలను, పదకొండవది ఐన మనస్సును వశంలో ఉంచుకొని, యుక్తాహార విహారాలు కలిగి యోగంతో శరీరాన్ని రక్షించుకొంటూ సర్వార్థాలను సిద్ధం చేసుకోవాలి.

శ్రుత్వా స్పృష్ట్వా చ దృష్ట్వా చ భుక్త్వా ఘ్రాత్వా చ యో నరః ।
న హృష్యతి గ్లాయతి వా స విజ్ఞేయో జితేంద్రియః ॥ మను. అ 2-100 ॥

స్తుతిని విని హర్షాన్ని, నిందను విని శోకాన్ని, ఉత్తమ స్పర్శతో సుఖాన్ని, దుష్ట స్పర్శతో దుఃఖాన్ని, సుందర రూప దర్శనంతో ప్రసన్నతను, కురూప దర్శనంతో అప్రసన్నతను, అత్యుత్తమ భోజనంతో ఆనందాన్ని, నికృష్ట భోజనంతో దుఃఖాన్ని, సుగంధంతో అభిరుచీ, దుర్గంధంతో అప్రీతీ కలిగి ఉండనివాడే 'జితేంద్రియుడు' అవుతాడు.

నాపృష్టః కస్యచిద్బ్రూయాన్న చాన్యాయేన పృచ్ఛతః ।
జానన్నపి హి మేధావీ జడవల్లోక ఆచరేత్ ॥ మను. అ 2-110 ॥

అడుగనివారికి, అన్యాయంగా, కపటంతో ప్రశ్నించేవారికి సమాధానమీయకూడదు. అలాంటివారి ముందు బుద్ధిమంతులు అజ్ఞానులలాగా-జడులలాగా ఉండాలి. నిష్కపటులైనవారికి, జిజ్ఞాసువులైనవారికి అడుగకుండానే ఉపదేశించాలి.

విత్తం బంధుర్వయః కర్మ విద్యా భవతి పంచమీ ।
ఏతాని మాన్యస్థానాని గరీయో యద్యదుత్తరమ్ ॥ మను. అ 2-136 ॥

ధనం, బంధుత్వం - కుటుంబం - కులం, వయస్సు, ఉత్తమ కర్మలు, శ్రేష్ఠవిద్య అనే ఈ ఐదు గౌరవ స్థానాలు. కాని ధనం కంటే ఉత్తమకుటుంబం, ఉత్తమ కుటుంబంకంటే అధిక వయస్సు కలవాడు, అతని కంటే శ్రేష్ఠకర్మలు చేసేవాడు, వానికంటే పవిత్రవిద్యగలవాడు అధికుడు. ఇలా ఒక దానికంటే మరొకటి అధికంగా మాననీయం.

అజ్ఞో భవతి వై బాలః పితా భవతి మంత్రదః ।
అజ్ఞం హి బాలమిత్యాహుః పితేత్యేవ తు మంత్రదమ్॥ ॥ మను. అ 2-153 ॥

శతవర్షం-వంద సంవత్సరాల వయసుగలవాడైనప్పటికీ విద్యావిజ్ఞాన రహితుడైనవాడు బాలుడనీ విద్యావిజ్ఞానాలను ఇచ్చేవాడు బాలుడైనా వృద్ధునిలాగా భావించాలి. ఎందుకంటే, సమస్త శాస్త్రాలు మరియు ఆప్తులైన విద్వాంసులు అజ్ఞానిని 'బాలకుడు' అనీ, జ్ఞానిని 'పిత' అనీ చెప్తారు.

న హాయనైర్న పలితైర్న విత్తేన న బంధుభిః ।
ఋషయశ్చక్రిరే ధర్మం యోఽనూచానః స నో మహాన్॥ ॥ మను. అ 2-154 ॥

అధిక సంవత్సరాల వయస్సు కలవాడు, వెంట్రుకలు నెరసినవాడు, అధిక ధనం కలవాడు, గొప్ప కుటుంబం కలవాడు వృద్ధుడు అనబడడు. విద్యా విజ్ఞానాలలో అధికుడైనవాడే వృద్ధుడు అనబడతాడని ఋషుల, మహాత్ముల నిశ్చిత అభిప్రాయం.

విప్రాణాం జ్ఞానతో జ్యైష్ఠ్యం క్షత్రియాణాం తు వీర్యతః ।
వైశ్యానాం ధాన్యధనతః శూద్రాణామేవ జన్మతః॥ ॥ మను. అ 2-155 ॥

జ్ఞానంతో బ్రాహ్మణుడు, బలంతో క్షత్రియుడు, ధనధాన్యాలతో వైశ్యుడు, అధికవయస్సుచేత శూద్రుడు వృద్ధుడు అవుతాడు.

న తేన వృద్ధో భవతి యేనాస్య పలితం శిరః ।
యో వై యువాప్యధీయాన స్తం దేవాః స్థవిరం విదుః॥ ॥ మను. అ 2-156 ॥

తలవెంట్రుకలు నెరసినంత మాత్రాన వృద్ధుడు కాదు. విద్యను అభ్యసించిన యువకుడే వృద్ధుడనీ, గొప్పవాడనీ విద్వాంసులంటారు.

యథా కాష్ఠమయోహస్తీ యథా చర్మమయో మృగః ।
యశ్చ విప్రోఽనధీయానస్త్రయస్తే నామ విభ్రతి ॥ మను. అ 2-157 ॥

విద్యను నేర్వనివాడు కఱ్ఱతో చేసిన ఏనుగులాగా, చర్మంతో చేసిన మృగం లాగా, నామ మాత్రానికే 'మనుష్యుడు' అని లోకంలో చెప్పబడుతాడు.

అహింసయైవ భూతానాం కార్యం శ్రేయోఽనుశాసనమ్ ।
వాక్చైవ మధురా శ్లక్ష్ణా ప్రయోజ్యా ధర్మమిచ్ఛతా ॥ మను. అ 2-159 ॥

కాబట్టి విద్య నేర్చిన విద్వాంసులు ధర్మాత్ములై, నిర్వైరం - శత్రుభావం లేకుండా ఉండి, సర్వ ప్రాణుల కల్యాణానికై ఉపదేశించాలి. ఉపదేశించునపుడు వాణి మధురంగా, కోమలంగా ఉండాలి. సత్యోపదేశాన్ని చేస్తూ, ధర్మాభివృద్ధిని చేస్తూ, అధర్మాన్ని నశింపజేయాలి. ఇలా చేసేవారే ధన్యులు.

నిత్యం స్నానం చేస్తూ, వస్త్రాలను, అన్నపానాలను, నివాసస్థలాన్ని మొదలైన వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇవి పరిశుభ్రంగా ఉన్నప్పుడే చిత్తం పరిశుద్ధంగా ఉంటుంది. ఆరోగ్యం కలుగుతంది. పురుషార్థాలను చక్కగా అభివృద్ధి చేసుకోవచ్చు. మలినం, దుర్గంధం దూరం చేయటానికి తగిన శౌచం - శుభ్రత అవసరం.

ఆచార మహత్త్వం

ఆచారః పరమోధర్మః శ్రుత్యుక్తః స్మార్త ఏవ చ ॥ ॥ మను. అ 2-108 ॥

సత్యభాషణాది కర్మలను ఆచరించటమే వేదంలో, స్మృతులలో చెప్పబడిన ఆచారం.

మా నో వధీః పితరం మోత మాతరమ్ ॥ ॥ యజు. 16-15 ॥

ఆచార్య ఉపనయమానో బ్రహ్మచారిణమిచ్ఛతే ॥ ॥ అథర్వ కాం. 11 సూ. 5. మం. 17 ॥

మాతృదేవో భవ । పితృ దేవో భవ ।
ఆచార్య దేవో భవ । అతిథి దేవో భవ ॥ తైత్తిరీయారణ్యకే. ప్ర. 7 అను. 11 ॥

తల్లిదండ్రుల, ఆచార్యుల, అతిథుల సేవను చేయటం 'దేవపూజ' అంటారు. లోకహితాలైన కార్యాలను చేయటం, లోకానికి హాని కలిగించే కార్యాలను విడిచిపెట్టటమే మానవుని ముఖ్య కర్తవ్యం. నాస్తికులతో, విషయ లంపటులతో, విశ్వాసఘాతకులతో, అసత్యమాడేవారితో, స్వార్థులు, కపటులు అయిన మోసగాండ్రతో, దుష్టులతో స్నేహం ఎన్నడూ చేయరాదు. ఆప్తులు, సత్యవాదులు, ధర్మాత్ములు, పరోపకారప్రియులు అయినవారితోనే సదా సాంగత్యం చేయటం శ్రేష్ఠాచారం.

విదేశగమనంవలన ఆచారం నష్టమవుతుందా?

ప్రశ్న:- ఆర్యావర్తదేశవాసులు తమ దేశంనుండి ఇతర దేశాలకు పోవటంవలన ఆచారం నష్టమవుతుందా? కాదా?

జవాబు:- ఇది మిథ్యావచనం-అసత్యం. ఎందుకంటే బాహ్య, అభ్యంతర పవిత్రత కలిగి సత్యభాషణాది ఆచరణ ఉన్నవారు ఎక్కడ ఉన్నా ఒకటే. సదాచారంగల వారు ఎన్నడూ ధర్మభ్రష్టులు కాలేరు. ఆర్యావర్తంలోనే ఉండి దురాచారులైతే వారు అధర్మాత్ములనీ, ఆచార భ్రష్టులనీ చెప్పబడతారు.

మేరోర్హరేశ్చ ద్వే వర్షే వర్షం హైమవతం తతః ।
క్రమేణైవ సమాగమ్య భారతం వర్షమాసదత్ ॥
స దృష్ట్వా వివిధాన్ దేశాన్ చీనహూణనిషేవితాన్ ॥

మహాభారత. శాంతి. మోక్షధర్మ. అ. 325-14-15 ॥

ఈ శ్లోకాలు మహాభారతంలోని శాంతిపర్వంలో మోక్షధర్మంలో గల వ్యాస శుక సంవాదంలోనివి. ఒకానొకప్పుడు వ్యాసుడు తన కుమారుడైన శుకునితోను, శిష్యులతోను నేడు అమెరికా అనబడే పాతాళంలో నివసిస్తుండేవాడు. శుక్రాచార్యుడు తన తండ్రితో ఆత్మవిద్య ఇంతేనా? ఇంకా ఉన్నదా? అని ప్రశ్నించాడు. తనకు తెలిసినా వ్యాసుడు ఆ ప్రశ్నకు జవాబు ఇవ్వలేదు. ఎందుకంటే అతని తండ్రి ఈ విషయాన్ని గురించిన ఉపదేశాన్ని అంతకుపూర్వమే చేసాడు. మరొక సాక్షానికై తన పుత్రుడైన శుకునితో ఇలా అన్నాడు – "ఓ కుమారా! మిథిలానగరానికి వెళ్ళి జనక మహారాజుతో ఈ ప్రశ్ననే అడుగు. దీనికి అతడు సరియైన సమాధాన మిస్తాడు" అని. తండ్రి మాటలను వినిశుక్రాచార్యుడు పాతాళం నుండి మిథిలానగరానికి వెళ్లాడు. ప్రథమంలో మేరుపర్వతం అనబడే హిమాలయాల నుండి ఈశాన్యానికి ఉత్తర, వాయవ్యదిశలలో ఉన్న హరివర్షానికి పోయాడు. 'హరి' అంటే కోతి. ఆ దేశపు ప్రజలు ఇప్పటికి రక్తవర్ణ ముఖాన్ని కలిగి వానరుల లాగా బూడిదరంగు కనులు కలిగి ఉంటారు. యూరపుఖండ దేశాన్నే సంస్కృతంలో 'హరివర్షం' అని చెప్పారు. శుకుడు ఆ దేశాన్ని చూస్తూ 'యహూదీ' అనబడే 'హూణ' దేశాన్ని చూస్తూ చీనా (చైనా) దేశానికి వచ్చాడు. తర్వాత చీనా నుండి హిమాలయానికి, అక్కడి నుండి మిథిలాపురికి వచ్చాడు.

శ్రీకృష్ణుడు, అర్జునుడు ఇద్దరూ 'అశ్వతరి' అనబడే అగ్నియానంలో కూర్చుండి పాతాళానికి వెళ్ళి మహారాజైన యుధిష్ఠిరుని యజ్ఞానికి ఉద్దాలకమహర్షిని తీసుకొని వచ్చారు. ధృతరాష్ట్రుని వివాహం 'కంధారం' అనబడే గాంధారదేశపు రాజపుత్రితో జరిగింది. పాండురాజు భార్య అయిన 'మాద్రి' ఈరాన్ దేశపు రాజపుత్రిక. అమెరికా అనబడే పాతాళదేశపు రాజకుమార్తె అయిన 'ఉలూపి'తో అర్జునుని వివాహం జరిగింది. మన పూర్వీకులు దేశ దేశాంతరాలకు, ద్వీప ద్వీపాంతరాలకు పోకపోతే ఈ సమస్త సంఘటనలన్నీ ఎలా జరుగుతాయి?

మనుస్మృతిలో సముద్రంపై ప్రయాణం చేసే నౌకలపై పన్ను తీసుకొనే విషయం వ్రాయబడి ఉన్నది. ఇది కూడా ఆర్యావర్తం నుండి ద్వీపాంతరాలకు పోవటాన్ని తెలియజేస్తున్నది. మహారాజైన యుధిష్ఠిరుడు రాజసూయ యాగాన్ని చేసినాడు. దానిలో పాల్గొనటానికి సమస్త భూగోళపు రాజులను ఆహ్వానించటానికై భీముడు, అర్జునుడు, నకులుడు, సహదేవుడు నలుదిశలలో గల దేశాలకు వెళ్లారు. అట్లా పోవటం దోషమని వారు భావిస్తే ఎప్పుడూ పోయేవారు కారు. పూర్వం ఆర్యావర్తదేశీయులు వ్యాపారానికై, రాచకార్యాలకై, దేశసంచారానికై భూగోళ మంతటా సంచరించేవారు.

నేడు 'అస్పృశ్యత - అంటుముట్టులతో' 'ధర్మభ్రష్టులు' అవుతారనే ఆచారం కేవలం మూర్ఖుల కపోల కల్పనల వల్లనే, అజ్ఞానుల అధిక మూర్ఖత వల్లనే ఏర్పడింది. ఇది దురాచారం. దీన్ని రూపుమాపటం మానవులందరి కర్తవ్యం. దేశదేశాంతరాలకు, ద్వీప ద్వీపాంతరాలకు పోయిరావటంలో ఎలాంటి అనుమానాన్ని పెట్టుకోరాదు. దేశ దేశాంతరాలకుపోయి అక్కడ ఉన్న వివిధ వర్ణాల మానవులతో కలిసి, వారి వారి ఆచార వ్యవహారాలను చూస్తూ, తెలుసుకొంటూ తమ రాజ్యాలను, రాజకార్య వ్యవహారాలను వృద్ధిపర్చుకొంటూ నిర్భయులుగా, శూరవీరులుగా ఉండాలి. ఉత్తమ వ్యవహారాలను గ్రహిస్తూ ఏ దేశపు చెడ్డ వ్యవహారమైనా సరే వీడటంలో తత్పరులై గొప్ప ఐశ్వర్యాలను పొందాలి.

ఆహా! అస్పృశ్యతను పాటించేవారు మహాభ్రష్టులైన మ్లేచ్ఛజాతిలో జన్మించిన వేశ్యలతో వ్యభిచారం చేస్తే ఆచార భ్రష్టులు, ధర్మహీనులు కారట! కాని దేశ దేశాంతరాలలోని ఉత్తమ పురుషులతో సాంగత్యం చేస్తే అంటుబడతారట! దోషం కలుగుతుందట! ఇది కేవలం మూర్ఖత్వం గాక మరేమవుతుంది?

భక్ష్య-అభక్ష్య విషయాలు

మాంసభక్షణం, మద్యపానాన్ని సేవించేవారి శరీరం, వీర్యాది ధాతువులు దుర్గంధాలతో దూషితాలవుతాయి. కావున అలాంటి వారితో స్నేహం చేస్తే ఆర్యులకు ఈ కులక్షణం అంటుకోవచ్చు. దీనినుండి జాగ్రత్తపడాలి. కాని విదేశీయులలో గల సద్వ్యవహారాలను, సుగుణాలను గ్రహిస్తే ఏ దోషం కాని, పాపం కాని కలగదు. వారిలోగల మద్యపానాది దోషాలను త్యజించి సుగుణాలను గ్రహిస్తే కొంచెం కూడ హాని జరగదు. కాని ఈ దేశంలో కొందరు మూర్ఖులు వీరి దర్శనం, స్పర్శనాలను కూడా పాపమని అన్నారు. కాబట్టే వారితో ఎన్నడూ యుద్ధం చేయలేరు. ఎందుకంటే యుద్ధంలో వారి దర్శన స్పర్శనాలు తప్పక జరుగుతాయి కదా!

రాగం, ద్వేషం, అన్యాయం, మిథ్యాభాషణాది దోషాలను వీడి శత్రుభావం లేకుండా ప్రేమ కలిగి ఉండటం, పరోపకారం చేయటం, సజ్జనత్వాది గుణాలు కలిగి ఉండటం సజ్జనుల యొక్క ఉత్తమ ఆచారం. మన ఆత్మతో, కర్తవ్యాలతో ధర్మానికి సంబంధం ఉన్నదని తెలుసుకోవాలి.

మనం సత్కార్యాలను చేస్తూ దేశ దేశాంతరాలకు, ద్వీప ద్వీపాంతరాలకు వెళ్ళినా ఏ కొంచెం కూడా దోషం కలుగదు. పాప కార్యాలను చేస్తే దోషం కలుగుతుంది. వేదోక్త ధర్మాచరణాన్ని మూఢవిశ్వాసాల మత ఖండనాన్ని చేయటం తప్పనిసరిగా నేర్చుకోవాలి. అప్పుడే మనలనెవ్వరూ

తప్పుడు మార్గం పట్టించలేరు. దేశ దేశాంతరాలలో, ద్వీప ద్వీపాంతరాలలో రాజ్యం గాని, వ్యాపారం గాని చేయకపోతే స్వదేశోన్నతి ఎలా జరుగుతుంది? స్వదేశీయులు స్వదేశంలోనే వ్యవహారాలను చేస్తుంటే విదేశీయులు వచ్చి మన దేశంపై రాజ్యం చేస్తూ వ్యవహారాలు సాగించారు. అప్పుడు దేశానికి దారిద్ర్యం, దుఃఖం తప్ప మరేదీ కలుగలేదు.

దేశ ప్రజలందరికి విద్య నేర్పి, దేశ దేశాంతరాలకు పోవటానికి అనుమతిస్తే వారు బుద్ధిమంతులై తమ పాషండజాలంలో చిక్కుకోరనీ, అందువలన తమ ప్రతిష్ఠకు జీవన నిర్వహణకు నష్టం కలుగునని మూఢులు భావించారు. అందువల్లనే భోజనాచ్ఛాదనాలలో వ్యర్థాడంబరాలను, అస్పృశ్యత మొదలైన స్పర్శదోషాలను కల్పించారు. విదేశగమనాన్ని నిషేధించారు. అయితే విదేశాలకు వెళ్ళివచ్చేవారు మద్య మాంసాది సేవనాదులనెన్నడూ పొరపాటున కూడా చేయరాదు.

రాజపురుషులు, సైనికులు యుద్ధ సమయంలో తమకు ప్రత్యేకంగా వేరువేరుగా భోజనాలయాలను ఏర్పరచుకొని వంటలు చేసుకొని తినటంచేతనే పరాజయాన్ని చెందినారని బుద్ధిమంతులు నిర్ణయించారు. క్షత్రియులు యుద్ధంలో ఒక చేతితో రొట్టెను తింటూ, జలాన్ని త్రాగుతూ, మరొక చేతితో అశ్వాలపై ఏనుగులపై రథాలపై ఎక్కిగాని, పాదచారులైగాని శత్రువులను సంహరిస్తూ విజయాన్ని సాధించటమే వారి ఆచారం. పరాజితులవటం అనాచారం. కాని ఈ అస్పృశ్యత - అంటుముట్టను మూర్ఖత్వంతో వీరు ప్రత్యేక భోజనాలయాలను ఏర్పర్చుకొంటూ, విరోధిస్తూ, విరోధింపజేస్తూ, స్వాతంత్ర్యాన్ని, ఆనందాన్ని, ధనాన్ని, రాజ్యాన్ని, విద్యను పురుషార్థాన్ని పోగొట్టుకొని చేతులు ముడుచుకొని కూర్చున్నారు. వీరేదైనా పదార్థం లభించినపుడే వండుకొని తినాలని కోరుతుంటారు. ఆర్యావర్తదేశమంతటా ఈ ప్రత్యేక భోజనశాలల విధానమే సర్వదా నష్టం చేసిందని తెలుస్తున్నది. భోజనం చేసిన స్థలాన్ని కడగటం, అలకటం, ఊడ్చటం, చెత్త చెదారాలను తొలగించటం అనేవి తప్పనిసరిగా చేయాల్సినవే. ముసల్మానుల లాగా, క్రైస్తవుల లాగా పాకశాలను అపరిశుభ్రంగా ఎప్పుడూ ఉంచుకోరాదు.

ప్రశ్న:- సఖరీ, నిఖరీ అంటే ఏమిటి?

జవాబు:- నీళ్ళతో అన్నాన్ని వండటం 'సఖరీ' అని, పాలు, నేయి, నూనెలతో వండిన దానిని 'నిఖరీ' అని అంటారు. దీనినే 'చోఖీ' అనీ చెబుతారు. ఇది కూడా ధూర్తులు ఏర్పరచిన పాషండమే. నేయి, పాలు అధికంగా ఉంటే తినటానికి రుచిగా ఉండి కడుపులోకి మృదువైన పదార్థం అధికంగా పోవటానికి ఈ ఆచారాన్ని ఏర్పరచారు. నీళ్ళతో వండిన పదార్థమే పక్వమైన ఆహారమనీ, అలా వండబడని పదార్థాలు అపక్వమైనవనీ వీరి భావం.

దీనినే హిందీలో కచ్చా-పక్కా అంటారు. అగ్నిపై పక్వమైన దానిని 'పక్కా' అని, ఉడకపెట్టని దానిని 'కచ్చా' అని అంటారు. ఈ పక్వాపక్వాలే 'కచ్చా-పక్కా' 'సఖరీ-నిఖరీ' అనే పదాలతో

వ్యవహరించబడింది. బ్రాహ్మణాది ఉన్నత వర్ణస్థులు శూద్రుల ఇంట వండిన జల పక్వ పదార్థాలను తినరు. కాని నేతితో, పాలతో చేసిన పదార్థాలను తింటారు. ఇందులో ఏ దోషం లేదని చెప్తారు. ఇదంతా వారి మూర్ఖత్వమే. పరిశుభ్రంగా ఎవరు వండినా ఎలాంటి దోషం లేదు. పక్వమైనదే భుజించటం అనేది కొన్ని సమయాలలో కుదరదు. ఎందుకంటే నానబెట్టిన సెనగలు మొదలైనవి అపక్వంగా కూడా తినబడుతున్నాయి.

ప్రశ్న:- ద్విజులు స్వయంగా తమ చేతితో వండుకొన్నదే తినాలా? లేక శూద్రులు వండినది కూడా తినవచ్చా?

జవాబు:- శూద్రులు వండినదానినే తినాలి. ఎందుకంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణస్థులైన స్త్రీ పురుషులు విద్యను చదివించటంలో, రాజ్యపాలనలో, వ్యవసాయం, పశుపాలన, వ్యాపారం మొదలైన కార్యాలలో నిమగ్నులై ఉంటారు. ఇందుకు ప్రమాణాన్ని చూడండి:-

ఆర్యాధిష్ఠాతా వా శూద్రాః సంస్కర్తారః స్యుః ॥ ఆపస్తంబ. ధర్మసూత్ర. ప్ర. 2-2-4-4 ॥

ఇది ఆపస్తంబ ధర్మ సూత్రం. ఆర్యుల గృహాలలోని శూద్రులు అంటే విద్యలేని స్త్రీ పురుషులు వంటలు మొదలైనవి చేసి వారిని సేవిస్తుండాలి. వారు శరీర, వస్త్రాలతో పవిత్రంగా ఉండాలి. ఆర్యుల గృహంలో వంటచేసినపుడు వీరు తమనోటికి గుడ్డను అడ్డంగా కట్టుకొని వంట చేయాలి. ఎందుకంటే, వారి నోటి నుండి తుంపరలుగాని, వారు విడుస్తూన్న శ్వాసగాని ఆహార పదార్థాలపై పడకూడదు. వారు ఎనిమిది రోజులకొకసారి క్షౌరం చేయించుకొని గోళ్ళను కత్తిరించుకోవాలి. ప్రతినిత్యం స్నానం చేసి వంట చేయాలి. ఆర్యులకు వడ్డించి వారు భుజించిన తర్వాత తినాలి.

ప్రశ్న:- శూద్రులు ముట్టుకొన్న అన్నాన్ని తినటమే దోషమైతే, వారు చేతులతో వండినది ఎలా తినవచ్చు?

జవాబు:- ఇది కూడా కపోల కల్పితమైన మూఢాచారమే. ఎలాగంటే బెల్లం, పంచదార, నేయి, పాలు, కూరగాయలు, పండ్లు, దుంపలు మొదలైనవి తినేవారందరూ లోకంలోని అందరి చేతులతో చేసిన పదార్థాలను ఉచ్ఛిష్టాన్ని - ఎంగిలిని తింటున్నవారే అని గ్రహించాలి. ఎలాగంటే, శూద్రులు, చర్మకారులు, పాకీవారు, ముసల్మానులు, క్రైస్తవులు మొదలైనవారు పొలాల నుండి చెఱకును కోస్తూ, విరుస్తూ, గానుగలో వేసి రసాన్ని తీస్తారు. వారు మలమూత్రాలను విసర్జించీ, కడుగని కాళ్ళు చేతులతోనే అశుభ్రంగా పని చేస్తారు. వాటిని పట్టుకొని, లేపి నెత్తిపై పెట్టుకొంటారు. చెఱకుగడను సగం నమిలి పీల్చి రసాన్ని త్రాగి మిగతా సగాన్ని దానిలోనే వేస్తారు. చెఱకు రసాన్ని కాచేటపుడు ఆ పొయ్యిమీదనే తమ రొట్టెలను కూడా కాల్చి తింటారు. బెల్లాన్ని తయారు చేసేటపుడు మలమూత్రస్థలంలో తిరిగిన, పేడ, ధూళి అంటుకొని ఉన్న తమ పాతచెప్పులతోనే కూర్చుని బెల్లాన్ని తోముతారు. పాలు పిండునపుడు తమ ఇండ్లలోని ఎంగిలిపాత్రలలోని నీరే వాడతారు. ఆ ఎంగిలి పాత్రలలోనే నేయి మొదలైన వాటిని పోసి ఉంచుతారు. పిండి విసురునప్పుడు కూడా తమ ఎంగిలి చేతులతో పిండిని

ఎత్తుతారు. వారి చెమట కూడా పిండిలో పడుతుంది. ఇలాంటివే మరి ఎన్నో జరుగుతాయి. ఫలాలు, కందమూలాలు మొదలైన వాటిలో ఇలాగే జరుగుతుంది. ఈ పదార్థాలను తినేటప్పుడు కూడా అందరి చేతితో తాకినవే తింటున్నామని తెలుసుకోవాలి.

ప్రశ్న:- కందమూల ఫల రసాలలో ఎలాంటి దోషముండదు. ఎవరూ చూడనపుడు జరిగినదానికి ఏ దోషం లేదు. కారణమేమిటంటే అవి అదృష్ట పదార్థాలు. సిద్ధమగు సమయంలో వాటిని ఎవరు చూస్తారు?

జవాబు:- ఆహా! అవును. ఇట్టి సమాధానం చెప్పక చేసేదేమిటి? లేకుంటే మీరు మట్టి-బూడిద తినవలసి వచ్చేది. బెల్లం, పంచదార మధుర పదార్థాలు. పాలు, నేయి పుష్టిని ఇస్తాయి. అందుకే ఈ విషయంలో స్వార్థపరులైన మీరు ఏదీ కల్పించలేదు? చూడనిదానిలో దోషం లేకుంటే పాకీవారుగాని, ముసల్మానులుగాని తమ చేతులతో మరొకచోట చేసి మీ దగ్గరకు తెచ్చి ఇస్తే తింటారా? లేదా? తినమంటే చూడని దానిలో కూడా దోషమున్నదనే కదా భావం. ముసల్మానులు, క్రైస్తవులు మొదలైన మాంసాహారుల హస్తాలతో ఇచ్చినదానిని తినటంవలన ఆర్యులు మద్యమాంసాలను త్రాగటం, తినటం వంటి అపరాధాలకు గురి అవుతారు. కాబట్టి వారి పదార్థాలను తినరాదు. కాని ఆర్యులలో శూద్రులు వంటచేసినా పరస్పరం సహపంక్తి భోజనం చేసినా ఎలాంటి దోషం లేదు.

అందరూ ఒకే అభిప్రాయాన్ని కలిగి పరస్పరం లాభనష్టాలు, సుఖ దుఃఖాలు అందరికీ ఒక్కటిగానే ఉంటాయని అంగీకరించనంతవరకు దేశం యొక్క ఉన్నతి జరగటం చాలా కష్టం. కేవలం తిని త్రాగటంలోనే ఒకటైనంతమాత్రాన సంస్కరణ పూర్తి కాదు. చెడు విషయాలను వీడి మంచి విషయాలను నేర్చుకోనంతవరకు ఉన్నతికి బదులుగా నష్టమే కలుగుతుంది. ఆర్యావర్తంలో విదేశీయుల రాజ్యం ఏర్పడటంతో పరస్పర భేదాలు, పోట్లాటలు, బ్రహ్మచర్యాన్ని ఆచరించకపోవడం, విద్యను నేర్చుకోకుండా, నేర్పించకపోవడం, బాల్యావస్థలోనే వివాహాలు చేయటం, విషయాసక్తి, మిథ్యాభాషణాది కులక్షణాలు, వేదవిద్యా ప్రచారం జరగకపోవటం అనే ఎన్నో దోషాలు ఏర్పడ్డాయి. అన్నదమ్ములు ఇద్దరు పరస్పరం పోట్లాడినపుడు మూడవవాడైన విదేశీయుడు వచ్చి మధ్యవర్తి అవటానికి ప్రయత్నిస్తాడు.

ఐదువేల సంవత్సరాలకు పూర్వం జరిగిన మహాభారత చారిత్రిక విషయాలను మీరు మరచారా? మహాభారత యుద్ధంలో అందరూ పోట్లాడుతున్నప్పుడు కూడా తమ తమ వాహనాలపై కూర్చొనే తిని త్రాగినారు. పరస్పర కలహాలతో కౌరవ పాండవులు, యాదవులు సర్వనాశనమైనారు. అదే రోగం నేటికీ మన వెన్నంటే ఉన్నది. ఈ భయంకర రాక్షసి ఎన్నడు విడుస్తుందో తెలియదు. ఇది ఆర్యులను సమస్త సుఖాల నుండి దూరంచేసింది. దుఃఖసాగరంలో ముంచి చంపిన ఆ స్వగోత్ర హంతకుడూ, స్వదేశ వినాశకుడూ, నీచుడూ, దుష్టుడునూ ఐన ఆ దుర్యోధనుని దుష్టమార్గంలోనే భారతీయులు నేటికినీ ప్రవర్తించుచు దుఃఖాభివృద్ధిని కావించుకొనుచున్నారు. పరమేశ్వరుడు కృపగలవాడై ఈ భయంకర రోగాన్ని ఆర్యులమగు మనల నుండి నష్టమొనర్చును గాక!

భక్ష్య-అభక్ష్య భేదాలు

భక్ష్యాభక్ష్యాలు రెండు విధాలు :- (1) ధర్మశాస్త్రోక్తం (2) వైద్య శాస్త్రోక్తం

ధర్మ శాస్త్రంలో ఇలా ఉన్నది:-

అభక్ష్యాణి ద్విజాతీనామమేధ్యప్రభవాణి చ ॥ మను. అ 5-5 ॥

ద్విజులైన బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు, శూద్రులు అపరిశుభ్రమైన, మలినాలైన, మలమూత్రాల సమీపంలో పుట్టి, పెరిగి ఫలించిన శాక, ఫల, మూలాలను భుజించరాదు.

వర్జయేన్మధుమాంసం చ ॥ మను. అ 2-177 ॥

మద్యం, గంజాయి, భంగు, నల్లమందు మొదలైన అనేక విధాలైన మత్తు మాదకద్రవ్యాలను, అన్నిరకాలైన మాంసాలను పూర్తిగా విసర్జించాలి.

బుద్ధిం లుంపతి యద్ద్రవ్యం మదకారీ తదుచ్యతే ॥ శార్ఙ్గధర. అ. 4-21 ॥

బుద్ధివినాశక పదార్థాలను ఎన్నడూ సేవించరాదు. క్రుళ్ళి పాచిపోయిన చెడిపోయిన అన్నాన్ని దుర్గంధాలతో దూషితమైన దానిని, బాగా పక్వంగాని దానిని, మద్యమాంసాల పరమాణువులతో నిండి ఉన్న శరీరం గల మద్యమాంసాహారులైన మ్లేచ్ఛుల చేతులతో వండిన పదార్థాలను తినకూడదు.

గోవు వలన లాభాలు - గోవధ వలన హాని

మాంసాహారానికై ఉపకారం చేసే ప్రాణులను చంపుతున్నారు. కాబట్టి దీనిని పూర్తిగా విడిచిపెట్టాలి. గోవు మొదలైన పశువుల వలన కలిగే లాభాలను ఈ క్రింద చదవండి.

ఆవు నుండి పాలు, నేయి లభిస్తాయి. కోడెదూడలు, ఆవుదూడలను ఉత్పన్నం చేయవు. ఆవు తన సంతతివలన ఒకే తరంలో (4,75,600) నాలుగు లక్షల డెబ్బై ఐదువేల ఆరువందల మంది మానవులకు ఒకసారి భోజనాన్ని ఇస్తున్నది. కాబట్టి ఇలాంటి పశువులను చంపరాదు. చంపనీయరాదు ఒక ఆవు ప్రతిరోజూ ఇరవైశేర్ల పాలను మరొక ఆవు రెండుశేర్ల పాలను ఇస్తుంది. ఇంకొక ఆవు నుండి సరాసరి ప్రతిరోజు పదకొండు శేర్ల పాలు లభిస్తాయి. కొన్ని ఆవులు 18 నెలల వరకూ, మరికొన్ని ఆరునెలల వరకూ పాలిస్తాయి. ఇలాగే ప్రతి ఆవు సరాసరి పన్నెండు నెలల వరకు పాలిస్తుంది ఈ విధంగా ప్రతి ఆవు తన జీవితాంతం వరకు ఇచ్చే పాలతో (24,960) ఇరవైనాలుగు వేల తొమ్మిదివందల అరవైమంది ఒకసారికి తృప్తిచెందుతారు. దానికి ఆరు ఆవు దూడలు ఆరు కోడె దూడలు కలుగుతాయి. వాటిలో రెండు చచ్చినా పది దూడలుంటాయి. అందులో ఐదు ఆవుదూడలు పెరిగి తన జీవితాంతం వరకు ఇచ్చే పాలతో (1,24,800) ఒక లక్ష ఇరవై నాలుగు వేల ఎనిమిదివందల మంది ఒకసారి తృప్తి చెందుతారు. ఐదు కోడెదూడలు పెరిగి తమ జీవితాంతం వరకు పనిచేసి

కనీసం 5,000 ఐదువేల మణుగుల ఆహార పదార్థాల ఉత్పత్తికి కారణమౌతాయి. ప్రతి మానవుడు మూడు పావుశేర్ల వంతున తింటే ఈ ఆహార పదార్థాలు (2,50,000) రెండున్నర లక్షలమంది మానవులకు తృప్తి కలుగుతుంది. పాలను, ఆహార పదార్థాలను కలిపితే (3,74,800) మూడు లక్షల డెబ్బైనాలుగు వేల ఎనిమిదివందలమంది తృప్తి చెందుతారు. ఈ రెండు సంఖ్యలను కలిపితే ఒక ఆవుతో ఒకే తరంలో (4,75,600) నాలుగు లక్షల డెబ్బై ఐదు వేల ఆరువందల మంది ఒకసారికి పోషించబడతారు. ఇలా తరాల లెక్కలు వేస్తే అసంఖ్యాకులైన మానవులను ఒక ఆవు పోషిస్తుంది.

ఇదే కాక ఎద్దు బండ్లను లాగటానికి, బరువులు మోయటానికి, వ్యవసాయ పనులకు మానవులకు మిక్కిలిగా ఉపకరిస్తున్నాయి. ఆవుపాల వలన అధిక ఉపయోగం కలుగుతున్నది. ఎద్దుల లాగానే, బర్రెలు, దున్నపోతులు కూడా ఉపకరిస్తున్నాయి. ఆవు పాలు, నెయ్యివలన ఎంత బుద్ధిబలం వృద్ధియై లాభం కలుగునో అంతగా బర్రెపాల వలన కలుగదు. అందుకే ఆర్యులు గోవులను ముఖ్య ఉపకారకాలుగా పరిగణించారు. వీటి మలమూత్రాలు కూడ పంటలు పండటానికి ఎరువులుగా ఉపయోగపడతాయి.

ఒక్క మేకపాలతో (25,920) ఇరవై ఐదువేల తొమ్మిదివందల ఇరవై మంది ఒకసారి పోషింపబడతారు. అలాగే ఏనుగు, గుఱ్ఱం, ఒంటె, గొర్రె, గాడిద మొదలైన వాటివలన చాలాఉపకారం కలుగుతుంది. ఈ పశువులను చంపేవారిని మానవులందరినీ చంపేవారుగానే భావించాలి.

గోహత్యారంభం

చూడండి ఆర్యుల రాజ్యం ఉన్నపుడు మహోపయోగకరాలైన ఈ ఆవులవంటి పశువులు చంపబడకుండా ఉండేవి. అప్పుడు ఆర్యావర్తంలో, భూగోళ మందలి ఇతర దేశంలోనూ మానవాది సర్వప్రాణులు అధికానందంతో ఉండేవి. ఎందుకంటే పాలు, నెయ్యి, ఎద్దులు మొదలైన పశువులు సమృద్ధిగా ఉండటంతో అన్నం, రసాలు పుష్కలంగా లభించేవి. మాంసాహారులైన విదేశీయులు ఈ దేశానికి వచ్చి గోవు మొదలైన పశువులను చంపుతూ, మద్యపానం చేస్తూ రాజ్యాధికారులైనప్పటి నుండి క్రమంగా ఆర్యులకు దుఃఖం పెరగడం ప్రారంభమైంది ఎందుకంటే:-

నష్టే మూలే నైవ ఫలం న పుష్పమ్ ॥ వృద్ధచాణక్య. అ. 10-13 ॥

వృక్షమూలమే ఛేదింపబడినపుడు ఫలపుష్పాలు ఎక్కడ నుండి వస్తాయి?

పశురక్షణం

ప్రశ్న:- అందరూ అహింసకులైతే వ్యాఘ్రాది క్రూర మృగాలు అధికమై గోవులు మొదలైన పశువులను చంపి తింటాయి గదా! అపుడు మీ పురుషార్థం వ్యర్థమవుతుందా? కాదా?

జవాబు:- హానికారకాలైన మృగాలను గాని, మానవులను గాని దండించటం రాజ పురుషుల పని. వారు వానిని చంపాలి.

ప్రశ్న:- అప్పుడు వాటి మాంసాన్ని పారవేయాలా?

జవాబు:- పారవేయలనుకుంటే పారవేయవచ్చు. లేకపోతే కుక్కలు మొదలైన మాంసాహార జంతువులకు ఆహారంగా ఇవ్వవచ్చు. లేదా కాల్చివేయాలి. పూడ్చివేయాలి. ఇలాంటి సందర్భాలలో దొరికిన మాంసాన్ని మాంసాహారులు ఎవరైనా తిన్నా ప్రపంచానికి ఎలాంటి నష్టం కలుగదు. కాని దానిని తినే మానవుల స్వభావం మాత్రం మాంసాహారిగా మారే ప్రమాదముంది.

హింస, దొంగతనం, విశ్వాసఘాతం, మోసం, కపటం మొదలైనవాటితో పదార్థాలను సంపాదించి వాటిని అనుభవించటం 'అభక్ష్యం' భక్షించకూడదు అని, అహింసాది ధర్మకార్యాలతో సంపాదించి భోజనాలు చేయటం 'భక్ష్యం' తినదగినది అని అంటారు. ఆరోగ్యాన్ని కలిగించి, రోగాలను నివారించి, బుద్ధి బలపరాక్రమాలను అభివృద్ధి చేసి, ఆయు వృద్ధిని కలిగించే బియ్యం, గోధుమలు, ఫలాలు, కందమూలాలు, పాలు, నెయ్యి, తీపి పదార్థాలు మొదలైనవాటిని సేవించటానికై యథాయోగ్యంగా వాటిని పక్వం చేసి, ఒకటిగా చేర్చి, యథోచిత సమయాలలో మితాహారంగా భుజించేవి భక్ష్యాలు అంటారు. తమ ప్రకృతికి విరుద్ధంగా ఉండి వికారాన్ని కలిగించే పదార్థాలను వర్జింపదగినవని వైద్యశాస్త్రం చెప్పిన సర్వథా త్యజించాలి. ఎవరికి ఏ యే పదార్థాలు హితమైనవో వాటిని గ్రహించటమే భక్ష్యమవుతుంది

సహ భోజన దోషాలు

ప్రశ్న:- కలిసి ఒకే కంచంలో భుజిస్తే ఏమైన దోషం ఉన్నదా? లేదా?

జవాబు:- ఒకే కంచం-పళ్ళెంలో తినటంవలన దోషం ఉన్నది. ఒకరి స్వభావ, ప్రకృతులతో మరొకరివి కలువవు. కుష్ఠరోగులతో కలిసి తినటంవలన మంచివారి రక్తం కూడా చెడిపోతుంది. అలాగే ఇతరులతో కలిసి తినటంవలన కొంత చెరుపే కలుగుతుంది. బాగు మాత్రం జరుగదు.

అందువలననే:-

నోచ్ఛిష్టం కస్య చిద్దద్యాన్నాద్యాచ్చైవ తథాంతరా ।
న చైవాత్యశనం కుర్యా న్న చోచ్ఛిష్టః క్వచిద్ వ్రజేత్ ॥ మను. అ 2-56 ॥

ఎవరికీ ఎంగిలి పదార్థాలను ఇవ్వరాదు. మరొకని ఎంగిలి కంచంలోని పదార్థాన్ని తీసుకొని తాను భుజించరాదు. అధికంగా భుజించకూడదు. భుజించిన తర్వాత చేతులను, ముఖాన్ని కడుక్కోకుండా ఇటు అటు తిరగరాదు.

ప్రశ్న:- "గురోరుచ్ఛిష్ట భోజనమ్" అనే వాక్యానికి అర్థమేమిటి?

జవాబు:- గురువు భుజించిన తర్వాత విడిగా మిగిలి ఉన్న పరిశుభ్రమైన అన్నాన్ని భుజించాలని దీని అర్థం. అంటే గురువును మొదట భుజింపజేసి తర్వాత శిష్యులు భుజించాలి.

ప్రశ్న:- ఎంగిలే నిషిద్ధమైతే తేనెటీగల ఎంగిలి అయిన తేనె, దూడచీకిన తర్వాత పితికే పాలు, ఒక ముద్ద తిన్న తరువాత తను తినే పదార్థం ఎంగిలే అవుతుంది. వాటిని కూడ తినకూడదా?

జవాబు:- తేనె నామమాత్రానికే ఎంగిలి. అది అనేకరకాలైన ఔషధాలకు సారంగా గ్రహించబడింది. దూడ తన తల్లి పాలను యజమాని పితకక ముందు బయట ఉన్న పాలనే త్రాగుతుంది. పొదుగులో నోరుపెట్టి త్రాగదు. కాబట్టి అవి ఎంగిలి అనబడవు. దూడ చీకిన తర్వాత పొదుగును నీళ్ళతో కడిగి పరిశుభ్రమైన పాత్రలోనికి పాలు పిండుకోవాలి. మన ఎంగిలి మనకు వికారాన్ని కలిగించేది కాదు. 'ఒకరి ఎంగిలి మరొకరు తినరాదు' అనే విషయం స్వాభావికంగా ఋజువవుతున్నది. చూడండి! మన నోరు, ముక్కు చెవి, కండ్లు, ఉపస్థ, గుహ్యేంద్రియాల నుండి వెడలు మలినాలు, మలమూత్రాలను స్పర్శించిన మనకు అసహ్యం కలుగదు. ఇతరుల మల మూత్రాలను స్పర్శించాలంటే అసహ్యం కలుగుతుంది. సృష్టిక్రమాన్ని అనుసరించి ఈ వ్యవహారం విపరీతం కాదని ఋజువవుతున్నది. కాబట్టి మానవ మాత్రులెవ్వరూ పరుల ఎంగిలిని తినకూడదు.

భార్యాభర్తలు ఒకరి ఎంగిలిని మరొకరు తినకూడదు

ప్రశ్న:- భార్యాభర్తలు ఇద్దరూ కలిసి ఒకే కంచంలో భోజనం చేయవచ్చా? లేదా?

జవాబు:- చేయకూడదు. ఎందుకంటే వారి శరీరాల స్వభావాలు కూడా వేరువేరుగాఉంటాయి.

ప్రశ్న:- ఇక చెప్పండి! మనిషైనవాని చేతితో వండిన పదార్థాలను తింటే కలిగే దోషమేమిటి? బ్రాహ్మణులు మొదలుకొని చండాలుర వరకు గల మానవుల శరీరాలు అన్నీ ఎముకలు, మాంసం, చర్మాలతోనే కూడి ఉన్నాయి. బ్రాహ్మణుల శరీరంలో ఏ రక్తముందో చండాలాదుల శరీరాలలో కూడ అదే రక్తం ఉన్నది. కాబట్టి మనిషైనవాని చేతితో వండిన పదార్థాలను తినటంలో కలిగే దోషమేమి?

జవాబు:- దోషం ఉన్నది. ఉత్తమ పదార్థాలను తినటం, త్రాగటం వలన బ్రాహ్మణ స్త్రీ పురుషుల శరీరాలనుండి దుర్గంధాది దోషరహిత రజోవీర్యాలు ఉత్పన్నమవుతాయి. చండాలజాతి స్త్రీ పురుషుల శరీరాలనుండి దుర్గంధం గల రజోవీర్యాలు జనిస్తాయి. ఎందుకంటే, చండాలుర శరీరాలు దుర్గంధం గల పరమాణువులతో నిండి ఉంటాయి. బ్రాహ్మణాది ఉత్తమ వర్ణాలవారు తమ చేతివంటకాలనే తినాలి. చండాలాది నీచులు, భంగీ, చర్మకారాలు వండినది తినకూడదు. "తల్లి, అత్త, సోదరి, కూతురు, కోడలు మొదలైనవారి శరీరం కూడా తన భార్య శరీరం లాగానే చర్మంతో ఏర్పడి ఉన్నది. అలాగని తన భార్యతో వర్తించినట్లు తల్లి మొదలైన స్త్రీలతో ప్రవర్తించెదరా? అని మీతో ఎవరైన ప్రశ్నించిన మీరు అప్పుడు సిగ్గుతో నోరు మూసుకొంటారు. ఉత్తమములైన ఆహార పదార్థాలను చేతితో గ్రహించి నోటితో భుజించినట్లు దుర్గంధ పదార్థాలు కూడా తినవచ్చునని మలాదులను కూడా తింటారా? ఇలా తినేవారు ఎవరైనా ఉంటారా?

ఆవు పేడ వలన కలిగే లాభాలు

ప్రశ్న:- ఆవు పేడతో వంట ఇంటిని, వాకిలిని అలికినట్లు తమ పేడతో ఏల అలుకరు? పేడతో అలికిన వంటయింటి లోనికి పోవటం అపరిశుభ్రం కాదా?

జవాబు:- మానవుని మలం లాగ ఆవుపేడ దుర్గంధంగా ఉండదు. ఆవు పేడతో అలికిన భూమి నున్నగా ఉండి తొందరగా పొక్కిలి కాదు. వస్త్రాలు చెడిపోవు. మురికి అంటదు. మట్టితో

అలికిన బట్టలు తొందరగా మురికియై పాడగునట్లు ఆవుపేడతో అలికితే కాదు. మట్టి, ఆవు పేడ కలిపి అలికిన ప్రదేశాలు చూడటానికి చాలా అందంగా ఉంటాయి. వంట గృహంలో భోజనాలు చేస్తే నెయ్యి, తీపి పదార్థాలు, ఎంగిళ్లు నేలపై పడటంతో ఈగలు, క్రిములు మొదలైన ప్రాణులు ఆ మురికి స్థలానికి చేరుతాయి. అలాంటి స్థలాన్ని ప్రతిరోజూ ఊడ్చి, అలికి పరిశుభ్రం చేయకుంటే ఆ స్థలం పాకీదొడ్డి లాగానే అవుతుంది. కాబట్టి ప్రతిరోజూ మన్ను, ఆవు పేడ, కలిపి పొరక (చీపిరికట్ట)తో బాగా పరిశుభ్రం చేయాలి. గట్టి కట్టడం గల ఇండ్లను నీటితో కడిగి పరిశుభ్రపరచాలి. అలాగైతే ఇంతకు పూర్వం చెప్పబడిన దోషాలు నివారించబడతాయి. ముసల్మానుల వంటయింటిలో ఒకచోట బొగ్గులు, మరొకచోట బూడిద, ఒకవైపు కట్టెలు మరొకవైపు పగిలిన కుండలు, ఎంగిలి గిన్నెలు, పళ్లెములు, మరొకచోట ఎముకలు పడి ఉంటాయి. ఇక ఈగల సంగతి ఏమని చెప్పాలి? ఆ స్థలానికి ఒక మంచివాడు పోయి కూర్చున్న అతనికి వమనం (వాంతి) వస్తుంది. ఆ ప్రదేశమంతా ఒక దుర్గంధ స్థానం వలె కనిపిస్తుంది. ఆవు పేడతో భోజనాలయాలను అలికితే మీరు తప్పుగా భావిస్తున్నారు. కాని పొయ్యిలో పిడకలను కాల్చటం, దాని నిప్పుతో ముట్టించుకొని చుట్టలు త్రాగటం, ఇంటిగోడలను పేడతో అలకటం మొదలైనవి చేసినపుడు ముసల్మానుల వంటగదులు కూడా చెడిపోతాయి అనటంలో సందేహమేమి?

వంటశాల - భోజన పద్ధతులు

ప్రశ్న:- వంటశాలలో కూర్చుని భోజనం చేయటం మంచిదా? లేక బయట కూర్చుని చేయటం మంచిదా?

జవాబు:- సుందర రమణీయస్థానంలో అంటే శుభ్రంగా, మంచిగా, అందంగా ఉన్న ప్రదేశంలో కూర్చుని భోజనం చేయటం మంచిది. యుద్ధసమయంలో మాత్రం తప్పనిసరైనపుడు గుఱ్ఱం రథం వంటి వాహనాలపై కూర్చునో లేక నిలబడో తిని, త్రాగటం తగును.

ఆచార, అనాచార - భక్ష్యాభక్ష్యాలు

ప్రశ్న:- తమ చేతివంటనే తినాలా? లేక ఇతరులు వండినది కూడా తినవచ్చా?

జవాబు:- ఆర్యులు పరిశుభ్రంగా సిద్ధం చేసిన వంటకాన్ని సమానంగా ఆర్యులందరితో కలిసి తింటే ఏ దోషం లేదు. ఎందుకంటే బ్రాహ్మణాది వర్ణస్థులైన స్త్రీ పురుషులు వంట చేస్తూ పాకశాలలు శుభ్రం చేస్తూ, వంట పాత్రలు తోముట మొదలైన కార్యాలలో నిమగ్నమైతే విద్యాది శుభగుణాలు ఎన్నడూ వృద్ధి కాలేవు.

యుధిష్ఠిర మహారాజు చేసిన రాజసూయయాగానికి ప్రపంచంలోని రాజులు, ఋషులు, మహర్షులు వచ్చారు. వారందరు ఒకే పాకశాలలో భోజనాలు చేసారని ప్రమాణాలు ఉన్నాయి. క్రైస్తవ, మహమ్మదీయ మత మతాంతరాలు వ్యాపించగానే ఈ దేశంలో పరస్పర వైరాలు, విరోధాలు ఏర్పడ్డాయి. మద్యపానం చేస్తూ గోమాంసాలను తినటం ఆరంభించినప్పటినుండి భోజనాలందు కక్ష్యలు ఏర్పడ్డాయి.

చూడండి! కాబూలు, కాందహారు, ఈరాను, అమెరికా, ఐరోపా మొదలైన దేశాల రాజపుత్రికలైన గాంధారి, మాద్రి, ఉలూపి మొదలైనవారిని ఆర్యావర్తదేశీయ రాజులు వివాహమాడారు. శకుని మొదలైనవారు కౌరవ పాండవులతో కలిసి సహపంక్తిలో కూర్చొని భోజనాలు చేస్తుండేవారు. ఎలాంటి అటంకాలు అపుడు లేవు. ఎందుకంటే, ఆ కాలంలో భూగోళమంతట వేదోక్త ధర్మం ఒకటే ఉండేది. అందరికీ దానియందే నిష్ఠ ఉండేది. ఒకరి సుఖ దుఃఖాలను హాని లాభాలను మరొకరు తమవిగా భావించేవారు. ఆనాడు భూగోళమంతట అలా ఉండటంతో సుఖముండేది. ఇపుడు అనేక మతాలు గల వారుండటం వలన దుఃఖాలు, విరోధాలు అభివృద్ధి చెందాయి. వీటిని తొలగించటం బుద్ధిమంతుల కర్తవ్యం. పరమాత్ముడు అందరి మనసులలో సత్యమత బీజాంకురాలను నాటితే మిథ్యామతాలు శీఘ్రంగా నశిస్తాయి. ఈ విషయాన్ని విద్వాంసులందరూ ఆలోచించుకొని విరోధ భావాలను వీడి ఆనందాన్ని వృద్ధిపరతురు గాక!

ఇలా సంక్షేపంగా ఆచార, అనాచార, భక్ష్య, అభక్ష్యాల గురించి వ్రాయబడింది. ఈ గ్రంథం యొక్క పూర్వార్థం ఈ దశమ సముల్లాసంతో ముగిసింది. ఈ సముల్లాసాలలో విశేషించి ఖండన మండనల గురించి వ్రాయబడలేదు. ఎందుకంటే మానవుడు సత్యం అసత్యాల గురించి ఏ కొంచెమైనా సామర్థ్యాన్ని పెంపొందించుకోకుండా స్థూలమైన, సూక్ష్మమైన ఖండనాల అభిప్రాయాలను అర్థం చేసుకోలేడు. కాబట్టి మొదట అందరికీ సత్యవిద్యను గురించి ఉపదేశించబడింది.

ఇక ఉత్తరార్థంలో గల నాలుగు సముల్లాసాలలో విశేషించి ఖండన మండన విషయాలు వ్రాస్తాము. ఈ నాల్గు సముల్లాసాలలో మొదటి దానిలో ఆర్యావర్తీయుల మతమతాంతరాలు, రెండవదానిలో జైనుల గురించీ, మూడవదానిలో క్రైస్తవుల గురించీ, నాల్గవదానిలో ముసల్మానుల మతాన్ని గురించీ ఖండన మండనాలు వ్రాయబడతాయి. తర్వాత పద్నాల్గవ సముల్లాసం చివర స్వమంతవ్యామంతవ్యాలనుగూర్చి తెలుపబడుతుంది. విశేషించి ఖండన మండనాలనే తెలుసుకొన కోరేవారు ఈ చివరి నాల్గు సముల్లాసాలను చూడాలి. సామాన్యంగా అక్కడక్కడ మొదటి పది సముల్లాసాలలోను కొద్దిగా ఖండన మండనం చేయబడింది. ఈ పదునాల్గు సముల్లాసాలను పక్షపాతం వీడి, న్యాయదృష్టితో ఎవరు చూస్తారో, చదివుతారో వారి ఆత్మలో సత్యమైన అర్థం గోచరించి ఆనందం కలుగుతుంది. హఠం, దురాగ్రహం, ఈర్ష్యలతో దీనిని చూసినా, విన్నా వారికి ఈ గ్రంథం యొక్క యథార్థ అభిప్రాయం తెలియటం మిక్కిలి కఠినం. కాబట్టి ఎవరైనా దీనిని యథారీతిగా ఆలోచించకపోతే, వారు దీని అభిప్రాయాన్ని గ్రహించక తికమక పడగలరు. సత్యా సత్యాలను నిర్ణయించి సత్యాన్ని గ్రహించటం, అసత్యాన్ని త్యజించి పరమానందాన్ని పొందటం విద్వాంసుల కర్తవ్యం. అలాంటివారే గుణాలను గ్రహించే ఉత్తమ విద్వాంసులై ధర్మ, అర్థ, కామ, మోక్షరూప ఫలాన్ని పొంది ఆనందిస్తారు.

శ్రీమద్దయానంద సరస్వతీ స్వామి కృత సుభాషావిభూషితమైన
సత్యార్థప్రకాశంలో ఆచార-అనాచారాలు భక్ష్య-అభక్ష్య విషయాలు గల
దశమ సముల్లాసం సంపూర్ణం.

ఇది పూర్వార్థం.

ఏకాదశ సముల్లాసము

అథార్యావర్తీయ మతఖండనమండనే విధాస్యామః

ఆర్యావర్తీయ మతఖండనమండనాలు

ఇప్పుడు ఆర్యావర్తదేశంలో నివసించే ఆర్యుల మతఖండన మండనాలను చేయబోవుచున్నాము. ఈ ఆర్యావర్తదేశానికి సమానమైన మరొకదేశం ఈ భూగోళంలో లేదు. కాబట్టి ఈ భూమికి స్వర్ణభూమి అని పేరు వచ్చింది. ఈ భూమిలో సువర్ణాదిరత్నాలు ఉత్పన్నమవుతాయి. అందుకే సృష్ట్యాదిలోనే ఆర్యులీ దేశానికి వచ్చి నివసించారు. ఈ విషయాన్ని నేను సృష్టి ఉత్పత్తి విషయంలోనే ఆర్యనామం ఉత్తమ పురుషులకు చెందినదని, ఇక ఆర్యులకంటే భిన్నులైన అన్యమానవులు దస్యులవుతారని వ్రాసినాము.

భూగోళంలో ఉన్న సమస్త దేశాలు ఈ దేశాన్ని పొగుడుతున్నాయి. ఈదేశంలో 'పరుసవేది' అను మణి ఒకటి ఉన్నట్లుగా ఆశలు పెట్టుకున్నారు. పరుసవేది మణి ఉండటం అసత్యం. ఈ మణితో ఏ లోహాలను తాకినా అది బంగారంగా మారుతుందని చెప్పారు. కాని వాస్తవానికి ఈ ఆర్యావర్తదేశమే ఒక నిజమైన - యథార్థమైన 'పరుసస్పర్శవేది'. ఈ పరుసవేది అనే ఈ దేశాన్ని లోహరూప దరిద్రావస్థలో ఉన్న విదేశీయులు స్పర్శించగానే సువర్ణంగా అంటే ధనాఢ్యులుగా మారుతున్నారనే ఆశ కలిగి ఈ దేశానికి వచ్చారు.

ఆర్యసార్వభౌమరాజ్యం

ఏతద్దేశ ప్రసూతస్య సకాశాదగ్ర జన్మనః ।
స్వం స్వం చరిత్రం శిక్షేరన్ పృథివ్యాం సర్వమానవాః ॥ మను. అ. 2-20 ॥

సృష్టి మొదలుకొని ఐదువేల సంవత్సరాల పూర్వం వరకు ఆర్యుల సార్వభౌమ చక్రవర్తి రాజ్యం, అంటే భూగోళానికి అంతటికి అత్యున్నతమైన ఒకే ఒక రాజ్యం సర్వోపరిగా విరాజిల్లుచుండేది. అన్ని

దేశాలలో మాండలికులు అంటే చిన్నచిన్న సామంతరాజులు ఉండేవారు. కౌరవ పాండవులతో పాటు ఇక్కడి రాజ్యానికి మరియు రాజ శాసనానికి ఈ భూగోళం యొక్క సమస్త రాజులు మరియు ప్రజలు లోబడి ప్రవర్తించారు. ఎందుకంటే ఈ విషయం సృష్ట్యాదిలో రచించబడిన మనుస్మృతియే దానికి ప్రమాణం. ఇలాంటి ఆర్యావర్త దేశంలో జన్మించిన బ్రాహ్మణులు అంటే విద్వాంసులతో ప్రపంచములోని మానవులు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, దస్య, మ్లేచ్ఛాదులు అందరు తమ అర్హతానుసారం విద్యలను, శీల నిర్మాణానికి కావలసిన చారిత్రిక శిక్షలను ఇక్కడికి వచ్చి అభ్యసించారు. మహారాజైన యుధిష్ఠరుని రాజసూయయాగం నుండి మహాభారత యుద్ధం వరకు సమస్త రాజ్యాలు ఇక్కడి రాజ్యాధీనంలోనే ఉన్నాయి.

వినండి. చైనా దేశస్థుడైన భగదత్తుడు, అమెరికా నివాసస్థుడైన బభ్రువాహనుడు, యూరపుదేశ బిడాలాక్షుడు (పిల్లికండ్లు కలవాడు), యూనాన్ (టర్కీ గ్రీకు) దేశస్థులైన యవనులు, తురుష్కులు, ఈరాన్ దేశవాసి అయిన శల్యుడు మొదలైన రాజులందరు రాజసూయ యాగానికి, మహాభారత యుద్ధానికి ఆజ్ఞానువర్తులై వచ్చినారు. రఘుమహారాజు యొక్క గణరాజ్యానికి రావణుడు కూడా వశుడై సామంతరాజుగా ఉన్నాడు. శ్రీరామచంద్రుని కాలంలో అతడు విరోధిగా మారినందున పరస్పర విరుద్ధం కలగటంతో అతనిని శ్రీరామచంద్రుడు దండించి రాజ్యభ్రష్టుని చేసి అతని సోదరుడైన విభీషణునికి రాజ్యాధికారం ఇచ్చాడు.

స్వాయంభువ రాజు మొదలుకొని పాండవుల వరకు ఆర్యులకు చక్రవర్తి రాజ్యం సర్వత్ర విరాజిల్లుతూ ఉండేది. తర్వాత పరస్పర శత్రుత్వాలతో పోట్లాడి నాశనమైనారు. పరమాత్ముని ఈ సృష్టిలో అన్యాయుల, అహంకారుల, అవిద్వాంసుల రాజ్యాలు అధిక కాలం వరకు కొనసాగవు. ఇది ప్రాపంచిక నైసర్గిక వృత్తాంతం. అంటే మిక్కుటమైన ధనం అసంఖ్యాక ప్రయోజనాలు అధికమైనపుడు సోమరితనం, పురుషార్థ రాహిత్యం, ఈర్ష్య ద్వేషాలు, విషయవాసనలలో ఆసక్తి, పొరపాట్లు, భ్రమలు మొదలగునవి వృద్ధి పొందుతాయి. వీటి ద్వారా దేశంలో విద్య, సుశిక్షలు నష్టమై దుర్గుణాలు, దుర్వ్యసనాలు వృద్ధిచెందుతాయి. ఉదా:- మద్యమాంససేవనం, బాల్యవివాహాలు, విచ్చలవిడి వ్యవహారాది దోషాలు అభివృద్ధి చెందుతాయి.

ఇంక యుద్ధవిభాగంలో ~~యుద్ధ~~విద్యాకౌశలం మరియు సైన్యం అధికవృద్ధి చెందినపుడు అంటే మమ్ములను ఎదిరించేవారు భూలోకంలో మరెవరు లేరని భావించినప్పుడు వారిలో పక్షపాతం, అహంకారాలు అధికమై అన్యాయం పెరుగుతుంది. ఈ దోషం ఏర్పడినపుడు పరస్పరం విరోధులవుతారు. వారి కంటే అధికుడవటానికి వేరే చిన్న కులం నుండి ఎవడో ఒక సమర్థుడు నిలబడి వారిని ఓడించటానికి సమర్థుడవుతాడు. ఉదా:- ముసల్మాను సుల్తానుల శాసనకాలంలో శివాజీ, గోవిందసింహుని వంటి సమర్థ వీరులు నిలచి ముసల్మానుల రాజ్యాన్ని ఛిన్నా భిన్నం చేసిన విషయాన్ని ఎవరెరుగరు?

పూర్వకాలపు చక్రవర్తి రాజులు

అథకిమేతైర్వా పరేఽన్యే మహాధనుర్ధరాశ్చక్రవర్తినః కేచిత్ సుద్యుమ్న భూరిద్యుమ్నేంద్రద్యుమ్న కువలయాశ్వ యౌవనాశ్వ వధ్ర్యశ్వాశ్వపతి శశబిందు హరిశ్చంద్రాఽమ్బరీష ననక్తు సర్యాతి యయాత్యనరణ్యాక్ష సేనాదయః । అథ మరుత్త భరత ప్రభృతయో రాజానః॥ మైత్ర్యుపనిషత్. (ప్ర. 1 ఖం. 4)

ఇలాంటి ప్రమాణాలద్వారా సృష్టి మొదలుకొని మహాభారత యుద్ధ పర్యంతం చక్రవర్తి, సార్వభౌమ రాజులు ఆర్యావర్తదేశంలో ఉన్నారని తెలుస్తున్నది. తర్వాత వీరి సంతానం దురదృష్టంతో రాజ్య పదవీచ్యుతులై విదేశీయుల పాదాక్రాంతులైనారు. ఉదా:- సుద్యుమ్నుడు, భూరిద్యుమ్నుడు కువలయాశ్వుడు, ఇంద్రద్యుమ్నుడు, యౌవనాశ్వుడు, వధ్ర్యశ్వుడు, అశ్వపతి, శశబిందుడు, హరిశ్చంద్రుడు, అంబరీషుడు, ననక్తుడు, శర్యాతి, యయాతి, అనరణ్యుడు, అక్షసేనుడు, మరుత్తుడు మరియు భరతుడు సార్వభౌములయ్యారు. వీరు సమస్త భూమిలో జగత్ప్రసిద్ధి చెందిన చక్రవర్తిరాజులని వ్రాయబడ్డారు. ఇలాగే స్వాయంభువాది చక్రవర్తి రాజుల పేర్లు స్పష్టంగా మనుస్మృతి, మహాభారతాది గ్రంథాలలో వ్రాయబడ్డాయి. దీనిని అజ్ఞానం మరియు పక్షపాతం కలిగినవారే మిథ్య అని అంటారు.

ఆగ్నేయాది అస్త్ర శస్త్ర విద్యలు

ప్రశ్న:- గ్రంథంలో వ్రాయబడిన ఆగ్నేయాస్త్రాది విద్యలు సత్యాలా? కావా? ఫిరంగులు, తుపాకులు ఆ కాలంలో ఉన్నాయా? లేవా?

జవాబు:- ఉన్నాయి. ఈ విషయాలు నిజమైనవే. అస్త్రాలు, శస్త్రాలు అన్నీ ఆ రోజుల్లో ఉండేవి. ఎలాగంటే పదార్థం విద్య ద్వారా ఈ విషయాలన్నీ సంభవాలే.

ప్రశ్న:- ఇవి అన్నీ దేవతల మంత్రాలవల్ల సిద్ధించుచుండెడివా?

జవాబు:- కాదు. దేని ద్వారా అస్త్రశస్త్రాలను ఉపయోగిస్తున్నారో అవి మంత్రాలు. మంత్రాలు అంటే ఆలోచనలు-విచారాలు. వాని నాలోచించి అస్త్రశస్త్రాలను సిద్ధం చేశారు. అప్పుడు వాటిని ప్రయోగించారు. మంత్రం శబ్దమయం. దానితో ఏ ద్రవ్యపదార్థం ఉత్పన్నం కాదు. మంత్రం ద్వారా అగ్ని ఉత్పన్నమైనదని ఎవరైనా అంటే అది మంత్రజపం చేసేవాని హృదయాన్ని, నాలుకని కూడా భస్మం చేయ్యాలి. శత్రువును చంపటానికి పోయి తానే మరణిస్తాడు. మంత్రానికి ఆలోచన అనే అర్థమున్నది. రాజమంత్రి, అంటే రాచకార్యాలను ఆలోచించి చేసేవాడు అని అర్థం. అలాగే ఆలోచనకు మంత్రం అనిపేరు. అంటే ఆలోచనవలన సమస్త సృష్టియొక్క పదార్థాల జ్ఞానం ప్రథమంలో కలుగును. ఆ తర్వాత అనేక ప్రయోగాల ద్వారా పనిచేసిన అనేకరకాలైన పదార్థాలు, క్రియాకౌశలాలు ఉత్పన్నమవుతున్నాయి. ఎవడో ఒక మానవుడు ఒక ఇనుప బాణాన్ని కాని లేక ఒక ఇనుప గుండును

కాని తయారుచేసి దానిలో ఒక పదార్థం ఉంచుతారు. అది అగ్ని తాకిడితో వాయువులో పొగ వ్యాపింప చేస్తుంది. సూర్యకిరణాలు కాని లేక వాయు స్పర్శ కాని ఆ పదార్థానికి తాకగానే నిప్పుమంటలు లేస్తాయి. దీని పేరు ఆగ్నేయాస్త్రం. మరొకడు దీనిని నివారించదలిస్తే ఆ ఆగ్నేయాస్త్రం పైకి వారుణాస్త్రాన్ని విడుస్తాడు. అంటే ఒక శత్రువు మరొక శత్రువుయొక్క సేనపై ఆగ్నేయాస్త్రాన్ని విడిచి నష్టపరుస్తారు. అదే విధంగా తన సైన్యాన్ని రక్షించుకోవటానికై సైన్యాధిపతి వారుణాస్త్రాన్ని ఆగ్నేయాస్త్రంపై ఉపయోగిస్తారు. పదార్థాల యొక్క మిశ్రమంతో అస్త్రం నుండి వచ్చే పొగ, వాయు స్పర్శ తాకగానే మేఘాలుగా మారి వెంటనే వర్షించడం ఆరంభిస్తాయి. అగ్నిని చల్లారుస్తాయి. ఇలాంటిదే నాగబంధం. అంటే దీన్ని శత్రువుపై ప్రయోగించిన అతని శరీర అంగాలను గట్టిగా పట్టుకొని బంధిస్తుంది. అదే విధంగా మరొకటి మోహనాస్త్రం. అంటే దీనిలో మాదకద్రవ్యాలు ఉంచటంతో దాని నుండి వెడలు పొగ తాకగానే శత్రుసైన్యమంతా నిద్రపోతుంది. అంటే మూర్ఛను పొందుతుంది. ఇదేవిధంగా శస్త్రాస్త్రాలన్నీ ఉన్నాయి. ఇదే కాక ఒక తీగె ద్వారా లేక అద్దం ద్వారా లేక మరేదైన అన్య పదార్థాలతో విద్యుత్తును ఉత్పత్తి చేసి శత్రునాశనం చేస్తారు. దీనిని కూడా ఆగ్నేయాస్త్రం, పాశుపతాస్త్రమని అంటారు.

తోపు, బందూక్ అనే పేర్లు యితర భాషా శబ్దాలు. ఇవి సంస్కృత భాషకు, ఆర్యావర్తీయ భాషకు చెందిన శబ్దాలు కావు. సంస్కృతంలో వీటిని శతఘ్ని, భుశుండి అంటారు. సంస్కృతవిద్యను అభ్యసించనివారు భ్రమచెంది ఒక శబ్దానికి ఏదో ఒక అర్థాన్ని వ్రాస్తూ చెబుతున్నారు. దీనికి బుద్ధిమంతులు ప్రమాణాలను చూపలేరు.

భూగోళంలో ఎన్ని భాషలు (విద్యలు) వ్యాపించియున్నాయో అవన్నీ ఆర్యావర్తదేశమైన మన దేశం నుండి ఈజిప్టు దేశానికి, అక్కడి నుండి యూనాన్ = తురుష్క దేశానికి, అక్కడి నుండి రోము, మరియు అక్కడి నుండి యూరోపు (ఐరోపా) దేశానికి అక్కడి నుండి అమెరికా మొదలైన దేశాలలో వ్యాపించాయి.

ఆర్యావర్తం నుండే అన్ని భాషలు వ్యాపించినవి

ఇప్పటి వరకు సంస్కృతభాషకు ఆర్యావర్త దేశంలో ఉన్నంత ప్రచారం మరే దేశంలోనూ లేదు. జర్మనీ దేశంలో సంస్కృత విద్యాప్రచారం ఎక్కువగా ఉన్నట్లు జనులు చెబుతున్నారు. ఇంతేకాక మోక్షమూలర్ చదివినంత సంస్కృతం మరొకరు చదువలేదని కూడా అంటారు. ఇది కేవలం చెప్పటానికి మాత్రమే కాని వాస్తవం కాదు. ఎందుకంటే **"యస్మిన్దేశే ద్రుమోనాస్తి తత్రైరండోఽపి ద్రుమాయతే'.** అంటే వృక్షాలు లేని చోట ఆముదపు చెట్టునే మహావృక్షంగా భావిస్తారు, అలాగే ఐరోపాదేశంలో సంస్కృతభాషా ప్రచారం లేనందున జర్మనులు మాక్సుముల్లరు చదివిన కొద్ది పాటి చదువే ఆ దేశానికి గొప్పదైనది. కాని ఆర్యావర్త దేశం వైపుకు చూస్తే జర్మనులు చాలా తక్కువ పాండిత్యం కలవారని తెలుస్తున్నది. ఎందుకంటే నేను జర్మనీదేశ నివాసియైన (ప్రిన్సిపాల్) ఆచార్యుని పత్రం

ద్వారా జర్మనీ దేశంలో సంస్కృతభాషలో వ్రాయబడిన పత్రానికి అర్థం చెప్పేవారు కూడా చాలా తక్కువగా వున్నారని తెలుసుకొన్నాను. మాక్సుముల్లరు యొక్క సంస్కృత సాహిత్యాన్ని, వేదవ్యాఖ్యానాన్ని చూసి నాకు ఈ క్రిందివిధంగా విదితమైనది. ఆతడు ఇక్కడి ఆర్యావర్తీయులతో వ్రాయబడిన టీకా వ్యాఖ్యానాలను చూసి తనయిష్టం వచ్చినట్లుగా మార్చి అదో ఇదో ఏదో ఒక విధంగా వ్రాసాడే కాని అంతకు మించి ఏమీ లేదు. అదెలాగంటే:-

యుంజంతి బ్రధ్నమరుషం చరన్తం పరితస్థుషః । రోచంతే రోచనాదివి ॥ (ఋ. 1-6-1)

ఈ మంత్రంలోని 'బ్రధ్న' శబ్దానికి గుఱ్ఱం అని అర్థం వ్రాసాడు. దీనికే సాయణాచార్యుడు సూర్యుడని అర్థం చెప్పారు. ఇది పై అర్థం కంటే మంచిదే. కాని దీనికి సరియైన అర్థం పరమాత్ముడు. అందుకే నేను వ్రాసిన 'ఋగ్వేదాది భాష్యభూమిక'లో చూడండి. అందులో ఈ మంత్రానికి యథార్థమైన అర్థం వ్రాయబడింది. జర్మనీ దేశం వారికి మరియు మాక్సుముల్లరుకు సంస్కృతభాషలో ఎంత పాండిత్యం ఉందో దీని ద్వారా తెలుసుకోండి.

ఈ భూగోళంలో ఎన్ని విద్యలు, ఎన్ని మతాలు వ్యాపించి ఉన్నాయో అవన్నీ ఆర్యావర్తదేశం నుండే వెలువడి వ్యాపించి ప్రచారమైనాయనటం నిశ్చితం. ఫ్రాన్సు దేశస్థుడైన 'గోల్డుస్టకర్' అనే అతడు తన బైబిల్ ఇన్ ఇండియా ఇండియాలో బైబిలు అనే గ్రంథంలో ఏమి వ్రాసాడో చూడండి. **"సమస్త విద్యలకు ఉపకారాలకు, శుభాలకు భండారం ఆర్యావర్తం. సమస్త విద్యలు, మంత్రాలు ఈ దేశం నుండే వ్యాపించాయి".** అతడు పరమేశ్వరుని ఈ విధంగా ప్రార్థించాడు. **"ఓ పరమేశ్వరా! ఆర్యావర్త దేశంలో ప్రాచీనకాలంలో ఎంత ఉన్నతి ఉందో అలాగే మా దేశంలోనూ చేయండి"** అని వ్రాసాడు. దీనిని మీరు ఆ గ్రంథంలో చదవవచ్చు.

దారాశికోహ అనే రాజు కూడా **"సంపూర్ణవిద్యలు సంస్కృతంలో ఉన్నట్లుగా మరేభాషలోనూ లేవ'**ని నిశ్చయించి చెప్పాడు. ఉపనిషత్తుల భాషాంతరీకరణలో అతడిలా వ్రాసాడు. **"నేను అరబ్బీ వంటి భాషలు అనేకం చదివాను, కాని నా మనస్సులోని సంశయాలు తొలగవాదు, ఆనందం కలుగలేదు. సంస్కృతభాషను చదివిన తరువాత నా సందేహాలన్నీ పోయి మిక్కిలి ఆనందాన్ని పొందాను".**

ప్రాచీన జ్యోతిష యంత్రం

కాశీలోని మానసమందిరంలో ఉన్న 'శింశుమార చక్రా'న్ని చూడండి. దానికి సరైన రక్షణా ఏర్పాట్లు లేవు. అయినప్పటికి కూడా అది ఎంతో ఉత్తమంగా ఉన్నది. దానిలో నేటికి కూడా ఖగోళమందలి అనేక విషయాలు చాలా విదితమవుతున్నాయి. జయపురాధీశుడైన సవాయి మహారాజు దానిని ప్రవేశపెట్టాడు. ఇది ఇప్పుడు శిథిలావస్థలో ఉన్నది. దీనిని ఎవరైనా రక్షించి, తిరిగి మరమ్మతులు చేపడితే చాలా బాగుండేది.

మహాభారత యుద్ధ ప్రభావం

ఇంతటి వస్తు సంపదకు శిరోమణి అయిన దేశం మహాభారత యుద్ధం ద్వారా కలిగిన ఆఘాతం నుండి నేటికి కూడా తన పూర్వ వైభవానికి రాలేదు. ఎందుకంటే ఒక సోదరుడు తన సోదరుని కొట్టి చంపాలనుకొంటే దేశం నాశనాన్ని పొందక ఏమవుతుంది?

"వినాశకాలే విపరీతబుద్ధిః" (చాణక్య. నీ. అ. 16-15) ఇది ఒక కవి వాక్యం. వినాశకాలం దాపరించినపుడు విపరీతబుద్ధి కలిగి విపరీతమైన కార్యం చేస్తుంటారు. ఎవరైనా వారికి చక్కగా బోధించినచో విపరీతంగాను, విపరీతంగా బోధించినచో మంచిగాను అనుకుంటారు. గొప్ప గొప్ప విద్వాంసులు, రాజులు, మహారాజులు, ఋషులు, మహర్షులనేకులు మహాభారత యుద్ధంలో చంపబడ్డారు. చాలామంది మరణించారు. అందువలన అప్పటి నుండీ విద్య, వేదోక్త ధర్మప్రచారం అడుగంటింది. ఈర్ష్యాద్వేషాలు, అహంకారం పరస్పరం కలుగ నారంభించాయి. బలవంతులైనవారు దేశాన్ని పణంగా బెట్టి రాజులు కాసాగారు. అలాగే ఆర్యావర్తదేశంలో అంతట చిన్న చిన్న రాజ్యాలు, సామంత రాజ్యాలు ఏర్పడ్డాయి. అలాంటి తరుణంలో తిరిగి ద్వీప ద్వీపాంతరాల రాజ్యాల నియమ వ్యవస్థను రూపొందించేవారెవరు?

నామధారి బ్రాహ్మణులు

బ్రాహ్మణులే విద్యావిహీనులైనప్పుడు క్షత్రియ, వైశ్య, శూద్రులు అవిద్వాంసులవటంలో చెప్పవలసినదే మున్నది? పరంపగా వేదాది శాస్త్రాలను అర్థ సహితంగా అభ్యసించే ప్రచారమునశించినది. కేవలం జీవనార్థమై బ్రాహ్మణులు పాఠాలను పఠించటం ఆరంభించారు. ధనం ఇవ్వనందువల్ల క్షత్రియాది వర్ణాలవారికి కూడా చదివించడంమాని వేశారు. అవిద్వాంసులు పెరిగినందుకు మోసం, కపటం, అధర్మం కూడ పెరిగింది. బ్రాహ్మణులు తమ జీవన నిర్వహణకై తగిన నియమనిబంధనలనేర్పాటు చేసుకోవాలని ఆలోచించారు. ఏకాభిప్రాయులై దీనినే నిర్ణయించుకొని క్షత్రియాది అన్యవర్ణాలవారితో "మేము మీ పూజ్యదేవతలం. మాకు సేవాశుశ్రూషలు చేసినచో మీకు స్వర్గం, ముక్తి లభిస్తుంది. మీరు మా సేవలు చేయకపోతే ఘోర నరకంలో పడతా"రని ఉపదేశించారు.

"వేదశాస్త్రాలలో పూర్ణవిద్యావంతులు, ధార్మికులైనవారుమాత్రమే బ్రాహ్మణులని, వారే పూజనీయులని వేదాలలోనూ, ఋషి, ముని ప్రణీత శాస్త్రాలలోనూ వ్రాయబడి ఉంది. అలాంటి బ్రాహ్మణులం మేమే" అని మూర్ఖులు, కపటులు, విషయవాసనలలో తత్పరులైన కాముకులు, అధర్మాత్ములైన వారు చెప్పుకొంటూ పూజింపబడ్డారు. ఇలాంటి దుర్గుణ, దురాచారాలుగల బ్రాహ్మణులు, పూజనీయమైన పేర్లు పెట్టుకొన్నారు. ఆహా! ఆ ఆప్తవిద్వాంసుల లక్షణాలు ఈ మూర్ఖులలో ఎప్పుడు సంభవిస్తాయి? సంస్కృతభాషాజ్ఞాన శూన్యులైన క్షత్రియాది యజమానుల సమక్షంలో ఈ మూర్ఖులు ఏవేవో తల, తోక లేని వ్యర్థ ప్రలాపాల నాడినారో కాని ఆ యా ఆలోచనలనన్నింటిని అప్పటి రాజులు, మంత్రులు అంగీకరించారు. అప్పటినుండి ఈ నామమాత్రపు బ్రాహ్మణులు ఏర్పడ్డారు.

వీరు అందరిని తమ శబ్దజాలంలో బంధించి వశీభూతులనులు చేసుకొని 'బ్రహ్మవాక్యంజనార్ధనః' అని చెప్పుసాగారు.

అంటే బ్రాహ్మణుల నోటినుండి ఏ వచనం వచ్చినా అది సాక్షాత్తుగా భగవంతుని నోటినుండి వచ్చినదని నమ్మినారు క్షత్రియాది వర్ణాలు వివేకాంధులు, ధనాఢ్యులు అంటే లోపల విద్యా నేత్రంలేని ధనాఢ్యులైన క్షత్రియాది వర్ణాలవారు ఈ వ్యర్థ నామమాత్ర బ్రాహ్మణులకు శిష్యులుగా లభించారు. ఇక వీరి విషయానందానికి పూదోట లభించినట్లయ్యింది. ప్రపంచంలో ఏ ఉత్తమ పదార్థాలున్నాయో అవన్నీ బ్రాహ్మణుల నిమిత్తమై ఉన్నాయని కూడా వెల్లడించారు. అంటే గుణ, కర్మ, స్వభావాన్ని అనుసరించే ఏర్పర్చబడిన బ్రాహ్మణాది వర్ణ వ్యవస్థా నియమాలను రద్దుచేసి జన్మసిద్ధ వర్ణ వ్యవస్థను ఏర్పరిచారు. మరణించినప్పుడు కూడా వారి యజమానుల నుండి దానాలను స్వీకరించడం ఆరంభించారు.

తమ ఇచ్ఛానుసారంగా ఏదితోస్తే అది చేసేవారు. "మేము భూలోక దేవతలం, మాకు సేవాశుశ్రూషలు చేయకున్న దేవలోకం ఎవరికీ లభించదు" అని చెప్పారు. ఇట్టివారితో మీరు ఏ లోకానికి వెళతారని ప్రశ్నించాలి. కారణమేమిటంటే మీరు చేసే కార్యాలు ఘోరనరకాన్ని అనుభవింప చేసేవిగా ఉన్నాయి. "మీరు క్రిమి, కీటక, పతంగాలు = రెక్కల పురుగులు అవుతారు" అని వారితో చెప్పాలి. అప్పుడు వారు మిక్కుటమైన క్రోధంతో ఇలా అంటారు. "మేము శపించిన మీరు నాశనమవుతారు. ఎందుకంటే "బ్రహ్మ ద్రోహీ వినశ్యతి", అంటే బ్రాహ్మణద్రోహి నశిస్తా"డని వ్రాయబడింది. ఔను సంపూర్ణ వేదాలను, పరమాత్మ, ఆత్మలను తెలిసినవారు, ధర్మాత్ములు, సమస్త జగత్తుకు ఉపకారం చేసే బ్రాహ్మణులతో ద్వేషం పెట్టుకొంటే, వాడు తప్పక నశిస్తాడనే మాట నిజం. కాని బ్రాహ్మణులు కానట్టి వారిని బ్రాహ్మణులనటం, వారికి సేవ చేయటం తగదు. వీరికి బ్రాహ్మణనామమే వర్తించదు. ఇలాంటి నామధారి బ్రాహ్మణులే ఇక్కడ 'పోపులు' అనబడ్డారు.

బ్రాహ్మణుడే పోపు

ప్రశ్న:- అయితే మేము ఎవరం? (ఇక్కడ ప్రశ్నకర్త బ్రాహ్మణ నామధారిగా ఎంచుకోవాలి).

జవాబు:- మీరు 'పోపులు' (అంటే క్రైస్తవమత గురువు వంటివాడవు)

ప్రశ్న:- 'పోపులు' అని ఎవరినంటారు?

జవాబు:- 'రోమన్' భాషలో ఈ పదానికి 'పెద్దవాడు గొప్పవాడు, తండ్రి' అని అర్థం. కాని మేముమాత్రం ఇప్పుడు మోసం కపటాలతో యితరులను మోసంచేసి తమ స్వార్థాన్ని నెరవేర్చుకొనేవానిని 'పోపులు' అని చెప్తాము.

ప్రశ్న:- మేమైతే బ్రాహ్మణులం. సాధువులం ఎందుకంటే మా తండ్రి బ్రాహ్మణుడు. మా తల్లి బ్రాహ్మణ స్త్రీ మరియు మేము ఫలానా సాధువు యొక్క శిష్యులం.

జవాబు:- ఇది సత్యమే కాని, సోదరా! విను. మాతాపితలు బ్రాహ్మణీ, బ్రాహ్మణులైనంత మాత్రాన, ఒక సాధువుకు శిష్యులైనంత మాత్రాన ఎవ్వరూ బ్రాహ్మణుడు కాలేడు. తమ తమ ఉత్తమ గుణ, కర్మ స్వభావాల చేత, పరోపకారం చేత బ్రాహ్మణులవుతారు.

రోము పోపుల మాయాలీలలు - మోసాలు

ఇది మేము విన్న విషయం:- రోము దేశంలో 'పోపులు' తన శిష్యులకు ఇలా చెప్తారట. మీరు మీ పాపాన్ని మాముందు చెప్పినచో మేము వాటిని క్షమిస్తాము. మాకు సేవచేయక, ఆజ్ఞలను పాటించక ఎవ్వరూ కూడా స్వర్గానికి పోలేరు. మీరు ఒకవేళ స్వర్గానికి వెళ్ళాలనుకుంటే మా వద్ద ఎన్ని రూపాయలను జమచేస్తే, వానికి తగినన్ని వస్తువులు స్వర్గంలో మీకు లభిస్తాయి. దీన్ని నమ్మిన జ్ఞానాంధుడైన ధనవంతుడు ధనపు మూటలు నొసగటంలో నిపుణులైనవాడు స్వర్గానికి పోవాలని పోపుకు తమ ఇష్టం వచ్చినన్ని రూపాయలనిస్తాడు. అప్పుడు ఆ పోపు క్రీస్తు మరియు మరియమ్మ విగ్రహాల ముందు నిలబడి ఈ విధమైన చెక్కు నొకటి వ్రాసి ఇస్తాడట.

అది ఇలాగా ఉంటుంది. 'ఓ ప్రభువైన ఏసుప్రభూ! ఈ మానవుడు స్వర్గానికి రావటానికై నీ పేర ఒక లక్షరూపాయలు మావద్ద జమచేసి ఉన్నాడు. అతడు స్వర్గానికి వచ్చినపుడు నీవు నీ తండ్రి యొక్క స్వర్గరాజ్యంలో ఇరవైఐదు వేల రూపాయలకు తగినంత పూదోట, పండ్లతోటలను, గృహం మరొక ఇరవైఐదు వేల రూపాయల ప్రయాణ సాధనాలను, వేటాడే సాధనాలను, సేవకులను, పనిపాటలు చేసేవారిని, ఇరవైఐదు వేల రూపాయల విలువ గల ఆహార పానీయాలను, వస్త్రోపవస్త్రాలను, మరో ఇరవైఐదు వేల రూపాయల విలువ గల విందు ఇతని ఇష్టమిత్రులకు, సోదరులకు, బంధువుల నిమిత్తమై ఇప్పించుము. మరొకసారి ఆ చెక్కు క్రింద పోపు తన సంతకం చేసి చెక్కును అతని చేతికిచ్చి ఇలా అంటాడు. 'నీవు మరణించినప్పుడు చెక్కును గోరిలో నీ తల దగ్గర పెట్టటానికి నీ కుటుంబం వారికి చెప్పు. తర్వాత నిన్ను తీసుకొని వెళ్లటానికి దేవదూతలు వస్తారు. అప్పుడు నీతో పాటు ఈ చెక్కును స్వర్గానికి తీసుకెళ్ళి అందులో వ్రాసినట్లు తగినన్ని వస్తువులు నీకు అక్కడ దేవుడిస్తాడు.

చూడండి! పోపు స్వర్గాన్ని గుత్తకు తీసుకొన్నట్లు వ్యవహరిస్తున్నాడు. యూరోపు (దేశంలో) ఖండంలో మూర్ఖత్వం ఉన్నంత వరకు అక్కడ పోపుల లీలలు జరుగుతూనే ఉంటాయి. అయితే ఇప్పుడు విద్యావంతులు అధికం కావడం వల్ల పోపుయొక్క అబద్ధపు లీలలు అంత అధికంగా సాగటంలేదు. కాని పూర్తిగా నిర్మూలన మాత్రం కాలేదు.

ఆర్యావర్తపు పోపులు

ఇదేవిధంగా ఆర్యావర్తంలో ఉన్న పోపులు లక్షల కొద్ది రూపాలను దోస్తూ తమ లీలలను వ్యాపింపచేస్తున్నారని తెలుసుకోండి. అంటే రాజులకు గాని, ప్రజలకు గాని విద్యను చదివించరాదు. సత్పురుషుల సాంగత్యం చేయకూడదు. రాత్రింబవళ్లు పెదదారి పట్టించటం తప్ప కొంచెం పని

కూడా చేయరాదు. కాని ఎవరు ఛల కపట కుత్సిత వ్యవహారాలను చేస్తారో వారే పోపులనబడతారన్న విషయాన్ని జ్ఞాపకంలో ఉంచుకోవాలి. అయితే వారిలో కూడా ఎవరైనా ధార్మిక విద్వాంసులు, పరోపకారాలున్నచో వారు నిజమైన బ్రాహ్మణులు మరియు సాధువులు అని తెలుసుకోవాలి.

ఉత్తమ బ్రాహ్మణులు - వేద రక్షకులు

ఛలకపట స్వార్థులైన మానవులను (ఇతరులను వంచించి తమ ప్రయోజనాలను, నెరవేర్చుకొనేవారిని) 'పోపు', శబ్దంలో గ్రహించటం. ఉత్తమ పురుషులను 'బ్రాహ్మణులు, సాధువు'లను పేరుతో స్వీకరించటం యోగ్యం. ఉత్తమ బ్రాహ్మణులు సాధువులు లేకుంటే వేదాది సత్య శాస్త్ర గ్రంథాలు స్వరసహితంగా పఠనపాఠనాలు చేయటం, జైన, మహమ్మదీయ, క్రైస్తవుల వలలలో పడకుండా కాపాడుతూ ఆర్యులను వేదాది సత్ శాస్త్రాలలో ప్రీతియుక్తులుగా చేయటం,, వర్ణాశ్రమాలందుంచటం అనే ఇలాంటి కార్యాలను సమర్థులైన బ్రాహ్మణులు, సాధువులు తప్ప అన్యులెవరు చేయగలరు?

"విషాదప్యమృతం గ్రాహ్యమ్" మను. 2-239 విషం నుండి కూడ అమృతాన్ని గ్రహించటం లాగానే దారి తప్పించేటటువంటి పోపులీలల నుండి జనులను కాపాడటం, మతాంతరుల వలలో చిక్కుకోకుండా చేయటమే విషంనుండి అమృతాన్ని గ్రహించటంవంటిది.

స్వార్థులైన బ్రాహ్మణులు

యజమానులు విద్యావిహీనులైనపుడు స్వయంగా తామేదో కొన్ని పూజా పాఠాలను చదివి అహంకారులై బ్రాహ్మణనామధారులు పరస్పరం ఆలోచించుకొని ఏకాభిప్రాయులై రాజు మొదలైన అధికారులతో ఇలా అన్నారు. "బ్రాహ్మణులు మరియు సాధువులు శిక్షార్హులు కారు. **"బ్రాహ్మణో న హంతవ్యః సాధుర్న హన్తవ్యః"** అనే ఇలాంటి వాక్యాలు, సత్యసంధులు, యథార్థమైన బ్రాహ్మణుల, సాధువుల విషయంలో వ్రాయుబడిన వాక్యాలను తమకు అన్వయింపచేసుకొన్నారు. మరింకా మిథ్యావచనాలతో యుక్తమైన గ్రంథాలను రచించి వాటిలో మన ఋషుల, మునుల పేర్లను చేర్చి వారి పేర్లతోనే వినిపించారు. ప్రఖ్యాతిచెందిన ఋషి, మహర్షుల పేర్లను అడ్డంపెట్టుకొని తాము తప్పులు చేసి దండనావ్యవస్థనుండి తప్పించుకొన్నారు. అంటే ఎన్నో కఠిన కట్టుదిట్టాలను ఏర్పరచారు. వారి ఆజ్ఞ లేకుండా నిద్రించటం, లేవటం, కూర్చోవటం, రాకపోకలు చేయటం, భుజించటం, త్రాగటం మొదలైన కార్యాలు వారు చెప్పనిదే చేయటానికి వీలుకాని నియమాలను నిర్మించుకొన్నారు.

'పోపు' అనే పేరుతో పిలువబడు బ్రాహ్మణుడు, సాధువు "ఎట్టి అపరాధాన్ని చేసినా దండించరా"దను నియమాన్ని రాజులకు చెప్పి శాసనం చేయించారు. ఇలాంటి శాసనం చేయించుకున్న పోపులు ఏ కోరిక కలిగినా వెంటనే యథేచ్ఛగా వానిని ఆచరించారు.

అంటే ఈ నాశనానికి, ఇలాంటి దురవస్థకు మూలకారణం మహాభారత యుద్ధం కంటే పూర్వం ఒక వేయి సంవత్సరాల నుండే ఆరంభమైంది. ఎలాగంటే అప్పటికే ఈ దేశంలో ఋషులు, మునులు లోపించారు. ఆ సమయంలో కొందరు ఋషులు, మునులు ఉన్నప్పటికి కూడా వారిలో కొద్ది సోమరితనం, భ్రమ, ఈర్ష్య, ద్వేషాలనే అంకురాలు మొలకెత్తాయి. అవి క్రమంగా పెరిగి వృక్షాలైనాయి.

సత్యోపదేశం లేనందువలన అంధపరంపర

సత్యోపదేశాలు ఉపదేశింపబడనందుకే ఆర్యావర్తంలో అవిద్య వ్యాపించి, పరస్పరం పోట్లాడి కలహించుకోసాగారు. ఎలాగంటే:-

"ఉపదేశ్యోపదేష్టృత్వాత్ తత్సిద్ధిః, ఇతరథాంధపరంపరా" ॥ సాంఖ్య. 3. 79-81 ॥

అత్యుత్తమ ఉపదేశకులున్నప్పుడు ధర్మార్థకామ మోక్షాలు చక్కని విధి విధానంతో బాగా సిద్ధిస్తాయి. వారులేనినాడు వినేవారుండరు. అప్పుడు జాతిలో అంధవిశ్వాసాలు - మూఢ నమ్మకాలు వ్యాపిస్తాయి. ఇలాగైనప్పటికీ కూడ సత్పురుషులు ఉద్భవించి సత్యోపదేశం చేసినప్పుడు ఈ మూఢవిశ్వాసాలు నశించి జ్ఞానప్రకాశం అంతటా వ్యాపిస్తాయి.

అప్పుడుకూడా పోపులు సావధానులై తమ పూజ, తమ పాదపూజ చేయించుకోవడం ఆరంభించారు. ఇందులోనే మీ కల్యాణం ఉన్నదని బోధిస్తారు. విద్య, బలం, బుద్ధి, శూరవీరత్వాది శుభగుణాలన్నీ నశిస్తాయి. ఇలాగే లోకులను వశపరచుకొని తాము విషయాసక్తిలో నిమగ్నులై శిష్యులను వంచించి కాలం వెళ్లబుచ్చారు. ఆ తర్వాత విషయాసక్తులై రహస్యంగా మాంసాన్ని భక్షిస్తూ, మద్యాన్ని సేవించడం ఆరంభించారు.

వామమార్గం-పంచమకారాలు

తర్వాత, పైన తెలిపిన వారినుండియే ఒకడు వామ మార్గాన్ని స్థాపించాడు. 'శివ ఉవాచ' 'పార్వత్యువాచ' 'భైరవ ఉవాచ' అనే ఇలాంటి వాక్యాలు వ్రాసి తంత్రాలని పేరు పెట్టాడు. వాటిలో ఇలాంటి చిత్రవిచిత్రాలైన లీలలెన్నో వ్రాసాడు.

1. **మద్యం మాంసం చ మీనం చ ముద్రా మైథునమేవ చ ।**
   ఏతే పంచమకారాః స్యుః మోక్షదాయి యుగే యుగే ॥ (కాళీతంత్రం)

2. **ప్రవృత్తే భైరవీ చక్రే సర్వేవర్ణా ద్విజాతయః ।**
   నివృత్తే భైరవీ చక్రే సర్వే వర్ణాః పృథక్ పృథక్ ॥ (కులార్ణవతంత్రం 8-96)

3. **పీత్వాపీత్వా పునః పీత్వా యావత్పతతిభూతలే ।**
   పునరుత్థాయ వై పీత్వా పునర్జన్మ న విద్యతే ॥ కులార్ణవతంత్రం ॥ (7-100)

4. మాతృయోనిం పరిత్యజ్య విహరేత్సర్వయోనిషు ॥

5. వేదశాస్త్రపురాణాని సామాన్యగణికా ఇవ ।
ఏకైవ శాంభవీ ముద్రా గుప్తా కులవధూరివ ॥ జ్ఞాన సంకలనీతంత్రం ॥

ఈ గవర్గండపోపుల లీలలను చూడండి! ఇవి వేదాలకు విరుద్ధాలైనవి. అత్యంత అధర్మంతో కూడినవి. వీనినే వామమార్గీయులు శ్రేష్ఠం అని భావిస్తున్నారు.

మద్యం, మాంసం, మీనం, ముద్ర (శంఖుచక్రాది చిహ్నాలు) మైథునం అంటే పురుషులందరు శివులుగాను, స్త్రీలందరు పార్వతులుగాను భావిస్తూ.

అహంభైరవస్త్వం భైరవీ హ్యావయోరస్తు సంగమః ॥

'నేను భైరవుడను, నీవు భైరవవి మనిద్దరి సంగమం జరుగుగాక' అని పురుషులైనా, స్త్రీలైనా, ఎవరైనా ఈ వాక్యాన్ని చదివి పరస్పరం సంగమం చేసిన దోషంలేదని బోధిస్తారు.

ముట్టుగల స్త్రీలను కూడా ఈ మంత్రంలో అతిపవిత్రులుగా చేస్తారు. ఉదా:- శాస్త్రాలలో రజస్వలాది స్త్రీలను స్పర్శించటం నిషేధించబడింది. ఇలాంటివారిని వామమార్గీయులు అతి పవిత్రంగా భావిస్తారు. వీరి శ్లోకాల యొక్క వ్యర్థ ప్రలాపాలను ఆలకించండి.

రజస్వలా పుష్కరం తీర్థం చండాలీ తు స్వయంకాశీ ।
చర్మకారీ ప్రయాగః స్యాద్రజకీరమథురామతా ॥
అయోధ్యా పుక్కసీ ప్రోక్తా ॥ (రుద్రాయామలతంత్రం)

రజస్వల అయిన స్త్రీతో సంయోగం చేసిన పుష్కరిణిలో స్నానమాడినట్లు, చండాలస్త్రీతో సమాగమమైన కాశీయాత్ర చేసినట్లు, చర్మకారి స్త్రీతో వ్యభిచరిస్తే ప్రయాగలోని త్రివేణీసంగమంలో స్నాన మాచరించినట్లు, చాకలిదానితో కూడిన మధుర యాత్ర చేసినట్లు, దేశదిమ్మరిజాతి స్త్రీతో క్రీడ చేసిన అయోధ్యాతీర్థ స్నానం చేసినట్లు అవుతుందని చెబుతున్నారు.

మద్యానికి తీర్థం అని, ధర అని పేరు పెట్టారు. ఇలాగే మాంసానికి శుద్ధి లేక పుష్పమని. మత్స్యం పంచమకారాలలో మూడవదవటం వలన తృతీయాయని, నీరు చిక్కుళ్ళని; ముద్రపేరు చతుర్థీయని, మైథునానికీ పంచమి అని పేర్లుపెట్టారు. ఇతరులు అర్థం చేసుకోకుండా ఈ పంచమకారాలకు ఆ యా పేర్లు పెట్టారు. ఇక తమకు కౌలు, ఆర్ద్రవీర, శాంభవ, గణ అనే పేర్లు పెట్టుకొన్నారు. వామమార్గమంలో లేనివారికి కంటకులని, విముఖులని, శుష్కపశువులని పేరు పెట్టారు.

భైరవీ చక్రంలో ఉన్న బ్రాహ్మణులు మొదలుకొని చండాలుర వరకు గలవారందరు ద్విజులనబడతారు. ఈ భైరవీ చక్రం ఒక ఉత్సవం. ఇది పూర్తయిన తర్వాత తిరిగి అందరు తమ

క్షమ వర్ణస్థులుగా మారుతారు. భైరవీ చక్రం అంటే దేవీ పూజకై ఒకేచోట చేరిన తాంత్రికుల, అనాచారుల యొక్క సమూహం.

భైరవి, దేవి పేరిట వావివరుసలు లేకుండా చేసే కుకర్మలు

భైరవీ చక్రంలో వామమార్గులు భూమిమీదో, కొయ్యపలకమీదో ఒక బిందువును త్రికోణాలు కలదిగా, చతుష్కోణాలు కలదిగా, వర్తులాకారంతో చేసి దానిమీద మద్యం కుండ నుంచి, దానిని పూజిస్తారు. **"బ్రహ్మశాపం విమోచథ"** అనే ఈ మంత్రాన్ని పఠిస్తారు. అంటే "ఓ మద్యమా! నీవు బ్రహ్మశాపం నుండి రక్షించు" అని మంత్రాభిప్రాయం.

వామమార్గీయులు చేరే చోటికి ఇతరులను రానివ్వరు. ఈ రహస్య స్థలంలో స్త్రీ పురుషులందరు ఒక చోట సమావేశమవుతారు. ఇక్కడ ఒక స్త్రీని నగ్నంగా చేసి పురుషులు, పురుషుని నగ్నంగా చేసి స్త్రీలు పూజిస్తారు. ఆ తర్వాత అక్కడికెందరో తమ యితరుల భార్యలు, కన్యలు, తల్లులు, అక్కచెల్లెండ్రు, కోడండ్రు మొదలైనవారందరు వస్తారు. ఆ తర్వాత ఒక పాత్రలో మద్యాన్ని నింపి మరోపాత్రలో మాంసం, గారెలు, వడలు పెడతారు. ఆ పాత్రను వాళ్ళ గురువు తన చేతిలోని గిన్నెలో పోసి ఇలా అంటాడు - "భైరవోऽహమ్ = నేను భైరవుడను, శివోऽహమ్ = నేను శివుడను" అని దానిని త్రాగుతాడు. ఆ తర్వాత ఆ ఎంగిలి గిన్నెతోనే అందరు త్రాగుతారు. ఎవరో ఒక స్త్రీని లేదా వేశ్యను వస్త్ర హీనురాలిగా చేసి ఒక పురుషుని కూడా నగ్నంగా చేసి చేతికొక ఖడ్గం ఇచ్చి ఆ ఖడ్గాన్ని పట్టుకొన్న స్త్రీని దేవి అనీ, పురుషుడిని మహాదేవుడని పేరు పెట్టి వారి ఉపస్థేంద్రియాలను పూజిస్తారు. ఆ దేవి, శివులకు గిన్నెతో మద్యాన్ని త్రాగించి ఆ ఎంగిలి గిన్నెతోనే అందరు మద్యాన్ని త్రాగుతారు. అదే విధంగా క్రమంగా బాగా త్రాగి మత్తెక్కి ఉన్మాదులై వాయి వరుసలేకుండా ఎవరికి ఎవరితో ఇష్టం ఉంటుందో వారితో కుకర్మ చేస్తారు. అప్పుడప్పుడు బాగా మత్తెక్కటంతో చెప్పులతో, తన్నులతో, ముష్టియుద్ధం, జుట్లు జుట్లు పట్టుకొని పరస్పరం పోట్లాడతారు. కొంతమందికి అక్కడనే వాంతి అవుతుంది. వారిలో చేరిన అఘోరి అంటే అందరిలో సిద్ధుడని లెక్కించబడినవాడు వాంతి చేస్తే ఆపదార్థాలను కూడ తింటాడు. అంటే ఇతడు అందరికంటే గొప్పసిద్ధిని పొందాడనటానికి ఈ క్రింది విషయాలు ఇలా ఉన్నాయి:.

హాలాం పిబతి దీక్షితస్య మందిరే సుప్తో నిశాయాం గణికాగృహేషు ।

విరాజతే కౌలవచక్రవర్తీ ॥

దీక్షపొందినవాడు అంటే వారి ఇంటికి అనగా కల్లమ్మువాని ఇంటికి వెళ్ళి సీసాల కొద్ది కల్లు సారా త్రాగేవాడు, రాత్రులందు వేశ్యాగృహాలకు వెళ్ళి వారితో కుకర్మలు చేసేవారు, వ్యభిచరం చేస్తూ అక్కడే నిద్రించేవాడు. ఇలాంటి కర్మలను సిగ్గు, బిడియాలు లేక నిశ్శంక కలవాడై ఆచరించేవాడు,

వీడే వామమార్గీయులలో అందరికంటే ఉన్నతుడు, ముఖ్యుడు, చక్రవర్తి లేక రాజుతో సమానుడుగా భావించబడతాడు. వారిలో చాలా దుష్టుడైనవాడే శ్రేష్ఠుడు. సత్కార్యాలు చేస్తూ, చెడుకార్యాలకు భీతిల్లే వాడే చిన్నవాడు. ఎందుకంటే -

పాశబద్ధో భవేజ్జీవః పాశముక్తః సదాశివః ॥ జ్ఞానసంకలనీ తంత్రం 43.

లోకలజ్జ, శాస్త్రలజ్జ, కులలజ్జ, దేశలజ్జ అనే పాశాలతో బంధించబడినవాడు జీవుడు. సిగ్గులేకుండా దుష్కార్యం చేసేవాడే సదాశివుడు అని చెప్పబడింది.

ఉడ్డీస తంత్రాలలో ఒక ప్రయోగం ఇలా వ్రాయబడింది. అది ఏమిటంటే! గృహంలో నలువైపుల గోడలలో గూళ్లు ఉండాలి. వీటిలో సారా సీసాలు నింపిపెట్టబడి ఉండాలి. ఒకగూడునుండి ఒక సారాబుడ్డి త్రాగి రెండవ గూడుకు పోవాలి. అక్కడ కూడ ఒక బుడ్డి త్రాగి, అక్కడి నుండి మూడవ గూటికి వెళ్లాలి. అక్కడి సీసా త్రాగి నాల్గవ గూటికి పోవాలి. అక్కడ కూడా ఒక సీసా త్రాగాలి. ఇలా మద్యాన్ని తాగి తాగి కట్టెవలె భూమిపై పడునంత వరకు త్రాగాలి. మళ్ళీ మత్తు తగ్గినప్పుడు అదే విధంగా త్రాగి క్రిందపడాలి. మళ్ళీ మూడవసారి ఇదేరీతిగా త్రాగి క్రింద పడి లేచిన అతనికి పునర్జన్మ ఉండదు. నిజానికి ఈ మానవులు తిరిగి మానవ జన్మ పొందటం కఠినం. నీచయోనులలో పుట్టి చాలా కాలం వరకు అక్కడే పడి ఉంటారు.

వామమార్గీయుల తంత్రగ్రంథాలలో ఈ నియమం ఉన్నది. తల్లిని తప్ప ఏ స్త్రీని విడువరాదు. అంటే ఆ స్త్రీ తన కూతురైనా కావచ్చు, చెల్లెలైనా కావచ్చు. అందరితో వ్యభచరించాలి. ఈ వామమార్గీయులలో దశ మహావిద్యలు అనేవి ప్రసిద్ధాలు. వాటిలో ఒకడు 'మాతంగీ' విద్యావంతుడు ఉంటాడు. **"మాతరమపి న త్యజేత్"** అంటే తల్లిని కూడా సమాగమం చేయకుండా త్యజించరాదని చెబుతుంటాడు. స్త్రీ మరియు పురుషుని సమాగమ సమయంలో మాకు సిద్ధి ప్రాప్తించుగాక, అనే మంత్రాన్ని జపిస్తారు. ఈ బుద్ధి వైకల్యం చెందిన పిచ్చివారు, మహామూర్ఖులైన మానవులు ప్రపంచంలో చాలా అరుదుగా ఉంటారు.

అబద్ధాలాడదలచిన మానవుడు సత్యాన్ని తప్పక దూషిస్తాడు. వామమార్గీయులు ఈ విషయంలో ఏమి చెబుతున్నారో చూడండి. వేదాలు, శాస్త్రాలు మరియు పురాణాలన్నీ సామాన్యమైన వేశ్యలవంటివి. ఏవి శాంభవీ వామమార్గీయులకు ముద్రలో అవి గుప్తకుల స్త్రీలవంటివి.

ఇందుకే వారు వేదధర్మానికి విరుద్ధంగా తమ మతాన్ని ఏర్పరిచారు. ఆ తర్వాత ఇవి క్రమంగా వ్యాపించాయి. తర్వాత వేదాల పేరిట కూడా ఈ వామమార్గపు లీలలను నడపసాగారు. ఉదా:-

'సౌత్రామణ్యాం సురాం పిబేత్'
'ప్రోక్షితం భక్షయేన్మాంసమ్'
'వైదికీ హింసా హింసా న భవతి' ।

(మను. అ.5. 27)

న మాంసభక్షణే దోషో న మద్యే న చ మైథునే ।
ప్రవృత్తి రేషా భూతానాం నివృత్తి స్తు మహాఫలా ॥ (మను. అ.5. 56)

సౌత్రామణి యజ్ఞంలో సురాపానం చేయటం మధుపానం చేయటంకాదు. సోమరసాన్నే సురాపానమంటారు. ఈ రసాన్ని ఆ యజ్ఞసమయంలో త్రాగుతారు. యజ్ఞ సమయంలో ప్రోక్షిత మాంసాన్ని భక్షిస్తే దోషం లేదు అనే ఈ తెలివిమాలిన పామర వామమార్గీయుల మాటలను నమ్మరాదు. వైదికీ హింస హింస కాకున్న నిన్ను, నీకుటుంబాన్ని చంపి హోమం చేస్తే విచారమేల? అని వారిని ప్రశ్నించాలి. మాంసభక్షణ చేసినా, మద్యపానం చేసినా, పరస్త్రీ గమనం చేసినా దోషం లేదనటం అవివేకం. ఎందుకంటే ప్రాణులను హింసించకుండా మాంసం లభించదు. నేరం లేకుండా ప్రాణికి బాధకలిగించటం ధర్మకార్యం కాదు. అది ధర్మవిరుద్ధం. మద్యపానానికి పూర్తిగా నిషేధం ఉన్నది. ఎందుకంటే ఇప్పటివరకు వామమార్గీయులు తప్ప ఎవరూ ఏ గ్రంథంలోనూ వ్రాయలేదు. మీదు మిక్కిలి సర్వత్ర నిషేధం ఉన్నది. వివాహమాడక మైథునం చేయుట కూడా దోషమే. ఇది దోషం కాదని చెప్పేవారే దుష్టులు. ఈ వాక్యాలను కూడా ఋషుల గ్రంథాలలో ఉంచి, ఎన్నో గ్రంథాలను ఋషి - మునుల పేర్లతో రచించి గోమేధం, అశ్వమేధం పేర్లు గల యజ్ఞాలను కూడా చేయించారు. ఆవును గాని, అశ్వాన్ని గాని చంపి హోమం చేసినచో యజమాని మరియు మరణించిన పశువు రెండు కూడ స్వర్గాన్ని చేరును-అనే వ్యవహారానికి మూలం బ్రాహ్మణ గ్రంథాలలో అశ్వమేధ, గోమేధ, నరమేధాది శబ్దాలుండటమే. వీటికి సరైన అర్థాన్ని వారు తెలిసికోకుండటమే దానికి కారణం. వారు ఒకవేళ తెలిసికొని ఉంటే ఇలాంటి పనులను చేయకుండెడివారేమో?

అశ్వమేధగోమేధ శబ్దార్థాలు

ప్రశ్న:- అశ్వమేధ, గోమేధ, నరమేధాది శబ్దాలకు అర్థమేంటి?

జవాబు:- వీటి అర్థాలివి:-

రాష్ట్రం వా అశ్వమేధః ॥ శత. 13-1-6-3.

అన్నగ్ం హి గౌః ॥ శత. 4, 3-1-25.

అగ్నిర్వా అశ్వః ॥ శత. 3-6-2-5.

ఆజ్యం మేధః ॥ శత. 13-3-6-2.

గుఱ్ఱాలు, గోవులు మొదలైన పశువులను, మానవులను చంపి హోమంచేయాలని ఎక్కడా వ్రాయబడలేదు. కేవలం వామమార్గీయుల గ్రంథాలలోనే ఈ అనర్థాలు వ్రాయబడ్డాయి. ఈ విషయాలను వామ మార్గీయులే ప్రచారం చేశారు. ఎక్కడైనా ఈ వ్రాతలుంటే ఆ యా గ్రంథాలలో ఈ వామమార్గీయులే

ప్రక్షేపం చేసారు. చూడండి రాజు న్యాయ ధర్మాలతో ప్రజలను పాలించాలి. విద్యాదులను ప్రచారం చేయాలి. యజమానుడై అగ్నిలో ఘృతాలను వేసి హోమం చేయాలి. రాజు చేయవలసిన ఈ కార్యాలకే 'అశ్వమేధం' అని పేరు. ఆహార పదార్థాలు, ఇంద్రియాలు, కిరణాలు, పృథ్వి మొదలైన వాటిని పవిత్రంగా ఉంచటం గోమేధం. మానవుడు మరణించినపుడు అతని శరీరాన్ని విధి పూర్వకంగా దహనం చేయటం నరమేధమవుతుంది.

ప్రశ్న:- యజ్ఞాలు చేయటంవలన యజమాని, చంపబడిన పశువు స్వర్గగాములవుతారని, హోమానంతరం పశువును తిరిగి బ్రతికిస్తారని యజ్ఞకర్తలంటారు. ఈ విషయాలు సత్యాలు కావా?

జవాబు:- సత్యాలు కావు. స్వర్గానికి పోవటం నిజమేనని చెప్పేవాడు తనను చంపి హోమం చేసి స్వర్గానికి పంపుమని చెప్పాలి. లేదా అతడు తన ప్రియమైన తల్లినో, తండ్రినో, భార్యా పుత్రాదులనో చంపి హోమంచేసి వారిని స్వర్గానికి పంపాలి. అలా ఎందుకు చేయరు? యజ్ఞవేదిక నుండి తిరిగి ఎందుకు బ్రతికించరు?

యజ్ఞంచేసే యజమాని చంపబడిన పశువులు స్వర్గానికి పోవు. ఈ వామమార్గీయులకు స్వర్గానికి పంపే శక్తి లేదు. ఒకవేళ ఉన్నా ప్రియమైన అతని తల్లిని, తండ్రిని, భార్యను, పుత్రాదులను చంపి హోమం చేసి స్వర్గంలోకి ఎందుకు పంపరు? స్వర్గ ప్రాప్తి ఇంత సరళంగా, సులభంగా లభిస్తే అందరు ఈ విధంగానే చేసి స్వర్గాన్ని పొందేవారే. కాని స్వర్గప్రాప్తిని పొందటానికి కాదు. పశువును బలిచ్చి, హోమం చేసి, దానిని స్వర్గానికి పంపడమెందుకు? దానిపై గల ప్రేమచేతనా? కాదు. కేవలం దాని మాంసాన్ని తినడానికీ చంపుతున్నారే కాని స్వర్గానికి పంపటానికి కాదు. పైగా బలిపశువును మరల బ్రతికిస్తారన్న మాట పచ్చి అబద్ధం. చచ్చినవారిని తిరిగి బ్రతికించేశక్తి ఏ మానవునికీ లేదు.

ప్రశ్న:- ఈ యజ్ఞాలు చేసినపుడు మంత్రాలను పఠిస్తారు. ఈ మంత్రాలు వేదంలో లేకుంటే ఎటునుండి చదివుతారు?

జవాబు:- ఈ యజ్ఞాలు చేయునపుడు వారు పఠించేవి వేదమంత్రాలు కావు. శ్లోకాలు. ఇవి మానవులతో రచించబడ్డాయి. మంత్రాలు పరమేశ్వర కృతాలు. ఆ మంత్రాలెక్కడ? ఈ శ్లోకాలెక్కడ? ఇవి కేవలం శబ్దాలు మాత్రమే. పశువును చంపి హోమంచేయుమని ఏ మంత్రం చెప్పదు. పైగా మంత్రాలు లోక కల్యాణకరమైనవి.

ఉదా:- **"అగ్నయే స్వాహా"** అనే మొదలైన వేదమంత్రార్థం 'అగ్నిలో పుష్ట్యాదులను కలుగజేసే ఘృతాలు, ఉత్తమ పదార్థాలను హోమం చేస్తే వాయువు, వర్ష జలం పరిశుద్ధమై జగత్తుకు సుఖకారకాలవుతాయి. కాని ఈ సత్యమైన అర్థాలను ఆ మూర్ఖులు గుర్తించరు. ఎందుకంటే స్వార్థబుద్ధి కలవారు తమ స్వార్థాన్ని నెరవేర్చుకోవటం తప్ప మరొకటి తెలుసుకోలేరు.

ఈ పోపులకు సంబంధించిన ఈ అనర్థకాలైన అనాచారాలను, ఇతరులు మరణించినప్పుడు వారు చేసే తర్పణ, శ్రాద్ధాది కర్మలను చూచి వేదాదిశాస్త్రాలను నిందిస్తూ మహా భయంకరమైన బౌద్ధ జైన మతాలు వ్యాప్తిలోకి వచ్చాయి. ఈ దేశంలోగల గోరఖ్‌పూరులో ఒకరాజుండేవాడు. అతనితో ఈ పోపులు ఒక యజ్ఞాన్ని చేయించి, అతనికి ప్రియమైన రాణిని గుఱ్ఱంతో సమాగమం చేయించారు. దానితో ఆమె మరణించింది. అప్పుడు ఆ రాజుకు వైరాగ్యం కలిగి తన పుత్రునికి రాజ్యభారాన్ని అప్పగించి సాధువై పోపుల లోగుట్టును లోకానికి వెల్లడించడానికి బయలుదేరాడు. దీని శాఖలే చార్వాక, ఆబాణక మతాలుగా వెలిసాయి.

వారు ఈ క్రింది విధంగా శ్లోకాలను రచించారు.

1. **పశుశ్చేన్నిహితః స్వర్గం - జ్యోతిష్టోమే గమిష్యతి ।**
స్వపితా యజమానేన - తత్ర కస్మాన్న హింస్యతే ॥

పశువును చంపి, అగ్నిలో హోమం చేస్తే పశువు స్వర్గానికి పోయినచో యజ్ఞకర్తయైన యజమాని, తన తండ్రి మొదలైనవారిని చంపి స్వర్గానికి ఎందుకు పంపడు?

2. **మృతానామపి జంతూనాం - శ్రాద్ధం చేత్తృప్తికారణమ్ ।**
గచ్ఛతామిహ జంతూనాం - వ్యర్థం పాథేయ కల్పనమ్ ॥

మరణించిన వారి తృప్తికై శ్రాద్ధం, తర్పణాలు పెట్టబడినచో విదేశాలకు పోయే వారికి మార్గవ్యయం, ఆహార పానీయాలను కట్టి ఇవ్వడం వ్యర్థం. ఎందుకంటే మరణించినవారికి శ్రాద్ధ, తర్పణాలను పెట్టి ఆహార పానీయాలను పంపించినపుడు ఇక జీవిస్తూ పరదేశంలో ఉన్నవారికి, మార్గమధ్యంలో ప్రయాణం చేసేవారికి, గృహంలో సిద్ధం చేయబడిన వంటకాలను విస్తరిలో ఉంచి, చెంబునిండ నీరు నింపి, వాటిపేర ఉంచితే అవి వారికేందుకు చేరటంలేదు? బ్రతికి ఉండి దూర దేశంలో గాని లేక పదిబారల దూరంలోగాని కూర్చున్నవారి పేర ఇచ్చిన వస్తువులు వారికి చేరనపుడు మరణించి, మరొక జన్మలో ఉన్నవారికి పెట్టిన వస్తువులు ఏ విధంగా చేరగలవు?

పాషాణాది మూర్తి పూజలు - జైనులు

జనులు వారి ఈ యుక్తిసిద్ధాలగు ఉపదేశాలను విని అంగీకరిస్తూ వారి మతాల్లో కలిసిపోయారు. అనేకమంది రాజులు, భూపతులు వారి మతానుయాయులైనప్పుడు పోపులు కూడ వారివైపుకే మొగ్గారు. ఎందుకంటే ఏ వైపున కపోల కల్పితాలతో బాగా లాభం వస్తుందో వారు ఆ వైపుకే వెళతారు. వెంటనే జైనులవటానికి వెళ్ళారు. జైన మతంలో కూడ మరోవిధమైన పోపు లీలలనేకమున్నాయి. వాటిని ద్వాదశ సముల్లాసంలో వ్రాస్తాము. అనేకులు వీరి మతాన్ని స్వీకరించారు. కాని ఎన్ని చెప్పినా ఆనాటి పర్వత, కాశీ, కన్నౌజు రాజ్య ప్రజలు, పశ్చిమ, దక్షిణ దేశవాసులు జైన మతాన్ని స్వీకరించలేదు.

ఆ జైనులు వేదార్థాలను తెలియక బాహ్య భ్రాంతులతో కూడిన పోపులీలలు వేదాలలోనివే అని విశ్వసించి వేదాలనే నిందించారు. వేదపఠన పాఠనాలను, యజ్ఞోపవీత ధారణ, బ్రహ్మచర్యాది నియమాలను కూడా నాశనం చేసారు. వేదాలకు సంబంధించిన పుస్తకాలన్నింటినీ నిర్మూలించారు. ఆర్యులపై అనేక రాజశాసనాలు చేసి దుఃఖాన్ని కలిగించారు. వారికి భయం తీరిపోయిన తర్వాత తమ మతస్థులైన గృహస్థులను, సాధువులను సన్మానింప ప్రారంభించారు. వేదమార్గానుయాయులను అవమానంనించసాగినారు. పక్షపాతంతో వారిని దండించటం చేసారు. స్వయంగా సుఖాన్ని, విశ్రాంతులననుభవిస్తూ గర్వంతో బలిసి సంచరించారు.

ఋషభదేవుడు మొదలుకొని మహావీరుని వరకు గల తమ తీర్థంకరులకు పెద్దపెద్ద విగ్రహాలను తయారుచేసి పూజించడమారంభించారు. అంటే రాళ్ళతో విగ్రహాలను తయారుచేసి వాటిని పూజించే విధానానికి జైనులే పునాదులు వేసారు. పరమేశ్వరుని పట్ల విశ్వాసం తగ్గి, పాషాణాది మూర్తులపై విశ్వాసాన్ని పెంచుకొని పూజలు చేశారు. ఇలా మూడు శతాబ్దాల వరకు ఆర్యావర్తంలో జైనమతం రాజ్యమేలింది. వారు వేదార్థజ్ఞాన శూన్యులైనారు. ఈ విషయాలు జరిగి ఇప్పటికి రెండున్నర వేల సంవత్సరాలు గతించినది.

శంకరాచార్యుల వేద పునరుద్ధరణ

రెండువేల వత్సరాలకు పూర్వం ద్రావిడ దేశంలో (కేరళలో) ఉద్భవించిన బ్రాహ్మణుడైన శంకరాచార్యులు బ్రహ్మచర్యంతో వ్యాకరణాది శాస్త్రాలన్నింటిని చదివి, ఆహా! సత్యమైన ఆస్తికత్వం గల వేద ధర్మం అడుగంటి జైనుల నాస్తికమతం వ్యాపించినది. ఇది అత్యంత హానికరమైన విషయం. దీన్ని ఎలాగైనా తొలగించాలని ఆలోచించారు. శంకరాచార్యులు శాస్త్రాలు చదివిన పిదప జైనమత గ్రంథాలను కూడా చదివారు. వారికి బుద్ధిచతురత, వాక్చాతుర్యం బాగా ఉండేది. జైనమతాన్ని ఏ విధంగా తొలగించాలి అని ఆలోచించి. ఉపదేశం కంటే శాస్త్రార్థం ద్వారానే వీరీ మార్గం నుండి వైదొలగుతారని నిశ్చయించుకొన్నాడు.

జైనమత నిరాకరణం

ఇలా ఆలోచించి శంకరాచార్యులు ఉజ్జయినీ నగరానికి వచ్చారు. అప్పుడా ప్రాంతాన్ని సుధన్వుడనే రాజు పాలిస్తున్నాడు. ఈ రాజు జైన గ్రంథాలను, కొంత సంస్కృతం కూడా అభ్యసించి ఉన్నాడు. శంకరాచార్యులు అక్కడికి వెళ్లి వేదోపదేశం చేయడం ఆరంభించారు. రాజుతో కలిసి మీరు సంస్కృతాన్ని, జైన గ్రంథాలను చదివారు కదా! మీరు జైనులై ఉంటారు. కావున మీతో నేను కోరేదేమిటంటే "జైన పండితులతో నాకు శాస్త్రార్థాన్ని జరిపించండి. ఇందులో ఓడినవారు గెలుపొందిన వారి ధర్మాన్ని-మతాన్ని స్వీకరించాలి" అని అన్నారు. అప్పుడు రాజు "మీరు కూడా గెలుపొందిన వారి మతాన్నే స్వీకరించవలసి వస్తుంది" అని కోరారు.

రాజు సుధన్వుడు జైన మతాన్ని స్వీకరించినప్పటికీ సంస్కృత గ్రంథాలను పఠించటం వలన అతనిబుద్ధిలో కొంత విద్యా ప్రకాశం ఉన్నది. అతని మనస్సులో అత్యంత మతోన్మాదం వ్యాపించలేదు. ఎందుకంటే, విద్వాంసుడైనవాడు సత్యాసత్యాలను పరీక్షించి సత్యాన్ని గ్రహించి అసత్యాన్ని తజ్యిస్తాడు. రాజైన సుధన్వునికి గొప్ప విద్వాంసుడు ఉపదేశకునిగా లభించనందు వలన ఏది సత్యమో ఏది అసత్యమో అనే సందేహంలో ఉన్నాడు. శంకరాచార్యుని ఈ విషయాలు విన్నప్పుడు రాజు చాలా సంతోషంతో 'నేను శాస్త్రార్థం ఏర్పరచి సత్యాసత్యాలను అవశ్యంగా నిర్ణయిస్తా'నని చెప్పాడు.

సుదూరాల నుండి జైన పండితులను పిలిపించి సభను ఏర్పాటు చేసారు. దానిలో శంకరాచార్యుని వేదధర్మం, జైనుల వేదవిరుద్ధ మతాలు శాస్త్రార్థానికై పెట్టబడ్డాయి. అంటే శంకరాచార్యుని పక్షం వేదధర్మాన్ని స్థాపించటం, జైనమతాన్ని ఖండించటం; ఇక జైనుల పక్షంవారు తమ మతాన్ని స్థాపించుకోవటం, వేదాలను ఖండించటం. శాస్త్రార్థం చాలా రోజులు జరిగింది. సృష్టికి కర్త అనాది ఈశ్వరుడు ఎవరూ లేరు, ఈ జగత్తు జీవుడు అనాదులు, ఈ రెండింటి ఉత్పత్తి గాని, వినాశంగాని ఎన్నడూ జరుగదు అని జైనుల అభిప్రాయం. దీనికి విరుద్ధంగా జగత్తుకు కర్త అనాది సిద్ధుడైన పరమేశ్వరుడు. ఈ జగత్తు, జీవుడు అసత్యాలు. ఎందుకంటే ఆ పరమేశ్వరుడు తన మాయతో జగత్తును ఏర్పరచాడు. దానినే ధరించి అతడు ప్రళయం చేస్తాడు. ఈ జీవుడు మరియు ప్రపంచం స్వప్నం వంటివి. పరమేశ్వరుడు తానే అన్ని రూపాలను ధరించి నాటకమాడుతున్నాడు అనేది శంకరాచార్యుల మతం.

ఇలా శాస్త్రార్థాలు అనేక రోజులు జరిగి చివరకు యుక్తులు, ప్రయుక్త ప్రమాణాలతో జైనుల మతం ఖండించబడి శంకరాచార్యుని మతం అఖండితమై దిగ్విజయాన్ని పొందింది. జైన పండితులు, సుధన్వరాజు వెంటనే వేదమతాన్ని స్వీకరించి జైనమతాన్ని త్యజించారు. దీని ద్వారా దేశంలో, సమాజంలో గొప్ప కోలాహం చెలరేగాయి. సుధన్వరాజు, ఇతరులైన తన మిత్రరాజులకు పత్రాలు వ్రాసి మరల శంకరాచార్యునితో శాస్త్రార్థం జరిపారు. కానీ జైనులు మరల పరాజితులైనారు. తర్వాత సుధన్వుడు మొదలైన రాజులు శంకరాచార్యులకు ఆర్యావర్తంలో దేశం అంతటా తిరగటానికి తగిన ప్రబంధం చేసారు. వారి రక్షణకు సరిపోయే ఏర్పాటు చేసినారు.

వైదికమతోద్ధరణం

అప్పటినుండి అందరికీ యజ్ఞోపవీతధారణ ప్రారంభమయ్యింది. వేదాల పఠన, పాఠనాలు కూడా ప్రచారంలోనికి వచ్చాయి. శంకరాచార్యులు పది సంవత్సరాలపాటు ఆర్యావర్త దేశం అంతటా సంచరించి జైనమతాన్ని ఖండిస్తూ వేదమతమండనం చేసారు. శంకరాచార్యుని కాలాన్నే జైనమత పతనం అంటే ఎన్ని జైన విగ్రహాలు నేడు బయటపడుతున్నాయో అవన్నీ శంకరాచార్యుని కాలంలోనే ఖండింపబడ్డాయి. లేదా ఖండిచబడకుండా ఉండడానికి జైనులు భూమిలో పాతిపెట్టినవైనా కావచ్చు.

అవి యిప్పటికి ఎక్కడో ఒకచోట భూమి నుండి బయటపడుతున్నాయి. శంకరాచార్యులకు పూర్వం కొద్దిగా వ్యాపించిన శైవమతాన్ని, వామమార్గీయుల మతాన్ని కూడా వారు ఖండించారు.

ఆ కాలంలో కూడా ఈ దేశంలో చాలా ధనముండేది. స్వదేశభక్తి కూడా ఉండేది. జైనమందిరాలను శంకరాచార్యుడు కాని, రాజా సుధన్వుడు కాని కూలగొట్టించలేదు. ఎందుకంటే ఆ మందిరాలలో వేదపాఠశాలలను పెట్టాలనే సంకల్పం ఉన్నది. వేదధర్మ స్థాపన అనంతరం వేదవిద్యా ప్రచారం చేయాలనుకున్నారు. ఇంతలో ఇద్దరు జైనులు పైకి చూడడానికి, వేదధర్మీయులుగా, లోనమాత్రం అంధవిశ్వాసం గలవారిగా ఉండేవారు. అంటే వీరు మిక్కిలి వంచనతో కూడిన మునులు. వీరిరువురిపై శంకరాచార్యుడు అత్యంత నమ్మకాన్నుంచాడు. సమయాన్ని చూసుకొని ఈ ఇద్దరూ కలిసి శంకరాచార్యునికి విషయుక్త పదార్థాన్ని తినిపించారు. దీని ద్వారా అతని ఆకలి మందగించింది. ఆ తర్వాత శరీరంపై కురుపులు, పుండ్లు లేచి ఆరునెలల్లోనే శంకరుడు శరీరాన్ని త్యజించాడు. అప్పుడు అందరు నిరుత్సాహులైనారు. ఏ విద్యాప్రచారం ఇతనితో జరుపబడవలసి ఉండెనో అది జరుపబడలేదు. ఇతని ద్వారా రచించబడిన శారీరిక భాష్యాల ప్రచారం ఇతని ద్వారా కాక, శిష్యులతో చేయబడింది. అంటే జైన మత ఖండనకై బ్రహ్మసత్యమనీ, జగత్తు మిథ్య అనీ, జీవ బ్రహ్మలు ఒకటే అని అతడు చెప్పిన దానిని అతని శిష్యులు ఉపదేశించడం ఆరంభించారు.

దక్షిణంలో 'శృంగేరి' మఠం, పశ్చిమంలో 'భూగోళవర్ధన' మఠం, ఉత్తరంలో 'జోశీమఠం', ద్వారకలో 'శారదామఠా'లను స్థాపించి శంకరాచార్యుని శిష్యులు మహంతులైనారు. శ్రీమంతులై ఆనందాన్ని అనుభవించసాగారు. ఎలాగంటే శంకరాచార్యుని అనంతరం అతని శిష్యులకు ప్రతిష్ఠ కలగడం ఆరంభమైంది. వీరినే నవీన వేదాంతులని అంటారు.

ఇప్పుడు దీనిలోని అభిప్రాయాలను గురించి ఆలోచించాలి. జీవబ్రహ్మలు ఒకటి. జగత్తు మిథ్య అనేవి శంకరాచార్యుని నిజాభిప్రాయాలైన అది మంచి మతం కాదు. జైనమత ఖండనకై ఈ మతం అవలంబిస్తే కొంతమంచిదే.

నవీన వేదాంతుల మతం

ప్రశ్న:- జగత్తు స్వప్నం వంటిది. రజ్జు సర్పం లాగా; ముత్యపు చిప్పలో వెండిలాగా, మృగతృష్ణలో జలం లాగా, గంధర్వనగరంలో ఇంద్రజాలం లాగా ఈ సంసారం అసత్యం. ఒక్క బ్రహ్మయే సత్యం.

సిద్ధాంతి:- అసత్యం-మిథ్య అని నీవు దేనినంటావు?

నవీనుడు:- పదార్థం లేకున్నా కూడా ఉన్నట్లు ప్రతీతమవటానికి.

సిద్ధాంతి:- పదార్థమే లేకంటే అది ఉన్నట్లు ఎలా ప్రతీతమవుతుంది?

నవీనుడు:- అధ్యారోపం ద్వారా

సిద్ధాంతి:- అధ్యారోపమని దేనినంటావు?

నవీనుడు:- 'వస్తున్యవస్త్వారోపణమధ్యాసః', వేదాంతసారం. 6.

'అధ్యారోపాపవాదాభ్యాం నిష్ప్రపంచం ప్రపంచ్యతే' అనుభూతి ప్రాకశః 1-18.

పదార్థం వేరే ఒకటి ఉండగా అందులో అన్యవస్తువును ఆరోపించటం 'అధ్యాసం' అనబడుతుంది. అధ్యారోపం మరియు దానిని నిరాకరించటం అపవాదమవుతుంది. ఈ రెండింటితో ప్రపంచరహితుడైన బ్రహ్మలో ప్రపంచరూప జగత్తు విస్తృతపరచబడింది.

సిద్ధాంతి:- నీవు త్రాడును వస్తువుగా, సర్పాన్ని అవస్తువుగా భావించి ఈ భ్రమలో పడ్డావు. సర్పం వస్తువు కాదా ఏమిటి? నీవు ఏమైనా చెప్పు. త్రాడులో పాములేకుంటే దేశాంతరంలో ఉండవచ్చు. అంతేకాక దాని సంస్కారం హృదయంలో ఉన్నదా లేదా? అయితే ఆ సర్పం అవస్తువు మాత్రం కాదు. అలాగే స్థాణువున పురుషుడు, ముత్యపు చిప్పలో వెండి మొదలైన వాటి నియమ వ్యవస్థను తెలుసుకోవాలి. స్వప్నంలో ఏ వస్తుజ్ఞానం ఉందో అది దేశాంతరంలో ఉంటుంది. దాని సంస్కారం ఆత్మలో కూడా ఉంటుంది. కాబట్టి ఆ స్వప్నం కూడా ఒక వస్తువులో అవస్త్వారోపణం ఎన్నడూ కాదు.

నవీనుడు:- ఎప్పుడూ చూడని, వినని, ఎన్నడూ మనముందు జరుగని విషయాలను మనం స్వప్నంలో చూస్తాము. ఉదా:- తన తల తెగినట్లు, తానే ఏడుస్తున్నట్లు, జల ప్రవాహాలు తనపైకి వస్తున్నట్లుగా స్వప్నంలో చూస్తాము. ఇవన్నీ సత్యాలెలా అవుతాయి?

సిద్ధాంతి:- ఈ దృష్టాంతం కూడా మీ పక్షాన్ని బలపరచటం లేదు. ఎందుకంటే చూడకున్నా, వినకున్నా దాని సంస్కారం హృదయంలో ఉండదు. సంస్కారం లేకున్న స్మృతి, స్మృతి లేకున్న సాక్షాత్తు అనుభవం కలుగదు. ఫలానా వ్యక్తి తల నరకబడిందని ఎవరితోనో విన్నా లేక చూసినా, యుద్ధంలో అతని సోదరుడు గాని లేక వాని తండ్రిగాని ప్రత్యక్షంగా రోదించటం చూసినా నీరు చిమ్ము గొట్టం నుండి నీరు పైకెక్కటం చూసినా లేక విన్నా వాటి సంస్కారం అతని ఆత్మలో ఉంటుంది. జాగ్రదవస్థలో పదార్థాలకు దూరంగా ఉండి మానవుడు చూస్తాడు. ఆ పదార్థాలనే స్వప్నంలో తనలో చూస్తాడు. తనలో చూసినప్పుడు తన శిరస్సే ఖండించబడినట్లు, తాను ఏడుస్తున్నట్లు జలధార తన పైకివస్తున్నట్లు చూస్తాడు.

ఇది కూడ వస్తువులో అవస్తువుయొక్క ఆరోపణ వంటిది కాదు. ఉదా:- చిత్రకారుడు ఇంతకు పూర్వం తాను చూసిన, విన్న దానిని తనలోనుండే ఊహించి కాగితంపై గీస్తాడు. ఛాయాచిత్రా(ఫోటో)లను గీసేవాడు బింబాన్ని బాగా చూసి తన ఆత్మలో ఆకృతి నుంచుకొని దానికి సమానమైన దానిని గీయగలడు. అవును, అప్పుడప్పుడు స్వప్నంలో స్మరణయుక్త జ్ఞానంకూడా

కలుగుతుంది. ఉదా:- తన ఉపాధ్యాయుని చూసి, ఎప్పుడో చాలాకాలం పూర్వం చూసిన, విన్న అతీత జ్ఞానాన్ని సాక్షాత్కరించుకొంటాడు. నేను ఫలానా సమయంలో చూసాను. అతని గురించి వింటిని లేక ఫలానా పని చేసాను అని, వాటినే చూస్తూ, వింటూ, తిరిగి చేస్తాను అనే స్ఫురణ ఉండదు. జాగ్రదవస్థలో చూసినట్లుగానే స్వప్నంలో స్మరణకు రాదు.

చూడండి జన్మాంధునికి (పుట్టుకతో గుడ్డివానికి) రూపంతో కూడిన స్వప్నం రాదు. దీనివలన మీ అధ్యాస = మిథ్యాజ్ఞానం మరియు అధ్యారోప లక్షణాలు రెండూ అసత్యాలే. వేదాంతులు వివర్తం = నిజం కాని రూపవాదనను అనగా రజ్జువున సర్పాది జ్ఞానం కలుగు దృష్టాంతం, బ్రహ్మలో జగత్తుయొక్క జ్ఞానం కలగటంలో ఇవ్వబడింది. అది కూడ సరైనది కాదు.

నవీనుడు:- అధిష్ఠానం లేకుండా అధ్యస్తం ఎన్నడూ ప్రతీతి కాదు. ఉదా:- రజ్జువే లేకుంటే సర్పజ్ఞానం కలగదు. వాస్తవంగా రజ్జులో సర్పం త్రికాలాలలో ఉండదు. కాని కొద్ది పాటి చీకటి వెలుగుల ప్రకాశం యొక్క కలయికలో అకస్మాత్తుగా త్రాడును చూసినచో సర్పభ్రాంతితో భయం కలుగుతుంది. దానిని దీపాలతో చూసి ఇది సర్పంకాదు త్రాడని తెలుసుకొన్నపుడు ఆ భ్రమ, భయం తొలగిపోతుంది. అలాగే బ్రహ్మలో జగత్తు యొక్క మిథ్యాజ్ఞానం వెల్లడైనది. అదే బ్రహ్మ సాక్షాత్కారం అయినపుడు ఆ జగత్తను భ్రాంతి తొలగుతుంది. బ్రహ్మ జ్ఞానం కలుగుతుంది. ఉదా:- సర్పభ్రాంతి నివృత్తి కాగానే రజ్జు జ్ఞానం కలిగినట్లు.

సిద్ధాంతి:- బ్రహ్మలో జగద్ భ్రాంతి ఎవరికి కలిగింది?

నవీనుడు:- జీవునికి

సిద్ధాంతి:- జీవుడెక్కడ నుండి కలిగెను?

నవీనుడు:- అజ్ఞానం వలన.

సిద్ధాంతి:- అజ్ఞానం ఎక్కడ నుండి కలిగింది? అది ఎక్కడ ఉంటుంది?

నవీనుడు:- అజ్ఞానం అనాది. అది బ్రహ్మలో ఉంటుంది.

సిద్ధాంతి:- బ్రహ్మలో బ్రహ్మనికి సంబంధించిన అజ్ఞానం కలిగిందా? లేక మరి ఇతరులకు సంబంధించిన అజ్ఞానమా? మరియు ఆ అజ్ఞానం ఎవరికి కలిగింది?

నవీనుడు:- చిదాభాసునికి

సిద్ధాంతి:- చిదాభాసుని స్వరూపమేమిటి?

నవీనుడు:- బ్రహ్మం. బ్రహ్మనికే బ్రహ్మనికి సంబంధించిన అజ్ఞానం కలిగింది. అంటే తన స్వరూపాన్ని తానే మరచిపోయాడు.

సిద్ధాంతి:- అతడు అలా మరచిపోవటానికి గల కారణమేమిటి?

నవీనుడు:- అవిద్య.

సిద్ధాంతి:- ఈ అవిద్య సర్వవ్యాపకుడైన సర్వజ్ఞుని గుణమా? లేక అల్పజ్ఞుని గుణమా?

నవీనుడు:- అల్పజ్ఞుని గుణం.

సిద్ధాంతి:- అయితే, మీ మతంలో అనంత సర్వజ్ఞ చేతనుడే కాక మరొక చేతనుడున్నాడా? ఉంటే ఆ అల్పజ్ఞుడు ఎక్కడ నుండి వచ్చాడు? అవును. అల్పజ్ఞ చేతనుడు = ఆత్మ, బ్రహ్మ కంటే భిన్నుడని అనుకుంటే సరే మంచిది. బ్రహ్మంలో ఒకచోట బ్రహ్మకు తన స్వరూపానికి సంబంధించిన అజ్ఞానం కలిగినచో అది బ్రహ్మమునందంతట వ్యాపిస్తుంది. ఉదా:- శరీరంలో ఒక చోట పుండు పుట్టినపుడు దాని బాధ శరీరావయవాలన్నింటిని పనికిరానివిగా చేస్తుంది. అదేవిధంగా బ్రహ్మలో ఒక ప్రదేశంలో అజ్ఞానం కలిగిన సంపూర్ణ బ్రహ్మ కూడ అజ్ఞానుడు, పీడనానుభవయుక్తుడవుతాడు.

నవీనుడు:- ఇదంతా ఉపాధి ధర్మమే కాని బ్రహ్మది కాదు.

సిద్ధాంతి:- ఉపాధి జడమా? లేక చేతనమా? సత్యమా? లేక అసత్యమా?

నవీనుడు:- అనిర్వచనీయమైనది. అంటే జడమని కాని, చేతనమని కాని, సత్యమని కాని, అసత్యమని కాని అది చెప్పే వీలుకానిది.

సిద్ధాంతి:- మీరు చెప్పింది **"వదతో వ్యాఘాతః"** అన్నట్లున్నది. ఎందుకంటే, 'అవిద్య' అని ఒకవంక చెప్పుతున్నావు. మరొకవంక అది జడమని కాని, చేతనమని కాని, సత్యమని అసత్యమని కాని చెప్పనలవికాదంటున్నావు. స్వర్ణంలో ఇత్తడి కలిపి, దానిని బంగారు వర్తకుని దగ్గరకు కొనిపోయి ఇది బంగారమా? లేక ఇత్తడా? అని పరీక్షింప చేసినట్లుగా ఉన్నది. అప్పుడతడు దీనిని మేము బంగారమని కాని, ఇత్తడి అనికాని చెప్పలేము. రెండు ధాతువులు కలిసినవని మాత్రం చెప్పగలం అని అంటారు.

నవీనుడు:- చూడండి-ఘటాకాశం, మఠాకాశం, మేఘాకాశాలు, మహదాకాశం అని ఘటం, మఠం, మేఘం అనే ఉపాధుల వలన ఆకాశం భిన్న భిన్నాలుగా ప్రతీతమవుతున్నది. వాటిని తొలగించిన వాస్తవానికి మహదాకాశమే వీటికి కారణం. అదే విధంగా మాయ, అవిద్య, సమిష్టి, వ్యష్టి మరియు అంతఃకరణానికి సంబంధించిన ఉపాధులవలన అజ్ఞానులకు బ్రహ్మ వేర్వేరుగా ప్రతీతి అవుతున్నాడు. కాని వాస్తవానికి అతడొక్కడే. ఇప్పుడు చెప్పబోయే గొప్ప ప్రమాణాన్ని చూడండి.

అగ్నిర్యథైకో భువనం ప్రవిష్టో రూపం రూపం ప్రతి రూపో బభూవ ।
ఏకస్తథా సర్వభూతాంతరాత్మా రూపం రూపం ప్రతిరూపో బహిశ్చ ॥

(కఠోప. వల్లీ 5. మం. 9)

అగ్ని పొడవైన, వెడల్పైన, గుండ్రని, చిన్న, పెద్ద ఆకారాలు గల పదార్థాలన్నింటిలో వ్యాపించి ఆయా ఆకారాలుగా గోచరిస్తుంది. మరియు వాటి నుండి వేరుగా ఉంటుంది. అదేరీతిగా సర్వవ్యాపకుడైన పరమాత్మ అంతఃకరణాలలో వ్యాపకుడై అంతఃకరణాకారుడవుతున్నాడు. కానీ వాటినుండి వేరుగా ఉన్నాడు.

సిద్ధాంతి:- నీవు ఇలా చెప్పటం కూడా నిరర్థకమే. ఎందుకంటే ఘటం, మఠం, మేఘాలను ఆకాశం కంటే భిన్నంగా అంగీకరించినట్లు కారణ కార్యరూప జగత్తు మరియు జీవులు బ్రహ్మ కంటే మరియు బ్రహ్మ వీటి కంటే భిన్నమని తెలుస్తున్నది.

నవీనుడు:- అగ్ని అన్నింటిలో ప్రవేశించి చూడటానికి ఆయా ఆకారాలుగా కనిపిస్తుంది. ఇదేవిధంగా పరమాత్ముడు జడంలో మరియు జీవునిలో వ్యాపించి ఆకారంగల అజ్ఞానులకు ఆకార యుక్తంగా కనిపిస్తాడు. వాస్తవానికి బ్రహ్మ జడం గాని, జీవుడు కాని కాదు. ఉదా:- సహస్ర జల కడవలను పెట్టి ఒక్కొక్క కడవలో చూసిన అన్నింటిలో సూర్యుని ప్రతిబింబం కనిపిస్తుంది. వస్తుతః సూర్యుడు ఒక్కడే. కడవలు పగిలి నీరంతా బయటికి పోయి అతడు కనిపించనంత మాత్రాన సూర్యుడు నాశనం కాడు. ఎక్కడికీ పోడు. ఇదేవిధంగా అంతఃకరణాలలో బ్రహ్మయొక్క ఆభాసం - జ్ఞానం కలుగుతుంది. దీన్నే చిదాభాసం - చైతన్య జ్ఞానం అని అంటారు. అంతఃకరణాలు ఉన్నంత వరకు జీవుడుంటాడు. అంతఃకరణ జ్ఞానం నుండి శూన్యుడైనప్పుడు బ్రహ్మ స్వరూపుడవుతాడు. ఈ చిదాభాసుడు జీవుడు తన బ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకొన్నవాడై తనను భోక్తగా, సుఖిగా, దుఃఖిగా, పాపాత్మునిగా, పుణ్యాత్మునిగా ఎంచి జనన మరణాలను తనలోనే ఆరోపించుకొన్నంత వరకు ప్రాపంచిక బంధనాల నుండి విముక్తుడు కాలేడు.

సిద్ధాంతి:- నీ యొక్క ఈ దృష్టాంతం కూడ వ్యర్థమైనదే. కారణమేమిటంటే, సూర్యుడు ఆకారం కలవాడు. నీటి కడవలు కూడా సాకారాలే. సూర్యుడు నీటి కడవల కంటే భిన్నుడు మరియు సూర్యుని నుండి నీటి కడవలు కూడా భిన్నాలే. ఇలా భిన్నా లైనందు వల్లనే సూర్యుని ప్రతిబింబం అన్ని కడవలలో పడుతున్నది. ఒకవేళ సూర్యుడు నిరాకారుడే అయితే అతని ప్రతిబింబం ఎన్నడూ ఏర్పడదు.

పరమేశ్వరుడు నిరాకారుడు. సర్వత్ర ఆకాశం లాగా వ్యాపకుడవటం వలన బ్రహ్మనుండి ఏ పదార్థం గాని లేక పదార్థాల నుండి బ్రహ్మ కాని వేరు కాలేదు. వ్యాప్య వ్యాపక భావ సంబంధం ఉండుట వల్ల ఆ రెండు ఒకటి కాలేవు. అంటే అన్వయ వ్యతిరేకభావంతో చూచినపుడు వ్యాప్య వ్యాపక పదార్థాలు రెండూ కలిసి యుండీ సదా భిన్నాలుగా ఉంటాయి. ఒకటే అయితే వానిలో వ్యాప్యవ్యాపక భావ సంబంధం ఎట్లు కుదురుతుంది. కాబటి వ్యాప్యవ్యాపక సంబంధం కలుగదు. అందువలన బృహదారణ్యక (అంతర్యామీ) బ్రాహ్మణంలో సుస్పష్టంగా వ్రాయబడింది. బ్రహ్మనున్నాడనే జ్ఞానం కూడా కలగదు. ఎందుకంటే ఆకారం లేకుంటే అభాసం కలగటం సంభవం. అంతఃకరణోపాధితో బ్రహ్మను జీవునిగా భావించిన మీ మాటలు అజ్ఞానంతో ఉన్న పసిపిల్లల మాటలతో

సమానాలు. అంతఃకరణం చంచలమైనది. ఖండ ఖండాలై ఉన్నది. బ్రహ్మ అచలుడు, అఖండుడు. ఒకవేళ నీవు బ్రహ్మ మరియు జీవుని వేరు వేరుగా అనుకుంటే ఏయే చోట్లకు అంతఃకరణం పోతుందో ఆ యా చోట్ల ఉన్న బ్రహ్మను అజ్ఞానిగాను, ఏ యే ప్రదేశాలు అంతఃకరణం వీడునో ఆ యా చోట్ల ఉన్న బ్రహ్మను సుజ్ఞానవంతునిగా పరిగణిస్తావా? లేదా? దీనికి మీ సమాధానమేమి? ఉదా:- గొడుగు ఎండలో ఎక్కడెక్కడ పట్టుకొంటే అక్కడక్కడ ఎండను కప్పివేస్తుంది. ఎక్కడెక్కడి నుండి ఆ గొడుగు తొలగుతుందో అక్కడక్కడ ఎండబయటపడుతుంది. అలాగే అంతఃకరణం బ్రహ్మను క్షణ క్షణానికి జ్ఞానిగాను, అజ్ఞానిగాను, బద్ధునిగాను, ముక్తునిగాను చేస్తూ పోతుంది. అఖండమైన బ్రహ్మకు ఏకదేశంలో అచ్ఛాదనా ప్రభావం కలుగుతుందో ఆ ప్రదేశాలలో బ్రహ్మలందరు అజ్ఞానులు కాగలుగుతారు. ఎలాగంటే అతడు చేతనుడు. అంటే జ్ఞానం కలవాడు. మథురలోని ఒక అంతఃకరణంలో ఉన్న బ్రహ్మ యే వస్తువును చూసాడో దాని స్మరణ కాశీలోగల మరొక అంతఃకరణస్థునిలో స్మరించబడలేదు. ఎందుకంటే **"అన్యదృష్టమనోన స్మరతీతి న్యాయాత్ "** ఒకరు చూచినది మరోకరికి స్మరణకు రాదు. మథురలో నున్న చిదాభాసుడు వేరు. కాశీలో ఉన్న చిదాభాసుడు వేరు. మథురలో నున్న అంతఃకరణావచ్ఛిన్న బ్రహ్మము వేరు. కాశీలోనున్న అంతఃకరణా వచ్ఛిన్న బ్రహ్మము వేరు. బ్రహ్మయే జీవుడై వేరుకాకుంటే జీవుడు సర్వజ్ఞుడు కావాలి. ఒకవేళ బ్రహ్మ ప్రతిబింబం బ్రహ్మకంటే భిన్నమైన ప్రత్యభిజ్ఞా అంటే పూర్వం చూసిన, విన్న జ్ఞానం వీరికి కలగజాలదు. బ్రహ్మ ఒక్కడు కాబట్టి స్మరణ కలుగుతుందని ఎవరైనా అంటే ఒకచోట అజ్ఞానంగాని లేక దుఃఖంగాని కలగటంవలన, బ్రహ్మలందరికీ అజ్ఞానంగాని, లేక దుఃఖంగాని కలగాలి. ఇలాంటి అనేక దృష్టాంతాలతో నిత్యుడు, శుద్ధుడు, బుద్ధుడు, ముక్తస్వభావుడైన బ్రహ్మను నీవు అశుద్ధుడు, అజ్ఞాని మరియు బద్ధ్యాది దోషయుక్తునిగా మరియు అఖండితున్ని ఖండ ఖండాలుగా చేసావు.

నవీనుడు:- నిరాకారానికి కూడ ఆభాస కలుగుతుంది. ఉదా:- దర్పణంగాని, జలాలలో గాని ఆకాశంయొక్క ఆభాసపడుతుంది. అది నీలంగానో, లేక మరొకవిధంగానో గంభీరంగా గూఢంగా కనిపిస్తుంది. అదే విధంగా బ్రహ్మ ఆభాస కూడా సమస్తాంతఃకరణాలలో పడుతుంది.

సిద్ధాంతి:- ఆకాశానికి రూపమే లేదు. కండ్లున్న వాడెవడు దానిని చూడలేడు. కనిపించని పదార్థం దర్పణంలోగాని,.జలాలలోగాని ఎలా అగుపడుతంది? ఘనీభవించిన లేక పలుచనైన సాకార వస్తువు కనిపిస్తుందే గాని నిరాకార వస్తువు కనిపించదు.

నవీనుడు:- అలాగైతే మనపైన నీలవర్ణంగా కనిపిస్తుంది కదా అదే అద్దం వంటి పదార్థంలో భాసిస్తున్నది. అది ఏ పదార్థం?

సిద్ధాంతి:- అది పృథ్వి నుండిపైకేగిన జల, పృథ్వీ అగ్నుల త్రస రేణువులు. ఎక్కడనుండి వర్షం కురుస్తుందో అక్కడ జలమే లేకుంటే వర్షమెక్కడ నుండి కురుస్తుంది. కావున సుదూరంలో

గుడారంలా కనిపిస్తున్నది జలం యొక్క చక్రం. ఇదే విధంగా పొగమంచు దూరంనుండి ఘనా = మేఘాకారంగా కనిపిస్తుంది. మరి సమీపం నుండి పలుచగా మరియు డేరాలాగా (గుడారం లాగా) కనిపిస్తుంది. అదే రీతిగా ఆకాశంలో జలం కనిపిస్తుంది.

నవీనుడు:– మేమిచ్చిన రజ్జు, సర్ప, స్వప్నాల దృష్టాంతాలు అసత్యాలా?

సిద్ధాంతి:– కావు, మీరు గ్రహించినది అసత్యం. అందుకే మేము ఇంతకు పూర్వమే వ్రాసినాము. మంచిది. మొదట అజ్ఞానం ఎవరికి కలుగుతుందో చెప్పండి.

నవీనుడు:– బ్రహ్మకు.

సిద్ధాంతి:– బ్రహ్మ అల్పజ్ఞుడా? సర్వజ్ఞుడా?

నవీనుడు:– సర్వజ్ఞుడు కాని, అల్పజ్ఞుడు కాని కాదు. ఎందుకంటే సర్వజ్ఞత్వం, అల్పజ్ఞత్వాలు ఉపాధితో ఉన్నప్పుడు ఏర్పడతాయి.

సిద్ధాంతి:– ఉపాధి సహితుడు ఎవడు?

నవీనుడు:– బ్రహ్మ

సిద్ధాంతి:– అయితే బ్రహ్మయే సర్వజ్ఞుడు, అతడే అల్పజ్ఞుడైతే నీవు సర్వజ్ఞత, అల్పజ్ఞతల నెలా నిషేధించావు? అది ఉపాధి కల్పితం అంటే దానిని కల్పించే కాల్పనికుడు ఎవరు?

నవీనుడు:– జీవుడు బ్రహ్మయా లేక అన్యుడా?

సిద్ధాంతి:– అన్యుడు, ఎందుకంటే బ్రహ్మ స్వరూపుడే అయితే మిథ్యాకల్పనలను చేయువాడు బ్రహ్మ కాలేడు. ఎవని కల్పన మిథ్యయో అతడు సత్యమెట్లు కాగలడు?

నవీనుడు:– మేము సత్యాన్ని, అసత్యాన్ని అబద్ధమని భావిస్తాము. నోటితో మాట్లాడటం కూడా అసత్యమే.

సిద్ధాంతి:– నీవు అసత్యమాడుతూ, దానినే నమ్ముకొనేవాడవైతే అసత్యవాదివి ఎలా కావు?

నవీనుడు:– ఆగండి. అసత్యం మరియు సత్యం అనేవి మాలోనే కల్పితమైనవి. మేము ఆ రెండింటికి సాక్షులం. అధిష్ఠాతలం అంటే అధికారులం.

సిద్ధాంతి:– నీవు సత్యాసత్యాలకు ఆధారుడవైన ఒక వ్యాపారివి, ఒక చోరునివి. కావున నీవు ప్రామాణికుడవు కాదు. ఎందుకంటే ఎప్పుడూ సత్యాన్నే అంగీకరించి, సత్యాన్నే చేసి సత్యాచరణ కలిగి, అసత్యాన్ని విశ్వసించక, మాట్లాడక, సత్యాచరణ కలిగి ఉండేవాడే ప్రామాణికుడవుతాడు. నీవు నీ మాటను అసత్యంగా అనుకుంటే నీ యంతట నీవే మిథ్యావాదివవుతావు.

నవీనుడు:- బ్రహ్మకు ఆశ్రయమై, బ్రహ్మయే ఆవరణగా ఉంటే ఆ మాయను నీవు నమ్ముతావా? లేదా?

సిద్ధాంతి:- విశ్వసించం. ఎందుకంటే నీవు లేని వస్తువున్నట్లు కనిపిస్తున్నదని చెప్పుచున్నావు. ఆ మాటను హృదయనేత్రం లేనివాడు అంటే అజ్ఞాని విశ్వసిస్తాడు. ఎందుకంటే వస్తువు లేకుండా దాని జ్ఞానం కలగటం సంభవం కాదు. ఉదా:- గొడ్రాలికి బిడ్డ ప్రతిబింబం ఎన్నడూ ఏర్పడదు. "సన్మూలాః సోమ్యేమాః ప్రజాః" అనే ఇత్యాది ఛాందోగ్యోపనిషత్తులోని వాక్యాలను నీవు విరుద్ధంగా చెబుతున్నావు.

నవీనుడు:- వశిష్ఠ శంకరాచార్యాలు మొదలుకొని నిశ్చలదాసు వరకు గల గొప్ప పండితులు వ్రాసిన వాటిని నీవు ఖండిస్తావా? మాకు మాత్రం వసిష్ఠుడు. శంకరాచార్యుడు, నిశ్చల దాసాదులు గొప్పవారుగా అనబడుతున్నారు.

సిద్ధాంతి:- నీవు విద్వాంసుడవా? అవిద్వాంసుడవా?

నవీనుడు:- మేము కూడా కొంత విద్వాంసులమే.

సిద్ధాంతి:- మంచిది. అయితే వశిష్ఠ, శంకరాచార్య, నిశ్చలదాసుల పక్షాన్ని మా సమక్షంలో సమర్థించండి. మేము దానిని ఖండిస్తాము. ఎవరి పక్షం గెలిచిన ఆ పక్షమే గొప్పది. వారివి మరియు నీవి అఖండనీయాలైతే వారి యుక్తులతో మా పక్షాన్ని ఖండించు? అప్పుడు నీ మాటలు వారి మాటలు మాననీయములవుతాయి.

శంకరాచార్యులు జైనమతాన్ని ఖండించటానికై ఈ మాయావాదాన్ని అవలంబించి ఉంటారని అనుమానించబడుతున్నది. ఎందుకంటే దేశకాలానుకూలంగా తమ పక్షాన్ని సమర్థింపదలచి స్వార్థులైన విద్వాంసులు అనేకులు తమ ఆత్మ జ్ఞానానికి విరుద్ధంగా వాదిస్తారు. జీవేశ్వరులు ఒక్కటి, జగత్తు మిథ్య, అనే మాటలు కార్యవ్యవహారాలు సత్యాలుగా అంగీకరించబడనప్పుడు, వారి మాటలు సత్యాలు కాలేవు. నిశ్చలదాసు పాండిత్యం కూడా ఎలా ఉంటుందో చూడండి."**జీవో బ్రహ్మాఽభిన్నశ్చేతనత్వాత్**" అని అతడు వృత్తి ప్రభాకరంలో జీవ బ్రహ్మల ఏకతను గురించి అనుమానంగా ఇలా వ్రాసాడు. జీవుడు చేతనుడవటం వలన బ్రహ్మకంటే అభిన్నుడు అనే విషయం చాలా అజ్ఞానంతో కూడిన పురుషుని మాటలాగా ఉన్నది. ఎలాగంటే సాధర్మ్య మాత్రంతో పరస్పర ఐక్యత కలగదు. వైధర్మ్యని భేదం కలుగుతుంది. ఉదా:- "**పృథివీ జలాఽభిన్న జడత్వాత్**" అంటే జడమవటంతో పృథ్వి జలం కంటే అభిన్నమని ఎవరో అన్నట్లుగా ఈ వాక్యం పొసగలేదు. అదేవిధంగా నిశ్చలదాసు యొక్క లక్షణం కూడా వ్యర్థమైనది. ఎందుకంటే అల్పం, అల్పజ్ఞత్వం మరియు భ్రాంతిమత్వాది ధర్మాలు జీవునిలోని బ్రహ్మ కంటే విరుద్ధాలు. మరి సర్వగత, సర్వజ్ఞత్వం, నిర్భ్రాంతిత్వాది వైధర్మ్యాలు బ్రహ్మలోని

జీవుని కంటే విరుద్ధాలై ఉన్నాయి. దీని ద్వారా బ్రహ్మ, జీవుడు భిన్నులు. ఉదా:- గంధత్వ కఠినత్వ మిథ్యాదులు పృథ్వీ ధర్మాలు. రసత్వ, ద్రవత్వాలు గల జల ధర్మాలకు విరుద్ధాలవటం వలన పృథ్వీ మరియు జలం ఒకటి కాదు. అలాగే జీవుడు బ్రహ్మకు వైధర్మ్యాలు కలవాడవటం వలన జీవబ్రహ్మాలు ఎన్నడూ ఒకటి కాలేరు. ఉండలేరు. దీనితో నిశ్చలదాసుకు ఎంత పాండిత్యముందో తెలుసుకోండి. యోగ వాశిష్ఠాన్ని రచించినవాడు ఎవడో ఒక ఆధునిక వేదాంతి. వాల్మీకి, వశిష్ఠాదులతో రచించబడింది కాదు. రామచంద్రుని ద్వారా రచించబడి, చెప్పి వినిపించబడింది కాదు. ఎందుకంటే వారందరు వేదానుయాయులు. వేద విరుద్ధాలు వ్రాయరు. చెప్పరు. వినరు.

ప్రశ్న:- వ్యాసుడు శారీరిక సూత్రాలను రచించాడు. వానిలోకూడ జీవబ్రహ్మాల ఏకత కనిపించదా చూడండి.

సంపద్యావిర్భావః స్వేన శబ్దాత్ ॥ 1 ॥
బ్రాహ్మేణ జైమిని రుపన్యాసాదిభ్యః ॥ 2 ॥
చితితన్మాత్రేణ తదాత్మకత్వాదిత్యౌడులోమిః ॥ 3 ॥
ఏవమప్యుపన్యాసాత్ పూర్వభావాదవిరోధం బాదరాయణః ॥ 4 ॥
అత ఏవ చానన్యాధిపతిః ॥ 5 ॥ వేదాంతదర్శ. అ.4 పా.4 సూ.1-5-6,7,9 ॥

1. జీవుడు తన స్వరూపాన్ని పొంది ప్రకటితమవటానికి పూర్వం అతడు, బ్రహ్మ స్వరూపుడు. ఎందుకంటే స్వశబ్దంతో తన బ్రహ్మ స్వరూపం గ్రాహ్యమవుతున్నది.

2. **"అయమాత్మా అపహతపాప్మా"** మొదలైనవి ఆఖ్యాయికలు. ఐశ్వర్య ప్రాప్తి వరకు గల హేతువుల ద్వారా బ్రహ్మ స్వరూపంతో జీవుడుంటాడు. ఇలాంటి అభిప్రాయాలు జైమిని ఆచార్యునివి.

3. ఔడులోమి అనే ఆచార్యుడు తదాత్మక స్వరూప నిరూపణాలతో బృహదారణ్యహేతురూపక వచనాలతో చైతన్య మాత్రస్వరూపంతో జీవుడు ముక్తిలో స్థితుడై ఉంటాడన్నాడు.

4. వ్యాసుడు ఈ పూర్వోక్త సూత్రాలతో, ఐశ్వర్యప్రాప్తి రూపహేతువులతో, జీవునికి బ్రహ్మ స్వరూపం కలగటంలో అవిరోధాన్ని తెలిపాడు.

5. ఐశ్వర్య సహితుడైన యోగి తన బ్రహ్మ స్వరూపాన్ని పొంది అన్యాధిపతి రహితుడై అంటే స్వయంగా తనంతతానే అందరికీ అధిపతి రూపుడైన బ్రహ్మ స్వరూపంతో ముక్తిలో స్థిరమై ఉంటాడు.

జవాబు:- పై సూత్రాలకు మీరు చెప్పిన అర్థాలు, సరియైనవని కావు. వాటి అర్థమిలా ఉన్నది. వినండి.

1. జీవుడు తన స్వకీయ పరిశుద్ధ స్వరూపాన్ని పొంది సమస్త మలాల నుండి రహితుడై పవిత్రుడు కానంతవరకు యోగాభ్యాసంతో ఐశ్వర్యాన్ని పొంది అంతర్యామి అయిన బ్రహ్మను పొంది ఆనందంలో స్థిరుడై ఉండలేడు.

ఇదే విధంగా పాపాది రహితుడైతే ఐశ్వర్యయుక్త యోగి అవుతాడు. అప్పుడు బ్రహ్మతో కలిసి ముక్త్యానందాన్ని అనుభవిస్తాడు అని జైమినీ ఆచార్యుల అభిప్రాయం.

3. అవిద్యాది దోషాలనుండి విముక్తుడై పరిశుద్ధ చైతన్య మాత్ర స్వరూపంతో జీవుడు స్థిరత్వం పొందుతాడు. అప్పుడు "తదాత్మకత్వం" అంటే బ్రహ్మ స్వరూపంతో, సంబంధాన్ని పొందగలడు.

4. బ్రహ్మతో కలిసి ఐశ్వర్యాన్ని మరియు పరిశుద్ధ విజ్ఞానాన్ని పొంది ఈ మానవ జీవిత కాలంలోనే జీవన్ముక్తుడవుతాడు. అప్పుడు తన పూర్వ స్వరూప పవిత్రతను పొంది ఆనందం పొందుతాడని వ్యాసుడు అన్నాడు.

5. యోగికి సత్యసంకల్పం కలిగినప్పుడు స్వయంగా పరమేశ్వరుని పొంది మోక్ష సుఖాన్ని అనుభవిస్తాడు. అక్కడ స్వాధీనుడై, స్వతంత్రునిగా ఉంటాడు. ప్రపంచంలో ఒకటి ప్రధానమైన మరొకటి అప్రధానమైనట్లు ముక్తిలో అలా ఉండదు. కాని ముక్త జీవులన్ని ఒకేవిధంగాఉంటాయి.

ఇలా లేకుంటే,

వ్యాసముని కృత వేదాంత సూత్రాలు

1-1-16 ॥

1. నేతరోఽనుపపత్తేః ॥

బ్రహ్మ తప్ప అన్యజీవుడు సృష్టికర్త కాడు. ఎందుకంటే ఈ అల్పశక్తి సామర్థ్యం, అల్పజ్ఞుడైన జీవునిలో సృష్టికర్తృత్వం అంటే సృష్టిని సృజించేంతటి సామర్థ్యాలు లేవు. కావున జీవుడు బ్రహ్మ కాడు. కాలేడు.

1-1-17 ॥

2. భేదవ్యపదేశాచ్చ ॥

"రసంహ్యేవాయం లబ్ధ్వానందో భవతి" (తై. ఉ. బ్ర.వ. 7) ఇది తైత్తరీయ ఉపనిషద్వచనం. జీవుడు మరియు బ్రహ్మ భిన్నులని ఈ ఇద్దరి భేదం ప్రతిపాదించబడింది. ఇలా కాకుంటే రసం అంటే ఆనందస్వరూప బ్రహ్మను పొంది జీవుడు ఆనందస్వరూపుడౌతాడు. ఈ ప్రాప్తి విషయ బ్రహ్మ మరియు ప్రాప్తి పొందే జీవుని గురించిన నిరూపణ వేరుగా కలుగదు. కావున జీవుడు మరియు బ్రహ్మ ఒక్కటి కాదు.

1-2-22 ॥

3. "విశేషణ భేదవ్యపదేశాభ్యాం చ నేతరౌ"

దివ్యోహ్యమూర్తః పురుషః స బాహ్యాభ్యంతరోహ్యజః ।
అప్రాణోహ్యమనాః శుభ్రోఽక్షరాత్పరతః పరః ॥ ముండకోప. 2-ఖం. 1 మం. 2 ॥

దివ్యమైన వాడు, పరిశుద్ధుడు, మూర్తిమత్వరహితుడు, అన్నింటిలో పరిపూర్ణుడు, వెలుపల, లోపల నిరంతర వ్యాపకుడు, అజుడు, జన్మ-మరణ-శరీరధారణాది రహితుడు, శ్వాసనిశ్వాసశరీర మనో సంబంధరహితుడు, ప్రకాశస్వరూపుడు అనే ఇలాంటి పరమాత్ముని విశేషణాలు మరియు అక్షర, నాశరహిత ప్రకృతి కంటే భిన్నుడు. అంటే సూక్ష్మజీవుని కంటే కూడా పరమేశ్వరుడు భిన్నుడు అంటే బ్రహ్మ సూక్ష్ముడు. ప్రకృతి మరియు జీవుల కంటే బ్రహ్మ యొక్క భేద ప్రతిపాదనారూప హేతువుల చేత, ప్రకృతి మరియు జీవుల కంటే బ్రహ్మ భిన్నుడై ఉన్నాడు.

4. అస్మిన్నస్య చ తద్యోగం శాస్తి ॥ 1-1-19 ॥

ఈ సర్వవ్యాపక బ్రహ్మలో జీవుని యోగం మరియు జీవునిలో బ్రహ్మ యోగ ప్రతిపాదన చేయటం వలన జీవ, బ్రహ్మ భిన్నులు. ఎందుకంటే యోగం, భిన్న పదార్థాలకే కలుగ గలదు.

5. అంతస్త ద్ధర్మోపదేశాత్ ॥ 1-1-20 ॥

ఈ బ్రహ్మకు అంతర్యామి అయిన ధర్మాలు చెప్పబడినవి. జీవునిలో వ్యాపించి ఉండటం వలన వ్యాప్య అంటే వ్యాపించబడిన జీవుడు, వ్యాపక అంటే వ్యాపించిన బ్రహ్మ కంటే భిన్నుడు. ఎందుకంటే వ్యాప్య వ్యాపక సంబంధాలు కూడా భేదంలోనే సంభవిస్తాయి.

6. భేదవ్యపదేశాచ్చాన్యః ॥ 1-1-21 ॥

పరమాత్ముడు ఏ విధంగా జీవుని కంటే భిన్న స్వరూపుడో అదేవిధంగా ఇంద్రియాలు, అంతఃకరణం కంటే, పృథివ్యాది భూతాలకంటే, దిశలు, వాయువు, సూర్యాదుల కంటే, దివ్య గుణాలను అనుభవించటం ద్వారా దేవతావాచ్యం గల విద్వాంసుల కంటే కూడా పరమాత్ముడు భిన్నుడు.

7. గుహాం ప్రవిష్టావాత్మానౌహితద్దర్శనాత్॥ 1-2-11 ॥

"గుహాం ప్రవిష్టౌ సుకృతస్యలోకే" ఇలాంటి ఉపనిషత్తుల వచనాలతో జీవుడు మరియు పరమాత్ముడు భిన్నులు. అదే విధంగా ఉపనిషత్తులలో అనేక ఆధారాలు చూపబడినవి.

8. అనుపపత్తే స్తు న శారీరః ॥ 1-2-3 ॥

"శరీరే భవః శారీరః" శరీరధారి అయిన జీవుడు బ్రహ్మ కాదు. ఎందుకంటే బ్రహ్మ యొక్క గుణ, కర్మ, స్వభావాలు జీవునిలో కలగవు.

9. అంతర్యామ్యధిదైవాదిషు తద్ధర్మ వ్యపదేశాత్ ॥ 1-2-18 ॥

(అధిదేవ) సమస్త దివ్య పదార్థాలైన మనస్సు, ఇంద్రియాలలో, (అధిభూత) పృథివ్యాది భూతాలలో, (అధ్యాత్మ) సకల జీవులలో పరమాత్ముడు అంతర్యామి రూపంలో ఉన్నాడు. ఇలాగే ఆ పరమాత్ముని వ్యాపకత్వాది ధర్మాలు సర్వత్ర ఉపనిషత్తులలో వ్యాఖ్యానించబడ్డాయి.

10. శారీర శ్చోభయేఽపి హి భేదేనైన మధీయతే ॥ 1-2-20 ॥

శరీరధారియైన జీవుడు బ్రహ్మ కాడు. ఎందుకంటే బ్రహ్మ కంటే జీవుని భేదం స్వరూపంతో తెలుస్తున్నది. పైన తెలిపిన శారీరిక సూత్రాల ద్వారా, స్వరూపంతో కూడా బ్రహ్మ జీవుల భేదం తెలుస్తున్నది. వేదాంతుల ఉపక్రమం, ఉపసంహారాలు కూడా ఋజువు కావడం లేదు. ఎందుకంటే ఉపక్రమం, అంటే ఆరంభం బ్రహ్మ నుండి ఉపసంహారం అంటే ప్రళయం వరకు అన్నీ బ్రహ్మలోనే కల్పిస్తారు. రెండవ వస్తువును అంగీకరించనప్పుడు ఉత్పత్తి, ప్రళయాలు కూడా బ్రహ్మ యొక్క ధర్మాలవుతాయి. ఉత్పత్తి వినాశరహితమే బ్రహ్మమని వేదాది సత్య శాస్త్రాలలో ప్రతిపాదించబడి ఉన్నది. నిర్వికారుడు, అపరిణామి, శుద్ధుడు, సనాతనుడు, నిర్భ్రాంతత్వాది విశేషగుణ యుక్త బ్రహ్మలో వికారం, ఉత్పత్తి మరియు అజ్ఞానాలు ఏవిధంగా సంభవిస్తాయి? ఉపసంహారం అంటే ప్రళయం కలిగినప్పటికి కూడా బ్రహ్మ, కారణాత్మకమైన జడప్రకృతి మరియు జీవుడు నిరంతరం ఉంటారు. కావున ఉపక్రమ, ఉపసంహారాలు కూడా అసత్యాలే. ఇలా పరిశుద్ధత లేని, సత్య శాస్త్రాలకు, ప్రత్యక్షాది ప్రమాణాలకు విరుద్ధమైన మాటలనేకమున్నాయి.

విక్రమాదిత్యుడు - భర్తృహరి

దీని తర్వాత జైనుల, శంకరాచార్యుని అనుయాయుల ఉపదేశ సంస్కారాలు ఆర్యావర్తంలో వ్యాపించాయి. వీరు తమలో తాము ఖండనమండనాలను కూడా కొనసాగించారు.

శంకరాచార్యుని తర్వాత మూడు శతాబ్దాలు గడిచిన మీదట ఉజ్జయినీ నగరంలో ప్రతాపవంతుడైన విక్రమాదిత్యుడు రాజుగా ఉన్నాడు. అతడు రాజులందరి మధ్య ఉన్న అంతఃకలహాల నణచి శాంతిని స్థాపించాడు. తదనంతరం రాజా భర్తృహరి కావ్యాది శాస్త్రాలలో, అన్య విషయాలలో కూడా కొంత కొంత పాండిత్యాన్ని సంపాదించి విద్వాంసుడయ్యాడు. అతడు విరాగియై రాజ్యాన్ని త్యజించాడు.

విక్రమాదిత్యుని తర్వాత ఐదువందలవత్సరాలకు భోజుడు రాజయ్యాడు. అతడు కొంత వ్యాకరణాన్ని, కావ్యాలంకారాలను విరివిగా ప్రచారం చేసాడు. ఇతని రాజ్యంలో మేకలను మేపుకొనే కాళిదాసు కూడా రఘువంశ కావ్యాన్ని రచించి దానికి కర్త అయ్యాడు. ఇది విశ్వవిఖ్యాతం పొందినది. భోజరాజు దగ్గరకు ఎవరైనా ఒక మంచి శ్లోకాన్ని వ్రాసి తెచ్చిన వానికి రాజు పుష్కలంగా ధనం ఇచ్చి సత్కరించేవాడు. తర్వాతకాలంలో తదనంతరం ఈ దేశంలో ఉన్న రాజులు, శ్రీమంతులు చదవటాన్నే మానేసారు.

శంకరాచార్యునికి పూర్వం, వామమార్గీయుల తర్వాత శైవాది సంప్రదాయాలలో మతవాదులు కూడా ఉన్నారు. కాని వారికి గొప్ప ప్రాబల్యం లేదు. మహారాజైన విక్రమాదిత్యుని నుండి మొదలుకొని శైవుల ప్రాబల్యం అభివృద్ధి కాసాగింది. శైవులలో, వామమార్గీయులలో దశమహా విద్యాది

శాఖలున్నట్లుగానే పాశుపతాది అనేక శాఖలున్నాయి. ప్రజలు శంకరాచార్యులను శివుని అవతారమని నిర్ణయించారు. అతని అనుయాయులైన సన్యాసులు కూడా శైవమతంలో ప్రవేశించారు. వామమార్గీయులను కూడా తమ మతంలో కలుపుకోసాగారు. వామమార్గీయులు శివుని భార్య అయిన 'దేవి' ఉపాసకులుగా శైవులు 'మహాదేవు'ని ఉపాసకులుగా అయ్యారు. వీరిరువురు రుద్రాక్షలను, భస్మాన్ని విభూతిని నేడూ ధరిస్తున్నారు. కాని వేదవిరోధులుగా వామమార్గీయులైనంతగా శైవులు కాలేదు.

రుద్రాక్షధారణ మహాత్మ్యం

1. ధిక్ దిక్కపాలం భస్మరుద్రాక్ష విహీనమ్ ॥

అంటే 'ఎవరి ఫాలభాగంలో విభూతి, కంఠంలో రుద్రాక్షమాల ఉండవో వారిని తిరస్కరించాలి' అనే శ్లోకాలు అనేకవిధాలుగా వీరు రచించి, ఇంకా ఇలా అన్నారు.

తంత్యజేదన్త్యజమ్ యథా ॥ ఇలాంటివారిని ఛండాలురులాగా త్యజించాలి.

2. రుద్రాక్షాన్ కంఠదేశ దశనపరిమితాన్మస్తకే వింశతి ద్వే. షట్ షట్, కర్ణ ప్రదేశే కరయుగల గతాన్ ద్వాదశాన్ద్వాదశైవ॥ బాహ్వోరిన్దోః కలాభిః పృథగితి గదితమేక మేవం శిఖాయామ్, వక్షస్యష్టాధికం యః కలయతి శతకం స స్వయం నీలకంఠః ॥ 2 ॥

కంఠంలో ముప్పై రెండు, శిరస్సులో నలభై, ఒక్కొక్క చెవికి ఆరు - ఆరు చొప్పున, ఒక్కొక్క చేతికి పన్నెండు చొప్పున, పదహారు చొప్పున భుజాలకు, శిఖలో ఒకటి మరియు హృదయంపై నూట ఎనిమిది రుద్రాక్షలను ఎవడు ధరిస్తాడో అతడు సాక్షాత్తుగా మహాదేవునితో సమానుడు. శాక్తేయులు కూడా ఈ విధంగానే భావిస్తారు.

భగ, లింగపూజ

తర్వాత ఈ వామమార్గీయులు మరియు శైవు లేకాభిప్రాయులై భగలింగాన్ని స్థాపించారు. దానినే జలధారి మరియు లింగం అంటే పానవట్ట లింగమని అంటారు. దీనిని వారు పూజించసాగారు. ఆ సిగ్గులేని వారికి ఈ పామరత్వంతో కూడిన పనిని మేమెందుకు చేస్తున్నాము? అని కించిన్మాత్రం కూడా సిగ్గు కలగలేదు. **"స్వార్థీ దోషం న పశ్యతి"** స్వార్థులు తమ స్వార్థసిద్ధి కొరకై దుష్కార్యాలను కూడా శ్రేష్ఠమని అనుకుని వానిలోని దోషాలను పరికించరు అని ఒక కవి చెప్పాడు. ఇలాంటి పాషాణాది మూర్తులు మరియు భగలింగాల పూజలందే సమస్త ధర్మ, అర్థ, కామ, మోక్షాలు సిద్ధిస్తాయని భావించారు.

భోజరాజు తర్వాత జైనులు తమ మందిరాలలో మూర్తులను స్థాపించి, దర్శన, స్పర్శనాలకై రాకపోకలుసాగించినప్పుడు ఈ పోపుల శిష్యులు కూడా జైనమందిరాలకు రాకపోకలు సాగించారు.

క్రమంగా పశ్చిమం నుండి కొన్ని అన్యమతాలు మరియు యవనులు కూడా ఆర్యావర్తానికి రాకపోకలను ప్రారంభించిరిచారు. అప్పుడు పోపులు ఈ శ్లోకాన్ని రచించారు.

న వదేద్యావనీం భాషాం ప్రాణైః కంఠగతైరపి ।
హస్తినా తాడ్యమానోఽపి న గచ్ఛేజ్జైనమందిరమ్ ॥ భవిష్యపురాణం 3-3-28-53 ॥

దుఃఖమెంత కలిగినా, ప్రాణాలు కంఠ మందున్నా అంటే మృత్యువు ఆసన్నమైనా సరే యవనుల అంటే మ్లేచ్ఛభాషను నోటితో ఉచ్చరించరాదు. మరియు మదించి పిచ్చెక్కిన ఏనుగు ఒకటి చంపటానికి తరుముతూ వచ్చినప్పుడు జైనుల మందిరానికి వెళ్ళిన ప్రాణం దక్కుతుందన్నప్పటికి కూడా జైనమందిరంలో ప్రవేశించరాదు. జైనమందిరంలో ప్రవేశించి రక్షింపబడటం కంటే ఏనుగుతో మరణించటమే మంచిది.

ఇలాంటి విషయాలను తమ శిష్యులకు ఉపదేశం చేయసాగారు. వారితో, 'మీ మతంలో ఏదైన మాననీయ గ్రంథ ప్రమాణం ఉన్నదా?' అని అడిగితే 'అవును ఉన్న'దని చెప్పి, మార్కండేయ పురాణాది వాక్యాలను చూపించే వారు. దుర్గాపాఠంలో దేవీ వర్ణన వ్రాయబడి ఉన్నది. దానిని చూడండి. ఒకడు భోజరాజు రాజ్యంలో వ్యాసుని పేర మార్కండేయ, శివపురాణాలను వ్రాసి ప్రచురించాడు. ఈ సమాచారం భోజరాజుకు తెలియటంతో ఆ పండితులకు హస్తాలను నరకు దండన విధించాడు. వారితో భోజరాజు ఇలా అన్నాడు. మీలో ఎవరైనా కావ్యాది గ్రంథాలను రచించదలిస్తే మీ పేర్లతో వ్రాయండి, కాని ఋషి, మునుల పేర్లతో వ్రాసి ప్రచురించవద్దు.

మహాభారతంలో వేల శ్లోకాలనుచేర్చటం

ఈ విషయాలు భోజరాజుతో రచించబడిన 'సంజీవని' అనే గ్రంథంలో వ్రాయబడ్డాయి. ఈ గ్రంథం గ్వాలియరు రాజ్యంలో బిండ అనే పేరుగల నగరంలో తివాడీ బ్రాహ్మణుల గృహంలో ఉన్నది. దీనిని లఖునోయొక్కరావు సాహెబుగారు మరియు వారి గుమస్తా రామదయాళ్ చౌబేగారు తమ కళ్లతో చూసారు. దానిలో వ్యాసుడు నాలుగువేల నాలుగు వందలు, వారిశిష్యులు ఐదువేల ఆరువందల శ్లోకాలతో కూడిన అంటే మొత్తం పదివేల ఆరువందల శ్లోకాలతో కూడిన అంటే మొత్తం పదివేల శ్లోకాలకు (ప్రమాణం) కారణంగా భారతమును రచించారని సుస్పష్టంగా వ్రాయబడింది. అది మహారాజా విక్రమాదిత్యుని కాలానికి ఇరవైవేల శ్లోకాలతోను, భోజ మహారాజు తండ్రి కాలానికి ఇరవై ఐదువేలు మరియు ఇప్పుడు నా అర్థవయస్సులో ముప్పై వేల శ్లోకాలతో కూడిన మహాభారత గ్రంథం లభిస్తున్నదని భోజ మహారాజు అన్నారు. ఇలాగే పెంచుతూ పోతే మహాభారత గ్రంథం ఒక ఒంటె మోయలేనంత బరువు కలది అవుతుంది. ఋషి, మునుల పేర్లతో పురాణాది గ్రంథ రచన సాగించిన ఆర్యావర్త ప్రజలు భ్రమజాలంలో పడి వైదిక ధర్మ విహీనులై భ్రష్టులవుతారు. దాని ద్వారా భోజరాజుకు కొంత కొంత వేద సంస్కారం ఉన్నదని విదితమవుతున్నది.

భోజరాజు సమయంలో యంత్రాలు

ఇతని భోజ రత్నాకర ప్రబంధంలో ఇలా వ్రాయబడింది.

ఘట్యైకయా క్రోశదశైక మశ్వః, సుకృత్రిమో గచ్ఛతి చారుగత్యా ।
వాయుం దదాతి వ్యజనం సుపుష్కలం, వినా మనుష్యేణ చలత్యజస్రమ్ ॥

భోజ మహారాజు రాజ్యంలో మరియు అతని సమీపంలో గొప్ప గొప్ప శిల్పులుండిరి. వారు అశ్వాకారాన్ని పోలిన ఒక విమానాన్ని యంత్రాలతో కూడిన దానిని తయారు చేసారు. అది ఒక ఘడియలో పదకొండు క్రోసులు మరియు ఒక ఘంటలో ఇరవై ఏడున్నర క్రోసుల దూరం పోతుండేది. అది భూమిపైనా మరియు అంతరిక్షంలో కూడా ప్రయాణం చేసేది. ఒకడు ఒక గాలివీచు యంత్రాన్ని సిద్ధం చేసాడు. ఇది మానవునితో నడపబడక యంత్రశక్తితో ప్రతినిత్యం నడుపబడుతూ పుష్కలంగా గాలిలో సంచారం చేసేది. ఈ రెండు యంత్రాలు నేటి వరకు కూడా ఉండి ఉన్న ఐరోపా ఖండవాసులింత అహంకారం చూపకుండెడివారు.

పోపులు తమ శిష్యులను జైనుల వైపుకు పోనీయక అడ్డగిస్తున్నప్పటికి జైన మందిరాలకు ప్రజలు పోతూనే ఉండిరి. జైనుల కథలను వినటానికి కూడ వెళ్ళేవారు. జైన పోపులు ఈ పౌరాణిక పోపు శిష్యులను తమ మార్గంలోనికి తెచ్చుకొనుచుండగా అప్పుడు పౌరాణికులు దీనికేదైనా ఉపాయం ఆలోచించాలి. లేకున్న తమ శిష్యులు జైనులవుతారు అని ఆలోచించి పౌరాణిక పోపులు కూడా జైనుల లాగానే తాము కూడా అవతారాలను, మందిరాలను, మూర్తులను, కథా పుస్తకాలను రచించి, మంద్రిరాలను నిర్మించ నిశ్చయించుకొన్నారు. వీరు జైనుల ఇరవై నాలుగు తీర్థంకరుల లాగా ఇరవై నాలుగు అవతారాలను, ఆలయాలను, విగ్రహాలను నిర్మించారు. జైనులకు ఏ విధంగా ఆది గ్రంథం మరియు ఉత్తర పురాణాలున్నాయో అలాగే పద్దెనిమిది పురాణాలను రచించారు.

వైష్ణవ, శైవ మతాలు, పురాణాల ఆరంభం

భోజరాజుకు తర్వాత నూటయాభై వత్సరాలకు వైష్ణవమతమారంభమయ్యింది. కంజర జాతిలో శఠగోపుడనేవాడు జన్మించాడు. అతనితో వైష్ణవమతం కొంత ప్రచారమయ్యింది. అతని తర్వాత భంగీకులములో పుట్టిన మునివాహనుడు, ఇతని తదనంతరం యవన (మహమ్మదీయ) కులంలో జన్మించిన యావనాచార్యుడు మూడవ ఆచార్యుడయ్యాడు. ఆ తర్వాత బ్రాహ్మణ కులం వాడైన రామానుజుడు నాల్గవ ఆచార్యుడయ్యాడు. అతడు తన మతాన్ని వ్యాపింపజేసాడు.

వివిధ పురాణాలు

శైవులు శివపురాణాదులను, శాక్తేయులు దేవీభాగవతాదులను, వైష్ణవులు విష్ణు పురాణాదులను రచించారు. తమ పేర్లతో వ్రాస్తే ఎవరూ అందులోని విషయాలను ప్రమాణంగా అంగీకరించరని

భావించి వ్యాసాది ఋషి, మునుల పేర్లతో పురాణాలను రచించారు. వాస్తవానికి వీని పేర్లను కూడ నవీనం' అనే పెట్టవలసి ఉంటుంది. కాని ఒక దరిద్రుడు తన కొడుకు పేరు 'మహారాజాధిరాజు' అని పెట్టినపుడు, ఒక ఆధునిక పుస్తకానికి సనాతనమని పేరు పెట్టిన ఆశ్చర్యమేమి? ఇక వీరిలో ఏ యే పరస్పర విరుద్ధమైన పోట్లాటలున్నాయో. వాటినన్నింటినీ పురాణాలలో పొందుపరిచారు.

దేవీభాగవత గుణ దోష నిరూపణ

దేవీభాగవతాన్ని చూడండి. అందు 'శ్రీ' అనుపేరు గల ఒక స్త్రీ దేవిగాను, శ్రీపురానికి స్వామిని గాను వ్రాసినారు. ఆమెయే సమస్త జగత్తును రచించినదని, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను కూడా ఆమెయే సృజించినదనీ వ్రాయబడింది. ఆ దేవికి కోరిక కలుగ ఆమె తన హస్తాన్ని నేలకు రుద్దింది. దానితో ఆమె హస్తంలో ఒక బొబ్బ పుట్టింది. దాని నుండి బ్రహ్మ జనించాడు. అతనితో దేవి "నీవు నన్ను వివాహమాడు" మన్నది. అందుకు బ్రహ్మ "నీవు నా తల్లివి, నిన్ను వివాహమాడలేను" అనగా అదివిన్న ఆ తల్లికి చాలా కోపం వచ్చింది. అతన్ని భస్మం చేసింది. మళ్ళీ మరొకసారి హస్తాన్ని నలిపి అదేవిధంగా రెండవ వానిని పుట్టించింది. అతనికి విష్ణువను నామం పెట్టింది. మరల అతనితో కూడా అదే రీతిగా పలికింది. దానికి అతడు అంగీకరించనందున అతనిని కూడా భస్మం చేసింది. తర్వాత అదే విధంగా మూడవ వానిని పుట్టించింది. అతనికి మహాదేవుడని పేరు పెట్టింది. అతనితో "నీవు నన్ను వివాహమాడు' మన్నది. అందుకు ఆ మహాదేవుడు "నేను నిన్ను వివాహమాడలేను. నీవు మరొ స్త్రీ దేహాన్ని ధరించు" అనగా దేవి అలానే చేసింది. అప్పుడు మహాదేవుడు "ఈ రెండు బూడిద కుప్పలలో ఉన్నదేమిటని ప్రశ్నించాడు. ఈ రెండు బూడిదకుప్పలు నీ సోదరులు. వీరు నా ఆజ్ఞను విననందుకు భస్మం చేసానని దేవి సమాధానం ఇచ్చింది. ఇది విని మహాదేవుడు "అలాగైతే నేనొక్కడను సృష్టి కార్యాలనెలా చేస్తాను? వీరిద్దరినీ బ్రతికించండి. ఇద్దరి స్త్రీలను కూడ సృజించండి. అప్పుడు మా ముగ్గురి వివాహాలు మీ ముగ్గురి స్త్రీలతో జరుగుతాయి" అనగా దేవి అలాగే చేస్తుంది. ముగ్గురితో వివాహాలు అయ్యాయి.

ఆహాహా! తల్లిని వివాహమాడలేదు. కాని సోదరిని వివాహమాడాడు. ఇది సరియైనదా? పాఠకులు ఊహింతురుగాక! ఆ తర్వాత ఇంద్రాదులను పుట్టించెను. బ్రహ్మ, విష్ణు, రుద్రుడు మరియు ఇంద్రుడు ఈమె పల్లకిని మోయు బోయవాండ్రను సృజించారు. ఇలాంటి వ్యర్థపు మాటలు సుదీర్ఘంగా - విస్తృతంగా తమ ఇష్టానుసారంగా వ్రాసారు. ఆ వ్రాసిన వారిని "ఆ దేవి శరీరాన్ని, ఆ శ్రీపురాన్ని సృజించిన వారెవరు? మరియు ఆ దేవి తల్లిదండ్రులెవరు?" అని ఎవరైనా ప్రశ్నించిన వారు "మీరు ఏదైనా అనండి దేవి అనాది" అని అంటారు. అలాగైతే సంయోగజన్య వస్తుత్వము ఎన్నడూ అనాది కాలేదు. తల్లినికొడుకు వివాహమాడటానికి జంకిన, అన్న చెల్లెలిని వివాహమాడటంలో కలిగే మేలేమిటి?

ఈ దేవీ భాగవతంలో ఏ విధంగా మహాదేవుడు, విష్ణువు మరియు బ్రహ్మాదులను తక్కువజేసి

దేవి యొక్క గొప్పతనం వ్రాసారో అదే విధంగా శివ పురాణంలో దేవి మొదలైనవారిని తక్కువచేసి వ్రాసారు. అంటే వీరందరు మహాదేవుని దాసులనీ అతడు అందరికీ ఈశ్వరుడని వ్రాసారు.

రుద్రాక్షలు - పగడాలు - పూసలు - బూడిద ధరించేవారు ముక్తిని పొందుతారా?

రుద్రాక్షలు అంటే ఇవి ఒక వృక్షం యొక్క ఫలబీజాలు. వీటిని మరియు బూడిదను ధరించిన ముక్తి అని అనుకుంటే బూడిదలో పొర్లాడు గార్దభాది పశువులు, పగడాలు, గురుగింజలు మొదలైన పూసలను ధరించే భిల్లులు, కంజరులు మొదలైనవారు ముక్తిని పొందుదురా? వరాహ, శ్వాన, గార్ధభాదులు బూడిదలో పొర్లాడు పశువులకు కూడా ముక్తి వచ్చునా?

ప్రశ్న:- కాలాగ్ని రుద్రోపనిషత్తులో భస్మాన్ని ధరించే విధానం వ్రాయబడింది. అదియూ అసత్యమా? మరియు '**త్ర్యాయుషం జమదగ్నేః**'అనేది యజుర్వేద వాక్యం. ఈ విధమైన వేదమంత్రాలతో భస్మధారణా విధానం, పురాణాలలో రుద్రుని నేత్రాల నుండి వెడలు కన్నీటి ధారల నుండి ఏ వృక్షమైనదో దాని పేరే రుద్రాక్ష. దానిని ధరించిన పుణ్యమని వ్రాయబడింది. ఒకే ఒక రుద్రాక్షను ధరించినా కూడా సమస్త పాపాల నుండి విముక్తి చెంది స్వర్గానికి పోతారు. యమరాజుతోగాని నరకంలోగాని భయముండదు.

జవాబు:- కాలాగ్ని రుద్రోపనిషత్తును ఎవడో ఒక భస్మధారి అంటే బూడిద పూతలు పూసుకొన్నవాడు రచించాడు. ఎలాగంటే "**యాఽస్య ప్రథమారేఖా సాఽభూర్లోకః**" అనే ఇత్యాది వాక్యాలు అనర్థకాలై ఉన్నవి. ప్రతిదినం చేతితో పూసుకొనిన రేఖ భూలోకంగాని తద్వాచకంగాని ఎలా అవుతుంది?

"**త్ర్యాయుషం జమదగ్నేః**" అనే మంత్రాలు భస్మాన్ని గాని లేక త్రిపుంద్రధారణలకు సంబంధించినది కాదు. కాని "**చక్షుర్వైజమదగ్ని**" అనే వాక్యం శతపథ బ్రాహ్మణంలో (8-1-2-3) ఉన్నది. ఓ పరమేశ్వరా! నా నేత్రజ్యోతి త్ర్యాయుషమ్ = త్రిగుణమై అంటే మూడువందల సంవత్సరాల వరకుండుగాక! నేను కూడా దృష్టిలోపం రానట్టి ధర్మకార్యాలనే చేయుదునుగాక!

ఆహా ! బాగున్నది. కన్నీటి ధారల నుండి కూడ వృక్షం పుడుతుందనటం ఎంత మూర్ఖత్వ విషయం. పరమేశ్వర సృష్టిక్రమాన్ని ఎవడైనా మార్చగలడా? ఉదా:- ఏ వృక్షబీజాన్ని పరమాత్ముడు పుట్టించెనో దానినుండే ఆ వృక్షం పుడుతుంది కాని మరొకవిధంగా కాదు. రుద్రాక్షలు, భస్మం, తులసీ, కమలాక్షాలు, గడ్డి, చందనాలను కంఠంలో ధరించటం అనేది అడవులలో నుండు ఆటవికుల పని. ఇలాగే వామమార్గీయులు, శైవులు అధిక మిథ్యాచారులు. విరోధులు, కర్తవ్య కర్మలను త్యజించేవారు. వారిలో శ్రేష్ఠులైనవారు ఈ విషయాలను విశ్వసించక సత్కర్మలు చేస్తారు. రుద్రాక్షలతో, భస్మధారణలతో యమదూతలు భయపడిన రక్షకభటులు (పోలీసువారు) కూడా భయపడాలి.

రుద్రాక్షలను, భస్మాన్ని ధరించేవారికి కుక్క, సింహం, సర్పం, తేలు, ఈగ, దోమలు కూడ భయపడవు. ఇక న్యాయాధీశుడైన ఆ యముని దూతలేల భయపడతారు?

వైష్ణవమతము

ప్రశ్న:- వామమార్గీయులు మరియు శైవులు మంచివారు కాకపోతే వైష్ణవులైనా మంచివారుకారా?

జవాబు:- వీరు కూడా వేదవిరోధులవటం వలన వారికంటే కూడా మిక్కిలి చెడ్డవారు.

ప్రశ్న:- **"నమస్తే రుద్రమన్యవే"** (యజు. 16-1) **"వైష్ణవమసి"** (యజు. 5-21) **వామనాయ చ" "గణానాంత్వాం గణపతిగ్ం హవామహే" "భగవతీ భూయాః"** (అథర్వ. 9-10-20) **"సూర్య ఆత్మాజగత స్తస్థుషశ్చ"** (యజు. 13-46) మొదలైన వేద ప్రమాణాలద్వారా శైవాది మతాలు సిద్ధిస్తున్నాయి. మళ్ళీ నీవేల ఖండింతువు?

జవాబు:- ఈ వాక్యాల ద్వారా శైవాది సంప్రదాయాలు సిద్ధించవు. ఎలాగంటే "రుద్రు"డనే పేరు పరమేశ్వరునికి, ప్రాణాది వాయువులకు, జీవులకు, అగ్న్యాదులకు ఉన్నది. క్రోధానికి కర్తయైన రుద్రుడు అంటే దుష్టులను దుఃఖింపజేసే పరమాత్మకు నమస్కరించటం, ప్రాణానికి, జఠరాగ్నికి ఆహార పదార్థాలు వండటం, (నమ ఇతి అన్ననామసు పఠితమ్ - నిఘంటువు 2-7) మంగళకారియై ప్రపంచాని అత్యంత కల్యాణాన్ని కలిగించే ఆ పరమాత్మునికు నమస్కారం చేయాలి. **"శివస్య పరమేశ్వరస్యాయం భక్తః శైవః" "విష్ణోః పరమాత్మనో౽యం భక్తో వైష్ణవః" "గణపతేః సకల జగత్స్వామినో౽యం సేవక గాణపతః", 'భగవత్యా వాణ్యా అయంసేవకః భాగవతః" సూర్యస్య చరాచరాత్మనో౽యంసేవకః సౌరః"**, కాబట్టి రుద్ర, శివ, విష్ణు, గణపతి, సూర్యాది పేర్లు పరమేశ్వరునివి. ఇక భగవతీ, అనేపేరు సత్యభాషణయుక్త వాణిది. వీని అర్థాలను తెలిసికొనకయే ఇలాంటి జగడాలు ఏర్పరచారు.

బైరాగి- శిష్యులు

ఒకానొక బైరాగికి ఇద్దరు శిష్యులుండేవారు. వారు ప్రతిరోజూ గురువు కాళ్ళను వత్తుచుండేవారు. ఒకడు కుడికాలు, రెండవవాడు ఎడమకాలు వత్తటానికి పంచుకొన్నారు. ఒక రోజు ఆ ఇద్దరిలో ఒక శిష్యుడు దుకాణానికి పోయాడు. ఇక రెండవవాడు తాను సేవించేకాలును వత్తుతున్నాడు. ఇంతలో గురువుగారు ఒక పక్కకు దొర్లటంతో ఇతడు సేవించేకాలుపై, తన తోటి సోదర శిష్యుడు సేవించే కాలు పడింది. ఇది చూసి రెండవ శిష్యుడు ఒక కఱ్ఱ తీసుకొని ఆ పడిన కాలును కొట్టాడు. అప్పుడు గురువు "ఓరి దుష్టుడా! నీవేమి పనిచేసితివిరా?" అని ప్రశ్నించగా "నేను సేవించే కాలుపై ఈ కాలు వచ్చి ఎందుకు పడింది? అందుకే ఆ కాలును కొట్టాను" అని శిష్యుడన్నాడు. ఇంతలో దుకాణానికి వెళ్ళిన శిష్యుడు తిరిగి వచ్చాడు. అతడు కూడా తాను సేవించే పాదాన్ని వత్తనారంభించాడు. కాలు

వాచి ఉండటం చూసి, గురువు గారూ! నేను సేవించే ఈ కాలుకు ఏమైన"దని అడిగాడు. గురువుగారు విషయమంతా వినిపించారు. ఆ మూర్ఖుడు కూడా ఏమి మాట్లడక చప్పుడు కాకుండా కఱ్ఱను ఎత్తి బలంగా గురువు యొక్క రెండవ కాలును కొట్టాడు. అప్పుడు గురువు గట్టిగా అరిచాడు. అప్పుడా ఇద్దరు శిష్యులు చెరొక కఱ్ఱ తీసుకొని గురువు కాళ్ళను కొట్టసాగారు. అప్పుడు గొప్ప కోలాహలమే ఏర్పడింది. ప్రజలు గురువు కేకలు విని వచ్చారు. "సాధువుగారూ! ఏమైన?"దని అడిగారు. వారిలో ఒక బుద్ధిమంతుడు సాధువును శిష్యుల నుండి విడిపించిన తర్వాత ఆ మూర్ఖులైన శిష్యులతో "చూడండి. ఈ రెండు కాళ్లు మీ గురువుగారివి. ఆ రెండింటికీ సేవ చేసిన ఆ గురువుకే సుఖం కలుగుతుంది. దుఃఖం కలిగిస్తే అతడొక్కనికే దుఃఖం కలుగుతుందని ఉపదేశించాడు.

ఒక్క గురువును సేవించటంలో ఇలాంటి లీలలను సృష్టించినట్లు, అఖండుడు, సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మునికి విష్ణువు, రుద్రుడు అనే అనేక పేర్లున్నాయి. ఈ పేర్లకు అర్థం ఈ పుస్తకంలో ప్రథమ సముల్లాసంలో ప్రకాశపరిచాము. అలాంటి సత్యార్థాన్ని గుర్తించక శైవులు, శాక్తేయులు వైష్ణవ సాంప్రదాయం కలవారు పరస్పరం ఒకరు మరొకరి దేవుళ్ళపేర్లను నిందిస్తున్నారు. మందమతి గలవారు కొంచెం కూడ తమ బుద్ధిని విశాలం చేసుకొని ఈ విష్ణు, రుద్ర, శివాది పేర్లన్నీ ఒక అద్వితీయుడు, సర్వనియంత, సర్వాంతర్యామి అయిన జగదీశ్వరుని అనేక గుణ, కర్మ, స్వభావయుక్తములైన అతని వాచకాలుగా తెలుసుకోరు. ఆహా! ఇలాంటి మూర్ఖులపై ఈశ్వరునికి క్రోధమెందుకు కలుగదో కదా?

చక్రాంకితులైన వైష్ణవుల అద్భుత మాయలు

తాపః పుండ్రం తథా నామ మాలామంత్రస్తథైవ చ ।
అమీ హి పంచసంస్కారాః పరమై కాంతహేతవః ॥ (రామానుజపటల పద్ధతి)
అతప్తతనూ ర్న తదామో అశ్నుతే । ఇతి శ్రుతేః ॥ ఋ. 9-83-1.

(తాపః) శంఖ, చక్ర, గదా, పద్మాల ముద్రలను అగ్నిలో బాగా కాల్చి భుజాల మూలాలలో గుర్తులను ఏర్పరచిన తర్వాత క్షీరపాత్రలో ఆ ముద్రలను చల్లారుస్తుంటారు. ఆ పాలను కూడా కొందరు పానం చేస్తారు. మానవుల మాంసపు రుచి కూడా ఆ పాలలోనికి రావటాన్ని ప్రత్యక్షంగా చూడండి. ఇలాంటి కర్మల ద్వారా పరమేశ్వరుని పొందలేరని తెలుసుకోవాలి. ఎందుకంటే ఈశ్వరుడు (అమః) చిహ్నాలతో కాల్చబడని, అపరిపక్వుడని అర్థం. ఏ విధంగా రాజ్యంలో ఉన్న నౌకరులు మొదలైనవారికి చిహ్నాలు ఉన్నప్పుడు - వారిని రాజపురుషులుగా భావించి వారికి అందరు భయపడేటట్లుగా, విష్ణువు యొక్క శంఖచక్రాది ఆయుధ చిహ్నాలను చూసి యమధర్మరాజు మరియు అతని గణమైన యమభటులు భయపడతారు. ఇంకా వారు ఇలా అంటారు.

వైష్ణవుల గుర్తులు - మంత్రాలు

దోహా బానా బడా దయాల్ కా తిలక్ చాప్ ఔర్ మాల్ ।
యమ డరపే కాలూ కహే భయ్ మానే భూపాల్ ॥ భక్తమాల్. నిష్ఠ - 6 ॥

అంటే తిలకం, ముద్ర మరియు మాలలను ధరించటమే భగవంతుని గుర్తు. గొప్పతనం. వీటికి యమరాజేగాక రాజు కూడా భయపడతాడు. (పుండ్రమ్) త్రిశూలం లాగా లలాటంలో చిత్రాన్ని చిత్రించటం (నామ్) నారాయణదాసు, విష్ణుదాసను దాస శబ్దాంతాలైన పేర్లను పెట్టుకోవటం (మాలా) తామరకాయల మాలలను ధరించటం, ఇక ఐదవది (మంత్ర) మంత్రజపం చేయటం వైష్ణవులకు గుర్తులు.

ఉదా:- ఓం నమో నారాయణాయ ॥ 1 ॥

ఈ మంత్రాన్ని వీరు సామాన్య మానవుల కొరకై వ్రాసారు.

శ్రీమన్నారాయణ చరణం శరణం ప్రపద్యే ॥ 1 ॥
శ్రీమతే నారాయణాయ నమః ॥ 2 ॥
శ్రీమతే రామానుజాయనమః ॥ 3 ॥

ఇత్యాది మంత్రాలు ధనాఢ్యులకు మరియు మాననీయులకై రచించి ఉంచారు. ఇది కూడా ఒక దుకాణంగా ఉండటాన్ని తిలకించండి. ముఖాన్ని అనుసరించి తిలకాన్ని ధరించటం. ఒక వ్యాపారమైనది. ఈ పంచ సంస్కారాలను చక్రాంకితులు ముక్తికి హేతువులని విశ్వసిస్తున్నారు.

ఈ మంత్రలాకు అర్థం:-

1. నేను నారాయణునికి నమస్కరిస్తాను. నేను లక్ష్మీయుక్త నారాయణుని చరణారవిందాల శరణు పొందుతాను.
2. శ్రీ లక్ష్మీసమేత నారాయణునికి నమస్కరిస్తాను. అంటే శోభాయుక్తుడైన నారాయణునికి నా నమస్కారం చేరుగాక!
3. శోభాయమానుడైన రామానుజునికి నమస్కారం.

వామమార్గీయులు పంచమకారాలను అంగీకరించినట్లే చక్రాంకితులు పంచసంస్కారాలను నమ్ముతున్నారు. తమ శంఖచక్రాలతో గుర్తులను వేసుకోవటానికి ప్రమాణంగా తీసుకొన్న వేదమంత్ర పాఠం మరియు అర్థం ఈ విధంగా ఉన్నది.

పవిత్రంతే వితతం బ్రహ్మణస్పతే ప్రభుర్గాత్రాణి పర్యేషి విశ్వతః ।
అతప్త తనూర్న తదామో అశ్నుతే శృతాస ఇద్వహన్తస్త త్సమాశత ॥
ఋ.మం.9 సూ. 8 3. మం. 1 ॥
తపో ష్పవిత్రం వితతం దివస్పదే ॥

బ్రహ్మాండాన్ని, వేదాలను పాలించే ఓ ప్రభూ! సర్వసామర్థ్యయుక్తుడవు, సర్వశక్తివంతుడవు. నీవు నీ వ్యాప్త గుణంలో ప్రపంచం యొక్క సమస్త (భాగాలను) అంశాలను వ్యాపింపజేసి ఉంచావు. ఈ నీ యొక్క ఏ వ్యాపక, పవిత్ర స్వరూపం ఉందో దానిని బ్రహ్మచర్యం, సత్యభాషణ, శమ, దమ, యోగాభ్యాసం, జితేంద్రియత్వాలను కలిగి ఉండక సత్సంగాది తపశ్చర్యలతో రహితమై ఏ అపరిపక్వ ఆత్మ అంతఃకరణంతో కూడి ఉన్నదో అలాంటి నా స్వరూపం నీ స్వరూపాన్ని పొందలేదు. ఎవరు పూర్వోక్త తపములతో పవిత్రులై ఉన్నారో వారే ఈ తపస్సును ఆచరిస్తూ అలాంటి నీ పవిత్ర స్వరూపాన్ని సరియైన విధంగా చక్కగా చేస్తారు. ॥ 1 ॥

ఎవరైతే ప్రకాశస్వరూపుడైన పరమేశ్వరుని సృష్టిలో విస్తృతమైన పవిత్రాచరణ స్వరూపమైన తపస్సు చేస్తారో వారే పరమాత్మను పొందటానికి యోగ్యులవుతారు. ॥ 2 ॥

అతప్త తనుః- అర్థము

రామానుజ మతస్థులు ఈ మంత్రాలతో "చక్రాంకితు'లవటానికి ఎలా సమర్థిస్తారో ఇప్పుడు ఆలోచించండి. మంచిది వారు విద్వాంసులో లేక అవిద్వాంసులో చెప్పండి? ఎవరైనా విద్వాంసుడని చెప్పిన, ఇలాంటి అసంభావితమైన అర్థాన్ని ఈ మంత్రనికెట్లు చేయుదురు? ఎందుకంటే ఈ మంత్రంలో **"అతప్తతనూః"** అనే శబ్దం ఉన్నది, కాని **"అతప్తభుజైకదేశః"** అనిలేదు. అయినప్పటికినీ **"అతప్తతనూః"** అనేది నఖశిఖాగ్ర పర్యంత సముదాయార్థం. దీనిని ప్రమాణంగా చేసుకొని అగ్ని చేతనే కాల్చబడటాన్ని 'చక్రాంకితులు' స్వీకరించిన, తమతమ శరీరాలను పొయ్యిలో వేసి కాల్చినప్పటికి కూడా ఈ మంత్రార్థం కంటే విరుద్ధంగా నున్నది. ఎందుకంటే ఈ మంత్రంలో సత్యభాషణాది పవిత్ర కర్మలు చేయటం తపము అని గ్రహింపబడింది.

ఋతం తపః సత్యం తపో దమస్తపః స్వాధ్యాయస్తపః ॥

తైత్తరీయ ఆ.ప్ర.10అను. 10 ॥

ఋతం తపః = యథార్థమైన పరిశుద్ధ భావాన్ని కలిగి ఉండటం, సత్యాన్ని అంగీకరించటం, సత్యాన్ని పలకటం, సత్యాచరణను కలిగి ఉండటం, మనస్సును అధర్మ విషయాలవైపుకు పోనీయకుండటం, బాహ్యేంద్రియాలను అన్యాయాచరణాలవైపుకు పోవటం నుండి నిరోధించటం, అంటే శరీరేంద్రియాలతోనూ మరిము మనస్సుతోనూ శుభకర్మలను ఆచరించటం, వేదాది సత్యవిద్యలను చదవటం వేదానుకూలంగా ఆచరించటం మొదలైన ఉత్తమ ధర్మయుక్త కర్మల పేరే తపస్సు. కాని లోహాన్ని వేడిచేసి 'చర్మాన్ని' కాల్చటం తపస్సనబడదు. చక్రాంకితమత ప్రవర్తకుడు చక్రాంకితులైనవారు తమను తాము గొప్ప వైష్ణవులుగా భావించటాన్ని చూడండి. తమ గురు పరంపరల మీద కాని, తమ కుకర్మల మీద గాని శ్రద్ధ ఉంచరు. వీరి మూల పురుషుడైన 'శఠగోపుడు' ప్రథమంలో చక్రాంకితులుగలరో మరియు నాభాదూములతో రచించబడిన భక్తిమాల గ్రంథంలో ఈ క్రిందివిధంగా వ్రాయబడింది.

విక్రీయ శూర్పం విచచార యోగీ ॥

ఈ వాక్యాలన్నీ చక్రాంకితుల గ్రంథంలో వ్రాయబడి ఉన్నాయి. శఠగోపుడు అనే యోగి చేటలను తయారుచేసి, విక్రయించి తిరుగుచుండెడివాడు. ఇతడు బ్రాహ్మణుల దగ్గర సద్విషయాలను, పౌరాణిక గ్రంథాలను చదివి వినదలచినప్పుడా బ్రాహ్మణులు అతనిని తిరస్కరించి ఉండవచ్చును. అందుకే అతడు బ్రాహ్మణ విరుద్ధ సాంప్రదాయకాలైన తిలకం చక్రాంకితులు మొదలైన శాస్త్ర విరుద్ధమైన వాటిని తమ ఇష్టం వచ్చినట్లుగా ప్రచారం చేసి ఉండవచ్చును. అతని శిష్యుడు చండాల వర్ణంలో ఉత్పన్నమైన మునివాహనుడు. ఈ మునివాహనుని శిష్యుడు 'యావనాచార్యుడు' ఈతనికీ పేరు మార్చి కొందరు ఇతనిని యమునాచార్యుడన్నారు. ఇతని తర్వాత రామానుజాచార్యుడు వైష్ణవ మతాచార్యుడై చక్రాంకితుడయ్యాడు.

రామానుజ మత సమీక్ష

అతని పూర్వీకులు కొన్ని భాషా గ్రంథాలను వ్రాసి ఉన్నారు. రామానుజుడు సంస్కృతాన్ని కొంతవరకు చదివి సంస్కృతంలో శ్లోకబద్ధ గ్రంథాన్ని, శారీరిక సూత్రాలను మరియు ఉపనిషత్తులకు టీకలను శంకరాచార్యుని టీకలకు విరుద్ధంగా రచించటమే గాక శంకరాచార్యున్ని అనేక విధాలుగా నిందించాడు. ఉదా: శంకరాచార్యుని మతం అద్వైతం. అంటే జీవబ్రహ్మలు ఒకటి. ఇది గాక యితర ఏ వస్తువు కూడా వాస్తవానికి లేదు. జగత్తు అంటే ప్రపంచమంతా మిథ్య. మాయా స్వరూపం కలది ఇది అనిత్యం అని ప్రతిపాదించారు. దీనికి విరుద్ధంగా రామానుజుడు జీవుడు, బ్రహ్మ, మాయ అనే ఈ మూడింటిని నిత్యాలు అన్నాడు.

ఇక్కడ శంకరాచార్యుని అభిప్రాయం బ్రహ్మ కంటే వేరుగా జీవుని కాని మరియు కారణ వస్తువును కాని అంగీకరించకుండుట మనేది సరిగా లేదు. ఇక రామానుజాచార్యుడు విశిష్టాద్వైతంలో ఈ అంశంలో జీవుడు మరియు మాయాసహిత పరమేశ్వరుడు ఒక్కటే. ఈ మూడింటిని అంగీకరించటం మరియు అద్వైతాన్ని గురించి చెప్పటం సర్వదా వ్యర్థం. అన్ని విధాల ఈశ్వరాధీనంలో పరతంత్రుడైన జీవున్ని అంగీకరించటం, హారాలను ధరించటం, తిలకాన్ని, జపమాలలను ధరించటం, విగ్రహారాధనాది పాఖండ మతాలను ప్రచారం చేయటం మొదలైన దోషాలు చక్రాంకితుదున్నాయి. చక్రాంకితులు వేద విరోధులైనట్లు శంకరాచార్య మతానుయాయులు కారు.

మూర్తి పూజ

ప్రశ్న:- విగ్రహారాధన ఎవరి వలన ప్రచారంలోనికి వచ్చింది?

జవాబు:- జైనుల వలన

ప్రశ్న:- జైనులు ఎక్కడి నుండి స్వీకరించారు?

జవాబు:- తమ అజ్ఞానము నుండి, మూర్ఖత్వం నుండి

ప్రశ్న:- శాంతంగా, ధ్యానావస్థతో కూర్చున్న మూర్తిని చూస్తే జీవుడు కూడా శుభ పరిణామంతో యుక్తుడవుతాడని జైనులంటారు.

జవాబు:- జీవుడు చేతనుడు. మూర్తి జడం. మూర్తిని చూస్తే జీవుడు మూర్తివలె జడమవుతాడా? ఈ మూర్తి పూజ కేవలం పాఖండ మతస్థులైన జైనులతోనే ప్రచారం చేయబడింది. కావున వీటి ఖండన ద్వాదశ సముల్లాసంలో చేయబడింది

ప్రశ్న:- శాక్తేయాదులు విగ్రహాలను తయారుచేయటంలో జైనులను అనుకరించలేదు. ఎందుకంటే జైనమూర్తుల లాగా వైష్ణవాదుల విగ్రహాలు లేవు.

జవాబు:- ఔను. ఇది సత్యం. జైన విగ్రహాల లాగా తమ విగ్రహాలను తయారు చేసుకొనేవారు జైనమతంలో కలిసిపోవలసివచ్చును. అందువలన జైనమూర్తుల కంటే వ్యతిరేకంగా తయారు చేసుకొన్నారు. ఎలాగంటే జైనుల కంటే వ్యతిరేకంగా చేయటమే వీరి పని. మరియు వీరితో విరోధులుగా ఉండటం ముఖ్యంగా వారి కర్తవ్యం. ఉదా:- జైనులు విగ్రహాలను నగ్నంగాను, ధ్యానావస్థితునిగాను, సర్వసంగపరిత్యాగిగాను సిద్ధపరచారు. వీరికి విరుద్ధంగా వైష్ణవాదులు తమ ఇష్టం వచ్చినట్లుగా శృంగారించబడిన స్త్రీలతో ఆనందయుక్త రాగ భోగ విషయాసక్తులతో కూడిన ఆకారాలను, నిలుచున్న కూర్చున్న వాటిని సిద్ధపరచారు. జైనులు అనేక విధాలైన శంఖాలను, ఘంటలను, జేగంటలు మొదలైన వాయిద్యాలను వాయించరు. కాని వైష్ణవులు గొప్ప కోలాహలం చేస్తారు. అప్పుడు ఇలాంటి లీలలను పొందట వలన వైష్ణవాది మతస్థుల పోపు శిష్యులు జైనుల వంచనల నుండి (వలల నుండి) రక్షించబడి వారు మనోరంజనకై చేసే కార్యాలలో బంధించబడ్డారు. మరియు వ్యాసాది అనేక మహర్షుల నామాలతో ఇష్టం వచ్చినట్టి అసంభవనీయ గాథలతో యుక్తమైన గ్రంథాలను రచించారు. వానికి 'పురాణా'లని పేరడి కథలను కూడా వినిపించారు. ఇలాంటివే విచిత్ర మాయలననేకాలను సృజించనారంభించారు. పాషాణాది విగ్రహాలను తయారు చేసుకొని రహస్యంగా ఏ పర్వతాల మీదనో, అరణ్యాలలోనో పెట్టివస్తారు. లేదా పాతి ఉంచుతారు. ఆ తర్వాత తమ శిష్యులతో నాకు రాత్రి స్వప్నంలో మహాదేవుడో, పార్వతియో, రాధనో, శ్రీకృష్ణుడో, సీతారాముడో, లక్ష్మీనారాయణుడో, భైరవుడో, హనుమంతుడో (వీరిలో ఎవరో ఒకడు) "నేను ఫలానా చోట ఉన్నానని నాతో పలికారు. నన్నిక్కడి నుండి తీసుకొచ్చి, మందిరంలో స్థాపించండి. మరియు నీవే నాకు పూజారిగా నున్న, నేను నీవు కోరిన కోరికలను, వరాలను ఇస్తానని పలికినా"డని చెప్పి ఈ విషయం అధిక ప్రచారం చేసారు.

కండ్లున్న గ్రుడ్డివారు, (అజ్ఞానులు) మూటలు కట్టుటలో పరిపూర్ణులైన ధనికులైన వారు పోపులు కల్పించిన లీలలను విని, నిజమని నమ్ముతారు. అప్పుడు వారు ఆ విగ్రహమెక్కడ ఉన్నదని అతనిని ప్రశ్నించగా పోపు ఫలానా పర్వతం పైననో లేక అడవిలోనో (అతడు పెట్టిన స్థలంలో) ఉన్నదని చెబుతూ "నాతో మీరు రండి నేను చూపిస్తా"నని అంటాడు. అప్పుడా తెలివిమాలినవా రా ధూర్తుని

వెంట వెళ్ళి చెప్పిన చోట చూస్తారు. ఆశ్చర్యంతో ఆ పోపు కాళ్ళపైబడి "మీపై ఈ దేవత కెంతో దయ ఉన్నది. దీనిని మీరు తీసుకొని ఇప్పుడు మాతో రండి. మేము దీనికై మందిరాన్ని నిర్మించి ఇస్తాము. దానిలో ఈ దేవతను ప్రతిష్ఠించి మీరే పూజించండి. మేము కూడా ఈ శూర వీర దేవతను దర్శించి, స్పర్శించి మా మనోవాంఛా ఫలాలను పొందుతాము" అని అంటారు. ఈ విధంగా ఒకడొక లీలను సృష్టించి దానిని పొంది మిగతా పోపులు తమ జీవనార్థమై మోస కపటయుక్తులై ఆ యా చోట్ల విగ్రహాలను స్థాపిస్తారు.

ప్రశ్న:- పరమేశ్వరుడు నిరాకారుడు. అతడు ధ్యానంలోనికి రాలేడు. అందువలన తప్పక విగ్రహాలుండాలి. ఏమి చేయకున్నా విగ్రహ సమక్షంలో హస్తాలను జోడించి పరమేశ్వరుని స్మరిస్తూ, అతని పేరును ఉచ్చరించటం మంచిది. ఇక దీనివలన నష్టమేమి?

జవాబు:- పరమేశ్వరుడు నిరాకారుడు, సర్వవ్యాపకుడైనప్పుడు అతనికి మూర్తియే ఏర్పడదు. మూర్తిని దర్శించినంత మాత్రంలోనే పరమేశ్వరుడు స్మరణకు వచ్చిన పరమేశ్వరునితో రచించబడిన ఈ పృథ్వి, జలం, అగ్ని, వాయువు మరియు వనస్పత్యాది అనేక పదార్థాలు అతని వలన రచించబడిన మహామూర్తులు. వీటిని ఈశ్వరుడు ఎంతో అద్భుతంగా రచించాడు. వీటిని చూసిన పరమేశ్వరుడు స్మరణకు రానప్పుడు అతనితో మూర్తిగా మలచబడిన పర్వతం నుండి తెచ్చిన మానవకృత మూర్తిని దర్శించిన ఈశ్వరుడు స్మరణకు వస్తాడా? మూర్తిని చూసిన పరమేశ్వరుడు స్మరణకు వస్తాడని నీవంటే అది సర్వథా మిథ్య. విగ్రహం ఎదుట లేకున్న పరమేశ్వర స్మరణ కలుగకున్న, మానవుడు ఏకాంతతను పొంది చోర, జారత్వాది కుకర్మలు చేయటంలో ప్రవృత్తుడు కూడా కాగలుగుతాడు. ఎలాగంటే ఈ సమయంలో ఇక్కడ నన్నెవరూ చూడటం లేదని అనుకుంటే అతడు దుష్కార్యాలు చేయకుండా ఉండలేడు. ఇలాంటి అనేక దోషాలు పాషాణాది మూర్తి పూజ ద్వారా కలుగుతాయి.

నామస్మరణ చేసే పద్ధతి

పాషాణాది మూర్తులను అంగీకరించక నిరంతరం సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, న్యాయకారి అయిన పరమాత్మను సర్వత్ర గుర్తిస్తూ అంగీకరించేవాడు, పరమేశ్వరుడు అందరి మంచి చెడు కర్మల ద్రష్ట అని భావించి ఒక్క క్షణమైనా కూడా పరమాత్మ నుండి తాను వేరు కాదని గుర్తించిన వాడు కుకర్మలు చేయడు. మనసులో దుశ్చేష్టలను చేస్తూ దురాలోచనను ఆలోచించడు. నేను నా మనోవాక్కాయాలతో ఏ స్వల్ప దుష్కార్యం చేసినను ఈ అంతర్యామి యొక్క న్యాయ వ్యవస్థ నుండి దండన పొందక ఎప్పుడు కూడా రక్షించబడనని అతడు తెలుసుకొంటాడు. అంతే కాదు నామస్మరణతో స్వల్ప ప్రయోజనం కూడా ఉండదని గుర్తిస్తాడు. ఉదా:- కలకండ, కలకణ్డ అని అన్నంత మాత్రాన నోరు తియ్యబడదు. వేప, వేప అన్నంతనే చేదు కాదు. నాలుకతో రుచి చూచినప్పుడే తీపి, చేదుతనాలు తెలుస్తాయి.

ప్రశ్న:- అయితే నామస్మరణ చేయటం సర్వథా మిథ్యమేనా? పురాణాలందంతట నామస్మరణకి అధిక మహాత్మ్యం ఉన్నదని వ్రాయబడి ఉన్నది గదా?

జవాబు:- మీ నామస్మరణ చేసే మీ పద్ధతి బాగా లేదు. అది సరైనది కాదు.

ప్రశ్న:- మా పద్ధతి ఎలా ఉన్నది?

జవాబు:- వేద విరుద్ధంగా ఉన్నది.

ప్రశ్న:- మంచిది. ఇప్పుడు మీరు మాకు వేదోక్త నామస్మరణ చేసే పద్ధతిని తెలపండి.

జవాబు:- నామస్మరణ ఈ విధంగా చేయాలి. ఉదా:- 'న్యాయకారి' అనేది ఈశ్వరుని నామాలలో ఒకటి. ఈ నామానికి అర్థమేమిటంటే పరమాత్ముడు పక్షపాతరహితుడై అందరికీ యథా విధిగా న్యాయం చేస్తాడని ఆ అర్థాన్ని గ్రహించి న్యాయ యుక్తంగా సదా వ్యవహరించాలి. అన్యాయం ఎప్పుడూ ఆచరించరాదు. ఈ విధంగా ఒకే నామంతో కూడా మానవ కల్యాణం కలుగగలదు.

అవతార వాదం

ప్రశ్న:- పరమేశ్వరుడు నిరాకారుడని మాకు కూడా తెలుస్తుంది. కాని అతడు శివునిగా, విష్ణువుగా, గణేశునిగా, సూర్యునిగా మరియు దేవి మొదలైన శరీరాలను ధరించి రామ, కృష్ణాది అవతారాలను దాల్చాడు. కావున అతనికి మూర్తి నిర్మించబడింది విషయం కూడా అసత్యమేనా?

జవాబు:- ఔను. అసత్యమే. ఎందుకంటే 'అజ ఏకపాత్' 'అకాయమ్' అనే ఇత్యాది విశేషణాల ద్వారా పరమేశ్వరుడు జన్మ మరణాలు లేనివాడనీ, శరీర ధారణారహితుడనీ వేదంలో చెప్పబడినది. యుక్తిద్వారా కూడా పరమేశ్వరు ఎన్నడూ అవతారమెత్తలేడు. ఎందుకంటే ఆకాశంలాగా సర్వత్ర వ్యాపకుడై, అనంతుడై, సుఖ దుఃఖాలు, దృశ్యాది గుణరహితుడైన అతడు ఒక అల్పవీర్యానికి గర్భాశయానికి, శరీరానికి ఎందుకు వస్తాడు? ఏకదేశీయుడై రాకపోకలు ఎందుకు జరుపుతాడు? అచలుడు, అదృశ్యుడు, ప్రతి పరమాణువు నందును నిండియున్నాడు. అలాంటి వాడు అవతారమెత్తుననుట ఒక గొడ్రాలి కొడుకు వివాహం చేసి అతని మనుమనిని ఎత్తుకున్నదనే విషయంలాగా ఉన్నది.

విగ్రహ పూజ సమీక్ష

ప్రశ్న:- పరమేశ్వరుడు సర్వ వ్యాపకుడు కావున మూర్తిలో కూడా ఉంటాడు. కాబట్టి వస్తువులోనైనా భావముంచి పూజించటం మంచిదేల కాదు?

చూడండి - న కాష్ఠే విద్యతే దేవో న పాషాణే న మృణ్మయే ।
భావే హి విద్యతే దేవ స్తస్మా ద్భావో హి కారణమ్ ॥ చా.నీ.ద. 811 ॥

పరమేశ్వరుడైన దేవుడు కఱ్ఱతో, పాషాణంతో, మట్టితో తయారుచేసిన పదార్థాలలో లేదు. అతడు భావమందున్నాడు. భావమెక్కడుంచిన అక్కడనే అతడు సిద్ధిస్తాడు.

జవాబు:- సర్వత్ర వ్యాపకుడైన పరమేశ్వరున్ని ఏదో ఒక వస్తువులో భావించటం అన్యత్ర భావించక పోవడం అనేది, ఒక చక్రవర్తి రాజాధిరాజును సమస్త రాజ్యాలపై అధికారం నుండి విడిపించి ఒక చిన్నపాటి పర్ణశాలకు స్వామిగా భావించటంవంటిది అవుతుంది. ఇది ఎంతటి అవమానమో ఆలోచించండి. వ్యాపకునిగా అతనంగీకరించినచో పూదోట నుండి పుష్పాలను, పత్రాలను కోసి ఎందుకు ఆ విగ్రహానికి అర్పిస్తావు? గంధం తీసి ఎందుకు పూస్తావు? సాంబ్రాణి, గుగ్గిలాల ధూపమెందుకు వేస్తావు? గంటలు, చిరుగంటలు కంచువాద్యం, ఢంక నగారాలను కఱ్ఱలతో కొట్టటం, మ్రోగించటం ఎందుకు చేస్తున్నావు? నీ హస్తంలో భగవంతుడున్నా వాటిని ఎందుకు జోడిస్తావు? శిరస్సున అతడున్నాడు. ఎందుకు శిరస్సు వంచి నమస్కరిస్తావు? ఆహారపదార్థాలలో, జలంలో ఉన్నాడు. నైవేద్యం ఎందుకు పెడుతున్నావు? స్నానమెందుకు చేయిస్తావు? ఎందుకంటే ఆ పదార్థాలన్నింటిలో పరమాత్ముడు వ్యాపించి ఉన్నాడు. నీవు వ్యాపకుని పూజిస్తావా? లేక వ్యాప్య పదార్థాలనా? వ్యాపక పరమాత్మనే పూజించినచో పాషాణాలపై, కఱ్ఱ విగ్రహాలపై చందన పుష్పాలను ఎందుకు అర్పిస్తావు? వ్యాప్య పదార్థాలనే పూజించిన మేము పరమేశ్వరపూజ చేస్తామని ఇలాంటి అసత్యాలను ఎలా పలుకుతావు? మేము పాషాణాలనే పూజించే వారమనే సత్యవాక్కులను ఏలా పలుకవు?

భావన- అభిప్రాయం

భావం సత్యమా? అసత్యమా? ఇప్పుడు చెప్పండి. ఏది అన్నా అది సత్యమేయైన, నీ భావానికి అధీనుడై పరమేశ్వరుడు బద్ధుడు కావలసి వస్తుంది. ఇక నీవు మట్టిలో సువర్ణ, రజతాలను, పాషాణంలో 'రత్నాలను, వజ్రాలను' మరకత మాణిక్యాలను, సముద్రపు నురుగులో ఘృతం, దుగ్ధం, దధి మొదలైనవాటిని మరియు మట్టిదుబ్బ, బూడిదలో మైదా, పంచదారలను భావించి వాటిని ఆ విధంగా ఎందుకు ఉపయోగించుకోవు? నీకు దుఃఖభావం ఎందుకు కలుగుతుందో ఆలోచించవు? సుఖయుక్త భావాలు సదా ఎందుకు లభించవో ఆలోచిస్తావు. ఇలాగే ఒక అంధుడు నేత్రాలు ఉన్నట్లుగా భావించిన కనిపించదెందుకు? మరణించాలని అనుకుంటావు కాని ఎందుకు మరణించవు? కావున నీ భావాలు సత్యాలు కావు. ఎందుకంటే ఏది ఎలా ఉన్నదో దాన్ని అలానే భావించటాన్ని భావమంటారు. ఉదా:- అగ్నిలో అగ్నిని, జలంలో జలాన్ని తెలుసుకొనటం భావం. అలాగాక జలంలో అగ్నిని, అగ్నిలో జలాన్ని భావించటం అభావం. ఎందుకంటే ఏది ఎలా ఉన్నదో దానిని అలాగే తెలుసుకోవటం జ్ఞానం. అలాగాక మరొకవిధంగా తెలుసుకోవటం అజ్ఞానం.

ఆవాహన - విసర్జన

ప్రశ్న:- అయ్యా! వేదమంత్రాల ద్వారా ఆవాహన చేయనంతవరకు దేవత రాదు. ఆవాహన చేయగానే వెంటనే వస్తుంది. ఇక విసర్జించిన వెళ్లిపోతుంది.

జవాబు:- మంత్రం పఠించి ఆవాహనం చేయగానే దేవత వస్తే మూర్తి చేతనమేల కాదు? ఇక విసర్జించిన, ఎందుకు వెళ్ళి పోదు? అది ఎక్కడి నుండి వస్తుంది? విసర్జించిన ఎక్కడికి పోతుంది? అజ్ఞానులారా! పరిపూర్ణుడైన పరమాత్మ ఎక్కడికీ రాడు. మరి ఎక్కడికీ పోడు. నీ వే మంత్ర బలంతో పరమాత్మను పిలుస్తావో ఆ మంత్రాలతోనే మృతి చెందిన మీ పుత్రుని శరీరానికి జీవుని నేలపిలువవు? శత్రు శరీరంలో ఉన్న జీవాత్మను విసర్జనా మంత్రాలతో నేల చంపలేవు? ఓ అమాయక సోదరా! విను. ఈ పోపు నిన్ను వంచించి తన ప్రయోజనాన్ని నెరవేర్చుకొంటున్నాడు. వేదాలలో పాషాణాది మూర్తిపూజలకు గాని, పరమేశ్వరుని పిలిచి, పొమ్మను ఆవాహన విసర్జనలకు గాని ఒక్క మంత్రం కాదు గదా ఒక్క అక్షరం కూడా లేదు.

ప్రశ్న:- **ప్రాణా ఇహాగచ్ఛంతు సుఖం చిరం తిష్ఠతు స్వాహా ।**
ఆత్మేహ గచ్ఛతు సుఖం చిరం తిష్ఠతు స్వాహా ।
ఇంద్రియాణీహాగచ్ఛంతు సుఖం చిరం తిష్ఠంతు స్వాహా ॥

మొదలైన వేదమంత్రాలున్నాయి. నీవెందుకు లేవని చెబుతావు?

జవాబు:- సోదరా! నీ బుద్ధికి కొంచమైన పని కల్పించవా? ఇవన్నీ కపోల కల్పితాలు. వామమార్గీయుల వేద విరుద్ధ తంత్ర గ్రంథంలోని పోపు రచిత పంక్తులు. వేదవాక్యాలు కావు.

ప్రశ్న:- తంత్రాలు అసత్యాలా?

జవాబు:- అవును. సర్వదా అసత్యాలే. ఉదా:- ఆవాహనలు, ప్రాణప్రతిష్ఠాదులు, పాషాణాది మూర్తి విషయాల గురించి వేదంలో ఒక్క మంత్రం కూడా లేదు. ఇలాగే స్నానం సమర్పయామి" అనే ఇత్యాది వచనాలు కూడా లేవు. **"పాషాణాది మూర్తి రచయిత్వా మందిరేషు సంస్థాప్య గంధాదిభిరర్చయేత్"** అనికూడ వేదంలో వ్రాయబడిలేదు. అంటే పాషాణాది మూర్తులను నిర్మించి మందిరాలలో స్థాపించి చందనం, అక్షతాదులతో పూజించాలని కూడా లేదు. ఇలాంటి విషయాలే మాత్రం లేవు.

ప్రశ్న:- వేదాలలో విధి లేనప్పుడు ఖండన కూడా ఉండదు. ఖండనే ఉన్న **"ప్రాప్తౌ సత్యాం నిషేధః"** మూర్తి ఉంటే ఖండన జరగగలదు?

జవాబు:- నియమ విధి లేదు. కాని పరమేశ్వరుని స్థానంలో మరొక అన్య పదార్థం పూజించదగినదని అనుకోవటమే కాక సర్వదా నిషేధింపబడినది. ఇది అపూర్వ నియమం కాదా? దీనిని ఆలకించండి.

మూర్తి పూజా ఖండనం

అంధం తమః ప్రవిశంతి యేఽ సంభూతి ముపాసతే ।
తతో భూయ ఇవ తే తమో య ఉ సమ్భూత్యామ్ రతాః ॥ యజు. అ. 40. మం.9 ॥

న తస్య ప్రతిమా అస్తి । యజు. అ.32. మం. 3 ॥

యద్వాచానభ్యుదితం యేన వాగభ్యుద్యతే ।
తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥ 1 ॥

యన్మనసా న మనుతే యేనాహూమనోమతమ్ ।
తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥ 2 ॥

యచ్చ క్షుషా న పశ్యతి యేన చక్షూంషి పశ్యతి ।
తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥ 3 ॥

యచ్ఛ్రోత్రేణ న శ్రుణోతి యేన శ్రోత్రమిదం శ్రుతమ్ ।
తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥ 4 ॥

యత్ప్రాణేన న ప్రాణితి యేన ప్రాణః ప్రణీయతే ।
తదేవ బ్రహ్మ త్వం విద్ధి నేదం యదిదముపాసతే ॥ 5 ॥ కేనోపనిశద్ ఖ.1.మం.4-8 ॥

1. అసంభూతి అంటే అనుత్పన్నం, అనాది ప్రకృతికి కారణుడైన బ్రహ్మ స్థానంలో అన్య పదార్థాలను పూజించువారు అంధకారం అంటే అజ్ఞానమయమైన దుఃఖసాగరంలో మునుగుతారు. సంభూతి అంటే కారణం ద్వారా ఉత్పన్నమైన కార్యరూపమైన పృథివ్యాది పంచభూతాలు, పాషాణాలు, వృక్షాలు అవయవాలు గల మనుష్యాది శరీరాలను బ్రహ్మ స్థానంలో ఉపాసించేవారు అంధకారం కంటే మహాంధకారంలో బడతారు. అంటే మహా మూర్ఖులై చిరకాలం దుఃఖరూప ఘోర నరకంలో మహాక్లేశాన్ని అనుభవిస్తారు.
2. జగత్తు అంతట వ్యాపకుడైనటువంటి ఆ నిరాకార పరమాత్మకు ప్రతిమ కాని, పరిమాణంకాని, సాదృశ్యం కాని, మూర్తి కాని లేదు.

1. ఇది జలం. గ్రహించండి అన్నట్లుగా ఈశ్వరుడు వాక్కుతో చెప్పబడేవాడు కాదు. ఎవరి ధారణ, సామర్థ్యంలో వాక్కు ఉత్పత్తి అవుతుందో దానినే బ్రహ్మగా అనుకుంటారు. దానినే పూజించండి. తద్భిన్నమైన దానిని ఉపాసించకండి.
2. ఎవడు మనస్సుతో ఇంతవాడని విచారించటానికి వీలుకానివాడో, ఎవడు మనస్సును గుర్తిస్తున్నాడో అతన్నే 'బ్రహ్మ' అని తెలుసుకొని అతన్నే ఉపాసించండి. అతని కంటే అన్యమైన జీవుని గాని, అంతఃకరణాన్ని గాని బ్రహ్మస్థానంలో ఉపాసించకండి.

3. ఎవడు నేత్రాలకు కనిపించడో, ఎవనివలన సమస్త నేత్రాలు చూస్తున్నవో అతనినే 'బ్రహ్మ' అని తెలుసుకొని అతనినే ఉపాసించండి. అతనికంటే అన్యమైన సూర్యుడు, విద్యుత్ అగ్న్యాదులు జడ పదార్థములు. వాటిని ఉపాసించకండి.

4. భగవంతుడు శ్రోత్రాలద్వారా వినబడడు. కాని అతనివల్లనే శ్రోత్రాలు వింటున్నాయి. అలాంటి అతనినే 'బ్రహ్మ'గా తెలుసుకొని, అతని పూజ చేయండి. అతనికంటే అన్యమైన శబ్దాలను అతని స్థానంలో పూజించకండి.

5. ఎవడు ప్రాణాలతో నడవబడడో, ఎవరివలన ప్రాణాలు గతి = గమనం కలవి అవుతాయో అలాంటి బ్రహ్మను గుర్తించి అతన్నే ఉపాసించండి. ఏది ఆ భగవంతుని కంటే అన్యమైన ఈ వాయువు ఉన్నదో దానిని ఉపాసించకండి. ఇలా అనేకమైన నిషేధా లున్నాయి.

నిషేధం ప్రాప్త నిషేధమని అప్రాప్త నిషేధమని రెండు విధాలు. **ప్రాప్త నిషేధం:-** ఒకచోట కూర్చున్న వానిని అక్కడ నుండి లేపటం. **అప్రాప్త నిషేధం:-** ఓ కుమారా! నీవు ఎప్పుడు కూడా దొంగతనం చేయకు. బావిలో పడకు. దుష్టులతో చెలిమి చేయకు. విద్యా విహీనుడవు కాకు, అనేవి అప్రాప్తాలు. ఇలా ప్రాప్త నిషేధాలే గాక అప్రాప్త నిషేధాలు కూడా ఉంటాయి. అందువలన మానవుల జ్ఞానంలో అప్రాప్త నిషేధాలు ఉన్నట్లు పరమేశ్వరుని జ్ఞానంలో ప్రాప్త నిషేధం చేయబడింది. కావున పాషాణాది మూర్తిపూజలు అత్యంత నిషేధాలు. అకర్తవ్యత్వంతో మిథ్యా భాషణాలు వేదంలో నిషిద్ధాలు. విహితమైన వానిని అనుష్ఠించటం అది ధర్మం. వానిని అనుష్ఠించకుండా ఉండటం అధర్మం. అలాగే నిషిద్ధకర్మలు చేయటం అధర్మం మరియు అలాంటి కర్మలు చేయకుండా ఉండటం ధర్మం. ఇలా వేదాలతో నిషిద్ధాలైన మూర్తి పూజా కర్మలను చేస్తే నీవు పాపాత్ముడవు ఏల కావు?

మూర్తిపూజ పాపం

ప్రశ్న:- విగ్రహారాధనలో పుణ్యం లేకుంటే పాపమైతే లేదు కదా?

జవాబు:- కర్మలు రెండు విధాలు. 1. విహితకర్మలు - కర్తవ్యంతో వేదాలలోని సత్యభాషణాలుగా ప్రతిపాదించబడింది. 2. నిషిద్ధ కర్మలు - అకర్తవ్యంతో వేదాలలో మిథ్యా భాషణాలు నిషిద్ధాలు. విహితకర్మలను అనుష్ఠానం చేయటం ధర్మం. వాటిని అనుష్ఠించకుండటం అధర్మం. అలాగే నిషిద్ధ కర్మలను చేయటం అధర్మం. అలాంటి కర్మలను చేయకపోవటం ధర్మం. వేదాల ద్వారా నిషేధించబడిన మూర్తి పూజా కర్మలను చేస్తుంటే నీవు పాపాత్ముడవు ఎలా కావు?

ప్రశ్న:- చూడండి. వేదాలు అనాదులు. ఆ సమయంలో మూర్తులతో పనేమిటి? ఎందుకంటే ప్రారంభంలో దేవతలు ప్రత్యక్షమయ్యేడివారు. ఈ పద్ధతి తర్వాతి కాలంలో తంత్రాల ద్వారా మరియు పురాణాల ద్వారా ప్రచారమైనది. మానవుల జ్ఞానం, సామర్థ్యం తగ్గినప్పుడు పరమేశ్వరుని ధ్యానంలో

నిలుపుకొనలేకపోయారు. ఇక మూర్తులను అయితే ధ్యానించవచ్చు. ఈ కారణంతో అజ్ఞానుల నిమిత్తమై మూర్తిపూజ ఏర్పర్చబడింది. ఎందుకంటే ఒక్కొక్క మెట్టు ఎక్కుతూనే భవనం పైకి చేరగలం. ప్రథమ సోపానాన్ని వీడి పైకి వెళ్ళదలచిన పోలేము. కావున మూర్తిపూజ ప్రథమ సోపానం. దీనిని క్రమంగా అర్చించగా అర్చించగా జ్ఞానం కలిగి అంతఃకరణం పవిత్రమవుతుంది. అప్పుడు పరమాత్మను ధ్యానించవచ్చు. ఉదా:- గురి చూచి కొట్టువాడు ప్రథమంలో స్థూల లక్ష్యాన్ని బాణంచేతనో, తుపాకి గుండు చేతనో, ఫిరంగి గుండు చేతనో కొడుతూ కొడుతూ చివరకు సూక్ష్మమైన దానిని కూడా గురిపెట్టి కొట్టగలడు. అలాగే స్థూలమైన మూర్తిని పూజిస్తూ, పూజిస్తూ, తిరిగి సూక్ష్మ బ్రహ్మను కూడా పొందుతాడు. ఉదా:- బాలికలు బొమ్మలాటలను నిజమైన భర్తను పొందేంతవరకు ఆడుతున్నారు. ఇలాంటి పద్ధతులతో మూర్తిపూజ చేయటం దుష్టలపని కాదు.

జవాబు:- వేద విహిత కర్మలలో ధర్మం, వేద నిషిద్ధాచరణ కర్మలలో అధర్మం ఉన్నదని తెలుసుకున్న నీవు మూర్తిపూజ చేయటం ధర్మమని అనటం వేదాలకు విరుద్ధాలైన గ్రంథాలను ప్రమాణంగా చెప్పటం నాస్తికులవటమే అని తెలుస్తున్నది.

వేదాలకు విరుద్ధాలైన గ్రంథాలను ప్రమాణంగా చెప్పటం నాస్తికులవటమే అని తెలుస్తున్నది.

1. **"నాస్తికో వేదనిందకః"** అనే మనుస్మృతి వాక్యాన్ని చూడండి.

వేదాలను నిందించేవాడు అంటే వేదాలను అవమానించినా, వాటిని విడిచినా వాటికి విరుద్ధాచరణ చేసినా అతడు నాస్తికుడు అనబడతాడు.

2. **యా వేదబాహ్యాః స్మృతయో యాశ్చ కాశ్చకుదృష్టయః।**
సర్వాస్తానిష్ఫలాః ప్రేత్య తమోనిష్ఠా హి తాః స్మృతాః ॥ మను. 12-95 ॥

వేదబాహ్యులు, కుత్సిత పురుషులైన వారితో రచించబడిన గ్రంథాలు, ప్రపంచ జనులను దుఃఖ సాగరంలో ముంచేవి. అవన్నీ నిష్ఫలాలు, అసత్యాలు. అంధకారరూపాలు, ఇహ, పరలోక దుఃఖదాయకాలు.

3. **ఉత్పద్యంతే చ్యవంతే చ యాన్యతోఽన్యాని కానిచిత్।**
తాన్యర్వాక్కాలికతయా నిష్ఫలాన్యనృతాని చ ॥ మను. 12-96 ॥

ఈ వేదాలకు వ్యతిరేకంగా ఉత్పన్నమైన వేద విరుద్ధ గ్రంథాలు ఆధునికాలు అవటంతో శీఘ్రంగా నశిస్తాయి. వాటిని అంగీకరించటం నిష్ఫలం, అయథార్థం.

మూర్తిపూజ సోపానం కాదు - అది ఒక ఊబి

బ్రహ్మ మొదలు జైమిని మహర్షి వరకు ఈ వేద మార్గాన్నే అంగీకరించారు. వేద విరుద్ధాలను అంగీకరించకపోవటమే వారి అభిప్రాయం. వేదానుకూల ఆచరణే ధర్మం. ఎందుకంటే వేదాలు

సత్యార్థ ప్రతిపాదకాలు. వీటికి విరుద్ధాలుగా ఏ అనేక తంత్రాలు, పురాణాలు వెలసాయో అవి అసత్యాలు. వేద విరుద్ధ గ్రంథాలలో చెప్పబడిన మూర్తిపూజ అధర్మంతో కూడి ఉన్నది. మానవుని జ్ఞానం జడ పదార్థాలను పూజించటం వలన వృద్ధిని పొందదు. ఉన్న జ్ఞానం కూడా నష్టమవుతుంది. కావున జ్ఞానులైన వారి సేవా శుశ్రూషలు చేసి, వారితో స్నేహ సాంగత్యం చేయటం వలన జ్ఞానాభివృద్ధి కలుగుతుంది. పాషాణాలను పూజించటం వలన వృద్ధి కలుగదు. పాషాణాది మూర్తిపూజల ద్వారా పరమేశ్వరుని ఎన్నడైన ధ్యానించగలుగునా? ధ్యానించలేదు. ఇది నిజం. మూర్తిపూజ సోపానం కాదు కాని ఒక పెద్ద కందకం. దానిలో పడిన మానవుడు నుగ్గు నుగ్గు కాగలడు. మళ్ళీ ఆ ఊబి నుండి బయటికి రాలేడు. అందులోనే మరణిస్తాడు. ధార్మికులైన సాధారణ, స్వల్ప జ్ఞాన విద్వాంసులు మొదలుకొని పరమ విద్వాంసుల, యోగుల సాంగత్యంతో ఉంటే సద్విద్య, సత్యభాషణాలు కలుగుతాయి. ఇవే పరమేశ్వర ప్రాప్తికి పరమ సోపానాలు. ఉదా:- భవనం పైకి పోవటానికి నిచ్చెన వంటివి. కాని మూర్తిపూజ చేసి చేసి జ్ఞానులైన వారు ఎవరూ లేరు. మీదు మిక్కిలి మూర్తిపూజారులు అజ్ఞానులై మానవ జన్మను వ్యర్థంగా పోగొట్టుకొని అనేక విధాలుగా మరణించారు. ఇక ఇప్పుడున్నవారు మరియు భవిష్యత్తులో ఉండబోవు వారందరు మానవ జన్మ యొక్క ధర్మ, అర్థ, కామ మోక్షాల ప్రాప్తి రూప ఫలాల నుండి విముఖులై నిరర్థకంగా నశిస్తారు. మూర్తిపూజ బ్రహ్మప్రాప్తిలో స్థూల లక్ష్యం వంటిది కాదు. ధార్మిక విద్వాంసులు మరియు సృష్టివిద్యలు స్థూల లక్ష్యాలు. వీటిని వృద్ధిపరచుకొంటే మానవుడు బ్రహ్మను కూడా పొందుతాడు. మూర్తిపూజ ఒక బొమ్మలాట వంటిది కాదు. కాని అక్షరాభ్యాసం పొంది సుశిక్షితులవటమే బొమ్మలాటలాగా బ్రహ్మప్రాప్తికి సాధనాలు. మంచి శిక్షను మరియు సత్యవిద్యను పొందినప్పుడు సత్యస్వామియైన పరమాత్మను కూడా పొందగలడనే విషయాన్ని మరవకండి.

సాకారంలో మనస్సు స్థిరపడదు

ప్రశ్న:- సాకార వస్తువులో మనస్సు స్థిరమవుతుంది. నిరాకార వస్తువులో స్థిరమవటం కష్టం. కాబట్టి మూర్తిపూజ ఉండవలసిందే.

జవాబు:- సాకార వస్తువుపై మనస్సెప్పుడూ స్థిరంగా ఉండదు. ఎందుకంటే దానిని మనస్సు తొందరగా గ్రహించి దాని ఒక్కొక్క అవయవంలో తిరుగుతుంది. మరియొక దానిపైకి పరుగెత్తుతుంది. ఇక నిరాకార పరమాత్మను గ్రహించటంలో యావత్ సామర్థ్యం గల మనస్సు మిక్కిలి పరుగెత్తినప్పటికి కూడా అంతాన్ని పొందలేదు. నిరవయవి (అవయవరహితం) అవటం వలన చంచలం కూడా అవదు. అతని గుణ, కర్మ, స్వభావాలను ఆలోచించి ఆలోచించి ఆనందంలో మగ్నమై స్థిరమవుతుంది. సాకారంలో మనస్సు స్థిరమైనచో అందరిమనస్సులు స్థిరంకావాలి. ఎలాగంటే జగత్తులో మానవులు, స్త్రీ, పుత్రుడు, ధనం, మిత్రుడు వంటి సాకారాలలో చిక్కుకొంటారు. నిరాకార వస్తువుపై మనస్సును

లగ్నపరచనంతవరకు ఎవరి మనస్సు స్థిరంగా ఉండదు. ఎందుకంటే నిరవయవి అవటం వలన దానిపై మనస్సు స్థిరమవుతుంది. కావున మూర్తిని పూజించటం అధర్మం.

మూర్తిపూజ వలన కలిగే దోషాలు

1. సాకారంలో మనస్సు స్థిరపడదు. మూర్తి పూజ చేయుట వేదవిరుద్ధము.
2. కోట్ల కొద్ది రూపాయలు మందిరాలకు వెచ్చించి దరిద్రులవుతారు. మరియు వీటి ద్వారా ఎన్నో పొరపాట్లు కూడా జరుగుతాయి.
3. మందిరాలలో స్త్రీ పురుషులనేకులు చేరటం వలన వ్యభిచారం, కలహాలు, ఇబ్బందులు మరియు అంటురోగాలు ఉత్పన్నం అవుతాయి.
4. మందిరాలే ధర్మ, అర్థ, కామ మోక్షాలకు సాధనాలని భావించి పురుషార్థరహితులై మానవ జన్మను వ్యర్థంగా గడుపుతారు.
5. అనేక విధాలైన విరుద్ధస్వరూపాలు, నామాలు, చరిత్రలతో యుక్తమైన మూర్తుల పూజారులలో ఐకమత్యం నశించి విరుద్ధ మతాలలో ప్రవేశించి పరస్పర భేద భావాలను అభివృద్ధి పరచుకొని దేశాన్ని నాశనం చేస్తారు.
6. మూర్తిపై గల విశ్వాసంతో శత్రువులకు పరాజయం, తమకు విజయం కలుగుతుందని విశ్వసించి ఏ కార్యం చేయక కూర్చుంటారు. వీరికి పరాజయం కలిగి రాజ్యం, స్వాతంత్ర్యం మరియు ధనం సుఖం శత్రువుల స్వాధీనమవుతాయి. అప్పుడు వారు పరాధీనులై ధర్మ సత్రపు యజమాని యొక్క కంచరగాడిద లేక కుమ్మరి వాని గాడిద లాగా శత్రువశులై అనేక విధాలైన దుఃఖాలననుభవిస్తారు.
7. ఒకడొకనితో మేము నీవు కూర్చొను ఆసనంపైన లేదా నీ పేరు మీద ఒక రాయిని పాతదలచామని అన్న అతడు అతనిపై క్రోధితుడై కొడతాడు లేదా నిందిస్తాడు. అలాగే పరమేశ్వరుని ఉపాసనా స్థానమైన హృదయంలో లేదా నామంపై పాషాణాది మూర్తులనుంచుతామంటే, ఇలాంటి దుర్బుద్ధి గలవారిని పరమేశ్వరుడు సర్వనాశనం ఎలా చేయకుండును?
8. పిచ్చివారై ప్రతి మందిరానికి, దేశదేశాంతరాలకు మాటిమాటికి వెళ్ళి తిరిగి దుఃఖాన్ని పొందుతారు. ధర్మం, సాంసారిక మరియు పరమార్థ కార్యాలను నష్టపరుచుకొంటారు. దొంగలబారిన పడతారు. వంచకులతో వంచించబడతారు.
9. దుష్టులైన పూజారులకు అక్కడికి వచ్చే భక్తులు ధనాన్నిస్తారు. ఆ ధనాన్ని వారు వేశ్యలకు,

పరస్త్రీ గమనాలకు, మద్య మాంసాహారాలకు, కలహాలకు మొదలైన చెడు వ్యసనాలకు వ్యయపరుస్తారు. దానితో దాత యొక్క సుఖమూలం నష్టమై దుఃఖం కలుగుతుంది.

10. మాతాపితలైన మాన్యులను అవమానపరచి, పాషాణ మూర్తులను సత్కరించి కృతఘ్నులవుతారు.

11. మూర్తులను ఎవరైన పగులగొట్టినప్పుడు, చోరులు దొంగిలించినప్పుడు హాహాకారాలను చేస్తూ, గట్టిగా రోదిస్తుంటారు.

12. పూజారులు పరస్త్రీలతో, పూజారిణులు పరపురుషులతో సంగమం కలిగి, తరచుగా దూషితులై స్త్రీ పురుషుల ప్రేమానందాన్ని చేజేతులా జారవిడుచుకొంటారు.

13. స్వామి యాజ్ఞను సేవకుడు యథావిధిగా పాటించకపోవటం వలన పరస్పర విరుద్ధ భావం ఏర్పడి నష్టభ్రష్టులవుతారు.

14. జడ పదార్థాలను ధ్యానించేవారి ఆత్మ కూడా జడబుద్ధి కలదవుతుంది. ఎందుకంటే ధ్యేయం యొక్క జడత్వ ధర్మం అంతఃకరణం ద్వారా ఆత్మలోనికి తప్పక వస్తుంది.

15. పరమేశ్వరుడు సుగంధాది యుక్తమైన పుష్పాది పదార్థాలను, వాయువు, జలంలోని దుర్గంధాన్ని నివారింపజేస్తూ మరియు ఆరోగ్యాన్ని కలుగచేయటానికి సృజింపజేశాడు. వీనిని పూజారులు తెంచి వాటి జీవితాన్ని మధ్యలోనే నాశనం చేస్తారు. ఈ పుష్పాల సుగంధం ఎన్ని రోజుల వరకు ఆకాశంలోనికి పోయి వాయు జలాలను శుభ్రపరుస్తుందో తెలియదు. పూర్ణ సుగంధ సమయం వరకు వాటి నుండవివ్వరు. పుష్పాలు మురికితో కలిసి మురిగి విపరీతమైన దుర్గంధాన్ని ఉత్పన్నం చేస్తాయి. పరమాత్ముడు రాళ్లపై అర్పించటానికా పుష్పాది సుగంధయుక్త పదార్థాలను సృష్టించింది?

16. పాషాణాలకు అర్పించిన పుష్పాలు, చందనం, అక్షతలు మొదలైనవాటితో కలిసిన నీరు మట్టితో కలియటంతో కాల్వలోనికో గుంటలలోనికో వచ్చి మురిగి ఎంతో భరించరాని దుర్గంధాన్ని ఆకాశంలో వ్యాపింపజేస్తాయి. మానవుని మలమెట్టి దుర్గంధాన్ని కలిగిస్తుందో అలాంటి దుర్గంధం ఈ నీటి ద్వారా వ్యాపిస్తుంది. వేలకొద్దీ జీవులు వాటిలో పుడతాయి. వాటిలోనే మరణించి క్రుళ్లుతాయి.

ఇలాంటివే అనేక దోషాలు మూర్తిపూజ చేయటం ద్వారా కలుగుతాయి. కావున సర్వదా పాషాణాది మూర్తిపూజలను సజ్జనులు త్యజించాలి. ఎవరు పాషాణాది మూర్తిపూజలను చేసారో, చేస్తారో మరియు చేయగలరో వారు పూర్వోక్త దోషాల నుండి రక్షించబడలేరు. రక్షించబడరు. రక్షించబడలేరు.

పంచాయతన పూజ

ప్రశ్న:- ఏ విధమైన మూర్తిపూజలను చేయరాదు, చేయించరాదు. కాని మన ఆర్యావర్తంలో పంచదేవతల పూజా శబ్దం ప్రాచీన పరంపర నుండి ప్రచారంలో ఉన్నది. ఈ పంచాయతన పూజ అంటే శివుడు, విష్ణువు, అంబిక, గణేశుడు మరియు సూర్యుడు అనే మూర్తులను తయారుచేసి పూజిస్తారు. ఇది పంచాయతన పూజ అవునా కాదా?

జవాబు:- ఏ విధమైన మూర్తిపూజను చేయరాదు. కాని ఈ దిగువ వ్రాయబడు మూర్తివంతులైన వారిని పూజించాలి. అంటే సత్కరించాలి. ఇదే పంచదేవపూజ అంటారు. పంచాయతన పూజా శబ్దాలు బహు చక్కని అర్థం గలవి. కాని విద్యా విహీనులైన మూర్ఖులు వాటికి గల ఉత్తమ అర్థాన్ని విడిచి నికృష్టార్థాన్ని గ్రహించారు. ఎవరైతే నేటికి శివాది పంచవిధ మూర్తులను తయారుచేయించి పూజిస్తారో వాటి ఖండన ఇప్పుడే చేసాము. వేదోక్తం, వేదానుకూలోక్తమైనది దేవపూజయే. పంచ దేవపూజయే నిజమైన పంచాయతన పూజ అని గ్రహించండి.

1. మానోవధీః పితరం మోత మాతరమ్ ॥ యజు. అ. 16 మం. 15 ॥

సాకారవతియై పూజించదగిన ప్రథమ దేవత మాత. అంటే సంతానము తమ తను మను ధనాలతో సేవించి తల్లిని ప్రసన్నురాలుగా ఉంచాలి. హింస అంటే ఆమెను ఎన్నడూ కొట్టరాదు, తిట్టరాదు నిందించి బాధించరాదు. సత్కరించదగిన రెండవ దేవత తండ్రి. ఇతన్ని కూడా తల్లిలాగానే సేవించాలి.

2. ఆచార్య ఉపనయమానో బ్రహ్మచారిణమిచ్ఛతే ॥ అథ. కాం. 11. వ5 మం. 17 ॥

విద్యను నేర్పించే ఆచార్యుడు మూడవ దేవత. అతన్ని తను మనుధనాలతో సేవించాలి.

3. అతిథిర్గృహానుపగచ్ఛేత్ ॥ అథ. కాం. 15 వల్లి 13 మం. 6 ॥

నాల్గవ దేవత అతిథి. ఇతడు విద్వాంసుడు, ధార్మికుడు, నిష్కపటం కలవాడు. అందరిఉన్నతిని కాంక్షించేవాడు. ప్రపంచమంతా సంచరిస్తూ సత్యోపదేశంతో సకల ప్రాణులకు సుఖాన్ని కలిగిస్తాడు. ఇలాంటి గుణాలున్న అతిథిని సేవించాలి.

4. అర్చత ప్రార్చత ప్రియమేధాసో అర్చత ॥ ఋగ్వేదం ॥ 8-89-8

ఐదవ దేవత స్త్రీకి తన భర్త, పురుషునికి తన భార్య దేవత. వీరు పరస్పరం గౌరవించుకోవాలి. ఈ ఐదుగురు సాకార దేవతలు. వీరి స్నేహ సౌహార్ద్రాలతో మానవ శరీరోత్పత్తి, పాలన, సత్యశిక్ష జ్ఞానంతో కూడిన సత్యోపదేశ ప్రాప్తి కలుగుతుంది. వీరే పరమేశ్వర ప్రాప్తికి సోపానాలు. వీరిని సేవించక ఎవరు పాషాణాది మూర్తులను పూజిస్తారో వారత్యంత పామరులై నరకగాము లవుతారు.

5. "త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి । త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మవదిష్యామి" తై. ఉ. 1.1.5

అంటే ఈ పైన తెలిపి (చేతన) దేవతలు మనకు ప్రత్యక్షమై ప్రాణస్వరూపంగా వెల్లడైనవారు. వీరే మనకు బ్రహ్మ. వీరినే నేను బ్రహ్మ అని అంటాను.

6. కతమ ఏకో దేవ ఇతి స బ్రహ్మ తదిత్యాచక్షతే ॥

శత. 3 కాండ. 14, ప్ర. 6 బ్రాహ్మ. 2 కండిక 10 ॥

కనిపించే సూర్యుడే, బ్రహ్మవాచకమైన జడ దేవుడు.

7. మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ అతిథి దేవో భవ ॥

తైత్తరీయో. వ. అను. 11 ॥

ఓ కుమారా! నీవు తల్లి పట్ల దేవబుద్ధి కలవాడవవ్వు. అలాగే తండ్రి, ఆచార్యుడు, అతిథి పట్ల కూడా దేవబుద్ధి కలవాడ వవ్వు. దీని అభిప్రాయమేమంటే ఈ నలుగురు ఈశ్వరునికి ప్రతిమూర్తులుగా భావించి శ్రద్ధ మరియు భక్తి పూర్వకంగా సదా వీరి ఆజ్ఞలను పాలించి, వారికి నమస్కరించి సేవిస్తుండాలి. వీరిని సదా వినయంతో కూడిన నడవడికతో ప్రసన్నులుగా ఉంచండి.

8. పితృభిర్భ్రాతృభిశ్చైతాః పతిభిర్దేవరైస్తథా ।
పూజ్యాభూషయితవ్యాశ్చ బహు కల్యాణమీప్సుభిః ॥ మను. అ. 3-55 ॥

తండ్రి తన కన్యను, సోదరుడు తన సోదరిని, పతి తన పత్నిని, బావకాని, మరిది కాని తన మరదల్ని లేక వదినను పూజించాలి. వీరితో ఉచితమైన మధురభాషణ పొందాలి. వీరికి భోజనం, వస్త్రాభూషణాలను ఇచ్చి ప్రసన్నులను చేయాలి. కల్యాణాన్ని కాంక్షించే మానవుడు స్త్రీలకెన్నడూ క్లేశం కలిగించరాదు.

9. ఉపచర్యః స్త్రియాసాధ్వ్యా సతతం దేవవత్పతిః ॥ మను. 5-154 ॥

సాధ్వి అయిన స్త్రీని పతి దేవత లాగా ఆరాధించటం ఉచితం.

ప్రశ్న:- తల్లిదండ్రి వంటి పెద్దల సేవ చేస్తూ మూర్తిపూజ కూడా చేసిన ఏమైన దోషం కలుగుతుందా?

జవాబు:- పాషాణ మూర్తిపూజలను సర్వదా త్యజించి మాతాది మూర్తులను సేవించటంలోనే కల్యాణం ఉన్నది. సాక్షాత్తు మాతాది ప్రత్యక్ష, సుఖదాయక దేవతలను త్యజించి దేవతలు కానటువంటి పాషాణ మూర్తులకై శిరస్సు పగులగొట్టుకోవటానికి స్వీకరించు విషయం మిక్కిలి అనర్థ దాయకం.

తల్లిదండ్రుల సమక్షంలో నైవేద్యంకాని, కానుకలు, పూజాద్రవ్యాలను గాని పెట్టినచో వారే భుజిస్తారు. వారు కానుకలను, పూజా ద్రవ్యాలను గైకొనిన, మానోళ్ళలో గాని, మా చేతులలో గాని

ఏమీ పడదని మూర్ఖులు భావించి మూర్తులను తయారు చేయించి వానిముందు నైవేద్యం ఉంచి ఘణఘణ గంటలను, పుంపుం శంఖులను వాయించి, ఊది కోలాహలం చేసి బొటనవ్రేలును వాటికి చూపి "త్వమంగుష్ఠం గృహాణ భోజనం పదార్థం వాఽహంగృహీష్యామి" ఉదా:- ఒకడు ఒకనిని మోసగించటానికి లేక విసిగింపచేయటానికో గంటను తీసుకొని మరియు బొటనవేలును చూపి అతని ముందున్న సమస్త పదార్థాలను తీసుకొని తాను భుజించటానికే ఈ పూజారుల లీలలున్నాయి. అంటే పూజ పేరుతో సత్కర్మలకు శత్రువులుగా వీరి కార్యాలున్నాయి. విగ్రహాలను తళుకుబెళుకులతో, వయ్యారంగా, ప్రకాశవంతంగా తయారుచేయించి మూర్ఖులను మోసగించి తాము పాపమనదగిన అజ్ఞానుల, అనాథుల సామాన్యులను మోసంతో దోచుకొని ఆనందిస్తారు. పుణ్యాత్ములైన రాజులెవరైన ఉన్న వారీ పాషాణ ప్రియులను రాళ్లు కొట్టటానికి, శిల్పాలను, గృహాలను నిర్మించు కార్యాలలో ఉంచితే బాగుండేది.

ప్రశ్న:- పాషాణ స్త్రీ మూర్తులను చూచినపుడు కామోత్పత్తి కలుగునట్లు వీతరాగియైన ప్రశాంత మూర్తిని చూస్తే వైరాగ్యం మరియు శాంతత ఎలా లభించవు?

జవాబు:- లభించవు. ఎలాగంటే మూర్తుల యొక్క జడత్వ ధర్మం ఆత్మలో ప్రవేశించటం వలన ఆలోచనా శక్తి నశిస్తుంది. ఆలోచన లేకుండా వైరాగ్యం, వైరాగ్యం లేకుండా విజ్ఞానం, విజ్ఞానం లేకుండా శాంతి ప్రాప్తించవు. సహవాసం, ఉపదేశం మరియు ఇతిహాసాలను చదివి చూడటం వలననే కొంత లాభం కలుగుతుంది. ఎలాగంటే గుణదోషాలను గుర్తించక ఆ ప్రతిమలను దర్శించినంత మాత్రాన ప్రీతి కలుగదు. ప్రేమ ఏర్పడటానికి గుణ జ్ఞానమే కారణం. ఇలాంటి మూర్తిపూజల వంటి దుష్కారణాల చేతనే ఆర్యావర్తంలో పనికిమాలిన పూజారులు, భిక్షుకులు, సోమరులు, పురుషార్థ రహితులు కోట్లకొద్ది ఏర్పడ్డారు. ఈ మానవులు మూర్ఖులవటం వలన ప్రపంచంలో అంతటా మూర్ఖత్వం వ్యాపించినది. అసత్యం, అక్రమాలతో కూడిన మోసం కూడా విరివిగా వ్యాపించాయి.

చమత్కారాల ఖండనం

ప్రశ్న:- 'ఔరంగజేబు' పాదుషాకు కాశీలో లాట్ భైరవుడు గొప్ప గొప్ప చమత్కారాలను చూపించటాన్ని చూడండి. ముసల్మానులు వాటిని ఛేదించటానికి వెళ్లినప్పుడు వాటిపై ఫిరంగి గుండ్లను వేసినప్పుడు పెద్ద పెద్ద గండు తేనెటీగలు వెడలి వారి సైన్యాన్ని గగ్గోలు పరచి పారద్రోలినవి.

జవాబు:- ఇది పాషాణాల అద్భుత విషయం కాదు. అక్కడ గండు తేనెటీగలు తెట్టెలు పెట్టి ఉంచవచ్చు. వాటి స్వభావం క్రూరమైనది. ఎవరైన వాటిని రేకెత్తించిన అవి కరవటానికి పరుగుతీస్తాయి. విగ్రహమునుండియో లేక మరే దానినుండి వెళ్ళినా పాలధార ఒక అద్భుత విషయం. అది పూజారి యొక్క లీల.

ప్రశ్న:- మహాదేవుడైన శివుడు మ్లేచ్ఛులకు దర్శన మీయరాదని ఒక కూపంలో, వేణీమాధవుడను ఒక బ్రాహ్మణుని గృహంలో దాక్కొన్నారు. ఇవి కూడా అద్భుత విషయాలు కాదా?

జవాబు:- ఆహోహో! చాలా బాగున్నది. కోటపాలకుడైన కాలభైరవుడు, లాటభైరవాది భూతప్రేతాలు, గరుడాది గణాలు మహాదేవుని వేగదా! వారు ముసల్మానులతో పోరాడి ఎలా ఓడించి తొలగించ లేదు? శివ, విష్ణు పురాణాలలో త్రిపురాసురాది అనేక ఘోరభయంకర దుష్టులను దునుమాడి భస్మం చేసినట్లు కథలున్నాయి. ముసల్మానులను ఎలా భస్మం చేయలేదు? పాషాణాలు పోట్లాడి పోట్లాడింప చేస్తాయని వారు అనుకున్నట్లుగా ఋజువవుతున్నది. ముసల్మానులు మందిరాలను కూలగొడుతూ, మూర్తులను విరుగ్గొడుతూ కాశీని సమీపించినపుడు పూజారులు ఆ పాషాణ లింగాన్ని బావిలో పడవేసారు. ఇలాగే వేణుమాధవునిని బ్రాహ్మణుని గృహంలో దాచి ఉంచారు. కాశీకి కాలభైరవుని భయంతో యమదూతలు రాకుంటే ప్రళయం కూడా కాశీని నాశనం చేయదు కదా. మ్లేచ్ఛుల సైన్యాన్ని ఎలా హడలగొట్టలేదు? మరియు తన రాజైన మహాదేవుని మందిరాన్నెలా నాశనం కానిచ్చారు. ఇదంతా పోపులనబడే పూజారుల మాయ.

గయాశ్రాద్ధం

ప్రశ్న:- గయలో శ్రాద్ధాలు పెట్టిన పితరులకు పాపవిమోచనమై అక్కడ పెట్టిన శ్రాద్ధాల పుణ్య ప్రభావంతో పితరులు స్వర్గానికి వెళ్ళుదురు. పితరులు తమ హస్తాలను చూచి పుత్రులు పెట్టు పిండాలను అందుకొంటారను విషయం కూడా అసత్యమేనా?

జవాబు:- సర్వదా అసత్యం. అక్కడ పిండాలు పెట్టిన ఈ ప్రభావమే కలిగిచో పండాలకు పితరుల సుఖానికై ఇచ్చిన లక్షల కొద్ది రూపాయలను వేశ్యాగమనాది పాప కార్యాలలో వ్యయపరుస్తారు. అలాంటి సమయంలో పితరుల పాపం ఏ విధంగా విముక్తి అవుతుంది? పిండాలను గ్రహించుటకు పితరులు చేతులనేల చాపడం లేదు. పండాల చేతులు మాత్రం కనిపిస్తాయి. ఇది ఎప్పుడో ఎవడో ఒక ధూర్తుడు భూమిపై ఒక గుహను త్రవ్వి అందులో ఒక మానవుని కూర్చోబెట్టవచ్చు. ఆ తర్వాత అతని ముఖంపై దర్భలను పరచి పిండమిచ్చి ఉండవచ్చు. ఆ కపటి, దానిని తీసుకొని ఉండవచ్చు. కండ్లున్న గ్రుడ్డివానిని, మాట్లాడటంలో నిపుణులైన ఆ అమాయక ధనికులను ఈ విధంగా మోసగించిన ఆశ్చర్యం లేదు. ఇలాగే వైద్యనాథుని రావణుడు తెచ్చినాడనటం కూడా అసత్యవిషయమే.

కలకత్తా కాళీ, కంచి కామాక్షి

ప్రశ్న:- కలకత్తాలోని కాళీ, కంచిలోని కామాక్షి మొదలైన దేవతలను లక్షల కొద్ది మానవులు నమ్ముతున్నారు. చూడండి ఇది చమత్కారం కాదా?

జవాబు:- ఇది చమత్కారం కాదు. ఈ అమాయకులైన గ్రుడ్డివారు గొఱ్ఱెల లాగా ఒకరివెనుక మరొకరు వెళ్లుదురు. ఇంతకు ముందు గొఱ్ఱె ఒక గుంతలో పడిన వెనుక ఉన్న గొఱ్ఱెలు ఒకదాని తర్వాత ఒకటి ఆ గుంతలో పడతాయి. కాని తప్పుకోవు. అలాగే ఒక మూర్ఖుని వెంట మరొకడు వెళ్ళి మూర్తిపూజా అనే గుంతలో చిక్కుకొని దుఃఖాన్ని పొందుతారు.

పూరి జగన్నాథుడు

ప్రశ్న:- మంచిది. దీనిని విడిచిపెట్టండి. కాని జగన్నాథంలో ప్రత్యక్ష చమత్కారాలున్నాయి. 1. శరీరాకృతి మారినప్పుడు గంధపు మొద్దు సముద్రం పై నుండి స్వయంగా వస్తుంది. 2. పొయ్యిపై ఒకదానిపై ఒకటిగా ఏడు కుండలనుపెట్టి వండగా పైపై కుండలు ప్రథమంలో పక్వమవుతాయి. ఎవ్వరైన అక్కడ జగన్నాథుని ప్రసాదం భుజించకపోతే వాడు కుష్ఠ రోగి అవుతాడు. 3. జగన్నాథుని రథం తనంత తానే నడుస్తుంది. 4. పాపులకు స్వామి దర్శనం కాదు. ఇంద్రదమనుని రాజ్యంలో దేవతలు మందిరాన్ని నిర్మించారు. 5. శరీరాకృతి మారు సమయంలో ఒక రాజు, ఒక పూజారి, ఒక వడ్రంగి మరణిస్తారని మొదలైన చమత్కారాలను నీవు అసత్యం చేయలేవు.

జవాబు:- ఒకడు పన్నెండు సంవత్సరాల పర్యంతం జగన్నాథుని పూజించిన పూజారి ఒకడు విరక్తుడై మథురకు వచ్చాడు. అతడు నాతో కలిసాడు. నేను పై ప్రశ్నలకు ఉత్తర అడగగా అతడివన్నీ అసత్యాలని తెలిపాడు. విచారించి నిశ్చయమైన అంశం ఇది - ఎప్పుడైతే జగన్నాథుని శరీరాకృతిని మార్చవలసిన సమయం ఆసన్నమౌతుందో అప్పుడు నౌకలో చందనపు మొద్దులను తెచ్చి సముద్రంలో పడవేస్తారు. ఆ ఎండిన మొద్దులు సముద్ర తరంగాలతో ఒడ్డుకు చేరుతాయి. వాటిని తీసుకొని వడ్రంగులు మూర్తులుగా తయారు చేస్తారు. వంట చేసినపుడు తలుపులు మూసుకొని వంటవారు తప్ప అన్యులెవరిని పోనివ్వరు, చూడనివ్వరు. భూమిపై నలువైపుల ఆరు, మధ్య ఒక పొయ్యిని చక్రాకారంగా నిర్మిస్తారు. ఆ అండాల క్రింది భాగంలో నేయి, మన్ను మరియు బూడిదను పట్టించి ఆరు పొయ్యిలపై బియ్యం వండి వాటి అడుగు భాగాలనుతోమి, ఆ మధ్య ఉన్న అండాలో అప్పుడే బియ్యం వేసి ఆరు పొయ్యిలను ముఖాన్ని లోహపు పెనములతో మూసి దర్శనం చేసేవారికి, వారు ధనాఢ్యులైన, పిలిచి ఈ అండాలను పొయ్యిలను చూపుతారు. మీది మీది అండాల నుండి ఉడికిన అన్నాన్ని చూపి క్రింది అండాలలో ఉడకని బియ్యాన్ని తీసి చూపించి, వారితో అండాల నిమిత్తమై ఏదైన పెట్టండి అని అంటారు. అమాయకులైన ఆ కండ్లున్న గ్రుడ్డివారు, డబ్బు మూటలు సంపాదించటంలో నైపుణ్యం గలవారు రూపాయలను, బంగారు నాణాలను ఆ అండాలముందు పెడతారు. కొందరు మాసికవేతనాన్ని కట్టి ఇస్తారు. శూద్రులు, నీచులు మందిరానికి నైవేద్యం తెస్తారు. నైవేద్యం సమర్పించాక అప్పుడా శూద్రులు, నీచులు దానిని ఎంగిలి చేస్తారు. తర్వాత ఎవరైతే రూపాయలను చెల్లించి అండాలను కొంటారో వారికి ఆ అండాలో ఉన్న నైవేద్య ప్రసాదాన్ని వారున్న

వసతి గృహానికి చేరుస్తారు. దీనులైన గృహస్థులు, సాధువులు, అక్కడికి చేరిన భక్తులు మొదలైన శూద్రులు మరియు అంత్యజుల వరకు ఒకే పంక్తిలో కూర్చొని ఆ ఎంగిలి ప్రసాదాన్ని ఒకరు మరొకరికి తినిపిస్తారు. ఆ పంక్తి భుజించి లేచినప్పుడు ఆ విస్తరుల ముందే మరొక పంక్తిని కూర్చోబెడతారు. ఇది మహా అనాచారం. అనేకులు అక్కడికి వెళ్లి వీరి ఎంగిలి ప్రసాదాన్ని భుజించక, తమ హస్తాలతో సిద్ధం చేసుకొన్న ఆహారాన్ని భుజించి వెళతారు. కాబట్టి కుష్ఠ వంటి అంటు రోగాలు వ్యాపించవు. ఆ జగన్నాథపురంలో ఉన్నవారు అనేకులు కూడా ఈ ఎంగిలి ప్రసాదాన్ని భుజించరు. కాబట్టే వీరికి కుష్ఠువ్యాధి రావటం లేదు. ఈ జగన్నాథపురంలో అనేక కుష్ఠ రోగులున్నారు. వీరు ప్రతినిత్యం ఆ ఎంగిలి ప్రసాదాన్ని భుజించినప్పటికి కూడా వ్యాధి వదలుట లేదు. ఈ జగన్నాథపురంలో వామమార్గీయులు భైరవీ చక్రం ఏర్పరిచారు. ఎందుకంటే సుభద్ర శ్రీకృష్ణ బలరాముల చెల్లెలు. ఆమెను ఇరువురి సోదరుల మధ్య స్త్రీ అనగా పత్నీ మరియు తల్లి స్థానంలో కూర్చోబెడతారు. భైరవీ చక్రమే లేకుంటే ఇలాంటి విషయం ఎప్పటికీ సంభవించదు.

రథం తనంత తానే నడవటానికి దానిచక్రాలకు ఒక యంత్రం అమర్చబడినది. వానిని ఒక బుద్ధిమంతుడు త్రిప్పిన ఆ రథం తిరుగుతుంది. అప్పుడా రథం ముందుకు నడుస్తుంది. రథం గుంపుగా ఉన్న జనుల మధ్యకు వచ్చినప్పుడు దాని యంత్రానికున్న గూటాన్ని వెనక్కు త్రిప్పిన అది ఆగిపోతుంది. పూజారులు దానం చేయండి, పుణ్యం చేసుకోండి అని గట్టిగా కేకలు వేస్తుంటారు. మీరిచ్చిన దానంతో జగన్నాథుడు ప్రసన్నుడై మన రథాన్ని నడుపుతాడు. మన ధర్మం నిలుస్తుంది. కానుకలు వచ్చునంత వరకు ఈ విధంగానే కేకలు పెడుతుంటారు. కానుకలు రాగానే ఒక ప్రజవాసి మంచి దుస్తులను ధరించి, శాలువ కప్పుకొని రథానికి ముందు నిలిచి కరములను జోడించి ఓ జగన్నాథ స్వామీ! కరుణించి రథాన్ని నడపండి. మా ధర్మాన్ని నిలపండి అని స్తుతిస్తూ సాష్టాంగ దండ ప్రమాణం చేసి రథంపైకి ఎక్కుతాడు. అదే సమయంలో యంత్రాన్ని చక్కగా త్రిప్పుతారు. జయ నినాదా లొనరిస్తూ వేలకొలది మానవులు త్రాడును లాగుతారు, రథం ముందుకు నడుస్తుంది. జగన్నాథుని మందిరం చాలా పెద్దది. విశాలమైనది. దానిలో పగటిపూట కూడా చీకటి ఉంటుంది. అనేకులు స్వామిని దర్శించటానికి పోయినపుడు దీపాలను వెలిగించవలసి ఉంటుంది. ఆ మూర్తుల ముందు తెరలుంటాయి. స్వామికి ఇరుప్రక్కల లాగటానికి వీలుగా ఆ తెరలుంటాయి. పండాలు, పూజారులు ఈ తెరల వెనుక నిలబడి ఉంటారు. ఒక ప్రక్కనున్న తెరనులాగగానే వెంటనే విగ్రహం చాటుకు పోతుంది. అపుడక్కడ పండాలు, పూజారులు మీరు కానుకలు, కట్నాలు పెట్టండి. మీ పాపాలు పోగలవు. అప్పుడు స్వామి దర్శనమిస్తాడని కేకలు వేస్తూ, శీఘ్రపడండి, తొందరపడండి అని అంటారు. పాపం అమాయకులైన మానవులు ఆ ధూర్తుల చేతులలో దోచబడతారు. వెంటనే తెర రెండవ వైపుకు లాగబడుతుంది. అప్పుడు స్వామి దర్శనమవుతాడు. జయజయ నినాదాలను చేస్తూ ప్రసన్నులై త్రోపుడులను అనుభవిస్తూ తిరస్కృతులై వెళ్లిపోతారు.

ఇంద్రదమనుని వంశంవారిప్పటికీ కలకత్తాలో ఉన్నారు. అతడొక ధనవంతుడైన రాజు. దేవి యొక్క ఉపాసకుడు. అతడు లక్షల కొద్ది రూపాయలను ఖర్చుచేసి మందిరాన్ని నిర్మించాడు. ఆర్యావర్తదేశపు ఆహారపు చిక్కును ఈ పద్ధతిలో తొలగించాడు. కాని ఆ మూర్ఖులు ఎక్కడ వదలుతారు. మందిర నిర్మాణం చేసిన కర్మచారులను, శిల్పులనే దేవతలుగా భావించారు. రాజు, పండ మరియు మృదంగి శరీరాకృతి మారునప్పుడు మృతిని పొందలేదు. కాని ఈ ముగ్గురే అక్కడ ముఖ్యులైఉంటారు. వీరు తమక్రింద పనిచేసే చిన్న కార్మికులను పని నిమిత్తమై బాధించి ఉంచవచ్చు. వారందరి అంగీకారంపై శరీరాకృతి మార్పు చెందినపుడు ఈ ముగ్గురూ అక్కడే ఉంటారు. విగ్రహం యొక్క హృదయభాగం డోలుగా ఉన్నది. దానిలో ఒక బంగారు భరిణతో ఒక సాలగ్రామం నుంచి దీనిని ప్రతిదినం కడిగి చరణామృతాన్ని తయారుచేస్తారు. ఈ స్థాలగ్రామంపై రాత్రి శయన హారతి సమయంలో విషయుక్త ద్రావకాన్ని పూసి ఉండవచ్చు. ఆ సాలగ్రామాన్ని కడిగి ఆ చరణామృతాన్ని ఈ ముగ్గురికి త్రాగించగా వారు మృతి చెంది ఉండవచ్చు. మరణాలు ఈ విధంగా జరుగగా భోజన భట్టులైనవారు జగన్నాథుడు తన శరీరాకృతిని మార్చుకొన్నప్పుడు ఈ ముగ్గురు భక్తులను, తన వెంట తీసుకొని వెళ్లెనని ప్రచారం చెంది ఉండవచ్చు. ఇలాంటి అసత్యపు విషయాలు ఇతరుల ధనాన్ని మోసంతో అపహరించటానికై అనేక ప్రచారాలు జరుగుతాయి.

రామేశ్వర లింగ చమత్కారం

ప్రశ్న:- రామేశ్వరంలో గంగోత్రి జలాన్ని అభిషేకించినపుడు లింగం పెద్దదైవుతుంది అనే విషయం కూడా అసత్యమేనా?

జవాబు:- అసత్యం. ఎందుకంటే ఆ మందిరంలో కూడా పగలే చీకటి ఉంటుంది. దీపాలు రాత్రింబవళ్లు వెలిగిస్తూనే ఉంటారు. జలధారను విడిచినపుడు ఆ జలంలో విద్యుత్తు లాగా దీపాల ప్రతిబింబాలు వెలుగుతాయి. మరింకొకటేమి లేదు. పాషాణం పెరుగదు తరగదు, ఎంత ఉందో అంతే ఉంటుంది. ఇలాంటి లీలలను కల్పించి బుద్ధిలేనివారిని నమ్మింతురు.

ప్రశ్న:- రామేశ్వరుని రామచంద్రుడు స్థాపించినాడు. విగ్రహాలను అర్చించటం వేద విరుద్ధమైతే రామచంద్రుడు మూర్తిని ఎలా స్థాపించాడు? మరియు వాల్మీకి రామాయణంలో ఎలా వ్రాసాడు?

జవాబు:- రామచంద్రుని కాలంలో ఆ లింగం కాని, ఆ మందిరం పేరు గాని, చిహ్నం గాని లేకుండెను. కాని దక్షిణ దేశస్థుడైన రాముడి పేరు గల రాజు ఒకడు ఈ మందిరాన్ని నిర్మింపజేసి, లింగనామం రామేశ్వరుడని పేరు పెట్టాడనటం నిజం. రామచంద్రుడు సీతను గైకొని హనుమదాదులు వెంటరాగ లంక నుండి ఆకాశమార్గంలో విమానంలో కూర్చుండి అయోధ్యకు వచ్చినపుడు సీతతో ఇలా అన్నాడు -

అత్ర పూర్వం మహాదేవః ప్రసాదమకరోద్విభుః ।
సేతు బంధ ఇతి విఖ్యాతమ్ ॥ వాల్మీకి.రా.లంకా. కాం. సర్గ 125 శ్లో. 70 ॥

ఓ సీతా! నీ వియోగంలో మేము దుఃఖితులమై సంచరిస్తున్నాము. ఈ స్థలంలోనే "చాతుర్మాస్యం సలిపాము. ఇంకా పరమేశ్వరోపాసన, ధ్యానం కూడా చేసాము. సర్వత్ర విభుడు (వ్యాపకుడు) దేవతల్లో దేవుడైన పరమాత్ముని కృపతో మాకు సమస్త వస్తువులు ఇక్కడ లభించాయి. చూడు ఈ సేతువును, దీనిని మేము నిర్మించి లంకలో ప్రవేశించి, ఆ రావణుని చంపి, నిన్ను తీసుకొని వచ్చాము. ఇంతకంటే వాల్మీకి రామాయణంలో మరేమీ కూడా వ్రాయబడలేదు.

ప్రశ్న:- **"రంగ్ హై కాలియా కాంత్ కో - జిస్‌నే హుక్కా పిలాయా సంత్‌కో"** దక్షిణంలో కాలియాకాంతుడనే ఒక మూర్తి ఉన్నది. అది ఇప్పటి వరకు హుక్కా పొగను త్రాగుతున్నది. మూర్తిపూజ అసత్యమైన ఈ చమత్కారం కూడా అసత్యమే అయి ఉండేది గదా?

జవాబు:- ముమ్మాటికీ అబద్ధమే. ఇవన్నీ పోపుల లీలలు. ఎందుకంటే ఆ విగ్రహం యొక్క నోరు బోలుగా ఉంటుంది. దానికి ఒక రంధ్రాన్ని వీపుగుండాచేసి గోడ అవతల మరొక గృహంనుండి నల్లా (కొళాయి) పెట్టి ఉంటుంది. పూజారి హుక్కాను నింపి మరచీలలతో బిగించి ఉంచుతాడు. నోటిలో నల్లీని అమర్చి తెరవేసి వచ్చి ఉంటాడు. అప్పుడే వెనుక ఉన్న మానవుడు నోటితో పొగను గుంజిన ఇక్కడ హుక్కా గుడగుడ చప్పుడు చేస్తుంది. రెండవ రంధ్రం ముక్కు నోటితో సంబంధం ఉంటుంది. వెనుక పొగను ఊదుతున్నప్పుడు నాసిక, నోటి రంధ్రాల నుండి పొగ వెళ్ళుతుంటుంది. ఆ సమయంలో మూర్ఖులకీ లీలను చూపి వారి వద్ద ఉన్నవాటిని దోచుకొంటారు.

ప్రశ్న:- డాకోరు అనే విగ్రహం ద్వారక నుండి భక్తుని వెంట నడచి వచ్చినది. 1 1/4 ఒకటింబావు గురిగింజ బంగారంలో అనేక మణుగుల మూర్తి. తూచబడినదట చూడండి. ఇది కూడా చమత్కారం కాదా?

జవాబు:- ఇది చమత్కారం కాదు. ఆ భక్తుడు ఆ విగ్రహాన్ని దొంగిలించుకొని తెచ్చి ఉండవచ్చు ఆ విగ్రహం ఒకటింబావు గురిగింజ బంగారం ఎత్తు తూచబడినదని ఒక భంగు త్రాగినవాడు గప్పాలు మాట్లాడి ఉండవచ్చు.

సోమనాథ మందిరం

ప్రశ్న:- సోమనాధుడు భూమినంటకుండ పైన ఉన్నాడు. ఇది గొప్ప చమత్కారం. ఇది కూడా మిథ్యయేనా?

జవాబు:- అవును. మిథ్యయే. ఆలకించండి. క్రింద, మీద సూదంటురాయిలను (అయస్కాంతం) జోడించి ఉంచారు. వాని ఆకర్షణలతో ఆ మూర్తి గుడిలో నిలిచి ఉన్నాయి. 'మహమ్మద్ గజనీ' మన

దేశానికి వచ్చి యుద్ధం చేసినప్పుడు ఈ చమత్కారం చూసి ఈ మందిరాన్ని పడగొట్టెను. పూజారులకు, భక్తులకు దుర్దశ కలిగించాడు. లక్షల కొద్ది సైన్యం పదివేల సైన్యంతో పరుగెత్తిపోయారు. పోపులు, పూజారులు పూజా పునశ్చరణలు, స్తుతి ప్రార్థనలు చేశారు. "ఓ మహాదేవా! ఈ మ్లేచ్ఛులను నీవు చంపి మమ్మల్ని రక్షించు". అంతే కాదు తమ శిష్యులైన రాజులతో మీరు నిశ్చింతతో ఉండండి. మహాదేవుడు భైరవుడినో లేక వీరభద్రుడినో పంపిస్తాడు. వారు మ్లేచ్ఛులనందరినీ చంపుతారు. లేక వారిని గ్రుడ్డివారిగా చేస్తారు. అప్పుడే మన దేవతలు ప్రసిద్ధులవుతారు. హనుమంతుడు, దుర్గ, భైరవి స్వప్నంలో 'మేము వారిని తుదముట్టిస్తాము' అని చెప్పారని ఓదార్చి పంపిస్తారు. ఆలోచించని అమాయకులైన ఆ రాజులు, క్షత్రియులు పోపుల మోసపు మాటలతో నమ్మకంగా ఉన్నారు. ఎంతోమంది జ్యోతిశ్శాస్త్ర పోపులు ఇప్పుడే మీరు దండెత్తవలసిన ముహూర్తం కాదని రాజులతో చెప్పారు. ఒకడు ఈ దినమష్టమ చంద్రుడున్నాడని, మరొకడు నాకు యోగిని ఎదురుగా కనిపించిందని యుద్ధం చేయవద్దని మొదలైన మోసపు భ్రమలలో ఉంచారు. మ్లేచ్ఛుల సైన్యం వచ్చి చుట్టుముట్టినప్పుడు పారిపోయారు. ఎంతో మంది పోపులు, పూజారులు వారి శిష్యులు పట్టుబడ్డారు. పూజారులు చేతులు మోడ్చి మూడు కోట్ల రూపాయలను తీసుకోండి. మందిరాన్ని విగ్రహాన్ని పగులగొట్టకుడని కూడా అన్నారు. ముసల్మానులు మేము విగ్రహారాధకులం కాము. మూర్తి భంజకులం అంటూ మందిరాన్ని పడగొట్టారు. పైకప్పు కూలగానే అయస్కాంతం వేరవటం వలన మూర్తి క్రిందపడింది. మూర్తిని పగులగొట్టగా అందులో ఉండే పద్దెనిమిది కోట్ల రత్నాలు వచ్చాయని విన్నాము. పూజారులపై, పోపులపై కొరడాలు పడగా ఏడ్వసాగారు. అప్పుడు ముసల్మానులు వారిని కొడుతూ ధనాగారాన్ని చూపించమన్నారు. చచ్చేటట్లు చితకబాదిన వెంటనే ధనాగారాన్ని చూపించారు. ధనాగారమంత దోచుకొని, పోపులను వారి శిష్యులను బానిసలుగా చేసుకొని వెట్టి చాకిరి చేయించుకున్నారు. కఠిన పరిశ్రమతో అలసిపోయేలాగా చేసారు. మలమూత్రాలను ఎత్తించారు. తినటానికి శనగలను ఇచ్చారు. అహా! రాళ్లను పూజించి ఎందుకింత సర్వనాశనాన్ని పొందినారు? పరమేశ్వరుని భక్తితో ఏల ప్రార్థించలేదు? మ్లేచ్ఛుల దంతాలూడదీస్తే, తమ విజయం తామే పొందుతారు గదా. చూడండి. ఎన్ని మూర్తులున్నాయో అంతమంది శూరవీరులను పూజించినప్పటికి కూడా ఎంతో రక్షణ కలిగేది. పూజారులు ఈ పాషాణాలను ఎంతో భక్తితో కొలిచారు కాని ఒక్క మూర్తి కూడా ఆ శత్రువుల శిరస్సులపై ఎగిరిపడలేదు. ఒక శూరవీరుని మూర్తివలె సేవించినా అతడు తన సేవకులను యథాశక్తి రక్షించేవాడు. మరియు శత్రువులను చంపేవాడు.

ప్రశ్న:- ద్వారకావాసుడైన రణఛోడుడు 'నర్సీమహతా' వద్దకు హుండీని పంపాడు. మరియు అతని ఋణాన్ని చెల్లించాడు. ఈ విషయాలు కూడా అయథార్థములా?

జవాబు:- ఏ వ్యాపారో రూపాయలిచ్చి ఉండవచ్చు. ఎవడో దానిని శ్రీకృష్ణుడు పంపినాడని అసత్య ప్రచారాన్ని కల్పించవచ్చు. వి.శ. 1914 సంవత్సరంలో ఫిరంగుల తాకిడితో

మందిరమూర్తులను ఆంగ్లేయులు నాశనంచేసినపుడు మూర్తి ఎక్కడకు వెళ్ళినది? అయినా వ్యాఘ్రాం వంటి వారెందరో ఎంతో వీరత్వాన్ని చూపి పోరాడి శత్రువులను మట్టుపెట్టారు. కాని ఒక్క విగ్రహమైనా ఈగకాలిని కూడా విరచలేకపోయింది. శ్రీకృష్ణుని లాగా ఎవడైనా ఉంటేవారిని పిండి పిండిగా చూర్ణం చేసి తూర్పారపట్టేవాడు. ఇక వీరు పరుగెత్తుతూ పారిపోయేవారు. ఇక రక్షకుడే తన్నులు తిన్న, అట్టి శరణాగతులు ఎలా తన్నులు తినరు?

ప్రశ్న:- జ్వాలాముఖి ఒక ప్రత్యక్షదేవి. ఈమె అన్నింటినీ భక్షిస్తుంది. ప్రసాదమిచ్చిన సగం భుజించి మిగతా సగం విడచిపెడుతుంది. మహమ్మదీయ ప్రభువులు ఈమె పైకి నీటికాలువలను విడిచారు. ఇనుపరేకులను దిగకొట్టారు. అయినా జ్వాల చల్లారలేదు. ఆగనూ లేదు.

అదే విధంగా 'హింగ్‌లాజ' కూడా అర్ధరాత్రి వేల సంచారంచేసి పర్వతంపై కనిపిస్తుంది. పర్వతాన్ని గర్జింపజేస్తుంది. చంద్ర కూపం మాట్లాడుతుంది. యోని యంత్రం నుండి వెడలిన పునర్జన్మ ఉండదు. ఠూమరాను కట్టుకొన్నవాడు పూర్తిగా మహా పురుషుడనబడతాడు. 'హింగలాజ' రానంత వరకు అర్ధ పురుషుడని ప్రసిద్ధి చెందుతాడు. అనే ఇత్యాది విషయాలన్నీ విశ్వసించదగినవి కావా?

జవాబు:- విశ్వసించదగినవి కావు. ఎందుకంటే జ్వాలాముఖి పర్వతం నుండి అగ్నిజ్వాలలు వస్తాయి. ఈ విషయంలో పూజారులు విచిత్రమైన లీలలను కల్పించారు. పోపు పెట్టు నేతిగరిటెలోనికి జ్వాల వస్తుంది. వేరు చేసినా లేదా ఊదినా చల్లారుతుంది. ఆ జ్వాల కొంచెం నెయ్యిని తిని మిగిలినది విడుస్తుంది. అదేవిధంగా అక్కడ జరుగుతున్నది. ఉదా:- పొయ్యిమంటలో ఏది వేసినా అంతా బూడిదవుతుంది. అడవికి గాని, ఇంటికి గాని నిప్పంటుకొంటే అందులోని వస్తువులన్నీ తగలబడిపోతాయి. దీనికంటే అక్కడ జరిగే విశేషమేమి? మందిరం, కోనేరు లేకుండా ఇక్కడక్కడ నీటి గొట్టాల నిర్మాణం తప్ప హింగలాజంలో ఏ ఉత్సవం గాని జరగదు. ఏదైనా కొద్దిగా జరిగితే అదంతా పోపు, పూజారుల లీలలే తప్ప మరేదీ కాదు. అక్కడ ఒక జలగుండం ఉన్నది. అది బురదతో కూడి ఉన్నది. అందులో నుండి బుడగలు వస్తుంటాయి. దానిని సఫల యాత్ర అనటం మూర్ఖుల నమ్మకం. యోని యంత్రం ధనం గుంజుకోవటానికి చేసి ఉంచారు. ఠుమరులు కూడా పూజారుల లీలయే. ఠుమరులతో మహాపురుషులైతే ఒక పశువుపై వాటిని ఉంచిన అది మహారుషుడగునా? గొప్ప గొప్ప ధర్మయుక్తాలైన పురుషార్థాలు చేస్తే మహాపురుషులు అవుతారు.

ప్రశ్న:- అమృతసర్‌లో గల సరస్సు అమృతంతో సమానమైనది. అక్కడి కుంకుడు కాయ సగం తియ్యగా ఉంటుంది. ఒక గోడ వంగి ఉంటుంది. కాని అది పడదు. రేవాల సరస్సులో రాళ్ళు తేలుతుంటాయి. అమరనాథ క్షేత్రంలో లింగాలు స్వయంగా నిర్మాణం అవుతాయి. హిమాలయాల నుండి పావురాల జంట వచ్చి దర్శనం ఇచ్చి పోతుంది. ఇవన్నీ నమ్మదగినవి కావా?

జవాబు:- కాదు. ఆ సరస్సునకు అమృతసరస్సని పేరు మాత్రమే. ఒకప్పుడు ఆ ప్రదేశంలో అడవి ఉండేది. ఆ చెరువునీరు స్వచ్ఛంగా తియ్యగా ఉండేది. కావున దానికి అమృత సరస్సని పేరు పెట్టి ఉంటారు. ఆ నీరు అమృతమే యైతే పౌరాణికులు చెప్పినట్లు ఆ నీరు త్రాగినవారు చావకూడదు కదా? ఎందుకు చస్తున్నారు? గోడ నిర్మాణంలోనే ఏదో ఏర్పాటు చేసి ఉంటారు. అందుకే అది వంగి కనబడుతుంది. నేల కూలదు. కుంకుడుకాయ సగం తియ్యగా ఉన్న అది అంటుకట్టిన చెట్టుగా ఉండవచ్చు. తియ్యని పండ్లను ఇచ్చే చెట్టుతో కుంకుడుచెట్టును అంటుకట్టి ఉండవచ్చు అని భావం. రేవాల సరస్సులో రాళ్లు తేలటానికి ఏదో ఉపాయం చేసి ఉంటారు. అమరనాథ క్షేత్రంలో మంచుతో కొండలు ఏర్పడుచుంటే చిన్న చిన్న లింగాలు ఏర్పడటంలో ఆశ్చర్యమేమి? పావురాల జంట పెంపుడు జంటగా ఉంటుంది. వాటికి అభ్యాసం చేయించి ఉంటారు. పర్వతం వెనుక ఎవరో ఉండి వాటిని వదలిన అవి వచ్చి పోతున్నాయి. ఇలాంటి తమాషాలు చూపి యాత్రికుల నుండి ధనం దోచుకుంటున్నారు.

హరిద్వారం స్వర్గ ద్వారము కాదు

ప్రశ్న:- హరిద్వారం స్వర్గానికి ద్వారం. 'హరకీ పైడీ'లో స్నానం చేస్తే పాపాలు నశిస్తాయి. తపోవనంలో ఉంటే తపస్వి అవుతాడు. దేవప్రయాగ, గంగోత్రిలో గోముఖం, ఉత్తరకాశీలో గుప్తకాశి, త్రియుగీనారాయణుని దర్శనం కలుగుతుంది. కేదార, బదరీనారాయణుల పూజ ఆరు మాసాలు మానవులు, ఆరు మాసాలు దేవతలు చేస్తారు. మహాదేవుని ముఖం నేపాలులో పశుపతి నామంతోనూ, కేదారంలో పిరుదులు, తుంగనాథంలో జానువులు, అమరనాథ్‌లో చరణాలు ఉన్నాయి. వీటిని దర్శించి స్పృశించినా, స్నానం చేసినా ముక్తి కలుగుతుంది. కేదారం నుండి బదరీనుండి స్వర్గం వెళ్ళతలచినవారు వెళ్ళవచ్చు. ఈ విషయాలన్నింటినీ ఏమనాలి?

జవాబు:- హరిద్వారం ఉత్తర పర్వతాలలోకి పోవటానికి ఒక మార్గానికి ఆరంభం. ఇక 'హరకీ పైడీ' స్నానంలో ఒక కొండకి పోవటానికి మెట్లు నిర్మింపబడ్డాయి. ఆ మెట్లనే 'హరకీపైడీ' అంటారు. నిజం చెబితే నది 'హాడ్ పైడీ' ఎముకల స్థానమనాలి. ఎందుకంటే దేశదేశాంతరాలలో చనిపోయినవారి ఎముకలన్నీ అక్కడ గంగలో వేస్తారు. పాపం ఎన్నడూ ఎక్కడా విడవదు. అనుభవించకపోతే అవి నశించవు. తపోవనం - అది ఎప్పుడో ఒకప్పుడు తపోవనమై ఉండవచ్చు. ఇప్పుడు మాత్రం అది భిక్షుకవనం. తపోవనానికి వెళ్ళి అక్కడ ఉన్నంత మాత్రాన తపం కాదు. తపం చేయటంవలన తపస్సు అవుతుంది. అక్కడ ఎందరో అసత్యాలాడే దుకాణదారులున్నారు.

'హిమవతః ప్రభవతి గంగా' పర్వతంపై నుండి జలం క్రిందికి బడుతుంది. అక్కడ డబ్బులు దోచుకునేవారు గోముఖం ఆకారం నిర్మించి ఉన్నారు. అదే పోపుల స్వర్గమై ఉంటుంది. అక్కడ ఉత్తరకాశీ మొదలైన స్థానాలు ధ్యానం చేసుకొనేవారికి మంచిగా ఉంటుంది. కానీ దుకాణదారులకు అది వ్యాపారం చేసుకోవటానికి బాగానే ఉంటుంది.

దేవప్రయాగ పురాణాల గప్పాలు కొట్టేవారి లీలాస్థానం. అక్కడ అలఖనందా, గంగా రెండూ కలిసినాయి. కాబట్టి అక్కడ దేవతలు నివసిస్తారని గప్పాలు కొట్టకుంటే అక్కడికి ఎవరు వెళతారు? వారికి డబ్బులు ఎవరిస్తారు? గుప్తకాశీ కాదు, అది ప్రసిద్ధికాశియే. అక్కడ మూడు యుగాల 'ధూని' కనబడదు. పది, ఇరవై తరాల సోపులది. అది ఖాతిల భస్మధారణం చేసేవారి ధూనీ, పారసీకుల అగ్నిగృహం – 'అగ్యారీ' లాగా ఎల్లపుడూ కాష్టాలు కాలుతుంటాయి. ధూమం వస్తూ ఉంటుంది. అందువల్లనే దాన్ని మూడు యుగాల ధూని అంటుంటారు.

తప్తకుండం కూడా పర్వతాల లోపలనుండి వేడిని కలిగిస్తుంటుంది. అందుకే ఆ కుండంలో వెచ్చని జలం లభిస్తుంది. దానికి సమీపంలో ఉన్న మరొక కుండానికి జలం వస్తుంది. అది చల్లగానే ఉంటుంది. ఆ జలం చల్లని ప్రదేశం నుండి వస్తుంది.

'కేదార' స్థానంలోని భూమి చాలా మంచిది. కాని అక్కడ కూడా ఒక రాతిమీద పూజారులో వారి శిష్యులో ఒక మందిరాన్ని నిర్మించారు. అక్కడి మహంతు పూజారులు జ్ఞానశూన్యులైన ధనవంతుల నుండి కావలసినవన్నీ సంపాదించుకొని విషయానందం అనుభవిస్తారు. అలాగే 'బద్రీనారాయణ'లోని వంచనావిద్యలో నేర్పరులైన వంచకులు చాలామంది తిష్ఠవేసుకొని ఉంటారు. అక్కడ వారిలో ముఖ్యుడు 'రావల్ జీ' ఒక స్త్రీని కాక పలువురు స్త్రీలని ఉంచుకొని ఉంటాడు. 'పశుపతి' అనేదొక మందిరం. మూర్తిపేరు పంచముఖి. అడిగేవారు లేనప్పుడే ఇలాంటి లీలలు బలపడుతుంటాయి. తీర్థవాసులు ధూర్తులు, ధనాన్ని హరించే వారుగా ఉంటారు. పర్వత నివాసులు అలాంటి వారు కారు. అక్కడి భూమి మిక్కిలి రమణీయమైనది. పవిత్రమైనది కూడా.

తీర్థనామ విమర్శ

ప్రశ్న:– వింధ్యాచలంలో వింధ్యేశ్వరీ కాళీ అష్టభుజాలుకలిగి ప్రత్యక్ష సత్యమై ఉన్నది. వింధ్యేశ్వరి మూడు సమయాలకు మూడు రూపాలను మారుస్తుంటుంది. ఆమె ఆవరణలోనికి ఒక్క ఈగ కూడా రాదు.

ప్రయాగ తీర్థరాజం. అక్కడ శిరాన్ని ముండనం చేయించుకొంటే సిద్ధి కలుగుతుంది. గంగా యమునల సంగమంలో స్నానంచేసిన ఇష్టసిద్ధి కలుగుతుంది.

అలాగే 'అయోధ్య' ఎన్నో పర్యాయాలు బస్తీతో పాటు స్వర్గానికి పోయివచ్చినది. మథురా – అన్ని తీర్థాలకంటే గొప్పది. 'బృందావనం' – లీలాస్థలం మరియు గోవర్ధనం వ్రజయాత్ర మిక్కిలి భాగ్యం వలనగాని కాదు. సూర్యగ్రహణం రోజు 'కురుక్షేత్రంలో' లక్షలాది ప్రజలు గుమిగూడుతుంటారు. ఇవి అన్నీ భ్రమలేనా?

జవాబు:- మూడు మూర్తులు ప్రత్యక్షంగా కనబడుతుంటాయి. అవి రాతి విగ్రహాలు. పూజారులు వస్త్రాభూషణాలను వాటికి ధరింపచేసి రూపాలు మారుస్తుంటారు. ఆ రూప పరివర్తనానికి కారణం వారే. ఈగలు మక్షికలు ఒక్కటి కాదు. వేలు లక్షలు మూగి ఉంటాయి. నేను నా కళ్ళతో చూసాను.

ప్రయాగలో ఎవడో మంగలి స్వయంగా లేక పూజారికి కొంత ధనమిచ్చే శిరస్సును ముండనం చేసుకోనందుకు కలుగు మహాత్మ్యాన్ని శ్లోకాలలో వ్రాసో వ్రాయించో వ్యాపకం చేసియుంటాడు. ప్రయాగలో స్నానం చేసినవారు స్వర్గానికి పోయి తిరిగి వచ్చిన వారెవ్వరూ కనిపించ రెలా? స్నానం చేసినవారందరూ ఇండ్లకే తిరిగి వెళతారు. ఇంటికి తిరిగి రానివారు స్నానం చేస్తూ నదిలో మునిగి చచ్చి మరెక్కడో జన్మించి ఉంటారు. 'మథురా-తీర్థరాజం' అని యాత్రికులను మోసంచేసి ధనం దోచుకునేవారు పెట్టినపేరు. జడపదార్థాలలో రాజు ప్రజాభావం ఎన్నడూ సంగతం కాదు.

అయోధ్యానగరి అంతా తనలో ఉన్న కుక్కలు, గాడిదెలు, పాకీవాళ్ళు, చర్మకారులు అనే వారితో మూడు సార్లు స్వర్గానికి వెళ్ళినదనటం మిక్కిలి అసంభవం. స్వర్గానికి ఎన్నడూ వెళ్ళలేదు. అది అక్కడే ఉన్నది. కాని పోపు ముఖం నుండి వెలువడే గప్పాలలో అయోధ్య స్వర్గానికి ఎగిరిపోయి ఉంటుంది. ఈ గప్పాలు శబ్దరూపంలో వాయు మండలంలో ఎగురుతుంటుంది. ఇలాగే నైమిశారణ్యం మొదలైనవారి విషయాన్ని తెలుసుకోండి.

మథుర ముల్లోకాలలో విలక్షణమేమీ కాదు. కాని అందులో మూడు జంతువులు మాత్రం మిక్కిలి లీలాధారులై ఉన్నాయి. వాటివలన జలం, స్థలం, అంతరిక్షం అనే ముల్లోకాలలలో ఎవరికీ సుఖం లభించదు. అందులో ఒక జంతువు చౌబే (పండా) ఎవడైనా నదిలో స్నానం చేయబోతే వానిని నిలబెట్టి 'యజమానుడా! తే ముందు పన్ను చెల్లించు' అని వారి దగ్గర నుండి దొరికినది వసూలు చేస్తారు. "భంగు, మిర్చి, లడ్లు తిని, త్రాగి, యజమానికి జయం పలుకుదుము" అంటారు. ఇక రెండవ జంతువు యమునలోని కూర్మం-తాబేలు. నీటిలో దిగినవారిని అవి కరవక మానవు. వాటివలన ఘట్టం-రేవులో స్నానం చేయటం దుష్కరం. ఇక మూడవ జంతువు ఎర్రని ముఖంగల కోతులు. అవి యాత్రికుల తలపాగలు, టోపీలు, స్త్రీల దేహంపై ఉండే నగలు, కాలి చెప్పులు వేటినీ వదలవు, కరవటానికి వెనుకాడవు. త్రోసి క్రింద పడవేస్తాయి. వీనిబాధలు వర్ణనాతీతములు.

వీటిని పోపులు, పోపుల శిష్యులు పూజిస్తుంటారు. మణుగుల కొద్ది సెనగలు కూర్మాలకు, బెల్లంతో సిద్ధంచేసిన సెనగలు కోతులకు, చౌబేళ్ళకు లడ్లు సమర్పించి ఈ జంతువులకు సేవలు చేస్తుంటారు.

బృందావనం ఎప్పుడో ఒకప్పుడు బృందావనంగా ఉన్నదేమో కాని, ఇప్పుడు అది వేశ్యావనంలాగా లల్లా, లల్లీ, గురువు శిష్యురాలు మొదలైన వారి లీలలు వ్యాపించి ఉన్నాయి. అలాగే దీపమాలిక ఉత్సవంలో, గోవర్ధన, వ్రజయాత్రలలో పోపులు వారి ప్రయోజనం సిద్ధింప చేసుకొంటారు.

కురుక్షేత్రంలోని జీవికకు సంబంధించిన లీలయే తెలుసుకొనతగినది. వీరిలో ఎవరో ధార్మికుడు, పరోపకారియైన పురుషుడు మాత్రం పోపుల లీలలనుండి తప్పుకో కలుగుతాడు.

మూర్తిపూజ - తీర్థాలు

ప్రశ్న:- ఈ మూర్తిపూజ మరియు తీర్థాలు సనాతనంగా ప్రచారంలో ఉన్నాయి. అవి అసత్యాలెందుకవుతాయి?

జవాబు:- మీరు సనాతనం అని దేని నంటున్నారు? సృష్టి ఆరంభం నుండి వస్తున్నది అని మీ అభిప్రాయం అయితే వేదాలలోని ఋషికృత బ్రాహ్మణ గ్రంథాలలో వీటి నామాలైనా ఏల కనిపించవు? మూర్తిపూజ రెండున్నర, మూడువేల సంవత్సరాలనుండి వామమార్గుల వలన, జైనుల వలన ఆరంభించబడింది. అంతకు పూర్వం ఆర్యావర్తంలో మూర్తిపూజ లేదు.

ఈ తీర్థాలు లేవు. గిరినార్, పాలిటానా శిఖరశత్రుంజయ్, ఆబూ మొదలైన తీర్థస్థానాలను ప్రారంభించిన తర్వాత వామమార్గులు పోపులు తీర్థాలను ఏర్పరిచారు. వీరి ఆరంభాన్ని పరీక్షించ గోరువారు పండాల ప్రాచీన బహీఖాతా పుస్తకాలు, రాగిపత్రాలు చూసినవారికి సత్యం తెలుస్తుంది. తీర్థం ఐదువందలు లేక సహస్ర వర్షాల నుండి ప్రారంభించినట్లు తెలుస్తున్నాయి. కావున అవి సనాతనాలు కావు. ఆధునికాలే.

ప్రశ్న:- 'తీర్థమాహాత్మ్యాలు, నామమహత్త్వం' అంటే 'అన్యక్షేత్రే కృతం పాపం కాశీక్షేత్రే వినశ్యతి' అనేటటువంటి విషయాలు సత్యాలా కావా?

జవాబు:- కావు. ఎందుకంటే పాపాలు నశిస్తే దరిద్రులకు ధనం, రాజ్యం, అంధులకు కన్నులు రావాలి. కుష్టురోగుల కుష్ఠువ్యాధి పోవాలి. అలా ఎక్కడా జరగటంలేదు. కావున ఎవరికీ పాపపుణ్యాలు తీర్థసేవనంలో నశించవు.

ప్రశ్న:- **2. గంగా గంగేతి యో బ్రూయాద్యోజనానాం శతైరపి ।**
ముచ్యతే సర్వపాపేభ్యో విష్ణులోకం స గచ్ఛతి ॥ బ్రహ్మపురాణం. అ. 17582 ॥

వందల, వేల క్రోసుల దూరం నుండి గంగా గంగా అని అంటే చాలు అతని పాపాలు నశిస్తాయి. వైకుంఠానికీ పోతాడు.

2. హరిర్ హరతి పాపాని హరి రిత్యక్షర ద్వయమ్ ॥ పద్మపురాణం అ. 72-12 ॥

'హరి' అనే రెండక్షరాల నామం పలికితే అది సర్వ పాపాలను హరిస్తుంది. అలాగే రామ, కృష్ణ, శివ, భగవతీ నామాల మాహాత్మ్యం వ్రాయబడి ఉన్నది.

3. ప్రాతః కాలే శివం దృష్ట్వా నిశి పాపం వినశ్యతి ।
అజన్మ కృతం మధ్యాహ్నే సాయాహ్నే సప్తజన్మనామ్ ॥ తీర్థదర్పణం. పరిచ్ఛే. 2 ॥

ఏ మానవుడు ప్రాతఃకాలంలో శివులింగాన్ని దర్శించిన రాత్రి వేలలో చేసిన పాపాలు, మధ్యాహ్నం దర్శించిన పుట్టిన రోజు నుండి చేసిన పాపాలు, సాయంకాలం దర్శనం చేసుకొన్న ఏడు జన్మలలో చేసిన పాపాలు నశిస్తాయి. ఇది దర్శన మాహాత్మ్యం. ఇవి అన్నీ అబద్ధాలేనా?

జవాబు:- ఇవి అన్నీ భ్రమ అనటంలో సందేహమేమున్నది? గంగా గంగా, హరేరామ హరేకృష్ణ, శివ, భగవతీ మొదలైన నామస్మరణల వల్ల పాపాలెన్నడూ నశించవు. అలా నశిస్తే లోకంలో ఎవ్వరూ దుఃఖితులే ఉండరు. పాపం చేయటానికి ఎవ్వరూ భయపడరు. ప్రస్తుతం పోపు లీలల వల్లే పాపాలెక్కువవుతున్నాయి. పాపం చేసినా తీర్థ స్నానాల వలన అవి నశిస్తాయని మూఢులు విశ్వసిస్తున్నారు. ఈ విశ్వాసంతోనే ఈ లోకంలో పాపాలు చేసి ఇహపరాలను నాశనం చేసుకొంటున్నారు. కాని, చేసిన పాపం భోగించక తప్పదు.

ప్రశ్న:- అయిన, సత్యమైన నామస్మరణం కాని, తీర్థంకాని ఏదైనా ఉన్నదా? లేదా?

జవాబు:- ఉన్నది. వేదాది సత్య శాస్త్రాలను పఠించి - పఠింపజేయటం. ధార్మిక విద్వాంసుల సాంగత్యం, పరోపకారం, ధర్మానుష్ఠానం, యోగాభ్యాసం, నిర్వైరం, నిష్కపటం, సత్యభాషణం, సత్యాన్నే అంగీకరించటం. సత్యమాచరించటం, బ్రహ్మచర్యం ఆచార్యుల, అతిథుల, మాతాపితలను సేవించటం పరమేశ్వరుని స్తుతించి, ప్రార్థించి, ఉపాసించటం, శాంతి, జితేంద్రియత్వం, సుశీలత్వం, ధర్మయుక్త పురుషార్థాలను ఆచరించటం, జ్ఞాన, విజ్ఞానాది శుభ గుణ, కర్మలు దుఃఖం నుండి తరింపజేసేవి అవటం వలన ఇవి తీర్థాలనబడతాయి. జల, స్థలాలు ఎన్నడూ తీర్థాలు కావు. కారణమేమంటే - **"జనా యైస్తరన్తి తాని తీర్థాని"** జనులు ఏ దుఃఖాల నుండి తరిస్తారో అవి తీర్థాలు. జలస్థలాలు తరింపచేయకపోగా ముంచి చంపేస్తాయి. నౌకలు మొదలైన వాటిని తీర్థాలని చెప్పినా దోషం లేదు. ఎందుకంటే వాటివలన మానవులు సముద్రాలు, నదులు దాట కలుగుతారు.

అష్టా. 4. పా. 4-103 ॥

సమాన తీర్థే వాసీ ॥

యజు. అ. 16 మం. 42 ॥

నమస్తీర్థ్యాయచ ॥

ఒక ఆచార్యుని వద్ద ఒక శాస్త్రాన్ని చదువు బ్రహ్మచారులు సతీర్థులు - సమాన తీర్థాన్ని సేవించేవారవుతున్నారు.

వేదాది శాస్త్రాలలో, సత్యభాషణాది ధర్మలక్షణాలలో సాధువులైన వారికి అన్నం మొదలైన పదార్థాల నిచ్చి వారినుండి విద్యలను గ్రహించటం తీర్థం అనబడుతుంది.

యజు. అ. 32 మం. 3 ॥

యస్య నామ మహద్యశః ॥

పరమేశ్వరుని నామం మిక్కిలి యశస్సు - అంటే ధర్మయుక్త కర్మలను ఆచరించటం. ఎలాగంటే.- బ్రహ్మం, పరమేశ్వరుడు, ఈశ్వరుడు, న్యాయకారి, దయాళువు, సర్వశక్తిమంతుడు మొదలైనవి గుణ కర్మ స్వభావాలను తెలుపు నామాలు. బ్రహ్మం అన్నింటికంటే గొప్పవాడు, **పరమేశ్వరుడు** = ఈశ్వరులకు ఈశ్వరుడు, **ఈశ్వరుడు** = సామర్థ్యయుక్తుడు, **న్యాయకారి** = ఎన్నడూ అన్యాయం చేయనివాడు, **దయాళువు** = అందరిపై కృపా దృష్టి ఉంచేవాడు, **సర్వశక్తిమంతుడు** = తన సామర్థ్యంతోనే ఉత్పత్తి స్థితి లయను జగత్తుకు చేసేవాడు. ఇందులో ఎవరి సహాయాన్నీ అపేక్షించనివాడు, **బ్రహ్మ** = వివిధ జగత్పదార్థాలను నిర్మించేవాడు, **విష్ణువు** = అంతటా, అన్నింటిలో వ్యాపించి ఉండి రక్షించేవాడు, **మహాదేవుడు** = సమస్త దేవతలకు దేవుడు. **రుద్రుడు** = ప్రళయం చేసేవాడు. అనే ఇలాంటి నామార్థాలను తనలో ధారణ చేయాలి. అంటే పెద్ద పనులలో పెద్దయై, సమర్థులలో సమర్థుడై తన సామర్థ్యాలను పెంపొందించుకోవాలి. అధర్మం ఎన్నడూ చేయరాదు. అందరిపై దయ ఉంచాలి. అన్ని విధాలైన సాధనాలను సమర్థం చేసుకోవాలి. శిల్ప విద్యతో అనేక విధాలైన పదార్థాలను చేయాలి. సమస్త సంసారమునందును తన ఆత్మకు తుల్యంగా సుఖదుఃఖాలను ఎంచాలి. అందరినీ రక్షించాలి. విద్వాంసులలో విద్వాంసుడు కావాలి. దుష్టకర్మలు చేసి, చేయించేవారిని ప్రయత్న పూర్వకంగా దండించాలి. సజ్జనులను రక్షించాలి.

ఇలా పరమేశ్వరుని నామాల అర్థాలను తెలుసుకొని పరమేశ్వరుని గుణకర్మ స్వభావాలకు అనుకూలంగా తన గుణకర్మ స్వభావాలను మార్చుకోవాలి. ఇదే పరమేశ్వరుని **'నామ స్మరణం'**.

గురు మహత్త్వ విమర్శనం

ప్రశ్న:- **గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।**
గురుదేవ పరం బ్రహ్మ తస్మై శ్రీగురవే నమః ॥ గురుగీత గురుమాహాత్మ్యం-16

ఇలాంటి గురు మహాత్మ్యం నిజమేనా? గురువు పాదాలు కడిగి త్రాగటం, ఎలాంటి ఆజ్ఞను ఇచ్చినా దానిని పాలించటం, గురువు లోభియైన వామన సమానుడనీ, క్రోధి అయిన నరసింహ సదృశుడనీ, మోహియైన రామునివంటి వాడనీ, కామి అయిన ఎడల కృష్ణతుల్యుడనీ గురువును భావించాలి. గురువు ఎలాంటి పాపం చేసినా శ్రద్ధను విడవకుండా ఉండాలి. సంత-గురుదర్శనానికి వెళ్ళిన ప్రతి పదంలో అశ్వమేధ ఫలం లభిస్తుంది. ఇది అంతా సత్యమా కాదా?

జవాబు:- సరైనవి కావు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వర పేర్లు పరమేశ్వరునివి. గురువు పరమేశ్వరుని తుల్యుడెన్నడూ కాలేడు. గురుమహాత్మ్యం, గురుగీత కూడా పోపులీలయే. తల్లిదండ్రులు, ఆచార్యుడు, అతిథి గురువులవుతారు. వారిని సేవించాలి. వారినుండి విద్య, శిక్షణ గ్రహించాలి. పరస్పరం ఒకరి నుండి ఒకరు మంచి విషయాలను ఇచ్చి పుచ్చుకోవటాలు గురుశిష్యులు చేసుకోవాలి.

కాని, గురువు లోభి, మోహి, క్రోధి, కామియైన అతనిని విడిచిపెట్టాలి. చేతనైతే దండించాలి. సాధారణ శిక్షవలన అంగీరించకుంటే కొట్టటం, దండిచటం, ప్రాణాలు హరించేవరకు దండించిన దోషం లేదు.

విద్యా సద్గుణాలలో గురుత్వం లేనివారై, కంఠంలో మాలలు, నుదుట తిలకం ధరించటం, వేదవిరుద్ధ ధర్మోపదేశం చేయటం మొదలైనవి చేసేవారు గురువులే కారు. వారు గొర్రెల కాపరుల వంటివారు. గొర్రెల కాపరులు గొర్రెల నుండి మేకల నుండి పాలు తీసుకొని ప్రయోజనాన్ని పొందుతారు. అలాగే వీరు కూడా శిష్యులనుండీ, శిష్యురాండ్ర నుండీ ధనాదులు సంపాదించుకొని తమ ప్రయోజనాలను సిద్ధం చేసుకొంటారు.

దోహా: గురులోభీ చేలా లాలచీ దోనోం ఖేలే దావ్ ।
భవసాగర్‌మే దూబతే, బైఠ్ పత్థర్ కీ నావ్ ॥

శిష్యులు ఏదో కొంచెం మాకు ఇయ్యకపోరు అని గురువు 'కానిమ్ము గురువు అబద్ధపు ఒట్లు పెట్టించటానికి పాపాలు విడిపించటానికి పనికివస్తాడు. నష్టం ఏమున్నది? అని శిష్యుడు భావిస్తాడు. ఇలా ఇరువురూ గురువు శిష్యుడు ఏదో ఒక లోభబుద్ధితో ఒకరినొకరు మోసంచేసుకుంటూ భవసాగరంలో దుఖాలలో మునుగుతారు. రాతినావపై కూర్చొని సముద్రాన్ని దాటాలనుకునేవారు మునిగేటట్లు వీరు కూడా మునుగుతారు.

ఇలాంటి గురుశిష్యుల ముఖాల మీద మన్ను బూడిద పోయాలి. వారిదగ్గర ఎవరు నిలువరాదు. వారి చెంత ఉండేవారు దుఃఖసాగరంలో పడతారు. ఎలాంటి పోపులీలలను పూజారులు పౌరాణికులు నడిపారో అలాంటి లీలలనే ఈ గొల్లల వంటి మూర్ఖగురువులు కూడా నడిపించారు. ఇది అంతా స్వార్థపరులైన వారి పనే. పరమార్థాన్ని అభిలషించేవారు స్వయంగా దుఃఖాలను అనుభవించి లోకానికి ఉపకారం చేయటం మానరు. గురుమాహాత్మ్యం గురుగీత మొదలైన పుస్తకాలు కూడా లోభులు కుకర్ములునయిన ఈ గురువులతో రచింపబడినవే.

పురాణ కర్తలెవరు?

ప్రశ్న:- **1. అష్టాదశ పురాణానాం కర్తా సత్యవతీ సుతః ॥** మహా. భా. ఆ. 1267 ॥

అష్టాదశ పురాణాలకు కర్త వ్యాసుడే. వ్యాసుని వచనం తప్పక ప్రమాణంగా అంగీకరించాలి.

2. ఇతిహాస పురాణాభ్యాం వేదార్థ ముపబృంహయేత్ ॥ మహా. భా. ॥

ఇతిహాస = మహాభారతం నుండే అష్టాదశ పురాణాల నుండే వేదార్థాలను చదవాలి. చదివించాలి. ఎందుకంటే ఇతిహాస పురాణాలు వేదార్థాలకు అనుకూలంగానే ఉన్నాయి.

3. పురాణాన్యఖిలాని చ ॥ మను. అ.3. శ్లో. 232 ॥

పితృకర్మలలో పురాణం హరివంశపు కథ వనండి.

4. ఇతిహాసపురాణః పంచమో వేదనాం వేదః ॥ ఛాం. ప్ర. 2 - ఖం. 1 ॥

ఇతిహాస పురాణాలు పంచమ వేదాలని చెప్పబడుతున్నాయి.

5. దశమేఽహని కించిత్పురాణ మా చక్షీత ॥ శతపథ. 13-4-3-13

అశ్వమేధ యాగ సమాప్తిలో పదవ రోజున కొంచెం పురాణకథ వినాలి.

6. పురాణ విద్యా వేదః ॥ సూత్రమ్ ॥

పురాణ విద్య వేదార్థాన్ని తెలుపటం వలననే వేదం అనబడుతుంది.

ఇలాంటి ప్రమాణాల వలన పురాణాల ప్రమాణం. వీటి ప్రమాణాల వలన మూర్తి పూజ, తీర్థాలు ప్రామాణికాలని తెలుస్తున్నాయి. పురాణాలలో మూర్తిపూజ, తీర్థాలు విధించబడి ఉన్నాయి.

జవాబు:- వ్యాసుడు 18 పురాణాలకు కర్తై ఉంటే వాటిలో ఇలాంటి గప్పాలు ఉండవు. ఎందుకంటే వ్యాసుడు వ్రాసిన శారీరిక సూత్రాలు యోగశాస్త్రంపై వ్రాసిన భాష్యం మొదలైన గ్రంథాలను చూసిన వ్యాసుడు గొప్ప విద్వాంసుడనీ, సత్యవాది, ధార్మికుడనీ, యోగి అనీ విదిమతువుతన్నది.

అలాంటివారు భ్రమతో కూడిన కథలను ఎన్నడూ వ్రాయరు. అందువలన సాంప్రదాయకులు పరస్పర విరోధాలైన భాగవతాది నవీన పురాణాలను కపోల కల్పితాలైన గ్రంథాలను రచించారనీ వాటిలో వ్యాసుని గుణలేశాలు కూడా లేవనీ స్పష్టమవుతున్నది. వేదశాస్త్రాలను విరోధించే స్వార్థపరులు, అవిద్వాంసులైన వారే ఇలాంటి పని చేస్తారు.

ఇతిహాసం, పురాణం అనే నామాలు శివపురాణాదులవి కావు.

"బ్రాహ్మణానీతిహాసాన్ పురాణాని కల్పాన్ గాథా నారాశంసీరితి" (ఇది బ్రాహ్మణం, సూత్రవచనం)

ఐతరేయ, శతపథ, సామ, గోపథ, బ్రాహ్మణ గ్రంథాలకే ఇతిహాసం, పురాణం, కల్పం, గాథా, నారాశంసీ అని ఐదు పేర్లు ఉన్నాయి. **ఇతిహాసం** = జనకయాజ్ఞవల్క్యుల సంవాదం మొదలైనవి, **పురాణం** = జగదుత్పత్తి మొదలైన వాటి వర్ణన,**కల్పం** = వేదశబ్దాల సామర్థ్య వర్ణనం - అర్థనిరూపణం చేయటం, **గాథా** = కొండొకని దృష్టాంతదార్ష్టాంత రూప కథా ప్రసంగాన్ని చెప్పటం, **నారాశంసీ** = మానవులకు సంబంధించిన ప్రశంసనీయాలు, అప్రశంసనీయాలైన కార్యాలను వర్ణించటం. వీటి వల్లనే వేదార్థాలు బోధపడతాయి.

'పితృకర్మ' అంటే జ్ఞానుల ప్రశంసను గురించి కొంత వినటం. అశ్వమేధ యజ్ఞాంతములోనూ ఇలాంటి ప్రశంసలను వినటం వ్రాయబడి ఉన్నది. ఎందుకంటే వ్యాసకృత గ్రంథాలు వినటం, వినిపించటం వ్యాసుని జన్మకు తర్వాతే జరిగే వీలుంటుంది. వ్యాసుని జన్మకు పూర్వము వారితో రచించబడిన గ్రంథాలు వినటం అసంభవం కదా! వ్యాసునికి పూర్వంకూడా వేదాలు వేదార్థాలు చదివి, చదివిస్తూ, విని, వినిపిస్తూ ఉండేవారే కదా! అందువలన అన్నిటికంటే ప్రాచీనాలైన బ్రాహ్మణ గ్రంథాలలోనే ఇది సంగతమవుతుంది. ఈ నవీన కపోల కల్పిత శ్రీమద్భాగవత శివపురాణాలలో ఎలా సంగతమవుతుంది? ఈ దూషిత గ్రంథాలకు ఇది వర్తించనే వర్తించదు. వీటివలన వేదార్థం ఎన్నడూ బోధపడదు.

వేదవ్యాసుడు

వ్యాసుడు వేదాలను చదివి వాటిని అర్థాలతో చదివించి ప్రచారంచేసి వ్యాపింపచేసినందుకు అతనికి వేదవ్యాసుడు అని పేరు కలిగింది. వర్తులమున గల మధ్యరేఖకు వ్యాసం అని పేరు. వ్యాసుడంటే ఋగ్వేదం మొదలుగా అథర్వవేదం సాంతం చదివినవాడని అర్థం. శుకదేవునికి, జైమినికి ఇంకా ఇతరులకూ వేదాలను చెప్పినవాడు. వ్యాసుని జన్మనామం కృష్ణద్వైపాయనుడు. వ్యాసుడు వేదాలను ప్రోగుచేసినవాడు, ఏకం చేసినవాడు అనటం సత్యంకాదు. ఎందుకంటే వ్యాసుని పిత, పితామహుడు, పరాశర, శక్తి, వసిష్ట, బ్రహ్మాదులందరూ నాలుగు వేదాలను చదివి ఉన్నారు. కాబట్టి ఇది ఎలా సంగమవుతుంది?

పురాణాల విమర్శ

ప్రశ్న:- పురాణాలలోని సమస్త విషయాలన్నీ అసత్యాలేనా? కొన్నైనా సత్యాలున్నాయా?

జవాబు:- అనేక విషయాలు అసత్యాలు. కొన్ని ఘుణాక్షర న్యాయంతో సత్యాలున్నాయి. సత్యాలైనవి వేదాది సత్యశాస్త్రాలవి. అసత్య విషయాలు ఈ పోపుల పురాణరూపమైన ఇంటి నుండి వచ్చినవి. ఎలాగంటే:- శివపురాణంలో శైవులు శివుని పరమేశ్వరునిగా అంగీకరించి, విష్ణువు, బ్రహ్మ, గణేశుడు, ఇంద్రుడు మొదలైన వారిని పరమేశ్వరుని దాసులుగా చేసినారు. వైష్ణవులు విష్ణుపురాణంలో విష్ణువును పరమాత్మగా అంగీకరించి శివుడు మొదలైన వారిని విష్ణువుకు దాసులుగా చేసారు. దేవీభాగవతంలో దేవిని పరమేశ్వరిగా, శివవిష్ణ్వాదులను ఆమె కింకరులుగా చేసారు. గణేశఖండంలో గణేశుని ఈశ్వరునిగాను, మిగిలిన వారినందరినీ అతని దాసులుగా చేసారు.

ఇదంతా సంప్రదాయకుల పని కాక మరి ఎవరిది? పురాణాలన్నీ ఒక వ్యక్తి రచించి ఉంటే ఇలాంటి పరస్పర విరుద్ధ విషయాలు వ్రాయడు. విద్వాంసుని వ్రాతలో ఎన్నడూ ఇలాంటి విషయాలు వ్రాయబడవు. వీటిలో ఒకటి సత్యమని అనుకుంటే మిగిలినవి అసత్యాలవుతాయి. రెండవ విషయాన్ని

సత్యమంటే మిగిలినవి అసత్యాలవుతాయి. మూడవ విషయాన్ని సత్యమంటే మొదటి రెండూ అసత్యాలవుతాయి.

శివపురాణ కర్తలు శివునిచేత, విష్ణుపురాణ కర్తలు విష్ణువుచేత, దేవీపురాణం వారు దేవిచేత, గణేశఖండం వారు గణేశునిచేత, సూర్యపురాణం వారు సూర్యునిచేత, వాయుపురాణం వారు వాయువు చేత సృష్టికి ఉత్పత్తి స్థితిలయాలు చేయించారు. మళ్ళీ ఒక్కొక్క జగత్కర్త అయిన దేవత మిగిలిన జగత్కర్తలను సృష్టించినట్లు వ్రాసి ఉన్నారు.

జగత్తుయొక్క సృష్టికి, స్థితికి, ప్రళయానికి కారణమైన వాడెలా పుడతాడు? పుట్టినవాడు సృష్టికర్త ఎలా అవుతాడు? అని వీరిని అడగాలి. ఏమి చెబుతారు? మౌనం వహించటం తప్ప గత్యంతరం ఏమి ఉంటుంది? మరియు ఈ సృష్టికర్తల శరీరం ఎలా పుట్టింది? తాము సృష్టిలోని పదార్థాలై పరిచ్ఛిన్నులై ప్రపంచాన్ని ఉత్పన్నం చేయటానికి కర్తలెలా కాగలరు? జగత్తు యొక్క ఉత్పత్తి విలక్షణ ప్రకారాలతో అంగీకరించారు. అది సర్వథా అసంభవం. ఎలాగంటే:-

శివ పురాణం - సృష్టి

శివపురాణంలో శివుడు 'నేను సృష్టిని సృష్టిస్తాను' అని కోరాడు. అంతటా 'నారాయణ' జలాశయాన్ని కలిగించి దాని నాభి నుండి కమలాన్ని, ఆ కమలం నుండి బ్రహ్మను సృష్టించాడు. అతడంతా జలమయమై ఉండటం చూసాడు. ఆ జలాన్ని అంజలిలోకి తీసుకొని చూసి మరల జలంలో పోసాడు. దానినుండి ఒక బుడగ లేచింది. ఆ బుడగ నుండి ఒక పురుషుడు (విష్ణువు) ఉత్పన్నమయ్యాడు. అతడు బ్రహ్మతో 'ఓ పుత్ర ! సృష్టిని ఉత్పన్నం చేయుము' అన్నాడు. అంతలోనే బ్రహ్మ 'నేను నీ పుత్రుడ్ని కాను, నీవే నా పుత్రుడవు' అన్నాడు. అంతలోనే ఆ ఇద్దరిలో వివాదం కలిగింది. సహస్ర దివ్యవర్షాల పర్యంతం వారిద్దరూ జలం మీద పోట్లాడారు.

అప్పుడు మహాదేవుడు 'సృష్టిని చేయటానికి నేను పంపిన వారిద్దరూ పరస్పరం పోట్లాడుతున్నారు' అని విచారించాడు. అంతలో ఆ పోట్లాడే వారి మధ్య తేజోమయ లింగం ఉత్పన్నమయ్యింది. అది శీఘ్రంగా ఆకాశానికి పెరిగిపోయింది. దానిని చూసి వారిద్దరూ ఆశ్చర్యపోయారు. దీని ఆద్యంతాలు కనుగొనాలని ఆలోచించారు. దీని ఆద్యంతాలను కనుగొని ముందువచ్చేవాడు తండ్రి అనీ, ఆలస్యంగా వచ్చేవాడు లేదా కనుగొనలేనివాడు పుత్రుడనీ అంగీకరించి నిశ్చయించుకొన్నారు.

విష్ణువు కూర్మ రూపం ధరించి క్రింది వైపుకు; బ్రహ్మ హంసరూపం ధరించి ఆకాశం వైపుకు పోయారు. ఇద్దరూ మనోవేగంతో దివ్యసహస్రవర్ష పర్యంతం వెళుతూనే ఉన్నారు. కాని దాని ఆద్యంతాలు దొరకవు కదా. అప్పుడు క్రింది నుండి పైకి విష్ణువు, పైనుండి క్రిందికి బ్రహ్మ వచ్చారు. దారిలో బ్రహ్మ 'అతడంతం కనుగొని వచ్చిన నేను పుత్రుడిని కావలసి యుండునని' అని ఆలోచిస్తుండగా పై

నుండి ఒక గోవు, ఒక మొగలి వృక్షం క్రిందికి దిగివస్తూ కనిపించాయి. బ్రహ్మ వానిని ఇట్లా అడిగాడు, 'మీరెక్కడ నుండి వస్తున్నారు?' వారు 'మేము సహస్ర వర్షాల నుండి ఈ లింగం ఆధారంతో వస్తున్నాము' అన్నారు. అలా బ్రహ్మ 'ఈ లింగానికి అంతం ఉన్నదా? లేదా?' అని అడిగాడు. వారు లేదన్నారు.

అప్పుడు బ్రహ్మ వారితో ఇలా అన్నాడు. 'మీరు నాతో రండి. నేను ఈ లింగం శిరస్సు మీద దుగ్ధధార ప్రవహింపజేశాను' అని గోవు, 'నేను ఈ లింగంపై పుష్ప వృష్టిని కురిపించాన'ని మొగలి వృక్షాన్ని మీరిద్దరు సాక్ష్యం చెప్పండి. మీరు అలా చెప్పిన మిమ్ము మీ స్థానాలకు చేరుస్తాను". అలా వారు బ్రహ్మతో 'మేము అబద్ధపు సాక్ష్యం చెప్పము' అన్నారు. అలా బ్రహ్మ కుపితుడై 'మీరు సాక్ష్యం చెప్పకపోతే మిమ్మల్ని ఇప్పుడే భస్మం చేస్తాను' అని బెదిరించాడు. అప్పుడు వారిద్దరూ భయపడి 'నీవు చెప్పినట్లే సాక్ష్యం ఇస్తా' మని అంగీకరించారు. తర్వాత ముగ్గురూ క్రిందికి దిగివచ్చారు.

విష్ణువు ముందుగానే వచ్చి ఉన్నాడు. ఇప్పుడు బ్రహ్మ కూడా చేరాడు. చేరి 'నీవు క్రింది అంతు కనుగొని వచ్చావా' అని విష్ణువు నడిగాడు. అలా విష్ణువు 'నాకు దీని అంతు దొరకలేదు' అన్నాడు. 'నేను పై అంతాన్ని చూసి వచ్చాను' అని బ్రహ్మ చెప్పగా 'ఇందుకు సాక్ష్యమేమి?' అని విష్ణువు అడిగాడు. అప్పుడు గోవు, వృక్షం రెండూ లింగంపైన మేమున్నాము' అని సాక్ష్యం చెప్పాయి. అప్పుడు ఆ లింగం నుండి శబ్దం ఒకటి వినపడింది. 'నీవు అబద్ధం చెప్పావు కాబట్టి నీ పువ్వులు నా మీద గానీ, మరి ఏ దేవత మీదగాని ఉంచబడవు. ఎవరైనా అర్పించిన వారు నశిస్తారు' అని వృక్షాన్ని, 'నీవు ఏ ముఖంతో అబద్ధం చెప్పావో ఆ ముఖంతో మలాన్ని తింటావు. నీ ముఖాన్ని ఎవరు పూజించరు. నీ తోకను పూజిస్తారు' అని గోవును, 'అబద్ధం చెప్పావు కాబట్టి ఈ లోకంలో నిన్నెవ్వరూ పూజించరు' అని బ్రహ్మను శపించాడు. విష్ణువుకు 'నీవు సత్యం చెప్పావు. కాబట్టి నిన్ను అంతటా పూజిస్తారు" అని వరమిచ్చాడు.

తర్వాత బ్రహ్మ, విష్ణువు లిద్దరూ లింగాన్ని స్తుతించారు. దానితో ప్రసన్నుడై ఆ లింగం నుండి ఒక జటాజూట మూర్తి బయటికి వచ్చింది. "మిమ్మల్ని సృష్టిచేయడానికి పంపాను. ఎలా పోట్లాడుతున్నారు?' అని జటాజూటమూర్తి అడుగగా "బ్రహ్మ, విష్ణువు లిద్దరూ మేము ముడిసరుకు లేకుండా ఎలా సృష్టిని చేయగలం?" అన్నారు. అంతటా మహాదేవుడు తన జట నుండి ఒక భస్మపు ముద్దను తీసి వారికి ఇచ్చి "వెళ్ళండి. దీనినుండి సమస్త సృష్టిని చేయండి" అని ఉపదేశించారు. (ఇది శివుని సృష్టి.)

ఆహా! ఎంత బాగున్నది? ఈ పురాణాలను నిర్మించినవారిని అడగాలి. అయ్యా! సృష్టికి పూర్వం సృష్టితత్త్వాలు పంచమహాభూతాలు లేని సమయంలో బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుల శరీరాలు, లింగం, గోవు, మొగలి వృక్షం, భస్మపు ఉండ ఇవన్నీ ఎటునుండి వచ్చాయి? మీ తాతగారి ఇంటి నుండి సృష్టించబడి పంపబడ్డాయా?"

భాగవత పురాణ సృష్టి

శివపురాణంలో వలెనే భాగవతంలోనూ విష్ణువు నాభినుండి కమలం, ఆ కమలం నుండి బ్రహ్మ, బ్రహ్మ దక్షిణ పాదం నుండి స్వాయంభువుడు. వామపాదం నుండి శతరూపా రాణి, లలాటం నుండి రుద్రుడు, మరీచి మొదలైన దశపుత్రులు, వారినుండి పదిమంది ప్రజాపతులు, వారికి పదమూడు పుత్రికలు, వారికి కశ్యపునితో వివాహం, వారిలో దితి నుండి దైత్యులు, దనువునుండి దానవులు, అదితి నుండి ఆదిత్యులు, వినత నుండి పక్షులు, కద్రువ నుండి పాములు, సరమా నుండి కుక్కలు, నక్కలు మొదలైనవి, ఇతర స్త్రీల నుండి ఏనుగులు, గుర్రాలు, ఒంటెలు, గాడిదెలు, గేదెలు, గడ్డిగాదం, తుమ్మలు మొదలైన కంటక వృక్షాలు పుట్టాయి.

వహ్వారే! వహ్వా! ఈ భాగవతకర్త బుద్ధికుశలాన్నేమనాలి? అరేభాయీ! ఇలాంటి అసత్య విషయాలను వ్రాయటంలో కొంచెం సిగ్గు బిడియమైనా కలుగలేదా? పూర్తిగా కన్నులు మూతపడ్డాయా? గ్రుడ్డివాడవైనావా? స్త్రీ పురుషుల రజోవీర్య సంయోగం వలన మానవుని శరీరం ఏర్పడుతుంది. అంతేకాదు, పరమేశ్వరుని సృష్టిక్రమానికి విరుద్ధంగా పశువులు, పక్షులు, సర్పాలు ఎలా పుడతాయి? ఎన్నడూ పుట్టవు. ఏనుగు, ఒంటె, సింహం, కుక్క, గాడిద, వృక్షాలను స్త్రీ గర్భాశయంలో ఎలా ఉండగలవు? సింహం మొదలైన క్రూర జంతువులు పుట్టి తల్లితండ్రులను తిని వేయలేదా? మానవ శరీరం నుండి పశువులు, పక్షులు, వృక్షాలు పుట్టటం ఎలా సంభవమవుతుంది?

వీరితో వ్రాయబడిన ఇలాంటి మిక్కిలి అసంభవ విషయాలకు సంబంధించిన లీలలు నేటికీ మానవ లోకాన్ని భ్రమలో ఉంచుతున్నది. ఇది ఎంతటి దుఃఖకర విషయం! ఈ పచ్చి అబద్ధాలను అంధులైన పోపులు, అంతకంటే కన్నులుండీ చూడని వారి శిష్యులు నేటికీ చదివి-చదివించి, విని-వినిపిస్తున్నారు. ఇంతకంటే ఆశ్చర్యమేముంటుంది? వీరు మనుషులా? లేక ఇంకెవరైనానా? ఈ భాగవతాలను రచించేవారు గర్భంలో లేదా పుట్టినప్పుడు ఎందుకు మరణించలేదు? లేదా పుట్టిన క్షణంలోనైనా ఎందుకు మరణించలేదు? ఎందుకంటే మరణించిన ఈ పోపుల నుండి తప్పించుకొని ఆర్యావర్త దేశం దుఃఖాల నుండి రక్షింపబడేది.

ప్రశ్న:- ఈ విషయాలలో విరోధం లేదు. ఎందుకంటే "ఎవరి వివాహం జరుగుతుందో వారి గీతాలు పాడబడతాయి అన్నట్లు విష్ణువును స్తుతించాలనప్పుడు అతన్ని పరమేశ్వరుడనీ మిగిలిన వారిని దాసులనీ అలాగే శివుని స్తుతించాలన్నప్పుడు అతడు పరమేశ్వరుడు మిగిలినవారు అతని దాసులేనని స్తుతించటంలో దోషమేమున్నది?

పరమేశ్వరుని మాయలో అన్నియు జరుగవచ్చును. మనుష్యుల నుండి పశ్వాదును, పశ్వాదుల నుండి మనుష్యలనుత్పత్తి పరమేశ్వరుడు చేయగలడు. చూడుడు! కారణం లేకపోయినా సృష్టినంతయు చేసాడు. అతనితో ఘటితం- కానిది ఏమున్నది? ఏమి చేయాలన్నా చేయగలడు.

జవాబు:- ఓ అమాయకులారా! వివాహానికి పాటలు పాడువా రతని సందరి కంటే గొప్పచేసి మిగిలినవారిని చిన్నలను చేయుటగాని, నిందించుటగాని, అతని అందరి తండ్రిని గాని చేయరు కదా?

'పోపుగారూ! చెప్పండి. నీవు భట్టువా? వందిమాగధులు చారణులు అను వారికంటే ఎక్కువ గొప్పలు గొట్టువాడవా? కాదా? ఎవరివెంట పడితే వారినే అందరకంటె గొప్పచేస్తావా? ఎవరితోనైనా విరోధం కలిగితే వారి నందరికంటే నీచుడు నొనరింతువా? అవును. నీకు సత్యా అసత్యాలతో ధర్మంతో ఏమి ప్రయోజనం ఉంది? ఛలకపటాలుగల మానవునిలో మాయ ఉండును. అట్టివారినే మాయావి అంటారు. పరమేశ్వరునిలో ఛలకపటాలు ఉండవు. కాబట్టి మాయావి అని అతని ననరు. అది సృష్టిలో కశ్యపున కతనిపత్నులలో పశుపక్షులు జన్మించిన నేడు ఎందుకు పుట్టడం లేదు? కాబట్టి పూర్వ మెట్లు సృష్టిక్రమం వ్రాసియుంటిమో అదియే సరియైనది.

పోపున కీ క్రింది వాక్యం వల్లనే భ్రమకలిగి దారితప్పి ఉండవచ్చు నని అనుమానించవలసి వస్తుంది. 'తస్మాత్ కాశ్యప్య ఇమాః ప్రజాః (శ. 7.5.1.5). అని శతపథవాక్యం. ఈ సృష్టి అంతా కశ్యపునితో చేయబడినది. **కశ్యపః కస్మాత్ పశ్యకో భవతీతి,** (నిరు) సృష్టికర్త అయిన పరమేశ్వరునకు కశ్యపుడని పేరు. కారణమేమన! అతడు పశ్యకుడు. **'పశ్యతీతి పశ్యః ఏవ పశ్యకః".** భ్రమరహితుడై చరాచరాత్మక జగత్తును, జీవులను వారి కర్మలను సకలవిద్యలను ఉన్నవి ఉన్నట్లు చూస్తాడు. తెలుసుకొంటాడు. కాబట్టి పరమేశ్వరుడు పశ్యకుడనబడును. కశ్యపుడు పశ్యకుడు ఎట్లవుతాడు? మహాభాష్యకర్త **'ఆద్యన్త విపర్యయశ్చ'** వాక్యం వల్ల 'కశ్యప' శబ్దంలోని ఆది 'క' అంతానికి, అంతిమ 'ప' వర్ణం ముందుకు మార్చితే కశ్యపుడు- పశ్యకు డవుతాడు. పాపము పోపు కీయర్థం తెలియక చెంబెడు భంగు పొట్టకెక్కించి సృష్టివిరుద్ధంగా వ్రాయటం, చెప్పటంలో తన జన్మను నష్టం చేసుకొన్నాడు.

మార్కండేయపురాణం- రక్తబీజుడు

మార్కండేయ పురాణపు దుర్గాపాఠంలో దేవి శరీరం నుండి తేజస్సు వచ్చి ఒక్క దేవి అవుతుంది. ఆమె 'మహిషాసురు'ని చంపును. రక్తబీజుని శీరరం నుండి రక్తబిందువు భూమిపై బడి అందులో నుండి రక్తబీజుని సదృశుడు మరొక్కడు పుట్టుట, ఇట్లే జగత్తంతయు రక్తబీజునితో నిండి పోయి రక్తపు టేర్లు ప్రవహించుట జరుగుతుంది అని గొప్పలనెన్నో వ్రాయబడినవి.

రక్తబీజునితో జగత్తంతయు నిండిపోయినపుడు దేవి, ఆమె సింహం, సేన అందరు ఎక్కడుండిరి? రక్తబీజులు దేవికి దూరదూరంగా ఉన్నారందురేని జగత్తంతయు రక్తబీజునితో నిండిపోయిన బశు వులు, మనుష్యులు, పక్షులు మున్నగు ప్రాణులు ఎక్కడ ఉండెను? జలజంతువులు మత్స్యములు, మొసళ్ళు మున్నగునవి ఎక్కడుండెను? వనస్పతి మున్నగు వృక్షములేమాయెను? ఇవి అన్నీ దుర్గాపాఠము

రచించువాని ఇంటిలో దాగుకొనినవా? చూడుడు ఎంతటి అసంభవమైన గప్పాలు కొట్టినాడో ఈ మహానుభావుడు. భంగు త్రాగి దానివల్ల కలిగిన మత్తు ప్రవాహంలో ఓలలాడుచు వ్రాసి ఉండెను.

భాగవత సమాలోచన

ఇక శ్రీమద్ భాగవత మని చెప్పబడు దానిలీలలు వినండి! బ్రహ్మకు నారాయణుడు **'చతుఃశ్లోకి భాగవతం'** ఉపదేశించాడు.

"జ్ఞానం పరమగుహ్యం మే యద్విజ్ఞానసమన్వితమ్
స రహస్యం తదరగంచ గృహాణ గదితం మయా." ॥ – భాగవతము. 2.9-30

ఓ బ్రహ్మ! నీవు ఆ పరమగుహ్యమైన జ్ఞానవిజ్ఞానాలతో రహస్యంతోనూ కూడిన ధర్మార్థకామ మోక్షాల కంగమైన దానిని నా నుండి గ్రహించుము.

సమీక్ష :- విజ్ఞానయుక్త జ్ఞాన మని చెప్పిన తదుపరి జ్ఞానశబ్దంను పరమశ్రేష్ఠపద విశేషణం చేర్చుట వ్యర్థం. గుహ్య విశేషణ ముండుట వల్ల రహస్య శబ్ద ప్రయోగం పునరుక్తదోష మవుతుంది. ఇట్లు మూలశ్లోకమే అనర్థకమైన అన్యగ్రంథాలలో అనర్థకాలకు కొరత ఏముండును? భాగవతానికి మూలమే అబద్ధమైనప్పుడు వృక్షమేల అబద్ధం కాదు?

"భవాన్ కల్పవికల్పేషున విముహ్యతి కర్హిచిత్" (భాగవతం. 10.13.14)

'నీవు కల్ప = సృష్టిలోను, వికల్ప = ప్రళయంలో ఎన్నడు మోహం పొందవు" అని ఇట్లా వ్రాసి దశమస్కంధంలోనే "మోహితుడవై వత్సహరణమును జేసితివి' అని ఉన్నది. ఈ రెండు విషయాలలో ఒకటి సత్యం, మరొకటి అసత్యం కావాలి. ఇట్లా రెండు అసత్యం అవుతున్నవి.

జయ విజయులకు శాపం

వైకుంఠలో రాగద్వేషాలు, ఈర్ష్య, క్రోధం, దుఃఖం ఉండవు. వైకుంఠద్వారములో సవకాదులకు క్రోధం ఎట్లు వచ్చింది? క్రోధం కలిగినచో అది స్వర్గం- వైకుంఠం ఎట్లగను? కానేకాదు. అప్పుడు జయవిజయులు ద్వారపాలకులుగా ఉండిరి. వారికి స్వామిఆజ్ఞ తప్పక పాలింపదిగనది. వారు సనకాదులను అడ్డగించారు. ఇందులో అపరాధం ఏమున్నది? అపరాధం చేయనివారికి శాపం తగులదు. 'మీరు పృథివిపై పడిపొండు, అను శాపము వారికి తగిలినది అనగా ఏమి సిద్ధించినది? అక్కడ పృథివిలేదని సిద్ధమగుచున్నది. కాని ఆకాశం, వాయువ, అగ్ని, జలం ఉండియుండును. అట్టియెడల ద్వారం, మందిరం అను ఇవి దేని ఆధారమున ఉన్నవి? మరల జయవిజయులు సనకాదులను స్తుతించిరి. "స్వామీ ! మేం మళ్ళీ వైకుంఠం ఎప్పుడు వచ్చెదం?" అందుకు వారు "ప్రేమతో నారాయణుని భక్తితో భజింతురేని ఏడవ జన్మమందు; విరోధంతో భక్తి నొనరించిన మూడవ జన్మమునందును వైకుంఠానికి రాగలరు" అని పలికిరి.

సమీక్ష:- ఇందు ఆలోచింప వలసిన విషయం. జయవిజయులు నారాయణునకు సేవకులై ఉండిరి. వారికి సాహాయ్యం,రక్షణ చేయుట నారాయణుని కర్తవ్యం. తన సేవకుల నెవరైనను అపరాధం చేయకయే దండించి దు:ఖం కలిగించిన స్వామి వారిని దండింప గలరా? అలా దండింపని స్వామి సేవకులెల్లరు బాధింపబడరా? కాబట్టి నారాయణుడు జయవిజయుల ఆదరించి సనకాదులను దండింప వలసి ఉంది. వారు లోపల ప్రవేశించుటకు ఏల పట్టుపట్టారు? ఎందుకు కలహించారు? ఏల శపించిరి? జయవిజయులకు బదులు సనకాదులే పృథివై పడినట్లు దండింప వలసి ఉంది. అట్లు చేయుట నారాయణుని కర్తవ్యం న్యాయం కూడ. నారాయణుని ఇంటిలోనే ఇంత అన్యాయం ఉంటే నారాయణుని భక్తులు సేవకులైన వైష్ణవులకు ఎట్టి దుర్దశ కలుగునో ఊహించవచ్చును.

వరాహము- హిరణ్యాక్షవధ

జయవిజయులు హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులుగా పుట్టారు. వారిలో హిరణ్యాక్షుని వరాహం చంపి నది. ఆ కథ ఇలా ఉంది. 'హిరణ్యాక్షుడు పృథివిని చాపవలె చుట్టి తలక్రింద పెట్టుకొని నిద్రించాడు. విష్ణువు వరాహ రూపాన్ని ధరించి అతని శిరస్సు క్రింద ఉన్న పృథ్విని తన ముఖమున ధరించగా హిరణ్యాక్షుడు లేచారు. ఇద్దరికీ యుద్ధం జరిగింది. వరాహం హిరణ్యాక్షుని చంపినది.

సమీక్ష:- భూమి గుండ్రంగా ఉన్నదా?. లేక చాపలాగా పరచబడి ఉన్నదా? అని ఈ రచయితలను అడిగితే ఏమంటారు? ఏమీ చెప్పలేరు. పౌరాణికులు భూగోళవిద్యకు విరోధులు. హిరణ్యాక్షుడు భూమిని చూపగా చుట్టి తలక్రింద పెట్టుకొని తాను ఎక్కడ పడుకున్నాడు? వరాహం దేనిపై పరుగెత్తి తన కాళ్ళతో వచ్చింది? భూమిని తన ముఖంలో ఉంచుకొన్నపుడు వారిద్దరూ ఎక్కడ యుద్ధం చేసారు? అక్కడ ఎవరికి నిలుచుండటానికి తావు లేదు కదా? భాగవతాది పురాణాలను వ్రాసే పోపుల తలల మీద నిలబడి వరాహ హిరణ్యాక్షులిద్దరూ యుద్ధం చేసి ఉంటారేమో! కాని పోపుగారు ఎక్కడ ఉన్నాడో! ఈ వ్రాత ఎలాగుందంటే:-

ఒక అసత్యవాది (గప్పాలు గొట్టేవాని) ఇంటికి మరొక అసత్యవాది వచ్చి వారిద్దరూ మాటలాడనారంభించిన ఇలాగే అసంభవ విషయం ఒకరితో మరొకరు నిరాటంకంగా మాట్లాడతారు. ఆ మాటలకు తల తోక ఉండదు. అలాగే ఈ కథలూ ఉన్నాయి.

నృసింహుడు హిరణ్యకశ్యపుడు

ఇక హిరణ్యకశ్యపుడు, అతని కుమారుడు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు భక్తుడు. తండ్రి అతన్ని చదువుకోవటానికి బడికి పంపాడు. అలా ప్రహ్లాదుడు అధ్యాపకులతో 'నా పలకమీద 'రామరామ' అని వ్రాయండి' అన్నాడు. ఈ విషయం తండ్రికి తెలిసి 'ఓరీ! మన శత్రువును ఎలా భజిస్తున్నావురా' అని అడిగాడు. అయినా ప్రహ్లాదుడు మానలేదు. అపుడు అతని తండ్రి అతన్ని బంధించి పర్వతం

నుండి క్రిందికి పడేసారు. బావిలో వేయించారు. కాని అతని కేమీ హాని కలగలేదు. అప్పుడతడు ఒక ఇనుప స్తంభం ఎర్రగా కాల్పించి ప్రహ్లాదుని పిలిపించి 'ఓరీ! నీవు ఈ స్తంభాన్ని పట్టుకో అది నిన్ను కాల్చకుంటే నీ రాముడు సత్యవంతుడవుతాడు' అన్నాడు. ప్రహ్లాదుడు దానిని తాకటానికి వెళుతుంటే అతని మనస్సులో 'కాలునో లేదో' అనే శంక కలిగింది. నారాయణుడు ఆ సమయంలో ఆ స్తంభం మీద చిన్నచిన్న చీమలు పంక్తిలో నడుస్తున్నట్లు చేసాడు. ప్రహ్లాదుడు అది చూసి కాలదని నిశ్చయించుకొని వెంటనే వెళ్ళి దాన్ని పట్టుకొన్నాడు. ఆ స్తంభం వెంటనే పగిలి అందులో ఉండే నృసింహుడు బయటికి వచ్చాడు. హిరణ్యకశ్యపుని పట్టుకొని అతని పొట్ట చీల్చి చంపి, తర్వాత ప్రహ్లాదుని తన నాలుకతో నాకసాగాడు. ప్రహ్లాదున్ని వరం కోరమన్నాడు. అలా ప్రహ్లాదుడు తన తండ్రికి సద్గతి కలిగించమని కోరాడు. నృసింహుడు 'నీ ఇరవై ఒక తరాల పురుషులు సద్గతిని పొందుతారు" అని వరమిచ్చాడు.

సమీక్ష:- చూడండి! ఇది కూడా మరొక గప్పాలు చెప్పే సోదరుని మాటలవలె నున్నవి. ఒక భాగవతం వినే వారిని గాని, చెప్పే వారిని గాని, తీసుకొని వెళ్ళి కొండ మీద నుండి పడవేసిన వారిని రక్షించేవా డెవడుంటాడు? పడ్డ వాడు ముక్కలు ముక్కలై చస్తాడు. ప్రహ్లాదుని తండ్రి అతన్ని చదవటానికి పంపితే అది చెడు పని కాదుగదా! అతడేమీ చెడుగా చేసాడు? ఆ ప్రహ్లాదుడు ఎంతటి మూర్ఖుడు! చదవటం మాని బైరాగి కావాలని కోరినాడట. ఇది మంచి పనా!

మండుతున్న స్తంభం మీద చీమలు పారుతున్నాయి, ప్రహ్లాదుడు ఆ స్తంభాన్ని పట్టుకొన్నాడు. అతడు కాలలేదు. ఈ విషయాన్ని సత్యమని నమ్మే వారిని కూడా మండుతున్న స్తంభానికి కట్టి వేయాలి. ఇతడు కాలకపోతే ప్రహ్లాదుడు కూడా కాలలేదని నమ్మవచ్చు. నృసింహుడు కూడా కాలలేదనవచ్చు.

ప్రథమంలో సనకాదులకు "మూడవ జన్మలో వైకుంఠం చేరగలరని వరమిచ్చాడు. దానిని మీ నారాయణుడు మరచిపోయాడా? భాగవత రీతిని అనుసరించి బ్రహ్మ ప్రజాపతి కశ్యపుడు హిరణ్యాక్ష హిరణ్య కశ్యపులు నాల్గవతరం వారవుతారు. ఇరవై తరాలు ప్రహ్లాదునికి కానే లేదు. మరో ఇరవై యొక్క తరాల పురుషులు సద్గతిని పొందారు' అనటం ఎంత పొరపాటు? మరియు ఆ హిరణ్యాక్ష హిరణ్యకశ్యపులే రావణ కుంభకర్ణులు, శిశుపాల దంతవక్త్రులుగా పుట్టారు. అప్పుడు నృసింహుని వరమెక్కడికి ఎగిరి పోయింది? ఇలాంటి ప్రమాదయుక్త విషయాలు ప్రమాది పురుషులు ప్రమాదాలను చేసేవారే చెబుతారు, వింటారు. విద్వాంసులు ఇలా చేయరు.

పూతన అక్రూరులు

పూతన, అక్రూరుల విషయాన్ని చూడండి!

రథేన వాయువేగేన జగామ గోకులం ప్రతి" భాగవతం-10-38-24 ॥

అక్రూరుడు కంసునితో పంపబడినవాడై వాయువేగంతో సమానంగా పరుగిడే గుర్రాలు కట్టిన రథంపై కూర్చొని సూర్యోదయ సమయంలో బయలుదేరి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న గోకులాన్ని సూర్యాస్తసమయంలో చేరెను. దీనిని ఎలా నమ్మాలి? నాలుగుమైళ్ళ దూరం వాయువేగంతో పోవు గుర్రాలు సాయంకాలం వరకు ఎక్కడకి పరుగెత్తినాయి? భాగవతం రచించేవాని చుట్టు పరిభ్రమ చేస్తూనే ఉండవచ్చు. లేదా మార్గాన్ని మరచి అక్రూరుడూ, గుర్రాలను నడిపే సారథీ, భాగవతకర్త ఇంట గుర్రుపెట్టి నిద్రపోయి ఉండవచ్చు.

పూతన శరీరం ఆరు క్రోసుల వెడల్పు, చాలక్రోసుల పొడవని వ్రాసి ఉన్నది. శ్రీకృష్ణుడామెను చంపి మధుర–గోకులం మధ్య పడేసాడు. అప్పుడు మధుర, గోకులాలు రెండు ఆ పూతన శవం క్రింద అణిగిపోయి ఉండాలి. వీని మధ్య పోపు ఇల్లు కూడా దాని క్రింద పడి పాతాళంలోకి పోయుండవచ్చు.

అజామీళుని కథ

ఇక అజామీళుని కథ విచిత్రంగా వ్రాయబడి ఉన్నది. అతడు నారదుడు చెప్పినందుకు తన పిల్లవాడికి నారాయణుడు అని పేరు పెట్టుకొన్నాడు. అజామీళుడు మరణించునప్పుడు తన పుత్రుని పిలిచాడు. మధ్యలో నారాయణుడు వచ్చి నిలుచున్నాడు. వైకుంఠ వాసియైన ఈ నారాయణుడికి ఈ మాత్రమైనా జ్ఞానం లేదా? 'ఇతడు నన్ను పిలవటం లేదు. తన కొడుకును పిలుచుకొన్నాడు' అని కూడా తెలియదా! నారాయణ మాహాత్మ్యం ఇలాంటిదే అయితే నేడు నారాయణ నామస్మరణం చేసేవారి దుఃఖాలను నశింపచేయడానికి నారాయణుడు ఏల రాడు? ఇది సత్యమైతే జైళ్ళలో శిక్షలను అనుభవించేవారు నారాయణ స్మరణచేసి జైళ్ళనుండి ఎలా తప్పించుకోరు?

ఇలాగే సుమేరుపర్వతపు పరిమాణం కూడా జ్యోతిష్య శాస్త్రానికి విరుద్ధంగా వ్రాయబడింది. మరియు ప్రియవ్రతరాజు యొక్క రథచక్రపు గాడి వలన సముద్రాలు ఏర్పడ్డాయట. నలభై తొమ్మిది కోట్ల యోజనాలు పృథ్వి అంట. ఇలాంటి అసత్య విషయాలకు సంబంధించిన గప్పాలు లెక్కకు మించినవి భాగవతంలో వ్రాయబడి ఉన్నాయి.

భాగవతకర్త బోపదేవుడు

ఈ భాగవతం బోపదేవునితో రచించబడింది. అతని సోదరుడు జయదేవుడు, గీతగోవిందాన్ని రచించాడు. చూడండి. అతడు తన హిమాద్రి నామక గ్రంథంలో ఈ శ్లోకాలు వ్రాసాడు. 'శ్రీమద్ భాగవత పురాణాన్ని నేనే వ్రాసాను". ఆ లేఖకు సంబంధించిన మూడు పేజీలు మా దగ్గర ఉన్నాయి. వాటిలో ఒకటి ఎక్కడో పోయింది. ఆ పత్రంలోని శ్లోకాశయాలను అనుసరించి మేము శ్లోకాలు రచించి ఈ క్రింద వ్రాసాము. చూడదలచినవారు హిమాద్రి గ్రంథంలో చూడండి.

1. హిమాద్రేః సచివ స్యార్థే సూచనా క్రియతేఽధునా ।
స్కంధాఽధ్యాయకథానాం చ యత్ప్రమాణం సమాసతః ॥

2. శ్రీమద్భాగవతం నామ పురాణం చ మయేరితమ్ ।
విదుషా బోపదేవేన శ్రీకృష్ణస్య యశోన్వితమ్ ॥

ఆ చినిగిన పత్రంలో ఇలాంటి శ్లోకాలే ఉన్నాయి. అంటే రాజు యొక్క మంత్రి హిమాద్రి బోపదేవుడను పండితునితో 'నాకు నీవు వ్రాసిన శ్రీమద్భాగవతం సంపూర్ణంగా వినే అవకాశం లేదు. కావున సంక్షేపంగా శ్లోకబద్ధమైన సూచీ పత్రం వ్రాయండి. దానిని చూసి శ్రీమద్భాగవత కథను సంక్షేపంగా తెలుసుకోగలను' అన్నాడు. అందువలన నిమ్న లిఖిత సూచీపత్రాన్ని ఆ బోపదేవుడు రచించాడు.

దానినుండే ఆ చినిగిన పత్రంలో పది శోక్లాలు పోయాయి. పదకొండవ శ్లోకం నుండి ఇలా ఈ క్రింద వ్రాస్తున్నాము. ఈ శ్లోకాలన్నీ బోపదేవుని రచనలే.

11. బోధంతీతి హి ప్రాహుః శ్రీమద్భాగవతం పునః ।
పంచ ప్రశ్నాః శౌనకస్య సూతస్యాత్రోత్తరం త్రిషు ॥ 11

12. ప్రశ్నావతారయోశ్చైవ వ్యాసస్యానిర్వృతిః కృతాత్ ।
నారదస్యాత్ర హేతూక్తిః ప్రతీత్యర్థం స్వజన్మ చ ॥ 12

13. సుప్తఘ్నం ద్రౌణ్యభిభవస్త దస్త్రాత్పాండవా వనమ్ ।
భీష్మస్య స్వపదప్రాప్తిః కృష్ణస్య ద్వారకాగమః ॥ 13

14. శ్రోతుః పరీక్షితో జన్మ ధృత రాష్ట్రస్య నిర్గమః ।
కృష్ణమర్త్య త్యాగ సూచా తతః పార్థమహాపదః ॥ 14

15. ఇత్యష్టా దశభిః పాదైరధ్యాయార్థః క్రమాత్ స్మృతః ।
స్వపర ప్రతిబంధోనం స్ఫీతం రాజ్యం జహౌనృపః ॥ 15

ఇతి వైరాజ్ఞో దార్ఢ్యోక్తౌ ప్రోక్తాద్రౌణిజయాదయః । 16 ఇతి ప్రథమ స్కంధః ॥

ఇలాంటి పన్నెండు స్కంధాలకు సూచీపత్రం ఈ విధంగానే బోపదేవ పండితుడు వ్రాసి హిమాద్రి సచివున కిచ్చాడు. వీటి విస్తారం చూడదలచిన వారు బోపదేవుడు వ్రాసిన హిమాద్రి గ్రంథంలో చూడవచ్చు.

ఇలాగే ఇతర పురాణాల లీలలు తెలుసుకోవాలి. అన్నీ ఇలాగే ఒకదానిని మించి మరొకటి అసత్యాలతో నిండి ఉన్నాయి.

శ్రీకృష్ణుని చరిత్రకు కళంకం

చూడండి. శ్రీకృష్ణుని చరిత్ర మహాభారతంలో ఉన్నతంగా ఉంది. అతని గుణకర్మ స్వభావం ఆప్త పురుషుని లాగా ఉన్నది. అందులో శ్రీకృష్ణుడు పుట్టినది మొదలు మరణపర్యంతం ఎట్టి చెడుపనులు చేసినట్లు అందులో వ్రాయబడలేదు.

ఈ భాగవతకారుడు అనుచితంగా తన ఇష్టం వచ్చినట్లు శ్రీకృష్ణునికి దోషాలనాదించాడు. పాలు, పెరుగు, వెన్న మొదలైన వాటిని దొంగిలించాడని వ్రాసాడు. ఇలాగే కుబ్జాదాసీ సమాగమం, పరస్త్రీలతో రాసక్రీడలు మొదలైనవి అసత్యదోషాలెన్నో శ్రీకృష్ణునికి అంటగట్టాడు. వీటిని చదివి-చదివించి, విని-వినిపించి ఇతర మతాలవారు శ్రీకృష్ణున్ని ఎన్నో రకాలుగా నిందిస్తున్నారు. ఈ భాగవతమే లేకుంటే శ్రీకృష్ణునివంటి మహాత్ములకు ఇంతటి నింద కలిగేదా?

శివపురాణం-జ్యోతిర్లింగాలు

శివపురాణంలో పన్నెండు జ్యోతిర్లింగాలు వ్రాయబడి ఉన్నాయి. ఆ కథయు సర్వథా అసంభవం. పేరుకు జ్యోతిర్లింగాలు, ప్రకాశం లేశమాత్రం కూడా ఉండదు. రాత్రి దీపంలేక ఏదీ కనిపించదు. ఇది అంతా పోపులీల తప్ప మరేమీ లేదు.

స్త్రీ శూద్రులు - వేద పఠనాధికారం

ప్రశ్న:- వేదాలు చదివే సామర్థ్యం లేనప్పుడు స్మృతి, దానిని చదవలేనప్పుడు శాస్త్రం, అది చదివే సామర్థ్యం లేనప్పుడు పురాణాలు వ్రాయబడ్డాయి. అవి కూడా కేవలం స్త్రీ శూద్రుల కొరకు. వీరికి వేదాలు చదవటానికి వినటానికి అధికారం లేదు. కావున ఇవి వ్రాయబడ్డాయి.

జవాబు:- ఇదీ అసత్యమే. చదివి చదివించటం వలన సామర్థ్యం కలుగుతుంది. మరియు వేదాలు చదవటానికి వినటానికి అందరికీ అధికారం ఉన్నది. గార్గి మొదలైన స్త్రీలు, ఛాందోగ్యంలో జానశ్రుతి శూద్రుడు, రైక్వముని వద్ద వేదాన్ని చదివాడు. వేదాలను చదవటానికి వినటానికి మానవ మాత్రునికి అధికారం ఉన్నట్లు యజుర్వేదంలో 26వ అధ్యాయంలో 2వ మంత్రంలో స్పష్టంగా వ్రాయబడి ఉన్నది. అయినా కూడా ఇలాంటి మిథ్యా గ్రంథాలను వ్రాసి సత్యగ్రంథాల నుండి ప్రజలను విముఖులను చేసి తమ వలలో స్వప్రయోజనాలను సాధించుకొనేవారు మహాపాపులు కాక మరేమవుతారు?

గ్రహాలు - సమీక్ష

గ్రహాల చక్రం ఎలా నడిపారో చూడండి. ఎందరో విద్యావిహీనులు ఈ చక్రంలో చిక్కుకొని ఉన్నారు.

1. **'ఆకృష్ణేన రజసా'** ఇది సూర్యమంత్రం అంటారు. కాని ఇది ఆకృష్ణే = ఈ సూర్యుడు (యజు. 33-43) మరియు భూమి యొక్క ఆకర్షణ గురించి తెలిపేది.

2. **ఇమదేవ మసపత్నగ్ం సువధ్వమ్ ।** ఇది చంద్రుని మంత్రమంటారు. కాని ఇది (యజు. 9-40) రాజ గుణ విధాయకం తెలుపుతుంది.

3. **అగ్నిర్మూర్ధాదివః కకుత్పతిః ॥** ఇది మంగళుని మంత్రమంటారు.. కాని ఇది అగ్ని గురించి తెలుపుతుంది. (యజు. 3-12)

4. **ఉద్బుధ్యస్వాగ్నే ॥** ఇది బుధుని మంత్రమంటారు. కాని ఇది యజమానుని గురించి తెలుపుతుంది. (యజు. 15-54)

5. **బృహస్పతే అతియదర్యో ॥** ఇది బృహస్పతి మంత్రమంటారు. కాని ఇది విద్వాంసుని గురించి తెలుపుతుంది. (యజు. 26-3)

6. **శుక్రమంధసః ॥** శుక్రుని మంత్రమంటారు. కాని ఇది వీర్యం - ఆహార పదార్థాల గురించి చెప్పబడింది. (యజు. 19-72)

7. **శన్నోదేవీరభిష్టయ ॥** ఇది శని మంత్రమంటారు. కాని ఇది జలం, ప్రాణం - పరమేశ్వరుని గురించి చెప్పబడింది. (యజు. 36-12)

8. **కయానశ్చిత్ర ఆభువ ॥** ఇది రాహు మంత్రమంటారు. కాని దీని అర్థం మిత్రుడు (యజు. 27-39)

9. **కేతుం కృణ్వన్నకేతవే ॥** ఇది కేతు మంత్రమంటారు. కాని ఇది కండిక - జ్ఞానాన్ని గ్రహించే విషయం. ఈ పద్ధతిలో మంత్రాలున్నాయి. దీనిని కేతుకండిక అంటారు. ఇవి గ్రహాలను సూచించవు. అర్థం తెలియకుండటం వలన ఇవి గ్రహాలని భ్రమజాలంలో పడ్డారు.

గ్రహఫలాలు

ప్రశ్న:- గ్రహాలకు ఫలం ఉన్నదా లేదా?

జవాబు:- పోపు లీలలకు ఫలం లేదు. సూర్యచంద్రుల కిరణాల ద్వారా ఉష్ణత, శీతలత్వం లభిస్తుంది. లేక ఋతువుల లాగా కాలచక్రానికి గల సంబంధం వలన తమ ప్రకృతులకు అనుకూలంగాను, ప్రతికూలంగానూ సుఖదుఃఖాలకు నిమిత్తం అవుతుంది.

కాని, పోపులీలల వారు చెప్పినట్లు కాదు. "వినండి సావుకారుగారూ! యజమానులారా! వినండి! సూర్యుడు, చంద్రుడు మొదలైన క్రూర గ్రహాలు మీ ఇంట నేడు ప్రవేశించాయి. రెండున్నర సంవత్సరాలకుగాను శనిపాదంలో ప్రవేశించాడు. మీకు పెద్ద విఘ్నం కలుగుతుంది. ఇల్లు, వాకిళ్ల

నుండి విడిపించి పరదేశాలలో మిమ్ములను త్రిప్పును. నీవు గ్రహపూజ జపం, పాఠం పూజ జరిపించితే దుఃఖాల నుండి తప్పుకొంటావు".

ఇలా సంకటాలు తెచ్చిపెట్టేవారితో ఇలా అనాలి. 'ఓ పోపు గారూ! మీకూ, గ్రహాలకు ఏ సంబంధం ఉంది? గ్రహాలు ఎలాంటి వస్తువులు?" (అంతేకాని వారు చెప్పినట్లు విని పూజాపాఠాలలో పడి ధనవ్యయం చేసుకొని దుఃఖించరాదు.)

పోపు: దైవాధీనం జగత్సర్వం మంత్రాధీనాశ్చ దేవతాః ।
తేమంత్రాః బ్రాహ్మణాధీనా స్తస్మాద్ బ్రాహ్మణ దైవతమ్ ॥

చూడండి! ఎలాంటి ప్రమాణాలున్నాయో! సమస్త జగత్తు దేవతల ఆధీనంలో ఉంటాయి. దేవతలు మంత్రాధీనంలో, మంత్రాలు బ్రాహ్మణాధీనంలో ఉన్నాయి. కావున బ్రాహ్మణుడు దేవత అనబడతాడు. ఎందుకంటే, ఏ దేవతనైనా మంత్రబలంతో పిలిచి ప్రసన్నం చేసి కార్యాన్ని సిద్ధింపజేసే అధికారం మాకే ఉన్నది. మాలో మంత్రశక్తి లేని పక్షంలో మీవంటి నాస్తికులు మమ్మల్ని ఈ లోకంలోనే ఉండనీయరు.

సత్యవాది:- దొంగలు, దోపిడిగాళ్ళు, దుష్కార్యాలు చేసేవారు మీ దేవతల ఆధీనంలోఉంటారా? దేవతలే వారిచేత దుష్టకర్మలను ఆచరింపజేస్తున్నారేమో! ఇదే నిజమైతే మీ దేవతలకు రాక్షసులకు భేదమేమీ ఉండదు. మీ ఆధీనంలో మంత్రాలున్నాయి. కాబట్టి మీ ఇష్టం వచ్చినది చేయించగలుగుతారు. అలాగైతే మంత్రాలతో దేవతలను వశపరచుకొని రాజుల కోశాల నుండి దేవతల ద్వారా ధనాన్ని తెప్పించుకొని మీ ఇల్లు నింపుకొని సుఖంగా కూర్చొని ఆనందాన్ని ఎలా అనుభవించరు? ఇంటింటికి శనిగ్రహాల నెపంతో తైలదానం, ఛత్రదానాలు పట్టటానికి ఎలా కాలికి బలపాలు కట్టినట్లు తిరిగి తిరిగి బాధల పాలవుతున్నారు? ఎవరిని మీరు కుబేర దేవత అంటారో వారిని వశపరచుకొని కావలసిన ధనం సంపాదించుకోవచ్చు కదా! పాపం ఈ దరిద్రుల నెందుకు దోచుకొంటున్నారు?

గ్రహాల ప్రసన్నత - అప్రసన్నత

మీకు దానం చేస్తే గ్రహాలు ప్రసన్నమైతే ఇవ్వకుంటే అప్రసన్నమైతే మాకు సూర్యాది గ్రహాల ప్రసన్నతను అప్రసన్నతను ప్రత్యక్షంగా చూపండి. ఒకనికి ఎనిమిదింట సూర్యచంద్రులు, మరొకనికి మూడింట సూర్యచంద్రులైన ఇద్దరిని జ్యేష్ఠమాసంలో పాదరక్షలు లేకుండా కాలుతున్న భూమిపై నడిపించండి. ఎవరిపై ప్రసన్నులవుతాడో వాని కాళ్లు కాని, శరీరం కాని కాలకూడదు. ఎవరిపై క్రోధం కలిగి ఉంటాడో వానివి కాలాలి. పుష్యమాసంలో ఇరువురిని నగ్నంగా చేసి పౌర్ణమినాటి రాత్రంతా మైదానంలో ఉంచాలి. ఒకనికి చలితగిలి, మరొకనికి చలివేయకుంటే గ్రహాలు క్రూర సౌమ్యదృష్టి కలవని గుర్తించండి. నీ కేమైనా గ్రహాలతో సంబంధం ఉన్నదా? నీకు తపాలా ద్వారా

గాని తంతిద్వారాగాని సమాచారమొస్తుందా? లేక నీవు వాని వద్దకు, అవి నీ దగ్గరకు వచ్చిపోతున్నాయా? నీలో మంత్రశక్తే ఉంటే నీవు స్వయంగా రాజు, ధనాఢ్యుడవు ఎలా కావటం లేదు? లేక శత్రువులను నీ వశం ఎలా చేసుకోవు?

వేదాల, ఈశ్వరుని ఆజ్ఞలను పాలించక వేదవిరుద్ధంగా లీలలు చేసేవారే నాస్తికులు. గ్రహదానం మీ కీయక గ్రహంపట్టినవారే తింటే ఏమవుతుంది? అలా కాదు. మాకు దానమిస్తేనే గ్రహం ప్రసన్నమవుతుంది. అని అంటే మీరు గ్రహాలను గుత్తకు తీసుకున్నారా? తీసుకుంటే సూర్యాదులను మీ ఇండ్లకు పిలిపించుకొని కాలి బూడిదై చావండి.

వాస్తవమేమిటంటే సూర్యాదిలోకాలు జడాలు. అవి ఎవరికీ సుఖంకాని, దుఃఖం కాని కలిగించవు. కానీ గ్రహదాన జీవులైన మీరే మూర్తిమంతాలైన గ్రహాలు. కారణమేమంటే గ్రహశబ్దానికి అర్థం కూడా మీకే సంగతమవుతుంది. **"యే గృహ్ణంతి తే గ్రహాః"** గ్రహించేవారే గ్రహాలు.

రాజులు, ధనవంతులు, సేఠులు, సావుకారులు, దరిద్రులు ఎవరైనా మీ చరణాలు చేరనంత వరకు వారికి నవగ్రహాల స్మరణ కూడా కలుగదు. మీరు సూర్యాదిగ్రహరూపాలు ధరించి వారిపైన పడనంతవరకు వారికి ఎలాంటి చింతా ఉండదు. మీరు వారిపై పడి వారి నుండి ఏమీ గ్రహించక వారిని ఎన్నడూ వీడరు. ఎవడైనా మీ మాటలకు లొంగకుంటే అతనిని నాస్తికాది పదాలతో నిందిస్తారు.

పోపు:- చూడండి. జ్యోతిషశాస్త్ర ప్రత్యక్ష ఫలం. ఆకాశంలో ఉండే సూర్యచంద్రులను రాహుకేతువులు గ్రహించటానికి ముందుగానే మేము చెబుతాము. ఈ గ్రహణాలు ప్రత్యక్షమైనట్లు గ్రహఫలాలు కూడా ప్రత్యక్షమవుతాయి. ధనాఢ్యుడు, దరిద్రుడు, రాజు, రంకు, గ్రహాల వల్లనే కదా! సుఖదుఃఖాలననుభవిస్తున్నారు.

సత్యవాది:- ఈ గ్రహణరూప ప్రత్యక్ష ఫలం గణిత విద్యకు సంబంధించింది. ఫలిత విద్యకు సంబంధించింది కాదు. గణితవిద్య సత్యమే. ఫలిత విద్య స్వాభావిక సంబంధం వలన కలుగునది కాక మిగిలిన దంతా అసత్యమే. అనులోమ ప్రతిలోమ గతులను అనుసరించి తిరుగు పథ్వి, చంద్రులు గణితం వలన సూర్యచంద్రులు ఎప్పుడు ఎక్కడ ఎంత మేరకు కలుగుతుందో స్పష్టంగా తెలుస్తుంది. ఎలాగంటే:-

ఛాదయత్యర్క మిందుర్విధుం భూమి భాః ॥ ఇది సిద్ధాంతశిరోమణి వాక్యం. (5-4

ఇలాగే సూర్యసిద్ధాంతం మొదలైన వాటిలో ఉన్నది. సూర్యునికి భూమికి మధ్య చంద్రుడు వచ్చినపుడు సూర్యగ్రహణం, సూర్యచంద్రులకు మధ్య భూమి వచ్చినప్పుడు చంద్రగ్రహణం జరుగుతుంది. అంటే చంద్రుని ఛాయ భూమిమీద, భూమిఛాయ చంద్రుని మీద బడుతుంది. సూర్యుడు ప్రకాశస్వరూపుడవటం వలన అతనిపైన ఎవరి ఛాయా పడదు. ప్రకాశవంతడైన సూర్యునికి దీపానికి

ఎదురుగా నిలుచున్నపుడు మన శరీరాల ఛాయలు వ్యతిరేక దశలో బడుతుంటాయి. అలాగే గ్రహ ఛాయలు తెలుసుకోవాలి.

లోకంలో జనులు వారుచేసే కర్మలవలన ధనాఢ్యులు, దరిద్రులు, రాజులు, రంకులు అవుతారు కానీ గ్రహాల వలన కారు. కొందరు జ్యోతిష్కులు తమ పుత్రపుత్రికల వివాహాలు గ్రహాల లెక్కలు వేసి దానికి అనుగుణంగా చేస్తున్నారు. మరి పుత్రికలు విధవలవటం పుత్రులు విధురులవటం చూస్తున్నాము కదా! కర్మ ఫలం ఎలా ఉంటే అలాగే అవుతున్నది? కాబట్టి కర్మలగతిఫలం సత్యం. గ్రహగతి సుఖదుఃఖ భోగమునందు కారణం కాదు. గ్రహాలు, పృథ్వీ, ఆకాశంలో బహుదూరంలో ఉన్నాయి. కర్త, కర్మలతో ఈ గ్రహాలకు సంబంధం సాక్షాత్తుగా ఏమీ లేదు. కర్మ, కర్మ ఫలాలకు సంబంధం కర్తా, భోక్తా అయిన జీవునితో సాక్షాత్తు సంబంధం ఉన్నది. కర్మఫలాన్ని అనుభవింపచేసేవాడు పరమాత్మయై ఉన్నాడు.

మీరు గ్రహాల ఫలం అంగీకరిస్తే దీనికి సమాధానం చెప్పండి? ఏ క్షణంలో ఒక మానవుని జన్మ కలుగుతుందో ఎవరికి మీరు ధ్రువాత్రుటిని అంగీకరించి జన్మపత్రం సిద్ధం చేస్తారో, ఆ క్షణంలో భూగోళంలో ఇతరుల జన్మలు కలగవా? కలుగుతాయా? కలుగకపోతే అది అబద్ధం. కలుగుతాయని అందురేని అందులో ఒకడు చక్రవర్తివలె భూగోళంపై రాజ్యమేలితే మరియొకడు చక్రవర్తి, రాజు ఎలా కావటం లేదు? అవును. ఈ లీల తమ ఉదర పోషణార్థమంటే ఎవరైన విశ్వసిస్తారు.

గరుడ పురాణ విమర్శ

ప్రశ్న:- గరుడ పురాణం కూడా అసత్యమేనా?

జవాబు:- ఔను. అసత్యమే.

ప్రశ్న:- ఇక మరణించిన జీవునికి ఎలాంటి గతి కలుగుతుంది?

జవాబు:- అతని కర్మలు ఎలా ఉంటాయో అలాంటి గతి కలుగుతుంది.

ప్రశ్న:- యముడు రాజు. చిత్రగుప్తుడు మంత్రి. అతని కింకరులు మిక్కిలి భయంకరులు. కాటుక పర్వతాల వంటి శరీరాలు కలవారు. వారు జీవుని పట్టుకొని తీసుకొని వెళతారు. జీవుని పాపపుణ్యాలను అనుసరించి నరక స్వర్గాలలో వారిని పడవేస్తారు. అందుకే దానపుణ్యం, శ్రాద్ధతర్పణాలు, వైతరిణీ నది దాటటానికి గోదానాలు చేస్తారు. ఇవన్నీ అసత్యాలు ఎలా కాగలవు?

జవాబు:- ఇవి అన్నీ పోపుల లీలల అసత్యపు మాటలు. యమలోకానికి దూరంలో ఉన్న జీవులు యమలోకానికి వెళతారు. అక్కడ యముడు చిత్రగుప్తుడు వారికి న్యాయం చేస్తాడు. యమలోకంలో ఉన్న జీవులు పాపాలు చేస్తే వారిని శిక్షించటానికి మరొక యమలోకాన్ని అంగీకరించవలసి వస్తుంది. అక్కడ ఇంకొక యముడు కావాలి.

పర్వతాలంత శరీరాలు కలవారైన యమకింకరులు కనిపించరు ఎందుకు? మరణించే జీవుల ఇండ్ల ద్వారాలు చిన్నవిగా ఉంటాయి. పర్వతశరీరులు ఆ జీవులను తీసుకొని వెళ్ళటానికి వారి యొక్క వ్రేలైనా ఆ ఇంట దూరలేదు కదా? వారు సూక్ష్మశరీరధారులు కాలేదెందుకని, పర్వతాకారపు శరీరంలోని పెద్దపెద్ద ఎముకలన్నీ పోపుగారి ఇంటిలో నుంచి సూక్ష్మశరీరధారులవుతారా? అడవిలో అగ్ని ఏర్పడి అరణ్యాన్ని దహించునపుడు వేలకొద్ది, లక్షలకొద్ది జీవులు చనిపోతారు కదా. ఆ జీవులందరినీ తీసుకొని పోవటానికి అక్కడ వేలాది యమకింకరులు వెళ్తే అక్కడ చీకటి, కటిక చీకటి ఏర్పడాలి కదా! వారు జీవులను పట్టుకోవటానికి త్వరపడి పరుగెత్తుతారు. అప్పుడు పరస్పరం ఒకరికొకరు కొట్టుకొని పర్వత శిఖరాల వంటి వారి యవయవాలు విరిగి గరుడ పురాణం చదివేవారి కొంపల మీద పడితే వాటి క్రిందపడి అణిగిమణిగి ఆ పోపులు – పురోహితులు చచ్చిపోరా? పడిపోయిన ఇల్లు వాటిపైన యమకింకరుల శరీర అవయవాలు పడి దారులు కూడా లేక ప్రజలు అనేకావస్థల పాలవుతారేమో!

శ్రాద్ధతర్పణ, పిండప్రదానాలు, చనిపోయిన జీవులకు ఎన్నడూ చేరవు. కానీ మరణించిన వారికి ప్రతినిధులైన పురోహితుల ఇళ్లలోను వారి ఉదరంలోనూ, హస్తాలలోనూ చేరుతాయి. వైతరణి నదిని దాటించటానికి ఇచ్చే గోవు కూడా పురోహితుని ఇంటికో లేక కసాయివాని ఇంటికో చేరుతుంది దానం ఇచ్చిన గోవు ఇక్కడనే ఉంటుంది. వైతరణికి పోదు కదా! మరణించిన జీవుడు ఎవరితోకను పట్టుకొని నదిని దాటుతాడు? మరణించిన చేతులు ఇక్కడే అగ్నిలో తగులబడతాయి. భూమిలో పూడ్చబడుతుంది. జీవునికి చేతులు ఉండవు. తోక ఎలా పట్టుకొంటాడు?

ఈ విషయంలో ఇలా ఒక దృష్టాంతం మిక్కిలి ఉపయుక్తమవుతుంది. ఒక కృషీవలుడున్నాడు. ఆ రైతు గృహంలో ఒక గోవు రోజుకు ఇరవై సేర్ల పాలను ఇచ్చేదున్నది. దాని పాలు చాలా రుచిగా కూడా ఉంటాయి. అప్పుడప్పుడు ఆ ఇంటి పురోహితునికి కూడా ఆ పాల రుచి తెలుస్తూ ఉండేది. ఆ కృషీవలుని ముసలితండ్రి చనిపోయినప్పుడు ఈ ఆవునే దాన సంకల్పం చేయించవచ్చునని ఆ పురోహితుడు ఆశపెట్టుకొని ఉన్నాడు.

కొద్ది రోజులలోనే దైవయోగం వలన ఆ రైతు తండ్రి మరణించే సమయం సమీపించింది. అతని మాటలు పోయాయి. అతనిని మంచం మీదనుండి దించి భూమిపై పడుకోబెట్టారు. ప్రాణాలు పోతున్నాయి. అప్పుడు ఆ రైతు ఇష్టమిత్రులు సంబంధులు కూడా వచ్చి ఉన్నారు. అప్పుడు పురోహితుడు వచ్చి యజమానిని పిలిచి 'అయ్యా! ఇప్పుడింకా ఆలస్యం చేయకండి. మీ తండ్రి గారితో గోదానం చేయించండి' అన్నాడు. ఆ రైతు పది రూపాయలు తీసి తండ్రి చేతిలో పోసి 'సంకల్పం చదవండి' అని పురోహితున్ని కోరాడు. "వహ్వా! యజమానుడా! ఇదేమిటి! ఇప్పుడు సాక్షాత్తుగా గోవును దానం చేయాలి. నీ తండ్రి మళ్ళీ మళ్ళీ చావడు కదా! ఈ సమయంలో బాగా పాలను ఇచ్చే వయస్సులో ఉన్న గోవును దానం చేయాలి" అని అన్నాడు.

రైతు:- 'అయ్యా! మా దగ్గర ఒక్కటే గోవు ఉన్నది. అది లేకుంటే మా పిల్లలను పోషించటానికి అవకాశం లేదు. కావున దానిని ఇవ్వను. దానికి బదులు ఇరవై రూపాయలు తీసుకొని సంకల్పం చెప్పండి. ఈ రూపాయలతో మరొక పాలనిచ్చే ఆవును కొని తెచ్చుకోండి' అన్నాడు.

పురోహితుడు:- వహ్వా! నీవు నీ తండ్రి కంటే గోవును ఎక్కువగా చూస్తున్నావా? నీ తండ్రిని వైతరణిలో ముంచి దుఃఖాలపాలు చేయదలచావా? మంచి సుపుత్రుడవే దొరికావయ్యా!

అప్పుడు బంధుమిత్రులు కూడా పురోహితుని పక్షమే వహించారు. పురోహితుడు ముందుగానే వారిని సిద్ధపరచి ఉంచాడు. అప్పుడు వారికి సైగచేసి తన పక్షానికి అనుకూలం చేసుకొన్నాడు. అందువలన అందరూ పట్టుపట్టి ఆ గోవును పురోహితునికి సంకల్పం చేయించారు. ఆ సమయంలో రైతు ఏమీ అనక అందరి ఇష్ట ప్రకారం చేసి మెదలక ఊరుకున్నాడు. తండ్రి చనిపోయాడు. పురోహితుడు గోవును పాల పాత్రతో పాటు తన ఇంటికి తీసుకొనిపోయి గోవును కట్టివేసి పాలపాత్రను ఇంట్లో పెట్టి మరల రైతు ఇంటికి వెళ్ళాడు. శవం వెంట శ్మశానానికి వెళ్ళి దహనకర్మ చేయించాడు. అక్కడ కూడా తన లీలలేవో చేసి తర్వాత దశగాత్రాలు సపిండీకరణాలు చేయించి ఆ రైతును బాగా దోచుకొన్నాడు. అతడే కాక మహాబ్రాహ్మణులు కూడా అతన్ని వదలలేరు. ఇతర కుక్షింభరులు తమ పొట్టను నింపుకున్నారు. ఇలా కావలసిన క్రతువులన్నీ ముగిసేవరకు ఆ రైతు ఇరుగుపొరుగు వారి నుండి పాలు సంపాదించుకొని తన ఇల్లు గడుపుకొన్నారు.

ఏదిహేను రోజుల తర్వాత రైతు పురోహితుని ఇంటికి వెళ్ళాడు. అప్పుడే పురోహితుడు పాలు పిండి పాత్ర నిండగా లేచి ఇంటిలోనికి వెళ్ళడానికి సిద్ధపడుతున్నాడు. ఇంతలో రైతు వెళ్ళాడు. అతనిని చూసి 'ఓహెూ మీరా రండి కూర్చోండి" అని పురోహితుడు పలికాడు.

రైతు:- పురోహితులుగారూ! మీరు కూడా ఇటు రండి.

పురో:- ఇదిగో పాలపాత్రను ఇంట్లో పెట్టి వస్తాను.

రైతు:- కాదు. కాదు, దుగ్ధపాత్ర కూడా ఇలా తెండి. ఆ మాటలు విని పురోహితుడు పాత్రతో దగ్గరకు వెళ్ళి అక్కడ పాత్ర నుంచాడు.

రైతు:- ఏమయ్యా! ఇంత అసత్యమా చెప్పేది?

పురో:- నేనేమి అసత్యం చెప్పానయ్యా!

రైతు:- నీవు గోవును తీసుకొన్నది ఎందుకు చెప్పు!

పురో:- నీ తండ్రిని వైతరణీ నదిని దాటించటానికి తీసుకొచ్చాను.

రైతు:- మంచిది. మరి నీవు గోవును వైతరణీ నదీ తీరంలోకి ఎలా పంపలేదు? మేము

విశ్వసించి, నీవు గోవును పంపావని అనుకున్నాము. కాని నీవు గోవును నీ ఇంట్లోనే కట్టేసి ఉంచావు. మా తండ్రి నదిలో ఎన్ని మునకలు వేసి ఉన్నాడో! ఎంత దుఃఖాన్ని పొందాడో తెలియదు కదా!

పురో:- అరే! అలా ఎందుకు జరుగుతుంది? నీవు చేసిన దాన ప్రభావం వలన మరొక గోవు మీ తండ్రిని దాటించి ఉండవచ్చు.

రైతు:- వైతరణీ నది ఇక్కడికి ఎంత దూరంలో, ఏ వైపున ఉన్నది?

పురో:- సుమారు 20 కోట్ల క్రోసుల దూరంలో ఉంటుంది. 49 కోట్ల యోజనాలు పృథ్వియే ఉన్నది. వైతరణీ నది దక్షిణ నైరూతిదిశలో ఉన్నది.

రైతు:- అంత దూరం పత్రం కానీ, టెలిగ్రాం కానీ పోయి అక్కడ నుండి తిరిగి జవాబు వచ్చి ఉండవచ్చు కదా! అక్కడ పుణ్యగోవు మా తండ్రికి లభించిందా? మా తండ్రి నది దాటినట్లు జవాబు వచ్చియుండును కదా! కొంచెం చూపండి.

పురో:- మా దగ్గర గరుడ పురాణ లేఖ తప్ప మరొక ఉత్తరం - టెలిగ్రాంలు ఏమీ ఉండవు.

రైతు:- ఈ గరుడ పురాణం సత్యమని మేమెలా నమ్మాలో చెప్పండి?

పురో:- అందరూ నమ్మినట్లే మీరు కూడా నమ్మండి.

రైతు:- ఈ పుస్తకాన్ని మీ పూర్వీకులు, మీ జీవిక కొరకు రచించారు. తండ్రికి పుత్రుని మించిన ప్రియుడొకడుంటాడా? నా తండ్రి నాకు పత్రమో, టెలిగ్రామో పంపినప్పుడు నేను స్వయంగా గోవును అక్కడకు తీసుకొని వెళతాను. నా తండ్రిని నదిని దాటించిన తరువాత గోవును తెచ్చుకొని నేను నా పిల్లలు పాలు త్రాగుతాము. **'దుగ్ధపాత్ర ఇలా తెండి'** అని పాత్రను తీసుకొని గోవును, దూడను వెంటకొనిపోయి తన ఇంట చేర్చాడు.

పురో:- దానమిచ్చిన వస్తువును నీవు మళ్ళీ తీసుకొంటావా? నీవు సకుటుంబంగా నశిస్తావు.

రైతు:- మాట్లాడకుండా ఉండు. ఈ 15 రోజులు పాలు లేక మేము పడిన పాట్లకు బదులుగా ఇంకేమైనా నీ వద్దనే వసూలు చేయవలసి వస్తుంది. అప్పుడు పోపు మౌనంగా ఉన్నాడు. ఇలా అందరూ సిద్ధపడిన రోజు పోపులీలలన్నీ నశిస్తాయి.

దశగాత్ర పిండాలతో దశాంగాలు, సపిండీకరణం వలన శరీరంతో జీవుడు కలిసి అంగుష్ఠమాత్ర శరీరంతో యమలోకానికి వెళతాడు. అది సత్యమైన యమదూతల రాక మరణ సమయంలో వ్యర్థమవుతుంది. 13 రోజులకు తరువాత వెళ్ళాలి. శరీరం సిద్ధమైన తర్వాత భార్య, పుత్రుల మోహంతో అతడు మళ్ళీ తిరిగి ఎందుకు రాలేదు?

ప్రశ్న:- స్వర్గంలో ఏమీ లభించదు. ఇక్కడ చేసే దానమే అక్కడ లభిస్తుంది. కాబట్టి దానమందరూ చేయాలి.

జవాబు:- అలాగైతే మీ స్వర్గం కంటే ఈ లోకమే ఉత్తమమైనది. ఇక్కడ ధర్మశాలలు, దానం చేసేవారున్నారు. ఇష్టమిత్రులూ ఉన్నారు. కులం వారు అప్పుడప్పుడు పిలిచి బాగా సత్కరిస్తారు. మంచిమంచి వస్త్రాలు లభిస్తాయి. నీవు చెప్పిన దానినిబట్టి స్వర్గంలో ఏమీ లభించదు కదా! ఇలాంటి నిర్దయ, కృపణ, దరిద్ర స్వర్గంలో పోపులు, పురోహితులు పోయి దుఃఖాలననుభవింతురు గాక! పుణ్యాత్ములకు ధర్మాత్ములకు అక్కడ పనేమున్నది?

యముడు - యమలోకం

ప్రశ్న:- మీరు చెప్పినట్లు 'యమలోకం, యముడు' లేకుంటే చనిపోయిన జీవులు ఎక్కడి పోతారు? వారికి న్యాయం చేసేవారెవరు?

జవాబు:- మీ గరుడపురాణంలో చెప్పింది ప్రమాణం కాదు. వేదోక్తమే ప్రమాణం. నిజం.

'యమేన', 'వాయునా' 'సత్యరాజన్' ॥

ఋ. 10-14.8., అథ. 20.141.2; యజు. 20-4 ॥

అనే ఈ వేదవాక్యం వలన, యముడు వాయువనీ నిశ్చయమవుతున్నది. మరణించిన తర్వాత జీవుడు వాయువులో అంతరిక్షంలో ఉంటాడు. పక్షపాతరహితుడు, సత్యకర్తయైన పరమేశ్వరుడే ధర్మరాజు. అతడే అందరికీ న్యాయం చేసేవాడు.

ప్రశ్న:- నీవు చెప్పిన దాన్నిబట్టి గోదానాలెవ్వరికీ ఇవ్వరాదు. ఇతర దానపుణ్యాలు కూడా చేయరాదని స్పష్టమవుతున్నది.

జవాబు:- నీవు చెప్పినది సర్వథా వ్యర్థం. ఎందుకంటే సుపాత్రులైన పరోపకారపరులైన వారికి పరోపకారార్థం బంగారం, వెండి, రత్నాలు, ముత్యాలు, అన్నజలాలు అన్నీ తప్పక దానం చేయాలి. కానీ దుష్టులకు కుపాత్రులకు ఎన్నడూ చేయకూడదు.

దానగ్రహీతల లక్షణాలు

ప్రశ్న:- కుపాత్ర, సుపాత్రుల లక్షణమేమిటి?

జవాబు:- మోసం, కపటం, స్వార్థం, విషయాసక్తత, కామం, క్రోధం, లోభం, మోహంతో కూడినవారు, పరులకు హాని చేయువారు, లంపటులు, మిథ్యావాదులు, అవిద్వాంసులు, కుసంగులు, అలసులు, దాతను మాటిమాటికి అడుక్కునేవారు, మెండికివేసి కూర్చుండేవారు, హఠంతో అడిగేవారు, తిట్టేవారు, శపించేవారు, తన దగ్గర ఎంత ఇచ్చినా సంతోషించనివారు, ఇవ్వనివారిని నిందిచేవారు,

పదార్థాలున్నా లేదని అడిగేవారు, పలుమార్లు కోరినది ఇచ్చి ఎన్నడైనా ఒకసారి ఇవ్వకుంటే శత్రుత్వం వహించేవారు, పైకి సాధువేషం ధరించి ప్రజలను దారితప్పించి మోసగించేవారు, వెంటబడి వేధించి వేధించి తమ స్వార్థాన్ని సిద్ధం చేసుకొనేవారు, రాత్రింబవళ్ళు అడుక్కోవటమే ప్రవృత్తులై ఉండేవారు, ఆహ్వానించినప్పుడు ఎక్కువగా భంగు, మొదలైన మాదకద్రవ్యాలను సేవించి అటుపై ఇతరుల పదార్థాలను అమితంగా మెక్కేవారు, తర్వాత ఉన్మత్తులై ప్రమాదాలను చేసేవారు, సత్యమార్గాన్ని విరోధించి తన ప్రయోజనం కోసం అసత్యమార్గాన్ని అవలంభించేవారు, అలాగే తన శిష్యులను తనకే సేవచేయాలని, ఇతరులు మంచివారైనా వారికి పనిచేయరాదని బోధించేవారు, సత్‌విద్యా ప్రవృత్తిని విరోధించేవారు, ఇది అంతా అసత్యం - జగత్తు మిథ్య అని చెప్పి, స్త్రీ-పురుష, మాతాపితలు-సంతానం రాజా-ప్రజ ఇష్టమిత్రులు అనే వారిపై మరియు ఈ జగత్తుకు సంబంధించిన వ్యవహారాలలో అప్రీతిని కలిగించేవారు, దుష్టోపదేశాలు చేసేవారు దానానికి తగినవారుకారని తెలుసుకోవాలి.

బ్రహ్మచారులు, జితేంద్రియులు, వేద విద్యలను చదివేవారు, చదివించేవారు, సుశీలురు, సత్యవాదులు, పరోపకారప్రియులు, పురుషార్థపరులు, ఉదారులు, విద్యను ధర్మాన్ని నిరంతరం అభివృద్ధి పరచేవారు, ధర్మాత్ములు, శాంతులు, నిందాస్తుతులలో హర్షశోకాలను పొందనివారు, నిర్భయులు, ఉత్సాహవంతులు, యోగులు, జ్ఞానులు, సృష్టిక్రమానికి, వేదాజ్ఞలకు, ఈశ్వరుని గుణకర్మ స్వభావాలకు అనుకూలంగా వర్తించేవారు, న్యాయపద్ధతితో కూడినవారు, పక్షపాతరహితులు, సత్యోపదేశకులు, సత్యశాస్త్రాలను చదివి చదివించేవారిని. పరీక్షించేవారు; ఒకరిని మెచ్చుకోవడానికి ప్రయత్నించనివారు, ప్రశ్నలకు యథార్థాలైన సమాధానాలు చెప్పేవారు, తన ఆత్మతో పోల్చుకొని ఇతరుల సుఖదుఃఖాలను, హాని లాభాలను గుర్తించేవారు, అవిద్యా క్లేశం హఠదురాగ్రహాలు లేనివారు. అవమానం అమృతసమానంగానూ, మానమర్యాదలను విషసమానంగాను భావించేవారు, సంతోషం కలవారు, ఎవరేది ప్రీతితో ఎంత యిచ్చిన దానితోనే ప్రసన్నులయ్యేవారు, ఆపత్కాలంలో అడిగినప్పుడు ఇయ్యని వారి గురించి కుచేష్టలు చేయనివారు, తిరస్కరించినా ఏమీ అనకుండా ఉండేవారు, అక్కడి నుండి చురుగ్గా లేచి తిరిగివచ్చి వారిని నిందించకుండేవారు, సుఖాన్ని అనుభవించేవారితో మిత్రత, దుఃఖితులపై కరుణ, పుణ్యాత్ములతో ఆనందం, పాపాత్ముల పట్ల ఉదాసీనత అంటే రాగద్వేష రహితత కలిగి ఉండేవారు, సత్యం అంగీకరించి సత్యాన్ని చెప్తూ సత్యం ఆచరించేవారు, నిష్కపటులు, ఈర్ష్యాద్వేషరహితులు, గంభీరాశయంగల సత్పురుషులు, ధర్మయుక్తులై ఎల్లప్పుడూ అధర్మానికి దూరంగా ఉండేవారు, తమ తనుమనుధనాలను పరోపకారం చేయటానికి అర్పించేవారు, ఇతరులకు సుఖం చేకూర్చటంలో తమ ప్రాణాలను అర్పించేవారు, ఇలాంటి శుభగుణయుక్తులు సుపాత్రులని తెలుసుకొని దాన ధర్మాలు చేయాలి.

కాని దుర్భిక్షం మొదలైన ఆపత్కాలాలలో అన్నజలాలకు, వస్త్రాలకు, ఔషధాలకు పథ్యపానాలకు ప్రాణిమాత్రులందరూ అధికారులవుతారు. ఉపర్యుక్త వస్తువులను దానం చేయుటంలో ఆపత్కాలంలో వివక్షత చూపరాదని భావం.

దాతల భేదాలు

ప్రశ్న:- దానంచేసే దాతలు ఎన్ని విధాలుగా ఉంటారు?

జవాబు:- మూడు విధాలుగా ఉంటారు. ఉత్తములు, మధ్యములు, అధములు

ఉత్తమదాతలు:- దేశకాలపాత్రలను తెలిసి సత్యవిద్యను ధర్మాన్ని ఉన్నతిచేయటం అనే పరోపకారార్థం దానం చేసేవారు ఉత్తమదాతలు అనబడతారు. కీర్తి కొరకు, స్వార్థం కొరకు దానం చేసేవారు మధ్యమ దాతలు. తన ఉపకారం కొరకుగాని, ఇతరుల ఉపకారం కొరకుగాని దానం చేయక వేశ్యాగమనాలతో మిథ్యాస్తుతిచేసే భటులకు దానం చేసేవాడు నీచ-నికృష్టదాత అనబడతాడు. దానం చేసేటప్పుడు తిరస్కారం, అవమానం మొదలైన కుచేష్టలు చేయరాదు. పాత్రకు పాత్రల భేదం కొంచమైనా చెప్పక, అన్ని ధాన్యాలను ఒకే ధరకు అమ్మే వారిలాగా, వివాదం, అంటే పరీక్షించి విద్వాంసులైన ధర్మాత్ములకు దానమిచ్చేవాడు - ఉత్తమదాత అవుతాడు. పరీక్ష చేసో చేయకో తన ప్రశంసకొరకు దానం చేసేవాడు మధ్యమదాత అవుతాడు. పరీక్షించకుండా కన్నులు మూసుకొని నిష్ఫలదానం చేసేవాడు నీచదాత అవుతాడు.

ప్రశ్న:- దాన ఫలం ఇక్కడ లభిస్తుందా? లేక పరలోకంలో లభిస్తుందా?

జవాబు:- అంతటా లభిస్తుంది.

ప్రశ్న:- స్వయంగా ఫలితం లభిస్తుందా? ఎవరైనా ఇస్తారా?

జవాబు:- ఫలం ఇచ్చేవాడు ఈశ్వరుడు. లోకంలో ఒక దొంగగాని, ఒక బందిపోటు గాని, స్వయంగా కారాగారానికి వెళ్ళడు. రాజు అతనినేరాన్నిబట్టి కారాగారానికి పంపుతాడు. ధర్మాత్ముల సుఖాన్ని రక్షిస్తాడు. ఫలితాన్ని అనుభవింపజేస్తాడు. దోపిడి దొంగల నుండి రక్షించి వారిని సుఖంగా ఉంచుతాడు. అదే విధంగా పరమాత్ముడు పాపపుణ్యాలకు దుఃఖ-సుఖరూప ఫలాన్ని యథావిధిగా అందరతో అనుభవింపజేస్తాడు.

ప్రశ్న:- ఈ గరుడ పురాణ గ్రంథాలు వేదార్థాన్ని గాని, వేదాలను గాని బలపరుస్తున్నవా లేదా?

జవాబు:- బలపరచటం లేదు. పైగా వేద విరుద్ధాలై వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయి. తంత్రాలు కూడా ఇలాంటివే. ఒకడు ఒకనికి మిత్రుడైన ప్రపంచమంతటికీ శత్రువవుతాడని పురాణాలను, తంత్రాలను విశ్వసించేవారున్నారు. ఎందుకంటే ఈ గ్రంథాలు ఒకటి మరొకదానితో విరోధాన్ని

కలిగింపచేసేట్టివి. వీటిని ఏ మానవుడు విశ్వసించవలసిన పని లేదు. కాని వీటిని విశ్వసించటమే పశుత్వం.

ఏకాదశ్యాది వ్రతాలు

చూడండి - శివ పురాణంలో త్రయోదశి, సోమవారాన్ని; ఆదిత్య పురాణంలో రవివారాన్ని, చంద్ర ఖండంలో సోమగ్రహం వంటి మంగళ, బుధ, బృహస్పతి, శుక్ర, శనైశ్చర, రాహుకేతువుల, వైష్ణవ ఏకాదశి, వామనుని ద్వాదశి, నృసింహలేక అనంతుని చతుర్దశి, చంద్రుని పౌర్ణమాసి, దిక్పాలకుల దశమి, దుర్గానవమి, వసువుల అష్టమి, మునుల సప్తమి, కార్తీక స్వామి షష్ఠి, నాగపంచమి, గణేశ చతుర్దశి, గౌరీ తదియ,అశ్వనీ కుమారుల విదియ, ఆశ్యాదేవి పాడ్యమి, పితరుల అమావాస్య మొదలైన వాటిని తెలుసుకోండి. పురాణపద్ధతిని అనుసరించి ఈ రోజులు ఉపవాసం చేయాలి. సమస్త గ్రంథంలో ఏ మానవుడు ఈ వార, తిథులలో అన్నపానాలను గ్రహిస్తాడో అతడు నరకగామి అవుతాడని వ్రాయబడింది.

ఇప్పుడిక పోపులు, పోపు శిష్యులు ఏ వారంనందునూ ఏ తిథిలోనూ భోజనం చేయరాదు. భోజనంగాని, పానంగాని చేసినవాడు నరకగామి అవుతాడు. 'నిర్ణయసింధు' 'ధర్మసింధు' వంటి గ్రంథాలు ప్రజలకు ఆపత్కరంగా మారాయి. వాటిలో ఒక్కొక్క వ్రతానికి కలిగించిన దుర్దశ ఇంతింతకాదు. ఉదా:- ఏకాదశి రోజున శైవుడు దశమీవిద్ధను, ద్వాదశినాడు కొందరు ఏకాదశీ వ్రతం చేస్తారు. ఆకలితో చావటానికి కూడా వాద వివాదాలు చేసే పోపు లీల చాలా విచిత్రమైనది. ఏకాదశీ వ్రతాన్ని ప్రచారం చేసి వానిలో తన స్వార్థాన్ని ఇమిడ్చాడే కాని కించిన్మాత్రం కూడా దయలేదు. అతడు ఇంకా ఇలా అంటాడు.

ఏకాదశ్యామన్నే పాపాని వసంతి ॥

ఏకాదశినాడు పాపాలన్నీ అన్నంలో ఉంటాయని వారు చెబుతున్నారు. ఈ విషయంలో - 'ఎవరి పాపం అన్నంలో ఉంటుంది. నీ పాపమా? నీ తండ్రి పాపమా? ఎవరి పాపాలన్నీ అన్నంలో ఉంటాయి' అని ఆ పోపును అడగాలి. ఆ రోజున పాపాలన్నీ వెళ్ళి అన్నంలో వసించిన లోకంలో ఎవరికీ ఎలాంటి దుఃఖం కలుగరాదు. ఏకాదశినాడు దుఃఖాలు ఎవరికీ కలుగవా? కలుగుతూనే ఉంటాయి. ఉపవాసం చేసేవారు, తిండి లేనివారి ఆకలి బాధతో పీడితులైతూనే ఉంటారు. దుఃఖం పాపఫలం, కాబట్టి ఆకలితో బాధపడటం, చావటం పాపం.

ఏకాదశీ వ్రతమాహాత్మ్యం గొప్పగా చేస్తారు. దీని కథను చదివి వినిపించి ప్రజలను మోసగించారు. అందుకు ఒక గాథ:-

బ్రహ్మలోకంలో ఒక వేశ్య ఉండేది. ఆమె ఏదో కొంచెం అపరాధం చేసింది. ఆమెకు 'నీవు భూమిపై పడిపొమ్ము' అని శాపమివ్వబడింది. ఆమె భూమిపై పడి నేను స్వర్గానికి తిరిగి ఎలా

రాగలుగుతానని బ్రహ్మను స్తుతించింది. దాని కతడు ఎప్పుడైనా ఏకాదశి వ్రత ఫలాన్ని నీకు ఎవరైనా ఇచ్చిన తిరిగి స్వర్గానికి రావచ్చునన్నాడు. ఆమె విమాన సహితంగా ఒకానొక నగరంలో పడింది. అక్కడి రాజు ఆమెను నీవు ఎవరని అడిగాడు. అప్పుడు ఆమె తన వృత్తాంతమంతా వినిపించి ఇలా అన్నది. ఎవరైన నాకు ఏకాదశి వ్రతఫలం దానం చేస్తే మళ్ళీ స్వర్గానికి పోతాను. రాజు తన నగరంలో వెదికించాడు ఏకాదశి వ్రతమాచరించే వారెవరూ లభించలేదు. కాని ఒక రోజున ఒక శూద్ర స్త్రీ పురుషులకు జగడం అయ్యింది. కోపంతో ఒక పగలు, ఒక రాత్రి ఆకలితో ఉన్నారు. దైవయోగం వలన ఆ రోజు ఏకాదశి అయ్యింది. నేను ఏకాదశి అని తెలిసి ఉపవాసం చేయలేదు. హఠాత్తుగా ఆ రోజున ఆకలితో ఉన్నానని ఆమె అన్నది. ఇలాగే రాజభటులతో అన్నారు. అప్పుడు వారు ఆమెను రాజు సమక్షానికి తీసుకొని వచ్చారు. ఆమెతో రాజు నీవు ఈ విమానాన్ని స్పర్శించమన్నాడు. ఆమె స్పర్శించింది. ఇక చూడండి వెంటనే విమానం పైకి లేచింది. ఇది తెలియక చేసిన ఏకాదశి వ్రత ఫలం. ఇక తెలిసి చేసిన ఆ ఫలానికి ఒక పరిమితి ఉంటుందా! ఆహా! ఓ కళ్ళున్న అజ్ఞాన అంధులారా! ఈ విషయం నిజమని నమ్ముతున్నారా? నమ్మినచో ఒకపని చేయండి. స్వర్గంలో తాంబూలపు విడెములు దొరకవు. ఏకాదశీ వ్రతము చేయువారు తమ వ్రతఫలముతో ఒక్కొక్కవిడెమును స్వర్గానికి పంపుమనుడు. ఒక తమలపాకు విడెము పైకి పోయినట్లైన ఇక లక్షల, కోట్లకొలది తాంబూలాలను అక్కడికి పంపవచ్చును. మనం కూడా ఏకాదశి వ్రతమాచరించుదాం. వ్రతం పేరుతోనైనా ఈ ఆకలి చావుల రూప ఆపత్కాలం నుండి రక్షించబడుదాం.

నెలకు రెండు చొప్పున సంవత్సరానికి 24 ఏకాదశులు వస్తాయి. ఈ 24 ఏకాదశుల పేర్లు వేర్వేరుగా పెట్టబడ్డాయి. ఒక ఏకాదశికి 'ధనదా' అనీ, మరొకదానికి 'కామదా? అనీ, ఇంకొక దాని పేరు 'పుత్రదా' అనీ, ఇంకా మరొకదానికి 'నిర్జలా' అనీ నామాలున్నాయి. అనేక మంది దరిద్రులు, కాముకులు, నిర్వంశస్తులు ఏకాదశి వ్రతమాచరించి వృద్ధులైనారు. మరణించారు కూడా. కాని ధనం గాని, కామితార్థాలను కాని, పుత్ర ప్రాప్తిని కాని పొందలేదు. జ్యేష్ఠమాస శుక్లపక్షంలో ఒక ఘడియ జలం త్రాగకుంటే మానవుడు వ్యాకులుడవుతాడు. వ్రతమాచరించేవారికి అత్యంతాధిక దుఃఖం కలుగుతుంది. విశేషించి బెంగాలులో ఏకాదశి నాడు విధవా స్త్రీలందరికీ గొప్ప దుర్దశ కలుగుతున్నది. ఈ వ్రతమహాత్మ్యమును వ్రాయువాడు దయలేని కసాయి వంటివాడు. జ్యేష్ఠమాసపు ఏకాదశికి సజల ఏకాదశియని, పుష్యమాసము 'ఏకాదశి'కి నిర్జల ఏకాదశి అని పేరు పెట్టవలసి యుండెను. దీని వల్ల కొంత బాధ తగ్గేది. కాని ఈ పోపుకు దయతో పనేమి? ఎవరు జీవించినా మరణించినా పోపు ఉదరం పూర్తిగా నిండాలి.

బాగున్నది. గర్భవతులు, సద్యో వివాహిత స్త్రీ, బాలురు, యువకులైన స్త్రీ పురుషులు ఎన్నడూ ఉపవాసం ఉండరాదు. కాని ఎవరైన ఉపవాసం ఉండాలనుకుంటే అజీర్ణంగా ఉన్నవాడు, క్షుధ

కలుగని రోజులో చక్కెరతో కూడిన శరబతు కాని, పాలు కాని త్రాగుతుండాలి. ఆకలి ఉన్నప్పుడు తిననివాడు, లేనప్పుడు భుజించేవాడు. ఈ ఇద్దరూ రోగసాగరంలో మునిగి దుఃఖాన్ని పొందుతారు, ఇలాంటి వ్రతాలకు ఎలాంటి ప్రమాణాలుండవు.

లుప్తవేదశాఖలలో మూర్తిపూజ ఉన్నది

ఇప్పుడు గురుశిష్యుల మంత్రోపదేశాలను గురించీ, మతమతాంతరాల చరిత్రను గురించీ చెప్పెదము.

ప్రశ్న:- విగ్రహారాధకులు వేదాలు అనంతాలని, ఋగ్వేదానికి ఇరవై ఒక్క (21) శాఖలు, యజుర్వేదానికి నూట ఒక్క (101) శాఖలు, సామవేదానికి ఒక సహస్ర (1000) శాఖలు, అథర్వ వేదానికి తొమ్మిది (9) శాఖలున్నాయనీ, ఇందులో కొన్ని శాఖలు లభిస్తాయనీ, మిగిలినవి లోపించాయనీ చెపుతారు. ఈ లోపించిన వాటిలో మూర్తిపూజను గురించి, తీర్థాలను గురించి ప్రమాణాలు ఉన్నాయి. అవి లేకుంటే పురాణాలలోనికి ఎక్కడ నుండి వస్తాయి? కార్యాన్ని చూసి కారణాన్ని అనుమానించవచ్చు. ఇక పురాణాలలోని మూర్తిపూజ వర్ణనరూపకార్యాన్ని బట్టి వేదమూలమునేల ఊహింపరాదు? దీనివలన కలుగు దోషమేమిటని ప్రశ్నిస్తారు.

జవాబు:- వృక్ష శాఖలన్నీ ఆ వృక్షం లాగానే ఉంటాయి. దానికి విరుద్ధంగా ఉండవు. శాఖలు మాత్రం కొన్ని చిన్నవిగా, మరికొన్ని పెద్దవిగా ఉండవచ్చు. కాని వానిలో విరుద్ధ భావం ఉండదు. అలాగే ఎన్ని వేదశాఖలు లభించినవో వానిలో పాషాణ మూర్తుల, జల, స్థల విశేష ప్రాముఖ్యత గల తీర్థ ప్రమాణాలు లేనప్పుడు, లోపించిన శాఖలలో కూడా ప్రమాణలుండవు. చతుర్వేదాలు సంపూర్తిగా లభిస్తాయి. వాటి ద్వారా విరుద్ధ శాఖలు ఎప్పుడూ ఏర్పడలేవు. ఒకవేళ విరుద్ధాలుగా ఉన్నా వాటిని శాఖలని ఎవరూ ఋజువుపరచలేరు. ఈ విషయం ఇలా ఉండగా పురాణాలు వేదశాఖలు ఎలా కాగలవు ? కావు. కాని మత సాంప్రదాయకులు పరస్పర విరుద్ధ రూప గ్రంథాలను రచించి పెట్టరు.

వేదాలను నీవు పరమేశ్వర కృతాలుగా విశ్వసించిన 'అశ్వలాయనాది, ఋషిమునుల నామాలతో ప్రసిద్ధి చెందిన గ్రంథాలను వేదాలని ఎలా విశ్వసిస్తావు. కొమ్మలను, ఆకులను దర్శించిన ఇది రాగి, మఱ్ఱి, మామిడి మొదలైన వృక్షాల గుర్తింపు కలిగినట్లుగా ఋషి మునులతో రచించబడిన వేదాంగాలను చతుర్బ్రాహ్మణాలు, అంగాలు, ఉపాంగాలు, ఉపవేదాలతో వేదార్థం గుర్తించబడింది. అందువలన ఈ గ్రంథాలను వేదశాఖలుగా అంగీకరిస్తారు. వేద విరుద్ధమైనవి ప్రమాణాలు కావు. అనుకూలమైనవీ ప్రమాణాలు.

కనిపించని శాఖలలో నీవు మూర్త్యాది ప్రమాణాలను కల్పించినప్పుడు మరికొందరు ఈ క్రింది పక్షాన్ని కూడా అవలంబించి లోపించిన శాఖలలో వర్ణాశ్రమ వ్యవస్థకు వ్యతిరేకార్థం. అంటే అంత్యజ,

శూద్రుల నామాలు బ్రాహ్మణాదులని మరియు బ్రాహ్మణాది నామాలను శూద్ర, అంత్యజాదులని, అగమ నీయమానికి ఆగనమనని, అకర్తవ్యానికి కర్తవ్యమని, మిథ్యాభాషణాలను ధర్మాలని, సత్యభాషణాలు అధర్మాలని ఇత్యాదులను వ్రాసి ఉండవచ్చు. దానికి మేమే సమాధానం ఇస్తామో నీవు కూడా అదే సమాధానమిత్తువు. వేదాలలో, ప్రసిద్ధ శాఖలలో బ్రాహ్మణులను బ్రాహ్మణులనీ, శూద్రులను శూద్రులనీ వ్రాసినట్లుగానే లోపించిన శాఖలను కూడా అంగీకరించాలి. లేకుంటే వర్ణాశ్రమ వ్యవస్థలన్నీ అస్తవ్యస్తాలవుతాయి.

చూడండి! జైమిని, వ్యాస, పతంజలుల కాలంవరకు శాఖలన్నీ ఉన్నవా? లేవా? ఒకవేళ లేకుంటే నీవెప్పుడు నిషేధించలేవు. లేవన్నా ఇక శాఖలున్నాయనటానికి ప్రమాణమేమి? జైమిని మహాముని మీమాంసలో సమస్త కర్మకాండను, పతంజలిముని యోగశాస్త్రంలో ఉపాసనాకాండను, వ్యాసముని శారీరిక సూత్రాలలో జ్ఞానకాండను వేదానుకూలంగా వ్రాసారు. వాటిలో పాషాణాది మూర్తి పూజలు, ప్రయాగాది తీర్థాల నామాలను నామ మాత్రానికి కూడా ఏ చిహ్నాలను వ్రాయలేదు. చూడండి. వారు ఎక్కడి నుండి వ్రాస్తారు? వేదాలలో ఎక్కడైనా ఉంటే కదా వ్రాయడానికి. కావున లోపించిన శాఖలలో కూడా ఈ మూర్తి పూజలకు ప్రమాణాలు లేవని తెలుసుకోండి.

శాఖలు వేదాలు కావు

ఈ శాఖలన్నీ వేదాలు కావు. ఎందుకంటే వీటిలో ఈశ్వర కృత వేదాలకు ప్రతికూలాలను ఆలోచించి, వర్ణించి ప్రాపంచిక జనుల ఇతిహాసాది విషయాలను వ్రాసారు. కావున వేదాలలో ఎప్పుడూ ఇలాంటి విషయాలు ఉండవు. వేదాలలో మానవులకు కేవలం విద్యను గురించే ఉపదేశం చేయబడింది. ఏ మానవులను గురించి నామమాత్రమైన కూడా వ్రాయబడలేదు. కాబట్టి మూర్తిపూజ ఖండించబడింది.

మూర్తిపూజలతో మహాపురుషుల నింద

మూర్తిపూజ ద్వారా శ్రీరామచంద్రునికి, శ్రీకృష్ణునికి, నారాయణునికి, శివునికి చాలా నిందలు, అపహాస్యాలు జరుగుతున్నాయి. వారు గొప్ప మహారాజాధిరాజులని, వారి స్త్రీలైన సీత, రుక్మిణి, లక్ష్మి, పార్వతి మొదలైనవారు మహారాణులని అందరికీ తెలుసు. కానీ వారి మూర్తులను మందిరంలో ఉంచి పూజారులు వారి పేర్లతో భిక్షమడుగుకొంటున్నారు. అంటే వారిని బిచ్చగాండ్లుగా చేస్తున్నారు. ఓ మహారాజా రమ్ము. మహారాజాధి రాజులారా! గొప్ప వ్యాపారులారా! దర్శించండి. కూర్చోండి. చరణామృతాన్ని గ్రోలండి. ఏమైన కానుక, దక్షిణల నివ్వండి. మహారాజా! సీతారాములకు, రుక్మిణీకృష్ణులకు లేక రాధాకృష్ణులకు, లక్ష్మీనారాయణులకు మరియు పార్వతీ మహాదేవులకు మూడురోజుల నుండి బాలభోగంకాని, రాజభోగం అంటే జలపానంగాని లేక భోజనాలు కాని లభించలేదు. నేడు వీరివద్ద ఏమి కూడా లేదు. సీతకు ముక్కుపుడకలను, ఓ రాణిగారూ! ఓ గొప్ప వారి వ్యాపారపత్నులారా! తయారుచేయించండి. ఆహార పదార్థాలను పంపించిన రామకృష్ణులకు

భోగం, నైవేద్యం పెడతాం. వస్త్రాలన్నీ చిరిగిపోయాయి. మందిరం మూలలన్నీ కూలాయి. పైనుండి పెంకులు రాలిపడుతున్నాయి. దుష్టులైన చోరులు ఏది ఉంటే దాన్ని ఎత్తుకుపోతున్నారు. కొన్నింటిని ఎలుకలు కొరికి పెట్టాయి.

ఒక రోజు మూషికాలు ఈ విగ్రహాల కండ్లు ఎత్తుకొని పారిపోయి గొప్ప అనర్థాన్ని కలిగించాయి. ఇప్పుడు మేము వెండికండ్లను చేయించలేకపోయాము. ఇందువలన గవ్వకండ్లను పెట్టాము. రామలీలలు, రాసమండలులు కూడా జరుపబడుచున్నాయి. సీతారాములు, రాధాకృష్ణులు ఆడుతున్నారు. రాజులు మరియు మహంతులు, వారి సేవకులు ఆనందంగా కూర్చున్నారు. మందిరంలో సీతారాములు నిలిచి ఉంటే పూజారులు లేక మహంతులు ఆసనంపై లేదా పరుపులపై దిండ్లనుంచుకుని కూర్చుంటారు. తీక్షణ వేసవిలో కూడా తాళంవేసి లోపల బంధిస్తారు. మీరు మంచి స్వచ్ఛమైన గాలిలో మంచం వేసుకొని నిద్రిస్తారు. అనేక మంది పూజారులు తమ నారాయణుని ఒక చిన్న డబ్బాలో బంధించి పైనుండి వస్త్రాలతో కట్టి కంఠంలో వ్రేలాడవేసుకొంటారు. ఆడ వానరం తన బిడ్డను నడుమున వ్రేలాడ వేసుకొనినట్లుగా పూజారుల మెడలలో కూడా ఇవి వ్రేలాడుతుంటాయి. విగ్రహాలను ఎవరైనా విరుగగొట్టినపుడు అయ్యో! అయ్యో! అంటూ, వక్షస్థలాలను బాదుకొంటూ సీతారాములను, రాధాకృష్ణులను మరియు శివపార్వతులను దుష్టులు విరుగగొట్టారని అరుస్తారు. ఇప్పుడు మంచి శిల్పులు పాలరాతితో తయారుచేసిన వేరే మూర్తులను తెప్పించి స్థాపించి పూజించాలి. నారాయణునికి నేయి లేక నైవేద్యం పెట్టలేదు. చాలా లేకుంటే కొద్దిగానైన తప్పక పంపుము అనేటి మాటలను పలుకుతారు.

ఇక రాసమండలం, రామలీలల ముగింపులో సీతారాములతో రాధాకృష్ణులతో భిక్షమెత్తిస్తారు. జాతరలు ఉత్సవాలు జరిగేచోట, చిన్నపిల్లలకు ఒక కిరీటాన్ని పెట్టి బాలకృష్ణునిగా చేసి దారిలో కూర్చుండబెట్టి భిక్షం అడిగిస్తారు. ఇలాంటి విషయాలను మీరు ఆలోచించండి. ఇవి ఎంత దుఃఖదాయకాలో కదా!

బాగున్నది. సీతారాములు ఇంత దరిద్రులు, భిక్షకులా? చెప్పండి? ఇది వారిని పరిహసించటం, నిందించటం కాక మరేమిటి? దీనివల్ల మన మర్యాదాపురుషులను బాగా నిందించటం జరుగుచున్నది. వారు జీవించిన కాలంలో సీతా, రుక్మిణి, లక్ష్మి, పార్వతులను రోడ్డుపై గాని లేక ఏదైనా మందిరంలాంటి గృహంలో గాని, నిలబెట్టి పూజారులు 'ఓ భక్తజనులారా! రండి. వీరిని దర్శించండి. ఏదైనా కానుకలు, దక్షిణలను పూజకై పెట్టండి' అని అంటే వారు సహించేవారా? వారిని దండించక విడిచిపెట్టేవారా? ఇలాంటి దండనలు పూజారులకు జరుగనందువల్లనే ఇట్టి అనాచారాలు ప్రబలినవి. వారివలన లభించకున్నను పూజారుల కుకర్మలకు తగిన ఫలాలు మూర్తి భంజకులవలన లభిస్తూనే ఉన్నవి. ఇక ముందూ అట్లే లభించగలవు. కుకర్మలను విడువనంతవరకు వీరికి ఆపదలు తప్పవు. ఔను వీటివలననే ఆర్యావర్తానికి ప్రతిరోజు మహానష్టం, పాషాణ మూర్తిపూజకులకు పరాజయం కలుగుచున్నది. ఈ

కర్మల ద్వారానే ఇవి కలుగుతున్నాయనటంలో సందేహమే లేదు. ఎందుకంటే పాపానికి ఫలం దుఃఖం. ఈ పాషాణ మూర్తుల పట్ల గల విశ్వాసంతో అనేక నష్టాలు కలిగాయి. ఈ విగ్రహారాధన విడిచిపెట్టకుంటే ప్రతిదినం నష్టం కలుగుతూనే ఉంటుంది.

మారణహోమాలు

వీరిలో వామమార్గీయులు ఒక గొప్ప అపరాధకులు. వారు శిష్యులను చేసుకొను నప్పుడు.

దం దుర్గాయైనమః । భం భైరవాయనమః । ఐం హ్రీం క్లీం చాముండాయై విచ్చే ॥

ఇలాంటి మంత్రోపదేశం చేస్తూ బెంగాలులో ఏకాక్షరమంత్రోపదేశం చేస్తారు.

ఉదా:- హ్రీం. శ్రీం. క్లీం. ॥ శావరతం. వ. ప్రకీ. పు. 44 ॥

ఇలాంటి మంత్రాలతో ధనాఢ్యులకు పూర్ణాభిషేకం చేస్తారు. ఇలాంటివే దశమహావిద్యల మంత్రాలు.

హ్రాం. హ్రీం. హ్రూం బగలాముఖ్యై ఫట్ స్వాహా ॥ (శా.ప్రకీ. ప్ర. 41)

మరియు హ్రూం ఫట్ స్వాహా ॥ (కామ రత్న తంత్రబీజ మంత్ర 4)

మంత్ర తంత్ర ప్రయోగాలు

ఇంకా మారణ, మోహన, ఉచ్చాటన, విద్వేషణ, వశీకరణాది ప్రయోగాలను చేస్తారు. ఈ మంత్రాల వల్ల ఏదీ జరుగదు. అంతా క్రియలద్వారా చేస్తారు. ఒకన్ని చంపటానికి ప్రయోగం చేసినపుడు ఇలా చేయించేవారి నుండి ధనం తీసుకొని పిండితోగాని లేక మట్టితోగాని చంపాలనుకున్న వారి బొమ్మను చేస్తారు. దాని ఛాతిలో గాని, నాభిలో గాని, కంఠంలో గాని కత్తులను గ్రుచ్చుతారు. కండ్లలో, చేతులలో, పాదాలలో చీలలను నాటుతారు. దానిపై భైరవుని, లేక దుర్గా మూర్తిని చేసి చేతికి త్రిశూలం ఇచ్చి దాని హృదయంపై ఆనిస్తారు. ఒక వేదికను సిద్ధంచేసి, మాంసాలతో హోమం చేయడం ఆరంభిస్తారు. అలా ఒక దూతను గాని, సేవకుని గాని పంపి అతనిని విషాలతో చంపటానికి ఉపాయం ఆలోచిస్తారు. తమ పునశ్చరణ అంటే మంత్రావృత్తి మధ్య అతనిని చంపిన తమను భైరవదేవీ యొక్క సిద్ధిని పొందినవానిగా తెలుసుకొంటారు.

"భైరవో భూతనాథశ్చ ॥" లాంటి మంత్రాలను పఠిస్తారు.

మారయ మారయ. ఉచ్చాటయ ఉచ్చాటయ. విద్వేషయ విద్వేషయ, ఛింది ఛింది, భింది భింది, వశీకురు, వశీకురు, ఖాదయ ఖాదయ, భక్షయ, భక్షయ త్రోటయ త్రోటయ, నాశయ నాశయ, మమశత్రూన్ వశీకురు వశీకురు, హుంఫట్ స్వాహా ॥

(కామరత్న తంత్ర ఉచ్చాటన ప్రకరణ మం. 5-7)

ఇలాంటి మంత్రాలను జపిస్తూ, మద్యమాంసాలను యథేష్టంగా తింటూ త్రాగుతారు. భృకుటి మధ్య సింధూరరేఖలను పెడతారు. అప్పుడప్పుడు కాళీ మొదలైనవానికై ఒక మనుష్యుని పట్టుకొని చంపి హోమం చేసి కొంచెం కొంచెం అతని మాంసాన్ని కూడా తింటారు. భైరవీచక్రంలోనికి పోయి మద్యమాంసాలను త్రాగి తినకుంటే అతనిని చంపి హోమం చేస్తారు. వారిలో అఘోరీ అనేవాడు చనిపోయిన మానవుడి మాంసాన్ని భుజిస్తాడు. 'అజరీ బజరీ' చేసేవారు మలమూత్రాలను కూడా సేవిస్తుంటారు.

చోలీమార్గం, బీజమార్గం

చోలీమార్గంవారు, బీజమార్గంవారని రెండు మార్గాలవారు ఉంటారు. చోలీ మార్గంవారు, భూమిలోగానీ, మరొకచోట గానీ రహస్యస్థావరం ఏర్పర్చుకొంటారు. అక్కడ అందరూ - స్త్రీలు, పురుషులు, తల్లి, అక్క, చెల్లెలు, అన్న, తమ్ముడు, కోడలు అనే భేదం లేకుండా చిన్నలు, పెద్దలు అందరూ చేరుతారు. అందరూ కలిపి మద్యం త్రాగి మాంసం తింటారు. అందొక స్త్రీని నగ్నంగాచేసి ఆమె గుప్తేంద్రియాలను పురుషులందరూ పూజిస్తారు. అలాగే ఒక పురుషున్ని నగ్నంగా చేసి అతని గుప్తేంద్రియాన్ని స్త్రీలందరూ పూజిస్తారు.

కల్లు, సారాయి త్రాగి మత్తులో మునిగి పోయినపుడు స్త్రీల రవికెలన్నీ దీసి ఒక మట్టితొట్టిలో వేసి వాటిని కలిపి వేస్తారు. తర్వాత ఎవరి చేతికి దొరికిన రవికెను - పురుషులు తీసుకొని ఆ రవికె ఏ స్త్రీకి సంబంధించినదో ఆ స్త్రీ తల్లియైనా, కుమార్తెయైనా, అక్క, చెల్లెలు, కోడలు ఎవరైనా సరే ఆమెతో ఆ పురుషుడు వ్యభిచరిస్తాడు. ఇలా కుకర్మ ఆచరిస్తూ బాగా మత్తెక్కిన మీదట తెలియక చెప్పులతో కూడా కొట్టుకుంటారు. తర్వాత తెల్లవారకముందే తమ తమ ఇండ్లకు చేరుకొంటారు. అప్పుడు మళ్ళీ వావివరుసలు పాటిస్తారు. తల్లిని తల్లిగాను, బిడ్డను బిడ్డగాను, భార్యను భార్యగాను చూసుకొంటారు.

ఇక బీజమార్గాన్ని అనుసరించేవారు స్త్రీపురుషులు సంగమం చేసి వీర్యాన్ని నీటిలో కలిపి త్రాగుతారు. ఇది ముక్తికి మార్గమని ఈ పామరులు అనుకుంటారు. వీరిలో విద్య, విచారణ సజ్జనత నామమాత్రమైనా ఉండవు.

శైవమత ఖండన

ప్రశ్న:- శైవమతంవారు మంచివారై ఉండవచ్చు?

జవాబు:- వారు మాత్రం ఎలా మంచివారవుతారు? ప్రేతనాథుని వంటి వాడే భూతనాథుడు కూడా. వామమార్గులు మంత్రోపదేశాలతో ధనం హరించునట్లు శైవులును **'ఓం నమః శివాయ'** అనే పంచాక్షరీ మంత్రాన్ని ఉపదేశిస్తారు. రుద్రాక్షమాలలు ధరిస్తారు. భస్మధారణం చేస్తారు. మట్టితోగాని, పాషాణాలతో గాని లింగాలను చేసి పూజిస్తారు.

'హర హర బం బం' అని మేకపోతుల లాగా నోటితో 'బడబడ' శబ్దాలను చేస్తారు. దానికి కారణమిలా చెపుతారు. చప్పట్లు కొట్టి 'బంబమ్మ'ను శబ్దం చేసినచో పార్వతి ప్రసన్నమవుతుంది. మహాదేవుడు అప్రసన్నమవుతాడు. కారణమేమిటంటే, భస్మాసురుని నుండి మహాదేవుడు పారిపోయినపుడు బంబమ్మను శబ్దం ఎగతాళికి సంబంధించిన చప్పట్లు కలిగాయట. దవడలు వాయించినందుకు మేకపోతు ధ్వనివంటి ధ్వని చేసినచో పార్వతి అప్రసన్నమవుతుంది. ఎందుకంటే, పార్వతి తండ్రియైన దక్షుని శిరస్సు త్రుంచి హోమం చేసి మొండెంపై మేకపోతు శిరస్సును అంటించారు. ఆ అనుకరణను మేక శబ్దంలాగా దవడలాడిస్తున్నారని పార్వతి అప్రసన్నురాలవుతుందని విశ్వసిస్తారు. శివరాత్రికి ప్రదోష వ్రతమాచరిస్తారు. వీటితో ముక్తి కలుగుతుందని భావిస్తారు. వామమార్గీయులు భ్రాంతి చెందినట్లే శైవులు కూడా భ్రాంతి చెంది ఉన్నారు. విశేషించి వీరిలో చెవిపోగులవారు, ముక్కుపోగులవారు, గిరిజనులు, పురజనులు, వనవాసులు, అరణ్యవాసులు, పర్వత వాసులు, సాగరతీరవాసులు, గృహస్థులు కూడా శైవులవుతారు. కొందరు జోడు గుర్రాలను ఎక్కటం అంటే వామ, శైవ మతాలను రెండింటినీ అంగీకరిస్తారు. ఎంతోమంది వైష్ణవులు కూడా ఉంటారు. వారిని గురించి కూడా తెలిపుతాను.

వైష్ణవమత విమర్శ

అంతః శాక్తా బహిశ్శైవాః సభా మధ్యే చ వైష్ణవాః ।
నానా రూప ధరాః కౌలా విచరంతి మహీతలే ॥ కులార్ణవ తంత్ర గ్రంథ శ్లోకం

ఇది తంత్రంలోని శ్లోకం. లోపల శాక్తులుగా అంటే వామమార్గీయులు గాను, బయటికి శైవులుగా అంటే రుద్రాక్షలను, భస్మాన్ని ధరిస్తారు. ఇక సభలో వైష్ణవులు అనబడతారు. మేము విష్ణువును ఉపాసించేవారం. ఇలా అనేక విధరూపాలను దాల్చి వామమార్గీయులు ప్రపంచంలో విహరిస్తున్నారు.

ప్రశ్న:- వైష్ణవులైనా మంచివారా? కాదా?

జవాబు:- ఏమి మంచి మన్ను మంచి. వారెంతో వీరు కూడా అంతే. వీరు విష్ణువునకు దాసులట. ఈ వైష్ణవుల లీలలు చూడండి. వీరు అందరి కంటే గొప్పవారట. వీరిలో చక్రాంకితులైన శ్రీవైష్ణవులుంటారు. కాని ఆ గొప్పతనం వారిలో ఏ కొంచెమూ లేదు.

ప్రశ్న:- ఎందుకు? ఏ కొంచెం లేదు? అన్నీ ఉన్నాయి. చూడండి? లలాటంలో నారాయణుని చరణారవిందం లాగా ఉన్న తిలకం. ఇక మధ్యనున్న పచ్చని రేఖ శ్రీ ఉంటుంది. ఇందువల్లనే మేము శ్రీ వైష్ణవులం అనబడతాము. నారాయణుని తప్ప వేరెవ్వరినీ నమ్మము. మహాదేవుని లింగాన్ని కూడా చూడము ఎందుకంటే మా లలాటంలో శ్రీ ప్రకాశిస్తున్నది. మేము లింగాన్ని చూస్తే ఆమె సిగ్గుపడుతుంది. అలా మందారాది స్తోత్రపాఠాలను పఠిస్తాము. మంత్రపూర్వకంగా నారాయణుని పూజిస్తాము. మాంసాన్ని తినము. మధ్యాన్ని సేవించము. ఇక మేము మంచివార మెందుకు కాము?

జవాబు:- ఈ తిలకాన్ని హరి పాదాకృతియనీ, ఈ పచ్చని రేఖను శ్రీ అని భావించటం వ్యర్థం. ఎందుకంటే ఇది మీ హస్తకళ. ఇక లలాటచిత్రం ఏనుగు లాలటంలో దిద్దబడే చిత్రంలాగా విచిత్రం కలిగిస్తుంది. మీ లలాటంలో గల విష్ణుపాద చిహ్నమెక్కడినుండి వచ్చింది. ఎవరైన వైకుంఠాన్ని వెళ్ళి విష్ణుపద చిహ్నాన్ని లలాటంలో దిద్దుకొనివచ్చాడా?

వివేకవంతుడు:- ఇక ఈ శ్రీ (లక్ష్మి) జడమా? లేక చేతనమా?

వైష్ణవుడు:- చేతనం కలది.

వివేకవంతుడు:- మరి ఈ రేఖ జడమైయున్నది కాన శ్రీ కాదు. ఈ శ్రీ చేయబడినదా? లేక చేయబడనిదా? అని మేము ప్రశ్నిస్తున్నాము. చేయబడనిదైన ఇది శ్రీకాదు. ఎందుకంటే దీనిని నీవు నిత్యం నీ చేతితో చేస్తావు. కాబట్టి అది శ్రీ కాలేదు. నీ లలాటంలో శ్రీ ఉంటే ఎందరో వైష్ణవుల ముఖాలు అందవిహీనం అంటే శోభారహితంగా ఎలా కనిపిస్తాయి? లలాటంలో శ్రీ పెట్టుకొని ప్రతిగృహంలో భిక్ష మెత్తుతూ, సదా బ్రతుకు తెరువును తీసుకొని పొట్ట నింపుతూ ఎందుకు తిరుగుతావు? ఈ విషయం సిగ్గులేని వాళ్ళది మరియు మస్తకంలో శ్రీని ఉంచుకొని మహా దరిద్రుల కార్యం.

వీరిలో ఒక పరికాలుడను పేరు గల వైష్ణవ భక్తుడున్నాడు. అతడు దొంగతనం చేసి, దారులు కొట్టి మోసగించి కపటంతో ఇతరుల ధనం అపహరించి వైష్ణవులకు ఆ డబ్బు ఇచ్చి ప్రసన్నుడవుతుంటాడు. ఒకసారి అతనికి దొంగతనంలో ఏదీ దొరకలేదు. ఎవరిని దోచాలా అని వ్యాకులుడై తిరుగుతున్నాడు. ఇలాంటి సమయంలో నారాయణుడు తన భక్తుడు దుఃఖం పొందుతున్నాడని తెలుసుకొన్నాడు. ఒక గొప్ప వ్యాపారి రూపాన్ని ధరించి, ఉంగరాల వంటి ఆభూషణాలను ధరించి రథంలో కూర్చొని ముందుకు వచ్చాడు. అప్పుడు పరికాలుడు కూడా రథం దగ్గరకి వెళ్లాడు. వర్తకునితో వస్తువులనన్నింటినీ తొందరగా తీయండి లేకుంటే చంపుతానన్నాడు. అన్నింటిని తీస్తూ తీస్తూ ఉంగరాన్ని తీయటంలో ఆలస్యమయ్యింది. పరికాలుడు నారాయణుని వ్రేలును కోసి ఉంగరాన్ని తీసుకొన్నాడు. అందుకు నారాయణుడు అతిగా సంతోషించి చతుర్భుజ శరీరుడై దర్శనం ఇచ్చి నీవు నా ప్రియభక్తుడవు. ఎందుకంటే అందరిని చంపి, కొల్లగొట్టి, దొంగిలించి వైష్ణవులను సేవిస్తావు. ఇందువలన నీవు ధన్యుడవని చెప్పాడు. ఆ తర్వాత పరికాలుడు వెళ్ళి వైష్ణవుల ముందర ఆ నగలన్నింటిని పెట్టాడు.

ఒకానొక సమయంలో ఒక వర్తకుడు పరికాలుని నౌకరుగా ఉంచుకొని నౌకలో కూర్చోబెట్టుకొని దేశాంతరానికి తీసుకుపోయాడు. అక్కడి నుండి తిరుగు ప్రయాణంలో నౌకలో పోకలను నింపాడు. పరికాలుడు ఒక పోకను పగులగొట్టి సగం ముక్కను చేసి వ్యాపారితో ఈ సగం పోకను నౌకలో ఉంచండి. నౌకలో అర్థ పోక పరికాలునిదని వ్రాయమన్నాడు. అందుకు వ్యాపారి నీకు కావలసినది సగం పోకేగా కావలంటే సహస్ర పోకలను తీసుకోమన్నాడు. పరికాలుడు వద్దు నేను ధర్మాత్ముడ్ని

అసత్యమైన దానిని తీసుకోను. నాకు సగమే కావాలి అన్నాడు. వ్యాపారి ఇతడు అమాయకుడని తలచి నిజముగా అమాయకుడైన వర్తకుడు వ్రాసి ఇచ్చాడు. మనదేశంలోని ఓడ రేవుకు నౌక వచ్చింది. పోకలు దించే ప్రయత్నం జరిగినప్పుడు పరికాలుడు తన సగం పోకను ఇవ్వమన్నాడు. వ్యాపారి అతడిచ్చిన సగం పోకను ఇవ్వబోయాడు. అప్పుడు పరికాలుడు నౌకలో నా సగం పోక ఉన్నది. ఆ సగం పంచుకొంటానని పోట్లాడసాగాడు. ఈ తగవు రాజపురుషుల దగ్గరకు పోయింది. పరికాలుడు వ్యాపారి సగం పోకను ఇస్తానని వ్రాసిన పత్రాన్ని చూపించాడు. వ్యాపారి ఎన్ని విధాలుగా చెప్పినా అతడు వినక నౌక నుండి సగం పోక తీసుకొని వైష్ణవులకు అర్పించాడు. అప్పుడు వైష్ణవులు చాలా సంతోషించారు. ఇప్పటికి ఆ దోపిడి దొంగ అయిన పరికాలుని మూర్తిని మందిరాలలో ఉంచుతారు. ఈ కథ భక్తమాలలో వ్రాయబడింది. వైష్ణవులు, వారి సేవకులు, నారాయణుడు ఈ ముగ్గురు దొంగల ముఠాకు చెందినవారా? కారా? బుద్ధిమంతులు ఆలోచించండి! మత మతాంతరాలలో కొద్దో గొప్పో మంచి ఉన్నప్పటికీ ఆ మతాలలో ఉన్నవారు మాత్రం పూర్తిగా మంచివారు కారు. సర్వదా మంచివాడు మాత్రం కాలేదు.

వైష్ణవ భేదాలు

వైష్ణవులలో కూడా పోట్లాటలు ఉన్నాయి. వీరు వివిధాలైన తిలకాలను, హారాలను ధరిస్తారు. రామానందులు ఇరుప్రక్కల గోపీ చందనం, మధ్య ఎరుపురేఖను ధరిస్తారనీ మా సాంప్రదాయకులు రెండు సన్నని రేఖల మధ్య నల్లని బిందువును ధరిస్తారు. మాధ్వులు నల్లనిరేఖ, గౌడులను బంగాలీలు చిన్న కత్తివంటి తిలకాన్ని, రామ ప్రసాద సాంప్రదాయకులు రెండు చంద్రాకారం వంటి రేఖల మధ్య తెల్లని గుండ్రని చుక్క మొదలైన తిలకాలు, చిత్ర విచిత్రాలుగా ఉంటాయి. ఇలా వీరి మాటలు కూడా విలక్షణంగా ఉంటాయి. రామానందులు నారాయణుని హృదయంలో ఎఱ్ఱని రేఖను లక్ష్మీచిహ్నం, గోసాయిలు శ్రీకృష్ణచంద్రుని హృదయంలో రాధా ప్రకాశిస్తున్నది అనే మాటలను తెలుపుతారు.

భక్తమాలలో ఒక కథ వ్రాయబడింది. ఒకానొక మానవుడు ఒక చెట్టునీడలో నిద్రిస్తున్నాడు. నిద్రలోనే అతడు మరణించాడు. పైనుండి ఒక కాకి రెట్ట వేసింది. అది లలాటంలో తిలకాకారమయ్యింది. అక్కడికి అతన్ని తీసుకొని పోవటానికి యమదూతలు వచ్చారు. ఇంతలో విష్ణుదూతలు కూడా అక్కడికి చేరుకొన్నారు. ఇరుదూతలు పోట్లాడసాగారు. మేము మా యజమాని ఆజ్ఞానుసారంగా యమ లోకానికి తీసుకొని పోతామని యమదూతలంటే, మా యొక్క యజమాని వైకుంఠానికి తీసుకొని రమ్మని ఆజ్ఞాపించాడని విష్ణుదూతలన్నారు. చూడండి ఇతని లలాటంలో వైష్ణవుల తిలకం ఉన్నదీ. మీరు ఎలా అతనిని కొనిపోతారని విష్ణుదూతలు, యమదూతలు మౌనంగా అక్కడ నుండి వెళ్ళిపోయారు. విష్ణుదూతలు అతన్ని ఏ ఇబ్బంది లేకుండా వైకుంఠానికి తీసుకొనిపోయారు. అతనిని నారాయణుడు వైకుంఠంలో ఉంచాడు.

హఠాత్తుగా తిలకం ఏర్పడటం చేతనే ఇంత మహాత్మ్యం ఉంటే ఎంతో ప్రేమతో, తమ హస్తాలతో తిలకాన్ని దిద్దుకొంటె వారు నరకం నుండి విముక్తులై వైకుంఠానికి వెళ్ళిన దీనిలో ఆశ్చర్యం ఏమున్నది చూడండి. చిన్న తిలకం పెట్టుకొన్నంత మాత్రాననే వైకుంఠానికి వెళ్లితే, ముఖమంతా లేపనం చేసుకొన్నా కానీ లేక నల్లని ముఖంగా చేసుకొన్నా లేక శరీరంపై లేపనం చేసుకొన్నచో వైకుంఠం కంటే కూడా ఇంకా ముందుకు వెళ్ళిపోతారా? పోరా? అని మేము ప్రశ్నిస్తాము. ఇవన్నీ వ్యర్థాలాపములని తెలుస్తున్నది.

ఖాఖీల సంప్రదాయం

వీరిలో కొందరు ఖాఖీ - ఒంటినిండా విభూతి పూసుకొని, లంగోటీ ధరించి కొయ్యలు మండుతున్న 'ధూనీ' - నెగడు చుట్టుచేరి మంట కాస్తుంటారు. వారు, జడలు పెంచుకొని, సిద్ధుల వేషాలు ధరించి ఉంటారు. కొంగజపం చేస్తుంటారు. గంజాయి, చరస్సుల పొగను పీలుస్తుంటారు. భంగు త్రాగి మత్తులో ఉంటారు. కళ్లు ఎర్రబడి ఉంటాయి. అందరినీ చిటికెడు పిండిపెట్టమని అడుగుతుంటారు. పైసలు అడుగుతూ ఉంటారు. పిల్లలను మోసగించి శిష్యులను చేసుకొంటుంటారు. వీరిలో ఎక్కువమంది కూలి నాలి చేసుకొనేవారు చేరుతుంటారు. ఎవడైనా విద్యను అభ్యసించాలనుకుంటే వారిని చదవుకోనివ్వరు. కాని ఇలా అంటారు.

పఠితవ్యం తదపి మర్తవ్యం న పఠితవ్యం తదపి మర్తవ్యం దంతకటాకటేతి కింకర్తవ్యమ్ ॥

సాధువులకు విద్య చదువవలసిన పని ఏమి? ఎందుకంటే విద్యను చదివేవారు చదువని వారూ మరణిస్తారు. ఇంతదానికి దంతాలు ఇటు-అటు కటకటా అని ఆడించవలసిన పనేమి? సాధువులు నాలుగు ఇండ్లు తిరిగి రావాలి. సాధువులను సేవించటం, రాముని భజించటం ఒక్కటే.

మూర్ఖత, అవిద్యతో కూడిన ఆకారాన్ని చూడదలిస్తే, ఖాఖీ సంప్రదాయకులను చూడండి. వారు మూర్తీభవించిన మూర్ఖులు వారివద్దకు ఎంతపెద్దవారైనా ఎవరైనా వెళ్లితే వారిని 'అబ్బాయి - అమ్మాయి' అని పిలుస్తారు. ఖాఖీ సంప్రదాయకులు తమ తల్లి తండ్రివంటి వయస్సు కలిగినవారిని కూడా అలాగే పిలుస్తారు.

ఖాఖీల లాగానే రూంఖడ్, సూంఖడ్, గోదడియే, సమూహంగా ఉండేవారు, సుతరేసాయీలు, అకాలీలు, చెవిపోగులు ధరించినవారు, జోగులు, ఔఘడులు మొదలైనవారు ఒకే విధంగా ఉంటారు.

'ఖాఖీ కథ'

ఒక ఖాఖీ వాని శిష్యుడు నీరు తెచ్చుటకు ఒక బావి దగ్గరకు వెళ్ళాడు. అక్కడొక పండితుడు కూర్చున్నాడు. బావికి వచ్చిన ఈ శిష్యుడు 'స్రీగనే సాఁజనమే' అని వల్లెవేయటం చూసి పండితుడిలా అన్నాడు. ఓరీ సాధూ! అశుద్ధంగా వల్లె వేస్తున్నావు. 'శ్రీ గణేశాయ నమః' అని వల్లించమన్నాడు.

అతడు వెంటనే చెంబు నింపుకొని వెళ్ళి గురువును సమీపించి ఇలా అన్నాడు. ఒక బ్రాహ్మణుడు నా వల్లె వేయటాన్ని తప్పంటున్నాడు. ఇది విని వెంటనే ఖాఖీ లేచి బావి దగ్గరకు పోయాడు. అక్కడ ఉన్న పండితునితో నీవు మా శిష్యున్ని మోసగించి తప్పుదారి పట్టిస్తున్నావా? అని అన్నాడు. నీవు గురువు యొక్క పంక్తులను ఏమి చదివావు? చూడండి ఈ ఒకే విధమైన పాఠాన్ని తెలుసుకొన్నావు. మేము త్రివిధాలైన పాఠాలను తెలిసి ఉన్నాము. 'శ్రీగణేశాజన్నమే", స్రీ గణేసాయ నృమే', 'స్రీ గనేసాయనమేం'.

పండితుడు:- ఓ సాధూ! విను. విద్యా విషయం చాలా కష్టం. ఇది చదువకుండా రాదు.

ఖాఖీ:- అరే పోరాపో! విద్వాంసులందరినీ నేను నూరి నూరి నలిపి, భంగులో కలిపి ఒకేసారి గుటుక్కుమన్నాను. సాధువుల మహత్తు ఏమనుకున్నావు? ఓరి బాపడా! నీకేమి తెలియును?

పండితుడు:- చూడండి. మీరు విద్య చదివిన ఇలాంటి అపశబ్దాలను ఉచ్చరించేవారు కారు. సర్వ విధాలుగా నీకు జ్ఞానం కలిగేది.

ఖాఖీ:- ఒరే! నీవు నా గురువవుతావా? నీ ఉపదేశాన్ని నేను వినను.

పండితుడు:- నీవు ఎక్కడ వింటావు? బుద్ధే లేదు. ఉపదేశాన్ని వినటానికి, అర్థం చేసుకోవటానికి విద్య కావాలి.

ఖాఖీ:- శాస్త్రాలన్నీ చదివి సాధువునే అంగీకరించకుంటే, అతడేమి చదువలేదని గుర్తించండి.

పండితుడు:- అవును. మేము సాధువులను సేవిస్తాము. కాని నీ వంటి సోమరిపోతులను సేవించము. ఎందుకంటే సాధువంటే సజ్జనుడు. విద్వాంసుడు, ధార్మికుడు, పరోపకారియైన పురుషుడు.

ఖాఖీ:- చూడండి. నేను రాత్రింబగళ్లు నగ్నంగా ఉంటాను. చలిమంటలలో మాడుతాను. గంజాయి, చరస్‌లను వందలసార్లు పొగదమ్ము పడతాను. మూడు మూడు గ్లాసుల భంగు త్రాగుతాను. గంజాయి, భంగు, ఉమ్మెత్తాకులను కూరగా నంజుకొని తింటాను. పాషాణంవంటి విషాన్ని, నల్లమందును కూడా నాకి మ్రింగుతాను. మత్తులో లీనమై రాత్రింబవళ్లు దుఃఖం లేకుండా ఉంటాను. ప్రపంచాన్ని గురించి నేనేది తెలుసుకోను. భిక్షమడుక్కొని రొట్టె చేసుకొని తింటాను. రాత్రంతా ప్రక్కన పడుకున్నవారు, నిద్రించకుండా బాగా దగ్గుతాను. అనేక సిద్ధులు, సాధుత్వాలు నాలో ఉన్నాయి. అయినా నీవు నన్ను ఎలా నిందిస్తావు? ఓ బాపడా! తెలివి తెచ్చుకో. నన్ను తిరస్కరించిన నేను నిన్ను భస్మం చేస్తాను.

పండితుడు:- ఈ లక్షణాలన్నీ అసాధువులకు, మూర్ఖులకు, విద్యావిహీనులకుంటాయి. సాధు - సజ్జనులకుండవు. "సాధ్నోతి పరాణి ధర్మకార్యాణి స సాధుః" ధర్మయుక్త ఉత్తమ కార్యాలను చేస్తూ, సదా పరోపకారంలో ప్రవృత్తులవుతూ, ఎలాంటి దుర్గుణాలు లేనివాడై, విద్వాంసుడై సత్యోపదేశాలతో అందరికీ పరోపకారం చేస్తుంటాడు. అతన్నే సాధువంటారు.

ఖాఖీ:- ఒరే పోరాపో! సాధువులు చేసే కార్యాల గురించి నీకేమి తెలుస్తుంది? సాధువు జన్మస్థానం గొప్పది. ఏ సాధువుతో తలపడటం మంచిది కాదు. లేకుంటే పట్టకారును తీసుకొని కొడతాను, చూడూ పుఱ్ఱె పగుల గలదు.

పండితుడు:- మంచిది. ఓ ఖాఖీ! నీవు కూర్చున్న చోటికి పొమ్ము. నాపై కోపం తెచ్చుకోకు, రాజ్యం ఎలా ఉన్నదో తెలుసా? ఎవరినైన కొట్టిన పట్టుకొని పోతారు. జైలుశిక్ష అనుభవిస్తావు. బెత్తపు దెబ్బలు తింటావా? లేక ఎవరైనా నిన్ను కొట్టినప్పుడేమి చేస్తావు? ఇది సాధు లక్షణం కాదు.

ఖాఖీ:- ఒరే శిష్యుడా! పోదాం పదరా. ఎటువంటి రాక్షసుని ముఖం చూపించావురా.

పండితుడు:- నీవు ఎప్పుడు ఏ మహాత్ముల సహవాసం చేయలేదు. చేసియున్న ఇంత జడునిగా, మూర్ఖునిగా ఉండవు.

ఖాఖీ:- నాకు నేనే మహాత్ముడను. మాకు ఎవరితో అవసరం లేదు.

పండితుడు:- దురదృష్టవంతులకు నీ వంటి బుద్ధి, అభిమానాలే కలుగుతాయి.

ఖాఖీ తన స్థానానికి, పండితుడు తన ఇంటికి వెళ్ళిపోతాడు.

వృద్ధ ఖాఖీ - శిష్యులు

సంధ్యాహారతి ఇచ్చిన తర్వాత ఆ ఖాఖీ ఒక వృద్ధునిగా అనుకుని అనేక ఖాఖీ సంప్రదాయకులు డాండోత, డాండోత అంటే దండాలు, దాండాలు అంటూసాష్టాంగం చేసి కూర్చున్నారు. అప్పుడు ఆ ఖాఖీ ఒరే రామదాసూ! నీవేమి చదివావు? అని అడిగాడు.

రామదాసు:- మహారాజా! నేను 'వెస్ను సహసరనామా'లను చదివాను.

ఖాఖీ:- ఒరే! గోవింద దాసిగా ! నీవు ఏమి చదివావు?

గోవిందదాసు:- నేను ఫలానా ఖాఖీ దగ్గర ఉండి 'రామసతవ రాజాన్ని' చదివాను.

అప్పుడు

రామదాసు:- 'మహారాజా! మీరేమి చదివా?'రని ప్రశ్నించాడు.

ఖాఖీ:- నేను 'గీత' చదివాను.

రామదాసు:- ఎవరి దగ్గర?

ఖాఖీ:- పోరా బాలుడా! నేను గురువుగా ఎవరినీ అనుకోను. చేసుకోను. చూడండి. నేను దుబ్బ పూసుకొని 'పరాగరాజము'న ఉన్నాను. నాకు అక్షరాలు రావు. పొడవైన ధోవతి కట్టిన ఏ పండితుని చూస్తే గీత (గోసటి) గోష్ఠిలో ఈ దరిద్రాక్షరం పేరేమిటని అడుగుతాను. ఇలా అడుగుతూ అడుగుతూ 18 అధ్యాయాల గీతను అభ్యసించాను. గురువుగా ఒక్కరిని కూడా చేసుకోలేదు.

బాగుంది. ఇలాంటి విద్యాశత్రువులలో అవిద్యా స్థానం స్థిరపడి ఉండకుంటే ఎక్కడ ఉంటుంది?

వీరు మత్తు పదార్థాలను సేవిస్తూ ఉండి, ఆపదలను తెచ్చుకోవటం, పోట్లాట, భుజించటం, నిద్రించటం, ఢంకను మ్రోగించటం, గంటలను, చిరుగంటలను మ్రోగించటం, శంఖం ఊదటం, చలిమంట చితులను వేయటం, స్నానం చేయటం, కడగటం, అన్నిదిక్కులలో వ్యర్థంగా తిరుగటం వంటి కార్యాలను చేయడం తప్ప ఇతర మంచి పనులను చేయరు. అనుకుంటే రాళ్లనైనా కరిగించవచ్చు. కాని ఈ ఖాఖీల ఆత్మలకు బోధించటం కష్టం. ఎందుకంటే వీరిలో అనేకులు శూద్ర వర్ణస్థులైన కూలీలు, రైతులు, పల్లకీలను మోసే బోయలు మొదలైనవారు. వీరు తమ కూలిని విడిచి కేవలం బూడిదను పూసుకొని బైరాగులు ఖాఖీలు అవుతారు. వారు విద్య, సత్సంగాల మహాత్మ్యాన్ని తెలుసుకోలేరు.

వీరిలో నాథ సంప్రదాయకుల మంత్రం **'నమః శివాయ'**, ఖాఖీలది **'నృసింహాయ నమః'**, రామావతులు **'శ్రీరామచంద్రాయ నమః'** లేక **"సీతారామాభ్యాం నమః"**, కృష్ణోపాసకులు **'శ్రీరాధా కృష్ణాభ్యాం నమః'** అని గాని, **'నమో భగవతే వాసుదేవాయ'** అనిగాని బెంగాలులు **'గోవిందాయ నమః'** అనే మంత్రాన్ని చెవిలో పఠించినంత మాత్రాన శిష్యులవుతారు. ఓ పిల్లవాడా! సొరకాయ మంత్రాన్ని చదువు అని ఇలా వీరు ఉపదేశిస్తారు.

జల పవితర సథల పవితర జెర్ పవితర కుఆ ।
శివ కహే సున పార్వతీ తూంబా పవితర హుఆ ॥

(రామస్నేహీ ధర్మప్రకాశ్ రామపటల్ పుట-3)

దీని అర్థమేమిటంటే జలం పవిత్రం, స్థలం మరియు బావి కూడా పవిత్రమైనవి. ఇలాగే సొరకాయ కూడా పవిత్రమని శివుడు పార్వతికి ఉపదేశించాడు. ఆహా! ఇలాంటి యోగ్యత గల సాధువు లేక విద్వాంసుడైన వానితో జగదుపకారం ఎన్నడైనా జరుగుతుందా? ఖాఖీ రాత్రింబవళ్లు కట్టెమొద్దులు, పిడకలు వేసి కాలుస్తాడు. ఒక మాసంలోనే అనేక రూపాయల విలువ గల కర్రలను కాల్చి బూడిద చేస్తాడు. ఒక మాసంలో కర్రల నిమిత్తమై ఖర్చు చేసే మూల్యం నుండి కంబళ్లు మొదలైన వస్త్రాలను తీసుకొంటే, శతాంశ, ధనంతోనే ఆనందంగా ఉండవచ్చు. వారికి ఇంత బుద్ధి ఎక్కడి నుండి వస్తుంది. తమ నామాన్ని ఆ చలిమంటలలో కాచటం చేతనే తాపసికులని పెట్టుకొన్నారు. ఇదేవిధంగా తాపసికులైన ఆటవిక మానవులు వీరి కంటే కూడా గొప్ప తాపసికులు అనబడతారు. జడలను పెంచుతూ, బూడిద పూసుకొంటూ, తిలకం దిద్దుకొన్నందుకే తాపసికులైన అందరు కూడా ఇలాగే చేయవచ్చును. వీరు పైకి త్యాగస్వరూపులుగాను, లోపల చాలా కూడబెట్టుకొనే స్వభావం కలవారుగా ఉంటారు.

కబీర పంథీ విమర్శ

ప్రశ్న:- కబీర సంప్రదాయం గలవారు మంచివారేనా?

జవాబు:- మంచివారు కారు.

ప్రశ్న:- ఎలా మంచివారు కారు? వీరు పాషాణ మూర్తిపూజలను ఖండిస్తారు. కబీరు పుష్పం నుండి జన్మించి చివరకు పుష్పమయ్యాడు. బ్రహ్మ, విష్ణు, మహాదేవులు జన్మించకముందు నుండే కబీరున్నాడు. గొప్ప సిద్ధుడు. ఏ విషయాన్ని వేదాలు, పురాణాలు కూడా తెలుసుకోకుండానే వాటిల్లో విషయాలను కబీరు తెలుసుకోనేతంటటివాడు. సత్యమార్గాన్ని చూపించినవాడు. ఇతని మంత్రం 'సత్యనామ కబీరు' మొదలైనవి.

జవాబు:- పాషాణాలను పరిత్యజించి మంచాలను, పరుపులను, పాంకోళ్ళను, జ్యోతి అంటే దీపాలను పూజించటం పాషాణ మూర్తుల కంటే తక్కువేమీ కాదు. కబీరు కీటకమా లేక మొగ్గా? పువ్వులనుండి పుట్టటానికి, చివరకు పుష్పమవటానికి, ఇక్కడ, ఇతన్ని గురించి వ్రాసిన విషయం సత్యమైనది.

ఒకానొక సాలెవాడు కాశీలో ఉన్నాడు. అతనికి పిల్లా జెల్లా లేరు. ఒకనాడు ఇంక కొంచెం రాత్రి ఉన్నది. ఆ సాలెవాడు ఒక సందు నుండి పోతుంటే రాజబాట ఒడ్డున ఒక తట్టలో పువ్వుల మధ్య అదే రాత్రి జన్మించిన బాలకుడు ఉండటం చూసాడు. అతడు ఆ బాలుని తీసుకొనిపోయాడు, తన భార్యకు ఇచ్చాడు. అతడు ఆ బాలకుని పోషించాడు. బాలకుడు పెరిగిన తర్వాత సాలెపని చేసేవాడు. ఒక పండితుని దగ్గరికి సంస్కృతాన్ని అభ్యసించటానికి వెళ్ళాడు. కాని ఎవరూ నేర్పలేదు. అప్పుడు కబీరు అసంబద్ధ భాషను కల్పించి సాలె మొదలైన తక్కువ జాతివారికి ఉపదేశించేవాడు. తంబుర తీసుకొని పాడేవాడు. భజన కీర్తనలను రచించేవాడు. విశేషించి పండితులను, శాస్త్రాలను, వేదాలను నిందించసాగాడు. కొందరు మూర్ఖులు అతడు ఆలోచించిన మోసానికి చిక్కి అతని ఉపదేశాలకు లొంగారు. మరణించినప్పుడు ప్రజలు అతనిని సిద్ధునిగా చేసారు. బ్రతికి ఉన్నప్పుడు ఏయే రచనలను రచించాడో వాటిని అతని శిష్యులు పఠించసాగారు. చెవులను మూసుకొని ఏ శబ్దాలను వింటున్నారో వాటిని అనహత శబ్ద సిద్ధంతంగా స్థాపించారు. మనోవృత్తిని 'సురతి' అంటారు. దానిని, ఆ శబ్దాన్ని వినటంలో మనస్సును లగ్నపరచే దాన్ని సంతుల మరియు పరమేశ్వర ధ్యానమని తెలిపారు. అక్కడకు కాలుడు చేరడు. బల్లెంవంటి తిలకం, చందనాలు, కఱ్ఱపూసల హారాలను ధరిస్తారు. బాగా ఆలోచించి చూడండి. దానిలో ఆత్మోన్నతి గాని, జ్ఞానవృద్ధి గాని ఏమైనా కలుగునా? ఇది కేవలం పిల్లవాడు ఆడుకొనే ఆట వంటి లీల.

నానక్ (పంథ్) సంప్రదాయకుల విమర్శ

ప్రశ్న:- పంజాబ్ దేశంలో నానక్ అనే అతడొక మార్గాన్ని ప్రారంభించాడు. ఎందుకంటే అతడు విగ్రహాల విధానాన్ని ఖండించేవాడు. ముసల్మానులవటం నుండి రక్షించాడు. అతడు సాధువు

కూడా కాదు. కాని గృహస్థునిగా ఉన్నాడు. అతడు ఈ క్రింది మంత్రాన్ని ఉపదేశించాడు. దాని ద్వారా అతని ఆశయం మంచిదే అని విదితమవుతుంది.

ఓం సత్యనామ కర్తా పరుష నిర్భౌ నిర్వైర అకాల మూర్త అజోని సహాభం గురుప్రసాద జప ఆది సచ జుగాది సచ హై భీ సచ నానక హోసీ భీ సచ ॥ జ ప జీ పౌ డీ ॥

అర్థం:- (ఓమ్) ఎవరి నామం సత్యమో అతడే కర్త, పురుషుడు, భయరహితుడు, వైర రహితుడు. అకాలమూర్తి. కాలాతీతుడు, యోనిలోనికి రానివాడు, ప్రకాశమానుడు అతన్ని గురుకృపతో జపించండి. అతడు పరమాత్ముడు. ఆదిలో యదార్థమై ఉన్నాడు. యుగయుగాలలో సత్యమై ఉన్నాడు. వర్తమానంలో యదార్థం మరియు సత్యంగా ఉంటుంది.

జవాబు:- నానక్ ఆశయం మంచిదే. కాని విద్య కొంచెం కూడా లేదు. ఆ ప్రాంతపు గ్రామ్య భాషను తెలిసినవాడు. వేదాది శాస్త్రాలను గాని, సంస్కృతాన్ని గాని ఏ కొంచెం కూడా తెలుసుకోలేదు. తెలిసే ఉంటే 'నిర్భయ' శబ్దాన్ని 'నిర్భౌ' అని ఎలా వ్రాస్తాడు? దీనికి దృష్టాంతం అతడు రచించిన సంస్కృతీ స్తోత్రం. నేను సంస్కృతంలో కూడా ప్రవేశించాలనుకుంటున్నాను. కాని చదువకుండా సంస్కృతం ఎలా వస్తుంది? అవును ఆ గ్రామీణులముందు, సంస్కృతం ఎన్నడూ విననివారి సమక్షంలో సంస్కృతీ స్తోత్రాన్ని వ్రాసి సంస్కృతంలో కూడా పండితుడ్ని అని యుండవచ్చును. ఆహా! తాను మాన ప్రతిష్ఠ గాంచి, ప్రఖ్యాతి నొందవలెనను కోరిక లేకుండ ఈ విషయమును తెలుసుకోలేదు. అతనికి తాను తప్పక ప్రతిష్ఠ పొందాలనే కోరిక ఉండేది. లేకుంటే ఏ భాష తనకు తెలుసో ఆ భాషనే చెప్పేవాడు. నేను సంస్కృతాన్ని చదువలేదని కూడా చెప్పేవాడు. కొద్దిగా అభిమానం ఉన్న మాన ప్రతిష్ఠకై కొంత మోసం కూడా చేయవచ్చు? ఇందువలన అతని గ్రంథంలో అక్కడక్కడ వేద నింద మరియు స్తుతి కూడా ఉన్నది. ఎలాగంటే ఇలా అనుకున్న అతనితో కూడా ఎవరైనా వేదార్థం అడిగిన, అప్పుడు ఆ అర్థం రాకుంటే తన ప్రతిష్ఠ నష్టమవుతుంది. కావున ప్రథమంలోనే తన శిష్యుల సమక్షంలో అక్కడక్కడ వేదాలకు విరుద్ధంగా చెప్పెడివాడు. మరికొన్ని చోట్ల వేదానుకూలంగా మంచిగా చెప్పాడు. ఎందుకంటే ఎక్కడైనా మంచిగా మోసంచేయకపోతే ప్రజలు అతనిని నాస్తికునిగా అనుకుంటారు.

(అష్టపది 7)

ఉదా:- వేద్ పఢత్ బ్రహ్మా మరే - చారోం వేద్ కహానీ ॥ సుఖమనీ పౌడీ 2. పద 8 ॥

సంత్ (సాధు)కి మహిమా - వేద్ న జానో ॥ సు. పౌ.భీ. 8 పద 6 ॥

నానక్ బ్రహ్మ జ్ఞానీ ఆప్ పరమేశ్వర్ ॥

వేదాలను పఠించేవారు మరణించరా? ఏమి? నానక్ వంటివారు తమకు తాము అమరులుగా భావించారా? అయితే వారు చావలేదా? వేదం సమస్త సత్యవిద్యల భాండాగారం. కానీ నాలుగు

వేదాలు కథలని చెప్పేవారి మాటలన్నీ కథలే అవుతాయి. మూర్ఖులు పేరుకే సాధువులైన వారు వేదాల మహిమలను ఎన్నడూ తెలుసుకోలేరని ఆలోచించాలి. నానక్ వేదాలనే గౌరవించిన అతని సంప్రదాయం వ్యాపించకుండా ఉండేది. అతడు గురువు కాకుండా ఉండేవాడు. ఎందుకంటే సంస్కృత విద్య పఠించలేదు, ఇతరులను చదివించి శిష్యులను ఎలా తయారుచేస్తాడు?

నానక్ పంజాబ్‌లో ఉన్నప్పుడు పంజాబ్ రాష్ట్రంలో సంస్కృత విద్య పూర్తిగా లేనిదై ముసల్మానులతో పీడింపబడుతుందనటం నిజం. అప్పుడు అతడు కొంతమందిని రక్షించాడు. అతడు ఉన్నప్పుడు అతని సంప్రదాయం వ్యాప్తి పొందలేదు లేదా అనేక శిష్యులు ఏర్పడలేదు. ఎందుకంటే అవిద్వాంసుల పద్ధతే అతని మరణానంతరం అతనిని సిద్ధునిగా చేస్తుంది. ఆ తర్వాత అనేక మహాత్మ్యాలు కల్పించి ఈశ్వరునితో సమానంగా అంగీకరిస్తారు.

ఉదాసీ - నిర్మలులు

అవును. నానక్ ఒక గొప్ప ధనాఢ్యుడు కాని, గొప్పవాడు కాని కాడు. కాని అతని శిష్యులు "నానక్ చంద్రోదయం" 'జన్మశాఖీ' మొదలైన వాటిలో గొప్ప సిద్ధుడని, గొప్ప ఐశ్వర్యశాలి అని వ్రాసారు. నానక్ బ్రహ్మాదులతో కలిసాడు. చాలా సంభాషణలు చేసాడు, అందరూ అతన్ని గౌరవించారు, నానక్ వివాహంలో అనేక అశ్వాలు, రథాలు, గజాలు, సువర్ణం, రజతం, ముత్యాలు, పచ్చలు మొదలైన రత్నాలతో పొదిగిన వస్తువులకు మరియు అమూల్య రత్నాలకు మేరలేకుండా ఉన్నదని వ్రాసారు. మంచిదే. ఇవన్నీ కపోల కల్పితాలు గాక మరేమి అవుతుంది? దీనిలో ఇతని శిష్యులదే దోషం కాని నానక్‌ది కాదు కదా!

అతని మరణానంతరం అతని కుమారులతో ఉదాసీ శిష్యుల సంప్రదాయం ఏర్పడింది. నిర్మల సంప్రదాయం రామదాసాదులతో ప్రచారం అయ్యింది. ఎంతోమంది పీఠాధిపతులు భాషను తయారుచేసి గ్రంథాలను వ్రాసారు. అంటే వీరి గురువులలో 10వ గురువు గోవింద సింహుడు. అతని తర్వాత ఆ గ్రంథంలో ఎవరి భాషను కలుపలేదు. కాని అప్పటివరకు ఉంటే చిన్న చిన్న పుస్తకాలనన్నింటిని కూర్చి పెద్ద గ్రంథంగా చేసారు. వీరు కూడా నానక్ అనంతరం అనేక పదాలను కల్పించారు. ఎంతోమంది అనేకవిధాలైన పురాణాలలోని మిథ్యా కథల వంటివి వ్రాసారు. కాని వారు స్వయంగా బ్రహ్మ జ్ఞానులుగా పరమేశ్వరునిగా అవటమే కాక కర్మోపాసనాన్ని త్యజించి వీరి శిష్యులుగా లొంగిపోయారు. వీరు చాలా వరకు పూర్వం ఉన్న మత సంప్రదాయాలను నిర్మూలించారు. నానక్‌గారు ఈశ్వర భక్తిని, విశేషించి ఈశ్వరుని గురించి ఏం వ్రాసారో దాన్ని వీరు ఆచరించిన బాగుండేది.

ఇక ఉదాసీనులు మేము గొప్పవారమని, నిర్మలులు మేమే గొప్పవారమని, అకాలీలు, సూతరహా సాయిలు కూడా అందరకంటే మేమే గొప్పవారమని తమలో తాము వాదులాడుతున్నారు.

గురుగోవింద సింహ - పంచకకారాలు

వీరిలో గురుగోవిందసింహుడు శూరవీరుడయ్యాడు. ముసల్మానులు అతని వంశీకులకు అధిక దుఃఖాన్ని కలిగించగా వారితో ప్రతీకారం చేయకోరుకున్నాడు. కాని ఇతని వద్ద కావలసిన వస్తు సామగ్రి లేదు. అటు ముసల్మాను సుల్తానులు అధిక ప్రబలులు కాసాగారు. అతడొక పునశ్చరణ అయ్యేలాచేసి తనకు దేవి వరం? ఖడ్గం ఇచ్చి తురుష్కులతో పోట్లాడిన నీకు విజయం కలుగుతుందని చెప్పినట్లుగా వెల్లడించాడు. అనేకులు అతని స్నేహితులయ్యారు. వామమార్గీయులు పంచమకారాలను, చక్రాంకితులు పంచ సంస్కారాలను ప్రచారం చేసినట్లుగా ఇతడు పంచకకారాలను వాడుకలోనికి తెచ్చాడు. ఈ పంచకకారాలు సంగ్రామంలో చాలా ఉపయుక్తాలుగా ఉన్నాయి.

1. **కేశాలు:-** వీనిని ఉంచుకోవటం వల్ల యుద్ధంలో కఱ్ఱదెబ్బల నుండి, కత్తిపోట్ల నుండి కొంత రక్షణ కలుగుతుంది.
2. **కంకణం:-** చక్రం వంటి సాధనం. దీన్ని తలపై వెంట్రుకలతో బంధించి అకాలీలు తలపాగ చుట్టుకొంటారు. ఇలాగే చేతికి కూడా అంటే ముంజేతి కంకణం. దీనిని ధరించి చేతిని, శిరస్సును రక్షించుకొంటారు.
3. **కాఛ:-** అంటే కాసె. మోకాలుపైకి ఉండి పొడవైన లంగోటా. ఇది పరుగెత్తటానికి, దుంకటానికి అనుకూలంగా ఉంటుంది. అధికంగా గరడీలపై సాము చేసే మల్లులు మరియు నాట్యం చేసేవారు మొగ్గలు వేసే దొమ్మరివాళ్ళు కూడా దీనిని ధరిస్తారు. ఎలాగంటే దీని ద్వారా శరీర మర్మావయవం రక్షించబడుతుంది.
4. **కంగా:-** అంటే దువ్వెన. దీని ద్వారా కేశాలు చెల్లా చెదరు కాకుండా సంస్కరించబడతాయి.
5. **కాచు:-** అంటే కత్తి. దీని ద్వారా శత్రువుతో కలిసినప్పుడు, మోసం జరిగినప్పుడు యుద్ధంలో పనికి వస్తుంది. ఇందువలన ఈ పద్ధతిని గోవిందసింహుడు తన బుద్ధి కుశలతతో ఆ సమయం నిమిత్తమై ప్రవేశపెట్టాడు. ఇప్పుడు ఈ కాలంలో వాటిని ధరించటం వలన ఏ మాత్రం ఉపయోగం లేదు. కాని అప్పుడు యుద్ధ ప్రయోజనానికై ఏ విషయాలను కర్తవ్యాలో ఉంచారో ఇప్పుడు వాటిని ధర్మానుకూలంగా విశ్వసించారు.

వీరు మూర్తిపూజను చేయరు. కాని ఇంతకంటే విశేషంగా గ్రంథపూజ చేస్తారు. ఇది మూర్తిపూజ కాదా ఏమి? ఏదో ఒక జడ పదార్థానికి శిరస్సును ఒంచుతూ లేక దానిని పూజించటం లాంటివన్నీ మూర్తిపూజలే. మూర్తి పూజకులు తమ దుకాణాలను స్థాపించి తమ జీవితాలను నిలుపుకొనేటట్లుగా వీరు కూడా చేసారు. పూజారులు మూర్తిని దర్శింపచేసి కానుకలను అర్పింపజేసేటట్లుగా నానక్‌పంథ్ వారు గ్రంథాన్ని పూజిస్తూ, పూజింపజేస్తూ, దక్షిణలను కానుకలను కూడా సమర్పింపజేసుకున్నారు. అంటే మూర్తిపూజ చేసేవారు వేదాలను ఎంత గౌరవిస్తారో అంతగా గ్రంథసాహెబ్ వారు వేదాలను గౌరవించరు.

ఇక్కడ వీరు వేదాలను వినలేదు, చూడలేదు, ఏమి చేద్దాము? వారిలో వినటానికి, చూడటానికి వచ్చిన బుద్ధిమంతులు, మొండిపట్టుదల కలవారు కాని దురాగ్రహులు కాని కారు. ఇటువంటి సర్వ మతాల వారు వేద ధర్మానికి వస్తారు. వీరందరూ భోజనం యొక్క భేదాలను తొలగించినట్లే విషయాసక్తులను, దురభిమానాన్ని కూడా విడిచి వేద ధర్మోన్నతికి పాటుపడితే ఎంతో మంచి జరుగుతుంది.

దాదూపంథీ

ప్రశ్న:- దాదూ పంథుల మార్గం మంచిదేనా?

జవాబు:- వేదమార్గమే మంచిది. వేదమార్గాన్ని పట్టుకోదలచితిరా పట్టుకొనుడు. లేకుంటే సదా మోసాలలో చిక్కుకొంటారు. ఇతని మతంలో దాదూజీ గుజరాతులో జన్మించి ఉన్నాడు. తర్వాత జయపురానికి సమీపంలో ఉన్న 'ఆమేరు'లో ఉన్నాడు. తెలకపని చేసేవాడు. ఈశ్వరుని విచిత్రలీల ఏమిటోగాని, దాదూ కూడా పూజించబడ్డాడు. ఇప్పుడు వేదాది శాస్త్రాల విషయాలను త్యజించి 'దాదూరామ్, దాదూరామ్' అని స్మరించటంలోనే ముక్తిని అంగీకరించారు. సత్యోపదేశకులు లేనప్పుడు ఇలాంటివే అనేక చిక్కులు ప్రచారం చేస్తారు.

రామస్నేహి పంథానుయాయుల విమర్శ

ఇటీవల 'రామస్నేహి' అనే మతం ఒకటి శాహపురం నుండి ప్రచారమయ్యింది. అతడు సమస్త వేదోక్త ధర్మాలను పరిత్యజించి 'రామ రామ' అని కేకలు వేయటమే మంచిదని అంటాడు. దీనిలోనే జ్ఞాన, ధ్యాన, ముక్తి ఉన్నదని అంటాడు. కాని ఆకలి వేసినప్పుడు 'రామ నామం' నుండి రొట్టె గాని, శాకం గాని రావడం లేదు. ఎందుకంటే ఆహార పానీయాలు గృహస్థుల ఇంటిలోనే లభిస్తాయి. ఇతడు కూడా మూర్తిపూజను తిరస్కరిస్తాడు. కాని తానే స్వయంగా మూర్తి అయినాడు. స్త్రీల సాంగత్యంలో అధికంగా ఉండేవాడు. ఎందుకంటే రామునికి 'రామక్క' లేనిది ఆనందమే ప్రాప్తించదు. ఇప్పుడు రామ స్నేహి మతాన్ని గురించి కొన్ని విశేషాలను వ్రాస్తాను.

రామ చరణుడనే పేరు గల ఒక సాధువు ఉన్నాడు. ఇతని మతం ముఖ్యంగా 'శాహపురం' అనేచోట మేవాడ నుండి ప్రచారమయ్యింది. అతడు 'రామ రామ' అనటమే పరమ మంత్రమని, దీనినే సిద్ధాంతంగా భావిస్తాడు. సంత దాసాల వాక్కులతో యుక్తమైన ఒక గ్రంథంలో అతడు ఇలా వ్రాసాడు.

సంతదాసాల వాక్యాలు:-

భరమ రోగ్ తబ్‌హీ మిట్యా - రట్యా నిరంజన్ రాఇ ।
తబ్ జమ్‌కా కాగజ్ ఫట్యా, కట్యాకర్మ తబ్ జాఇ ॥ సాఖీ 6 ॥ సుమరణ. 17.

బుద్ధిమంతులైన వారు ఈ క్రింది విధంగా ఆలోచించండి. 'రామ రామ' అని భ్రమపడటం అజ్ఞానమే. యమరాజు యొక్క పాపానుకూల శాసనం కాని, లేక చేసిన కర్మలు కాని ఎన్నడైనా విడిపోగలవా? ఇది కేవలం మానవులను పాపంలో బంధించడమే. ఇంకా మానవ జన్మను నష్టం చేయటానికే ఉన్నది. ఇప్పుడు వీరికి "రామచరణుడు" ముఖ్యగురువు. అతని వాక్యాలు ఇలాఉన్నాయి.

1. మహిమా నాంవ ప్రతాపకీ సుణౌ సవరణ చిత లాఇ ।
   రామ్ చరణ్ రసనా రటౌ - క్రమ సకల ఝుఢ్ జాఇ ॥

2. జిన్ జిన్ సుమర్యానాంవ కూం - సో సబ్ ఉతర్యా పార్ ।
   రామ్ చరణ్ జో వీసర్యా - సో హీజమ్‌కే ద్వార్ ॥

3. రామ్ బినా సబ్ ఝూట్ బతాయో రామ్ భజత్ ఛూట్యా సబ్ క్రమ్మా ॥
   చంద్ అరుసూర దే ఇ పర కమ్మా ॥ రామ్ కహే తినకూంభై నాహీం ॥

4. తీన్ లోకమే కీరతిగాహీం - రామ్ రటత్ జగ్ జోర్‌నలాగై ॥
   రామ్ నామ్ లిఖ్ పథర్ తరా ఈ - భగతి హేతి జౌ తార్ హీ ధరహీ ॥

5. ఊంచ్ నీచ్ కుల్ భేద్ విచారై - సోతో జనమ్ ఆపణో హారై ।
   సంతాంకైకుల్ దీసైనాం హీం - రాంమ్ రాంమ్ కహారామ్ సమ్మాంహీ ॥

6. ఐ సో కుణ జో కీరతిగావై - హరి హరి జకౌ పార్ నపావై ।
   రామ్ సంతాంకా అంత్‌న ఆవై - ఆప్ ఆప్ కీ బుద్ధి సమగావై ॥ - నామప్రతాపం.

రామచరణుడు ఒక గ్రామీణుడు. సాధారణ మానవుడు. సరళ స్వభావం కలవాడని ప్రథమంలో రామచరణాది గ్రంథాలను చూస్తే విదితమవుతుంది. అతడేమీ చదువలేదు. లేకుంటే కపోలకల్పితాలను ఎలా వ్రాస్తుంటాడు. రామ రామ అంటే కర్మ విమోచనమవటం కేవలం అతని భ్రమ. అతడు కేవలం తన జన్మనే గాక అన్యుల జన్మలను కూడా నష్టపరిచాడు. యముని భయమన్న చాలా పెద్దది. రాజభటుడు, చోరుడు, దోపిడిగాండ్రు, వ్యాఘ్రం, సర్పం, తేలు మరియు దోమల భయం ఎప్పుడూ వీడిపోదే. ఇష్టంగా రామ్ రామ్ రాత్రింబవళ్లు అన్నంత మాత్రాన ఏమి కాదు. ఉదా:- "శర్కర, శర్కర" అన్నంత మాత్రాన నోరు తీపి కానట్లే సత్యభాషణ కర్మలు చేయక రామ రామ అంటే ఏమీ ప్రయోజనం లేదు. 'రామ రామ' అంటే అతని రాముడే ఆలకించకుంటే బ్రతికి ఉన్నన్నాళ్లు ఎవరువింటారు? వినరు. ఒకవేళ విన్నా రెండవసారి 'రామ రామ' అనటం వ్యర్థం. వీరు తమ పొట్టలను నింపుకోవటానికి, ఇతరుల జన్మను నాశనం చేయటానికి ఒక పాఖండమతాన్ని స్థాపించారు. అందువలన రామ స్నేహి అని పేరు పెట్టుకొని రండలతో స్నేహం చేస్తారని మనం వినటం, చూడటం ఆశ్చర్యం. ఎక్కడ చూస్తే అక్కడ ఈ ముండలే ముండలు సాధువులను చుట్టుకొని ఉంటారు. ఒకవేళ

ఇలాంటి పాఖండమే ప్రచారం కాకుంటే ఆర్యావర్త దేశానికి ఇలాంటి దుర్దశ ఎలా సంభవించేది. వీరు తమ శిష్యులకు ఎంగిళ్లను తినిపిస్తారు. స్త్రీలు కూడా సాష్టాంగ దండ ప్రణామం చేస్తారు. ఏకాంతంలో స్త్రీల, సాధువుల లీలలు జరుగుతూనే ఉంటాయి.

వీరిలో మరొక శాఖ మార్వాడా ప్రాంతంలోని 'ఖేడాపా' అనే ప్రాంతం నుండి ప్రచారమయ్యింది. దాని చరిత్ర ఈ విధంగా ఉన్నది.

ఒక రామదాసనే పేరుగల నీచజాతి వాడున్నాడు. అతడు మిక్కిలి చాతుర్యం కలవాడు. అతనికి ఇద్దరు భార్యలున్నారు. అతడు మొదట చాలా రోజులు 'అఘోర' సంప్రదాయంలో నుండి కుక్కలతో కలిసి భుజిస్తుండేవాడు. ఆ తర్వాత వారు వామమర్గంలోని 'కూండా పంథి' యై ఆ తర్వాత రామదేవ్పుని అనుయాయి అయ్యాడు. తన ఇద్దరి భార్యలతో కలిసి పాడేవాడు. ఇలా తిరుగుతూ తిరుగుతూ 'శీతల్' అనే గ్రామంలో ఢేధులకు గురువైన రామదాసును కలిసాడు. అతడు ఇతనికి 'రామదేవ్పంథ్' అనే సంప్రదాయాన్ని తెలిపి తన శిష్యునిగా చేసుకొన్నాడు. ఆ రామదాసు ఖేడాపా అనే గ్రామంలో తన వసతిని ఏర్పాటు చేసుకొన్నాడు. అతని మతం ఇక్కడ వ్యాపించింది. అక్కడ శాహపురంలో రామచరణుని మతం ప్రచారమయ్యింది.

రామచరణుని చరిత్ర:-రామచరణుడు జయపురపు వర్తకుడు. అతడు దాంతడా అనే గ్రామంలో ఒక సాధువు నుండి వేషాన్ని స్వీకరించి అతన్ని గురువుగా చేసుకున్నాడు శాహపురానికి వచ్చి స్థిరనివాసం ఏర్పర్చుకొన్నాడు.

అమాయకులలో పాఖండ మతమూలాలు శీఘ్రంగా అంకురించి, పాతుకుంటాయి. ఈ మతాలన్నింటిలో పైన పేర్కొనబడిన రామచరణుని వాక్య ప్రమాణాల ద్వారా శిష్యులను చేసుకొని ఉచ్చ నీచ భేదాలను పాటించలేదు. బ్రాహ్మణులు మొదలుకొని అంత్యజుల వరకు వీనిలో శిష్యులవుతారు. ఇప్పటికి కూడా కూండా పంథి వారితోనే ఈ మతం ఉన్నది. ఎలాగంటే వీరు మట్టి చిప్పలలో, కుండలలో తింటారు. ఇంకా సాధువుల ఎంగిలిని భుజిస్తారు. వేదధర్మం నుండి, తల్లిదండ్రులసేవ నుండి ప్రాపంచిక వ్యవహారాల నుండిమోసగించి విడిపించి శిష్యులుగా చేసుకొంటారు. రామ నామాన్ని మహామంత్రంగా అంగీకరిస్తారు. దీన్నే 'ఛ్ఛుఛ్ఛుమ' (సూక్ష్మ) వేదమని కూడా అంటారు. 'రామ రామ' అంటే అనంత జన్మల పాపం త్యజించబడుతుంది. ఇది లేక ముక్తి ఎవరికీ కలుగదు. శ్వాస నిశ్వాసలతో 'రామ రామ' అని జపించటానికి తెలిపిన అతన్ని సత్యగురువంటారు. సత్యగురువును పరమేశ్వరుని కంటే కూడా గొప్పగా భావిస్తారు. అతని మూర్తినే ధ్యానిస్తారు. సాధువుల చరణాలను కడిగి త్రాగుతారు. గురువు నుండి శిష్యుడు దూరంగా పోయిన గురునఖాల (గోళ్ల)ను, గడ్డంలోని కేశాలను తమ దగ్గరుంచుకోవాలి. అతని చరణామృతాన్ని ప్రతిరోజూ సేవించాలి. రామదాసు, హరరామదాసుల వాక్కులతో రచించబడిన పుస్తకాలను వేదాల కంటే గొప్పవని విశ్వసిస్తారు. వాటికి ప్రదక్షిణ, అష్ట

సాష్టాంగ ప్రణామాలను చేస్తారు. గురువు సమీపంలో ఉంటే సాష్టాంగ నమస్కారాలను చేస్తారు. స్త్రీ పురుషులకు ఒకే విధమైన 'రామ రామ' అనే మంత్రోపదేశం చేస్తారు. నామస్మరణ ద్వారా కల్యాణం కలుగుతుందని నమ్ముతారు. కాని పాపమని విద్యాభ్యాసం భావిస్తారు. వారి సాఖీలో ఈ క్రింది విధంగా వ్రాయబడింది. -

పండితాఈ పానే పడీ - ఓ. పూర లో పాప్ ।

రామ్ రామ్ సుమర్యాం వినా - ర ఇ గ్యో రీతో అప ।

వేద్ పురాణ్ పఢే పఢ్ గీతా - రామ్ భజన్ బిన్ రహగయే రీతా ॥

ఇలాంటి పుస్తకాలను రచించారు. స్త్రీ పతిని సేవించటం పాపం. గురుసేవ సాధువులసేవ చేయుట ధర్మము వర్ణాశ్రమాలను నమ్మరు. రామ స్నేహికాని బ్రాహ్మణుడు నీచుడనీ, చండాలుడనీ గుర్తిస్తారు. రామస్నేహి అయిన వాణ్ణి ఉత్తమునిగా గుర్తిస్తారు. ఈ కాలంలో ఈశ్వరుని అవతారాలనెత్తడని అంటారు. రామచరణుడు పైన వ్రాసిన వాక్యంలో - **భగతి హేతి ఔతార్ హీ ధరహీ ॥** అని వ్రాయబడింది.

భక్తి కొరకు, సాధువుల హితానికి అవతారాన్ని కూడా అంగీకరిస్తారు. ఇలాంటి పాఖండ ప్రపంచం వీరి కెంత ఉందో అదంతా ఆర్యావర్త దేశానికి అహితకారకమైనది. ఇంతటితోనే బుద్ధిమంతులు అధికంగా ఊహించి గ్రహింతురు గాక!

వల్లభ సంప్రదాయం

ప్రశ్న:- గోకులీయ గోసాయిల మతం చాలా మంచిది. వీరు ఎలా ఐశ్వర్యాలను అనుభవిస్తారో చూడండి. ఈ ఐశ్వర్యం లీల లేకుండా సంభవమా?

జవాబు:- ఈ ఐశ్వర్యం గృహస్థులది. గోసాయిలదేమియు లేదు.

ప్రశ్న:- **అహా! వాహ్!** గోసాయిల ప్రతాపం వలననే కలిగింది. ఎలాగంటే ఇలాంటి ఐశ్వర్య మితరుల కెలా లభించదు?

జవాబు:- ఇతరులు కూడా ఇదేవిధంగా మోసం, కపటాల ప్రపంచాన్ని కల్పించిన ఐశ్వర్య ప్రాప్తికి సందేహమేమి? వీరి కంటే అధికమోసం చేస్తే అధిక ఐశ్వర్యం ప్రాప్తిస్తుంది.

ప్రశ్న:- ఇందులో ఉన్న మోసమేమి? ఇదంతా గోలోక లీలయే.

జవాబు:- గోలోక లీల కాదు. కాని గోసాయిల లీల. ఇది గోలోక లీల అయితే గోలోకం కూడా ఇదేవిధంగా ఉంటుంది.

ఈ మతం త్రిలింగదేశంలో ప్రచలితమయ్యింది. ఎందుకంటే త్రిలింగదేశస్థుడైన లక్ష్మణభట్టను ఒక బ్రాహ్మణుడు. వివాహమాడి ఏదో కారణంచేత తల్లిదండ్రులను, భార్యను వీడి కాశీకి వెళ్లి అక్కడ సన్న్యాసం తీసుకొన్నాడు. నాకు వివాహం కాలేదని అసత్యమాడాడు. దైవయోగంతో ఈ విషయమంతా తల్లిదండ్రులు, భార్య విని కాశీకి వెళ్లి సన్యాసమిచ్చిన వానితో మా పుత్రుని సన్యాసిగా ఎలా చేసావని అడిగారు. చూడు ఈ యువతి ఇతని భార్య అన్నారు. అప్పుడా స్త్రీ మీరొకవేళ నా పతిని నాతో పంపకుంటే నాకు కూడా సన్న్యాసమివ్వండి అని అన్నది. అప్పుడు అతన్ని పిలిచి నీవు ఒక గొప్ప అసత్యవాదివి. సన్న్యాసాన్ని వీడి గృహస్థుడవు కమ్ము అని అన్నాడు. ఎందుకంటే నీవు అసత్యమాడి సన్న్యాసం తీసికొన్నావు. ఇది విని సన్న్యాసాన్ని వీడి గృహస్థుడయ్యాడు. తల్లిదండ్రులతో, భార్యతో కలిసి ఇంటిముఖం పట్టాడు.

ఈ మతానికి గల మూలమే అసత్యం, కపటాలతో కూడి ప్రచారమై ఉన్నది. త్రిలింగానికి వచ్చిన తర్వాత అతన్ని ఎవరూ తమ జాతిలో తీసుకోలేదు. అప్పుడక్కడ నుండి వెళ్ళి ఇటునటు తిరుగసాగాడు. కాశీకి సమీపంలో ఉన్న 'చరాణార్గఢ్' దగ్గర గల చంపారణ్యం అనే పేరుగల అడవికి పోయాడు. అక్కడ ఎవరో ఒక బాలుడిని అడవిలో విడిచి ఏ మృగమైన వానిని వెంటనే చంపి తినకుండ నలువైపుల దూర దూరంగా నిప్పంటించి వెళ్ళిపోయారు.

లక్ష్మణభట్టు మరియు అతని భార్య ఆ పిల్లవాడిని తీసుకొని తమ పుత్రునిగా చేసుకున్నారు. తర్వాత కాశీలో ఆనందంగా ఉన్నారు. పిల్లవాడు పెద్దవాడయ్యాడు. అతన్ని పెంచిన తల్లిదండ్రులు మరణించారు. కాశీలో బాల్యావస్థ నుండి యువావస్థ వచ్చు వరకు ఏదో చదువుకున్నాడు. అయినా అతడు ఎక్కడికో పోయి ఒక విష్ణుస్వామి మందిరంలో శిష్యుడయ్యాడు. అక్కడ నుండి ఏదో చిన్న తగవు కలగడం వలన కాశీకి తిరిగి వచ్చాడు. సన్న్యాసం స్వీకరించాడు. ఎవరో ఇలాగే జాతి బహిష్కృతుడైన బ్రాహ్మణుడు ఒకడు కాశీలో ఉన్నాడు. అతని బిడ్డ యౌవ్వనవతి. ఆ బ్రాహ్మణుడు ఇతనితో నీవు సన్న్యాసాన్ని వీడి నా బిడ్డను వివాహమాడమన్నాడు. అలాగే జరిగింది. వాడి తండ్రి చేసిన లీలను కొడుకు అలా ఎలా చేయడు? ఆ స్త్రీని తీసుకొని మొదట విష్ణుస్వామి మందిరంలో శిష్యుడైన చోటికి వచ్చాడు. వివాహమాడటం వలన అతన్ని అక్కడనుండి వెళ్ళగొట్టారు. విద్యాగంధ మిసుమంతలేని వ్రజ దేశానికి వచ్చి తన ప్రపంచం (మతం) అనేక విధాలైన మోసాలతో కూడిన చాతుర్య యుక్తలతో వ్యాప్తి చేయనారంభించాడు. మిథ్యా విషయాలను ప్రసిద్ధి పరచాడు. శ్రీకృష్ణుడు నాతో కలిసి గోలోకం నుండి దైవీ జీవులు మర్త్యలోకానికి వచ్చారు. వారిని బ్రహ్మ సంబంధాలతో పవిత్రం చేసి గోలోకానికి పంపుమన్నాడు. ఇలాంటి ప్రలోభాలతో కూడిన మాటలను మూర్ఖులకు వినిపించి కొద్దిమందిని అంటే 84 మందిని వైష్ణవులుగా చేసుకొని ఈ క్రింది మంత్రాలను లిఖించాడు. వాటిలో కూడ భేదాన్ని కల్పించాడు.

వల్లభ మంత్రం - సమీక్ష

ఉదా:- శ్రీ కృష్ణః శరణం మమ । క్లీం కృష్ణాయ గోపీ జన వల్లభాయ స్వాహా ।

(గోపాల సహస్ర నామాలు)

ఈ రెండూ సాధారణ మంత్రాలు. కాని రాబోవు మంత్రం బ్రహ్మ సంబంధాన్ని, సమర్పణ చేయటానికి తెలపబడింది. -

శ్రీ కృష్ణం శరణం మమ । సహస్ర పరివత్సరమిత కాల జాత కృష్ణ వియోగ జనితతాప క్లేశానన్త తిరోభావోఽహం భగవతే కృష్ణాయ దేహేంద్రియ ప్రాణాంతః కరణ తద్ధర్మాంశ్చ దారాగారపుత్రా ప్తవిత్తేహ పరాణ్యాత్మనా సహ సమర్పయామి దాసోఽహం కృష్ణ ! తవాస్మి ॥

ఈ మంత్రోపదేశం చేసిన శిష్యులకు, శిష్యురాళ్లకు సమర్పణ చేయిస్తారు. "**క్లీం కృష్ణాయేతి,** ఈ 'క్లీం' తంత్ర గ్రంథంలోనిది. ఈ వల్లభ మంత్రం కూడా వామమార్గీయుల భేదం అని విదితమవుతున్నది. దీని ద్వారానే స్త్రీ సంగమాన్ని గోసాయిలు అధికంగా ప్రోత్సహిస్తారు."**గోపీవల్లభేతి**" కృష్ణుడు గోపికలకే ప్రియుడు కాని ఇతరులకు కాడా? స్త్రీ భోగంలో చిక్కిన వాడే, స్త్రీలోలుడే స్త్రీలకు ప్రియుడై ఉంటాడు. అయితే శ్రీకృష్ణుడిలాంటి వాడేనా?

సహస్ర పరి వత్సరేతి:- సహస్ర వర్షాలను లెక్కించటం వ్యర్థం. ఎందుకంటే వల్లభుడు మరియు అతని శిష్యులు ఏ కొద్ది సర్వజ్ఞులు కారు. కృష్ణుని వియోగం సహస్రాబ్దాల నుండి కలిగినదా? వల్లభ మతం ఇక్కడ లేనప్పుడు, వల్లభుడు పుట్టనప్పుడు, అతనికి ముందు తన దైవీ జీవోద్ధరణకై ఏల రాలేదు? 'తాపం' మరియు 'క్లేశం' అనే ఈ రెండు పర్యాయ వాచక పదాలు. వీనిలో ఒకటి గ్రహించటం ఉచితం. రెండవదాని అవశ్యకత లేదు. "అనంత శబ్ద పాఠమొనరించటం వ్యర్థం. ఎందుకంటే 'అనంత' శబ్దం ఉంచిన 'సహస్ర' శబ్దపాఠం ఉంచరాదు. సహస్ర శబ్ద పాఠాన్నే ఉంచినపుడు అనంత శబ్ద పాఠం ఉంచటం సర్వథా వ్యర్థం. అనంత కాలంలోనే స్వీకరించిన 'తిరోహితం' అంటే ఆచ్ఛాదితమై ఉన్నదని ముక్తికై వల్లభుని ఆవశ్యకత కూడా వ్యర్థం. ఎందుకంటే అనంతునికి అంతం ఉండదు. బాగున్నది! దేహేంద్రియాలను, ప్రాణాంతఃకరణాలను మరియు వాని ధర్మాలను, స్త్రీలను, స్థానాలను, పుత్రులను ప్రాప్తి ధనాన్ని కృష్ణునికి ఎలా నేర్పించాలి? ఎందుకంటే కృష్ణుడు పూర్ణకాముకుడవటం వలన ఇతరుల దేహేంద్రియాలను కోరడు. ఇక దేహేంద్రియాలను అర్పించటం కూడా అసంభవం. ఎందుకంటే దేహాన్ని అర్పించిన నఖశిఖాగ్ర పర్యంత దేహమే అవుతుంది. దానిలో కొన్ని మంచి వస్తువులుంటే మరికొన్ని చెడ్డవస్తువులు కూడా ఉన్నాయి. మలమూత్రాలను కూడా ఎలా అర్పించబడగలవు? పాపపుణ్యరూప కర్మలనే కృష్ణార్పణ చేయించి వాటి ఫలభోగి కూడా కృష్ణుడే అవుతాడు. అంటే పేరైతే కృష్ణునిది గైకొని తమ నిమిత్తమై సమర్పణ చేస్తారు. శరీరంలో గల

మలమూత్రాలను కూడా గోసాయీలకు అర్పించటం ఏల కాదు? తియ్య తియ్యనివి మ్రింగటం, చేదు చేదున్నవానిని ఉమ్మివేసినట్లుగా గోసాయీలకే అర్పించాలి. కాని అన్యమతస్థులకు కాదని వ్రాయబడింది. ఇదంతా స్వార్థంతో కూడినది. పరుల ధనమపహరించటం, వేదోక్త ధర్మనాశనానికై రచించిన లీల, వల్లభుని ఈ ప్రపంచాన్ని తెలుసుకోండి -

1. శ్రావణస్యామలేపక్షే ఏకాదశ్యాంమహానిశి ।
సాక్షాద్భగవతా ప్రోక్తం తదక్షరశ ఉచ్యతే ॥ ॥ 1 ॥

2. బ్రహ్మసంబంధ కరణాత్సర్వేషాం దేహజీవయోః ।
సర్వదోషనివృత్తిర్హి దోషాః పంచవిధాస్మృతాః ॥ ॥ 2 ॥

3. సహజా దేశ కాలోత్థా లోకవేద నిరూపితాః ।
సంయోగజాః స్పర్శజాశ్చ న మంతవ్యాః కదాచన ॥ ॥ 3 ॥

4. అన్యథా సర్వదోషాణాం న నివృత్తిః కథంచన ।
అసమర్పిత వస్తూనాం తస్మా ద్వర్జనమాచరేత్ ॥ ॥ 4 ॥

5. నివేదిభిః సమర్ప్యైవ సర్వం కుర్యాదితి స్థితిః ।
న మతం దేవ దేవస్య స్వామి భుక్తి సమర్పణమ్ ॥ ॥ 5 ॥

6. తస్మాదాదౌ సర్వకార్యే సర్వవస్తు సమర్పణమ్ ।
దత్తాపహార వచనం తథా చ సకలం హరేః ॥ ॥ 6 ॥

7. న గ్రాహ్యమితి వాక్యం హి భిన్నమార్గపరం మతమ్ ।
సేవకానాం యథా లోకే వ్యవహారః ప్రసిధ్యతి ॥ ॥ 7 ॥

8. తథా కార్యం సమర్ప్యైవ సర్వేషాం బ్రహ్మతా తతః ।
గంగాత్వే గుణ దోషాణాం గుణదోషాది వర్ణనమ్ ॥ ॥ 8 ॥

గోసాయిల సిద్ధాంత రహస్యము

1. ఇలాంటి శ్లోకాలు గోసాయీల సిద్ధాంత రహస్యాది గ్రంథాలలో వ్రాయబడింది. ఇవే గోసాయీ మతానికి మూలసారం. మంచిది. శ్రీకృష్ణుడు మరణించి దాదాపు పంచ సహస్రాబ్దాలు గడిచాయి. అతడు శ్రావణమాసపు అర్ధరాత్రి వల్లభునితో ఎలా కలిసాడు? అని అతన్ని ఎవరైనా ప్రశ్నించాలి?

2. గోసాయీలకు శిష్యుడైన వానికి సమస్త పదర్థాలు అర్పించబడ్డాయి. అతని శారీరిక, జీవాత్మ దోషాలన్నీ నివృత్తి అవుతాయి. ఇదే వల్లభుని ప్రపంచం. మూర్ఖులను మోసంతో

తప్పుదారి పట్టించే వారిని తన మతానికి తెచ్చుకోవటమే. గోసాయిల శిష్య శిష్యరాండ్ర సమస్త దోషాలు నివృత్తి అయితే వ్యాధులు దారిద్ర్యాది దుఃఖాలతో ఎలా పీడించబడుచున్నారు? ఆ దోషాలు ఐదు రకాలు.

అ. స్వాభావికమైన సహజ దోషాలు:- ఇవి కామ క్రోధాలతో ఉత్పన్నమవుతాయి.

ఆ. ఏ దేశ కాలమందో చేసిన అనేక విధ పాపజనిత దోషాలు.

ఇ. లోకంలో వేటిని భక్ష్యా భక్ష్యాలంటారో వేటిని వేదోక్త మిథ్యాభాషణాలంటారో వాటితో కలుగు దోషాలు.

ఈ. సంయోగ జనిత దోషాలు. ఇవి దుస్సాంగత్యంతో అంటే చోరత్వజారత్వాల చేత, మాతా, సోదరి, కన్య, పుత్రవధువు, గురుపత్ని వంటి స్త్రీలతో సంయోగం చేయటం వలన కలిగే దోషాలు.

ఉ. స్పర్శజాలు - ముట్టరాని వారిని ముట్టుటవలన కలుగునవి.

3. ఈ పంచ విధ దోషాలను గోసాయిాల మతస్థులు ఎప్పుడూ అంగీకరించరు. అంటే యథేష్టాచారం చేస్తారు.

4. ఇతర ఏ విధమైన దోష నివృత్తికి గోసాయిా మతం తప్ప మరొకటి లేదు. వీరి శిష్యులు సమర్పణ చేయని పదార్థాలను భోగించరు. వీరి శిష్యులు తమ భార్యలను, బిడ్డలను, కోడళ్లను, ధనాది పదార్థాలను కూడా సమర్పిస్తారు. సమర్పణకు ఈ నియమం కలదు. ఎప్పుడు అంటే అప్పుడు గోసాయిాల చరణ సేవకై సమర్పణ చేస్తే ఆ గృహస్థుడైన శిష్యుడు తన భార్యను స్పర్శించరాదు.

5. దీని ద్వారా గోసాయిాల శిష్యులు సమర్పించిన తర్వాతనే తమ తమ పదార్థాలను అనుభవించాలి. ఎందుకంటే భోగించిన తర్వాత స్వామికి సమర్పణ కాలేదు.

6. దీని కంటే ప్రథమంలో సమస్త కార్యాలలో సమస్త వస్తువులను వారికి సమర్పణ చేయాలి. ప్రథమంలో గోసాయిాకి భార్యలను సమర్పించిన తర్వాతనే గ్రహించాలి. అదే విధంగా వారికి సమర్పించవలసిన పదార్థాలను సమర్పించి గ్రహించాలి.

7. గోసాయిాల మతం కంటే భిన్న మార్గానుయాయుల వాక్యభావాలను కూడా గోసాయిాల శిష్య - శిష్యురాలు ఎప్పుడు వినకూడదు. స్వీకరించరాదు. ఇదే వారిశిష్యుల వ్యవహార ప్రసిద్ధి.

8. అదే విధంగా సమస్త వస్తు సమర్పణ చేసి అన్నింటి మధ్య బ్రహ్మ ఉన్నాడని అనుకోవాలి. దాని తర్వాత గంగలో అన్యజలాలు కలిసి గంగారూపమైనట్లుగా తమ మతంలో గుణాలు, ఇతరుల మతంలో దోషాలున్నాయని అంటారు. కావున తమ మతంలో గల గుణాల్నే వర్ణించాలి.

ఇప్పుడు చూడండి. గోసాయి మతం సర్వ మతం కంటే అధికంగా తన ప్రయోజనాన్ని నెరవేర్చుకొన్నది. బాగున్నది. ఈ గోసాయిలకు బ్రహ్మ యొక్క ఒక్క లక్షణం కూడా తెలియదు. అలాంటి సమయంలో శిష్యునికి శిష్యురాళ్లకు బ్రహ్మతో సంబంధం ఎలా కలిగించగలరని ప్రశ్నించగలరు. మేమే బ్రహ్మలమని, మాతో సంబంధం ఉండటం వలన బ్రహ్మ సంబంధమౌతుందని ఎవరైన అంటే నీలో బ్రహ్మ యొక్క గుణ, కర్మ, స్వభావాలు ఒక్కటి కూడా లేవు. కేవలం నీవు భోగవిలాసాల నిమిత్తమై బ్రహ్మవై కూర్చున్నావా? ఏమి? బాగున్నది. శిష్యులను, శిష్యురాళ్లను నీవు నీతో పాటు సమర్పించుకొని శుద్ధి చేస్తావు. కాని నీవు, నీ భార్య, బిడ్డ, కోడలు మొదలైనవారు అసమర్పితులుగా ఉంటే అపవిత్రులుగా ఉన్నారా? నీవు అసమర్పిత వస్తువును అపరిశుద్ధమని భావిస్తే, దాని నుండి ఉత్పన్నమైన నీవు అశుద్ధుడ వెలా కావు? కావున నీవు కూడా ఈ స్త్రీని, బిడ్డను, కోడలు మొదలైన స్త్రీలను అన్యమతస్థులకు సమర్పింపజేయటం ఉచితం. కాదు కూడదంటే నీవు కూడా అన్య పురుషులకు ధనాది పదార్థాలను సమర్పించటం, సమర్పింపజేయటాన్ని మానుకోవాలి.

పుష్టిమార్గం కాదు - కుష్ఠుమార్గం

మంచిది. ఇప్పటివరకు జరిగినదేదో జరిగింది. ఇప్పుడైనా ఈ మిథ్యా ప్రపంచ దుర్గుణాలను విడువు. మరియు సౌందర్యోపేత ఈశ్వరోక్త వేదవిహిత సుపథానికి వచ్చి ఈ మానవాకార జన్మను సఫలం చేసి ధర్మార్థ కామ మోక్షాలను చతుష్ట్య ఫలాలను పొంది ఆనందం అనుభవించు. ఇంకా చూడండి. ఈ గోసాయిలు తమ సంప్రదాయాన్ని 'పుష్టి' మార్గమంటారు. అంటే తిని, త్రాగి పుష్టిగా ఉండటం, అందరి స్త్రీలతో స్నేహం చేసి, యథేష్టంగా భోగవిలాసాలను అనుభవించటం. దీన్నే పుష్టిమార్గమంటారు. కాని భయంకర, అత్యంత దుఃఖదాయక భగందరాది వ్యాధులకు గురై ఏడ్చి మరణిస్తారు. అలాంటి బాధ ఉన్నవాళ్లకే ఇది తెలుస్తుంది. కాబట్టి వారినే అడగాలి. నిజానికది పుష్టిమార్గం కాదు - కుష్ఠుమార్గం అని చెప్పవచ్చు. కుష్ఠురోగి శరీరంలోని సమస్త ధాతువులు బాగా కరిగి బయటికి వెళతాయి. అతడు అధికంగా విలపిస్తూ శరీరాన్ని విడుస్తాడు. ఇలాంటి లీలలే వీరిని చూస్తే కనిపిస్తాయి. కాబట్టి దీనిని నరక మార్గం అనటమే మంచిది. ఎందుకంటే దుఃఖానికి నరకమని, సుఖానికి స్వర్గమని పేరు.

ఇదే విధంగా అసత్యజాలాన్ని పన్ని, అమాయకులను ఆలోచనాశక్తి లేనివారిని తాము పన్నిన వలలో చిక్కించి, తమను తాము శ్రీకృష్ణునిగా అనుకుని, అందరికి స్వాములవుతారు. ఎంతమంది

దైవీజీవులు' గోలోకం నుండి ఇక్కడికి వచ్చారో వారిని ఉద్ధరించటానికే మేము లీలా పురుషోత్తములమై జన్మించాము. ఎప్పుడంటే అప్పుడు మా యుపదేశాలను వినకుంటే గోలోక ప్రాప్తి కలుగదు. అక్కడ శ్రీకృష్ణుడు ఒక్కడే పురుషుడు, మిగతా వారందరు స్త్రీలు అని అంటారు. బాగున్నదండీ బాగున్నది. మీ మతం చాలా బాగున్నది. గోసాయీలకు ఎంత మంది శిష్యులున్నారో వారందరు గోపికలవుతారు.

ఇప్పుడు బాగును గురించి ఆలోచించండి. ఇద్దరు భార్యలు ఉన్న పురుషులు అత్యంత దుర్దశను అనుభవిస్తున్నారు. ఇక ఒకే పురుషుడు కోట్ల కొలది స్త్రీలు ఒకరి తర్వాత మరొకరు వెంటబడితే అతని దుఃఖానికి అవధులుంటాయా? శ్రీకృష్ణునిలో గొప్ప సామర్థ్యం ఉన్నదనీ, అతడందరిని ఆనందపరుస్తాడనీ ఐతే స్వామిని అయిన శ్రీకృష్ణుని భార్య, అతని అర్థాంగిని అవటంవలన ఆమెలోనూ శ్రీకృష్ణునంతటి సామర్థ్యం ఉండవచ్చు. ఎలాగంటే ఇక్కడ స్త్రీ పురుషుల కామచేష్టలు తుల్యాలు? లేక పురుషుని కంటే స్త్రీకి అధికమైనట్లు? గోలోకంలో కూడా ఇలాంటివి ఎలా సంభవిచవు? అదే నిజమైన స్వామికి తక్కిన స్త్రీలకు అత్యంత కలహాలు, చిక్కులు ఏర్పడుతుండవచ్చు. ఎలాగంటే సవతులనే భావం చాలా చెడ్డదిగా ఉంటుంది. ఇక గోలోకం స్వర్గానికి బదులుగా నరకతుల్యమై ఉండవచ్చు. లేక అనేక స్త్రీగామి అయిన పురుషులు భగందరాది రోగాలతో పీడించబడినట్లుగా గోలోకంలో కూడా పీడించబడుతూ ఉండవచ్చును.

ఛీ! ఛీ!! ఛీ!!! ఇట్టి గోలోకం కంటే మర్త్యలోకమే బాగున్నది. ఇక్కడ గోసాయీలు తమను శ్రీకృష్ణునిగా భావిస్తారు. అనేక స్త్రీలతో లీలలను చేస్తే భగందర, ప్రమేహం = క్షయవంటి వ్యాధులతో పీడించబడి మహా దుఃఖాలను అనుభవించటం చూడండి. ఇప్పుడు చెప్పండి తన స్వరూపులైన గోసాయీలు పీడితులైన గోలోకస్వామి శ్రీకృష్ణుడు ఎలా ఈ వ్యాధులతో పీడించబడడు? అలా పీడించబడకుంటే అతని స్వరూపులైన గోసాయీలు ఎలా పీడితులవుతారు?

ప్రశ్న:- మర్త్యలోకంలో లీలావతారం ధరించటంవలన వ్యాధి దోషాలు కలుగుతాయి. గోలోకంలో కలుగవు. ఎందుకంటే అక్కడ వ్యాధి దోషాలే లేవు?

జవాబు:- 'భోగే రోగభయమ్' (భర్తృ. వైరా. శ్లో. 83) ఎక్కడ భోగం అక్కడ ఉంటే రోగం తప్పకుండా ఉంటుంది. శ్రీకృష్ణునికి కోటాను కోట్ల స్త్రీలతో సంతానం కలుగుతుందా? లేదా? సంతానమే కలిగితే మగపిల్లలే కలుగుతారా? లేక ఆడపిల్లలే కలుగుతారా? లేక మగ ఆడ ఇద్దరూ పుడుతారా? ఆడపిల్లలే కలిగిన వారి వివాహం ఎవరితో జరిగి ఉండవచ్చు? ఎందుకంటే అక్కడ శ్రీకృష్ణుడు తప్ప పురుషులెవరూ లేరు కదా. ఒకవేళ ఇతర పురుషులే ఉంటే మీరన్న ప్రతిజ్ఞ భంగమౌతుంది. మగపిల్లలకు మగపిల్లలే కలుగుతారని అన్నప్పటికి కూడా ఈ దోషమే వచ్చిపడుతుంది. వారి వివాహం ఎక్కడ ఎవరితో జరుగుతుంది? లేక ఇంట్లోవారు ఇంట్లోని వారితోనే సంబంధం కలిగి ఉండవచ్చునా. లేక ఇతరుల కన్యలతో గాని, మగపిల్లలతో గాని జరిగినప్పటికి మీ ప్రతిజ్ఞ

అయిన 'గోలోకంలో ఒక్కడే శ్రీకృష్ణుడు పురుషుడు' అన్నది భగ్నమవుతుంది. సంతానమే కలుగదని అంటే శ్రీకృష్ణునిలో నపుంసకత్వం అనే దోషం, స్త్రీలలో గొడ్రాలితనం అనే దోషం కలుగుతుంది.

తను మనుధనాల అర్పణం

నేడు ఈ గోకులం ఏమైంది? ఢిల్లీ బాదుషా యొక్క భార్యామణుల సైన్యమైనదని తెలుసుకో. ఇప్పటికి గోసాయిలు శిష్య శిష్యురాళ్ళు, తనుమనుధనాలను తమకు అర్పింపజేసుకోవటం కూడా బాగా లేదు. ఎందుకంటే శరీరాలు వివాహ సమయంలో వధూవరులు పరస్పరం అర్పించుకొంటారు. ఇక మనస్సు కూడా ఇతరులకు సమర్పించబడలేదు. ఎందుకనగా మనస్సుతో పాటు తనువు కూడా సమర్పించవలసి వస్తుంది. ఇందులో ఏదైనా ఇతరులకు అర్పిస్తే అది వ్యభిచారమవుతుంది. ఇక ఇప్పుడు మిగిలింది ధనం. దానికి కూడా ఇదే లీల ఉన్నదని భావించండి. అంటే మనస్సు లేకుండా స్వల్పాంశం కూడా సమర్పించబడలేదు. ఈ గోసాయిల అభిప్రాయమేమిటంటే, శిష్యుడు సంపాదించిన దానిని తాము ఆనందంగా అనుభవించవచ్చునని ఉన్నది.

వల్లభ సాంప్రదాయులైన గోసాయిలందరు ఇప్పుడు త్రిలింగజాతిలో లేరు. ఎవరైన వీరికి పొరపాటున పిల్లనిచ్చిన అతడు కూడా జాతి నుండి వెలివేయబడి జాతి భ్రష్టుడవుతాడు. ఎందుకంటే వీరు జాతి నుండి పతితులుగా వెలివేయబడ్డారు. విద్యావిహీనులై రాత్రింబవళ్లు సోమరులుగాఉంటారు.

ఇంటికి వచ్చిన గోసాయి లీల

ఒకడు పాదపూజ చేయుటకు గోసాయిగారిని తన ఇంటికి తోడ్కొని వచ్చినపుడు అతడు కఱ్ఱబొమ్మ వలె కదలక మెదలక మౌనంగా కూర్చుంటాడు. పలకనైన పలకడు. పాపం, అతడు నోరెత్తిన మూర్ఖుడని తెలియును కద! ఏలయనగా **"మూర్ఖాణాం బలం మౌనం"** మూర్ఖులకు మౌనమే బలమన్నట్లు మాట్లాడిన పరువు తగ్గుననుకొనును. కాని స్త్రీలను మాత్రము రెప్పవాల్చక చూచుచుండును. ఏ స్త్రీ మీద గోసాయిగారి దృష్టిపడునో ఆమే భాగ్యం గొప్పదని ఆమె భర్త, సోదరులు, బంధువులు, తల్లిదండ్రులు మహా ప్రసన్నులవుతారు.

ఇక అచ్చటి స్త్రీలందరును గోసాయిగారి పాదాలకు మొక్కుచుందురు. అప్పుడు ఏ స్త్రీమీద గోసాయిగారికి మనస్సు పడునో లేదా దయకలుగునో లేదా దృష్టి పడునో ఆమె వ్రేలును తన కాలితో ఒత్తిపట్టును. అప్పుడా స్త్రీ, ఆమె పెనిమిటి మొదలగువారందరును తమ భాగ్యమని తలంతురు. అప్పుడు ఆ స్త్రీ యొక్క పతి మున్నగువారు ఆమెతో "నీవు గోసాయి గారి చరణసేవలో నుండు" మని చెప్పుదురు. ఒకవేళ ఎవరేని ఇష్టపడనిచో, దాసినో, మరొకరినో గోసాయి సేవకు పంపుదురు. యథార్థమేమనగా వారి మందిరములలోను, వారి సమీపమునను ఇట్టి కార్యములను చేయు స్త్రీలనేకులుందురనుట స్పష్టము.

వీరు దక్షిణలను కోరు విధానము

ఇక వీరు దక్షిణలను లాగుటకు పన్నిన ఎత్తుగడలు చూడండి. అదెట్లన- గోసాయిగారికి, గోసాయమ్మగారికి, పుత్రునికి, కూతురుకు, ముఖ్యసేవకునికి పరిచారకులకు, గాయకునకు, అట్లే శ్రీకృష్ణ విగ్రహానికి దక్షిణలను సమర్పింపుడని ఈ 'ఏడంగళ్ళ' పేర యథేష్టంగా దోచుకొంటారు. ఇక గోసాయిగారి శిష్యులలో ఎవరైనా మరణిస్తే గోసాయిగారు వాని యెదమీద తన పాదమునుంచును. అప్పుడు తనకేది లభించినను గోసాయిగారు తీసుకొనును. ఇదేమి పని? స్మశానములో శవములపై దానము గ్రహించు మహా బ్రాహ్మణుల, కాటికాపరుల పనికాదా?

కొందరు శిష్యులు వివాహ సమయంలో గోసాయిగారిని పిలిచి అతనిచేతనే వధూవరుల పాణిగ్రహణాన్ని చేయిస్తారు. కొందరు సేవకులాతనికి 'కేసరీయా' స్నానాన్ని చేయిస్తారు. అనగా గోసాయిగారి శరీరానికి స్త్రీలు కేసరి కుంకుమపువ్వు లేపనాన్ని చేసి, ఒక పెద్ద పాత్రలో పీట నుంచి, దానిపై గోసాయిగారిని కూర్చోబెట్టి, స్త్రీ పురుషులందరును చేరి స్నానం చేయిస్తారు. కాని వారిలో సామాన్యంగ స్త్రీలే స్నానం చేయిస్తారు. తర్వాత గోసాయిగారు పీతాంబరాన్ని ధరించి తడిపంచెను ఆ పాత్రలోనే వదిలేసి పావుకోళ్లు తొడిగి, బయటికి వస్తాడు. పిదప ఆ నీటిని శిష్యులందరూ ఆచమనం చేస్తారు. తరువాత మంచి మసాలా వేసి తాంబూలాన్ని కట్టి గోసాయిగారి కిస్తారు. అతడు దానిని నమిలి కొంత మ్రింగి తక్కినదానిని తన శిష్యుడు నోటియొద్ద ఎత్తిపట్టుకొనియుండిన వెండిగిన్నెలో ఉమ్మివేస్తాడు. అది ముఖ్య ప్రసాదమట. దానిని కూడ పంచుకొని ప్రసాదంగా సేవిస్తారు.

వీరెట్టి మనుష్యులో! ఆలోచించండి. వీరు చేయు పనులు మానవులకు తగినదేనా? ఇంతకు మించిన మూర్ఖత్వం, అనాచారం, ఈ లోకంలో ఇంకొకటుంటుందా? ఇదే సమయంలో గోసాయులు కానుకలను పుచ్చుకొంటారు. వారిలో కొందరు వైష్ణవుల చేతివంటనే తింటారు. తక్కినవారిచేత తినరు. మరికొందరు వైష్ణవుల చేతివంటను కూడా తినరు. వారు వంటచెరకులను కూడా కడిగి శుద్ధిచేసి వాడుకొంటారు. కాని పిండి, బెల్లం, చక్కెర, నెయ్యి మొదలగువాటిని కడుగకుండానే తీసుకొంటారు. కడుగుటవలన స్పర్శ దోష నివారణ మగుచుండెను గదా! పాపం వారేమి చేయగలరు? కడిగినచో ఆ పదార్థాలనే పోగొట్టుకొనవలసి వచ్చును. ఈ పదార్థాలకు స్పర్శదోషమంటదని చెబుతారు.

ఇక వారు 'మేము శ్రీకృష్ణుని విగ్రహాలను అలంకరించుటలోనూ నైవేద్యాదులను సమర్పించుటలోనూ పెక్కుధనాన్ని వ్యయం చేస్తున్నామని చెబుతారు. కాని ఆ యలంకారంగాని భోగాలను అలంకారాలకు భోగము వచ్చినలకు తామే అనుభవిస్తారు. నిజంగా చూస్తే వీరు పెద్దపెద్ద అధర్మాలాచరిస్తారు. దానితో అనేక విధాలైన అనర్థాలు జరుగుతాయి. అనగా హోలి పండుగలలో పిచికారి గొట్టాలనిండ రంగులను నింపి స్త్రీల అస్పర్శనీయావయవాలమీద, మర్మస్థానాల మీద చిమ్ముతారు. బ్రాహ్మణులకు నిషిద్ధమైన రసవిక్రయాన్ని కూడ వీరు చేస్తారు.

ప్రశ్న :- గోసాయిగారు రొట్టెలు, పప్పు, పాయసం, కూరలు, లడ్డూలు మొదలగు పదార్థాలను ప్రత్యక్షంగా అంగట్లో పెట్టి తామే కూర్చుండి స్వయంగా అమ్మరు. తమ పరిచారకులకు, సేవకులకు విస్తర్లలో పెట్టి ఇస్తారు. వారు కొనిపోయి అమ్ముతారు. గోసాయిగారు కాదు.

జవాబు:- గోసాయిగారు వారికి మాసిక వేతనాలనిస్తే వారా విస్తర్ల నెందుకు అంగట్లోపెట్టి అమ్ముతారు? గోసాయిగారు తమ సేవకులకు పప్పు అన్నం మొదలగు వానిని సేవకు మూల్యంగా అమ్ముచున్నారు. వారు వానిని తెచ్చి బజారులో అమ్ముకొంటున్నారు. గోసాయిగారు తామే బజారులో అమ్మిన ఆ బ్రాహ్మణాది సేవకులు రసవిక్రయ దోషమునుండి రక్షింపబడి ఒక గోసాయిగారు మాత్రమే ఆ రసవిక్రయరూప పాపము ననుభవింతురు గదా. కావున మొదట తామీ పాపమున బడి మునుగుచు ఇతరులను కూడ అందు పడవేయుచున్నారు. కొన్ని స్థలాలలో ఈ గోసాయిలు కూడ అన్నాదులను విక్రయిస్తారు. రసవిక్రయము చేయుట నీచుల పనియే కాని ఉత్తముల పని కాదు. ఇట్టివారే ఈ ఆర్యావర్తానికి అధోగతిని కలిగించారు.

స్వామినారాయణ మత ఖండనము

ప్రశ్న:- స్వామి నారాయణ మత మెట్లున్నది?

జవాబు:- "యాదృశీ శీతలాదేవీ తాదృశో వాహనః ఖరః" 'శీతలాదేవి ఎట్టిదో ఆమె వాహనమైన గాడిదకూడా అట్టిదే' అన్నట్లు ధనాపహరణాదులందు గోసాయిగారి చిత్ర లీలలెట్టివో స్వామి నారాయణుని మతము కూడా అట్టిదే.

చూడండి! సహజానందుడనువాడు అయోధ్యకు సమీపంలోనున్న ఒక గ్రామంలో పుట్టినాడు. అతడు బ్రమ్మచారియై గుజరాత్ కాఠియవాడ, కచ్ఛ, భుజ్జ మొదలగు ప్రాంతాలలో తిరుగుచుండేను. ఈ ప్రాంతంలోని ప్రజలు మూర్ఖులు, అమాయకులు. నేను వీరిని నా అభీష్టమతమున దింపగలుగుదునని భావించి ఓ ముగ్గురు, నలుగురిని శిష్యులుగా చేసికొన్నాడు.

పరస్పరం అందరాలోచించుకొని ఐకమత్యంగా వారిద్వారా సహజానందుడు నారాయణుని అవతారమనియు, మహాసిద్ధుడనియు, భక్తులకు చతుర్భుజములతో సహా సాక్షాత్తుగ దర్శనమిచ్చుచున్నాడ'నియు అక్కడి ప్రజలకు ఆ శిష్యులు ప్రచారం చేసారు.

కాఠియవాడలో దాదాఖాచరు డను ఒక జమీందారుండేవాడు. అతనితో ఈ శిష్యులు 'చతుర్భుజ, నారాయణుని దర్శనము చేసుకొనవలెనను కోరిక మీకున్నచో మేము సహజానందులవారిని వేడుకొందుమని చెప్పారు. శుద్ధ అమాయకుడైన అతడు సరే, కానీయడని వారితో అన్నాడు. అపుడొక గదిలో సహజానందుడొక కిరీటాన్ని తన తలపై పెట్టుకొని, రెండుచేతులలో శంఖ చక్రాలను పట్టుకొని ఆ చేతులను పైకి జాచి నిలుచున్నాడు. మరియొకడు వాని వెనుక నిలచి గదాపద్మములను పట్టుకొన్న

తన రెండుచేతులను సహజానందుని చంకంలో నుండి దూర్చి ముందుకు చాచి, చతుర్భుజమూర్తి ఆకారమగుపడునట్లు చేసాడు. తక్కిన శిష్యులు దాదాఖాచరునితో "మీరొకసారి కన్నులు తెరచి చూచి, మరల మూసికొని, తక్షణమే యీవలకు వెడలిరావలయును. చాల సమయం చూచిన నారాయణుడు కోపగించు"నని చెప్తారు. (ఏలయనగా తాము చేసిన కపటాన్ని అతడు పరీక్షచేయగూడదని వారి తలంపు). అప్పుడతనిని అచ్చటికి పిలుచుకొనిపోయినారు. సహజానందుడు తళతళ మెరిసే జరీవస్త్రాలను, పట్టుపీతాలంబరాన్ని ధరించి ఒక చీకటిగదిలో నిలుచున్నాడు. అప్పుడు శిష్యులున్నట్లుండి ఒక్కసారి దీపకాంతిచేత ఆ గదినంతయు దేదీప్యమానమగునట్లు చేసారు. దాదాఖాచిరుని కంటికి నెదుట చతుర్భుజమూర్తి నిలిచియున్నది కనబడ్డది. తక్షణమే యా దీపాలను ఆర్పివేసారు. అందరును నేలబడి నమస్కారాలు చేసారు. (వచ్చిన త్రోవను గాక) వేరుత్రోవను బట్టి దాదాఖాచరుని పిలుచుకొని వస్తూ, అతనితో, "మీ భాగ్యము నేడు ఫలించినది. మీరిక మహారాజుగారి శిష్యులు కండ"ని చెప్పగా నతడు మంచిదట్లే కానీయడని సహజానందుని శిష్యుడైనాడు. ఇంతలో సహజానందుడు వస్త్రాలను మార్చుకుని మరియొక గదిలో గద్దెపై కూర్చుండి దాదాఖాచరునికి కనిపించాడు. అప్పుడా శిష్యులు దాదాఖాచరునితో, "చూచితిరా! వీరి మహిమ. క్షణములో అవతారాన్ని మార్చుకొని ఇచ్చట విరాజమానుడై యున్నాడు" అని చెప్పారు.

అప్పుడు దాదాఖాచరుడు పూర్తిగా వారి వలలో పడ్డాడు. అప్పటి నుండి యీ మతము యొక్క వేరు గట్టిగా నాటుకుపోయింది. ఏలయనగా దాదాఖాచరుడను వాడొక గొప్ప జమీందారుగా నున్నందున అక్కడనే ఈ మతాన్ని స్థిరపరచుకొని ఆ సహజానందుడు ఇక్కడక్కడ నుపదేశాలు చేస్తూ తిరుగుచుండెను. ఎందరినో సాధువులను గూడ చేసాడు. అప్పుడప్పుడొక సాధువుయొక్క కంఠనాడుల నదిమిపట్టి, మూర్ఛగలుగుజేసి, వానిని సమాధిస్థునిగా చేసినాననియు జనులను మోసపుచ్చుచుండేవాడు. కాఠియవాడ్ ప్రజలు అమాయకులగుట వల్ల అతని టక్కులకు లోబడ్డారు. సహజానందుని మరణానంతరం అతని శిష్యులు మిక్కిలి పాషండతను వ్యాపింపజేశారు.

ఈ విషయంలో ఒక ఉదాహరణ మివ్వడం బాగనుపిస్తున్నది. అదేమిటంటే- ఒకడు దొంగతనం చేసి పట్టుబడ్డాడు. న్యాయాధీశుడు 'వీని ముక్కు చెవులు కోసివేయు'డని దండన విధించాడు. ముక్కును కోయగానే ఆ వంచకుడు నాట్యమాడుచు గానము చేయుచు, నవ్వసాగాడు. జనులు అది చూసి "నీవేల నవ్వుచున్నా'వని వాని నడుగుతారు. దానికి వాడు, 'అదిచెప్పదగినది కాదు' అంటాడు. అది యేమి చిత్రమని మరల వారడుగుతారు. మహా అద్భుతమైన చిత్రము, నేనెప్పుడును చూడలేదని వాడంటాడు. అప్పుడు వారు అది యేమి చిత్రమో", చెప్పాలంటారు. దానికి వాడు, "అహా! సాక్షాత్తుగ చతుర్భుజ నారాయణుడు నా యెదుట నిలిచియున్నాడే, నేనాయనను చూచి కడు సంతోషంతో నాట్యమాడుతూ పాటలు పాడుచున్నాను. నాకిట్లు సాక్షాత్తుగ నారాయణుని దర్శనమగుచున్నందులకు

నేనెంత గొప్ప భాగ్యవంతుడనని మురియుచున్నా" నంటాడు. మాకేల దర్శనమగుటలేదు? అని మరల వారడుగుతారు. దానికి వాడు "మీ ముక్కడ్డంగా ఉన్నది. ముక్కును కోయించుకుంటే నారాయణుడు మీకు అగుపడుతాడు. లేకపోయిన లేదు" అని బదులు చెప్తాడు. వారిలో మూర్ఖుడొకడు "ముక్కు తెగిపోయినను చింత లేదు కాని, నారాయణుని దర్శన మవశ్యముగా చేసుకొనవలె నని నిశ్చయించుకొని, వానితో "నా ముక్కు కోసి నారాయణుని చూపించు"అని చెప్తాడు. అప్పుడతడు వాని ముక్కు కోసి "నీవు నావలెనే చేయి. లేకపోతే నీ బ్రతుకు నా బ్రతుకు నవ్వులపాలౌతుంది సుమా" అని వాని చెవిలో మంత్రంగా మెల్లగా చెప్తాడు. పోయిన ముక్కు మరల రాదు గద, ఇక నిట్లు చెప్పుటయే తగునని ఊహించి వాడును, వారి యెదుట ఆడుచు పాడుచు, దుముకులాడుచు, నవ్వుచు, నాకు నారాయణుడు కానవచ్చుచున్నా"డని చెప్పనారంభిస్తాడు. ఇట్లొకని వెనుక నొకడు వేయిమంది ముక్కులు తెగినవారు గుంపుగా చేరారు. ఈ వార్త అంతటను మారు మ్రోగసాగింది. వీరు తమ సంప్రదాయానికి 'నారాయణదర్శి" అను పేరును పెట్టుకొన్నారు.

తెలివిలేని రాజొక డీ సమాచారాన్ని విని వారిని రప్పిస్తాడు. రాజు వారిని చూస్తున్నప్పుడు వారు చాలా ఆనందంగా, ఆడుతూ, పాడుతూ కనిపించారు. అదేమిటి అని రాజు వారి నడుగగా వారు ప్రత్యక్షంగ మాకు నారాయణుడు కనపడుచున్నాడని చెప్పారు.

రాజు:- మాకేల కానరాడు?

నారాయణదర్శి:- ముక్కుండునంతవరకు కనబడదు. మీరు ముక్కును కోయించుకొంటే మీకు కూడా నారాయణుడు ప్రత్యక్షంగా కనిపిస్తాడంటారు.

మంచిదని రాజు వారి మాటలను నమ్మి జ్యోతిష్కుని పిలుపించి ముహూర్తాన్ని పెట్టుమంటాడు. అపుడాతడు 'ఆజ్ఞాపాలకుడను' అన్నదాతా! దశమినాడు ప్రాతఃకాలం ఎనిమిది ఘంటలకు ముక్కును కోయించుకొనుటకును, నారాయణుని దర్శించుటకును మిక్కిలి మంచి ముహూర్తము" అని చెప్తాడు.

బలే! పోపుగారూ, బలే! మీ జ్యోతిష్య పుస్తకాలలో ముక్కులు కోయించుకోవడానికి కూడ ముహూర్తాన్ని వ్రాసిపెట్టినారా? అయ్యో! ఈ ధూర్తుల నేమనాలి?

అలా రాజు నిశ్చయించుకొని, ఆ వేయిమంది ముక్కిడుల భోజనార్థం షడ్రసోపేతమైన సామగ్రిని పంపాడు. అప్పుడు, వారందరు అమితానందభరితులై ఆడుటం, దుముకులాడుటం, పాడుటం ఆరంభించారు. కాని ఆ రాజుగారి మంత్రికి తక్కిన బుద్ధిమంతులుగా నున్న కొందరికి ఇది రుచింపలేదు. ఆ రాజుగారికంటె నాలుగు తరాలకు పూర్వం మంత్రిగా ఉన్న 90 సంవత్సరాల వృద్ధుడొకడున్నాడు. ఆ సమయంలో మంత్రిగా నున్న అతని మునిమనుమడు ఆ వృద్ధుడగు తన ముత్తాతకు ఈ వృత్తాంతము నంతయు వినిపిస్తాడు. అప్పుడా ముసలిమంత్రి విని, వారు వంచకులు. నన్ను రాజుయొద్దకు

దీసికొని వెళ్లవలయుననగా అతడట్లే చేస్తాడు. రాజు ఆ వృద్ధునకు మహాసంతోషముతో ఆ ముక్కిడుల వార్త నంతయు వినిపిస్తాడు. ఆ వృద్ధమంత్రి రాజు చెప్పిన దంతయు విని, వినుడు మహారాజా! పరీక్షించుటకు పూర్వము తొందరపడరాదు. తర్వాత పశ్చాత్తాపము చేసుకొనవలసి వస్తుందంటాడు.

రాజు:- ఆ వేయిమంది అబద్ధము చెప్పుదురా ఏమి?

మంత్రి:- అబద్ధము చెప్పుచున్నారో, నిజమే చెప్పుచున్నారో పరీక్ష జేయనిదే ఇది నిజమని, ఇది అబద్ధమని చెప్పబడజాలం.

రాజు:- ఏ ప్రకారం పరీక్ష చేయాలి?

మంత్రి:- విద్య, సృష్టిక్రమం, ప్రత్యక్షాది ప్రమాణాలతో

రాజు:- చదువని వాడెట్లు పరీక్ష చేయగలడు?

మంత్రి:- విద్వాంసుల సాంగత్యము వలన జ్ఞానాన్ని వృద్ధిపరచుకొని

రాజు:- విద్వాంసులు చిక్కని పక్షంలో?

మంత్రి:- పురుషార్థి కేదియు దుర్లభము కాదు.

రాజు:- ఎట్లు చేయాలో మీరే చెప్పండి?

మంత్రి:- నేను ముసలివాడను, ఇంటిలోనే కూలబడియుంటాను. ఇక కొన్ని దినాలే జీవిస్తాను. కావున మొదట నేను పరీక్షిస్తాను. పిమ్మట తాము ఉచితమని తోచిన అట్లే చేయవచ్చును.

రాజు:- ఇది బహు బాగుగ నున్నది. జ్యోతిష్యులుగారు మంత్రిగారి కొరకు ముహూర్తమును చూడుడు.

జ్యోతిష్యులు మహారాజుగారి అజ్ఞాప్రకారం శుక్ల పంచమినాడు పది ఘంటలకు సుముహూర్తమున్నది.

ఆ నియమింపబడిన పంచమి రాగానే ఆనాడు ఎనిమిది గంటలకు ఆ వృద్ధమంత్రి రాజుగారి వద్దకు వచ్చి, మన మచ్చుటికి రెండు మూడువేల సైన్యాన్ని గూడ మనతో దీసికొని పోవాలంటాడు.

రాజు:- అచ్చట సైన్యంతో నేమి ప్రయోజనం?

మంత్రి:- తమకు రాజ్యవ్యవస్థ తెలియదు. నే చెప్పినట్లు చేయి.

రాజు:- 'మంచిది. వెళ్లి సైన్యాన్ని సిద్ధపరచండి' అని అజ్ఞాపిస్తాడు.

సైన్యం, సన్నద్ధం కాగానే తొమ్మిదిన్నర గంటలకు రాజు వాహనము నెక్కి అందరిని వెంటబెట్టుకొని

పోతాడు. వీరందరిని చూచి ఆ ముక్కిడులు ఆడుటకును పాడుటకును ఆరంభిస్తారు. వీరందరు అచ్చటికి పోయి కూర్చొన్నారు. వారిలో మొదట ముక్కిడియై ఈ సంప్రదాయమును ప్రారంభించిన మహంతును బిలిచి రాజు– "నేడు మంత్రిగారికి నారాయణుని దర్శనం చేయింపుము" అనగా వాడు మంచిదని, పది గంటల సమయం కాగానే, ఒక మనుష్యుడొక పళ్ళెమును ముక్కు క్రిందబట్టియుండగా పదునైన కత్తితో మంత్రిగారి ముక్కును కోసి ఆ పళ్ళెములో పడవేస్తాడు. అపుడా మంత్రి ముక్కు నుండి నెత్తురు కారసాగింది. ముఖము వెలవెలబోయింది. అందరకు వలెనే ఆ వంచకుడా మంత్రిగారి చెవిలో "మీరును కూడ నవ్వుచు నాకు నారాయణుడు కనబడుచున్నాడని చెప్పుడు; కోసిన ముక్కు మరల రాదు. మీరట్లు చెప్పకపోయిన మీకు తలవంపు కల్గును. అందరు మిమ్ముల చూచి నవ్వుతారు" అను మంత్రాన్ని ఉపదేశించి, దూరంగా తొలగిపోతాడు. పాపము మంత్రిగారు తన చేతిగుడ్డతో గాయాన్ని నొత్తిపట్టుకొంటాడు.

అప్పుడు ఆ రాజు మంత్రిగారూ "నారాయణు డగపడుచున్నాడా? లేదా?" అని అడుగగా అతడు, రాజుగారి చెవిలో ఏమియు కనిపించుటలేదు. వ్యర్థముగ నీ ధూర్తుడు మోసపుచ్చి వేలమందిని పాడుచేసినాడు. అంతయు అబద్ధమే"నని చెప్తాడు. అంత రాజు "ఇపుడేమి చేయవలయు"నని మంత్రి నడుగగా అతడు "వీరికి కఠిన దండన విధించాలి. జీవితకాలమంతయు వీరిని చెరసాలలో నుంచాలి. వీరి నందరిని చెడిపిన యీ దుర్మార్గుని గాడిదమీద ఎక్కించి మహా దుర్దశతో చంపాల"ని రాజుతో చెప్తాడు. ఆ రాజు, మంత్రియు గుసగుసలాడ నారంభించినపుడే ఆ ముక్కిడులకు భయము పుట్టి పలాయనసూత్రాన్ని పఠించదలచారు. కాని నలుప్రక్కలను వారిని సైన్యము ముట్టడించి యున్నందున పారిపోవుటకు వీలు కాలేదు. అప్పుడు వీరందరిని బట్టి కాళ్ళకు సంకెళ్ళను వేయుడు. ఈ దుర్మార్గుని ముఖానికి మసిపూసి నల్లగా చేసి గాడిదమీద నెక్కించి, వీని మెడలో పాత చెప్పులదండను వేసి అంతట త్రిప్పుచు పిల్లవాండ్రచేత మన్ను, బూడిద వీని మీద చల్లించుచు, నాలుగు బాటలు కలిసినచోట్ల నిలిపి, చెప్పులతో కొట్టించుచు, కుక్కలచేత వీని దేహాన్ని తునాతునక లగునట్లు చేసి, వీనిని చంపాలి. అట్లు చేయకపోయినచో వీరు మరల ఇతరులను కూడ ఇట్లే మోసపుచ్చుదురని రాజు తన భటుల కాజ్ఞాపిస్తాడు. వారట్లే చేస్తారు. ఆ ముక్కిడుల సంప్రదాయ మంతటితో అంతరించింది.

ఈ విధంగానే వేద విరోధులందరు కపటోపాయముతో ఇతరుల ధనాన్ని అపహరించుటలో చతురులై యున్నారు. సంప్రదాయకుల మోసాలు ఇలాగే ఉంటాయి.

స్వామి నారాయణ మతస్థులు డబ్బులాగుటకు నానావిధాలైన కపట కృత్యాలను చేసేవారు. మూఢుల నెందరినో మోసపుచ్చుటకుగాను, వారు మృతినొందునప్పుడు, వారితో సహజానందులు తెల్లని గుఱ్ఱము నెక్కి మోక్షస్థాన మను స్వర్గమునకు కొనిపోవుటకు వచ్చుననియు, ప్రతిదినం ఈ మందిరాని కొక పర్యాయమైనా వచ్చిపోవాలని నియమంపెట్టారు.

ఇక ఉత్సవ సమయాలలో మందిరంలోపల పూజారులుంటారు. మరి వారుండు స్థలమునకు క్రిందిభాగముననే ఒక దుకాణమును తెరచియుంచెడివారు. దుకాణము, మందిరముల మధ్య నొక సొరంగము చేయబడియుంటుంది. నైవేద్యము కొరకు భక్తులు సమర్పించిన టెంకాయలను మరల నా అంగడిలోనికి ఈ సొరంగము ద్వారా పంపిస్తారు. అనగా ఈ విధంగానే ఒక కొబ్బరకాయ దినమునకు వేయిసార్లు విక్రయింపబడును. ఇటులనే అన్ని పదార్థాలను అమ్ముతుంటారు.

ఏ జాతి సాధువు నా జాతిపని చేయుటకు నియమించుచున్నారు. ఎట్లనగా, మంగలివానిచే క్షౌరమును, కుమ్మరిచేత కుండలు మొదలగువానిని, శిల్పించే శిల్పిపనులను, కోమటిచేత వాణిజ్యాన్ని, శూద్రునిచే ఊడిగపు పనులను చేయించుచున్నారు. వీరు తమ శిష్యులమీద పన్నును వేస్తారు. వీరిట్లు మోసపుచ్చి లక్షలకొలది, కోట్లకొలది ధనాన్ని సంగ్రహిస్తారు. సంగ్రహిస్తూనే ఉంటారు. గురుపీఠంపై గూర్చుండువాడు గృహస్థుడు అనగా అతడు వివాహము చేసుకొని ఆభూషణములను కూడ అలంకరించుకొంటాడు. పాదపూజ కొరకు రప్పించినవారితో గోకులీయ గోసాయుల వలె గోసాయిగారికి, గోసాయమ్మగారికి, వారి బిడ్డలకు దక్షిణ సమర్పించుడని చెప్పి డబ్బు లాగుతుంటారు.

తాము సత్సంగులమని, ఇతర మతములవారిని కుసంగులని చెప్తుతారు. తమ వారిని తప్ప తక్కిన వారెంత ఉత్తములు, ధర్మాత్ములు, విద్వాంసులైనను వారి నాదరించరు. వారి సేవ ఎన్నటికిని చేయరు. ఇతర మతస్థులవారికి సేవ చేయుటవలన పాపం కలుగునని భావిస్తుంటారు. వీరి సాధువులు స్త్రీల ముఖములనైనను చూడరని చెప్తుతుంటారు. కాని లోలోపల నేమేమి చిత్రములు జరుగుచుండునో తెలియదు గద! ఇట్టివారి గుర్తింపు చాలా తక్కువే. కొన్ని స్థలాలలో ఈ సాధువుల పరస్త్రీ గమనాది చేష్టలు కూడ బైటపడినవి.

ఇక వీరిలో పెద్దపెద్ద సాధువులు చనిపోయినపుడు వారి శరీరాలను ఒక రహస్యమైన బావిలో పడవేసి 'వారు దేహముతో వైకుంఠానికి పోయినారని, వారిని సహజానందులవారే పిలుచుకొనిపోయిరని, ప్రచారం, చేస్తారు. ఇంకను 'మహారాజా! వీరిని తీసుకొనిపోకండి. కొంతకాలమిక్కడనే ఉండనిండు. ఈ మహాత్ముడు ఇక్కడుండడం వలన మాకు చాలా మంచిది' అని మేమెంత ప్రార్థించినను "లేదు లేదు, వీరి అవసరము వైకుంఠమున ఎంతో ఉన్నది. కావున తీసుకొనిపోవుచున్నా"నని సహజానందులు చెప్పిరనియు, మేము మా కన్నులతో సహజానందుల వారిని, వారి విమానాన్ని మరణించిన మహాత్ముడిని తన విమానమున గూర్చుండబెట్టుకొని పోవునపుడు పుష్పవర్షము కురిసినదని ప్రసిద్ధిచేస్తారు.

ఒక సాధువు రోగగ్రస్తుడై మరణాసన్నుడైనపుడు "నేను రేపు రాత్రి వైకుంఠమునకు పోవుదును" అని చెప్పుచుండును. ఆ రాత్రి వాడు చావకపోయినను మూర్ఛలో ఉండగానే అతనిని తీసుకొని ఆ రహస్యమైన బావిలో పడవేయుదురని వినికిడి. అట్లు చేయకున్నా ఆ సాధువు చెప్పిన మాట అబద్ధమగును గదా! కావున అటుల చేయుదు రనుటలో ఆశ్చర్యపడవలసిన దేమియు లేదు. ఇట్లే గోకులీయ

గోసాయులు మరణించినపుడును వారి శిష్యులు "గోసాయిగారు తమ ప్రభావమును విస్తరించిపోయిరి"అని చెప్పుదురు.

ఈ గోకులీయ గోసాయులును, స్వామినారాయణ మతస్థులును ఉపదేశించు "శ్రీకృష్ణ శరణం మమ" అను మంత్రమొక్కటే. శ్రీకృష్ణుడు నాకు శరణ్యుడు అనగా నేను శ్రీకృష్ణునకు శరణాగతుడనని వారర్థము చేస్తారు. కాని శ్రీకృష్ణుడు నా శరణమును పొందును గాక! అనగా నాకు శరణాగతుడగును గాక యని కూడా దీని కర్థమగును. ఇట్టి మతస్థులందరును విద్యావిహీనులగుట వలన శాస్త్ర విరుద్ధములైన అసంగతవాక్యాలను రచిస్తారు. వీరికి విద్యానియమాల జ్ఞానమెంతమాత్రముండదు.

మాధ్వమతము - సమీక్ష

ప్రశ్న:- మాధ్యమతమైన మంచిదేనా?

జవాబు:- ఇతర మతావలంబులవంటివారే ఈ మాధ్వలు కూడా. వీరును చక్రాంకితులగుచున్నారు. అన్య చక్రాంకితులకంటె వీరియందు కొంత విశేషమున్నది. ఏమన, రామానుజీయులొక పర్యాయమే చక్రాంకితులౌతారు. కాని మాధ్వలు సంవత్సరమున కొకసారి చక్రాంకితులౌతారు. చక్రాంకితులు ముఖమున పచ్చని రేఖను, మాధ్వలు నల్లని రేఖను దిద్దుకొంటారు. ఒక మాధ్వ పండితునితో ఒక మహాత్ముడు ఇట్లు శాస్త్రార్థం చేసాడు.

మహాత్ముడు:- మీరు నల్లని రేఖను, గుండ్రంగా చందనవు బొట్టును ఎందుకు పెట్టుకొంటున్నారు?

మాధ్వ పండితుడు:- ఇట్లు పెట్టుకొనుట వలన మేము వైకుంఠానికి పోతాము. శ్రీకృష్ణుని శరీరం కూడ నల్లనిదే కదా! కావున, మేము నల్లని తిలకాన్ని పెట్టుకొంటాము.

మహాత్ముడు:- నల్లని రేఖను గుండుబొట్టును ముఖమున పెట్టుకొనుటవలననే వైకుంఠమునకు పోవుదురేని ముఖమునంతా నల్లగా చేసికొన్నచో మరెక్కడికి పోగలుగుదురు? వైకుంఠమును గూడ దాటిపోదురా ఏమి? శ్రీకృష్ణుని శరీరమంతయు నల్లనిదిగా ఉన్నది. మీరును మీ శరీరమును నల్లగా చేసికొన్న శ్రీకృష్ణుని వంటివారు కావచ్చును గద. అలా ఎందుకు చేసుకొనరు?

దీనిని బట్టి ఈ మతము కూడ పైన చెప్పబడిన మతముల వంటిదే అని తెలుసుకొనాలి.

లింగాంకిత మతము

ప్రశ్న:- లింగాంకితుల మతమెట్టిది?

జవాబు:- అదియును చక్రాంకితులవంటిదే. చక్రాంకితులు చక్రంతో ముద్రలు వేసుకొని నారాయణునిదప్ప మరి యెవ్వరిని అంగీకరింపనట్లు లింగాంకితులును లింగంతో కాల్చి ముద్రలు

వేసుకొని మహాదేవుని తప్ప మరొకరిని ఉపాసింపరు. ఇక ఈ లింగాంకితులలో గల విశేషమేమనగా వీరు పాషాణముతో చేయబడిన లింగమును బంగారు మూకుడు పెట్టెలోగాని వెండి మూకుడు పెట్టెలో గాని పెట్టి దానిని మెడలో ధరింతురు. వారు నీరు త్రాగునపుడు కూడ దానికి చూపి త్రాగుతారు. వీరి మంత్రము కూడ శైవుల వంటిదేనని తెలుసుకొనాలి.

బ్రహ్మసమాజం - ప్రార్థనా సమాజం

ప్రశ్న:- బ్రహ్మ సమాజం ప్రార్థనా సమాజాలైనను మంచివా కావా?

జవాబు:- కొన్ని కొన్ని, విషయములు మంచివే. కాని వానిలో అనేక దోషాలు గలవు.

ప్రశ్న:- బ్రహ్మ సమాజం ప్రార్థనా సమాజా లన్నింటికంటే మేలు. ఏలయనగా వీని నియమాలు చాలా బాగుగా ఉన్నవి.

జవాబు:- సర్వాంశములందు దాని నియమాలు బాగుగా లేవు. ఏలయనగా వేదవిద్యా విహీనులైనవారి కల్పనలు సర్వథా సత్యములెట్లు కాగలవు? బ్రహ్మ సమాజ ప్రార్థనా సమాజపు వారు క్రైస్తవమతములో చేరకుండా కొందరిని కాపాడారు. కొంత కొంత పాషాణాది విగ్రహారాధనను కూడ దూరం చేశారు. మరికొందరిని, మిథ్యాకల్పిత గ్రంథాలకు మోసపోకుండ చేసారు. ఈ మతంలో ఉన్న మంచి ఇంతే.

బ్రహ్మ సమాజ- ప్రార్థనా సమాజ దోషాలు

1. వీరిలో స్వదేశ భక్తి చాలా తక్కువగా నున్నది. వీరు క్రైస్తవుల ఆచారాలనే విశేషించి అనుకరిస్తున్నారు. అన్నపానాలను, వివాహాది నియమాలను కూడ మార్చివేసినారు.
2. తమ దేశము యొక్క ప్రశంసను ఏ మాత్రం చేయరు. తమ పూర్వజుల గొప్పతనాన్ని ప్రకటించుటకు బదులు వారిని బాగా విమర్శిస్తారు. ఉపన్యాసాలలో క్రైస్తవాది ఆంగ్లేయుల ప్రశంసను మనసార చేస్తారు. బ్రహ్మాది మహర్షుల పేర్లను కూడ ఎత్తరు. తద్విరుద్ధంగా ఆంగ్లేయులు తప్ప సృష్టిలో ఇంతవరకు ఎవ్వరును విద్వాంసులే కాలేదనియు, ఆర్యావర్తీయు లెప్పుడును మూర్ఖులుగానే యుండిరనియు, ఇప్పుడూ అట్లే ఉన్నారనియు, వీరెన్నటికీ ఉన్నతిని పొందలేరనియు చెప్పుతారు.
3. వేదాదులను ప్రశంసించు మాట అటుండనిండు, పైపెచ్చువానిని నిందించుటకు అందరికంటే ముందుంటారు. బ్రహ్మ సమాజము యొక్క ఉద్దేశములు వ్రాయబడియున్న పుస్తకంలో 'క్రీస్తు, మహమ్మదు, నానకు, చైతన్యుడుమున్నగు వీరినే సాధువులుగా లెక్కించి ఒక్క ఋషి- మహర్షి పేరు నైనను వ్రాయలేదు. దీనివలన వీ రెవరిపేర్లను వ్రాసిరో, వారి మతానుయాయులే వీరని బోధపడుచున్నది.

ఆహా! వీరు ఆర్యావర్తమున పుట్టి, ఈ దేశపు అన్న జలాలతో శరీరాన్ని పోషించుకొంటూ తమ తల్లిదండ్రుల, తమ తాత మొదలగువారి మార్గాన్ని వదలి, విదేశీయ మతముపై ఇంత విశ్వాసము కలిగియుండుటయు, ఇంతేకాక ఈ దేశానికి సంబంధించిన సంస్కృత విద్యను చదువక, తమకు తామే విద్వాంసులమని చెప్పుకొనుటయు. ఆంగ్లేయభాషను అభ్యసించి పండితాభిమానులై తటాలున ఒక కొత్త మతమును ప్రవేశపెట్టుటయందు ప్రవృత్తులగుట మొదలగునవి జనుల స్థైర్యమును వృద్ధిచేయు కార్యము లెట్లగును?

4. ఆంగ్లేయులు, యవనులు, అంత్యజులు మున్నగువారితో భోజనపానాదులలో భేదమును పాటింపకున్నారు. ఇట్లు తిను త్రాగుటవలనను జాతిభేదమును నిరాకరించుట వలనను మన దేశము బాగుపడునని వీరనుకొనుచున్నారు కాబోలు, కాని యిట్టివారి వలన బాగుపడుటెట్లు? దానికి మారుగా చెడుయే కలుగును.

5. జాతి భేదాలు:-

ప్రశ్న:- జాతి భేదాలు ఈశ్వరకృతమా? లేక మనుష్యకృతమా?

జవాబు:- జాతి భేదము ఈశ్వరకృతము మరియు మనుష్యకృతము.

ప్రశ్న:- ఈశ్వరకృతమేది? మనుష్యకృతమేది?

జవాబు:- మనుష్య, పశు, పక్షి, వృక్ష, జలజంత్వాది జాతులు పరమేశ్వరకృతాలు. ఉదా: పశువులలో ఆవు, గుఱ్ఱము, ఏనుగు మొదలగు జాతిభేదాలు వృక్షములలో మేడి, మఱ్ఱి, చింత మొదలగు జాతి భేదాలు, పక్షులలో హంస, కాకి, కొంగ మొదలగు జాతి భేదములును, జలజంతువులలో చేపలు మొసళ్ళు మొదలగు జాతి భేదాలు. అట్లే మనుష్యులలోను బ్రాహ్మణ- క్షత్రియ- వైశ్య- శూద్ర- అంత్యజాతి జాతిభేదాలు ఈశ్వరకృతాలు. ఐనను మనుష్యులలో బ్రాహ్మణాదులను సామాన్య విశేషాత్మక జాతులందు లెక్కించుచున్నాము. కాని సామాన్యజాతియందు లెక్కించుటలేదు. వర్ణాశ్రమ వ్యవస్థ విషయంలో ఇంతకు పూర్వము వ్రాయబడినట్లే గుణ కర్మ స్వభావాలను బట్టి వర్ణవ్యవస్థ నంగీకరించుట అవసరం. ఈ మనుష్యకృతత్వము, అనగా వారి వారి గుణ కర్మ స్వభావాలను బట్టి పూర్వము చెప్పబడినట్లు బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రాది వర్ణాలను పరీక్షాపూర్వకంగా నియమించుట రాజులకును విద్వాంసులకును కర్తవ్యమైయున్నది. భోజన భేదము కూడ ఈశ్వరకృతమును మనుష్యకృతమునయియున్నది. ఎట్లనగా సింహము మాంసాహార జంతువు. ఖడ్గమృగము గడ్డి మొదలగువానిని తినును. ఇది ఈశ్వరకృతము. ఇక దేశకాల వస్తుభేదాలను బట్టి భోజనభేదము మనుష్యకృతము.

ఐరోపీయుల గుణ దోషములు

ప్రశ్న:- యూరోపీయనులను చూడండి! వారు బూట్లు, కోట్లు, తొడిగి, హోటళ్ళలో అందరితో కలిసి తినుచున్నారు. కావుననే వారు వృద్ధిని పొందుచున్నారు.

జవాబు:- ఇట్లు తలచుట మీ పొరపాటు. ఏలయనగా తురకలు, మాలలు మొదలగు వారందరిచేత తినుచున్నారే. మరి వారేల ఉన్నతిని పొందుట లేదు? యూరోపియనులు బాల్యావస్థలో వివాహం చేసుకోరు. వారు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తారు. స్వయంవర వివాహాలను చేస్తారు. దుర్మార్గుల ఉపదేశాలను వినక విద్యావంతులై మూర్ఖుల వలలో చిక్కుకొనరు. ఏ పని చేసినను పరస్పరము ఆలోచించి, సభలలో నిశ్చయించుకొని చేస్తారు. తమ జాత్యభివృద్ధి కొరకు తనువును, మనుసును, ధనాన్ని ధారపోస్తారు. సోమరితనాన్ని వదలి, నిరంతరం పనిచేస్తారు.

వారి ఉన్నతికి కారణాలు:- చూడండి! వారు తమ దేశపు బూట్లను తొడిగినవారినే కార్యాలయా (ఆఫీసు)ల లోనికి రానిస్తారు. ఇతరదేశపు పాదరక్షలను తొడిగినవారిని రానివ్వరు. ఇంతటితోనే మీరు గ్రహింపవచ్చును. అనగా వారు తమ దేశపు పాదరక్షలను చూచునంతటి గౌరవ మర్యాదలతోనైనా ఇతర దేశస్థులైన మనుష్యులను కూడ చూడరు.

చూడుడు! సుమారు వంద సంత్సరాలకు పైగా యూరోపియనులు ఈ దేశానికి వచ్చి నివసిస్తున్నారు. ఇంతవరకును తమ దేశమున తొడుగుచుండిన విధంగానే వస్త్రాలను తొడుగుచున్నారు. వారు తమ దేశ మర్యాదలను వదలలేదు. కాని మీ యందనేకులు వారి ననుసరిస్తున్నారు. దీనివలననే కద! మీరు బుద్ధిహీనులనీ, వారు బుద్ధిమంతులనీ తెలుస్తున్నది. ఇతరులను అనుకరించుట బుద్ధిమంతుల పనికాదు.

ఇంతేకాక వారు ఏపనినైనా యథోచితంగా చేస్తారు. వారు యజమాని ఆజ్ఞానుకూలంగానే వ్యవహరిస్తారు. తమ దేశస్థులను వర్తకము మున్నగు పనులందు సహాయం చేస్తారు. ఇట్టి ఈ మంచి గుణములుండుట చేతను, మంచి కర్మలను చేయుట చేతను వారున్నతిని పొందుచున్నారు. కాని, బూట్లను, కోట్లను, పాయింట్లను తొడిగి హోటళ్ళలో తిని, త్రాగుట మున్నగు సామాన్యాలైన ప్రవర్తనలచే గాని, చెడుకార్యములచే గాని వారు వృద్ధికి రాలేదు.

ఇక వీరిలోనూ జాతిభేదము కలదు. చూడుడు! ఒక యూరోపియను వ్యక్తి ఎంత గొప్ప అధికారియు ప్రతిష్ఠావంతుడునై యున్నను, అత దన్యదేశపు కన్యను గాని అన్యమతస్థుల కన్యను గాని వివాహావాడిన పక్షమందును, తక్కిన పక్షమందును లేదా ఒక యూరోపియన్ కన్య అన్యదేశీయుని వివాహమాడిన పక్షమందును, వారితో తెగవారందరును వారికి ఆహ్వానము పంపుట కాని, వారితో గలిసి భోజనము చేయుటగాని, వారితో వివాహాది సంబంధముంచుట గాని తక్షణమే మానివేస్తున్నారు. ఇది జాతిభేదము కాక మరేమగును?

ఇక వారు "మాలో జాతిభేదము లేద"ని చెప్పుచు మీలోటి తెలివితక్కువవారిని భ్రమింపచేయుచు మోసగిస్తున్నారు. మీరును మీ మూర్ఖత్వంవలన ఆ మాటలను నిజమని నమ్ముచున్నారు. కావున ఏపనిని చేసినను మరల పశ్చాత్తాపము కలుగకుండునట్లు బాగుగా విచారించి చేయాలి.

చూడుడు! రోగికి వైద్యుడు, ఔషధము అవసరముండును. ఆరోగ్యవంతునకు వానితో పనిలేదు. విద్యావంతుడు నిరోగిగా ఉండును. అవిద్వాంసుడు రోగగ్రస్తుడగుచుండును. అవిద్యారోగమును తొలగించుటకు సత్యవిద్య సత్యోపదేశం అవసరం. ఈ అవిద్యయనే రోగం కలవారు కలిసి తినుట త్రాగుటలోనే ధర్మం కలదనియు, అట్లు చేయనిచో ధర్మం పోవుననియు తలచుచున్నారు. అన్నపానములందు అనాచారముగ వర్తించువానిని చూచినపుడు, వాడు ధర్మభ్రష్టుడైనాడని అనుకొందురు. ఇక వానిమాటకూడ వినరు. తాము వాని సమీపమున కూర్చుండరు. వానిని తమ సమీపమున కూర్చుండనివ్వరు.

ఇప్పుడు "మీ విద్య స్వార్థం కొరకా, పరమార్థం కొరకా?" మీరే చెప్పండి. మీ విద్యవలన అజ్ఞానులకు లాభం కలిగినపుడే అది పరమార్థమగును. వా రా లాభాన్ని పొందగోరరు, దానికి మేమేమి చేయాలంటారా? అదియును మీ దోషమే కాని వారి దోషం కాదు. ఏలయనగా మీరు తగిన నడవడిక కలిగియున్నచో వారు మిమ్ములను ప్రేమించి మీ నుండి ఉపకారం పొందెడివారు. కేవలం మీరు మీ సుఖాన్నే చూచుకొని వేలకొలది జనులకు కలుగబోవు ఉపకారాన్ని నశింపజేసినందులకు ఈ గొప్ప అపరాధమను పాపము మీకు తగిలినదని తెలిసికొనాలి. ఏలయనగా పరులకు ఉపకారం చేయుట ధర్మం, హాని కలిగించుట అధర్మం.

కనుక విద్వాంసుడు యథాయోగ్యంగా నడుస్తూ అజ్ఞానులను దుఃఖసాగరమునుండి తరింపచేయుటకు పడవవంటివాడు కావాలి. ఎన్నడును మూర్ఖులవలె కార్యాలను చేయగూడదు. కాని తమకును, ఇతరులకును దినదినాభివృద్ధిని కలుగజేయు కార్యాలను మాత్రం తప్పక చేయుచుండాలి.

ప్రశ్న :- మేము ఏ పుస్తకాన్నీ! ఈశ్వరకృతమని గాని దానిలోని అంశాలన్నియు సత్యమైనవని కాని నమ్మము, ఏలయనగా మనుష్యులబుద్ధి భ్రాంతితో కూడినది. కాబట్టి వారు రచించిన గ్రంథాలన్నియు భ్రాంతి యుక్తాలైయుండును. కావున మేమన్నింటిలోని సత్యాన్ని గ్రహింస్తున్నాము. అసత్యాన్ని వదలివేస్తున్నాము. ఆ సత్యం వేదమునందుగాని, బైబిలునందుగాని, ఖురానునందుగాని, మరియే గ్రంథమునందు గాని ఉండిన అది మాకు గ్రాహ్యమే. అసత్యమెచ్చట నున్న అది గ్రాహ్యం కానేరదు.

జవాబు:- దేనివలన మీరు సత్యాన్ని గ్రహించదలచుచున్నారో దానివలననే మీరసత్యాన్ని కూడ గ్రహించగలగాలి. ఏలయనగా మనుష్యులందరు భ్రాంతిరహితులు కాజాలరు. మరి మీరును

మనుష్యులై యుండుటవలన భ్రాంతిసహితులే అగుదురు. భ్రాంతిసహితులైనవారి మాటలు సర్వాంశములందును ప్రామాణికాలు కానపుడు మీ మాటలునూ విశ్వసింపదగినవి కావు. ఇక మీ మాటలను కూడ పూర్ణముగా విశ్వసింపగూడదు. కావున విషయుక్తమైన అన్నంవలె అవియును త్యాజ్యాలే.

మరి మీరు వ్రాసిన వ్యాఖ్యాన పుస్తకాలను కూడ ప్రమాణాలని ఎవరూ అంగీకరింపకూడదు. **"చలే తో చౌబేజీ ఛబ్బే జీ బననేకో, గాంఠ కే దో ఖోకర దుబేజీ బన గయే"**అనగా చతుర్వేదియైనవాడు ఆరు వేదముల వాడగుటకు పోగా ఉన్నవానిలోని రెండు పోగొట్టుకొని 'ద్వివేది' అయ్యెనట. ఇతర మనుష్యులు సర్వజ్ఞులు కానట్లే మీరును ఎంతమాత్రము సర్వజ్ఞులు కారు. మీరొక సమయంలో భ్రమచే అసత్యాన్ని గ్రహించి, సత్యాన్ని వీడిననూ వీడవచ్చును. కావున సర్వజ్ఞుడైన పరమేశ్వరుని వచన సహాయం అల్పజ్ఞులమయిన మనకు తప్పనిసరిగా కావలసినదే. వేదవ్యాఖ్యాన విషయంలో సప్తమ సముల్లాసంలో వ్రాయబడినట్లుగా మీరు అవశ్యమంగీకరించాలి. లేకున్న "ఇతో భ్రష్ట స్తతోనష్ట" అన్నట్లు కావలసివచ్చును. వేదములందసత్యమేమియు లేక అంతయు సత్యమే లభించుచుండగా వాని నంగీకరించుటకు సందేహించుట, తాము హాని బొందుటయే గాక పరులకును హాని కలుగజేయుటయై యున్నది.

దీనివలననే ఆర్యావర్తపు జనులు మిమ్ములను తమవారని భావింపరు. కావున మీరు ఆర్యావర్తము యొక్క అభివృద్ధికి కారణభూతులు కాలేకపోయారు. ఏలయనగా, మీరు పదిండ్ల పాపరాజులు. "ఇట్లు చేయుట చేతనే ఉపకారము పొందుచు ఇతరులకు ఉపకారము చేయగలగుదు"మని మీ రనుకొనవచ్చును. కాని మీరట్లు చేయలేరు. ఒక తల్లిదండ్రు లిరువురే ప్రపంచములోని బిడ్డలనందరిని పాలింపబూనుదురేని వారందరిని బాలింపనేరక తమ స్వంతబిడ్డలను కూడ ఎట్లు నష్టపరచుకొందురో అట్లే మీ గతియునగును. ఇక వేదాది సత్యశాస్త్రముల నంగీకరించక మీరు మీ వచనములయందలి సత్యాసత్యములను ఎట్లు పరీక్షించగలరు? ఆర్యావర్తము యొక్క ఉన్నతిని ఎట్లు చేయుగలరు? ఎన్నడునూ చేయుజాలరు.

ఈ దేశానికి వచ్చిన రోగానికి తగిన మందు మీ యొద్ద లేదు. మరి యూరోపియనులు మీ సహాయాన్ని కోరరు. ఇంక ఆర్యావర్తీయులు మిమ్ములను అన్య మతస్థులవలె చూస్తున్నారు. ఇప్పుడైనను మీరు తెలివి తెచ్చుకొని వేదాది సత్యశాస్త్రాల నంగీకరించుచు దేశోన్నతి కొరకు ప్రయత్నించుట మంచిది. మీరు సత్యమంతయు పరమేశ్వరునిచే ప్రకాశింపబడునని చెప్పుచున్నారు కదా, మరి ఋషుల ఆత్మలలో పరమేశ్వరునిచే ప్రకాశింపబడిన సత్యార్థాన్ని వేదాలను ఎందుకంగీకరింపరు? దీనికి కారణమేమన మీరు వేదాలను చదువలేదు, చదువగోరరు. ఇక మీకు వేదోక్తజ్ఞానమెట్లు కలుగగలదు?

ఉపాదానం లేక జగదుత్పత్తి కాదు

6. జగత్తు యొక్క ఉపాదాన కారణం అంగీకరించక ఈ జగత్తు ఉత్పత్తి యైనదనియు, జీవుడు కూడ ఉనుత్పన్నుడనియు క్రైస్తవ మహమ్మదీయుల వలెనే మీరును నమ్ముచున్నారు. దీనికి జవాబు సృష్ట్యుత్పత్తి ప్రకరణమందును జీవేశ్వరుల వ్యాఖ్యయందును (సప్తమ- అష్టమ సముల్లాసాలలో) గలదు. కావున అక్కడ చూడవచ్చును. కారణం లేనిది కార్యమగుననుట సర్వదా అసంభవం. ఉత్పన్నమైన వస్తువునకు నాశనం లేకపోవుట కూడ అటులనే అసంభవము.

భోగం- పాపనివృత్తి

7. పశ్చాత్తాపం వలనను, ప్రార్థన చేయుటవలనను పాపవిమోచన మగునని నమ్ముటయును మీ పొరపాటే. దీనివలననే లోకంలో పాపాలు అధికమైనవి. ఏలయనగా పౌరాణికులు తీర్థయాత్రల వలనను, జైనులు నవకార మంత్రజపమువలనను, అట్లే తీర్థయాత్రలవలనను క్రైస్తవులు ఏసు యందు విశ్వాసముంచుట వలనను, ముసల్మానులు 'తోబా' చేయుటవలనను, అనుభవింపకయే పాపాల నుండి విముక్తు లగుదురుని నమ్ముతున్నారు. దీనివలన జనులు పాపభీతి లేనివారై పాపకార్యాలందు అమితంగా ప్రవృత్తులగుచున్నారు. ఈ విషయంలో బ్రహ్మసమాజ ప్రార్థనా సమాజముల వారును పౌరాణికులతో సమానులే యనుట స్పష్టము. వేదాలనే విని వేదసిద్ధాంతాన్నే తెలిసికొనియున్నను "తప్పక పాప పుణ్యఫలమనుభవింపవలసి వచ్చును. అనుభవింపక నివృత్తి కలుగ"దని పాపాలకు భయపడి సదా ధర్మమునందే ప్రవృత్తులైయుందురు. మరి అనుభవింపకయే నివృత్తి కలుగునన్న ఈశ్వరుడన్యాయకారియౌతాడు.

సీమితకర్మలకు అనంత ఫలము లభించదు

8. ఇక మీరు జీవుని కనంత యున్నతి కలుగునని నమ్ముచున్నారు. అట్లెన్నటికిని కాజాలదు. ఏలయనగా ససీములైన జీవుని గుణ కర్మ స్వభావాల ఫలము కూడ అవశ్యంగా ససీమయై యుండును.

ప్రశ్న:- పరమేశ్వరుడు దయాళువు కావున, ససీమకర్మలకు అనంత ఫలము నీయవచ్చును.

జవాబు:- అట్లు చేయునేని పరమేశ్వరుని న్యాయము నష్టమైపోవును. అట్లే సత్కర్మల అభివృద్ధి కొరకు ఎవడునూ పాటుబడడు. ఏలయనగా సత్కర్మ కించిన్మాత్రము చేయబడినను దాని కనంత ఫలాన్ని పరమేశ్వరు డిచ్చునని, పశ్చాత్తాపం వలన ప్రార్థనల వలన ఎటువంటి ఎట్టి పాపాలైనను పోతాయని చెప్పబడినట్టి మాటలకు లోబడుటవలన హానిగలిగి పాపాలు పెరుగును.

ప్రశ్న:- మేము స్వాభావిక జ్ఞానాన్ని వేదమునకంటె అధికమని నమ్ముచున్నామే కాని నైమిత్తికమును గాదు. ఏలయనగా పరమేశ్వరుడొసగిన స్వాభావిక జ్ఞానమే మనలో లేకున్న వేదాలను చదువుట- చదివించుట, వినుట- వినిపించుట; తెలిసికొనుట- తెలియజేయుట ఎట్లు జరుగును? కావున మా మతమే మిక్కిలి మంచిది.

జవాబు:- ఈ మాట కూడా నిరర్థకమైనదే. ఏలయనగా ఒకడొసంగినపుడే జ్ఞానము కలుగుచున్నది. కావున అది స్వాభావికము కాదు. అస్వాభావికమై యుండునది. సహజమైనది జ్ఞానము. అది హెచ్చునూ హెచ్చదు. తగ్గనూతగ్గదు. దానివలన ఉన్నతి ఎవడునూ పొందజాలడు. ఎట్లన అడవి మనుష్యలలోను స్వాభావిక జ్ఞానము కలదు. మరి వారు తమంతట తామే ఉన్నతిని పొందలేదెందులకు?

కావున నైమిత్తిక జ్ఞానమే ఉన్నతికి కారణమగును. చూడుడు! మీరును మేమును బాల్యావస్థయందు కర్తవ్యాకర్తవ్యాలను, అట్లే ధర్మాధర్మాలను సరిగా తెలిసికొనజాలెడివారము కాదు. విద్వాంసుల వద్ద చదివినపుడె కదా! కర్తవ్యాకర్తవ్యాలను, ధర్మాధర్మాలను తెలుసుకొనగలిగాము. కావున స్వాభావిక జ్ఞానమే సర్వోపరి అని నమ్ముట సరికాదు.

పూర్వోత్తర జన్మలు

9. మీరు క్రైస్తవ మహమ్మదీయుల ననుసరించియే పూర్వజన్మ పునర్జన్మములను నమ్మకపోవచ్చును. దీనికి సమాధానం పునర్జన్మమును గురించిన వ్యాఖ్యయందు (నవమ సముల్లాసమున) వ్రాయబడినది అక్కడ చూచి తెలుసుకొనవచ్చును. కాని, "జీవుడు శాశ్వతుడని ముందుగా తెలిసికొనుడు. నిత్యుడనియు నతని కర్మలు కూడ ప్రవాహరూపమున నిత్యములే యనియు మీరెరుగవలెను. ఎందుకన కర్మకును కర్మ చేయువానికిని నిత్య సంబంధముండును. జీవుడెక్కడైనను నిష్కర్మియై కూర్చుండి యుండునా? ఇకముందుండబోవునా? మరి మీరట్లు చెప్పుదురేని పరమేశ్వరుడు కూడ పనికిరాని వాడగుచున్నాడు.

పూర్వాపర జన్మలను నమ్మకపోవుటవలన ఈశ్వరునియందు కృతహాని, అకృతాభ్యాగమ, నైర్ఘృణ్య, వైషమ్యములను దోషాలు కూడ కలుగుచున్నవి. జన్మమే లేకపోయినచో పాపపుణ్యాల యొక్క ఫలభోగానికి హానికలుగును. ఏలయన ఎవడు ఏవిధంగా ఒకనికి సుఖదుఃఖ హానిలాభాలను కలుగజేసియుండెనో అట్లే వాని ఫలమును అనుభవించుటకు శరీరమును ధరింపక తప్పదు.

రెండవది- పూర్వజన్మ పాపపుణ్యములే లేకుండిన నీ జన్మమున సుఖదుఃఖము లెట్లు కలుగుచుండును? ఈ జన్మమున కలుగు సుఖదుఃఖాలు పూర్వజన్మము యొక్క పాపపుణ్యానుసారం అవి కలుగకపోయిన పరమేశ్వరుడన్యాయకారియై పోవును. కర్మఫలం అనుభవించనిదే అది నశించిపోయినట్లగును. కావున మీరిట్లు చెప్పునది కూడ సరికాదు.

10. ఈశ్వరుడు కాక తక్కిన దివ్యగుణాలుగల పదార్థాలను, విద్వాంసులను మీరు దేవతలని నమ్మకపోవుటయు సరికాదు. ఏలయనగా పరమేశ్వరుడు మహాదేవు డనబడుచున్నాడు. ఇతర దేవతలే లేకపోయినచో ఈశ్వరుడు, మహాదేవు డెట్లుకాగలుగును?

11. అగ్నిహోత్రాది పరోపకారకములైన కర్మలను గూడ కర్తవ్యములని అంగీకరించకపోవుటయు మంచిది కాదు.

12. ఋషులు మహర్షులు చేసిన ఉపకారాన్ని విస్మరించి ఏసు మూసాలవారి ననుసరించుటయు మంచిదికాదు.

13. కారణవిద్యయగు వేదాలను అంగీకరింపక అన్యకార్య విద్యల ప్రవృత్తిని అంగీకరించుట సర్వదా అసంభవం.

14. విద్యావ్రత చిహ్నలైనట్టి యజ్ఞోపవీతాన్ని, శిఖను త్యజించి క్రైస్తవ మహమ్మదీయులవంటి ఆచారం కలిగియుండుట కూడా వ్యర్థమే. పైంట్లు, కోట్లు మొదలగు వస్త్రాలను ధరించుచు 'బిరుదు బిల్ల'లను ధరింప సిద్ధపడుచున్నారు గదా! ఏమి? యజ్ఞోపవీతాదు లంత భారమైయుండెనా?

15. బ్రహ్మ మొదలుకొని ఈ ఆర్యావర్తమున ఎందరో విద్వాంసులయియుండగా వారలను కొనియాడక, యూరోపియనులను మాత్రము పొగడుట పక్షపాతము, ముఖస్తోత్రముగాక మరియేమగును?

16. బీజములనుండి అంకురములు ఉత్పన్నమగునట్లు జడచేతనాల యోగము వలన 'జీవోత్పత్తి' అగునని నమ్ముటయు పుట్టుటకు పూర్వము జీవతత్వాన్ని నమ్మకపోవుటయు, మరి యుత్పన్నుడైన వానికి నాశనము లేదనుటయు పూర్వాపర విరుద్ధాలు. ఉత్పత్తికి పూర్వం జడ చేతనాలు లేకుండిన జీవుడెక్కడినుండి వచ్చెను? సంయోగమెవరికి గలిగినది? ఈ రెంటిని సనాతనములని నమ్ముదురేని మంచిదే. కాని సృష్టికి పూర్వము పరమేశ్వరుడు తప్ప మరి యే తత్వమును లేకయుండెననుట వలన మీ పక్షము వ్యర్థమైపోవుచున్నది.

ఉన్నతిని కోరువారు ఆర్యసమాజమున చేరుడు

కావున ఉన్నతిని పొందగోరుదురేని మీరు ఆర్యసమాజముతో చేతులు కలిపి దాని ఉద్దేశానుసారంగా నడుచుకొనుటకు అంగీకరింపుడు. లేకపోయిన మీ చేతికేమియు దొరకదు. ఏలయనగా ఏ దేశములోని పదార్థాలతో మన దేహాలు నిర్మింపబడినవో నేడును పోషింపబడుచున్నవో, ఇకముందును పోషింపబడునో, అట్టి దేశము యొక్క ఉన్నతి కొరకు తనుమనుధనములచే నందర మేకీభవించి ప్రీతిపూర్వకంగా పాటుపడుట మీకును మాకును ఎల్లరకును ఉచితము. కావున ఆర్యసమాజము ఆర్యావర్త దేశోన్నతికి కారణమైయున్నట్లు మరొకటి కాజాలదు. ఈ సమాజానికి తగిన సహాయం చేయుట అత్యవసరం. ఏలయనగా సమాజము యొక్క సౌభాగ్యాన్ని వర్ధిల్ల జేయుట నలుగురు చేరి సముదాయంగా చేయవలసిన పనియే కాని ఒక్కరి పని కాదు.

ధర్మము అందరికి ఒక్కటే

ప్రశ్న:- మీరు అన్ని మతముల ఖండననే చేయుచు వచ్చుచున్నారు. కాని తమ తమ ధర్మములందలి యన్నియు మంచివే. ఏ మతాన్నీ ఖండన చేయకూడదు. ఒకవేళ చేసితిరేని మీరు వారికంటే నధికమేమి చెప్పబోవుచున్నారు? మరి చెప్పుచున్నారన్నను మీ కంటె నధికుడు గాని, మీతో సమానుడు గాని మునుపుండలేదా? లేకుండెనా? ఇట్లభిమానపడుట మీకును ఉచితము కాదు. ఏలయనగా పరమాత్ముని సృష్టియందొకని కంటె ఒకడధికుడుగను ఒకనితో నొకడు తుల్యుడుగను ఒకనికంటె నొకడు న్యూనుడుగను ఎందరో గలరు. ఎవ్వరికిని గర్వపడుట ఉచితము కాదు.

జవాబు:- అందరికి ధర్మము ఒక్కటా లేక అనేకమా? అనేక మంటిరేని, ఒకటి కొకటి విరుద్ధముగ నుండునా, అవిరుద్ధముగనా? విరుద్ధముగ నుండునన్న నొకటి మాత్రమే తప్ప, మరొకటి ధర్మముకాజాలదు. అవిరుద్ధంగా నుండునన్న వేరువేరుగా నుండుట వ్యర్థము. కావున ధర్మం కాని అధర్మం కాని ఒక్కొక్కటేయుండును గాని అనేకమై యుండదు.

మేము చెప్పునట్టి విశేషమేమనగా! ఒక రాజు సమస్త సంప్రదాయములందలి ఉపదేశకుల నందరి ఒక్కచోట చేర్చిన ఆ సంప్రదాయములన్నీ వేయింటికంటె తక్కువ కాజాలవు. కాని వీనియందు పౌరాణిక, క్రైస్తవ, జైన, మహమ్మదీయములను నాలుగే ముఖ్యవిభాగాలు కలవు. ఎందుకనగా నీ నాలుగింటిలోనే సమస్త సంప్రదాయాలు సమావిష్టాలు కావచ్చును.

ధర్మ జిజ్ఞాసువు- సంప్రదాయాలు

ఒకానొక రాజు తాను జిజ్ఞాసువై సంప్రదాయాలవారిని, జిజ్ఞాసువుల నందరినీ పిలిపించి సభను ఏర్పాటు చేయాలి. అందులో ఒక ధర్మ జిజ్ఞాసువు వామమార్గోపదేశకుని వైపు చూస్తూ రాజుగారిని అడుగవలసిన దేమన- మహారాజా! నేను నేటివరకొక గురువును గాని, ఒక ధర్మాన్ని గాని గ్రహించినవాడను గాను. సర్వధర్మములలో ఉత్తమ ధర్మమెవ్వరిదో చెప్పుడు, దానిని నేను స్వీకరించెదను?

వామమార్గి:- మా ధర్మమే మంచిది.

జిజ్ఞాసువు:- మరి తక్కిన తొమ్మిదివందల తొంబది తొమ్మిది ధర్మములెట్లున్నవి?

వామమార్గి:- అవియన్నియు అబద్ధములు మరియు నరకమునకు కొనిపోవునవియు నైయున్నవి. ఏలయనగా "కౌలాత్పరతరం నహి" (కులార్ణవతంత్రము. 2-8.) అను ఈ వచన ప్రమాణాన్ని బట్టి మా ధర్మాన్ని మించినది వేరొక ధర్మమే లేదు.

జిజ్ఞాసువు:- అయ్యా! మీ ధర్మమేమి?

వామమార్గి:- భగవతిని నమ్ముట, మద్యమాంసాది పంచమకారములను సేవించుట, రుద్రయామలాది 64 తంత్ర గ్రంథాలను నమ్ముట మొదలుగాగలది. నీవు ముక్తిని కోరుదువేని మాకు శిష్యుడవు కమ్ము.

జిజ్ఞాసువు:- మంచిది. తక్కిన మహాత్ములను కూడ దర్శించి, అడిగి తెలిసికొని వచ్చెదను. పిమ్మట దేనియందు నాకు శ్రద్ధయు ప్రీతియు కలుగునో ఆ మతస్థునకే శిష్యుడనయ్యెదను.

వామమార్గి:- ఒరే! ఈ భ్రాంతిలో నేలబడియున్నావు? వారు నిన్ను మోసగించి తమ వలలో వేసుకొందురు. ఎవ్వరి యెద్దకును పోకుము. మాకే శరణాగతుడవు కమ్ము. లేకపోయిన నీకు పశ్చాత్తాపము కలుగును. చూడుము! మా మతమున భోగమోక్షములు రెండును గలవు.

జిజ్ఞాసువు:- 'మంచిది. చూచిరానిండు' అని ముందుకు వెళ్లి శైవుని వద్దకు పోయి అతనిని అడుగగా అట్టి సమాధానమునే చెప్పెను. 'విశేషమేమన! శివభక్తి, భస్మరుద్రాక్ష ధారణ, లింగార్చన, ఇవి లేనిది ముక్తి దొరకదని మాత్రము చెప్పెను.

జిజ్ఞాసువు:- వానిని వదలి నవీన వేదాంతి గారి యొద్దకు పోయెను.

జిజ్ఞాసువు:- మహారాజా! మీ ధర్మమేమిమఅయో చెప్పుదు? అనెను.

వేదాంతి:- మేము ధర్మాధర్మముల నేమియు నమ్మము. మేమే సాక్షాద్బ్రహ్మమై యున్నాము. మా యందు ధర్మాధర్మమెక్కడున్నది? ఈ జగత్తంతయు మిథ్యయే. ఎవడు జ్ఞానియు, శుద్ధుడును, చేతనుడును కాదలచునో అతడు తానే బ్రహ్మ ననుకొని జీవుడను భావాన్ని వదలిన నిత్యముక్తుడగును.

జిజ్ఞాసువు:- మీరు బ్రహ్మయు నిత్యముక్తులులైన మీ యందు బ్రహ్మ యొక్క గుణ కర్మ స్వభావము లేల లేవు? ఈ శరీరమునందేల బంధింపబడియున్నారు?

వేదాంతి:- నీకు శరీరములు గోచరమగుచున్నవి. దీనివలననే కద నీవు భ్రాంతిని కలిగియున్నావు. మాకు బ్రహ్మ తప్ప మరేమియు కానరాదు.

జిజ్ఞాసువు:- చూచు వారగు మీ రెవ్వరు? మరి మీరెవరిని చూస్తున్నారు?

వేదాంతి:- చూచువాడు బ్రహ్మ. బ్రహ్మ బ్రహ్మనే చూస్తున్నాడు.

జిజ్ఞాసువు:- బ్రహ్మలిద్దరా ఏమి?

వేదాంతి:- ఎవడైనను తన భుజముల మీద తానే కూర్చొనగలడా? మీ మాటలన్నియు పిచ్చివాని మాటలవలె నున్నవి. కాని మరియేమియును కాదు.

జైనులు:- పిమ్మట అతడు జైనుల యొద్దకు పోయి వారిని ప్రశ్నించెను. వారును అటులనే చెప్పిరి. కాని 'జైనధర్మము' తప్ప తక్కిన ధర్మములన్నియు అబద్ధములనియు, జగత్తునకు కర్త అనాది

ఈశ్వరుడెవ్వడును లేదనియు, అనాదికాలమునుండి ఈ జగత్తు ఎట్లు కలిగియున్నదో అట్లే ఉన్నదనియు, ఇక ముందుకు ఇట్లే కలిగియుండగలదనియు, నీవు మాకు శిష్యుడవు కమ్ము, మే మన్నివిధముల నుత్తములమై యున్నామనియు, ఉత్తమ విషయాలను మాత్రమే నమ్ముచున్నామనియు, జైన మార్గము కంటె భిన్నమైన దల్ల అబద్ధమనియు ఈ అనేక విషయములను బోధించిరి.

క్రైస్తవము:- తరువాత అతడు ముందుకు సాగి క్రైస్తవుని సమీపించి అతని నడిగెను. అతడును వామమార్గి వలెనే అడిగిన ప్రశ్నలన్నిటికిని ప్రత్యుత్తరము లిచ్చుచు "మనుష్యులందరును పాపులు. కేవలము తమ సామర్థ్యముచే పాపాలు దూరము కావు. ఏసు నందు విశ్వాసము కలుగనంతవరకు ఎవడును పవిత్రుడై ముక్తిని పొందలేడు. అతడందరి ప్రాయశ్చిత్తము కొరకు తన ప్రాణములను ధారపోసి దయచూపెను. నీవు మాకు శిష్యుడవు కమ్ము". అని మాత్రము విశేషంగా చెప్పెను.

మహమ్మదీయమతము:- అది విని, యా జిజ్ఞాసువు, మౌల్వీ సాహెబుగారి యొద్దకు పోయెను. అతనితోనూ అటులనే ప్రశ్నోత్తరాలు జరిపెను. కాని మౌల్వీ సాహెబు చెప్పిన విశేషము:- అల్లా తప్ప మరొకడు లేడు. అతని పైగంబరును, ఖురాన్ షరీఫ్‌ను నమ్మకపోయిన ఎవ్వరికిని ముక్తి లభించదని, ఈ మతమును నమ్మనివాడు నరకగామి, కాఫీర్, చంపబడుటకు యోగ్యుడు అనియు బోధించెను.

ఆ మాటలను విని జిజ్ఞాసువు వైష్ణవుని యొద్దకు పోయెను. అతనితోడను పైన చెప్పిన వారితో వలెనే సంవాదము జరిగెను. వైష్ణవుడు "మా తిలక చిహ్నములను చూచి యముడే భయపడుచున్నాడు" అను నీ విశేషాన్ని బోధించాడు. ఆ మాటను విని జిజ్ఞాసువు తనలో తాను దోమలు, ఈగలు, పోలీసువాంద్రు, చోరులు, బందిపోటు దొంగలు మరియు శత్రువులు వీరు భయపడరే, యమరాజకింకరులేల భయపడుదురో అనుకొని అటులనే అందరి నడుగుచు బోగా అన్ని మతముల వారును తమ తమ మతమే సత్యమనుచు వచ్చిరి. వారిలో ఒకడు మా కబీరుడు సత్యమనియు, ఒకడు నానకుడనియు మరియొకడు దాదువనియు, ఇంకొకడు వల్లభుడనియు వేరొకడు సహజానందుడనియు మరొకడు మాధవుడనియు నిట్లందరును తమ తమ వారే గొప్పవారనియు వారందరు అవతార పురుషులనియు చెప్పిరి. ఇట్లు సహస్ర సంఖ్యాకుల నడుగగా తేలినదేమన వీరందరు పరస్పర మొకరితో నొకరు విరోధము కలిగియున్నారనియు, వీరిలో ఎవ్వడును గురువగుటకు తగినవాడు లేడనియు అతనికి నిశ్చయము కలిగెను. ఏలయనగా నొక్కొక్కని మాట అబద్ధమని 999 మంది సాక్ష్యమిచ్చుచూ వచ్చిరి. అసత్యవాదులయిన అంగడివాంద్రవలెను వేశ్యలవలెను లేదా కుంటెనగాంద్రవలెను తమ తమ వస్తువులు మంచివని కొనియాడుకొనుచు తక్కినవారి వస్తువులు మంచివికావని దూషించుచున్న రీతిని వీరును చేయుచున్నారు. ఇట్లాలోచించి అతడు:-

త ద్విజ్ఞానార్థమం స గురుమేవాభిగచ్ఛేత్ । ॥ 1 ॥
సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్ ॥

తస్మై సవిద్యా నుపసన్నాయ సమ్యక్ప్రశాంత చిత్తాయ శమాన్వితాయ ।
యేనాక్షరం పురుషం వేద సత్యం ప్రోవాచ తాం తత్త్వతో బ్రహ్మవిద్యామ్ ॥ ॥ 2 ॥

॥ ముండక ఖం- 2. మం. 12, 13. ॥

సత్యజ్ఞానము కొరకు వాడు సమిత్పాణియై అనగా చేతిలో సమిధలను తీసుకొని వేదవిదుడును బ్రహ్మనిష్ఠగలవాడును, పరమాత్మను గుర్తెరిగిన వాడునైన గురుని వద్దకు బోవలయును, పాఖండుల వలలో చిక్కుగూడదు, అని తలచెను. ॥ 1 ॥

ఇట్టి జిజ్ఞాసువు విద్వాంసుని యొద్దకు బోయినపుడు అతడీ శాంతచిత్తుడును, జితేంద్రియుడును అగు జిజ్ఞాసునకు యథార్థ బ్రహ్మవిద్యను, పరమాత్మ యొక్క గుణకర్మ స్వభావాలను ఉపదేశం చేయాలి. అట్లే వానికి ధర్మార్థకామమోక్షాలను, పరమాత్మను గుర్తెరుగగల ఆ యా సాధనాలను విశదమగునట్లు బోధించాలి. ॥ 2 ॥

అతడపుడు అట్టి పురుషుని యొద్దకుబోయి, "మహారాజా! ఈ సంప్రదాయములవారు చెప్పిన విపరీతముల వలన నా మతి భ్రమజెందినది, ఏలయనగా నేను వీరిలో ఒకనికి శిష్యుడనయితి నేని 999 సాంప్రదాయములవారికి విరోధిని కావలసివచ్చును. ఒకనికి 999 మంది శత్రువులయి, ఒకడు మాత్రమే మిత్రుడుగానున్న వానికి సుఖమెన్నటికి గలుగజాలదు. కావున నాకు మీరుపదేశము చేయుడు. నేను దాని ననుష్ఠించెదను" అని అతనిని ప్రార్థించెను.

ఆప్త విద్వాంసుడు:- ఈ మతములన్నియు అవిద్యవలన పుట్టి విద్యావిరుద్ధములైయున్నవి. ఈ మతములవారు మూర్ఖులును, పామరులునగు అడవి మనుష్యులను మోసపుచ్చి తమ వలలో చిక్కించుకొని తమ ప్రయోజనాన్ని నెరవేర్చుకొనుచున్నారు. పాపము ! వారు, మనుష్యజన్మ ఫలమునుండి వంచితులై, తమ మనుష్యజన్మను వ్యర్థం చేసుకొనుచున్నారు. చూడుము! ఏ విషయములో ఈ వేయి మతాలు ఏకీభవించునో అదియే వేదమతము, అదియే గ్రాహ్యము' అని తెలిసికొనుము. ఇక ఏ అంశమున పరస్పర విరోధముండునో అది కల్పితమనియు అబద్ధమనియు, అధర్మమనియు గ్రహింపదగనిదనియు తెలియవలయును.

జిజ్ఞాసువు:- దీనిని పరీక్షించుటెట్లు?

ఆప్తవిద్వాంసుడు:- నీవు వెళ్ళి వారితో ఈ విషయముల నడుగుము. వారందరును ఏకీభవింతురు. అపుడా జిజ్ఞాసువు ఆ వేయిమంది సంప్రదాయకుల నడుమ నిలిచి, అయ్యలారా! వినుడు. మీరందరును విని నాకు సమాధానం చెప్పండి. ధర్మం సత్యభాషణంలో ఉన్నదా? మిథ్యాభాషణంలోనా? అని యడుగగా దానిని వారందరును సత్యభాషణంలో ధర్మం, అసత్యభాషణంలో అధర్మం కలదని సమాధానం చెప్పారు. అట్లే విద్యాభ్యాసం, బ్రహ్మచర్య పాలనం, పూర్ణయువావస్థ యందలి వివాహం, సత్సంగం, పురుషార్థం, సత్యవ్యవహారం మొదలగు వానినాచరించుటయందు

ధర్మము కలదా? లేక అవిద్యాగ్రహణము, బ్రహ్మచర్యము సలుపకపోవుట, వ్యభిచారము, కుసంగము, అసత్యవ్యవహారము, ఛలము, కపటము, హింస, పరహాని మొదలగు కర్మల నాచరించుట యందా? అని యడుగగా విద్యాభ్యాసము మొదలుగాగల కర్మలందే ధర్మమును, అవిద్యాగ్రహణాది కర్మలం దధర్మమును కలదని అందరును ఏకగ్రీవంగా అంగీకరించారు. అప్పుడు జిజ్ఞాసువులందరిని జూచి, మీరందరిట్లు ఏకాభిప్రాయులై సద్ధర్మాభివృద్ధి కొరకును మిథ్యా మార్గమునకు హానిగలిగించుటకును ఏల పాటుపడరని అడుగగా వారు, మేమట్లుచేసిన మమ్మెవరడుగుదురు? మా శిష్యులును మా యాజ్ఞకు లోబడి యుండకపోవుదురు. మా జీవికకును నష్టము కలుగును. మరి మే మనుభవించుచున్న ఆనందమునకు భంగము కలుగును. కావున మేమెరిగియు తమతమ మతములనే బోధించుచు సుఖములను పొందుచున్నారము. ఏలయనగా "రొట్టెను చెక్కరతో దినవలయును. లోకమును కపటముతో జయింపవలయు" అను లోకోక్తిగలదు. ప్రపంచ మెట్లున్నదో చూడుము. న్యాయచింతన గలిగి సత్యవర్తియైన మనుష్యునకు ఎవ్వడూ ఒక్క రూపాయి నీయడు. వాని నెవ్వడును ఉన్నావా యని కూడా అడుగడు. మోసమును కపటవంచనలను చేయువానికే అన్నివస్తువులు లభించును.

జిజ్ఞాసువు:- మీరిలాంటి ఎత్తుగడలు పన్ని పరులను మోసపుచ్చుచున్నారే, రాజు మిమ్ములనేల దండింపడు?

అన్ని మతములవారు:- రాజును గూడ మేము ముందుగనే మా శిష్యవర్గములో చేర్చుకొని యున్నారము. మేమన్ని కట్టుదిట్టముల నేర్పరచియుంచినాము. అవి వదలవు.

జిజ్ఞాసువు:- మీరు కపటముతో అన్యమతస్థులగు మనుష్యులను మోసపుచ్చి వారికి హానిగలుగజేయుచున్నారే, మీరు పరమేశ్వరుని యెదుట నేమి యుత్తరమీయగలరు? మీకు ఘోర నరకమే సంప్రాప్తమగును. కొద్ది జీవనము కొరకు ఇంతటి గొప్ప అపరాధము చేయుట నేల మానరు?

మతములవారు:- అట్టైనప్పటికి చూచుకొందము. నరకము, పరమేశ్వరుని దండన ఇవి ఎప్పుడో కలుగును. ఇప్పుడో ! మే మానందమనుభవించుచున్నాము. మాకు వారు సంతోషముతో ధనాది పదార్థములనిచ్చుచున్నారు. మేము వారిని బలాత్కారముచేసి లాగుటలేదు. కావున రాజు మమ్మేల దండించును?

జిజ్ఞాసువు:- ఒక పసిబాలు నెవడైనను బుజ్జగించి వానిమీదనున్న ధనాదిపదార్థముల నపహరించిన వానికెట్టి శిక్ష లభించునో అట్టిశిక్ష మీకేల దొరకదు? ఏలయనగా :-

అజ్ఞో భవతి వై బాల : పితా భవతి మంత్రద : ॥

మను ॥ 2 శ్లో ॥ 53 ॥

జ్ఞాన శూన్యుడైనవానిని బాలుడని, జ్ఞానం నిచ్చువానిని తండ్రి లేక వృద్ధుడని అంటారు. బుద్ధిమంతుడు, విద్వాంసుడు ఐనవాడు మీ మాటలలో చిక్కుపడడు, కాని బాలురవలెనున్న అజ్ఞానులను మీరు మోసపుచ్చుచున్నందులకు మీకు రాజదండన తప్పక కలుగుతుంది.

మతములవారు :– రాజు ప్రజలందరును మా మతములోని వారైనపుడు మాకు దండన విధించువాడెవ్వడు? అట్టి పరిస్థితి ఏర్పడినప్పుడు ఈ మార్గాన్ని వదలి వేరొక మార్గాన్ని చూచు కొంటాము.

జిజ్ఞాసువు:– మీరు కూర్చుండి, అనగా కష్టపడక వ్యర్థంగా ఇతరుల డబ్బు లాగుచున్నారు. దీనిని వదలి విద్యనభ్యసించి గృహస్థుల యొక్క బాల బాలికలను చదివించిన మీకును ఆ గృహస్థులకును గూడ ఎంతో శుభము చేకూరును గద.

మతములవారు:– ఇప్పుడు బాల్యావస్థ మొదలుకొని మరణపర్యంతము మాకు లభించియున్న సుఖమును మంటగలిపి బాల్యావస్థ నుండి యువావస్థవరకు విద్యాభ్యాసములో బడి, పిదప, విద్య జెప్పుచు, ఉపదేశము చేయుచు ఇట్లు బ్రతికినన్నాళ్ళు శ్రమపడుచు నుండుటవలన మాకేమి ప్రయోజనం? మాకు అనాయాసంగానే లక్షలకొలది రూపాయలు లభించుచున్నవి. ఆనందించుచున్నాము. దానినెందుకు పోగొట్టుకోవాలి?

జిజ్ఞాసువు:– దీని పరిణామము మంచిదికాదు. చూడుడు! మీకు గొప్ప రోగాలు సంభవించి త్వరలోనే మృత్యువును పొందుతారు. మీరు బుద్ధిమంతులలో నిందితులగుచున్నారుగదా! మరి మీరేల తెలిసికొనరు?

మతములవారు:– ఓరీ ! నాయనా !

టకా ధర్మష్టకా కర్మటకా హి పరమం పదం ।
యస్య గృహే టకా నాస్తి హా! టకా టకటకాయతే ॥ ॥ 1 ॥

అనా అంశకలాః ప్రోక్తా రూప్యో సౌ భగవాన్ స్వయమ్ ।
అతస్తం సర్వమిచ్ఛంతి రూప్యం హి గుణవత్తమమ్ ॥ ॥ 2 ॥

నీవు పిల్లవాడవు. నీకు ప్రపంచ జ్ఞానములేదు. చూడుము! పైస లేనిది ధర్మమును, పైసలేనిది కర్మయును, పైసలేనిది ముక్తియును దొరకదు. ఎవ్వనియింట పైసలేదో, వాడు పైసా పైసాయని కలవరించుచుండును. మంచిమంచి వస్తువులను ఉవ్విళ్ళూరు చూపులతో జూచుచు, అయ్యో ! నా యొద్ద పైసలుండిన నీ మంచి పదార్థముల ననుభవించియుండునుగదా! అని తలచును. ॥ 1 ॥

ఏలయన అందురు 'భగవంతుడు పదియారు కళలతో గూడినవాడు, అదృశ్యుడు' అని చెప్పుటను మాత్రము వినుచున్నారేకాని కంటితో చూచినవారెవరు? కాని పదహారణాలతో ఏర్పడు రూప్యమే సాక్షాద్భగవత్స్వరూపము. కావుననే అందరును రూపాయలను జమచేయుటయందేనిమగ్నులైనారు. ఏలయనగా పనులన్నియు రూపాయలవలననే నెరవేరుచున్నవి. ॥ 2 ॥

జిజ్ఞాసువు:– సరే ! ఇప్పుడు మీ లోగుట్టు బైటపడినది. మీరీ ఎత్తుగడలను తమ సౌఖ్యముకొరకే పన్నితి రనుట స్పష్టము. కాని దీనివలన జగత్తునకు హానికలుగుచున్నది. ఏలయనగా సత్యోపదేశము

వలన ప్రపంచమునకు లాభము కలుగునట్లే అసత్యోపదేశము వలననూ నష్టము కలుగును. మీకు ధనమే కావలసియున్న కొలువు చేసియో, వ్యాసార వ్యవహారాది కార్యములొనర్చియో ధనమేల కూడబెట్టరు?

మతములవారు:- వానిలో పరిశ్రమ ఎక్కువగలదు. ఒక్కొక్కప్పుడు నష్టముగూడ కలుగును. కాని మా ఈ ఎత్తుగడలలో నష్టమెన్నటికిని గలుగదు. సదా లాభమే కలుగుచుండును. చూడుము! తులసీదళమును చేతబట్టి చరణామృతము త్రాగించి, మెడను ఒకమాలనుగట్టి శిష్యుని జేసుకొన్నామనుకో వాడు బ్రతికినన్నాళ్ళు పశుప్రాయుడుగా నుండి మేము చెప్పినట్లెల్ల నడుచుకొనును.

జిజ్ఞాసువు:- వీరు మీకు చాలధనము దేనికొరకు నిచ్చుచున్నారు?

మతములవారు:- ధర్మము, స్వర్గము, మోక్షము అను నివి లభించుటకు.

జిజ్ఞాసువు:- మీరే ముక్తులు కారు. అట్లే ముక్తిస్వరూపాన్నిగాని, ముక్తిసాధనాలనుగాని తెలిసినవారుగారు. మరి మీబోటివారికి సేవ చేయుటవలన వారికేమి దొరకగలదు?

మతములవారు:- ఏమి? ఈ లోకము దొరకునా? లేదు. కాని చచ్చిన తరువాత పరలోకమున చిక్కును. ఈ లోకమున మా కెంతయిచ్చుచున్నారో, మాసేవ నెంత చేయుచున్నారో, అదంతయు వారికి పరలోకమున లభించును.

జిజ్ఞాసువు:- వీరు మీకిచ్చిన దానికి బదులు దొరకునో దొరకదో కాని, తీసుకొనువారగు మీ కేమి దొరకును? నరకమేనా? లేక మరేమైననా?

మతములవారు:- మేము భజన చేయుచున్నాము కదా! దానికి ప్రతి మాకు సుఖము దొరకును.

జిజ్ఞాసువు:- మీ భజనలన్నియు పైసాకొరకే, ఆ పైసా అంతయు ఇక్కడనే పడియుండును. మీరు పెంచుకున్న మాంసపిండము కూడ భస్మమై ఇచ్చటనే పడియుండును. మీరు పరమేశ్వరునే భజించుచుండిన కనీసము మీ ఆత్మయైన పరిశుద్ధమై యుండెడిది.

మతములవారు:- మే మపవిత్రులమా యేమి?

జిజ్ఞాసువు:- లోలోపల మీరు మిక్కిలిగా అపవిత్రులు.

మతములవారు:- మీకెట్లు తెలియును?

జిజ్ఞాసువు:- మీ ఆచార వ్యవహారాలవలన.

మతములవారు:- మహాత్ముల వ్యవహారము, ఏనుగు దంతముల సమానము. ఏనుగుకు దంతములు తినుట కుపయోగించునవి వేరుగను, చూపుకు వేరుగను యుండునటులే మేము లోపల పవిత్రులముగా నుండి వెలుపల ఏవో లీలలను మాత్రము చేయుచుందుము.

జిజ్ఞాసువు:- మీరు పరిశుద్ధముగా నుండిన మీ బహిశ్చర్యలుకూడ పవిత్రముగానే యుండెడివి. కావున మీ అంతర్యమును మలినమైనదే.

మతములవారు:- మేమెట్టులున్న నేమి, మా శిష్యులు మాత్రము మంచివారేకద.

జిజ్ఞాసువు:- గురువులగు మీరెట్లున్నారో మీశిష్యులును అట్లే అగుదురు. అన్నిమతములు ఒక్కటి ఎన్నడు కాజాలదా?

మతములవారు:- ఒక్కమతమెన్నటికిని కాజాలదు. ఏలయనగా మనుష్యుల గుణకర్మస్వభావాలు భిన్నాలు.

జిజ్ఞాసువు:- బాల్యావస్థయందు అందరికి ఒకేవిధమైన శిక్షణనిచ్చి సత్యభాషణాది ధర్మగ్రహణమును, మిథ్యాభాషణాద్యధర్మ త్యాగమును చేయించిన అవశ్యముగ ఒకమతమే అగును. ఇక ధర్మాత్ములు అధర్మాత్ములు అను రెండు మతములవారు అన్ని కాలములం దుండవచ్చును. కాని ధర్మమధికమై అధర్మము న్యూనమగుటవలన, ప్రపంచమున సుఖమధికమగును. మరి అధర్మ మధికమగునపుడు దుఃఖము హెచ్చును. కాబట్టి విద్వాంసులందరును ఒకేవిధమైన ఉపదేశములను చేయ పూనుదురేని ఒక్కమతమగుటకు చాలకాలము పట్టదు.

కలి ధర్మమునకు బాధకముకాదు:-

మతములవారు:- ఇది కలియుగము నాయనా. నీవు సత్యయుగపు మాటలనుకోరకుము.

జిజ్ఞాసువు:- కలియుగ మనునది ఒక కాలముపేరు. కాలము క్రియారహితమై ఉన్నందున అది ధర్మాధర్మము లొనర్చుటకు సాధకము కాని బాధకము కాని గాదు. కాని మీరే కలియుగ మూర్తులైయున్నారు. మనుష్యులే సత్యయుగపు కలియుగపు మూర్తులుగాకున్న ఈ లోకమున ధర్మాత్ముడు అధర్మాత్ముడు ఉండరు. ఈ గుణదోషములన్నియు సంగతివలన ఏర్పడినవే కాని స్వాభావికములుగావు.

జిజ్ఞాసువు ఈ మాటలను చెప్పి (మరల) ఆప్తవిద్వాంసుని యొద్దకుపోయి, ఆయనతో అయ్యా! మీరు నన్నుద్ధరించితిరి. లేకపోయిన నేను ఒకరి వలలో పడి నష్ట భ్రష్టుడనయ్యెడివాడను. ఇక మీదట నేను గూడ ఈ పాఖండుల ఖండనను వేదోక్త మతమండనమును చేసెదను.

ఆప్తవిద్వాంసుడు:- మనుష్యులందరకు, విశేషంగా విద్వాంసులకు సన్న్యాసులకును ఇదియే కర్తవ్యం. మానవులెల్లరు సత్యమండనం, అసత్యఖండనం చేయుచు, అందరకు చదివి వినిపించి సత్యోపదేశం ద్వారా ఉపకారిన్ని చేకూర్చాలి.

ప్రశ్న:- బ్రహ్మచారులు, సన్న్యాసులైవరైనా మంచివారుకారా?

జవాబు:- ఈ బ్రహ్మచర్య, సన్న్యాసాశ్రమములు మంచివే. కాని నేడు వీనిలో గూడ చాలమోసము గలదు. ఎందరో బ్రహ్మచారులమని చెప్పుకొనుచు జడలుధరించి, లేనిపోని సిద్ధులను చూపుచు జప

పురశ్చరణాదులలో లిప్తమైయున్నారు. విద్యాభ్యాసము పేరుకైనను చేయరు. విద్యాభ్యాసమే బ్రహ్మచర్యం. 'బ్రహ్మ' అనగా వేదము. ఆ బ్రహ్మమనే వేదపఠనమందు ఎంతమాత్రము శ్రమపడరు. అట్టి బ్రహ్మచారులు మేక మెడనుండు స్తనములవలె నిరర్థకులుగా నున్నారు.

అట్లే ఎందరో సన్న్యాసులు విద్యావిహీనులై దండకమండలాలను ధరించి కేవలం భిక్షమెత్తుకొనుచు సంచారము చేయుచుందురు. వేదమార్గము నెంతమాత్రము వర్ధిల్ల జేయరు. బాల్యావస్థలోనే సన్న్యాసమును స్వీకరించి దేశదిమ్మరులై తిరుగుచునుందురు. విద్యాభ్యాసము చేయరు. ఇట్టి బ్రహ్మచారులు, సన్న్యాసులు ఇటునటు జలస్థల పాషాణాదిమూర్తులను దర్శించుచు, పూజించుచు తిరుగుచునుందురు. కొందరు విద్యావంతులైనవారు మౌనముగా నుందురు. ఏకాంతప్రదేశమున యథేష్టముగా తిని త్రాగి నిద్రపోవుచు పొర్లాడుచుందురు. ఈర్ష్యాద్వేషములయందు మగ్నులై నిందా కుచేష్టత నొనర్చి తమ నిర్వాహము చేసుకొనుచుందురు. కాషాయవస్త్రములను, దండమును ధారణచేసినంత మాత్రమున తాము కృతకృత్యులమయినట్లు తలంతురు. తాము సర్వోత్కృష్టులమని భావించి ఉత్తమ కార్యాలను చేయరు. ఇట్టి బ్రహ్మచారులు, సన్న్యాసులు ఈ ప్రపంచమున వ్యర్థంగా నివసిస్తున్నారు. వీరిలో ఎవరైనా జగత్తునకు మేలొనగూర్చువారుండిన వారు ప్రశంసనీయులు.

ప్రశ్న:- గిరి, పురి, భారతి మొదలగు గోసాయీలు మంచివారేనా? ఏలయనగా వారు గుంపులు గుంపులుగా చేరి ఇటునటు సంచరించుచు వందలకొలది సాధువుల కానందమును కలుగజేయుచున్నారు. వారు సర్వత్ర అద్వైతమతప్రచారాన్ని చేయుచున్నారు. అట్లే కొంత చదువుచు జదివించుచునున్నారు. కావున వారు మంచివారు కావచ్చును.

జవాబు:- ఈ గిరి, పురి మున్నగు పదిపేర్లు ఇటీవల కల్పింపబడినవే. కాని సనాతనాలు కావు. వారు గుంపులుగా చేరియుండుట ఎల్ల భోజనంకొరకే. అట్లే అనేకమంది సాధువులు పొట్ట కూటికయి ఆ గుంపులలో నుందురు. అందు దంబముకలవారును గలరు. ఏలయనగా వారిలో మహంతుగా చేయబడిన ఒక ముఖ్యుడు సాయంకాలము కాగా, ఒక గద్దెపై కూర్చుండునుఅప్పుడు బ్రాహ్మణులును, సాధువులందరును లేచి నిలబడి పుష్పములను చేతనుంచుకొని :-

నారాయణం పద్మభవం వసిష్ఠం శక్తించ తత్పుత్ర పరాశరం చ ।
వ్యాసం శుకం గౌడపదం మహాంతమ్...... ॥

అను ఇట్టి శ్లోకములను చదివి 'హరహర' యని పలికి అతని మీద పువ్వుల వర్షమును గురిపించి, సాష్టాంగ నమస్కారాలను చేస్తారు. అట్లు చేయనివానిని అచ్చట నిలువనీయరు. ఈ దంబాచారమంతయు ప్రపంచానికి చూపుటకొరకు చేస్తారు. దీనవలన ప్రతిష్ఠగలిగి ధనసంచయము కాగలదనియే వారి ఉద్దేశం. ఎందరో మఠాధిపతులు గృహస్థులైయుండియు సన్న్యాసాభిమానము కలిగియుందురే కాని ఎంత మాత్రము కర్మచేయరు. సన్న్యాస, ధర్మాలను గూర్చి పంచమ

సముల్లాసమున వ్రాయబడినది. అట్టి కర్మలనాచరింపక వృథా కాలహరణము చేయుచున్నారు. ఎవరైన మంచి ఉపదేశము చేసిన వానిని ద్వేషింతురు. వీరు ఎక్కువగా భస్మరుద్రాక్షలను ధరించుచు శైవసంప్రదాయాభిమానమును కలిగియుందురు.

ఎప్పుడైనా శాస్త్రార్థము చేయుదురేని శంకరాచార్యోక్త మతమును స్థాపించి, చక్రాంకితాది మతాలను ఖండించుటయందు ప్రవృత్తులగుచుందురు. వేదమార్గము యొక్క ఉన్నతికొరకును గాని పాఖండ మతమును ఖండించుటకుగాని ఎంతమాత్రము పాటుబడరు. మాకు "ఈ ఖండన మండనములతో ప్రయోజన మేమి" అని ఈ సన్న్యాసులందురు. మేము మహాత్ములము మాకేమిపని? ఇట్టివారు ఈ ప్రపంచమున భారరూపులై యున్నారు.

వీరిట్లుండుటవలననే వేద విరోధులగు వామమార్గాది సాంప్రదాయములవారును, క్రైస్తవులను, మహమ్మదీయులను, జైనులు మొదలగువారును వృద్ధికి వచ్చిరి, ఇప్పుడును వృద్ధికి వచ్చుచున్నారు. ఇట్లు తమకు నాశనము కలుగుచున్న గూడ ఈ సన్న్యాసులు కన్నులు తెరువరు. ఎందుకు తెరుతురు? వీరి హృదయములందు పరోపకారబుద్ధియు, సన్న్యాసులనబడు వీరికి తమ కర్తవ్యకర్మలయందు ఉత్సాహమును లేదు. కాని వీరు కేవలము తమ ప్రతిష్ఠను కోరుచు భోజనపానములకంటే అధికమేమియు లేదనియే తలతురు.

ఏషణత్యాగ సన్న్యాసము

లోకైషణ - లోకమున ప్రతిష్ఠ, విత్తైషణ- ధనార్జనయందు తత్పరులై విషయభోగముల నభిలషించుట, పుత్రైషణ- పుత్రుల శిష్యులమీద మోహితులగుట. ఈ మూడు ఏషణములను వదలుట సన్న్యాసులకు ముఖ్యము. ఈ ఏషణములనే వదలనివారు సన్న్యాసు లెట్లు కాగలరు? అనగా పక్షపాతరహితమైనట్టి వేదోక్తమార్గోపదేశము వల్ల జగత్తునకు శుభము కలుగజేయుటయందు అహర్నిశలు ప్రవృతులైయుండుట సన్న్యాసులకు ముఖ్యకర్తవ్యం. తమ తమ అధికారకర్మల నొనరించేని వారు సన్న్యాసాదినామాలను వహించుట వ్యర్థం. కావున తమ వ్యవహారములందును స్వార్థమునందును శ్రమపడు గృహస్థులకంటె అధికపరిశ్రమ చేయుచు పరోపకారమొనర్చుటయందు సన్న్యాసులు తత్పరులై యుండవలయును. అప్పుడే అన్ని ఆశ్రమాలు అభివృద్ధిలోనుండును.

సన్న్యాసులారా! చూడుడు? మీ కంటి యెదుటనే పాఖండ మతములు వృద్ధియగుచు వచ్చుచున్నవి. జనులు క్రైస్తవులుగాను., మహమ్మదీయులుగాను ఐపోవుచున్నారు. మీ యింటిని మీరు కాపాడుకొనుటకును, ఇతరులను మీలో కలుపుకొనుటకును కొంచమైనను మీ చేత గాకున్నది. చేయదలచిన గదా? మీకు చేతనగుట! ఇప్పుడును, ఇకమీదటను మీరున్నతశీలురు కాకపోయినచో ఆర్యావర్తదేశమునకు గాని అన్యదేశీయులకు గాని వృద్ధికలుగదు. వృద్ధికి కారణములగు వేదాది శాస్త్రముల పఠనపాఠనములును, బ్రహ్మచర్యాది ఆశ్రమముల యొక్క యథావదనుష్ఠానమును, సత్యోపదేశమును జరుగునప్పుడే దేశోన్నతి యగును.

గమనించి చూడుడు! మేల్కొనుడు. అనేక కపట వ్యాపారాలను మీరు చూస్తూనే ఉన్నారు. బైరగాళ్ల వంటి కొందరు సాధువులు తమ సిద్ధులతో పుత్రాదులను కలిగింతుమని దుకాణాలను పెట్టుకొని కూర్చున్నారు. వారి వద్దకు స్త్రీ లెందరో వెళ్లి, ముకుళిత హస్తులై పుత్రభిక్షను అడుగుదురు. బాబాజీగారు అందరికిని పుత్రులు కలుగునట్లు ఆశీర్వదింతురు. వారిలో ఒక స్త్రీకి పుత్రుడు కలిగినప్పుడు ఆమె "బాబాజీగారి వచన ప్రభావము వలననే పుత్రుడు కలిగినాడని" భావించును. కాని పంది, కుక్క గాడిదె, కోడి మున్నగువానికి ఏ బాబాగారి ఆశీర్వచనమువలన పిల్లలు పుట్టుచున్నారని అడిగిన ఆ స్త్రీ ఉత్తరమేమియు నియ్యజాలకుండును. ఎవడేని "నేను పిల్లవానిని రక్షింతును, చావనివ్వను" అని ప్రగల్భములు పలికిన వాడు ఏల చనిపోవుచున్నాడు?

ధనసారీ వంచకులు

ఇట్లెందరో వంచకులు మంచి బుద్ధిమంతులను కూడ మాయలలో పడవేసి మోసము చేయుచున్నారు. ఇందు ధనసారీ వంచకులు మిక్కిలి ప్రసిద్ధులు చూడుడు. వారైదారుగురు చేరి దూరదూర దేశములకు పోయి, తమలో ఆకారాపుష్టిని కలిగి, చూపునకు చక్కగా నుండువానికి సిద్ధపురుషుని వంటి వేషము వేసి, ధనాఢ్యులుండు పట్టణమునకు గాని లేదా గ్రామమునకు గాని సమీపమునందున్న అడవిలో వానిని కూర్చుండబెట్టుదురు. ఒకరిద్దరు సేవకులుగా ఉంటారు. తక్కినవారు, ఏమియు ఎరుగనివారివలె వేర్వేరుగా ఆ ఊరిలోనికి పోయి, ఎదురైనవారి నెల్ల "మీరిట ఎక్కడైనను ఫలానా మహాత్ముని చూచియున్నారా?" అని అడుగజొత్తురు. వారిట్లు విని, 'ఆ మహాత్ము డెవ్వడు? అతడెట్టివాడు?' అని విచారింపగా "అతడు మహా సిద్ధపురుషుడు. ఎదుటివాని హృదయములలోని మాట ఉన్నదున్నట్లు చెప్పును. అతడు చెప్పిన మాట తప్పక ఫలించును. అతడు మహా యోగీశ్వరుడు, అతని దర్శనము కొరకే మేము మా ఇండ్లను వదలి ఇట్లు తిరుగుచున్నాము. ఆ మహాత్ము డీ ప్రాంతమందే ఎక్కడనో ఉన్నట్లు మాకు తెలిసినది" అని ప్రత్యేకంగా చెప్పుదురు. ఈ సుద్దులు విన్న ఆ గృహస్థులు "ఆ మహాత్ముడు మీకుచిక్కినచో మాకును తెలియజేయుడు. మేము కూడ వారి దర్శనాన్ని చేసికొనెదము. అట్లే మా మనస్సులో ఉన్న మాటలను అడిగి తెలుసుకొనెదము" అని అందురు.

ఇట్లు వారు దినమంతయు ఆ ఊరు తిరిగి ప్రతి ఒకనికిని ఆ సిద్ధుని ప్రభావాన్ని వెల్లడిచేతురు. రాత్రి కాగానే సిద్ధ సాధకులందరును చేరి తిని త్రాగి నిద్రింతురు. మలర ప్రొద్దున లేచి ఆ యూరికే పోయి తిరిగి వత్తురు. ఇట్లు రెండు మూడు దినములైన తరువాత ఆ సాధకులలో ఒక్కొక్క డొక్కొక్క ధనవంతుని వద్దకు పోయి "ఆ మహాత్ముడు దొరికినాడు. నీకు అతనిని దర్శింప కోరిక ఉన్నచో నాతో రమ్ము, పోదము" అని చెప్పుదురు. ఇక వారు సిద్ధమై వెంబడి రాగా ఈ సాధకులు "నీ వేమియడుగదలచినావో నాతో చెప్పుమని" వారల నడుగుదురు. అప్పుడు వారిలో ఒకడు తనకు

పుత్రుడు కావలయుననియు, మరియొకడు ధనము కావలయుననియు, ఇంకొకడు తనకు రోగనివారణము కావలయుననియు, వేరొకడు తనకు శత్రువుపైము కలుగవలె ననియు తాము కోరెడు సంగతుల నెల్ల వారితో చెప్పుదురు. అప్పుడు వారా ధనికులను వెంబడించుకొని ఆ సిద్ధుడున్న చోటునకు కొనిపోవుదురు. ఈ మనోగతాలను తెలుసుకొనునట్లు ఆ సాధకులు మొదటనే కొన్ని సంకేతములను ఏర్పరచుకొనియుందురు. అనగా ధనాపేక్ష గలవారిని గుడిప్రక్కను, పుత్రేచ్ఛ గలవారిని సమ్ముఖముననను, రోగనివారణమును కోరువారిని ఎడమ ప్రక్కను, శత్రువుపై జయమును ఆశించువారిని వెనుక ప్రక్కనుండి త్రిప్పి వారు నిర్దేశించుకున్న స్థానములందు గూర్చుండబెట్టుదురు. వారు నమస్కారము చేసిన తక్షణమే, ఆ సిద్ధుడు తన మాయా ప్రభావమువలన కొంత బిగ్గరగా "నీవు పుత్రాపేక్ష కలిగి వచ్చియున్నావే" ఏమి, మా యొద్ద పుత్రుల నుంచుకొని యున్నామా? అనియు, అదేరీతిన ధనవాంఛతో వచ్చినవానిని చూచి, ఇచ్చట ధన సంచులు పెట్టుకొని యున్నామనియా నీవు ధనమును గోరి వచ్చియున్నావు. ఫకీరుల వద్ద ధనమెక్కడ నుండుననియు, రోగ నివారణార్థము వచ్చినవానిని చూచి, మేము వైద్యులమనియా నీవు రోగనివారణము కొరకు వచ్చియున్నావు. నీ రోగమును మాన్పుటకు మేము వైద్యులము కాము. వైద్యు డెవడైన నుండిన వాని యొద్దకు పో పొమ్మనియు అనును.

కాని వచ్చిన వాని తండ్రి రోగిగా నున్న అంగుష్టమును, తల్లి రోగిగా నున్న తర్జనీవ్రేలును, అన్నదమ్ములు రోగులుగానున్న నడిమివ్రేలును, భార్య రోగిగానున్న అనామికను, కుమార్తె రోగిగానున్న చిటికెన వ్రేలును ఆ సాధకులు సంకేతముగా చూపుదురు. అప్పుడా సిద్ధుడు నీ తండ్రి రోగిగా నున్నాడు, నీ తల్లి రోగిగా నున్నది, నీ తోబుట్టువు రోగిగా నున్నాడు, నీ భార్య రోగిగా నున్నది, నీ బిడ్డ రోగిగా నున్నదని సంకేతమును బట్టి సందర్భానుసారము చెప్పును. వచ్చియున్న ఆ నలుగురును మోహితులై పోవుదరు. అప్పుడా సాధకులు వారితో చూచితిరా! మేము చెప్పినటులె యున్నారా, లేదా? అని ఆ నగర గ్రామవాసులను నమ్మింపచేతురు.

గృహస్థుడు:– మీ రెట్లు చెప్పియుంటిరో, వారట్లే యున్నారు. మీరు మాకొక గొప్ప ఉపకారమును చేసితిరి. ఇటువంటి మహాత్ముడు చిక్కుట మా గొప్ప భాగ్యోదయమే అనవలెను. ఈ మహాత్ముని దర్శించి మేము కృతార్థులమైతిమి.

సాధకుడు:– నాయనలారా ! వినుడు– ఈ మహాత్ముడు మనోగామి. చాలా దినముల వరకు ఇచ్చట నుండువాడు కాడు. ఈయన ఆశీర్వాదమును కొంత పొందవలయుననంటిరా, మీమీ సామర్థ్యము కొలది తనుమనధనములచేత సేవచేయుడు. ఏలయనగా సేవ చేసినవారికే గదా ఫలమబ్బును. ఈయన ఎవరి పట్ల ప్రసన్నుడగునో, ఎవరికేమి వరమిచ్చునో చెప్పజాలము. సంతుల మహిమ అపారమైనది సుమా, అని వారిని బుజ్జగింతురు.

పాప మా గృహస్థులు వారి మృదుమధురవాక్కుల కుప్పొంగి హర్షముతో కొనియాడుచు తమ తమ ఇండ్లకు పోవుదురు. తమ గుట్టును ఎవరెక్కడ బైట బెట్టుదురో అను భీతిచే ఆ సాధకుడు కూడ వారిని వెంబడించును. వారు అలా ఆ ధనికులతో గూడిపోవుచు, వారి మిత్రులైవరైనా ఎదురుపడినచో వారితోనూ ఆ సిద్ధుని ప్రశంస చేయుచుందురు. ఇట్లా సాధకులతో పోవుచున్నవారందరు తమ తమ వృత్తాంతమంత చెప్పుచుందురు.

ఇక ఆ పట్టణమందెక్కడ చూచినను 'ఫలానా స్థలమున ఒక మహాపురుషుడు వచ్చినాడట. పదండు. అతని వద్దకు పోదము' అను వార్తానాదమే వినబడుచుడును. అప్పుడు జనులు గుంపులు గుంపులుగా పోయి 'మహారాజా! నా మనస్సులోని వృత్తాంతమును తెలుపుడు' అని ఆ సిద్ధుని అడుగుదురు. అప్పుడు తమ సాంకేతిక వ్యవహారమంతయు నస్తవ్యస్తమైయుండుట చూచి, ఆ సిద్ధుడు మౌనవ్రతమును పూని కొంతసేపటికి, "మమ్ము ఊరక పీడింపకుడు" అని చెప్పును. తక్షణమే సాధకుడొకడు ఆమాటను అందుకొని వారితో 'ఈయనను ఇట్లూరక పీడించిన ఇట నుండి వెడలిపోవు'నని చెప్పును. వారిలో ఎవడో ఒక గొప్పధనాఢ్యుడు ఆ సాధకుని వేరుగా పిలుచుకొని 'మా మనస్సులోని మాటను చెప్పించిన మేము యథార్థముని నమ్మగలము' అని వానితో అనును. అప్పుడా సాధకుడు అదేమి మాట అని యడుగును. ఆ ధనాఢ్యుడు తన అంతర్యమును విప్పి చెప్పగానే ఆ సాధకుడు పై చెప్పిన సంకేతానుసారం అతనిని తీసుకొనిపోయి ఆ సిద్ధుని వద్ద గూర్చుండబెట్టును. అప్పుడా సిద్ధుడు గ్రహించి తక్షణమే వాని తలంపును చెప్పివేయును. అచ్చట ప్రోగైయుండిన వారెల్ల దానిని విని 'ఓహో! ఈతడు గొప్ప సిద్ధపరుషు'డని నమ్మి ప్రశంసింతురు.

కొందరు మిఠాయి, కొందరు ధనము, కొందరు అపరంజీలు, కొందరు వస్త్రాలు, కొందరు వంటసామగ్రి మొదలగునవి తెచ్చి సమర్పణ చేతురు. ఇట్లా జనులకు నమ్మకమున్నంతకాలము ఆ సిద్ధసాధకులు లోకులను యథేష్టముగా దోచుకొని తిందురు. ఎవరైన నొకరిద్దరు హృదయాంధులును ధనపూర్ణులును నైన వారు పుత్రాపేక్షతో వచ్చిన, వారి కాశీర్వాదమో లేక భస్మమో యొసంగి, వేయిరూపాయలను వారి నుండి పుచ్చుకొని, "నీ యందు నిజమైన భక్తి కలదేని నీకు పుత్రుడు తప్పక కలుగు"నని చెప్పును.

ఇటువంటి దొంగలెందరో ఈ లోకమున ఉన్నారు. అట్టివారిని విద్వాంసులే పరీక్షించగలుగుదురు. కాని తక్కినవారు పరీక్షించనర్హులు కారు. కావున వేదాది విద్యలను చదువుచు సత్సంగమున కాలము గడుపదగును. వాని నెవడును మోసపుచ్చనేలేడు. అతడు ఇతరులను కూడ అట్టి మోసము నుండి కాపాడగలడు. ఏలయనగా విద్యయే మనుష్యునకు నేత్రమువంటిది.

విద్యాశిక్షణలను పొందకున్న జ్ఞానము కలుగదు. బాల్యావస్థ నుండియే ఉత్తమ శిక్షణను ఎవరు పొందుదురో వారే విద్వాంసులగుదురు. కుసంగములో పడినవారు దుష్టులును పాపాత్ములును మహామూర్ఖులునై దుఃఖమనుభవింతురు. కావున జ్ఞానమే విశేషమని చెప్పబడినది. వివేకియగువాడే దీనిని అంగీకరింపగలడు.

న వేత్తి యో యస్య గుణప్రకర్షం స తస్య నిందాం సతతం కరోతి ।
యథా కిరాతీ కరికుంభజాతా ముక్తాః పరిత్యజ్య బిభర్తి గుంజాః ॥

॥ వృద్ధ.చా.అ.11. శ్లో. 12॥

అడవిలో నుండు భిల్లులు- బోయలు ఏనుగు కుంభస్థలములో పుట్టు ముత్యాలను వదలి, గురిగింజల హారాలను ధరించునట్లే ఒక వస్తుగుణమును తెలియనివాడు దానినెప్పుడును నిందించుచుండును. అట్లే ఏ పురుషుడు విద్వాంసుడును, జ్ఞానియు, ధార్మికుడును, సత్పురుషుల సహవాసము గలవాడును, యోగియు, పురుషార్థియు, జితేంద్రియుడును, సుశీలుడును అగునో వాడే ధర్మార్థ కామమోక్షాలను పొంది. ఈ జన్మలో పరజన్మలో సదా ఆనందమగ్నుడై ఉంటాడు.

ఉపసంహారము:- ఇంతవరకు ఆర్యావర్తనివాసుల మతవిషయమున సంక్షిప్తముగా వ్రాయబడినది. ఇక ముందు కొంతవరకు లభించిన ఆర్యరాజుల ఇతిహాసము సజ్జనులందరకు తెలియుటకుగాను ప్రకటింపబడుచున్నది.

ఇక ఆర్యావర్తదేశీయ రాజవంశమును అనగా శ్రీమాన్ యుధిష్ఠిర మహారాజు మొదలుకొని అశ్వపాలమహారాజు పర్యంతపు ఇతిహాసమును వ్రాయుచున్నాము. మరి శ్రీమాన్ స్వాయంభువ మను మహారాజు మొదలుకొని యుధిష్ఠిరమహారాజు పర్యంతపు ఇతిహాసము మహాభారతాది గ్రంథములందు వ్రాయబడియేయున్నది. కావున ఇటీవలి రాజుల ఇతిహాసము దీనివల్ల సజ్జనులకు విదితమగును. ఈ విషయము విద్యార్థుల ఉపయోగార్థము, రాజపుత్రస్థానమున ఉన్న ఉదయపుర రాజసంస్థానమునకు రాజధానియైన చిత్తోడ్‌గఢ్ పురమునుండి వెడలుచుండిన 'హరిశ్చంద్ర చంద్రిక' తథా 'మోహనచంద్రిక' అను పక్షపత్రికలయందు ప్రచురింపబడినది. ఇది మీ కందరకును విశదమే అయినను వానిని బట్టియే మేము భాషాంతరమొనరించి యున్నాము. అటులనే మన ఆర్య సజ్జనుల ఇతిహాసములను, విద్యాపుస్తకములను వెదకి ప్రకాశపరచిన మన దేశమున కెంతయో లాభము కలుగవచ్చును. ఆ పత్రికాధిపతి విక్రమ శకము 1732వ సంవత్సరమున వ్రాసిన ఒక ప్రాచీన పుస్తకమును, తన మిత్రుని వలన పొంది, విక్రమశకము 1939వ సంవత్సర మార్గశీర్ష శుక్ల పక్షమున 19-20 సంఖ్యలుగల సంచికలలో ప్రచురించినదే యీ క్రింద వ్రాసినదానికి ప్రమాణమని చదువరులు తెలుసుకొనుడు.

ఆర్యావర్త దేశీయ రాజవంశావళి

శ్రీ మద్యశపాల మహారాజు పర్యంతము ఆర్యులు ఇంద్రప్రస్థపురమున రాజ్యము చేసిరి. వారిలో శ్రీమద్యుధిష్ఠిర మహారాజు మొదలుకొని యశ్వపాల మహారాజు పర్యంతము 4157 సంవత్సరములు, తొమ్మిది మాసములు, 14 దినముల వ్యవధిలో సుమారు 124 మంది రాజులైనారు. దాని వివరములు

ఆర్య రాజులు	తరములు	సంవత్సరాలు	నెలలు	రోజులు
	124	4157	9	14

శ్రీ మద్యుధిష్ఠిరాది మహారాజుల వంశమున సుమారు 30 మంది రాజులు. వీరి రాజ్యకాలము 1770 సంవత్సరములు, 11 మాసములు, 10 దినములు రాజ్యము చేసిరి. దాని విరములు –

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	నెలలు	రోజులు
1.	యుధిష్ఠిర	39	8	15
2.	పరీక్షిత్తు	60	0	0
3.	జనమేజయుడు	84	7	23
4.	అశ్వమేధుడు	82	8	22
5.	రామరాజ ద్వితీయుడు	88	2	8
6.	ఛత్రమలుడు	81	11	27
7.	చిత్రరథుడు	75	3	18
8.	దుష్టశైల్యుడు	75	10	24
9.	ఉగ్రసేనుడు	78	7	21
10.	శూరసేనుడు	78	7	21
11.	భువనపతి	69	5	5
12.	రణజీతుడు	65	10	4
13.	ఋక్షకుడు	64	7	4
14.	సుఖదేవుడు	62	0	24
15.	నరహరిదేవుడు	51	10	2

16.	సూచీరథుడు	42	11	2
17.	రెండవ శూరసేనుడు	58	10	8
18.	పర్వతసేనుడు	55	8	10
19.	మేధావి	52	10	10
20.	సోనచీరుడు	50	8	21
21.	భీమదేవుడు	47	9	20
22.	నృహరిదేవుడు	45	11	23
23.	పూర్ణమల్లుడు	44	8	7
24.	కరదవి	44	10	8
25.	అలమ్మిక	50	11	8
26.	ఉదయపాలుడు	38	9	0
27.	దువనమలుడు	40	10	26
28.	దమాత	32	0	0
29.	భీమపాలుడు	58	5	4
30.	క్షేమకుడు	48	11	21

క్షేమకరాజుకు మంత్రిగా నుండిన విశ్రవుడు క్షేమకుని చంపి రాజ్యమునకధిపతి యయ్యెను. అతనితో ఆ వంశస్థులు 14 మంది రాజులు. వీరు 500 సంవత్సరములు, 3 మాసములు, 17 దినములు రాజ్యమేలిరి దాని వివరములు –

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	మాసాలు	రోజులు
1.	విశ్రవుడు	17	3	29
2.	పురసేనుడు	42	8	21
3.	వీరసేనుడు	52	10	7
4.	అనంగశాయి	47	8	23
5.	హరిజిత్	35	9	17

6.	పరమసేని	44	2	23
7.	సుఖపాతాళుడు	30	2	21
8.	కద్రుతుడు	42	9	24
9.	సజ్జనుడు	32	2	14
10.	అమరచూడుడు	27	3	16
11.	అమీపాలుడు	22	11	25
12.	దశరధుడు	25	4	12
13.	వీరసాలుడు	31	8	11
14.	వీరసాలసేనుడు	47	0	14

వీరసాలసేనుని అతని మంత్రిగా నుండిన వీరమహుడు అతనిని చంపి తాను రాజ్య పరిపాలకుడయ్యెను. అతనితో ఆ సంతతివారు 16 మంది రాజులు. వీరు 445 సంవత్సరములు, 5 నెలలు 3 దినములు రాజ్యమేలిరి. దాని వివరములు-

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	మాసాలు	రోజులు
1.	వీరమహుడు	35	10	8
2.	అజితసింహుడు	27	7	19
3.	సర్వదత్తుడు	28	3	10
4.	భువనపతి	15	4	10
5.	(మొదటి) వీరసేనుడు	21	2	13
6.	మహీపాలుడు	40	8	7
7.	శత్రుశాలుడు	26	4	3
8.	సంఘరాజు	17	2	10
9.	తేజపాలుడు	78	11	10
10.	మాణిక చందుడు	37	7	21
11.	కామసేని	42	5	10

12.	శత్రుమర్ధనుడు	8	11	10
13.	జీవనలోకుడు	28	9	17
14.	హరిరావు	26	10	29
15.	(రెండవ) వీరసేనుడు	35	2	20
16.	ఆదిత్య కేతువు	23	11	13

మగధదేశమునకు రాజుగా నుండిన ఆదిత్యకేతువును ప్రయాగకు రాజుగా నుండిన ధంధరుడు చంపి మగధదేశ రాజ్యమునకు వచ్చెను. అతనితో ఆ సంతతివారు 9 మంది రాజులు. వీరు 374 సంవత్సరములు 11 మాసములు 26 దినములు రాజ్యమేలిరి. దాని వివరములు–

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	మాసాలు	రోజులు
1.	ధంధరుడు	42	7	24
2.	మహర్షి	41	2	29
3.	సనరచ్చీ	50	10	19
4.	మహాయుద్ధుడు	30	3	8
5.	దురనాథుడు	28	5	25
6.	జీవనరాజు	45	2	5
7.	రుద్రసేనుడు	47	4	28
8.	ఆరీలకుడు	52	10	8
9.	రాజపాలుడు	36	0	0

రాజపాలుడను రాజును అతని సామంతుడగు మహాపాలుడు చంపి 14 సంవత్సరములు రాజ్యమేలెను. తరువాత అతని వంశస్థులు ఎవ్వరును రాజులు కాలేదు.

'అవంతికాపుర' ఉజ్జయినాధీశుడగు విక్రమాదిత్యుడు రాజా మహాన్‌పాలుని రాజ్యము మీదికి దండెత్తి వెళ్ళి, అతనిని చంపి తాను 36 సంవత్సరములు రాజ్యమేలెను.

శాలివాహనుని సామంతుడుగా నుండి పైరణుడైన సముద్రపాలయోగి విక్రమాదిత్యుని చంపి తాను రాజ్యమునకు వచ్చెను. అతనితో ఆ సంతతివారు 16 మంది రాజులు. వీరు 372 సంవత్సరములు, 4 మాసములు 27 దినములు రాజ్యమేలిరి. దాని వివరములు–

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	నెలలు	రోజులు
1.	సముద్రపాలుడు	54	2	20
2.	చంద్రపాలుడు	36	5	4
3.	సహాయపాలుడు	11	4	11
4.	దేవపాలుడు	27	1	28
5.	నరసింహపాలుడు	18	0	20
6.	సామపాలుడు	27	1	27
7.	రఘుపాలుడు	22	3	25
8.	గోవిందపాలుడు	27	1	17
9.	అమృతపాలుడు	36	10	13
10.	బలిపాలుడు	12	5	27
11.	మహీపాలుడు	13	8	4
12.	హరిపాలుడు	14	8	4
13.	సీసపాలుడు (భీమపాలుడు అని మరోపేరు)	11	10	13
14.	మదనపాలుడు	17	10	19
15.	కర్మపాలుడు	16	2	2
16.	విక్రమపాలుడు	24	11	13

విక్రమపాలుడు పశ్చిమదేశాధిపతి యగు మల్లూఖచంద్ర భోహరుని మీదికి దాడి చేసి యుద్ధమున చచ్చెను. అంతటితో ఇంద్రప్రస్థమునకు మల్లూఖచంద్రుడు పాలకుడయ్యెను. అతనితో ఆ సంతతి వారు 10 మంది రాజులు. వీరు 191 సంవత్సరములు 1 మాసము 16 దినములు రాజ్యమేలిరి. వీరి వివరములు–

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	నెలలు	రోజులు
1.	మల్లూఖచంద్రుడు	54	2	10
2.	విక్రమచంద్రుడు	12	7	12

3.	అమీనచంద్రుడు (మానిక్‌చంద్ అని మరోపేరు)	10	0	5
4.	రామచందుడు	13	11	8
5.	హరిచందుడు	14	9	24
6.	కళ్యాణచందుడు	10	5	4
7.	భీమచందుడు	16	2	9
8.	లోవచందుడు	26	3	22
9.	గోవిందచందుడు	31	7	12
10.	పద్మావతీ రాణి (గోవిందచందుని భార్య)	1	0	0

పద్మావతీ రాణి గతించెను. ఈమెకు సంతానము లేదు. ఇందువలన ఆమె ముత్సద్దీయులందరు కలిసి ఆలోచించుకొని హరిప్రేమయోగిని సింహాసనాసీనుని చేసి తాము రాజ్యము నేలుచుండిరి. అతనితో ఆ సంతతివారు 4గురు. రాజులు వీరు 50 సంవత్సరముల 21 దినములు రాజ్యము నేలిరి. దాని వివరములు–

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	నెలలు	రోజులు
1.	హరిప్రేముడు	7	5	16
2.	గోవిందప్రేముడు	20	2	8
3.	గోపాలప్రేముడు	15	7	28
4.	మహాబాహుడు	6	8	29

మహాబాహుడు తపశ్చర్య చేయ వనమునకు వెడలిపోయెను. దీనిని విని బంగాళ్ దేశమునకు రాజుగా నుండిన ఆధిసేనుడు ఇంద్రప్రస్థమునకు వచ్చి రాజ్యారూఢుడయ్యెను. అతనితో ఆ సంతతివారు 12 మంది రాజులు. వీరు 151 సంవత్సరములు 11 మాసములు 2 దినములు రాజ్యమేలిరి. దాని వివరములు–

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	నెలలు	రోజులు
1.	ఆదిసేనుడు	18	5	21
2.	విలావసేనుడు	12	4	2
3.	కేశవసేనుడు	15	7	12

4.	మాధవసేనుడు	12	4	2
5.	మయూరసేనుడు	20	11	27
6.	భీమసేనుడు	5	10	9
7.	కల్యాణసేనుడు	4	8	21
8.	హరిసేనుడు	12	0	25
9.	క్షేమసేనుడు	8	11	15
10.	నారాయణసేనుడు	2	2	29
11.	లక్ష్మీసేనుడు	26	10	0
12.	దామోదరసేనుడు	11	5	19

దామోదరసేనుడు తన సామంతులను మిక్కిలి పీడించుచుండినందున, వారిలో నొకడగు దీపసింహుడు బలము కూర్చుకొని యుద్ధమున దామోదరసేనుని చంపి, తాను రాజ్యపాలకుడయ్యెను. అతనితో ఆ సంతతివారు 6 గురు రాజులు. వీరు 107 సంవత్సరములు 6 మాసములు 12 దినములు రాజ్యమేలిరి. దాని వివరములు-

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	నెలలు	రోజులు
1.	దీప సింహుడు	17	1	26
2.	రాజసింహుడు	14	5	0
3.	రణసింహుడు	9	8	11
4.	నరసింహుడు	45	0	15
5.	హరిసింహుడు	13	2	29
6.	జీవనసింహుడు	8	0	1

జీవనసింహుడు తన సేన నంతయును ఏదియో కారణమును బట్టి ఉత్తర దిశకు పంపెను. ఈ వార్త విరాటరాజగు పృథ్వీరాజు చౌహాణుడు విని అతని మీద దాడి చేసి యుద్ధమున ఆ జీవనసింహుని చంపి తా నా ఇంద్రప్రస్థ రాజ్యమును ఆక్రమించెను.

అతనితో ఆ సంతతివారు 5 గురు రాజులు. వీరు 86 సంవత్సరములు 20 దినములు రాజ్యమేలిరి. దాని వివరములు-

క్ర.సం.	ఆర్యరాజులు	సంవత్సరాలు	మాసాలు	రోజులు
1.	పృథ్వీరాజు	12	2	19
2.	అభయపాలుడు	14	5	17
3.	దుర్జనపాలుడు	11	4	14
4.	ఉదయపాలుడు	11	7	3
5.	యశపాలుడు	36	4	27

సుల్తాన్ షహాబుద్దీన్‌గోరి గజనీ నుండి యశపాలరాజు మీదికి యుద్ధమునకు వచ్చి అతని బట్టి ప్రయాగ కోటలో విక్రమశకము 1249వ సంవత్సరమున చెరపట్టి, తాను ఇంద్రప్రస్థము రాజ్యమేలెను. అతనితో ఆ సంతతివారు 53 మంది రాజులు. వీరు 754 సంవత్సరములు 1 మాసము 12 దినములు రాజ్యమేలిరి. దీని వివరణ అనేక ఇతిహాస గ్రంథములలో కానవచ్చును కావున దాని నిచ్చట వ్రాయలేదు.

ఇక కొన్ని ఇతిహాసములలో మహారాజను పృథ్వీరాజుపై సుల్తాను షహాబుద్దీన్ గోరి దండెత్తి అనేక పర్యాయములు పృథ్వీరాజుచే పరాభవమొంది తిరిగి పోయె ననియు, తుదకు 1249వ (విక్రమ సంవత్సరమున అంతఃకలహముల కారణము బట్టి పృథ్వీరాజును జయించి, అతనిని అంధుని చేసి, తన దేశమునకు కొనిపోయితా నా ఇంద్రప్రస్థము నేలె ననియు, ముసల్మానుల రాజ్యము 45 తరములు 613 సంవత్సరములు నిలిచియుండెననియు వ్రాయబడియున్నది.

దీని తరువాత బౌద్ధ జైన మతముల విషయము వ్రాయబడును.

శ్రీమద్దయానంద సరస్వతీస్వామి కృత సుభాషావిభూషితమైన

సత్యార్థప్రకాశంలో ఆర్యావర్తీయ మతఖండన మండన విషయాలు గల

ఏకాదశ సముల్లాసం సంపూర్ణం.

ద్వాదశ సముల్లాసము

అనుభూమిక (2)

ఆర్యావర్తంలో నివసించే మానవులలో యథార్థంగా సత్యాసత్యాలు నిర్ణయించే వేదవిద్య లుప్తమై అవిద్య వ్యాపించటచే జైనమతం మొదలైన విద్యావిరుద్ధాలైన మతమతాంతరాలు అంకురించి వ్యాపించటానికి కారణమయ్యింది.

ఎలాగంటే వాల్మీకీయమైన రామాయణంలో గాని, వేదవ్యాసకృతమైన మహాభారతం మొదలైన గ్రంథాలలో గాని జైనుల పేరు మచ్చుకైనా కనిపించదు. కాని వారి పుస్తకాలలో రామాయణ మహాభారతాలలో వర్ణించబడిన రామకృష్ణాదుల చరిత్రలు చాలా విస్తారంగా వ్రాయబడ్డాయి. ఈ కారణాన ఈ మతం వీరి తర్వాతనే వ్యాపించినట్లు సిద్ధమవుతున్నది. కాని జైనులు తమ మతాన్ని చాలా ప్రాచీనమైనదని వ్రాస్తున్నారు. అలాగైతే వాల్మీకీయాది గ్రంథాలలో వారి చరిత్ర తప్పక ఉండి ఉండాలి కదా! కావున జైన మతము ఈ గ్రంథాలకు తర్వాత ప్రచలితమైనదనటం స్పష్టం అవుతుంది.

జైన గ్రంథాలలోని కథలను సంగ్రహించి వాల్మీకీయ గ్రంథాలు వ్రాయబడి ఉండవచ్చుననుకుంటే వాల్మీకీయాదులలో ఆ గ్రంథాల పేర్లనైనా వ్రాయలేదు. మీ గ్రంథాలు ఎందుకు ఎలా వ్రాయబడ్డాయి అని వారిని అడగాలి. తండ్రి పుట్టుకను కొడుకు చూడగలడా? ఎన్నడూ చూడడు. కావున దీనిని బట్టి బౌద్ధాది మతాలు శైవ శాక్తేయాది మతాలకు తర్వాతనే వెలువడ్డాయని సిద్ధమవుతున్నది.

ఇక ఈ పన్నెండవ సముల్లాసంలో జైనమత విషయంపై వ్రాయబడిన విషయాలన్నీ వారి గ్రంథాల నుండే ఉదాహరణగా తీసుకొని వ్రాయబడ్డాయి. దీనిని జైనులు తప్పుగా భావించకూడదు. ఎందుకంటే కేవలం సత్యాసత్య నిర్ణయం కొరకు వీరి మత విషయాలు వ్రాయబడ్డాయే కాని విరోధాన్ని పెంచటానికి కాని హాని చేయటానికి కాని ఎంతమాత్రం కాదు.

ఈ లేఖను జైనులు, బౌద్ధులు, ఇతరులును చూసినప్పుడే కద! అందరికీ సత్యాసత్య నిర్ణయంలో ఆలోచన కలిగేది. నా ఈ వ్రాయడం వల్ల ఆలోచన పెరుగుతుంది. వాద ప్రతివాదులు ఏర్పడి ప్రేమయుక్తంగా తర్కించనంతవరకు, వ్రాయనంతవరకు సత్యాసత్యాల నిర్ణయం జరగదు.

విద్వాంసులలో సత్యాసత్య నిర్ణయం కానప్పుడు అవిద్వాంసులు మహాంధకారంలో పడి మిక్కిలి దుఃఖాలపాలు కావలసివస్తుంది. కావున సత్యం జయించటానికి అసత్యం నశించటానికి మైత్రితో విషయాలను వాదించటమో, వ్రాయటమో మానవమాత్రులకు తప్పనిసరి. అలా చేయకపోతే మానవోన్నతి ఎప్పుడూ జరుగదు.

ఇక ఈ జైన బౌద్ధ మత విషయాలు వీరికే కాక ఇతర మతస్థులకు కూడా అపూర్వలాభం కలుగజేస్తుంది. ఎందుకంటే వీరి వీరి పుస్తకాలు ఇతర మతస్థులకు చదవటానికి గాని, చూడడానికి గాని, వ్రాయటానికి గాని ఇవ్వనే ఇవ్వరు.

ఎంతో పరిశ్రమించి నేను విశేషంగా బొంబాయి ఆర్య సమాజమంత్రియైన శ్రేష్ఠి సేవకలాల్ కృష్ణదాసుగారితో చేసిన ప్రయత్నం వలన గ్రంథాలు లభించాయి. కాశీలో ఉన్న 'జైన ప్రభాకర' యంత్రాలయంలో ముద్రించబడటం వలన, బొంబాయిలో 'ప్రకరణ రత్నాకరం' అనే గ్రంథం ముద్రణకావడం వలన అందరికీ ఈ జైనమతాన్ని తెలుపడం సులభమైనది.

ఆహా! తమ పుస్తకాలను తామే చూసుకోవటం, ఇతరులకు చూపకపోవటం ఎంతటి పాండిత్యమో! తెలియున్నది. ఈ గ్రంథాలలో అసంభవవాక్యాలు ఉన్నాయనీ, ఇతర మతస్థులు చూస్తే వాటిని ఖండిస్తారని మనవారు ఇతర గ్రంథాలు చూస్తే ఈ మతంపై శ్రద్ధ ఉండలేదనీ ఈ గ్రంథకర్తలకు మొదటనే సందేహం ఉన్నదనీ దీని నుండే విదితమవుతున్నది.

వారి అభిప్రాయమేదైనా ఉండుగాక! చాలామందికి తమ దోషాలు కానరావు. కాని ఇతరుల దోషాలను ప్రకటించటానికి చాలా ఉత్సాహాన్ని చూపుతారు. ఇది న్యాయం కాదు. ఎందుకంటే తొలుత తమ దోషాలు తొలగించుకొని, తరువాత ఇతరుల దోషాలను తెలుసుకొని వాటిని తొలగించటానికి ప్రయత్నించాలి.

ఇక ఈ జైన బౌద్ధమత విషయాలనన్నింటిని సజ్జనుల సమ్ముఖంలో ఉంచుతున్నాను. యథోచితంగా ఉన్నది ఉన్నట్లు విచారించుదురుగాక!

కిమధికలేఖనేన బుద్ధిమద్వర్యేషు

బుద్ధిమంతులైనవారికి ఎక్కువగా వివరించి వ్రాయనవసరం లేదు.

ద్వాదశ సముల్లాసము

అథ నాస్తికమతాంతర్గత చారవాక బౌద్ధ జైనమతఖండన మండన విషయాన్ వ్యాఖ్యాస్యామః

నాస్తిక మతాంతర్గత చార్వాక బౌద్ధ జైన మతాలను గూర్చిన ఖండనమండనాలను వ్రాస్తున్నాము

చార్వాక మతం

బృహస్పతి' అనే పేరుగల పురుషుడు ఒకడుండేవాడు. అతడు వేదాలను మరియు యజ్ఞం మొదలైన ఈశ్వరుని ఉత్తమకర్మలను కూడా అంగీకరించేవాడు కాదు. అతని మతాన్ని చూడండి.

యావజ్జీవం సుఖం జీవేన్నాస్తి మృత్యోరగోచరః ।
భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః ॥ సర్వదర్శన సంగ్రహం. చార్వాక దర్శనం ॥

మానవుడు మొదలైన ఏ ప్రాణీ మరణం నుండి తప్పించుకోలేదు. అందరూ చావాల్సినవారే. కావున శరీరంలో జీవుడున్నంతవరకు సుఖంగా ఉండాలి.

ఎవడైనా ధర్మాన్ని ఆచరించటం చాలా కష్టమనీ, ధర్మాన్ని వదలితే పునర్జన్మలో మిక్కిలి కష్టాన్ని అనుభవించవలసి వస్తుందని చెబితేవారితో చార్వాడుడిలా అంటాడు– "ఓ వెఱ్ఱివాడా! చచ్చిన తరువాత శరీరం భస్మమవుతుంది. తిని, త్రాగి చనిపోయినవాడు మళ్ళీ ప్రపంచంలో జన్మించడు. కావున నీకు తోచిన విధంగా ఆనందంతో ఉండు. లోకంలో నీతితో నడుచుకోండి. ఐశ్వర్యాన్ని వృద్ధి చేసుకోండి. దానితో ఇష్టభోగాలను అనుభవించండి. ఈ లోకం తప్ప పరలోకమనేది ఏదీ లేదు.

చూడండి! భూమి, జలం, అగ్ని, వాయువు అనే ఈ నాలుగు భూతాల పరిణామంతో ఈ శరీరం అయ్యింది. ఇందు వీని యోగంవలన చైతన్యం కలుగుతుంది. మత్తుపదార్థాలను సేవించటంవలన మత్తు కలిగేటట్లు చైతన్యం కలుగుతుంది. అలాగే జీవుడు శరీరంతో పుట్టి శరీరంతో నశిస్తాడు. ఇక పాపపుణ్యాల ఫలం ఎవరికి కలుగుతుంది" అని సమాధానం ఇచ్చాడు.

తచ్చైతన్య విశిష్టదేహ ఏవ ఆత్మా । దేహాతిరిక్త ఆత్మని ప్రమాణాభావాత్ ॥ స. ద చా. ద. ॥

ఈ శరీరంలో భూత చతుష్టయ సంయోగంతో జీవాత్మ పుట్టి వాని వియోగంతోనే నశిస్తుంది. మృతిచెందిన తర్వాత ఏ జీవుడూ ప్రత్యక్షంగా కనబడటం లేదు కదా! కావున మేమొక ప్రత్యక్షాన్నే ప్రమాణంగా ఒప్పుకొంటున్నాము. ప్రత్యక్షంగాక అనుమానాదిప్రమాణాలు కలుగనే కలుగవు. కావున ముఖ్యమైన ప్రత్యక్షప్రమాణం ముందు అనుమానాలు గౌణాలవటం వలన వాటిని మేము గ్రహించము. సుందరమైన స్త్రీని కౌగలించుకొని సంతసించటమే పురుషార్థానికి ఫలం.

జడం నుండి చేతనం పుట్టదు

జవాబు:- ఈ పృథివ్యాది భూతాలు జడాలు. వాటినుండి చైతన్యం ఎన్నడూ పుట్టదు. తల్లిదండ్రుల కలయికవలన దేహం పుట్టినట్లే సృష్ట్యాదిలో మానవుల శరీరాకారాలు కర్తయైన పరమేశ్వరుని వలన మానవుల శరీరాకృతులు ఏర్పడతాయి. అతడు లేకుండా ఎన్నడూ కలుగనేరవు. మదంలాగా చైతన్యం పుట్టదు, నశించదు. మదం చైతన్యానికే పుడుతుంది కాని జడానికి కాదు.

పదార్థాలు అదృశ్యాలైనా - అభావం కాదు

పదార్థాలు నశించాయంటే అదృశ్యాలవుతాయని అర్థం. ఏ వస్తువుకూ అభావం కలుగదు. అలాగే అదృశ్యుడవటంవలన జీవుని అభావం కూడా ఒప్పుకోకూడదు. జీవాత్మ దేహంలో ఉన్నప్పుడే అతడు ప్రకటమవుతాడు. జీవుడు శరీరాన్ని విడిచినప్పుడు అది మృత్యువు అనబడతాడు. అంటే అతడు పూర్వం చైతన్యయుక్తంగా ఉండినట్లు ఉండదు. ఈ విషయమే బృహదారణ్యకంలో చెప్పబడింది.

"నాహం మోహం బ్రవీమి అనుచ్ఛిత్తి ధర్మాయ మాత్మేతి" ॥ బృ. 4.5.14 ॥

యాజ్ఞవల్క్యుడు "ఓ మైత్రేయీ! నేను మోహంతో చెబుతున్నానని భావించకు.

యథార్థంగా ఆత్మ నశించేది కాదు. దాని యోగంతోనే శరీరం చేష్టలు చేస్తున్నది.

శరీరం కంటే జీవుడు భిన్నుడు. జీవుడు శరీరం నుండి వేరైనప్పుడు శరీరంలో జ్ఞానమేమీ ఉండదు. దేహం కంటే ఆత్మ వేరుకాకుంటే మరణించినపుడు శరీరంలో జ్ఞానాభావం కలుగరాదు. కావున దేని సంయోగంలో దేహంలో జ్ఞానం ఉంటుందో, దేని వియోగంలో దేహంలో జ్ఞానం - చైతన్యం ఉండదో అది శరీరం కంటే భిన్నమవటం నిజం. నేత్రమన్నిటిని చూస్తుంది కానీ తనను తాను చూడదు. అలాగే ప్రత్యక్షం చేసుకొనేవాడు తనను ఇంద్రియాలకు ప్రత్యక్షుని చేసికోనేరడు. తన కన్నులతో సమస్త ఘటపటాది పదార్థాలజ్ఞానాన్ని పొందుతున్నట్లు తన జ్ఞానంతో కన్నులను చూస్తాడు. ద్రష్టయైనవాడు ద్రష్టగానే ఉంటాడు. దృశ్యమెన్నటికీ కాడు. ఆధారం లేకుంటే ఆధేయం, కారణం లేకుంటే కార్యం, అవయవి లేకుంటే అవయవం, కర్త లేకుంటే కర్మ సంభవించనట్లే కర్త లేకుండా ప్రత్యక్షం ఎట్లగును?

సుందరమైన స్త్రీ కలయికయే పురుషార్థ ఫలమని అనుకుంటే క్షణిక సుఖం కలుగవచ్చును, కాని దానివలన దుఃఖం కూడా కలుగుతున్నది. అది కూడా పురుషార్థఫలమేల కాదు? అలా అయితే స్వర్గహాని కలిగి దుఃఖాన్ని అనుభవించ వలసి వస్తుంది. ఇక దుఃఖాన్ని దూరం చేయడానికి,

సుఖాభివృద్ధికొరకు యత్నించాలన్నా ముక్తిలోని సుఖానికి హాని కలుగుతుంది. కావున అది పురుషార్థఫలం కాదు.

చార్వాకుడు:- దుఃఖంతో కూడిన సుఖాన్ని పోగొట్టుకొనేవారు మూర్ఖులు. ధాన్యార్థి ధాన్యాన్ని గ్రహించి పొట్టును విడిచినట్లు బుద్ధిమంతుడు సంసారంలోని సుఖాలను గ్రహించి దుఃఖాలను విడవాలి. ఎందుకంటే ఈ ప్రపంచంలో ఉపస్థిత సుఖాన్ని వదిలి అనుపస్థిత స్వర్గసుఖం కోరి ధూర్తులు రచించిన వేదోక్తమైన అగ్నిహోత్రాది కర్మోపాసనా జ్ఞానకాండల అనుష్ఠానం, పరలోక ప్రాప్తికొరకు చేస్తున్న వారు అజ్ఞానులు. పరలోకమే లేనపుడు దాన్ని ఆశించటం మూర్ఖత్వం. ఎందుకంటే -

అగ్నిహోత్రం త్రయో వేదా స్త్రిదండం భస్మగుంఠనమ్ ।
బుద్ధిపౌరుషహీనానాం జీవికేతి బృహస్పతిః ॥ స. ద. చార. ద ॥

'అగ్నిహోత్రం, త్రివేదాలు, త్రిదండం, భస్మలేపనం' అనే వాటిని బుద్ధిహీనులు, పురుషార్థరహితులైనవారు జీవికగా ఏర్పాటుచేసుకున్నారని ముండ్లు గ్రుచ్చుకోవటానికి మొదలైనవాని వలన కలిగే దుఃఖం నరకమనీ. లోకప్రసిద్ధుడైన రాజే పరమేశ్వరుడనీ, శరీరనాశనమే మోక్షమనీ, ఇంతకన్న మరేమీ లేదనీ చార్వాక మతప్రచారకుడైన బృహస్పతి నొక్కి వక్కాణిస్తున్నాడు.

జవాబు:- విషయభోగం వలన సుఖం మాత్రమే పురుషార్థఫలమని, విషయాలవలన కలుగు దుఃఖాలనుండి తొలగటమే కృతకృత్యత అని, స్వర్గప్రాప్తి అని భావించుట మూర్ఖత్వమవుతుంది. అగ్నిహోత్రాది యజ్ఞాలవలన వాయుశుద్ధి. వృష్టిజలశుద్ధి కలుగుతుంది. వాటిద్వారా ఆరోగ్యంకలిగి ధర్మార్థకామమోక్షాలు సిద్ధిస్తాయి. వీటిని తెలుసుకోక వేదాన్ని, ఈశ్వరున్ని, వేదోక్త ధర్మాన్ని నిందించటం ధూర్తకృత్యం. త్రిదండనాన్ని, భస్మధారణను ఖండించటం బాగానే ఉన్నది. ముల్లు మొదలైన వాటివలన కలిగే దుఃఖమే నరకమయితే అంతకంటే అధికాలైన మహారోగాలు ఎలా నరకాలు కావు? ఐశ్వర్యవంతుడై ప్రజాపాలన సమర్థుడవటం వలన రాజును శ్రేష్ఠుడనటం ఉచితమే. కాని అన్యాయకారీ పాపీ అయిన రాజును కూడా పరమేశ్వరునిగా భావిస్తే మీవంటి మూర్ఖులెవ్వరూ ఉండరు. కేవలం శరీరవిచ్ఛేదమే అనగా శరీరం నండి విడిపోవటమే మోక్షమైతే కుక్క గాడిద మొదలైన వానికీ మీకూ గల భేదమేమి? ఆకృతిభేదం తప్ప వేరొకటి కాదుగదా?

చార్వాకుడు:- **అగ్నిరుష్ణో జలం శీతం శీతస్పర్శస్తథానిలః ।**
కేనేదం చిత్రితం తస్మాత్ స్వభావా త్తద్వ్యవస్థితిః ॥ 1 ॥
॥ సర్వదర్శన సంగ్రహే చార్వాక దర్శనం ॥

అగ్ని 'ఉష్ణం', జలం, 'శీతం' అలాగే అనిలం 'శీతస్పర్శం' కలది. ఈ విచిత్రం ఎవనితో చిత్రించబడింది? కావున దీని ఈ వ్యవస్థితి స్వభావం వల్లనే కలిగినది. చార్వాకులు, ఆభాణకులు, బౌద్ధులు, జైనులు సహితం జగదుత్పత్తిస్వాభావికమని నమ్ముతున్నారు. స్వాభావికాలై ఉన్న అయా గుణాలతో ద్రవ్యాల సంయోగం వలన సకల పదార్థాలు కలుగుతున్నాయి. జగత్కర్త ఎవ్వడూ లేడు. వీరిలోని చార్వాకుడు ఇలా నమ్ముతున్నాడే కాని బౌద్ధులు, జైనులు పరలోకాన్ని, జీవాత్మను

ఒప్పుకొంటున్నారు. చార్వాకుడు ఒప్పుకోడు. కొన్ని విషయాలలో తప్ప తక్కిన విషయాలలో ఈ ముగ్గురి మతం ఒక్కటే.

న స్వర్గో నాపవర్గో వా నైవాత్మా పారలౌకికః ।
నైవ వర్ణాశ్రమాదీనాం క్రియాశ్చఫలదాయికాః ॥ 2 ॥

స్వర్గం లేదు నరకం లేదు. పరలోకానికి వెళ్లే ఆత్మ లేదు. వర్ణాశ్రమానికి చెందిన క్రియలు ఫలదాయకాలు కావు.

పశుశ్చేన్నిహతః స్వర్గం జ్యోతిష్టోమే గమిష్యతి ।
స్వపితా యజమానేన తత్ర కస్మాన్న హింస్యతే ॥ 3 ॥

యజ్ఞంలో పశువును చంపేసి హోమం చేయటం వలన అది స్వర్గానికి వెళితే యజమానుడు తన తండ్రి మొదలైనవారిని చంపి హోమం చేసి వారిని ఎలా స్వర్గానికి పంపడు?

మృతానామపి జంతూనాం శ్రాద్ధం చేత్తృప్తికారణమ్ ।
గచ్ఛతామిహ జంతూనాం వ్యర్థం పాథేయకల్పనమ్ ॥ 4 ॥

చనిపోయిన జీవులకు శ్రాద్ధతర్పణాలు తృప్తికారకాలైతే, పరదేశాలకు పోవువారికి మార్గనిర్వాహార్థం అన్న వస్త్ర ధనాల నేలకొనిపోతారు? ఎందుకంటే, చనిపోయినవారి పేర అర్పణం చేయబడిన పదార్థాలు స్వర్గానికి చేరినట్లు, పరదేశం వెళ్లినవారికి వారి బంధువుల ఇంట్లోనే వారి పేర తర్పణం చేసినపోవా? ఇక్కడ చేరకున్న స్వర్గానికి ఎలా చేరగలదు?

స్వర్గస్థితా యదా తృప్తిం గచ్ఛేయు స్తత్ర దానతః ।
ప్రాసాదస్యోపరిస్థానా మత్ర కస్మాన్నదీయతే ॥ 5 ॥

మర్త్యలోకంలో దానం చేయటం వలన స్వర్గవాసులు తృప్తులయితే, క్రిందదానం చేసిన మేడపైన ఉన్న వాడేల తృప్తిని పొందకూడదు?

యావజ్జీవేత్సుఖం జీవే దృణం కృత్వా ఘృతం పిబేత్ ।
భస్మీభూతస్య దేహస్య పునరాగమనం కుతః ॥ 6 ॥

కావున బ్రతికి ఉన్నంతవరకు సుఖంగా బ్రతకాలి. ఇంటిలో పదార్థాలు లేకుంటే అప్పు చేసైనా సుఖపడాలి. అప్పు తీర్చాలని భయపడనవసరం లేదు. కారణం ఏమిటంటే తిని త్రాగిన శరీరం మరియు జీవుడు ఈ రెండూ తిరిగిరావు. ఇక అడిగేవాడెవడు? ఇచ్చేవాడెవడు?

యది గచ్ఛేత్పరం లోకం దేహాదేశ వినిర్గతః ।
కస్మాద్భూయో న చాయాతి బంధుస్నేహసమాకులః ॥ 7 ॥

కొందరు మరణసమయంలో 'జీవుడు పరలోకానికి వెళ్ళిపోతున్నాడు' అని అంటున్నారు. ఆ మాట అబద్ధం. ఎందుకంటే అది నిజమైతే స్వర్గానికి వెళ్లినవాడు మోహబద్ధుడై మళ్ళీ ఎలా ఇంటికి రాడు?

తతశ్చ జీవనోపాయో బ్రాహ్మణైర్విహిత స్త్విహ ।
మృతానాం ప్రేతకార్యాణి న త్వన్యద్విద్యతే క్వచిత్ ॥ ॥ 8 ॥

కాబట్టి బ్రాహ్మణులు దీనినంతా తమ జీవనోపాయం కోసం కల్పించి ఉన్నారు. దశగాత్రాది మృతకక్రియలను ఆచరించటం అంతా వారి జీవనోపాయం కొరకు ఏర్పాటు చేసుకొన్నవే.

త్రయో వేదస్య కర్తారో భండధూర్తనిశాచరాః ।
జర్భరీతుర్ఫరీత్యాది పండితానాం వచః స్మృతమ్ ॥ ॥ 9 ॥

వేదాలను రచించినవారు, భాండ, ధూర్త, నిశాచరులను ముప్పురు రాక్షసులు. 'జర్భరీతుర్ఫరీ' లాంటి పండితులు కల్పించిన ధూర్తాలాపాలు.

అశ్వస్యాత్ర హి శిశ్నం తు పత్నీ గ్రాహ్యం ప్రకీర్తితమ్ ।
భండై స్తద్వత్పరం చైవ గ్రాహ్యజాతం ప్రకీర్తితమ్ ॥ ॥ 10 ॥

ధూర్తుల రచనలను చూడండి. అశ్వలింగాన్ని స్త్రీ గ్రహణం చేయాలని, దానితో యజమాని భార్య సంగమం చేయాలని చెప్పడం ఇలాంటి మాటలు ధూర్తులు కాక మరెవరు వ్రాస్తారు?

మాంసానాం ఖాదనం తద్వ న్నిశాచరసమీరితమ్ ॥ ॥ 11 ॥

ఇక మాంసం తినవచ్చని వ్రాసి ఉంటే వేదభాగం కూడా రాక్షసులతో రచించబడినదే.

జవాబు:- చైతన్యుడైన పరమేశ్వరుడు నిర్మాణం చేయకుంటే జడ పదార్థాలు స్వాభావికంగా తమంతట తాము నియమపూర్వకంగా కలిసి ఉత్పన్నం కాలేవు. స్వాభావికంగానే ఏర్పడితే మరొక సూర్యుడు, చంద్రుడు, పృథివి, నక్షత్రాది లోకాలు తమంతట తామే కలుగవు? ॥ 1 ॥

'సుఖానుభవానికి స్వర్గం, దుఃఖానుభవానికి నరకం' అని పేరు. జీవాత్మయే లేకుంటే సుఖదుఃఖాలను ఎవరు అనుభవించగలుగుతారు? ఈ జన్మలో జీవుడు సుఖదుఃఖాలను ఎలా అనుభవిస్తున్నాడో అలాగే పరజన్మలో కూడా అనుభవిస్తాడు. వర్ణాశ్రమ ధర్మాలలో సత్యభాషణం, పరోపకారం మొదలైన క్రియలు కూడా నిష్ఫలాలేనా? ఎన్నటికీ కాలేవు. ॥ 2 ॥

పశువులను చంపి హోమం చేయుమని వేదాది సత్య శాస్త్రాలలో ఎక్కడా కూడా వ్రాయబడలేదు. చనిపోయిన వారికి శ్రాద్ధతర్పణాలను చేయటం కపోలకల్పితమే. ఇది వేదాది సచ్ఛాస్త్రాలకు విరుద్ధం. భాగవతాది పురాణాలలో వ్రాయబడిన మతం కావున ఇలాంటి నియమాలు ఖండించదగినవే. ॥ 3-4-5 ॥

ఏ వస్తువు కలదో దానికి అభావం ఎన్నడూ కలుగదు. విద్యమానుడై అస్తిత్వం గల జీవునికి అభావం కలుగదు. దేహం భస్మమైపోతుందే కాని జీవుడు కాడు. జీవుడు మరొక శరీరంలో ప్రవేశిస్తాడు. కావున ఎవరు ఋణాలు చేసి పరపదార్థాలతో ఈ లోకంలో సుఖం అనుభవించి మళ్ళీ ఆ ఋణం తీర్చరో వారు నిశ్చయంగా పాపాత్ములై పరజన్మలో దుఃఖరూప నరకం అనుభవిస్తారు. ఇందు సందేహం ఏమీ లేదు. ॥ 6 ॥

జీవుడు దేహం నుండి వెళ్ళి స్థానాంతరాన్ని అంటే మరొక శరీరాన్ని పొందుతాడు. కావున మరల అదే కుటుంబంలోకి రాలేదు. వానికి పూర్వజన్మ యొక్క పూర్వ కుటుంబాల జ్ఞానమేమీ ఉండదు. ॥ 7 ॥

బ్రాహ్మణులు ప్రేతకర్మలను తమ జీవికార్థం ఏర్పర్చుకొని ఉన్నారనటం నిజమే. కాని, అవి వేదోక్తాలు కానందున ఖండించదగినవే. ॥ 8 ॥

చార్వాకులు వేదాది సత్యశాస్త్రాలను చూసి, విని, చదివి ఉంటే వేదాలను ఎన్నడూ దూషించేవారు కాదు కదా! భాండధూర్త నిశాచరుల వంటి పురుషులు వేదాలను రచించారని నిందించరు కదా! వ్యాఖ్యానాలు వ్రాసిన మహీధరాదులే నిజంగా భాండధూర్త నిశాచరులవంటివారు. వారి ధూర్తత్వమే కాని వేదాలలో ఇలా లేదు.

అయ్యో! ఈ చార్వాకులు, ఆభాణకులు, బౌద్ధులు, జైనులు నాల్గు వేదాల మూల సంహితలను కూడా వినలేదు. చూడలేదు. ఒక విద్వాంసుని వద్దనయినా చదువుకోలేదు కదా. కాబట్టే నష్ట భ్రష్ట బుద్ధికలవారై నిరర్థకంగా వేదాలను దూషించారు దుష్టులైన వామమార్గీయుల ప్రమాణ శూన్యాలైన కపోల కల్పితాలైన భ్రష్ట టీకలను పొంది వేదవిరోధులై అవిద్యారూపమైన అగాధ సముద్రంలో పడి మునిగారు కదా! ॥ 9 ॥

అశ్వలింగాన్ని స్త్రీతో గ్రహింపజేసి దానితో సమాగమం చేయించటం, యజమానికుమార్తెతో పరిహాసాలు చేయటం, వామమార్గీయుల పనే కాని ఇతర మానవుల పని కాదు. ఈ మహా పాపిష్ఠులైన వామమార్గీయులు తప్ప వేదార్థానికి విపరీతమైన భ్రష్టాశుద్ధ వ్యాఖ్యానాలను ఎవరు వ్రాసి ఉంటారు? చార్వాకులు కొంచెమైన ఆలోచించకే వేదాలను దూషించి ఉండటం కడు విచారకరం. కొంచెమైన తమ బుద్ధిని ఉపయోగించవలసి ఉన్నది గదా! పాపం వారేమి చేస్తారు? వారిలో సత్యాసత్యాలు పరిశీలించి సత్యమండనాన్ని అసత్య ఖండనాన్ని చేసేటంతటి విద్య, యుక్తి లేదు. ॥ 10 ॥

ఇక మాంసం తినవచ్చు అనేది ఆ వామమార్గీయులైన టీకాకారుల లీలయే. దీనిని బట్టి వారిని రాక్షసులనటం ఉచితం. కాని వేదాలలో ఎక్కడ కూడా మాంసం తినవచ్చని వ్రాయబడలేదు. కావున ఇలాంటి అబద్ధపు మాటలు వ్రాసిన పాపం ఆ టీకాకారులకు, వేదాన్ని కనక, వినక ఇష్టం వచ్చినట్లు దూషించిన నిందకులకు నిస్సందేహంగా కలుగుతుంది.

వాస్తవంగా వేదవిరోధులంటే, వేదాలను దూషించినవారు, దూషించేవారు, దూషించబోయేవారు తప్పకుండా అవిద్యాంధకారం అనబడే దారుణదుఃఖాన్ని అనుభవించినా కొదవే అనవచ్చును. కాని వేదానుకూలంగా ప్రవర్తించటమే మానవులందరికీ సముచితం. ॥ 11 ॥

వామమార్గీయులు లేనిపోని అసత్యకల్పనలు చేసుకొని వేదాల పేర తమ ప్రయోజనాలను సిద్ధం చేసుకోవటానికి అంటే ఇష్టం వచ్చినట్లు మద్యపానం, మాంసభక్షణం, పరస్త్రీ గమనం మొదలైన దుష్కర్మలను ప్రవర్తింపజేయటానికి వేదాలకు కళంకం కలిగించారు. ఈ మాటలనే చూసి చార్వాకులు, బౌద్ధులు, జైనులు వేదాలను నిందింపసాగారు. వేరుగా ఒక వేదవిరుద్ధమైన అనీశ్వరవాదాన్ని -

నాస్తికమతాన్ని నడిపించారు. చార్వాకులు వేదాలలోని మూలార్థాలను విచారించి తెలుసుకొంటే ఈ అసత్యపు టీకలను చూసి సత్యమైన వేదోక్తమతానికి దూరమై ఎలా వంచితులవుతారు. పాపం వారేమి చేయగలరు? **'వినాశకాలే విపరీత బుద్ధిః'** (చా.నీ. అ. 16 శ్లో.5) అన్నట్లు నష్టభ్రష్టులు కానున్న సమయం చేరువైనపుడు మానవుల బుద్ధులు విపరీతంగా ప్రవర్తిస్తాయి.

చార్వాక భేదం

ఇప్పుడు చర్వాకులలో గల భేదాలు వ్రాస్తున్నాము. ఈ చార్వాకులు అనేక విషయాలలో ఒక్కటిగా ఉన్నారు. కాని చార్వాకులు దేహోత్పత్తితోటే జీవోత్పత్తిని, తన్నాశంతో జీవుని నాశనాన్ని ఒప్పుకొంటున్నారు. పునర్జన్మను, పరలోకాన్ని అంగీకరించరు. ఒక ప్రత్యక్ష ప్రమాణాన్ని తప్ప తక్కిన అనుమానాది ప్రమాణాలను కూడా వారు అంగీకరించరు.

చార్వాక శబ్దార్థం

"మాట్లాడటంలో ప్రగల్భుడనీ, అందంగా మాట్లాడువాడనీ విశేషార్థాన్ని వైతండికుడనీ కలదు".

ఇక బౌద్ధులు, జైనులు ప్రత్యక్షాది నాలుగు ప్రమాణాలను, అనాది జీవులను పునర్జన్మను, పరలోకాన్ని, మోక్షాన్ని కూడా ఒప్పుకొంటున్నారు. చార్వాకులకు, బౌద్ధ, జైనులకు గల భేదం ఇంతే. కాని నాస్తికత్వం, వేదేశ్వరుల నింద, పరమత ద్వేషం, "ఆరు యత్నాలు, జగత్కర్త ఎవ్వడూ లేడనటం" అనే విషయాలలో అందరూ సమానులే. ఇలా చార్వాకమతాన్ని సంక్షిప్తంగా ప్రకటించాను.

బౌద్ధమతం

ఇక బౌద్ధమత విషయం సంక్షేపంగా వ్రాస్తున్నాను

కార్యకారణభావాద్వా స్వభావాద్వా నియామకాత్ ।
అవినాభావనియమో దర్శనాంతరదర్శనాత్ ॥ సర్వదర్శనసంగ్రహం. బౌద్ధ దర్శనం ॥

కార్యకారణ భావమంటే కార్యదర్శనంతో కారణం, కారణ దర్శనంతో కార్యాల సాక్షాత్కారాన్ని, ప్రత్యక్షాన్ని బట్టి శేషమునందు అనుమానం కలుగుతున్నది. దీన్ని అంగీకరించక జీవుల సమస్త వ్యవహారాలు పూర్ణాలు కాలేవు. ఇలాంటి లక్షణాలలో అనుమానం అధికంగా అంగీకరించి, చార్వాకుల కంటే భిన్నంగా ఏర్పడిన శాఖ బౌద్ధులది.

బౌద్ధులలో నాలుగు భేదాలు

నాలుగు విధాలుగా బౌద్ధులు కలరు. ఒకరు **'మాధ్యమికులు'**. రెండవవారు **'యోగాచారులు'**. మూడవవారు **'సౌత్రాంతికులు'**. నాల్గవవారు **'వైభాషికులు'**. **'బుద్ధ్యా నిర్వర్తతే స బౌద్ధః'** బుద్ధితో సిద్ధమైనది బౌద్ధం. అంటే తన బుద్ధికి తోచిన మాటలను ఒప్పుకోవాలనటం తమ బుద్ధికి తోచని మాటలను ఒప్పుకో కూడదనటం. వీరిలోని మొదటివారైన **'మాధ్యమికులు'** 'సర్వం శూన్యమే' అని

నమ్ముతున్నారు. అంటే ఎన్ని పదార్థాలు కలవో అవన్నీ శూన్యాలే. అంటే ఆదిలో లేవు. అంతమందు ఉండవు. మధ్యకాలంలో ప్రతీతమైనదీ ప్రతీతకాలమందే ఉంటుంది. తర్వాత శూన్యమైపోతుంది. ఎలాగంటే ఉత్పత్తికి పూర్వం ఘటం లేదు. ప్రధ్వంసానంతరం ఉండదు. ఘట జ్ఞానసమయంలో ఉన్నట్లు తెలుస్తున్నది. ఇక అన్య పదార్థాల మీదికి మనస్సు పోయిన ఘట జ్ఞానం ఉండదు. కావున శూన్యమే ఒక తత్త్వమై ఉన్నది.

రెండవవారైన **'యోగాచారులు'** బాహ్య పదార్థాలన్నీ శూన్యమని నమ్ముతున్నారు. అంటే పదార్థాలు లోపల జ్ఞానంలో ఉన్నట్లు తెలుస్తున్నవే కాని బయట గావు. ఎలాగంటే ఘట జ్ఞానం ఆత్మలో ఉంటుంది. అపుడే కదా, 'ఇది ఘటము' అని మనుజుడు అంటున్నాడు. లోపల జ్ఞానమే లేకుంటే అలా చెప్పలేకపోతాడు.

మూడవవారైన **'సౌత్రాంతికులు'** లోపల పదార్థాలు ఉన్నాయి. కాని అవి అనుమానంతో తెలియబడును. కారణమేమిటంటే:- బయట ఏ పదార్థామూ సాంగోపాంగంగా ప్రత్యక్షం కాదు. కొంతభాగం మాత్రమే కనిపిస్తుంది. మిగిలినది అనుమానం వల్లనే తెలుస్తుందని వారి మతం.

నాల్గవవారైన **'వైభాషికులు'** పదార్థం బయట ప్రత్యక్షమవుతున్నదే గాని లోన కాదంటున్నారు. ఎలాగంటే **'అయం నీలో ఘటః'** ఈ నీలిరంగుతో కూడిన ఘటం యొక్క ఆకారం వెలుపలే ఉన్నది. లోపల లేదు అని వారి మతం.

వీరికి బుద్ధుడే గురువై ఉంటే శిష్యుల బుద్ధులలో భేదం కలిగి నాలుగు విధాల శాఖలు ఏర్పడేవికావు. సూర్యుడస్తమించిన తరువాత జారపురుషుడు పరస్త్రీ గమనాన్ని, విద్వాంసుడు సత్యభాషణాది సత్కర్మలను పొందే సమయం ఒక్కటే కాని తమ తమ బుద్ధి ప్రకారంగా భిన్న భిన్న చేష్టలు నేర్చుకుంటారు. ఇక పైన చెప్పబడిన నలుగురిలో **'మాధ్యమికుడు'** సమస్తాన్ని క్షణికమంటున్నాడు. అంటే క్షణక్షణమందు బుద్ధి పరిణామాన్ని పొందటంవలన పూర్వక్షణంలో తెలుసుకోబడిన వస్తువులు ఉత్తరక్షణంలో అలా ఉండదు. కావున అన్నింటిని క్షణికాలని ఒప్పుకోవాలని చెబుతున్నాడు.

రెండవ వాడైన **'యోగాచారుడు'** 'ప్రవృత్తి అంతా దుఃఖరూపమే అవుతుంది. ఎందుకంటే ప్రాప్తిలోనే ఎవడు కూడా సంతుష్టుడుగా ఉండడు. ఒకటి లభించిన మరొక దాని కోరిక ఉండే తీరుతుందని' నమ్ముతున్నాడు.

మూడవవాడైన **'సౌత్రాంతికుడు'** పదార్థాలన్నీ తమతమ లక్షణాలతో లక్షితాలౌతున్నాయి. ఎలాగంటే గోచిహ్నాలతో గోవు, ఘోటక చిహ్నాలతో ఘోటకం – గుర్తుం తెలియబడినట్లే లక్షణం లక్ష్యంలోనే ఎల్లప్పుడుంటుంద'ని చెబుతున్నాడు.

నాల్గవవాడైన **'వైభాషికుడు'** శూన్యాన్నే ఒక పదార్థమని నమ్ముతున్నాడు. సమస్తాన్ని శూన్యమని నమ్ముతున్న మొదటి మాధ్యమికుని పక్షాన్నే ఈ వైభాషికుడును పూనియున్నాడు. ఈ విధంగా ఈ బౌద్ధులలో అనేక వివాదాస్పదాలైన పక్షాలు కలవు. ఇలాగే నాలుగు విధాల భావనలను నమ్ముతున్నారు.

బౌద్ధమత సమీక్ష

జవాబు:- అంతా శూన్యమైతే శూన్యాన్ని తెలుసుకొనేవాడు శూన్యం కాలేడు. అంతా శూన్యమే అయితే శూన్యాన్ని శూన్యం తెలుసుకోలేకపోతుంది. అందువలన శూన్యాన్ని తెలుసుకొనేవాడు శూన్యమెన్నడూ కాలేడు. కావున శూన్యాన్ని తెలుసుకొనే జ్ఞాత, అతనితో తెలుసుకోబడే జ్ఞేయం శూన్యాలు కావు. కావున 'జ్ఞాత' - 'జ్ఞేయం' అనే రెండు పదార్థాలు ఉన్నాయని సిద్ధమవుతున్నది.

యోగాచార్యుడనేవాడు బాహ్య శూన్యతను అంగీకరిస్తే, హిమాలయ పర్వతాలు వానిలోపల ఉండాలి కదా. ఎవడైనా ఉన్నదంటే వారి హృదయంలో పర్వతం ఉండగలిగేటంతటి అవకాశం ఎక్కడ కలదు? కావున పర్వతం వెలుపల కలదు. పర్వతజ్ఞానం ఆత్మలో ఉంటుంది.

సౌత్రాంతికుడు ఏ పదార్థాన్నీ ప్రత్యక్షమని అంగీకరించడు. కాబట్టి అతడు అతనివచనాన్ని కూడా అనుమేయాలని అంగీకరించాలి కాని ప్రత్యక్షాలు కావు. ప్రత్యక్షమే లేని యెడల **'అయం ఘటః'** అనే ఈ ప్రయోగం చేయరాదు. కాని **'అయం ఘటైకదేశః'** ఇది ఘటం యొక్క ఏకదేశమని ఉండాలి. కదా! ఏకదేశానికి ఘటమని పేరు కాదు. కాని సముదాయానికి ఘటమని పేరు. **"ఇది ఘటం"** అన్నది ప్రత్యక్షం. అనుమేయం కాదు. ఎందుకంటే అవయవాలన్నింటిలో అవయవి ఒక్కటే. అది ప్రత్యక్షమైన ఘటావయవములన్నీ ప్రత్యక్షాలవుతాయి. అంటే సావయవమైన ఘటం ప్రత్యక్షమవుతున్నదని తెలుసుకోవాలి.

ఇక నాల్గవవాడైన వైభాషికుడు 'బాహ్య పదార్థాలను ప్రత్యక్షా'లని అంగీకరిస్తున్నాడు. అది కూడా సరికాదు. ఎందుకంటే ఎక్కడ జ్ఞాత, జ్ఞానం ఉంటుందో అక్కడనే ప్రత్యక్షమవుతున్నది. ప్రత్యక్షానికి విషయం బయట ఉంటే తదాకార జ్ఞానము ఆత్మకు కలుగుతున్నది.

పదార్థం క్షణికమై దాని జ్ఞానం క్షణికమైతే 'ప్రత్యభిజ్ఞ' కలుగదు. అంటే 'నేను ఆ విషయాన్ని మాట్లాడాను' అనే ఇలాంటి స్మరణం కలుగలేదు. కాని లోకంలో పూర్వం చూసింది విన్నది స్మరణకు వస్తుంది. కావున క్షణిక వాదం కూడా సరైనది కాదు. దుఃఖమే. సుఖమేమీ లేదు. అంటే సుఖాన్ని ఆపేక్షించక దుఃఖం సిద్ధించదు. ఎందుకంటే రాత్రిని అపేక్షించి దినం, దినము నపేక్షించి రాత్రి కలుగుతున్నాయి. కావున అంతా దుఃఖమే అనటం సరికాదు.

స్వలక్షణం మాత్రమే అంగీకరించిన నేత్రం రూపానికి లక్షణం, రూపం లక్ష్యం. ఎలాగంటే ఘటరూపాన్ని లక్ష్యంలో కంటే, ఘటరూపానికి లక్షణమైన చక్షువు భిన్నం. గంధగుణం పృథ్వికి అభిన్నం. ఈ ప్రకారమే లక్ష్యలక్షణాలు భిన్నా భిన్నాలని ఒప్పుకోవాలి.

శూన్యాన్ని గురించి ఇంతకుముందే సమాధానమీయబడింది. అంటే శూన్యాన్ని తెలుసుకొనేవాడు శూన్యం కంటే భిన్నుడై ఉంటాడు.

సర్వస్య సంసారస్య దుఃఖాత్మకత్వం సర్వతీర్థంకరసంమతమ్ ॥ సర్వ. ద. సం. బౌ. ద ॥

సర్వజగత్తు దుఃఖమయమని తీర్థంకరుల మతం.

ఎవరిని బౌద్ధులు తీర్థంకరులని నమ్ముతారో వారినే జైనులు నమ్ముతున్నారు. కావున ఈ ఉభయులును ఒక్కటే. పూర్వోక్తమైన 'భావనచతుష్టయం' అంటే నాలుగు భావనలతో సమస్త వాసనల నివృత్తి అవటం వలన శూన్యరూప నిర్వాణం అంటే ముక్తి కలుగుతుందన్నారు.

గురువుల వచనాలను ప్రమాణాలుగా భావించి అనాదియైన బుద్ధియందు వాసనలు ఉండుటం వలన బుద్ధి అనేక రకాలుగా అనిపిస్తుంది. ఈ విధముగా గురువులు తమ శిష్యులకు ఉపదేశిస్తారు. అందులో ఈ క్రింద వ్రాయబడిన ఐదు స్కంధాలు కలవు.

రూపవిజ్ఞాన వేదనాసంజ్ఞా సంస్కార సంజ్ఞకః ॥ సర్వ. ద. సం. బౌ. ద ॥

మొదటిది:– ఇంద్రియాల ద్వారా రూపాది విషయాలు గ్రహింపబడటం 'రూపస్కంధం'.

రెండవది:– ఆలయ విజ్ఞానం ప్రవృత్తిని తెలుసుకోవటం అనే వ్యవహారం 'విజ్ఞాన స్కంధం'.

మూడవది:– రూపస్కన్దం, విజ్ఞాన స్కంధం అనే వాటి వలన కలిగిన సుఖదుఃఖాల ప్రతీతి అనే వ్యవహారం 'వేదనా స్కంధం'.

నాల్గవది:– గోవు మొదలైన సంజ్ఞల సంబంధం నామధారి (పదార్థం–సంజ్ఞి)తో అంగీకరించటం 'సంజ్ఞాస్కంధం'.

ఐదవది:– వేదనాస్కంధంలో కలిగే రాగద్వేషాది క్లేశాలు, ఆకలిదప్పికలు మొదలైన ఉపక్లేశాలు, మదం, ప్రమాదం, అభిమానం, ధర్మాధర్మాలు 'సంస్కార స్కంధం' అని నమ్ముతున్నారు.

సర్వస్య సంసారస్య దుఃఖాత్మకత్వం సర్వతీర్థంకర సమ్మతమ్ ॥ బౌద్ధ దర్శనం ॥

సమస్త సంసారాన్ని దుఃఖమనీ, దుఃఖ గృహమనీ, దుఃఖసాధనమనీ భావించి సంసారం నుండి వెళ్ళిపోవాలని బౌద్ధులంటారు. ఇక చార్వాకులు వీనినే కాక ముక్తిని, అనుమానాన్ని, జీవులను కూడా నమ్మరు.

తీర్థంకరులు - ద్వాదశాయతన పూజ

దేశనా లోకనాథానాం సత్వాశయవశానుగాః ।
భిద్యన్తే బహుధా లోకే ఉపాయైర్బహుభిః కిల ॥ 1 ॥ సర్వ. ద. సం. బౌ. ద ॥

జ్ఞానులు, విరక్తులు, జీవన్ముక్తులు, లోకనాథులు, బుద్ధుడు మొదలగు తీర్థంకరులు బోధించిన పదార్థాల స్వరూపాలను గ్రహించి, భిన్న భిన్న విషయాలను ప్రతిపాదించే ఉపదేశకుడు అనేక భేదాలతోనూ, అనేకోపాయాలతోనూ చెప్పినవానిని అంగీకరించాలి.

గంభీరోత్తానభేదేన క్వచిచ్చోభయ లక్షణా ।
భిన్నా హి దేశనా భిన్నా శూన్యతాఽ ద్వయలక్షణా ॥ 2 ॥ సర్వ. ద. సం. బౌ. ద ॥

అతి గంభీర ప్రసిద్ధ భేదాలతో కొన్ని చోట్ల గుప్తంగాను, కొన్ని చోట్ల ప్రకటంగాను, పూర్వం చెప్పబడిన శూన్య లక్షణయుక్తాలైన వేర్వేరు గురువుల ఉపదేశాలను అంగీకరించాలి.

ద్వాదశాయతనపూజా శ్రేయస్కరీతి బౌద్ధా మన్యంతే:-

అర్థానుపార్జ్య బహుశో ద్వాదశాయతనాని వై ।
పరితః పూజనీయాని కిమన్యైరిహ పూజితైః ॥ 3 ॥ సర్వ. ద. సం. బౌ. ద ॥

ద్వాదశాయతనపూజయే మోక్షదాయకమైనది. ఆ పూజ కొరకు అనేక ద్రవ్యాది పదార్థాల గురించి ద్వాదశాయతనం - పనెడు విధాలైన స్థాన విశేషాలను నిర్మించుకొని అన్ని విధాలా పూజించాలి. ఇతరులని పూజించిన ఏమి ప్రయోజనం?

జ్ఞానేంద్రియాణి పంచైవ తథా కర్మేంద్రియాణి చ ।
మనో బుద్ధిరితి ప్రోక్తం ద్వాదశాయతనం బుధైః ॥ 4 ॥ సర్వ. ద. సం. బౌ. ద ॥

వీరి 'ద్వాదశాయతన పూజ' ఏమిటంటే - అయిదు జ్ఞానేంద్రియాలు - శ్రోత్రత్వక్చక్షుజిహ్వాఘ్రాణాలు అంటే చెవులు, చర్మం, కన్నులు, నాలుక, ముక్కు ఐదు కర్మేంద్రియాలు వాక్, హస్త, పాద, పాయు, ఉపస్థలు మనస్సు, బుద్ధి ఈ పన్నెండు ఇంద్రియాలను బాగా సత్కరించటం. అంటే వీనిని ఆనందంలో ప్రవర్తింపజేయటం మొదలైనవి బౌద్ధుల మతం.

దుఃఖరూప ప్రపంచంలో ప్రవృత్తి ఎందుకు?

జవాబు:- సంసారమంతా దుఃఖరూపమైతే ఏ జీవునికి కూడా ఇందులో ప్రవృత్తి కలుగకూడదు. సంసారంలో జీవుల ప్రవృత్తి ప్రత్యక్షంగా కనపడుతున్నది. కావున సంసారమంతా దుఃఖరూపం కాదు. కాని ఇందు సుఖదుఃఖాలు రెండూ కలవు. ఇదే బౌద్ధుల సిద్ధాంతమైతే అన్నపానాలను అనుభవిస్తే పథ్యంచేసి ఔషధాలు మొదలైనవాటిని సేవిస్తూ శరీర రక్షణలో ప్రవృత్తులై సుఖం ఎలా పొందుతున్నారు? మేమూ ప్రవృత్తులమవుతున్నాము. కాని దాన్ని దుఃఖమనే భావిస్తున్నామంటే ఆ మాటే సంభవం కాదు. ఎందుకంటే జీవుడు సుఖమని తెలుసుకొని ప్రవృత్తుడు, దుఃఖమని భావించి నివృత్తుడగువుతున్నాడు. ప్రపంచంలో ధర్మాచరణం, విద్య, సత్సంగము మొదలగు శ్రేష్ఠ వ్యవహారాలన్నీ సుఖకారకాలు. బౌద్ధులు తప్ప వీటిని ఏ పండితుడూ దుఃఖకారణాలుగా అంగీకరించడు.

పంచ స్కంధాలు కూడా పూర్తిగా అపూర్ణాలే. ఎలాంగంటే ఇలాంటి స్కంధాలను విచారించడం మొదలుపెడితే ఒక్కొక్కదానికి అనేక భేదాలు కలగవచ్చు.

ఈ తీర్థంకరులను ఉపదేశకులనీ, లోకనాథులనీ అంగీకరిస్తున్నారు. అయితే, వారు నాథులకు నాథుడైన అనాది అయిన పరమాత్మను అంగీకరించరు కదా, మరి ఆ తీర్థంకరులు ఎవరి నుండి ఉపదేశాన్ని పొందారు? స్వయంగానే ప్రాప్తించింది అంటే ఆ మాట సంభవం కాదు. ఎందుకంటే, కారణం లేకుంటే కార్యం కాలేదు. పోనీ వారి కథనానుసారం అలాగే అయితే ఇప్పుడు కూడా చదువక చదివించక, వినక వినిపించక, జ్ఞానుల సహవాసం చేయక, జ్ఞానులేల కారు? అలా కానప్పుడు ఇలా అనడం సర్వథా నిర్మూలం. యుక్తిశూన్యమైన సన్నిపాత రోగగ్రస్తుని మాటలకు సమానమవుతుంది.

శూన్యరూపమే బౌద్ధుల అద్వైతోపదేశమైన, విద్యమానమైన పదార్థం ఎన్నడూ శూన్యరూపం కాలేదు. కాని సూక్ష్మమైన కారణ రూపాన్ని పొందగలదు. కావున ఈ కథనం కూడా భ్రమరూపమై ఉన్నది.

ద్వాదశాయయతన పూజ ముక్తి కాదు - భోగం

ద్రవ్యాలను అర్జించి పూర్వోక్తద్వాదశాయతన పూజ చేయటమే మోక్షసాధనమైతే పది ప్రాణాల 11వ జీవాత్మను ఎలా పూజించరు? ఇంద్రియాంతఃకరణాల పూజే మోక్షప్రదమైతే ఈ బౌద్ధులకు కాముక పురుషులలో గల భేదమేమిటి? బౌద్ధులు వాటి నుండి తప్పించుకోకపోతే వారికి ముక్తి ఎక్కడిది? ఇట్టి విషయాలున్నచోట ముక్తితో ప్రయోజనమేమి? భళా! వీరి అవిద్యకు - అజ్ఞానానికి సాటి వీరిలో తప్ప ఇతరులలో కనబడదు.

వీరు వేదాలను, ఈశ్వరుణ్ణి వ్యతిరేకించటం వలన తగిన ఫలితమే లభించిందని నిశ్చయించవలసి వస్తున్నది. వీరు మొదట ప్రపంచమంతా దుఃఖరూపమని భావించారు. మధ్యలో ద్వాదశాయతనపూజలో ఎందుకు పడిపోయారు? వీరి ద్వాదశాయతనపూజ ప్రపంచంలోని పదార్థాల కంటే వేరైనదా వీరికి ముక్తి నిచ్చుటకు?

ఒకడు కన్నులు మూసుకొని రత్నాలను వెతకదలచి వెతికినా అవి ఎప్పుడైనా లభించగలవా? వేదాలను, ఈశ్వరున్ని అంగీకరించకపోవడం వలన వీరి దశ ఇలా అయ్యింది. ఇప్పటికైనా సుఖం కావాలని కోరుకుంటే వేదేశ్వరులని ఆశ్రయించి తమ జన్మలను సఫలం చేసికోవచ్చును.

వివేకవిలాసంలోని బౌద్ధ సిద్ధాంతాలు

'వివేక విలాసం' అనే గ్రంథం (అష్టమవిలాస)లోని బౌద్ధుల సిద్ధాంతం ఇలా వ్రాయబడింది.

బౌద్ధానాం సుగతో దేవో విశ్వం చ క్షణభంగురమ్ ।
ఆర్యసత్త్వాఖ్యయా తత్త్వచతుష్టయమిదం క్రమాత్ ॥ 1 ॥

బౌద్ధులకు సుగతదేవుడైన పూజనీయ బుద్ధభగవానుడు, క్షణభంగురమైన జగత్తు, ఆర్యులైన స్త్రీ పురుషులు, తత్త్వాల సంజ్ఞాది ప్రసిద్ధి అనే ఈ నాలుగు తత్త్వాలు బౌద్ధులకు మంతవ్యాలైన పదార్థాలు.

దుఃఖమాయతనం చైవ తతః సముదయో మతః ।
మార్గశ్చేతస్య చ వ్యాఖ్యా క్రమేణ శ్రూయతామతః ॥ 2 ॥

ఈ విశ్వాన్ని లేదా శరీరాన్ని దుఃఖాలకు గృహమనుకోవాలి. తదనంతరం రాగాల ఉత్పత్తి కలుగుతుంది. క్రమంగా వీని వ్యాఖ్యను వినండి.

దుఃఖం సంసారిణః స్కంధాస్తే చ పంచ ప్రకీర్తితాః ।
విజ్ఞానం వేదనా సంజ్ఞా సంస్కారో రూపమేవ చ ॥ 3 ॥

సంసారంలో దుఃఖమే కలదు. పూర్వం చెప్పబడిన పంచ స్కంధాలను తెలుసుకోండి.

కృత్తిః కమండలు ర్మౌండ్యం చీరం పూర్వాహ్ణ భోజనమ్ ।
సంఘో రక్తాంబరత్వం చ శిశ్రియే బౌద్ధభిక్షుభిః ॥ 11 ॥ స. ద. సం. బౌ. ద ॥ 46,47 పుటలు

'మృగాల చర్మం, కమండలం, వెం(ట్రు)కలను కొరిగించటం, వల్కల వస్త్రం, పూర్వాహ్ణం అంటే 9 గంటలకు భోజనం, ఒంటరిగా ఉండకపోవటం, రక్తవస్త్రధారణం' అనేవి బౌద్ధసాధువుల వేషాలు.

క్షణికవాద దోషాలు

జవాబు:- బౌద్ధులకు సుగతుడనే బుద్ధుడే దేవుడైన అతనికి గురువెవడున్నాడు? విశ్వం క్షణభంగురమన్న 'పూర్వం ఎన్నడో చూసిన వస్తువుని ఇప్పుడు మరల చూసినచో ఇది అదే' అని, చిరదృష్ట పదార్థ జ్ఞాపకం ఉండకూడదు. మరి క్షణభంగురమైతే ఆ పదార్థమే ఉండకుండును. ఇక దేని జ్ఞాపకముండును?' క్షణికవాదమే బౌద్ధులమార్గమైతే, వీరి మోక్షం కూడా క్షణభంగురమే అవుతుంది.

జ్ఞానయుక్తార్థమే ద్రవ్యమైన జడవస్తువులో కూడా జ్ఞానం ఉండాలి. అందుకే జ్ఞానంలో అర్థం ప్రతిబింబం లాగా ఉంటుంది. అంతర్జ్ఞానంలో ద్రవ్యముంటే అది బాహ్యంలో ఉండలేదు. ఇక దేని మీద అది చలనం మొదలుగాగల క్రియలు చేయును? మంచిది. బయట కనపడేది మిథ్య ఎలా కాగలదు? బుద్ధికి ఆకారం కలదంటే అది దృశ్యం కావాలి. 'కేవలం జ్ఞానమే హృదయంలో ఆత్మస్థమై ఉండుననీ, బాహ్య పదార్థాలు జ్ఞానమాత్రాలే' అని అంగీకరించబడునేని, జ్ఞేయమనే పదార్థములేనిది జ్ఞానమే కలుగలేదు.

వాసనాచ్ఛేదమే ముక్తియైన సుషుప్తిలోనూ ముక్తిని ఒప్పుకోవాలి. ఇలా ఒప్పుకోవటం విద్యా విరుద్ధమై ఉన్నందుకు తిరస్కరింపదగియున్నది.

బౌద్ధమతస్థుల ఇలాంటి సంగతులు సంక్షేపంగా ప్రదర్శింపబడ్డాయి. ఇప్పుడు వీరి విద్య, వీరి మతం ఎలా ఉన్నాయో బుద్ధిమంతులు, విచారణశీలురు అయిన పురుషులు తెలుసుకోవాలి. దీనిని జైనులు కూడా అంగీకరిస్తున్నారు.

జైన మత వర్ణనము

ఇక జైనమతవర్ణనం చేయబడుతుంది. ప్రకరణ రత్నాకరం 1వ భాగం, నయచక్రసారంలో ఈ క్రింది విషయాలు వ్రాయబడి ఉన్నాయి -

బౌద్ధులు సమయసమయంలో నూతనంగా 1. ఆకాశం, 2. కాలం, 3. జీవులు, 4. పుద్గలం అనే ఈ నాలుగు ద్రవ్యాలను అంగీకరిస్తారు. మరి జైనులు **ధర్మాస్తి కాయం, అధర్మాస్తికాయం, ఆకాశాస్తి కాయం, పుద్గలాస్తి కాయం, జీవాస్తికాయం,** కాలం అనే ఈ ఆరు ద్రవ్యాలను అంగీకరిస్తారు. వీరిలోని కాలాన్ని అస్తికాయమని అంగీకరించరు. వారు కాలం ఉపచారంలో ద్రవ్యమై ఉన్నదే కాని వస్తుతః ద్రవ్యం కాదని చెబుతారు.

1. **ధర్మాస్తి కాయం:-** వీటిలో గతి పరిణామత్వంతో పరిణతిని పొందిన జీవుడు, పుద్గలాన్ని, సమీపంలో నుండి దాని గతిని స్తంభనచేసి హేతువును 'ధర్మాస్తికాయం' అంటున్నారు. అది ససంఖ్య ప్రదేశ పరిమాణాలలోను, లోకంలోనే వ్యాపకమై ఉన్నది.

2. **అధర్మాస్తికాయం:-** స్థైర్యంతో పరిణతిని పొందిన జీవపుద్గలముల స్థితికి ఆశ్రయమైన దానికి హేతువై ఉంటుంది.

3. **ఆకాశాస్తికాయం:-** సమస్త ద్రవ్యాలకు ఆధారభూతమై నిర్గమన, ప్రదేశ క్రియలను చేసే జీవపుద్గలములకు అవగాహన హేతువై, సర్వవ్యాపకమై ఉండునది.

4. **పుద్గలాస్తికాయం:-** కారణరూపంలో సూక్ష్మం, నిత్యం, ఏకరసం, వర్ణం, గంధం, స్పర్శం, కార్యలింగాన్ని నిండెడు కరగెడు స్వభావం కలదియై ఉండునది.

5. **జీవాస్తికాయం:-** చైతన్యజ్ఞాన లక్షణాలు కలిగి దర్శనమందు ఉపయుక్తమై, అనంత పర్యాయాలుగా పరిణామం పొందునది కర్తా భోక్తయై ఉన్నది.

6. **కాలం:-** పూర్వోక్తాలైన పంచాస్తికాయముల పరత్వాపరత్వ, నవీనత ప్రాచీనత్వాలకు చిహ్నరూపమై ప్రసిద్ధంగా వర్తమానరూపాలను పదార్థాలతో యుక్తమై ఉండునది. జీవపుద్గలముల స్థితికి ఆశ్రయమైన దానికి హేతువై ఉండునది.

సమీక్షకుడు:- బౌద్ధులు అంగీకరించిన నాల్గు ద్రవ్యములు ప్రతి సమయంలోనూ క్రొత్తవిగా అవుతాయనడం సత్యం కాదు. ఎలాగంటే ఆకాశం, కాలం, జీవులు, పరమాణువులు అనేవి క్రొత్తవిగాని, పాతవిగాని ఎన్నడూ కాలేవు. ఇవి ఆదిలేనివి. కారణరూపంలో నాశనం లేనివి. కావున నవీనత్వం, ప్రాచీనత్వం అనేది వీనిలో ఎలా సంభవమవుతుంది?

మరి జైనులు అంగీకరించే ఆరు ద్రవ్యాలు సరికాదు. ఎందుకంటే ధర్మాధర్మాలు ద్రవ్యాలు కావు. కాని గుణాలై ఉన్నాయి.

ఈ రెండూ జీవాస్తికాయంలోనే వస్తాయి. కావున ఆకాశము, పరమాణువులను, జీవులను, కాలాన్ని అంగీకరించటం సమంజసం.

వైశేషికంలో అంగీకరించబడిన తొమ్మిది ద్రవ్యాలే సరైనవి. ఏవంటే పృథివ్యాది పంచతత్త్వాలు. కాలం, దిక్కు, ఆత్మ, మనస్సు అనేవి తొమ్మిది వేరువేరు పదార్థాలుగా నిశ్చయించబడ్డాయి. జీవులను మాత్రం చైతన్యులుగా అంగీకరించి ఈశ్వరుని అంగీకరించకపోవటం జైన బౌద్ధుల మిథ్యా పక్షపాతయుక్తమైన కథనమే అవుతుంది.

సప్తభంగీస్యాద్ వాదం:- ఇక బౌద్ధులు, జైనులు అంగీకరించు సప్తభంగీస్యాద్వాదమును చూడండి.

1. 'సంఘటః' ఘటమున్నది. సత్తా కలిగినది. దీనిని ప్రథమభంగమంటారు. ఎందువల్లన్నంటే ఘటము తన వర్తమానత్వంతో కూడియున్నది. అంటే ఘటమున్నది. ఇది అభావాన్ని నిషేధిస్తున్నది.

2. 'అసంఘటః' ఘటము లేదు. మొదటి ఘటభావాన్ని బట్టి ఈ ఘటానికి అసద్భావము అనటం రెండవ భంగం.

మూడవ భంగం:- 'సన్న సన్న ఘటః' అంటే ఇది ఘటము. పటము కాదు. ఎందుకంటే ఆ రెండిటికంటే ఇది వేరు.

నాల్గవ భంగం:- 'ఘటోఽఘటః'. ఘటము - అఘటము. ఎట్లు 'అఘటః పటః' అఘటం పటము. రెండవ పటాభావం తనలో ఉండటంచేత ఘటము అఘటం అనబడింది. ఒక్కమాటుగానే దానికి ఘటమనీ, అఘటమనీ కూడా రెండు సంజ్ఞలు కలుగుతాయి.

అయిదవ భంగం:- ఘటాన్ని పటమనటం యోగ్యం కాదు. ఎందుకంటే దానిలోని ఘటత్వం వక్తవ్యం, పటత్వం అవ్యక్తవ్యమునై ఉన్నది.

ఆరవ భంగం:- అంటే ఘటమే లేకుంటే అది చెప్పబడటానికి యోగ్యమైనది కాదు. ఉన్నదన్నది ఏదున్నదో అది చెప్పబడటానికి యోగ్యమైనదనటం.

ఏడవ భంగం:- ఏది చెప్పటానికిష్టమైనదో అది లేదు. ఘటమని చెప్పటం కూడా యోగ్యం కాదు. ఇదియే సప్తమ భంగమనబడుతున్నది.

స్యాదస్తి జీవోఽయం ప్రథమో భంగః ॥ 1 ॥

స్యాన్నాస్తి జీవో ద్వితీయో భంగః ॥ 2 ॥

స్యాదవక్తవ్యోజీవ స్తృతీయో భంగః ॥ 3 ॥

స్యాదస్తి నాస్తి నాస్తి రూపో జీవశ్చతుర్థో భంగః ॥ 4 ॥

స్యాదస్తి (చ) అవక్తవ్యో జీవః పంచమో భంగః ॥ 5 ॥

స్యాన్నాస్తి (చ) అవక్తవ్యో జీవః షష్ఠో భంగః ॥ 6 ॥

స్యాదస్తినాస్తిచ అవక్తవ్యోజీవ ఇతి సప్తమో భంగః । 7 ॥

అంటే 1. 'జీవుడున్నాడు' అని అన్నపుడు జీవునికి విరుద్ధాలైన జడపదార్థాలు ఆ జీవునిలో లేవనే భంగం ప్రథమమనబడుతున్నది. ఇక జడంలో జీవంలేదని కూడా చెప్పబడటం కలదు. కావున ఇది రెండవ భంగమనబడుతుంది. జీవుడు కలడుకాని చెప్పడానికి వీలుకాదు. ఇది మూడవ భంగం.

జీవుడు శరీరాన్ని ధరించినపుడు ప్రసిద్ధుడుగాను, శరీరం నుండి వేరైనపుడు అప్రసిద్ధుడుగాను ఉంటాడని చెప్పబడింది గదా! దీనిని నాల్గవ భంగమంటారు. జీవుడు కలడు కాని చెప్పబడటానికి యోగ్యుడు కాడనునది పంచమ భంగమనబడుతుంది. జీవుడు కలడని ప్రత్యక్షప్రమాణంతో చెప్పటానికి సాధ్యం కాదు. చక్షుఃప్రత్యక్షం కాదు అనే వ్యవహారం కలదు. కావున దీనిని షష్ఠభంగమంటారు. ఒక సమయంలో అనుమానంతో జీవుడున్నట్లు, అదృశ్యత్వంతో లేనట్లు, ఒకేరీతిగా ఉండక క్షణక్షణంలో పరిణామం పొందుటచే అస్తినాస్తి అనేది లేకపోవటం, నాస్తి అస్తి అనే వ్యవహారం కూడా కలుగకుండటం అనేది సప్తమభంగమనబడుతుంది.

ఈ ప్రకారంగానే నిత్యత్వసప్తభంగి, అనిత్యత్వసప్తభంగి, అలాగే సామాన్య ధర్మం, విశేష ధర్మం అనే గుణ పర్యాయాలను బట్టి ప్రతి వస్తువులో సప్తభంగి తటస్థిస్తున్నది. అలాగే ద్రవ్య గుణ స్వభావాలు పర్యాయాలు అనంతాలవటం వలన సప్తభంగులు కూడా అనంతులగును, ఇట్లు, బౌద్ధుల, జైనుల స్యాద్వాదము, సప్తభంగీన్యాయము అనబడును.

సమీక్షకుడు:- ఈ కథనమంతా అన్యోన్యాభావమందు, సాధర్మ్య వైధర్మ్యాలందు చరితార్థం కాగలదు. ఈ సరళ పద్ధతిని వదలి కఠినజాలాన్ని రచించటం కేవలం అజ్ఞానులను వలలో చిక్కించుకోవటానికే కదా! చూడండి! జీవాభావమజీవమందు, అజీవాభావం జీవమందు ఉండే ఉంటుంది. ఎలాగంటే - జీవజడాలు వర్తమానాలవటం చేత వాటిలో వర్తమానత్వరూప సాధర్మ్యం కలదు. మరియు అవి చైతన్యజడాలవటంచేత వానిలో వైధర్మ్యం - అంటే జీవమందు చేతనత్వం (అస్తి) కలదు. జడత్వం (నాస్తి) లేదు. ఈ విధంగానే జడంలో జడత్వం కలదు. చేతనత్వం లేదు. దీనివల్ల గుణ కర్మ స్వభావాల సమాన - విరుద్ధ ధర్మాల ఆలోచనలను బట్టి వీరి సప్తభంగీ, స్యాద్వాదం అంతా సులభంగా తెలుస్తుంది. ఇక ఇలా ప్రపంచాన్ని పెంచటంవలన ఏమి ప్రయోజనం? ఈ విషయంలో బౌద్ధుల, జైనుల మతమొక్కటే. కొంచెం వేరవటం వలన భిన్న భావం కూడా కలుగుతున్నది.

జైన సిద్ధాంతాలు

ఇప్పుడు జైనమతాన్ని గురించి వ్రాయబడుతుంది.

చిదచిద్ద్వే పరే తత్త్వే వివేక స్తద్వివేచనమ్ ।
ఉపా దేయముపాదేయం హేయం హేయం చ కుర్వతః ॥ 1 ॥స.ద.సం. ఆర్హత దర్శనం. ॥ పుట. 67 ॥

జైనులు 'చిత్తు అచిత్తు' అంటే 'చేతనం, జడం' అనే రెండే పరతత్త్వాలను అంగీకరిస్తున్నారు. ఆ రెంటి వివేచనమే 'వివేక'మనబడుతుంది. గ్రహించదగిన వాటిని గ్రహించి, త్యజించదగిన వాటిని త్యజించేవాడు 'వివేకి' అవుతాడు.

హేయం హి కర్తృరాగాది తత్కార్య మవివేకినః ।
ఉపాదేయం పరం జ్యోతి రూపయోగైకలక్షణమ్ ॥ 2 ॥
స.ద.సం. ఆర్హత దర్శనం ॥ పుట. 67 ॥

జగత్కర్త, రాగాలు, జగత్తునీశ్వరుడు రచించారు అనే ఈ వివేక శూన్యమైన మతాన్ని త్యజించి, యోగంతో లక్షితుడైన పరమ జ్యోతిస్స్వరూపుడైన ఆ జీవుని గ్రహించటమే ఉత్తమం.

అంటే జీవుడు తప్ప రెండవ చేతనతత్వమైన ఈశ్వరుని ఒప్పుకోరు. అనాది సిద్ధుడైన ఈశ్వరుడెవడూ లేడని బౌద్ధులు, జైనులు నమ్ముతున్నారు.

జైనులు బౌద్ధులు ఒక్కటే

దీనిని గురించి రాజా శివప్రసాదుగారు 'ఇతిహాస తిమిరనాశకం' అనే గ్రంథంలో వీరికి 'బౌద్ధులు, జైనులు' అని రెండు పేర్లు ఉన్నాయి. ఇవి పర్యాయపదాలు, మద్యమాంసాహారం చేసే వామమార్గీయులు బౌద్ధులు. వీరికి జైనులకు విరోధం ఉంది. మహావీరుడని గౌతమగణధరుడను వారికి బౌద్ధులు 'బుద్ధు'డనీ, జైనులు గణధరుడనీ, జినవరుడనీ పేర్లు పెట్టారని' వ్రాసి ఉన్నారు.

జైన మత పరంపరలోని వారి గురించి రాజా శివప్రసాదుగారు 'శంకరాచార్యులకి ఇంచుమించు వేయి సంవత్సరాలకు పూర్వం వీరుండిరనీ, శంకరునికి ముందు ఈ భారత వర్షంనందంతట జైనమో, బౌద్ధమో అనే ఒక మతం వ్యాపించి ఉండెననీ తమ 'ఇతిహాస తిమిరనాశకం' అనే గ్రంథంలో మూడవ ఖండంలో వ్రాసారు. దీనిమీద శివప్రసాద్ గారే ఇక్కడ తన గ్రంథంలో ఇలా టిప్పణి వ్రాసారు. దీనిమీద శివప్రసాద్‌గారే యిక్కడ తన గ్రంథములో ఇట్లు (టీకా) టిప్పణి వ్రాసియున్నారు. "బౌద్ధమంటే మా అభిప్రాయం – మహావీరునికి సంబంధించిన గణధర గౌతమస్వామివారి కాలం నుండి శంకరస్వాముల కాలం వరకు భారతదేశమంతట వ్యాపించి ఉన్నది. వేదవిరుద్ధమైన మతమనీ ఆ మతాన్ని అశోకుడు సంప్రతి మహారాజును అంగీకరించారు. దీని నుండి జైనులెంత మాత్రం వేరు కాలేరు. జినశబ్దం నుండి జైన, బుద్ధ శబ్దం నుండి బౌద్ధ అనే రూపం ఏర్పడింది. ఈ రెండూ పర్యాయ వాచక శబ్దాలు. కోశం నందు ఈ రెండిటికి ఒకే అర్థం వ్రాయబడి ఉన్నది. గౌతమునిని ఉభయులు ఒప్పుకొంటున్నారు. లేకపోతే దీపవంశాది పురాతనాలైన బౌద్ధ గ్రంథాలలో శాక్యమునియైన గౌతమబుద్ధుని తరచు మహావీరుడనే పేరుతో వ్రాసి ఉండరు. కావున అతని సమయంలో వాళ్ల మతమొక్కటే అయి ఉండవచ్చును. మేము గౌతమ మతస్థులను జైనులని వ్రాయక, బౌద్ధులని వ్రాసిన ప్రయోజనమేమిటంటే, వారికి ఇతర దేశస్థులు బౌద్ధులనే వ్రాసి ఉన్నారు". అమరకోశంలో కూడా అలాగే వ్రాయబడి ఉన్నది.

అమరకోశం:–

సర్వజ్ఞః సుగతో బుద్ధో ధర్మరాజ స్తథాగతః ।
సమస్తభద్రో భగవాన్మారజి ల్లోక జిజ్జినః ॥
షడభిజ్ఞో దశబలోఽ ద్వయవాదీ వినాయకః ।
మునీంద్రః శ్రీఘనః శాస్తా మునిః శాక్యమునిస్తు యః ॥

స శాక్యసింహః సర్వార్థసిద్ధ శ్శౌద్ధోదనిశ్చ సః ।
గౌతమ శ్చార్కబంధుశ్చ మాయాదేవీసుతశ్చ సః ॥ అమరకోశం.కాం.1 వర్గ.1శ్లో. 8–10 ॥

ఇప్పుడు చూడండి! బుద్ధ, జిన అలాగే బౌద్ధ, జైన అనే పేర్లు ఒకరివేనా, కావా! అమరసింహుడు కూడా బుద్ధుడు, జినుడు ఒకడే అని మరచి వ్రాసాడా ఏమి? అవిద్వాంసులైన జైనులు తమది తెలుసుకోరు. ఇతరులది తెలుసుకోరు. కేవలం హఠం చేస్తూ వాగుతుంటారు. కాని జైనులలో విద్వాంసులైన వారందరు, బుద్ధ జిన, అలాగే బౌద్ధ జైన శబ్దాలు పర్యాయవాచకాలని తెలుసుకుంటారు. ఇందు సందేహమేమీ లేదు.

మరి కొన్ని జైన సిద్ధాంతాలు

జీవుడే పరమేశ్వరుడవుతాడని జైనులనుంటున్నారు. వారు తమ తీర్థంకరులకే కైవల్యముక్తి లభించినదని, వారే పరమేశ్వరులని నమ్ముతున్నారు. అనాదిగా పరమేశ్వరుడెవడూ లేడంటారు. సర్వజ్ఞ, వీతరాగ, అర్హన్, కేవలీ, తీర్థంకృత, జిన అనే ఈ ఆరు నాస్తికుల దేవతలకు పేర్లు.'ఆదిదేవు'ని స్వరూపాన్ని 'చంద్రసూరి' అనేవాడు 'అప్తనిశ్చయాలంకార' గ్రంథంలో ఇలా వ్రాసాడు -

సర్వజ్ఞో వీతరాగాది దోషస్త్రైలోక్యపూజితః।
యథాస్థితార్థవాదీ చ దేవోర్హన్ పరమేశ్వరః ॥ 1 ॥

రాగాది దోషరహితుడు, త్రిలోకంలో పూజ్యుడు, యథావత్పదార్థ వక్తా, సర్వజ్ఞుడు అయిన అర్హన్ దేవుడే పరమేశ్వరుడు. అలాగే తౌతాతితులు కూడా వ్రాసి ఉన్నారు -

సర్వజ్ఞో దృశ్యతే తావన్నే దానీమస్మదాదిభిః।
దృష్టో న చైక దేశోఽస్తి లింగం వా యోఽనుమాపయేత్ ॥ 2 ॥

మేము ఈ సమయంలో పరమేశ్వరుని చూడటంలేదు. కాబట్టి సర్వజ్ఞుడు, అనాదియైన పరమేశ్వరుడు ప్రత్యక్షం కాడు. ఈశ్వరునిలో ప్రత్యక్ష ప్రమాణం లేనందున అనుమాన ప్రమాణం కూడా ఘటించలేదు. ఎందుకంటే ఏకదేశం ప్రత్యక్షం కానంతవరకు అనుమాపకలింగం లేనందున అనుమాన ప్రమాణం కలుగదు.

న చాగమవిధిః కశ్చిన్నిత్యసర్వజ్ఞబోధకః।
న చ తత్రార్థవాదానాం తాత్పర్యమపి కల్ప్యతే ॥ 3 ॥

ప్రత్యక్షానుమానాలే లేకుంటే నిత్యుడు, అనాది, సర్వజ్ఞుడు అయిన పరమాత్మ బోధక - ఆగమం అనే శబ్దప్రమాణాన్ని స్థిరపడలేదు. మూడు ప్రమాణాలను స్థిరపడనప్పుడు అర్థవాదం అంటే స్తుతి, నిందా, పరకృతి అనే పరచరిత్రవర్ణనం, పురాకల్పం అంటే ఇతిహాస తాత్పర్యం కూడా స్థిరపడలేదు.

న చాన్యార్థ ప్రధానైస్తైస్తదస్తిత్వం విధీయతే।
న చానువాదితుం శక్యః పూర్వమన్యైరబోధితః ॥ 4 ॥
స.ద.సం. ఆర్హత దర్శనం ॥ 56వ పుట ॥

అన్యార్థప్రధానమైన బహువ్రీహి సమాసంలాగా పరోక్షంలో గల పరమాత్మను సిద్ధింపచేసే విధానం కూడా ఘటింపలేదు. ఇక ఈశ్వరోపదేష్టల నుండి వినకుంటే అనువాదం కూడా ఎట్లుంటుంది?

దీని ప్రత్యాఖ్యానం అంటే ఖండనం - అనాదియైన ఈశ్వరుడు లేకుంటే అర్హన్ దేవుని తల్లి తండ్రి మొదలైనవారి శరీరాల మూసలను ఎవరు చేయగలిగి ఉంటారు? సంయోగకర్త లేక యథాయోగ్యంగా సర్వావయవ సంపన్నమై యథోచితకార్యాలను చేయడానికి ఉపయుక్తమైన శరీరమే ఏర్పడలేదు. ఏ పదార్థాలతో శరీరం ఏర్పడిందో అవి జడములయినందుకు, తమంతట తాము ఈ ప్రకారంగా ఉత్తమ రచనాయుక్తాలైన శరీరరూపాలు కాలేవు. ఎందుకంటే వాటిలో యథాయోగ్యంగా ఏర్పడే జ్ఞానమే లేదు.

జీవుడు ఈశ్వరుడు కాలేడు

రాగాది దోషసహితుడైన తర్వాత దోషరహితుడైన వాడెన్నడూ ఈశ్వరుడు కాలేడు. ఎందుకంటే - ఏ నిమిత్తంలో అతడు రాగాల నుండి విముక్తుడవుతున్నాడో ఆ నిమిత్తం అనిత్యమవటం వలన తజ్జనిత ముక్తి అనిత్యమవుతున్నది.

అల్పుడు, అల్పజ్ఞుడైన వాడు సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు ఎన్నడూ కాలేడు. ఎలాగంటే జీవుని స్వరూపం ఏకదేశీయం, పరిమిత గుణ కర్మ స్వభావాలు కలది కూడా అవుతున్నది. అతడు సర్వవిధాల సమస్త విద్యలలో యథార్థ వక్త కాలేడు. కాబట్టి మీ తీర్థంకరులు ఎప్పుడూ పరమేశ్వరులు కాలేరు. ॥ 1 ॥

మీరు ప్రత్యక్షాలైన పదార్థాలనే అంగీకరిస్తున్నారా? అప్రత్యక్షాలను అంగీకరించరా? చెవులతో రూపగ్రహణం, కన్నులతో శబ్దగ్రహణం కానట్లే అనాది పరమాత్మను కనుగొనే సాధనాలైన శుద్ధాంతఃకరణ, విద్యా, యోగాభ్యాసాలతో పవిత్రాత్ముడు పరమాత్మను ప్రత్యక్షంగా చూస్తున్నాడు. చదువక విద్యా ప్రయోజనం సిద్ధించనట్లు, యోగాభ్యాస విజ్ఞానాలు లేక పరమాత్మ కనపడడు.

ఈశ్వర ప్రత్యక్షం

భూమియొక్క రూపాదిగుణాలను చూసి, తెలుసుకొని గుణాలతో అవ్యవహిత సంబంధం గల పృథ్వి ప్రత్యక్షమవుతున్నట్లు ఈ సృష్టిలోని పరమాత్ముని రచనావిశేషాలైన చిహ్నాలను పొందిన పరమాత్ముడు ప్రత్యక్షమవుతున్నాడు. పాపాలను ఆచరించదలచినపుడు భయం, శంక, లజ్జ అనేవి కలుగుతున్నాయి. అవి అంతర్యామి అయిన పరమాత్మవల్లనే కలుగుతున్నాయి. అందువలన పరమాత్ముడు ప్రత్యక్షమవుతున్నాడు. ఇక అనుమాన ప్రమాణంతో సిద్ధించటం వలన సందేహమేమి? ॥ 2 ॥

శబ్ద ప్రమాణం

ప్రత్యక్షానుమానాలు సిద్ధించిన మీదట ఆగమ ప్రమాణం కూడా "నిత్యుడు, అనాది, సర్వజ్ఞుడు" అయిన ఈశ్వరుని బోధించునదగును. కావున శబ్దప్రమాణం కూడా ఈశ్వరునిలో సంఘటిల్లును. త్రివిధ ప్రమాణాలతో జీవుడు ఈశ్వరుని తెలుసుకోగలిగినపుడు, అర్థవాదం అంటే పరమేశ్వరుని గుణప్రశంస చేయటం యథార్థంగా సంఘటిల్లును. ఎందుకంటే నిత్యములైన పదార్థాల గుణ కర్మ

స్వభావాలు సహితం నిత్యములే అవుతాయి. వాని ప్రశంస చేయుటలో ఏ ప్రతిబంధకమూ లేదు. ॥ 3 ॥

ఈశ్వరుడు లేకపోత సృష్టి సంభవం కాదు

మనవులలో కర్త లేకుంటే ఏ కార్యమూ కానట్లే ఈ మహత్కార్యం కూడా కర్తలేనిదే కలుగుననటం సర్వథా అసంభవం. కావున ఈశ్వరుడు కలడనటంలో ఒక్క మూర్ఖునికయిననూ సందేహం కలుగదు. ఈశ్వరుడు కలడని ఉపదేశించేవారి నుండి విన్న తర్వాత దాని అనువాదం చేయటం కూడా సులభమే. ॥ 4 ॥

దీన్ని బట్టి జైనులకు ఇలా ప్రత్యక్షాది ప్రమాణాలతో ఈశ్వరుని ఖండించాలనుకోవటం ఉచితం కాదు.

అనాది పదార్థాలలో అన్యోన్యాశ్రయ దోషం లేదు

ప్రశ్న:-అనాదేరాగమస్యార్థో న చ సర్వజ్ఞ ఆదిమాన్ ।
కృత్రిమేణ త్వసత్యేన స కథం ప్రతిపాద్యతే ॥ 1 ॥

సర్వజ్ఞుడు మధ్యనయ్యెననుట అనాది శాస్త్రానికి అర్థం కాలేదు. ఎందుకంటే అసత్యవచనంతో అతడెట్లు ప్రతిపాదించబడగలడు?

అథ తద్వచనేనైవ సర్వజ్ఞోऽన్యైఃప్రతీయతే ।
ప్రకల్ప్యేత కథం సిద్ధి రన్యోన్యాశయయో స్తయోః ॥ 2 ॥

పరమేశ్వరుని వచనాల చేతనే పరమేశ్వరుడు సిద్ధిస్తున్న అనాది ఈశ్వరుని వల్ల అనాది శాస్త్రసిద్ధీ, అనాది శాస్త్రముల వల్ల అనాది పరమేశ్వరుని సిద్ధి కలిగి అన్యోన్యాశ్రయదోషం సంభవిస్తున్నది.

సర్వజ్ఞోక్తతయా వాక్యం సత్యం తేన తదస్తితా ।
కథం తదుభయం సిద్ధ్యేత్ సిద్ధమూలాంతరాదృతే ॥ 3 ॥

స.ద.సం. ఆర్హత దర్శనం ॥ 56, 57వ పుట ॥

సర్వజ్ఞుని కథనమవటాన్ని బట్టి, ఆ వేదవాక్యం సత్యమని తద్వేదవచనంవల్లనే ఈశ్వరుని సిద్ధింపజేస్తున్నారు కదా? అది ఎలా సిద్ధిస్తుంది? ఆ శాస్త్రం యొక్క పరమేశ్వరుని యొక్క సిద్ధికి మూడవ ప్రమాణమేదైన కావాలి. అలా ఒప్పుకోకుంటే అనవస్థా దోషం సంప్రాప్తమవుతుంది.

జవాబు:- మేము పరమేశ్వరుని, పరమేశ్వరుని గుణ కర్మ స్వభావాలను అనాది అని అంగీకరిస్తున్నాము. అనాది నిత్యములైన పదార్థాలలోని అన్యోన్యాశ్రయదోషం కలుగలేదు. ఎలాగంటే కార్యం వలన కారణ జ్ఞానం, కారణంనుండి కార్యబోధ కలుగుతుంది. కార్యంలో కారణ స్వభావం, కారణంలో కార్యస్వభావం నిత్యమై ఉంటుంది. అలాగే పరమేశ్వరుడు, పరమేశ్వరుని అనంత విద్యాది గుణాలను నిత్యములైనందుకు ఈశ్వర ప్రణీతమైన వేదానికి అనవస్థా దోషంరాదు. ॥ 1-23 ॥

తీర్థంకరుడు ఈశ్వరుడు కాదు

మీరు తీర్థంకరులను పరమేశ్వరుడని నమ్ముతున్నారు. అది ఎన్నటికీ కాలేదు. ఎందుకంటే తల్లిదండ్రులు లేకుండా వారి శరీరాలే ఏర్పడవు. అలాంటప్పుడు వారు తపశ్చర్యలను ఎలా చేయగలరు? జ్ఞానాన్ని, ముక్తిని ఎలా పొందగలరు? ఆ ప్రకారమే సంయోగానికి కారణం తప్పక ఉండే తీరుతుంది. ఎలాగంటే వియోగం లేనిది సంయోగం కలుగనే కలుగదు. కావున అనాది సృష్టి కర్తయగు పరమాత్మను ఒప్పుకోండి.

చూడండి! ఎంతటి సిద్ధపురుషుడైనా శరీరాల రచనను పూర్ణంగా తెలుసుకోలేడు. సిద్ధుడైన జీవుడు సుషుప్తిదశలోనికి పోయినపుడు అతనికి ఏమీ భాసించదు. జీవుడు దుఃఖాన్ని పొందుతున్నప్పుడు అతనికి జ్ఞానం కొంత తగ్గుతుంది. ఇలా పరిచ్ఛిన్న సామర్థ్యం కలిగి ఏకదేశీయుడైన వానిని ఈశ్వరుడని అంగీకరించేవారు భ్రాంతి బుద్ధియుక్తులైన జైనులు తప్ప మరెవ్వరూ ఉండరు.

ఆ తీర్థంకరులు తమ తల్లిదండ్రులకు పుట్టారని మీరంటే ఆ తల్లిదండ్రులు ఎవ్వరికి పుట్టారు? మరి వారి తల్లిదండ్రులు కూడా ఎవరికి పుట్టారు? మొదలైన అనవస్థాదోషం సంభవిస్తుంది.

ఆస్తిక నాస్తికుల సంవాదం

దీని తరువాత గొప్ప గొప్ప జైన విద్వాంసులు తమ సమ్మతిపూర్వకంగా అంగీకరించి బొంబాయిలో అచ్చువేయించిన 'ప్రకరణరత్నాకరం'లోని రెండవ భాగంలోని ఆస్తిక నాస్తిక సంవాదరూప ప్రశ్నోత్తరాలను ఇక్కడ వ్రాస్తున్నాము.

ఈశ్వరీయ వ్యవస్థ - కర్మఫలం

నాస్తికుడు:- ఈశ్వరేచ్ఛ వలన ఏమీ కాదు. కర్మ నుండే అంతా జరుగుతుంది.

ఆస్తికుడు:- అంతా కర్మ నుండే జరిగితే, కర్మ ఎవరి నుండి కలుగుతున్నది? జీవాల నుండి కలుగుతున్నాయంటే ఏ శ్రోత్రాది సాధనాలతో జీవుడు కర్మ చేస్తున్నాడో అవి ఎవని నుండి కలిగినవి? అనాది కాలం నుండి స్వాభావికంగానే కలుగుతున్నవంటే, అనాదియైనది వేరవటం అసంభవమై మీ మతంలో ముక్తికి అభావం కలుగుతుంది. ప్రాగభావం లాగా, అనాది, సాంతం అంటే, యత్నం లేకే అందరి కర్మలు నివృత్తి చెందుతాయి.

ఈశ్వరుడు ఫలప్రదాత కాకుంటే, పాపఫలాలైన దుఃఖాన్ని జీవుడు తన ఇష్టంతో ఎన్నటికీ అనుభవించరు. ఎలాగంటే దొంగలు మొదలైనవారు దొంగతనపు ఫలమైన శిక్షను తమ ఇష్టంతో పొందరు. రాజ్యవ్యవస్థతో పొందుతారు. అలాగే పరమేశ్వరుని వలన జీవులు పాపపుణ్య ఫలాలను అనుభవిస్తున్నారు. లేకపోతే కర్మలు సంకరములవుతాయి. ఒకని కర్మఫలాన్ని ఒకడు అనుభవించవలసి వస్తుంది.

జీవుడు ఈశ్వరుడు కాడు

నాస్తికుడు:- ఈశ్వరుడు అక్రియుడు. ఎందుకంటే కర్మ చేసేవాడే కర్మఫలాన్ని కూడా అనుభవించవలసిన వాడవుతాడు. కావున మేము 'కేవలీ' ప్రాప్తం పొందినవాళ్లను అక్రియులని నమ్ముతున్నట్లే మీరు కూడా నమ్మండి.

ఆస్తికుడు:- ఈశ్వరుడు అక్రియుడు కాడు. సక్రియుడు. చేతనుడైనప్పుడు కర్త ఎలా కాడు? కర్తయగువాడు క్రియ నుండి ఎప్పుడూ వేరు కాలేడు. జీవుడు తీర్థంకరుడైన మీదట అతన్ని ఈశ్వరుడని మీరు నమ్ముతున్నారు. కృత్రిమంగా నిర్మించబడిన అట్టి ఈశ్వరుని విద్వాంసుడెవడైన అంగీకరించలేడు.

కారణమేమిటంటే ఏర్పడు నిమిత్తంతో ఈశ్వరుడు అనిత్యుడు, పరాధీను డవుతాడు. ఎందుకంటే ఈశ్వరుడవటానికి పూర్వం జీవుడై ఉన్నాడు. తర్వాత ఏదో ఒక నిమిత్తంతో ఈశ్వరుడయ్యాడని మళ్ళీ కూడా జీవుడైపోతాడు. తన జీవత్వం అనే ఈ స్వభావం ఎన్నడూ వదలలేడు. ఎందుకంటే అనంతకాలం నుండి జీవుడై ఉన్నాడు. అనంతకాలం వరకు అలాగే ఉంటాడు. కావున ఈ అనాది స్వతఃసిద్ధుడైన ఈశ్వరుని ఒప్పుకోవటమే యోగ్యం.

ఈశ్వరుడు నిష్క్రియుడు కాడు

చూడండి ! వర్తమాన కాలంలో జీవుడు పాపపుణ్యాలను చేస్తూ, సుఖదుఃఖాలను అనుభవించునట్లు ఈశ్వరుడెన్నడూ కాడు. ఈశ్వరుడు క్రియావంతుడు కాకుంటే ఈ జగత్తు నెలా చేయగలిగి ఉంటాడు? కర్మలను, ప్రాగభావంలాగే, అనాది, సాంతాలని అంగీకరింతురేని కర్మ సమవాయ సంబంధం కలిగి ఉండదు. సమవాయ సంబంధంతో ఉండనిది సంయోగమై అనిత్యమవుతున్నది. ముక్తియందు క్రియయే అంగీకరించబడదేని ఆ ముక్తజీవులు జ్ఞానవంతులా? కారా? జ్ఞానవంతులయితే అంతఃక్రియావంతులవుతారు. ముక్తియందు పాషాణం లాగా జడములైపోదురా? ఒకచోట పడియుండి క్రియలేమీ లేకుంటే అది ముక్తి అగునా? అంధకార బంధనాలలో ఉండటమవుతుందా?

నాస్తికుడు:- ఈశ్వరుడు వ్యాపకుడు కాడు. వ్యాపకుడైతే వస్తువులన్నీ చేతనాలు ఎలా కావు? బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులలో ఉత్తమ, మధ్యమ నికృష్టాలను వ్యవస్థలెందుకు కలిగాయి? ఎందుకంటే అందరిలో ఈశ్వరుడు ఒకటిగా వ్యాప్తుడై ఉన్నందుకు చిన్న పెద్ద అనే భేదం ఉండరాదు.

ఆస్తికుడు:- వ్యాప్యం వ్యాపకం అనేవి రెండు ఒక్కటి కావు. వ్యాప్యమేకదేశీయం, వ్యాపకం సర్వదేశీయం అవుతున్నది. ఎలాగంటే ఆకాశం అన్నిటిలో వ్యాపకం. భూగోళం ఘటపటాలన్నీ వ్యాప్యాలు - ఏకదేశీయాలు. పృథ్వి, ఆకాశం ఒక్కటి కానట్లు, ఈశ్వరుడు జగత్తు ఒక్కటి కావు. ఘటపటాదులందంతట ఆకాశం వ్యాపకమై ఉంటే, ఘటపటాలు ఆకాశం కానట్లే చేతనుడైన పరమేశ్వరుడన్నిటిలో ఉన్నా అవి అన్నీ చేతనాలు కావు. విద్వాంసులు, అవిద్వాంసులు, ధర్మాత్ములు, అధర్మాత్ములు సమానులు కారు. విద్యాది సద్గుణాలు, సత్యభాషణాది కర్మలు, సుశీలతాది స్వభావాలు న్యూనాధికాలవటం వలన బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, అంత్యజులు, పెద్దలు,

చిన్నలు అని అనబడుతున్నారు. వర్ణవ్యవస్థను గురించి చతుర్థ సముల్లాసంలో వ్రాయబడింది. అక్కడ చూడండి.

నాస్తికుడు:- ఈశ్వర రచన వల్ల సృష్టి ఏర్పడి ఉంటే తల్లిదండ్రులతో ప్రయోజనమేమి?

అస్తికుడు:- ఈశ్వరుడు ఈశ్వరీయ సృష్టికి కర్త. జీవసృష్టికి కాడు. జీవుల కర్తవ్యకర్మలను ఈశ్వరుడు చేయడు. జీవుడే చేస్తాడు. ఎలాగంటే ఈశ్వరుడు వృక్షాలను, ఫలాలను, ఔషధాలను, అన్నాదులను పుట్టించినాడు. వానిని గ్రహించి మానవులు తనకు అనుకూలంగా పిండి చేసుకొని రొట్టెలు మొదలైనవి చేసుకొని తినకయున్న ఈశ్వరుడు వారికి బదులుగా ఈ కార్యాలను ఎన్నడైనా చేయునా? చేయడేని జీవుల జీవనం కూడా జరుగనేరకుండును. కావున అది సృష్టిలో శరీరాలను, ఆకృతులను చేయటం ఈశ్వరాధీనం, తర్వాత వాని నుండి పుత్రాదులను ఉత్పన్నం చేయటం జీవుల కర్తవ్యకర్మమైయున్నది.

నాస్తికుడు:- పరమాత్ముడు, శాశ్వతుడు, అనాది, చిదానందుడు, జ్ఞానస్వరూపుడునై ఉన్నప్పుడు జగజ్జాలంలో, దుఃఖంలో ఎందుకు పడ్డాడు? ఆనందాన్ని వదలి దుఃఖాన్ని పొందునట్టి కార్యం ఒక సాధారణ మానవుడు కూడా చేసినపుడు ఈశ్వరుడెందుకు చేసాడు?

అస్తికుడు:- పరమాత్ముడు గందరగోళంలో, దుఃఖంలో పడడు. తన ఆనందాన్ని విడువడు. ఎందుకంటే ఏకదేశీయుడైనవాడు గందరగోళంలో, దుఃఖంలో పడగలడు. సర్వదేశీయుడు పడడు. అనాది, చిదానందుడు జ్ఞానస్వరూపుడు అయిన పరమాత్మ జగత్తును చేయకుంటే అన్యుడెవడు చేయగలుగుతాడు? జగత్తును చేసే సామర్థ్యం జీవునిలో లేదు. జడంలో స్వయంగా ఏర్పడే సామర్థ్యం కూడా లేదు. ఇందువలన పరమాత్ముడే జగత్తును చేస్తూ సదా ఆనందంలో నివసిస్తున్నాడనటం సిద్ధం. పరమాత్ముడు పరమాణువులతో సృష్టిని నిర్మిస్తున్నట్లే తల్లిదండ్రులు అనబడే నిమిత్త కారణంచేత అతడే ఉత్పత్తి ఏర్పాట్లను నియమాలను స్థిరపరచి ఉన్నాడు.

నాస్తికుడు:- ఈశ్వరుడు ముక్తిరూప సుఖాన్ని విడనాడి సృష్టిని రచించటం, ధరించటం, ప్రళయమొనర్చటం అనే ఈ జంజాటాలలో పడ్డాడు?

అస్తికుడు:- ఈశ్వరుడు సదాముక్తుడు. మీ తీర్థంకరులు సాధనలతో సిద్ధిని పొంది బంధనపూర్వకమైన ముక్తితో యుక్తులై ఏకదేశంనందుండునట్లా సనాతనుడైన పరమాత్ముడు కాడుగద! అనంత స్వరూప గుణ కర్మ స్వభావయుక్తుడైన పరమాత్ముడే ఈ కించిన్మాత్రమయిన జగత్తును రచిస్తూ, ధరిస్తూ, ప్రళయం గావిస్తూ ఉండి బంధనంలో పడడు. ఎందుకంటే బంధమోక్షాలు సాపేక్షాలు. ఎలాగంటే ముక్త్యపేక్షచేసి, బంధనమును, బంధమపేక్షచేసి, ముక్తి కలుగుచుండును. ఎన్నడూ బద్ధుడుగా ఉండనివాడు ముక్తుడని ఎలా చెప్పబడగలడు? ఏకదేశీయులైన జీవులే సదా బద్ధులు. ముక్తులు అవుతుంటారు. అనంతుడు. సర్వదేశీయుడు, సర్వవ్యాపకుడు అయిన ఈశ్వరుడు మీ తీర్థంకరులలాగా బంధనంలోగాని, నైమిత్తిక ముక్తి చక్రంలోగాని ఎన్నడూ పడడు. కావున ఆ పరమాత్మ ఎల్లప్పుడూ ముక్తుడన బడుతున్నాడు.

నాస్తికుడు:- భంగు త్రాగి తమంతట తామే మత్తుచెందుతున్నట్లే జీవులు కర్మ ఫలాన్ని అనుభవిస్తారు. ఇందు ఈశ్వరుని పని లేదు.

అస్తికుడు:- రాజు లేకుంటే దొంగలు, దోపిడికాండ్రు, లంపటులు మొదలైన దుష్టులైన మానవులు స్వయంగా ఉరిఖంబం ఎక్కటంగాని, జైలులో బంధించబడటంగాని ఎవరూ చేయలేరు. కాని రాజ్యసంబంధమైన న్యాయవ్యవస్థానుసారం బలవంతంగా పట్టుబడి యథోచితంగా రాజుతో దండించబడినట్లే పరమేశ్వరుడు తన న్యాయవ్యవస్థతో జీవులకు వారి వారి కర్మానుసారంగా యథాయోగ్యమైన దండన విధిస్తున్నాడు. ఎందుకంటే ఏ జీవుడయినా తన దుష్కర్మఫలాన్ని అనుభవించకోరడు. కావున పరమాత్మ న్యాయాధీశుడు కాక తప్పదు.

ఈశ్వరుడు ఒక్కడే

నాస్తికుడు:- జగత్తులో ఉన్నది ఒక్క ఈశ్వరుడు కాదు. ముక్తిని పొందిన జీవులందరు ఈశ్వరులే.

అస్తికుడు:- ఈ మాట సర్వథా వ్యర్థం. ఎందుకంటే మొదట బద్ధులుగా నుండి ముక్తి పొందినప్పుడు, మళ్ళీ బంధనంలో తప్పక పడతారు. ఎలాగంటే వారు స్వాభావికంగా నిత్యముక్తులు కారు. ఎలాగంటే మీ 24 మంది తీర్థంకరులు కూడా మొదట బద్ధులుగా నుండి తర్వాత ముక్తులైనారు. మళ్లీ తప్పక బంధనంలో పడతారనటం స్పష్టం. ఈశ్వరులు అనేకులు కలరేని, జీవులనేకులై ఉన్నందున పోట్లాడుతూ, ఎదురాడుతూ తిరుగుతూ ఉన్నట్లే ఈశ్వరులును పోట్లాడుతూ ఎదురాడుతూ ఉండగలరు.

నాస్తికుడు:- ఓ మూర్ఖుడా! జగత్తుకు కర్త ఎవ్వడూ లేదు. ఈ జగత్తు స్వయంగా సిద్ధమై ఉన్నది.

అస్తికుడు:- ఇది జైనులలో గల గొప్ప పొరపాటు. కర్త లేక ఒక కర్మ కాని, కర్మ లేక ఒక కార్యం గాని, జగత్తున కలుగుతున్నట్లు కనిపిస్తున్నదా? ఈ వార్త గోధుమలు పండు పొలంలో స్వయంగానే పిండి విసరబడి, రొట్టెలు సిద్ధమై జైనుల కడుపులో పడునన్నట్లే ఉన్నది గద! దూది స్వయంగా నూలుగా మారి వస్త్రంగా, దుప్పటి, ధోవతి, పాగ మొదలైనవిగా సిద్ధమగునా? అలా కాకపోతే, ఈశ్వరుడు కర్తగా లేకుంటే ఈ వివిధ జగత్తులోని అనేక విధ రచనావిశేషాలు ఎలా కలుగగలుగును?

జగత్తు స్వయంగానే సిద్ధమైనదని మొండితనంగా నమ్ముతుంటే, ఉపర్యుక్త వస్త్రాలు కర్త లేక స్వయంగా సిద్ధమయినట్లు ప్రత్యక్షంగా చేసి చూపండి! ఇలా నిరూపించకపోతే, ఇక మీ ప్రమాణశూన్యమైన వాక్యాలను బుద్ధిమంతుడెవడు అంగీకరించగలడు?

నాస్తికుడు:- ఈశ్వరుడు విరక్తుడా? మోహితుడా? విరక్తుడైన జగజ్జాలంనందేల పడ్డాడు? మోహితుడైన, జగత్తును నిర్మించటానికి సమర్థుడు కాడు.

అస్తికుడు:- పరమేశ్వరునిలో వైరాగ్యం కాని, మోహం కాని ఎన్నటికీ సంభవించవు. ఎలాగంటే సర్వవ్యాపకుడైనవాడు దేనిని విడుస్తాడు? మరి దేనిని గ్రహిస్తాడు? ఈశ్వరుని కంటే ఉత్తమమైనది

గాని, అతనికి అప్రాప్తమైనది గాని ఏ పదార్థమూ లేదు. కావున అతనికి ఏ ఒక్కదానిలో మోహం కలుగదు, మోహవైరాగ్యాలు జీవునిలో కలుగుతున్నవి. ఈశ్వరునిలో కలుగవు.

ఈశ్వరుడు నిర్లిప్తుడు

నాస్తికుడు:- ఈశ్వరుడు జగత్కర్త అనీ, జీవులకు కర్మఫలం ఇచ్చేవాడని నమ్మితే ఈశ్వరుడు చిక్కులలో పడి, దుఃఖితుడవుతాడు.

ఆస్తికుడు:- అనేకవిధాలైన కర్మలను చేసేవాడు, ప్రాణులకు ఫలానిచ్చేవాడు, ధర్మాత్ముడు, న్యాయాధీశుడైన అనంతసామర్థ్యంగల పరమేశ్వరుడు చిక్కులలోపడి దుఃఖితుడెలా కాగలడు? సరే మీరు మీ అజ్ఞానం చేత పరమేశ్వరుని కూడా మీ లాగే లేదా మీ తీర్థంకరుల లాగానే భావిస్తున్నారు. ఇది మీ అవిద్యా లీలయే. ఈ అవిద్యాదోషాలనుండి విడివడమని కోరితే, వేదాది సత్యశాస్త్రాలను ఆశ్రయించండి. భ్రమలో పడి ఎందుకు చెడిపోతున్నారు?

సంసారం అనాది అనంతమా?

ఇక జైనులు జగత్తును నమ్ముతున్న రీతిని, వారి సూత్రాలను బట్టి వ్రాస్తున్నాము. సంక్షేపంగా మూలానికి అర్థం వ్రాసి తర్వాత సత్యాసత్యాల సమీక్ష వ్రాసెదము.

మూలం - సామి అణాఇ అణన్తే చఉగఇ సంసార ఘోరకాన్తారే ।
మోహాణ కమ్మగురుఠిఇ । వివాగ వసఉ భమఇ జీవో ॥

ప్రకరణరత్నాకరం 2వ భాగం, షష్ఠీశతకం 60.సూత్రం ॥ 2 ॥

ఈ ప్రకరణరత్నాకరం అనే పేరుగల గ్రంథంలో 'సమ్యక్త్వప్రకాశ'మనే ప్రకరణలో గౌతమ మహావీరుల సంవాదం కలదు.

సంక్షేపంగా అందులోని ఉపయోగకరమైన అర్థమేమిటంటే 'ఈ ప్రపంచం అనాదీ, అనంతమూ కాదు. దీనికి ఎన్నడూ ఉత్పత్తి కలుగలేదు. ఇది ఎన్నడూ వినాశనాన్ని పొందదు. అంటే ఒకనితో ఈ జగత్తు చేయబడలేదు' అన్నదే ఆస్తికనాస్తిక సంవాదరూపకంగా "ఓ మూర్ఖుడా! జగత్కర్త ఎవ్వడూ లేడు. అది ఎన్నడూ నిర్మించబడలేదు. ఎన్నడూ నశించదు" అని ఉంది.

సమీక్షకుడు:- సంయోగంతో ఏర్పడినది అనాది, అనంతం ఎన్నడూ కాలేదు. ఉత్పత్తి వినాశాలు లేని కర్మ ఉండదు. జగత్తునందు ఉత్పన్నములైన పదార్థాలన్నీ సంయోగాలు. అవి ఉత్పత్తి వినాశాలను పొందునవిగా తెలుస్తున్నది. అలాగైతే జగత్తు ఉత్పత్తి వినాశాలను ఎలా పొందదు? కావున మీ తీర్థంకరులకు తగిన జ్ఞానం అబ్బలేదు. వారికి సమ్యక్ జ్ఞానం ఉంటే ఇలాంటి అసంభవాలైన విషయాలను ఎందుకు వ్రాసి ఉంటారు?

శిష్యులైన మీరు మీ గురువుల లాగానే ఉన్నారు. మీ మాటలు వినేవానికి పదార్థజ్ఞానమెన్నటికీ కలుగలేదు. చూడండి! ప్రత్యక్షంగా పదార్థం సంయోగజమై ఉన్నట్లు గోచరమవుతుండగా దానికి

ఉత్పత్తి వినాశాలు కలుగుతాయని అంగీకరించరు ఎందుకు? అంటే వీరి ఆచార్యులకు గాని, జైనులకు గాని, భూగోళ ఖగోళ విద్య కూడా తెలియదు. వీరి దగ్గర ఇప్పుడు కూడా అలాంటి విద్య లేదు. ఉండే ఉంటే ఈ క్రింద వ్రాయబడినట్టి అసంభవవార్తలను ఎలా అంగీకరిస్తారు? ఎలా చెప్పుకొంటారు?

చూడండి! ఈ సృష్టిలో పృథ్వీకాయం అంటే పృథ్వి కూడా జీవునికి శరీరమట. అలాగే జలకాయాది జీవులను కూడా నమ్ముతున్నారు. దీనిని ఎవ్వడు కూడా అంగీకరించలేడు. ఇంకా వీరి మిథ్యావార్తలను గమనించండి. జైనులు ఏ తీర్థంకరులను సమ్యక్ జ్ఞానులనీ, పరమేశ్వరులనీ నమ్ముతున్నారో వారి మిథ్యావచనాలకు ఇవి సాదృశ్యాలు. 'రత్నసారభాగం' ప్రథమభాగం ఈ గ్రంథాన్ని జైనులు అంగీకరిస్తున్నారు. ఇది 28 ఏప్రియల్ 1879వ క్రీ.శ. లో కాశీలో ఉండే జైన ప్రభాకర ప్రెస్సులో నానకచంద్ జత్తీగారి ద్వారా అచ్చువేయించబడి ప్రచురించబడినది. అందులోని 145వ పుటలో కాలాన్ని గురించి ఇలా వ్రాయబడింది.

సమయానికి సూక్ష్మకాలమనీ, అసంఖ్యాక సమయాలకు 'ఆవలి' అనీ పేర్కొని ఉన్నారు. ఒక కోటి అరవై ఆరు లక్షల డెబ్బదివేల రెండువందల పదహారు ఆవలీల కొక ముహూర్తమట. అలాంటి ముప్పై ముహూర్తాలకు ఒక 'రోజు', అలాంటి పదిహేను రోజులకు ఒక 'పక్షం', అలా రెండు పక్షాలకు ఒక 'మాసం'. ఆ పన్నెండు మాసాలకు ఒక 'సంవత్సర'మవుతుందంట. ఇక అలాంటి డెబ్బై లక్షల కోట్ల యాభైఆరు వేల కోట్ల సంవత్సకాలకు ఒక పూర్వమనీ, అలాంటి అసంఖ్యాత పూర్వాలకు ఒక పల్యోపమ కాలమనీ అంటారు. అసంఖ్యాత కాలమనగా నాలుగు క్రోసుల వెడల్పు పొడుగు, లోతు గల ఒక చదరపు బావిని త్రవ్వి దానిని 'జుగులీయే' అంటే సూక్ష్మరోమాలుగల మానవుని శరీరంలోని వెంట్రుకలను తీసుకొని ముక్కలు ముక్కలుగా చేసి ఈ క్రింద వ్రాయబడినట్లు నింపాలట. ఇక్కడ గమనించవలసినదేమిటంటే వర్తమానకాలపు మానవుని వెంట్రుకల కంటే 'జుగులీయే' మానవుని వెంట్రుకలు నాలుగువేల తొంబైయారు రెట్లు సూక్ష్మమై ఉంటుందట. అంటే ఆ మానవుని నాలుగువేల తొంబైఆరు వెంట్రుకలను ఒకచోట చేర్చిన ఇప్పటి మానవుని ఒక వెంట్రుక అవుతుంది.

ఇలాంటి జుగులీయే మానవుని ఒక్కొక్క వెంట్రుకలో ఒక్కొక్క అంగుళభాగాన్ని ఏడుసార్లు ఎనిమిదేసి ముక్కలు చేసిన 2097152 ఇరువది లక్షల తొంబైఏడు వేల ఒకవంద యాభై రెండు ముక్కలవుతుంది. ఇలాంటి ముక్కల నుండి పూర్వోక్తమైన బావిని నింపాలట. అందులో నుండి శతవర్షాలకు ఒక పర్యాయం ఒక్కొక్క వెంట్రుకను తీస్తూ పోవాలి. ఇలా ముక్కలు తీయగా బావి వట్టిదైపోయినప్పటికి అది సంఖ్యాతకాలమే అవుతుందట. అందులోని ఒక్కొక్క ముక్కలో అసంఖ్యాతాలైన ముక్కలుగా చేసి ఆ ముక్కల నుండి ఆ బావిని "చక్రవర్తి రాజుగారి సైన్యం దాని మీద నుండి నడిచిపోయిన అణగకుండ" ఒత్తి నింపాలట. ఇక దానిలో నుండి నూరు సంవత్సరాల అంతరాన్ని బట్టి అంటే నూరేండ్లకు ఒకసారి ఒక్కొక్క ముక్కను తీస్తూ పోగా ఆ బావి వట్టిదవటానికి ఎంతకాలం పట్టునో అది అసంఖ్యాతం. ఇలాంటి అసంఖ్యాత పూర్వాలు గడచిపోవాలి. అప్పుడొక పల్యోపమ కాలమవుతుంది. ఆ పల్యోపం కాలం ఈ బావి దృష్టాంతాన్ని బట్టి తెలుసుకోవాలట.

ఇక దశ కోటి కోట్ల పల్యోపమ కాలాలు గడిచిపోయినప్పుడు ఒక సాగరోపమ కాలాన్ని, దశకోటి కోట్ల సాగరోపమకాలాలు గడచిపోయినా ఒక ఉత్సర్పిణీకాలాన్ని, ఒక ఉత్సర్పిణీయు అవసర్పిణీకాలాన్ని గడిచిపోయిన ఒక కాలచక్రాన్ని, ఇలాంటి అనంతకాల చక్రాలు గడచిపోయిన ఒక పుద్గలపరావర్తం అవుతుందట.

ఇక అనంతకాలమని దేనిని అంటారు? 'సిద్ధాంత పుస్తకంలోని తొమ్మిది దృష్టాంతాలతో ప్ర కాల సంఖ్యను నియమించి ఉన్నారో దానికి ఉపరాంతమైనదే అనంతకాలమట. అలాంటి అనంతపుద్గల పరావర్త కాలాలు జీవునికి సంచరిస్తూ గడచినవి' అనే నిత్యాలు వ్రాయబడి ఉన్నాయి.

సమీక్షకుడు:- గణిత విద్య తెలిసిన సోదరులారా! గమనించండి. జైనుల పుస్తకాలలోని కాలసంఖ్యను లెక్కింపగలుగుతారా? లేదా? అలాగే మీరు దీనిని సత్యమనీ నమ్మగలుగుతారా? లేదా? చూడండి! ఈ తీర్థంకరులు ఇలాంటి గణితవిద్య తెలిసి ఉన్నారు. వీరి మతంలో ఇలాంటి గురుశిష్యులున్నారు. వారి అవిద్యకు హద్దులున్నవా?

ఇంకా వీరి అసంభవ విషయాలను వినండి. రత్నసారంలో 1వ భాగం 134వ పుట మొదలుకొని 'బూటావాలే' అనే జైనుల సిద్ధాంత గ్రంథాలేవి కలవో, అవి అన్నీ వారి ఋషభదేవుడు మొదలుకొని మహావీరుని పర్యంతమె ఉంటే" 24 తీర్థంకరుల వచనాల సారసంగ్రహమనబడింది. అందులోని రత్నసారంలో 1వ భాగం 148వ పుటలో "పృథ్వీకాయములలోని జీవులు మన్ను రాయి మొదలైనవి పృథ్వీ భేదాలను తెలుసుకోవలె"నని వ్రాయబడి ఉన్నది. వానిలో ఉండే జీవముల శరీరపరిమాణం ఒక అంగుళంలో అసంఖ్యాతభాగమని తెలుసుకోవాలి. అంటే అత్యంత సూక్ష్మమై ఉంటుంది. వాని ఆయువు పరిమాణం ఎక్కువలో ఎక్కువ ఇరవై రెండువేల సంవత్సరముల పర్యంతముంటుంది.

రత్నసారం 1వ భాగం 149వ పుటలో "ఒక్కొక్క వనస్పతి శరీరంలోని అనంతములైన జీవాలుంటాయని అవన్నీ సాధారణమైన వనస్పతులు అనబడుననీ, కందమూల ప్రముఖాలు, అనంతకాయ ప్రముఖాలైన వానిని సాధారణ వనస్పతీ జీవములు అంటాయనీ' ఉంది. ఇక వాని ఆయుఃప్రమాణం 'అనంత ముహూర్తము' లవుతాయి. అంటే ఇక్కడవారి పూర్వోక్త ముహూర్తమని తెలుసుకోవాలి.

స్పర్శేంద్రియమనే ఒక ఇంద్రియమే వీని శరీరంలో కలదు. అందొక జీవమే ఉంటుంది. కావున అది ప్రత్యేకమైన వనస్పతి అనబడుతుంది. దాని దేహపరిమాణం ఒక సహస్ర యోజనాలు. అంటే పౌరాణికుల యోజనం 4 క్రోసులవుతుంది కానీ జైనుల యోజనం పదివేల క్రోసులు అవుతుంది. అలాంటి నాల్గువేల యోజనాల పరిమాణం వారి శరీరంలో ఉంటుంది. ఇక దాని ఆయుః ప్రమాణం అధికాధికం పదివేల సంవత్సరాలు.

ఇక రెండింద్రియాలు గల జీవాలు. అంటే శరీరం, ముఖం, కలిగి ఉండే శరీరం, గవ్వ, పేను మొదలైనవి. వీని దేహపరిమాణం అధికాధికం నలభైఎనిమిది క్రోసుల స్థూల శరీరం కలది. వీని ఆయుః ప్రమాణం అధికాధికం పన్నెండు సంవత్సరాలు

సమీక్షకుడు:- ఇక్కడ మిక్కిలి తప్పుచేసినాడు. ఎందుకంటే ఇంత పెద్ద శగల జీవులకు ఆయువెక్కువ వ్రాయవలసి ఉన్నది. నలభై ఎనిమిది క్రోసుల స్థూల పరిమాణంగల పేను జైనుల శరీరంలో పడుతుండవచ్చు. వారే చూసి ఉంటారు. ఇంత పెద్ద పేనులను చూసే భాగ్యం ఇతరులకు అబ్బునా? చూడండి! ఎంతటి ఘోరమైన అజ్ఞానాంధకారమో?

రత్నసారం భాగం ॥ 1 ॥ 150వ పుటలో ఇంకా విపరీతం గమనించండి!. "తేలు, దోమ, ఈగ, జోరీగ, ఒక యోజనపు శరీరాలు గలవనీ, వాని ఆయువు ఎక్కువలో ఎక్కువ ఆరు మాసాలనీ" వ్రాయబడి ఉన్నది.

సమీక్షకుడు:- సోదరులారా! నాలుగు క్రోసుల పరిమాణంగల తేలును ఇతరుడెవ్వడూ కూడా చూసి ఉండడు. ఎనిమిది మైళ్ళ విస్తారపు శరీరాలుగల తేళ్ళు, ఈగలు జైనుల మతంలో ఉంటాయి. అలాంటి తేళ్ళను ఈగలను వారి ఇల్లలోనే నివసిస్తుండవచ్చు. వారే చూసి ఉంటారు. ఇతరులెవ్వరూ ప్రపంచంలో చూసి ఉండరు. ఇలాంటి తేళ్ళు ఎన్నడయిన ఒక జైనుని కుట్టిన వాని గతి ఏమైనా ఉంటుందా?

జలచరాలైన మత్స్యాదుల శరీరపరిమాణం ఒక సహస్రయోజనాలట 10000 క్రోసులకొక యోజనమనే వారిలెక్క చొప్పున 10000000 ఒక కోటి క్రోసుల విస్తారపు శరీరాలు కలిగి ఉంటాయి. మరి వాని ఆయుఃప్రమాణం ఒక కోటి పూర్వముల సంవత్సరాలట.

సమీక్షకుడు:- ఇంతటి స్థూల జలచరాలని ఈ జైనులు తప్ప మరెవ్వరూ చూసి ఉండరు. అలాగే ఏనుగు మొదలైన చతుష్పాద జంతువులనేవి రెండు క్రోసులు మొదలుకొని తొమ్మిదిక్రోసుల విస్తారపు శరీరాలు కలవి. ఇక వాని ఆయువు ఎనభైనాలుగు వేల సంవత్సరాలు. ఇక ఇలాంటివి ఎన్నో ఉన్నాయి. ఇంతటి గొప్ప శరీరాలు, ఆయువు గల జీవాలను జైనులే చూసి ఉంటారు. కాబట్టి వారే ఔనంటున్నారు. బుద్ధిమంతుడెవ్వడూ అంగీకరించలేడు.

రత్నసారం-భాగం ॥ 1 ॥ 151వ పుట - జలచరా లను గర్భజలాలైన జీవాల దేహపరిమాణం ఉత్కృష్టంగా ఒక సహస్ర యోజనాలు అంటే ఒక కోటి క్రోసులు. వాని ఆయువు ఒక కోటి పూర్వాల సంవత్సరాలు.

సమీక్షకుడు:- ఇంత గొప్ప శరీరాలు, ఆయువూ గల జీవులను కూడా వీరి ఆచార్యులు స్వప్నంలోనే చూసి ఉండవచ్చు. ఎప్పటికీ సంభవం కాలేదని ఈ వార్తలని నితాంత మసత్యాలని తెలుసుకోవాలి.

ఇక భూమి పరిమాణాన్ని వినండి. రత్నసారం భాగం ॥ 1॥ 152వ పుట - ఈ వంకరగా అడ్డంగా ఉన్న ప్రపంచంలో అసంఖ్యాతలైన ద్వీపాలు, అసంఖ్యాతమైన సముద్రాలు ఉన్నాయి. ఈ అసంఖ్యాతాల ప్రమాణ మెంత అంటే "రెండున్నర సాగరోపమకాలమందు ఎంత సమయం - ఎన్ని రోజులు పట్టునో అన్ని ద్వీపాలు సముద్రాలూ ఉన్నాయని తెలుసుకోవాలి.

ఇక ఈ పృథ్వీలో మొదట జంబూద్వీపమనేది అన్ని ద్వీపాల మధ్య ఉన్నది. దాని పరిమాణం ఒక లక్షయోజనాలు - ఒక అర్బుదం క్రోసులు. దీనికి నలువైపుల లవణ సముద్రం కలదు. దాని పరిమాణం రెండు లక్షల యోజనాల క్రోసులు. - రెండు అర్బుదాల క్రోసులు. ఈ జంబూద్వీపానికి నలువైపుల **'ధాతకీఖండం'** అనే ద్వీపం ఉంది. దాని పరిమాణం నాలుగు లక్షల యోజనాలు - నాలుగు అర్బుదాల క్రోసులు. దాని వెనుక **'కాలోదధి'** సముద్రం ఉంది. దాని పరిమాణం ఎనిమిది లక్షల యోజనాలు - ఎనిమిది అర్బుదాల క్రోసులు - దానికి తర్వాత **'పుష్కరావర్త'** ద్వీపం ఉంది. దాని పరిమాణం పదహారు క్రోసులు ఉంది.

ఆ ద్వీపానికి లోపల **'కోరా'**లు ఉన్నాయి. తద్వీపంలోని అర్థభాగంలో మానవులు నివసిస్తారు. దానికి అవతల అసంఖ్యాకాలైన ద్వీపాలు సముద్రాలు ఉన్నాయి. వానిలో తిర్యగ్యోని సంభూత జీవులున్నాయి.

రత్నసారం - భా. ॥ 1 ॥ 153వ పుట జంబూద్వీపంలో ఒక హిమవంతం, ఒక హిరణ్యవంతం, ఒక హరివర్షం, ఒక రమ్యకం, ఒక దేవకురువు, ఒక ఉత్తరకురువు అనే ఆరు క్షేత్రాలు ఉన్నాయి.

సమీక్షకుడు:- భూగోళవిద్యను తెలిసిన సోదరులారా! వినండి! భూగోళపరిమాణం లెక్కించటంలో మీరు పొరబడ్డారా? లేక జైనులా? జైనులు మరచిపోతే మీరు వారికి తెలుపండి. మీరే మరచిపోతే వారి నుండి తెలుసుకోండి.

కొంచెం విచారించి చూస్తే జైనుల ఆచార్యులును వారి శిష్యులునూ భూగోళ ఖగోళ విద్యలను, గణితవిద్యను, ఎంతమాత్రం తెలిసినవారు కాదని నిశ్చయమవుతున్నది. తెలిసే ఉంటే ఇంతటి గొప్ప అసంభవమైన గప్పాలను ఎలా చెబుతారు? సరి! ఇక ఇలాంటి విద్యా విహీనులైన పురుషులు జగత్తును అకర్తృకమనీ, ఈశ్వరుడు లేడనీ అంటే అందాశ్చర్యమేమి? కావున జైనులు తమ పుస్తకాలను అన్యమతస్థుల విద్వాంసులకు చూపరు. ఎందుకంటే వీరికి ప్రామాణికం అనబడే - తీర్థంకరులతో రచించబడిన - సిద్ధాంత గ్రంథాలలో ఈ విధమైన అవిద్యాయుక్త వార్తలు నిండి ఉన్నాయి. కావున ఎవరినీ చూడనీయరు. చూడనిస్తే వారి రహస్యాలు బయటపడతాయి. వీరు తప్ప కొంచెం బుద్ధి గల ఏ మానవుడయినా ఇలాంటి గప్పాలను సత్యమని అంగీకరించరు.

జైనులు జగత్తును అనాది అని నిరూపించటానికే ఈ ప్రయత్నాలను అన్నిటిని చేసి ఉన్నారు. కాని ఇది పూర్ణంగా అసత్యం. అయినా జగత్కారణం మాత్రం అనాది. ఎందుకంటే అది పరమాణువులు మొదలైన తత్వస్వరూపం కలదై అకర్తృకంగా నున్నది. కాని వాటిలో నియమపూర్వకంగా సంయోగ వియోగాలను పొందే సామర్థ్యమేమీ లేదు. కారణమేమిటంటే 'పరమాణు ద్రవ్యం'అని ఒకదానికి పేరు. ఇక ఆ పరమాణువులు స్వభావంగా వేర్వేరురూపాలు కలిగి జడాలై ఉన్నపుడు అవి తమంతట తాము యథాయోగ్యంగా సంయోగం పొందలేవు. కావున వీని సంయోగపరచేవాడు చైతన్యుడు తప్పక ఉన్నాడు. అతడే జ్ఞానస్వరూపుడు.

చూడండి! పృథ్విని, సూర్యాదిసమస్త లోకాలను నియమమందుంచటం. అనంతుడు, అనాది, చేతనుడు అయిన ఆ పరమాత్ముని పనే. దేనిలో సంయోగరచనా విశేషం గోచరమవుతుందో అలాంటి స్థూలజగత్తు ఎన్నటికీ అనాది కాలేదు. కార్యజగత్తును నిత్యమంటే - దానికి కారణమేదీ ఉండకపోదు. అదే కార్యకారణరూపమయిందటే, తమకు తామే కార్యం, కారణమవటం వలన అన్యోన్యాశ్రయ దోషం, ఆత్మాశ్రయ దోషం సంభవిస్తుంది. తన భుజం మీద తానే ఎక్కటం, తనకు తానే పుత్రుడు తండ్రి అవటం ఎలా అసంభవమో అది కూడా అలాగే అనటం స్పష్టం. కాబట్టి జగత్కర్త ఉన్నాడని తప్పకుండా అంగీకరించాలి.

కర్తకు కర్త కారణానికి కారణం ఉండదు

ప్రశ్న:- ఈశ్వరున్ని జగత్కర్త అని అంగీకరిస్తే ఈశ్వరున్ని చేసినవాడెవడు?

జవాబు:- కర్తకు కర్త, కారణానికి కారణం ఎన్నటికీ ఉండవు. ఎందుకంటే మొదట కర్తా మరియు కారణం ఉండటం వల్లనే కార్యమవుతున్నది. ఎవరిలో సంయోగం, వియోగం సంభవించదో, ఎవడు మొదట సంయోగ వియోగాలకు కారణుడై ఉన్నాడో అతనికొక కర్త కాని, కారణం కాని ఏ విధంగానూ ఉండలేదు. దీని విశేష వ్యాఖ్య ఎనిమిదవ సముల్లాసంలో సృష్టి విషయంలో వ్రాయబడింది. అక్కడ చూడవచ్చు.

ఈ జైనులకు స్థూలవిషయ జ్ఞానం కూడా యథాయోగ్యంగా లేకుంటే పరమ సూక్ష్మమైన సృష్టి విద్యాజ్ఞానం ఎలా కలుగ గలదు? కావున జైనులు సృష్టిని అనాద్యనంతమనీ, ద్రవ్యపర్యాయాలను కూడా అనాద్యనంతాలనీ ప్రతిగుణానికీ, ప్రతి దేశానికీ పర్యాయాలను, ప్రతి పదార్థంలోని అనంతపర్యాయాలను అంగీకరిస్తున్నారు. ఇలా ప్రకరణ రత్నాకరంలోని ప్రథమభాగంలో **'దేవచంద్ర'** విరచిత **'నయనచక్రసారం'**, ప్రథమ ముద్రణలో 186వ పుటలో వ్రాయబడి ఉన్నది.

ఈ విషయం కూడా ఎన్నటికీ సంఘటిల్లలేదు. ఎందుకంటే ఏ వస్తువులకు అంతం (మేర) కలదో తత్సంబంధం కలవన్నీ అంతం కలవే అవుతాయి. అనంతాన్ని అసంఖ్యాతమని అనుకుంటే అది కూడా సంఘటిల్ల లేదు. కాని ఇది జీవుని విషయంలో సంఘటిల్లుతుంది. పరమేశ్వరుని విషయంలో కాదు. ఎలాగంటే "ఒక్కొక్క ద్రవ్యంలో తమ తమ ఒక్కొక్క కార్యకారణ సామర్థ్యాన్ని, విభాగం కానట్టి పర్యాయాలను బట్టి' అనంత సామర్థ్యాన్ని అంగీకరించటం కేవలం విద్యాయుక్తమైన మాటే.

ఒక పరమాణు ద్రవ్యం సీమకలదేని దానిలో అనంతవిభాగాలను పర్యాయాలు ఎలా ఉండగలుగుతాయి? ఇలాగే ఒక్కొక్క ద్రవ్యంలో అనంత గుణాలు ఒక్కొక్క గుణప్రదేశంలో విభాగం కానట్టి అనంత పర్యాయాలను కూడా అనంతాలని అంగీకరించటం కేవలం పసితనపు మాటే. కారణమేమిటంటే దేని అధికరణానికి అంతం ఉందో దానిలో ఉండేవానికి అంతమే ఉండదు? ఇలాంటి విస్తారాలైన మిథ్యావార్తలు ఎన్నో వ్రాయబడి ఉన్నాయి.

జడపుద్గలం- పాపపుణ్యాలు

ఇక జీవాజీవాలను రెంటిని జైనులు ఈ క్రింద వ్రాయబడినట్లు నమ్ముతున్నారు.

చేతనాలక్షణో జీవః స్యాదజీవ స్తదన్యకః ।
సత్కర్మపుద్గలాః పుణ్యం పాపం తస్య విపర్యయః ॥ స.ద.సం. ఆర్హత దర్శనం ॥

ఇది 'జినదత్తసూరి' వచనం. ఇలాగే ప్రకరణ రత్నాకర ప్రథమభాగంలోని 'నయచక్రసారం'లో 192వ పుటలో కూడా వ్రాయబడి ఉన్నది. చేతనాలక్షణం కలది జీవం. చేతనారహితమైనది అజీవం. అంటే జడం, సత్కర్మరూపపుద్గలం పుణ్యమనీ, పాపకర్మరూప పుద్గలం పాపమనీ అనబడుతుంది.

సమీక్షకుడు:- జీవజడాల లక్షణాలు బాగానే ఉన్నాయి. కాని జడరూపాలైన పుద్గలాలను అవి పాపపుణ్యయుక్తం ఎన్నటికీ కాలేవు. ఎందుకంటే పాపపుణ్యాలు చేసే స్వభావం చైతన్యానిది. అంటే జీవునిది. చూడండి! ఈ జడ పదార్థాలు ఎన్ని ఉన్నాయో అవి అన్నీ పాపపుణ్యాల నుండి వేరై ఉన్నాయి. జీవులను అనాది అనుచున్నారు. అది సరే కాని అల్పజ్ఞుడైన ఆ జీవుని ముక్తి దశలో సర్వజ్ఞుడని అంగీకరించటం మాత్రం అసత్యమే. ఎందుకంటే అల్పుడు అల్పజ్ఞుడైన అతని సామర్థ్యం కూడా సర్వదా సమీపస్థమై ఉంటుంది.

జగత్తు, జీవకర్మలు, బంధం అనాదులు కావు

జైనులు జగత్తును, జీవులను, జీవుల కర్మలను, బంధాలను అనాది అని నమ్ముతున్నారు. జైనుల తీర్థంకరులు ఇక్కడ పప్పులో కాలువేసారు. ఎలాగంటే సంయుక్తమై ఉన్న జగత్తుకు కార్యకారణాలు, ప్రవాహరూపమైన కార్యం, జీవుని కర్మలు, బంధాలన్నీ ప్రవాహంలో అనాదులు, కాని స్వరూపంతో కాదు. స్వరూపంలో కర్మలు, బంధం అనాదులని అంగీకరిస్తే కర్మల నుండి బంధాలనుండి విడిపోవటానికి ఎలా అంగీకరిస్తున్నారు? ఎందుకంటే అనాదియైన పదార్థం ఎన్నటికీ విడిపోదు కదా!

అనాది పదార్థమైనా నశిస్తుందంటే మీరు అనాది అని నమ్మినట్టి పదార్థాలన్నీ నశిస్తాయనే మాట స్థిరపడగలదు. అలాగే అనాది పదార్థాలను నిత్యములంటే, కర్మలు, బంధాలు కూడా నిత్యాలే అవుతాయి. అన్ని కర్మలు విడిపోవటం వలన ముక్తి కలుగుతుందని నమ్ముతుంటే, అన్ని కర్మల నుండి విడిపోతారనటం ముక్తికి నిమిత్తం అయ్యాయి. అలా అయితే ముక్తి నైమిత్తికం అనబడుతుంది. ఇంకా అది ఎల్లప్పుడు ఉండేది కాలేదు. కర్మకర్తల సంబంధం నిత్యమవటంవలన కర్మలు ఎన్నటికీ విడిపోకుండా ఉంటాయి. మీరు నిత్యంగా నమ్మిన మీ ముక్తి, మీ తీర్థంకరులకు కలుగలేదు.

సాధన - సాధ్యముక్తి నిత్యం కాదు

ప్రశ్న:- ధాన్యపు పొట్టును తీసివేయటం వలన గాని అది అగ్ని సంయోగమవటం వలన గాని ఆ విత్తు తిరిగి మొలవనట్లు ముక్తిని పొందిన జీవుడు మళ్ళీ జన్మమరణరూపమైన సంసారానికి రాడు.

జవాబు:- జీవులకు కర్మలకు గల సంబంధం పొట్టు విత్తువంటిది కాదు. వీనికి సమవాయ సంబంధం కలదు. కావున అనాదికాలం నుండి జీవునికి కర్మలకు కర్తృత్వ శక్తికి సంబంధం ఉన్నది. జీవునిలో కర్మచేసే శక్తి కూడా లేదంటే జీవులందరు పాషాణ సమానులవుతారు. ఇక ముక్తిని అనుభవించే సామర్థ్యం కూడా ఉండదు.

ఎలాగంటే అనాది కాల సంబంధమైన కర్మబంధనం విడిపోయి జీవుడు ముక్తి పొందుతున్న మీ నిత్యముక్తి నుండే విడివడి బంధనంలో చిక్కును. ఎందుకంటే కర్మరూపాలను ముక్తిసాధనాల నుండి సైతం దూరమై జీవుడు ముక్తిపొందుతాడని నమ్ముతున్నట్లే నిత్యముక్తి నుండే విడివడి బంధనంలో పడతాడు.

సాధనాలతో సిద్ధమైన పదార్థం ఎన్నటికీ నిత్యం కాలేదు. సాధనాలతో సిద్ధించనట్లు ముక్తిని నమ్మితే కర్మ లేకయే బంధనం సంప్రాప్తమవుతుంది. వస్త్రంలోని మురికి ఉతుకటం వలన దూరమైపోతుంది. తిరిగి మురికి అలాగే చేరుతుంది. అసత్య రాగద్వేషాల ఆశ్రయంచేత జీవునికి కర్మరూపఫలం కలుగుతుంది. ఇక సమ్యక్ జ్ఞానం, దర్శనం, చరిత్ర అనే వీనితో నిర్మలుడవుతాడనీ, మలమంటు కారణాలను బట్టి కల్మషుడౌతాడనీ నమ్ముతున్నారేని ముక్తజీవులు సంసారులవుతారనీ సంసారంలోని జీవులు ముక్తులవుతారనీ అవశ్యముగ తప్పకుండా అంగీకరించవలసి వస్తుంది. ఏమిటంటే నిమిత్తాల ద్వారా మాలిన్యం దూరమయినట్లే నిమిత్తాలచేత మాలిన్యం కూడా అంటుకొంటుంది. కావున జీవునికి బంధమోక్షాలు ప్రవాహరూపంలో అనాదులని ఒప్పుకోండి. అవి (స్వరూపంతో) అనాది అనంతాలు కావు.

ప్రశ్న:- జీవుడు ఎన్నడూ నిర్మలుడు కాడు. మలినంతో కూడినవాడే.

జవాబు:- నిర్మలుడుగా ఎన్నడూ లేకుంటే నిర్మలుడు కానే కాడు. శుద్ధమైన వస్త్రానికి మలినమంటిన ఉతికేస్తే పోతుంది. వస్త్రం యొక్క స్వాభావికమైన శ్వేతవర్ణాన్ని దూరపరచలేము. మరల వస్త్రానికి మైల అంటవచ్చును. ఆ ప్రకారమే ముక్తిలోనూ సంభవించును.

ప్రశ్న:- జీవుడు పూర్వమార్జించిన కర్మవల్లనే శరీరాన్ని ధరిస్తున్నాడు. కావున ఈశ్వరున్ని అంగీకరించటం వ్యర్థం.

జవాబు:- కర్మలే శరీరధారణనకు నిమిత్తమై ఈశ్వరుడు కారణం గాకుంటే జీవుడు దుఃఖం అధికంగల దుర్జన్మను ఎన్నడూ ధరించకపోతాడు. సదా ఉత్తమమైన జన్మములనే ధరిస్తుంటాడు. కర్మలు ప్రతిబంధకాలు అయితే దొంగ స్వయంగా కారాగృహానికి పోడు. స్వయంగా ఉరిబెట్టుకోడు. కాని రాజు శిక్షిస్తున్నాడు. అలాగే జీవునికి శరీరాన్ని ధరింపచేసేవాడు, వానికి కర్మానుసారం ఫలం పొందజేయువాడు పరమేశ్వరుడు గలడని మీరు కూడా అంగీకరించండి.

ప్రశ్న:- మత్తులాగా కర్మ స్వయంగా ప్రాప్తమవుతున్నది. ఫలం పొందటానికి రెండవవాని అవసరం లేదు.

జవాబు:- అలాగైతే సదా మత్తుపదార్థాలు సేవించేవానికి మత్తు అంతగా కలుగక అభ్యాసంలేని వానికి విశేషంగా కలుగుతున్నట్లు, నిత్యం అనేక పాపపుణ్యాలను చేసేవారికి ఫలం తక్కువవుతుంది. ఒకానొకప్పుడు కొద్దికొద్దిగా పాపపుణ్యాలు చేసేవారికి అధికంగానే అనిపిస్తుంది. మరియు అల్ప కర్మములను చేసే వారికి ఫలం అధికంగా లభిస్తుంది.

ప్రశ్న:- ఎవరి స్వభావం ఎలా ఉందో వారికి అలాగే ఫలం లభిస్తుంది.

జవాబు:- స్వభావం వలన కలుగునన్న, స్వభావానికి వియోగం కానీ లేక సంయోగం కానీ కలుగదు. కాని, పరిశుభ్రమైన వస్త్రానికి నిమిత్తాలతో మలమంటుకొనినట్లు, అది విడదీస్తే నిమిత్తంతో వీడిపోవునట్లు అంగీకరించటం సమంజసం.

ప్రశ్న:- సంయోగం లేక కర్మ పరిణామాన్ని పొందదు. ఎందుకంటే పాలతో పులుపుకి సంయోగం కాకుంటే పెరుగు కాదు. ఆ ప్రకారమే జీవకర్మల యోగంచేతనే కర్మ పరిణామం పొందుతుంది.

జవాబు:- పాలలో పులుసును చేర్చేవాడు మూడవవాడవుతాడు. అలాగే జీవులను కర్మఫలంతో చేర్చటానికి మూడవవాడు ఈశ్వరుడుండాలి. ఎందుకంటే జడపదార్థాలు తమంతట తాము నియమపూర్వకంగా సంయుక్తాలు కాలేవు. జీవులు కూడా అల్పజ్ఞులు అవటంవలన స్వయంగా తమ కర్మఫలాలను పొందలేరు. ఈశ్వర స్థాపిత సృష్టిక్రమం లేకపోతే కర్మఫల వ్యవస్థ కలుగలేదు.

ప్రశ్న:- కర్మనుండి ముక్తుడైనవాడే ఈశ్వరుడవుతాడు.

జవాబు:- అనాదికాలంనుండి జీవులకు కర్మలతో సంబంధం ఉన్నప్పుడు వాటి నుండి జీవులెన్నడూ ముక్తులు కాలేరు.

ప్రశ్న:- కర్మబంధం సాది - ఆది కలదై ఉన్నది.

జవాబు:- కర్మబంధం 'సాది' అయితే కర్మయోగం 'ఆది' ఎలా అవుతుంది? సంయోగానికి పూర్వం జీవుడు నిష్కర్ముడవుతాడు. నిష్కర్ముడైనవానికి కర్మ తగులుకొంటే ముక్తులకు కూడా తగులుకొంటుంది. కర్మకు కర్తకు సమవాయమనే నిత్యసంబంధం ఉంటుంది. అది ఎన్నడూ వేరుకాదు. కావున తొమ్మిదవ సముల్లాసంలో మేము వ్రాసినట్లు అంగీకరించక తప్పదు.

జీవుడు తన జ్ఞాన సామర్థ్యాలను ఎంత వృద్ధిచేసుకొన్నా అతనిలో పరిమిత జ్ఞానం, పరిమిత సామర్థ్యం ఉంటుంది. ఈశ్వర సమానుడు ఎన్నడూ కాలేడు. ఎంత సామర్థ్యం వృద్ధిపొందటం ఉచితమో, అంతే యోగం ద్వారా వృద్ధిపొందగలడు.

జీవ పరిమాణం

జైనులలో అర్హతలు దేహపరిమాణాన్ని బట్టి జీవపరిమాణాన్ని నమ్ముతున్నారు. ఇలాగైతే ఏనుగులో ఉండే జీవుడు చీమలో ఉంటాడు. చీమలోని జీవుడు ఏనుగులో ఎలా ఇముడుతాడు? అని వారిని

అడగాలి? ఇలా అంగీకరించటం మూర్ఖత్వమే అవుతుంది. ఎందుకంటే జీవుడు ఒక సూక్ష్మ పదార్థం. ఒక పరమాణువులో ఉండగలడు. అతని శక్తులు శరీరంలోని ప్రాణాలు, విద్యుత్తు, నాడి మొదలైన వాటితో సంయుక్తమై ఉంటుంది. వాటివల్ల శరీరస్థితి తెలుసుకుంటున్నాడు. మంచి సహవాసం వలన మంచివాడు, చెడ్డవారి సాంగత్యంవలన చెడ్డవాడు అవుతున్నాడు.

జైనులు అంగీకరించే ధర్మాలు

మూలం - రే జీవ భవ దుహాఇం ఇక్కం చియ హరఇ జిణమయం ధమ్మం ।
ఇయరాణం పరమంతో సుహ కయ్యే మూఢ ముసి ఓసి ॥

॥ ప్రకరణరత్నాకరం. భా. 2. షష్ఠీ శతకం 61. సూత్రాంకం 3 ॥

ఓరి జీవుడా! ఒక్క జినమతమే వీతరాగ భాషిత ధర్మం. సంసార సంబంధాలైన జన్మ, జరా, మరణాది దుఃఖాలను హరిస్తాడు. కావున జైనమతస్థులైన వారినే సుదేవులు, సుగురువులని తెలుసుకోండి. ఇతర వీతరాగులైన ఋషభదేవుడు మొదలుకొని మహావీరుని పర్యంతపు వీతరాగ దేవుల కంటే భిన్నులైన హరిహర బ్రహ్మాది కుదేవతలను తమ కల్యాణార్థం పూజించే మానవులందరు మోసపోయినవారేనని తెలుసుకోండి. అంటే జైనమతస్థులైన సుదేవులను, గురువులను, సుధర్మాన్ని సేవించక ఇతర కుదేవులను, కుగురువులను కుధర్మాన్ని సేవించటంవలన ఏమీ లాభం లేదని దీని భావం.

సమీక్షకుడు:- జైనుల ధర్మగ్రంథం ఎలాంటి నిందలతో కూడి ఉన్నాయో విద్వాంసులు విచారింతురు గాక!

మూలం:- అరిహం దేవో సుగురూ సుద్ధం ధమ్మం చ పంచ నవకారో ।
ధన్నాణం క యచ్ఛాణం నిరంతరం వసఇ హియయమ్మి ॥

॥ ప్రకరణరత్నాకరం. భా. 2. షష్ఠీ శతకం 61. సూత్రాంకం 1 ॥

అరిహన్ దేవేంద్రులతో పూజించబడటానికి యోగ్యుడు. అతని కంటే ఉత్తమ పదార్థం మరొకటి లేదు. ఇలా దేవతలకు దేవుడై శోభాయమానుడైన అరిహంతదేవుడు జ్ఞాన క్రియావంతుడు. శాస్త్రోపదేష్టా, శుద్ధుడు, కషాయమలరహితుడు, సమ్యక్త్వవినయాలు కలవాడు దయామూలమైన శ్రీ జినదేవునితో భాషిత ధర్మమే దుర్గతిలో పడే ప్రాణులను ఉద్ధరింపజేస్తాడు. ఇతర హరిహరాదుల ధర్మం సంసారంనుండి ఉద్ధరింప చేసినది కాదు. పంచ అరిహన్తాలకు పరమేష్ఠి తత్సంబంధాలకు నమస్కారం, దయ, క్షమ, సమ్యక్త్వజ్ఞానం, దర్శన, చరిత్రలను నాలుగు పదార్థాలు శ్రేష్ఠాలు. ఇదే జైనుల ధర్మం.

సమీక్షకుడు:- మనుషులైన వారందరిపై చూపని దయ దయ కాదు. క్షమక్షమ కాదు. జ్ఞాన దర్శనాలకు బదులుగా అజ్ఞానాంధకారాలు, శీలానికి బదులుగా ఉపవాసం ఉండటం మంచి విషయమా?

జైనమత ధర్మ ప్రశంస

మూలం - జఇ న కుణసి తవ చరణం న పఢసిన గుణేసి దేసి నో దాణమ్ ।
తా ఇ త్తియం న సక్కిసి జం దేవో ఇక్క అరిహంతో ॥

॥ ప్రకరణరత్నాకరం. భా. 2. షష్ఠీ శతకం 60. సూత్రాంకం 2 ॥

అర్థం:- ఓ మానవుడా! నీవు తపస్సు చేయకుంటే, శీలవంతుడవు కాకుంటే, సూత్రాలను చదువకుంటే సందర్భాన్ని బట్టి ఆలోచించకుంటే, మంచివారికి దానమీయకుంటే ఆరాధింపబడటానికి యోగ్యుడైన ఒక్క అరిహంత దేవుడ్ని సుగురువునందు లేదా సుధర్మమనే జైనమతంలో విశ్వాసం ఉంచి శ్రద్ధగలవాడవైతే అదే నీ ఆత్మోద్ధరణకు కారణమవుతుంది. ఇదే సర్వోత్తమ ధర్మం.

సమీక్షకుడు:- దయాక్షమాలు మంచివైనప్పటికీ పక్షపాతంలో చిక్కటం వలన దయ అదయగాను, క్షమ అక్షమగాను మారుతుంది. దీని ప్రయోజనమేమిటంటే, ఏ జీవికీ దుఃఖం కలిగించకపోవటం అనేది సర్వథా అసంభవం. ఎందుకంటే దుష్టులను దండించటం కూడా దయగా ఎంచబడుతుంది. ఒక దుష్టుని దండించకుంటే వేలకొద్ది మానవులకు దుఃఖం కలుగుతుంది. కావున అలాంటి దయ దయ కాదు. మరియు అట్టి క్షమ క్షమ కాదు.

సర్వప్రాణుల దుఃఖాలు నశించటాకి, సుఖం కలగటాకి ఉపాయం చేయటమే 'దయ' అంటారు. జలం వడగట్టి త్రాగటం, క్షుద్రజంతువులను కాపాడటం మాత్రమే దయ కాదు. ఇలాంటి దయను జైనులు చెబుతారే కాని అలా వారు నడువరు. మానవులు ఏ మతం వారైనా సరే వారిపై దయ చూపుతూ వారిని అన్నపానాలతో సత్కరిస్తూ, అన్యమతస్థులైన విద్వాంసులను గౌరవిస్తూ వారికి సేవ చేయటం దయ కాదా?

ఒకటి:- 'పరమతాల స్తుతి' అంటే ఇతర మతాలలోని గుణాలను ఎన్నడూ కీర్తించకూడదు.

రెండవది:- వారికి 'నమస్కారం' కూడా చేయకూడదు.

మూడవది:- ఇతర మతస్థులతో తక్కువగా మాట్లాడాలి.

నాల్గవది:- వారితో పలుమార్లు మాట్లాడరాదు.

ఐదవది:- వారికి అన్నవస్త్రాలను దానం చేయరాదు.

ఆరవది:- ఇతర మతాలవారి ప్రతిమలను పూజించటానికి గంధపుష్పాలను ఇయ్యరాదు.

ఈ ఆరు విధాలైన కర్మలను జైనులెన్నడూ చేయరాదు.

సమీక్షకుడు:- ఇప్పుడు ఈ జైనులు అన్యమతస్థుల మీద ఎంత నిర్దయ, కుదృష్టి, ద్వేషం కలిగి ఉన్నారో బుద్ధిమంతులైన మీరే ఆలోచించండి. అన్యమతస్థులైన మనుషులమీద ఇంత నిర్దయ కలిగితే, ఈ జైనులు దయా విహీనులే అనదగుదురు. ఎలాగంటే తమ ఇంటివారి సేవచేయటం ఒక గొప్ప ధర్మం కాదు. తమ మతస్థులు తమ ఇంటివారివంటివారు. అందువల్లనే వారు వారి సేవ చేస్తున్నారు.

అన్యమతస్థుల సేవ చేయరు. ఇక వారిని దయావంతులని ఏ బుద్ధిమంతుడనగలడు? "మథురానగర రాజుగారి మంత్రియైన 'నముచి'ని జైనమతస్థులు తమ విరోధి అని భావించి చంపివేసారు. తర్వాత ప్రాయశ్చిత్తం చేసుకొని శుద్ధులైనారు అని వివేకసారం 108వ పుటలో వ్రాసి ఉన్నది.

ఏమి? ఇది కూడా దయా క్షమల నశింపజేసే పని కాదా? అన్యమతస్థుల మీద, ప్రాణం తీయునంతటి వైరబుద్ధిని ఉంచితే వీరిని దయావంతులనటానికి బదులు హింసకులనుటయే మంచిది.

ఇక సమ్యక్త్వదర్శనాల లక్షణాలు "ఆర్హత ప్రవచన సంగ్రహ పరమాగమసారం"లో చెప్పబడ్డాయి. సమ్యక్ శ్రద్ధానం, సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ శీలం అనే ఈ నాలుగు మోక్ష మార్గానికి సాధనాలు. వీటికి వ్యాఖ్యానం రచించినవాడు యోగదేవుడు. ఏ రూపంతో జీవాదిద్రవ్యాలు అవస్థితాలై ఉన్నాయో ఆ రూపంతోనే జినునితో ప్రతిపాదించబడిన గ్రంథానుసారానికి విపరీతమైన అభినివేశాది రహితమైనట్టి శ్రద్ధ - జినమతంలో గల ప్రీతి - 'సమ్యక్ శ్రద్ధానం" అని 'సమ్యక్ దర్శనం'అని అంటారు.

రుచిర్జినో క్త తత్వేషు సమ్యక్ శ్రద్ధానముచ్యతే ॥ స.ద.సం. ఆర్హత దర్శనం ॥ పుట.62 ॥

జినోక్త తత్వాలలోనే సమ్యక్ శ్రద్ధని ఉంచాలి. అంటే మరెక్కడా కూడా శ్రద్ధని ఉంచరాదు.

యథావస్థితతత్వానాం సంక్షేపాద్విస్తరేణ వా ।
యోఽవబోధ స్త మత్రాహుః సమ్యక్ జ్ఞానం మనీషిణః ॥
స.ద.సం. ఆర్హత దర్శనం ॥ పుట. 63 ॥

జీవాది తత్వముల యథార్థమైన బోధ సంక్షేపముగానో లేక విస్తారము గానో కలుగు బోధను బుద్ధిమంతులు సమ్యక్ జ్ఞానమంటారు.

సర్వథాఽవద్య యోగానాం త్యాగశ్చారిత్రముచ్యతే ।
కీర్తితం తదహింసాది వ్రతభేదేన పంచధా ।
అహింసాసూనృతాస్తేయ బ్రహ్మచర్యాపరిగ్రహాః ॥ స.ద.సం. ఆర్హత దర్శనం ॥ పుట. 65 ॥

అన్ని విధాలుగా నిందనీయమైన అన్యమతసంబంధ త్యాగమే శీలమనబడుతుంది. అహింసాది భేదాలతో వ్రతాలు ఐదు విధాలు.

ఒకటి:- అహింస - ఏ ప్రాణిని కూడా చంపకుండుట.

రెండవది:- సూనృత - మధుర భాషణముచేయుట.

మూడవది:- అస్తేయ - దొంగతనము చేయకుండుట.

నాల్గవది:- బ్రహ్మచర్యం - ఉపస్థేంద్రియ సంయమనం.

ఐదవది:- అపరిగ్రహః - అన్ని వస్తువులను త్యజించటం.

సమీక్షకుడు:- ఇందులో కొన్ని మంచిమాటలు ఉన్నాయి. అవి ఏవంటే, హింస, స్తేయం మొదలైన నిందితములైన కర్మలను త్యజించటం మంచిదే కాని పరమతాలను నిందించటం మొదలుగాగల దోషాలతో కూడా అందులో ఈ మంచిమాటలు కూడా దోషయుక్తాలైనాయి. ఇతర హరిహరాల ధర్మం సంసారంనుండి ఉద్ధరింపచేసేది కాదని ప్రథమ సూత్రంలో వ్రాయబడింది. ఏమి? చిన్న నిందయా? వారి గ్రంథాలను అవలోకించటంవలన విద్యా, ధర్మం పూర్ణంగా ప్రకటమవుతుండగా, వానిని చెడ్డవనటం పైన చెప్పబడిన మహా అసంభవాలైన మాటలను చెప్పే తమ తీర్థంకరులను స్తుతించటం కేవలం దురాగ్రహమనే చెప్పాలి.

ఇక జైనులు ఏ మాత్రం శీలవంతులు కాకున్నా చదవటానికి గాని, దానమివ్వటానికి గాని సామర్థ్యం లేనివారైనా జైనమతం మాత్రం సత్యమైనదనటం తగదు. ఏమి? ఏతన్మాత్రకథనంచేత వారు ఉత్తములవుతారా? అన్యమతంలోని శ్రేష్ఠులు కూడా అశ్రేష్ఠులవుతారా? ఇలాంటి మాటలను చెప్పే మానవులను భ్రాంతులని, బాలబుద్ధి గలవారని అనక మరేమనాలి?

దీనివలన వీరి ఆచార్యులు స్వార్థపరులై ఉన్నారని, విద్వాంసులు కారని తెలుస్తున్నది. ఎందుకంటే అందరిని నిందించకుంటే ఇలాంటి అబద్ధపు మాటలలో ఎవడూ చిక్కకుండా ఉంటాడు. మరి వారి ప్రయోజనం కూడా నెరవేరకపోదు. చూడండి ! దీనివలన జైనులమతం ముంచివేస్తుందని, వేదమతమందరినీ తరింపచేస్తుందని సిద్ధమవుతున్నది. ఇక హరిహరాది దేవతలు సుదేవతలని వీరి ఋషభదేవాదులందరికీ దేవతలనీ, ఇతరులంటే వారికి అలాగే చెడ్డగా తోచదా? ఇంకా వీరి ఆచార్యులయొక్క, అనుచరుల యొక్క పొరపాట్లను గమనించండి :-

మూలం:- జిణవర అణా భంగం, ఉమగ్గ ఉస్సుత్త లేస దేసణఉం ।
అణా భంగే పావం తా జిణమయ దుక్కరంధమ్మమ్ ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ శ. 61 సూ.11 ॥

అర్థం:- ఉన్మార్గం - ఉత్సూత్రాలను లేశమాత్రం చూపటం వలన, జినవరుల - వీతరాగ తీర్థంకరుల యాజ్ఞకు భంగం కలుగుతుంది. కావున అది దుఃఖానికి హేతువైన పాపం. జినేశ్వరునితో చెప్పబడిన సమ్యక్త్వాది ధర్మాన్ని గ్రహించటం మిక్కిలి కఠినం. కాబట్టి జినాజ్ఞకు భంగం కలుగనట్లు నడచుకోవాలి.

సమీక్షకుడు:- తన నోటితో తానే పొగుడుకోవటం, తన ధర్మమే గొప్పదంటూ ఇతరులను నిందవేయటం మూర్ఖత్వంగాక మరేమవుతుంది? ఎందుకంటే ఇతర విద్వాంసులు ఎవనిని పొగడుతారో వానిని గురించి ప్రశంస చేయటం సమంజసమే. దొంగలు కూడా తమ నోటితో తమ ప్రశంస చేసికొంటే వారు ప్రశంసనీయులు కాగలరా? వీరి సంగతులు కూడా ఇలాంటివే అనటం స్పష్టం.

మూలం:- బహుగుణవిజాయిఖనిల ఓ ఉసుత్తభాసీ తహా విముత్తవ్వో ।
జహా పర మణి జుత్తో విహు విగ్ఘకరో లోఏ ॥

ప్ర. భా. 2 షష్ఠీ 60. సూత్రము 18. ॥

అర్థం:- విషం గల సర్పంలో ఉన్న మణి త్యజించదగినదై ఉన్నట్లు జైనమతంలో లేనివాడెంత గొప్ప ధర్మాత్ముడు, పండితుడు అయినా అతన్ని త్యజించటమే జైనులకు ఉచితం.

సమీక్షకుడు:- చూడండి ! ఇదెంత గొప్ప పొరపాటో! వీరి శిష్యులు, ఆచార్యులును విద్వాంసులైతే విద్వాంసులను ప్రేమిస్తారు. వీరి తీర్థంకరులే అవిద్వాంసులైనప్పుడు విద్వాంసులను ఎందుకు గౌరవిస్తారు? మట్టిలో పడిన బంగారాన్ని ఎవడైన వదలివేస్తాడా? ఇంతటి పక్షపాతంకలవారు, హఠులు, దురాగ్రహులు, విద్యావిహీనులైనవారు జైనులు తప్ప మరెవ్వరూ ఉండరని దీనివల్ల సిద్ధమవుతున్నది.

మూలం:- అఇసయ పావియ పావా ధమ్మిఅ పబ్బే సు తోవి పావ రయా ।
న చలన్తి సుద్ధ ధమ్మా ధన్నా కివిపావ పవ్వేసు ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.29 ॥

అర్థం:- ఇతర దర్శనాలను అంగీకరించే కులింగులను అంటే జైనమతవిరోధులను జైనులు చూడనే కూడదు.

సమీక్షకుడు:- ఇదెంతటి పామరుల నిర్ణయమో బుద్ధిమంతులు ఆలోచించెరు గాక! వాస్తవంగా ఎవరి మతం సత్యమో అతడెవరికీ భయపడడు. తమ మతంలో సారం లేదని జైనాచార్యులకు తెలుసు. ఇతరులకు చెబితే అది ఖండించబడుతుందనీ తెలుసు. కావున అందరిని నిందిస్తూ మూర్ఖజనులను తమ వలలో వేసుకొంటుంటారు.

మూలం:- నా మంపి తస్స అసుహం జేణ నిదిఠాఇ మిచ్ఛ పవ్వాఇ ।
జేసిం అణుసంగాఉ ధమ్మీణవి హోఇ పావ మఈ ॥

॥ ప్రకర రత్నాకరం భాగం. 2, షష్ఠీ 60, సూత్రము 27 ॥

అర్థం:- జైనధర్మానికి విరుద్ధాలైన ధర్మాలన్నీ మానవులను పాపాత్ములను చేస్తుంది. కావున అందరూ అన్యధర్మాన్ని స్వీకరించక కేవలం జైనధర్మాన్ని మాత్రమే స్వీకరించటం శ్రేష్ఠం.

సమీక్షకుడు:- "అందరితో వైరం - విరోధం కలుగజేస్తూ నింద ఈర్ష్య మొదలైన దుష్కర్మరూపసాగరంలో ముంచివేసేది ఈ జైనమతమే అని దీనితో సిద్ధమవుతున్నది. జైనులు సర్వజన నిందకులైనట్లు అన్యమతస్థులెవ్వరూ మహానిందకులు అధార్మికులు కారు. ఒకవైపు నుండి అందరిని నిందిస్తూ తమను తాము అతిగా పొగుడుకొంటూ మూర్ఖులైన మానవుల పనులే కాని వేరు కాదు. వివేకం కలవారు 'ఎవ రే మతస్థులైనా కానీయండి' మంచివారిని మంచివారని, చెడ్డవారిని చెడ్డవారని చెబుతారు.

మూలం:- హాహా గురుఅ అకజ్జుఖం సామీ న హు అచ్ఛి కస్స పుక్కరిమో ।
కహ జిణ వయణ కహ సుగురు పావయా కహ ఇయ అకజ్జుఖమ్ ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ సూ. 35 ॥

అర్థం:- సర్వజ్ఞభాషితాలైన జినవచనాలు, జైనుల సుగురువులు జైన ధర్మం ఎక్కడ? వారికి విరోధులైన కుగురువులు, అన్యమార్గోపదేశకులెక్కడ? అంటు తమ మతంవారు సుగురువులు, సుదేవతలు, సుధర్ములు. ఇతర మతంవారు కుదేవతలు, కుగురువులు, కుధర్ములు అని భావం.

సమీక్షకుడు:- ఈ విషయం రేగుపండ్లను అమ్ముకొని బ్రతుకు ముసలమ్మ మాటలలాగా ఉన్నాయి. ఆమె తన పుల్లని రేగుపండ్లను తియ్యనివని, ఇతరుల తియ్యని పండ్లను పుల్లనివని, అవి మంచివి కావని అన్నట్లే ఈ జైనుల సంగతులును కలవు. వీరు తమకంటే భిన్నులైన మతస్థుల సేవ చేయటాన్ని గొప్ప అకార్యంగా - పాపంగా భావిస్తున్నారు.

మూలం:- సప్పో ఇక్కం మరణం కుగురు అణంతాఇ దేహ మరణాఇ ।
తో వరిసప్పం గహియుం మా కుగురుసేవణం భద్దమ్ ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ. 37 ॥

అర్థం:- ఇంతకు పూర్వం వ్రాసినట్లుగా సర్పమునందలి మణిని వదిలివేయునట్లు అన్యమార్గములందలి శ్రేష్ఠులు, ధర్మాత్ములును అగు పురుషులను కూడ త్యజింపవలెను. ఇంకను జైనులు దీనికంటె అధికముగ అన్యమతస్థులను నిందించుచున్నారు. ఎట్లన జైనమతమునకు భిన్నులగు వారందరు కుగురువులు. వారు సర్పముకంటెను చెడ్డవారు. వారి దర్శనము కాని, సేవకాని, సాంగత్యము గాని ఎన్నడును చేయకూడదు. ఎందుకనగా సర్పముతో సహవాసము చేయుటవలన ఒక్కసారే మరణము కలుగును. అన్యమార్గులైన దుష్టగురువుల సాంగత్యముచే అనేక పర్యాయములు జన్మమరణములను పొందవలసి వచ్చును. కావున ఓ భద్రపురుషులారా! అన్యమార్గులగు దుష్టగురువుల దగ్గర నిలువకుము. ఏలయన నీవు కొంచెమైనను అన్యమార్గుల సేవజేసితివా, దుఃఖమున పడుదువు.

సమీక్షకుడు :- చూడుడు జైనులవంటి కఠినులు, భ్రాంతులు ద్వేషులు, నిందకులు, సన్మార్గమును మరచినవారు అన్యమతస్థులెవ్వరునుండరు? అన్యమతనింద, తమ ప్రశంస చేయకున్న తమకు సేవ, ప్రతిష్ఠ కలుగదని వా రాలోచించి యుండవచ్చును. కాని ఇది వారి దౌర్భాగ్యమనియే చెప్పవలెను. ఏలయనగా ఉత్తమ విద్వాంసుల సేవాసాంగత్యములు చేయనంతవరకు వీరికి యథార్థమైన జ్ఞానము కాని, సత్యధర్మ ప్రాప్తి కాని ఎన్నడును కలుగదు. కావున విద్యావిరుద్ధములైన మిథ్యావిషయములను త్యజించి వేదమందు చెప్పబడినట్టి సత్యములైన మాటలను గ్రహించుట జైనులకు మిక్కిలి శ్రేయస్కరము.

మూలం:- కిం భణిమో కిం కరిమో తాణ హయాసాణ ధిట్ఠ దుట్ఠాణం ।
జే దంసిఊణ లింగం ఖివంతి న రయమ్మి ముద్ధ జణం ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ. 40 ॥

అర్థం:- కళ్యాణేచ్ఛ నష్టమైనవానికి, మర్యాదలేనివానికి చెడ్డపనులు చేయుటలో చతురుడైనవానికి, ఈ దోషములతో కూడిన వానికి ఏమని చెప్పవలెను? ఏమి చేయవలెను? ఎందుకనగా! వాడు ఉపకారము చేసినవారికి నష్టము, కష్టము కలిగించును. ఎవడేని గ్రుడ్డిదైన సింహము కన్నులను

తెరువబోయిన అది అతనినే తినివేయునట్లు అన్యమతగురువులకు అనగా ఇతర మతములవారికి ఉపకారము చేయుట తనను తాను నాశనము చేసికొనుటయే యగును. కాబట్టి వారి నుండి సదా దూరముగ ఉండవలెను.

సమీక్షకుడు:- జైనులు ఆలోచించినట్లే అన్యమతస్థులు కూడ ఆలోచించినచో జైనుల కెంతటి దుర్దశ సంప్రాప్తమగును? మరి వారల కెవరును ఏ విధమైన ఉపకారమును చేయకున్న, వారి అనేక కార్యములు నష్టమై, వారికెంత దుఃఖము కలుగవచ్చును? ఆ ప్రకారమే జైనులు అన్యుల విషయమున ఏల విచారింపరు?

మూలం:- **జహ జహ తుట్టఇ ధమ్మో జహ జహ దుట్ఠాణ హోఇ అఇ ఉదఉ ।**
సమద్ధిట్ఠి జియాణం తహ తహ ఉల్లసఇ సమత్తం ॥

॥ ప్రకర. భాగ. 2. షష్టీ సూ. 42 ॥

అర్థం:- దర్శనభ్రష్టులకు, నిహ్నవులకు, పాసచ్ఛులకు, ఉసన్నులకు, కుసీలియాదులకును మరియు ఇతర దార్శనికులకు, త్రిదండములను ధరించినవారికి పరివ్రాజక విప్రాదిక దుష్టులకు బడితె పూజ చేయవలెను. అప్పుడు వారికి సమ్యక్ దృష్టి కలుగును.

సమీక్షకుడు :- ఇప్పుడు చూడుడు. ఈ జైనులను మించిన ఈర్ష్యా ద్వేష వైరబుద్ధులు గలవా డన్య డెవడైనా ఉండునా? అన్యమతములందును ఈర్ష్యా ద్వేషములు గలవు. కాని ఈ జైనులలో ఎంతగా ఉన్నవో అంతగా ఇతరులందు లేవు. ద్వేషమే పాపమునకు మూలము. కావున జైనులందు పాపాచరణమేల ఉండదు?

మూలం:- **సంగోవి జాణ అహిఉ తేసిం ధమ్మాఇ జే పకువ్వంతి ।**
ముత్తూణ చోరసంగం కరంతి తే చోరియం పావా ॥

॥ ప్రకర. భాగ. 2. షష్టీ సూ. 75 ॥

అర్థం:- మూర్ఖజనులు దొంగల సహవాసమందుండుటచే నాసికాచ్ఛేదనాది శిక్షలకు భయపడనట్లే జైనమతేతరములగు దొంగమతములతో పాటుండెడు జనులు తమ అశుభమునకు భయపడరని దీని ముఖ్యభావము.

సమీక్షకుడు:- మానవుడు సహజముగా తనవలెనే ఇతరులను కూడ భావించును. ఇతర మతములన్ని దొంగమతములని, జైనులది మాత్రము సాహుకారి మతమని అనుట సత్యము కాగలదా? మనుష్యునిలో మిక్కిలి అజ్ఞానము, దుష్టసహవాసముచే భ్రష్టబుద్ధి ఉన్నంతవరకు అతడు ఇతరులతో అతి ఈర్ష్యా ద్వేషాది దుష్టత్వముల నొనర్పక మానడు. ఈ జైనమతమునందు పరమతద్వేషమున్నంతగా మరేమతమునందు లేదు.

మూలం:- **జచ్ఛ పసుమహిసలరకా పవ్వం హోమంతి పావ నవమీఏ ।**
పూఅన్తి తంపి సడ్ఢా హా హీలా వీయరాయస్స ॥

॥ ప్రకర. భాగ. 2 షష్టీ సూ. 76 ॥

అర్థం:- పూర్వసూత్రమున చెప్పినట్లు 'మిథ్యాత్వి' అనగా జైనమతముకంటే భిన్నమైన వారందరును మిథ్యాత్వులు. తాము మాత్రమే సమ్యక్త్వులు. అనగా ఇతరులందరు పాపాత్ములు. జైనులందరును పుణ్యాత్ములే. కావున ఎవడు మిథ్యాత్వుల ధర్మమును స్థాపించునో వాడు పాపాత్ముడే.

సమీక్షకుడు:- ఇతరుల తీర్థస్థానములందు ప్రసిద్ధమైన - ప్రముఖమైన, చాముండా, కాళికా, జ్వాలాప్రముఖుల ఎదుట జరుపబడు పాపనవమి, దుర్గా నవమి తిథులు మున్నగునవన్నియు చెడ్డవైనట్లే మీ పజూషణాది వ్రతములు చెడ్డవి కావా? వానివలన మహాకష్టము కలుగుటలేదా? ఇట వామమార్గీయుల లీలలను ఖండన చేయుట యుక్తమే. అటులనే మీరు నమ్ముచున్న శాసనదేవీ మొదలగువాని ఖండన కూడా సమంజసమే. "మా దేవి హింసకురాలు కా"దందురేని, అదియును అబద్ధమే. ఏలయన శాసనదేవి ఒక పురుషుని నేత్రములను, మేక నేత్రములను పెరికివేసెను. ఇక అమె రాక్షసి, దుర్గా కాళికాదులకు సొంత సోదరిగాక మరేమగును? మరి తమ పచ్చ ఖాణాది వ్రతములను శ్రేష్ఠములని నవమీ మున్నగు వ్రతములను నికృష్టములని చెప్పుట మౌర్ఖ్యమే. ఏలయన ఇతరుల ఉపవాసాది వ్రతముల నిందించుట, తమ ఉపవాసాదులను గూర్చి పొగడుకొనుట మూర్ఖత్వపు మాటయే. సత్యభాషణాది వ్రతములాచరించుట మాత్రము సర్వహితకరము. కాబట్టి జైనులు గాని, ఇతరులు గాని చేసెడు ఉపవాసములు సత్యములు కావు.

మూలం- **వేసాణ వందియాణయ మాహణ దుంబాణ జరకసిరకాణమ్ ।**
భత్తా భరకట్ఠాణం వియాణం జంతి దూరేణమ్ ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ. 82 ॥

అర్థం:- వేశ్యలకు, చారణులకు, భట్టులు మున్నగువారికి, బ్రాహ్మణులకు, యక్షులకు, మిథ్యాదృష్టికల దేవీ దేవతాదులకు భక్తులైనవారు వానిని అంగీకరించువారందరు తాము మునుగుచు, ఇతరులను ముంచుదురు. కారణమేమనగా వారి దగ్గర నుండియే తామన్ని వస్తువులను యాచింతురు. వీతరాగ పురుషులకు దూరముగా నుందురు.

సమీక్షకుడు:- ఇతరుల దేవీ దేవతలను అసత్యములని, తమ దేవీ దేవతలు సత్యమని చెప్పుటయు కేవలము పక్షపాతమే. వామమార్గుల దేవీదేవతలను మీరు నిషేధించుచున్నారు. కాని శ్రాద్ధ దినకృత్యమందలి 46వ పుటలో "ఒక పురుషుడు రాత్రియందు భోజనము చేసిన నేరమునకు శాసనదేవి అతని చెంపమీద గొట్టెననియు, వాని కన్నులను తీసివేసెననియు మరల వానికి మారుగా మేకకన్నులను దీసి ఆ మనుష్యునికి పెట్టె"ననియు వ్రాయబడియున్నది. ఈ దేవి హింసకదేవి కాదా? ఎందువలన కాదు? రత్నసార ప్రథమభాగమున 67వ పుటలో ఏమి వ్రాసియున్నదో చూడుడు! మరుతదేవి పథికులకు శిలావిగ్రహమై సహాయ మొనరించుచుండెనట. ఈమెను కూడ అట్లెందుకంగీకరింపరు?

మూలం:- **కిం సోపి జణణి జాఓ జాణో జణణీ కిం గఓ విద్ధిం ।**
జఇ మిచ్ఛరఓ జాఓ గుణేసు తహ మచ్ఛరం వహఇ ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ సూ. 81 ॥

అర్థం:- జైనమతమును విరోధించు మిథ్యాత్వులగు మిథ్యాధర్మము గల వారెందులకు జన్మించవలెను? జన్మించినను ఎందుకు వృద్ధిచెందినారు? అనగా తక్షణమే నష్టమైపోయిన బాగుండెడిదని భావము.

సమీక్షకుడు:- చూడుడు. వీరి వీతరాగభాషిత దయా ధర్మము ఎంత దయాధర్మము కలదియో! ఇతర మతములవారు జీవింపనే కూడదట. వీరి దయా ధర్మమనునది కేవలము చెప్పుటకే కాని మరెందుకు కాదు. దయా ధర్మమున్నదన్న అది క్షుద్రజీవుల కొరకు, పశువుల కొరకు ఉన్నదే కాని జైనమత భిన్నులగు మనుష్యుల కొరకెంతమాత్రమును కాదు.

మూలం:- **సుద్ధే మగ్గే జాయా సుహేణ గచ్ఛత్తి సుద్ధ మగ్గంమి ।**
జే పుణ అమగ్గజాయా మగ్గే గచ్ఛంతి తే చుయ్యం ॥

॥ ప్రకర. భాగ. 2. షష్టీ సూ. 83 ॥

అర్థం:- జైనమతమున పుట్టినవాడు ముక్తి నొందినచో అందు ఆశ్చర్యమేమియు లేదు. జైన భిన్నకులమునందు పుట్టిన మిథ్యాత్ములగు అన్యమార్గులు ముక్తి నొందుదురనుట మిక్కిలి ఆశ్చర్యకరమైన విషయము. ఇదియే సూత్రాభిప్రాయము. అనగా జైనమతస్థులే ముక్తినొందుదురు. అన్యులెవరును ముక్తినొందరు. కావున జైనమతమును అంగీకరింపనివారు నరకగాములని ఫలితార్థము.

సమీక్షకుడు:- ఏమి? జైనమతమునందు దుష్టుడుగాని, నరకగాముడు గాని ఒక్కడునూ లేడా? అందరును ముక్తినొందుదురా? అన్యులెవ్వరును ముక్తినొందరా? ఇది మీ యున్మత్తాలాపము కాక మరియేమగును? అమాయకులు తప్ప ఇట్టి మాటలను ఎవరంగీకరింపగలరు?

మూలం:- **తిచ్ఛయ రాణం పూఅ సమ్మత్త గుణాణకారిణీ భణియా ।**
సావియ మిచ్ఛత్తయరీ జిణ సమయే దేసియా పూఅ ॥

॥ ప్రకర. భాగ. 2. షష్టీ సూ. 90 ॥

అర్థము :- ఒక జినమూర్తుల పూజనమే సారము. ఇతర మతముల వారి మూర్తిని పూజించుట అసారము. అట్లే జినమార్గమందలి ఆజ్ఞలను పాలించువాడే తత్వజ్ఞాని. వానిని పాలింపనివాడు తత్వజ్ఞాని కాడు.

సమీక్షకుడు:- ఆహా! ఎంత చక్కని మాట! వైష్ణవాదుల మూర్తుల వలె మీ మూర్తులును రాళ్ళు మున్నగు జడపదార్థములతో, చేయబడినవి కావా? వైష్ణవాదుల మూర్తిపూజెట్లు మిథ్యయో, మీ మూర్తిపూజయు మిథ్యయే మీరు తత్వజ్ఞులనుకొనుచు, అన్యులను తత్వజ్ఞులు కారని చెప్పుచుండుట వలన మీ మతమందు తత్వజ్ఞానమే లేదని తెలియుచున్నది.

మూలం:- **జిణ ఆణాఏ ధమ్మో ఆణారహిా అణ ఫుడం అహముత్తి ।**
ఇయ ముణిఊణయ తత్తం జిణ ఆణాఏ కుణహు ధమ్మమ్ ॥

॥ ప్రకర. భాగ. 2. షష్టీ సూ. 92 ॥

అర్థం:- జినదేవుని ఆజ్ఞయే దయాక్షమాది రూపమైన ధర్మము. దానికంటె భిన్నమగు ఆజ్ఞలన్నియు అధర్మములు.

సమీక్షకుడు:- ఇదెంతటి అన్యాయము! జైనులు కాక ఇతరులెవ్వరును సత్యవాదులు, ధర్మాత్ములు, కారా? అందలి ధర్మాత్ముల మాట కూడా పాలింపరాదా? జైనమతస్థ మనుష్యుల ముఖము, నాలుక, చర్మముతో నిర్మింపబడక ఇతరులవే చర్మముతో నిర్మింపబడినచో మీ మాటలు అంగీకరింపవచ్చును. కావున తమ నోటితో తమ మత గ్రంథములను, తమ వచనములను, తమ సాధువులు మొదలగువారలను కొనియాడుటయందు ఈ జైనులు బట్టురాజులను మించినవారని - వారలకు అన్నలని తేటతెల్లమవుతున్నది.

మూలం:- వన్నేమి నారయాఉవి జేసిం దురకాఇ సంభరం తాణం ।
భవ్వాణ జణఇ హరిహర రిద్ధి సమిద్ధీవి ఉద్ధోసం ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.95 ॥

అర్థం:- దీని ముఖ్య తాత్పర్యమేమన, హరిహరాదిదేవతల విభూతి నరకహేతువు. దానిని జూచిన జైనుల వెంట్రుకలు నిక్కబొడుచుకొనును. రాజాజ్ఞాభంగము చేసిన మనుష్యుడు మరణ దండమును, మరణపర్యంతము దుఃఖమును పొందునట్లే జినేంద్రాజ్ఞాభంగము చేసినవాడేల జన్మమరణ రూప దుఃఖములను పొందకుండును?

సమీక్షకుడు:- జైనుల ఆచార్యాదుల మానసికవృత్తులను, వారి కపటాడంబర యుక్తములగు బాహ్యలీలలను చూడుడు. ఇప్పుడు వీరి అంతరిక విషయములు బయటపడినవి కద! వీరు హరిహరాదులయొక్క - వారి ఉపాసకుల యొక్క ఐశ్వర్యమును, వృద్ధిని చూడజాలరని తెలియుచున్నది. ఇతరులకు అభివృద్ధి ఏల కలిగెననియే కాబోలు వీరి రోమములు గగుర్పొడుచుచున్నవి. ఇతరుల ఐశ్వర్యమంతా తమకు లభించి వారు దరిద్రులయిపోయిన బాగుండునని వీరు కోరుచుండవచ్చును. ఈ జైనులు రాజస్తుతి పాఠకులు. మిథ్యావాదులు. పిరికివారు. అందువలననే రాజాజ్ఞను దృష్టాంతముగా ఇచ్చుచుందురు. ఏమి? రాజుల అసత్యపు మాటలను సహితము అంగీకరింపవలయునా? కావున జైనులను మించిన ఈర్ష్యాద్వేషములు గలవారు మరొకరుండరని స్పష్టమగుచున్నది.

మూలం:- జో దేఇ సుద్ధ ధమ్మం సో పరమప్పా జయమ్మి నహు అన్నో ।
కిం కప్పద్దుమ్మ సరిసో ఇయర తరూ హోఇ కఇయావి ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.101 ॥

అర్థం:- జైనధర్మమునకు విరోధులగువారు మూర్ఖులు. జినేంద్రభాషితధర్మోపదేశకులగు సాధువులుగాని, గృహస్థులుగాని, గ్రంథకర్తలుగాని తీర్థంకరులకు తుల్యులే. వారికి సమానులు మరొకరెవ్వరును కారు.

సమీక్షకుడు:- జైనులు బాలబుద్ధిగలవారు గాకున్న ఇట్టి మాటలను ఎందుకంగీకరించి

యుందురు? వేశ్య తన స్తుతియే కాని అన్యుల స్తుతి కానదన్నట్లు ఈ జైనుల విషయము కనిపించుచున్నది.

మూలం:- మూలం జిణిదం దేవో తవ్వయణం గురుజణం మహాసమాణం ।
సేసం పావట్ఠాణం పరమప్పాణం చ వజ్జేమి ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.103 ॥

అర్థం:- జినేంద్రదేవుని, తదుక్తసిద్ధాంతములను మరియు జినమతోపదేశకులను త్యజించుట జైనుల కుచితము కాదు.

సమీక్షకుడు:- ఇది జైనుల హఠమును, పక్షపాతమును, అవిద్యాఫలమును ప్రకటించునది గాక మరేమగును? కాబట్టి జైనులవి కొన్ని మాటలు తప్ప తక్కినవన్నియు విడువదగినవి. ఏ కొంచెము బుద్ధిగలవాడైనను, జైనుల దేవతలను చూచినచో, సిద్ధాంత గ్రంథములను వినినచో ఉపదేశకులను గూర్చి విచారించినచో నిస్సందేహముగ అప్పుడే వారిని విడిచిపెట్టును.

మూలం:- వయణే వి సుగురు జిణవల్లహస్స కేసిం న ఉల్లసఇ సమ్మం ।
అహ కహ దిణమణి తేయం ఉలుఆణం హరఇ అంధత్తం ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.108 ॥

అర్థం:- జినవచనానుసారముగ ప్రవర్తించువారు పూజ్యులు. తద్విరుద్ధముగ వర్తించువారు అపూజ్యులు. కావున జైనగురువులనే నమ్మవలెను. ఇతర మార్గముల వారిని నమ్మరాదు.

సమీక్షకుడు:- జైనులు జ్ఞానహీనులగువారిని శిష్యులుగా చేసుకొని పశువులవలె బంధించి ఉంచకున్నచో వారు వీరి వలలో చిక్కక తాము ముక్తికొరకు పురుషార్థము చేసి తమ జన్మములను సఫలము చేసికొనెడివారు. మిమ్ముల నెవరైన కుమార్గులని, దుష్టగురువులని, మిథ్యాత్ములని, దురుపదేశకులని అన్నచో మీకెంత దుఃఖము కలుగును? అటులే మీరును ఇతరులకు దుఃఖదాయకులు. కావున మీ మతమందు అసారములైన సంగతులెన్నియో నిండియున్నవి.

మూలం:- జే రజ్జధానఈణం కారణభూయ హవంతి వావారా ।
తే విహు అఇప్పాజుయా ధన్నాఛద్దంతి భవభియా ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.119 ॥

అర్థం:- మరణించునంతటి దుఃఖము సంప్రాప్తమైనను జైనులు కృషి, వ్యాపారము మున్నగు కార్యములు చేయగూడదు. ఏలయన ఈ కార్యములే నరకమునకు కొనిపోవును.

సమీక్షకుడు:- అటులైనచో "మీరు వ్యాపారాది కార్యములను ఏల చేయుచున్నారు? ఈ కార్యములను విడువరెందులకు? విడుతురేని మీ శరీరపాలనము పోషణము ఎట్లు జరుగును? ఇక మీ మాట విని అందరును విడిచిపెట్టినచో మీరేమి తిని జీవింతురని జైనులనడుగవలెను. ఇట్టి

హానికారక ఉపదేశములు చేయుట సర్వథా వ్యర్థము. పాపము వారేమి చేయుదురు? విద్యాసత్సంగములు లభింపనందున ఇష్టము వచ్చినట్లు మొరుగుచున్నారు.

మూలం:- తఇయా హమాణ అహమా కారణరహియా అనాణగవ్వేణ ।
జే జంపంతి ఉస్సుత్తం తేసిం దిద్ధిచ్ఛ పండిచ్చం ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.121 ॥

అర్థం:- జైనాగమములకు విరుద్ధములయిన శాస్త్రములను ఒప్పుకొనువారు అధమాధములు. ఎట్టి ప్రయోజనము సిద్ధింపనున్నను దాని కొరకు జైనమతమునకు విరుద్ధముగ చెప్పగూడదు నమ్మకూడదు. ఎట్టి ప్రయోజనము నెరవేరుచున్నను అన్యమతమును త్యజింపవలయును.

సమీక్షకుడు:- మీ మూల మతగురువులు మొదలుకొని నేటివరకు పుట్టినవారు, అన్య మతములవారిని తిట్టుట తప్ప మరొకటేమియు చేసినది లేదు. చేయబోరు. ఇక ఎక్కడ తమ ప్రయోజనము నెరవేరునని తలచెదరో అక్కడ ఈ జైనులు శిష్యులకును శిష్యులైపోవుదురు. వీరికి ఇట్టి వ్యర్థాలాపములు వ్రాయుటకు కొంచెమైన లజ్జ కలుగకపోవుట కదు శోచనీయము.

మూలం:- జం వీరజిణస్స జిఓ మిరఈ ఉస్సుత్త లేసదేసణఓ ।
సాగర కోడా కోడిం హిండఇ అఇభీమభవరణ్ణే ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ సూ.122 ॥

అర్థం:- ఎవడేని ఒకడు జైనసాధువులయందును ధర్మము కలదు. మాలోనూ, ఇతరులలోనూ ధర్మము కలదు అని చెప్పినచో అతడు కోట్లకొలది సంవత్సరముల వరకు నరకమనుభవించి మరల నీచజన్మమునే పొందుచున్నాడు.

సమీక్షకుడు:- ఆహా! ఏమి తెలివి? ఓ విద్యాశత్రువులారా! మీరు మీ అసత్యపు మాటలను ఎవరును ఖండింపకుందురనియే కాబోలు ఇట్టి భయంకరములయిన వచనములు వ్రాసియున్నారు. కాని అది అసంభవము. మీరు కేవలము లేనిపోని నిందలు చేయుచు అన్యమతములతో విరోధము పెట్టుకొనుటకే సంసిద్ధులై మీ ప్రయోజనములను నెరవేర్చుకొనుటయే మోహన భోగమనుకొనియున్నారు గదా? ఇక మీకెంతవరకు బోధింపవలెను?

మూలం:- దూరే కరణం దూర మ్మి సాహణం తహ పభావణా దూరే ।
జిణధమ్మ సద్దహాణం పి తిరకదురకాఇ నిట్ఠవఇ ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.128 ॥

అర్థము:- ఎవడు జైనధర్మమునను‌ష్ఠింపకున్నను జైనధర్మమే సత్యమనియు, అన్యధర్మమేదియు సత్యము కాదని, ఇంతమాత్రము శ్రద్ధకలవాడైనను అతడు దుఃఖముల నుండి తరించును.

సమీక్షకుడు:- మూర్ఖులను తమ మతమను వలలో చిక్కించుకొనుటకు ఇంతకంటె అధిక

ఉపాయమేముండును? ఏలయన ఏమాత్రము కర్మచేయవలసిన పనిలేక ముక్తికలుగనే కలుగునను ఇంతటి పామరమతము వేరొకటుండునా?

మూలం:- కఇయా హోహీ దివసో జఇయా సుగురూణ పాయమూలమ్మి ।
ఉస్సుత్త లేసవిసలవ రహిఓ నిసుణేసు జిణధమ్మం ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.128 ॥

అర్థం:- "నేను మనుష్యుడనయినచో జినాగమములను, జైనుల శాస్త్రములనే విందును. కాని ఉత్సూత్రములను, అన్యమత గ్రంథములను ఎప్పుడును వినను" అని కోరువాడు ఆ కోరికతోనే దుఃఖసాగరము నుండి తరించుచున్నాడు.

సమీక్షకుడు:- ఈ మాటను కూడ అమాయకులను తమ వలలో చిక్కించుకొనుటకే కల్పించియున్నారు. కారణమేమన పై చెప్పబడిన కోరికతో నిక్కడి దుఃఖసాగరమునుండియే తరింపడు. అట్లే పూర్వజన్మమందలి సంచిత పాపముల దుఃఖరూపఫలమును గూడ పొందవలసియే వచ్చును. ఇట్లు అసత్యములు విద్యావిరుద్ధములగు విషయములు తెలిసినచో వీరి అవిద్యారూప గ్రంథములను, వేదాది శాస్త్రములను చూచి, విని సత్యాసత్యములను తెలిసికొని వీరి గ్రంథములను విడిచిపెట్టుదురు. కాని వీరు మూర్ఖులను బిగించి కట్టి తమ వలలో చిక్కించుకొని గట్టిగా బంధించినారు. ఈ బంధనముల నుండి సత్సాంగత్యముకల బుద్ధిమంతుడెవడో విడివడవచ్చునే కాని మందబుద్ధిగలవారు విడివడుట సాధ్యము కాదు.

మూలం:- జహ్మా జేణణేహిం భణియం సుయ వవహారం విసోహియం తస్స ।
జాఇయ విసుద్ధ బోహీ జిణఆణా రాహగత్తాఓ ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ.138 ॥

అర్థం:- జినాచార్యులచే చెప్పబడిన సూత్ర, నిరుక్తి, వృత్తి, భాష్య, చూర్ణులను ఒప్పుకొనువారే శుభ వ్యవహారములను, దుస్సహ వ్యవహారముల నొనర్చుచు శీలసంపన్నులై సుఖములను పొందుచున్నారు. అన్యమత గ్రంథములను అవలోకించుటవలన పొందజాలరు.

సమీక్షకుడు:- మిక్కిలి ఆకలితో చచ్చుట మొదలగు కష్టములను సహించుటయే చరిత్ర, శీలమనబడునా? అకలి దప్పికలు మొదలగువానిచే చచ్చుటయే 'శీలము' అన్నచో చాలామంది కరువు కాటకములతో అన్నాదులు లభింపక ఆకలితో చనిపోవుచున్నారు. వారును పవిత్రులయి శుభఫలమును పొందవలసిన్నదే కద! అట్లు వారును శుద్ధులు గారు. మీరును గారు. కాని పిత్తాదుల ప్రకోపములచే రోగులై సుఖమునకు మారు దుఃఖమనుభవింతురు.

న్యాయాచరణము, బహ్మాచర్యము, సత్యభాషణము మొదలగునవి 'ధర్మము'. అసత్యభాషణము, అన్యాయాచరణము మొదలగునవి 'పాపము'. అందరితో ప్రీతిపూర్వకముగ పరోపకారార్థము వర్తించుట 'శుభచరిత్ర' అనబడును. కావున, జైనమతస్థులవలె ఆకలి దప్పికలతో ఉండుట మొదలైనది 'ధర్మము'

కాదు. ఇక ఈ సూత్రాదులను ఒప్పుకొనుటవలన కొంచెము సత్యమును, అధికముగా అసత్యమును పొంది దుఃఖ సాగరమునబడి మునుగుదురు.

మూలం:- జఇ జాణిసి జిణ నాహో లోయాయారా విపరకవి భూఓ ।
తా తం తం మన్నంతో కహ మన్నసి లోఅ అయారం ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ. 148 ॥

అర్థం:- మంచి అదృష్టవంతులైన మనుష్యులే జినధర్మమును అంగీకరింతురు. అనగా జినధర్మమును అంగీకరింపని వారి ప్రారబ్ధమే నష్టమైనదని భావము.

సమీక్షకుడు:- మీరిటుల వ్రాయుట అసత్యము కాదా? పొరపాటు కాదా? ఇతర మతములందు మంచి అదృష్టవంతుడును, జైనమతమందు అదృష్టహీనుడును ఎవ్వడు లేడా?

సాధర్మి - సమానధర్మముగలవారైన జైన ధర్మావలంబులగువారు తమలో తాము కొట్లాడుకొనరాదని, ప్రేమపూర్వకముగ నడుచుకొనవలెనని చెప్పబడినది. అయితే జైనులు ఇతరులతో పోట్లాడుట మంచిదనే భావించినట్లు కదా! దీని భావము. కావున ఇది కూడ సరికాదు. ఏలయనగా సజ్జనులు సజ్జనులతో ప్రీతిపూర్వకముగ వర్తించుచు, దుష్టులకు మంచి శిక్షనిచ్చి సుశిక్షితులను చేయుచున్నారు.

ఇక బ్రాహ్మణులు, త్రిదండి, పరివ్రాజకాచార్యులు అనగా సన్న్యాసులు, తపస్వులను బైరాగులు మున్నగువారందరును జైనమత శత్రువులని వ్రాయబడినది. దానిని గమనించితిరా!

ఇతరులనందరను శత్రుభావముతో చూస్తూ నిందిస్తున్నారు. అప్పుడు ఈ జైనుల దయారూపము, క్షమారూపమునగు ధర్మమెక్కడ నిలిచెను? ఇతరుల మీద ద్వేషముంచునపుడు దయా క్షమ లనునవి నశించును. దానివంటి హింసారూపమైన దోషము మరొకటుండదు. జైనుల వంటి ద్వేషము గలవారు ఇతరులలో కొద్దిగానే ఉందురు. మరి ఋషభదేవుడు మొదలుకొని మహావీరుని వరకు గల 24 తీర్థంకరులను రాగద్వేషములు గలవారని, మిథ్యాత్వులని, జైనమతమును స్వీకరించినవారు సన్నిపాత జ్వరగ్రస్థులై ఉన్నారని, వారి ధర్మము నరకముతో - విషముతో సమానమైనదని భావించవలయునన్నచో జైనుల కెంత కష్టముగా ఉండును. కావున జైనులు ఇతరుల నింద, పరవ ఎతద్వేషరూపమగు నరకమునబడి మహాక్లేశములను అనుభవించుచున్నారు. వారు దీనిని వదలినచో ఎంతయో బాగుండును.

మూలం:- ఏగో అగురూ ఏగో విసావగీ చేఇ ఆణి వివహాణి ।
తచ్ఛయ జం జిణదవ్వం పరుప్పరం తం న విచ్చంతి ॥

॥ ప్రకర. భాగ. 2. షష్ఠీ. సూ. 150 ॥

అర్థం:- శ్రావకులందరకు దేవగురువు ధర్మమొక్కటే. చైత్యవందనము అనగా జిన ప్రతిబింబములనెడి విగ్రహములను, దేవాలయములను, జినద్రవ్యములను కాపాడుట విగ్రహములను పూజించుట ధర్మము.

సమీక్షకుడు:- ఇప్పుడు గమనింపుడు! మూర్తిపూజాసంబంధమైన గొడవలు గందరగోళమంతయు ఈ జైనుల ఇంటినుండియే బయలుదేరినవి. పాఖండమునకు మూలము కూడ నీ జైనమతమే అనవలెను. మరొకటి కాదు.

మూర్తిపూజ ప్రారంభము

ఇక 'శ్రాద్ధదినకృత్యము' మొదటిపుటలో మూర్తిపూజకు ప్రమాణములు గలవు.

నవకారేణ విబోహో ॥ 1 ॥	అనుసరణం సావఉ ॥ 2 ॥
వయాఇం ఇమే ॥ 3 ॥	జోగో ॥ 4 ॥
చియ వన్దణగో ॥ 5 ॥	యచ్చరఖాణ తు విహి పుబ్బ ॥ 6 ॥ మొదలగునవి.

1. శ్రావకులు మొదటి ద్వారమున 'నవకార జపము' చేయవలెను.
2. రెండవ ద్వారమున నవకారజపమొనరించిన పిదప 'నేను శ్రావకుడను' అని స్మరించు కొనవలెను.
3. మూడవ ద్వారమున 'అణు వ్రతాదులు తమకెన్ని' అని ఆలోచింపవలెను.
4. నాల్గవ ద్వారమున ఇట్లాలోచింపవలెను. నాల్గువర్గములందు అగ్రగామి మోక్షము. దాని కొరకు జ్ఞానాదులు ఆవశ్యకములనుట యోగము. ఆ సమస్త అతిచారములను పవిత్రపరచుటకు ఆవశ్యకములైన కారణములు ఆరు కలవు. అది ఉపచారయోగ మనబడుచున్నది.
5. ఐదవ ద్వారమున 'చైత్యవందనము' అనగా విగ్రహమునకు నమస్కారము. ద్రవ్యభావ పూజనములు.
6. ఆరవది ప్రత్యాఖ్యాన ద్వారము. నవకారసీప్రముఖములను విధిపూర్వకముగా వర్జింతును. ఇత్యాదులు.

ఈ గ్రంథమునందే మున్ముందుగా అనేక విధులు వ్రాయబడినవి. అనగా సాయంకాల భోజన సమయమునందు జినబింబములను - తీర్థంకరుల విగ్రహములను (శ్రా.ది.కృ.పుట.1) పూజింపవలెననియు, ద్వారములను పూజింపవలెననియు కలదు. ఆ ద్వారపూజ విషయమున చాలా గొడవలున్నవి. ఇక మందిరములను కట్టించు నియమములు, పాతమందిరములను కట్టించుట చేత, బాగుచేయుట చేత (శ్రా.ది.కృ.పుట.20) ముక్తి కలుగును. మందిరములకు వెళ్ళి కూర్చుండు విధము, (శ్రా.ది.కృ.పుట. 24) మిక్కిలి శ్రద్ధా భక్తులతో పూజించుట, 'నమోజినేంద్రేభ్యః' ఇత్యాది మంత్రములతో స్నానాదులను (శ్రా.ది.కృ.పుట. 5-6) చేయించుట "జలచందన పుష్పధూపదీపనైః" ఇట్టి మంత్రములతో గంధము మున్నగువానిని ఎక్కించుట మొదలగు చాలా విషయములున్నవి.

రత్నసార భాగము 12వ పుటలో మూర్తి పూజాఫలము "పూజారిని రాజుకాని, ప్రజలు కాని ఎవ్వరును అడ్డగించుటకు అర్హులు కారు" అని వ్రాయబడినది.

సమీక్షకుడు:- ఈ విషయములన్నీ కపోలకల్పితములే. రాజు మొదలగువారెందరో జైన పూజారులను అడ్డగించుచున్నారు అటువంటప్పుడు మీ వ్రాతలకు ప్రయోజనమేమి?

రత్నసార భాగము 13వ పుటలో మూర్తిపూజలవలన రోగములు, పీడలు, మహాదోషములు దూరమగుచున్నవని వ్రాయబడినవి. ఒకడు ఐదుపైసల పువ్వులను తెచ్చి మూర్తిపైన వేసినందున అతడు పదునెనిమిది దేశములకు రాజయ్యెనట. అతని పేరు కుమారపాలుడు. ఇత్యాది విషయములన్నియు అబద్ధములు. మూర్ఖులను ప్రలోభపెట్టుటకు పనికివచ్చును. ఏలయన ఎందరో జైనులు పూజలు చేసి చేసి రోగులయి కృశించుచుందురు. పాషాణాది మూర్తిపూజవలన ఒక ఎకరపు రాజ్యమయినను లభించుటలేదు. ఐదుపైసల పువ్వులను వేయుట వలన రాజ్యము దొరుకునన్న ఐదేసి పైసల చొప్పున పూలను వేసి భూగోళమునంతటిని తమ రాజ్యముగా ఏల చేసికొనరు? పైగా రాజదండన ఎందులకు పొందుచున్నారు? మూర్తిపూజ చేసి భవసాగరము నుండి తరింతురేని, జ్ఞానసమ్యగ్దర్శన చారిత్రలను పొందు టెందులకు?

రత్నసార భాగము (1) 13వ పుటలో 'గౌతముని అంగుష్ఠమున అమృతము కలదు. అతని స్మరించిన మనోవాంఛిత ఫలములు పొందుచున్నా'రని వ్రాయబడినది.

సమీక్షకుడు:- ఇటులయిన జైనులందరు అమరులు కావలసినదే కదా! అట్లగుటలేదు. కాబట్టి ఇది కేవలము మూర్ఖులను భ్రమింపజేయు మాటయే. కాని ఇందు వేరొక తత్త్వమేమియు లేదు.

వీరు పూజ చేయునపుడు పఠించు శ్లోకము వివేకసారము 52వ పుటలో ఇట్లు వ్రాయబడినది.

జలచందనపుష్పధూపనైరథ దీపాక్షతకైర్నైవేద్యవస్త్రైః ।

ఉపచారవరైర్వయం జినేన్ద్రాన్ రుచిరైరద్య ముదా యజామహే ॥

మనము జల, చందన, అక్షత, పుష్ప, ధూప, దీప, నైవేద్య, వస్త్రాది శ్రేష్ఠోపచారములచే జినేన్ద్రు లను తీర్థంకరులను పూజింపవలెను.

సమీక్షకుడు:- ఇందులకే కద! మే మీ మూర్తిపూజ జైనులనుండే ప్రచారమైనదని చెప్పుచున్నాము.

వివేకసారము 21వ పుటలో "జిన మందిరమున మోహము కలుగదు. అది భవసాగరమునుండి తరింపజేయును"

వివేకసారము 51వ పుట మరియు, 52వ పుటలో "మూర్తిపూజ వలన ముక్తికలుగునని ఉన్నది. జిన మందిరమునకు వెళ్లినచో సద్గుణములు వచ్చును. జలచందనాదులచే తీర్థంకరులకు పూజ చేసినవాడు నరకమునుండి విడుదలై స్వర్గమునకు పోవును.

వివేకసారము 55 వ పుటలో జినమందిరములందలి ఋషభదేవాదుల విగ్రహములను పూజించిన ధర్మార్థ కామమోక్షములు సిద్ధించును".

వివేకసారము 61వ పుటలో "జిన విగ్రహములను పూజించినచో జగత్తులోని క్లేశము లన్నియు దూరమైపోవును".

సమీక్షకుడు:- ఇప్పుడు వీరిలో అవిద్యతో కూడిన అసంభవములగు మాటలను గమనింపుడు! ఈ ప్రకారముగ పాపాది దుష్కర్మలు దూరమగునని, మోహము కలుగదని, భవసాగరమునుండి తరింతురని, సద్గుణములు సంప్రాప్తములగునని, నరకమును వీడి స్వర్గమునకు పోవుదురని, ధర్మార్థ కామ మోక్షములు లభించునని, క్లేశములన్నియు దూరమైపోవుననియు చెప్పుచున్నారే! మరి జైనులందరు సుఖమును, సకల పదార్థసిద్ధిని ఎందుకు పొందుటలేదు?

ఈ వివేకసారము 3వ పుటలో 'జినమూర్తులను స్థాపించినవారు తమయొక్క తమ కుటుంబము యొక్క బ్రతుకుదెరువును ఏర్పాటు చేసికొనినవారన వ్రాయబడినది.

వివేకసారము 225 వ పుటలో "శివవిష్ణ్వాది విగ్రహములను పూజించుట మిక్కిలి అశుభకరము. అనగా అది నరకమునకు సాధనము".

సమీక్షకుడు:- ఆహా! ఏమి చెప్పితిరి? శివాది విగ్రహములు నరకమునకు సాధనములైనచో మీ విగ్రహములు అటువంటివి కావా? మీ విగ్రహములు త్యాగము, శాంతి, శుభముద్ర అనువానితో కూడియున్నందున మంచివనియు, శివాది విగ్రహము లట్టివి కానందున చెడ్డవని అందురేని "మీ విగ్రహములు లక్షల, కోట్ల రూపాయల విలువ గల మందిరములందుండును. వానికి చందన కేసరాదులను పూయుదురు, అవి త్యాగముతో కూడినవి ఎటులగును? అని వారల నడుగవలెను. మరి శివాది విగ్రహములు కొన్నిచోట్ల నిలువ నీడ లేక ఉండును. అవి వైరాగ్యముతో కూడిన వేల కావు? ఇక శాంతములంటిరా, జడపదార్థములన్నియు నిశ్చలములైనందున శాంతముతోనే ఉండును. కాబట్టి అన్ని మతములందలి మూర్తి పూజలు వ్యర్థమే.

మూర్తిపూజ వలన జడత కలుగును

ప్రశ్న:- మా విగ్రహములు వస్త్రములను ఆభూషణాదులను ధరింపవు కావున మంచివి.

జవాబు:- అందరు చూచు స్థలములలో నగ్నములైన విగ్రహముల నుంచుట పశువుల వంటి వ్యవహారమే.

ప్రశ్న:- స్త్రీల చిత్రపటములను గాని, రూపములను గాని చూచుటచే కామోత్పత్తి కలుగునట్లు సాధువుల, యోగీశ్వరుల విగ్రహములను చూచుటచే శుభగుణములు కలుగును.

జవాబు:- పాషాణాది విగ్రహములను చూచుటవలన శుభపరిణామము కలుగునని నమ్ముదురేని, వాని జడత్వాది గుణములు కూడ తప్పక మీయందు కలుగును. మీ రప్పుడు జడబుద్ధి గలవారై

పూర్తిగా చెడిపోవుదురు. ఇక అటులనే ఉత్తమ విద్వాంసుల సేవాసాంగత్యముల నుండి విముఖులై గొప్ప మూర్ఖులై పోవుదురు. కాబట్టి పాషాణాది విగ్రహములను పూజించువారలకు పదునొకండవ సముల్లాసమున వ్రాయబడిన దోషములన్నియు కలుగును. ఈ జైనులు విగ్రహారాధనను గూర్చి వ్యర్థమైన హడావుడి - అలజడి చేసినట్లుగనే వీరి మంత్రములందును అనేక అసంభవములైన విషయములు వ్రాయబడినవి.

ప్రసిద్ధ జైననవకారమంత్రము

వీరి యీ మంత్రము రత్నసార భాగము 1వ పుటలో ఇట్లు గలదు.

నమో అరిహంతాణం నమో సిద్ధాణం నమో ఆయరియాణం, నమో ఉవజ్ఝాయాణం నమో లోఏ సబ్బ సాహూణం

ఏసో పంచ నముక్కారో సవ్వ పావప్పణా । సణో మంగళాచాణం సబ్బేసిం పఢమం హవఇ మంగళమ్ ॥1॥

ఈ మంత్రము యొక్క మాహాత్మ్యము చాలా గొప్పగా వ్రాయబడినది. జైనులందరికిది గురు మంత్రము. తంత్ర పురాణములనే కాదు. బట్టురాజుల కథలను గూడ ఓడించునంతటి మాహాత్మ్యమును ఇందు కల్పించినారు.

ఇక శ్రాద్ధ దిన కృత్యము 3వ పుటలో -

నముక్కారం తఉ పడే ॥ 9 ॥

జఉ కబ్బం । మన్తాణమన్తో పరమో ఇముత్తి ధేయాణధేయం పరమం ఇముత్తి ।

తత్తాణతత్తం పరమం పవిత్తం సంసారసత్తాణ దుహాఇయాణం ॥ 10 ॥

ఇది పవిత్రమైన పరమ మంత్రము. ధ్యానయోగమునకు పరమధ్యేయము. తత్వములందు పరమ తత్వము. దుఃఖములచే పీడితులైన ప్రపంచమందలి జీవుల కీ నవకార మంత్రము సముద్రమున దాటించు ఓడ వంటిది.

తాణం అన్నన్తు నో అత్థి । జీవాణం భవసాయరే ।

బుడ్డం తాణం ఇమం ముత్తుం । నముక్కారం సుపోయయమ్ ॥ 11 ॥

ఓడ వలె నున్నట్టి ఈ నవకార మంత్రమును త్యజించువారు భవసాగరమున మునిగిపోవుదురు. దీనిని గ్రహించువారు దుఃఖములనుండి దూరమగుదురు. కాబట్టి ఈ మంత్రమే అందరిని దుఃఖరహితులను చేయును. అట్లే సకల పాపములను నశింపచేసి ముక్తిని గూడ ఇచ్చును. దీనివంటి మంత్రము మరొకటేదియు లేదు.

కబ్బం । అణేగజమ్మంతరసం చిఅణం దుహాణం సారీరిఅమాణు సాణు సాణం ।

కత్తోయ భవ్వాణ భవిజ్జనాసో న జావపత్తో నవకారమన్తో ॥ 12 ॥

"ఈ నవకార మంత్రము. అనేక భవాంతరములలో కలిగిన శరీరసంబంధమైన దుఃఖములను

దూరపరచి, భవ్యజీవులను భవసాగరమునుండి తరింపజేయును. ఈ మంత్రమును పొందనంతవరకు భవసాగరమును జీవుడు దాటనే దాటడు" అని పై సూత్రమునందు చెప్పబడినది.

ఇక అగ్ని ప్రముఖములగు అష్ట మహాభయములందు ఈ నవకార మంత్రము తప్ప మరేదియు తోడ్పడదు. మహా రత్నవైఢూర్యములను మణులను గ్రహించుచున్నట్లు, శత్రుభయమునం దమోఘ శస్త్రమును గ్రహించుచున్నట్లు ఈ శ్రుతకేవలిని గ్రహింపవలెను. ద్వాదశాంగము లన్నిటియందు ఈ నవకార మంత్రమే మిక్కిలి రహస్యమైనది.

ఈ మంత్రార్థము నమో అరిహన్తాణం = తీర్థంకరులకందరకు నమస్కారము. నమో సిద్ధాణం = జైన మతసిద్ధులకందరకు నమస్కారము. నమో ఆయరియాణం = జైనమతాచార్యుల కందరకు నమస్కారము. నమో ఉవాజ్ఝాయాణం = జైనమతోపాధ్యాయుల కందరకు నమస్కారము. నమో లోఏ సబ్బ సాహూణం = ఈ లోకమున గల జైనమతసాధువుల కందరకు నమస్కారము.

ఈ మంత్రమునందు 'జైన' పదమే లేదు. కాని జైనులకు సంబంధించిన గ్రంథములందు జైనమతస్థులకు దప్ప మరెవ్వరికిని నమస్కారము చేయరాదని నిషేధింపబడినది. కావున అర్థమునందు జైనపదము జోడింపబడినది. అందుచే ఈ అర్థమే సరైనది.

తత్త్వవివేకము 169వ పుటలో "కట్టెలను, రాళ్ళను దేవతలుగా భావించి పూజించు మనుష్యుడు మంచి ఫలములను పొందుచున్నాడు".

సమీక్షకుడు:- అటులైనచో, వానిని దర్శించుచు అందరును సుఖరూపములైన ఫలములను ఎందుకు పొందుటలేదు?

రత్నసార భాగము 10వ పుటలో పార్శ్వనాథమూర్తిని దర్శించిన పాపములన్నియు నశించును" అని ఉన్నది.

కల్పభాష్యము 50వ పుటలో "జీర్ణములయిన లక్ష ఇరువదైదు వేల మందిరములు బాగుచేయబడినవి" అని వ్రాసియున్నది.

అట్లే విగ్రహారధనమును గూర్చి విశేషముగ వ్రాయబడియున్నది. కాబట్టి విగ్రహారాధనమునకు మూలకారణము ఈ జైనమతమేయని తెలియుచున్నది. ఇక ఈ జైనసాధువుల లీలలను గమనింపుడు!

వివేకసారము 228వ పుటలో "ఒక జైనమత సాధువు 'కోశ' అను వేశ్యతో రమించుచుండి, తదనంతరము విరక్తుడై స్వర్గమునకు పోయెను.

వివేకసారము 10వ పుటలో "అర్ణకముని శీలమును వదలి అనేక సంవత్సరముల వరకు దత్తసెట్టి ఇంట్లో విషయభోగములను సేవించిన పిదప దేవలోకమునకు పోయెను. శ్రీకృష్ణుని పుత్రుడగు ఢంఢణ మునిని నక్క ఎత్తుకొనిపోయెను. పిమ్మట వాడు 'దేవత' అయ్యెను.

వివేకసారము 156వ పుటలో "జైనమతసాధువు లింగధారి. అనగా కేవలం వేషధారియైనను శ్రావకులతనిని సత్కరించవలెను. ఆ సాధువులు చరిత్రలేనివారైనను అశుద్ధ శీలురైనను కానిండు

వారందరును పూజనీయులే" వివేకసారము 168వ పుటలో "జైనమత సాధువులు చరిత్ర హీనులైనను అన్యమత సాధువుల కంటే శ్రేష్ఠులే. వివేకసారము 171వ పుటలో "శ్రావకులు జైనమత సాధువులను చరిత్రహీనులు గాను - భ్రష్టాచారులు గాను - చూచినను కూడ వారి సేవ చేయువలయును" వివేకసారము 216వ పుటలో "ఒక దొంగ ఐదు పిడికిళ్ళ వెంట్రుకల నూడబెరుకుకొని చరిత్రను గ్రహించెను. మిక్కిలి కష్టమును, పశ్చాత్తాపమును పొందెను. అతడు ఆరవ మాసముననే కేవలము జ్ఞానమును పొంది సిద్ధుడయ్యెను.

సమీక్షకుడు:- ఇప్పుడు వీరి సాధువులయొక్క గృహస్థులయొక్క లీలలను గమనించితిరా? వీరి మతమున ఎంతటి దుష్కర్మముల నొనర్చు సాధువైనను సద్గతిని పొందును గదా!

వివేకసారము 106వ పుటలో "శ్రీకృష్ణుడు మూడవ నరకమునకు పోయినా"డని వ్రాయబడినది.

వివేకసారము 145వ పుటలో "ధన్వంతరి నరకమునకు పోయినా"డని వ్రాసియున్నది.

వివేకసారము 48వ పుటలో "జోగులు, జంగములు, కాజీముల్లాలు అజ్ఞానముచే అనేక కష్టములకోర్చి తపముల నొనరించినను,దుర్గతినే పొందుచున్నా"రని వ్రాయబడినది.

రత్నసారభాగము 171వ పుటలో తొమ్మండుగురు వాసుదేవులు అనగా త్రిపృష్ఠ వాసుదేవుడు, ద్విపృష్ఠ వాసుదేవుడు, స్వయంభూ వాసుదేవుడు, పురుషోత్తమ వాసుదేవుడు, సింహపురుష వాసుదేవుడు, పురుష పుండరీక వాసుదేవుడు, దత్తవాసుదేవుడు, లక్ష్మణవాసుదేవుడు, శ్రీకృష్ణవాసుదేవుడు అను వీరందరు పదునొకండవ, పండ్రెండవ, పదునాల్గవ, పదునైదవ, పదునెనిమిదవ, ఇరువదవ, ఇరువదిరెండవ తీర్థంకరుల సమయము లందు నరకమునకు పోయినారు.

అట్లే తొమ్మండుగురు ప్రతివాసుదేవులు అనగా అశ్వగ్రీవప్రతి వాసుదేవుడు, తారకప్రతి వాసుదేవుడు, మోరకప్రతివాసుదేవుడు, మధుప్రతివాసుదేవుడు, నిశుంభప్రతివాసుదేవుడు, బలీప్రతివాసుదేవుడు, ప్రహ్లాదప్రతి వాసుదేవుడు, రావణప్రతి వాసుదేవుడు, జరాసింధుప్రతి వాసుదేవుడు అను వీరందరును నరకమునకు పోయినారు" అని కలదు. మరి కల్పభాష్యమున [మోక్ష కల్పానక 55-86వ పుట] ఋషభదేవుడు మొదలుకొని మహావీరుని పర్యంతము 24 తీర్థంకరులందరు మోక్షమును పొందినార'ని వ్రాయబడినది.

సమీక్షకుడు :- ఔరా! అనేక మంది వేశ్యాగాములు, పరస్త్రీగాములు, దొంగలు మొదలగు జైనమతస్థ లందరు స్వర్గమునకు పోయి ముక్తిని పొందినారని, శ్రీకృష్ణాది గొప్ప ధర్మాత్ములయిన మహాత్ములందరు నరకమునకు పోయినారని వ్రాయుట ఎంత చెడ్డమాటనో బుద్ధిమంతు లూహింతురు గాక! ఆలోచించి చూచినచో జైనుల సహవాసము కాని, వారిని చూచుట గాని సజ్జనుల కెంతమాత్రము ఉచితము కాదని తేటపడుచున్నది. ఏలయన వీరి సహవాసమువలన ఇట్టి మిథ్యోక్తులు వారి హృదయములందును నాటుకొనును. ఎందువలననగా ఈ మహామూర్ఖులు, దురాగ్రహులు నగు మనుజుల సహవాసముచే చెడు తప్ప మంచిదేదియు చిక్కదు. ఇక జైనులలో ఎవరేని ఉత్తములైనవారున్నచో వారితో సత్సంగాదుల నొనరించిన ఎట్టి దోషము లేదు.

వివేకసారము 55వ పుటలో "గంగ మొదలగు తీర్థములకు పోయినను, కాశీ మొదలగు యాత్రలు చేసినను పరమార్థమేమియు సిద్ధింపదు. కాని మా గిరినార, పాలీటాణా, ఆబూ మున్నగు తీర్థక్షేత్రములు మాత్రము ముక్తిని గూడ లభింపజేయు"నని వ్రాయబడినది.

సమీక్షకుడు :– ఇట విచారింపవలసినదేమన శైవవైష్ణవాదుల తీర్థక్షేత్రములు జల స్థలములును జడరూపములునై యున్న అటులే జైనులవి కూడా ఉన్నవి కదా! ఇందొకదాని నిందించుట మరొకదానిని స్తుతిచేయుట మూర్ఖత్వము కాక మరేమగును?

జైనుల ముక్తి వర్ణనము

రత్నసార భాగము పుట 23లో "ఊర్ధ్వలోకమున ఒక సిద్ధశిలయను స్థానము కలదు. అది స్వర్గపురికి పైన నలుబదైదు లక్షల యోజనముల వైశాల్యము, అంతయే అవకాశము, లోతు, ఎనిమిది యోజనముల మందము, తెల్లని ముత్యముల హారమువలె – అనగా గోదుగ్ధమున కంటె తెలుపు, బంగారువంటి మెరుపు, స్ఫటికమువంటి పరిశుభ్రతయు కలిగియున్నది. ఆ సిద్ధశిల పదునాల్గవ లోక శిఖరము మీద కలదు. ఆ సిద్ధశిల మీద నున్న శివపురమను ధామమందు గూడ ముక్తపురుషులు అంతరిక్షమున వసించుచున్నారు. అట జన్మమరణాది దోషములు సంభవింపవు. ఆనందముగ నుందురు. వారు తిరిగి జన్మమరణములను పొందరు. ఏమన వారి కర్మము లన్నియు విడిపోవును" అని మహావీరుడను తీర్థంకరుడు గౌతమునితో చెప్పుచున్నాడు. ఇది జైనుల ముక్తి.

సమీక్షకుడు:– విచారింపవలసిన దేమన అన్యమతములలో వైకుంఠము, కైలాసము, గోలోకము, శ్రీపురము మున్నగునవియే మోక్షధామములని పౌరాణికులును, ఇక క్రైస్తవులు నాల్గవ ఆకాశమునందును, ముసల్మానులు ఏడవ ఆకాశముననందును మోక్షస్థలములు కలవని నమ్ముచున్నటులే ఈ జైనుల సిద్ధశిలయు, శివపురమును గలవు. ఇక జైనులు దేనిని పైభాగమని నమ్ముచున్నారో, దానినే క్రింద నున్నవారు, ఎవరీ భూగోళమున మాకంటె క్రిందనున్నారో, దానినే క్రింద నున్నవారు, ఎవరీ భూగోళమున మాకంటే క్రింద నున్నారో వారు తమ దృష్టియందు దానిని క్రిందిభాగమని భావించుచున్నారు. కావున పైభాగము,లోభాగము అనునదొక వ్యవస్థిత పదార్థము కాదు. ఆర్యావర్తనివాసులగు జైనులు పైభాగముగా భావించుదానినే అమెరికా నివాసులులో భాగముగా భావించుచున్నారు. ఆర్యావర్త నివాసులులో భాగముగా భావించు దానిని అమెరికావాసులు పైభాగముగా ఎంచుచున్నారు. ఆ శిల నలుబదైదు లక్షలే కాదు, దానికి రెండింతలు అనగా తొంబది లక్షల క్రోసులు గలదయి యున్నను ఆ ముక్తపురుషుల కది బంధనమే అగును. ఏలయన ఆ శిలనుండి కాని ఆ శివపురమునుండి కాని బయటికి వెడలిరా, ముక్తి విడిపోవును. సదా అందేయుండ ప్రీతి, దాని నుండి వెడలుటకు అప్రీతియుండును కాబోలు. ఆటంకమును ప్రీతియు, అప్రీతియు కలుగుచోటు మోక్షధామ మనబడనేరదు. నవమ సముల్లాసమునందు ముక్తిని గూర్చి వ్రాసియున్నాము. అట్లంగీకరించుటయే శ్రేయస్కరము. ఈ జైనుల ముక్తి కూడ ఒకవిధమైన బంధనముగా ఉన్నది. ఈ జైనులు ముక్తి యను భ్రమలో బడి చిక్కియున్నారు. కాని వేదముల యథార్థమైన అర్థము బోధపడనంతవరకు వారు ముక్తి స్వరూపమును ఎన్నటికి ఎరుగజాలరనుట నిక్కము.

ఇంకను వీరి అసంభవములైన కొన్నిమాటలను ఆలకింపుడు! వివేకసారము 28వ పుటలో "మహావీరుడు జన్మించినపుడు అతనిని ఒక కోటి అరువది లక్షల కలశములతో స్నానము చేయించిరి".

వివేకసారము 136వ పుటలో దశార్ణుదను రాజు మహావీరుని దర్శించుటకు వెళ్లి కొంత అభిమానమును కనబరచెను. అతని అభిమానమును నివారించుటకు 1677,72,16000 ఇంద్రస్వరూపులు, 13,37,05,7280,00,00000 ఇంద్రాణులు అక్కడికి వచ్చిరి. అప్పుడు రాజు చూచి ఆశ్చర్యము నొందెను.

సమీక్షకుడు:- ఇంతమంది ఇంద్రులు, ఇంద్రాణులు నివసించుటకు ఎన్నియో భూగోళములు కావలసియుండును. దీనిని బుద్ధిమంతులు ఆలోచించవలయును.

శ్రాద్ధదినకృత్యము - ఆత్మనిందా భావన 31వ పుటలో "బావులు, చెరువులు త్రవ్వించరాదని వ్రాయబడినది.

సమీక్షకుడు:- సరే! మనుష్యులందరు జైనమతమునందు కలిసి బావులను, చెరువులను త్రవ్వించనిచో వారందరు ఎక్కడినుండి నీళ్ళు త్రాగగలరు?

ప్రశ్న:- చెరువులు మొదలగునవి త్రవ్వించిన అందు పురుగులు పుట్టును. దానిచే కట్టించినవారికి పాపము కలుగును. కావున జైనుల మగు మే మీ కార్యములను చేయము.

జవాబు:- అయ్యో! మీ బుద్ధి ఏల నష్టమైపోయినది? ఏలయన క్షుద్రజీవములు చచ్చుట వలన పాపము కలుగునని భావించుచున్న మీరు గొప్ప గోవులు మున్నగు పశువులకు, మనుష్యాది ప్రాణులకు త్రాగునీళ్ళను అందజేసిన ఎంత గొప్ప పుణ్యము కలుగునో తెలుసుకొనలేరా?

తత్త్వవివేకము. 196-198వ పుటల్లో 'ఒక నగరమునందు నందమరికారుడను సెట్టి బావిని త్రవ్వించినందులకు ధర్మభ్రష్టుడై పదహారు మహారోగములచేత పీడితుడయ్యెను. తదుపరి మృతినొంది ఆ బావిలోనే కప్పయై పుట్టెను. మహావీరుని దర్శించుటవలన వానికి జాతిస్మరణ కలిగినది. నా రాకను విని నన్ను పూర్వజన్మ ధర్మాచారుడని తెలిసికొని నమస్కారము చేయుటకు దగ్గరకు రాగా మార్గమున గల శ్రేణికుని గుఱ్ఱము కాలిక్రిందబడి శుభధ్యాన యోగమున చచ్చి దర్దురాంకనామము కల మహర్ధిక దేవతగా పుట్టెను. అవధిజ్ఞానముచే నేనిక్కడికి వచ్చినానని తెలిసికొని నమస్కారము చేసి బుద్ధిని కనబరచిపోయినా'డని మహావీరుడు చెప్పుచున్నాడు.

సమీక్షకుడు:- "ఇట్టి విద్యావిరుద్ధములు అసంభవములునగు అబద్ధపు మాటలను చెప్పు మహావీరుని, సర్వోత్తముడని భావించుట మహాభ్రాంతి" అనియే చెప్పవచ్చును.

శ్రాద్ధదినకృత్య 36వ పుటలో "ప్రేతవస్త్రములను సాధువులు తీసికొనవలె"నని వ్రాయబడినది.

సమీక్షకుడు:- చూడుడు! వీరి సాధువులు కూడ మహా బ్రాహ్మణుల (కాటికాపరుల) వలె నైరి. వస్త్రములను సాధువులు తీసికోవలెనన్న మరి ఆ మృతి నొందిన వారి ఆభూషణములను ఎవరు తీసికొనవలెను? బహుమూల్యమైన వగుటచే వానిని ఇంటిలోనే ఉంచుకొందురేమో! అప్పుడా ఇంటివారు కూడ ఎవరైరి? వారు మహా బ్రాహ్మణులు కారా?

పిండిచేయుట- రొట్టిచేయుట పాపము

రత్నసారము భా. 1.105వ పుటలో "ౘ్రేపుట, దంచుట, విసరుట, అన్నము వండుట మున్నగువానివలన పాపము కలుగుచున్నది.

సమీక్షకుడు:- వీరి విద్యావిహీనతను చూడుడు. ఈ పనులను చేయనిచో మనుష్యులు బ్రతుకుటెట్లు? జైనులు కూడ ఆకలిదప్పికలచే పీడితులై చచ్చిపోదురుగద!

రత్నసారము:- 104వ పుటలో "తోటలు పెంచుటవలన తోటమాలికి ఒక లక్ష పాపములు కలుగుచున్నవి".

సమీక్షకుడు:- తోటమాలికి లక్షపాపములు కలుగుచున్నవన్న దానిచే అనేక జీవములు పత్ర, ఫల, పుష్ప, ఛాయాదులను పొంది ఆనందితులగుచున్నందున కోట్లకొలది పుణ్యములు కూడ కలుగుచునేయున్నవి. దీనిని విస్మరింపజేయుట గొప్ప అన్యాయమే కద!

తత్త్వవివేకము 202వ పుటలో "ఒకదినమున నందిషేణ సాధువు పొరపాటున వేశ్య ఇంటికి వెళ్లి ధర్మము పేర భిక్షమడిగెను. ఇక్కడ ధర్మముతో పనిలేదు. అర్థమే కావలసియున్నదని ఆ వేశ్య చెప్పెను. అప్పుడా సాధువు 12 లక్షల ఏబదివేల అపరంజీలను ఆమె ఇంట కురిపించెను.

సమీక్షకుడు:- ఈ విషయాన్ని సత్యమని బుద్ధిహీనుడు తప్ప మరెవరైనా అంగీకరింపగలడా?

రత్నసారభాగము 67వ పుటలో "ఒక శిలా విగ్రహము గుఱ్ఱము నెక్కి ఎవ్వరెచ్చట స్మరించిన అచ్చటికి వచ్చి వారిని రక్షించుచున్నదని వ్రాయబడినది.

సమీక్షకుడు:- జైన మహాశయులారా! ఈ వర్తమాన సమయమున మీవద్ద దొంగతనములు మొదలగునవి జరుగుచున్నవి. శత్రుభయము కూడ కలుగుచుండును గదా! అప్పుడు ఆ రాతి విగ్రహమును స్మరించి మీరేల రక్షింపబడుట లేదు? అటు దిక్కులేక నిటు పోలీసు స్టేషనులకు, కోర్టులకు ఎందుకు తిరుగుచున్నారు?

శ్వేతాంబరులు - దిగంబరులు

ఇప్పుడు వారి సాధువుల లక్షణములు వ్రాయబడును.

సరజోహరణా భైక్ష్యభుజో లుంచితమూర్ధజాః ।
శ్వేతాంబరాః క్షమాశీలా నిఃసంగా జైనసాధవః ॥

॥ స.ద.సం. అర్హత. ద ॥ 1 ॥

జైన సాధువుల లక్షణములను 'జినదత్త సూరి' అను నత డీ శ్లోకములందు వివరించినాడు. సరజో హరణా = చామరము నుంచుట, భిక్షమడిగి తినుట, తలవెంట్రుకలను ఊడబెరుకుకొనుట, శ్వేతవస్త్రములను ధరించుట, క్షమకలిగి యుండుట, నిస్సంగుడై యుండుట అను ఈ లక్షణములు గల జైన శ్వేతాంబరులే **'యతులు'** అనబడుదురు.

లుంచితాః పిచ్ఛికాహస్తాః పాణిపాత్రా దిగంబరాః ।
ఊర్ధ్వాశినో గృహే దాతు ర్ద్వితీయాః స్యు ర్జినర్షయః ॥ 2 ॥

రెండవవారు దిగంబరులు. అనగా వస్త్రములను ధరింపక యుండుట, తలవెంట్రుకలను ఊడబెరికికొనుట, ఉన్నిపోగులతో చేయబడిన 'పిఛ్ఛిక' యను ఊడ్చుసాధనమును చంకనుంచుకొనుట, ఎవడేని భిక్షమిచ్చిన చేతియందుంచుకొని తినువారును **'దిగంబరులు'** అనబడుదురు. వీరు రెండవ విధమైన సాధువులు. భిక్షమిచ్చు గృహస్థుడు భోజనము చేసిన తదుపరి భోజనము చేయువారు **'జినర్షులు'** అనగా మూడవ విధమయిన సాధువులనబడుదురు.

భుంక్తే న కేవలీ న స్త్రీ మోక్షమేతి దిగంబరః ।
ప్రాహురేషామయం భేదో మహాన్ శ్వేతాంబరైః సహ ॥ 3 ॥

ఇక దిగంబర, శ్వేతాంబరులందు భేదమేమన, దిగంబరులు స్త్రీలకు 'అపవర్గము' లేదందురు. శ్వేతాంబరులు కలదందురు. ఇత్యాది విషయముల వల్లనే వీరు ముక్తిని పొందుచున్నారు.

ఇదియే వీరి సాధువులలో గల భేదము. కావున జైనులలో గల కేశలుంచనము – వెంట్రుకలను పెరికివేయుట సర్వత్ర ప్రసిద్ధమైయున్నది. ఐదు పిడికిళ్ళు వెంట్రుకల ఊడబెరుకుట మున్నగు మాటలు అక్కడక్కడ కూడ వ్రాయబడియున్నవి.

వివేకసారము భా. 2. 16వ పుటలో "అయిదు పిడికిళ్ళు వెంట్రుకలను ఊడబెరికి చారిత్రను గ్రహించెను. అనగా ఐదు పిడికిళ్ళు తలవెంట్రుకలను ఊడబెరికి సాధువయ్యెనని వ్రాసియున్నది. కల్పసూత్ర భాష్యము 108వ పుటలో కేశలుంచన మొనరించి గోవు వెంట్రుకల వలె ఉంచవలె"నని వ్రాయబడినది.

సమీక్షకుడు :– జైనులారా! ఇప్పుడు చెప్పుడు. మీ దయాధర్మమిక ఎక్కడున్నది? ఇది 'హింస' అనబడదా? అనగా తన చేతితో తానే వెంట్రుకలను ఊడబెరికికొనినచో ఆ జీవి కెంత కష్టము కలుగవచ్చును? ఒక జీవికి కష్టము కలుగజేయుటయే 'హింస' అనబడును.

వివేకసారము 7–8వ పుటలో 1633వ విక్రమ సంవత్సరమున శ్వేతాంబరులలో 'ధూండియా' అనువారు, వారినుండి 'తేరహ పంథీయులు' మున్నగు ఆడంబర వేషధారులును బయలుదేరినారు. ధూండియాలు పాషాణాది మూర్తుల నంగీకరింపరు. వారు భోజనమును, స్నానమును చేయునప్పుడు తప్ప తక్కిన సమయములందు సదా నోటిపై ఒక పట్టీని కట్టుకొందురు. యతులు మున్నగువారు పుస్తకములు చదువునపుడు మాత్రమే ముఖము మీద పట్టీ కట్టుకొందురు. అన్య సమయములందు కట్టుకొనరు.

ప్రశ్న:– నోటిమీద తప్పక బట్టను కట్టుకొనవలెను. ఏలయన 'వాయుకాయము' అనగా గాలిలోనుండు సూక్ష్మ శరీరములు కల జీవులు నోటిగాలి వేడిమివల్ల చచ్చిపోవును. అట్టి పాపము ముఖము మీద పట్టీ కట్టుకొననివారికి కలుగును. కావుననే మేము ముఖము మీద పట్టీ కట్టుకొనుటను మంచిదని భావించుచున్నాము.

జవాబు:- ఈ విషయము విద్యకును, ప్రత్యక్షాది ప్రమాణములకును వ్యతిరేకమైనది. ఎందులకన జీవులు అజరామరములు. అవి నోటి వేడిమికి ఎన్నడును చావవు. వీనిని మీరు కూడా అజరామరములనియే ఒప్పుకొనుచున్నారు కదా!

ప్రశ్న:- జీవులు చావవు. కాని నోటియందలి ఉష్ణవాయువు వల్ల వానికి పీడ గలుగుచున్నది. అట్టి పీడను కలుగజేయువారికి పాపము కలుగును. కావున - నోటిమీద పట్టీ కట్టుకొనుట మంచిది.

జవాబు:- ఈ మీ మాటలు కూడ సర్వథా అసంభవమే. ఏ జీవునికి పీడ కలిగింపకుండవలెనన్నచో ఒక్క జీవుని నిర్వాహము కూడ కించిత్తైనను జరుగదు. నోటివాయువు వలననే జీవులకు పీడగలుగుచున్నదని మీ మతమున గలదేని నడచుట, తిరుగుట, కూర్చుండుట, చేతులనెత్తుట, రెప్ప వాల్చుట మున్నగువానియందు కూడ తప్పక పీడకలుగుచుండవచ్చును. కాబట్టి నోటికి గుడ్డలు కట్టుకొని ఉండునట్లు కాళ్ళు చేతులు కట్టివేసుకొని ఒకమూల పడుంటుట మంచిది.

ప్రశ్న:- ఔను. వీలైనంతవరకు జీవులను రక్షింపవలెను. మే మెచ్చట రక్షింపలేమో అచ్చట అసమర్థులము కావచ్చును. ఏలయన వాయువు మున్నగు పదార్థములందంతట జీవులు నిండియున్నవి. మేము ముఖము మీద పట్టీ కట్టుకొనకున్న అనేక జీవములు చచ్చును. బట్ట కట్టుకొనుట వలన అంతగా చావవు.

జవాబు:- మీ ఈ మాటలు యుక్తి శూన్యములే. ఏలయన బట్ట కట్టుకొనుట వలన జీవులకు అధిక దుఃఖము కలుగును. ఒకడు ముఖము మీద బట్టకట్టుకొనినచో అతని ముఖవాయు వాడక అది క్రిందికో, పార్శ్వమునకో లేక మౌనముగానున్న సమయమున నాసిక ద్వారా కుంభకమయి వేగముగనో వెడలుచుండును. దానిచే ఉష్ణత అధికమై మీ మతానుసారముగ జీవులకు విశేషముగ పీడ కలుగవచ్చును.

చూడండి! ఇంటికి, గదికి గల తలుపులన్నియు మూయబడిన పక్షమందు గాని లేక తెరకట్టబడిన పక్షమందు గాని ఉష్ణత అధికమగుచుండును. తెరవబడియున్న అంత అధికము కాజాలదు. అటులే ముఖము మీద పట్టీ కట్టుకొనుటవలన ఉష్ణత అధికమగును. తెరచియుంచిన న్యూనమగును. ఆ ప్రకారమే మీరు మీ మతానుసారముగ జీవులధిక దుఃఖమును కలుగజేయుచున్నారు. నోరు మూయబడినపుడు ముక్కు పుటముల నుండి వాయువొక చోట చేరి కుంభించి వేగముగ వెడలుచు, జీవుల కధికాపాయమును, పీడను కలిగింపవచ్చును.

చూడండి! ఒక మనుష్యుడు నోటితోను, మరొకడు గొట్టముతోను అగ్నిని ఊదునేని నోటితో ఊదిన వాయువు విస్తరించి వెడలుట చేసి అగ్నిని తక్కువగాను, గొట్టముతో ఊదిన వాయువు ఒకచోట చేరి వెడలుటవలన అగ్ని అధికముగాను రగులుకొనజేయును. ఆ ప్రకారమే ముఖముమీద పట్టీ కట్టుకొని వాయువు నాపుటచే అది నాసిక ద్వారా మిక్కిలి వేగముగ వెడలి జీవముల కధిక దుఃఖమును కలిగించును. కావున ముఖము మీద పట్టీ కట్టుకొనువారి కంటే కట్టుకొననివారే ధర్మాత్ములు. ముఖము మీద పట్టీ గట్టుటచే తగిన స్థాన ప్రయత్నములతో అక్షరముల ఉచ్చారణ

కూడ జరుగదు. నిరనునాసికములైన అక్షరములను సానునాసికములుగా ఉచ్చరించుట వలన మీకు దోషమును కలుగును.

ఇక ముఖముమీద పట్టీ కట్టుకొనుట చేత దుర్గంధమధికమగును. ఏలయన శరీరము లోపల దుర్గంధము నిండియున్నది. శరీరము లోపలినుండి వెడలు వాయువంతయు దుర్గంధయుక్తమగుట ప్రత్యక్షము. దానిని అడ్డగించినచో దుర్గంధము అధికమగును. ఎట్లన బంధింపబడియున్న ప్రదేశము అధిక దుర్గంధయుక్తమును, తెరచియున్న ప్రదేశము అల్ప దుర్గంధయుక్తమును అగును. అట్లే ముఖము మీద పట్టీ కట్టుకొనుటవలనను, దంతధావన ముఖ ప్రక్షాళన స్నానాదులను చేయకపోవుటవలనను, వస్త్రములు శుభ్రపరచుకొనకపోవుటవలనను మీ శరీరములందు అధిక దుర్గంధముత్పన్నమై ప్రపంచమునందు రోగము లధికమగును. ఇట్లు మీరు జీవుల కెంతటి పీడ కలిగించుచున్నారో అంత అధికముగ మీకు పాపము కలుగుచున్నది.

జాతరలు మున్నగువానియందు అధికముగా దుర్గంధము వ్యాపించుటచేత 'విశూచిక - కలరా' మొదలగు అనేక విధాల - రోగములు పుట్టి జీవులకు దుఃఖదాయకములగునట్లే దుర్గంధము తక్కువైయున్న రోగములును తక్కువగా పుట్టి జీవులకు విశేష దుఃఖమును సంభవింపదు. కాబట్టి మీర అధికముగా దుర్గంధమును పెంచుటచేత గొప్ప నేరగాండ్రయియున్నారు. ఇక ముఖము మీద పట్టీ కట్టుకొనక దంతధావనమును, ముఖప్రక్షాళనమును, స్నానమును చేసి స్థాన, వస్త్రములను శుభ్రముగా ఉంచుకొనువారు మీ కంటె మిక్కిలి మంచివారు. దుర్గంధముతో కూడియుండు అంత్యజుల సహవాసమునందుండనివారును మిక్కిలి మంచివారే. దుర్గంధయుక్తులగు అంత్యజుల సహవాసముచేత నిర్మలమైన బుద్ధి కలుగనటులే మీ, మీ సాంఘికుల సహవాసమున నుండువారి బుద్ధియు వృద్ధి బొందదు.

ప్రశ్న:- మూయబడిన ఇంటిలో నుండు అగ్నిజ్వాల బయటనున్న జీవులకు బాధ కలిగింపనట్లు మేము నోటికి పట్టీ కట్టుకొనుటవలన వెలుపలి జీవులకు తక్కువ బాధ కలుగును. కావున నోటికి గుడ్డ కట్టుకోవడం వలన బయట వాయువులోనున్న జీవములకు పీడ కలుగదు. ఇక ఎదుట రగులుచున్న అగ్నికి అడ్డముగ చేయినుంచినచో వేడి తక్కువగా తగులును.

జవాబు:- ఈ మీ మాటలు కూడా చిన్నపిల్లల మాటలవంటివే. మూసిన ఇంటిలో అగ్ని మండవలయునన్న లోపలిగాలికి బయటిగాలికి సంబంధముండవలెను. లేనిచో అది మండదు. దీనిని ప్రత్యక్షముగా చూడదలచినచో ఒక లాంతరులో దీపమును వెలిగించి రంధ్రము లన్నియు మూసివేసి చూడుడు! దీప మప్పుడే ఆరిపోవును. భూమిపై సంచరించు మనుష్యాది ప్రాణులకు బయటిగాలి దొరకకున్న జీవింపనటులే అగ్నియు రగులుకొనదు. ఒకవైపునుండి అగ్నివేగమును అడ్డగించినచో అది రెండవవైపునకు అతివేగముగా వెడలును. అట్లే చేతినడ్డముగా ఉంచిన ముఖమునకు మంట తక్కువగా తగులును. కాని చేతి కెక్కువగా తగులును. కావున మీ మాట సరియైనది కాదు.

ప్రశ్న:- ఒక పెద్దమనిషితో ఒక చిన్న వ్యక్తి దగ్గరగా చేరి చెవిలో మాటలు చెప్పునపుడు

"నోటినుండి తుంపరలు రాలకుండుటకు, దుర్గంధమతనికి కలుగకుండుటకును" ముఖముమీద బట్టనో లేక చేతినో ఉంచును. పుస్తకమును చదువునపుడు దానిమీద తుంపరలు పడి అది ఎంగిలగును. కొందరగా చెడిపోవును. ఇది అందరకు తెలిసినదే. కావున నోటికి పట్టీ కట్టుకొనుట మంచిది.

జవాబు:- జీవులు రక్షింపబడునను ఉద్దేశముతో ముఖము మీద పట్టీ కట్టుకొనుట వ్యర్థమని దీని మూలమున సిద్ధమైనది. ఇక పెద్దమనిషితో చిన్నవ్యక్తి మాటలాడునపుడు, "ఆ గుప్తమైన మాటలను ఇతరులు వినకుండుటకు గాను ముఖముమీద గుడ్డనో, చేతినో ఉంచుకొనును. గట్టిగా మాట్లాడునపుడు ముఖముమీద గుడ్డనుగాని, చేతిని గాని ఎవ్వరు పెట్టుకొనరు. కాబట్టి గుప్తమైన మాటల కొరకే అట్లు తటస్థించునని తెలియుచున్నది.

ఇక మీరు దంతధావనాదులు చేయనందున మీ ముఖము మున్నగు అవయవములనుండి అత్యంత దుర్గంధము వెడలుచున్నది. కావున మీరొకని సమీపమున గాని, ఒకడు మీ సమీపమున గాని కూర్చుండిన దుర్గంధము తప్ప మరేమి వచ్చును? ముఖమున కడ్డముగా చేతినో లేక కొంగునో ఉంచుకొనుటవలన కొన్ని ప్రయోజనములు కలవు. చాలామంది ఉన్నచోట ఒక రహస్యమైన మాట చెప్పునప్పుడట్లు చేతినో, కొంగునో ఉంచకున్న ఇతరుల దిక్కునకు వాయువు వ్యాపించి ఆ మాట బయటపడును. వారిద్దరును ఏకాంతమున మాటలాడునప్పుడు మూడవవాడుండడు. కావున అట్లు చేయవలసి యుండదు. ఇక పెద్దలమీదనే ఉమ్మి పడకుండ ఉండవలెనన్న, చిన్నలమీద ఉమ్మి పడవచ్చునా? ఎంగిలి తుంపరులు ఎవరిమీదనుపడకూడదు. ఏలయన మేము దూరముగా ఉండి మాటలాడినను గాలి మా దిక్కునుండి ఇతరుల దిక్కునకు పోవును. సూక్ష్మరూపమును దాల్చి త్రసరేణువులు ఆ వాయువుతో కలిసి వాని శరీరముమీద అవశ్యముగా పడును. దానిని కూడ దోషమని భావించిన అది అవిద్యయే అనబడును.

మరి నోటి వేడిమికి జీవులు చచ్చుననియో లేక వానికి పీడ కలుగుననియో నమ్ముచున్న వైశాఖ జ్యేష్ఠ మాసములందు సూర్యుని తీక్షణమైన వేడిమికి ఆ వాయు కాయ జీవము లొకటియు మిగులక అన్నియు చచ్చిపోవును. కాని ఆ వేడిమికి ఆ జీవులు చావజాలవు. కావున మీ యీ సిద్ధాంతము మిథ్యయే. ఏలయన మీ తీర్థంకరులు పూర్ణవిద్వాంసులై యున్న, ఇట్టి వ్యర్థమైన మాటల నెందులకు చెప్పియుందురు? చూడుడు! అన్ని అవయవములతో ఉన్న జీవునికి మాత్రమే పీడకలుగును. ఇందులకు ప్రమాణము –

పంచావయవయోగా త్సుఖసంవిత్తిః ॥ సాంఖ్య అ. 5, సూ. 27 ॥

పంచేంద్రియములకు పంచవిషయములతో సంబంధము కలుగునప్పుడే జీవులకు సుఖమో లేక దుఃఖమో కలుగును. చెవిటివాని కొకడు తనను తిట్టుచున్నాడను జ్ఞానము కాని, అంధునకు రూప జ్ఞానము కాని లేదా వాని ఎదుటనుండి సర్పవ్యాఘ్రాది భయంకరములయిన జంతువులు పోవుచున్నవను వాని జ్ఞానము గాని, పక్షవాతరోగము కలవానికి స్పర్శజ్ఞానము కాని, జలుబురోగము కలవానికి పరిమళ జ్ఞానము కాని, జిహ్వలేనివానికి రుచి జ్ఞానము గాని కలుగజాలనట్లే ఆ వాయుగత జీవుల విషయమని ఎంచవలెను. చూడుడు.

జీవుడు సుషుప్తిదశలో ఉన్నప్పుడు అతనికి సుఖదుఃఖము లేవియు కలుగవు. ఎందులకన జీవము శరీరము లోపల ఉండును. దానికి బాహ్యావయవములతో సంబంధము లేకపోవుట వలన సుఖదుఃఖములు కలుగవు. వైద్యుడు కాని డాక్టరు కాని, మత్తుపదార్థములను తినిపించియో లేక వాసన చూపించియో రోగుల శరీరావయవములను కోయుచున్నప్పుడు వారికి దుఃఖమేమియు తెలియనట్లే వాయుకాయజీవులకును, అన్యస్థావర శరీరములు గల జీవులకును సుఖదుఃఖము లెన్నటికిని కలుగనేరవు.

ఎట్లన మూర్ఛితదశలో నున్న జీవులకు సుఖదుఃఖములు కలుగనటులే అత్యంత మూర్ఛిత దశలో నున్న ఈ వాయుకాయ జీవులకు సుఖదుఃఖములు కలుగనేరవనుట స్పష్టము. కావున వానిని బాధల నుండి కాపాడుట ఎట్లు కుదురును? వానికి సుఖదుఃఖములు కలవనునది ప్రత్యక్షము కానపుడు మీ అనుమానాదు లిట ఎట్లు సంగతములగును?

ప్రశ్న:- అవి జీవులేకద వానికి సుఖదుఃఖము లెందులకు కలుగకుండును?

సమాధానము:- నాయనలారా! వినుడు! మీరు సుషుప్తిలో ఉండునపుడు మీకు సుఖదుఃఖము లేల కలుగవు? సుఖదుఃఖములు కలుగుటకు ప్రసిద్ధసంబంధమే కారణముకద. మత్తుపదార్థముల వాసన చూపించి డాక్టర్లు అంగములనుకోయుచు, చీల్చుచు, ఛేదించుచున్నప్పుడు వారికి దుఃఖము కలుగుటలేదని దీనికి సమాధానమింతకుముందే ఇచ్చినాము. ఆ విధముగానే అతి మూర్ఛితులై యున్న జీవులకు సుఖదుఃఖము లెట్లు కలుగును? కారణము సుఖదుఃఖములను పొందుట కక్కడ సాధనమే లేదు.

ప్రశ్న:- చూడుడు! కారణమేమన ఆకుకూరలందు, కందమూలములందు అనంతములైన జీవములు కలవు. వానిని తింటిమా ఆ జీవములను చంపినందున, వానిని దుఃఖింపజేసినందున మేము పాపాత్ములమగుదుము.

జవాబు:- ఇదియును మీ తెలివితక్కువ మాటలే. ఏలయన పచ్చని ఆకుకూరలను తినుటవలన జీవములు చచ్చుననియు, వానికి పీడకలుగుననియు ఏల భావించుచున్నారు? ప్రత్యక్షముగ పీడ కలుగుచున్నట్లు మీకు గోచరమగుటలేదు గద. గోచరమగుచున్న మాకును చూపింపుడు. మీ రెన్నడును ప్రత్యక్షముగ చూడజాలరు. మాకు చూపనుజాలరు. ప్రత్యక్షమే కానపుడు అనుమానోపమాన శబ్దప్రమాణములు కూడ ఎన్నటికిని ఘటిల్లనేరవు. పైన చెప్పబడిన ఉత్తరమే దీనికి అన్వయించును. ఏలయన అత్యంతాంధకార మను మహాసుషుప్తిలో నున్నప్పుడును, మితిమీరిన మత్తులో ఉన్నప్పుడును జీవులకు సుఖదుఃఖములు గలుగునని భావించుట "మీకిట్టి యుక్తిశూన్యములైన విద్యా విరుద్ధములగు మాటలను బోధించిన" మీ తీర్థంకరుల పొరపాటే యని తెలియుచున్నది.

ఇంటికి అంతమున్నప్పుడు దానిలో నుండురికి అంతమేల ఉండదు? కందములు అంతము కలవై యుండుట మనము చూచుచున్నప్పుడు వానియందలి జీవముల కంతమెందులకు లేకపోవును? కావున ఇదియును మీ అజ్ఞానమే అనవచ్చును.

ప్రశ్న:- చూడుడు! మీరు నీళ్ళను కాచక అట్లే త్రాగుచు గొప్ప పాపభాగులగుచున్నారు. మేము నీళ్ళను కాచి చల్లార్చి త్రాగుచున్నట్లే మీరును త్రాగవలెను.

జవాబు:- ఈ మీ మాటయు భ్రమతో గూడినదే. మీరు నీళ్ళను కాచునపుడు ఆ జలమందలి జీవులన్నియు చావనే చచ్చును గద. మరి వాని శరీరములు కూడ నీటిలో కలిసిపోవును. ఆ నీటిని మీరు త్రాగుదురు. ఆ జీవుల శరీరసారమంతయు మీలో చేరును. కావున మీరే మిక్కిలి పాపము చేయుచున్నారు. చల్లని నీటిని త్రాగువారు పాపమే చేయుట లేదు. చల్లని నీటిని త్రాగినపుడు అది కడుపులోనికి పోయి కొంత వేడగును. ఆ నీటియందలి జీవులు శ్వాసద్వారా వెలుపలికి పోవును. ఇక జలకాయ జీవులకు మేము పైన చెప్పినట్లు సుఖదుఃఖములు కలుగనే కలుగవు. కాబట్టి చల్లని నీరు త్రాగువారికి పాపముతో పనేమున్నది?

ప్రశ్న:- జఠరాగ్ని వేడిమికి జీవులు బయటికి వెడలునట్లే వెచ్చబెట్టిన జలములో నుండి ఆ జీవులు బయటకేలపోవు?

జవాబు:- ఔను, వెడలిపోవచ్చును. కాని మీరు నోటివాయువు వేడిమికి జీవులు చచ్చునని నమ్ముచున్నారు గద. జలమును కాచినప్పుడును మీ మతానుసారముగ జీవులు చచ్చిపోవును. లేదా అధికబాధనొంది వెడలిపోవును. ఇక అట్లే వాని శరీరములును ఆ జలములో కలిసిపోవును. కాబట్టి ఉష్ణజలము త్రాగువారే పాపులగుచున్నారు.

ప్రశ్న:- మేము స్వయముగ నీటిని వేడిచేయుము. గృహస్థుని కూడ 'జలమును వేడిచేయుము' అని ఆజ్ఞాపింపము. కావున మాకు పాపము కలుగదు.

జవాబు:- మీరు వేడినీళ్ళను త్రాగకున్న గృహస్థులెందులకు వేడి చేయుదురు? కాబట్టి మీ కొరకు వారు నీటిని వేడిచేయుచున్నారు. కావున ఆ పాపమునకు పాత్రులు మీరే. మీ రెవరికైన నీళ్ళను వేడిచేయమని ఆజ్ఞాపించినచో అతడే నీళ్ళను వేడిచేయును. కాని ఆ గృహస్థులు ఈ సాధువులు ఎవరియింటికి విచ్చేయుదురో! అను అనుమానముతో గృహస్థులందరును తమ తమ గృహములందు జలమును వేడిచేసియుంచుదురు. కావున ఈ పాపమునకు పాత్రులు ముఖ్యముగా మీరే అగుచున్నారు.

రెండవది:- ఎక్కువగా కట్టెలు కాలినందున, కాల్చినందున పైన ఉదహరింపబడినట్లు వంట, పొలము, వ్యాపారము మున్నగువానిని చేయుటచేత మీరు జీవులకు హింస కలిగించి మిక్కిలి పాపులగుచున్నారు. జలమును వేడిచేయించుటకు ముఖ్యముగా మీరే కారణము. అట్లే 'మీరు వేడినీటిని త్రాగవలెను. చన్నీటిని త్రాగకూడదు' అని బోధించుచున్నందున ముఖ్యంగా ఆ పాపానికి మీరే బాధ్యులగుతున్నారు. ఇక మీ ఉపదేశమును తీసుకొని అట్లాచరించువారును పాపాత్ములే.

ఇక అది మీ అవిద్యయో, కాదో గమనింపుడు! మీరు చిన్న చిన్న జీవులమీద దయ చూపుచున్నారు. కాని ఇతర మతములవారిని నిందించుచు వారికి అపకారము చేయుచున్నారే అది పాపము కాదా? మీ తీర్థంకరులు చెప్పు మతమే నిజమన్నచో సృష్టియందు ఇంత వర్షమును, పారుచున్న ఇన్ని నదులను ఇంత జలమును ఈశ్వరుడెందులకు సృష్టించెను? అట్లే సూర్యుని కూడ సృష్టించ లేకుండెను.

ఏలయన అందు కోట్లకొలది జీవులు మీ మతము ననుసరించి చచ్చుచుండవచ్చును గద. మరి మీరెవరిని ఈశ్వరులని నమ్ముచున్నారో వారు దయచేసి సూర్యుని తాపమును, మేఘములను ఎందుకు నిలిపివేయలేదు? పూర్వము చెప్పబడినట్లు ప్రాణులు విద్యమానమై యుండకున్న కందమూలాది పదార్థము లందుండు జీవులకు సుఖదుఃఖములు కలుగకుండును. సకల ప్రాణులమీద మిక్కిలి దయ కలిగియుండుట గూడ దుఃఖమునకు హేతువగును. ఎట్లన మనుష్యులందరును మీ మతమునే అంగీకరించినవారై దొంగలను, దోపిడిగాండ్రను ఎవరును దండింపకపోదురేని ఎంత గొప్ప పాపము జరుగును? కావున తగురీతిని దుష్టులను దండించుచు శ్రేష్ఠులను పాలించుటయే 'దయ' అనబడును. దీనికి విపరీతముగ ఆచరించుట దయాక్షమా రూప ధర్మమును నశింపజేయుటయే. ఎందరో జైనులు దుకాణములు పెట్టుదురు. ఆ వ్యవహారములందు అబద్ధములు పలుకుదురు. పరుల ధన మపహరింతురు. దీనులను మోసపుచ్చుట మున్నగు దుష్కర్మల నొనర్తురు. వీనిని దూరము చేయుటకు ఉపదేశమెందులకు చేయరు? నోటిమీద పట్టీ కట్టుకొనుటమున్నగు చర్యలెందులకు నటించుచున్నారు?

మీరెందరినో శిష్యులనుగాను, శిష్యురాండ్రను గాను చేసికొనునపుడు కేశలుంచనమును,అనేక దినముల యుపవాసమును చేయుచు, చేయించుచు మీకు, ఇతరులకు పీడ కలిగించుచున్నారు. ఇట్లు అన్యులకు దుఃఖము గలుగజేయుచు ఆత్మహత్య యను ఆత్మ దుఃఖము గలుగజేయువారలై హింసకు లేల అగుచున్నారు? మరి ఏనుగులమీదనో, గుఱ్ఱముల మీదనో, ఎద్దుల మీదనో, ఒంటెల మీదనో ఎక్కుట, మనుష్యులచేత కూలిపనులు చేయించుట జైనులు పాపమని ఏల భావింపరు? మీ శిష్యులు తల తోక లేని మాటలను నిరూపింపరేని మీ తీర్థంకరులు కూడ నిరూపింపజాలరు.

ఇక మీరు కథ చెప్పబోవునపుడును, శ్రోతలు వినుటకు వచ్చునపుడును మార్గమునందు మీ మతానుసారముగ జీవులు చచ్చుచునే యుండవచ్చును. కావున మీ రీ పాపమునకు ముఖ్యకారకులేల యగుచున్నారు? ఈ కొలది మాటల మూలమున అధికముగా ఊహించి గ్రహింపదగును. అనగా జల, స్థల, వాయువులందలి స్థావర శరీరములలో అత్యంత మూర్ఛిత దశయందుండు జీవులకు దుఃఖము కాని, సుఖము కాని ఎన్నటికిని కలుగనేరదనుట స్పష్టము.

ఇంకను జైనుల అసంభవములైన కొన్ని కథలను వ్రాయుచున్నాము. వానిని గమనింపవలయును. తన చేతితో కొలిచిన మూడున్నర చేతుల ధనుస్సుండుననియు, పూర్వము వ్రాయబడినటులే కాలసంఖ్య కలదనియు గూడ జ్ఞాపకముంచుకొనవలయును.

రత్నసారభాగము 1 నందు 166, 167వ పుటలలో ఇట్లు వ్రాయబడినది.

1. ఋషభదేవుని శరీరపరిమాణము 500 (అయిదువందల) ధనుస్సుల పొడుగున్నది. ఆయువు 8400000 (ఎనుబది నాలుగు లక్షల) పూర్వ సంవత్సరములు.
2. అజితనాథుని శరీరపరిమాణము 450 (నాల్గువందల యేభై) ధనుస్సుల పొడుగు. ఆయువు 7200000 (డెబ్బది రెండు లక్షల) పూర్వ సంవత్సరములు.

3. సంభవనాథుని శరీరపరిమాణము 400 (నాల్గువందల) ధనుస్సుల పొడుగు. ఆయువు 6000000 (అరువది లక్షల) పూర్వ సంవత్సరములు.

4. అభినందనుని శరీరపరిమాణము 350 (మూడువందల యాభై) ధనుస్సుల పొడుగు. ఆయువు 5000000 (యాభై లక్షల) పూర్వ సంవత్సరములు.

5. సుమతినాథుని శరీరపరిమాణము 300 (మూడువందల) ధనుస్సుల పొడుగు. అయువు 4000000 (నలుబది లక్షల) పూర్వ సంవత్సరములు.

6. ప్రద్మప్రభ శరీరపరిమాణము 240 (నూటనలభై) ధనుస్సుల పొడుగు. ఆయువు 3000000 (ముప్పది లక్షల) పూర్వ సంవత్సరములు.

7. పార్శ్వనాథుని శరీరపరిమాణము 200 (రెండువందల) ధనుస్సుల విస్తారము. ఆయు పరిమాణము 2000000 (ఇరవై లక్షల) పూర్వ సంవత్సరములు.

8. చంద్రప్రభ శరీరపరిమాణము 150 (నూట యాభై) ధనుస్సుల విస్తారము. ఆయువు 1000000 (పది లక్షల) పూర్వ సంవత్సరములు.

9. సువిధినాథుని శరీరపరిమాణము 100 (నూరు) ధనుస్సుల పొడుగు. ఆయువు 200000 (రెండు లక్షల) పూర్వ సంవత్సరములు.

10. శీతలనాథుని శరీరపరిమాణము 90 (తొంభై) ధనుస్సుల పొడుగు. ఆయువు 100000 (ఒక లక్ష) పూర్వ సంవత్సరములు.

11. శ్రేయాంసనాథుని శరీరపరిమాణము 90 (ఎనభై) ధనుస్సుల పొడుగు. ఆయువు 840000 (ఎనభైనాలుగు లక్షల) పూర్వ సంవత్సరములు.

12. వాసుపూజ్యస్వామి శరీరపరిమాణము 70 (డెబ్బై) ధనుస్సుల పొడుగు. ఆయువు 720000 (డెబ్బదిరెండు లక్షల) పూర్వ సంవత్సరములు.

13. విమలనాథుని శరీరపరిమాణము 60 (అరువది) ధనుస్సుల పొడుగు. ఆయువు 6000000 (అరువదిలక్షల) పూర్వ సంవత్సరములు.

14. అనంతనాథుని శరీరపరిమాణము 50 (ఏబది) ధనుస్సులు. ఆయువు 3000000 (ముప్పది లక్షల) పూర్వ సంవత్సరములు.

15. ధర్మనాథుని శరీరపరిమాణము 45 (నలుబదియైదు) ధనుస్సులు. ఆయువు 1000000 (పది లక్షల) పూర్వ సంవత్సరములు.

16. శాంతినాథుని శరీరపరిమాణము 40 (నలుబది ధనుస్సులు). ఆయువు 100000 (ఒక లక్ష) పూర్వ సంవత్సరములు.

17. కుంథునాథుని శరీరపరిమాణము 35 (ముప్పదియైదు) ధనుస్సులు. ఆయువు 95000 (తొంభైఐదు వేల) పూర్వ సంవత్సరములు.

18. అమరనాథుని శరీరపరిమాణము 30 (ముప్పది) ధనుస్సులు. ఆయువు 84000 (ఎనుబది నాలుగువేల) పూర్వ సంవత్సరములు.

19. మల్లీనాథుని శరీర పరిమాణము 25 (ఇరువది యైదు) ధనుస్సులు. ఆయువు 55000 (యాబది యైదు వేల) పూర్వ సంవత్సరములు.

20. ముని సువ్రతుని శరీర పరిమాణము 20 (ఇరువది) ధనుస్సులు. ఆయువు 30000 (ముప్పది వేల) పూర్వ సంవత్సరములు.

21. నమి నాథుని శరీర పరిమాణము 14 (పధ్నాలుగు) ధనుస్సులు. ఆయువు 10000 (పదివేల) పూర్వ సంవత్సరములు.

22. నేమి నాథుని శరీర పరిమాణము 10 (పది) ధనుస్సులు. ఆయువు 1000 (ఒక వేయి) పూర్వ సంవత్సరములు.

23. పార్శ్వ నాథుని శరీర పరిమాణము తొమ్మిది చేతులు. ఆయువు 100 (ఒక వంద) పూర్వ సంవత్సరములు.

24. మహావీరస్వామి శరీర పరిమాణము ఏడు చేతులు. ఆయువు 72 (డెబ్బది రెండు) పూర్వ సంవత్సరములు.

సమీక్షకుడు:- ఈ ఇరువది నాలుగు మంది తీర్థంకరులు జైనమత ప్రచారకులు, ఆచార్యులు, గురువులును. వీరినే జైనులు పరమేశ్వరులని నమ్ముచున్నారు. వీరందరును ముక్తిని పొందినారట! "ఇంత గొప్ప శరీరములు, ఇంతటి ఆయువు మనుష్యుల కబ్బుట సంభవమా?" అని బుద్ధిమంతులు ఆలోచించవలెను. ఈ భూగోళమున ఇట్టి మానవులుండరు. పౌరాణికులు కూడా ఈ జైనుల గప్పాలను చూచి పురాణాలలో ఒక లక్ష, పదివేలు, వేయి సంవత్సరములు జీవించినట్లు వ్రాసినది కూడ అసంభవమే. కావున జైనుల కథనమెట్లు సంభవము కాగలదు?

ఇంకను వినుడు! కల్పభాష్యము 4వ పుటలో "నాగకేతనుడనువాడు ఒక గ్రామమంతటి పెద్దరాయిని వ్రేలిమీద నిలబెట్టెను".

కల్పభాష్యము 37వ పుటలో "మహావీరుడు తన అంగుష్ఠముతో పృథివి నొత్తగా శేషనాగుడు గడ గడ వణకెను".

కల్పభాష్యము 46వ పుటలో "మహావీరుని సర్పము కరువగా రక్తమునకు మారు పాలు కారెను. ఆ సర్పమును ఎనిమిదవ స్వర్గమునకు బోయెను".

కల్పభాష్యము 47వ పుటలో "మహావీరుని కాళ్ళమీద పరమాన్నము వండబడెను. ఆయన కాళ్ళు కాలలేదు.

కల్పభాష్యము 16వ పుటలో "ఒకచిన్న పాత్రలో ఒంటెను నిలిపెను.

రత్నసారభాగము 1.14వ పుటల్లో "శరీరముపైనున్న మురికిని తీసివేయరాదు. శరీరమును గోకరాదు.

వివేకసారము. భా. 1.215వ పుటల్లో "జైనులలో ఒక దమసారసాధువు క్రోధావేశుడై ఉద్వేగజనక సూత్రములను చదివి ఒక నగరమును తగులబెట్టెను. మహావీరుడను తీర్థంకరున కతడు మిక్కిలి ప్రియుడై యుండెను".

వివేకసారము. భా. 1 227 పుటల్లో "రాజాజ్ఞను అవశ్యముగ పాలింపవలెను".

వివేకసారము. భా. 1. 227 పుటల్లో "కోశ యను ఒక వేశ్య పళ్ళెములో ఆవాలను కుప్పగా పేర్చి, దానిమీద పుష్పములతో కప్పబడిన ఒక సూదిని నిలబెట్టి, దానిమీద బాగుగా నాట్యమాడెను. కాని సూది కాలికి గ్రుచ్చుకొనలేదు. ఆ ఆవాల కుప్ప కూడ చెదరలేదు".

తత్త్వవివేకము 228వ పుటలో ఈ కోశావేశ్యతో 'స్థూలముని' అను నతడు 12 సంవత్సరముల వరకు సంభోగము చేసెను. పిమ్మట దీక్షను పొంది సద్గతిని పొందెను. ఆ కోశావేశ్య కూడ జైనధర్మము నాచరించుచు సద్గతిని పొందినది.

వివేకసారము.భా. 1.185 పుటలో "మెడలో వేసికొనబడు ఒక సిద్ధుని కంఠరుమాలు 500 అపరంజీలను ఒక వైశ్యునకు ప్రతిదినము ఇచ్చుచుండెను".

వివేకసారము. భా. 1.228 పుటలో "బలవంతుని ఆజ్ఞవలనను, దేవాజ్ఞవలనను కారడవిలో కష్టముతో కాలము గడుపునపుడు గురువు, తల్లి, తండ్రి, కులాచార్యుడు, జ్ఞాతులు, ధర్మోపదేశకులు అను నీ ఆరుగురిని అడ్డగించుటవలన ధర్మమునకు కొంత కొరత ఏర్పడినను ధర్మము నష్టము కాదు.

సమీక్షకుడు:- ఇప్పుడు వీరి ఈ మిథ్యా విషయములను గమనింపుడు. ఒక మనుజుడు గ్రామమంతటి గొప్పశిలలను వ్రేలిమీద ఎన్నడైన ఎత్తికొన గలుగునా? ॥ 1 ॥

అంగుష్ఠముతో పృథివినొత్తిన అది అణగిపోగలదా? శేషనాగుడే లేనపుడు వణకిన దెవడు? ॥2 ॥

శరీరమును కోయుట వలన పాలు కారుట ఎవ్వడును చూచియుండడు. ఇది ఇంద్రజాలముగాక మరేమియు కాదు. అతనిని కరచిన సర్పము స్వర్గమునకు పోయెనట. మహాత్ములైన శ్రీకృష్ణుడు మున్నగువారు నరకమునకు పోయిరనుట ఎంత అబద్ధము? ॥ 3, 4 ॥

మహావీరుని కాళ్ళ మీద పరమాన్నము వండబడి నప్పుడతని పాదములు కాలిపోలేదెందులకు? ॥ 5 ॥

ఔరా! ఒక చిన్న పాత్రలో ఎన్నడైన ఒంటె పట్టగలదా? ॥ 6 ॥

శరీరపు మైలను శుభ్రము చేయకగోకకయున్నచో దుర్గంధరూపమగు మహానరకమును అనుభవించుచుండ వచ్చును. ॥ 7 ॥

'నగరమును తగులబెట్టిన 'సాధువు' యొక్క దయా క్షమ లెక్కడికి లేచిపోయెనో గద? మహావీరుని సాంగత్యముచేతనే అతని ఆత్మ పవిత్రముగానపుడు, మరణానంతరము అతని ఆశ్రయము గొను జైనులు ఎన్నడును పవిత్రులు కానేరరు. ॥ 8 ॥

రాజాజ్ఞను పాలింపవలసినదే. కాని జైనులు వ్యాపారులైనందున - రాజునకు భయపడి ఈ మాటను వ్రాసియున్నారు. ॥ 9 ॥

కోశావేశ్య శరీరమెంత తేలికగానున్నను ఆవాలకుప్పమీద సూదిని నిలబెట్టి దానిపై నాట్యమాడె ననుట, సూది గ్రుచ్చుకొనకపోవుట, ఆవాలును చెదరకపోవుట అనునవి ఉత్తగప్పాలు కాక మరేమగును? ॥ 10 ॥

ఎట్టి స్థితిలోనున్నను, ఏమి సంభవించినను, ధర్మము నెవ్వడును త్యజింపగూడదు. ॥ 11 ॥

ఇక కంఠరుమాలు యనునది జోలెబట్టతో చేయబడును గద! అది ప్రతిదినము 500 అపరంజీలను ఎట్లీయగలుగును? ॥ 12 ॥

ఈ రీతి అసంభవములైన వీరి మాటలు వ్రాయుచు పోవుదుమేని జైనుల కల్పితగాథలతో గూడిన గ్రంథము వలె ఇదియును మిక్కిలి పెరిగిపోవును. కావున అధికముగా వ్రాయుటలేదు. అనగా ఈ జైనులవి కొన్ని విషయములు తప్ప తక్కినవన్నియు మిథ్యోక్తులే అని తెలుసుకొనవలెను. చూడుడు!

దో ససి దో రవి పఢమే । దుగుణా లవణంమి ధాయఈ సందే ।
వారస ససి వారస రవి । తప్పమి ఇం నిదిఠ ససి రవిణో ॥
తిగుణా పుబ్బిలజయా । అణంతరాణంతరం మిఖిత్తమి ।
కాలో ఏ బయాలా । బిసత్తరీ పుస్కర్ ద్వంమి ॥

॥ ప్రకరణ భా. 4. సంగ్రహణీ సూత్రము. 77-78 ॥

జంబూద్వీపము లక్షయోజనములు. అనగా నాల్గులక్షల క్రోసుల విస్తారము కలదని వ్రాయబడి యున్నది. ద్వీపములలో ఇది మొదటి ద్వీపము. ఇందు నిద్దరు చంద్రులు, నిద్దరు సూర్యులును కలరు. అటులే లవణ సముద్రమున దానికి ద్విగుణము అనగా నలుగురు చంద్రులు, నలుగురు సూర్యులు కలరట. ఆ ప్రకారమే ధాతకీఖండమునందు 12 (పన్నెండు) చంద్రులు, 12 (పన్నెండు) సూర్యులును గలరు. ॥77॥

వీనికి మూడింతలు చేసిన ముప్పదియారగుదురు. ఇందరును, జంబూద్వీపమందలి ఇరువురును, లవణ సముద్రమునందలి నలుగురును కలిసి 42 చంద్రులును, 42 సూర్యులును కాలోదధి సముద్రమున కలరు.

ఈ విధముగనే ముందటి ద్వీపములందును సముద్రములందు కూడ "పూర్వము చెప్పబడిన నలుబది రెండింటిని మూడింతలు చేసిన" 126 అగును. వానిలో ధాతకీఖండమందు 12, లవణ సముద్రమునందు 4, జంబూద్వీపమందు 2, వీరిని అందరిని చేర్చి లెక్కించిన 144 మంది చంద్రులును, 144 మంది సూర్యులును పుష్కరద్వీపమున ఉండును. ఇదియు కేవలం అర్థమనుష్య

క్షేత్రగణనయే. ఇక ఎచ్చట మనుష్యులు నివసింపరో అచ్చట అనేక సూర్యులును చంద్రులును గలరు. మరియు అర్ధపుష్కర ద్వీపమునందు గల అనేక సూర్యచంద్రులు స్థిరముగా ఉందురు.

పూర్వము చెప్పబడిన 144 మందిని మూడింతలు చేసిన 432 మంది అగుదురు. వానిలో పూర్వోక్త జంబూద్వీపమందు ఇద్దరిద్దరును, లవణసముద్రమందు నలుగురు నలుగురును, ధాతకీఖండమందు 12 గురు 12 గురును, కాలోదధి సముద్రమందు నలువది రెండు మంది. వీరందరి జేర్చి, లెక్కించిన 492 చంద్రులును, 492 సూర్యులును పుష్కరసముద్రమున కలరు" అని శ్రీ జినభద్ర గణీక్షమాశ్రమణునిచే బృహత్ 'సంఘయణీ'లో 'యోతీసకరండక పయన్నా'లో 'చంద్రపన్నతి' 'సూరపన్నతి' అను ప్రముఖములైన సిద్ధాంత గ్రంథములలో కూడ ఇట్లే వ్రాయబడినది. ॥ 78 ॥

అసంభవ సూర్యచంద్రులు

సమీక్షకుడు:- భూగోళ ఖగోళవేత్తలారా! ఇక ఆలకింపుడు! ఈ యొక్క భూగోళమున ఒక విధముగ 492, మరొక విధముగ అసంఖ్యాక చంద్ర సూర్యులను ఈ జైనులు అంగీకరించుచున్నారు. మీరు చాలా భాగ్యవంతులు. ఎందులకన మీరు వేదధర్మానుయాయులై సూర్యసిద్ధాంతాది జ్యోతిష గ్రంథములను చదువుటవలన మీకు యథార్థముగ భూగోళ ఖగోళములు తెలిసినవి. ఒకవేళ మీరు ఈ జైనుల గందరగోళ మను మహాంధకారమున పడినచో ఇప్పటి జైనుల వలె మీరును ఆజన్మ మంధకారమునందే ఉండెడివారు. జంబూద్వీపమునందు ఒక్కొక్క సూర్యచంద్రునితో ఈ విద్వాంసులకు సందేహం కలిగియుండును కాబోలు! ఏలయన ఇంత పెద్ద భూమండలమును ముప్పది గడియలలో సూర్యచంద్రులెట్లు చుట్టివత్తురు? వీరు పృథివిని సూర్యుని కంటె పెద్దదిగా భావించుచున్నారు. ఇది వారి పెద్ద తప్పు.

దో ససి దో రవి పంతీ ఏగంతరియా ఛసది సంఖాయా ।
మేరుం పయాహిణంతా మాణుసఖిత్తే పరిఅడంతి ॥

॥ ప్రకరణ భా. 4. సంగ్రహణీ సూత్రము. 79 ॥

అర్థం:- మనుష్యలోకమున గల చంద్రసూర్యుల పంక్తులను లెక్కించుచున్నాము. రెండేసి చంద్రుల రెండేసి సూర్యుల వరుసలు కలవు. అవి ఒక్కొక్క లక్ష యోజనములు. అనగా నాల్గు లక్షల క్రోసుల దూరపు అంతరములో తిరుగుచున్నవి. సూర్యపంక్తిలో ఒక చంద్ర పంక్తి ఉన్నటులే చంద్రపంక్తిలో ఒక సూర్యపంక్తియు గలదు. ఇవ్విధముగ నాల్గు పంక్తులు గలవు. ఆ ఒక్కొక్క చంద్రపంక్తియందు 66 చంద్రులును, ఒక్కొక్క సూర్యపంక్తియందు 66 సూర్యులును కలరు.

ఆ నాల్గుపంక్తులు జంబూద్వీపమందలి మేరు పర్వతము చుట్టూ తిరుగుచు, మనుష్య క్షేత్రమునందును తిరుగుచుందును. అనగా జంబూద్వీపమందలి మేరువునుండి ఒక సూర్యుడు దక్షిణమునకు తిరుగుచుందునపుడు, రెండవ సూర్యుడు ఉత్తరమునకు తిరుగుచుండును. అలాగుననే లవణసముద్రమందలి ఒక్కొక్క దిక్కునకు ఇద్దరిద్దరు సంచరించుచుందురు. ధాతకీఖండమందు 6గురు, కాలోధధియందు 21 మంది, పుష్కరార్థమందు 36గురు, ఈ విధముగా అందరు కలసి 66 గురు

సూర్యులు దక్షిణదిశయందును 66గురు సూర్యులు ఉత్తరదిశయందును తమ తమ క్రమానుసారముగ సంచరించుచున్నారు.

ఈ రెండు దిశలయందలి సూర్యచంద్రుల వరుసలను చేర్చి లెక్కించితిమేని 132 మంది సూర్యులును, 132 మంది చంద్రులును మనుష్యలోకమున కూడ సంచరించుచున్నారు. ఇవ్విధముగనే చంద్రునితో పాటు అనేక నక్షత్ర పంక్తులు చాల తిరుగుచున్నట్లు తెలుసుకొనవలెను.

సమీక్షకుడు:- సోదరులారా! గమనించితిరా! ఈ భూగోళమున 132 మంది సూర్యులు, 132 మంది చంద్రులు ఈ జైనుల ఇండ్లమీదనే తిరుగుచు తపింపజేయుచుండవచ్చును. నిజముగా తపించినచో వారెట్లు జీవింపగలుగుదురో గద! రాత్రులందును 132 మంది చంద్రులు ప్రకాశించిన ఎంత శీతలముండునో ఆలోచింపుడు.

భూగోళ ఖగోళ విద్య నెరుగనివారే ఈ అసంభవములైన మాటలకు మోసపోదురు. ఇతరులు కాదు. ఒక్క సూర్యుడే ఈ భూగోళమంతటి అనేక భూగోళములను ప్రకాశింపజేయుచున్నపుడు, ఈ చిన్న భూగోళమెంత! పృథివి తిరుగుటలేదు. సూర్యుడే భూమిచుట్టూ తిరుగుచున్నాడన్న ఎన్నియో సంవత్సరముల కొక దినము ఒక రాత్రి ఏర్పడును. సుమేరు వనునది హిమాలయ పర్వతమే. మరొకటి లేనే లేదు. మరి ఘటమున కెదుట ఆవగింజంతగా గూడ నిది సూర్యుని ఎదుట లెక్కకు రాదు. ఈ విషయములను జైనులు ఆ మతమునందున్నంతవరకు తెలుసుకొనజాలరు. అంధకారమునందే పడియుందురు.

కేవలుని రాజనట భ్రమణము

సమత్త చరణ సహియా సవ్వం లోగం ఫుసే నిరవసేసం ।
సత్తయ చఉదసభాఏ పంచయ సుయదేసవిర ఈఏ ॥

॥ ప్రకరణ భా. 4. సంగ్రహణీ సూత్రము. 135 ॥

అర్థం:- సమ్యక్ చారిత్ర సహితులైన 'కేవలీ' అనువారు కేవల సముద్ఘాతావస్థచే పదునాల్గు రాజ్యలోకములందును తమ ఆత్మ ప్రదేశముచేసి సంచరింతురు.

సమీక్షకుడు:- జైనులు పదునాల్గు రాజ్యములున్నవని నమ్ముచున్నారు. ఇక వానియందలి పదునాల్గవదాని శిఖరము మీద 'సర్వార్థసిద్ధి' అను విమాన ధ్వజముపై కొంతదూరమున నుండు సిద్ధశిలయు, అట్లే దివ్యాకాశమును శివపురమందురు. కేవల జ్ఞానమను సర్వజ్ఞత్వమును, పూర్ణ పవిత్రతను పొందిన 'కేవలీ' లను వారే ఆ లోకమునకు పోయి స్వాత్మప్రదేశముచే సర్వజ్ఞులై యుందురట. ప్రదేశము కలవాడు విభువు కానేరడు. విభువు కానివాడు సర్వజ్ఞుడను కేవలజ్ఞాని ఎన్నటికిని కానేరడు. ఏలయన ఎవని ఆత్మ ఏకదేశీయమో అదియే వచ్చుచు, పోవుచు నుండును. అట్లే వాడు బద్ధుడును, ముక్తుడును, జ్ఞానియు అజ్ఞానియు అగుచుండును. సర్వవ్యాపకుడును, సర్వజ్ఞుడునై వాడట్లెన్నడును కానేరడు.

జైనుల తీర్థంకరులు జీవరూపులును, అల్పులును, అల్పజ్ఞులునై యుండిరి. వారు సర్వవ్యాపకులు, సర్వజ్ఞులును ఎన్నటికిని కానేరరు. కాని ఎవనియందు సర్వజ్ఞత్వాది గుణములు యథార్థముగ ఘటిల్లుచున్నవో అట్టి అనాద్యనంతుడు, సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు, పవిత్రుడు, జ్ఞానస్వరూపుడును అగు పరమాత్మను జైనులంగీకరించుటలేదు.

గబ్భనర తిపలియాఊ । తిగాఉ ఉక్కోసతే జహన్నేణం ।
ముచ్ఛిమ దుహావి అంతముహూ । అంగుల అసంఖ భాగతణూ ॥

॥ ప్రకరణ భా. 4. సంగ్రహణీ సూత్రము. 241 ॥

అర్థం:– ఇట రెండు విధముల మనుష్యులున్నారు. ఒకరు గర్భజులు. రెండవవారు అగర్భజులు. వారిలో గర్భజులగు మనుష్యులకు ఉత్కృష్టమైన మూడు పల్యోపముల ఆయువు, మూడు క్రోసుల శరీరములు ఉండునని తెలుసుకొనవలెను.

సమీక్షకుడు:– సరి! మూడు పల్యోపముల ఆయువు, మూడు క్రోసుల పరిమాణము గల శరీరము గల మనుష్యులు ఈ భూగోళమున కొందరుమాత్రమే జీవింప వీలగును. ఇక పూర్వము వ్రాయబడినట్లు వారికి మూడు పల్యోపముల ఆయువు కలిగియుండునేని వారికి పుట్టినవారి శరీరములు కూడ అటులే మూడు క్రోసుల పరిమాణము కలవై యుండదగును. మరి అట్టి మనుష్యులు బొంబాయి వంటి నగరమున ఇద్దరు, కలకత్తా వంటి నగరమున ముగ్గురో లేక నలుగురో నివసింపగలుగుదురు. ఇక జైనులొక్క నగరమున లక్షలకొలది మనుష్యులు కలరని వ్రాసియున్నందున వారుండు నగరములు కూడ లక్షల క్రోసుల వైశాల్యము కలిగియుండవలెను. ఈ భూగోళ ప్రాంతమున అంతట ఒక్క నగరము కూడ వసించుటకు అవకాశముండదు.

సిద్ధశిల

పణయాల లరకజోయణ । విరకమ్మా సిద్ధిసిల ఫలిహ విమలా ।
తదువరి గజోయణంతే లోగంతో తచ్ఛ సిద్ధఠిఈ ॥ 258 ॥

అర్థం:– 'సర్వార్థసిద్ధి' అను విమాన పతాకము మీద 12 యోజనముల సిద్ధశిల కలదు. దాని వెడల్పు, పొడుగు, లోని డొల్లల వైశాల్యము 45 (నలుబది ఐదు) లక్షల యోజనములు. ఆ సిద్ధశిలయందలి సిద్ధభూమి అంతయు ధవళమై, దేదీప్యమానమై, సువర్ణమయమై స్ఫటికమువలె నిర్మలమై యున్నది. దానినే కొందరు 'ఈషత్ ప్రాగ్భరా' అని పేర్కొనుచున్నారు. ఈ సర్వార్థసిద్ధశిలా విమానమునకు 12 యోజనములపైన ఆ లోకము కలదు. దీని పరమార్థమును 'కేవలీలు' మాత్రమే ఎరుగుదురు.

ఈ సర్వార్థ సిద్ధశిల మధ్యభాగము 8 యోజనముల స్థూలమైయున్నది. అక్కడినుండి నాల్గుదిశలకును, నాల్గు మూలలకును తగ్గింపబడుచు, ఈగ రెక్కలవలె సన్నమైన, ఉత్తాన ఛత్రాకారముతో సమానముగ నా సిద్ధశిల స్థాపింపబడియున్నది. ఆ శిల కొక యోజనము దూరముగా లోకాంతము కలదు. సిద్ధులకు నిలకడ స్థానమదియే.

సమీక్షకుడు:- ఇప్పుడు జైనులు నమ్ముచున్న మోక్షస్థానమను ఆ సర్వార్థ సిద్ధి విమాన ధ్వజముపైనున్న 45 (నలుబదైదు) లక్షల యోజనముల వైశాల్యముగల శిలయనునది మిక్కిలి అందమై, నిర్మలమైనదై యుండుగాక. అందుండు ముక్తజీవులు మాత్రమొకవిధముగ బద్ధులేకద. ఎందుకన అందుండి వెడలిన ముక్తిసుఖము దూరమైపోవచ్చును. దాని లోపలనే ఉందురేని వారికి గాలి కూడ తగులకుండవచ్చును. "ఇది పామరజనులను మోసపుచ్చుటకు కల్పింపబడిన వట్టి బూటకమే" అని తెలుసుకొనవలెను.

కీటకాదుల పరిమాణము

జోయణ సహస్స మహియం । ఏగింద్రియ దేహముక్కోసం ॥
వితి చఉరిం దిస సరీయం । వారస జోయణం తికోస చఉకోసం ।
జోయణ సహసపణిం దియ । ఉహే వుచ్ఛంత విసేసంతు ॥

॥ ప్రకరణ భా. 4. సంగ్రహణీ సూత్రము. 266-267 ॥

అర్థం:- సామాన్యముగ ఒక ఇంద్రియము గల శరీరము సహస్ర యోజనముల విస్తారము గల ఉత్కృష్టమైన శరీరమని ఎరుగవలెను. రెండింద్రియములు గల శంఖాదుల శరీర పరిమాణము పంద్రెండు యోజనములని ఎరుగవలెను. అట్లే మూడింద్రియములు గల క్రిమి కీటకాదుల శరీరములు మూడు క్రోసులని ఎరుగవలెను. నాలుగింద్రియములు గల భ్రమరాదుల శరీరపరిమాణము నాల్గు క్రోసులు. అట్లే పంచేంద్రియములు గల వాని శరీరపరిమాణమొక సహస్ర యోజనములు. అనగా నాల్గువేల క్రోసులని ఎరుగవలెను.

సమీక్షకుడు:- పంచేంద్రియములు గల ఒక్కొక్క మనుష్యుని శరీరము నాలుగేసి వేల క్రోసుల పరిమాణమున్న ఈ భూగోళమున కొందరు మాత్రమే ఉండగలుగుదురు. అనగా వందల మనుష్యులతోడనే భూగోళమంతయు క్రిక్కిరిసి నిండిపోవచ్చును. ఒకనికి నడుచుటకైన వీలులేకపోవును. ఇక వారు నడుచుటకు మార్గము, నివసించు స్థలమును చూపుడని జైనులనే అడుగవలెను. అప్పుడు దీనిని వ్రాసిన జైనులే తమ యింట నుంచుకొందురు కాబోలు.

కాని నాల్గువేల క్రోసుల పరిమాణపు శరీరము గల ఒక్కని కొరకే 32 (ముప్పది రెండు) వేల క్రోసుల వైశాల్యముగల గృహము నిర్మింపబడవలసి వచ్చును. జైనుల వద్దనున్న ధనమంతయు ఖర్చుపెట్టినను ఇట్టి దొక్క గృహమైన నిర్మింపబడకుండును. దానిపై ఎనిమిదివేల క్రోసుల వైశాల్యము గల కప్పును నిర్మించుటకు ఇంత పెద్ద దూలములను, కట్టెలను ఎక్కడినుండి తేగలుగుదురు? ఇట్లూహించ మొదలిడిన ఈ విషయము లెంతటి అసత్యములో బోధపడును. కావున ఇవన్నియును మిథ్యాలాపములే.

కాలపరిమాణము

తే థూలా పల్లే విహు సం ఖిజ్జాచే వహంతి సవ్వేవి ।
తే ఇక్కిక్క అసంఖే । సుహుమే ఖమ్మే పక ప్పేహ ॥

॥ ప్రకరణ భా. 4. లఘుక్షేత్ర సమాస ప్రకరణ సూత్రము. 4 ॥

అర్థం:- పూర్వము చెప్పబడినట్లు ఒక అంగుళపు పొడవు గల వెంట్రుక ముక్కలతో నింపిన నాల్గు చదరపు క్రోసుల చౌకమును అంతే లోతును గల ఒక బావి ఉండవలెను. ఒక అంగుళపు వెంట్రుకలో మొత్తము ఇరువది లక్షల ఏబది యేడు వేల నూటయేబది రెండు ముక్కలగును. ఎక్కువకు ఎక్కువ (330762104, 2465625, 4219960, 9753600,0000000) ముప్పది మూడు కోటానుకోట్లను ఏడులక్షల అరువది ఏడు వేల నూటనాల్గు కోటానుకోట్లను, ఇరువదినాల్గు లక్షల అరువదిఐదు వేల ఆరువందల ఇరవై ఐదు కోటానుకోట్లను, నలుబది రెండులక్షల పందొమ్మిది వేల తొమ్మిదివందల అరువది కోటానుకోట్లను, తొంబదిఏడు లక్షల ఏబది మూడువేల ఆరు వందల కోటానుకోట్లను కాగలవు. వెడల్పయిన ఘనయోజన పల్యోపములో సమస్త స్థూల లోమఖండములు గణింపబడును. ఇది కేవల సంఖ్యాత కాలము. పూర్వము చెప్పబడినట్లు ఒక రోమఖండమునందు అసంఖ్యాత ఖండములను మనస్సుతో కల్పించిన అసంఖ్యాత సూక్ష్మ రోమాణువు లగును.

సమీక్షకుడు:- ఇప్పుడు వీరి గణితరీతిని గమనింపుడు. ఒక అంగుళ ప్రమాణము గల వెంట్రుకను ఎన్ని తునకలు చేసిరో చూడుడు. ఇవి ఎన్నడయిన ఎవని లెక్కకైనా రాగలవా? పైగా మనస్సుతో అసంఖ్యాత ఖండములు కల్పించుచున్నారు. పైన చెప్పబడిన ఖండములను చేతితో చేసియుండరు కాబోలు! చేతితో చేయజాలనపుడు మనస్సుతో కనబరచి ఉందురని దీనివలన సిద్ధమగుచున్నది. ఔరా! ఒక అంగుళపు రోమము అసంఖ్య ఖండములగు ననుట ఎన్నడయిన సంభవమగునా?

జంబూద్వీపపమాణం గుల జోయణ లరక వట్ట విరకంభీ ।
లవణాఈ యాసేసా బలయాభా దుగుణ దుగుణాయ ॥

॥ ప్రకరణ.భా. 4 లఘుక్షేత్ర సమా. సూ.12 ॥

అర్థం:- జంబూద్వీప వైశాల్యము ఒక లక్ష యోజనములు. తక్కిన లవణాది సప్త సముద్రములును సప్త ద్వీపములును, జంబూద్వీపమున కంటె రెండు రెండింతలనియు, మొదట చెప్పినట్లే ఈ పృథివి యందే జంబూ ద్వీపాది సప్త ద్వీపములు, సప్త సముద్రములు కలవని తెలుసుకొనవలెను.

సమీక్షకుడు:- ఇప్పుడు జంబూద్వీపమునకు రెండింతలు రెండవ ద్వీపమన్న అది రెండులక్షల యోజనము లనియు, దానికి రెండింతలు మూడవ దన్న నది నాల్గులక్షల యోజనములు కలదనియు, నాల్గవది ఎనిమిది లక్షల యోజనములును, అయిదవది పదియారు లక్షల యోజనములు. ఆరవది ముప్పదిరెండు లక్షల యోజనములును, ఏడవది అరువదినాల్గు లక్షల యోజనములును గలవని తెలియబడుచున్నది. అటుపైన ఇంతటి వైశాల్యము గల ద్వీపములును, అంతకంటె ఎంతయో మించిన వైశాల్యముగల సముద్రములు ఈ పదిహేనువేల విస్తారపు పరిధిగల భూగోళమునందెట్లుండ గలవు? ఉండజాలవు. కావున ఇదంతయు మిథ్యాకల్పనయే.

కురు నఇ చులసీ సహసా । ఛచ్చేవంతరనఈఉప ఇ విజయం ।
దోదో మహా నఈఉ । చఉదస సహసాఉ పత్తేయం ॥

॥ ప్రక. భా. 4. లఘు.క్షేత్ర. సమా. సూ.63 ॥

అర్థం:- కురుక్షేత్రమునందు 84 (ఎనభై నాలుగు) వేల నదులు కలవు.

సమీక్షకుడు:- కురుక్షేత్ర మనున దొక చిన్నదేశము. దానిని చూడకయే ఇట్టి అబద్ధపు వ్రాతలు వ్రాయుటకు వీరికి సిగ్గైనా కలుగలేదా?

జాముత్తరాఉ తాఉ । ఇగేగ సింహాసణాఉ అఇపువ్వం ।
చఉసువి తాసు నియాసణ దిసి భవజిణ మజ్జణం హోఈ ॥

॥ ప్రకర. భా. 4. లఘు క్షేత్ర సమా. సూ. 119 ॥

అర్థం:- ఆ శిలలకు విశేషముగ దక్షిణోత్తర దిశలందు ఒక్కొక్క సింహాసనము కలదని ఎరుగవలెను. దక్షిణమున నున్నది అతిపాండుకంబలా శిల. ఉత్తరమున ఉన్నది అతిరిక్త కంబలాశిల. ఈ శిలలను సింహాసనములమీద తీర్థంకరులు కూర్చుందురు.

సమీక్షకుడు:- గమనించితిరా! వీరు తీర్థంకరుల జన్మోత్సవాదుల జరుపుకొనునపుడు అటనుండు శిలలు కూడ ముక్తిదాయక సిద్ధశిలయే కావచ్చును. వీరియందిట్టి గందరగోళము లెన్నియో కలవు. ఎంతవరకని వ్రాయవలెను? ఐనను "నీరు వడియగట్టుకొని త్రాగుట, అల్పజీవులపై నామమాత్రపు దయనుచూపుట, రాత్రియందు భోజనము చేయకపోవుట" అను ఈ మూడు మాటలు కొంత మంచివే కాని, తక్కిన వీరి గాథలన్నియు అసంభవములని తెలుసుకొనవలయును.

ఈ వ్రాసినదానిని బట్టియే బుద్ధిమంతులు అధికముగా ఊహించి తెలుసుకొనవలెను. ఇక్కడ ఉదాహరణముగ కొంచెమే వ్రాయబడినది. వీరి అసంభవములగు కథలనన్నిటిని వ్రాసినచో ఒక పురుషుడు తన జీవితకాలమందైనను చదువజాలనన్ని పుస్తకములు కావచ్చును.

కావున ఒక పాత్రలోని బియ్యముడుకునప్పుడు అందలి ఒకమెతుకును పరీక్షించిన తక్కిన బియ్యము ఉడికినది లేనిది తెలియునట్లే ఈ కించిల్లేఖనము నుండి సజ్జనులు అనేక విషయములను ఊహించి గ్రహింపదగును.

బుద్ధిమంతులకు అధికముగా వ్రాయవలసిన అవసరము లేదు. ఏలయన దిగ్దర్శన మాత్రమున సంపూర్ణాశయమును బుద్ధిమంతులు గ్రహించగలుగుదురు. దీని తరువాత క్రైస్తవుల మతమును గూర్చి వ్రాయుదుము.

శ్రీమద్దయానంద సరస్వతీస్వామి నిర్మిత,
సుభాషావిభూషితమైన సత్యార్థప్రకాశమున నాస్తిక మతమతాంతర్గత
చార్వాక, బౌద్ధ, జైన మతఖండన మండన విషయాలు గల
ద్వాదశ సముల్లాసం సంపూర్ణం.

త్రయోదశ సముల్లాసము

అనుభూమిక (3)

క్రైస్తవ మతవిషయ సమీక్ష

ఇది బైబిలు మతము. క్రైస్తవులు, యూదులు ఈ మతానికి అనుయాయులు. ఈ 13వ సముల్లాసంలో బైబిలును అనుసరించు క్రైస్తవమత విషయాల గురించి వ్రాయబడింది. అనగా ఇప్పుడు బైబిలు మతంలో క్రైస్తవులు ప్రధానులు - ముఖ్యులు. యూదులు మొదలగువారు అప్రధానులు - గౌణులు. వీరి ఈ విషయాలన్నియు బైబిలు నుండియే తీసుకొని ఇక్కడ వ్రాయబడింది. ఈ బైబిలు గ్రంథమును క్రైస్తవులు, యూదాదులందరును అంగీకరించుచు దీనినే తమ ధర్మానికి మూలకారణమని భావిస్తున్నారు.

వీరి మతగురువులైన గొప్ప గొప్ప ఫాదరీలు ఈ గ్రంథాన్ని ప్రపంచంలోని అనేక భాషలలోనికి అనువదింపజేసారు. నేను సంస్కృతంలోనికి అనువదింపబడిన బైబిలును చదివాను. అందులో నాకు అనేక సందేహాలు కలిగినవి. వానిలోనుండి కొన్నింటిని ఈ 13వ సముల్లాసంలో అందరూ పరిశీలించుటకు గాను వ్రాసాను. కేవలం సత్యము పెంపొందుటకు అసత్యము నశించుటకు మాత్రమే దీనిని వ్రాసితినే కాని ఒకరికి దుఃఖము కలుగజేయాలని గాని, హాని కలిగించాలని గాని, ఒకరిపై అసత్యదోషాన్ని మోపవలెనని గాని వ్రాయలేదు. ఇకముందు ఇందులో వ్రాయబోవు విషయాలను జూచి "ఈ గ్రంథమెట్టిది? వీరి మతమేమి?" అను అంశాలను అందరూ తెలుసుకోవచ్చును.

మానవులందరూ సులభంగా వ్రాయబడిన ఈ విషయాలను చదివి-చదివించి, విని-వినిపించి, పక్ష ప్రతిపక్షాలను పూని క్రైస్తవమతాన్ని బాగుగా పరిశీలించి వారు చేస్తున్న మతమార్పిడులను, మతోద్యమాన్ని అడ్డగించుటయే ఈ లేఖ ప్రయోజనం. మనుష్యులకు ధర్మసంబంధమైన జ్ఞానం వర్ధిల్లి వారు సత్యాసత్యమతాన్ని, కర్తవ్యాకర్తవ్య కర్మసంబంధాలగు విషయాలను (ఆచార వ్యవహారాలను) యథాయోగ్యంగా తెలిసికొనగలిగి, సత్యాన్ని, కర్తవ్యాలైన కర్మలను స్వీకరిస్తూ అసత్యాన్ని, అకర్తవ్యాలను సులభంగా విడిచిపెట్టినపుడే ఈ వ్రాతలకు ప్రయోజనం.

మానవులందరు సమస్త మత గ్రంథాలను పరిశీలనగా చదివి, తెలిసికొని, అనుకూల ప్రతికూలాభిప్రాయాలను వాఙ్మూలంగానో, వ్రాతమూలంగానో ప్రకటించుట మంచిది. ఏలయనగా చదువుటవలన పండితుడైనట్లుగా వినుట వలన బహుశ్రుతుడవుతాడు. ఒకవేళ విన్నవాడు మరొకనికి చెప్పజాలక పోయినా తాను మాత్రం తప్పక తెలుసుకోగలుగుతాడు. ఎవరు పక్షపాతమను వాహనంపై కూర్చుని చూస్తారో, వారికి తమ గుణదోషాలు కాని, పరుల గుణదోషాలు కాని తెలియవు. మనుష్యుని ఆత్మ సత్యాసత్యాలను యథాయోగ్యంగా నిశ్చయింపగలుగుతుంది. దాని కా సామర్థ్యం కలదు. చదివినంతవరకో, వినినంతవరకో అది నిశ్చయింపగలదు. ఒకానొక మతాన్ని గూర్చి ఒకనికి తెలిసి మరియొకనికి తెలియకున్న తగురీతిగా చర్చ జరుగదు. కాని అజ్ఞానులు భ్రమజాలంలో చిక్కుకుంటారు. అట్లు గాకుండుటకే ఈ గ్రంథంలో వాడుకలోనున్న సమస్త మతవిషయాలను కొంచెం కొంచెంగా వ్రాసాను. దీనితో మిగిలిన విషయాలు సత్యాలా? అసత్యాలా? అని ఊహింపవచ్చును. సర్వమాన్యాలైన సత్య విషయాలన్నీ అంతటా ఒకేవిధంగా ఉన్నవి. కాని వివాదం అసత్యవిషయాలందే కలుగుచున్నది. ఒకడు సత్యవాది, మరొకడు అసత్యవాది అయ్యేనేని కొంత వివాదం జరుగవచ్చు. వాదిప్రతివాదులు సత్యాసత్య నిర్ణయం కొరకు వాద ప్రతివాదాలు కావించిన తప్పక సత్యనిర్ణయం కాగలదు. ఇక నే నీ పదమూడవ సముల్లాసంలో నందు క్రైస్తవమత విషయాలను కొన్నింటిని వ్రాసి, పరిశీలనార్థం అందరి ఎదుట ఉంచుతున్నాను. ఎట్లున్నదో ఆలోచించుడు.

అలమతిలేఖనేన విచక్షణవరేషు

విచక్షణాపరులకు ఎక్కువగా వివరింపనవసరము లేదు.

త్రయోదశ సముల్లాసము

క్రైస్తవ మతవిషయ సమీక్ష

ఇక క్రైస్తవ మతాన్ని గూర్చి "వీరి మతం నిర్దోషమా? కాదా? వీరి బైబిలు పుస్తకం ఈశ్వరకృతమా, కాదా?" అని తెలిసికొనుటకు వ్రాస్తున్నాను. మొదట బైబిలులోని 'తౌరేతు' న గల విషయాలు వ్రాయబడును.

1. **ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను. భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను. చీకటి అగాధ జలముపైన కమ్మియుండెను. దేవుని ఆత్మ జలములపైన అల్లాడుచుండెను.** (ఆ. 1.1-2)

సమీక్షకుడు:- దేనిని ఆది అని చెప్పుచున్నారు?

క్రైస్తవుడు:- సృష్టి ప్రథమోత్పత్తిని.

సమీక్షకుడు:- ఇదియే ప్రథమ సృష్టియా? దీనికి మునుపెన్నడునూ సృష్టి కాలేదా?

క్రైస్తవుడు:- అయినదో కాలేదో మాకు తెలియదు. దేవునకెరుక.

సమీక్షకుడు:- తెలియకున్న ఈ పుస్తకంపై విశ్వాసమెందులకు? దేనిచేత సందేహనివృత్తి కాజాలదో, అటువంటిదానిని ఆధారంగా తీసుకొని బోధిస్తూ జనులందరిని ఈ సందేహంతో కూడిన మతంలో ఎందుకు పడవేస్తున్నారు? ఇక ఏ విధమైన సందేహం లేని, సర్వ సందేహాలను నివారించునట్టి వేదమతాన్ని ఎందుకు స్వీకరింపరు? ఈశ్వరసృష్టి సమాచారమే మీకు తెలియనపుడు ఈశ్వరున్ని ఎట్లు తెలిసికోగలుగుతారు? సరే, ఆకాశమని దేనిని నమ్ముచున్నారు?

క్రైస్తవుడు:- మన పైన ఉన్నదాన్ని, ఖాళీ ప్రదేశాన్ని.

సమీక్షకుడు:- ఈ బట్టబయలగు విభు పదార్థం అతి సూక్ష్మమైంది. క్రింద మీద ఒకే విధంగా ఉంటుంది. ఈ ఖాళీప్రదేశం యొక్క ఉత్పత్తి ఎట్లు జరిగింది? ఆకాశం సృజింపబడనపుడు బయలుగాని,

ఆకాశంగాని ఉండెనా? లేదా? లేకుండెనేని ఈశ్వరుడు, జగత్కారణము, జీవులు ఎక్కడుండిరి? ఆకాశం లేకుండా ఏ ఒక్క పదార్థమూ ఉండజాలదు. కాబట్టి మీ బైబిలులో చెప్పిన ఈ విషయం సరియైనది కాదు. సరే, ఈశ్వరుడు, అతని జ్ఞానకర్మలు సమానాలా? లేక అన్నియు అసమానాలా?

క్రైస్తవుడు:- సమానాలు.

సమీక్షకుడు:- అటులైన ఇచ్చట ఈశ్వరునిచే చేయబడిన భూమి అసమానమై ఉండెనని ఎందుకు వ్రాయబడింది?

క్రైస్తవుడు:- 'అసమానము' అనగా మిట్టపల్లాలు కలదని, సమానంగా లేకుండెనని అర్థం.

సమీక్షకుడు:- మరల సమానంగా చేసిందెవరు? అయితే ఇప్పుడు మిట్టపల్లాలు కలిగి లేదా? కావున ఈశ్వరుని పని అసమానమయినది కాజాలదు. అతడు సర్వజ్ఞుడు. అతని పనిలో మరపు కానీ, తప్పు కానీ ఎన్నటికీ జరుగదు. బైబిలులో ఈశ్వరుని సృష్టి అసమానమైనదని వ్రాయబడింది. కావున ఈ బైబిలుపుస్తకం ఈశ్వరకృతం కాదు. అయితే మొదట చెప్పండి "ఈశ్వరుని ఆత్మ ఎటువంటి పదార్థము?"

క్రైస్తవుడు:- చేతనము.

సమీక్షకుడు:- అది సాకారమా? నిరాకారమా? ఏకదేశీయమా? వ్యాపకమా?

క్రైస్తవుడు:- నిరాకారం, చేతనం, వ్యాపకమైంది. కాని ఒకానొక సీనాయి పర్వతమందును, నాల్గవ ఆకాశాది స్థానములందును విశేషంగా ఉండును.

సమీక్షకుడు:- నిరాకారమైనచో దానిని చూచిందెవరు? వ్యాపకమైనచో జలముపై అల్లాడుచుండెననుట ఏ మాత్రం సరియైనది కాదు. మంచిది! ఈశ్వరుని ఆత్మ నీటిపై అల్లాడుచున్నప్పుడు ఈశ్వరు డెక్కడున్నాడు? ఈశ్వరుని శరీరం ఒక చోట తన ఆత్మ మరొక చోట నీటిపై అల్లాడింపజేసియుండుననియే కద సిద్ధమగుచున్నది! అట్లైనచో విభుడు, సర్వజ్ఞుడు ఎప్పటికిని కాజాలడు. విభుడు కానిచో జగత్తును రచించుటకు, ధరించుటకు, పాలించుటకు, జీవుల కర్మవ్యవస్థచేయుటకు, ప్రళయము చేయుటకు ఎన్నటికిని సమర్థుడు కాజాలడు. ఏలయనగా ఏ పదార్థ స్వరూపమేకదేశీయమో, దాని గుణకర్మ స్వభావాలు కూడ ఏకదేశీయాలే అవుతాయి. అట్లైనచో అతడు ఈశ్వరుడే కాజాలడు. ఎందుకనగా ఈశ్వరుడు సర్వవ్యాపకుడు. అనంత గుణకర్మ స్వభావయుక్తుడు. సచ్చిదానందస్వరూపుడు, నిత్యుడు, శుద్ధుడు, బుద్ధుడు, ముక్తస్వభావుడు, అనాద్యనంతాది లక్షణ యుక్తుడని వేదమందు చెప్పబడింది. అతనినే నమ్ముకొనుడు. అప్పుడే మీకు శుభం కలుగుతుంది. లేనిచో శుభంకాని సద్గతి కాని కలుగదు. ॥ 1 ॥

2 దేవుడు వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను. వెలుగు మంచిదైనట్టు దేవుడు చూచెను.

ఆ. 1. 3,4 వాక్యములు.

సమీక్షకుడు:- ఏమిటి? ఈశ్వరుని మాట జడరూపమైన వెలుతురు వినినదా? వినినచో ఈ కాలమునందును సూర్య దీపాగ్నుల వెలుతురు మన మాటల నేల వినడం లేదు? వెలుతురు జడము. అదెప్పుడునూ ఒకరి మాట వినజాలదు.

అయ్యో! దేవుడు వెలుగును చూచినప్పుడే అది మంచిదని తెలిసికొనెనా? అంతవరకు వెలుగు మంచిదని తెలియదా? తెలిసినచో దానిని చూచి అది మంచిదని ఎందుకనును? తెలియకుండెనేని అతడు దేవుడే కాడు. కావున మీ బైబిలు ఈశ్వరోక్తం కాదు. అందులో చెప్పబడిన ఈశ్వరుడును సర్వజ్ఞుడు కాడు. ॥ 2 ॥

3. **మరియు దేవుడు జలముల మధ్య నొక విశాలము కలిగి ఆ జలములను ఈ జలములను వేరుపరచునుగాకని పలికెను. దేవుడు ఆ విశాలము చేసి విశాలము క్రింది జలములను, విశాలము మీది జలములను వేరుపరచగా ఆ ప్రకారమాయెను. దేవుడు ఆ విశాలమునకు ఆకాశమని పేరు పెట్టెను. అస్తమయమును, ఉదయమును కలుగగా రెండవ దినమాయెను.**

ఆ. 1. 6 – 8 వాక్యములు.

సమీక్షకుడు:- ఏమిటేమిటి? ఆకాశం, జలం ఈశ్వరుని మాటలు వినెనా? జలముల మధ్య ఆకాశం లేకున్న ఆ జలమెక్కడుండగలదు? మొదటి ఆయతులో ఆకాశమును సృజించెనని చెప్పబడింది. అలా చెప్పి మరల ఆకాశమును రచించెననుట వ్యర్థం. ఆకాశమునే స్వర్గమని చెప్పినప్పుడు అది సర్వవ్యాపకమైనందున విశ్వమంతయు స్వర్గమగును. ఇక స్వర్గం పైన ఉన్నదనుట నిరర్థకం. అప్పటికి సూర్యుడే సృష్టింపబడలేదు. మరి పగలు రాత్రి ఎట్లు కలిగెను? ఇట్టి అసంభవమైన మాటలు ఇకముందు చెప్పబోవు ఆయతులందు ఎక్కువగానే ఉన్నాయి. ॥ 3 ॥

4. **అటు పిమ్మట దేవుడు మన స్వరూపమందు, మన పోలికె చొప్పున ఆదామును చేయుదునని పలికెను. దేవుడు తన స్వరూపమందు ఆదామును సృజించెను. దేవుని స్వరూపమందు వానిని సృజించెను. స్త్రీని గాను పురుషుని గాను వారిని సృజించెను. దేవుడు వారిని ఆశీర్వదించెను.**

ఆ.1, 26, 27, 28 వాక్యములు.

సమీక్షకుడు:- ఒకవేళ ఈశ్వరుడు ఆదామును తన స్వరూపమున చేసినచో ఈశ్వరుడు పవిత్రుడు, జ్ఞాన స్వరూపుడు, ఆనందమయాది లక్షణయుక్తుడు గద; మరి అతనితో సమానుడుగా ఆదా మేల కాలేదు? కాలేదు కనుక అతడాతని స్వరూపమున చేయబడలేదు. ఆదామును పుట్టించెనన్న ఈశ్వరుడు తన స్వరూపమునే ఉత్పత్తి గలదిగా చేసెను. ఇక అది అనిత్యమెందులకు గాకుండును? మరి ఆదామును ఎక్కడ నుండి పుట్టించాడు.

క్రైస్తవుడు:- మట్టి నుండి.

సమీక్షకుడు:- మట్టి నెక్కడ నుండి పుట్టించాడు?

క్రైస్తవుడు:- తన సామర్థ్యము నుండి.

సమీక్షకుడు:- ఈశ్వరుని సామర్థ్య మనాదియా? నవీనమా?

క్రైస్తవుడు:- అనాది.

సమీక్షకుడు:- అనాది యైనచో జగత్కారణం సనాతనమగును. మరి అభావం నుండి భావం పుడుతుందని ఏల నమ్ముచున్నారు?

క్రైస్తవుడు:- సృష్టికి పూర్వం ఈశ్వరుడు తప్ప ఏ వస్తువును లేదు.

సమీక్షకుడు:- ఏ వస్తువు లేకున్నచో ఈ జగత్తు ఎట్లు చేయబడింది? ఈశ్వరుని సామర్థ్యం ద్రవ్యమా లేక గుణమా? ద్రవ్యమందురేని ఈశ్వరుని కంటె వేరుగా రెండవ పదార్థముండును. గుణమందురేని గుణము నుండి ద్రవ్యము ఎన్నటికిని కాజాలదు. ఎట్లనగా రూపమునుండి అగ్నియు, రసము నుండి జలమును కాజాలవు. ఈశ్వరుని నుండియే జగత్తు చేయబడియున్న అది ఈశ్వరుని వంటి గుణకర్మ స్వభావాలు కలిగియుండాలి. అతని గుణకర్మ స్వభావాలతో తుల్యమైనది కానందున ఈశ్వరుని నుండి చేయబడలేదనియే నిశ్చయమగుచున్నది. కాని జగత్కారణము పరమాణువులనబడు జడపదార్థం నుండి చేయబడింది. కాబట్టి ఈశ్వరుడు జగత్తును రచించుచున్నాడని వేదాది శాస్త్రాలందు వ్రాయబడినటులే ఒప్పుకొనుడు. ఆదాము లోపలి స్వరూపం జీవముగను, వెలుపలి స్వరూపం మనుష్యుని వలె నుండెనన్న ఈశ్వరుని స్వరూపమటులెందులకు లేదు? ఏలయన ఆదాము ఈశ్వరునితో సమానంగా చేయబడినప్పుడు ఈశ్వరుడు అవశ్యముగ ఆదామును పోలియుండాలి గద. ॥ 4 ॥

5. **దేవుడైన యెహోవా నేలమట్టితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను. దేవుడైన యెహోవా తూర్పున ఏదెనులో ఒక తోట వేసి తాను నిర్మించిన నరుని దానిలో ఉంచెను. ఆ తోట మధ్యను జీవవృక్షమును, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమును నేల నుండి మొలిపించెను.** ఆ. 7, 8, 9 వాక్యములు.

సమీక్ష:- ఈశ్వరుడు ఏదెనులో తోట వేసి దానిలో ఆదాము నుంచి అప్పుడతనిని మరల అక్కడినుండి తీసివేయవలసి వచ్చునని ఈశ్వరునకు తెలియకుండెనా? ఈశ్వరుడు ఆదామును మట్టితో చేసినప్పుడు అతడీశ్వర స్వరూపుడు కాలేదు. అయినాడన్నచో ఈశ్వరుడు సైతము మంటితో నయి యుండవలసివచ్చును. ఈశ్వరుడు అతని ముక్కుపుటములలో ఊపిరిని ఊదినప్పుడు ఆ ఊపిరి ఈశ్వర స్వరూపమా? లేక భిన్నమా? భిన్నమై యుండెనేని ఈశ్వరుడు ఆదాము స్వరూపమున లేడు. ఏకమనిన ఆదామును ఈశ్వరుడును ఒక్కటైరి. ఒక్కటిగ ఉన్నచో జన్మము, మరణము, వృద్ధి, క్షయము, ఆకలి, దప్పిక మొదలగు దోషాలు ఆదామునకు వలెనే ఈశ్వరునియందును కలుగును. ఇక అతడెట్లు ఈశ్వరుడు కాగలడు? అందువలన ఈ తౌరేతునందలి మాటలు సరియైనవని తోచదు. మరియు ఈ పుస్తకము సైతము ఈశ్వరకృతము కాదు. ॥5॥

6. **అప్పుడు దేవుడైన యెహోవా ఆదామునకు గాఢనిద్ర కలుగజేసి అతడు నిద్రించినపుడు అతని ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి ఆ చోటును మాంసముతో పూడ్చివేసెను. తరువాత**

దేవుడైన యెహోవా తాను ఆదామునుండి తీసిన ప్రక్కటెముకను స్త్రీనిగా నిర్మించి ఆమెను ఆదాము నొద్దకు తీసుకొని వచ్చెను. ఆ. 2 21, 22 వాక్యములు.

సమీక్ష:- ఈశ్వరుడు ఆదామును మట్టితో చేసినచో అతని స్త్రీని మట్టితో ఎందుకు చేయలేదు? స్త్రీని ఎముకతో చేసినచో ఆదామును ఎముకతో ఏల చేయలేదు? నరుని నుండి వెడలుట వలన నారీనామము కలిగినచో నారీనుండి నరనామము కూడ కలగవలసియుండును. మరి వారియందు పరస్పరము ప్రేమయు ఉండదగును. స్త్రీని పురుషుడు ప్రేమించినట్లే పురుషుడిని స్త్రీ కూడా ప్రేమించవలెను. విద్వాంసులారా! ఈశ్వరుని పదార్థవిద్య (ఫిలాసఫీ) ఎట్లు చిలుకుచున్నదో చూడుడు! ఆదాము ప్రక్కటెముకలలో ఒకదానిని తీసి నారిని (స్త్రీని) చేసినచో పురుషులందరకు ప్రక్కటెముక ఒకటి తక్కువగా ఉండాలి కదా? ఎందుకుండదు? మరియు స్త్రీ శరీరమందు ప్రక్కటెముక ఒకటే ఉండాలి. ఏలయనగా అది ఒకే ఒక్క ప్రక్కటెముక నుండి చేయబడింది. ఏమి! ఈ జగత్తంతయు ఏ సామగ్రితో చేయబడెనో ఆ సామగ్రితోనే స్త్రీ శరీరం చేయబడజాలకుండెనా? కావున ఈ బైబిలులో చెప్పబడిన సృష్టిక్రమం సృష్టివిద్యకు విరుద్ధము. ॥ 6 ॥

7. దేవుడైన యెహోవా చేసిన సమస్త భూజంతువులలో సర్పము యుక్తిగలదై యుండెను. అది ఆ స్త్రీతో - 'ఇది నిజమా? ఈ తోట చెట్లలో దేనిఫలములనైనను మీరు తినకూడదని దేవుడు చెప్పెనా? అని అడిగెను. అందుకు స్త్రీ ఈ తోటలోని చెట్ల ఫలములను మేము తినవచ్చును. అయితే తోట మధ్యనున్న చెట్టు ఫలములను గూర్చి దేవుడు "మీరు చావకుండునట్లు వాటిని తినకూడదనియు, వాటిని ముట్టకూడదనియు చెప్పె" నని సర్పముతో అనెను. అందుకు సర్పము "మీరు చావనే చావరు. ఏలయనగా మీరు వాటిని తిను దినమున మీ కన్నులు తెరవబడుననియు, మీరు మంచి చెడ్డలను ఎరిగినవారై దేవతలవలె ఉందురనియు దేవునికి తెలియునని స్త్రీతో చెప్పగా స్త్రీ ఆ వృక్షము ఆహారమునకు మంచిదనియు, కన్నులకు అందమైనదనియు వివేకమిచ్చు రమ్యమైనదియునై ఉండుట చూచినప్పుడు ఆమె దాని ఫలములలో కొన్ని తీసికొని తిని తనతో పాటు తన భర్తకును ఇచ్చెను. అతడు కూడ తినెను. అప్పుడు వారిద్దరి కన్నులు తెరవబడెను. వారు తాము దిగంబరులమని తెలిసికొని అంజూరపు ఆకులు కుట్టి తమకు కచ్చడములను చేసికొనిరి. అందుకు దేవుడైన యెహోవా సర్పముతో 'నీవు, దీని చేసినందున పశువులన్నిటిలోను, భూజంతువు లన్నిటిలోను నీవు శపింపబడినదానవై నీ కడుపుతో ప్రాకుచు నీవు బ్రతుకు దినములన్నియు మన్ను తిందువు. మరియు నీకును, స్త్రీకిని, నీ సంతానమునకును, ఆమె సంతానమునకును, వైరము కలుగజేసెదను. అది నిన్ను తలమీద కొట్టును. నీవు దాని మడిమె మీద కొట్టుదు'వని చెప్పెను. ఆయన స్త్రీతో 'నీ ప్రయాసమును నీ గర్భవేదనను నేను మిక్కిలి హెచ్చించెదను. వేదనతో పిల్లలను కందువు. నీ భర్త యెడల నీకు వాంఛ కలుగును. అతడు నిన్ను ఏలు'నని చెప్పెను. ఆయన ఆదాముతో 'నీవు నీ భార్య మాట విని నేను తినవద్దని నీ కాజ్ఞాపించిన వృక్షఫలములు తింటివి. గనుక నీ నిమిత్తము నేల

శపింపబడియున్నది. ప్రయాసముతోనే నీవు బ్రతుకు దినములన్నియు దాని పంట తిందువు. అది ముండ్లతుప్పలను, గచ్చపొదలను నీకు మొలిపించును. పొలములోని పంట తిందువు'.
అ. 14-18 వాక్యములు.

సమీక్ష:- క్రైస్తవుల దేవుడు సర్వజ్ఞుడైనచో ఈ ధూర్త సర్పమను సైతానును ఎందుకు సృజించును? సృష్టించెనేని ఆ దేవుడే అపరాధియనదగును. ఏలయన అతడు దానిని దుష్టస్వభావం కలదిగ సృజింపకున్నచో అది దుష్టత్వమెందులకు చేసియుండును? పూర్వజన్మమును అంగీకరింపనిచో అపరాధము లేకనే దానిని పాపస్వభావము కలదిగ ఎందుకు సృజించెను? నిజము విచారించి చూచిన అది సర్పము గాక మనుష్యుడై యుండెను? ఏలయన మనుష్యుడు కానిచో మానుషభాష నెట్లు చెప్పగలిగియుండును? తాను అసత్యవంతుడై ఇతరులను అబద్ధమార్గమున నడిపించువానినే 'సైతాన్' అనవలెను. ఇచట సైతాను సత్యవాది కనుక అతడా స్త్రీకి విపరీతములు బోధింపలేదు. సత్యమే చెప్పెను. ఈశ్వరుడు ఆదాము హవ్వలతో 'దీనిని తినుట వలన మీరు చనిపోదు'రని అబద్ధమాడెను. ఆ చెట్టు జ్ఞానమును, అమరత్వమును ఇచ్చునదిగ ఉండెనేని 'దాని ఫలములను తినగూడ'దని ఎందుకు నిషేధించెను? అట్లు నిషేధించిన ఆ ఈశ్వరుడే 'అసత్యవాది మోసగాడు' అయ్యెను. ఏలయనగా ఆ వృక్షఫలములు మనుష్యులకు జ్ఞానసుఖములను ఇచ్చునవై యుండెనే కాని అజ్ఞానమును, మృత్యువును కలుగజేయునవి కాకుండెను. ఈశ్వరుడు ఆ ఫలమును తినవలదని చెప్పెను గద! మరి ఆ వృక్షమును సృష్టించినదెందులకు? తన కొరకే సృష్టించెననుకొన్న తాను అజ్ఞానియు, మృత్యుధర్మము కలవాడునై యుండెనా? ఇతరుల కొరకు సృష్టించెనన్న, ఫలములను తినుటయం దపరాధమేమియు లేదు. వర్తమాన సమయమందు జ్ఞానకారకమును, మృత్యునివారకమునగు వృక్ష మొక్కటియు కనబడుటలేదు. ఈశ్వరుడు దాని విత్తనమును కూడ నశింపజేసెనా ఏమి? ఇట్టి పనులు చేసిన మనుష్యుడు మోసకాడును, కపటియు అగునేని ఈశ్వరుడు అటువంటివాడేల కాకుండును? ఏమనగా పరులను టక్కులబన్ని మోసపుచ్చువాడు మోసగాడును, టక్కరియును ఏల కాకుండును? అపరాధములేనిదే ఈ ముగ్గురకు శాపము పెట్టెను కావున ఆ ఈశ్వరు డన్యాయకారి అయ్యెను. ఈ శాపమీశ్వరునకు చెందవలసినదే. ఎందుకనగా అతడే అబద్ధము చెప్పి వారిని మోసపుచ్చియుండెను. ఈ తత్వవిజ్ఞానమును (ఫిలాసఫీని) కనుగొనుడు! బాధ కలుగకుండ గర్భధారణ కాని, శిశువు పుట్టుట గాని సంభవమైయుండునా? శ్రమపడక ఎవ్వరయినను జీవనమును గడుపగలుగుదురా? మొదట ముండ్లచెట్టు లేకుండెనా? కూరగాయలు తినుట మనుష్యుల కందరకును ఈశ్వరుని ఆజ్ఞ వలన ఉచితమేని తిరిగి బైబిలు నందు మాంసము తినవలె నని వ్రాసినది అబద్ధము కాదా? అది నిజమేని ఇది అబద్ధము. ఆదామునందేమియు అపరాధము సిద్ధింపదేని క్రైస్తవులు జనులందరును "ఆదాము చేసిన అపరాధమును బట్టి అతని సంతానమైనందున వారిని పాపు"లని ఎందులకు చెప్పుచున్నారు? సరే! ఈలాంటి పుస్తకము కాని ఇట్టి ఈశ్వరుడు కాని బుద్ధిమంతులకు ఒప్పిదములా? ॥7॥

8. అప్పుడు దేవుడయిన యెహోవా- 'ఇదిగో మంచిచెడ్డలను ఎరుగునట్లు, ఆదాము మనలో ఒకని వంటివాడాయెను. కాబట్టి అతడు ఒకవేళ తన చెయ్యి చాచి జీవవృక్షఫలమును

కూడ తీసికొని తిని నిరంతరము జీవించునేమో అని అప్పుడాయన ఆదమును వెళ్ళగొట్టి ఏదెను తోటకు తూర్పు దిక్కున 'కెరూబు'లను జీవవృక్షమునకు పోవు మార్గమును కాచుటకు ఇటు అటు తిరుగుచున్న ఖడ్గజ్వాలను నిలువబెట్టెను. ఆ. 3, 22, 23, 24 వాక్యములు.

సమీక్ష:- మంచిది. ఆదాము జ్ఞానమందు నాతో సమానుడయ్యెనని ఈశ్వరునకిట్టి ఈర్ష్యాభ్రమ లెందులకు కలిగెను? ఇదేమి చెడ్డదా? ఇట్టి సంశయమెందుకు కలిగినది? ఈశ్వరునికి సమానుడు మరొక డెన్నటికిని కాజాలడు. ఈ వ్రాతల వలననే అతడు ఈశ్వరుడు కాక కేవలం మనిషైయుండెనని తేటపడుచున్నది. బైబిలునందు వర్ణింపబడిన ఈశ్వరుడు మనుష్యునివంటి వాడే అని తెలియబడుచున్నది. ఇంకనూ గమనింపుడు. ఈశ్వరుడు ఆదాము యొక్క జ్ఞానోన్నతిని చూచి దుఃఖితుడగుటయే గాక అమరవృక్షఫలాలను తినెను గదా యని ఎంతయో ఈర్ష్యకలవాడయ్యెను. మొదట తోటలో నుంచినప్పుడు తిరిగి ఇతనిని వెళ్ళగొట్టవలసి వచ్చు నను భవిష్యత్ జ్ఞానమతనికి లేకుండెను. కావున క్రైస్తవుల ఈశ్వరుడు సర్వజ్ఞుడు కాడు. ఇక మెఱయుచుండు ఖడ్గమును ధరింపజేసి కొందరిని కావలి యుంచెను అనునది కూడా మనుష్యుని పనియే కాని ఈశ్వరునిది కాదు. ॥ 8 ॥

9. **కొంతకాలమైన తరువాత కయీను పొలము పంటలో కొంత యెహోవాకు అర్పణగా తెచ్చెను. హేబెలు కూడా తన మందలో తొలుచూలున పుట్టిన వాటిలో క్రొవ్వినవాటిని కొన్ని తెచ్చెను. యెహోవా హేబెలును అతని అర్పణను లక్ష్యపెట్టెను. కయీనును అతని అర్పణను ఆయన లక్ష్యపెట్టలేదు. కాబట్టి కయీనుకు మిక్కిలి కోపము వచ్చి అతడు తన ముఖము చిన్నబుచ్చుకొనగా యెహోవా కయీనుతో- 'నీకు కోపమేల? ముఖము చిన్నబుచ్చుకొని యున్నావేమి?** ఆ. 4: 3, 4, 5, 6 వాక్యములు.

సమీక్ష:- దేవుడు మాంసాహారి కాకపోయినచో గొఱ్ఱెల అర్పణతో హేబెలు నాదరించి, ధాన్యము అర్పణతో కయీనును ఎందుకు తిరస్కరించి యుండును? మఱియు ఈ జగడమునకును, హేబెలు మరణమునకును దేవుడే కారకుడయ్యెను. మనష్యులొకరితో నొకరు మాటలాడునట్లే క్రైస్తవుల దేవుడును మాటలాడును. తోటలోనికి వచ్చుచు పోవుచుండుటవలన ధాన్యము వేయుట సయితము, మనుష్యుల పనియే గనుక నీ బైబిలు మనుష్యులచే కల్పింపబడినదే కాని ఈశ్వరోక్తము కాదు. ॥ 9 ॥

10. **యెహోవా 'నీ తమ్ముడైన హేబెలు ఎక్కడున్నా' డని కయీను నడుగగా అతడు 'నేనెరుగను; నా తమ్మునికి నేను కావలివాడనా' అనెను; అప్పుడాయన, నీవు చేసిన పని ఏమిటి? నీ తమ్ముని రక్తము యొక్క స్వరము నేలలో నుండి నాకు మొరపెట్టుచున్నది. కావున నీ తమ్ముని రక్తమును నీ చేతిలో నుండి పుచ్చుకొనుటకు నోరు తెరచిన ఈ నేలమీద ఉండకుండ, నీవు శపింపబడినవాడవు'** ఆ. 4: 9, 10, 11 వాక్యములు.

సమీక్ష:- ఏమి? హేబెలు గతి ఏమైనదో ఈశ్వరుడెరుగక కయీనునడిగెనా? రక్తనాదము భూమిలోనుండి ఎప్పుడైనా ఎవరినైనా పిలువగలుగునా? ఇవన్నియు పామరుల మాటలే. కావున ఈ బైబిలు ఈశ్వరకృతము కాని, ఒక విద్వాంసునిచే కూడా వ్రాయబడినది కాదని తెలుస్తున్నది. ॥10॥

11. హనోకు, మెతూషెలను కనిన తరువాత మూడువందల ఏండ్లు దేవునితో నడుచుచు కుమారులను, కుమార్తెలను కనెను. ఆ: 5: 22 వాక్యము.

సమీక్ష:– భలే! క్రైస్తవుల దేవుడు మనుష్యుడు కాకున్నచో హనోకు అతని వెంబడి ఎట్లు నడచియుండును? కనుక వేదమందు చెప్పబడిన నిరాకారుడగు పరమేశ్వరుని నమ్ముటయే క్రైస్తవులకు శ్రేయస్కరము. ॥ 11 ॥

12. నరులు భూమి మీద విస్తరింపనారంభించిన తరువాత వారికి కుమార్తెలు పుట్టినప్పుడు దేవుని కుమారులు, నరుల కుమార్తెలు చక్కనివారని చూచి వారందరిలో తమకు మనస్సుకు నచ్చిన స్త్రీలను వివాహము చేసికొనిరి. ఆ దినములలో దానవులు భూమి మీద ఉండిరి. **తరువాతను ఉండిరి. దేవుని కుమారులు నరుల ఆదాము కుమార్తెలతో పోయినప్పుడు వారికి పిల్లలను కనిరి.** వారు పూర్వపువారి కంటె పేరుపొందిన శూరులు వీరే. నరుల **చెడుతనము భూమి మీద గొప్పదనియు, వారి హృదయమునందలి తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి తాను భూమి మీద నరులను చేసినందుకు 'యెహోవా' సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను. అప్పుడు 'యెహోవా' – 'నేను సృజించిన నరులను, నరులతో గూడ జంతువులను, పురుగులను, ఆకాశ పక్ష్యాదులను, భూమిమీద నుండకుండ తుడిచివేయుదును; ఏలయనగా నేను వారిని సృష్టించినందుకు సంతాపమును పొందియున్నాను** అనెను. ఆ: 6: 1,2,3,4,5,6,7 వాక్యములు.

సమీక్ష:– క్రైస్తవులను "దేవుని కుమారులు ఎవరని, దేవుని భార్య, అత్త, మామ, బావమరిది, సంబంధీకు లెవరనియు" అడగాలి. ఏలయన ఇప్పుడా నరుల కుమార్తెలతో వివాహమైనందున దేవుడు వారికి వియ్యంకుడయ్యెను. అట్లే వారికి పుట్టిన పుత్రులు పౌత్రులైరి. ఏమిటి? ఇవి దేవ వాక్కులు కాని, దేవ పుస్తకమందలి వాక్కులు కాని కాగలవా? కావున ఈ పుస్తకమును అనాగరికులు రచించిరనియే స్పష్ట మగుచున్నది. సర్వజ్ఞుడు కానివాడును; ముందురాగల మాటలను ఎరుగనివాడును ఈశ్వరుడేకాడు. అతడు జీవుడు సృష్టిని రచించినప్పుడు ముందు ముందు మనుష్యులు దుష్టులగుదురను మాట అతనికి తెలియకుండెనా? ఇట్లు పశ్చాత్తాపపడుట, అతిశోకాదులు భరించుట, పొరపడి పనిచేసి పిమ్మట పశ్చాత్తాపపడుట మొదలగునవి యీ క్రైస్తవుల దేవునియందే ఘట్టిల్లుచున్నవి. ఏమనగా వీరి దేవుడు పూర్ణవిద్వాంసుడు కాడు. ఒక యోగియును కాడు. ఒకవేళ శాంతియుక్తుడు విజ్ఞానయుక్తుడైనచో శోకాదుల నుండి దూరమై ఉండెడివాడు. సరే! పశుపక్ష్యాదులు సైతం దుష్టస్వభావములు కలవయ్యెనా? ఈశ్వరుడు సర్వజ్ఞుడైనచో ఇంతటి విషాదము నేల పొందియుండును? దీనివలన తెలిసికొన్న దేమనగా ఇతడు ఈశ్వరుడు కాడు. ఈ పుస్తకము ఈశ్వరకృతము కాజాలదు. వేదమందు చెప్పబడినట్లు సమస్త పాపక్లేశ దుఃఖ శోకాది రహితుడును, సచ్చిదానందస్వరూపుడును అగు పరమేశ్వరుడిని ఈ క్రైస్తవులు ఇప్పుడైనా నమ్ముదురేని తమ మనుష్య జన్మమును సఫలము చేసుకొనగలుగుదురు. ॥12॥

13. ఆ ఓడ మున్నూరు మూరల పొడుగును, ఏబది మూరల వెడల్పును, ముప్పది మూరల ఎత్తును గలదై యుండవలెను. నీవును నీతో కూడ నీ కుమారులును, నీ భార్యయు, నీ కోడండ్రును, ఆ ఓడలో ప్రవేశింపవలెను. మరియు నీతో కూడ వానిని బ్రతికించి యుంచుకొనుటకు, సమస్త జీవులలో అనగా, సమస్త శరీరుల యొక్క ప్రతి జాతిలోనివి రెండేసి చొప్పున నీవు ఓడలోనికి తేవలెను. వానిలో మగదియు ఆడదియు నుండవలెను. నీవు వానిని బ్రతికించి యుంచుకొనుటకై వాని వాని జాతుల ప్రకారము పక్షులలోను, వాని వాని జాతుల ప్రకారము జంతువులలోను, వాని వాని జాతుల ప్రకారము నేలప్రాకువాని యన్నిటిలోను, ప్రతి జాతిలో రెండేసి చొప్పున నీ వద్దకు అవి వచ్చును. మరియు నీవు తినుటకు నానావిధమైన ఆహార పదార్థములను కూర్చుకొని నీ దగ్గర ఉంచుకొనుము. అది నీకును వానికిని, ఆహారమగునని చెప్పెను. నోవహు అట్లు చేసెను. దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తు చేసెను.

ఆ. 6: 15, 18, 19, 20, 21, 22 వాక్యములు.

సమీక్ష:– ఔరా! ఇట్టి జ్ఞానవిరుద్ధములగు అసంభవమైన మాటలు చెప్పినవానిని దేవుడని ఏ విద్వాంసుడైనను అంగీకరించునా? ఇక ఇంత పొడవు, వెడల్పు, ఎత్తును గల నావయందు ఏనుగులు, ఒంటెలు మొదలుగాగల కోట్లకొలది జంతువుల జతలు, వాని కొరకును మరియు తన కుటుంబము కొరకును అన్నపానాది సామగ్రులన్నియు ఇముడగలుగునా? కావున ఈ పుస్తకము అజ్ఞాన మనుష్యునిచే వ్రాయబడినది. దీనిని వ్రాసినవాడు కనీసము విద్వాంసుడు కూడ కాడు. ॥ 13 ॥

14. అప్పుడు నోవహు యెహోవాకు బలిపీఠము కట్టి పవిత్ర పశువులన్నిటిలోను పవిత్ర పక్షులన్నిటిలోను కొన్ని తీసికొని ఆ పీఠము మీద దహనబలి అర్పించెను. అప్పుడు యెహోవా ఇంపైన సువాసన నాఘ్రాణించి, ఇకమీదట నరులను బట్టి భూమిని మరల శపించను; ఎందుకనగా నరుల హృదయాలోచన వారి బాల్యమునుండి చెడ్డది. "నేనిప్పుడు చేసిన ప్రకారముగా సమస్త జీవులను సంహరింపను" అని అనుకొనెను.

ఆ. 8: 20, 21 వాక్యములు.

సమీక్ష:– 'వేదిని కట్టుట, హోమమొనరించుట' అను ఈ మాటలు వేదముల నుండి తీసుకొని బైబిలునందు చేర్చబడినట్లు తోచుచున్నది; ఏమిటి?! సువాసన నాఘ్రాణించుటకు పరమేశ్వరునకు ముక్కు కలదా? ఈ క్రైస్తవుల దేవుడు మనుష్యుని వలె అల్పజ్ఞుడు కాడా? తానొకప్పుడు శపించుటయు, పిదప పశ్చాత్తాపపడుటయు, ఒకప్పుడు శపింపననియు అనుచున్నాడు. మొదట శపించినట్లే మరల కూడా శపింపగలడు. మొదట అందరను చంపివేసెను; ఇప్పుడో 'ఇక ఎప్పుడును చంప'ననుచున్నాడు! ఇవి అన్నియు పిల్లకాయల మాటల వంటివి. ఈశ్వరునివి అనుటెట్లు? ఒక విద్వాంసునివైనను కావు. ఏలయన విద్వాంసుని మాట కాని, ప్రతిజ్ఞ కాని స్థిరముగా ఉండగలదు. ॥14॥

15. మరియు దేవుడు నోవహును అతని కుమారులను ఆశీర్వదించి ... ప్రాణము గల సమస్త

చరములు మీకు ఆహారమగును; పచ్చని కూరమొక్కల నిచ్చినట్లు వానిని మీకిచ్చియున్నాను; అయినను మాంసమును దాని రక్తముతో మీరు తినకూడదు. రక్తమే దాని ప్రాణము" అనెను. ఆ. 9 : 1, 3, 4 వాక్యములు.

సమీక్ష:- ఒకరి ప్రాణము తీయించి ఇతరులను ఆనందింపజేసినందున ఈ క్రైస్తవుల దేవుడు దయలేనివాడు కాడా? తల్లిదండ్రులు ఒక పుత్రుడిని చంపించి మరొకనికి తినపెట్టుదురేని వారు మహాపాపులు కారా? ఇదియును అట్లే యున్నది. ఏలయన ప్రాణులన్నియు ఈశ్వరునకు పుత్రుల వంటివే. అట్లు భావింపనందుననే కద వీరల దేవుడు కటికవానివలె వర్తించుచున్నాడు. ఇక మనుష్యులందరను హింసకులుగా కూడ ఇతడే చేసియున్నాడు. కాబట్టి క్రైస్తవుల దేవుడు దయలేనివాడయినందున పాపాత్ము డెందుకు కాడు? ॥ 15 ॥

16. **భూమియందంతట ఒక్క భాషయు, ఒక్క పలుకును ఉండెను. మరియు వారు "మనము భూమియందంతట చెదిరిపోకుండ ఒక పట్టణమును ఆకాశమునంటు శిఖరము గల ఒక గోపురమును కట్టుకొని పేరు సంపాదించికొందము రండ"ని మాటలాడుకొనగా యెహోవా నరుల కుమారులు కట్టిన పట్టణమును, గోపురమును చూడ దిగివచ్చెను. అప్పుడు యెహోవా 'ఇదిగో జనము ఒక్కటే. వారికందరికి భాష ఒక్కటే. వారు ఈ పని ఆరంభించియున్నారు. ఇకమీదట వారు చేయదలచు ఏ పనియైనను చేయకుండ వారికి ఆటంకము ఏమియును ఉండదు. కనుక మనము దిగిపోయి వారిలో నొకని మాట ఒకనికి తెలియకుండ అక్కడ వారి భాషను తారుమారు చేయుదము రండ'ని అనుకొనెను. అలాగు యెహోవా అక్కడ నుండి భూమియందంతట వారిని చెదరగొట్టెను. కనుక వారు ఆ పట్టణమును కట్టుట మానిరి.** ఆ.11 :1, 4, 5, 6, 7, 8 వాక్యములు.

సమీక్ష:- పృథివియందంతటను ఒక్క భాష ఒక్కమాట ఉండినప్పుడు మనుష్యులందరకు పరస్పరం అత్యంతానందము కలిగియుండును. కాని చేయునదేమి? ఈ క్రైస్తవుల ఈర్ష్యగల దేవుడు వారి భాషను తారుమారు చేసి అందరిని పాడుచేసెను. అతడట్లు చేయుట గొప్ప తప్పు. అది సైతాను పని కంటెను చెడ్డపని కాదా? ఇక క్రైస్తవుల దేవుడు సీనాయిపర్వతము మొదలగువానిమీద నివసించుచుండె ననియు, జీవుల ఉన్నతినైన చూడజాలకుండెననియు కూడ దీనివలన తెలియుచున్నది. ఇదొక పామరుని మాట గాక ఈశ్వర వాక్యమని గాని ఇది ఈశ్వరోక్త పుస్తకమని కాని ఎట్లంగీకరింపదగును? ॥ 16 ॥

17. **అప్పుడతడు తన భార్యయైన శారయితో 'ఇదిగో నీవు చక్కనిదానివని ఎరుగుదును. ఐగుప్తీయులు నిన్ను చూచి 'యీమె అతని భార్య' అని నన్ను చంపి, నిన్ను బ్రతుకనిచ్చెదరు. నీవలన నాకు మేలు కలుగునట్లును, నిన్ను బట్టి నేను బ్రతుకునట్లును, నీవు నా సహోదరివని దయచేసి చెప్పు'మనెను.** ఆ. 12 : 11, 12, 13 వాక్యములు.

సమీక్ష:- ఇప్పుడు చూడుడు! అబ్రహామును క్రైస్తవులు, ముసల్మానులు కూడ గొప్ప పైగంబరుడు - దేవదూత అని భావించుచున్నారు. అతని మిథ్యాభాషణాది కార్యాలు అనుచితములే కద. పైగంబరు లిట్టివారైన వారి అనుచరులకు విద్య కాని మంచిమార్గము కాని ఎట్లు లభింపగలదు? ॥ 17 ॥

18. మరియు దేవుడు 'నీవును నీవు మాత్రమే గాక నీ తరువాత వారి తరములలో నీ సంతతియు నా నిబంధనను గైకొనవలెను. నాకును నీకును నీ తరువాత నీ సంతతికిని మధ్య మీరు గైకొనవలసిన నా నిబంధన యేదనగా మీలో ప్రతి మగవాడును సున్నతి పొందవలెను. మీరు మీ గోప్యాంగచర్మమున సున్నతి పొందవలెను. అది నాకు నీకు మధ్యనున్న నిబంధనకు సూచనగా ఉండుడు. ఎనిమిది దినముల వయస్సు గలవాడు అనగా నీ ఇంట పుట్టినవాడైనను నీ సంతానముకాని, అన్యుని వద్ద వెండితో కొనబడిన వాడైనను మీ తరములలో ప్రతి మగవాడు మీలో సున్నతి పొందవలెను. మీ యింట పుట్టినవాడును, నీ వెండిచేత కొనబడినవాడును తప్పక సున్నతి పొందవలెను. అప్పుడు నా నిబంధన మీ శరీరమందు నిత్య నిబంధనగా ఉండును. సున్నతి పొందని మగవాడు అనగా ఎవని గోప్యాంగచర్మమున సున్నతి చేయబడదో అట్టివాడు తన జనులలో నుండి కొట్టివేయబడును. వాడు నా నిబంధనను మీరియున్నాడ'ని అబ్రహాముతో చెప్పెను.

ఆ. 17 : 9, 10, 11, 12, 13, 14 వాక్యములు.

సమీక్ష:- ఇప్పుడు ఈ ఈశ్వరుని విపరీతమైన ఆజ్ఞను చూడుడు. ఈ సున్నతి యను గోప్యాంగ చర్మఖండనము కావించుట అతనికిష్టమైయున్నచో సృష్ట్యాదియందు ఆ చర్మమును కలిగింపకయే యుండెడివాడు. అది కంటికి రెప్ప వలె రక్షణార్థము కలిగింపబడియున్నది. ఏలయనగా ఆ గోప్యాంగ మతి కోమలమైనది. అట్లది చర్మముతో కూడియుండకున్న ఒక పురుగు కాటువలననో కొంచెము దెబ్బ తగులుట వలననో మిక్కిలి నొప్పి కలుగును. ఇక అది లఘుశంకానంతరము కొంత మూత్రాంశమును బట్టలకు తగులకుండజేయుట ఇత్యాది పనుల కుపయుక్తమై యున్నది కావున దానిని ఛేదించుట తప్పు. మరియును, ఇప్పుడు క్రైస్తవులు ఈ ఆజ్ఞను పాలించుట ఎదేందులకు? సర్వదా పాలింపబడవలెనను ఈ ఆజ్ఞ పాలింపబడుటలేదు. కావున వ్యవస్థాపుస్తకమను బైబిలునందొక బిందుమాత్ర మసత్యోక్తి లేదని ఏసు చెప్పిన సాక్ష్యము మిథ్యయయ్యెను. దీనిని క్రైస్తవులు ఎంతమాత్రము కనుగొనుట లేదుగదా! ॥ 18 ॥

19. దేవుడు అబ్రాహాముతో మాటలాడుట చాలించిన తరువాత అతని వద్ద నుండి పరమునకు వెళ్లెను.॥

ఆ. 17 : 22 వాక్యము.

సమీక్ష:- క్రిందినుండి మీదికిని, మీదినుండి క్రిందికిని బోవుచు వచ్చుచు నుండెనన్న ఈ దేవుడొక మనుష్యుడో లేక పక్షియో యై యుండెనని దీనివలన నిరూపితమగుచున్నది. కావున ఇతడొక ఇంద్రజాలకునివలె నుండె ననుటయే నిశ్చయము. ॥ 19 ॥

20. మరియు మమ్రే దగ్గరున్న సింధూరవనములో అబ్రాహాము ఎండవేళ గుడారపు ద్వారమందు కూర్చుని యున్నప్పుడు యెహోవా అతనికి కనబడెను. అతడు కన్నులెత్తి చూచినప్పుడు ముగ్గురు మనుష్యులు అతని ఎదుట నిలబడియుండిరి. అతడు వారిని చూచి గుదారపు వాకిటినుండి వారిని ఎదుర్కొనుటకు పరుగెత్తి నేలమట్టుకు వంగి 'ప్రభువా! నీ కటాక్షము నామీద యున్న ఎడల ఇప్పుడు నీ దాసుని దాటిపోవద్దు. నేను కొంచెము నీళ్ళు తెప్పించెదను. దయచేసి కాళ్ళు కడుగుకొని ఈ చెట్టు క్రింద అలసట తీర్చుకొనుడి. కొంచెము ఆహారమును తెచ్చెదను. మీ ప్రాణములను బలపరచుకొనుడి. తరువాత మీరు వెళ్ళవచ్చును. ఇందునిమిత్తము తా మీ దాసుని యొద్దకు వచ్చితి'రనెను. వారు నీవు చెప్పినట్లు చేయు'మనగా అబ్రాహాము గుదారములోనున్న శారా వద్దకు త్వరగా వెళ్ళి నీవు త్వరపడి మూడుమానికల మెత్తని పిండి తెచ్చి, పిసికి రొట్టెలు చేయుమని చెప్పెను. మరియు అబ్రాహాము పశువులమందకు పరుగెత్తి ఒక లేతదూడను తెచ్చి ఒక పనివాని కప్పగించెను. ఆ పనివాడు దానిని త్వరగా సిద్ధపరచెను. తరువాత అతడు వెన్నను, పాలను, తాను సిద్ధము చేయించిన దూడను తెచ్చి వారి ఎదుట పెట్టి వారు భోజనము చేయుచుండగా వారి యొద్ద ఆ చెట్టుక్రింద నిలుచుండెను.

ఆ : 18 : 1, 2, 3,4, 5, 6, 7, 8 వాక్యములు.

సమీక్ష:- సజ్జనులారా! చూచితిరా! దేవుడే దూడ మాంసాన్ని తినునప్పు డతని ఉపాసకులు ఆవులు, దూడలు మొదలగు పశువులను ఎందుకు వీడుదురు? కొంచెమైన దయలేక మాంసాన్ని తినుటకు సిద్ధంగా నుండువాడు హింసకుడగు మనుష్యుడుగాక ఎప్పుడైన ఈశ్వరుడు కాగలడా? మరి ఈశ్వరుని వెంబడి ఇద్దరు మనుష్యులెవరుండిరో తెలియదు. అనాగరికుల సముదాయమొకటి యుండెననియు అందులో ముఖ్యుడుగా నుండినవాడే ఈ బైబిలునందు ఈశ్వరుడని పేర్కొనబడవచ్చుననియు దీనివలన తెలియుచున్నది. కావున బుద్ధిమంతులు వీరి పుస్తకమును ఈశ్వరకృతమని కాని, అందు వర్ణింపబడిన ఈశ్వరుని ఈశ్వరుడని కాని అంగీకరింపరు. ॥ 20 ॥

21. అంతట యెహోవా అబ్రాహాముతో "వృద్ధురాలనైన నేను నిశ్చయముగా ప్రసవించెదనా యని శారా నవ్వనేల? యెహోవాకు అసాధ్యమైనది ఏదైన ఉన్నదా" అనెను.

ఆ : 18 : 13, 14 వాక్యములు.

సమీక్ష:- ఈ క్రైస్తవుల దేవుని చిత్రములు కనుగొనుడు. పిల్లకాయ వలెనో లేక స్త్రీలవలెనో చిరాకుపడుచు ఎత్తిపొడుచుచున్నాడు. ॥ 21 ॥

22. అప్పుడు యెహోవా సోదొమ మీదను గొమొఱ్ఱా మీదను యెహోవా వద్దనుండి గంధకమును, అగ్నిని ఆకాశమునుండి కురిపించి, ఆ పట్టణములను, ఆ మైదానమంతటిని, ఆ పట్టణములలో నివసించువారి నందరిని, నేలమొలకలను నాశనము చేసెను.

ఆ : 19 : 24, 25 వాక్యములు.

సమీక్ష:– బైబిలునందు వర్ణింపబడిన దేవుని ఈ లీలలను చూడుడు. బాలలు మొదలైనవారి మీద కూడ కొంచెమైనను దయలేదు కదా! భూమిని బొర్లించి అందరిని ఒత్తి చంపెనన్నచో వారందరు అపరాధులుగ నుండిరా? ఈ మాట న్యాయ దయా వివేకములకు విరుద్ధమైనదే కద. దేవుడే ఇట్టి పనులను చేసిన అతని ఉపాసకులు అట్లెందులకు చేయకుందురు? ॥ 22 ॥

23. **మన తండ్రికి ద్రాక్షారసము త్రాగించి అతనితో శయనించి మన తండ్రివలన సంతానము కలుగజేసికొందము రమ్మని చెప్పెను. ఆ రాత్రి వారు తమ తండ్రికి ద్రాక్షారసము త్రాగించిన తరువాత అతని పెద్ద కుమార్తె లోపలికి వెళ్ళి తన తండ్రితో శయనించెను....! మనము నేటి రాత్రియు ద్రాక్షారసము త్రాగించెదము. నీవు వెళ్ళి శయనింపుము. చిన్నది వెళ్లి అతనితో శయనించెను. ఆలాగున 'లోతు' కుమార్తె లిద్దరు తమ తండ్రి వలన గర్భవతులైరి.**

ఆ : 19 : 32, 33, 34, 36 వాక్యములు.

సమీక్ష:– చూడండి! ఏ మద్యపానపు మత్తు తండ్రికిని, కుమార్తెకును సంపర్కము కలుగజేసెనో అట్టి దుష్టమగు మద్యమును క్రైస్తవాదులు ఇప్పటికిని త్రాగుచునే యున్నారు గదా! ఇక వారి దుష్టత్వమున కాక మేరయుండునా? కావున సజ్జనులు ఈ దుష్టమద్యమును తలంపనే కూడదు. ॥ 23 ॥

24. **యెహోవా తాను చెప్పిన ప్రకారము శారాను దర్శించెను. మరి శారా గర్భవతి యాయెను.**

ఆ : 21 : 1, 2 వాక్యములు.

సమీక్ష:– ఇప్పుడు శారానుగూడి గర్భవతిగా చేసెనను కార్యమెట్లయ్యెనో గమనింపుడు! ఏమి యెహోవా శారాయు గాక మూడవ వాడెవడైన గర్భస్థాపకుడుగ అగుపడుచున్నాడా? శారా యెహోవా కృప వలననే కద గర్భవతి యయ్యెనని విదితమగుచున్నది? ॥ 24 ॥

25. **కాబట్టి తెల్లవారినప్పుడు అబ్రాహాము లేచి ఆహారమును నీళ్ళతిత్తిని తీసికొని ఆ పిల్లవానితో కూడ హాగరునకు అప్పగించి ఆమె భుజముమీద వానిని పెట్టి ఆమెను పంపివేసెను. ఆమె పిల్లవానిని ఒక పొదలో పడవేసి ఎదురుగా కూర్చుండి యెలుగెత్తి యేడ్చెను. అప్పుడు దేవుడు ఆ చిన్నవాని మొరను వినెను.**

ఆ : 21 : 14, 15, 16, 17 వాక్యములు.

సమీక్ష:– చూచితిరా! మొదట శారాకు పక్షపాతియై హాగరనువాని నచ్చట నుండి వెళ్ళగొట్టించిన క్రైస్తవుల దేవుని చిత్రములు! ఎలుగెత్తి యేడ్చునది హాగరు. వినబడినది బాలకుని శబ్దమట. ఇదియును ఒక వింతయే. బాలకుడే యేడ్చుచున్నాడని ఈశ్వరునకే భ్రమ కలుగవచ్చును కాబోలు. ఈశ్వరవాక్యమని కాని, ఈశ్వర కృత గ్రంథస్థ వాక్యమని కాని చెప్పబడగలదా? ఒక సాధారణమైన మనుష్యుని వంటి మాటలే ఈ పుస్తకమునందు గలవు. వానిలో కొన్ని మాత్రమే సత్యములై తక్కినవన్నియు నిస్సారమైన మాటలతో నిండియున్నవి. ॥ 25 ॥

26. **ఆ సంగతులు జరిగిన తరువాత దేవుడు అబ్రాహామును పరిశోధించెను. ఎట్లనగా ఆయన**

'అబ్రాహామా!' అని పిలువగా అతడు 'చిత్తము ప్రభువా!' అనెను. అప్పుడాయన – నీకు ఒక్కడైయున్న నీ కుమారుని, అనగా! నీవు ప్రేమించు ఇస్సాకును తీసుకొని మోరియా దేశమునకు వెళ్లి అక్కడ నేను నీతో చెప్పబోవు పర్వతములలో ఒకదానిమీద దహనబలిగా అతని నర్పించుమని చెప్పెను. తన కుమారుడగు ఇస్సాకును బంధించి ఆ పీఠముపైనున్న కట్టెలమీద ఉంచెను. అప్పుడు అబ్రాహాము తన కుమారుని వధించుటకు తన చేయి చాపి కత్తి పట్టుకొనగా యెహోవా దూత పరలోకము నుండి "అబ్రాహామ్, అబ్రాహామ్!" అని అతనిని పిలిచెను. అందుల కతడు "చిత్తము ప్రభువా" అనెను. అప్పుడు ఆయన "ఆ చిన్న వానిమీద చేయి వేయకుము; అతని నేమియు చేయకుము. నీకు ఒక్కడైయున్న నీ కుమారుని నాకియ్య వెనుదీయలేదు గనుక నీవు దేవునికి భయపడువాడవని ఇందువలన నాకు కనబడుచున్న"దనెను. ఆ : 22 1,2,9,10,11,12 వాక్యములు.

సమీక్ష:– ఇప్పుడు బైబిలునందలి దేవుడు అల్పజ్ఞుడనియు, సర్వజ్ఞుడు కాదనియు స్పష్టమైనది. అబ్రాహాము అను నతడు ఒక అమాయకుడై ఉండెను. లేనిచో ఇట్టి చేష్టల నెందులకు చేసియుండును? బైబిలునందలి దేవుడు సర్వజ్ఞుడే యైన అతని భవిష్యత్తులోని భక్తుని తన సర్వజ్ఞత్వముతో తెలిసికొనియే యుండును. కావున క్రైస్తవుల దేవుడు సర్వజ్ఞుడు కాడనుటయే నిశ్చయము. ॥ 26 ॥

27. మా శ్మశాన భూములలో అతి శ్రేష్ఠమైనదానియందు మృతిచెందిన నీ భార్యను పాతిపెట్టుము.
ఆ : 23 : 6 వాక్యము.

సమీక్ష:– శవములను పాతిపెట్టుట వలన ప్రపంచమునకు గొప్ప హాని కలుగుచున్నది. ఎట్లన అవి మురిగి వాయువును దుర్గంధపరచి రోగములను వ్యాపింపజేయుచున్నవి.

ప్రశ్న:– చూడుడు! ప్రేమ గలవానిని కాల్చుట మంచిది కాదు. పాతిపెట్టుట వానిని పరుండబెట్టినట్లగును. కావున పాతిపెట్టుటయే మంచిది.

జవాబు:– మరణించిన వ్యక్తిని ప్రేమింతువేని అలాగే తమ ఇంట్లో ఎందుకుంచుకొనరు? మరియు ఎందులకు పాతిపెట్టుచున్నారు? ఏ జీవాత్మయందు ప్రీతియుండెనో అది వెళ్లిపోయెను. ఇక దుర్గంధయుక్తమగు మట్టియందు ఎందుకు ప్రీతి? ప్రీతినుంచెదరేని దానిని మట్టిలో ఏల పూడ్చిపెట్టుచున్నారు? చూడుడు! ఒకడొకనితో "నిన్ను మట్టిలో పూడ్చిపెట్టవలె" నని చెప్పెనేని అతడు విని ఎన్నటికిని ప్రసన్నుడు కాడు. అట్లే అతని ముఖనేత్ర శరీరములపై మట్టిని, రాళ్లను, ఇటికెలను, సున్నమునువేయుట, రొమ్ము మీద బండ పెట్టుట అనునదొక ప్రీతియా? మరి పెట్టెలో పెట్టి పాతిపెట్టుట వలనను దుర్గంధము అధికమై భూమి నుండి వెడలి, వాయువును చెడగొట్టి, దారుణమైన రోగాలను పుట్టించును. రెండవది: – ఒక శవమును పూడ్చిపెట్టుటకు కనీసం ఆరు మూరల పొడవు, నాలుగు మూరల వెడల్పు గల భూమి కావలసివచ్చును. ఈ లెక్క చొప్పున నూరు శవములనో, వేయింటినో, లక్షనో లేక కోటి సంఖ్యాకములనో పూడ్చిపెట్టిన ఎంతయో భూమి వ్యర్థముగా పనికిరానిదైపోవును.

ఇక అది పొలమునకు గాని, తోటకు గాని, కాపురమునకు గాని ఉపయోగమునకు రాదు. కావున పాతిపెట్టుట అన్నింటికంటె చెడ్డది. జలములలో వేయుట దానికంటె కొంత చెడ్డది. ఏలయన దానినప్పుడే జలజంతువులు చీల్చి పీల్చి తినును. కాని జలమున మిగిలిన ఎముకలు, మలము మురిగి ప్రపంచమునకు హాని కలిగించును. ఇక అడవిలో పారవేయుట అంతకంటెను చెడ్డది. ఏలయన దానిని మాంసాహారియైన పశుపక్షులు కొరికితిన్నను దాని ఎముకలలోని మజ్జ, మలము మురుగుటచే ఎంత దుర్గంధము పుట్టునో అది జగత్తునకంత అపకారమే చేయును. కావున దహనము చేయుట సర్వోత్తమము. ఏలయన దానియందలి పదార్థములన్నియు అణురూపములై వాయువులో కలిసిపోవును.

ప్రశ్న:- దహనము చేయుట వలన దుర్గంధము కలుగదా?

జవాబు:- పద్ధతి ప్రకారంగా దహనం చేయని పక్షమున కొంచెం దుర్గంధం కలుగును. కాని పూడ్చిపెట్టుట మున్నగువానికంటె అది చాలా తక్కువ కలుగును. ఇక విధిపూర్వకముగ వేదమందు చెప్పబడినట్లు 3 మూరల లోతు, మూడున్నర మూరల వెడల్పు, ఐదు మూరల పొడవు, క్రిందిభాగము ఒకటిన్నర జానెడు ఎత్తును, వంపునుగల వేదికను త్రవ్వించి శరీరపు బరువుతో సమానముగల ఘృతమును (నేయిని), అందు సేరునకు రత్తి యెత్తు కస్తూరిని, మాసమెత్తు కేసరిని చేర్చి తక్కువకు తక్కువ అయిదు కిలోల చందనమును (అధికమెంతైనా తీసుకోవచ్చును), కొబ్బరి కుడుకలు, అగరు, తగరు, కర్పూరము మామిడి, మోదుగ, మఱ్ఱి, మేడి మొదలగు కట్టెలను తెచ్చి చితిగా పేర్చి దానిపై శవమునుంచి పిదప నాలుగు దిక్కులను వేదిక ముఖము నుండి జానెడు వరకు నిండుగ పేర్చి ఘృతాహుతుల నిచ్చుచు దహనము చేయవలయును. ఈ ప్రకారముగా శవ దహనముచేసినచో కొంచెమైనను దుర్గంధము రాదు. దీనికే **'అంత్యేష్టి'** అనీ, 'నరమేధ (పురుషమేధ) యాగ'మనీ పేర్లు. దరిద్రుడైనచో ఇరువది కిలోల ఘృతము కంటెతక్కువ కాకుండ భిక్షమెత్తియో, బంధువుల నుండియో లేక దాతల నుండియో సంపాదించి ఈ ప్రకారముగా దహనమే చేయవలెను. ఒకవేళ ఎట్టి పరిస్థితులలోనైనా నెయ్యి చిక్కనిచో పాతిపెట్టుట మున్నగువాని కంటె వట్టి కట్టెలతో శవమును దహనము చేసిననూ మంచిదే. ఏలయనగా ఒక వేదిక యందే లక్షల కోట్ల శవములను దహనము చేయవచ్చును. భూమి పాతిపెట్టుటవలన పాడగునట్లు దహనము చేయుటవలన కాదు. ఇక సమాధులను చూచుటవలన కూడ భయము కలుగుచున్నది. కావున పాతిపెట్టుట మొదలగునవి సర్వదా నిషిద్ధములని గ్రహింపవలెను.

॥ 27 ॥

28. అబ్రాహాము అను నా యజమానుని దేవుడైన యెహోవా స్తుతింపబడుగాక!. ఆయన నా యజమానునికి తన కృపను, తన సత్యమును చూపుట మానలేదు. నేను త్రోవలోనుండగానే యెహోవా నా యజమానుని బంధువుల ఇంటికి నన్ను నడిపించెను.

ఆ : 24 : 27 వాక్యము.

సమీక్ష:- అతడు అబ్రాహామునకు మాత్రమే దేవుడై యుండెనా? ఇప్పటి కూలివాండ్రు గాని, ముందు నడుచువారు గాని, ముందు నడుచుచు త్రోవ చూపునట్లు ఈశ్వరుడును చూపెనన్న

ఇప్పుడెందులకు మార్గము చూపుట లేదు? మనుష్యులతో ఎందుకు మాటలాడడు? కావున ఇట్టి మాటలు ఈశ్వరునివి కాని, ఈశ్వరకృత గ్రంథమందలివి కాని కాజాలవు. ఇవి అనాగరికుల మాటలే అనవలెను. ॥ 28 ॥

29. ఇస్మాయేలు పుత్రుల పేర్లు - ఇస్మాయేలు జ్యేష్ఠకుమారుడైన నెబాయోతు, కేదారు, అబ్దయేలు, విబ్శాము, మిష్మా, దూమా, మశ్శా, హదరు, తేమా, యెతూరు, నాపీషు, కేదమా... ఆ : 25 : 13,14,15 వాక్యములు.

సమీక్ష:- ఈ ఇస్మాయేలు, అబ్రాహాము అతని దాసియైన హాజిరుకు పుట్టినవాడు. ॥ 29 ॥

30. నీవు మందకు వెళ్ళి రెండు మంచి మేకపిల్లలను అక్కడినుండి నా యొద్దకు తెమ్ము. వాటితో నేను నీ తండ్రికి ఇష్టమైన రుచిగల భోజ్యములతనికి చేసెదను. నీతండ్రి మృతిపొందక ముందు అతడు వానిని తిని నిన్ను ఆశీర్వదించునట్లు నీవు వానిని నీ తండ్రియొద్దకు తీసుకొనిపోవలె ననెను. మరియు తన జ్యేష్ఠ కుమారుడగు ఏశావు యొక్క సొగసైన వస్త్రములు ఇంటిలో తన యొద్ద నుండెను. గనుక రిబ్కా వానిని తీసి తన చిన్నకుమారుడగు యాకోబునకు తొడిగించి ఆ మేకపిల్లల చర్మములతో అతని చేతులను అతని మెడమీద నునుపు భాగమును కప్పెను. అందుకు యాకోబు 'నేను ఏశావును, నీ జ్యేష్ఠకుమారుడను. నీవు నాతో చెప్పిన ప్రకారము చేసియున్నాను. నీవు నన్ను దీవించుటకై దయచేసి లేచి కూర్చుండి, నేను వేటాడి తెచ్చిన దానిని తినుమనెను.

ఆ : 27 : 9,10,15,16,19 వాక్యములు.

సమీక్ష:- గమనింపుడు! ఇట్లు అబద్ధములు చెప్పి, కపటవేషమును ధరించి ఆశీర్వాదము పొందినవారే పిదప సిద్ధులు, పైగంబరులు అయినారనుట ఆశ్చర్యము కాదా? ఇటువంటివారు క్రైస్తవులకు మార్గదర్శకులైయుండిన ఇక వీరి మతమందు పొరపాటులుండుటకు కొదువేమి? ॥30॥

31. తెల్లవారినప్పుడు యాకోబు లేచి తాను తలగడగా చేసికొనిన రాయిని తీసి దానిని స్తంభముగా నిలిపి దాని కొనమీద నూనె పోసెను. మరియు అతడు ఆ స్థలమునకు 'బేతేలు' అని పేరు పెట్టెను. మరియు స్తంభముగా నేను నిలిపిన ఈ రాయి దేవుని మందిరమగును. ఆ : 28 : 18,19,22 వాక్యములు.

సమీక్ష:- ఇప్పు డీ అనార్యుల పనులను చూడుడు! రాళ్లను పూజించినది, పూజింపజేసినది వీరేకద! దీనినే ఇప్పుడు ముసల్మానులు "బయితుల్ ముకద్దన్' అనెదరు. ఏమి? ఈ రాయియే ఈశ్వరమందిరమా? ఈ రాయియందు మాత్రమే ఈశ్వరుడు నివసించుచుండెనా? బాగు! బాగు! ఏమి చెప్పవలెను? క్రైస్తవులారా! మీరే గొప్ప విగ్రహారాధకులనుట స్పష్టము. ॥ 31 ॥

32. దేవుడు రాహేలును జ్ఞాపకము చేసికొని ఆమె మనవి విని ఆమె గర్భము తెరచెను. అప్పుడు ఆమె గర్భవతియై కుమారుని కని "దేవుడు నా నిందను తొలగించె" ననుకొనెను. దూరపరచెనని ఆమె అనెను. ఆ : 30 : 22,23 వాక్యములు.

సమీక్ష:- చాలాబాగుంది. క్రైస్తవుల దేవు డెంత గొప్ప డాక్టరనవలెను! స్త్రీల గర్భములను తెరచుటకు ఎట్టి శస్త్రౌషధములున్నవో కదా! ఇవన్నియు పోలిక పొందిక లేని మాటలే. ॥ 32 ॥

33. ఆ రాత్రి స్వప్నమందు దేవుడు విశ్రాంతియుతుడైన 'లాబాను' వద్దకు వచ్చి నీవు యాకోబుతో మంచిగాని, చెడుగాని పలుకకుము. జాగ్రత్త సుమీ! అని అతనితో చెప్పెను. నీ తండ్రి ఇంటిమీద బహు వాంఛగలవాడవై వెళ్ళగోరిన ఎడల వెళ్ళుము.

ఆ : 31 : 24 – 30 వాక్యములు.

సమీక్ష:- మేము ఇచ్చట కొన్ని మాటలను ఉదాహరించుచున్నాము. గమనింపుడు! వేలకొలది మనుష్యులకు స్వప్నమందు దేవుడు వచ్చెననియు, వారితో మాటలాడెననియు; జాగ్రదవస్థలో కూడ ప్రత్యక్షముగ వచ్చి కలిసెననియు, తినెననియు, త్రాగెననియు, వచ్చుచు పోవుచునుండెననియు ఇట్టి మాట లెన్నియో బైబిలునందు వ్రాయబడియున్నవి. కాని ఇప్పుడతడున్నాడో? లేడో తెలియుట లేదు. ఏమనగా ఇప్పుడా దేవుడెవ్వరికిని స్వప్నమందు గాని, జాగ్రదావస్థయందు గాని వచ్చి కలియడు. మరి ఈ అనార్యులు పాషాణాది మూర్తులను దేవతలని నమ్మి పూజించుచుండిరని కూడ దీని నుండి తేటపడినది. ఇక క్రైస్తవుల దేవుడు కూడా రాతినే దేవుడని నమ్ముచున్నాడు. లేనిచో దేవతలు దొంగిలింపబడుటెట్లు ఘటించును? ॥ 33 ॥

34. యాకోబు తన త్రోవను వెళ్ళుచుండగా దేవదూతలతనిని ఎదుర్కొనిరి. యాకోబు వారిని చూచి 'ఇది దేవుని సేన' అని చెప్పెను. ఆ : 32 : 1,2 వాక్యములు.

సమీక్ష:- ఇప్పుడు క్రైస్తవుల దేవుడు మనుష్యుడనుట కేమి సందేహము? ఏమనగా – సైన్యమును కూడ నుంచుకొనియున్నాడు గదా! సైన్యమున శస్త్రములు కూడ నుండవచ్చును. మరి ఏ వైపుననో యుద్ధము కూడా చేయుచుండవచ్చును గద! లేనిచో సైన్యముతో నేమిప్రయోజనము? ॥ 34 ॥

35. యాకోబు ఒక్కడు మిగిలిపోయెను. ఒక నరుడు తెల్లవారు వరకు అతనితో పెనుగులాడెను. తాను అతనిని గెలువకుండుట చూచి తొడ గూటి మీద అతనిని కొట్టెను. అప్పుడు అతడు, ఆయనతో పెనుగులాడుట వలన యాకోబు తొడ గూడు వదిలెను. ఆయన 'తెల్లవారుచున్నది గనుక నన్ను పోనిమ్మ'నగా ఆతడు నీవు నన్ను ఆశీర్వదించితేనే కాని నిన్ను పోనివ్వను అని అనెను. ఆయన నీ పేరేమని అడుగగా–యాకోబు అని చెప్పెను. అప్పుడాయన నీవు దేవునితోను, మనుష్యులతోను పోరాడి గెలిచితివి కనుక ఇక మీదట నీ పేరు ఇశ్రాయేలే కాని యాకోబు అనబడదని చెప్పెను. అప్పుడు యాకోబు నీపేరు దయచేసి తెలుపుమని యనెను. అందులకాయన నీవు ఎందు నిమిత్తము నాపేరు అడిగితివని చెప్పి అక్కడ అతనిని ఆశీర్వదించెను. యాకోబు నేను ముఖాముఖిగా దేవుని చూచితిని. అయినను నా ప్రాణము దక్కినదని ఆ స్థలమునకు 'పెనీయేలు' అని పేరు పెట్టెను. అతడు పెనీయేలు నుండి సాగిపోయినప్పుడు సూర్యోదయమాయెను. అప్పుడతడు తొడ

కుంటుచు నడిచెను. అందుచేత ఆయన యాకోబు తొడ గూటిమీది తుంటినరమును కొట్టినందున నేటివరకు ఇశ్రాయేలీయులు తొడగూటి మీదనున్న తుంటినరము తినరు.

ఆ : 32 : 23,25,26,27,28,29,30,31,32 వాక్యములు.

సమీక్ష:- క్రైస్తవుల దేవుడు మల్లుడయినందుననే కదా దయగలిగి సేరకును, హేబేలుకును, పుత్రులను కలుగజేసెను! ఆహా! ఇట్టివా డెప్పుడయిన ఈశ్వరుడు కాగలడా? ఒకడు పేరడగగా అతడు తన పేరే తెలుపడు. ఇదియు నొక చిత్రమే కద! ఇక ఈశ్వరుడు అతని నరమును బెణికించి గెలిచెనే కాని డాక్టరే యైన తొడనరమును కూడా బాగుపరచియుండును. ఇట్టి ఈశ్వరుని భక్తుడయిన యాకోబు కుంటుచుండినట్లే అన్య భక్తులును కుంటుచుండగలరు. ఈశ్వరుని ముఖాముఖిగ జూచి అతనితో మల్లయుద్ధము చేసెనన్న అతడు శరీరసహితుడే యనదగును గద. లేనిచో అది సంభవమగునా? కావున ఇది కేవలము చిన్నపిల్లల చేష్టలనుట స్పష్టము. ॥ 35 ॥

36. ఈశ్వరుని ముఖము చూచెను. తౌ. 33. ఆ. 10.

సమీక్ష:- ఈశ్వరునకు ముఖమున్నచో తక్కిన అవయవములు కలిగి జన్మమరణములు కలవాడు కూడ కావలెను. ॥ 36 ॥

37. యూదా జ్యేష్ఠ కుమారుడైన 'ఏరు' యెహోవా దృష్టికి చెడ్డవాడు కనుక యెహోవా అతనిని చంపెను. అప్పుడు యూదా ఓనానుతో "నీ అన్న భార్యవద్దకు వెళ్ళి మరిది ధర్మము జరిగించి నీ అన్నకు సంతానము కలుగజేయుమని చెప్పెను. ఓనాను ఆ సంతానము తనది కానేరదని ఎరిగి ఆమెతో పోయినప్పుడు తన అన్నకు సంతానము కలుగజేయకుండునట్లు తన రేతస్సును నేలను విడిచెను. అతడు చేసినది యెహోవా దృష్టికి చెడ్డది గనుక ఆయన అతనిని కూడా చంపెను.

ఆ : 38 : 7,8,9,10 వాక్యములు.

సమీక్ష:- ఇప్పుడు గమనించుడు! ఈ పనులు ఈశ్వరుడు చేయదగినవా? ఆమెతో నియోగమై యున్నవు డతనిని చంపినదెందులకు? అతని బుద్ధిని శుద్ధి చేయలేదేల? దీనివలన పూర్వకాలమందంతట వేదోక్త నియోగ పద్ధతులు ప్రచారమునందుండెనని స్పష్టమగుచున్నది. ॥37॥

నిర్గమకాండము

38. మోషే పెద్దవాడై తన జనులవద్దకు పోయి వారి భారములను చూచెను. అప్పుడు అతడు తన జనులలో ఒక ఇబ్రీయుని ఒక ఐగుప్తీయుడు కొట్టగా చూచెను. అతడు ఇటునటు తిరిగి చూచి యెవడును లేకపోగా ఆ ఐగుప్తీయుని చంపి, ఇసుకలో వానిని కప్పి పెట్టెను. మరునాడు అతడు బయట నడచి వెళ్ళుచుండగా ఇబ్రీయులైన మనుష్యులిద్దరు పోట్లాడుచుండిరి. అప్పుడతడు అన్యాయము చేసినవానిని చూచి నీవేల నీ పొరుగువానిని

కొట్టుచున్నావని అడుగగా - అతడు మా మీద నిన్ను అధికారిగాను తీర్పరినిగాను నియమించిన వాడెవడు? నీవు ఐగుప్తీయుని చంపినట్లు నన్ను కూడా చంపవలెనని అనుకొనుచున్నావా? అనెను. అందుకు మోషే నిశ్చయముగా ఈ సంగతి బయలుపడెనని భయపడి పరుగిడెను. నిర్గ : 2 : 11,1,2,13,14,15 వాక్యములు.

సమీక్ష:- ఇప్పుడు విచారింపుడు! బైబిలులోని ముఖ్య సిద్ధపురుషుడు మతాచార్యుడగు 'మోషే' అనువాని చరిత్ర క్రోధాది దుర్గుణములతో కూడినది. నరహత్య చేసి దొంగవలె రాజదండన నుండి తప్పించుకొనుచుండెను. ఈ విషయమును మరుగున పడనీయకూడదు. అతడు నిశ్చయముగ అసత్యవాదియే. ఇట్టివానితో ఈశ్వరుడు కలిసెను. ఇక అతడు పైగంబరుగా గణింపబడి యూదాదుల మతమును ప్రవర్తింప జేసినపుడు అది కూడ నా 'మోషే'ను బోలియే యుండును. దీనివలన తెలిసినదేమనగా క్రైస్తవులకు మూలపురుషుడగు మోషే మొదలగువారందరును ఆటవికులై యుండిరని, విద్యావంతులు కాకుండిరని తేటపడుచున్నది. ॥ 38 ॥

39. యెహోవా చూచుటకు ఒక ప్రక్క ముదుచుకొన్న దానిని త్రిప్పి చిన్న పొద మధ్యలో నున్నవానిని పిలిచి ఓ మోషే! మోషే! అని పిలిచెను. అప్పుడు మోషే ఇక్కడ నున్నాడనగా - ఇక్కడకు రావలదనియు, ఇది పవిత్రభూమి కనుక చెప్పులు తొడిగిన పాదములతో రావలదనియు చెప్పెను. ॥ తౌరీ. 3. ఆ. 4-5 ॥

సమీక్ష:- చూడుడు. మనుష్యుని చంపి ఇసుకలో పూడ్చువారితో ఈశ్వరునకు మైత్రి మరియు దేవదూతగా నంగీకరించుటయు చేయుచున్నారు. మీ ఈశ్వరుడు మోషేతో పవిత్ర స్థలమునకు చెప్పులు తొడిగిరావలదని చెప్పెను. మీ క్రైస్తవు లేల ఆతని ఆజ్ఞకు విరుద్ధముగ నడుచుచున్నారు? ॥39॥

ప్రశ్న:- మేము చెప్పులకు బదులు టోపీలు తీయుచున్నాము.

జవాబు:- మీరు రెండవ అపరాధము చేయుచున్నారు. టోపీ తీయుమని ఈశ్వరుడు చెప్పలేదు. మీ పుస్తకములలో వ్రాయబడలేదు. తొలగింపవలసిన దానిని తొలగింపక, తొలగింపనవసరము లేనివానిని తొలగించుటయు రెండును మీ పుస్తకమునకు విరుద్ధములే.

ప్రశ్న:- మా యూరోపు దేశములో చలి ఎక్కువగుటచే మేము పాదరక్షలను విడువము.

జవాబు:- ఏమి? తలకు చలి లేదా? అయితే యూరోపు దేశమునకు వెళ్ళినపుడు చేయుడు. ఇక్కడ మా ఇంటికి వచ్చినప్పుడు కాని పడకపై చేరినపుడు కాని పాదరక్షలు విడువుడు. మీరు అటుల విడువకున్నచో మీ బైబిలుకు విరుద్ధముగా నడచినవారగుదురు.

40. ఈశ్వరుడు మోషేతో నీ చేతిలో నేమున్నదనెను. అతడు చిన్న బెత్తమున్నదనెను. అయినచో దానిని భూమిపై పడవేయుమనెను. అతడు పడవేసెను. అప్పుడది సర్పముగా మారెను.

దానిని చూచి మోషే పరుగిడుచుండ పరమేశ్వరుడు అతనితో నీ చేయి చాచి దాని తోకను బట్టుకొమ్మనెను. అతడట్లే చేయగా అది చేతిలో బెత్తమాయెను.

అప్పుడు పరమేశ్వరు డాతనితో నీ చేతిని నీ యొడిలో నుంచుకొమ్మనెను. అతడట్లే చేసి బయటికి దీయగా నాతని చేయి మంచువలె కుష్ఠురోగి చేయివలె ముడుచుకొనెను. దానిని జూచి పరమేశ్వరుడు అతనితో నీ చేయి మరల నొడిలో నుంచుకొనుమనగా నాతడట్లే చేసి బయటకు తీయగా ఎప్పటివలె బాగుగా నుండెను. నీవు నీలమగు నదియొక్క నీరు తీసికొని ఎండినదానిపై పోయుము. నది నుండి తీసిన నీరు ఎండిన దానిపై నెత్తురగును. ॥ తౌ. 4. అ. 2-4, 5, 6, 7,9 ॥

సమీక్ష:- చూడండి! ఈ గారడీవాని ఆట. ఈ ఆటగాడైన ఈశ్వరుడు, అతని సేవకుడైన మోషే యీ మాటల నెట్లంగీకరింతురు? నేటి గారడీవాండ్రు ఇంతకంటె తక్కువ చమత్కారములు చేయుచున్నారా? ఇది ఈశ్వరుని గొప్ప ఆటయా? వీనిని విద్వాంసులెట్లంగీకరింతురు?

మరియు మాటి మాటికి నేను పరమేశ్వరుడను, అబ్రాహాము, ఇజక్, యాకోబులకు ఈశ్వరుడను ఇట్టివానిని ప్రతి పర్యాయము తన నోటిద్వారా తన ప్రశంసను చేయుట యుత్తముల లక్షణము గాదు. ఇట్టిది గర్వము గలవాని లక్షణము. ॥ 40 ॥

41. పస్క పశువును వధింపుడి! మరియు హిస్సోపు కుంచె తీసుకొని పళ్ళెములోనున్న రక్తములో దానిని ముంచి ద్వారబంధపు పై కమ్మికిని, రెండు నిలువు కమ్ములకును పళ్ళెములోని రక్తము తాకింపవలెను. తరువాత మీలో నెవరును ఉదయము వరకు తన యింటి ద్వారము నుండి బయలు వెడలకూడదు. యెహోవా ఐగుప్తీయులను హతము చేయుటకు దేశసంచారము చేయుచు ద్వారబంధపు పైకమ్మి మీదను రెండు నిలుపు కమ్ముల మీదను ఉన్న రక్తమును చూచి యెహోవా ఆ తలుపును దాటిపోవును. మిమ్ము హతము చేయుటకు మీ ఇండ్లలోనికి సంహారకుని చొరనియ్యడు. నిర్గ : 12 : 21,22,23 వాక్యములు.

సమీక్ష:- ఆహా! ఇట్టి గారడి - కనుకట్టువానివలెనున్న ఈశ్వరుడు ఎన్నడైన సర్వజ్ఞుడవగలడా! రక్తముద్రను చూచినపుడే కద ఇది ఇశ్రాయేలీయుల వంశమువారి యిల్లని గుర్తించును? లేనిచో గుర్తింపనేరకుండును. ఇదియు నొక క్షుద్రబుద్ధి గల మనుష్యుని వంటి పనియే. కావున ఇవి ఒకానొక ఆటవికునిచే వ్రాయబడిన మాటలేయని తెలియుచున్నది ॥ 41 ॥

42. అర్ధరాత్రివేళ జరిగినదేమనగా - సింహాసనము మీద కూర్చున్న ఫరోయు మొదలుకొని చెఱసాలలో నున్న ఖైదీయొక్క తొలిపిల్ల వరకు ఐగుప్త దేశమందలి తొలిపిల్లల నందరిని, పశువుల తొలిపిల్లల నన్నింటిని యెహోవా హతము చేసెను. ఆ రాత్రి ఫరోయు, అతని సేవకులందరును ఐగుప్తీయులందరును లేచినప్పుడు శవములేని ఇల్లు ఒకటైన లేకపోయినందున ఐగుప్తులో మహాఘోష పుట్టెను. నిర్గ : 12 : 29,30 వాక్యములు.

సమీక్ష:- అయ్యో! అర్ధరాత్రివేళ దొంగవలె దయలేని క్రైస్తవుల దేవుడు ఏ అపరాధము చేయని ఆ బాలవృద్ధులను, స్త్రీలను, పశువులను చంపివేసెను. ఏ మాత్రము దయలేదా? ఐగుప్త దేశమందు మహాఘోష పుట్టినప్పుడును ఈ క్రైస్తవుల దేవుని చిత్తములో క్రోధము నశింపలేదా? ఇది ఈశ్వరుని పనియా? ఒక సామాన్యమైన మనిషి కూడా ఇలా చేయడు. కాని ఇది ఆశ్చర్యమేమీ గాదు. ఎందుకనగా **"మాంసాహారిణః కుతో దయా"** అనునట్లు క్రైస్తవుల దేవుడు మాంసాహారి అగుటవలన అతనికి దయ ఎక్కడుంటుంది? ॥ 42 ॥

43. యెహోవా మీ పక్షమున యుద్ధము చేయును. మీరు ఊరకయే యుండవలెనని ప్రజలతో చెప్పెను. అంతలో యెహోవా మోషేతో "నీవేల నాకు మొరపెట్టుచున్నావు? సాగిపోవుడి అని ఇశ్రాయేలీయులతో చెప్పుము. నీవు నీ కఱ్ఱను ఎత్తి ఆ సముద్రమువైపు నీ చెయ్యి చాపి దానిని పాయలు చేయుము. అప్పుడు ఇశ్రాయేలీయులు సముద్రమధ్యమున ఆరిన నేలను నడిచిపోదురు. నిర్గ : 14 : 14,15,16 వాక్యములు.

సమీక్ష:- ఏమయ్యా! మొదట ఈశ్వరుడు గొఱ్ఱెల వెనుకనుండు గొఱ్ఱెలకాపరి వలె ఇశ్రాయేలీయుల వెనువెంట దిరుగుచుండెను. అది ఇప్పుడెక్కడికి మాయమైపోయెనో తెలియకున్నదే! అట్లు గాకున్న నడి సముద్రము నుండి నాల్గు దిక్కులకు రైలుబండ్ల వలె ఇనుపదారులు చేయించుకొని ఉండెడివారు గద! దానివలన సమస్త జగత్తునకు లాభము కలుగుచుండెడిది. అట్లే నావలు మొదలగువానిని చేయు శ్రమయు తప్పిపోవుచుండెడిది. కాని ఏమి చేయవలెను? క్రైస్తవుల దేవుడు ఎచ్చట దాగియున్నాడో గదా! ఈ బైబిలునందలి ఈశ్వరుడు మోషేతో నిటువంటి వెన్నియో అసంభవములైన లీలలు కావించియున్నాడు. క్రైస్తవుల దేవు డెట్లున్నాడో, అటులే అతని సేవకులును కలరని, అతడు రచించిన పుస్తకము కూడా అట్లే ఉన్నదని తెలియుచున్నది. ఇట్టి పుస్తకమూ ఈ లాంటి దేవుడును మనకు దూరంగా ఉండుటయే మంచిది. ॥43 ॥

44. ఏలయనగా నీ దేవుడైన యెహోవా నగు నేను రోషముగల దేవుడను. నన్ను ద్వేషించువారి విషయములో మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించుచు నన్ను ప్రేమించి నా ఆజ్ఞలు గైకొనువారిని వెయ్యితరముల వరకు కరుణించువాడనై యున్నాను. నిర్గ 20 : 5-6 వాక్యములు.

సమీక్ష:- ఆహా! తండ్రి చేసిన అపరాధానికి అతని నాలుగు తరముల వారిని దండించుట న్యాయమేనా? మంచి తండ్రికి దుష్టులును, దుష్టునికి మంచి సంతానమును కలుగుటలేదా? కలిగినచో నాలుగు తరములవారిని ఎట్లు దండింపగలుగును? ఇక ఐదవతరమువారు దుష్టులైనచో వారిని దండింపడా ఏమి? కాబట్టి అపరాధము లేనివానిని దండించువాడు 'అన్యాయకారి' అనబడును. ॥44॥

45. విశ్రాంతి దినమును పరిశుద్ధ దినముగా ఆచరించుటకు జ్ఞాపకముంచుకొనుము. ఆరు దినములు నీవు కష్టపడి ఈ పని అంతయు చేయవలెను. ఏడవ దినము నీ దేవుడైన

యెహోవాకు విశ్రాంతిదినము. యెహోవా విశ్రాంతి దినమును ఆశీర్వదించెను.

నిర్గ : 20 : 8,9,10,11 వాక్యములు.

సమీక్ష:- ఒక ఆదివారమే పవిత్రమై తక్కిన ఆరు దినములు అపవిత్రములా? పరమేశ్వరుడు ఆరుదినముల వరకు గొప్ప పరిశ్రమ చేసి యుండెనా? దీనివలన యెహోవా అలసి ఏడవదినము నిద్రపోయెనని తెలియుచున్నది. ఇక ఆదివారమును ఆశీర్వదించెనన్న సోమవారము మొదలగు ఆరుదినములకు ఏమిచ్చెను? వానిని శపించియే యుండవచ్చును. ఇట్టిపనిని ఒక సామాన్యుడు కూడా చేయడే! మరి ఈశ్వరు డెట్లు చేయగలడు? మంచిది! ఒకదానిని పరిశుద్ధ దినమని ఆశీర్వదించి మిగతావాటిని వ్యర్థముగా అపరిశుద్ధము లని చెప్పెనేని ఆదివారమునందు ఏ గుణము కలదు? మరి సోమవారము మున్నగువానియందు ఏ దోషములున్నవి? ॥ 45 ॥

46. నీ పొరుగువాని మీద అబద్ధసాక్ష్యము పలుకకూడదు. నీ పొరుగువాని ఇల్లు ఆశింపగూడదు. నీ పొరుగువాని భార్యనైనను అతని దాసునైనను, అతని దాసినైనను, అతని యెద్దునైనను, అతని గాడిదనైనను, నీ పొరుగువానిదగు దేనినైనను ఆశింపగూడదు.

నిర్గ : 20 : 16-18 వాక్యములు.

సమీక్ష:- ఔరా! అందువల్లనే కద దప్పిగలవాడు జలమును, ఆకలిగలవాడు అన్నమును ఆశించునట్లు ఈ క్రైస్తవులు పరదేశీయుల సొమ్ము కాశపడియున్నారు. ఇది తమ ప్రయోజనమును సిద్ధింపజేయునదియు, పక్షపాతముతో గూడినదియునై యున్నటులే ఈ క్రైస్తవుల దేవుడును ఉండవచ్చును. మేము మానవులనందరిని పొరుగువారుగా భావించుచున్నామన్న మనుష్యులు గాక పొరుగువారు ఇతరు లెవరుందురు? కావున ఇవి స్వార్థసాధకులచే వ్రాయబడిన మాటలే కాని ఈశ్వరవాక్యములు కావు. ॥46॥

47. నరుని చావగొట్టిన వానికి నిశ్చయముగా మరణశిక్ష విధింపవలెను. అయితే వాడు చంపవలెనని పొంచి యుండకయే దైవికముగా వానిచేత ఆ హత్య జరిగిన యెడల వాడు పారిపోగల యొక స్థలమును నీకు నిర్ణయించెదను.

నిర్గ : 21 : 12,13 వాక్యములు.

సమీక్ష:- ఈ దేవుని న్యాయము నిజమైనచో 'మోషే' ఒక మనుష్యుని చంపి పూడ్చిపెట్టి పారిపోయియుండెను. వానికి ఏ దండననూ విధింపలేదెందులకు? ఈశ్వరుడు వానిని చంపుమని మోషే కప్పగించె నన్న ఈశ్వరుడు పక్షపాతి యయ్యెను. ఏలయన మోషేకు రాజుచే ఏల న్యాయము చేయింపలేదు? ॥ 47 ॥

48. యెహోవాకు సమాధాన బలులుగా కోడెలను వధించిరి. అప్పుడు మోషే వాటి రక్తములో సగము తీసికొని పళ్ళెములలో పోసి ఆ రక్తములో సగము బలిపీఠము మీద ప్రోక్షించెను. అప్పుడు మోషే రక్తమును తీసికొని ప్రజలమీద ప్రోక్షించి "ఇదిగో ఈ సంగతులన్నిటి

విషయమై యెహోవా మీతో చేసిన నిబంధన రక్తము ఇదే" అని చెప్పెను. అప్పుడు యెహోవా మోషేతో నిట్లనెను. "నీవు కొండ ఎక్కి నా యొద్దకు వచ్చి అచ్చట నుండుము. నీవు వారికి బోధించునట్లు నేను వ్రాసిన ఆజ్ఞలను ధర్మశాస్త్రమును రాతి పలకలను నీకిచ్చెదను.

నిర్గ : 24 : 5,6-8-12 వాక్యములు.

సమీక్ష:- ఇప్పుడు చూడుడు! ఇవన్నియు అడవిమనుష్యుల మాటలే కదా! 'పరమేశ్వరుడు కోడెల బలిదానము నంగీకరించెను. బలిపీఠము మీద రక్తమును ప్రోక్షించెను' అను మాటలు అనాగరికత అసభ్యతలనే బోధించుచున్నవి. క్రైస్తవుల దేవుడు దూడల బలిదానమును పుచ్చుకొనుచున్నప్పుడు అతని భక్తులు గోవుల బలిదానమును ప్రసాదముగా తీసుకొని తమ పొట్టలను ఏల నింపుకొనకుందురు? ఇక జగత్తున కెందులకు హాని కలుగజేయకుందురు?

ఇటువంటి చెడ్డమాట లెన్నియో ఈ బైబిలునందు నిండియున్నవి. ఆ కుసంస్కారము లున్నందువలననే కదా వేదములందు సైతం అట్టి మిథ్యాదోషముల నారోపించుచున్నారు. కాని వేదములం దిట్టి విషయములు పేరుకు కూడ లేవు. మరి క్రైస్తవుల దేవుడొక గుట్టమీద నివసించుచుండెననియు, ఒక అడవిమనుష్యునిగ ఉండెననియు గూడ నిశ్చయమైనది. ఇక ఆ దేవుడు కలము, కాగితములు, సిరా అనువాని నెరుగనివాడైనందుననే కద రాతిపలకలపై వ్రాసిచ్చుచుండెను. ఇటువంటివాడు ఆ అడవి మనుష్యులకు ఈశ్వరుడయ్యెను. ॥ 48 ॥

49. ఆయన "నీవు నా ముఖమును చూడజాలవు. ఏ నరుడును నన్ను చూచి బ్రతుక"దనెను. మరియు యెహోవా "ఇదిగో నా సమీపమున ఒక స్థలమున్నది. నీవు ఆ బండమీద నిలువవలెను. నా మహిమ నిన్ను దాటి వెళ్లుచుండగా ఆ బండ సందులో నిన్నుంచి నిన్ను దాటి వెళ్లువరకు నా చేతితో నిన్ను కప్పెదను. నేను నా చెయ్యి తీసిన తరువాత నా వెనుక పార్శ్వమును చూచెదవు కాని నా ముఖము నీకు కనబడదని మోషేతో చెప్పెను.

నిర్గ : 33 : 20-21-22-23 వాక్యములు.

సమీక్ష:- ఇప్పుడు క్రైస్తవుల దేవుడు మనుష్యునివలెనే శరీరముకలవాడై యుండినచో మోషేను మోసపుచ్చి తానెట్లు దేవుడయ్యెను? 'వెనుకటి పార్శ్వమును చూడగలవు. కాని రూపమును చూడలేవని చెప్పినప్పుడు చేతితో అతనిని కప్పకుండా ఉండవచ్చును గదా! దేవుడు తన చేతితో మోషేను కప్పినప్పుడు అతనికి ఆ చేతిరూపము కనపడకుండునా? ఇట్టి అసందర్భపు మాటలు బైబిలులో ఎన్నో కలవు.॥49॥

లేవీయ కాండము

50. యెహోవా మోషేను పిలిచి ప్రత్యక్షపు గుడారములో నుండి అతని కీ లాగు సెలవిచ్చెను. "నీవు ఇశ్రాయేలీయులతో నిట్లనుము - మీలో ఎవడైనను యెహోవాకు బలి అర్పించునప్పుడు గోవుల మందలో నుండిగాని, గొఱ్ఱెల మందలో నుండి గాని,

మేకలమందలో నుండి గాని దానిని తీసికొనిరావలెను.

॥ లేవీయకాండము. 1 : 1-2 ॥

సమీక్ష:- ఇప్పుడు ఆలోచింపుడు క్రైస్తవుల దేవుడు గోవృషభాదులను బలిగా పుచ్చుకొనువాడైనందులకే కద వానిని తనకు బలిగా సర్పింపుడని ఉపదేశించుచున్నాడు. అయితే అతడు గోవృషభాది పశువుల రక్తమాంసముల దాహార్తి కలవాడైనచో అతడు పశుతుల్యుడైన మానవుడే అగును. దీనివలన అతడహింసకుడు గాడు, ఈశ్వరుడును గాడని మాంసాహారియగు తుచ్ఛమానవుడే నని తెలియుచున్నది. ॥ 50 ॥

51. అతడు యెహోవా సన్నిధిని ఆ కోడెదూడను వధించిన తరువాత యాజకులైన అహరోను కుమారులు దాని రక్తమును తెచ్చి ప్రత్యక్షపు గుడారము ఎదుటనున్న బలిపీఠము చుట్టు ఆ రక్తమును ప్రోక్షింపవలెను. అప్పుడతడు దహన బలిరూపమైన ఆ పశుచర్మమును ఒలిచి దాని అవయవములను విడదీసిన తరువాత యాజకుడైన అహరోను కుమారులు బలిపీఠము మీద అగ్నిని ఉంచి ఆ అగ్నిమీద కట్టెలను చక్కగా పేర్చవలెను. అప్పుడు యాజకులైన అహరోను కుమారులు ఆ అవయవములను, తలను, క్రొవ్వును బలిపీఠము మీద నున్న అగ్నిమీద కట్టెలపైని చక్కగా పేర్చవలెను. దాని ఆంత్రములను, కాళ్ళను నీళ్ళతో కడుగవలెను. అది యెహోవాకు ఇంపైన సువాసన గల దహనబలి యగునట్లు యాజకుడు దాని నంతయు బలిపీఠము మీద దహింపవలెను.

॥ లేవీయకాండము. 1 : 5,6,7,8,9 ॥

సమీక్ష:- కొంచెమాలోచింపుడు. దేవుని ఎదుట తన భక్తులు దూడను చంపుట, తాను చంపించుట, రక్తమును వారు నలువైపుల చిలుకరించుట, అగ్నియందు హోమము చేయుట, దేవు డా సుగంధమును పీల్చుట అను నివి కటికవాని యింట జరుగు కృత్యముల కంటె మిక్కిలి నీచములు కావా? కావున బైబిలు ఈశ్వరకృతము కాదు. అందు వర్ణింపబడిన అడవి మనుష్యుని వంటి చరిత్ర గలవాడు. ఈశ్వరుడు కానే కాదు. ॥ 51 ॥

52. మరియు యెహోవా మోషేకు ఈలాగు సెలవిచ్చెను. "ప్రజలు అపరాధులగునట్లు అభిషిక్తుడైన యాజకుడు పాపము చేసిన యెడల తాను చేసిన పాపమునకై నిర్దోషమైన కోడెదూడను యెహోవాకు పాపపరిహారార్థం బలిగా అర్పింపవలెను. మరి కోడె తలమీద చెయ్యి ఉంచి యెహోవా సన్నిధిని కోడెను వధింపవలెను.

॥ లేవీయకాండము. 4 : 1-3-4 ॥

సమీక్ష:- ఇప్పుడు చూడుడు! స్వయముగ పాపకార్యములను చేయుచు ఆ పాప పరిహారార్థము ఆవు మున్నగు శ్రేష్ఠమైన పశువులను చంపుట యెహోవా వానిని చంపుమనుటయు నివి పాపములను తొలగజేయుటకు ప్రాయశ్చిత్తములట! ఇట్టి పనులను చేయుచు, చేయించువానిని సైతం ఈశ్వరుడని భావించి తమకు ముక్తి కలుగుననుకొను క్రైస్తవులు ఎంత ధన్యులో! ॥ 52 ॥

53. అధికారి అపరాధియైన ఎడల అతడు నిర్దోషమైన మగమేక పిల్లను అర్పణముగా తీసుకొని వచ్చి యెహోవా సన్నిధిని దానిని వధింపవలెను. ఇది పాపపరిహారార్థమైన బలి.

॥ లేవీయకాండము. 4 : 22, 23, 24 ॥

సమీక్ష:- ఇందులకే వీరి అధికారులు న్యాయాధీశులు, సేనాధిపతులు మొదలగువారు పాపము చేయుట కెంత మాత్రము భయపడరు. ఎందుకనగా తా మిష్టమై పాపములను చేయవచ్చునట. మరి వానికి బదులుగా ఆవు, కోడె, మేక మున్నగువాని ప్రాణములను తీసి ప్రాయశ్చిత్తము చేసికొనవచ్చునట! అందుకే కద క్రైస్తవులు పశు ప్రాణమును గాని, పక్షి ప్రాణమును గాని తీయుటకు వెనుకాడరు.

క్రైస్తవులారా! వినుడు! ఇప్పుడైనా ఈ అనార్యమతమును విడిచి సుసభ్యతాది ధర్మయుక్తమగు వేదమతమును స్వీకరింపుడు. దానిచేతనే మీకు శుభము చేకూరును. ॥ 53 ॥

54. అతడు గొఱ్ఱెపిల్లను తేజాలని యెడల అతడు పాపి యగునట్లు చేసినచో అపరాధ విషయమై రెండు తెల్ల గువ్వలను గాని, రెండు పావురముల పిల్లలను గాని యెహోవా సన్నిధికి తీసుకొనిరావలెను. దాని మెడ నుండి దాని తలను నులుమవలెను. కాని దాని నూడదీయగూడదు. అతడు చేసిన పాపము విషయమై ప్రాయశ్చిత్తము చేయగా అతనికి క్షమాపణ కలుగును. రెండు తెల్లగువ్వలైనను, రెండు పావురపు పిల్లలైనను తనకు దొరకని యెడల తూమెడు గోధుమపిండిలో పదవవంతును పాపపరిహారార్థ బలిరూపముగా తేవలెను. దాని మీద నూనె పోయవలదు. అతనికి క్షమాపణ కలుగును.

॥ లేవీయకాండము. 5 : 7,8,10,11,12,13 ॥

(**గమనిక:-** కోడెను, గొఱ్ఱెను, మేకపిల్లను, పావురమును తుదకు పిండినైనను పుచ్చుకొందునని నియమించినట్టి ఇట్టి ఈశ్వరునకు ధన్యవాదములు. పావురపుపిల్లలను 'మెడను నులిపించి' పుచ్చుకొనుచుండెను. అనగా మెడను త్రుంచివేయుటకు చేయవలసిన శ్రమయు తప్పిపోయెను. ఇదియు నొక అద్భుతమైన వింతయే. వీని నన్నింటిని విచారించుటవలన అడవి మనుష్యులలో ఒకానొక చతురుడగు పురుషు డుండెననియు, అతడు పర్వతమెక్కి కూర్చుండి తన్ను ఈశ్వరుడనని ప్రసిద్ధపరచుకొనెననియు, అజ్ఞానులుగ నున్న ఇతర మనుష్య లతనినే ఈశ్వరుడని నమ్ముకొనిరనియు విదితమగుచున్నది. ఇక నతడు తన యుక్తులచే ఆ పర్వతము మీదికి తినుటకు పశువులను పక్షులను అన్నాది పదార్థములను తెప్పించుకొనుచు ఆనందించుచుండెను. అతని దూతలు (ఫిరీశ్తాలు) పనిచేయుచుండిరి. సజ్జనులారా! బైబిలునందలి కోడెలను, గొఱ్ఱెలను, మేకపిల్లలను, పావురపు పిల్లలను మంచిపిండిని తిను ఈశ్వరుడెక్కడ? మరి సర్వవ్యాపకుడు, సర్వజ్ఞుడు అజన్ముడు, నిరాకారుడు, సర్వశక్తిమంతుడు, న్యాయకారి మొదలగు ఉత్తమ గుణములతో గూడిన వేదోక్తమగు ఈశ్వరు డెక్కడ? విచారింతురు గాక!)

సమీక్ష:- ఇప్పుడు వినుడు! క్రైస్తవులలో ఒక పేదవాడు కాని, ధనవంతుడు కాని పాపము చేయుటకు భయపడకుండవచ్చును. ఎందుకంటె వీరి దేవుడు పాపములకు ప్రాయశ్చిత్తమును

సులభముగా చూపించినాడు. కష్టపడవలసిన పనిలేకుండా పాపముతోనే పాపము దూరమగునని ఈ క్రైస్తవుల బైబిలునందుండుట మిక్కిలి అద్భుతమైన విషయము కదా! ఎట్లనగా మొదట పాపము చేసెను. రెండవసారి దాని నివారణకై జీవులను హింసించెను, ఇట్లు యథేష్టముగ తినుటకు మాంసము లభించెను. పాపము కూడా తొలగిపోయెను. అబ్బా! పావురపు పిల్ల మెడ విరిచివేయుట వలన అది ఎంత సమయము విలవిల తన్నుకొన్నదో గదా! అది చూచైనా క్రైస్తవులకు దయరాలేదా? దయ ఎట్లు వచ్చును? వీరి దేవుడే హింస చేయుట కుపదేశించుచున్నాడు. ఇక పాపములన్నియు ఇట్టి పాపపు ప్రాయశ్చిత్తముల వలననే తొలగుచున్నచో ఏసును విశ్వసించితేనే పాపపరిహారమగు నను ఈ ఆడంబరమెందులకు? ॥ 54 ॥

55. దహన బలి పశు చర్మము అతనిది. పొయ్యిమీద వండిన, ప్రతి నైవేద్యము కుండలోనేగాని, పెనము మీదనే గాని కాల్చినది యావత్తును దానిని అర్పించిన యాజకునిది.అది అతని దగును. ॥ లేవీయకాండము. 7 : 8,9 ॥

సమీక్ష:– నే నీ దేశములో దేవీదేవతల పేర్లమీద జరుగు శక్తిపూజలను, మందిరములలో జరుగు పూజారుల లీలలను, మోసములను టక్కుటమారములను గూర్చి తెలిసికొనియుంటిని. కాని క్రైస్తవుల దేవుడు, వారి పూజారుల ప్రబోధకుల లీలలు అంతకంటె వేయిరెట్లు మించి యున్నవి. ఏలయన దేవుని పేర తినుటకు భోజన పదార్థములు చిక్కునపుడు క్రైస్తవులు బాగుగా ఆనందించియే యుందురు. ఇప్పుడు కూడా ఆనందించుచుండవచ్చును. ఔరా! ఏ మనుష్యుడైన ఒక బాలుని చంపించి మరియొక బాలునికి వాని మాంసమును తినిపించునా? ఇటు లెన్నడైనను జరుగునా? అట్లే ఈశ్వరునికి మనుష్యులందరును, పశుపక్ష్యాదులగు జీవులన్నియు పుత్రతుల్యము. కాబట్టి పరమేశ్వరు డిట్లెన్నడును చేయబూనడు. కావున ఈ బైబిలు ఈశ్వరకృతము కాని, అందు వ్రాయబడినవాడు ఈశ్వరుడు గాని, దానిని నమ్మువారు ధర్మజ్ఞులు గాని ఎన్నటికిని కాజాలరు. ఈ బైబిలు పుస్తకములో ఇట్టి పాపపు మాటలెన్నియో నిండియున్నవి. ఎంతవరకని వివరింపవలెను? ॥ 55 ॥

సంఖ్యాకాండము

56. యెహోవా దూత ఖడ్గము దూసి చేతపట్టుకొని త్రోవలో నిలిచియుండుట ఆ గాడిద చూచెను. గనుక అది త్రోవను విడిచి పొలములోనికి పోయెను. బిలాము గాడిదను దారికి మలుపవలెనని దానిని కొట్టెను. అప్పుడు యెహోవా ఆ గాడిదకు వాక్కునిచ్చెను. కనుక అది నీవు నన్ను ముమ్మారు కొట్టితివి. నేను నిన్నేమి చేసితినని బిలాముతో అనెను.

॥ సంఖ్యా : 22 : 23, 28 ॥

సమీక్ష:– పూర్వము గాడిదలు కూడ దేవదూతలను చూచుచుండెను. కాని ఇప్పుడో బిషప్, ఫాదరీ మున్నగు గొప్పవారలకు, సామాన్యులకు ఆ దేవుడు గాని, అతని దూతలు గాని కనబడుట లేదు. ఏమో ఇప్పుడా దేవుడు, అతని దూతలు ఉన్నారో? లేరో? ఉన్నట్లైతే గాఢనిద్రలో ఉన్నారా?

రోగగ్రస్తులై ఉన్నారా? లేక వేరే భూగోళమునకు వెళ్లిపోయారా? లేక మరియొక వ్యవహారమున ప్రవేశించినారా? లేక ఇప్పుడు క్రైస్తవులమీద అలిగిపోయిరా? లేక చనిపోయినారా? అయ్యో! ఏమైపోయిరో కదా! తెలియకున్నది? ఇప్పుడు వారు కనబడుటలేదు. కావున అప్పుడును లేకుండవచ్చును అని అనుమానింపవలసివచ్చును. కావున ఇవన్నియు వట్టి కల్పనలే - గప్పాలే అని తెలిసికొనుడు. ॥ 56 ॥

57. మీరు పిల్లలలో ప్రతి మగవానిని, పురుషసంయోగము నెరిగిన ప్రతి స్త్రీని చంపుడి. పురుషసంయోగము ఎరుగని ప్రతి ఆడపిల్లను మీ నిమిత్తము బ్రతుకనీయండి.

॥ సంఖ్యా : 31 : 17, 18 ॥

సమీక్ష:- ఆహా! పైగంబరుడగు మోషేయు, మీ దేవుడగు యెహోవా ధన్యులు! స్త్రీలను, బాలురను, వృద్ధులను పశుపక్ష్యాదులను కూడ చంపిరి గదా! ఇక మోషే వ్యభిచారని దీనితో స్పష్టమైనది. వ్యభిచారి కాకున్నచో అక్షతయోని కన్యలను అనగా పురుషసంగమ మెరుగని కన్యలను తన దగ్గరకు ఎందుకు రప్పించుకుంటాడు? ఇటువంటి దయారహితమైన ఆజ్ఞను ఎందుకిస్తాడు? ॥ 57 ॥

సమూయేలు రెండవ పుస్తకము

58. ఇయితే ఆ రాత్రి యెహోవా వాక్కు సైతానునకు ప్రత్యక్షమై సెలవిచ్చిన దేమనగా "నీవు పోయి నా సేవకుడగు దావీదుతో నిట్లనుము. యెహోవా నీకాజ్ఞ ఇచ్చునదేమనగా - నాకు నివాసముగా ఒక మందిరమును కట్టించుటకు నీవు తగినవాడవా? ఐగుప్తులలో నుండి నేను ఇశ్రాయేలీయులను రప్పించిన నాటినుండి నేటివరకు మందిరములో నివసింపక డేరాలోను, గుడారములోను నివసించుచు సంచరించితిని.

॥ సమూ. రెండవ పు. అ. 7 : 4,5,6 ॥

సమీక్ష:- ఇప్పుడు క్రైస్తవుల దేవుడు మనుష్యుని వలె దేహధారియే యని స్పష్టమైనది గదా! చూడుడు! "నేను చాలా పరిశ్రమ చేసితిని. అక్కడ కూడ తిరిగితిని. ఇప్పుడు దావీదు ఇల్లు కట్టించినచో అందు విశ్రాంతిని పొందుదును" అని దూషణగా దబాయించుచున్నాడు. ఈలాంటి దేవున్ని ఇట్టి పుస్తకమును విశ్వసించటానికి ఈ క్రైస్తవులకు సిగ్గనిపించటం లేదా? పాపము వారేమి చేయగలరు? అజ్ఞానపు వలలో చిక్కిపోయిరి కద! ఇందులోనుండి తప్పించుకొనుటకు పెద్ద ప్రయత్నమే చేయవలెను. ॥ 58 ॥

రాజుల పుస్తకము

59. మరియు బబులోను రాజైన నెబుకద్నేజరు ఏలుబడిలో పందొమ్మిదవ సంవత్సరమందు ఐదవ నెల ఏడవదినమున రాజదేహ సంరక్షకులకు అధిపతియును, బబులోను రాజు

సేవకుడును అగు నెబూజరుద్దాను యెరూషలేముకు వచ్చి యెహోవా మందిరమును, రాజనగరును, యెరూషలేమునందున్న యిండ్లన్నిటిని, గొప్పవారి యిండ్లన్నిటిని అగ్నిచేత కాల్పించెను. మరియు రాజదేహ సంరక్షకుల అధిపతి యొద్ద నున్న కల్దీయుల సైనికులందరును యెరూషలేము చుట్టునున్న ప్రాకారములను పడగొట్టిరి.

॥ తౌ. రాజు పు.2 అ : 25 : 8,9,10 ॥

సమీక్ష:- చేయునదేమి? క్రైస్తవుల దేవుడు తన సుఖము కొరకే కద దావీదులచేత ఇల్లు కట్టించుకొని అందు విశ్రాంతి పొందుచుండగా నేబూజరు నుద్దాననువాడే ఆ దేవుని ఇంటిని పడగొట్టి పాడుచేసెను. అప్పుడు యెహోవా గాని అతని దూతల సైన్యము కాని ఏమియు చేయజాలలేకపోయిరి. మొదట వీరి దేవుడు గొప్ప యుద్ధములను చేయుచు విజయములను పొందుచుండెను. కాని ఇప్పుడు తన ఇంటిని కాల్చి పడగొట్టినను ఎందులకో ఊరక కూర్చున్నాడు. అతని దూత లెక్కడికి పారిపోయిరో గదా? ఇట్టి సమయమున ఎవ్వడును అక్కరకు రాకపోయెనే! ఇక యెహోవా పరాక్రమము సైతం ఎక్కడికి పారిపోయెనో తెలియదు. ఒకవేళ ఈ సంఘటన జరిగినది నిజమైనచో మొదట వ్రాయబడిన విజయపు సంగతులన్నియు వట్టివే యనుట నిజము. ఏమి? ఐగుప్తులలో బాలబాలికలను చంపుటకే వీరుడై యుండెనా? ఇప్పుడు వీరుల ఎదుట ఎందుకు మౌనముద్ర ధరించినాడు? అయ్యో ఇట్టి క్రైస్తవుల దేవుడు నిందితుడై తనకు తానే అగౌరవములను కలుగచేసికొనెను గదా! ఈ పుస్తకమునందు ఇలాంటి నిందాస్పదములగు వేలకొలది కథలు నిండియున్నవి. ॥ 59 ॥

జబూరు రెండవ భాగము

దిన వృత్తాంతముల మొదటి పుస్తకము

60. కావున యెహోవా ఇశ్రాయేలీయుల మీదికి తెగులు పంపగా ఇశ్రాయేలీయులలో డెబ్బదివేలమంది చచ్చిరి. ॥ దిన వృత్తాంతము 21 : 14 ॥

సమీక్ష:- ఇప్పుడీ ఇశ్రాయేలీయు లను క్రైస్తవుల దేవుని లీలలను చూడండి! ఏ ఇశ్రాయేలీయ కులమునకు పెక్కు వరములను ఇచ్చియుండెనో ఎవరిని పాలించుటకు అహర్నిశలు ప్రయత్నించుచుండెనో అట్టి దేవుడు ఇప్పుడు అంతలోనే కోపించి తెగులు పంపి ఆ కులమందలి డెబ్బదివేల మందిని చంపించెను. ఈ వింత ఒక కవి వ్రాసినదానికి సరిపోయినట్లే యున్నది.

క్షణే రుష్టః క్షణే తుష్టః రుష్టస్తుష్టః క్షణే క్షణే ।
అవ్యవస్థితచిత్తస్య ప్రసాదోఽపి భయంకరః ॥ సు.ర. భాండాగారము. ప్రక. 3. శ్లో. 139 ॥

ఒకడు ఒక క్షణములో ప్రసన్నుడు మరొక క్షణములో అప్రసన్నుడగునేని అతని ప్రసన్నతయు అంత భయదాయక మగునట్లే ఈ క్రైస్తవుల దేవుని మనస్తత్వమున్నది. ॥ 60 ॥

యోబు గ్రంథము

61. దేవదూతలు యెహోవా సన్నిధిని నిలుచుటకై వచ్చిన మరియొక దినము తటస్థింపగా వారితో కూడ అపవాది యెహోవా సన్నిధిని నిలుచుటకై వచ్చెను. యెహోవా "నీవు ఎక్కడ నుండి వచ్చితి"వని వాని నడుగగా అపవాది - "భూమిలో ఇటు అటు తిరుగులాడుచు అందులో సంచరించుచు వచ్చితి" నని యెహోవాకు ప్రత్యుత్తరమిచ్చెను. అందులకు యెహోవా నీవు నా సేవకుడైన యోబు సంగతి నాలోచించితివా? అతడు యథార్థవర్తనుడును, న్యాయవంతుడునై దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనము విసర్జించినవాడు. భూమి మీద అతనివంటివాడెవడును లేడు. నిష్కారణముగా అతనిని పాడుచేయుటకు నీవు నన్ను ప్రేరేపించినను అతడు ఇంకను తన యథార్థతను వదలక నిలకడగా నున్నాడనగా అపవాది చర్మమును కాపాడుకొనుటకై చర్మమును, తన ప్రాణమును కాపాడుకొనుటకై తనకు కలిగినది యావత్తును నరుడిచ్చును గదా. ఇంకొకసారి నీవు చేయి చాపి అతని ఎముకను, అతని దేహమును మొత్తిన ఎడల అతడు నీ ముఖము ఎదుటనే దూషించి నిన్ను విడిచిపోవును. అందులకు యెహోవా అతడు నీ వశమున నున్నాడు. అతని ప్రాణమును మాత్రము నీవు ముట్టవద్దని సెలవిచ్చెను. కాబట్టి అపవాది యెహోవా సన్నిధినుండి బైలువెడలి అతికాలు మొదలుకొని నడి నెత్తి వరకు బాధగల కురుపులతో యోబును మొత్తెను. ॥ జబూరు : యోబు : 2 : 1–7 వరకు ॥

సమీక్ష:- ఇప్పుడు క్రైస్తవుల యొక్క దేవుని సామర్థ్యమును చూడుడు! సైతాను తన ఎదుటనే తన భక్తులను దుఃఖపెట్టుచుండగా తాను సైతానును శిక్షించి తన భక్తులను రక్షింపలేకపోయెను. మరి దూతలలో సైతానును ఎదురించునంతటి సమర్థుడు లేడు. ఈ యొక్క సైతానే అందరను భయభీతులను చేసివేసినది. ఇక క్రైస్తవుల దేవుడు సర్వజ్ఞుడైన యోబు పరీక్ష సైతానుచే ఏల చేయించియుండును? ॥ 61 ॥

ప్రసంగి ఉపదేశ పుస్తకము

62. జ్ఞానమును విద్యను నేను పూర్ణముగా అభ్యసించితిననియు నా మనస్సులో నేననుకొంటిని. నా మనస్సు నిలిపి జ్ఞానాభ్యాసమును, వెఱ్ఱితనమును, మతిహీనతను తెలిసికొనుటకు ప్రయత్నించితిని. అయితే ఇదియు గాలికి ప్రయాసపడుటయే అని తెలిసికొంటిని. విస్తారమైన జ్ఞానాభ్యాసము చేత విస్తారమైన దుఃఖము కలుగును. అధికవిద్య సంపాదించినవానికి అధిక శోకము కలుగును.

॥ జబూ. ప్ర.సం. అ.1 : 16 నుండి 18 వరకు ॥

సమీక్ష:- గమనించితిరా! 'బుద్ధి, జ్ఞానము' అను పర్యాయవాచకపదములను వేర్వేరుగ ఎట్లు నమ్ముచున్నారు? ఇక బుద్ధి వృద్ధినొందినచో శోకము, దుఃఖముకలుగునని మూర్ఖులు గాక మరి

యెవరు వ్రాయగలుగుదురు? కావున ఈ బైబిలు ఈశ్వరకృత మనుటెట్లు? ఇదొక విద్వాంసునిచే వ్రాయబడినది కూడ కాదు. ॥ 62 ॥

ఇట్లు సంక్షిప్తముగ తౌరేతు జబూరులలోని విషయములు వ్రాయబడినవి. ఇకముందు క్రైస్తవులు మిక్కిలి ప్రమాణముగా నెంచెడి మత్తయి రచితాది సువార్తలలోని విషయములు వ్రాయబడును. 'సువార్త' అనున దెట్టిదో కొంత పరీక్షగా వ్రాయుచున్నాము. గమనింపుడు!

మత్తయి సువార్త

63. యేసుక్రీస్తు జననవిధ మెట్లనగా, ఆయన తల్లియైన మరియ, యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాకమునుపు ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను. ప్రభువు దూత స్వప్నమందతనికి ప్రత్యక్షమై దావీదుకుమారుడవైన యోసేపూ! నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము. ఆమె గర్భము ధరించినది. పరిశుద్ధాత్మ వలన కలిగినది. ॥ మత్త. 1 : 18–20 వరకు ॥

సమీక్ష:– ప్రత్యక్షాది ప్రమాణములకు, సృష్టిక్రమమునకు విరుద్ధమగుటవలన ఈ మాటలను ఏ విద్వాంసుడూ నమ్మడు. ఇటువంటి అజ్ఞానపు మాటలను మూర్ఖజనులు, అవివేకులు నిజమని నమ్ముదురే కాని జ్ఞానులైన విద్వాంసులు ఎన్నటికీ నమ్మజాలరు. ఈశ్వరుని నియమమును ఎవరైనా దాటగలుగుదురా? పరమేశ్వరుడే తన నియమమును అతిక్రమించినచో ఆతని ఆజ్ఞను యెవరూ పాలింపరు. ఇక అతడు సర్వజ్ఞుడు, నిర్భ్రాంతుడైనందున గర్భమును దాల్చిన కన్యలందరు ఆ సర్వేశ్వరుని వలననే గర్భిణులగుచున్నారని సర్వసాధారణ జనులు చెప్పవచ్చును. అట్లే పరమేశ్వరుని దూత నాతో "స్వప్నమందు ఈ గర్భ మీశ్వరునివలన నిలిచి"నట్లు చెప్పినాడని ఒకడు అబద్ధము చెప్పినా చెప్పవచ్చును. ఈ అసంభవమైన వార్త కల్పింపబడినట్లే సూర్యుని వలన కుంతి గర్భవతి అయ్యెనని పురాణములందు వ్రాయబడినదియును అసంభవమే. ఈలాంటి మాటలను వివేకములేని బుద్ధిహీనులు నిజమని నమ్మి భ్రమజాలమున చిక్కుకొందురు. ఇక ఈ సంగతి ఇట్లే జరిగియుండాలి. ఎట్లనగా ఒకానొక పురుషునితో మరియ సమాగమమగుట వలన గర్భవతియైనది. కాని ఆమెయో లేక మరొకడో 'ఈ గర్భము ఈశ్వరుని వలన నిలిచిన' దను అసంభవ వార్తను ప్రచారం చేయించి యుండవచ్చునని స్పష్టమగుచున్నది. ॥ 63 ॥

64. అప్పుడు ఏసు సైతానుచేత శోధింపబడుటకు ఆత్మ వలన అరణ్యమునకు కొనిపోబడెను. నలుబది దినములు దివారాత్రులు ఉపవాసముండిన పిమ్మట ఆయన ఆకలిగొనగా ఆ శోధకుడు ఆయన వద్దకు వచ్చి నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్లు రొట్టెలగునట్లు ఆజ్ఞాపింపుమనెను. ॥ మత్త :4:1–2–3 ॥

సమీక్ష:– ఈ క్రైస్తవుల దేవుడు సర్వజ్ఞుడు కాదని దీనివలన స్పష్టముగ సిద్ధమగుచున్నది. ఏలయన సర్వజ్ఞుడే యైన అతనిని పరీక్షించుటకు సైతాను నెందులకు పంపియుండును? స్వయముగనే

తెలిసికొనియుండును. మంచిది. ఇప్పుడొక క్రైస్తవుని నలుబది దినములు నిరాహారముగ ఉంచినచో అతడు బ్రతుకగలడా? అతడు ఈశ్వర కుమారుడు కాదని, సిద్ధిని పొందినవాడు కూడా కాదని దీనివలన సిద్ధమైనది. లేనిచో ఆ సైతాను ఎదుట రాళ్లను రొట్టెలుగా ఏల చేయకుండును? తానాకలితో ఎందుకుండును? కావున పరమేశ్వరుడు చేసిన రాళ్లను రొట్టెలుగా ఎవడు కూడా చేయజాలడనుటయే సిద్ధాంతము. ఈశ్వరుడు కూడా తాను ఏర్పరచిన సృష్టి నియమములను అతిక్రమింపజాలడు. ఏలయన అతడు సర్వజ్ఞుడు. అతని పనులలో తప్పులు గాని, మఱపులు గాని ఉండవు. ॥64॥

65. ఆయన 'నా వెంబడి రండి. నేను మనుష్యులను పట్టుజాలరులనుగా చేయుదు'నని వారితో చెప్పిన వెంటనే, వారు తమ వలలను విడిచిపెట్టి ఆయనను వెంబడించిరి.

॥ మత్త 4 : 19,20,21 ॥

సమీక్ష:- తౌరేతులో వ్రాయబడిన పది ఆజ్ఞలలో ఒకటగు "బిడ్డలు తల్లిదండ్రులకు సేవయు, మన్ననయు తమ ఆయుర్వృద్ధి నిమిత్తము చేయవలెను". (20. ఆ. 12) దీనిని పాలింపలేదనియే విదితమగుచున్నది. ఏలయన ఏసు తన తల్లిదండ్రులకు సేవ చేయలేదు. ఇతరులను సైతం తమ తల్లిదండ్రుల సేవలో నుండి విడదీసెను. ఈ అపరాధమను పాపము చేసినందులకే కద అతడు చిరంజీవుడు కాలేదు. ఇక వలలో చేపలను చిక్కించుకొనునట్లు ఏసు మనుష్యులను స్వమతమున చిక్కించుకొని తన ప్రయోజనమును సాధింపవలెనను ఉద్దేశంతో ఒక మతమేర్పరచె నని గూడ స్పష్టమైనది. ఏసే ఇట్లుండినపుడు ఇప్పటి ఫాదరీలు తమ వలలో మనుష్యులను చిక్కించుకొనుట ఒక ఆశ్చర్యమా! పెద్ద పెద్ద చేపలను పెక్కు వలలలో చిక్కించుకొనువాడు అధిక ప్రతిష్ఠావంతుడును, జీవనము గడుపగలవాడును అగునట్లే అనేకులను తమ మతములో చిక్కించుకొనువారు అధిక ప్రతిష్ఠావంతులును, జీవనము గడుపగలుగువారు నగుదురు. కావుననే కద వీరు వేదశాస్త్రములను చదువని - వినని - అమాయక జనులను మోసపుచ్చి తమ వలలో చిక్కించుకొనుచు వారిని తల్లి, తండ్రి, బాంధవులు మున్నగువారినుండి వేరుపరచుచున్నారు. కాబట్టి వీరి భ్రమజాలములో చిక్కక అమాయకులైన ఇతర సోదరులను వీరినుండి తప్పించుటయే విద్వాంసులగు ఆర్యుల కర్తవ్యము. ॥65॥

66. ఏసు వారి సమాజమందిరములలో బోధించుచు (దేవుని) రాజ్యమును గూర్చిన సువార్తను ప్రకటించుచు ప్రజలలోని ప్రతి వ్యాధిని, రోగమును స్వస్థపరచుచు గలిలయయందంతట సంచరించెను. నానావిధములయిన రోగములచేతను, వేదనల చేతను పీడింపబడిన వ్యాధిగ్రస్తుల నందరను, దయ్యము పట్టినవారిని, చాంద్రరోగులను, పక్షవాయువు గలవారిని వారాయనయొద్దకు తీసికొనిరాగా ఆయన వారిని స్వస్థతపరచెను.

॥ మత్త. 4 : 23-24 ॥

సమీక్ష:- పౌరాణిక పోపు లీలలను, టక్కులను పన్ని మంత్ర పురశ్చరణమును, ఆశీర్వాదములను గావించుచు చిటికెడు భస్మమును ఇచ్చి భూతములను పారద్రోలుదురనుట గాని, రోగములను

మాన్పగలుగుదురనుట గాని నిజమైనచో ఈ సువార్తయందలి మాటలు కూడా నిజము కావచ్చును. కాబట్టి ఇవి అమాయకులను భ్రమలో పడవేయు మాటలే. క్రైస్తవులు ఏసు మాటలను నమ్ముచున్నట్లే ఇచ్చటి దేవీదేవతల శక్తి పూజకుల మాటలను గూడ ఎందులకు నమ్మరు? ఏలయన పౌరాణికుల మాటలు వీరి మాటలవలెనే యున్నవి. ॥ 66 ॥

67. ఆత్మ విషయమై దీనులైనవారు ధన్యులు. పరలోకరాజ్యము వారిది. ఆకాశమును, భూమియు గతించిపోయిననే గాని ధర్మశాస్త్రమంతయు నెరవేరువరకు దానినుండి యొక పొల్లయినను, ఒక సున్నయైనను తప్పిపోదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. కాబట్టి ఈ ఆజ్ఞలలో మిగుల అల్పమైన ఒకదానినైనను మీరి మనుష్యులకు ఆలాగున చేయ బోధించువాడెవడో వాడు పరలోకరాజ్యములో మిక్కిలి అల్పుడనబడును.

॥ మత్త. 5 : 3 – 18 –19 ॥

సమీక్ష:– స్వర్గమొకటియే గద. దానికి రాజు కూడా ఒక్కడే ఉండును. కాబట్టి దీనులైనవారందరును స్వర్గమున కేగుదురన్న ఆ స్వర్గమందు రాజ్యాధికారమెవరి కబ్బును? అనగా ఒకరి కొకరు పోట్లాడుకొందురు. రాజ్యవ్యవస్థంతయు అస్తవ్యస్తమైపోవును. దరిద్రులగువారే దీనులనబడుదురన్నను సరికాదు. లేదా నిరభిమానులను దీనులందురన్న ఉపయోగము లేదు. ఏలయన దీన శబ్దమునకు అభిమానశబ్దమునకు అర్థమొకటి కాదు. ఇక మనస్సులో దీనుడగువానికి సంతోషమెన్నటికిని కలుగదు. కాబట్టి ఈ మాట ఉపయుక్తము కాదు. ఆకాశము, భూమియు నుండగలుగునప్పుడే ఈ వ్యవస్థయు నష్టమై పోవును. ఇటువంటి అశాశ్వతమైన ఏర్పాటు మనుష్యులు చేయుదురే కాని సర్వజ్ఞుడైన ఈశ్వరుడు కాదు. కాని ఈ ఆజ్ఞలను నమ్మనివాడు స్వర్గమున అందరికంటె అల్పుడనబడునని భయ ప్రలోభాలు గలిగించుటకు వ్రాయబడినదని తెలుసుకొనవలెను. ॥ 67 ॥

68. మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము.... భూమి మీద మీకొరకు ధనమును కూర్చుకొనవద్దు. ॥ మత్త. 6 : 11 – 19 ॥

సమీక్ష:– ఏసు జన్మించిన కాలములో ప్రజలు అనాగరికులుగను, దరిద్రులుగను ఉండిరని, ఏసు సైతం అట్లే దరిద్రుడుగ నుండెనని అందువలననే తాను దినాహార నిమిత్త మీశ్వరుని ప్రార్థించుచున్నట్లే అన్యులకు నేర్పెనని దీనివలన తెలియుచున్నది. అట్లైనచో ఇక ఈ క్రైస్తవులు ధనసంచయమేల చేయుచున్నారు? మరి వారు ఏసు వాక్యమునకు విరుద్ధముగ నడువక దానధర్మములు చేసి దీనులగుటయే మంచిది. ॥ 68 ॥

69. ప్రభువా! ప్రభువా! అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు.

॥ మత్త. 7 : 21 ॥

సమీక్ష:– ఇప్పుడు గమనింపుడు! పెద్ద పెద్ద ఫాదరీలును, భిషప్పులును క్రైస్తవులనువారు యేసు చెప్పిన యీ మాట సత్యమేయని నమ్ముదురేని ఏసును 'ప్రభువు' – 'ఈశ్వరుడు' అని ఎన్నటికిని

చెప్పగూడదు. మరి ఈ మాట నంగీకరింపరేని వారెప్పటికిని పాపమునుండి తొలగియుండజాలరు. ॥ 69 ॥

70. ఆ దినమందు అనేకులు నన్ను చూచి చెప్పుదురు. అప్పుడు "నేను మిమ్ములను ఎన్నడును ఎరుగను. అక్రమము చేయువారలారా! నాయొద్దనుండి పొండ"ని వారితో చెప్పుదును.

॥మత్త : 7 : 22,23 ॥

సమీక్ష:- చూడండి! ఏసు అడవి మనుష్యులను విశ్వసింపజేయుటకే కద స్వర్గమందు న్యాయాధీశు డగుటకు ఇష్టపడుచుండెను. ఇది కేవలము అమాయకులకు ప్రలోభము కలుగజేయు మాటయే. ॥70॥

71. అప్పుడొక కుష్ఠరోగి వచ్చి ఆయనకు మ్రొక్కి "ప్రభువా! నీ కిష్టమైతే నన్ను శుద్ధునిగా చేయగల"వనెను. అందులకాయన చెయ్యి చాపి వానిని ముట్టి నాకిష్టమే; నీవు శుద్ధుడవు కమ్మని చెప్పగా తక్షణమే వాని కుష్ఠరోగము శుద్ధియాయెను.

॥ బైబి. మత్తయి పర్వ 8 : 23 ॥

సమీక్ష:- ఇవి కేవలము అమాయకులను వశపరచుకొను మాటలే. మరి క్రైస్తవులు ఈ జ్ఞానవిరుద్ధములును, సృష్టిక్రమవిరుద్ధములునగు మాటలను సత్యములని నమ్ముచున్నపుడు శుక్రాచార్యుడు, ధన్వంతరి, కశ్యపుడు మున్నగువారు చనిపోయిన అనేకమంది దైత్యుల సైన్యమును బ్రతికించిరనియు, బృహస్పతి పుత్రుడగు కచుని నరికి ముక్కలుముక్కలుగా చేసి పశువులకును, చేపలకును తినబెట్టినను శుక్రాచార్యుడు వానిని మరల బ్రతికించెననియు, పిమ్మట కచుని చంపి శుక్రాచార్యునికి కల్లులో కలిపి త్రాగించగా కడుపులోనే అతనిని బ్రతికించి బయటికి రప్పించెననియు, తాను మృతిజెందగా కచుడతనిని తిరిగి బ్రతికించెననియు, కశ్యపఋషి తక్షకుని వలన మనుష్యసహితముగ భస్మమైపోయిన వృక్షమును, ఆ మనుష్యుని సజీవులుగా కావించెననియు, ధన్వంతరి లక్షలకొలది శవములను బ్రతికించెననియు, లక్షలకొలది కుష్ఠ మొదలగు రోగములను మాన్పెననియు, లక్షల కొలది గ్రుడ్డివాండ్రకు కన్నులను, చెవిటివాండ్రకు చెవులను ఇచ్చెననియు, పురాణము లందును, మహాభారతమునందును వ్రాసియున్నవి. ఇటువంటి కథలను మిథ్యయని యేల అనుచున్నారు? ఈ పురాణములలో చెప్పబడిన మాటలు అసత్యములన్నచో ఏసు మాటలేల అసత్యములు కాకుండును? ఇతరుల మాటలను అబద్ధములని తమ గప్పాలను సత్యములని చెప్పుట దౌర్జన్యము కాదా? కావున ఈ క్రైస్తవుల మాటలు కేవలము మూర్ఖత్వముతో కూడిన బాలుర మాటలవంటివే అని తెలుసుకొనవలెను. ॥ 71 ॥

72. దయ్యములు పట్టిన ఇద్దరు మనుష్యులు సమాధులలో నుండి బయలుదేరి ఆయనకు ఎదురుగా వచ్చిరి. వారు మిగుల ఉగ్రులైనందున ఎవడును ఆ మార్గమున వెళ్లలేకపోయెను. వారు ఇదిగో "ఓ దేవుని కుమారుడా! నీతో మాకేమి? కాలము రాకమునుపే మమ్మును

బాధించుటకు ఇక్కడికి వచ్చితివా?" అని కేకలు వేసిరి. వారికి దూరమున గొప్ప పందుల మంద మేయుచుండగా ఆ దయ్యములు "నీవు మమ్ము వెళ్లగొట్టిన ఎడల ఆ పందుల మందలోనికి పోనిమ్మ"ని ఆయనను వేడుకొనెను. ఆయన వానిని పొమ్మనగా అవి ఆ మనుష్యులను వదలిపెట్టి ఆ పందుల మందలలోనికి పోయెను. ఇదిగో ఆ మంద అంతయు ప్రపాతము నుండి సముద్రములోనికి వడిగా పరుగెత్తికొనిపోయి నీళ్ళలో పడి చచ్చెను.

॥ మత్త : 8 : 28,29,30,31,32,33 ॥

సమీక్ష:- ఇచ్చట కొంచెము ఆలోచించినచో మీ మాటలన్నియు అబద్ధములే యని తెలుసు. ఎట్లనగా మరణించినవాడు సమాధులలో నుండి లేచిరాడు. ఇతరులపై ఆవేశపడడు. ఇతరులతో సంవాదమును కూడా చేయడు. ఇవన్నీ విద్యావిహీనులచే కల్పింపబడిన మాటలు. వీటిని నిజమని మహామూర్ఖులైనవారే నమ్ముదురు. ఇక పందులను చంపించి ఆ పందులవాండ్రకు నష్టము కలిగించిన పాపము యేసునకు తగులవచ్చును గద. క్రైస్తవులు యేసును 'పాపవిమోచనుడు, పవిత్రపరచువాడు' అని నమ్ముచున్నారు. అటులైనచో ఆయన ఆ భూతములను ఎందులకు పవిత్రపరచలేకపోయెను? పందులవాండ్ర నష్టమును భరించలేదెందులకు? ఏమి? ఇప్పటి సుశిక్షితులైన క్రైస్తవులగు ఆంగ్లేయులు గూడ మీ గప్పాలను నిజమని నమ్ముచున్నారంటారా? నమ్ముచున్నారన్నచో వారు భ్రమజాలమున చిక్కియున్నారన్నది నిజము. ॥ 72 ॥

73. జనులు పక్షవాతముతో మంచము పట్టియున్న ఒకనిని ఆయన వద్దకు తీసుకొనివచ్చిరి. యేసు వారి విశ్వాసము చూచి కుమారుడా! ధైర్యముగా ఉండుము. నీ పాపములు క్షమింపబడి యున్నవని పక్షవాతము గలవానితో చెప్పెను. నేను నీతిమంతులను పిలువరాలేదు గాని పాపులను పశ్చాత్తాప నిమిత్తము పిలువవచ్చితిని.

॥ మత్త : 9 : 2, 13 ॥

సమీక్ష:- ఇది కూడా ఇంతకు ముందు వ్రాయబడినటువంటి అసంభవమైన మాటయే. ఇక పాపమును క్షమించుననెడి మాట కేవలం అమాయకులను ప్రలోభపరచి వలలో చిక్కించుకొనుటకే కల్పింపబడినది. ఎవడు మద్యమును, భంగును, నల్లమందును సేవించునో వాడే మత్తును పొందును. మరొకడు మత్తును పొందజాలడు. ఒకడు చేసిన పాపము మరియొకనికంటక చేసినవాడే ఆ పాపమనుభవించును. ఇదియే ఈశ్వరుని న్యాయము. ఒకడు చేసిన పాపపుణ్యములను మరొకడో లేక స్వయముగ న్యాయాధీశుడో పొందునన్నను లేదా చేసినవారలకు తగిన ఫలమీశ్వరు డీయకపోవునన్న అతడన్యాయకారియే యగును. ఇక మేలుచేయునది ధర్మమే కాని ఏసు కాదు. మరెవ్వడు కాడు. కావున ధర్మాత్ములకు కాని పాపాత్ములకు కాని ఏసు మున్నగువారి అవసర మేమియు లేదు. ఎందుకనగా పాపానుభవ మెవనికిని తప్పదు. ॥ 73 ॥

74. ఆయన తన పండ్రెండుమంది శిష్యులను పిలిచి అపవిత్రాత్మలను వెళ్ళగొట్టుటకును, ప్రతి విధమైన రోగమును, స్వస్థపరుచుటకును వారికి అధికారమిచ్చెను. మీ తండ్రి ఆత్మ మీలోనుండి మాట్లాడుచున్నాడే గాని మాటలాడువారు మీరు కారు. నేను భూమిమీదికి సమాధానమును పంప వచ్చితినని తలంచకుడి. ఖడ్గము నుపయోగింపచేయుటకు వచ్చితిని. ఒక మనుష్యునికిని వాని తండ్రికిని, కుమార్తెకును, ఆమె తల్లికిని, కోడలికిని, ఆమె అత్తకును విరోధము పెట్టవచ్చితిని. ఒక మనుష్యుని ఇంటిలోనివారే అతనికి శత్రువులగుదురు. ॥మత్త :10: 1,20,34,35,36 ॥

సమీక్ష:- ఈ పన్నెండుమంది శిష్యులలో ఒకడు ముప్పది రూపాయల ప్రలోభములో పడి ఏసును పట్టించుచుండగా తక్కినవారందరు తప్పించుకొని పారిపోయినవారే. దయ్యాలు పట్టుట, వానిని పారద్రోలుట, ఔషధపథ్యాదులు లేక రోగములను మాన్పుట అను ఈ మాటలు తర్కవిరుద్ధములేగాక సృష్టిక్రమానికి విరుద్ధములు అసంభవములునైయున్నవి. కావున ఇట్టి మాటలను అజ్ఞానులే నిజమని నమ్ముదురు. "జీవులు మాటలాడువారు కారు. ఈశ్వరుడే మాట్లాడుతూ పనిచేయుచున్నచో జీవులేల పని చేయుదురు? ఇక సత్యాసత్యములకు ఫలమగు సుఖమునో, దుఃఖమునో ఈశ్వరుడే అనుభవించవలసి వచ్చును." ఇది కూడా సరియైనది కాదు. ఏసు జనులలో అభిప్రాయభేదమును, జగడమును కలుగజేయుటకు వచ్చినట్లున్నాడు. భేదమును, జగడమును కలిగించుట మంచిది కాదు. దానివలన మనుష్యులకు నిరంతర దుఃఖమే సంభవించును. క్రైస్తవులు మాత్రము దీనినే గురు మంత్రమని గ్రహించియుండవచ్చును. ఏలయన ఒండొరులలో భేదము కలిగించుటను ఏసే మంచిదనుకొనునపుడు వీరెందులకనుకొనరు? ఇంటివారితో నింటివారే శత్రువులగుట ఏసు చేసిన పనే కావచ్చును. ఏది ఏమైనా ఇది మనుష్యుడు చేసే పని మాత్రము కాదు. ॥ 74 ॥

75. ఏసు మీ వద్ద ఎన్ని రొట్టెలున్నవని వారి నడుగగా వారు – ఏడు రొట్టెలును, కొన్ని చిన్న చేపలును ఉన్నవని చెప్పిరి. అప్పుడాయన నేలమీద కూర్చుండుడని జనసమూహమును ఆజ్ఞాపించి ఆ ఏడు రొట్టెలను, ఆ చేపలను పట్టుకొని కృతజ్ఞతాస్తుతులను చెల్లించి వానిని విరిచి తన శిష్యులకిచ్చెను. శిష్యులు జనసమూహమునకు వడ్డించిరి. వారందరు తిని తృప్తిపొందినమీదట మిగిలిన ముక్కలు ఏడు గంపల నిండ ఎత్తిరి – స్త్రీలును, పిల్లలును గాక తినినవారు నాల్గువేలమంది పురుషులు.
॥ మత్త : 15 : 34, 35, 36, 37, 38 ॥

సమీక్ష:- ఇప్పుడు గమనింపుడు! ఏమి? ఇది ఇప్పటి అబద్ధపు సిద్ధులు, ఇంద్రజాలికులు మున్నగువారల మోసకృత్యముల వంటివి కాదా? ఆ రొట్టెలో నుండి అనేకమైన రొట్టె లెక్కడ నుండి వచ్చెను? ఏసులో ఇట్టి సిద్ధులుండెనన్నను తాను ఆకలిగొన్నప్పుడు మేడిపండ్లను తినుట కేల వెదకుచుండెను? మట్టి, నీరు, రాళ్ళు మొదలగువానితో మోహనభోగునో, రొట్టెలనో తన కొరకు

చేసికొనలేదెందులకు? ఈ మాటలన్నియు చిన్నపిల్లల మాటలవలె నున్నవి. ఎందరో సాధువులు, బైరాగులు ఇట్టి మోసపుకృత్యములచేత అమాయకులను ఎట్లు మోసపుచ్చుచుందురో యివియు నటువంటివే. ॥ 75 ॥

76. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును. ॥ మత్త :16 : 27 ॥

సమీక్ష:- కర్మానుసారముగా ఫలమియ్యబడుననుట నిజము. ఇక క్రైస్తవులు పాపము క్షమింపబడు నని బోధించుట వ్యర్థము. అదియే సత్యమైనచో ఇది మిథ్య యగును. ఎవరేని, క్షమింపబడదగినవారే క్షమింపబడుదురనియు, క్షమింపబడదగనివారు క్షమింపబడరనియు నన్నది కూడ సరికాదు. కర్మలన్నింటికి తగిన ఫలము నిచ్చుటయే న్యాయము. అదియే 'పూర్ణ దయ' అగును. ॥ 76 ॥

77. విశ్వాసములేని మూర్ఖతరమువాలరాలా! మీకు ఆవగింజంత విశ్వాసముండిన ఎడల ఈ కొండను చూచి ఇక్కడి నుండి అక్కడికి పొమ్మనగా అది పోవును. మీకు అసాధ్యమైనది ఏదియు ఉండదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనెను.

॥ మత్త : 17 :17 - 21 ॥

సమీక్ష:- ఇప్పుడు క్రైస్తవులు - "మా మతమున ప్రవేశింపుడు. పాపపరిహారము పొందుడు. ముక్తులు కండు" అని ఇతరులకు బోధించుచుండున దంతయు మిథ్యయే యని తేటపడినది. ఎందుకనగా ఏసులో పాపములను తొలగించునట్టి, విశ్వాసమును దృఢపరచునట్టి, పరిశుద్ధులను గావించునట్టి సామర్థ్యమే యుండినచో తన శిష్యుల ఆత్మలను పాపరహితములు గాను, విశ్వాసార్హములుగాను, పరిశుద్ధముగాను ఎందుకు చేయకుండును? ఏసు తన వెంట తిరుగుచుండినవారినే పరిశుద్ధులుగను, విశ్వాసార్హులుగను, కళ్యాణయుక్తులుగను చేయలేకపోయినాడు. మరి మరణించిన పిదప ఏమి చేయగలడు? అతడెక్కడ నుండునది తెలియనిదే ఏమి చేయగలడు? ఇంతవరకు ఏ ఒక్కడిని కూడా పవిత్రునిగ చేయలేడు. ఆవగింజంత విశ్వాసము లేని ఏసుశిష్యులచే రచియింపబడిన ఈ సువార్తల పుస్తకము ప్రమాణయోగ్యము కాజాలదు. ఏమనగా విశ్వాసము లేనివారు, అపవిత్రులు, అధర్మపరులు నగు మనుష్యులచే వ్రాయబడిన లేఖలను శుభము గోరువారు విశ్వసింపవలసిన అవసరము లేదు. ఇక ఈ ఏసువాక్యము సత్యమైనచో ఏ క్రైస్తవునియందును ఒక్క ఆవగింజంత విశ్వాసము, సత్యము లేదనియు సిద్ధమగును. ఎవరేని మాయందు కొంచెమో, గొప్పయో మహిమలున్నయందురేని వారితో మీ రీ పర్వతమును ఈ మార్గములో నుండి తొలగింపుడని అనవలెను. వారిచే అది తొలగింపబడిన మీయందు పూర్ణ విశ్వాసము గలదనియు, తొలగింపబడకపోయిన ఒక బిందుమాత్రము విశ్వాసము, సత్యము మీ క్రైస్తవులయందు లేదనియు ఎరుగదగును. కొందరిట అభిమానాది దోషములను పర్వతనామముతో ఉదహరించినారనవచ్చు గాని అందువలన ఉపయోగము లేదు. మృతులను, గ్రుడ్డివారిని, కుష్ఠరోగులను, భూతగ్రస్తులను బాగుపరచినాడనునది సయితము ఆలసులకో, అజ్ఞానులకో, కాముకులకో, భ్రాంతియుక్తులకో నేర్పించి సజీవులుగాను, స్వస్థచిత్తులుగాను చేసి చూపవచ్చును. కాని ఇదియును నిజమని తోచదు. ఏలయన

స్వశిష్యుల నిట్లెందులకు జేయలేకుండును? కావున ఈ అసంభవమైన వార్త ఏసు అవివేకమును ప్రకటింపజేయుచున్నది. మంచిది, ఏసు కొంచెమైన విద్య కలిగియున్నచో ఇట్టి తెలివితప్పిన మాటలనెందులకు చెప్పియుండును? **"నిరస్తపాదపే దేశే ఏరండోఽపి ద్రుమాయతే"** చెట్టులేని దేశమందు ఆముదపు చెట్టే శ్రేష్ఠమైనదిగా గణింపబడుచున్నట్లు గొప్ప మొరటులును, విద్యావిహీనులును గల దేశమున యేసు కూడ ఒక శ్రేష్ఠుడుగా గణింపబడెనని చెప్పవలెను. కాని ఇప్పుడు యేసు ఏ తరగతిలో గణింపబడును? ॥ 77 ॥

78. మీరు మార్పునొంది బిడ్డలవంటివారైతేనే గాని పరలోకరాజ్యములో ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. ॥ మత్త : 18 : 3 ॥

సమీక్ష:- స్వేచ్ఛగా మనస్సును త్రిప్పుకొనుట స్వర్గమునకు కారణమనియు, మనస్సును త్రిప్పుకొనకపోవుట నరకమునకు కారణమనియు చెప్పబడినపుడు ఒకని పుణ్యపాపములను మరియొకడు తీసికొనజాలడని ఏర్పడుచున్నది. ఏసు వాక్యములు బాలకుల మాటలవంటివైనందున అవి విద్యకు, సృష్టిక్రమమునకు చాలా విపరీతమైయున్నవని, లోకు లతని మాటలను విని బాలకులవలె వారేమియు నడుగక కన్నులు మూసికొని ఒప్పుకోవలె ననే ధోరణి అతని మనస్సులో నుండెనని తెలియుచున్నది. క్రైస్తవుల అనేక చేష్టలు బాల్యబుద్ధితో కూడినవే అనవచ్చును. లేనిచో ఈ విద్యావిరుద్ధము, యుక్తిశూన్యము నగు మాటల నేల అంగీకరింతురు? ఏసు తాను విద్యాహీనుడును, బాల్యబుద్ధిగలవాడును గాకున్న అన్యులను బాలురుగా జేయుట కేల బోధించియుండును? అదేమనగా ఎవడెట్లుండునో వాడితరులను సయితము తన వలెనే చేయగోరును. ॥ 78 ॥

79. ధనవంతుడు పరలోక రాజ్యము ప్రవేశించుటలో దుర్లభమని నిశ్చయముగా కఠినము. మీతో చెప్పుచున్నాను. ఇది గాక ధనవంతుడు పరలోకరాజ్యములో ప్రవేశించుట కంటె సూది బెజ్జములో ఒంటె దూరుట సులభమని మీతో చెప్పుచున్నాననెను.

॥ మత్త : 19 : 23,24 ॥

సమీక్ష:- ఏసు దరిద్రుడుగ ఉండెననియు, ధనవంతులు అతనిని గౌరవింపకపోవచ్చుననియు, అందులకే ఇట్లు వ్రాసియుండవచ్చుననియు దీనివలన తెలియుచున్నది. కాని ఇది సత్యము కాదు. ఏలయన ధనికులలోను, దరిద్రులలోను మంచివారును, చెడ్డవారును ఉందురు. మంచికర్మ చేయువాడు మంచి ఫలమును, చెడుకర్మ చేయువాడు చెడుఫలమును పొందుచున్నాడు. ఈశ్వరుని రాజ్యము సర్వత్ర గాక ఏదో యొక దేశమున ఉన్నదని ఏసు నమ్ముచుండెనని గూడ దీనివలన స్పష్టమైనది. అట్లైనచో అటువంటివాడీశ్వరుడే కాడు. ఎవడీశ్వరుడో అతనిరాజ్యం అంతట గలదు. అతడొక చోట ప్రవేశింపగలడనికాని ప్రవేశింపజాలడని కాని చెప్పుట కేవలమవిద్యయే. ఇక క్రైస్తవులలోని ధనాఢ్యులందరు నరకమునకు, దరిద్రులందరు స్వర్గమునకును పోవుదురాయేమి? ధనాఢ్యుల వద్దనుండునంత సామగ్రి దరిద్రులవద్ద నుండదు. ధనికులు వివేకముతో ధర్మమార్గమున వ్యయపఱతురేని ఉత్తమ గతిని పొందగలుగుదురు. మఱి దరిద్రులు నీచగతినే పొందియుందురని యేసు కొంచెమైన ఆలోచింపవలసియుండెను. ॥ 79 ॥

80. యేసు వారితో నిట్లనెను- ప్రపంచ పునరుత్థానకాలమందు మనుష్యకుమారుడు తన మహిమగల సింహాసనం మీద ఆసీనుడైయుండునపుడు నన్ను వెంబడించిన మీరును పండ్రెండు సింహాసనముల మీద ఆసీనులై ఇశ్రాయేలుల పండ్రెండు గోత్రములవారికి తీర్పు చేయుదురు. నా నామము నిమిత్తము అన్నదమ్ముల నైనను, అక్కచెల్లెండ్రనైనను, తండ్రినైనను, తల్లినైనను, పిల్లలనైనను, భూములనైనను ఇండ్లనైనను విడిచిపెట్టిన ప్రతివాడును నూరురెట్లు పొందును. ఇదిగాక నిత్యజీవమును స్వతంత్రించుకొనును.

॥ మత్త :19:28-29 ॥

సమీక్ష:- ఇప్పుడు గమనింపుడు. లోకులు 'నా వలలో పడి నా వెనుక నడువకుందురుగాక' అని ఏసు తన మనస్సులో ఉండియున్నందులకే కద ముప్పదిరూపాయల లోభమునకు తన గురువును (ఏసును) పట్టించి చంపించినట్టి దుర్మార్గుడు సైతం ఇతని యొద్ద సింహాసనము మీద కూర్చుండుననియు, పక్షపాతముతో పరీక్షింపబడకయే ఇశ్రాయేలు కులమువారి పాపములన్నియు క్షమింపబడుననియు, అన్యకులమువారు పరీక్షింపబడుదురనియు చెప్పెను. ఇందువలననే కద క్రైస్తవులు తమ మతములపై పక్షపాతముతో - ఒక తెల్లవాడొక నల్లవానిని కొట్టినను బహుశః వానిని నిరపరాధిగా చేసి విడిచిపెట్టుచు ప్రవర్తింతురు.

ఇక ఏసు స్వర్గమందు ఇటువంటి న్యాయమే చేయవచ్చును. దీనివలన పెద్ద దోషము కలుగుచున్నది. అదేమనగా! ఒకడు సృష్ట్యారంభమందు చనిపోయెను. మరొకడు ప్రళయమునాటి రాత్రి చివరనచనిపోయెను. ఒకడు పరీక్ష ఎపుడగునా యని ఆదినుండి అంతము వరకు ఆశలోనే పడియుండెను. మరొకని పరీక్ష తక్షణమే జరిగెను. ఇదెంత గొప్ప అన్యాయము! ఇక నరకమునకు పోవువాడు అనంతకాలం నరక మనుభవించుననియు, స్వర్గమునకు పోవువాడు సదా సర్వసౌఖ్యము లనుభవించుననుటయు పెద్ద అన్యాయమే. ఎందుకన అంతము గల సాధనకర్మలకు అంతముగల ఫలమే అబ్బును. ఏ ఇద్దరిలోనూ పాపపుణ్యములు సమానముగా ఉండజాలవు. కావున తారతమ్యమును బట్టి న్యూనాధిక సుఖదుఃఖములు గల స్వర్గనరకము లెన్నియో యున్నప్పుడే కద అట్టి సుఖ దుఃఖముల ననుభవింపగలుగుదురు. అట్టి వ్యవస్థ క్రైస్తవుల పుస్తకమునందు లేనే లేదు. కావున ఈ పుస్తక మీశ్వరకృతము కాదు. ఏసు కూడ ఈశ్వరుని పుత్రుడు గాజాలదు. ఎవనికైనను నూర్గురు తల్లులో, నూర్గురు తండ్రులో ఉండరు. ఒక తల్లి ఒక తండ్రి మాత్రమే ఉండును. ముసల్మానులు ఒకనికి డెబ్బదిమంది స్త్రీలు స్వర్గమందు చిక్కుదురని దీని నుండియే గ్రహించియుందురని అనుమానము కలుగుచున్నది. ॥ 80 ॥

81. ఉదయమందు పట్టణమునకు మరల వెళ్లుచుండగా ఆయన ఆకలిగొనెను. అప్పుడు త్రోవ ప్రక్కన ఉన్న ఒక అంజూరపు చెట్టును చూచి దానివద్దకు రాగా దానియందు ఆకులుతప్ప మరేమియు కనబడలేదు. గనుక దానిని చూచి ఇకమీదట ఎన్నటికిని నీవు కాపు కాయకుందువు అని చెప్పెను. తక్షణమే ఆ అంజూరపు చెట్టు ఎండిపోయెను.

॥ మ. 21 : 18,19 ॥

సమీక్ష:– అతడు గొప్ప శాంత సమాన్వితుడై క్రోధాది దోషరహితుడుగ నుండెనని పాదరీలు, క్రైస్తవులందరును చెప్పుదురు కాని యీ మాటలను బట్టి చూడగా ఏసు క్రోధియు, ఋతుజ్ఞానము లేని వాడును, తెలివితప్పిన అనాగరికులవంటి ప్రవర్తనము కలవాడునై యుండెనని తేలుచున్నది. పోనిండు! వృక్షము జడపదార్థము కదా! ఎండిపోవునట్లు శపించుట కా వృక్షమేమి అపరాధము చేసియుండెను? అది అతని శాపమువలన ఎండిపోకుండవచ్చును గాని ఒకానొక ఔషధప్రయోగము వలన ఎండిపోయిన ఆశ్చర్యములేదు. ॥ 81 ॥

82. ఆ దినము శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును. చంద్రుడు తన కాంతిని ఇయ్యడు. ఆకాశము నుండి నక్షత్రములు రాలును. ఆకాశమందలి శక్తులు కదలింపబడును. ॥ మ.24 : 29॥

సమీక్ష:– భళిరా! ఏసూ! భళి! నక్షత్రములు ఆకాశము నుండి రాలిపడుననుట నీవు ఏ విద్యచే తెలిసికొంటివో! కదలిపడునను ఆకాశసైన్యమేది? అహా! ఏసు కొంత విద్యావంతుడేయైయున్న నక్షత్రము లన్నియు గోళములు. అవి ఎట్లు కదలిపడగలవు? అని తప్పక ఆలోచించియుండును! ఏసు వడ్రంగి కులమున పుట్టినందున ఎప్పుడును కట్టెలనే చీల్చుచు, చెక్కుచు, కోయుచు జోడించుచుండవచ్చును. కాని అతడా అనార్య దేశమున తానును పైగంబరు కావచ్చునను తలంపు కలుగగా ఇట్లు చెప్ప ప్రారంభించెనని తెలియుచున్నది. అతని నోటి నుండి ఎన్నియో మంచిమాటలు చెడ్డ మాటలును వెడలినవి. అచ్చటి జనులు తెలివిమాలినవారు గాన వాని నంగీకరించిరి. ఇప్పుడు ఐరోపాదేశమున్నతిలో నున్నట్లుగా పూర్వము కూడా ఉన్నతిలో నున్నచో ఇతని గొప్పతన మేమియు సాగకుండెడిది. ఇప్పుడు కొందరు విద్యావంతులైనను కొన్ని వ్యవహారపు చిక్కులవలన వారీ నిరర్థక మతమును విడువలేక సర్వథా సత్యమైన వేదమార్గమును గ్రహించుటకు, వచ్చుటకు రావడం లేదు. ఇదే వారిలో గల కొరత. ॥ 82 ॥

83. ఆకాశమును, భూమియు గతించును కాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు. ॥ మ : 24 : 35 ॥

సమీక్ష:– ఇది కూడా అవిద్యతో కూడిన తెలివితప్పిన మాటయే. ఔరా! ఆకాశము కదలి ఎక్కడికి పోగలదు? ఆకాశము అతి సూక్ష్మమైనందున కంటికే కానరానపుడు దాని కదలికను ఎవరు చూడగలుగుదురు? ఇక తన్ను తాను గొప్ప చేసికొనుట శ్రేష్ఠుల పని కాదు. ॥ 83 ॥

84. అప్పు డాయన తన ఎడమ వైపున ఉండువారిని చూచి "శపింపబడిన వారలారా! నన్ను విడిచి సైతానుకును, వాని దూతలకును సిద్ధపరుపబడిన నిత్యాగ్నిలోనికి పొండి" అనెను. ॥ మ:25:41 ॥

సమీక్ష:– తన శిష్యులను స్వర్గమునకు పంపుచు ఇతరులను నిత్యాగ్నిలో బడవేయుట గొప్ప పక్షపాతమే కద. మరి ఆకాశమే లేనపుడు నిత్యాగ్ని, నరకము, స్వర్గము ఎక్కడుండును? సైతానును,

అతని దూతలను ఈశ్వరుడు పుట్టింపకున్న ఇట్టి నరకమును ఏల నిర్మింపవలసివచ్చును? ఒక సైతానే ఈశ్వరునకు భయపడనిచో అత డీశ్వరుడనుట ఎట్లు? ఎందుకన అతని దూతయే అతనికి ద్రోహి యయ్యెను. ఈశ్వరు డతనిని మొదటనే పట్టి చెఱసాలలో ఉంచలేకపోయెను. మరియు చంపలేక పోయెను. ఏసును సైతం నలుబది దినములు దుఃఖపెట్టెను. ఇక అతని ఈశ్వరత్వ మేమని చెప్పవలెను? ఏసు కూడా అతని నేమియు చేయజాలకపోయెను. కావున ఈశ్వరపుత్రుడనుట వ్యర్థమని తేటపడెను. కాబట్టి ఏసు ఈశ్వరుని కుమారుడు గాని బైబిలునందు వర్ణింపబడిన ఈశ్వరుడు గాని కాజాలడు. ॥84॥

85. అప్పుడు పన్నెండుమందిలో ఒకడగు ఇస్కరియోతుయూదా ప్రధాన యాజకుల వద్దకు వెళ్లి నేనాయనను మీ కప్పగించిన ఎడల నాకేమి ఇత్తురని వారి నడిగెను. అందులకు వారు ముప్పది వెండినాణెములు తూచి వానికి ఇచ్చిరి. ॥ మ : 26 : 14 - 15 ॥

సమీక్ష:- ఇప్పుడు యేసు యొక్క సిద్ధులు, ఈశ్వరత్వము అంతయు ప్రకటమయ్యెను. తన వెంటనుంటూ తనకు ప్రధాన శిష్యుడైనను తన సాంగత్యముచే పవిత్రాత్ముడు కానపుడు మరణానంతరం అతడు ఇతరులనేల పవిత్రాత్ములుగ చేయగలడు? తనను అనుసరించి వస్తున్న శిష్యునికే మేలు చేయనివాడు మరణానంతరం అతని కేమి మేలు చేయగలుగును? ॥ 85 ॥

86. వారు భోజనము చేయుచుండగా ఏసు ఒక రొట్టె పట్టుకొని దాని నాశీర్వదించి విరిచి తన శిష్యులకిచ్చి మీరు తీసుకుని తినండి; ఇది నా శరీరమని చెప్పెను. మరియు ఆయన గిన్నె పట్టుకొని కృతజ్ఞతా స్తుతులను చెల్లించి వారికిచ్చి దీనిలోనిది మీరందరు త్రాగుడి - ఇది నా రక్తము. అనగా పాప క్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధనరక్తము. ॥ మ : 26 : 26-28 ॥

సమీక్ష:- సరే! ఇట్టి మాటలను ఒక విద్యావిహీనుడు ఒక అడవిమనిషి తప్ప సభ్యత కలిగిన మనిషి మాట్లాడునా? శిష్యులతో 'భోజన పదార్థమును తన మాంస'మనియు, 'పానీయములను రక్త'మనియు చెప్పునా? దీనినే ఇప్పుడు క్రైస్తవులు ప్రభుభోజనమనుచున్నారు. అనగా 'తిను, త్రాగు' వస్తువులనే ఏసు మాంసరక్తములని భావించి తినుచును, త్రాగుచునున్నారు. ఇదెంత వికారమైన మాట! తమ గురువు రక్తమాంసములతో తిను త్రాగు భావననే విడువలేనివారు ఇతరముల నెట్లు విడువగలుగుదురు? ॥ 86 ॥

87. పేతురును, జెబెదయి యిద్దరు కుమారులను వెంటబెట్టుకొని పోయి, దుఃఖపడుటకును చింతాక్రాంతుడగుటకును మొదలుపెట్టెను. అప్పుడు ఏసు నా ప్రాణము మరణమగునంతగా బహుదుఃఖములో మునిగియున్నది. మీరిక్కడ నిలిచి నాతో కూడ మెలకువగా నుండుడని వారితో చెప్పి కొంత దూరము వెళ్లి సాగిలపడి "నా తండ్రీ! సాధ్యమైతే ఈ గిన్నె నా వద్దనుండి తొలగిపోనిమ్ము. అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్మని" ప్రార్థించెను. ॥ మ : 26 : 37-39 ॥

సమీక్ష:– చూడుడు. అతడు మనుష్యుడు గాని, ఈశ్వరుని కుమారుడు గాని, త్రికాలజ్ఞుడు గాని ఒక విద్వాంసుడుగాని యైయున్నచో ఇట్టి అయోగ్యమైన పనులు చేసేవాడుకాడు. అతడీశ్వరుని కుమారుడు, భూతభవిష్యదాదుల నెరుగువాడు, పాపపరిహార కర్తయను ఇత్యాది కల్లమాటలను, ఏసో లేక అతని శిష్యులో కల్పించి ప్రచారం చేసియుండవచ్చునని దీనివలన తెలియుచున్నది. ఇతడు కేవలము ఒక సామాన్యమైన మనుష్యుడు అమాయకుడు. అవిద్వాంసుడునై యుండెనేకాని ఒక విద్వాంసుడు కాని, యోగి కాని, సిద్ధుడు కాని కాకుండె నని తెలుసుకొనవలెను. ॥ 87 ॥

88. ఆయన ఇంకను మాటలాడుచుండగా పన్నెండుమందిలో ఒకడైన యూదా వచ్చెను. వానితో గూడ బహుజనసమూహము కత్తులు, గుదియలు పట్టుకొని ప్రధాన యాజకులవద్దనుండియు, ప్రజల పెద్దల వద్దనుండియు వచ్చెను. ఆయనను అప్పగించువాడు – నేనెవరిని ముద్దుపెట్టుకొందునో ఆయనే ఏసు; ఆయనను పట్టుకొనుడనుమాట వారికి గురుతుగా చెప్పి – వెంటనే ఏసు వద్దకు వచ్చి బోధకుడా! నీకు శుభమని చెప్పి ఆయనను ముద్దుపెట్టుకొనెను. వారు దగ్గరకు వచ్చి ఏసును బలవంతముగా పట్టుకొనిరి. అప్పుడు శిష్యులందరు ఆయనను విడిచి పారిపోయిరి. తుదకు ఇద్దరు అబద్ధపు సాక్ష్యులు వచ్చి – వీడు 'దేవాలయమును పడగొట్టి మూడుదినములలో దానిని కట్టగల'నని చెప్పె ననిరి. ప్రధాన యాజకుడు లేచి – నీ వుత్తరమేమియు చెప్పవా? వీరు నీమీద పలుకుచున్న సాక్ష్యమేమని అడుగగా ఏసు ఊరకుండెను. అందులకు ప్రధాన యాజకుడు ఆయనను చూచి – నీవు దేవుని కుమారుడవైన, క్రీస్తువైన ఆ మాట మాతో చెప్పుమని జీవముగల దేవునితోడని నీ కానపెట్టుచున్నాననెను. అందులకు ఏసు – నీవన్నట్లే అనెను. ప్రధాన యాజకుడు తన వస్త్రమును చించుకొని – వీడు దేవదూషణ చేసెను. మనకిక సాక్షులతో పనియేమి? ఇదిగో ఈ దూషణపుమాట మీరిప్పుడు విన్నారు గదా! మీ కేమి తోచుచున్నదని అడిగెను. అందులకు వారు – వీడు మరణమునకు పాత్రుడనిరి. అప్పుడు వారు ఆయన ముఖముమీద ఉమ్మివేసి ఆయనను గ్రుద్దిరి. కొందరు ఆయనను చేతులతో కొట్టి – క్రీస్తూ! నిన్ను కొట్టినవాడెవడో మాతో చెప్పుమనిరి. పేతురు వెలుపటి ముంగిట కూర్చుండగా ఒక చిన్నది అతని వద్దకు వచ్చి – నీవును గలిలయ్యుడగు యేసుతో కూడ నుంటివి గదా యనెను. అందులకతడు నేనుండలేదు; నీవు చెప్పినది నాకు తెలియదని అందరి యెదుట అనెను. అతడు పడవలోనికి వెళ్ళిన తరువాత మరియొక చిన్నది అతనిని చూచి వీడును నజోరీయుడగు యేసుతో కూడ నుండెనని అక్కడివారితో చెప్పగా అత డొట్టు పెట్టుకొని – నేనుండలేదు; ఆ మనుష్యుని నే నెరుగనని మరల చెప్పెను. అందుల కతడు – ఆ మనుష్యుని నే నెరుగనే యెరుగనని శపించుకొనుటకు, ఒట్టుపెట్టుకొనుటకు ఆరంభించెను.

॥ మత్తయి : 26 : 47–50; 56, 60–63; 65–72; 74 ॥

సమీక్ష:- ఇప్పుడు ఆలోచింపుడు.' తన శిష్యులను దృఢవిశ్వాసులుగ జేయగలుగునంతటి సామర్థ్యము గాని, ప్రతాపము గాని అతనియందు లేకుండెను. ఉండియేయున్న ఆ శిష్యులు ప్రాణములు పోయినను తమ గురువును లోభముచే బట్టింపకుందురు. అట్లే తప్పించుకొనకయు, బొంకులు బొంకకయు, ఒట్లు పెట్టుకొనక ఉందురు. ఏసు కూడా చమత్కారి కాకుండెను. కుంటి, గ్రుడ్డి మున్నగువారిని చంపుటకు అనేకులు లోతు అనువాని యింటిమీదికి వచ్చియుండగా అట దేవదూతలిద్దరు వారిని గ్రుడ్డివారగునట్లు చేసిరని తౌరేతునందు వ్రాయబడిన మాటయు అసంభవమే. ఐనను ఏసునందింతటి సామర్థ్యమైన లేకయుండెనే. క్రైస్తవు లిప్పుడతని నెంతయో గొప్పగ పొగడుచున్నారు. అయ్యో! ఇట్టి దుర్దశతో చచ్చుటకంటె యుద్ధము చేసిగాని సమాధిస్థుడై గాని మరియొక విధమునగాని ప్రాణత్యాగము చేసియున్న మేలైయుండెడిదిగా! కావున అవిద్వాంసునకట్టి బుద్ధి ఎక్కడ నుండి పుట్టును? ఆ ఏసు ఇంకను చెప్పునదేమనగా - ॥ 88 ॥

89. ఈ సమయమున నేను నా తండ్రిని వేడుకొనలేననియు వేడుకొనిన యెడల ఆయన పన్నెండు సేనావ్యూహముల కంటె ఎక్కువమంది దూతలను నాకు పంపడనియు నీవనుకొనుచున్నావా? ॥ మత్తయి : 26 : 53 ॥

సమీక్ష:- ఇతరులను బెదిరించుచు తన, తన తండ్రి గొప్పతనములను వెల్లడించుచున్నాడే కాని ఏమియు చేయలేదు. ఆశ్చర్యమేమన 'వీరు నీకు విరుద్ధముగా సాక్ష్యమిచ్చుచున్నారు. దీనికి ప్రత్యుత్తరమి'మ్మని మహాయాజకుడు అడిగినప్పుడు ఏసు ఊరకయుండెను. ఏసు ఇట్లుండుటయు అనుచితమే. ఏలయన యథార్థమైన మాట అక్కడ తప్పక చెప్పియుండిన బాగుండెడిది. ఇట్లు తన గొప్పతనపు మాటల నెన్నియో చెప్పుకొనుట అతని కుచితము కాదు. ఏమన యేసుపై మోపబడిన నేరము మరణదండనకు తగినది కాదు. వారు అనాగరికులై యుండిరి. వారికి న్యాయమేమి తెలియును? కావున యేసు తానీశ్వరుని కుమారుడనని ప్రకటించుకొనకుండిన వారతనితో ఇంత కఠినముగ ప్రవర్తింపక పోదురు. ఉభయులకు శ్రేయస్కరమై యుండెడిది. కాని వారికింతటి విద్య, ధర్మభావము, న్యాయశీలత్వము ఎచటనుండి వచ్చును? ॥ 89 ॥

90. ఏసు అధిపతి ఎదుట నిలిచెను. అప్పుడు అధిపతి - యూదుల రాజువు నీవేనా? అని ఆయనను అడుగగా ఏసు అతని జూచి - నీవన్నట్లే అనెను. ప్రధాన యాజకులును, పెద్దలును ఆయనమీద నేరము మోపినప్పుడు ఆయన ప్రత్యుత్తరమేమియు నీయలేదు. కాబట్టి పిలాతు - నీ మీద వీరెన్ని నేరములు మోపుచున్నారో నీవు వినలేదా? అని ఆయన నడిగెను. అయినను ఆయన ఒక మాటకైనను అతనికి ఉత్తరమీయలేదు. గనుక అధిపతి మిక్కిలి ఆశ్చర్యపడెను. పిలాతు- అలాగైతే క్రీస్తు అనబడిన యేసును ఏమిచేయుదునని వారి నడుగగా - శిలువ వేయమని అందరు చెప్పిరి... యేసును కొరడాలతో కొట్టించి శిలువ వేయనప్పగించెను.

అప్పుడు అధిపతి యొక్క సైనికులు యేసును అధికారమందిరములోనికి తీసుకొనిపోయి

ఆయన యొద్ద సైనికుల నందరిని సమకూర్చిరి. వారు ఆయన వస్త్రములను తీసివేసి ఆయన కెఱ్ఱని అంగీ తొడిగించి ముండ్ల కిరీటమునల్లి ఆయన తలకు పెట్టి ఒక రెల్లును ఆయన కుడిచేతిలో నుంచి ఆయన యెదుట మోకాళ్ళూని - యూదుల రాజా! నీకు శుభమని ఆయన నపహసించి, ఆయనమీద ఉమ్మి వేసి, ఆ తెల్లును తీసుకొని దానితో ఆయనను తలమీద కొట్టిరి. ఆయనను అపహసించిన తరువాత ఆయన మీద నున్న ఆ అంగీని తీసివేసి ఆయన వస్త్రము లాయనకు తొడిగించి శిలువ వేయుటకు ఆయనను తీసికొనిపోయిరి.

వారు కపాలస్థలమను అర్థమిచ్చు గొల్గొతా అనబడు చోటికి వచ్చి చేదు కలిపిన ద్రాక్షరసమును ఆయనకు త్రాగనిచ్చిరి. కాని ఆయన దానిని రుచి చూచి త్రాగ నొల్లకపోయెను. అప్పుడు వారు ఆయనను శిలువ వేసిరి. ఆయన మీద మోపబడిన నేరము వ్రాసి ఆయనకు తలకు పైన ఉంచిరి. మరియు కుడివైపు ఒకడును ఎడమవైపు ఒకడును ఇద్దరు బందిపోటు దొంగలు ఆయనతో కూడ శిలువవేయబడిరి. ఆ మార్గమున వెళ్ళుచుండిన వారు తలలూపుచు "దేవాలయమును పడగొట్టి మూడు దినములలో కట్టువాడా! నిన్ను నీవే రక్షించుకొనుము. నీవు దేవుని కుమారుడవైన శిలువమీద నుండి దిగు"మని చెప్పుచు ఆయనను దూషించిరి. అలాగే శాస్త్రులును, పెద్దలును, ప్రధాన యాజకులును కూడాయనను అపహసించుచు - "వీడు ఇతరులను రక్షించెను. తన్ను తానే రక్షించుకొనలేడు! ఇశ్రాయేలుల రాజు గదా! ఇప్పుడు శిలువమీద నుండి దిగిన ఎడల వానిని మేము నమ్ముదుము. వాడు దేవునియందు విశ్వాసముంచెను. నేను దేవుని కుమారుడ నని చెప్పెను గనుక ఆయనకు ఇష్టుడైతే ఆయన ఇప్పుడు వానిని తప్పించు"నని చెప్పిరి. ఆయనతో శిలువవేయబడిన బందిపోటు దొంగలును అలాగే ఆయనను నిందించిరి.

మధ్యాహ్నము మొదలుకొని మూడుగంటల వరకు ఆ దేశమంతట చీకటి క్రమ్మెను. ఇంచుమించు మూడు గంటలప్పుడు ఏసు : "ఏలీ ఏలీ, లామా సబక్తానీ" అని బిగ్గరగా కేకవేసెను. ఆ మాటకు 'నా దేవా నా దేవా! నన్నెందులకు చేయి విడిచితి'వని అర్థము. అక్కడ నిలిచియున్నవారిలో కొందరా మాటలను విని - ఇతడు ఏలియాను పిలుచుచున్నాడనిరి. వెంటనే వారిలో నొకడు పరుగెత్తుకొనిపోయి స్పంజీ తీసికొని సిరకాలో ముంచి తెల్లున తగిలించి ఆయనకు త్రాగనిచ్చెను. తక్కినవారు 'ఊరకుండుడి, ఏలియా అతనిని రక్షింపవచ్చునేమో చూత'మనిరి. ఏసు మరల బిగ్గరగా కేకవేసి ప్రాణములను విడిచెను. ॥ మత్తయి : 27 : 11-14; 22, 26-31; 33-35; 37-50 ॥

సమీక్ష:- ఆ దుష్టులు వ్యర్థంగా ఏసునకు చెడు కలుగజేయుట నిజమే కాని ఏసునందును దోషము కలదు. అదేమన 'ఈశ్వరున కొకడు పుత్రుడు లేడు. అతడొకనికి తండ్రియు కాడు'. ఒకనికి తండ్రియైనవాడు మరొకనికి మామ, బావ, బంధువు - మొదలగువాడును కావలసివచ్చును. అధ్యక్షుడు

అడిగినప్పుడు నిజమైన జవాబు ఇవ్వవలసియుండెను. ఇంతకుపూర్వము చూపిన చమత్కారములగు కార్యములన్నియు సత్యములైనచో ఇప్పుడు కూడా శిలువమీద నుండి దిగి వచ్చి అందరను చకితులను చేసి తన శిష్యులుగా చేసికొని యుండును. మరి అతడీశ్వరుని పుత్రుడే యైన ఈశ్వరుడు అతనిని కాపాడకుండునా? అతడు త్రికాలజ్ఞుడు యైనచో చేదు కలిసియున్న సిర్కాను రుచి చూచి విడుచుటెందులకు? పూర్వమే తెలిసికొనియుండవచ్చును గదా! ఇక మహిమ గలవాడే యైన అరచి అరచి ప్రాణత్యాగమేల చేసియుండును? కావున ఎవడెంత చాతుర్యములను చూపినను తుదకు సత్యము సత్యమే, అసత్య మసత్యమే యగునని తెలుసుకొనవలెను. కాని, నక్కలడవి మనుష్యులలో ఏసు కొంత మంచివాడై యుండెనేమో కాని, అతడు మహిమగలవాడు గానీ, ఈశ్వర పుత్రుడు గానీ విద్వాంసుడు గానీ కాకుండె ననియు దీనివలన సిద్ధమైనది. ఈశ్వరపుత్రుడే యైన ఇట్టి దుఃఖమునేల యనుభవించియుండును? ॥ 90 ॥

91. ఇదిగో ప్రభువు దూత పరలోకమునుండి దిగివచ్చి రాయిని పొర్లించి దానిమీద కూర్చుండెను. అప్పుడు మహా భూకంపము కలిగెను. ఆయన ఇక్కడ లేడు. తాను చెప్పినట్టే ఆయన లేచియున్నాడు. ఆయన శిష్యులకు ఆ వర్తమానము తెలుప పరుగెత్తుచుండగా ఏసు వారికి ఎదురేగి మీకు శుభమని చెప్పెను. వారు ఆయన వద్దకు వచ్చి ఆయన పాదములను పట్టుకొని ఆయనకు మ్రొక్కిరి. అంతట యేసు భయపడకుడి. మీరు వెళ్లి నా సహోదరులు గలిలయకు వెళ్లవలె ననియు వారక్కడ నన్ను చూతురనియు వారికి తెలుపుడనెను. పదునొకండుమంది శిష్యులు ఏసు తమకు నిర్ణయించిన గలిలయలోని కొండకు వెళ్లిరి. వారు ఆయనన చూచి ఆయనకు మ్రొక్కిరి. గాని కొందరు సందేహించిరి. అయితే ఏసు వారి వద్దకు వచ్చి పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడినదని వారితో చెప్పెను. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదా కాలము మీతో కూడ ఉన్నానని చెప్పెను.

॥ మ : 28 : 2-6-9-10; 16-18; 20 ॥

సమీక్ష:- ఈ మాట కూడ సృష్టిక్రమమునకును, విద్యకును విరుద్ధమగుట వలన నమ్మదగినది కాదు. ఈశ్వరుని వద్ద దూతలుండుట, వారిని ఎచ్చటికి పంపదలచిన అచ్చటకు పంపుట, మీది నుండి దిగుట ఒక తహసీలుదారు వలె, కలెక్టరు వలె ఈశ్వరుని సిద్ధముచేసితిరా యేమి? ఏసు అదే శరీరముతో స్వర్గమునకు పోయి బ్రతికి లేచెనా? స్త్రీలతని పాదములు పట్టి మ్రొక్కినప్పుడు శరీర మదియే యుండినదా? మూడు దినములవరకు శిలువపై ఉన్నందులకు అది క్రుళ్లిపోలేదా? తనకు తానే సర్వాధికారినని చెప్పుకొనుట గర్వము కాదా? అట్లే శిష్యులతో కలియుట, వారితో అన్ని విషయములు మాట్లాడుట అసంభవము. ఈ మాటలన్ని యథార్థములైనచో నేడు కూడ చనిపోయినవారు ఎందుకు బ్రతికి లేవరు? శరీరముతోనే స్వర్గమునకేల పోరు? ఇట్లు సువార్తలో మత్తయి వ్రాసినదాని సమీక్ష వ్రాయబడినది. ఇక మార్కు రచిత బైబిలు గురించి వ్రాయబడును. ॥ 91 ॥

మార్కు సువార్త

92. ఇతడు వడ్రంగి కాదా? ॥ మార్కు : 6 : 3 ॥

సమీక్ష:- వాస్తవమునకు యోసేపు వడ్రంగియై యుండెను. కావున ఏసు కూడ వడ్రంగియే. అతడెన్నియో సంవత్సరములవరకు వడ్రంగము చేయుచుండెను. అటు తర్వాత పైగంబరు – ప్రవక్తగా మారి తుద కీశ్వరుని కుమారుడేయై కూర్చుండెను. తనకు అడవి మనుష్యులు స్వాధీనులగుట వలననే గదా దంబమును సాగించుకొనగలిగినది. కోసి కోసి విడదీయుట, కూర్చుట అతని వృత్తియే గదా! ॥ 92 ॥

లూకా సువార్త

93. అందులకు ఏసు 'నేను సత్పురుషుడనని ఏల చెప్పుచున్నావు? దేవుడొక్కడే తప్ప మరి ఎవడును సత్పురుషుడు కాడు. ॥ లూ : 18 : 19 ॥

సమీక్ష:- అద్వితీయుడైన పరమేశ్వరుడొక్కడే యని ఏసు చెప్పుచుండగా ఈ క్రైస్తవులు పవిత్రాత్మ, పిత, పుత్రులు అను ఈ ముగ్గురను ఎక్కడి నుండి కల్పించిరి? ॥ 93 ॥

94. హేరోదు నొద్దకు ఆయనను పంపెను. హేరోదు యేసును చూచి మిక్కిలి సంతోషించెను. ఆయనను గూర్చి చాలా సంగతులు విన్నందున ఆయన ఏదైనను ఒక సూచక క్రియ చేయగా చూడ నిరీక్షించి బహుకాలము నుండి ఆయనను చూడగోరెను. ఆయనను చూచినప్పుడు చాల ప్రశ్నలు వేసినను అతనికి ఉత్తరమేమియు ఇయ్యలేదు.
॥ లూ : 23 : 8-9 ॥

సమీక్ష:- ఈ మాట మత్తయి సువార్తలో లేదు కావున ఈ సాక్ష్యులు విరోధాభిప్రాయులైరి. ఏలయన సాక్షులు సమానాభిప్రాయులై యుండవలసియుండెను. యేసు చతురుడు, మహిమగలవాడునై యున్న తక్షణమే హేరోదునకు ఉత్తరమిచ్చి సిద్ధులను గూడ చూపియుండును. దీనివలన యేసునందు విద్య కాని, ఒక సిద్ధి గాని ఎంతమాత్రము లేకుండెననియే తెలియుచున్నది. ॥ 94 ॥

యోహాను సువార్త

95. ఆదియందు వాక్యముండెను. వాక్యము దేవునియొద్దనుండెను. వాక్యము దేవుడైయుండెను. ఆ వాక్యము ఆదియందు దేవుని యొద్ద నుండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను. కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు. ఆయనలో జీవముండెను. ఆ జీవము మనుష్యులకు వెలుగై యుండెను. ॥ యో : 1 : 1-4 ॥

సమీక్ష:- ఆదియందు పలుకువాడే లేకున్న వచనముండజాలదు. వచన మీశ్వరుని యొద్ద నుండెనన్న అట్లు చెప్పుట వ్యర్థము. మరి వచన మెన్నటికిని పరమాత్మ కాజాలదు. ఏలనన అది ఆదియందు ఈశ్వరుని యొద్ద నుండెనన్న మొదట వచనముండెనా? లేక ఈశ్వరుడా? అన్వయించుట

లేదు. కారణము లేనంతవరకు వచనము ద్వారా సృష్టి ఎప్పటికిని కాజాలదు. వచనముతో పని లేకుండానే కర్త మౌనముగా ఉంటూ సృష్టిని చేయగలుగును. మరి జీవమనగా నేమి? అది దేనియందుండెను? ఈ వచనము వలన జీవములు అనాది నుండి యున్నవని యొప్పుకొందురు గద. జీవము అనాదియైనప్పుడు ఆదాము ముక్కుపుటలలో తొల్లిలో ఊపిరి యూదుట మిథ్య యయ్యెను. జీవము మనుష్యులకే వెలుగయ్యెనా? పశ్వాదులకు కాలేదా? ॥ 95 ॥

96. వారు భోజనము చేయుచుండగా అయనను అప్పగించవలెనని సీమోను కుమారుడగు ఇస్కరియోతు యూదా హృదయములో సైతాను ఇంతకుముందు ఆలోచన పుట్టించియుండెను. ॥ యో : 13 : 2 ॥

సమీక్ష:- ఈ మాట సత్యము కాదు. ఎందుకనగా సైతానే అందరను పురికొలుపునన్న ఆ సైతానును ఎవరు పురికొలుపుచున్నారని ఈ క్రైస్తవుల నడుగవలెను. సైతాను తనంతట తానే పురికొల్పుకొను నన్న మనుష్యులు సైతం తమ్ము తామే పురికొల్పుకొనగలుగుదురు. సైతాను యొక్క అవసరమేమి? సైతానును సృజించినవాడు, పురికొల్పువాడు, పరమేశ్వరుడే యైన ఈ క్రైస్తవుల దేవుడే ఆ సైతానునకు సైతానై నిలుచును. ఎందుకనగా అతడే ఆ సైతాను ద్వారా అందరను పురికొల్పించును. సరే! ఇవి ఈశ్వరుని పనులు కాగలవా! క్రైస్తవుల పుస్తకము ఈశ్వరకృతమనియు, ఏసు ఈశ్వరుని కుమారుడనియు కల్పించినవారే సైతానులై యుందురనుట నిశ్చయము. కాని ఇది ఈశ్వరకృతము కాదు. ఇందు చెప్పబడినవా డీశ్వరుడు గాని, ఏసు ఈశ్వరుని కుమారుడు గాని కాజాలరు. ॥ 96 ॥

97. మీ హృదయమును కలవరపడనియ్యకుడి! దేవునియందు విశ్వాసముంచుచున్నారు. నాయందును విశ్వాసముంచుడి. నా తండ్రి యింట అనేక నివాసములు కలవు. లేనియెడల మీతో చెప్పుదును; మీకు స్థలము సిద్ధపరుప వెళ్ళుచున్నాను. నేను వెళ్ళి మీకు స్థలము సిద్ధపరచినపుడు నేనుండు స్థలములో మీరుండులాగున మరల వచ్చి నాయొద్ద నుండుటకు మిమ్మును తీసికొనిపోవుదును. యేసు అతనిని చూచి నేనే మార్గమును, సత్యమును, జీవమునై యున్నాను. నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు. మీరు నన్నెరిగియున్న నా తండ్రి నెరిగియుందురు. ॥ యో : 14 : 1-4, 6-7 ॥

సమీక్ష:- ఇప్పుడు చూడుడు! ఏసు వాక్యములు పౌరాణికులైన పోపులీల కంటె ఏమైన తక్కువగ నున్నవా? ఇట్టి వాక్యములను రచియింపకున్న అతని మతమందెవరు చిక్కుకొందురు? ఏసు తన తండ్రిని గుత్తగొనియున్నాడా? అతడు ఏసు వశమునందు ఉన్నచో పరాధీనుడగుట వలన అతడీశ్వరుడే కాడు. ఏలయన ఈశ్వరుడు ఒకని వాక్సహాయము (సిఫారసు) వినడు. యేసునకు పూర్వమెవ్వడును ఈశ్వరుని పొందకుండెనా? ఇట్లు స్థానాదుల ప్రలోభము కలిగించుచు తన నోటితో తానే సత్యమార్గమును, జీవనమును కలవాడనని చెప్పుకొనువాడు వట్టి డాంభికుడే యనబడును. కావున ఈ మాటలు ఎన్నటికిని సత్యము కాజాలవు. ॥ 97 ॥

98. నేను చేయు క్రియలు నాయందు విశ్వాసముంచువాడును చేయును. వానికంటె మరి గొప్పవియు అతడు చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.

॥ యో : 14 : 12 ॥

సమీక్ష:- ఇప్పుడు చూడుడు! ఏసునందు పూర్ణవిశ్వాసము కలిగియున్న క్రైస్తవులు పీనుగులను బ్రతికించుట మున్నగు పనులను చేయలేరెందులకు? విశ్వాసము కలిగియుండియు ఆశ్చర్యమును కలిగించు కార్యములను చేయలేరేని ఏసు కూడా అట్టి కార్యములను చేయకుండెననియే గట్టిగ చెప్పవచ్చును. ఏమనగా యేసు తానే "మీరును ఆశ్చర్యము గొలుపు కార్యములను చేయవచ్చు" ననుచున్నాడు. అట్లయిన ఇప్పుడు క్రైస్తవ లోకరైనను వానిని చేయలేరేని 'ఏసు పీనుగలను బ్రతికించుచుండెను' అనునిట్టి మాటలు జ్ఞాన విహీనుడు తప్ప మరి యెవ్వడంగీకరింపగలడు? ॥98॥

99. అద్వితీయ సత్యదేవుడైనవాడవు. ॥ యో : 17 : 3 ॥

సమీక్ష:- అద్వితీయుడైన ఈశ్వరు డొక్కడేయైన క్రైస్తవులు చెప్పెడు త్రిత్వం అబద్ధము. ॥99॥

ఇట్లే సువార్తలలో అనేక స్థలములందు విరుద్ధ విషయములు నిండియున్నవి.

యోహాను ప్రకటన వాక్యములు

ఇక యోహాను యొక్క అద్భుత వాక్యాలను వినండి:-

100. తమ తలలమీద సువర్ణ కిరీటములు పెట్టుకొన్నవారై కూర్చుండిరి. మరియు ఆ సింహాసనము ఎదుట ఏడు దీపములు ప్రజ్వలించుచున్నవి. అవి దేవుని ఏడు ఆత్మలు. మరియు ఆ సింహాసనము ఎదుట స్ఫటికమును పోలిన గాజు వంటి సముద్రమున్నట్లుండెను. ఆ సింహాసనమునకు మధ్యను సింహాసనము చుట్టును ముందు వెనుక కన్నులతో నిండిన నాలుగు జీవులుండెను. ॥ యో.ప్ర. 4 : 4,5,6 ॥

సమీక్ష:- ఇక చూడండి! క్రైస్తవుల స్వర్గమొక నగరము వలె నున్నది. వీరి ఈశ్వరుడును దీపాగ్ని వలె నున్నాడు. సువర్ణ కిరీటాది భూషణములను ధరించుటయు, వెనుకముందు నేత్రములు కల్గియుండుటయు అసంభవము. ఈ మాటలను ఎవరొప్పుకొందురు? అచ్చట సింహాది మృగములు కూడ నాలుగుండెనని వ్రాసియున్నారు. ॥ 100 ॥

101. మరియు లోపలను, వెలుపలను వ్రాతకలిగి ఏడు ముద్రలు గట్టిగా వేసియున్న యొక గ్రంథము సింహాసనమునందు ఆసీనుడైనవాని కుడిచేత చూచితిని. దాని ముద్రలు తీసి ఆ గ్రంథము విప్పుటకు యోగ్యుడైనవాడెవడు? పరలోకమందు గాని భూమి మీద గాని భూమి క్రిందగాని ఆ గ్రంథమును విప్పుటకైన చూచుటకైనను ఎవనికి శక్తి లేకపోయెను. ఆ గ్రంథము విప్పుటకైనను చూచుటకైనను యోగ్యుడెవడును కనబడనందున నేను బహుగా ఏడ్చుచుండగా .... ॥ యో. ప్ర. 5 : 1-4 ॥

సమీక్ష:- ఆహా! క్రైస్తవుల స్వర్గమందు సింహాసనములు, మనుష్యుల సొగసులు అనేక ముద్రలతో నిండిన పుస్తకము నుండుట, ఆ పుస్తకమును స్వర్గమందును, భూమి మీదను విప్పిచూచుటకును తగినవాడెవడును చిక్కకపోవుట అను మాటల గుఱించి ఆలోచించండి. యోహాను ఏడ్చుచుండగా దానిని ఏసే విప్పునని యొక ప్రాచీనుడు చెప్పెనట. ప్రయోజనమేమన వివాహ మెవనిదో పాటయు నతని గూర్చియే యుండును గదా! ఇట్లు ఏసునందే మహత్త్వమంతయు నారోపింపబడినది. కాని ఇవన్నియు వట్టి మాటలే. ॥ 101 ॥

102. మరియు సింహాసనమునకు, ఆ నాలుగు జీవులకును, పెద్దలకును మధ్య వధింపబడి నట్లుండిన గొఱ్ఱెపిల్ల నిలిచియుండుట చూచితిని. ఆ గొఱ్ఱెపిల్లకు ఏడుకొమ్ములును, ఏడు కన్నులు నుండెను. ఆ కన్నులు భూమియందంతటికి పంపబడిన దేవుని ఏడు ఆత్మలు.

॥ యో. ప్ర. : 5 : 6 ॥

సమీక్ష:- ఇప్పుడీ యోహాను స్వప్నమందలి మనోవ్యాపారమును చూడుడు! ఆ స్వర్గమున అందరు క్రైస్తవులును, నాలుగు పశువులును, ఏసుతప్ప ఇతరులెవ్వరును లేనట్లున్నది. ఇక ఏసున కిచ్చట రెండు నేత్రములు మాత్రమే యుండెను. కొమ్ముల పేరు కూడా లేదు కాని స్వర్గమున కేగిన తరువాత ఏడు కన్నులు, ఏడు కొమ్ములను కలవాడయ్యెను. ఇది గొప్ప అద్భుతమే. ఈశ్వరుని ఆ ఏడాత్మలే ఏసు నేత్రములు, కొమ్ములునయ్యెనట. అయ్యో! ఇట్టిమాటలను క్రైస్తవు లెట్లు నమ్మియున్నారో గదా! వారు కొంచెమైనను ఆలోచింపవలసియుండెను. ॥ 102 ॥

103. ఆయన పుస్తకమును తీసికొనినప్పుడు ఆ నాలుగు జీవులును, వీణెలును ధూప ద్రవ్యములతో నిండిన సువర్ణపాత్రలును పట్టుకొనియున్న ఆ ఇరువది నలుగురు పెద్దలును ఆ గొఱ్ఱెపిల్ల ఎదుట సాగిలపడిరి. ॥ యో.ప్ర. : 5 : 8 ॥

సమీక్ష:- సరే! ఏసు స్వర్గమందు లేకుండునప్పుడు వీరు ధూప, దీప, నైవేద్య హారతి మొదలగు పూజ లెవనికి నలుపుచుండవచ్చును? ఇచ్చట ప్రొటెస్టెంటు క్రైస్తవులు విగ్రహారాధనను నిరాకరించుచున్నారు గాని వీరి స్వర్గము మాత్రము విగ్రహారాధనకు నివాసమైయున్నది. ॥ 103 ॥

104. ఆ గొఱ్ఱె పిల్ల ఆ యేడు ముద్రలలో మొదటిదానిని విప్పినప్పుడు నేను చూడగా ఆ నాలుగు జీవులలో ఒకటి – రమ్మని ఉరుమువంటి స్వరముతో చెప్పుట వింటిని. మరియు నేను చూడగా ఒక తెల్లని గుఱ్ఱము కనబడెను. ఒకడు విల్లు పట్టుకొని దానిమీద కూర్చుండియుండెను. అతనికి ఒక కిరీటమీయబడెను. ఆయన జయింపవలెనను తాత్పర్యముతో జయశాలిగా బయలువెళ్లెను. ఆయన రెండవ ముద్ర విప్పినప్పుడు రమ్మని రెండవజీవి చెప్పుట వింటిని. అప్పుడు ఎఱ్ఱనిదైన వేరొక గుఱ్ఱము బయలువెళ్లెను. మనుష్యులు ఒకనినొకడు చంపుకొనునట్లు భూలోకములో సమాధానము లేకుండ చేయుటకు ఈ గుఱ్ఱము మీద కూర్చున్నవాని కధికార మియ్యబడెను. మరియు అతనికి ఒక పెద్ద ఖడ్గమియ్యబడెను. ఆయన మూడవ ముద్ర విప్పినప్పుడు ఒక నల్లని గుఱ్ఱము

కనబడెను. ఆయన నాల్గవ ముద్ర విప్పినప్పుడు పాండువర్ణము గల గుఱ్ఱము కనబడెను. దానిమీద కూర్చున్న వాని పేరు మృత్యువు. ॥ యో. ప్ర. : 6 : 1,2,3,4,5,7,8 ॥

సమీక్ష:- ఇప్పుడు చూడుడు. ఇది పురాణములను మించిన మిథ్యాలాపమా? కాదా? ఔరా! ఆ పుస్తకబంధనము లను ముద్రలలో గుఱ్ఱపు రౌతులు ఎట్లుండగలిగిరో కదా! ఈ స్వప్నాలాపములను గూడ సత్యమని నమ్మినవారి అవిద్య ఎంత వర్ణించినను తక్కువయే గదా! ॥ 104 ॥

105. వారు - నాథా! సత్యస్వరూపీ! పరిశుద్ధుడా! ఎందాక తీర్పు తీర్చకయు మా రక్తము నిమిత్తము భూనివాసులకు ప్రతిదండన చేయకయు నుందువని బిగ్గరగా కేకలు వేసిరి. తెల్లని వస్త్రము వారిలో ప్రతివాని కియ్యబడెను. మరియు వారి వలెనే చంపబడబోవు వారి సహవాసుల యొక్కయు సహోదరుల యొక్కయు లెక్కపూర్తియగువరకు ఇంక కొంచెము కాలము విశ్రమింపవలెనని వారితో చెప్పబడెను. ॥ యో.ప్ర. : 6 : 10-11 ॥

సమీక్ష:- క్రైస్తవు లిటువంటి న్యాయము కొరకే కద! అట చెఱసాలవంటి ఇబ్బందిలో బడియుండి యేడ్చుచుందురు. వేదమార్గమును స్వీకరించువానికి న్యాయము తక్షణమే జరుగును. ఇప్పుడు యెహోవా కార్యాలయము మూసియున్నదా? తీర్పులు చెప్పు పనిలేక న్యాయాధీశుడు నిష్క్రియుడైయున్నాడా? అని యీ క్రైస్తవులను అడుగవలయును. సరియైన జవాబేమియు చెప్పజాలకపోదురు. వీరి ఈశ్వరునికి గూడ మతిభ్రమ కలుగుచుండును. ఎందుకన వీరి ప్రార్థనల ప్రకారము తక్షణమే వీరి శత్రువులను పీడింపసాగును. పగబట్టి కఱచు సర్పస్వభావము గలవారు గనుక చచ్చిన పిమ్మటను స్వైరమును తీర్చుకొనుచున్నారు. శాంతి కించిత్తయినను లేదు. శాంతి లేనిచోట దుఃఖమున కంతమే యుండదు కదా! ॥ 105 ॥

106. పెద్దగాలిచేత ఊగులాడు అంజూరపు చెట్టునుండి అకాలపు కాయలు రాలినట్టు ఆకాశ నక్షత్రములు భూమి మీద రాలెను. మరియు చుట్టబడిన పటమువలె కానరానట్టు ఆకాశమండలము తొలగిపోయెను. ॥ యో.ప్ర. : 6 : 13,14 ॥

సమీక్ష:- పరిశీలించితిరా? భవిష్యద్వక్త యగు యోహాను విద్యావిహీనుడైనందుననే కదా! ఇట్టి అసంగతమగు కథ కల్పించెను. నక్షత్రములన్నియు గోళములే. అవి పృథివిపై ఎట్లు రాలిపడును? సూర్యాదుల ఆకర్షణ వాని నటునిటు కదలనీయదు. ఆకాశమును చాపవంటిదనుకొనుచున్నాడా? ఏమి? ఆకాశమొకరితో చుట్టబడుటకు అది సాకారపదార్థము కాదు. కావున యోహానాదులందరు అనార్యులైయుండిరి. వారికీ విషయముల జ్ఞానము లేదనుట స్పష్టము. ॥ 106 ॥

107. మరియు ముద్రింపబడినవారి లెక్క చెప్పగా వింటిని. ఇశ్రాయేలీయుల గోత్రము లన్నిటిలో ముద్రింపబడిన వారు లక్షనలుబదినాలుగువేలమంది. యూదా గోత్రములో ముద్రింపబడినవారు పన్నెండు వేలు. ॥ యో. ప్ర. : 7 : 4,5 ॥

సమీక్ష:– బైబిలులో వర్ణింపబడిన ఈశ్వరుడు ఇశ్రాయేలీయాది కులములకే రక్షకుడా? లేక సర్వ ప్రపంచమునకా? అట్లు కానిచో ఆ అనాగరికులకే యేల సహాయము చేసియుండును? వారికే ఏల సహాయము చేయును? ఇతరులను కన్నెత్తి కూడా చూడడు గదా! కావున అత డీశ్వరుడు కాడు. ఇశ్రాయేలీయుల వంశస్థులకు ముద్రలు వేయుట అతని అల్పజ్ఞతయో! యోహాను మిథ్యా కల్పనయో! తెలియదు. ॥ 107 ॥

108. అందువలన వారు దేవుని సింహాసనము ఎదుట ఉండి రాత్రింబగళ్లు ఆయన ఆలయములో ఆయనను సేవించుచున్నారు. ॥ యో. ప్ర. : 7 : 15 ॥

సమీక్ష:– ఇది గొప్ప విగ్రహారాధన కాదా? వారి ఈశ్వరుడు మానవ శరీరధారి అగుటవలన దేహధారియగు మనుష్యునివలె ఏకదేశీయుడు కాడా? క్రైస్తవుల దేవుడు రాత్రి నిద్ర కూడ పోడు. రాత్రియందు నిద్రపోయినచో భక్తులు పూజలెట్లు చేయగలుగుదురు? ఈ విధముగా అతనికి నిద్రకు భంగము కలుగవచ్చును. ఇలా రాత్రింబగళ్లు మేలుకొని యుండుటవలన పిచ్చివాడో, అతిరోగియో కావచ్చును. ॥ 108 ॥

109. మరియు సువర్ణ ధూపార్తి చేతబట్టుకొనియున్న వేరొక దూత వచ్చి బలిపీఠము ఎదుట సింహాసనము ఎదుట ఉన్న సువర్ణబలిపీఠము పైన పరిశుద్ధులందరి ప్రార్థనలతో కలుపుటకై అతనికి బహు ధూప ద్రవ్యము లియ్యబడెను. అప్పుడా ధూపద్రవ్యముల పొగ పరిశుద్ధుల ప్రార్థనలతో కలసి దూతచేతిలో నుండి పైకి లేచి దేవుని సన్నిధిని చేరెను. ఆ దూత ధూపార్తిని తీసికొని బలిపీఠముపై నున్న నిప్పులతో దానిని నింపి భూమి మీద పడవేయగా ఉరుములును, ధ్వనులును, మెరుపులును, భూకంపమును కలిగెను. ॥ యో.ప్ర. 8 : 3,4,5 ॥

సమీక్ష:– ఇక చూడుడు. స్వర్గమందును వేదిక, ధూపదీప నైవేద్యములు, వాయిద్యబృందములు ఉన్నవిగదా! బైరాగుల మందిరము కంటె నీ క్రైస్తవుల స్వర్గము ఏమైనా తక్కువైనదా? కొంత అల్లరి ఎక్కువగనే ఉండును. ॥ 109 ॥

110. మొదటి దూత బూర ఊదినప్పుడు రక్తముతో మిళితమైన వడగండ్లును, అగ్నియు పుట్టి భూమిపైన పడవేయబడెను. అందువలన భూమిలో మూడవభాగము కాలిపోయెను. ॥ యో.ప్ర. 8 : 7 ॥

సమీక్ష:– ఓయీ క్రైస్తవుల కాలజ్ఞానీ! 'ఈ ఈశ్వరుడు నీ యీ ఈశ్వర దూతలు, బూరల గోలలు ప్రళయలీలలు అనునవి కేవలము పిల్లల ఆటలే' అని తేటపడుచున్నవి గదా! ॥ 110 ॥

111. ఐదవ దూత బూర ఊదినప్పుడు ఆకాశమునుండి భూమిమీద రాలిన యొక నక్షత్రమును చూచితిని. అగాధము యొక్క తాళపుచెవి అతనికియ్యబడెను. అతడు అగాధము తెరవగా పెద్ద కొలిమిలో నుండి లేచు పొగవంటి పొగ ఆ గుండములోనుండి లేచెను. ఆ

గుండపుపొగ చేత సూర్యుడిని, ఆకాశమును చీకటి కమ్మెను. ఆ పొగలో నుండి మిడతలు భూమి మీదికి వచ్చెను. భూమిలో నుండు తేళ్లకు బలమున్నట్లు వానికి బలమియ్యబడెను. మరియు నొసళ్ళయందు దేవుని ముద్రలేని మనుష్యులను ఐదునెలల వరకు బాధించుటకు వానికి అధికారము నియ్యబడెను. ॥ యో. ప్ర.9 : 1-5 ॥

సమీక్ష:- ఏమి? తూతూరాల శబ్దములు విన్న ఆ నక్షత్రములు స్వర్గమందుగల ఆ దూతలమీద పడినవా? ఇక్కడ మాత్రము పడలేదు. మంచిది. ఆ గుండమునుగాని, మిడుతలను గాని ప్రళయము గావించుటకే ఈశ్వరుడు చేసియుంచెనా? ముద్రగలవారిని గరవవలదని అవి ముద్రలు చూచి చదువుకొనునా? ఇది మీరు క్రైస్తవులు కానిచో మిమ్ములను మిడతలు కరచు"నని భయము జూపి సామాన్య జనులను క్రైస్తవులలో కలుపుకొనుటకు పన్నిన టక్కులే. ఇట్టి మాటలు విద్యాశూన్యమగు దేశమందో ప్రజల యందో సాగును. కాని ఆర్యావర్తమందు సాగనేరవు. అది ప్రళయకాలపు మాట కాగలుగునా? ॥ 111 ॥

112. గుఱ్ఱపు రౌతుల సైన్యముల లెక్క ఇరువది కోట్లు. ॥ యో.ప్ర. 9 : 16 ॥

సమీక్ష:- బాగున్నది. ఇన్ని గుఱ్ఱములు స్వర్గమున నెట్లుండగలుగునో? అవి ఎచ్చట మేయునో? ఎచ్చట నివసించునో? ఎచ్చట లద్దె పెట్టునో గద! ఇక దాని దుర్గంధము కూడ స్వర్గమున విశేషముగా వ్యాపించియుండును. చాలు చాలు. ఇట్టి స్వర్గమునకు, ఈ దేవునికి ఇలాంటి మతమునకు ఆర్యులమందరము నీళ్లువదలియున్నారము. సర్వశక్తిమంతుని కృప వలన క్రైస్తవులందలి ఈ గందరగోళమంతయు దూరమైపోయిన ఎంతయో మేలు కలుగును. ॥ 112 ॥

113. బలిష్ఠుడైన వేరొక దూత పరలోకము నుండి దిగి వచ్చుట చూచితిని. ఆయన శిరస్సుమీద మేఘమును, ఇంద్రధనస్సును యుండెను. ఆయన ముఖము సూర్యబింబము వలెను, ఆయన పాదములు అగ్ని స్తంభముల వలెను ఉండెను. అయన తన కుడిపాదము సముద్రముమీదను, ఎడమపాదము భూమిమీదను మోపెను. ॥ యో.ప్ర.10 : 1-3 ॥

సమీక్ష:- ఇప్పుడు చూడుడు! ఈ దూతల కథలు పురాణగాథలను బట్టురాజుల పొగడ్తలను గూడా మీరినవి. ॥ 113 ॥

114. మరియు ఒకడు చేతికఱ్ఱ నా కిచ్చి - నీవు లేచి దేవుని ఆలయమును, బలిపీఠమును కొలతవేసి ఆలయములో పూజించువారిని లెక్కపెట్టుము. ॥ యో.ప్ర. 11 : 1 ॥

సమీక్ష:- ఇక్కడనే కాదు. క్రైస్తవులకు స్వర్గమందును మందిరములు నిర్మింపబడుటకు కొలతలు వేయబడినవి కదా! వారి స్వర్గమెట్లున్నదో వారి మాటలును అట్లే యున్నవి. ఇందువలన ఇచట ప్రభు భోజనకాలమున ఏసు శరీరావయవములను రక్తమాంసములని భావించి, తినుచు త్రాగుచునున్నారు. ఇక వీరు గుడిలో గూడా సిలువ ఆకారములను (కట్టెను లేక రాతిని నిలువుగా నుంచి దానికడ్డముగా నొకరాతిని లేక కట్టెనుంచుట శిలువ యాకారమనబడును) చేసియుండుట కూడ ప్రతిమారూపమే - విగ్రహారాధనమే అనవచ్చును. ॥ 114 ॥

115. మరియు పరలోకమందు దేవుని ఆలయము తెరవబడగా దేవుని నిబంధనము ఆయన ఆలయములో కనబడెను. ॥ యో.ప్ర. 11 : 19 ॥

సమీక్ష:- స్వర్గమందు గల మందిరము ఎల్లప్పుడు మూసియే యుండును కాబోలు, అది ఎప్పుడో ఒకప్పుడు తెరవబడుచుండవచ్చును. ఏమి? పరమేశ్వరునికి కూడా ఒక మందిరము కలదనుట సంభవమా? వేదమందు చెప్పబడినట్లు పరమాత్ముడు సర్వవ్యాపకుడగుటవలన అతనికి మందిరముతో పనియే లేదు. కాని క్రైస్తవుల ఈశ్వరుడు సాకారుడు గదా! అతడు స్వర్గమందో భూమిమీదనో ఎక్కడున్న నేమి! ఏ ప్రకారముగా ఇచ్చట 'ఠంఠం పూం పూం' బాజాల లీలలు జరుగుచున్నవో అటులే ఈ క్రైస్తవుల స్వర్గమందును జరుగుచుండవచ్చును. అప్పుడప్పుడు వా రా నిబంధన పెట్టెను గూడ చూచుచుండవచ్చును. దానివలన ఏ ప్రయోజనమును నెరవేర్చుకొందురో! తెలియదు. వాస్తవమేమన ఇవన్నియు మనుష్యులను లోభమున పడవేసి తప్పుదోవ పట్టించుమాటలే అనుమాట స్పష్టము. ॥115॥

116. అప్పుడు పరలోకమందు ఒక గొప్ప వింత కనబడెను. అదేమనగా సూర్యుని ధరించుకొనిన ఒక స్త్రీ కనబడెను. ఆమె పాదముల క్రింద చంద్రుడును, శిరస్సుమీద పన్నెండు నక్షత్రముల కిరీటమును ఉండెను. ఆమె గర్భిణియై ప్రసవవేదన పడుచు ఆ నొప్పులకు కేకలు వేయుచుండెను. అంతట పరలోకమందు ఇంకొక వింత కనబడెను. ఇదిగో ఎఱ్ఱని మహాఘట సర్పము; దానికి ఏడు తలలును, పది కొమ్ములును ఉండెను. దాని తల మీద ఏడు కిరీటములుండెను. దాని తోక ఆకాశ నక్షత్రములలో మూడవభాగము ఈడ్చి వానిని భూమిమీద పడవేసెను. ॥ యో.ప్ర. 12 : 1-4 ॥

సమీక్ష:- ఇదెంత కపోలకల్పితమైన కట్టుకథలో ఇప్పుడు గమనించుడు. వీరి స్వర్గమున కూడా పాపము స్త్రీ కేకలు పెట్టుచు ఏడ్చును. ఆమె దుఃఖమును వినువారు కాని, దూరపరచువారు కాని లేరు. ఆ అజగరమను పాముతోక ఎంత పెద్దగానో ఉన్నది. దానితో అది నక్షత్రములలో మూడవభాగమును లాగి భూమి మీద పడవేసెను. బాగున్నది. భూమి చిన్నది. నక్షత్రములు పెద్దవి. ఇక్కడ అనుమానించవలసిన విషయమేమన అట్టి నక్షత్రములీ భూమి మీద నొకటి కూడ బట్టజాలదు. కాబట్టి వానిలోని మూడవ భాగము ఈ మాటను కల్పించినవాని ఇంటిమీదనే పడియుండవచ్చునని అనుమానింపదగియున్నది. ఇక నక్షత్రములలోని మూడవభాగము తన నిడివి గల తోకతో చుట్టి భూమిమీద బడవైచిన ఆ సర్పము కూడ అతని యింటియందే నివసించుచుండవచ్చును. ॥ 116 ॥

117. అంతట పరలోకమందు యుద్ధము జరిగెను. మిఖాయెలును అతని దూతలును ఆ ఘట సర్పముతో యుద్ధము చేయవలెనని యుండగా ఆ ఘటసర్పమును, దాని దూతలును యుద్ధము చేసిరి. ॥ యో.ప్ర. 12 : 7, 8 ॥

సమీక్ష:- ఈ క్రైస్తవుల స్వర్గమున కేగు ప్రతివాడు యుద్ధమందు దుఃఖమును పొందుచుండవచ్చును. అట్టి స్వర్గముమీది ఆశను ఇచ్చటనే విడిచి చేతులు ముడుచుకొనుడు. ఏమన శాంతికి భంగమును, ఉపద్రవములను కలుగజేయు స్థాన మీ క్రైస్తవులకే తగును. ॥ 117 ॥

118. **కాగా సర్వలోకమును మోసపుచ్చుచు అపవాది యనియు, సైతాననియు పేరుగల పురాతన సర్పమైన ఆ మహాఘట సర్పము పడద్రోయబడెను.** ॥ యో.ప్ర. 12 : 9 ॥

సమీక్ష:- ఏమి? ఆ సైతాను స్వర్గమందుండినప్పుడు లోకులను మోసపుచ్చుచుండలేదా? వానిని ఆమరణాంతము (జీవితాంతము) కారాగారమందు ఎందుకు పెట్టలేదు? లేక ఎందుకు చంపలేదు? వానిని భూమిమీద ఎందుకు పడవేసెను? ఇక లోకులనందరను భ్రమింపచేయునది సైతానైనచో మరి సైతానును భ్రమింపచేయువాడెవడు? సైతాను తనంతట తానే భ్రమపడునన్న సైతాను లేకపోయినను భ్రమపడువారు పడనే పడుదురు. ఇక ఈశ్వరు డా సైతానును భ్రమింపచేయునన్న అతడీశ్వరుడే కాజాలడు. మరి దీనివలన క్రైస్తవుల ఈశ్వరుడు కూడ సైతానునకు భయపడవచ్చునని తెలియుచున్నది. ఏమనగా ఈశ్వరుడు సైతానుకంటె మించినవాడేని అపరాధము చేయునపు డాసైతానును శిక్షింపలేదెందులకు? క్రైస్తవుల ఈశ్వరుని రాజ్య మా సైతాను రాజ్యములో నొక సహస్రాంశమైనను లెక్కకు రాదు. ఇందువలననే క్రైస్తవుల ఈశ్వరుడా సైతానును తొలగింపలేకపోవచ్చును. ఇక్కాలపు రాజ్యాధికారులయిన క్రైస్తవులు, బందిపోటుదొంగలు మున్నగువారిని బట్టి తక్షణమే శిక్షించునట్లును ఈ క్రైస్తవుల ఈశ్వరుడు శిక్షింపకుండెనని తేటపడుచున్నది. కావున వైదిక మార్గమును విడిచిపెట్టి ఈ క్రైస్తవుల వట్టి కల్పితముల మతమును స్వీకరించునట్టి బుద్ధిహీనుడెవడుండును? ॥ 118 ॥

119. **పృథివి సముద్రముల నివాసులారా! శోకము ఎందుకన అపవాది మీ వద్దకు దిగివచ్చియున్నాడు.** ॥ యో.ప్ర. 12 : 12 ॥

సమీక్ష:- ఏమి! ఆ ఈశ్వరుడు అక్కడికి మాత్రమే స్వామియు రక్షకుడునై యున్నాడా? పృథివికిని, మనుష్యాది ప్రాణులకును రక్షకుడును స్వామియు కాడా? భూమికి అతడే రాజైనచో ఆ సైతానును ఏల చంపలేకపోయెను? సైతాను లోకులనందరను భ్రమింపజేయుచున్నను ఈశ్వరుడు ఊరక చూచుచుండునే కాని వానిని తొలగింపలేడు. కావున మంచి ఈశ్వరు డొకడును; సమర్థుడైన దుష్టుడగు ఈశ్వరుడు మరొకడున్నట్లు విదితమగుచున్నది. ॥ 119 ॥

120. **మరియు నలుబది రెండు నెలలు తన కార్యము జరుపు నధికారము దాని కేర్పాటాయెను. కనుక దేవుని నామమును, ఆయన గుడారమును, పరలోక నివాసులను, దూషించుటకై దేవుని దూషింపవలెనని యది తన నోరు తెరచెను. మరియు పరిశుద్ధులతో యుద్ధము చేయను. వారిని జయింపను దాని కధికారమీయబడెను. ప్రతి వంశము మీదను, ప్రతి ప్రజమీదను, ఆ యా భాషలు మాటలాడువారిమీదను, ప్రతి జనము మీదను అధికారము దానికియ్యబడెను.** ॥ యో. ప్ర. 13 : 5-7 ॥

సమీక్ష:- సరి! భూమిమీది లోకులను భ్రమింపజేయుటకు సైతానును, పశ్వాదులను పంపి పరిశుద్ధులయిన మనుష్యులతో యుద్ధము చేయించుట యను కార్యము బందిపోటుదొంగల యజమానునిదే యనవచ్చునా? కాదా? ఇటువంటి కార్యమీశ్వరునిది కాని, ఈశ్వర భక్తులది కాని కాజాలదు. ॥ 120 ॥

121. మరియు నేను చూడగా ఆ గొఱ్ఱెపిల్ల సీయోను పర్వతము మీద నిలబడియుండెను. ఆయన నామమును, ఆయన తండ్రి నామమును నొసళ్ళయందు లిఖింపబడియున్న నూటనలుబది నాలుగువేలమంది ఆయనతో కూడ ఉండిరి. ॥ యో.ప్ర.14 : 1 ॥

సమీక్ష:- యేసు తండ్రి ఎక్కడున్నాడో చూడుడు. సీయోను పర్వతముపైన ఉన్నాడు. అతనితోపాటు అతని పుత్రుడైన ఏసు కూడా ఉండెను. కాని ఇతడొక్కడే ఒకలక్షనలుబది నాలుగువేలమందిని ఎట్లు లెక్కించెను? మరొక లక్ష నలుబది వేల జనులు మాత్రమే స్వర్గవాసులైరి. ఇక తక్కిన కోట్ల కొలది క్రైస్తవుల శిరస్సులమీద ముద్రలు పడినట్లే కద!. వారందరును నరకమునకే పోయిరా? ఇప్పుడు ఏసు తండ్రియు అతని సైనికులును అక్కడనున్నారా? లేరా? అను సంగతిని కనుగొనుటకు క్రైస్తవులు సీయోను పర్వతముమీదికి పోయి చూడవలసినదే. ఉన్నచో ఈ లేఖ సత్యమగును. లేనిచో అబద్ధము. ఒకానొక చోటు నుండి వచ్చియుండిరందురేని ఇంత గొప్ప సైన్యము తాను క్రిందికిని మీదికిని ఎగిరివచ్చుచు పోవుచు నుండుటకు వారు పక్షులా ఏమి? ఇక అతడు వస్తూ పోతూ ఉండెనేని ఒక జిల్లా న్యాయాధిపతి వలె అయ్యెను. మరి అతడొకడేనో ఇద్దరో లేక ముగ్గురో యున్న అది కూడ సంభవము కాదు. కాని తక్కువకు తక్కువ ప్రతి భూగోళమునకు ఒక్కొక్క ఈశ్వరుడు కావలసియుండును. ఎందుకన అనేక బ్రహ్మాండములను ఒక్కరు, ఇద్దరు, ముగ్గురు పాలించుటకు గాని సర్వత్ర కలిసి సంచరించుటకు గాని సమర్థులెప్పటికిని కాజాలరు. ॥ 121 ॥

122. వారు తమ ప్రయాసములు మాని విశ్రాంతి పొందుదురు. వారి క్రియలు వారివెంట పోవునని ఆత్మ చెప్పుచున్నాడు. ॥ యో.ప్ర.14 : ఆ. 13 ॥

సమీక్ష:- చూసారా! క్రైస్తవుల దేవుడు ఇక్కడ 'ఎవరి కర్మలు వారితోనే ఉండును. అనగా అందరికి కర్మానుసారమే ఫలము లభించు'నని చెప్పుచున్నాడు. అట్లు కాక ఏసు పాపములను తీసికొనును. పాపములను క్షమించును' అని ఏమేమో చెప్పుచున్నారు. ఇప్పుడీశ్వరుని మాట సత్యమా? లేక క్రైస్తవులదా? బుద్ధిమంతులైనవారు ఆలోచింపవలెను. ఒకే విషయములో రెండు అభిప్రాయములు సత్యములు కావు. ఇందొకటి తప్పక అబద్ధమైపోవును. అయితే క్రైస్తవుల దేవుడు సత్యవంతుడైతే మనకేమి? అసత్యవంతుడైతే మనకేమి? ॥ 122 ॥

123. మరియు దానిని దేవుని కోపమను ద్రాక్షల పెద్ద తొట్టిలో వేసెను. ఆ ద్రాక్షల తొట్టి పట్టణమునకు త్రొక్కబడెను. నూరు క్రోసుల దూరము గుఱ్ఱముల కళ్లెము మట్టుకు ద్రాక్షల తొట్టెలో నుండి రక్తము ప్రవహించెను. ॥ యో. ప్ర.14 : 19,20 ॥

సమీక్ష:- ఇక చూడండి! వీరి గప్పాలు పురాణములకన్నను మించినవి కావా? క్రైస్తవుల ఈశ్వరుడు కోపపడునపుడు మిగుల దుఃఖితుడునగుచుండవచ్చును. అతని కోపకుండములు నిండియున్నవన్న అతని కోపము జలమా? లేక ఒకానొక ద్రవపదార్థమా? మరియు నూరు క్రోసులవరకు రక్తము ప్రవహించుచుండెననుటయు అసంభవమే. ఎందుకనగా! రక్తము గాలి తగులుటవలన వెంటనే గడ్డకట్టుకొనును. కావున అదెట్లు ప్రవహించును? కాబట్టి ఇవన్నియు వట్టిమాటలే' అని తెలుసుకొనవలెను. ॥ 123 ॥

124. నేను చూడగా సాక్ష్యపు గుడార సంబంధమైన గర్భాలయము పరలోకమందు తెరువబడెను.

॥ యో.ప్ర. 15 : 5 ॥

సమీక్ష:- క్రైస్తవుల దేవుడు సర్వజ్ఞుడైనచో సాక్ష్యులతో పనేమి? ఏలయన అతడు తనంతట తానే అన్ని విషయములను తెలిసికొనియుండును. కావున వీరి దేవుడు సర్వజ్ఞుడు కాడనియే దీనివలన స్పష్టమగుచున్నది. అతడు మనుష్యుని వలె అల్పజ్ఞు డైనందున ఈశ్వరీయ కార్యము నెట్లు చేయగలుగును? ఇంతేకాదు, గొప్ప అసంభవములగు దూతల వార్తలెన్నియో ఈ ప్రకరణమున వ్రాయబడియున్నవి. కాని వానిని సత్యములని ఎవ్వరును నమ్మజాలరు. ఎంతవరకని వ్రాయును? ఈ ప్రకరణమునందన్నియు ఇటువంటి మాటలే నిండియున్నవి. ॥ 124 ॥

125. దాని నేరములను దేవుడు జ్ఞాపకము చేసుకొనియున్నాడు. అది యిచ్చిన ప్రకారము దానికి ఇయ్యండి. దాని క్రియల చొప్పున దానికి రెట్టింపు చేయండి.

॥ యో.ప్ర. 18 : 5, 6 ॥

సమీక్ష:- చూడండి! 'క్రైస్తవుల దేవుడు అన్యాయకారి' అని ప్రత్యక్షముగా కనిపించుచున్నది. ఎవడు ఎంత కర్మ చేయునో వానికి అంతే ఫలమిచ్చుట 'న్యాయ'మనబడును. కాని దానికంటె తక్కువగనో, ఎక్కువగనో ఫలముల నిచ్చుట 'అన్యాయము' అనబడును. అన్యాయకారిని ఉపాసించువారు అన్యాయకారులు ఏల కాకుందురు? ॥ 125 ॥

126. గొఱ్ఱెపిల్ల వివాహోత్సవ సమయము వచ్చినది. ఆయన భార్య తన్ను తాను సిద్ధపరచుకొనియున్నది.

॥ యో. ప్ర. 19 : 7 ॥

సమీక్ష:- ఆలకించితిరా! క్రైస్తవుల స్వర్గమందు వివాహములు కూడా జరుగుచున్నవి. ఏలయన! ఏసుకు వివాహము ఈశ్వరుడు అక్కడనే చేసెను. మరి అతని అత్తమామలు, బావమరుదులు మొదలగు వారెవరనియు, బిడ్డలెందరనియు వారిని అడుగవలయును. ఇక వీర్యనాశముతో బలము, బుద్ధి, పరాక్రమము, ఆయువు మున్నగునవి కూడా తగ్గిపోవుట వలన ఇప్పటికే ఏసు అచ్చట తన శరీరత్యాగమును చేసియుండవచ్చును. ఏలయనగా! సంయోగజన్య పదార్థమునకు వియోగము తప్పక కలుగును. ఇప్పటివరకును క్రైస్తవులు అతనియందు విశ్వాసమునుంచి మోసపోయిరి. ఇక ఎంతవరకు మోసపోవుదురో తెలియదు. ॥ 126 ॥

127. అతడు ఆదియందున్న సర్పమును అనగా అపవాదియు, సైతానును అను ఆ ఘట సర్పమును పట్టుకొని వేయి సంవత్సరములు వానిని బంధించెను. ఆ వేయిసంవత్సరములు గడచు పర్యంతమును ఇంక జనులను మోసపరుపకుండుటకై పాతాళమును మూసి దానికి ముద్రవేసెను.

॥ యో.ప్ర. : 20 : 2-3 ॥

సమీక్ష:- చూడండి! చచ్చుచు బ్రతుకుచు ఎటులనో సైతానును పట్టి వేయేండ్లవరకు బంధించెను. కాని వేయేండ్ల తర్వాత విడుదలైన పిదప మరల ప్రజలను భ్రమింపచేయకుండునా? ఇట్టి దుష్టుని శాశ్వతముగా కారాగారమునందే ఉంచవలసియుండెను. లేదా చంపివేయవలసియుండెను. కాని

సైతాను కలద'నుకొనుట ఈ క్రైస్తవుల వట్టి భ్రమయే. వాస్తవమునకు అదేమియు లేదు. భయము చూపి లోకులను తమ వలలో వేసికొనుటకై ఈ ఉపాయమును పన్నియుండును. ఎట్లన ఒక మోసకారి అమాయకులైన కొందరు మనుష్యులతో "రండు!! మీకు దేవదర్శనము చేయింతు"నని చెప్పి ఒక ఏకాంత స్థానమునకు తోడ్కొనిపోయి ఒక మనుష్యునకు నాలుగు భుజము లేర్పరచి చెట్ల పొదలలో నిలబెట్టి "మీరు కన్నులు మూసికొనుడు. చెప్పినపుడు తెరువుడు. మరల నేను చెప్పినప్పుడు చప్పున మూసుకొనుడు. మూసుకొననివా డంధుడ"గునని చెప్పినట్లు "మా మతమును నమ్మనివాడు సైతానుచే భ్రమింపబడినవాడని చెప్పుడు" అను ఈ మతస్థుల బోధలును గలవు. ఎట్లన అతడు ముందుకు వచ్చినప్పుడు చూడుడనియు, మరల తక్షణమే మూసుకొనుడనియు, తిరిగి పొదలో దాగినప్పుడు తెరువుడనియు చెప్పి 'మీరందరును నారాయణుని దర్శించి ధన్యులయితి'రని అన్నటులే ఈ మతానుయాయుల లీలలను కూడా తెలుసుకొనవలెను. కావున వీరి మాయలో ఎవరును చిక్కుకొనకూడదు. ॥ 127 ॥

128. భూమియు, ఆకాశమును ఆయన సమ్ముఖమునుండి పారిపోయెను. వానికి నిలువచోటు కనబడకపోయెను. మరియు గొప్పవారేమి, కొద్దివారేమి మృతులయినవారందరు దేవుని ఎదుట నిలువబడి యుండుట జూచితిని. అప్పుడు గ్రంథము విప్పబడెను. మరియు జీవన గ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను. ఆ గ్రంథములయందు వ్రాయబడియున్న వానిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి.

॥ యో.ప్ర. 20 : 11,12 ॥

సమీక్ష:- ఈ పసితనపు మాటలను చూడుడు. భూమి మరియు ఆకాశములు ఎట్లు పరుగెత్తగలుగును? మరి దేనిమీద నిలువగలుగును? ఎవని సమ్ముఖము నుండి పరుగిడునో అతని సింహాసనమును అతను ఎచ్చట నిలిచియుండగలిగిరి? మరి చనిపోయినవారు దేవుని ఎదుట నిలువబెట్టబడి నపుడు దేవుడు కూడా కూర్చుండియుండెనా లేక నిలిచియుండెనా? ఇచ్చటి కచేరీలలోను, దుకాణములలోను వ్యావహారిక విషయములన్నియు పుస్తకమునందు వ్రాయబడినటులే ఈశ్వరునియొద్దకూడ వ్రాయబడునా? జీవులందరి స్థితిగతులు వ్రాయున దీశ్వరుడా? అతని గుమాస్తాలా? ఇలాంటి మాటలను బట్టియే కద అనీశ్వరుని ఈశ్వరునిగాను, ఈశ్వరుని అనీశ్వరుని గాను ఈ క్రైస్తవాదులు చేసిపెట్టిరి. ॥ 128 ॥

129. వారిలో నొకండు వచ్చి ఇటు రమ్ము! పెండ్లికుమార్తెను అనగా గొఱ్ఱెపిల్ల యొక్క భార్యను నీకు చూపెదనని నాతో చెప్పెను. ॥ యో.ప్ర. 21 : 9 ॥

సమీక్ష:- బాగున్నది. యేసునకు స్వర్గమున పెండ్లికూతురు అనగా మంచిభార్య లభించి నందులకు సంతోషించుచుండవచ్చును. అచ్చటికి పోయిన క్రైస్తవులందరకు కూడా స్త్రీలు లభించుచుండవచ్చును. బిడ్డలు కూడ పుట్టుచుండవచ్చును. జనమెక్కువగుట వలన రోగములు ప్రబలి చనిపోవుచునుండవచ్చును. ఇలాంటి స్వర్గమునకు దూరమునుండియే చేతులుజోడించుట మంచిది. ॥ 129 ॥

130. అతడు ఆ కోలకర్రతో పట్టణమును కొలువగా దానికొలత ఏడువందలయాభై క్రోసులైనది. దాని పొడుగును, ఎత్తును, వెడల్పును సమముగా ఉన్నది. మరియు అతడు ప్రాకారమును కొలవగా అది మనుష్యుని కొలత చొప్పున నూటనలుబదినాలుగుమూరలైనది. ఆ కొలత దూతకొలతయే. ఆ పట్టణపు ప్రాకారము సూర్యకాంతములతో కట్టబడెను. పట్టణము స్వచ్ఛమైన స్ఫటికముతో సమానమైన శుద్ధ సువర్ణముగా ఉన్నది. ఆ పట్టణపు ప్రాకారపు పునాదులు అమూల్యమైన నానావిధ రత్నములతో అలంకరింపబడియుండెను. మొదటి పునాది సూర్యకాంతపుఱాయి, రెండవది నీలము, మూడవది యమునారాయి, నాల్గవది పచ్చ, ఐదవది గోమేధికము, ఆరవది కెంపు, ఏడవది సువర్ణరత్నము, ఎనిమిదవది వైఢూర్యము, తొమ్మిదవది పుష్యరాగము, పదవది సువర్ణలశునీయము, పదకొండవది పద్మరాగము, పన్నెండవది సుగంధము. దాని పన్నెండు గుమ్మములు పన్నెండు ముత్యములు. ఒక్కొక్క గుమ్మము ఒక్కొక్క ముత్యముతో కట్టబడియున్నది. పట్టణపు రాజవీధి శుద్ధసువర్ణమయమై స్వచ్ఛమైన స్ఫటికమును పోలియున్నది.

॥ యో.ప్ర. 21 :16-21 ॥

సమీక్ష:- క్రైస్తవుల స్వర్గవర్ణన వినుడు. క్రైస్తవులు పుట్టుచు, గిట్టుచు నుందురేని ఇంత గొప్ప పట్టణమందెట్లు యిముడగలరు? ఏలయన అందు మనుష్యుల ఆగమనమే కలదు. దాని నుండి తిరిగి వెళ్ళిపోవుట లేదు. ఈ పట్టణము బహుమూల్య రత్నములచే నిర్మింపబడియున్నట్లు నమ్మియున్నారు. కాని 'బంగారుతో చేయబడినది' అను మున్నగు వ్రాతలన్నియు కేవలము అమాయకులైన మనుష్యులను మోసపుచ్చి తమ వలలో చిక్కించుకొనుటకు కల్పింపబడిన లీలలే. అహో! ఆ పట్టణపు వెడల్పు నిడివి వ్రాసినది సంభవమా? ఎత్తు ఏడువందల యాభై క్రోసులనునది ఎట్లు సంభవమగును? ఇది వట్టి మిథ్యాలాపమే. ఇంత పెద్ద ముత్యము లెట్లు చిక్కియుండును? ఆ లేఖ వ్రాసినవాని ఇంటి కుండలలో ఉండెనేమో? ఈ గప్పాలు పురాణములకు తండ్రులై యున్నవి. ॥130॥

131. దుష్టవస్తువును గాని, నింద్యకార్యమును గాని చేయువాడు, అసత్యవాది దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపడు. ॥ యో.ప్ర.21 : 27 ॥

సమీక్ష:- అటు లేని పాపులు కూడా క్రైస్తవమతములో చేరుటవలన స్వర్గమునకు పోగలుగుదురని క్రైస్తవులెందులకు చెప్పుచున్నారు? అది సరికాదు. అటులైనచో (స్వప్నమందలి) మిథ్యావాక్యములుచెప్పు యోహాను ఎప్పుడును స్వర్గమున ప్రవేశింపనేరడు. యేసు కూడా స్వర్గమునకు పోకుండవచ్చును. ఏలయన ఒక పాపియే స్వర్గమును పొందనేర నప్పు డనేక పాపుల పాపములను పొందువాడు స్వర్గవాసు డెట్లు కాగలడు? ॥ 131 ॥

132. ఇకమీదట శాపగ్రస్తమైన దేదియు దానిలో ఉండదు. దేవుని యొక్కయు గొఱ్ఱెపిల్ల యొక్కయు, సింహాసనము దానిలో ఉండును. ఆయన దాసులు ఆయనను సేవించుచు ఆయన ముఖావలోకనము చేయుచుందురు. ఆయన నామము వారి నొసళ్ళయందుండును.

రాత్రి యిక ఎన్నడు ఉండదు. దీపకాంతి కాని సూర్యకాంతి కాని వారి కక్కరలేదు. దేవుడైన ప్రభువే వారిమీద ప్రకాశించును. వారు యుగయుగములు రాజ్యము చేయుదురు.

॥ యో.ప్ర.22 : 3-5 ॥

సమీక్ష:- చూడండి! ఇదియే కద క్రైస్తవుల స్వర్గము! ఏమి? ఈశ్వరుడును, యేసును నిరంతరము సింహాసనముపై కూర్చుండియుందురా? మరి వారి దాసులు వారి ఎదుట నిలబడి సర్వదా వారి ముఖావలోకనమే చూచుచుందురా? మీ దేవుని ముఖము యూరోపియనుల వలె తెల్లనిదా? ఆఫ్రికనులవలె నల్లనిదా? లేక అన్యదేశీయుల బోలినదా? చెప్పుడు! ఈ స్వర్గము సైతమొక బంధనమే యన నొప్పును. ఏలయన ఎచ్చట కనిష్ఠ జ్యేష్ఠత్వములుండి ఆ నగరమందే నివసింపవలసి వచ్చునో అట దుఃఖమేల కలుగకుండును? ఇక ముఖము గల ఈశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు ఎప్పుడును కాజాలడు. ॥ 132 ॥

133. ఇదిగో త్వరగా వచ్చుచున్నాను. వాని వాని క్రియ చొప్పున ప్రతిదానికి యిచ్చుటకు నేను సిద్ధపరచిన జీతము నా యొద్ద ఉన్నది.

॥ యో.ప్ర. 22 : 12 ॥

సమీక్ష:- కర్మానుసారమే ఫలము లభించు ననుట నిజమైనప్పుడు పాపములెప్పటికిని క్షమింపబడనేరవు.

క్షమింపబడునన్న ఈ దూతల మాటలు అబద్ధములు. ఎవరేని క్షమింపబడు నను మాటలు కూడ సువార్తలలో వ్రాయబడియున్న దందురేని పూర్వాపరవిరుద్ధమైన మిథ్యాసాక్ష్యమయ్యెను కావున ఈ మిథ్యోక్తులను అంగీకరించుట మానుడు. ఇక ఎంతవరకని వ్రాయుదుము. వీరి బైబిలునందు వేల కొలది విషయములు ఖండింపదగినవి కలవు. వానిలో నుండి కొన్నిటిని మాత్రమే అందరకు బోధపడుటకు ఇందు ఉదాహరించి యున్నాడను. ఇంతటితోనే బుద్ధిమంతులధికముగ ఊహించి తెలిసికొనగలరు. ఈ బైబిలునందు కొన్ని మాటలు మాత్రమే గాక తక్కినవన్నియు మిథ్యోక్తులే నిండియున్నవి. అసత్యముతో గూడియున్న సత్యము గూడ పరిశుద్ధముగ నుండనటులే ఈ బైబిలు కూడ మాననీయము కాజాలదు. కాని సత్యమనునది ఆ వేదములను స్వీకరించునపుడే అలవడును. ॥133॥

శ్రీమద్దయానందసరస్వతీస్వామికృత
సుభాషావిభూషితమైన సత్యార్థప్రకాశంలో
క్రైస్తవమత విషయంగల
త్రయోదశ సముల్లాసం సంపూర్ణం.

చతుర్దశ సముల్లాసము

అనుభూమిక (4)

ముసల్మానుల మత సమీక్ష

ఈ పదునాల్గవ సముల్లాసం ముసల్మానుల మతాన్నిగూర్చి ఇతరగ్రంథాలనుండికాకుండా కేవలం వారి ఖురానునుబట్టియే వ్రాయబడింది. ఎందుకనగా ముసల్మానులు ఖురానునందే పూర్ణవిశ్వాసమునుంచినారు. వారిలో సంప్రదాయాలున్నందున శబ్దార్థాది విషయాలలో కొంత విరోధమున్నప్పటికిని ఖురాను విషయములో అందరూ ఒకటౌతారు. అరబ్బీభాషలో ఉన్న ఖురానునకు మౌల్వీలు ఉర్దూభాషలో అందర్థము వ్రాసినారు. ఆ అర్థమే ఆర్యభాషాంతరీకరణ చేయబడి గొప్పగొప్ప అరబ్బీ పండితులచే శోధింపబడిన పిదప దేవనాగరి అక్షరములలో వ్రాయింపబడినది. ఎవరైనా ఈ అర్థము బాగు లేదంటే మొదట మౌల్వీసాహెబులు వ్రాసిన అనువాదములను రద్దుపరచి తరువాత ఈ విషయము మీద వ్రాయాలి. ఎందుకనగా కేవలం మనుష్యుల న్నతి కొరకు, సత్యాసత్యాల నిర్ణయం కొరకు వ్రాయబడింది. దీనివలన అన్ని మతవిషయాలు కొంత బోధపడుటయేకాక మనుష్యులకు పరస్పరం విచారించుకొనుట కవకాశం చిక్కి ఒకరు మరొకరి దోషాలను ఖండిస్తూ గుణాలు గ్రహింపగలుగుతారు. మరొక మతమందో లేక ఈ మతమందో వ్యర్థంగా గుణదోషాలను ఆరోపించుటలేదు. కాని గుణాలు గుణాలుగాను, దోషాలు దోషాలుగాను అందరికి తెలియబడును. ఒకడొకనితో అబద్ధం ప్రచారం చేయుటకుగాని, సత్యాన్ని అడ్డుకొనుటకుగాని సమర్థుడు కాకుండును. సత్యాసత్యాలు తేటపడినను ఇష్టమున్నవాడు అంగీకరింప వచ్చును లేదా అంగీకరింపక పోవచ్చును. ఎవరిపట్ల బలాత్కారము జరుగదు.

తమవే కాని యితరులవే కాని దోషాలను దోషాలుగాను, గుణాలను గుణాలుగాను తెలిసికొని గుణాలను గ్రహించి దోషాలను పరిత్యజించుటయే సజ్జనుల పద్ధతి. అట్లే హఠాన్ని, మొండితనాన్ని తగ్గించాలి - తగ్గింపజేయాలి. ఏమన, పక్షపాతముతో ఎన్నెన్ని అనర్థాలు జగములో జరుగలేదు? జరుగుచుండుటలేదు? జరుగకుండబోవు? క్షణభంగురమైన ఈ జీవనమందు పరులకు హాని కలిగించి, తాను లాభం వదలుకొనుట ఇతరుల నట్లుంచుటయు, మనుష్యత్వానికి దూరమైన విషయం.

దీనియందు విరుద్ధమేమైనా వ్రాసినచో దానిని సజ్జనులు తెలియబరతురుగాక! అది ఉచితముగా నున్న అంగీకరింపబడును. ఇది హఠాన్ని, దురాగ్రహాన్ని, ఈర్ష్యాద్వేషాలను, వాదవివాదాలను, విరోధాన్ని తగ్గించుటకు వ్రాయబడినదేకాని వీటిని పెంచుటకు కాదు. మేలుకొలుగునట్లు ప్రవర్తించుట, లాభం కలుగజేయుట మా ముఖ్యకార్యం. కావున ఈ పదునాల్గవ సముల్లాసంలో ముసల్మానుల మతాన్ని గూర్చి సజ్జనులందరి ఎదుట నివేదించుచున్నాను. ఇష్టమైనదానిని గ్రహించి, ఇష్టం కాని దాన్ని త్యజించుడు.

బుద్ధిమద్వర్యులకు విస్తరింపనేల

చతుర్దశ సముల్లాసము

మహమ్మదీయ మత విషయాన్ని గూర్చిన సమీక్ష

1. **అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను.**

– అల్ ఫాతిహ సూరా:1

సమీక్ష:– ఈ ఖురాను దేవునిచే చెప్పబడిందని మహమ్మదీయులంటారు. కాని ఈ వాక్యము ద్వారా దీనిని రచించినవాడు మరొకడున్నాడని తెలుస్తున్నది. ఎట్లనగా పరమేశ్వరునిచే ఇది రచింపబడినచో 'దేవుని పేరుతో ఆరంభము' అని అనబడదు. "మానవుల ఉపదేశార్థమై ఆరంభము" అని అనబడును. లేదా మానవులకు 'మీరిట్లనుడు' అని తెలియజేయుట కూడా సరియైనది కాదు. ఎట్లంటే దీని ద్వారా దేవుని పేరుతో పాపం కూడా ఆరంభమై అతని పేరును కూడా చెడగొట్టును. అతడు క్షమించువాడు, దయగలవాడే యైతే అతడు తన సృష్టియందు మానవుల సుఖం కొరకు ఇతర ప్రాణులను చంపి వాటికి దారుణ బాధను కలిగించి మాంసాన్ని తినుమని ఆజ్ఞనేల ఇచ్చాడు? ఆ ప్రాణులు నిరపరాధులు కావా? పరమేశ్వరునిచే సృష్టింపబడినవి కావా? పరమేశ్వరుని పేరుతో "మంచిమాటలకు ప్రారంభము చెడు మాటలకు కాదు" అని చెప్పవలసియుండెను. ఇట్లు చెప్పుటలో గందరగోళమేర్పడినది. పరమేశ్వరుని పేరుతో దొంగతనం, వ్యభిచారం, అసత్యభాషణాదులతో అధర్మాలకు కూడా ఆరంభం చేయవచ్చునా? దీని ద్వారానే కసాయి వంటి మహమ్మదీయులు ఆవు మున్నగువాని గొంతులు కోయు సమయంలో కూడా 'బిస్మిల్లాహ్' అను ఆరంభ వచానాన్ని చదువుటను గమనించండి. ఈ విధంగా చెడు విషయాల ఆరంభం కూడా అల్లాపేరుతో మహమ్మదీయులు చేస్తుంటారు. ఇక వారి దేవుడు దయగలవాడు ఎలా అవుతాడు? ఎన్నటికిని కాజాలడు ఎందుకంటే అతని దయ ఆ పశువులపై లేదు కాబట్టి. మహమ్మదీయులు దీని అర్థాన్ని గుర్తించుకున్నచో దేవుడు ఈ వచనాన్ని ప్రకటించుట వ్యర్థం. ఒకవేళ వారు దీని అర్థాన్ని మరొకవిధంగా చెప్పినచో మరి సరియైన అర్థమేది? అను మొదలగు ప్రశ్నలు కలుగును. (1)

2. **అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు. ఆయన సకల లోకాలకు ప్రభువు, అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు, ప్రతిఫల దినానికి స్వామి.**

- అల్ ఫాతిహ సూరా :2.

సమీక్ష:- ఖురానులో ఖుదా ప్రపంచాన్ని పాలించువాడు. అందరిపై క్షమా దయలను చూపువాడు అయితే అన్య మతస్థులనేకాక పశ్వాదులను కూడా ముసల్మానులచేత చంపించుటకు ఆజ్ఞనొసంగెడువాడుకాడు. క్షమించువాడైతే పాపులను కూడా క్షమించునా? అటులైన ముందు చెప్పబోవునట్లు "కాఫిరులను చంపుడు". (ఖురాను పైగంబరులను అంగీకరింపనివారు కాఫిరులు) అని ఎందుకు వ్రాసినాడు? కావున ఖురాను ఈశ్వరకృతము కాదు.(2)

3. **మేము నిన్నే ఆరాధిస్తాము, సహాయం కొరకు నిన్నే అర్థిస్తాము. మాకు ఋజుమార్గం చూపించు.** **- అల్ ఫాతిహ సూరా : 3.**

సమీక్ష:- ఖుదా ఎల్లప్పుడు న్యాయం చేయడా? ఏదో ఒక దినమునాడు న్యాయం చేస్తాడా? ఇది అన్యాయంగానే ఉన్నది. అతనినే భజించాలి. అతన్నే సాహాయం కోరాలనడం సరియైనదే కాని చెడు కార్యాలకుకూడా సహాయం కోరాలా? చక్కని మార్గం కేవలం ముసల్మానులదేనా? ఇతరుది కాదా? చక్కని మార్గాన్ని ముసల్మానులేల గ్రహించడంలేదు? ఏమి? చక్కని మార్గం కీడు కలుగజేయటానికే కోరుట లేదుగద! అందరికి ఒకటేయైనచో 'ముసల్మానులందే' అను విశేష మేమియు ఉండకూడదు. ఇతరుల మేలు కోరనివారు పక్షపాతం కలవారే అవుతారు. (3)

4. **నీవు అనుగ్రహించినవారూ, నీ ఆగ్రహానికి గురికానివారూ, మార్గభ్రష్టులు కానివారూ అనుసరించిన మార్గము.** **- అల్ ఫాతిహ సూరా : 4.**

సమీక్ష:- ముసల్మానులు పూర్వజన్మను, పూర్వకృత పాపపుణ్యాలను ఒప్పుకోకుంటే కొందరిపట్ల దయచూపి మరికొందరిపట్ల దయచూపక పోవుట వల్ల ఖుదా పక్షపాతి అవుతాడు. ఎందుకన! పాపపుణ్యాలే లేకుంటే సుఖదుఖాలను పొందజేయుట కేవలం అన్యాయమే అవుతుంది. నిష్కారణంగా ఒకదానిపై దయను, మరొకదానిపై క్రోధాన్ని చూపుట కూడ స్వభావానికి విరుద్ధం. అతడు దయనో, క్రోధాన్నో చూపలేదు. ఏమన వారికి పూర్వసంచిత పుణ్యపాపాలే లేనపుడు ఒకదానిపై దయను, మరొకదానిపై క్రోధాన్ని చూపుననుట సంభవం కాదు. ఇక ఈ సూరతునకు టిప్పణి "ఈ విధంగా అల్లాసాహెబు మనుష్యుల నోటితో నుచ్చరింపజేసెనని" వ్రాయబడింది. అది నిజమైతే 'అలీఫ్ బే' మొదలుగా గల అక్షరాలను కూడ ఖుదా చదివింప యుండవచ్చును. అక్షరజ్ఞానం లేనివారు ఈ సూరతు నెట్లు చదువగలరు? ఏమి నోటితోనే చదివింపబడుచు, చదువుచు బోయిరా? అటులేని ఖురాను నంతటిని నోటితోనే చదివించి యుండవచ్చును. పక్షపాతంతో కూడిన మాటలుండు పుస్తకం ఈశ్వరకృతం కాజాలదని దీనివలన గ్రహించాలి. అరబ్బీ భాషయందుండుటవలన అరేబీయులకు దీన్ని చదువుట సులభమును , అన్యభాష నెరుగువారికి కఠినమునగును గాన ఖుదాయందు పక్షపాతం సంభవించుచున్నది. పరమేశ్వరుడు సృష్టిలోని సమస్త దేశములందలి మనుష్యులయెడ

న్యాయపూర్వకంగా ఎల్ల దేశభాషలకంటె విలక్షణమై ఎల్ల దేశీయులకు సమాన పరిశ్రమచే విదితము కాగల సంస్కృతభాషయందే వేదములను ప్రకాశపరచి యున్నట్లు రచించి యున్న ఈ దోషం సంభవింపకుండెడిది. (4)

5. **అలిఫ్ లామ్ మీమ్. ఇది అల్లాహ్ గ్రంథము. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. అల్లాహ్ భీతి కలవారికి ఈ గ్రంథం మార్గదర్శకం. వారు అగోచర విషయాలను విశ్వసిస్తారు. నమాజును స్థాపిస్తారు. మేము ప్రసాదించిన దాని నుండి (మా మార్గంలో) ఖర్చుచేస్తారు. మేము నీపై అవతరింపజేసిన గ్రంథాన్నీ (ఖురాను), నీకు పూర్వం అవతరింపజేసిన గ్రంథాలనూ విశ్వసిస్తారు. పరలోకాన్ని దృఢంగా నమ్ముతారు. ఇలాంటి వారు తమ ప్రభువు తరఫునుండి ఋజుమార్గంలో ఉన్నారు. సాఫల్యం పొందేవారు వారే. (ఈ విషయాలను) తిరస్కరించిన వారిని నీవు హెచ్చరించినా, హెచ్చరించకపోయినా ఒకటే. వారు విశ్వసించేవారు కాదు. అల్లాహ్ వారి హృదయాలకూ, వారి చెవులకూ ముద్రవేశాడు. వారి కన్నులపై తెర పడింది. వారు కఠిన శిక్షకు అర్హులు.**

– అల్ బఖర సూరా : 2-7.

సమీక్ష:– ఏమి? ఖుదా తన నోటితో తానే తన పుస్తకాన్ని పొగడుకొనుట డంభాలాపము కాదా? ధార్మికులైనవారు స్వాభావికంగా సత్యమార్గగాములై ఉంటారు. ఆ సత్యమార్గమున నున్నవారికి ఈ ఖురాను సత్యమార్గాన్ని చూపకపోతే దీని ప్రయోజనమేమి? పాపపుణ్యాలు "పురుషార్థమను సంచితము" లేనిచో ఖుదా తన కోశము నుండియే ఖర్చుపెట్టుటకు ఇస్తున్నాడా ఏమి? ఇచ్చునట్లైతే అందరికెందుకీయడు? ఇక ముసల్మానులేల పరిశ్రమము చేయుచున్నారు? బైబిలు, ఇంజీలు మొదలగునవి విశ్వసింపదగినవైతే ముసల్మానులు ఖురానును విశ్వసించునట్లు ఇంజీలు మున్నగువానిని ఎందుకు విశ్వసించుట లేదు? విశ్వసించుచున్నట్లైతే ఖురాను యొక్క అవసరమే ఉండదు కదా? (వాస్తవంగా ఈశబ్దము "ఖుర్అన్" అని ఉన్నది. కాని భాషలో లోకులు మాట్లాడునపుడు కురానని చెప్పుచున్నారు. కావున నటులే వ్రాయబడినది) కురాను నందనేక విషయము లున్నవని చెప్పుదురేని ఖుదా మొదటి పుస్తకమందు వ్రాయుటను మరచిపోయి యుండెనా? మరవలేదన్న కురాను రచించుట నిష్ప్రయోచనం. బైబిలులోని, కురానులోని కొన్ని విషయాలుతప్ప తక్కినవన్నియు సమానాలై యున్నట్లు మాకు తెలిస్తున్నది. వేదంవలె ఒక పుస్తకాన్నే ఎందుకు రచింపలేదు? కయామతునందే విశ్వాసముంచవలయునా? ఇతరమునందుంచవలదా?

ఏమి క్రైస్తవులు, ముసల్మానులు మాత్రమే దేవుని శిక్షలో నున్నారా? వారియందు ఎవడునూ పాపాత్ముడు లేడా? ధర్మవిహీనులైన క్రైస్తవులు, ముసల్మానులును గూడ విడుదల పొందుతారా? ఇతర ధర్మాత్ములైన వారు పొందరా? ఇది గొప్ప అన్యాయం, అనుచితం కాదా?

ముసల్మానుల మతం అంగీకరింపని వారిని కాఫిరులనుట ఏక పక్షపు తీర్పు కాదా? పరమేశ్వరుడు వారి యంతఃకరణముల మీదను, చెవుల మీదను ముద్రలు వేసి యున్నందుననే

కదా వారు పాపము చేయుచున్నారు? వారి దోషమేమియు లేదు. ఆ దోషం ఖుదాదే. ఇంక వారికి సుఖదుఃఖాలు కాని పాపపుణ్యాలు కాని కలుగనేరవు. మరి వారినేల శిక్షించుచున్నారు? ఏలయన వారు పాపమో, పుణ్యమో స్వతంత్రంగా చేయలేదుగదా! (5)

6. వారి హృదయాలకు ఒక రోగం పట్టుకుంది. అల్లాహ్ ఆ రోగాన్ని మరింత అధికం చేశాడు.

– అల్ బఖర సూరా :10.

సమీక్ష:– చూచితిరా అపరాధము లేనిదే ఖుదా వారి రోగములను పెంచెను. దయ రాలేదా! ఆ దీనజనులు ఎంత బాధపడినారో గదా! ఇది సైతాను కంటె మించిన సైతానుతనపు పనికాదా? ఒకని మనస్సు మీద ముద్రవేయుట, ఒకని రోగాన్ని పెంచుట అను పనులు ఖుదావి కాజాలవు. ఏలయన రోగము తన పాపము వలననే పెరుగును.(6)

7. మీ కొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను సృష్టించినవాడూ ఆయనే.

– అల్ బఖర సూరా :22.

సమీక్ష:– మంచిది. ఇది భలే బాగున్నది. ఆకాశమొకనికి ఆచ్ఛాదనం కాగలదా? ఇది అవిద్యతో కూడినమాట. ఆకాశాన్ని నొకకప్పుగా కమ్ముటయు హాస్యపు మాటయేకదా! ఏదో ఒక పృథివినే ఆకాశమని నమ్ముదురేని అది వారి ఇంటిమాటయే యగును. (7)

8. మేము మా దాసునిపై అవతరింపజేసిన గ్రంథం గురించి, అది మా గ్రంథం అవునో కాదో అని మీకు సందేహం ఉన్నట్లైతే దానివంటి ఒక్క సూరానైనా మీరు రచించి తీసుకురండి. మీ సహచరులందరిని పిలుచుకోండి. ఒక్క అల్లాహ్ తప్ప మరెవరి సహాయాన్నయినా పొందండి. మీరు సత్యవంతులే ఐతే ఈ పని చేసి చూపించండి. కాని మీరు అలా చెయ్యకపోతే – నిశ్చయంగా ఎన్నటికీ చెయ్యలేరు– భయపడండి, మానవులు, రాళ్ళు ఇంధనం కాగల ఆ అగ్నికి. అది సత్యతిరస్కారుల కొరకు తయారు చెయ్యబడింది.

– అల్ బఖర సూరా :23.24.

సమీక్ష:– ఆహా! దానివంటి సూరతయినా వ్రాయబడలేదనుట సరియైనదా? అక్బరు బాదశాహ కాలంలో మౌలవీ ఫైజీ అనువాడు సున్నలేని ఖురానును రచించి యుండలేదా? అది యే నరకపుటగ్ని? ఈ అగ్నికి భయపడవలదా? దీనిలో పడునదంతయు ఇంధనమే అగును. కాఫీరుల కొరకు ఖాలు సిద్ధపరపబడి యున్నవని ఖురానునందు వ్రాయబడినట్లే, మ్లేచ్ఛుల కొరకు ఘోరనరకము సిద్ధమయియున్నదని పురాణములందు వ్రాయబడి యున్నది. ఇప్పుడెవని మాట నిజమని నమ్మవలెనో చెప్పుడు? వారి వారి వచనములవలన నిద్దరు స్వర్గగాములుగాను ఒండొరుల మతభేదమువలన నిద్దరు నరకగాములగుచున్నారు. కాని వీరి ఈ వ్యర్థాలాపములన్నియు వట్టివే. సకల మతములలోగల ధర్మాత్ములందరు సుఖమును, పాపాత్ములందరు దుఃఖమును తప్పక పొందుదురు. (8)

9. **ఈ గ్రంథాన్ని విశ్వసించి, (దాని బోధనలకు అనుగుణంగా) తమ నడవడికను తీర్చి దిద్దుకునే వారికి సంతోషవార్త వినిపించు: కాలువలు ప్రవహించే ఉద్యానవనాలు వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి అని. ఆ వనాలలోని పండ్లు ఆకారంలో భూలోకంలోని పండ్లను పోలి ఉంటాయి. తినటానికి ఏమైనా పండ్లు ఇవ్వబడినప్పుడల్లా, వారు "ఇలాంటి పండ్లే పూర్వం భూలోకంలో మాకు ఇవ్వబడేవి" అని అంటారు. అక్కడ వారి కొరకు పవిత్రలైన భార్యలు ఉంటారు. వారు అక్కడే శాశ్వతంగా ఉంటారు.** – అల్ బఖర సూరా:- 25

సమీక్ష:– మంచిది. ఈ ఖురాను నందలి స్వర్గములో జగత్తులో లేని ఉత్తమ పదార్థమేమున్నది? ఏలయన, జగత్తులోగల పదార్థాలే ఈ ముసల్మానుల స్వర్గంలో ఉన్నవి. కాని విశేషమేమంటే ఇక్కడ పురుషులు పుట్టుచు, గిట్టుచు, వచ్చుచు, బోవుచు ఉన్నట్లు ఆ స్వర్గమందు తటస్థించదు. ఇక్కడ స్త్రీలెప్పుడూ ఉండరు. అక్కడ చక్కని స్త్రీలు సర్వదా యుందురేని కయామతు రాత్రి రానంతవరకు పాపమా స్త్రీలెట్లు కాలము గడుపగలుగుదురో గద! ఖుదాయే వారిపై దయ చూపుచుండవచ్చును. ఖుదా నాశ్రయించియే వారు కాలం గడుపుచుండవచ్చునన్న బాగుగనే యున్నది. ఈ ముసల్మానుల స్వర్గం, గోకులపు గోసాయిల గోలోకంవలె వారి మందిరము వలె కనబడుచున్నది. అచ్చట స్త్రీలకున్నంత మాన్యత పురుషులకు లేదు. అటులే ఖుదా గృహమందును స్త్రీలకు గౌరవం ఎక్కువగా ఉన్నది. వారిపై ఖుదా ప్రేమకూడా ఎక్కువగా ఉన్నది.ఆ పురుషుల మీద లేదు. ఏలయన ఖుదా బీబీలను స్వర్గమందెల్లప్పుడుంచుతాడు. పురుషుల నుంచలేదు. ఆ బీబీలు ఖుదా అంగీకారం లేకుండా స్వర్గమందెట్లుండ గల్గుతారు? ఈ వార్త నిజమేయైతే ఖుదా స్త్రీలోలుడైయుండవచ్చును. (9)

10. **తరువాత అల్లాహ్ ఆదమ్‌కు అన్ని వస్తువుల పేర్లూ నేర్పాడు. వాటిని దూతలకు చూపించి, "ప్రతినిధి నియామకం సంక్షోభానికి దారితీస్తుంది అనే, మీ అభిప్రాయమే నిజమయితే, వీటి పేర్లు కాస్త నాకు చెప్పండి?" అని అల్లాహ్ వారిని అడిగాడు. వారు కదు వినమ్రులై ఇలా అన్నారు: (ప్రభూ!) "దోష రహితుడవు నీవే! నీవు తెలిపినది తప్ప మాకు మరేమి తెలియదు. వాస్తవంగా సర్వం తెలిసినవాడవూ సర్వాన్ని అర్థం చేసుకోగలవాడవూ నీవే!" అప్పుడు అల్లాహ్ ఆదమ్‌తో, "ఈ వస్తువుల పేర్లను నీవు వారికి తెలుపు" అని అన్నాడు. ఆదమ్ వారికి వాటి పేర్లన్నీ తెలుపగానే, అల్లాహ్ ఇలా ప్రకటించాడు: "భూమ్యాకాశాలలో మీకు గోప్యంగావున్న సత్యాలన్నీ నాకు తెలుసనీ, మీరు ప్రకటించేవీ, మీరు దాచేవీ అన్నీ నాకు తెలుసనీ నేను మీకు చెప్పలేదా?"** – అల్ బఖర సూరా :30-33.

సమీక్ష:– మంచిది. దేవదూతలనిట్లు మోసపుచ్చి తనను తాను పొగడుకొనుట ఖుదా పనియా? ఇది డాంబికం కాదా? దీని నే విద్వాంసుడూ అంగీకరించడు. ఇక ఎట్టి అభిమానమునూ చూపడు. ఇటువంటి మాటల ద్వారానే ఖుదా తన గొప్పతనాన్ని చాటుకొనగోరుతున్నాడా? తెలివిలేని జనులలో ఒక డెట్టి అక్రమాలనైనను సాగించుకొనవచ్చును. (10)

11. మేము దూతలకు "మీరు అందరూ ఆదమ్‌కు తల వంచండి" అని ఆదేశించినప్పుడు, వారందరూ తలవంచారు. కాని ఇబ్లీసు ధిక్కరించాడు. దురహంకారానికి గురి అయ్యాడు. అవిధేయులలో కలసిపోయాడు.

– అల్ బఖర సూరా : 34.

సమీక్ష :– దీనివలన ఖుదా సర్వజ్ఞుడు కాడు. అనగా భూతభవిష్యద్వర్తమానములను తెలుసుకోలేనివాడుగా ఉన్నాడు. తెలిసినవాడేయైతే సైతానును ఎందుకు పుట్టిస్తాడు? ఇక ఖుదాలో పరాక్రమం కొంతకూడా లేదు. సైతాను ఖుదా ఆజ్ఞను పాలింపలేదు. ఐనను ఖుదా వాని నేమియు చేయలేకపోయెను. ఒక సైతాను కాఫిరుడే ఖుదాను గూడ తారుమారు చేసినాడన్న ఇక ముసల్మానుల కథనానుసారం కోట్లకొలది కాఫిరులున్నచోట ముసల్మానుల ఖుదాది కాని, ముసల్మానులది కాని ఏమి సాగుతుంది? ఇక అప్పుడప్పుడు ఖుదా ఒకని రోగాన్ని పెంచుచు, ఒకని భ్రమింప చేస్తున్నాడుగదా! ఈ మాటలను ఖుదా సైతాను నుండియే నేర్చియుండవచ్చుకదా! ఏమన సైతానునకు గురువు ఖుదాకాక మరెవ్వడు కాజాలడు. (11)

12. మళ్లీ మేము ఆదమ్‌తో ఇలా అన్నాము: "నీవు నీ భార్య ఇద్దరూ కలసి స్వర్గంలో నివసించండి. ఇక్కడ మీరు మీకిష్టమైన దానిని యథేచ్ఛగా తినండి. కాని ఈ చెట్టు దరిదాపులకు పోవద్దు. ఒకవేళ పోతే, మీరు అతిక్రమదారులలో కలిసి పోతారు." చివరకు సైతాను వారిద్దరినీ ఆ చెట్టువైపునకు ఆకర్షించి, మా ఆజ్ఞపాలనం నుండి దూరం చేశాడు. వారిని తమ పూర్వపు స్థితి నుండి తొలగించి వదలివేశాడు. అప్పుడు మేము ఇలా ఆజ్ఞాపించాము. "ఇక మీరంతా ఇక్కడ నుండి దిగిపొండి. మీరు ఒకరికొకరు శతృవులు "ఒక పరిమితకాలం వరకు మీరు భూలోకంలో ఉండి అక్కడే జీవితం గడపవలసి ఉంది." అప్పుడు ఆదమ్ తన ప్రభువు నుండి కొన్ని మాటలు నేర్చుకుని, పశ్చాత్తాపపడుతూ క్షమాభిక్ష అర్థించాడు. అతని ప్రభువు అతని వేడుకోలును మన్నించాడు. ఎందుకంటే, అయన అమితంగా క్షమించేవాడు, కనికరించేవాడూనూ.

–అల్ బఖర సూరా : 35–37.

సమీక్ష :– ఇక ఈ ఖుదా అల్పజ్ఞత్వాన్ని తెలుసుకోండి. అప్పుడే స్వర్గమునందు ఉండుటకు ఆశీర్వదించెను. మరల కొద్ది సమయం తర్వాత స్వర్గం నుండి వెల్లుడని చెప్పెను. భవిష్యద్విషయాలు తెలిసినవాడైతే వరమెందుకిచ్చేవాడు? భ్రమింపజేసే సైతానును కూడా దండించలేకపోవుచున్నా డెందులకు? మరి ఆ చెట్టును ఎవరి కొరకు పుట్టించాడు? తనకొరకా? అన్యుల కొరకా? అన్యులకొరకైతె ఆటంకపరచేదెందుకు? కనుక ఇట్టి మాటలు 'ఖుదా' వి గాని అతడు రచించిన పుస్తకములందలివి గాని కావు. ఖుదా నుండి ఆదాము ఎన్ని మాటలు నేర్చుకొన్నాడు? ఆదాము భూమిమీదకు వచ్చునపుడు ఏ విధంగా వచ్చినాడు? ఆ స్వర్గము పర్వతము మీదున్నదా? లేక ఆకాశము మీదనా? దాని నుండి ఎట్లు దిగి వచ్చినాడు? పక్షివలెనా? లేక మీదినుండి రాలిపడినట్లా? ఇక ఆదాము మట్టితో చేయబడినాడన్నచో వీరిస్వర్గంనందు మన్నుండెనని దీనివలన తెలియుచున్నది. అక్కడున్నవారు

అటులనే ఫర్రిశాలు మొదలగువారందరూ కావచ్చును. ఎట్లనగా మట్టి శరీరంలేనిచో ఇంద్రియభాగాలేర్పడవు. మరి మట్టి శరీరమైతే మృత్యువుకూడా కలుగనేరదు. మృత్యువు కలుగునప్పుడు వారక్కడనుండి ఎక్కడికి పోతారు? మృత్యువు కలుగదన్నవారు పుట్టలేదనుటయు స్పష్టమగుచున్నది. ఎందుకనగా పుట్టినవారు చావనే చస్తారు. అట్లయిన ఇక బీబీలు స్వర్గంలో ఎల్లప్పుడుంటారని ఖురానులో వ్రాసినదంతయు అబద్ధమగును. ఎందుకనగా వారికి కూడా మృత్యువు తప్పకుండా కలుగుతుంది. కావున స్వర్గానికి కూడా మృత్యువు కలుగనే కలుగుననుట స్పష్టమగుచున్నది. (12)

13. ఎవరూ ఎవరికీ ఏమాత్రం తోడ్పడలేనీ, ఎవరి సిఫారసూ అంగీకరించబడని, పరిహారం తీసుకుని ఎవరినీ విడుదల చెయ్యని, అపరాధులకు సహాయం ఎక్కడనుండీ లభించని ఆ దినానికి మీరు భయపడండి.
– అల్ బఖర సూరా : 47,48.

సమీక్ష:– వర్తమానకాలంలో భయపడకూడదా? కీడు చేయుటకు అన్ని దినాలలో భయపడాలి. 'సిఫారిసు' అంగీకరింపబడినప్పుడు మరి పైగంబరు సాక్ష్యముతోగాని, సిఫారిసుతోగాని ఖుదా స్వర్గమిచ్చుననుమాట ఎట్లు సత్యం కాగలదు? ఖుదా స్వర్గస్థులకే సహాయకుడా? నరకస్థులకు కాడానా? అట్లైతే ఖుదా పక్షపాతి అవుతాడు. (13)

14. గుర్తుకు తెచ్చుకోండి: (ఈ ఘోర పాతకంలో మీరు మునిగి వున్నప్పుడు) మీరు ఋజుమార్గం పొందగలందుకు మేము మూసాకు గ్రంథాన్ని, గీటురాయినీ ప్రసాదించాము. మేము వారిని "అందరూ అసహ్యంగా, నీచంగా చూసే కోతులుగా మారిపోండి." అని శపించాము. ఈ విధంగా మేము వారి ముగింపును ఆ కాలంవారికీ, భావితరాలవారికీ ఒక గుణంపాఠంగానూ, భయభక్తులు కలవారికి ఒక హితోపదేశంగానూ చేశాము.
– అల్ బఖర సూరా:53,65,66.

సమీక్ష:– మూసాకు పుస్తకమిచ్చినప్పుడు ఖుదా దగ్గర ఖురాను ఉండదు. ఇక అతనికి ఆశ్చర్యశక్తి నిచ్చినాడని బైబిలులోనే కాక ఖురానులో కూడా వ్రాయబడిఉంది. కాని ఈ మాటలు నమ్మదగినవికావు. ఎందుకనగా అప్పుడట్లయ్యుంటే ఇప్పుడట్లయ్యేది. ఇప్పుడు కావటంలేదు కావున అప్పుడునూ కాలేదు. స్వార్థపరులైన విద్వాంసులు ఇప్పుడెట్లు మేమే విద్వాంసులమని అనిపించుకుంటున్నారో అట్లే ఆ కాలమందును గప్పాలుకొట్టి యుండవచ్చును. ఖుదా మరియు అతని సేవకులు ఇప్పుడుకూడా ఉన్నారు గదా! ఇక ఈ సమయంలో ఖుదా ఆశ్చర్యశక్తి నెందుకీయడు? ఇతరులు చేయజాలరన్నచో మూసాకు పుస్తకమిచ్చినాడుగదా! మరల ఖురాను నీయవలసిన అవసరమేమున్నది? శుభాశుభకర్మలు చేయుటకు, చేయకుండుటకు ఉపదేశము సర్వత్ర ఒకేవిధంగా ఉన్నప్పుడు వేర్వేరు పుస్తకాలు రచించుట వలన పునరుక్త దోషం కలుగుచున్నది. మూసా మొదలగు వారికిచ్చిన పుస్తకాలలో ఖుదా కొంత మరచిపోయి యుండెనా?

ఖుదా నిందితమైన కోతివి కమ్మని ఆయనతో చెప్పితిమి. ఇటులాయన కెదురుగా వెనక నుండి వారల కొక భయమును, విశ్వాసులకు బోధను గలిగించితిమి. (14)

15. చూడండి! మృతులను అల్లాహ్ ఎలా బ్రతికిస్తాడో; మీరు అర్థం చేసుకోవాలని తన సూచనలను మీకు ఎలా చూపుతాడో! – అల్ బఖర సూరా : 73.

సమీక్ష:- ఖుదా శవములను బ్రతికించుచుండెనేని ఇప్పుడెందుకు బ్రతికించుటలేదు? ఏమి; కయామతు (తీర్పుదినం) రాత్రివరకు సమాధులలోనే పడియుందురా? ఇప్పుడు విచారణార్థమిబ్బందిలో నున్నారా యేమి? ఈశ్వర చిహ్నము లివియేనా? పృథివి, సూర్యుడు, చంద్రాదులు చిహ్నములు కావా? ప్రపంచములో ప్రత్యక్షముగ కనపడుచున్న ఈ వివిధ రచనా విశేషములను చిహ్నములు చాలవా? (15)

16. విశ్వసించి, మంచి పనులు చేసేవారే స్వర్గవాసులు. వారు స్వర్గంలోనే శాశ్వతంగా ఉంటారు. – అల్ బఖర సూరా: 82.

సమీక్ష:- ఏ జీవుడయినా అనంత పాపాలను చేయజాలడు. కాబట్టి ఎల్లప్పుడు స్వర్గ నరకములందుండజాలడు. ఖుదా అట్లుంచునేని అతడు అన్యాయకారియు, అవిద్వాంసుడు అగును. కయామతు రాత్రియందే న్యాయము చేయునేని, మనుష్యుల పాపపుణ్యాలు సమానాలై ఉండదగును. కర్మమనంతమైనది కానపుడు దానిఫల మనంత మెట్లు కాగలదు? ఏడెనిమిదివేల సంవత్సరాలకిటీవలనే సృష్టి నిర్మింపబడినట్లు తెలుపుచున్నారు. ఏమి? దీనికి పూర్వము ఖుదా పనిలేక కూర్చుండి యుండెనా? ఇవన్నియు పిల్లల మాటలవంటి మాటలే. ఏలయన పరమేశ్వరుని పనులు సర్వదా జరుగుచుండును. ఎవనికైనను పాపపుణ్యములకు తగినంతటి ఫలమునే యొసంగుచున్నాడు. కనుక ఖురానులో చెప్పబడిన ఈ మాట సత్యం కాదు. (16)

17. "మీరు ఒకరినొకరు చంపుకోరాదు. గృహాల నుండి బహిష్కరించుకోరాదు." దానిని మీరు అంగీకరించారు. దానికి మీరే స్వయంగా సాక్షులు. కాని మీరే నేడు మీ సోదరులను సంహరిస్తున్నారు. మీలోని ఒక వర్గంవారిని మీరు వారి ఇండ్లనుండి బహిష్కరిస్తున్నారు. దౌర్జన్యంగా, అన్యాయంగా, మీరు వారికి వ్యతిరేకంగా ముఠాలను కడుతున్నారు. – అల్ బఖర సూరా : 83,84,85.

సమీక్ష:- సరి! ఇట్లు ప్రతిజ్ఞ చేయుట, చేయించుట అల్పజ్ఞుల పనియా? లేక పరిమేశ్వరునికి తగునా? పరమేశ్వరుడు సర్వజ్ఞుడైనపుడు సాంసారిక మనుష్యునివలె ఇట్టి కఠిన నిబంధన నెందుకేర్పరచియుండును? ఇక ఒండొరుల రక్తము ప్రవహింపజేయరాదు. తమ మతస్థులను ఇండ్లనుండి వెడల గొట్టరాదు అనుట ఇతర మతస్థుల రక్తమును ప్రవహింపజేసి వారిని ఇండ్ల నుండి వెడలగొట్టవచ్చుననుటయేగదా! ఇది మంచి మాటయా? ఇది వట్టి మూర్ఖత్వముతోను పక్షపాతంతోను కూడినమాటయే. మరి వీరు ప్రతిజ్ఞ నుల్లంఘింతురని మొదటనే పరమేశ్వరునకు తెలిసియుండ కుండెనా? ముసల్మానుల ఖుదా కూడ అనేకాంశములందు క్రైస్తవుల ఖుదాను పోలియే యున్నాడు. ఇక నీ ఖురాను స్వతంత్రంగా రచింపబడలేదు. ఏలయన దీనిలో కొన్ని మాటలు తప్ప తక్కినవన్నియు బైబిలులోనివే కలవు. (17)

18. జాగ్రత్త! పరలోకాన్ని విక్రయించి దానికి బదులుగా ప్రాపంచిక జీవితాన్ని కొనుక్కున్నవారు వీరే! కనుక వారికి పడే శిక్షా తగ్గదు; వారికి ఏ సహాయమూ లభించదు.

– అల్ బఖర సూరా : 86

సమీక్ష:- మంచిది. ఇటువంటి ఈర్ష్యాద్వేషాలతో కూడిన మాటలు ఈశ్వరునివి కాగలవా? మరి ఎవరి పాపాలు తగ్గింపబడునో లేక ఎవరికి సహాయం చేయబడునో వారెవరు? పాపం చేసినవారిని శిక్షింపక వారి పాపాలు తగ్గింపబడునేని అన్యాయమగును. వారు శిక్షింపబడుచు వారి పాపాలు తగ్గింపబడునన్న ఈ ఆయతులో చెప్పబడినవారును శిక్షింపబడిన వారి పాపాలు తగ్గింపబడవచ్చును. మరి దండింపబడినవారి పాపాలు తగ్గింపబడనిచో అన్యాయమే అవుతుంది. పాపాలు తగ్గింపబడువారు ధర్మాత్ములని అభిప్రాయమేని వారి పాపాలు సహజంగానే తగ్గుతాయి. ఖుదా చేయునదేమి? కావున ఇదొక విద్వాంసునిచే వ్రాయబడిందికాదు. నిశ్చయంగా ధర్మాత్ములకు సుఖాన్ని వారి కర్మలననుసరించి సదా ఇస్తుండాలి. (18)

19. మేము మూసాకు దివ్య గ్రంథం ప్రసాదించాము. అతని తరువాత వరుసగా ప్రవక్తలను పంపాము. చివరకు మర్యమ్ కుమారుడైన ఈసాకు స్పష్టమైన సూచనలు ఇచ్చి పంపాము. పరిశుద్ధాత్మ ద్వారా అతనికి సహాయం చేశాము. మీ మనోవాంఛలకు ప్రతికూలంగా ఉన్న దానిని తీసుకుని ఏ ప్రవక్త అయినా మీ వద్దకు వచ్చినపుడు, మీరు ఆయనపట్ల తలబిరుసుతనంతో ప్రవర్తించారు. కొందరిని తిరస్కరించారు. మరికొందరిని చంపారు.

– అల్ బఖర సూరా : 87.

సమీక్ష:- మూసాకు పుస్తకము నిచ్చినాడని ఖురానులో సాక్ష్యమున్నప్పుడు దాని నొప్పుకొనుట ముసల్మానుల కావశ్యక మయ్యెను. ఆ పుస్తకంలోగల దోషాలు కూడా ముసల్మానుల మతమునందు వచ్చిపడెను. మోజిజాలను – దైవశక్తి ప్రకటించు వార్తలన్నియు అసంభవములు. అమాయకులగు మనుష్యులను మోసపుచ్చుటకు పట్టి టక్కులను పన్నిరి. ఏలయనగా సృష్టి క్రమానికి, విద్యకు విరుద్ధమగు వార్తలన్నియు అబద్ధములే. ఆ సమయమున మోజిజాలుండిన నీ సమయమున నేల లేవు? ఈ సమయమున లేకుండెననుటకు సందేహమేమియు నుండదు.

20. దీని రాకకుముందు అవిశ్వాసులపై విజయం ప్రసాదించు అని వారు ప్రార్థిస్తూ వచ్చినప్పటికీ, తీరా అది వచ్చిన తరువాత వారు దానిని గుర్తించికూడా తిరస్కరించారు. అటువంటి తిరస్కారులపై అల్లాహ్ శాపం అవతరించుగాక!. –అల్ బఖర సూరా : 90.

సమీక్ష:- మీరు అన్యమతస్థులను కాఫిరులనునట్లు వారును మిమ్ము కాఫిరులనకుందురా? అట్లే వారు తాము నమ్మిన ఈశ్వరుని ధిక్కారము (లానతు) మీ మీద గలదందురు. ఇంక నిప్పుడు సత్యవంతుడెవడో అసత్యవంతుడెవడో చెప్పుడు? విచారించి చూచిన సకల మతస్థులలో అసత్యమే గోచరిస్తున్నది. ఇక సత్యవిషయంలో నున్న అన్ని మతములందు ఒకేవిధంగా ఉండును. కావున ఈ వాదములన్నియు మూర్ఖత్వముతో కూడినవే. (20)

21. అల్లాహ్‌కు, ఆయన దూతలకు, ఆయన ప్రవక్తలకు, జిబ్రీలకు, మికాయీలుకు ఎవరు శత్రువులో, అటువంటి అవిశ్వాసులకు అల్లాహ్ శత్రువు. - అల్ బఖర సూరా : 98

సమీక్ష:- ఖుదా (లాశరీక్) అసమ్మిళితుడని ముసల్మానులు చెప్పుకొనుచున్నారే. ఈ సైన్యము సంతతి ఎక్కడనుండి (శరీక్) సమ్మిళిత పరచిర? ఏమి? అన్యులకు శత్రువయినవాడు ఖుదాకు కూడ శత్రువా? అటులేని యది సరికాదు. ఏలయన ఈశ్వరుడెవ్వనికీ శత్రువు కానేరడు. (21)

22. అప్పుడు మేము మీరు చేసిన తప్పులను మన్నిస్తాము. సజ్జనులను అత్యధికంగా అనుగ్రహిస్తాము. - అల్ బఖర సూరా : 58-59.

సమీక్ష:- ఆహా ఈ దేవుని ఉపదేశం అందరిని పాపులను చేయటానికా? పాపాలను క్షమించు అవకాశం మనుష్యులకు లభించినచో ఎవ్వడును పాపాలకు భయపడడు. కావున నిట్లు చెప్పువాడు దేవుడు కాని, అతడు వ్రాసినది పుస్తకం కాని కాజాలదు. కారణం దేవుడు న్యాయకారి కావున అన్యాయం ఎన్నడు చేయజాలడు. పాపాలను క్షమించినచో అన్యాయమగును. తప్పునకు శిక్ష నిచ్చువాడే న్యాయకారి (22)

23. జ్ఞాపకం తెచ్చుకోండి, మూసా తన ప్రజల కొరకు నీటికోసం ప్రార్థించినప్పుడు, మేము "నీవు ఆ కొండరాతిని నీ చేతి కర్రతో కొట్టు" అని ఆదేశించాము. తదనుగుణంగా కొండరాయి నుండి పన్నెండు ఊటలు పెల్లుబికాయి. - అల్ బఖర సూరా : 60.

సమీక్ష :- చూడుడు. ఇట్టి అసంభవములగువానికి సమానంగా ఇతరుడెవ్వడు చెప్పడు. రాతిపైన కర్రతో కొట్టిన పన్నెండు నీటిధారలు వచ్చుట అసంభవము. ఆ రాతి లోపల బోలుగాచేసి దానిలో నీరు నింపి పన్నెండు బెజ్జములుంచినచో సంభవము కావచ్చును. మరొక విధమున కాదు. (23)

24. కాని అల్లాహ్ తాను కోరిన వారిని తన కరుణ కొరకు ఎన్నుకుంటారు.
- అల్ బఖర సూరా :105.

సమీక్ష:- ఏమి! ముఖ్యుడగుటకును, దయచూపబడుటకును యోగ్యుడు కానివానిని కూడ ప్రధానునిగా చేసి వానిపై దయచూపునా? అటులేని ఖుదా కడు గందరగోళము చేయువాడై ఉన్నాడు. ఏలయన ఇంక మంచి కార్యముల నెవడు చేయును? మరి చెడు కార్యముల నెవడు మానును? ఏలయన కర్మఫలమును గాక ఖుదా ప్రసన్నతనే ముఖ్యమని భావించుచున్నారు. దీనివలన అందరి ప్రతిష్ఠకు హాని కలిగి కర్మోచ్ఛేదనము కాదొడగును. (24)

25. సత్యం వారికి సుస్పష్టం అయినప్పటికీ వారి ఈ కోరికకు కారణం వారి మనస్సులలో ఉన్న అసూయ. - అల్ బఖర సూరా : 109.

సమీక్ష:- ఇప్పుడు చూడుడు! మీ విశ్వాసమును కాఫిరులు తొలగింపకుందురుగాక! యని ఖుదాయే వారిని మేల్కొల్పుచున్నాడు. ఏమి! అతడు సర్వజ్ఞుడు కాడా? ఇట్టి మాటలు ఖుదావి కాజాలవు. (25)

26. మీరు మీ ముఖాన్ని ఏ దిక్కుకు త్రిప్పినా, అక్కడ మీకు అల్లాహ్ సమ్ముఖం లభిస్తుంది.
- అల్ బఖర సూరా :115

సమీక్ష:- ఈ మాట సత్యమేని ముసల్మానులు 'కిబలా' పశ్చిమ దిక్కునకు ముఖము నేల పెట్టుచున్నారు? మాకు కిబలా దిక్కునకే ముఖము నుంచవలయు ననుఆజ్ఞ గలదందురేని ఇష్టమైన దిక్కునకును ముఖ ముంచవచ్చునను ఆజ్ఞగూడ గలదు గద. ఏమి? ఒకమాట సత్యమై మరొకటి అసత్యమగునా? అల్లాకు ముఖము కలదేని అది అన్ని దిక్కులకు నుండనేరదు. ఏమన ఒకముఖ మొక దిక్కున కుండగల్గునేకాని అన్ని దిక్కులకు ఎట్లుండగలుగును? కావున ఇది అసంగతము. (26)

27. ఆయన ఆకాశాలకూ, భూమండలానికీ సృష్టికర్త. తాను ఒక నిర్ణయం తీసుకున్నప్పుడు, ఆయన దానిని కేవలం "అయిపో" అని ఆజ్ఞాపిస్తాడు. అది వెంటనే అయిపోతుంది.
- అల్ బఖర సూరా : 117.

సమీక్ష:- సరి! 'కమ్ము' అని ఖుదా ఆజ్ఞాపించినపుడు ఆ ఆజ్ఞనెవడు వినెను? అతడెవనికి వినిపించెను? మరి ఏమయ్యెను? ఏ కారణముబట్టి చేసెను? సృష్టికి పూర్వం ఖుదాకాక మరి ఏ వస్తువును లేకుండెనని వ్రాయుచున్నారే! ఆ సంసార మెక్కడనుండి రాగలిగెను? ఏ కారణములేక ఏ కార్యం కానేరదేని కాదు? ఇంత గొప్ప జగత్తు కారణం లేక దేని నుండి తయారయ్యెను? ఇది కేవలం పసితనపు మాటయే!

పూర్వపక్షి:- కాదు కాదు. ఖుదా ఇచ్ఛనుండి.

ఉత్తరపక్షి:- ఏమి? మీ ఇచ్ఛ వలన ఒక ఈగైనను కాగలదా? ఖుదా ఇచ్ఛనుండియే ఈ జగత్తంతయు అయ్యెననుచున్నారు.

పూర్వపక్షి:- ఖుదా సర్వశక్తిమంతుడు గనుక కోరినదానిని చేసివేయుచున్నాడు.

ఉత్తరపక్షి:- సర్వశక్తిమంతుడనగా అర్థమేమి?

పూర్వపక్షి:- కోరినదానిని చేయగలవాడు.

ఉత్తరపక్షి:- ఖుదా మరియొక ఖుదాను గూడ చేయగలాడ? తనంతట తానే చావగలడా? అటులే మూర్ఖుడును, రోగియు, అజ్ఞానియు కాగలడా?

పూర్వపక్షి:- ఇటులెన్నడును గాజాలడు

ఉత్తరపక్షి:- అందుకే పరమేశ్వరుడు తన, ఇతరుల గుణకర్మ స్వభావాలకు విరుద్ధంగా ఏమియు చేయజాలడు. ప్రపంచంలో ఒక వస్తువు కలుగుటకును కలుగజేయుటకును మొదట మూడు పదార్థాలుండి తీరాలి. ఒకటి: కుండను చేయు కుమ్మరివాడు, రెండవది: ఘటము చేయుటకు మన్ను, మూడవది: దేనిచే నా ఘటము చేయబడునో ఆసాధనము. కుమ్మరివాడు, మన్ను, సాధనములు

వీనిచే ఘటం తయారగును. ఆ చేయబడు ఘటమునకు పూర్వమున జగత్కారణంబగు ప్రకృతియు, వాని గుణకర్మ స్వభావాలును, అనాదులే కావున ఈ ఖురానునందు చెప్పబడినది సర్వదా అసంభవం. (27)

28. ఈ గృహాన్ని (కాబా) మేము మానవులందరికీ కేంద్రంగాను, శాంతి నిలయంగాను చేశాము. ఇబ్రాహీము ఆరాధన కొరకు నిలబడిన ప్రదేశాన్ని శాశ్వతమైన నమాజు స్థలంగా చేసుకోవలసిందని ప్రజలను మేము ఆదేశించాము.

విశ్వాసులు తోటి విశ్వాసులను కాదని అవిశ్వాసులను తమ మిత్రులుగా, తమ సహచరులుగా, తమ సహాయకులుగా ఎంతమాత్రం ఎన్నుకోరాదు. అలా చేసేవారికి అల్లాహ్‌తో ఏవిధమైన సంబంధమూ లేదు. అయితే వారి దౌర్జన్యం నుండి రక్షణ పొందటానికి, మీరు ఆ వైఖరిని అభినయిస్తే అది క్షమార్హమే.

– అల్ బఖర సూరా :125.

సమీక్ష:– ఖుదా కాబాకు బూర్వమొక పవిత్రస్థానమును చేయకయే యుండెనా? చేసెనన్న కాబాను మరల చేయవలసినఆవశ్యకత యేమియు లేకయుండెను. చేయలే దందురేని పూర్వోత్పన్నులను పవిత్రస్థానము లేకయే యుంచియుండెనా? మొదట ఈశ్వరునకు పవిత్రస్థానము చేయవలయునను స్మరణము లేకుండవచ్చును. (28)

29. ఇబ్రాహీము విధానాన్ని ఇక ద్వేషించే వాడెవడు – తనను తాను అజ్ఞానానికీ, అహంభావానికీ గురిచేసుకునేవాడు తప్ప. ప్రపంచంలో మా సేవ కొరకు మేము ఎన్నుకున్న వ్యక్తి ఇబ్రాహీము. పరలోకంలో అతను సజ్జనులతోపాటు ఉంటాడు.

– అల్ బఖర సూరా :130.

సమీక్ష:– ఇబ్రాహీము మతమును ఇష్టపడనివారందరు మూర్ఖులనుట సంభవమా? ఇబ్రాహీమునే ఖుదా మెచ్చుకొనెనన్న దీనికి కారణమేమి? ధర్మాత్ముడైనందున మెచ్చెనన్న ధర్మాత్ములింక ఎందరో కావచ్చును. ధర్మాత్ముడు కాకున్నను మెచ్చుకొనెనేని అన్యాయమయ్యెను. ధర్మాత్ముడే ఈశ్వరునకు ప్రియుడగుననుట మాత్రం ఉచితమే కాని ధర్మహీను డగుటకు ఉచితముకాదు. (29)

30. ప్రవక్తా! నీవు మాటిమాటికీ నీ మూఖాన్ని ఆకాశం వైపునకు ఎత్తటం మేము గమనిస్తూనే ఉన్నాము. ఇదిగో, నీకు అత్యంత ప్రీతికరమైన ఖిబ్లా వైపునకే ఇప్పుడు మేము నిన్ను త్రిప్పుతున్నాము. కాబట్టి నీవు ముఖాన్ని 'మస్జిదె హరామ్' వైపునకు త్రిప్పు.

–అల్ బఖర సూరా : 144.

సమీక్ష:– ఏమి? ఇది చిన్న విగ్రహారాధనమా? కాదు. పెద్దదే.

పూర్వపక్షి:– ముసల్మానుల మను మేము (బుత్పురస్త్) విగ్రహారాధకులము కాము కాని (బుత్శికన్) విగ్రహ భంజకులము. ఏలయన మేము కిబలాను ఖుదా యనుకొనము.

ఉత్తరపక్షి:- మీరెవరిని విగ్రహారాధకులనుచున్నారో వారు కూడ ఆ విగ్రహాలను ఈశ్వరుడని అనుకొనరు. కాని వాని ఎదుట ఆ పరమేశ్వరుని భజించుచున్నారు. మరి మీరు విగ్రహ భజనకు లేని ఆ మస్జిదుకిబలా అను పెద్ద విగ్రహము నెందుకు బడద్రోయలేదు?

పూర్వపక్షి:- ఏమండి! కిబలా దిక్కునకు ముఖముంచ వలయునను ఆజ్ఞ మాకు ఖురానున గలదుగాని వీరల కట్లు వేదమందు ఆజ్ఞలేదు. కావున వీరు విగ్రహారాధకులేలగారు? మేమెట్లగుదుము? ఏలయన ఖుదా ఆజ్ఞను పాలించుట ఆవశ్యకమే కద!

ఉత్తరపక్షి:- మీకు ఖురానునందాజ్ఞ యున్నట్లు వీరికి పురాణములందాజ్ఞ కలదు. మీరు ఖురానును (ఖుదా) దేవవాక్యమని భావించుచున్నట్లు ఈ పౌరాణికులు ఖుదా అవతారమును వ్యాసులవారు రచించిన పురాణములను దేవవాక్యములని భావించుచున్నారు. మీయందు వీరియందు(బుత్పరస్తీ) విగ్రహారాధనమందు భేద మేమియు లేదు. కాని మీరు పెద్ద విగ్రహారాధకులు. వీరు చిన్ని విగ్రహారాధకులగుదురు. ఏలయన నొకానొక మనుష్యుడు తనయింట ప్రవేశించిన పిల్లిని దొంగిలింపగా ఇంతలో లొట్టపిట్ట ప్రవేశించెనన్నట్లు మహమ్మదుసాహెబు చిన్న విగ్రహారాధనమును ముసల్మానులలో నుండి తొలగించెను. కాని పర్వతము వంటి మక్కా మసీదను పెద్ద విగ్రహమునతడు ముసల్మానుల మతమందు ప్రవేశింపజేసెనే! ఏమి ఇది చిన్న విగ్రహారాధనమా? కాబట్టి మేము వైదికులమై యున్నట్లు మీరు కూడ వైదికులగుదురేని ఈ విగ్రహారాధనము మొదలగు దోషములనుండి తొలగి యుండగలుగుదురు. లేనిచో దొలగియుండరు. మీరు ఈ పెద్ద విగ్రహారాధనమును దూరము చేసికొననంతవరకు ఇతరములగు చిన్న విగ్రహారాధకుల ఖండనమునకు సిగ్గుపడి దానినుండి దూరమై పవిత్రులు కాదగును. (30)

31. అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని 'మృతులు' అనకండి. వాస్తవానికి వారు సజీవులు.
–అల్ బఖర సూరా: 154

సమీక్ష:- సరే' ఈశ్వర మార్గంలో చావడం, చంపడమేమవసరం? ఈ మాట తమ ప్రయోజనమును సిద్ధింప జేసికొనుటకే యని ఎందుకు చెప్పరు? అనగా నిట్టి లోభాన్ని తెలియపరచితిరేని గనబరచితిమేని లోకులు బాగా పోట్లాడుకుంటారు. తమరికి విజయం కలుగుతుంది. చంపుటకును భయపడరు. దోపిడి చేయించుటవలన ఐశ్వర్యం లభించును. అటు పిమ్మట విషయానందము పొందవచ్చును. అను నిట్టి తమ ప్రయోజనాలు సిద్ధించుననియేకద ఈ విపరీతాలను కల్పించియున్నారు. (31)

32. శిక్షించటంలో కూడా ఆయన చాలా కఠినుడు. షైతాను చూపే మార్గాలను తొక్కకండి. వాడు మీకు బహిరంగ శత్రువు. – అల్ బఖర సూరా :165, 168,169.

సమీక్ష:- ఏమి? దయాళువయిన ఖుదా పాపాత్ములకును పుణ్యాత్ములకును గూడ కఠిన దుఃఖాలను కలుగజేస్తాడా? లేక ముసల్మానుల మీద దయగలిగి అన్యుల మీద దయలేని వాడై ఉంటాడా? అట్లైనచో అతడు ఈశ్వరుడే కాజాలడు. ఇంక పక్షపాతం లేకుంటే ఎవడెక్కడుంటేనేమి?

ధర్మం చేయువాని మీద ఆ ఈశ్వరుడు దయకలవాడు, అధర్మము చేయువానిని శిక్షించువాడగును. అటులయిన నడుమ మహమ్మదుసాహెబుగాని ఖురానును గాని నమ్మవలసిన అవసరమే ఉండదు. సైతాను అందరికి కీడు కలుగజేయుచున్నాడన్న ఆ సైతానును ఖుదా ఎందుకు పుట్టించాడు? అతడు భవిష్యత్తు గుర్తు తెలియనివాడా? తెలియును. కాని పరీక్షించుటకు బుట్టించెనన్నను సరికాదు. ఏమన పరీక్షించుటకు అల్పజ్ఞాని పని. సర్వజ్ఞుడగువాడు యథార్థంగా జీవులందరి మంచిచెడు కర్మలను సర్వదా తెలిసికొంటూనే ఉంటాడు.. సైతాను అందరను భ్రమింప చేస్తున్నాడంటే ఆ సైతాను నెవడు భ్రమింపజేసాడు? సైతాను స్వయంగా మార్గభ్రష్టుడయ్యెనందురేని ఇతరులు కూడ తమంతట తామే మార్గభ్రష్టులగుదురనవచ్చునుగదా! నడుమ సైతానావశ్యకమేమి? ఖుదాయే సైతానును భ్రమింపజేసెనేని ఆ ఖుదా సైతానును మించిన సైతానగును. కాన ఇది ఈశ్వరవాక్యం కాజాలదు. ఇంక నెవ్వడేకాని దుస్సంగతి, అజ్ఞానం అనువీనిచే తప్పక భ్రాంతిలో పడుచున్నాడనుట స్పష్టము. (32)

33. అల్లాహ్ నిషేధించినవి ఏమన్నా ఉంటే అవి ఇవి మాత్రమే: మరణించిన వాటిని తినకండి. రక్తాన్ని, పందిమాంసాన్ని ముట్టకండి. ఇంకా అల్లాహ్‌కు కాక ఇతరులకు సమర్పించబడిన దానిని తినకండి. – అల్ బఖర సూరా:173

సమీక్ష:– ఇక్కడ విచారింపవలసినదేమనగా దేహి తనంతట తాను చనిపోతేనేమి? ఒకనితో చంపబడితేనేమి? ఈ రెండు విధాలుగా అది (ముర్దారే) పీనుగే అగును గదా! ఇంక వీని యందు కొంత భేదమున్నను, చనిపోవడంలో మాత్రం భేద మేమియు లేదు. ఒక పంది మాంసమే నిషేధింపబడెనేని మనుష్యుని మాంసం తిన వచ్చునా? పరమేశ్వరుని పేరు మీద శత్రువులు మొదలగువారికి అత్యంత దుఃఖము కలుగజేయుచు ప్రాణహత్య చేయుట మంచిదేనా? దీనివలన ఈశ్వరనామానికి కళంకం కలుగదా? మంచిది "పూర్వజన్మ" మందలి అపరాధాలే లేనపుడు దారుణమైన దుఃఖాలను ఈశ్వరుడు ముసల్మానుల కెందులకిచ్చెను? వారిమీద దయగలవాడు కాడా? వారిని బుత్రులవలె నెంచడా? మహోపకార మొనర్చు ఆవు మున్నగు పశువులను వధింపకూడదని నిషేధింపక పోవుటవలన ఆ ఖుదా హత్యలు చేయించుచు జగత్తునకు హాని కలుగజేయువాడై యున్నాడనుట స్పష్టము. ఇక హింసారూప పాపముచే కలంకితుడు అగుచున్నాడు. ఇట్టి మాటలు ఖుదావి కాని ఖుదా పుస్తకమందలివిగాని ఎన్నటికి కాజాలవు. (33)

34. ఉపవాసకాలంలో రాత్రి సమయాలలో మీరు మీ భార్యల వద్దకు పోవడం మీ కొరకు ధర్మసమ్మతం చెయ్యబడింది. వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు, మీరు రహస్యంగా ఆత్మద్రోహానికి పాల్పడుతున్నారనే విషయం అల్లాహ్‌కు తెలిసిపోయింది. అయినప్పటికీ ఆయన మీ అపరాధాన్ని క్షమించాడు, మిమ్మల్ని మన్నించాడు. ఇక నుండి మీరు మీ భార్యలతో సంభోగం చేయవచ్చు. అల్లాహ్ మీ కొరకు ధర్మ సమ్మతం చేసిన సుఖానుభవాన్ని పొందండి. ఇంకా రాత్రి నలుపు రేఖలనుండి ఉషోదయపు ధవళ రేఖలు ప్రస్ఫుటమయ్యేవరకు, మీరు తినండి, త్రాగండి. – అల్ బఖర సూరా :187.

సమీక్ష:- ముసల్మానుల మతం కొనసాగినపుడో లేక ఇంతకు పూర్వమో ఒకానొక పౌరాణికునితో ఒక నెలవరకు జరుపబడు చాంద్రాయణ వ్రతవిధి ఎట్లని అడిగి యుండవచ్చును. అతడు చంద్రునికళ హెచ్చు తగ్గులు చెందునట్లు కబళముల ఎక్కువగను తక్కువగను జేయుచు మధ్యాహ్నసమయమందే తినదగునని వ్రాయబడియున్న శాస్త్ర విధిని దెలిసికొనలేక చంద్రుని దర్శనము చేసికొని తినవలెనని చెప్పి యుండవచ్చును. దానిని ముసల్మాను లీ ప్రకారంగా అర్థము జేసికొన్నారు. ఇక వ్రతదినమందు స్త్రీ సమాగమం కూడదని యుండగా మీరు నిరాటంకంగా స్త్రీలతో సమాగమం చేస్తారు. రాత్రులందిష్టమైనన్ని సార్లు తినుడని, ఖుదా. ఈ మాటను విశేషం చేప్పినాడని చెప్పుచున్నారు. సరి ఇది ఒక వ్రతమా? దినమందు దినుట లేదుగాని రాత్రియందు తినుచున్నారు. ఇట్లు దినమందు దినక రాత్రియందు దినుట సృష్టిక్రమానికి విరుద్ధం. (34)

35. మీతో పోరాడేవారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి. హద్దులు అతిక్రమించే వారిని అల్లాహ్ ప్రేమించడు. మీకు వారు ఎక్కడ ఎదురైనా, మీరువారితో పోరాడండి. మిమ్మల్ని వారు ఎక్కడనుండి పారద్రోలారో, అక్కడినుండి మీరూ వారిని పారద్రోలండి. చంపటం చెడ్డదే. కాని, ఫిత్నా' (పీడన) అంతకంటే చెడ్డది. 'మస్జిదె హరామ్' వద్ద వారు మీతో యుద్ధం చెయ్యనంత వరకు, మీరూ వారితో యుద్ధం చెయ్యకండి. కాని వారే అక్కడ కయ్యానికి కాలుదువ్వితే, మీరు వారిని చంపటానికి వెనుదీయకండి. అవిశ్వాసులకు ఇదే తగిన శిక్ష. వారు యుద్ధం చెయ్యటం మానుకుంటే (మీరు మానండి) పీడన (ఫిత్నా) అంతమయ్యేవరకు, దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మానుకుంటే, దౌర్జన్యపరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు.

—అల్ బఖర సూరా:190, 191, 193

సమీక్ష:- ఖురానునందిట్టి మాటలు వ్రాయబడకున్నచో ముసల్మానులు ఇతరమతస్థులయెడ అంతటి గొప్ప అత్యాచారాలు చేసేవారుకాదు కద! అపరాధం లేనివారిని చంపుట వారికి గొప్ప పాపమే. ముసల్మానుల మతాన్ని స్వీకరింపక పోవుటయే కుఫ్ర్ అగుచున్నది. అనగా, నీ ముసల్మానులు కుఫ్ర్ (పాపము) కంటె "కతల్" (చంపుట) మంచిదని తలచుచున్నారు. మా దీన్ మతమును నమ్మని వారిని మేము చంపుదుమని దానిని చేయుచునే వచ్చిరి. వీరు మతాన్ని గురించి పోట్లాడుతూ పోట్లాడుతూ తామే రాజ్యాదులను పోగొట్టుకొని నశించారు. కావున వీరి మత మన్యమతస్థులయెడ అతి కఠినంగా వర్తిస్తున్నది. దొంగతనానికి బదులు దొంగతనమేనా? దొంగలు మున్నగువారు మాకెంతటి అపకారం చేసినారో మేము కూడ అట్లే దొంగతనంతో వారికి అపకారం చేస్తామనడం సరైనదా? ఇది నిజంగా అన్యాయమే కద! ఒక అజ్ఞాని మనలను తిట్టినపుడు మనం కూడ తిట్టాలా? ఈ మాట ఈశ్వరునిది కాని ఈశ్వర భక్తుడగు నొక విద్వాంసునిది కాని ఈశ్వరోక్త పుస్తకమందలిది కాని కాజాలదు. ఇది కేవల మొక స్వార్థి జ్ఞానవిహీనుడు నగు మనుష్యుని మాటయే. (35)

36. అల్లాహ్ కల్లోలాన్ని ఏ మాత్రం సహించదు. ప్రజలారా! మీరు పూర్తిగా ఇస్లామ్‌లో ప్రవేశించండి. - అల్ బఖర సూరా :205, 208.

సమీక్ష:- కలహాన్ని ఖుదా మిత్రునిగా భావించకుంటే కలహించుటకు స్వయంగా ముసల్మానుల నేల ప్రేరేపిస్తున్నాడు. పోట్లాడు స్వభావం గల ముసల్మానులతో మిత్రత్వము నెందులకు చేయుచున్నాడు? ముసల్మానుల మతంలో చేరుటచేతనే ఖుదా సమ్మతించునన్న అతడు ముసల్మానులకు పక్షపాతియా? సమస్త ప్రపంచాని కతడీశ్వరుడు కాదా? దీనివలన 'ఖురాను' ఈశ్వరకృతము కాదు. అందు చెప్పబడినవాడు ఈశ్వరుడును గానేరడు. (36)

37. తాను కోరిన వారికి లెక్కలేకుండా ఇచ్చే అధికారం అల్లాహ్‌కే ఉంది.

- అల్ బఖర సూరా :212.

సమీక్ష:- పాపపుణ్యాలు లేకున్నను ఖుదా ఇటులే ఆహార పదార్థాల నిచ్చునా? అట్లైతే మంచి చెడులు రెండూ సమానమౌతాయి. ఎందుకంటే సుఖదుఃఖాలు అతని ఇష్టప్రకారమే లభించుచున్నవిగదా! దీనినుండియే కద ముసల్మానులు ధర్మవిముఖులై ఇష్టానుసారంగా వర్తిస్తున్నారు. కాని కొందరీ ఖురానును విశ్వసింపక ధర్మాత్ములౌతున్నారు. (37)

38. ఋతుస్రావానికి సంబంధించిన ఉత్తరువు ఏమిటి అని వారు నిన్ను అడుగుతారు. నీవు వారికి ఇలా తెలుపు. "అదొక అపరిశుద్ధావస్థ. కనుక ఋతుకాలంలో భార్యలకు దూరంగా ఉండండి. వారు పరిశుద్ధలు కానంతవరకు వారి వద్దకు పోకండి.[74] వారు పరిశుద్ధలు అయిన తరువాత, అల్లాహ్ ఆదేశించిన విధంగా మీరు వారి వద్దకు పోవచ్చు. చెడుగుకు దూరంగా ఉండేవారిని, పరిశుద్ధతను పాటించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. మీ స్త్రీలు మీ యొక్క సేద్యపు భూములు. మీ పొలాలకు మీరు కోరినవిధంగా పోవటానికి మీకు అధికారం ఉంది. అనాలోచితంగా మీరు చేసే అర్థరహిత ప్రమాణాలను గురించి అల్లాహ్ మిమ్మల్ని పట్టుకోడు. - అల్ బఖర సూరా : 222, 224.

సమీక్ష:- రజస్వలను తాకకూడదు అని వ్రాయటం మంచిదే. కాని స్త్రీలు పొలం వంటివారనియు వారితో నిష్టమైనట్లు వర్తింపుడనియు వ్రాయుట మనుష్యులను విషయలంపటులుగా చేయుటకు కారణం కాదా? ఖుదా వ్యర్థ శపథాలు చేసినా పట్టుకొనడేని అందరు అబద్ధాలే పలుకుతారు. శపథాన్ని భంగపరచగలరు. దీనివలన ఖుదా అబద్ధాన్ని ప్రవర్తింపజేసినవాడగును. (38)

39. అల్లాకు మంచి రుణం ఇచ్చేవారు మీలో ఎవరైనా ఉన్నారా? దానిని ఆయన ఎన్నో రెట్లు అధికంచేసి తిరిగి ఇస్తాడు. - అల్ బఖర సూరా :245.

సమీక్ష :- ఆహా! ఖుదాకు అప్పు (ఉద్దెర) పుచ్చుకొనవలసిన అవసరమేమిటి? సమస్త ప్రపంచాన్ని రచించినవాడు రచించువాడు మనుష్యుని నుండి అప్పు తీసుకొనుచున్నాడా? ఇది ఎన్నటికిని సంభవంకాదు. ఇది అజ్ఞానులు చెప్పవలసినదే. ఏమన అతని ధనాగారము ఖాళీయై ఉండెనా?

ఋణము పుచ్చుకొన నుద్యుక్తుడయ్యెననుటకు అతడు వడ్డీలు చెల్లిస్తూ వ్యాపారాది వ్యవహారాలందు తగులుకొని యున్నందున నష్టపడి యుండెనా యేమి? ఒకటికి రెండింతలీయ స్వీకరించుచున్నాడు. ఇది సాహుకారులవంటి పనికాదా?

ఐనను ఇట్టిపని దివాలాదీయువారు అధికంగా వ్యయపరచువారు న్యూనాదాయం కలవారు చేయవలసినదే కాని ఈశ్వరుడు గాదు. (39)

40. వారిలో కొందరు విశ్వసించారు, మరికొందరు అవిశ్వాసమార్గాన్ని అవలంబించారు. కాని అల్లాహ్‌కోరితే, వారు పరస్పరం కలహించుకునే వారే కాదు. కాని అల్లాహ్ తానుకోరింది చేస్తాడు. – అల్ బఖర సూరా : 253.

సమీక్ష :– ఏమి? జరిగెడు యుద్ధం ఈశ్వరేచ్ఛవలననే జరుగుచుండునా? అతడు అధర్మం చేయాలనుకుంటే చేసేస్తాడా? అట్లైతే అతడు ఈశ్వరుడే కాదు. ఎందుకంటే ఈ విధంగా శాంతి భంగం కలుగజేసి యుద్ధం చేయించుట సజ్జనుల పనికాదు. దీనివలన ఈ 'ఖురాన్' ఈశ్వర నిర్మితముకాదు. ఒక ధార్మిక విద్వాంసునిచే రచింపబడినదియు కాదని స్పష్టమగుచున్నది.(40)

41. ఆయన రాజ్యాధి కారం ఆకాశాలనూ భూమినీ పరివేష్టించి ఉన్నది.
– అల్ బఖర సూరా : 255.

సమీక్ష:– భూమ్యాకాశములయందుగల పదార్థాలనన్నిటిని పరమాత్ముడు జీవులకొరకు పుట్టించి యున్నాడేకాని తనకొరకు కాదు. ఎందుకంటే అతడు పూర్ణకాముడు కావున అతనికొక పదార్థాపేక్ష లేదు. అతనికి కురిబీ కలదేని అత డేదేశీయుడగును? ఏకదేశీయుడయినవాడీశ్వరు డనబడనేరదు. ఈశ్వరుడు సర్వవ్యాపకుడు. (41)

42. "సరే, అల్లాహ్ సూర్యుణ్ణి తూర్పు నుండి ఉదయింపచేస్తాడు. నీవు కాస్త దానిని పడమర నుండి ఉదయింపజెయ్యి." ఇది విన్న ఆ సత్యధిక్కారి బిత్తరపోయాడు. అయితే అల్లాహ్ దుష్టులకు ఋజుమార్గం చూపడు. – అల్ బఖర సూరా :258.

సమీక్ష:– ఈ అజ్ఞానయుక్తమగు విషయాన్ని గమనింపుడు. సూర్యుడొకప్పుడైనను దూర్పునుండి పడమరకుగాని పడమర నుండి తూర్పునకు గాని వచ్చుట పోవుట లేదు. కాని అతడు తన పరిధియందు మాత్రము తిరుగుచుండును. దీనివలన ఖురానును రచియించిన వానికి ఖగోళవిద్యగాని, భూగోళవిద్యగాని ఎంతమాత్రము తెలియకుండెననియే నిశ్చితమగుచున్నది. పాపులకు మార్గము చూపదేని ఈ ముసల్మానుల ఖుదా ఆవశ్యకత పుణ్యాత్ములకును లేదు. ఏమన ధర్మాత్ములు ధర్మ మార్గమందే నడతురు. కావున మార్గము చూపవలసిన అవశ్యకత ధర్మము తప్పినవారికే కలదు. కాబట్టి తన కర్తవ్యాన్ని పాలింపనందున ఖురాను చేసినవానిది గొప్ప పొరపాటనియే విదిత మగుచున్నది (42)

43. "సరే, మంచిది, నాలుగు పక్షులను తీసుకో. వాటిని బాగా మచ్చిక చేసుకో; తరువాత ఒక్కొక్కదాని భాగాన్ని ఒక్కొక్క కొండపై పెట్టిరా. మళ్ళీ వాటిని రమ్మని పిలువు. అవి నీ వద్దకు పరుగెత్తుకుంటూ వస్తాయి. –అల్ బఖర సూరా :260.

సమీక్ష:– అహో! ముసల్మానుల ఖుదా భానుమతివలె ఆడుచున్నాడు. ఖుదాతన మిటువంటి కార్యములవలననే బోధపడునా ఏమి? బుద్ధిమంతు లిట్టి ఖుదాకు తిలాంజలు లిచ్చి దూరంగా ఉంటారు. మూర్ఖులు మాత్రం అతనికి చిక్కిపోతారు. ఇంక దీనివలన ఖుదా గౌరవానికి హాని కలిగి అతడు చెరుపునకు పాత్రుడగును. (43)

44. అల్లాహ్ తాను కోరిన వారికి దివ్యజ్ఞానం ప్రసాదిస్తాడు. –అల్ బఖర సూరా :269.

సమీక్ష :– ఇష్టమయినవానికి నీతి నొసంగుచున్నాడేని ఇష్టము కాని వానికి అవినీతిని ఇస్తున్నాడా? ఇది ఈశ్వరత్వపు మాటకాదు. కావున పక్షపాతము వదలి అందరకు నీతితోగూడిన ఉపదేశం జేయువాడీశ్వరుడు. అతడే ఆప్తుడును కాగలడు కాని అన్యుడు కానేరడు. (44)

45. కపటులైనవారు గోరీలలోనే ఉందురు. – అల్ ఖబర సూరా. 275

సమీక్ష:– వారు గోరీలలోనే పడియుందురా? వారట్లు ఎంతకాలముందురు? ఇట్టి అసంభవమగు వ్రాతలు ఈశ్వరుని పుస్తకములో నుండజాలవు. బాలబుద్ధులకు తగును. (45)

46. ఇంకా, తాను కోరిన వారిని క్షమించటానికీ, తానుకోరిన వారిని శిక్షించటానికీ ఆయనకు అధికారం ఉంది. ఆయన అన్నిటిపైన అధికారం కలవాడు.–అల్ బఖర సూరా : 284.

సమీక్ష:– ఏమి? క్షమించుటకు యోగ్యుడైనవానిని క్షమింపక అయోగ్యుడైనవానిని క్షమించుట అన్యాయకారియగు రాజు పని వంటిది కాదా? ఈశ్వరుడు ఇష్టమయిన వానిని పాపాత్ముడుగానో, పుణ్యాత్ముడుగనో చేయునన్న జీవులకు పాపపుణ్యముల నారోపింపగూడదు. ఈశ్వరుడే వారినట్లు చేసినప్పుడు జీవులకు సుఖదుఃఖములు గలుగగూడదు. సేనాపతి యాజ్ఞచే ఒకభృత్యుడొకని జంపినను, రక్షించినను తత్ఫలము ననుభవించువాడు అతడు కానటులే వారును కారాదు. (46)

47. స్త్రీలూ, సంతానమూ, వెండి బంగారు రాసులూ, మేలుజాతి గుర్రాలూ, పశువులూ, సేద్యపు భూములూ వంటి వ్యామోహాలపై ప్రేమ ఆకర్షకంగా చెయ్యబడింది. కాని ఇవన్నీ అనిత్యమైన ఐహిక జీవన సంపదలు మాత్రమే. అసలైన ఉత్తమ నివాసం అల్లాహ్ వద్ద ఉన్నదే. ఇలా చెప్పు: వాటికంటే ప్రశస్తమైనదేదో నేను మీకు తెలిపేదా? భయభక్తులు కలవారి కొరకు వారి ప్రభువు వద్ద ఉద్యానవనాలు ఉన్నాయి. వాటి క్రిందుగా కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ వారికి శాశ్వతమైన జీవితం లభిస్తుంది. పరిశుద్ధ చరిత్రలైన భార్యల సాంగత్యం లభిస్తుంది. –ఆలి ఇమ్రాన్ సూరా :14,15.

సమీక్ష:– బాగున్నది. ఇది స్వర్గమా? లేక వేశ్యాలయమా? ఇతనిని ఈశ్వరు డనవలెనా? లేక స్త్రీలోలుడనవలెనా? ఏ బుద్ధిమంతుడైన ఇట్టి మాటలతో గూడిన పుస్తకాన్ని పరమేశ్వర రచితమని

నమ్మగలడా? ఇతడు పక్షపాతము నేలచేయుచున్నాడో! స్వర్గంలో సదా బీబీలుందురన్న వారు ఇక్కడ పుట్టి అక్కడికి పోయూరా! లేక అక్కడనే పుట్టిరా? ఇక్కడనే పుట్టి అక్కడకు పోయిరన్న (కయామత్) అను ప్రళయ రాత్రిగాకుండుటకు పూర్వమే యా బీబీల నచ్చుటకు రప్పించుకొని వారి భర్త్రాదుల రప్పించుకొనలే దెందులకు? కయామత్ రాత్రియందే అందరి న్యాయవిమర్శన మగునను నియమము నేల తప్పెను? ఇక వారక్కడనే పుట్టిరన్న కయామతు వరకు వారెట్లు నిర్వాహము జేసికొనగలుగుదురు? వారికి పురుషులు కూడ గలరందురేని యిక్కడనుండి స్వర్గమునకు బోవు ముసల్మానులకు పుట్టి యా ఖుదా బీబీల నెక్కడనుండి యియ్యగలుగును? స్వర్గమున నెల్లప్పుడుండు బీబీలను చేసినట్లు, పురుషుల నక్కడ సర్వదా యుండునట్లేలచేయలేదు? కావున ముసల్మానుల ఖుదా అన్యాయకారియు, అవివేకియు నైయున్నాడు. (47)

48. అల్లాహ్ దృష్టిలో అసలు ధర్మం కేవలం ఇస్లామ్ మాత్రమే. – ఆలి ఇమ్రాన్ సూరా :18.

సమీక్ష:– ఏమి అల్లా ముసల్మానులకేనా? అన్యులకు గాదా? పదుమూడు వందల వత్సరములకు పూర్వమీశ్వరీయమతమే లేకయుండెనా? కాబట్టి ఈ ఖురాను ఈశ్వరునిచే రచియింపబడినది కాదు. కాని ఒకపక్షపాతముగల పురుషునిచే రచియింపబడిన దనుట నిక్కము. (48)

49. ఆ రోజున ప్రతిమనిషికీ తాను సంపాదించుకున్నదానికి పూర్తి ప్రతిఫలం ఇవ్వబడుతుంది. ఎవరికీ అన్యాయం జరగదు. ఇలా అను: "ఓ అల్లాహ్! విశ్వసామ్రాజ్యాధిపత్యానికి ప్రభూ! నీవు కోరినవారికి ప్రభుత్వాధికారాన్ని ప్రసాదిస్తావు. నీవు కోరిన వారి నుండి దాన్ని లాక్కుంటావు. నీవు కోరిన వారికి గౌరవాన్ని ప్రసాదిస్తావు. నీవు కోరిన వారిని పరాభవంపాలు చేస్తావు. శుభాలు నీ అధీనంలో ఉన్నాయి. నిస్సందేహంగా నీకు అన్నింటిపైనా అధికారం ఉంది. నీవు రాత్రిని పగటిలోకి ప్రవేశింపచేస్తావు. పగలును రాత్రిలోకి ప్రవేశింప చేస్తావు. ప్రాణంలేని దానినుండి ప్రాణమున్న దానిని తీస్తావు. ప్రాణమున్న దాని నుండి ప్రాణం లేనిదానిని తీస్తావు. నీవు కోరిన వారికి లెక్క లేనంత ఉపాధిని ప్రసాదిస్తావు." – ఆలి ఇమ్రాన్ సూరా :24,28.

సమీక్ష:– ప్రతి జీవునకు కర్మఫలము పూర్తిగ నీయబడునపుడు క్షమింపబడనేరరు. క్షమింపబడుదురన్న ఫలము పూర్తిగ నీబడకపోవును. అన్యాయమే యగుననుట స్పష్టము. ఉత్తమ కర్మముల జేయకున్న ఒకనికి రాజ్యమొసంగినచో అన్యాయకారియే యగును. సరి! జీవితుని మృతునిగాను మృతుని జీవితునిగాను జేయుట యెన్నడయిన సంభవమగునా? ఏమన నీశ్వరుని వ్యవస్థ అచ్ఛేద్యము అభేద్యమై యున్నది. కావున అదెప్పుడును అస్తవ్యస్తము కానేరదు. ఇక పక్షపాతముగల మాటలు చూడుడు. ముసల్మానుల మతమందు లేనివారలు కాఫిరులనుటయు వారిలో నున్న దుష్టులతో గూడ స్నేహము చేయవలయుననియు ఉపదేశము చేయుట ఈశ్వరుని ఈశ్వరత్వమును రద్దుపఱచుచున్నది. దీనివలన 'ఖురాను' ఈ ఖురాను చెప్పిన ఖుదా ముసల్మానుల కేవలపక్షపాతముతో గూడిన అవిద్యలో మునిగియున్న వారలు. కాబట్టి ముసల్మాను లంధకారములో

బడియున్నారు. ఇక మీరు నా పక్షమున నుండిన ఖుదా మీపక్ష మగుననియు పక్షపాతముతో మీరు పాపమొనరించినను దానిని క్షమించుననియు బోధించిన మహమ్మదుసాహెబు లీలలను కనుగొనుడు. దీనివలన మహమ్మదుసాహెబు యొక్క అంతఃకరణము పవిత్రముగ లేకుండెననియే సిద్ధమగుచున్నది. కావున తనయభిమతము తీర్చుకొనుటకే మహమ్మదుసాహెబు ఖురానును రచించెననియో లేదా రచింపజేసెననియో విదితమగుచున్నది. (49)

50. తరువాత ఒకప్పుడు దైవదూతలు వచ్చి మర్యమ్‌తో ఇలా అన్నారు: "మర్యమ్! అల్లాహ్ నిన్ను ఎన్నుకున్నాడు. నీకు పరిశుద్ధతను ప్రసాదించాడు. ప్రపంచ మహిళలందరిపై నీకు ప్రాధాన్యమునిచ్చి నిన్ను తన సేవకొరకు ఎన్ను కున్నాడు.

– ఆలి ఇమ్రాన్ సూరా :42.

సమీక్ష:– బాగున్నది ఈకాలములో ఖుదా కాని ఖుదాఫరిశ్తాలుగాని ఒకరితో మాటలాడ రానపుడు పూర్వమెట్లు రాగలిగిరో గదా! అక్కాలపు మనుష్యులు పుణ్యాత్ములై యుండిరి. ఇప్పటివారు పుణ్యాత్ములు గారని యందురేని ఈ మాట మిథ్యయే. ఏమన గ్రైస్తవమతముగాని మహమ్మదీయ మతముగాని ప్రచలితమయినపుడాదేశములందు విద్యావిహీనులు ననాగరికులు నధికముగ నున్నందున నిట్టి విద్యావిరుద్ధములగు మతములు స్థిరపడగలిగినవి. ఇప్పుడో విద్యావంతు లెక్కువయినందున సాగనేరవు. ఇప్పుడు, విద్వాంసులధికముగ నున్నందున నిట్టివట్టి మతములు స్థిరపడి వృద్ధి బొందనేరవు. మరియు నస్తమించుచున్న వనుటమాత్రము నిక్కము. (50)

51. ఇస్రాయీలు సంతతివారు (ఈసాకు వ్యతిరేకంగా) రహస్యపుటెత్తులు పన్నసాగారు. వారి ఎత్తులకు పై ఎత్తులను అల్లాహ్ కూడా పన్నాడు. ఎత్తులు వెయ్యటంలో అల్లాహ్ మేటి. (అది అల్లాహ్ రహస్యతంత్రమే.) – ఆలి ఇమ్రాన్ సూరా :54.

సమీక్ష:– ముసల్మానులు ఖుదా వినా మరొక వస్తువే లేకుండెనని నమ్ముచున్నప్పుడు ఆ ఖుదా ఎవరితో 'కమ్ము' అని అనెను? అత దనుటతో ఏమైనది? దీనికి ముసల్మాను లేడు జన్మలెత్తినా జవాబీయజాలరు. ఏలయన ఉపాదానకారణం లేకుండా కార్య మెన్నటికినీ కాజీలదు. కారణం లేకుండా కార్యం జరిగినదన్న తనకు తల్లిదండ్రులే ఉండక తన శరీర మేర్పడెనన్నట్లగును. ఈశ్వరు డెన్నడును మోసపోవువాడు కాదు. మోసమును జేయడు. ఈశ్వరుడు మోసము చేయుననుట సంభవమగునా? ఒక సత్పురుషుడైనవాడు ఇలా చేయబూనడు కదా! (51)

52. "అల్లాహ్ మూడువేల మంది దూతలను దింపి మీకు సహాయం చెయ్యటం మీకు సరిపోదా?"

– ఆలి ఇమ్రాన్ సూరా :124.

సమీక్ష:– మూడువేల మంది దేవదూతలతో ముసల్మానులకు సాహాయ్యము చేయునట. ఇప్పుడు ముసల్మానుల రాజ్యము చాలనష్టమై పోయినది. ఉన్నదికూడ నష్టమే యగుచున్నది. మఱి సాహాయ్యము చేయుట లేదెందులకు? కావున ఇది కేవలము ప్రలోభము కలుగజేసి మూర్ఖులను తమవలలో చిక్కించుకొనుటకు పన్నిన గొప్ప అన్యాయముతో కూడిన తంత్రమే. (52)

53. అవిశ్వాసులకు ప్రతి కూలంగా మాకు సహాయం చెయ్యి. అల్లాహ్‌యే మీకు అండ, ఆయనే మీకు తోడు. ఆయనే అందరికంటే ఉత్తమ సహాయకుడు.

– ఆలి ఇమ్రాన్ సూరా :146, 150.

సమీక్ష:- ఇప్పు డీముసల్మానుల పొరపాటును గమనింపుడు. తమ మతస్థుల కానివారిని చంపుట కీశ్వరుని ప్రార్థించుచున్నారే. వీరి మాట నొప్పుటకు పరమేశ్వరుడు వెఱ్ఱివాడా యేమి? కేవల మల్లాయే ముసల్మానులకు ప్రయోజనకర్తగా నున్నచో ఈ ముసల్మానుల కార్యము లేల నష్టమగుచున్నవి? ఖుదా కూడా ముసల్మానులకు మోహమున జిక్కియున్నట్లు గోచరమగుచున్నాడు. ఆ ఖుదా యిట్లు పక్షపాతము చేయువాడేని ధర్మాత్ముల కెంత మాత్రముపాసనీయుడు గానేరడు. (53)

54. (అగోచర విషయాలు తెలుపడానికి) అల్లాహ్ తన ప్రవక్తలలో నుండి తాను కోరినవారిని ఎన్నుకుంటాడు. కనుక (అగోచర విషయాలను గురించి) అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తలను నమ్మండి.

– ఆలి ఇమ్రాన్ సూరా :179.

సమీక్ష:- ముసల్మాను లీశ్వరునిదప్ప మఱొకని విశ్వసింపనప్పుడును మఱియొకని నీశ్వరునితో జేరికగల వానినిగా నమ్మనపుడును 'ఈమాన్' విశ్వాసమునందు పైగంబరును తన నేల చేర్చుకొనెను? అల్లా పైగంబరును విశ్వసింపుడని వ్రాసియున్నందున పైగంబరుగూడ అతనితో సమ్మిళితు డయ్యెను. ఇక "లాశరీక్"తో భాగనుడనిచెప్పుట వ్యర్థము. మహమ్మదుసాహెబ్ పైగంబరుగా విశ్వసింపబడవలయుననియే దీనిభావ మందు రేనియట్లు మహమ్మదుసాహెబు కావలసిన యావశ్యకమేమి యనుప్రశ్న కలుగును. ఖుదా యతనిని బైగంబరుగా జేయకున్న దాజేయదలచిన కార్యమును జేయనేర దందురేని యతడవశ్యముగ నసమర్థుడే యనుట స్పష్టము (54)

55. విశ్వాసులారా! సహనంతో వ్యవహరించండి. అసత్యవాదుల ముందు పరాక్రమం చూపండి. సత్య సేవకొరకు సిద్ధంగా ఉండండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. తద్వారా మీరు సాఫల్యం పొందే అవకాశం ఉంది. – ఆలి ఇమ్రాన్ సూరా :200.

సమీక్ష:- ఈ ఖురానునందలి ఖుదాయ నతని పైగంబరు నను నిద్దఱును గలహాకారులై యుండిరి. యుద్ధమున కాజ్ఞాపించువాడు శాంతిభంగము చేయువాడే కద. నామమాత్ర మీశ్వరునకు భయపడుటవలన విడుదల పొందనగునా! లేక అధర్మంతో కూడిన యుద్ధాదులకు భయపడుట వలననా? ప్రథమపక్షమయ్యేనేని భయపడుటయు, భయపడకుంటుడయు నొక్కటియే. రెండవపక్ష మయ్యేనేని బాగుగనున్నది. (55)

56. ఇవి అల్లాహ్ విధించిన హద్దులు. అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ విధేయత చూపేవాణ్ణి అల్లాహ్, క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యానవనాలలో ప్రవేశింపజేస్తాడు. ఆ వనాలలో అతడు కలకాలం ఉంటాడు. అసలు ఇదే గొప్ప సాఫల్యం. అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ

అవిధేయత చుపుతూ అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమించే వాణ్ణి అల్లాహ్ అగ్నిలో పడవేస్తాడు. అందులో అతడు సదా ఉంటాడు. అతనికి మిక్కిలి అవమానకరమైన శిక్ష పడుతుంది. మీ ప్రభువును వేడుకోండి, విలపిస్తునూ గోప్యంగానూ. నిశ్చయంగా ఆయన మితిమీరి మెలిగేవారిని ప్రేమించడు. - అన్‌నిసా సూరా :13,14.

సమీక్ష:- ఖుదా పైగంబరను మహమ్మదుసాహెబును తనతో చేర్చుకొని యున్నాడు. ఇట్లా ఖుదా ఖురానునందే వ్రాసియున్నాడు. ఇంకను ఖుదా పైగంబరును కెట్లు లోబడియున్నాడో చూడుడు! అతడు స్వర్గమందును రసూలును భాగస్థునిగా చేసికొని ఉన్నాడుగద! ఒకమాట యందైనను ముసల్మానుల ఖుదా స్వతంత్రుడు కాడేని (లాశరీక్) భాగస్థుదనుటడనుట వ్యర్థము. ఇట్టివార్త ఈశ్వరోక్త పుస్తకమునందుండనేరవు. (56)

57. అల్లాహ్ ఎవరికీ రవ్వంత అన్యాయం కూడా చెయ్యడు. ఎవరైనా ఒక మంచి పని చేస్తే, దాన్ని అల్లాహ్ రెండింతలు చేస్తాడు. - అన్‌నిసా సూరా :40.

సమీక్ష:- ఒక త్రసరేణువంతైనా ఖుదా అన్యాయం చేయడుసరే మరిపుణ్యానికి రెండితలు ఫలమెందుకిచ్చును? ముసల్మానులకు పక్షపాత మెందుకు చేయుచున్నాడు? వాస్తవమేమన కర్మములకు రెండింతలుగాని తక్కువగాని ఫలమిచ్చునేని ఆ ఖుదా అన్యాయకారియే అగును. (57)

58. కాని నీ వద్ద నుండి వెళ్ళిన తరువాత వారిలోని ఒక వర్గంవారు రాత్రివేళ సమావేశమై నీ మాటలకు వ్యతిరేకంగా సంప్రదింపులు జరుపుతారు. వారి ఈ రహస్యాలోచనలనన్నింటినీ అల్లాహ్ వ్రాస్తున్నాడు. వాస్తవానికి వారు సంపాదించుకున్న దుష్టకర్మల ఫలితంగానే అల్లాహ్ వారిని వెనక్కు (పూర్వపుస్థితికి) మరల్చాడు. అల్లాహ్‌మార్గం చూపని వానికి మీరు మార్గం చూపదలచారా? వాస్తవంగా అల్లాహ్ అపమార్గం పట్టించినవాని కొరకు మీరు ఏ మార్గాన్నీ కనుగొనలేరు. - అన్‌నిసా సూరా :81,88.

సమీక్ష:- వార్తల నన్నింటిని వ్రాయుచు "బహీఖాతా" ద స్త్రముల నేర్పఱచుచు పోయినచో అల్లా సర్వజ్ఞుడు కాడు. సర్వజ్ఞుడైతే వ్రాయవలసిన అవసరమేమి? ఇక నందరిని భ్రమింపజేయుచున్నందున సైతానే దుష్టుడని ముసల్మాను లనుచున్నారు గద! ఖుదా కూడ జీవులను గుమరాహ చేయుచున్నప్పుడు ఖుదాయందును సైతానునందును భేద మేముండెను? ఔను. భ్రమింపజేయువాడే సైతానని ముసల్మానులు చెప్పుచున్నారు. కాబట్టి ఖుదా పెద్ద సైతాననియు, నతడు చిన్నసైతాననియు మాత్రమే భేదమననొప్పును. కావున నీ ప్రతిజ్ఞ ఖుదానుగూడ సైతానుగా జేసినది (58)

59. అలాంటివారు మీతో పోరాడటం మానుకోకపోతే, సంధికొరకు శాంతికొరకు చేయి చాపకపోతే, తమ చేతులను ఆపివుంచక పోతే, అప్పుడు వారిని ఎక్కడ దొరికితే అక్కడ పట్టుకొండి, సంహరించండి. వారితో యుద్ధం చెయ్యటానికి మేము మీకు స్పష్టమైన అధికారం ఇచ్చాము. ఇక బుద్ధిపూర్వకంగా ఒక విశ్వాసిని చంపేవానికి ప్రతిఫలం నరకం.

అందులో అతడు సదా ఉంటాడు. అతనిపై అల్లాహ్ ఆగ్రహం, శాపం అవతరిస్తాయి. అల్లాహ్ అతడి కొరకు కఠినమైన శిక్షను సిద్ధపరచి ఉంచాడు. –అన్‌నిసా సూరా :91,93.

సమీక్ష:– ఇప్పుడు చూచితిరా! ముసల్మాను కానివాని ఎక్కడచిక్కినను చంపివేయుడని, ముసల్మానుని మాత్రము జంపకూడదని చెప్పుట గొప్ప పక్షపాతమే కదా! తెలియక ముసల్మాను డొకముసల్మానుని చంపిన ప్రాయశ్చిత్తం చేయాలని ఇతరుని చంపిన స్వర్గాన్ని పొందునని చేయబడిన ఈ ఉపదేశాలను బావిలో వేయవలసిందే. ఇటువంటి పుస్తకాలను, పైగంబరులు, ఖుదాలు, మతాలు అను వీనివలన హాని కలుగుటదప్ప లాభమేమియు కలుగదు. కావున ఇవి ఉండకుండుటయే మంచిది. ఇట్లు ప్రమాదంతో కూడిన మతాలను త్యజించి వేదోక్త విషయాల నన్నిటి నంగీకరించుటయే బుద్ధిమంతులకు తగినది. అందుఅసత్యము కించిత్తయినను లేదు. ఇంక ఇక్కడ ముసల్మానుని చంపినవాడు నరకానిని పోవునన్నట్లే ముసల్మానుని జంపినవాడు స్వర్గానికి పోవునని అన్యమతస్థులనుచున్నారు. ఈ రెంటిలో దేనిని నమ్మవలెనో దేనిని త్యజింపవలెనో చెప్పుడు. కావున ఈ మూఢ ప్రకల్పిత మతాలను త్యజించి, వేదోక్తమతాన్ని స్వీకరించుటయే మనుష్యులందఱకును తగినది. అందు ఆనార్యుల– శ్రేష్ఠపురుషుల మార్గంలో నడువుడని, దస్యుల– దుష్టుల మార్గానికి దూరంగా ఉండుడని వ్రాయబడింది. కావున అదియే సర్వోత్తమము. (59)

60. కాని తనకు ఋజుమార్గం విశదమైనప్పటికి ఎవడైనా ప్రవక్తకు వ్యతిరేకంగా నడుంబిగిస్తే, విశ్వాసుల వైఖరి కాక మరొక వైఖరి అవలంభిస్తే, అతన్ని మేము అతడు మళ్ళిన దిక్కుకే నడిపిస్తాము. ఇంకా అతన్ని నరకంలో పడవేస్తాము. – అన్‌నిసా సూరా :115.

సమీక్ష:– ఇప్పుడు ఖుదా, రసూలుల పక్షపాతపు మాటలను గమనింపుడు. ఖుదాపేర తామిట్లు వ్రాయుకున్న తమతమము వృద్ధిపొందదనియు, పదార్థాలు లభింపవనియు ఆనందమనుభవింపకుందుమనియు, మహమ్మదు సాహెబు మున్నగువారు తలంచిరి వారు ఇతరుల పనులను చెడగొట్టుటతో మంచి నేర్పరులై అందు పరిపూర్ణ సిద్ధిని పొందియుండిరి. కాబట్టి వీరు ఆప్తులు కాకుండిరి. కావున వీరిమాట ఆప్తులగు విద్వాంసులయెదుట ప్రమాణార్హమెన్నటికి గానేరదు. (60)

61. విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్‌నూ, ఆయన ప్రవక్తనూ, ఆయన తన ప్రవక్తపై అవతరింపజేసిన గ్రంథాన్నీ, ఇంకా ఆయన దీనికి పూర్వం అవతరింపజేసిన ప్రతి గ్రంథాన్నీ విశ్వసించండి.[85] అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలను, అంతిమదినాన్ని తిరస్కరించినవాడు[86] నిశ్చయంగా మార్గం తప్పి అపమార్గంలో పడి చాలాదూరం పోయాడు. – అన్‌నిసా సూరా :136,137.

సమీక్ష:– ఏమి? ఇప్పుడు కూడా ఖుదా స్నేహితుడని చెప్పబడగలడా? స్నేహితుడని చెప్పుచూ అనతనితో అనేకులు స్నేహం చేయుటను అంగీకరిస్తున్నారు. ఇది పరస్పరవిరుద్ధము కాదా?

సమీక్ష:- ఇవి మాత్రమే నిషిద్ధాలా? ఇంకా ఎన్నో పశువులు, తిర్యక్ జీవాలు, కీటకాలు మొదలగునవి కలవు. అవన్నియు ముసల్మానులకు (హలాల్) భక్ష్యము లగునా? కావున ఇది మనుష్యుల కల్పితమేకాని ఈశ్వరునిది కాదు. కాబట్టి ఇది ప్రమాణార్హము కాదు. (64)

> **65. అల్లాహ్‌కు మంచి రుణాన్ని ఇస్తూవుంటే, నమ్మండి! నేను మీలోని చెడుగులను మీనుండి తుడిచివేస్తాను. ఇంకా మిమ్మల్ని క్రింద కాలువలు ప్రవహించే స్వర్గ వనాలలోకి ప్రవేశింపజేస్తాను.** – అల్ మాఇద సూరా :12.

సమీక్ష:- మంచిది! ముసల్మానుల ఖుదా ఇంటిలో కొంచమైనను ధనము లేకుండవచ్చును. ఎక్కువగా ఉంటే బదులెందు కడుగును? అట్లే మీ కీడును దూరం చేసి మిమ్ము స్వర్గమున కంపుదునని వారినేల భ్రమింపజేసి యుండును? ఇచ్చట మహమ్మదుసాహెబు ఖుదా పేరు చెప్పి తనకోరికలు తీర్చుకొన్నాడని అర్థమగుచున్నది. (65)

> **66. ఆయన తాను కోరిన వారిని క్షమిస్తాడు. తాను కోరిన వారిని శిక్షిస్తాడు. మూసా తన జాతి వారితో ఇలా అన్న విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి: "నా జాతి ప్రజలారా! అల్లాహ్ మీకు ప్రసాదించిన ఈ వరాన్ని గురించి ఆలోచించండి– ఆయన మీలో ప్రవక్తలను ఆవిర్భవింపజేశాడు. మిమ్మల్ని పాలకులుగా చేశాడు. ప్రపంచంలో ఎవరికీ ఇవ్వనిదానిని మీకు ఇచ్చాడు.** – అల్ మాఇద సూరా :18,20.

సమీక్ష:- ఏమి? సైతాను తనకిష్టమైన వానిని పాపాత్మునిగా చేయునట్లే ముసల్మానుల ఖుదా కూడా ఆసైతానువంటిపని చేయుచున్నాడా? అట్లైతే ఇక ఆ స్వర్గనరకాలకు ఖుదా పోవలసిందే కద. ఎందుకంటే అతడే పాపపుణ్యాలను చేస్తున్నాడు. జీవుడు పరాధీనుడు. సైన్యము సేనాధిపతి అధీనమందుండి కాపాడుచు ఒకని చంపుచుండును. ఆ పుణ్యపాపాలు ఆసేనాధిపతికి కలుగుతామేకాని సైన్యానికి కలుగవు గదా! (66)

> **67. అల్లాహ్ మాటను ఆయన ప్రవక్త మాటను వినండి.** – అల్ మాఇద సూరా :92.

సమీక్ష:- చూడండి! ఖుదా పొత్తుగలవాడనే ఇక్కడతెలియుచున్నది. ఇక అతని (లాశరీక్) భాగస్థుడని నమ్ముట వ్యర్థము (67)

> **68. పూర్వం జరిగినదానిని అల్లాహ్ క్షమించాడు. కాని ఇకముందు ఎవరైనా మళ్ళీ అలాచేస్తే, అల్లాహ్ వారికి ప్రతీకారం చేస్తాడు.** – అల్ మాఇద సూరా :95.

సమీక్ష:- చేసిన పాపాలు క్షమింపబడు ననుమాట పాపాలను చేయుటకు ఆజ్ఞాపించి వాటిని పెంచుడనాయే అర్థం. ఏ పుస్తకంలో పాపాలు క్షమింపబడు ననుమాట ఉండునో అది ఈశ్వర రచితముగాని ఒక విద్వాంసునిచే రచియింపబడినది కాదని తెలియునున్నది. పాపాలను పెంచునదనుట మాత్రం సత్యం. ఇక జరుగబోవు పాపాలను తొలగించుట కొకని ప్రార్థించుటయు తాను దానిని విడుచుటకు పురుషార్థము చేయుచు పశ్చాత్తాపపడుటయు అన్నీ వ్యర్థమే. (68)

69. అబద్ధపు అపనిందను సృష్టించి అల్లాహ్‌పై మోపేవాడికంటే, తనపై ఏ వహీ అవతరించక పోయినప్పటికీ "నాపై వహీ అవతరించింది" అని చెప్పేవాడికంటే లేదా అల్లాహ్ అవతరింప చేసినటువంటి విషయాలనే "నేను కూడా అవతరింపచేసి చూపిస్తాను" అని పలికేవాడికంటే మించిన దుర్మార్గుడు ఎవడు? - అల్ అన్ ఆమ్ సూరా :93.

సమీక్ష:- నాకు అల్లా దగ్గర నుండి ఆయాతు లందుచున్నవని మహమ్మదు సాహెబే చెప్పుకొనుచుండినట్లే అన్యుడెవడో నాకును ఆయతు లందుచున్న వనియు, నన్నుగూడ పైగంబరుగా నమ్ముడనియు మహమ్మదుసాహెబు వంటి లీలలను కల్పించి ఉండవచ్చును. అప్పుడు వానిమాటను రద్దుపఱచుటకును తన ప్రతిష్ఠను గొప్పచేయుటకును మహమ్మదుసాహెబు ఈ యుపాయాన్ని పన్నియుండవచ్చుననియే దీనివలన తెలుస్తున్నది (69)

70. మేము మీ సృష్టిక్రియను ప్రారంభించాము. తరువాత మీ రుపాన్ని తీర్చిదిద్దాము. పిదప ఆదముకు సాష్టాంగపడండి అని దైవదూతలను అజ్ఞాపించాము. ఈ ఆదేశానుసారం అందరూ సాష్టాంగపడ్డారు. కాని ఇబ్లీసు సాష్టాంగపడేవారిలో చేరలేదు. 12-19 అల్లాహ్, "నిన్ను నేను ఆదేశించినప్పటికీ సాష్టాంగపడకుండా నిన్ను ఏ విషయం నిరోధించింది?" అని అడిగాడు. ఇలా పలికాడు: "నేను అతడికంటే శ్రేష్ఠుణ్ణి. నీవు నన్ను అగ్నితో సృష్టించావు, అతణ్ణి మట్టితో." ఇలా సెలవిచ్చాడు, "సరే, అయితే, ఇక్కణ్ణుంచి కిందకు దిగు. ఇక్కడ నీ గొప్పతనాన్ని గురించి గర్వపడే హక్కు నీకు లేదు. వెళ్ళిపో. వాస్తవానికి నీవు తమ పరాభవాన్ని తామే కోరుకునేవారిలోని వాడవు."[4] ఇలా అన్నాడు: "వారందరూ మళ్ళీ లేపబడే రోజు వరకు నాకు వ్యవధినివ్వు." ఇలా సెలవిచ్చాడు: "నీకు వ్యవధి ఉంటుంది." ఇలా అన్నాడు: "అలాగే, నీవు నన్ను మార్గ భ్రష్టత్వానికి గురిచేసినట్లు నేను కూడా నీ ఋజుమార్గంపై ఈ మానవులకొరకు మాటువేసి కూర్చుంటాను. వెనుకా, ముందూ, కుడీ, ఎడమా అన్నివైపుల నుండీ వారిని చుట్టుముట్టుతాను. వారిలో అధిక సంఖ్యాకులను కృతజ్ఞులుగా చూడవు." ఇలా సెలవిచ్చాడు: "వెళ్ళిపో ఇక్కణ్ణుంచి, నీచుడవై, తిరస్కృతుడవై. వారిలో నిన్ను అనుసరించే వారందరితో నిన్ను కలిపి నరకాన్ని నింపుతాను.

- అల్ ఆరాఫ్ సూరా : 11-18.

సమీక్ష:- ఖుదాకు మరియు సైతానుకు జరిగిన జగడాన్ని ఇప్పుడు నిదానంగా వినండి. పరిచారకుడుగా నున్న ఒక ఫరిశ్తాకూడ ఖుదాకు లొంగలేదు. ఖుదా అయిన అతని ఆత్మను పవిత్రపఱప లేక పోయెను. అట్లే పాపకారులను చేసి ఉపద్రవములు కలుగజేసే ఆ ద్రోహిని ఖుదా విడిచిపెట్టెను. ఇది ఖుదా గొప్పపొరపాటే అనవచ్చును. సైతానందఱను భ్రమింపజేయువాడు. ఖుదా సైతానును భ్రమింపజేయువాడు నగుటబట్టి ఖుదా సైతానునకు మించిన సైతానని సిద్ధమగుచుననది. ఏలయన- నీవు నన్ను గుంరాహ చేసితివని సైతాను ప్రత్యక్షముగ చెప్పుకొనుచున్నాడు. కాబట్టి ఖుదాయందు పవిత్రతయు కనపడుట లేదు. కీడుల నన్నింటిని కల్పింపజేసెడి మూలకారణము ఖుదా అయ్యెను.

ఇట్టి ఖుదా కేవలము ముసల్మానుల కిష్టమగునేకాని శ్రేష్ఠులగు నితర విద్వాంసులకు కాదు. ఇక ఫరిశ్తాలతో మనుష్యుని మాదిరిగ వార్తాలాపము చేసియుండిన ముసల్మానుల ఖుదా దేహధారియు అల్పజ్ఞుడు, న్యాయరహితుడయ్యెను. కావుననే విద్వాంసులు ఇస్లామీమతమున కిష్టపడరు. (70)

71. వాస్తవంగా మీ ప్రభువు అల్లాహ్‌యే. ఆయన ఆకాశాలనూ, భూమినీ ఆరుదినాలలో సృష్టించాడు.[13] తరువాత తన రాజ్యపీఠాన్ని అలంకరించాడు.[14] మీ ప్రభువును వేడుకోండి, విలపిస్తూనూ గోప్యంగానూ. – అల్ ఆరాఫ్ సూరా : 54,55.

సమీక్ష:– బాగున్నది. ఎవడాఱుదినాలలో జగత్తును చేయునో అర్శ (పై ఆకాశం) సింహాసనము మీద శయనించునో అట్టి ఈశ్వరుడెన్నడయిన సర్వశక్తి మంతుడు సర్వవ్యాపకుడు కాగలడా? అట్లు కానిచో అతడు ఖుదా అనిగూడ చెప్పబడ జాలదు. ఏమి? పిలువగా వినడేని మీ ఖుదా బధిరుడా? ఈ మాటలన్నియు ఈశ్వరకృతములే? కావున ఖురాను ఈశ్వరకృతము కానేరదు. ఆఱుదినాలలో జగత్తునుజేసి, ఏడవదిన మర్శమీద శయనించెనన్న అలసి పోవచ్చును. ఇప్పటికీ నిద్రించుచున్నాడా? మేలుకొని యున్నాడా? మేలుకొని ఉన్నట్లైతే పని చేయుచున్నాడా? లేక నిరర్థకముగల ఇక్కడక్కడ తిరుగుచు ఆనందించుచున్నాడా? (71)

72. ధరణిపై సంక్షోభాన్ని సృష్టించకండి. – అల్ ఆరాఫ్ సూరా : 74.

సమీక్ష:– ఈ మాట మంచిదేకాని, దీనికి విపరీతంగా కొన్నిచోట్ల జిహాదు చేయుడనియు, కాఫిరులను భంపుడనియుగూడ వ్రాయబడిందే. ఇది పూర్వాపరవిరుద్ధముకాదా! చెప్పుడు. మహమ్మదు సాహెబు, నిర్బలుడయి యుండినపుడిట్లు చెప్పియుండవచ్చుననియు, బలవంతుడై ఉన్నప్పుడు జగడము చేయించి యుండవచ్చుననియు కూడ దీనివలన విదిత మగుచున్నది. కావున ఈవార్తలు పరస్పర విరుద్ధము లగుటవలన సత్యముల గావు. (72)

73. మూసా తన చేతికర్రను విసిరాడు. అకస్మాత్తుగా అది ఒక సజీవసర్పంగా మారిపోయింది. – అల్ ఆరాఫ్ సూరా :107.

సమీక్ష:– ఇట్లు వ్రాయుటవలన నిట్టి అబద్ధపు వార్తలను ఖుదా సాహెబును మహమ్మదు సాహెబును నమ్ముచుండిరనియు, వీ రిద్దఱును విద్వాంసులు కారనియు విదితమగుచున్నది. కంటితో చూచుటను, చెవితో వినుటను ఎవ్వడును నిరాకరింపనేరడు. కావు ఇవి ఐంద్రజాలపు మాటలే అనుట స్పష్టము. (73)

74. చివరకు మేము వారిపైకి తుఫానును పంపాము. మిడతల దండులను వదిలాము. పేలు వ్యాపింపచేశాము. కప్పలను పుట్టించాము. రక్తము కురిపించాము. ఈ సూచనలనన్నింటినీ వేర్వేరుగా చూపించాము. అప్పుడు మేము వారికి ప్రతీకారం చేశాము. వారిని సముద్రంలో ముంచి వేశాము. ఎందుకంటే, వారు మా సూచనలు అసత్యాలని తిరస్కరించారు. మేము ఇస్రాయీలు సంతతిని సముద్రం దాటించాము. తరువాత

వారు పోసాగారు. ఈ ప్రజలు అవలంబిస్తున్న విధానం నాశనం అయ్యేదే. ఇంకా వారు చేస్తూ ఉన్న పని పూర్తిగా అసత్యమైనది. - అల్ ఆరాఫ్ సూరా :133,136,138,139.

సమీక్ష:- ఇప్పుడు చూడండి! ఒక మోసగాడొకనిని- "మేము నీ మీదికి చంపుటకు సర్పములను పంపుదుమని" భయపెట్టినట్లే కద! ఈ మాటకూడ నయ్యేను. మంచిది. పక్షపాతముతో నిట్లొక జాతివారిని ముంచివేసి మరొక జాతివారిని తదరింపజేసినట్టి ఖుదా ధర్మము తప్పినవాడేలగాకుండును? వేలకొలది కోట్లకొలది మనుష్యులతో తరింపజేసినట్టి ఖుదా ధర్మము దప్పినవాడేలగాకుండును? వేలకొలది కోట్లకొలది మనుష్యులతో గూడియున్న ఇతరమతము లన్నియు అబద్ధములనియు తనమతమే సత్యమనియు ఎవడనుచున్నాడో, దానికంటె అబద్ధమైనది మరొకమత ముండునా? ఏలయన ఏమత మందైనను మనుష్యులందరును చెడ్డవారిగానో, మంచివారిగానో ఉండజాలరు. ఇట్లేక పక్షపు పరిష్కారము చేయునది మహామూర్ఖుల మతమే అగును. ఏమి? ఎవరి మతము తౌరేతు జబూరుల ననుసరించి యుండెనో అది అబద్ధమేనా! లేక దాని నబద్ధమని చెప్పుటకు వారిమతము మరొకటుండేనా? మరొక మత ముండెనన్న ఏ మతం ఉండెను? ఖురానునందు దాని పేర్లున్నట్లు చూపుదు (74)

75. ఇలా సెలవిచ్చాడు: "నీవు నన్ను చూడలేవు. కొంచెం, ముందున్న ఆ కొండవైపు చూడు. అది తన స్థానంలో స్థిరంగా ఉంటే అప్పుడు నీవు నన్ను చూడగలవు." ఆ ప్రకారం అతని ప్రభువు ఆ కొండపై తన తేజస్సును ప్రసరింపజేసి దానిని భస్మం చేసేశాడు. మూసా స్పృహ తప్పిపడిపోయాడు. -అల్ ఆరాఫ్ సూరా : 143.

సమీక్ష:- ఇట్లు కనిపించువాడు వ్యాపకుడు కాజాలడు. ఇవ్విధముగ చమత్కారములు చూపుచుండెనన్న నిప్పు డొకరికైన అట్టి చమత్కారము ఆ ఖుదా చూపుటలే దెందులకు? ఈ మాట నితాంత మసత్యము. కావున అంగీకారార్హము కాదు. (75)

76. ప్రవక్తా! నీ ప్రభువును ఉదయమూ సాయంత్రమూ స్మరించు, లోలోపల వినయంతోనూ భయపడుతూనూ,మెల్లగా నోటితోకూడా. - అల్ ఆరాఫ్ సూరా :205.

సమీక్ష:- ఖురానునందు కొన్నిచోట్ల తనప్రభువును ఎలుగెత్తి పిలువు మనియు, మతికొన్నిచోట్ల హీనస్వరముతో ఈశ్వరుని స్మరింపుమనియు వ్రాయబడి ఉన్నదిగదా! వీనిలోనే మాట నిజమో ఏమాట అబద్ధమో చెప్పుడు. ఇట్లొకమాట మరొకమాటను రద్దుపరచుచున్న అది ప్రమత్తాలాపము వంటిదే అనబడును. భ్రమచే ఒకమాట విరుద్ధంగా చెప్పబడెనన్న ఒప్పుకొనవచ్చును. చింతయేమియు లేదు. (76)

77. వారు నిన్ను "అన్‌ఫాల్"ను గురించి అడుగుతున్నారు.ఇలా అను: "ఈ అన్‌ఫాల్ అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ చెందుతాయి. కనుక మీరు అల్లాహ్‌కు భయపడండి. - అన్‌ఫాల్ సూరా :1.

సమీక్ష:- దోపిడీ వ్యవహారము- దోపిడిగాంఢ్రపనులు చేయుచు చేయించువారే 'ఖుదా పైగంబరులు. ఈమాన్‌దారులు అగుదురన్న ఇదిగొప్ప ఆశ్చర్యకరమగు వార్తయే అనవచ్చును. అల్లా భయము చూపుచు దోపిడీ మున్నగు దుష్కార్యాలను చేయువారుగూడ మాది ఉత్తమ మతమని చెప్పుకొనుట లజ్జాస్పదము కాదా? కావున హఠమును వదలి వేదమతమును గ్రహింపక పోవుటకంటె మించిన చెఱుపు మఱియేదియు నుండదనుట స్పష్టము. ((77)

78. అవిశ్వాసులను సమూలంగా నాశనం చెయ్యాలనేది అల్లాహ్ సంకల్పం. "నేను మీ సహాయంకొరకు వెయ్యిమంది దైవదూతలను ఒకరి తరువాత ఒకరిని ఎడతెగకుండా పంపుతున్నాను." నేను ఇప్పుడే ఈ అవిశ్వాసుల హృదయాలలో భయాన్ని సృష్టిస్తాను. కనుక మీరు వారి మెడలపై కొట్టండి. వారి కీలుకీలుపై కొట్టండి."

- అన్‌ఫాల్ సూరా :7,9,12.

సమీక్ష:- మంచిదయ్యా! మంచిది. ఈ ఖుదాను పైగంబరులను ఎంతటి దయాహీను లనవలయును? ముసల్మానుల మతమును నంగీకరింపనివారిని కాఫిరులనియేకద వారిని నిర్మూలము చేయుటకు ఆ ఖుదా ఆజ్ఞాపించుచున్నాడు. అంతేగాదు, వారి మెడలనునఱకుడు. వారి కాళ్ళుచేతులు కీళ్ళు తెగకోయుటకును తోడ్పడుదునని సమ్మతిగూడ నిచ్చుచున్నాడే! ఇటువంటి ఖుదా లంకేశు నికంటె నేమైన తక్కువవాడనబడునా? ఈ గందరగోళమంతయు ఖురాను కర్తదే కాని ఖుదాది కాదు. ఖుదాదేని ఇటువంటి ఖుదా మాకు దూరమై ఉండుగాక! మేముకూడ అతనికి దూరమై ఉందుము గాక! (78)

79. అల్లాహ్ విశ్వాసులతో ఉన్నాడు. విశ్వసించిన ప్రజలారా! అల్లాహ్ పిలుపునకూ, ఆయన ప్రవక్త పిలుపునకూ జవాబు పలకండి. ప్రవక్త మీకు జీవితాన్ని ప్రసాదించే దానివైపునకు మిమ్మల్ని పిలిచినప్పుడు. విశ్వసించిన ప్రజలారా! బుద్ధిపూర్వకంగా అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ నమ్మక ద్రోహం చెయ్యకండి. మీ అమానతుల విషయంలో ద్రోహానికి పాల్పడకండి. ఆ సమయంకూడా జ్ఞాపకం తెచ్చుకోదగ్గదే; అప్పుడు సత్య తిరస్కారులు నీకు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ ఉన్నారు, నిన్ను నిర్బంధించాలని లేదా నిన్ను హత్య చెయ్యాలని లేదా నిన్ను దేశం నుండి బహిష్కరించాలని. వారు తమ ఎత్తులు తాము వేస్తూ ఉన్నారు. అల్లాహ్ తన ఎత్తు తాను వేస్తూ ఉన్నాడు. అల్లాహ్ అందరికంటే బాగా ఎత్తులు వేస్తాడు. - అన్‌ఫాల్ సూరా :19,24,27,30.

సమీక్ష::- ఏమి! అల్లా ముసల్మానుల పక్షపాతియా? అటులేని అధర్మము చేయువాడగును. ఏమన ఈశ్వరుడు ప్రపంచమున అంతటను కలవాడు వినజాలడా? బధిరుడా? ఇంక అతనితో రసూలును ఏకముచేయుట కడునింద నీయమైన అంశము కాదా? దొంగిలింతు రనుటకు అల్లాఖజానా (కోశము) ఏది నిండియున్నది? రసూలు దొంగతనమును తన అమానతునందలి దొంగతనమును మాత్రమే మాని తక్కిన దొంగతనములన్నియు చేయవచ్చునా? ఇట్లు విద్యావిముఖులును, ధర్మవిహీనులు

నగువారే ఉపదేశింపగలుగుదురు. మంచిది! తంత్రము చేయువాడును తంత్రము చేయువాండ్రకు సహాయకుడు నయియున్నాడేని ఆ ఖుదా మోసగాడు, కపటియు, అధార్మికుడును ఏల కాకుండును? దీనివలన ఈ ఖురాన్ ఖుదాచే రచియింపబడినది కాదు. ఒకానొక మోసగాడు, కపటియైనవానిచే రచింపబడ వచ్చును. లేనిచో ఇట్టి విపరీతము లెందులకు వ్రాయబడి ఉంటాయి.(79)

80. పీడన ఏ మాత్రం మిగలకుండా పోయేవరకు, అల్లాహ్ నిర్ణయించిన ధర్మం పూర్తిగా నెలకొల్పబడేవరకు ఈ అవిశ్వాసులతో యుద్ధం చెయ్యండి.మీరు ఈ విషయాన్ని తెలుసుకోవాలి: మీరు యుద్ధ సంపదగా పొందిన దానిలో ఐదవభాగం అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ, బంధువులకూ, అనాధలకూ, బీదవారికీ, బాట సారులకూ చెందుతుంది. - అన్‌ఫాల్ సూరా :39,41.

సమీక్ష:- ఇట్టు అన్యాయముగ పొట్లాడుచు, పొట్లాడజేయునట్టి ముసల్మానుల ఖుదాకంటె అన్యుడు శాంతిభంగము చేయువాడితరు డెవడుండును? ఇంక మతమును చూడుడు! అల్లా కొరకును, రసూలు కొరకును, జగత్తును దోచుట, దోపించుట అనునది దోపిడిగాండ్ర పనిగాదా? అపహరింపబడిన సొత్తులో ఖుదా భాగస్థుడై ఉన్నప్పుడు దోపిడిగాడనియే అర్థం. మరి ఖుదా దోపిడిగాండ్రకు పక్షపాతియై తన ఖుదాతనానికి కొరతను గలుగ జేసికొనుచున్నాడు గదా! ఇట్టి పుస్తక మీ ఖుదా పైగంబరు నను నుపాధిధారులు ప్రపంచమున శాంతిభంగముచేసి, మనుష్యులకు దుఃఖము కలుగజేయుట కెక్కడినుండి వచ్చిరో గొప్పవింతగా నున్నది! జగత్తున నిట్టి మతములే ప్రచలితములు కాకుండిన జగత్తంతయు ఆనందముతో కూడియుండెడిది. (80).

81. దైవ దూతలు, హతులైన అవిశ్వాసుల ప్రాణాలను తీస్తున్నప్పటి స్థితిని నీవు గనక చూడగలిగితే ఎంత బాగుండేది! వారు వారి ముఖాలపైని, పిరుదలపైని కొట్టేవారు. ఇంకా ఇలా అనేవారు: "ఇదో, కాల్చే శిక్షను అనుభవించండి. ఇది స్వయంగా మీ చేతులే ముందుగా సేకరించి పెట్టినదానికి ప్రతిఫలం.

ఫిరౌను జాతివారికీ, వారికి పూర్వపు జాతులవారికీ ఏమి సంభవించిందో, అది ఈ నియమం ప్రకారమే సంభవించింది. మీరు మీ శక్తిమేరకు అత్యధికబలాన్నీ, కట్టివేసి సిద్ధంగా ఉన్న గుర్రాలను వారిని ఎదుర్కోవటానికి సమాయత్తపరచుకోండి.

- అన్‌ఫాల్ సురా :50,54,60

సమీక్ష :- ఏమండీ! వర్తమాన సమయమందు రూసువారు రోము మొదలగు దేశవాసులకును, ఇంగ్లండు వారు మిత్రదేశవాసులకు దుర్దశవాటిల్ల చేసిరే. ఫరిశ్తా లెక్కడ నిద్రపోయిరోగదా! పూర్వకాలమున ఖుదా తన సేవకుల శత్రువులను చంపుచు ముంచివేయుచు నుండెనను వార్తలు నిజమైన నిప్పుడు కూడ నటులే చేయవలసి ఉండెను. వారిదశ ఇట్లు కాకయుండెడిది. ఇందువలన ఈమాట ఒప్పదగినది కాదు. ఇక ఇతర మతస్థులతో మీరు చేయగలుగునంతటి దౌర్జన్యము చేయుడను ఈ దురాజ్ఞను గమనింపుడు. ఒక విద్వాంసుడో, ధర్మాత్ముడో, దయాళువో అయిన ఇట్లాజ్ఞాపింప

నేరడుగద. మరల ఖుదా దయాళుడనియు, న్యాయకారి యని కూడ వ్రాయుచున్నారు. ఇటువంటి మాటవలన ముసల్మానుల ఖుదాయందు న్యాయం, దయ మున్నగు సద్గుణము ఎంత మాత్రము స్థిరపడవు. (81)

82. ప్రవక్తా! నీకూ, నిన్ను అనుసరించే విశ్వాసులకూ అల్లాహ్‌యే చాలు. ప్రవక్తా! ముస్లిములను యుద్ధానికి పురికొలుపు. మీలో గనక ఇరవై మంది స్థైర్యం కలవారు ఉంటే, వారు రెండువందలమందిని జయిస్తారు. కనుక మీరు పొందినసొమ్మును తినండి. అది ధర్మసమ్మతమైనదీ, పవిత్రమైనదీను. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి. నిశ్చయంగా అల్లాహ్ మన్నించేవాడూ కరుణించే వాడూను. - అన్‌ఫాల్ సూరా :64,65,69.

సమీక్ష :- తనపక్షపువా డన్యాయము చేసినను వానికి తోడయి వానికే లాభము కలుగజేయు దనున దెట్టిన్యాయమో? ఎట్టి విద్వత్తో? ఏమి ధర్మమో? తెలియుట లేదు. ప్రజలందు శాంతిభంగము గలుగజేయుటకు యుద్ధము చేయుడనియు, చేయింపుడనియు తోచిన పదార్థములు సేవనీయములనియు అల్లా దయాళువు కావున క్షమించుననియు ననుమాటలు ఖుదాలిఖితము లెట్లు కాగలవు? ఒక సరసు నిచే వ్రాయబడినవియు గానేరవు. ఇట్టి మాటలుగల ఖురా నీశ్వరోక్త మెన్నటికిని కాజాలదు.(82)

83. వారి ప్రభువు వారికి తన కారుణ్యం, తన సంతోషాల శుభవార్తనూ, శాశ్వత భోగాల సామగ్రిగల స్వర్గవనాల శుభవార్తనూ, ఇస్తున్నాడు. వాటిలో వారు సదా ఉంటారు. నిశ్చయంగా సేవలకు ప్రతిఫలం ఇవ్వటానికి అల్లాహ్‌వద్ద ఎంతో ఉంది. విశ్వసించిన ప్రజలారా! మీ తండ్రులను, మీ సోదరులను కూడా మీ సహచరులుగా చేసుకోకండి, ఒకవేళ వారు విశ్వాసం కంటె అవిశ్వాసానికి ప్రాధాన్యం ఇస్తే. తరువాత అల్లాహ్ తన (తరపునుండి) ప్రశాంతస్థితిని తన ప్రవక్తపై విశ్వాసులపై అవతరింపజేశాడు; ఇంకా మీకు కనిపించని దళాలను దించాడు. సత్యతిరస్కారులను శిక్షించాడు. సత్యాన్ని తిరస్కరించే వారికి లభించే ప్రతిఫలం ఇదే. ఇంకా సత్యధర్మాన్ని తమ ధర్మంగా చేసుకోనివారూనూ అయిన వారికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యండి.

- అత్ తౌబా సూరా : 22,23,26,27,29.

సమీక్ష:- సరే! బాగున్నది. అలా స్వర్గవాసుల సమీపమున నుండునన్న సర్వవ్యాపకు డెట్లు కాగలడు? సర్వవ్యాపకుడు కాడేని, సృష్టికర్తయు, న్యాయాధీశుడును కాజాలడు. ఇక తమ తల్లి దండ్రులను, బంధుమిత్రులను డిపించుట కేవల మన్యాయమే కద. ఒకవేళ వారు చెడ్డయుపదేశము చేయుదురేని, అంగీకరింపవలదు. కాని వారి సేవ మాత్రము సర్వదా చేయవలసినదే. పూర్వకాలమున ఖుదా ముసల్మానుల మీద సంతోషభరితుడై ఉండెను. వారి సాహాయ్యమునకై సేనలను చంపుచుండెను. అనుమాటలు నిజమైయున్న ఇప్పుడట్లేల చేయకుండును? మొదట కాఫిరుల దండించుచు, మరల వారిమీద దయజూపుచు నుండెనన్న ఇప్పు డెక్కడికి పోయెను? ఖుదా యుద్ధము చేయింపక విశ్వాసము

కలుగజేయ నేరదా? ఇటువంటి ఖుదాకు మేము సర్వదా తిలాంజలి చెప్పుచున్నాము. ఖుదాయన నాకయాటకాదే యననొప్పును. (83)

84. వారితో ఇలా అనండి: "మీరు మా విషయంలో దేని కొరకు నిరీక్షిస్తున్నారో అది, రెండు మేళ్ళలో ఒకటితప్ప మరొకటేముంది?[33] ఇక మీ విషయంలో మేము నిరీక్షిస్తున్నది ఏమిటంటే, అల్లాహ్ స్వయంగా మీకు శిక్ష ఇస్తాడా లేక మా చేతులద్వారా ఇప్పిస్తాడా అనేది. మంచిది, అయితే ఇక మీరుకూడా నిరీక్షించండి. మేము కూడా మీతోపాటే నిరీక్షిస్తాము." - అత్ తౌబా సూరా :52

సమీక్ష:- ఏమి తనచేతనో, ముసల్మానులచేతనో అన్యమతస్థులకు పీడ కలుగజేయునన్న ముసల్మానులే ఈశ్వరునికి (పోలీసువారు) బంటులయి నిలిచిరా? ఇతర కోట్లకొలది మనుష్యులు ఈశ్వరునకు ప్రియులుకారా? ముసల్మానులందు పాపకారులున్నను వారు ప్రియులేనా? అటులేని (అంధేర్నగరీ గవరగండరాజు) 'అధర్మ పురాలు అన్యాయపు రాజు' అనుసామెతను పోలిన వ్యవస్థయే యని తేటపడుచున్నది. బుద్ధిమంతులయిన ముసల్మానులు కూడ నట్టి నిరాధారం, అయుక్తమగుమతమును అంగీకరించుట ఆశ్చర్యకరము. (84)

85. విశ్వాసులైన ఈ పురుషులకూ, స్త్రీలకూ అల్లాహ్ వాగ్దానం చేశాడు, క్రింద కాలువలు ప్రవహించే తోటలను వారికి ఇస్తాను అని. వారు వాటిలో శాశ్వతంగా ఉంటారు. నిత్యమూ కళకళలాడే ఆ ఉద్యాన వనాలలో వారికొరకు పరిశుద్ధమైన నివాసాలు ఉంటాయి. ఇంకా అన్నింటికంటే మించిన అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. అదే గొప్ప సాఫల్యం. సంతోషంతో, ఇష్టంతో విశ్వాసులు చేసే ధనత్యాగాలను కించపరుస్తూ వారు మాట్లాడుతారు. (దేవుని మార్గంలో ఇచ్చేందుకు) తాము శ్రమ కోర్చి ఇచ్చేది తప్ప మరేదీ తమ వద్ద లేనివారిని వారు హేళన చేస్తారు. ఈ హేళన చేసేవారిని అల్లాహ్ హేళన చేస్తున్నాడు. - అత్ తౌబా సూరా :72,79.

సమీక్ష:- తన ప్రయోజనము నెఱవేఱుటకు ఇట్లు ఖుదా పేరిట, స్త్రీ పురుషులకు ప్రలోభము గలుగ చేయుటకే కల్పింపబడిన దననొప్పును. ఏలయన నిట్టి ప్రలోభనమును గలుగజేయకున్న మహమ్మదు సాహెబు వలలో ఎవ్వడు చిక్కకుండును. ఇటులే అన్యమతస్థులును చేయుచున్నారు. మనుష్యులు మాత్ర మొకరితోను పరిహాసం చేయుట సహజమే కాని ఖుదా కూడా ఒకరితో పరిహాసము చేయుననుట యుక్తముకాదు. ఈ ఖురానన్న ఒక గొప్ప అటగా నున్నది. (85)

86. వారు ఇంటిలో కూర్చుండి పోయే స్త్రీలలో చేరిపోవటానికి ఇష్టపడ్డారు. వారి హృదయాలపై ముద్ర వేయబడింది.

దీనికి భిన్నంగా ప్రవక్తా, ప్రవక్తతోపాటు విశ్వసించినవారూ తమ ప్రాణాలతో తమ సంపదలతోపోరాడారు. కనుక ఇప్పుడు - అత్ తౌబా సురా :88,93

సమీక్ష:- చూడుడు. మహమ్మదు సాహెబును విశ్వసించినవారు మంచి వారనియు అతనిని విశ్వసింపని వారు చెడ్డవారనియు ననుట స్వార్థముతో గూడిన మాటయేకద. ఈ మాట పక్షపాతముతోను, అవిద్యతోను కూడినది కాదా! ఖుదా ముద్రలు వేసియున్నందుననే కద వారు పాప మొనరించుచున్నారు. అందు వారి అపరాధ మేమియు లేదు. కాని ఆ అపరాధము ఖుదాదే అననొప్పును. ఏలయన వారి హృదయముల మీద ముద్రలువేసి ఆ అమాయకులను సన్మార్గమునుండి తొలగజేసి ఉన్నాడే. ఇది ఎంత గొప్ప అన్యాయము. (86)

87. ప్రవక్తా! నీవు వారి సంపదల నుండి సదఖా తీసుకొని వారిని పరిశుద్ధపరచు. ఇంకా (సన్మార్గంలో) వారిని ముందుకు నడుపు. వారి కొరకు దేవుని కారుణ్యానికై ప్రార్థించు. ఎందుకంటే నీ ప్రార్థనవల్ల వారికి ఉపశమనం కలుగుతుంది.

యథార్థం ఏమిటంటే, విశ్వాసులనుండి అల్లాహ్ వారి ప్రాణాలనూ, వారి సంపదలనూ స్వర్గానికి బదులుగా కొన్నాడు. వారు అల్లాహ్ మార్గంలో పోరాడుతారు, చంపుతారు, చస్తారు. - అత్ తౌబా సూరా :103,111.

సమీక్ష:- మేలయ్యా చాలా మంచిదయ్యా మహమ్మదుసాహెబు ! చాలామంచిది! తాము గోకులపు గోసాయిలతో సమానులైతిరే! ఏమన వారిసొత్తుగైకొని వారిని పవిత్ర పరతు రనునది గోసాయీలవంటి సమాచారమే! మేలయ్యా ఖుదా! తాము మంచి బేరము కనిపెట్టితిరే! ముసల్మానులచేత తక్కిన బీదజనుల ప్రాణమును తీయించుటయే లాభమనుకొంటిరా! ఇట్లా యనాథులను చంపించి, ఈ దయావిహీనులగు మనుష్యులకు స్వర్గ మబ్బునని చెప్పుట ముసల్మానుల ఖుదా దయాన్యాయాలకు దూరమై తనఖుదాతనమున కొరతను కలుగచేసికొని, బుద్ధిమంతులగు ధర్మాత్ములలో నిందితుడై నిలిచెనుగదా! (87)

88. విశ్వసించిన ప్రజలారా! మీ చెంతనున్న సత్య తిరస్కారులతో పోరాడండి. వారు మీలో కాఠిన్యాన్ని చూడాలి.

తాము ప్రతి సంవత్సరం ఒకటీ రెండుసార్లు పరీక్షకు గురిచెయ్యబడటాన్ని వారు చూడటంలేదా? కాని దీని తరువాత కూడా వారు పశ్చాత్తాపము పడటం లేదు. ఏ గుణపాఠాన్నీ నేర్చుకోవటంలేదు. - అత్ తౌబా సూరా :123,126.

సమీక్ష:- ఈ విశ్వాసఘాతపు మాటలను కూడ గమనింపుడు. మీ పొరుగు వారే కాని పరిచారకులే కాని అవసరము చిక్కినప్పుడెల్లవారితో పోట్లాడుడనియు, వారి కషాయము కలుగజేయు డనియు ఖుదా ముసల్మానులకు నేర్పుచున్నాడు. ఇటువంటి మాటలెన్నియో ముసల్మానులచే కల్పింపబడినవి. ఈ ఖురాను లేఖనుబట్టియే యిప్పుడైనను ముసల్మాను లూహించి తెలిసికొని ఖురాను నందలి దురాచారములను ఒదులుదురేని కడు మేలౌనగూడును. (88)

89. యథార్థం ఏమిటంటే ఆకాశాలనూ, భూమినీ ఆరు రోజులలో సృష్టించి, తరువాత రాజ్యపీఠాన్ని అలంకరించి సృష్టివ్యవహారాలను నడుపుతూవున్న దేవుడే మీ ప్రభువు. ఆయన అనుమతి ఇస్తే తప్ప ఎవడూ సిఫారసు చేయలేడు. – యూనుస్ సూరా : 3.

సమీక్ష:– ఆకాశ మొక్కటియే. అది చేయబడక యనాదియై యున్నది. దానిని నిర్మించెనని వ్రాయుటవలన ఈ ఖురానును రచించినవారికి పదార్థ విద్య ఎంత మాత్రము తెలియకుండె ననుట స్పష్టము. ఏమి? పరమేశ్వరునకు ఆఱుదినముల వరకు చేయవలసివచ్చెనా? మరి "నా ఆజ్ఞ వలన కమ్ము అనగా అయ్యెను" అని ఖురానునందు వ్రాయబడి ఉన్నప్పుడు ఆరు దినములు పట్టవలసిన అవశ్యకమే లేదుగదా! కాబట్టి ఆరు దినములు పట్టెననుట అబద్ధమే ఆయన వ్యాపకుడేయై ఉన్న ఆకాశము మీద నెందులకు శయనించియుండును? ఇక కార్యముల నేర్పాటు చేయుచుండు నన్న నిజముగ మీ ఖుదా మనుష్యునితో సమానుడే యనబడును. ఏమన సర్వజ్ఞుడైనవాడు కూర్చుండియుండి ఏమి ఏర్పాటు చేయుచుండును? కావున నీశ్వరు నెరుగని అవివేకు లీ పుస్తకమును రచియింపవచ్చు నని దీనివల్ల విదితమగుచున్నది. (89)

90. ఆకాశాలనూ, భూమినీ ఆరు దినాలలో సృష్టించినవాడు ఆయనే– దానికి పూర్వం ఆయన సింహాసనం నీళ్ళపై ఉండేది– మీలో ఎవడు మంచిపనులు చేస్తాడో మిమ్మల్ని పరీక్షించి చూద్దామని. ప్రవక్తా! ఇప్పుడు నీవు గనక వారితో "ప్రజలారా! మరణించిన తరువాత మీరు మళ్ళీ లేపబడతారు." – హూద్ సూరా : 7 – 8.

సమీక్ష:– ఇట్లు కర్మములను పరీక్షించువాడు సర్వజ్ఞుడే కాదు. చచ్చిన పిదప లేపునన్న వారిని నిర్బంధములో బెట్టువాడే యగును. మఱి చచ్చినవారు జీవితులు కాకుండెడి తననియమమును దానే భంగపఱచువా డగునుగదా! కావున నిది ఖుదాత్వమున కొరతను కలుగజేయుచున్నది. (90)

91. ఆజ్ఞ జారీ అయింది: "భూమీ! నీ నీళ్ళన్నీ మింగి వెయ్యి. ఆకాశమా! కురవటం మానివెయ్యి." అప్పుడు నీరు భూమిలో ఇంకిపోయింది. తీర్పు జరిగిపోయింది. నా జాతి ప్రజలారా! చూడండి! అల్లాహ్ యొక్క ఈ ఒంటె మీకు ఒక నిదర్శనంగా ఉంది. దానిని అల్లాహ్ భూమిపై మేయటానికి స్వేచ్ఛగా వదలిపెట్టండి. దాని జోలికి ఏ మాత్రం పోకండి. ఒకవేళ అలాచేస్తే దైవశిక్ష మీపై పడటానికి ఎంతోసేపు పట్టదు.

– హూద్ సూరా : **44,64.**

సమీక్ష:– ఇంది యెంత పసితనపుమాట! పృథివ్యాకాశము లెప్పుడైన మాటలు వినగలవా! మేలయా! మేలు! ఖుదాకు ఒక ఆడుది ఆగు ఒంటెయు కలదేని మగది కూడ నుండవచ్చును. అట్లే ఏనుగులు, గుఱ్ఱాలు, గాడిదలు మున్నగునవియు ఉండవచ్చును. ఖుదా తన ఒంటెచే పొలమును మేపుట మంచిదేనా? ఆ యొంటెమీద నెక్కుచునున్నాడా ఏమి? ఇటులేని నవాబునింటి వంటి గందరగోళమే ఖుదాయింట నయ్యెను. (91)

92. ఇక అదృష్టవంతులుగా లేనివారు - వారు స్వర్గానికి పోతారు. అక్కడ శాశ్వతంగా ఉంటారు. భూమ్యాకాశాలు ఉన్నంతవరకు నీ ప్రభువు మరొకటి తలిస్తే తప్ప. ఎన్నటికీ తరిగిపోని అనుగ్రహం వారికి లభిస్తుంది. - హూద్ సూరా : 108.

సమీక్ష:- ప్రళయమునకు బిమ్మట నరక స్వర్గములకు అందరు పోవుదురన్న ఇక ఆకాశము, పృథివియు ఎందుకొరకుండును? మరి నరక స్వర్గములు భూమ్యాకాశము లుండువరకే యుండునన్న స్వర్గనరకములందు నెల్లప్పుడుందురనుమాట అసత్యమయ్యెను. ఇది విద్యావిహీనుల మాటయేకాని ఈశ్వరునిది కాని ఒక విద్వాంసునిదికాని కానేరదు. (92)

93. ఇది యూసుఫ్ తన తండ్రితో ఇలా అన్నప్పటి ప్రస్తావన: తండ్రీ నేను ఒక కలగన్నాను: - యూసుఫ్ సురా : 4.

సమీక్ష:- ఈ ప్రకరణమంతయు దండ్రికొడుకుల సంవాదమను కథతో నిండియున్నది. కావున ఖురాను ఈశ్వరకృతము గాదు. కాని యొకానొక మానవుడే మనుష్యుల ఇతిహాసమును వ్రాసియున్నాడు.(93)

94. మీకు కనిపించే ఆధారాలు లేకుండా ఆకాశాలను నిలిపినవాడు అల్లాహ్‌యే. తరువాత ఆయన తన రాజ్యపీఠాన్ని అలంకరించాడు. ఆయన సూర్యున్ని, చంద్రున్ని ఒక నియమానికి బద్ధులుగా చేశాడు. ఈ సమస్త వ్యవస్థకు చెందిన ప్రతివస్తువూ ఒక నిర్ణీతకాలం వరకు పయనిస్తోంది. ఆయనే ఈ భూమిని విశాలంగా పరచినవాడు. అల్లాహ్ ఆకాశం నుండి నీళ్ళను కురిపించాడు. ప్రతినదీ ప్రతి కాలువా తన శక్తికొలది దానిని గ్రహించి బయలుదేరింది.

అల్లాహ్ తన ఇష్టప్రకారం కొందరికి ఎక్కువ జీవనోపాదిని ప్రసాదిస్తాడు, మరికొందరికి తక్కువ జీవనోపాదిని ప్రసాదిస్తాడు. - అర్రాద్ సూరా :2,3,17,26.

పమీక్ష:- ముసల్మాను ఖుదా పదార్థవిద్య ఎంతమాత్ర మెఱుగకుండెను. ఎఱిగియే ఉండిన గురుత్వము కలిగియుండని ఆకాశమును స్తంభములు లేక నిలువబెట్టితి ననుగాథల నెంతమాత్రము వ్రాయకుండును. ఇక ఖుదా (అర్శ) నాల్గవ యాకాశ మనునొక స్థానమునందు వసించుచున్నాడేని అతడు సర్వశక్తిమంతుడును, సర్వవ్యాపకుడును కానేరడు. అట్లే ఖుదా మేఘ విద్య ఎఱిగి ఉండిన ఆకాశమునుండి నీటిని గురియించి తినని వ్రాసెనే కాని పృథివినుండి నీటిని పైకెక్కించితినని వ్రాయలేదెందులకు? దీనివలన ఖురానును రచియించినవాడు మేఘవిద్యనుగూడ నెఱుగకుండె ననుటయే నిశ్చయము. సుకృతదుష్కృతములు లేక సుఖదుఃఖములు కలుగజేయుచున్నాడేని పక్షపాతియు అన్యాయకారియు నిరక్షరకుక్షియై నిలచును. (94)

95. ఇలా అను: అల్లాహ్ తాను కోరినవారిని మార్గభ్రష్టులుగా చేస్తాడు. ఆయన తనవైపునకు మరలేవారికి మాత్రమే తనవైపునకు వచ్చే మార్గాన్ని చూపుతాడు. అటువంటి ప్రజలే

(ఈ ప్రవక్త సందేశాన్ని) విశ్వసించారు. వారి హృదయాలకు అల్లాహ్ సంస్మరణంవల్ల తృప్తి కలుగుతుంది. – అర్రాద్ సూరా :27

సమీక్ష:– ముసల్మానుల ఖుదా పదార్థవిద్య నెంతమాత్ర మెఱుగకుండెను. ఎఱిగియే యుండిన గురుత్వము కలిగియుండని ఆకాశమును స్తంభములు లేక నిలువబెట్టితి ననుగాథల నెంతమాత్రము వ్రాయకుండును. ఇక ఖుదా (అర్శ) నాల్గవ ఆకాశమునొక స్థానమునందు వసించుచున్నాడేని అతడు సర్వశక్తిమంతుడును, సర్వవ్యాపకుడును కానేరడు. అట్లే ఖుదా మేఘ విద్య నెఱిగియుండిన ఆకాశమునుండి నీటిని గురియించితినని వ్రాసెనే కాని పృథివినుండి నీటిని పైకెక్కించితినని వ్రాయలేదెందులకు? దీనివలన ఖురానును రచియించినవాడు మేఘవిద్యనుగూడ నెఱుగకుండె ననుటయే నిశ్చయము. సుకృతదుష్కృతములు లేక సుఖదుఃఖములు కలుగజేయుచున్నాడేని పక్షపాతియు అన్యాయకారియు నిరక్షరకుక్షియై నిలచును. (95)

96. ఈ మార్గదర్శకత్వంతోనే మేము ఈ అరబ్బీ ఫర్మానాను నీపై అవతరింపజేశాము. ఇక నీవు గనుక, నీవద్దకు ఈ జ్ఞానం వచ్చిన తరువాత కూడా, ప్రజల కోరికలను అనుసరిస్తే, అల్లాహ్ సమక్షంలో నిన్ను రక్షించేవాడుగానీ నీకు సహాయపడేవాడుగానీ ఎవడూ ఉండడు. నీ పని కేవలం సందేశాన్ని అందజెయ్యటమే. లెక్క తీసుకోవటం మటుకు మా పని. – అర్రాద్ సూరా :37,40

సమీక్ష:– అల్లా త్రోవ దప్పించుచున్నాడేని ఖుదాకు సైతానునకు నిక భేద మేముండెను? సైతా నితరులను త్రోవదప్పించుట, భ్రమింపజేయుటవలననే కదా దుష్టు డనబడుచున్నాడు. ఖుదాసైత మట్టిపనియే చేసినచో సైతానుకంటె చెడ్డవా డెందులకు కాకుండును? మరి భ్రమింపజేసెడి పాపమునుబట్టి నరకవాసి ఎందులకు గాకూడదు. (96)

97. నిరంతరం ప్రయాణం చేస్తూ పోతున్న సూర్యచంద్రులను మీ సేవకై మీకు లోబరచినవాడు, నిజముగా మానవుడు నీతి లేనివాడు, కృతఘ్నుడు. – ఇబ్రాహీం సూరా :33,34

సమీక్ష:– ఏమి! సూర్యచంద్రులే సదా తిరుగుచున్నారా? భూమి తిరుగుట లేదా? భూమి తిరుగకున్న ఎన్నియో సంవత్సరముల కొకదినమును రాత్రియు నేర్పడుచుండెడిది. మనుష్యుడు నిశ్చయముగ అన్యాయమును, పాపమును చేయువాడేని ఖురాను ద్వారా ఉపదేశము చేయుట వ్యర్థమే. ఏమనగా వారిస్వభావమే పాప మొనరించునదై యున్నప్పుడు వారిలో పుణ్యాత్మత ఎన్నటికి లేకుండును. కాని జగత్తున బుణ్యాత్ములు, పాపాత్ములు సర్వదా కనబడుచున్నారు. కాబట్టి ఇది ఈశ్వరకృత పుస్తక మందలి వాక్యము కానేరదు. (97)

98. నేను అతన్ని పూర్తిగా తయారుచేసి, అతనిలో నా ఆత్మను కొద్దిగా ఊదినప్పుడు, మీరంతా అతని ముందు సాష్టాంగపడాలి. అతడు ఇలా చెప్పాడు: "ప్రభూ నీవు నన్ను అపమార్గం పట్టించినట్లే ఇక నేను వారి కొరకు మనస్సును మోహింపజేసే విషయాలను భూమిలో

సృష్టించి వారందరినీ అపమార్గం పట్టిస్తాను, వారిలో నీవు ప్రత్యేకం చేసుకున్న నీ దాసులను తప్ప." - అల్ హిజ్ర్ సూరా :29,39

సమీక్ష:- ఖుదా తన ప్రాణమును ఆదామునందు నింపెనన్న అతడు కూడ ఖుదా అయ్యెను. ఖుదా కాకుండినచో (సిజ్దా) నమస్కారాది భక్తి సలుపుటకు గాను తనతో చేరియున్న వానినిగ నెందులకు జేసెను? సైతానును త్రోవ తప్పునట్లు చేయువాడు ఖుదాయే యయిన, అయనే సైతానును, పెద్దన్నయు, గురువు నేలగాడు? ఏలయన భ్రమింపజేయువానిని మీరు సైతానని అంగీకరించుచున్నచో ఖుదా సయితము సైతానును భ్రమింపజేసెనుగదా! తాను ముఖాముఖిగ నేను భ్రమింపజేయుదునని యన్నను పైవానిని దండించి చెరలో నెందుల కుంచలేదు? మరి చంపివేయలేదెందులకు? (98)

99. మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేసాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక చేసాము: "అల్లాహ్‌ని ఆరాధించండి. మిథ్యాదైవాల ఆరాధనకు దూరంగా ఉండండి." ఒక వస్తువును ఉనికి లోనికి తీసుకురావడానికి, దానిని 'అయిపో' అని ఆజ్ఞాపిస్తే చాలు, వెంటనే అది అయిపోతుంది. - అన్ నహ్లా సూరా :36,40

సమీక్ష :- అన్ని తెగలందు పైగంబరులను పంపినపుడు అందఱును పైగంబరుల అనుమతి ప్రకారముగనే ప్రవర్తించుచున్నారు. ఇంక వారు కాఫిరు లెట్లయిరి? మీ పైగంబరుకు తప్ప మిగిలిన పైగంబరులకు మాన్యత లేదా యేమి? అట్లయిన ఇది కేవలం పక్షపాతముతో కూడిన విషయమే. సరి! అన్ని దేశములందు పైగంబరుల పంపియున్నచో ఆర్యావర్తమం దెవరిని పంపెను? కాన నీమాట ఒప్పతగినది కాదు. ఖుదా కోరినప్పుడు 'పృథివీ! 'కమ్ము' అని అనునుగద!" సరి ఎన్నడును వినలేని ఆ జడము ఖుదా ఆజ్ఞ నెట్లు వినగలుగును? ఖుదా తప్ప మరొక వస్తువే లేనపుడు వినిన దెవరు? కలిగిన దేమిటి? ఇవన్నియు జ్ఞానశూన్యములగు వార్తలే. కాబట్టి ఇట్టి వార్తలను అవివేకులు మాత్రమే ఒప్పుకొనుచున్నారు. (99)

100. వారు దేవునికి కూతుళ్ళను కల్పిస్తారు. అల్లాహ్ పరిశుద్ధుడు. తమ కోసమేమో వారు స్వయంగా కోరుకున్నదా?

దేవుని తోడు, ప్రవక్తా! నీకు పూర్వం కూడా ఎన్నో జాతులవద్దకు మేము ప్రవక్తలను పంపి వున్నాము. - అన్ నహ్లా సూరా :57.

సమీక్ష:- అల్లా కుమార్తెలతో నేమి చేయును? ఒకానొక మనుష్యునకు కుమార్తెలు కావలసియుండును. కుమారులు నియమింపబడక కుమార్తెలే నియమింపబడుచున్నారా యేమి? దీనికి కారణమేమో చెప్పుడు! ఒట్టుపెట్టుకొనుట అసత్యవాదులపనియే కాని ఖుదాది కాదు. ప్రపంచమును తరుచుగా అబద్ధములాడు వాడే ఒట్టు పెట్టుకొనుచుండుట కనబడుచున్నది. సత్యవంతుడయినవాడెందుల కొట్టు పెట్టుకొనును. (100)

101. వారి హృదయాలకూ, వారి చెవులకూ, వారి కళ్ళకూ అల్లాహ్ ముద్రవేశాడు. ప్రతి ఒక్కనికీ తాను చేసిన దానికి ప్రతిఫలం పూర్తిగా ఇవ్వబడే రోజున, ఎవరికీ ఏ మాత్రమూ అన్యాయం జరగని రోజున (వారందరి విషయంలో తీర్పు జరుగుతుంది). ప్రతి మనిషి జాతకాన్ని మేము అతని మెడకే వ్రేలాడగట్టాము. ప్రళయంనాడు మేము ఒక పుస్తకాన్ని అతని కొరకు బయటికి తీస్తాము. అతడు దాన్ని ఒక తెరచిన గ్రంథం వంటిదని తెలుసుకుంటాడు. చూడు, నూహ్ తరువాత మా ఆజ్ఞ ప్రకారం నాశనమైన తరాలు ఎన్ని ఉన్నాయో. – బనీ ఇస్రాయీల్ సూరా : 13,17.

సమీక్ష:- ఖురానును, పైగంబరులను, ఖురానునందలి ఖుదానును, ఏడవ ఆకాశమును, నమాజుమున్నగువానిని ఒప్పుకొననివారే కాఫిరులు. వారికే నరకము కలదు అనుమాటలు కేవలము పక్షపాతముతో కూడినవే అన నొప్పును. ఏమనగా ఖురానును మాత్ర మొప్పుకొనువా రందఱును మంచివారు గాని, ఇతరముల నొప్పుకొను వారందఱును చెడ్డవారుగాని ఎన్నడేని కాగలరా? ఒక్కొక్కని మెడలో కర్మపత్రమును కట్టియుంచినా మనునదియు కడు పసితనపు మాటయే కద. మే మొకని మెడలో నయినను చూచుటలేదు. కర్మఫల మిచ్చుననుటయే దాని అభిప్రాయ మన్న మరి మనుష్యుల హృదయముల మీదను నేత్రాదుల మీదను ముద్రలు వేసినాడు, పాపములను క్షమించును, ననున వన్నియు వట్టిమాటలేనాయేమి? ప్రళయరాత్రినాడే ఖుదా ఆ పుస్తకమును తీయునేని ఇప్పుడా పుస్తకమెక్కడ నున్నది? ఒక సాహుకారివద్ద నుండు లెక్కల పుస్తకమువలె వ్రాయుచుండునా యేమి? పూర్వజన్మమే లేదేని జీవుల కర్మములు నుండుజాలవు గదా! మఱి కర్మరేఖ నెట్లు వ్రాయగలుగును. కర్మములు లేనిదే వ్రాసెనన్న వారిపై అన్యాయ మొనరించెననుట స్పష్టము. ఏలయన శుభాశుభకర్మములే లేకున్న వారికి సుఖదుఃఖముల నెట్లు కలుగజేసెను? ఖుదా ఇష్టమన్నచో అతడన్యాయమే చేసెను. శుభాశు భకర్మములు లేనిదే సుఖ దుఃఖములను ఫలము ఎక్కువతక్కువలుగ నిచ్చుట అన్యాయమే అనుబడును. ఇంక ఆ సమయము నందు (ఖుదా) దేవుడే పుస్తకమును జదువునా? లేక ఒక సిరస్తాదారుడను అధికారి వినిపించునా? మరి ఖుదా దీర్ఘకాలసంబంధముగల జీవులను అపరాధము లేనిదే చంపెనన్న అతడన్యాయకారియే అయ్యెను గద. అన్యాయకారి అయినవా డీశ్వరుడే కాజాలడు. (101)

102. (ఉదాహరణకు) సమూదుకు మేము ప్రత్యక్ష నిదర్శనంగా ఒక ఆడ ఒంటెను తెచ్చి ఇచ్చాము. నీవు ఎవరెవరిని నీ సందేశంతో భ్రష్టులుగా చెయ్యగలవో చెయ్యి. ఆ రోజును గురించి ఆలోచించండి. అప్పుడు మేము ప్రతి మానవవర్గాన్ని దాని నాయకునితోపాటు పిలుస్తాము. ఆ సమయంలో తన కుడిచేతికి కర్మపత్రం ఇవ్వబడిన వారు, తాము చేసిన పనులను చదువుకుంటారు. – బనీ ఇస్రాయీల్ సూరా : 59,64,71.

సమీక్ష:- ఖుదాను తెలియజేయు ఆశ్చర్యకరములగు ఎన్ని గురుతులుకలవో వానిలో ఒక ఆడులొట్టిపిట్టయు, ఖుదా ఉన్నాడనుటకు ప్రమాణముగనో లేక ఖుదాను గుర్తించుటకు సాధనముగనో ఉన్నది గదా! భ్రమింపజేయుమని ఖుదా ఆజ్ఞ నొసంగినచో, ఖుదాయే సైతానును ప్రేరేపించువాడును

సమస్తపాపముల నొనరింపజేయువాడునయ్యెను. ఇటువంటివానిని ఖుదాయనుటకేవల మవివేకమే. (కయామాత్) ప్రళయమునాడే న్యాయవిమర్శనము కొరకు పైగంబరులను, వారి ఉపదేశములను అంగీకరించువారలను పిలుచునన్న ప్రళయము కానంతవఱకు అందఱును నిర్బంధమను నిబ్బందిలో నుండవలసివచ్చును. న్యాయము చేయబడనంతవరకు నిర్బంధమున నుండుట ఎల్లరకు దుఃఖాదాయకమే అగును. కావున శ్రీఘ్రముగ న్యాయ మొనరించుటయే న్యాయాధీశున కుచితము. ఇది పోపాంబాయి న్యాయమయ్యెను. ఎట్లనగా ఒక న్యాయాధీశు డేబదేండ్లకాలము దొంగలును, సాహుకార్లును ప్రోగు కానంతవరకు ఎవరికిని శిక్షకాని, ప్రతిష్ఠకాని కలుగగూడదని ఉత్తరువు చేసినట్లే ఇదియునయ్యెను. గమనింపుడు! ఒక డేబది సంవత్సరముల వరకు నిర్బంధములో నుండెను. ఒకడు నేడే పట్టుబడెను. కాబట్టి న్యాయమన్న నిట్లు కాదు. వేదముననో, మనుస్మృతియందో చూడుడు! క్షణమాత్రమైన అట ఆలస్యము కాదు. తమతమ కర్మానుసారముగ జీవులు దండనమునో, ప్రతిష్ఠనో సదా పొందుచునే యుందురు. ఇక రెండవది పైగంబరులను సాక్షులవలె నుంచుటవలన ఈశ్వరుని సర్వజ్ఞత్వమునకును హాని కలుగుచున్నది. సరి! ఇటువంటి పుస్తకం ఈశ్వరకృతము కాగలదా? ఎన్నిటికిని గానేరదు. (102)

103. వారికై నిత్యహరితవనాలు ఉన్నాయి; వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి; అక్కడ వారు బంగారు కంకణాలను ధరిస్తారు; ఆకుపచ్చని సన్నని జలతారు పట్టువస్త్రాలను ధరిస్తారు; ఎత్తైన ఆసనాలపై దిండ్లకు అనుకొని ఆసీనులై ఉంటారు. అది ఎంత శ్రేష్ఠమైన ప్రతిఫలం!
– అల్ కహఫ్ సూరా : 31.

సమీక్ష:– ఆహా! ఖురానునందలి స్వర్గము నేమిచెప్పవలెను. అందు తోటలు, నగలు, వస్త్రములు, మెత్తలు, దూదిపరుపులు ఆనందించుటకు గలవుగా! ఒకానొక బుద్ధిమంతు డూహించునేని ఈ ముసల్మానుల స్వర్గమునందు అన్యాయముదప్ప ఇక్కడికంటె ఎక్కువ అక్కడ ఏమియు లేదనియే తేటపడును. ఏమియనగా అంతముగల కర్మములకు అనంత ఫలము లభించునని వ్రాయబడియున్నది. ఇదిగాక అక్కడ ప్రతినిత్యము తియ్యని పదార్థమే తిందురన్న గొలది దినములలోనే యది విషమువలె తోచును. ఇంక వారెల్లప్పుడు సుఖము ననుభవింతురేని ఆ సుఖమే వారికి దుఃఖరూపమగును. కావున మహాకల్పపర్యంతము ముక్తి సుఖము ననుభవించి పునర్జన్మ మెత్తుదురనుటయే సత్యమయిన సిద్ధాంతము. (103)

104. శిక్షకు గురి అయిన ఈ పట్టణాలు మీ ఎదుట ఉన్నాయి. వారు దుర్మార్గం చేయగా, మేము వారిని నాశనం చేశాము. వారిలోని ప్రతి ఒక్కరి వినాశానికి మేమే సమయం నిర్ణయం చేసి ఉంచాము.
– అల్ కహఫ్ సూరా: 59.

సమీక్ష:– ఏమి? జనులందరు పాపాత్ములుకాగలరా! తదుపరి ప్రతిజ్ఞ చేయుచున్నందున ఈశ్వరుడు సర్వశక్తి మంతుడును గాకపోయెను గద. ఏలయన వారి అన్యాయవర్తనమును చూచినపుడు ప్రతిజ్ఞ

చేసియుండెనేకాని తత్పూర్వము వీరన్యాయము చేయగలరని ఎఱుగకుండెనా! దీనివలన దయావిహీనుడు నయ్యెను గదా! (104)

105. ఇక ఆ బాలుని విషయం - అతని తల్లిదండ్రులు విశ్వాసులు. అతడు తన తలబిరుసుతనం వల్లా, తన అవిశ్వాసం వల్లా, వారిని వేధిస్తాడనే భయం మాకు కలిగింది. చివరకు అతను సూర్యుడు అస్తమించే హద్దుకు చేరినప్పుడు, నల్లని నీటిలో సూర్యుడు మునుగుతూ ఉండగా అతను చూశాడు. యాజూజ్, మాజూజ్‌లు ఆ భూభాగంలో కల్లోలాన్ని వ్యాపింపజేస్తున్నారు. - అల్ కహఫ్ సూరా: 80, 88, 94.

సమీక్ష:- సరి ! ఖుదాది తెలివిమాలినతన మని చెప్పవలయును. పిల్లల తల్లితండ్రులు తనమార్గము నుండి తొలగింపబడి తనకు ద్రోహము చేయువారు కాకుందురనియే గద అతని కీసందేహము కలిగినది. కావున నిది ఈశ్వర వాక్య మెన్నటికిని కానేరదు. ఇక సూర్యుడు రాత్రియం దొకచెలమలో మునిగి, తిరిగి ప్రాతఃకాలమున నుదయించునని భావించిన ఈ గ్రంథకర్త అజ్ఞానముతో గూడిన ఈవచనమును గూడ గమనింపుడు. సూర్యుడన బృథివికంటె జాలగొప్పవాడు. అత డొకనదిలోగాని చెలమలోగాని, సముద్రములోగాని ఎట్లు మునుగగలుగును? ఈ ఖురానును రచించినవాడు భూగోళఖగోళ విద్యల నెఱుగకుండె ననియే దీనివలన విదితమయ్యెను. ఎఱిగియేయున్న ఇట్టి విద్యావిరుద్ధమైన మాట నెందులకు వ్రాసియుండును? ఇక ఆ పుస్తకముపై విశ్వాసముగల వారియందును విద్యలేదు. విద్యయే యున్న ఇట్టి పనికిమాలిన పలుకులతో కూడియున్న పుస్తకమును ఎందుల కొప్పుకొని ఉంటారు? ఇదిగాక ఖుదా ఆ న్యాయాన్ని చూడండి! తానే పృథివిని సృజించువాడు రాజు న్యాయాధీశుడుగా నుండి మరి తానే ఆ జూజు మా జూజులను ప్రపంచమున కలహము లాడనిచ్చుచున్నాడు. ఇది ఈశ్వరత్వమునకు కడు విరుద్ధము. కావున ఈ పుస్తకము నడవిమనుష్యులు నమ్ముదురే కాని విద్వాంసు లెంతమాత్ర మంగీకరింపరు. (105)

106. ప్రవక్తా! ఈ గ్రంథంలో, మర్యమ్ తన వారినుండి వేరైపోయి, తూర్పుదిక్కున ఏకాంతంగా కూర్చుంది, వారికి చాటుగా తెర కట్టుకుని ఉండిపోయినప్పటికీ వృత్తాంతాన్ని ప్రస్తావించు. ఈ స్థితిలో మేము ఆమె వద్దకు మా 'ఆత్మ'ను (అంటే దూతను) పంపాము. అప్పుడు అతను ఆమె ముందు పరిపూర్ణమైన మానవాకారంలో ప్రత్యక్షమయ్యాడు. వెంటనే మర్యమ్ ఇలా పలికింది, "నీవు దైవభీతి గల మనిషివే అయితే, నేను నీ బారినుండి రక్షించవలసినదిగా దయామయుడైన దేవుని శరణుకోరుకుంటున్నాను." అతను "నేను నీ ప్రభువు దూతను మాత్రమే. నీకు ఒక పరిశుద్ధ పుత్రుణ్ణి ఇచ్చేందుకు పంపబడ్డాను" అని చెప్పాడు. మర్యమ్ "నాకు పుత్రుడు ఎలా పుడతాడు, నన్ను పురుషుడు ఎవడూ తాకనైనా తాకలేదు, నేను చెడునడత గల దానినీ కాను" అని అన్నది. మర్యమ్ ఆ మగశిశువును గర్భంలో దాల్చింది. గర్భవతి అయిన ఆమె ఒక దూర ప్రదేశానికి వెళ్ళిపోయింది. తరువాత ప్రసవవేదన పడుతూ ఆమె ఒక కర్జూరపు చెట్టు క్రిందకు చేరింది. - మర్యమ్ సూరా: 16-20; 22.

సమీక్ష:- ఫరిశ్తాలందఱును దేవుని జీవములైన, అవి యా (ఖుదా) దేవుని కంటె వేరైనవి కాజాలవనియేకద బుద్ధిమంతులిట విచారింపవలసియున్నది. (రెండవది) 'మరియమ'అను కన్యకకు కొడుకు కలుగుటయు దౌర్జన్యమే. ఏమియనగా ఆమె ఒకనితో సంభోగము చేయగోరకుండెను. కాని ఖుదా ఆజ్ఞబడసి ఆఫరిస్తా ఆమెకు గర్భము కలుగజేసెను. ఇది అన్యాయమే అనుట స్పష్టము. ఇంక నిట అసభ్యతతో గూడిన అనేక వార్తలును వ్రాయబడియున్నవి. వాని నిట వ్రాయుట ఉచితము కాదు. (106)

107. అయితే ఎవడు పశ్చాత్తాపపడతాడో మరియు విశ్వసించి మంచిపనులు చేస్తాడో, ఆ తరువాత సక్రమంగా నడుచుకుంటాడో, అతనిని నేను అమితంగా మన్నిస్తాను.

– తాహా సూరా: 82.

సమీక్ష:- పశ్చాత్తాపపడుటవలన పాపాలు క్షమింపబడునని ఖురాను నందుగల ఈవార్త అందఱను పాపాత్ములను చేయునదే అనవచ్చును. ఏలయనగా దీనివలననే పాపాత్ములకు పాపమొనరించుటకు సాహసమధికముగ ఉప్పొంగుచున్నది. ఇందువలన ఈ గ్రంథము, గ్రంథకర్తయు పాపకారులకు పాపమొనర్చుట కధికసాహసమును గలుగజేయును. కావున ఈ పుస్తకం ఈశ్వరకృతం కానేరదు. ఇందు చెప్పబడినవా డీశ్వరుడును కాజాలడు. (107)

108. మేము భూమిపై పర్వతాలను పటిష్ఠంగా నిలబెట్టాము, అది వాటితో దొర్లిపోకుండా ఉండాలని. – అల్ అంబియా సూరా: 31.

సమీక్ష:- ఖురాన్ కర్త భూమి తిరుగుచున్నది మొదలగు విషయముల నెఱిగియున్న పర్వతములు నిలుపుటవలన భూమి కదలకుండునని ఎప్పుడును వ్రాయకుండెడివాడు. పర్వతముల నుంచకున్న భూమి కదలకుండునని ఎప్పుడును వ్రాయకుండెడివాడు. పర్వతముల నుంచకున్న భూమి కదలగలదని అతనికి శంక గలిగినది. మరియు అట్లుంచియున్నను భూకంపము కలుగునపుడెల్ల నీ భూమి ఎందులకు కదలుచున్నది? (108)

109. మరియు తన శీలాన్ని కాపాడుకున్న ఆ మహిళను కూడ (అనుగ్రహించాము) మేము ఆమెలో మా ఆత్మ నుండి ఊదాము. –అల్ అంబియా సూరా: 91.

సమీక్ష:- ఇట్టి అశ్లీల వాక్యాలు ఖుదా అనుటెట్లు? ఇవి సభ్యపురుషులవిగూడ కానేరవు. మానవులే ఇటువంటి మాటలను వ్రాయుట అనుచితమని తలచునపు డవి ఈశ్వరునకెట్లు మంచివగును? ఖురానిట్టి వార్తలతో కూడియున్నందుకే దూషితమగుచున్నది. వేదములవంటి మంచిమాటలతో కూడి యున్ననిది మిగుల ప్రశంసనీయమై యుండెడిది. (109)

110. ప్రతి విషయమూ అల్లాహ్ దృష్టిలో ఉన్నది. ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్న సమస్తమూ, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, పర్వతాలు, వృక్షాలు, జంతువులు, చాలమంది మానవులు, శిక్షకు అర్హులైన చాలమంది ప్రజలు అల్లాహ్ ముందు వినమ్రులై ఉండటాన్ని

నీవు చూడటం లేదా? అక్కడ వారు స్వర్ణ కంకణాలతో, ముత్యాలతో అలంకరించబడతారు. వారు పట్టువస్త్రాలు ధరిస్తారు. ప్రదక్షిణం చేసేవారి కొరకూ, ఖియామ్, రుకూ, సజ్దాలు చేసే వారి కొరకూ నా గృహాన్ని పరిశుద్ధంగా ఉంచు. తరువాత వారు తమ మాలిన్యాన్ని దూరం చేసుకోవాలి, తమ మొక్కుబడులను చెల్లించుకోవాలి మరియు ఆ ప్రాచీనగృహానికి ప్రదక్షిణం చెయ్యాలి. ఆయన పేరును స్మరించడానికి. - అల్ హజ్ సూరా: 18,23,26,29,34.

సమీక్ష:- ఔరా ! జడపదార్థములన్న అవి పరమేశ్వరు నెఱుగజాలవు కద! మరి అతని భక్తినెట్లు ఒకానొక భ్రాంతి జెందిన సలుపగలుగును? కావున ఈ పుస్తక మీశ్వరకృత మెన్నటికిని కానేరదు. కాని ఒకానొక భ్రాంతి జెందిన వాడు వ్రాసియున్నాడని మాత్రం గోచరమగుచున్నది. భళిరే ! కడుమంచి స్వర్గము! బంగారుతోను ముత్యములతోను చేయబడిన నలుగును పట్టు దుస్తులను ధరించుటకు అట జిక్కునుగా ! వీరి స్వర్గమన్న నిచ్చటి రాజగృహములకంటె మంచిది కాదని తేటపడుచున్నది. అది పరమేశ్వరుని గృహమన్నప్పుడతడందు నివసించుచు నుండవచ్చును. అటులేని విగ్రహారాధన మేకాదయ్యెను? మఱి యితర విగ్రహారాధనజేయువారల నేల ఖండించుచున్నారు? ఖుదా కానుకలు పుచ్చుకొనుచు తనయింటి ప్రదక్షిణము చేయునాజ్ఞ ఒసంగుచు అట్లే పశువుల జంపించి తినిపించుచు నున్నాడేని ఈ ఖుదా దేవాలయములలోని దుర్గాభైరవులను పోలిన వాడే యయ్యెను. ఇక ఇతడే గొప్ప విగ్రహారాధనను చేయించువాడునయ్యెను. విగ్రహములన్నిటికంటె మసీదు గొప్ప విగ్రహముగా నున్నది. కాన ఖుదాయు ముసల్మానులును గొప్ప విగ్రహారాధకులుగాను, పౌరాణికులును, జైనులును చిన్న విగ్రహారాధకులుగాను నున్నారు. (110)

111. మళ్ళీ ప్రళయంనాడు నిస్సందేహంగా లేపబడతారు. - అల్ మూ'మినూన్ సూరా : 16.

సమీక్ష:- ఏమి? (కయామత్) ప్రళయము కాబోవునంతవరకు పీనుగులు సమాధులలోనే పడియుండునా? లేక ఏదో ఒక స్థానమందా? వానిలోనే పడియుండునన్న మురిగి దుర్గంధంతో కూడిన ఆశరీరములందుండగల పుణ్యాత్ములుకూడ దుఃఖమే అనుభవింతురు. ఇది న్యాయం కాదు, అన్యాయమే. ఇక దుర్గంధమధికమై రోగములు నుత్పన్నము లగుటవలన ఖుదాయు ముసల్మానులును పాపభాగులే అగుదురు.(111)

112. వారి నోళ్ళూ, వారి కాళ్ళూ, చేతులూ వారి చేష్టలను గురించి స్వయంగా సాక్ష్యం పలికే రోజును వారు మరచిపోకూడదు. అల్లాహ్ ఆకాశములకూ, భూమికీ వెలుగు. (సృష్టిలో) అయన వెలుగు ఉపమానం ఇలా ఉంది: ఒక గూటిలో దీపం ఉన్నది, ఆ దీపం ఒగ గాజు చిమ్నీలో ఉన్నది, ఆ గాజు కుప్పె ఆణిముత్యం మాదిరిగా మెరిసే నక్షత్రంలా ఉన్నది. ఆ దీపం శుభవంతమైన ఒక జైతూన్ వృక్షపు నూనెతో ప్రకాశింపజేయబడుతోంది. ఆ వృక్షం తూర్పుకూ చెందదు, పడమరకూ చెందదు; దాని నూనె నిప్పు తగలక పోయినా దానంతట అదే మండుతుంది. (ఈ విధంగా) వెలుగుపై

వెలుగు (ద్విగుణీకృతమయ్యే కారణాలన్నీ ఏకమయ్యాయి) అల్లాహ్ తన వెలుగు వైపునకు తనకు ఇష్టమైనవారికి మార్గం చూపుతాడు. - అన్ నూర్ సూరా : 24,35.

సమీక్ష:- కాళ్ళు, చేతులు మున్నగునవి జడములగుటవలన నవి సాక్ష్యమెన్నటికిని పలుకలేవు. ఇక నీ మాట సృష్టిక్రమమునకును విరుద్ధమై ఉన్నందున మిథ్యయే అననొప్పును. దృష్టాంతమిచ్చియున్నట్లు ఖుదా అగ్నియా? విద్యుత్తా? ఇట్టి దృష్టాంత మీశ్వరునియందు ఘటిల్లనేరదు. కాని సాకార పదార్థమందు ఘటిల్లగలదు. (112)

113. అల్లాహ్ ప్రతి ప్రాణిని ఒక విధమైన నీటితో సృష్టించాడు. ఒకటి పొట్టపై నడుస్తోంది. అల్లాహ్‌కూ, ప్రవక్తకూ, విధేయత చూపేవారు. ఇలా బోధించు, "అల్లాహ్‌కు విధేయులు కండి, దైవప్రవక్త ఆదేశాలను పాటించండి. దైవ ప్రవక్తకు విధేయులుగా ఉండండి.
- అన్ నూర్ సూరా : 45,52,54.57.

సమీక్ష:- పశువుల శరీరములం దన్నితత్త్వములు గోచరమగుచుండగా కేవలం జలముతో సృజించెననునదెట్టి తత్త్వ విచారమో గదా! ఇది కేవల మవిద్యతో కూడిన ప్రసంగమే. అల్లాతో సమానముగ పైగంబరు నాజ్ఞను పాలింపవలసినపుడు అతడు ఖుదాకు భాగస్థుడయ్యెనా? లేదా? అటులేని ఖురాను నందు (ఖుదాలాషరీక్) అద్వితీయుడని యేల వ్రాయబడెను? మీరు అట్లెందులకనుచున్నారు. (113)

114. ఆకాశాన్ని చీలుస్తూ ఒక మేఘం ఆ రోజున ప్రత్యక్షమవుతుంది. దైవదూతలు వరుసలు వరుసలుగా దింపబడతారు. ఆ రోజున నిజమైన రాజ్యాధికారం కేవలం కరుణామయుని చేతులలో ఉంటుంది. అది అవిశ్వాసులకు ఎంతో కఠినమైన రోజు. వారితో మహత్తరమైన పోరాటం జరుపు. అటువంటి వాడి చెడులను అల్లాహ్ శుభాలుగా మారుస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను. పశ్చాత్తాపపడి సద్వర్తనాన్ని అవలంబించే వ్యక్తి అల్లాహ్ వైపునకు మరలి వస్తాడు. - అల్ ఫుర్ఖాన్ సూరా : 25,52,70,71.

సమీక్ష:- ఆకాశము మేఘములతో కూడ బ్రద్దలయిపోవు ననుమాట ఎన్నటికీ నిజము కాజాలదు. ఆకాశము ఘనపదార్థమై యున్ననది బ్రద్దలగును. ఈ ముసల్మానుల ఖురాను, శాంతిభంగముచేసి యుద్ధాది కలహములు కలిగించునదై యున్నది. కావున ధర్మాత్ములైన విద్వాంసులు దీనినెంతమాత్ర మంగీకరింపరు. సరి! పాపణ్యములు మార్చబడుననుటయు ఒక మంచిన్యాయమేనా? ఆ పాపపుణ్యములనునవి నువ్వులు మినుములవలె నొకటి కొకటి మార్చ వీలగునాయేమి? పశ్చాత్తాపమువలన పాపవిమోచనమై ఈశ్వరుడు లభించునన్న పాపమొనరించుట కెవడును వెఱవకుండును. కావున నీ మాటలన్నియు విద్యావిరుద్ధములే అనుట స్పష్టము.(114)

115. "రాత్రికి రాత్రే నా దాసులను తీసుకుని వెళ్ళిపో. మిమ్మల్ని తప్పక వెంటాడటం జరుగుతుంది" అని మేము మూసాకు వహీ పంపాము. తరువాత ఫిరౌన్ (సైన్యాన్ని

సమాయత్తపరిచే నిమిత్తం) పట్టణాలలోకి వార్తాహరులను పంపాము. ఆయన నన్ను సృష్టించాడు. తరువాత ఆయనే నాకు మార్గం చూపుతున్నాడు. ఆయనే నాకు తినిపిస్తాడు, త్రాగిస్తాడు. తీర్పుదినం నాడు నా పాపాలను క్షమిస్తాడని నేను ఆయన మీద ఆశలు పెట్టుకున్నాను. - అష్ షుఅరా సూరా: 52, 53, 78, 79, 82.

సమీక్ష:- ఖుదా మూసాపరముగ వహీ (పుస్తకము) పంపినపుడు మరల దావూదు పరముగను, ఏసుపరముగను, మహమ్మదుసాహెబు పరముగను, పుస్తకముల నెందుకంపెను? ఈశ్వర వాక్యము సర్వదా ఒకే రీతిగను, మఱుపుచెందనిదిగ నుండును. దానికి పిమ్మట ఖురాను వరకు పుస్తకముల పంపుటవలన మొదటి పుస్తకముల పూర్ణములనియు, మరపుతో కూడిన వనియు నమ్మబడును. ఈ మూడు పుస్తకములును సత్యములేని ఖురాననునది మిథ్యయగును. ఇట్లే నాలుగును నొకదానికొకటి విరుద్ధములై యున్నందున సర్వదా సత్యమైనవి కాజాలవు. ఖుదా (రూహులును) జీవములను సృజించెనన్న నవి చావనే చచ్చును. అట్లయిన వానికొకప్పు డభావము కలుగకపోదుగదా! పరమేశ్వరుడే మనుష్యాది ప్రాణులకు తినిపించుచు త్రాగించుచునున్న ఎవరికిని రోగము సంభవింపగూడదు. అట్లే అత దందఱకు సమానముగ భోజన మొసంగవలయును. రాజునకును, దరిద్రునకును శ్రేష్ఠనికృష్ట భోజనము లభింపకూడదు. పరమేశ్వరుడే తినుపించువాడును, త్రాగించువాడును, పథ్యము చేయించువాడు నయియున్న, రోగములే సంభవింపకుండెడివి. కాని ముసల్మానాదులకు కూడ రోగములు సంభవించుచునే యున్నవి. ఖుదాయే రోగముల మాన్పి శమనము కలుగజేయువాడయిన, ముసల్మానుల శరీరములందు రోగములే యుండదగవు. రోగములుండు నేని ఈ ఖుదా పూర్ణవైద్యుడు కాడు. పూర్ణ వైద్యుడేయైన ముసల్మానుల శరీరములందు రోగము లెందుకున్నవి? అతడే పుట్టించుచు గిట్టించుచునున్న ఆ ఖుదాకే పాపపుణ్యము లంటవచ్చును. జన్మజన్మాంతరముల కర్మానుసారముగ వ్యవస్థ చేయుచున్నాడేని అతని అపరాధమేమియు లేదు. ఖుదా పాపముల క్షమించువాడును, మహాప్రళయరాత్రిని న్యాయము చేయువాడును అయియున్న అతడు పాపముల పెంచువాడును పాపములతో గూడినవాడును నగును. క్షమింపడన్న ఈ ఖురానులో వ్రాయబడిన మాట మిథ్య అనకతప్పదు. (115)

116. నీవు మా వంటి ఒక మానవుడు తప్ప మరేమీ కావు. నీకు సత్యవంతుడవే అయితే, ఏదైనా సూచనను తీసుకురా" సాలిహ్ ఇలా అన్నాడు, "ఇదిగో ఈ ఒంటెను చూడండి. ఒక రోజు అది నీళ్ళు త్రాగుతుంది. - అష్ షుఅరా సూరా : 154,155.

సమీక్ష:- మేలు! రాతిలోనుండి యాడులొట్టిపిట్ట వెళ్ళెనను మాట ఎవడయిన నమ్మగలడా? ఈమాట నంగీకరించినవా రడవి మనుష్యులై యుండవచ్చును ఆడులొట్టిపిట్టను నిదర్శనముగా చూపుట పామరత్వమే. కావున ఇది ఈశ్వరకృతము కాదు. ఈ పుస్తక మీశ్వరకృతమై ఉన్న ఇట్టి వ్యర్థమైన విషయము లిందుండుకుండెడివి. (116)

117. మూసా! ఇదిగో, నేను, అల్లాహ్‌ను, సర్వశక్తిమంతుడను, వివేకవంతుడను. ఏదీ, నీవు కొంచెం నీ చేతికర్రను విసరివెయ్యి." ఆ చేతికర్ర పాము మాదిరిగా కదలాడుతూ ఉండటం చూడగానే, మూసా వెన్ను చూపి పారిపోయాడు. వెనుకకు తిరిగి అయినా చూడలేదు. "మూసా! భయపడకు. నా సన్నిధిలో ప్రవక్తలు భయపడరు. అల్లాహ్; ఆయన తప్ప ఆరాధనకు అర్హుడైనవాడు ఎవ్వడూ లేడు. ఆయన మహోన్నతమైన అధికార పీఠానికి ప్రభువు. "నాకు వ్యతిరేకంగా తిరుగుబాటు వైఖరిని అవలంబించకు. ముస్లిమ్ అయి నా వద్దకు వచ్చెయ్యి." – అన్ నమ్ల్ సూరా: 9,10,26,31.

సమీక్ష:– ఇంకను జూడుడు ! అల్లా తననోటితో దానే గొప్పయని చెప్పుకొనుచున్నాడు. తన నోటితో తన ప్రశంస చేసికొనుట శ్రేష్ఠపురుషుల పనియైనను కానపుడు ఖుదా దెట్లు కాగలడు? అందులకేగద ఇంద్రజాలపు తంత్రాలను చూపించి అడవిమనుష్యులను వశపఱచుకొని తానరణ్యమున ఖుదాయయి నిలిచినది. ఇటువంటి మాట ఈశ్వరకృతపుస్తకమం దెన్నడు ఉండజాలదు. గొప్ప (అర్ష) ఏడవ ఆకాశమున కధిపతియై ఉన్నవా దేకదేశీయుడగుటజేసి ఈశ్వరుడే కానేరడు. హఠమొనరించుట మంచిది కాదేని ఖుదాయు, మహమ్మదుసాహెబును తమ స్తుతులచే ఆ పుస్తకము నెందులకు నింపిరి? మహమ్మదుసాహెబు అనేకులను చంపెనుగదా! అది హఠమయ్యెనా కాదా? ఈ ఖురాను పునరుక్తులతోను పూర్వాపరవిరుద్ధ విషయములతోను నిండియున్నది. (117)

118. ఈ రోజున నీవు పర్వతాలను చూచి అవి బాగా స్థిరంగా ఉన్నాయని అనుకుంటున్నావు. కాని అప్పుడు మేఘాల మాదిరిగా అవి ఎగురుతూ ఉంటాయి. ఇది అల్లాహ్ శక్తి సామర్థ్యాల మహిమ. ఆయన ప్రతివస్తువునూ వివేకంతో తీర్చిదిద్దాడు. – అన్ నమ్ల్ సూరా: 88.

సమీక్ష:– పర్వతములు మేఘములవలె చలించుననుట ఖురాను వ్రాసిన వారి దేశమున కానవచ్చునేమో కాని అన్యత్ర కాదు. ఇక ఖుదా ఎఱుగు వాడనుట ద్రోహియైన సైతానును బట్టి దండింపకపోవుట వలన విదితమే కద. అతడింతవఱ కొక ద్రోహినైనను బట్టి దండింపలేకపోయెను గదా! ఇంతకు మించిన ప్రమాదము మరేమి ఉండగలదు? (118)

119. మూసా అతనిని ఒక గుద్దుతో కడతేర్చాడు. (ఇది జరుగగానే) మూసా, "ఇది సైతాను నిర్వాకం. అతడు ప్రబల శత్రువు, స్పష్టంగా దారితప్పించేవాడు" అని అన్నాడు. తరువాత అతను ఇలా అన్నాడు, "నా ప్రభూ! నేను నా ఆత్మకు అన్యాయం చేశాను, నన్ను క్షమించు" అప్పుడు అల్లాహ్ అతనిని క్షమించాడు. ఆయన క్షమించేవాడు. నీ ప్రభువు తాను కోరిన దానిని సృష్టిస్తాడు. (స్వయంగా ఆయనే తన పని కోసం తాను కోరిన వారిని ఎన్నుకుంటాడు) – అల్ ఖసస్ సూరా: 15,16,68.

సమీక్ష:– మునసల్మానులయు, క్రైస్తవులయు, పైగంబరులయు, ఖుదా యొక్కయు దయను జూడుడు! పైగంబరగు మూసా మనుష్యుని చంపగా ఖుదా క్షమించెను! వీరిరువురును అన్యాయకారులై నిలిచిరా లేదా? తన ఇష్టము వలననే కోరుచున్నట్లు పుట్టించుచున్నాడా? ఆయన తన ఇష్టము

వలననే ఒకని రాజుగను, మఱొకని దరిద్రుడుగను, ఒకనిని విద్వాంసుడుగను, మరొకని మూర్ఖుడుగను జేసియున్నాడాయేమి? అటులేని యీ ఖురాను సత్యము కాదు. ఇక అన్యాయకారి అయినందున అతడు ఖుదాయే కాజాలడు. (119)

120. తన తల్లిదండ్రుల పట్ల సద్భావంతో మెలగుమని మేము మానవునికి ఉపదేశించాము. కాని ఒకవేళ వారు నా భాగస్వామిగా నీవు ఎరుగని వానిని (అరాధ్యుణ్ణి) నాకు భాగస్వామిగా చేయమని నిన్ను బలవంతపెడితే, అప్పుడు వారి యెడల విధేయత చూపకు. మేము నూహ్‌ను అతని జాతి వైపునకు పంపాము. అతను వారి మధ్య యాభై తక్కువ వేయి సంవత్సరాల వరకు ఉన్నాడు. – అల్ అన్ కబూత్ సూరా: 8,14.

సమీక్ష:– తల్లిదండ్రుల సేవచేయుట మంచిదే. ఖుదాతో చేర్చుకొను మన్నప్పుడు వారి ఆ మాట వినకపోవటయు మంచిదే. కాని తల్లిదండ్రులు మిథ్యా భాషణాదులు చేయుట కాజ్ఞాపించిన అంగీకరింపవలయునా యేమి? కాన నీ మాట సగము మంచిదిగను, సగము చెడ్డదిగనున్నది. ఇక నూహు మొదలగు పైగంబరులనే ఖుదా ప్రపంచములోనికి పంపుచున్న అన్యజీవముల నెవడుపంపుచున్నాడు? అందర నతడే పంపుచున్నాడేని యందఱును పైగంబరు లెందులకు గారు? మొదట మనుష్యులకు వేయిసంవత్సరముల ఆయువుండిన ఇప్పుడెందుకు లేదు? కావున ఈ మాట నిజము కాదు. (120)

121. అల్లాహ్‌యే సృష్టిని ప్రారంభిస్తాడు, ఆయనే దానిని తిరిగి సృష్టిస్తాడు, తరువాత ఆయన వైపునకే మీరు మరలింపబడతారు. ఆ గడియ నెలకొన్ననాడు, అపరాధులు దిగ్భ్రమకు లోనవుతారు. విశ్వసించి మంచి పనులు చేసినవారు ఒక ఉద్యానవనంలో సుఖంగా సంతోషంగా ఉంచబడతారు. మేము గాలిని పంపితే, దాని ప్రభావం వల్ల వారు తమ పంటలు పసుపుపచ్చగా మారటాన్ని చూస్తారు. ఈ విధంగా అల్లాహ్ జ్ఞానహీనుల హృదయాలకు ముద్రవేస్తాడు. – అర్ రూమ్ సూరా : 11,12,15,51,59.

సమీక్ష:– అల్లా రెండు పర్యాయములే ఉత్పన్నము చేయువాడై మూడవ పర్యాయము చేయడేని ఉత్పన్నము చేసిన పిమ్మట అప్రయోజకుడయి కూర్చుండవలసి వచ్చును. ఒక పర్యాయముగాని, రెండు పర్యాయములుగాని ఉత్పన్నము చేసిన పిమ్మట నతని సామర్థ్యము ప్రయోజనము లేనిది వ్యర్థమైనది యయిపోవును. న్యాయమొనరించు దినమున పాపాత్ములు నిరాశులయి యున్న నుండవచ్చు. కాని ముసల్మానులు తప్ప తక్కినవారందఱును పాపాత్ములుగా నెన్నబడి నిరాశులై యుందురని మాత్రము దీనిభావము కాదుగదా? ఏమనగా నీ ఖురానునందు పలుచోట్ల వ్రాయబడినట్లు పాపాత్ములన్న నితరులనియే అభిప్రాయము. తోటలో నుంచబడుట శృంగారింపబడుట మాత్రమే ముసల్మానుల స్వర్గమయిన నదీ ఈ ప్రపంచము వంటిదే యయ్యెను. అచ్చట తోటకాపులును, కంసాలులు నుండవచ్చును. లేదా ఖుదాయే తోటకావు, కంసాలి మున్నగువారి పనులు చేయుచుండవచ్చును. ఇక నొకని కాభూషణములు తక్కువగ నున్న నట దొంగతనము కూడ

జరుగుచుండవచ్చును. స్వర్గమున దొంగిలించువారలను నరకమునందు కూడ వేయుచుండవచ్చును. అట్లయిన సదా స్వర్గమున నుందురను మాట మిథ్యయగును. కృషికుల పొలము మీద కూడ ఖుదా దృష్టి కలదు గద. ఆ విద్య పొలముజేసెడి అనుభవమును బట్టియే కలుగును. ఇక ఖుదా తన విద్యచే నన్ని సంగతుల నెఱుంగుచున్నాడని అంగీకరించినను ఇట్లు భయము చూపుట మాత్రము తన అయథిమానమును ప్రసిద్ధపఱచుటకే అనవచ్చును. మరి అల్లా జీవుల హృదయములపై ముద్రలువేసి పాపము చేయించినప్పుడా పాపము నతడే పొందవలెను. జీవులు పొంద రాదు. జయాపజయములు సేనాధీశునకు కలుగునట్టులీ పాపము లన్నియు ఖుదాకే తగులును. (121)

122. ఇవి వివేచనగల గ్రంథంలోని వాక్యాలు. ఆయన, ఆకాశాలను నీవు చూడగలిగే స్తంభాలు లేకుండానే సృష్టించాడు, ఆయన భూమిలో పర్వతాలను అమర్చాడు, మీతో పాటు దొర్లిపోకుండా ఉండేటందుకు. అల్లాహ్ రాత్రిని పగలులోకీ, పగలును రాత్రిలోకీ చొప్పించటాన్ని నీవు చూడటం లేదా? అల్లాహ్ తన అనుగ్రహంతో నావను సముద్రంలో పయనింపజేయటాన్ని నీవు గమనించడంలేదా నీకు తన సూచనలు కొన్నింటిని చూపాలని?

– లుఖ్మాన్ సూరా: 2,10,29,31.

సమీక్ష:– చాలా బాగున్నది! సర్వథా జ్ఞానవిరుద్ధాలగు ఆకాశాదుల పుట్టించి ఉన్నాడనుటయు, వానిని స్తంభములచే నిలువబెట్టి నాడనుటయు, భూమి కదలకుండునటుల పర్వతముల నేర్పచి యుంచినాడ నుటయు బహుచమత్కారములు గలవాని పుస్తకమందలి మాటలే! కొంచెము చదివినవాడయిన నిట్టి వ్రాత నెన్నడు వ్రాయడు, నమ్మడు. ఇంకను చమత్కారము చూడుడు. దినమున్నప్పుడు రాత్రి లేదు. రాత్రి ఉన్నప్పుడు దినము లేదు. కాని యిట ఒకదాని యందొక దానిని ప్రవేశింపజేయుచున్నాడని వ్రాయబడి ఉన్నది. ఇది గొప్ప పామరుల మాటయే కావున ఈ ఖురాను జ్ఞానపుస్తకము కానేరదు. ఇది జ్ఞాన విరుద్ధమైన మాట కాదా? ఓడలు మనుష్యులనుండియు క్రియాకౌశలాదులవలన నడచుచున్నవా? లేక ఖుదా శక్తివలననా? ఇనుముతోగాని రాతితోగాని ఓడల జేసి సముద్రమున నడిపించితిమేని ఖుదా నిదర్శనము మునిగిపోవునా లేదా? కాన ఈ పుస్తక మొకవిద్వాంసునిచేగాని ఈశ్వరునిచేగాని రచియింపబడినది కాజాలదు. (122)

123. ఆయన ఆకాశం నుండి భూమి వరకు గల ప్రపంచ వ్యవహారాలను నిర్వహిస్తున్నాడు. ఆ నిర్వాహణా నివేదిక ఒక రోజున పైకి ఆయన సమ్ముఖానికి చేరుతుంది. ఆ రోజు పరిమాణం మీ అంచనా ప్రకారం వేయి సంవత్సరాలు. గోప్యంగాను, బహిరంగం గాను ఉన్న ప్రతిదానిని ఎరిగినవాడూ, శక్తిమంతుడూ, కరుణామయుడూ ఆయనే. ఆ తరువాత అతనిని నఖశిఖ పర్యంతం తీర్చిదిద్దాడు. అతనిలోనికి తన ఆత్మను ఊదాడు. మీపై నియమింపబడిన మృత్యుదూత మిమ్మల్ని పూర్తిగా కైవసం చేసుకుంటాడు. మేము కోరితే, మొదట్లోనే ప్రతి ఆత్మకూ దాని యొక్క మార్గదర్శకత్వాన్ని ఇచ్చి ఉండేవారము. కాని నేను జిన్నాతులు, మానవులు అందరినీ కలిపి నరకాన్ని నింపుతాను అని నేను చెప్పిన మాట నెరవేరింది.

– అస్ సజ్‌దహ్ సూరా: 5,6,9,11,13.

సమీక్ష:- ముసల్మానుల ఖుదా మనుష్యునివలె ఏకదేశీయుడని స్పష్టముగ తెలియుచున్నది. వ్యాపకుడయిన నొకస్థానమున నుండి ఏర్పాట్లు చేయుటయు ఎక్కుట దిగుటయు లేకుండెడిది. ఖుదా పరిశ్తాను పంపుచున్నాడన్నను తాను ఏకదేశీయుడే అయ్యెను. తానాకసముపై ప్రతీక్షించుచు గూర్చుండి ఫరిశ్తాలను పరుగెత్తించుచున్నాడు. ఫరిశ్తాలు లంచము దీసికొని ఒకవ్యవహారము చెడగొట్టినను లేదా ఒకపీనుగును విడిచిపెట్టి పోయినను ఖుదాకేమి తెలియగలదు? సర్వజ్ఞుడు సర్వవ్యాపకుడు నగునతనికే తెలియగలదు. అతడట్టి లేడుగదా? అటులయియున్న ఫరిశ్తాలను పంపవలసిన అనేకవిధములు ననేకుల పరీక్షింపవలసిన పనియే లేకుండెడిది. ఇక పోవుటకు ఒకవేయి సంవత్సరాలు పట్టుటయు వచ్చుటకు పోవుటకు నేర్పాట్లు చేయుటవలన అతడు సర్వశక్తిమంతుడును కాడు. ప్రాణముల గొనిపోవువాడు ఫరిశ్తాయన్న ఆఫరిశ్తాను చంపువాడెవడు? అతడు నిత్యుడన్న నమరుడయి ఖుదాతో సమానుడయ్యెను. ఒక ఫరిశ్తా ఒకేసమయమందు నరకమును నింపుటకు జీవులకు శిక్ష ఒసంగజాలడు. పాపములులేక వారిని తనయిష్టము వచ్చినట్లు నరకమున పడద్రోసి వారిని దుఃఖపెట్టుచు సంతోషించుచున్నచో ఆ ఖుదా పాపకారియు, అన్యాయకారియు, దయాహీనుడు నగును. ఏ పుస్తకమున నిట్టిమాటలు కలవో అది యొక విద్వాంసునిచేగాని, ఈశ్వరునిచేగాని రచింపబడినది కాదు. అట్లే దయాన్యాయములు లేనివా డీశ్వరుడెన్నడును గాజాలడు. (123)

124. ఓ ప్రవక్తా! వారితో ఇలా అను, "ఒకవేళ మీరు మృత్యువు బారినుండి లేదా హత్య బారినుండి తప్పించుకోవాలని పారిపోతే, ఈ పారిపోవటం మీకు ఏ మాత్రం లాభదాయకం కాబోదు. ఓ ప్రవక్త భార్యలారా! మీలో ఎవరైనా ఏదైనా స్పష్టమైన నీతి బాహ్యమైన పని చేస్తే ఆమెకు రెట్టింపు శిక్ష విధించబడుతుంది.

– అల్ అహ్జాబ్ సూరా: 16,30.

సమీక్ష:- యుద్ధమున ఎవడును పరుగెత్తకుండుటకు తమకు విజయము కలుగుటకు, చచ్చుటకైకనను భయపడకుండుటకు, ఐశ్వర్యమభివృద్ధి చెందుటకు, తమమతము వృద్ధిపొందుటకుగాను మహమ్మదు సాహెబిట్లు వ్రాసియు, వ్రాయించియు ఉండవచ్చును. సరి! స్త్రీలు లజ్జ విడిచి రాకూడదన్న పైగంబరు సాహెబు లజ్జవిడిచి రావచ్చునా? స్త్రీలకు పాపము తగులుట, పైగంబరునకు పాపము తగులకపోవుట అనున దెట్టి న్యాయమో. (124)

125. ఓ ప్రవక్తా! అల్లాహ్, నీవు, ఏ వ్యక్తికి మేలు చేశారో ఆ వ్యక్తితో "నీవు నీ భార్యను విడిచిపెట్టకు, అల్లాహ్‌కు భయపడు" అని అంటున్న ఆ సమయాన్ని జ్ఞాపకం చేసుకో. తరువాత జైద్ ఆమె విషయంలో అన అవసరాన్ని పూర్తి చేసుకున్నప్పుడు, మేము ఆమె (విడాకులను పొందిన స్త్రీ) తో నీకు వివాహం జరిపించాము. విశ్వాసులకు తమ దత్తపుత్రుల భార్యల విషయంలో, వారు తమ భార్యలకు సంబంధించిన తమ అవసరాన్ని పూర్తి చేసుకున్నప్పుడు, ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు. (మానవులారా) ముహమ్మద్ మీ లోని ఏ పురుషునికీ తండ్రికారు. నీ భార్యలలో నీకు ఇష్టమైన వారిని నీ

నుండి వేరుగా ఉంచేందుకూ, నీకు ఇష్టమైన వారిని నీతో ఉంచుకునేందుకూ, నీకు ఇష్టమైన వారిని వేరుగా ఉంచిన తరువాత (కూడ) నీ వద్దకు పిలిపించుకునేందుకూ నీకు అధికారం ఇవ్వబడుతోంది. విశ్వాసులైన ప్రజలారా! దైవప్రవక్త ఇళ్ళల్లోకి అనుమతి లేకుండా ప్రవేశించకండి. - అల్ అహ్‌జాబ్ సూరా: 37, 38, 40, 51, 53.

సమీక్ష:- స్త్రీలు చెరసాలలో ఉండునేరస్థులవలె గృహములందుండవలెననియు, పురుషులట్లుగాక స్వతంత్రులై ఉండవలెనని వ్రాయుట ఎంత అన్యాయం? ఏమి? స్త్రీల చిత్తము శుద్ధ వాయు సేవనమును, శుద్ధదేశ సంచారమును, సృష్టియందలి అనేక పదార్థములను చూచుటను కోరదా? ఇందులకే కాబోలు ముసల్మానుల పిల్లలు విశేషముగ తిరుగువారు, విషయాసక్తులు నగుచున్నారు? అల్లారసూలులదొక్కటే ఆజ్ఞయా? లేక పరస్పరవిరుద్ధమైనవా? ఒక్కటందురేని ఇద్దఱయాజ్ఞల పాలింపుడనుట వ్యర్థము. పరస్పర విరుద్ధమై వేర్వేరన్న ఒకటి సత్యమై రెండవది అసత్యమైనదా? అట్లయిన ఒకడు ఖుదా, మరొకడు సైతానగును. సహభోగియునై నిలుచును. బాగుంది! ఖురాను నందలి ఖుదాను, పైగంబరులను ఖురానును ఏమని చెప్పవలయును? ఇతరులకు హాని కలుగజేసి తన ప్రయోజనమును సిద్ధింపజేసికొనగోరువా దవశ్యముగ నిట్టిటక్కులే పన్నుచున్నాడు. కావున మహమ్మదుసాహెబు గొప్ప విషయాసక్తుడై ఉండెననికూడ దీనివలన సిద్ధమైనది. లేనిచో (లేపాలకను) పుత్రుని భార్యను, తన భార్యగ నెందులకు చేసికొనును? ఇక ఇట్టి పనులను చేసిన వానికి ఖుదా కూడ సహాయకుడై అన్యాయమును న్యాయమని నిలిపెనుగదా! మనుష్యులలో ఎంత తెలివిమాలినవాడయినను కొడుకు పెండ్లమును కోరుటలేదు. ఇట్టి విషయాసక్తమగు లీలలు చేయుటకు నబీకి ఏ ఆటంకములు కలుగకపోవుట కడువిపరీతమే. నబీ ఒకనికి తండ్రిగాకుండిన లేపాలకుడనుజైదు ఎవనికి కొడుకయ్యుండెను? ఇట్లు పైగంబరుసాహెబు కొడుకు భార్యనుగూడ వదలకున్న ఇతరులను వదలియుండునా? ఎంత చమత్కారము చేసినను దుష్కార్యము చేయువా డొకప్పుడయిన నిందితుడు కకపోడు. ఒకానొక పురుషుని భార్య నబీను మెచ్చి (నికాహ) పెండ్లి చేసికొనగోరినను అది హలాలే యగునా? నబీ ఇష్టమయిన స్త్రీని త్యజింపవచ్చునట కాని మహమ్మదుసాహెబు స్త్రీలు మాత్రము పైగంబరు నేరస్థుడయినను అతని నెంతమాత్రము విడువగూడ దనుట గొప్ప అధర్మము. పైగంబరు గృహములం దన్యులెవ్వరయినను వ్యభిచారదృష్టితో ప్రవేశింపగూడదుగదా! నబీ ఎవనియింట ప్రవేశింపగోరినను నిరాటంకముగ ప్రవేశింపవచ్చునాయేమి? మరి గౌరవార్హుడును కాగలుగునా? సరేసరే. ఈ ఖురానీశ్వరోక్తమనియు, మహమ్మదుసాహెబును పైగంబరనియు, ఖురాను చెప్పిన ఈశ్వరుని పరమేశ్వరుడనియు నమ్మగలుగునంతటి మూర్ఖుడెవడైన నుండునా? ఇట్లు యుక్తిశూన్యమును ధర్మవిరుద్ధమునగు విషయములతోగూడిన ఈ మతమును 'అరేబియా' దేశవాసు లంగీకరించి యుండుట కడు ఆశ్చర్యమే. (125)

126. **దైవప్రవక్తకు కష్టం కలిగించటం మీకు ఏ మాత్రం ధర్మసమ్మతం కాదు. అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ బాధ కలిగించిన వారిని అల్లాహ్ ఇహపరాలు రెండింటిలోనూ శపించాడు; ఓ ప్రభూ! వారికి రెట్టింపు యాతన విధించు, వారిని తీవ్రంగా శపించు."**

– అల్ అహ్‌జాబ్ సూరా: 53,57,68.

సమీక్ష:– ఆహా ! ఆహా! ఏమి యిట్లు ఖుదా తన ఖుదాతనాన్ని కనబఱచుచున్నది ధర్మపూర్వకమేనా? ఎందుకన రసూలునకు దుఃఖము కలిగింపరాదని చెప్పుట మంచిదేకాని ఇతరులకు దుఃఖము కలిగింపరాదని రసూలునుగూడ ఆజ్ఞాపింపవలసియుండెను. అట్లాజ్ఞాపింపలే దెందులకు? ఒకనికి దుఃఖము కలిగించుటవలన అల్లాకూడ దుఃఖితుడగుచున్నాడా యేమి? అటులయిన అతడీశ్వరుడు కాజాలడు. అల్లాయును, రసూలును ఇష్టమయినవానికి దుఃఖము కలిగింపవచ్చుననుట సిద్ధము కాదా? వీరికిగాక మఱియెవ్వరికైనను దుఃఖము కలిగింపవచ్చునా! ముసల్మానులకును, ముసల్మానుల స్త్రీలకును దుఃఖము కలిగించుట మంచిది కానట్ల అన్యమతమస్థులకు దుఃఖము కలుగజేయుటయు కడుదౌర్జన్యమే కద. ఇక దీని నంగీకరింపరేని వారు పక్షపాతము కలవారని గ్రహింపుడు. మేల్మేలు! సంసారమున ద్రోహము కలుగజేయు నో ఖుదా! ఓ నబీ మీబోటి దయాశూన్యులు ప్రపంచమున చాలతక్కువే ఉందురు! అన్యజనులెట జిక్కినను వారిని బట్టుకొని చంపుడని వ్రాయబడియున్నది! ఆ ప్రకారమే అన్యమతస్థులు ముసల్మానులయెడ వర్తింపవలెనన్న ముసల్మానులకది చెడ్డగ దోచునా లేదా? పైగంబరు లెంతటినిర్దయు లనవలయును. అన్య మతస్థులకు రెండింతలు దుఃఖము కలిగింపవలయునని పరమేశ్వరుని ప్రార్థించుచున్నారుగా! ఇదియు పక్ష పాతముతో కూడినట్టియు, స్వప్రయోజనమును సిద్ధింపజేసికొనునట్టియు గొప్ప అధర్మము కద. ఇందు వలననే యిప్పటి వఱకును, ముసల్మానులందు అనేక శఠులిట్టిపనులు చేయుట కెంతమాత్రము వెనుదీయరు. శిక్షితుడుకాని మనుష్యుడు పశుసమానుడై ఉండుననుట స్పష్టమేకద. (126)

127. **వాయువులను పంపేవాడు అల్లాహ్‌యే. తరువాత అవి మేఘాన్ని లేపుతాయి, ఆ తరువాత మేము దానిని ఒక పాడుబడ్డ నేల వైపునకు తీసుకుపోతాము, దాని ద్వారా చచ్చిపడివున్న ఆ నేలపై బ్రతికిస్తాము. మరణించిన మానవులు బ్రతికి లేవటం కూడా ఇలానే జరుగుతుంది. ఆయన మమ్మల్ని తన అనుగ్రహం వల్ల శాశ్వత నివాసస్థలంలో నివసింపజేశాడు. ఇక ఇక్కడ మాకు ఏ కష్టమూ ఉండదు. ఏ అలసటా కలుగదు."**

– ఫాతిర్ సూరా: 9,35.

సమీక్ష:– ఔరా! ఖుదా వాయువులను పంపగా అవి మేఘములను లేపుచున్నవనియు, నట్లే వానితో పీనుగల బ్రతికించుచున్నాడనియు అనెడి ఖుదా (ఫిలాసఫీ) తత్త్వవిద్య నేమని చెప్పవలయును! ఇవి ఈశ్వర వాక్యము లెంత మాత్రము కానేరవు. ఏలయన ఈశ్వరునిపని నిరంతర మొకేవిధముగ జరుగుచుండును. గృహములుండునన్న చేయబడక యుండనేరవుకద. మరి చేయబడినవి సర్వదా యుండనేరవు. శరీరము గలవాడు పరిశ్రమము చేయునిచో దుఃఖితుడగును.

శరీరధారియైనవాడొకప్పుడైనను రోగగ్రస్తుడు గాక బోడు. ఒకస్త్రీతో సమాగమ మొనరించువాడే రోగములను తప్పించుకొనకయున్న అనేకస్త్రీలతో విషయానంద మనుభవించువాని దుర్దశ ఏమికావచ్చును! కాన ముసల్మానుల నిరంతర స్వర్గవాసముకూడ సుఖకర మెన్నటికి గాజాలదు. (127)

128. వివేక విలసితమైన ఖురాన్ సాక్షిగా! నీవు నిశ్చయముగా దైవ ప్రవక్తలలోని వాడవు; ఋజుమార్గంలో ఉన్నావు. (ఈ ఖురాన్) శక్తిమంతుడూ, కరుణామయుడూ అయినవాడు అవతరింపజేసినది; – యాసీన్ సూరా: 2-5.

సమీక్ష:– ఇప్పుడు చూడుడు! ఈ ఖురాన్ ఖుదాచే రచియింపబినచో అతడేల ఒట్టుపెట్టుకొని ఉండును? నబీ ఖుదాచే పంపబడినవాడైతే (లేపాలకుడను) కొడుకుభార్య నెందులకు మోహించియుండును? ఖురాను నంగీకరించువారు చక్కనిక మార్గమున కలరనుట పట్టిమాటయే. ఏమనగా సత్యము చెప్పుట, సత్యము పలుకుట, సత్యము నాచరించుట, పక్షపాతరహితమగు న్యాయధర్మములు సేవించుట మున్నగున వెందుకలవో అదియే చక్కనిమార్గము. ఇక వీనికి విపరీతమైనదాని త్యజింపదగునని ఖురాను నందుగాని, ముసల్మానులందుగాని, వీరి ఖుదాయందుగాని లేనేలేదు. అందఱికంటె మించిన పైగంబరు, మహమ్మదుసాహెబేని యతడందఱికంటె అధికవిద్వాంసుడు, శుభగుణయుక్తుడు నెందులకు గాకయుండును? కాన పండ్ల నమ్ముస్త్రీ తనరేగుబండ్లు పుల్లని వననట్లే ఈమాటయు నయ్యెను. (128)

129. ఆ తరువాత ఒక శంఖం ఊదబడుతుంది. అప్పుడు వారు హఠాత్తుగా తమ ప్రభువు ముందు హాజరయ్యేందుకు తమ సమాధులనుండి బయటికి వస్తారు. వారు ప్రపంచంలో ఏమేమి సంపాదిస్తూ ఉండే వారో వారి చేతులు మాకు చెబుతాయి. వారి కాళ్ళు సాక్ష్యమిస్తాయి. ఆయన ఏదైనా చేయదలచుకున్నప్పుడు, దాన్ని కేవలం "అయిపో" అని మాత్రమే ఆజ్ఞాపిస్తాడు. అంతే అది అయిపోతుంది. –యాసీన్ సూరా: 51,65,82.

సమీక్ష:– ఇప్పుడీ పొందికలేని మాటలను వినండి. పాదము లెన్నడైన సాక్ష్యము పలుకగలుగునా? ఖుదా తప్ప ఆసమయమం దాజ్ఞాపింపబడుట కెవ్వడుండెను? ఏమయ్యెను? ఏ వస్తువును లేకుండె నన్న ఇది అబద్ధమగును. ఉండెనన్న 'ఖుదా తప్ప వేఱువస్తువు లేదు; ఖుదా అన్నిటిని జేసెను' అను మాట అబద్ధమై పోవును. (129)

130. మద్యపు చెలమల నుండి పాత్రలు మాటి మాటికీ నింపబడి వారి మధ్య త్రిప్పబడతాయి. మెరిసిపోతున్న మధువు త్రాగేవారికి అది ఎంతో మధురం. వారి దగ్గర తమ చూపులను నిగ్రహించుకునే అందమైన కళ్ళు గల స్త్రీలు ఉంటారు. వారు గ్రుడ్డు గుల్ల క్రింద దాగి ఉండే పొరలాంటి కోమలాంగులు. సరే, అయితే ఇక మేము చనిపోమా? లూత్ కూడా దైవప్రవక్తలుగా నియమించి పంపబడిన వారిలో ఒకడు. జ్ఞాపకం తెచ్చుకో, అపుడు మేము అతనికీ, అతని కుటుంబంలోని వారికందరికీ విముక్తి కలిగించాము, ఒక

వృద్ధురాలికి తప్ప; అమె, వెనుక ఉండిపోయిన వారిలో ఉండిపోయింది. ఆ తరువాత మిగతా వారందరినీ సర్వనాశనం చేశాము.

– అస్ సాఫ్ఫాత్ సూరా: 45, 46, 48, 49, 58, 134–136.

సమీక్ష:– ఏమండి! ఇట ముసల్మానులు సారాయి చెడ్డదనుచున్నారు. కాని వీరి స్వర్గమందో సారాయి నదులే ప్రవహించుచున్నవి! ఇక్కడ సురాపానమును నిషేధించుట మంచిదేకాని దీనికి బదులుగ అక్కడ వీరి స్వర్గమందు మాత్రము కడుచెఱుపు కలదు. స్త్రీలు మిక్కిలిగ ఉన్నందున ఒకనిచిత్తమైన స్థిరముగ నుండకపోవచ్చును. గొప్ప రోగములుకూడ సంభవించుచుండవచ్చును! అక్కడి మనుష్యులు శరీరధారులై యుందురేని చావనే చత్తురు. శరీరధారులు కారేని భోగవిలాసముల ననుభవింపలేకపోదురు. ఇక వారిని స్వర్గమునకు కొనిపోవుటయు వ్యర్థమే. లూతును పైగంబరని అంగీకరింతురేని అతనితో అతని కుమార్తెలు సమాగమ మొనరించి ఇరువురు కొడుకులను కనిరని బైబిలు నందు వ్రాయబడియున్నదే. దానినిగూడ నంగీకరింతురా లేదా? అంగీకరింతురేని అతని పైగంబరని భావించుట వ్యర్థము. ఇటువంటివాని సహచరులకును ఖుదా ముక్తి గలుగజేయునన్న ఆ ఖుదా సయితము అట్టివాడే అగును. ఏలయన వృద్ధురాలి వృత్తాంతము చెప్పువాడును పక్షపాతముతో ఇతరుల చంపువాడును ఎన్నటికి ఖుదా కానేరడు. ఇట్టి ఖుదా ముసల్మానులయింట ఉండదగునే కాని అన్యత్ర కాదు. (130)

131. నిశ్చయంగా ఉత్తమ నివాసం ఉన్నది; శాశ్వతమైన స్వర్గవనాలు ఉన్నాయి; వాటి ద్వారాలు వారి కొరకు తెరువబడి ఉంటాయి; వాటిలో వారు దిండ్లకు ఆనుకుని కూర్చుంటారు; ఎక్కువగా పండ్లనూ పానీయాలనూ కోరుతూ ఉంటారు; వారి ప్రక్కన సమవయస్కులైన, లజ్జావతులైన భార్యలు ఉంటారు. ఈ ఆజ్ఞ ప్రకారం దైవదూతలందరూ సజ్దా చాశారు. కాని ఇబ్లీస్ తాను గొప్పవాడినని గర్వించాడు; అతడు తిరస్కారులలో కలిసిపోయాడు. ప్రభువు ఇలా సెలవిచ్చాడు, "ఇబ్లీస్! నేను నా రెండు చేతులతో సృజించినవానికి సజ్దా చెయ్యకుండా నిన్ను ఏ విషయం ఆపింది? నీవు గొప్పవాడివై పోయావా లేదా ఉన్నత శ్రేణికి చెందినవారిలోని వాడవా?" అతడు ఇలా సమాధానం చెప్పాడు: "నేను అతడికంటె శ్రేష్ఠుణ్ణి. మీరు నన్ను అగ్నితో పుట్టించారు. ఇతన్నేమో మట్టితో సృష్టించారు" ఇలా సెలవిచ్చాడు: "సరే, ఇక్కడినుండి వెళ్ళిపో. నీవు శపించబడ్డావు. నీ మీద నా శాపం ప్రతిఫలదినం వచ్చేవరకూ ఉంటుంది". అతడు ఇలా ఉన్నాడు: "ప్రభూ! అలా అయితే వారు మళ్లీ లేపబడే దినం వరకూ నాకు గడువు ఇవ్వు" ఇలా సెలవిచ్చాడు, "సరే ఆ రోజు వరకూ నీకు గడువు ఉంది. అది వచ్చే కాలం నాకు తెలుసు." అతడు ఇలా అన్నాడు, "నీ గౌరవం సాక్షిగా! నేను వారందరినీ మార్గభ్రష్టులుగా చేసి తీరుతాను.

– సాద్ సూరా: 50–52, 73–82.

సమీక్ష:- ఖురానునందట ఉద్యానవనములు, నదులు, గృహములు మున్నగునవి ఉన్నట్లు వ్రాయబడియున్నదే, అవి సనాతనమునుండి యుండినవి కావు. సర్వదా యుండబోవు. ఏలయన సంయోగముచే కలుగు పదార్థము సంయోగమునకు పూర్వము లేకుండెను. భావిపదార్థము వియోగాంతమున ఉండదు. ఆ స్వర్గమే ఉండదన్న అందుండగలవను పదార్థము లెల్లప్పుడు ఎట్లుండగలుగును? ఏలయన పళ్ళపులు, మెత్తలు, ఫలములు, పానీయములను పదార్థము లక్కడ చిక్కునని వ్రాయబడి ఉన్నది. కాన మునల్మానుల మతము వ్యాపించినకాలమున నరేబియా దేశము విశేషధనముగలది కాదనియు, అందువలననే మహమ్మదుసాహెబు పరపులు మున్నగువాని కథలు వినిపించి బీదలను తనమతమందు జిక్కించుకొనెననియు దీనివలన సిద్ధమగుచున్నది. స్త్రీలుగలచోట్ల నిరంతరసుఖ మెక్కడిది? ఆ స్త్రీ లక్కడకెక్కడ నుండి వచ్చిరి? లేక వారు స్వర్గముననే యుండువారా? వచ్చినవారేని వెళ్ళిపోదురు. అక్కడనే యుండు వారన్న ప్రళయమునకు పూర్వ మేమిచేయుచుండిరి? నిరర్థకముగ కాలము గడపుచుండిరా? ఇక ఖుదాప్రతాపము చూడుడు! అత డాజ్ఞాపింపగా ఫరిశ్తాలందఱు నంగీకరించి ఆదామునకు నమస్కారము చేసిరి. కాని సైతానంగీకరింపలేదట. ఖుదా సైతానుతో నేను నా రెండు చేతులతో వాని చేసితిని. నీ వభిమానపడకు మని అనెనట. దీని నుండి ఖురాను నందలి ఖుదా రెండుచేతులుగల మనుష్యుడయి యుండెనని సిద్ధమగుచున్నది. కావున అతడు వ్యాపకుడు గాని, సర్వశక్తిమంతుడగాని కానేరడు. నేను ఆదాముకంటె ఉత్తముడవని సైతాను పలికినది నిజమే. ఖుదా అతని మీద కోపపడినదెందులకు? చెప్పరేమి? ఖుదా గృహం ఆకాశమునందే కలదా? పృథివిమీద లేదా? అట్లైతే మొదట కాబాను ఖుదా గృహమని యెందులకు వ్రాసెను? మఱి పరమేశ్వరుడు తన సృష్టిలో నుండి సైతాను నెట్లు వేఱుపఱుపగలడు? సృష్టియంతయు పరమేశ్వరునిదే కదా. దీనివలన ఖురానునందలి ఖుదా స్వర్గమునకు మాత్రమే ప్రభువని విదితమయ్యెను. ఖుదా అతనిని ధిక్కరించి చెఱలోనుండగా ఓ ప్రభువా! నన్ను ప్రళయదినమువఱకు విడిచిపెట్టుమని సైతానన్నప్పుడు ముఖస్తుతిచే నుప్పొంగి వానిని ఖుదా ప్రళయదినము వరకు విడిచిపెట్టెను. సైతాను విడుదలబొంది ఇక నేను జనులను విశేషముగ భ్రమింపజేయుదుననియు వారిలో ద్రోహము కలిగింతుననియు ననెను. అప్పుడా ఖుదా నీవెవరిని భ్రమింపజేయుదువో వారిని, నిన్నును నరకమున బడవేయుదుననెను. సజ్జను లారా! ఇట్టి సైతానును ఖుదా భ్రమింపజేసెనా? లేక తనంతట తానే భ్రమించెనా? గమనింపుడు! ఖుదా భ్రమింపజేసినచో అతడు సైతానుల మించిన సైతానయ్యెను. సైతాను స్వయముగనే భ్రమించెనన్న అన్య జీవులును తమంతటతామే భ్రమింతురు. సైతాను నావశ్యకమే ఉండదు. ఇక ద్రోహియైన ఆసైతానును ఖుదా విడిచిపెట్టినందున అతడు కూడ అధర్మమొనరింపజేయుచు ఆసైతానునకు భాగస్థు డయ్యెననుట స్పష్టము. తానే దొంగిలింపజేసి దండించునేని అతని అన్యాయమున కొకమేర యుండునా? (131)

132. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలనూ క్షమిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను. ప్రళయంనాడు యావత్తు భూమండలం ఆయన పిడికిలిలో ఉంటుంది. ఆకాశాలు ఆయన కుడిచేతిలో చుట్టబడి ఉంటాయి. భూమి తన ప్రభువ

యొక్క తేజస్సుతో వెలిగిపోతుంది. కర్మల చిట్టా తీసుకురాబడుతుంది. దైవప్రవక్తలూ, సాక్షులూ అందరూ హాజరు పరచబడతారు. ప్రజలకు సరిగ్గా, న్యాయంగా తీర్పు చేయబడుతుంది. –అజ్ జుమర్ సూరా: 53, 67, 69.

సమీక్ష:- ఖుదా సకలపాపములను క్షమించుచునన్న ప్రపంచయములో అంతట పాపాలను చేయిస్తున్నాడని దయావిహీనుడని తెలియుచున్నది. ఏమియన దుష్టునియెడ దయజూపి అతనిని క్షమించిన అతనడధికముగ దుష్టకార్యములనే చేయును. అట్లే ధర్మాత్ములైనవారి కెందఱకో దుఃఖము కలిగించును. కించిదపరాధమైనను క్షమింపబడునేని జగత్తునందంతట అపరాధములే వర్ధిల్లసాగును. ఏమి? పరమేశ్వరుడగ్నివంటి ప్రకాశము కలవాడా? మతీ కర్మపత్రములు ప్రోగుచేసి ఎక్కడ నుంచబడును? వానిని వ్రాసేవాడెవడు? ఖుదా పైగంబరుల మాటలను, సాక్షుల మాటలను విశ్వసించి న్యాయమొనరిస్తే అతడు సర్వజ్ఞుడు కాడు. సమర్థుడును కాడు. సమర్థుడును కాడు. అతడు న్యాయం చేయడు. న్యాయమే చేస్తే కర్మములకు తగినట్లే చేయుచుండవచ్చు కదా! ఇక ఆ కర్మలను అవి కూడా పూర్వప్రవర్తమాన జన్మములననుసరించే ఉండును. మరి క్షమించుట, హృదయముల మీద ముద్రలువేయుట, శిక్షింపకపోవుట, సైతానుద్వారా భ్రమింపజేయుట, ప్రతిబంధమందుంచుట మొదలైన మాటలన్నీ న్యాయవిరుద్ధములనుట స్పష్టము. (132)

133. ఈ గ్రంథం అల్లాహ్ తరపునుండి అవతరించింది. ఆయన మహాశక్తిమంతుడు, మహాజ్ఞాని, పాపాలను క్షమించేవాడూ, పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడూను;

– అల్ ముఃమిన్ సూరా : 2,3.

సమీక్ష:- అల్లాపేర అమాయకులు ఈ పుస్తకమును ఒప్పుకొందురనియే ఇట్లు కల్పింపబడినది. కాని ఇందలి కొన్ని మాటలుతప్ప తక్కిన పుస్తకమంతా మిథ్యోక్తులతో నిండి ఉన్నది. సత్యమైన మాటలను మిథ్యోక్తులతో కూడి కలుషితమై ఉన్నవి. కావున ఈ ఖురాను, ఖురాను చెప్పిన ఖుదా, వీనిని ఒప్పుకొనే వారందరూ పాపమును వృద్ధిపరచేవారు, పాపములు చేస్తూ చేయించేవారునై ఉన్నారు. ఎందుకంటే పాపమును క్షమించుటయే గొప్ప అధర్మము. ఇందువలననే కద ముసల్మానులు పాపోపద్రవములనొనర్చుటకు అంతగా భయపడకుండునది. (133)

134. అప్పుడు ఆయన రెండు రోజులలో ఏడు ఆకాశాలను నిర్మించాడు. వారి పూర్వీకులను, వారి వెనుకవారు వచ్చేవరకు ఆపటం జరుగుతుంది. తరువాత అందరూ అక్కడకు చేరినప్పుడు, వారి చెవులూ, కళ్ళూ, వారి శరీర చర్మాలూ వారు ప్రపంచంలో చేస్తూ ఉన్న దానిని గురించి సాక్ష్యమిస్తాయి. అప్పుడు వారు తమ శరీర చర్మాలను, "మీరు మాకు వ్యతిరేకంగా ఎందుకు సాక్ష్యం చెప్పారు?" అని అడుగుతారు. అవి ఇలా సమాధానం చెబుతాయి, "ప్రతి వస్తువుకూ మాట్లాడే శక్తిని ఇచ్చిన దేవుడే మాకూ మాట్లాడే శక్తిని ఇచ్చాడు. నిశ్చయంగా ఈ మృతభూమిని బ్రతికించే లేపే దేవుడే మృతులకు కూడా ప్రాణభిక్ష పెడతాడు. –హా మీమ్ అస్ సజ్దహ్ సూరా :12,20,21,39.

సమీక్ష:- చాలా బాగుంది ముసల్మానులారా! మీరు సర్వశక్తివంతుడని నమ్ముతున్న మీ ఖుదా సప్తాకాశములను రెండు దినములందా చేయగలిగినది! వస్తుతః సర్వశక్తిమంతుడైనవాడు క్షణంలో సమస్తాన్ని చేయగలుగును గదా! పోనిండు. చెవులను, కన్నులను, చర్మములను ఈశ్వరుడు జడములుగా చేసి ఉన్నాడు. అవి సాక్ష్యమెట్లు పలుకగలుగును? సాక్ష్యమిప్పించుదనన్న మొదట అతడు వానిని జడములుగా ఎందుకు చేసాడు? అప్పుడు వానికి శక్తి ఇచ్చునన్నచో తన నియమమును తానే రద్దుచేసికొనునా? ఇక జీవులమీద సాక్ష్యం పలికినప్పుడు ఆ జీవులు తమతమ చర్మాంగాలతో మీరు మా మీద సాక్ష్యమెందుకు పలికితిరని అడుగగా అవి 'మేమేమి చేయగలము? మేమును రప్పించబడితిమి' అనునిట్టి మాట ఎన్నడేని సంభవములగునా? ఒకానొకడు నేను ఒక గొడ్రాలి పుత్రుని ముఖం చూసితినన్నట్లయ్యేనుగదా! పుత్రుడు కలిగినప్పుడు ఆమె గొడ్రాలెట్లు? గొడ్రాలన్న ఆమెకు పుత్రుడే కలుగనేరడు గద! ఇదీ అటువంటి మిథ్యాలాపమే. కాన ఇది అంతకంటే అబద్ధము. అట్లే అతడు పీనుగుల బ్రతికించుననన్న, మొదట చంపుట ఎందుకు? తాను కూడా చావగలడా లేదా? చావదన్న చచ్చుట చెడ్డదని ఎందుకు భావిస్తున్నాడు? మరి ప్రళయరాత్రి వరకు చచ్చిన జీవములే ముసల్మానునింట ఉండును? అపరాధం లేనిదే వానినట్లు ఖుదా ప్రతిబంధంలో ఎందుకుంచును? శీఘ్రంగా న్యాయం చేయడెందుకు? ఈశ్వరుని ఈశ్వరత్వానికి కలంకము కలుగజేసేవి ఇటువంటి మాటలే కద. (134)

135. భూమ్యాకాశాలలోని నిక్షేపాల తాళపు చెవులు ఆయన వద్దనే ఉన్నాయి. తాను కోరిన వారికి ఆయన పుష్కలంగా ఉపాధిని ఇస్తాడు; తాను కోరినవారికి ఆయన ఆచితూచి ఉపాధిని ఇస్తాడు. తనకు ఇష్టమైన వారికి కూతుళ్ళనూ, తాను కోరినవారికి కొడుకులనూ ఇస్తాడు; తనకు ఇష్టమైన వారికి కొడుకులనూ, కూతుళ్ళనూ కలిపి ఇస్తాడు; తాను కోరిన వారికి అసలు సంతానమే ఇవ్వడు. అల్లాహ్ ముఖాముఖి మాట్లాడే అంత స్థానం మానవునిది కాదు. ఆయన మాట్లాడటం అనేది వహీ (సంకేతం) ద్వారానైనా జరుగుతుంది లేదా తెర వెనుక నుండి అయినా జరుగుతుంది లేదా ఆయన సందేశహరుణ్ణి (దైవదూత) ఎవరినైనా పంపుతాడు; – అష్ షూరా సూరా: 12,50,51.

సమీక్ష:- ఖుదావద్ద తాళపుచెవుల ఇల్లే ఉండవచ్చును. ఏమనగా అతనిచే అన్నిచోట్ల అందలి తాళములు విప్పబడుతుండవచ్చును. ఇదియు పసితనపు మాటయే. పుణ్యకర్మములను చేయని వానికి కూడా తన ఇష్టానుసారంగా ఐశ్వర్యమొసంగుచున్నాడా? అలాగే ఇష్టమైన వానిని కష్టపెట్టుచున్నాడా! అలాగైతే అతడు గొప్ప అన్యాయకారియే అవుతాడు. స్త్రీలు సైతం మోహితలై చిక్కుటకు ఆ ఖురానుకర్త చతురత్వం ఇంకను చూడండి. ఇష్టమైన దానిని పుట్టించగలుగునట. అలాగైతే రెండవ ఖుదాను కూడా పుట్టించగలుగునా లేదా? పుట్టించజాలడన్న అతని సర్వశక్తిమత్త్వమునకు అటంకము కలుగును. ఆహా! మనుష్యులలో ఇష్టమైన వారికి బిడ్డలను ఇస్తున్నాడేని కోళ్ళు, చేపలు, పందులు మొదలైన వానికి పెక్కు బిడ్డలు పుట్టుచున్నవే. వానికి ఎవడిచ్చుచున్నాడు? స్త్రీ పురుషులకు సంపర్కము లేకుండా ఎందులకియ్యడు? తన ఇచ్ఛానుసారం ఒకరిని గొడ్రాలుగా చేసి ఎలా దుఃఖింపచేయుచున్నాడు? ఆహా! అతని సమ్ముఖమున ఎవడును మాటలాడనేరడన్న ఆ ఖుదా ఎంతటి తేజముగల వాడని

చెప్పవలయును? ఆయన మొదట చెప్పి ఉన్నట్లు తెరవేసి మాటలాడుననీ, ఫరిశ్తాలుగాని పైగంబరులుగాని ఖుదాతో మాట్లాడగలరనీ వ్రాయబడిన ఈ వార్తలే నిజమైన ఫరిశ్తాలును, పైగంబరులును, దమ ప్రయోజనాలు బాగా నెరవేర్చుకోవచ్చు.

ఒకానొకడు ఖుదా సర్వజ్ఞుడనీ, సర్వవ్యాపకుడనీ అంటే "తెఅచాటున మాట్లాడును" "తపాలవార్తవలె సమాచారములు తెలుసుకొనును" అని వ్రాయబడిన మాటలన్నీ వ్యర్థములే. అటువంటి వాడేని అతడు ఖుదా కాదు. కాని ఒక యుక్తిపరుడైన మనుష్యుడు కావచ్చు. కావున ఈ ఖురాను ఈశ్వరకృతం ఎన్నటికీ కానేరదు. (135)

136. స్పష్టమైన సూచనలను తీసుకువచ్చిన ఈసా ఇలా అన్నాడు.

-అజ్ జుఖ్‌రుఫ్ సూరా: 63.

సమీక్ష:- ఏసుకూడా ఖుదాచే పంపబడిన వాడైతే అతని ఉపదేశానికి విరుద్ధంగా ఆ ఖుదా ఖురాను రచించినదెందులకు? మరి అంజీలను ఖురానునకు విరుద్ధంగా ఉన్నది. కావున ఈ పుస్తకములు ఈశ్వరకృతములు కావు. (136)

137. అతనిని పట్టుకోండి, నరకం మధ్యకు ఈడ్చుకుంటూ తీసుకువెళ్ళండి, ఇలా ఉంటుంది వారి దర్పం. పసిమి రంగు మేనులు, అందమైన విశాలమైన కళ్ళూ గల స్త్రీలను వారికి ఇచ్చి వివాహం చేస్తాము.

– అద్ దుఖాన్ సూరా: 47,54.

సమీక్ష:- ఔరా! ఖుదా న్యాయకారియు, జీవుల పట్టించి ఈడ్పించునా? ముసల్మానులఖుదాయే ఇట్లున్న అతని ఉపాసకులగు ముసల్మానులు అనాథులయిన నిర్బలులబట్టి ఈడ్చిన నందాశ్చర్య మేమి? ప్రపంచమందలి మనుష్యుల వలె అతడు పెండ్లి కూడ చేయించుచున్నాడే. అతడు ముసన్మానులకు పురోహితుడే అనవచ్చును. (137)

138. కనుక మీరు ఈ అవిశ్వాసులతో తలపడినప్పుడు, వారి మెడలను ఖండించటమే మీరు చేయవలసిన మొదటి పని. చివరకు మీరు వారిని పూర్తిగా అణచివేసిన తరువాత, ఖైదీలను గట్టిగా బంధించండి. ప్రవక్తా! నిన్ను బహిష్కరించిన నగరం కంటే ఎంతో శక్తిమంతములైన నగరాలు ఎన్నో గతించిపోయాయి. మేము వాటిని ఎవ్వరూ కాపాడలేనంతగా సర్వనాశనం చేశాము. భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం యొక్క వైభవం ఇలా ఉంది, అందులో నిర్మలమైన నీటి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. ఏ మాత్రమూ మారని రుచిగల పాల కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, సేవించే వారికి మధురంగా ఉండే మద్యపు కాలవలు ప్రవహిస్తూ ఉంటాయి. స్వచ్ఛమైన తేనె కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అందులో వారికొరకు అన్ని రకాల పండ్లు ఉంటాయి. ఇంకా వారి ప్రభువు తరఫునుండి క్షమాభిక్ష కూడ.

– ముహమ్మద్ సూరా : 4,13,15.

సమీక్ష:- దీనివలన ఈ ఖురాను, ఖురాను చెప్పిన ఖుదా, ముసల్మానులు ద్రోహమొనర్చుచు అందఱకు దుఃఖము కలుగజేయువారు, స్వార్థమును సిద్ధింపజేసికొనువారు, దయావిహీనులై ఉన్నారనుట స్పష్టము. ఆహా ! అన్య మతస్థుడొకడు ముసల్మానులతో ఇట వ్రాయబడినట్లే వర్తించిన ఇతరులకు దుఃఖము కలుగునట్లు ముసల్మానులకును దుఃఖము కలుగునా, లేదా! మహమ్మదుసాహెబును తొలగగొట్టిన వారిని ఖుదా చంపినాడన్న ఆ ఖుదా గొప్ప పక్షపాతియే అనవచ్చును. మంచిది ఎందు నిర్మలోదకము, పాలు, సారా, తేనె నదులు కలవో అది ఈ ప్రపంచమునకంటె మించినదగునా? పాల నదులెన్నడయిన ఉండగలుగునా? ఏమనగా అవి కొద్దికాలములోనే చెడిపోవును. బుద్ధిమంతులు ఈఖురాను మతము నంగీకరింపరు. (138)

139. భూమి మొత్తం అప్పుడు ఒక్కసారిగా తీవ్రంగా ఊపివేయబడుతుంది, పర్వతాలు చెదరిపోయిన ధూళిరేణువుల మాదిరిగా తుత్తునియలైపోతాయి. మీరు అప్పుడు మూడు వర్గాలుగా విడిపోతారు. కుడిపక్షంవారు; కుడిపక్షంవారి (అదృష్టాన్ని)ని గురించి ఏమనాలి? ఎడమపక్షంవారు; ఎడమపక్షంవారి (దురదృష్టాన్ని)ని గురించి ఏమనాలి? బంగారు జలతారుతో అల్లిన ఆసనాలపై దిండ్లకు ఆనుకొని ఎదురెదురుగా కూర్చుండి ఉంటారు. వారి సమావేశాలలో నిత్య బాల్యంకల బాలురు, మధువు ప్రవహించే చెలమనుండి నింపిన మధుపాత్రలు, గిన్నెలు, గాజుపాత్రలు, కూజాలు తీసుకుని పరుగుతో తిరుగుతూ ఉంటారు. దానిని త్రాగటంవల్ల వారి తల తిరగటం కాని, వారికి బుద్ధిమాంద్యం కలగటంగాని జరగదు. వారు వారి ముందు రకరకాల రుచికరమైన పండ్లను ఉంచుతారు, ఇష్టమైన దానిని తీసుకోవటానికి; పక్షుల మాంసాన్ని ఉంచుతారు, ఏ పక్షిమాంసం ఇష్టమైతే అది తినాలని వారి కొరకు అందమైన కళ్ళుగల 'హూర్'లు (రమణీమణులు) ఉంటారు. వారు దాచిపెట్టిన ఆణిముత్యాల మాదిరిగా ఎంతో అందంగా ఉంటారు. ఎత్తైన ఆసనాలు వీటి మధ్య ఉంటారు. వారి భార్యలను మేము ప్రత్యేకంగా సరిక్రొత్త పంథాలో సృష్టిస్తాము, వారిని కన్యలుగా చేస్తాము. దానితోనే మీరు మీ కడుపులను నింపుకుంటారు.

– అల్ వాఖిఅహ్ సూరా : 4-9, 15-23, 34-37, 57.

సమీక్ష:- ఇప్పుడు ఖురాను రచించినవాని లీలలు గమనింపుడు! భూమి తిరుగుచునే ఉన్నది. అప్పుడును తిరుగుచుండెను. కావున ఖురాను వ్రాసినవాడు భూమి స్థిరముగా ఉన్నదనుకొనుచుండెనని దీనివలన సిద్ధమైనది. ఆహా ! పర్వతాలను పక్షులవలె ఎగురగొట్టునా? తుత్తునియలై పోవునన్నను అవి సూక్ష్మశరీరములు ధరించునేని వానికది రెండవ జన్మ ఎందులకు కాకుండు? ఏమండీ! ఖుదా శరీరధారి కాకున్న అతని దక్షిణోత్తర పార్శ్వములం దెట్లు నిలువగలుగుదురు? జలతారులతో నల్లబడిన మంచము లటనున్నపుడు వడ్రంగులు స్వర్ణకారులు గూడ నట నివసించుచుండవచ్చును. మఱి నల్లులు కుట్టుచు రాత్రులందు వారిని నిద్రపోనియ్యకుండవచ్చును. వారు తివాచీ నంటి పెట్టుకొని స్వర్గమున నిరర్థకముగ కూర్చుండియే ఉందురా? లేక యేదైన పని చేయుచుందురా? కూర్చుండియే ఉందురన్న వారి కన్నము బాగుగా జీర్ణముగాక రోగములపాలై వారు శీఘ్రకాలములోనే చచ్చును

నుండవచ్చు. పనులు చేయుచుందురేని ఇక్కడకూలి కష్టములు చేయుచున్నటులే అక్కడను కష్టపడుచు నిర్వాహము చేసికొనుచుండ వచ్చును. ఒక స్వర్గమునం దిచ్చటికంటె అచ్చట విశేషమేమి కలదు? ఏమియు లేదనుటయే. పిల్లలక్కడ సర్వదా ఉందురన్న వారలకు దల్లిదండ్రులు కూడ ఉండవచ్చును. అత్తమామలు కూడ ఉండియుందురు కాబోలు. అనగా అది ఒక గొప్ప నగరమేయై వెలయుచుండ వచ్చును. ఇంక మలమూత్రాదులధికములగుటవలన అనేక రోగములు కూడ పుట్టుచుండవచ్చును. ఏమన ఫలములు తినుచు పాత్రలతో నీళ్ళు త్రాగుచు తలనొప్పి కలిగింపనట్టి మై మరచి పదరనీయనట్టి సారానుగూడ త్రాగుచు, నిష్టమైన ఫలములను, పశువుల, పక్షుల మాంసము సయితము తినుచుందురేని అట తప్పక నానావిధ దుఃఖములును, పక్షులపశువుల నుండియే ఉండును. హత్యలు జరుగుచు అక్కడక్కడ ఎముకలును పడియుండ వచ్చును. కటిక దుకాణములు కూడ నుండవచ్చును గదా! అబ్బా! వీరి స్వర్గాతిశయము నేమని వర్ణింపవలయును. అరేబియా దేశమునకంటె మించి యున్నటులే గోచరమగుచున్నది!!! మద్య మాంసములు త్రాగుచు తినుచు ఉన్మత్తులగుచుందురేని వారికొరకట చక్కని స్త్రీలును, యువకులు దప్పక యుండవలసినదే కదా లేనిచో, తలపుట్టెలం దుష్టమధికమై ఆత్రాగుబోతులు ప్రమత్తులయి పోదురు. ఇక ననేక స్త్రీపురుషులకు కూర్చుండుటకు, పరుండుటకు, అవశ్యముగ అట గొప్ప గొప్ప పఱపులును కావలసి ఉండును. స్వర్గమున ఖుదా పడుచుస్త్రీల నుత్పన్నము చేయుటవలననే యువకులను కూడ ఉత్పన్నము చేయుచున్నాడు. సరి! ఇక్కడనుండి, ఆయాశపెట్టుకొని పోయినవా రాపడుచు స్త్రీలను వివాహమాడుదురని ఖుదా వ్రాసియున్నాడే. అట నిరంతరముండెడు యువకులు ఫలానాపడుచులను వివాహమాడగల రనుమాట వ్రాయలేదు. కాబట్టి పడుచు స్త్రీలతోపాటు పడుచువాండ్రుకూడ ఆశాబద్ధులకే ఇయ్యబడుదురా యేమి? దీనివ్యవస్థ ఏమియు వ్రాయలేదు. ఖుదా కింతటి గొప్ప మఱపేల గలిగెను? సమానావస్థగల ముత్తయిదువలు పతులబొంది, స్వర్గమున నుందురన్న అది మంచిది కాదు. ఏలయన స్త్రీలకంటె, పురుషుల వయస్సు రెండింతలో రెండింతలన్నరయో ఉండదగును. ఇది కేవలము ముసల్మానుల స్వర్గమున గూర్చిన కథయే. ఇక నరకవాసులు (సింహూడ) పలకజమ్ముడి వృక్షముల దిని కడుపు నింపుకొనెదరేని, నరకమున కంటవృక్షము లుండుటవలన ముండ్లుగూడ గ్రుచ్చుకొనుచుండ వచ్చును. ఉడుకు నీళ్ళు త్రాగుట ఇత్యాది దుఃఖములను నరకమం దనుభవింతురు. ప్రాయికముగా నొట్టుపెట్టు కొనుట అసత్యవాదులపనియే కాని సత్యవంతులది కాదు. ఖుదా సయితమొట్టుపెట్టుకొనుచున్నాడేని అతడుకూడ అసత్యవంతుడనియే గ్రహింపనగును (139)

140. ఓ ప్రవక్తా! అల్లాహ్ నీ కొరకు ధర్మసమ్మతం చేసిన దానిని నీవు ఎందుకు నిషేధించుకుంటున్నావు? (ఈ విధంగా) నీవు నీ భార్యల సంతోషం పొందగోరుతున్నావా? – అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూను. ఒకవేళ మీ అందరికీ ప్రవక్త విడాకులిస్తే, అల్లాహ్ మీకు బదులుగా ఆయనకు మీ కంటె మంచి భార్యలను ప్రసాదిస్తాడు; వారు నిజమైన ముస్లిమ్‌లుగా, విశ్వాసం కలవారుగా, విధేయత చూపేవారుగా, పశ్చాత్తాపపడేవారుగా, ఆరాధన చేసేవారుగా, ఉపవాసం పాటించే వారుగా ఉంటారు.

– అత్ తహ్రీమ్ సూరా : 1,5.

సమీక్ష:- ధ్యానపూర్వకముగ గమనించితిమేని, అతడు ఖుదా కాడుగాని, మహమ్మదుసాహెబు పనులు చేయు సేవకుడేయని తేటపడును. మొదటి ఆయతును గూర్చి రెండు కథలు కలవు. (ఒకటి) మహమ్మదుసాహెబునకు తేనెద్రావకము ప్రియమనియు, అతని కనేక స్త్రీలుండి రనియు, వారిలో ఒకదానియింట త్రాగుటయందాలస్యమై నందున ఇతరుల కది అసహ్యముగ తోచెననియు వారి జాడింపులు వినిన పిమ్మట మహమ్మదు సాహెబిక త్రాగనని శపథము చేసెననియు వ్రాయబడి యున్నది. (రెండవది) అతని కనేక భార్య లుండిరనియు, వంతుగా నెవతె దగ్గఱకు పోవలసియుండెనో ఆమెవద్దకు రాత్రియందు వెళ్ళగా ఆమె ఇంటలేక తన తండ్రియొద్దకు పోయియుండెననియు, మహామమ్మదు సాహెబు ఒకదానిని బిలిచి పవిత్రము చేసెనననియు, భార్య కీసంగతి తెలియగా ఆమె అప్రసన్ను రాలయ్యెననియు, అప్పుడు మహ్మదుసాహెబిక నేనట్లు చేయనని ప్రమాణముజేసి నీ వీ సంగతి ఎవరికి తెలియజేయకుమని భార్యతో చెప్పగా ఆమె చెప్పనని ఒప్పుకొనెననియు, మరల నతడు రెండవ భార్య యొద్దకు పోయి చెప్పెననియు వ్రాయబడి యున్నది. దీనిగూర్చియే మేము నీకొఱకు హలాల్ చేసియున్న వస్తువును, నీవు హరామని ఎందులకు తలచుచున్నావను ఈ ఆయతును ఖుదా దించెనా? ఔరా! ఎక్కడయిన ఖుదా ఒకనియింటిని చక్కబెట్టుచు తిరుగుచుండునా? బుద్ధిమంతులు విచారింతురు గాక. ఇక నీ మాటలవలన మహమ్మదుసాహెబు నడవడి తేటపడినది కద. ఏమనగా అనేక స్త్రీల నుంచుకొనువా డీశ్వర భక్తుడు గాని, పైగంబరుకాని ఎట్లు కాగలడు? ఒక స్త్రీని అవమానపరచి మరొక స్త్రీని గౌరవించువాడు పక్షపాతియు, ధర్మహీనుడు నేలగాడు? అనేక స్త్రీలున్నను సంతుష్టుడుగాక దాసీలకు లోబడువానికి లజ్జ, భయము, ధర్మము ననున వెక్కడ నుండును? (కామాతురాణాం న భయం న లజ్జా) కాముకులగు మనుష్యులు అధర్మమునకు భయపడరు. లజ్జితులును కారని ఒకయనుభవజ్ఞుడు వచించినది నిజమే. వీరి ఖుదా నయితము మహమ్మదుసాహెబుగారి భార్యలయు పైగంబరులయు జగడములు తీర్పు చేయు పరిష్కారకర్తయై నిలిచెనుగా! ఈ ఖురాను ఒక విద్వాంసునిచే రచింపబడినదా? అనుమాట బుద్ధిమంతు లాలోచించిన తేటతెల్లమగును. ఒక మహమ్మదుసాహెబుతో అతని ఒకానొక భార్య అప్రసన్నురాలై ఉండవచ్చుననియు, ఖుదా ఈ ఆయతును దించి 'నీవల్లరి చేసితివేని మహమ్మదుసాహెబు నిన్ను విడిచిపెట్టును. ఖుదా నీకంటె అతనికి చక్కని పురుష ముఖము జూడని స్త్రీల నిచ్చును' అని భయ పెట్టియున్నట్లును, రెండవ ఆయతువలన తేటపడుచున్నది. ఇతడు ఖుదాయా? ఇవి ఖుదా చేయు పనులా? లేక తన ప్రయోజనమును సిద్ధిర్పజేసికొనుటకు ఖుదా చెప్పినట్లు మహమ్మదుసాహెబే చెప్పుచుండెనని పై మాటలవలన స్పష్టమగుచున్నది. ఖుదాయే చెప్పుచుండెననువారలతో, మేము చెప్పవలసిన దేమున్నది? బుద్ధిమంతులందరును 'అతడు ఖుదా కాక మహమ్మదుసాహెబు కొరకు స్త్రీలను తెచ్చియిచ్చు (మంగలి) సంబంధములు కూర్చువాడై యుండెననియే' అందురు. (140)

141. ఆ రోజున ఆకాశం బ్రద్దలవుతుంది. దాని వ్యవస్థ సడలిపోతుంది. దైవదూతలు దాని చుట్టుప్రక్కల చేరి ఉంటారు. ఎనిమిది మంది దైవదూతలు ఆ రోజున నీ ప్రభువు సింహాసనాన్ని తమపై ఎత్తుకొని మోస్తూ ఉంటారు. అదే మీరు హాజరుపరచబడే రోజు. ఆ రోజున మీ రహస్యాలేవీ దాగి ఉండవు. అప్పుడు తన కర్మల పత్రం తన కుడి చేతి కివ్వబడిన వ్యక్తి "చూడండి, నా కర్మల పత్రాన్ని తీసుకుని చదవండి. నా లెక్క నాకు తప్పకుండా లభిస్తుందని నేను అనుకుంటూ ఉండేవాణ్ణి." అని అంటాడు. తన కర్మల పత్రం తన ఎడమచేతికి ఇవ్వబడిన వ్యక్తి ఇలా వాపోతాడు, "అయ్యో! నా కర్మల పత్రం నాకు అసలు ఇవ్వకుండా ఉంటే, నా లెక్క ఏమిటో నాకు అసలు తెలియకుండా ఉంటే ఎంత బాగుండేది!"
- అల్ హాఖ్ఖా సూరా :16-19, 25.

సమీక్ష:- ఓహో! ఏమితత్త్వ విజ్ఞానము! ఎంత న్యాయమైన ప్రసంగమని పొగడవలయును? ఔరా! ఆకాశమెన్నడైనా బ్రద్దలయిపోవునా? ఏమి? బ్రద్దలగుటకది వస్త్రమువంటిదా యేమి? మీది లోకము ఆకాశమందురేని అది జ్ఞానవిరుద్ధమగుమాటయే అగును. ఇప్పుడు ఖురాను నందలి ఖుదా శరీర ధారియే అని స్పష్టముగ విదితమగుచున్నది గదా! ఏలయన పీఠము మీద కూర్చుండి ఎనమండుగురు బోయీలచే మోయబడువాడు మూర్తిమంతుడు గాక మరి యేమగును? ఇదిగాక ముందునకు వెనుకకు వచ్చుట పోవుట గూడ మూర్తిమంతునియందే ఘటిల్లగలదు. అతడు మూర్తిమంతుడే యైనచో ఏకదేశీయు డగుటవలన సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తిమంతుడు కానేరడు. అట్లే సకల జీవుల కర్మములను నన్నిటి ఎన్నడు ఎరుగజాలడు. పుణ్యాత్ములకుడి చేతులలో కర్మపత్రములిచ్చి చదివించుట, స్వర్గమునకు బంపుట, అట్లే పాపాత్ముల ఎడమ చేతులలో కర్మపత్రము లిచ్చి నరకమున పడవేయుట, కర్మపత్రములను చదివి న్యాయమొనరించుట అనునీమాటలు కడువింతగా నున్నవి. ఏమి? ఇదియొక సర్వజ్ఞుని పనియగునా? ఎన్నటికి కానేరదు. ఇవన్నియు పిల్లల ఆటలవంటి మాటలే అననొప్పును.(141)

142. యాభైవేల సంవత్సరాల ప్రమాణం గల ఒకరోజున దైవదూతలు, ఆత్మ ఆయన సాన్నిధ్యానికి అధిరోహిస్తారు. అప్పుడు వారు తమ సమాధులనుండి బయటికి వచ్చి తమ దేవతల మందిరాల వైపునకు పరుగెత్తుతున్నట్లు పరుగెత్తుతూ ఉంటారు.
- అల్ మఆరిజ్ సూరా : 4,43.

సమీక్ష:- దినపరిమాణమే పదివేల సంవత్సరములన్న రాత్రిపరిమాణము ఏబదివేల సంవత్సరములు గాదా? ఇంత గొప్పరాత్రి ఉండదందురేని అంతగొప్పదినము నెప్పటికి నుండదు. ఏబది వేల సంవత్సరముల వర కా ఖుదా, ఫరిశ్తాలు, కర్మపత్రధారులు అందరును నిలువబడియుందురా లేక కూర్చుండి యుందురా? మరి వారందరును మేలుకొనియే ఉందురా ఏమి? అటులయన ఇక అందరును రోగ గ్రస్తులై చావనే చత్తురు. వారు సమాధులలోనుండి లేచి

ఖుదాచ్చేరీ వైపునకు పరువెత్తుదురా? ఏమి? ఆబొందలలోని వారికి సూచనాపత్రము (సమనులు) ఎట్లందును? పాపమాపుణ్యాత్ములను పాపాత్ముల నందరినింతకాలము వరకు ప్రతిబంధరూపకముగా బొందలలో నెజొందులకు చేరవేసి యుంచెను? ఇప్పుడు ఖుదా కచ్చేరీ మూయబడి ఉండవచ్చునా యేమి? ఆ ఖుదా ఫరిశ్తాలు నిరర్థకముగ గూర్చుండి యుందురా? లేక ఏమయిన పని చేయుచుందురా? తమ స్థానములందు కూర్చుండి అటునిటు దిరుగుచు, పరుండుచు, నాట్యమ్ములను వేడుకలను చూచుచు, ఆనంద మనుభవించుచు నుండవచ్చును గద. ఇంత అన్యాయ మే రాజ్యమున నుండదు. కావున ఈ వార్తలను అడవి మనుష్యులు తప్ప అన్యులెవ్వరు నంగీకరింపజాలరు. (142)

143. వాస్తవానికి ఆయన మిమ్మల్ని విభిన్న రీతులలో సృజించాడు. అల్లాహ్ ఏ విధంగా ఏడు ఆకాశాలను ఒకదానిపై నొకటి సృష్టించాడో, వాటిలో చంద్రుణ్ణి కాంతిగానూ, సూర్యుణ్ణి దీపంగానూ చేశాడో, మీరు చూడటం లేదా? - నూహ్ సూరా : 14-16.

సమీక్ష:- ఖుదా జీవుల నుత్పన్నము చేసియున్నాడన్న వారు నిత్యులు అమరులు ఎప్పటికిని కానేరరు. ఇక స్వర్గమున సర్వదా ఎట్లుండగలుగుదురు? ఉత్పన్నమగు పదార్థ మవశ్యముగ నశించుచున్నది. పై భాగమందాకాశము నెట్లు చేయగలుగును? ఏమనగా ఇది నిరాకారమై విభువైన పదార్థము. వేరొక వస్తువున కాకాశమను పేరిడుచున్నారేని, దాని కాకాశమను పేరిడుటయు నిరర్థకమే. పైభాగమున ఆకాశముల జేసియునాడేని వానియన్నింటి మధ్య సూర్యచంద్రు లెన్నడు నుండజాలరు. మధ్య నుంచబడిరన్న, మీది దొకటి క్రిందిదొకటి మాత్రము ప్రకాశితమగును. రెండవది మొదలుకొని అన్నిటీ యం దంధకారమే యుండును. ఇట్లు గోచరమగుట లేదు. కావున ఈ వార్త సర్వథా మిథ్యయే.(143)

144. ఇంకా ఏమిటంటే, మసీదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కనుక వాటిలో అల్లాహ్‌తోపాటు ఇతరులెవ్వరినీ ప్రార్థించకండి. - అల్ జిన్న్ సూరా :18.

సమీక్ష:- ఈ మాట నిజమేని ముసల్మానులు 'లాయిలాహ ఇల్లలా: అను 'కలము' వాక్యమున ఖుదాతో గూడ మహమ్మదు సాహెబు నెందులకు పిలుచుచున్నారు? ఇట్లు పిలుచుటకు ఖురానునకును విరుధమేకదా! విరుద్ధము కాదందురేని, ఈ ఖురాను వాక్యము అబద్ధము చేయుచునాన్నిరు. మసీదులు ఖుదాగృహములయిన ముసల్మానులును విగ్రహారాధకులరి. చిన్న చిన్న విగ్రహములను ఈశ్వర మందిరములని నమ్ముజైనులును, పౌరాణికులును విగ్రమారాధకు లనబడునటులే వీరేల అనబడకుందురు.(144)

145. సూర్యచంద్రులు ఒకటిగా కలిపివేయబడినప్పుడు - అల్ ఖియామహ్ సూరా : 9

సమీక్ష:- సరి ! సూర్యచంద్రు లెన్నడయిన నొకచోట గూర్పబడగలరా? ఇదెట్టి యవివేకమయిన వార్తయో గమనింపుడు! సూర్యచంద్రులనే యొకచోట చేర్చుట కేమిప్రయోజన ఉండెను? అన్యలోకము

లన్నింటి నొకచోట చేర్పకపోవుట కేమియుక్తి కలదు? ఇట్టి యసంభవ విషయము లెన్నడైన నీశ్వరకృతములు కాగలవా? పామరులవి దప్ప విద్వాంసుల వెప్పటికిని గానేరవు.(145)

146. వారి సేవ కొరకు పరుగెత్తుతూ అటూ ఇటూ తిరిగే బాలుదు ఉంటారు; వారు ఎల్లప్పుడూ బాలురుగానే ఉంటారు. మీరు వారిని చూస్తే, వెదజల్లబడిన అణిముత్యాలా అని అనుకుంటారు. వారికి వెండి మురుగులు తొడుగుతారు. వారి ప్రభువు వారికి ఎంతో పరిశుద్ధమైన మద్యాన్ని ప్రసాదిస్తాదు. – అద్ దహ్ర సూరా :18,21.

సమీక్ష:– ఏమండీ! ముత్యములవంటి కాంతిగల పిల్లకాయ లచట నెందుల కుంచబడుచున్నారు? ఏమి, యువకులు వారిసేవ జేయలేరా? స్త్రీ జనము వారికి తృప్తి కలుగజేయజాలరా? దుష్టులు పిల్లకాయలతో నేయేగొప్ప దుష్కర్మల నొనరించుచున్నారో, దానికి మూల మీ ఖురాను వచనమే కావచ్చు ననుట కాశ్చర్యమేమి! ఇక స్వర్గమున స్వామి సేవకభావము బట్టి స్వామి కానందమును, సేవకునికి పరిశ్రమ చేయుటవలన దుఃఖమును గలుగును గద. ఈ పక్షపాత మట నెందులకు గలదు? ఖుదాయే సారా త్రాగించుచున్న అతడుకూడ వారికి సేవకుని వంటివాడేయై నిలుచును. ఇక ఖుదా గొప్పతనమెట్లు స్థిరపడగలుగును? స్వర్గమందు స్త్రీపురుషులకు సంపర్కమును అట్లే గర్భస్థితియు గలిగి వారు సంతాన వంతులు గూడ నగుట కలదా? లేదా? లేదన్న వారి విషయ భోగములు వ్యర్థమయ్యెను. కలదన్న ఆ జీవము లెక్కడినుండి వచ్చును? ఖుదా సేవచేయనిదే వారు స్వర్గమున ఎందులకు జన్మించిరి? జన్మించిరిపో! (ఈమాన్) మతవిశ్వాసము కలుగకున్నను. ఖుదాభక్తి సలుపకున్నను, వారి కనాయాసముగనే స్వర్గము లభించెనుగదా! కొందరకు (ఈమాన్) మతవిశ్వాసము కలుగుటవలనను, మరికొందరకు ధర్మము నాచరింపకున్నను సుఖము లభించుచున్న నింతకంటె గొప్ప అన్యాయ మేమికాగలదు? (146)

147. అందులో ఎలాంటి చల్లదనాన్ని, పానీయాన్ని వారు చవిచూడలేరు. అది (వారి కర్మలకు) పరిపూర్ణ ప్రతిఫలం. ఆత్మ, దూతలు బారులు తీరి నిలబడే రోజున,

– అన్ నబా సూరా :24, 26, 38.

సమీక్ష:– కర్మానుసారముగా ఫలమొసంగబడునన్న, స్వర్గమున నుండెడు చక్కని స్త్రీలకు, ఫరిశ్తాలకు, ముత్యమువంటి పిల్లకాయలకు ఏ కర్మములను బట్టి ఎల్లప్పుడుండుట అను స్వర్గము లభించెను? గిన్నెలు నింపుకొనుచు సారాయి త్రాగుదురేని మత్తెక్కి ఏల పోట్లాడకుందురు? ఇట (రూహు) ఫరిశ్తాలలో ఒక గొప్ప ఫరిశ్తా అనిభావమేమి? ఖుదా రూహును అన్యఫరిశ్తాలను వరుసగా నిలువబెట్టి సైన్యమును ప్రోగుచేయునా! సైన్యము ద్వారా జీవులందరకు శిక్ష గలుగజేయునా? మరి ఖుదా ఆసమయమున నిలువబడి యుండునా? లేక కూర్చుండి యుండునా? ఖుదా ప్రళయకాలము వరకైనను తానే సైన్యమునంతయు ప్రోగుచేసి ఆసైతానును పట్టుకొనునేని అతనిరాజ్యము నిష్కంటకముగ సాగగలుగును. దీనినే ఖుదాతన మందురు కాబోలు. (147)

148. సూర్యుడు చుట్టివేయబడినప్పుడు, నక్షత్రాలు చెదరిపోయినప్పుడు, పర్వతాలు నడిపించబడినపుడు, ఆకాశానికున్న తెర తొలగించబడినప్పుడు

– అత్ తక్వీర్ సూరా :1-3, 11.

సమీక్ష:– గుండ్రముగా నున్న సూర్యలోకము చుట్టబడుననుట కడుతెలివి మాలిన మాటయేకద. చుక్కలు రాలుదురుట ఎట్లు? జడములైన పర్వతము లెట్లు చలించును? చర్మమూడదీయబడుననుట కాయాకాశము నొక పశు వనుకొనెనా యేమి? ఇవి అజ్ఞానముతో కూడిన గొప్ప పామరత్వపు మాటలే అనబడును. (148)

149. ఆకాశం బ్రద్దలైనప్పుడు, నక్షత్రాలు చెదరిపోయినప్పుడు, సముద్రాలు చీల్చబడినప్పుడు, సమాధులు తెరువబడినప్పుడు **– అల్ ఇన్‌ఫితార్ సూరా : 1-4.**

సమీక్ష:– ఖురానును రచించు తత్త్వవేత్త! సెబాస్ సెబాస్!! ఆకాశమును బ్రద్దలుగ నెట్లు చేయగలుగును? చుక్కలను ఎట్లు రాల్చగలుగును? ఏమి? సముద్రములు చీల్చబడుట కవి కఱ్ఱలా? బ్రతికింప గలుగు ననుట కా సమాధులే పీనుగులా? ఇవన్నియు పసిపిల్లల మాటవంటివే యగును. (149)

150. దృఢమైన బురుజులు గల ఆకాశం సాక్షిగా! ఈ ఖురాన్ మహత్తరమైనది. ఫలకంపై వ్రాయబడి భద్రంగా ఉన్నది. **– అల్ బురూజ్ సూరా :1,21,22.**

సమీక్ష:– ఈ ఖురానును రచించినవాడు ఖగోళభూగోళముల నెంతమాత్ర మెరెగకుండెను. లేనిచో ఆకాశమును కోటవంటి బురుజులందురేని తక్కినవేల బురుజులు గాకుండును? కావున అవి బురుజులు కావు. కావున ఆ చుక్కలన్నియు లోకములే. మరి ఆ ఖురాను ఖుదావద్దనున్నదా యేమి? ఆ ఖురాను అతనిచే రచింపబడిన దేయైన, అదియు ఇంతకంటె అధిక జ్ఞానశూన్యము యుక్తిశూన్యము నగు అవిద్యతో కూడి యుండవచ్చును. (150)

151. వీరు (అంటే మక్కా అవిశ్వాసులు) కొన్ని పన్నాగాలు పన్నుతున్నారు, నేను కూడ ఒక పన్నాగం పన్నుతున్నాను. **– అత్ తారిఖ్ సూరా :15,16.**

సమీక్ష:– మోసపుచ్చుటయే టక్కనబడును గద. ఖుదాకూడ టక్కరియేనా యేమి? దొంగతనము దొంగతనమే. అబద్ధమున కబద్ధమే యుత్తరమా! ఒక దొంగ ఒకసజ్జనపురుషునింట దొంగతనము చేసిన ఆ సజ్జనపురుషుడు సయిత మాతని యింటికిబోయి దొంగతనము చేయవలయునా? ఖురానును రచించిన వాడా! సెబాస్!! సెబాస్!! (151)

152. మీ ప్రభువు అవతరిస్తాడు, దైవదూతలు బారులుగాతీరి నిలబడి ఉంటారు. ఆ రోజున నరకం ముందుకు తీసుకురాబడుతుంది. **– అల్ ఫజ్ర్ సూరా :22,23.**

సమీక్ష:- చెప్పరు! కోటపాలకుడు గాని సేనాధ్యక్షుడుగాని తన సైన్యమును పంక్తిపూర్వకముగ వెంటగొని తిరుగునట్లే వీరి ఖుదా కూడ తిరుగునాయేమి? ఇంత చిన్నదేని అందులసంఖ్యాకులగు ఖైదీలెట్లు పట్టగలరు? (152)

153. అప్పుడు దైవప్రవక్త ఆ ప్రజల్ని, "జాగ్రత్త! దేవుని ఒంటె జోలికి పోకండి, దాన్ని నీళ్ళు త్రాగకుండా అటంకపరచకండి" అని హెచ్చరించాడు. కాని వారు ఆయన మాటను ధిక్కరించి ఒంటెను చంపేశారు. చివరకు వారి పాపాల పర్యవసానంగా వారి ప్రభువు వారందరినీ ఒకేసారి సర్వనాశనం చేసే మహావిపత్తును వారిపైకి పంపాడు.

– అష్ షమ్స్ సూరా: 13,14.

సమీక్ష:- ఏమి! ఖుదా సైతము లొట్టిపిట్టమీద నెక్కి తిరుగుచుండునా? లేనిచో ఉంచిన దెందులకు? ప్రళయముకాకుండుటకు పూర్వమే తన నియమమును రద్దుపరచి మారియను రోగమును వారికేల కలుగజేసెను? అట్లు కలుగజేసినపుడు వారిని దండించినవాడే అయ్యెను. ఒక ప్రళయము నాటి రాత్రి న్యాయము చేయుననుటయు ఆ రాత్రి కాబోవుననుటయు అబద్ధమేనా? ఈ ఒంటె విషయమై వ్రాయబడిన లేఖను జూచి అరేబియా దేశమునందు లొట్టిపిట్టలు తప్ప, ఇతర వాహనములు చిక్కుట అరుదుగాన నీఖురాను ఒక యరేబియా దేశవాసుడు రచించినాడని అనుమానింపబడుచున్నది. (153)

154. అతడు గనక మానకపోతే, మేము అతన్ని, అతని నుదుటి వెంట్రుకలు పట్టుకుని ఈడుస్తాము; అబద్ధానికి, ఘోరపాపానికి పాల్పడిన నుదురు అది. మేము కూడా మా శిక్షించే దూతల్ని పిలుచుకుంటాము.

– అల్ అలఖ్ సూరా :15,16,18.

సమీక్ష:- ఈడ్చుటయను ఈ నీచమైన పరిచారకవృత్తిని చేయుటకు కూడ ఖుదా బాధ్యుడయ్యెనే. ఔరా! జీవుడు తప్ప నాసలెన్నడయిన అబద్ధము పలుకునా? అట్లే అపరాధ మొనరించునా? సెబాస్! చెరసాల సంరక్షకుని పిలిపించునటువంటి వాడెన్నడయిన ఖుదా కాగలడా? (154)

155. మేము దీని (ఖురాన్) ని ఘనమైన రాత్రియందు అవతరింపజేసాము. ఆ ఘనమైన రాత్రి ఏమిటో మీకు తెలుసా? ఆ రాత్రి ఆత్మ, దైవదూతలు తమ ప్రభువు అనుమతితో ప్రతి ఆజ్ఞను తీసుకుని అవతరిస్తారు.

– అల్ ఖద్ర్ సూరా : 1,2,4.

సమీక్ష:- ఒకరాత్రిని ఖురానును దించెనన్న 'ఫలానా అయతును ఫలానా సమయమందు నిట్లు క్రమక్రమముగా దించెనను టెట్లు సత్యమగును? రాత్రి చీకటితో కూడినదేగా! ఇక అందడుగవలసిన దేమున్నది? క్రింద మీదు లెంతమాత్రము కానేరవని మేము వ్రాసియున్నాము. ఇక ఇక్కడ ఫరిశ్తాలును, పవిత్రాత్ములును, ఖుదాయాజ్ఞగాని, సంసారమున నేర్పాటులు చేయుటకు

వచ్చుచున్నారని వ్రాయుచున్నారు. దీనివలన ఖుదా ఏకదేశీయుడనియే స్పష్టమయ్యెను. ఖుదా, ఫరిశ్తాలు, పైగంబరులను ఈ ముగ్గురి కథయే కలదని ఇంతవరకు తెలిసికొని ఉంటిమి. కాని పవిత్రాత్మయను నాల్గవవాడొకడు బయలుదేరినాడు. ఈ నాల్గవ పవిత్రాత్మ అనునదేమో తెలియకున్నది. ఇది క్రైస్తవ మతస్థులు నమ్ముపితా, పుత్ర, పవిత్రాత్మలను మూటికంటె నాల్గవ దొకటి ఎక్కువయే అయ్యెను గద. మేమీమూటిని ఖుదాయని యంగీకరింప మందురేని అట్లే కానిండు. కాని పవిత్రాత్మ వేరై ఉన్నప్పుడు ఖుదా, ఫరిశ్తా, పైగంబరులను పవిత్రాత్మలనవలయునా లేదా? పవిత్రాత్మ కలదేని ఒకరికే పవిత్రాత్మ అను పేరెందులకు? మరి ఖుదా గుర్రములు మున్నగు పశువుల మీదను, దినరాత్రుల మీదను, ఖురాను మున్నగు వాని మీదను ప్రతిజ్ఞ చేయుచున్నాడు. శపథము సజ్జనుల పని కానేకాదు. (155)

ఇక్కడ ఈ ఖురాను విషయమును వ్రాసి "ఈ పుస్తకమెటులున్నదో కనుగొనుటకుగాను" బుద్ధిమంతుల ఎదుట పెట్టుచునాఙ్నిడను. నన్నడుగుదురేని ఈ పుస్తక మీశ్వర రచితముకాని, ఒక విద్వాంసునిచే రచియింపబడినది కాని కాదు. ఇది ఒక జ్ఞానమునిచ్చు పుస్తకమును కాజాలదు. మనుష్యులు భ్రమలోబడి తమ జన్మములు వ్యర్థము చేసికొనకుండుటకు ఇట కొన్ని దోషములను మాత్రమే ప్రకటించినాను. ఇక ఇందుగల కించిన్మాత్ర సత్యము నటులే యన్యమతము లందలి హితములు కూడ పక్షపాత రహితులయిన విద్వాంసులకును, బుద్ధిమంతులకును గ్రాహ్యములే. ఇదియుగాక ఇందుగలదంతయు అవిద్యాభ్రమజాలములతో కూడినట్టియు, మనుష్యుని, ఆత్మను పశువుతో సమానముగా చేసి శాంతి భంగము కలుగ జేయునట్టియు నంశమే అని ఎరుగదగును. అట్లే పునరుక్త దోషములకు ఈ ఖురాను నిలయమేయై ఉన్నది. అందురతో అందరకు ప్రీతి కలుగునట్లును పరస్పర సంఘీభావము సిర్థరపడి ఒండొరుల సుఖాభివృద్ధి కొరకు అందరు పాటుపడునట్లును ఆపరమేశ్వరుడు మనుష్యులందరమీద కృపచేయునుగాత! నేను నా దోషమ్ములగాని ఇతర మతమతాంతరములందలి దోషములనుగాని పక్షపాత రహితుడనయి ఎట్లు ప్రకాశపరచుచున్నానో అట్లే విద్వాంసులందరు నొనర్తురేని పరస్పర విరోధము తొలగి మిత్రత్వము కుదిరి ఆనందపూర్వకముగ ఒక్కమతమే స్థిరపడి సత్యము చేకూర వచ్చును. ఇట్లు సంక్షిప్తముగ ఖురాను విషయమును వ్రాసియున్నాడను. బుద్ధిమంతులైన ధర్మాత్ములు, గ్రంథకర్త యొక్క అభిప్రాయమును గుర్తెరిగి దీనినుండి లాభము పొందుదురుగాక. అట్లే ఎక్కడనయిన భ్రమతో అన్యథా వ్రాయబడినదానిని సవరించుకొందురుగాక! ఇంకనొక విషయము శేషించి యున్నది. అదేమన అనేక ముసల్మానులు 'మా మతసమాచార మథర్వణ వేదమన వ్రాయబడియున్న'దని చెప్పుచు వ్రాయుచు ప్రచురింప జేయుచు నున్నారు. కాని అథర్వణ వేదమందు దాని నామచిహ్నముగూడ లేదనుటయే దీనికుత్తరము.

ప్రశ్న:- మీరు అథర్వణ వేదమంతయు జూచియున్నారా? చూచియున్న అల్లోపనిషత్తును చూడుడు. సాక్షాత్తుగ అందు వ్రాయబడియే ఉన్నది! మరల అథర్వ వేదమందు ముసల్మానుల నామచిహ్నము గూడ లేదని ఎందుల కనుచున్నారు?

అల్లోపనిషదం వ్యాఖ్యాస్యామః

అస్మాల్లాం ఇల్లే మిత్రావరునా దివ్యాని ధత్తే॥ ఇల్లల్లే వరుణో రాజా పునర్దదుః॥ హయా మిత్రో ఇల్లాం ఇల్లల్లే ఇల్లాం వరుణోమిత్రస్తే జస్కామః॥ 1॥ హోతారమింద్రో హోతారమింద్ర మహాసురింద్రాః॥ అల్లో జ్యేష్ఠం శ్రేష్ఠం పరమం పూర్ణం బ్రహ్మాణం అల్లామ్ ॥2॥ అల్లో రసూలమహామదరక బరస్య అల్లో అల్లామ్ ॥3॥ ఆదల్లా బూక మేకకమ్ ॥ అల్లా బూకక నిఖాతకమ్ ॥4॥ అల్లో యజ్ఞేన హుత హుత్వా అల్లా సూర్యచంద్ర సర్వనక్షత్రాః ॥5॥ అల్లా ఋషీణాం సర్వ దివ్యాం ఇంద్రాయ పూర్వం మా యా పరమ మంతరిక్షాః ॥6॥ అల్లః పృథివ్యా అంతరిక్షం విశ్వరూపమ్ ॥7॥ ఇల్లాంకబర ఇల్లాంకబర ఇల్లా ఇల్లల్లేతి ఇల్లల్లాః ॥8॥ ఓం అల్లా ఇల్లల్లా అనాదిస్వరూపాయ అథర్వణాశ్యామా హుం హ్రీం జనానపశునసిద్ధాన్ జలచరాన్ అదృష్టం కురుకురుఫట్ ॥9॥ అసుర సంహారిణీ హుం హ్రీం అల్లో రసూల మహామదరకబరస్య అల్లోఅల్లామ ఇల్లల్లేతి ఇల్లల్లాః ॥10॥

ఇత్యల్లోపనిషత్ సమాప్తా

ఇందు ప్రత్యక్షముగ మహమ్మదుసాహెబును రసూలని వ్రాయుబడినది. కావున ముసల్మానుల మతము వేదమూలకమనియే దీనివలన సిద్ధమగుచున్నది.

జవాబు:- మీరు అథర్వణ వేదాన్ని చూడకున్న మా దగ్గరకు రండు. ఆదినుండి అంతము వరకు చూడుడు. లేదా ఇరువది కాండలతో కూడియున్న 'మంత్ర సంహిత' అథర్వణ వేదమును ఏ అథర్వణ వేదీయుని యొద్ద నున్నను పోయి చూచుకొనుడు. మీ పైగంబరుసాహెబు నామముగాని మత చిహ్నముగాని అందు చూడజాలరు. ఈ అల్లోపనిషత్తనునది అథర్వణ వేదమందుగాని, దానిగోపథ బ్రాహ్మణమందుగాని శాఖయందుగాని లేదు. అక్బర్‌బాద్‌షాహ కాలమున ఒకడు దీనిని రచియించినాడని మాత్ర మనుమానింపబడుచున్నది. దీనిని రచియించినవాడు కొంత అరబ్బీ కొంత సంస్కృతముగూడ చదివియున్నట్లు గోచరమగుచున్నది. ఏమనగా నిందు అరబ్బీ పదములును, సంస్కృతపదములును ప్రయోగింపబడియుజూన్నవి. చూడుడు! 'అస్మాల్లాం ఇల్లే మిత్రావరుణా దివ్యాని ధత్తే" ఇత్యాదులు పది అంకములతో వ్రాయబడి ఉన్నవి. ఎట్లనగా "అస్మాల్లాం తథా ఇల్లే ఇల్లే" అనునవి అరబ్బీ పదములు "మిత్రా వరుణా దివ్యాని ధత్తే" ఇవి సంస్కృతపదములు. ఇటులే అంతట వాడబడియున్నందున దీనిని సంస్కృత అరబ్బీ భాషలు చదివిన వాడొకడు రచించెననుట స్పష్టము. దీనియర్థము చేసితిమేని యది కృత్రిమమును, అయుక్తమును వేదశైలికిని వ్యాకరణమునకును విరుద్ధమునై యున్నది. ఈయుపనిషత్తు రచించినటులే పక్షపాతముగల వివిధమత సంప్రదాయులు అనేకోపనిషత్తులు వ్రాసియున్నారు. అనగా స్వరూపోపనిషత్తు, నృసింహతాపని, రామతాపని, గోపాలతాపని మొదలగుననెన్నియో వ్రాయబడినవి.

ప్రశ్న:- నేటి పర్యంతం ఒక్కరూ ఇట్లు చెప్పలేదే. ఇప్పుడు మీరే అనుచున్నారు. మీ మాటను మేమొప్పుకొనుట ఎట్లు?

జవాబు:- మీరొప్పుకొన్నను నొప్పుకొనకపోయినను మామాట అబద్ధము కాజాలదు. ఇది అయుక్తముగా నున్నదని నేనెట్లు కనబరచి యున్నానో ఆ ప్రకారమే మీరును అథర్వణవేదమునగాని, గోపథమందుగాని దానిశాఖలుగా వ్రాయబడిన ప్రాచీన పుస్తకములందుగాని దీనినిజూపి అర్థము (సంగతమగునట్లు కూడ) నిరూపింతురేని అది సప్రమాణము కాగలదు.

ప్రశ్న:- మామత మెంతమంచిదో చూడుడు. అందన్నివిధముల సుఖ మలవడుటయే గాక అంతమందు ముక్తికూడ లభించును.

జవాబు:- "మామతమే మంచిది. తక్కినవన్నియు చెడ్డవి. మా మత మందు తప్ప మరేమతమందును ముక్తి లభింపదు" అని ఇట్లు వివిధ మతస్థులందరును చెప్పుకొనుచున్నారు. మీ మాటను సత్యమని నమ్మవలయునా? లేక వారి మాటనా? మేము మాత్రము సత్యభాషణము, అహింస, దయ మొదలగు శుభగుణము లన్నిమతములందును మంచివనియు, దక్కినవాదవివాదముల ఈర్ష్యాద్వేషములు మిథ్యాభాషణాది కర్మము లన్నిమతములందును చెడ్డవనియు నమ్ముచున్నాము. మీరు సత్యమతమును స్వీకరింపగోరుదురేని వేదమతమునే స్వీకరింపుడు.

స్వమన్తవ్యామన్తవ్యములు సంక్షేపంగా వ్రాయబడును.

శ్రీమత్పరమహంస పరివ్రాజకులు, పరమ విద్వాంసులు,

శ్రీ గురు విరజానంద సరస్వతీ స్వాముల శిష్యులైన

శ్రీమత్పరమహంస పరివ్రాజకాచార్య

మహర్షి దయానందసరస్వతీస్వామి విరచిత సత్యార్థ ప్రకాశము,

రంగారెడ్డి జనపదమునందలి కొందుర్గు మండలాంతర్గత రావిర్యాల

గ్రామవాస్తవ్యులు స్వ. శ్రీమతి శివనీలమ్మ, స్వ. శ్రీ బుగ్గారెడ్డి గార్ల పుత్రుడు,

కళాప్రపూర్ణ, వేదతత్త్వవేత్త పండిత గోపదేవశాస్త్రి దర్శనాచార్యుల శిష్యుడు,

వేదగిరి సంస్థాపకుడు, సిద్ధాంతాలంకార, విద్యాభూషణ, ఆర్షవిద్యావినోద బిరుదాంకితుడు

ఆచార్య మర్రి కృష్ణారెడ్డిచే

(పూర్వానువాదకర్తల గ్రంథ సహాయంతో)

అనువదించబడినది.

ఓం శాంతిః శాంతిః శాంతిః

స్వమంతవ్యామంతవ్య ప్రకాశము

సర్వతంత్ర సిద్ధాంతాన్ని అనగా సనాతన కాలం నుండి సార్వజనీన సామ్రాజ్యాన్ని, ధర్మాన్ని అందరూ అంగీకరిస్తూ వచ్చారు. అంగీకరిస్తున్నారు, అంగీకరిస్తారు కూడా కావున దానిని సనాతన ధర్మమనీ, నిత్యధర్మమనీ అంటారు. దీనికెవరూ విరోధులుండరు. అవిద్యతో కూడిన వారుగాని, ఇతర మతస్థులచే భ్రమింపజేయబడినవారు కాని ఆ సనాతనధర్మాన్ని వేరుగా భావించినను, విశ్వసించినను బుద్ధిమంతులెవ్వరూప మాత్రం స్వీకరింపరు. 'ఆప్తులు' అనగా సత్యాన్ని అంగీకరించువారు, సత్యవాదులు, సత్యాచరణ కలవారు, పరోపకారులు, పక్షపాత రహితులు, విద్వాంసులు, దీనినంగీకరిస్తారో అదియే మంతవ్యమని అందరి అభిప్రాయం. ఏదానినైతే పై ఆప్తులు అంగీకరింపరో అది అమంతవ్యము అనగా అందరి అభిప్రాయముకాదు. అందుచే అది ప్రమాణ యోగ్యము కాజాలదు. వేదాది సత్యశాస్త్రాలు, బ్రహ్మ మొదలు జైమిని ముని పర్యంతం వరకు అంగీకరించిన ఈశ్వరాది పదార్థాలను నేను అంగీకరిస్తూ. సమస్త సజ్జన మహాశయుల ముందుంచుచున్నాను.

నేను త్రికాలములందు అందరూ ఒకేవిధంగా అంగీకరించుటకు యోగ్యమైన దానినే నా అభిప్రాయంగా భావింతును. కొత్తమతాన్ని స్థాపించాలని గాని, ఉన్నమచాలలో ఏదో ఒక దానిని ప్రచారం చేయాలనిగాని అభిప్రాయం కాదు. నా నత్యమైన దానిని యంగీకరించుట, అంగీకరింపజేయుట, అసత్యమైన దానిని విడచుట, విడిపింపజేయుట నా యభీష్టము. ఒకవేళ నేను పక్షపాతం కలవాడనైతే ప్రచారంలోనున్న మతాలలో ఏదో ఒక మతాన్ని స్వీకరించేడివాడిని కాని ఆర్యావర్తముననే కాక ఇతర దేశాలలోగల అధర్మయుక్త ఆచార వ్యవహారాలను స్వీకరించుటగాని ధర్మ యుక్త మగు విషయాలను త్యజించుటాని చేయను. ఏలయన అటు లొనర్చుట మానవ ధర్మముకాదు.

మననశీలుడై తనకువలెనే అన్యుల సుఖ దుఃఖాలను, లాభ నష్టాలను తలంచిన వానినే మానవుడనాని. అన్యాయకారి యైన బలాఢ్యునికైననూ కూడా భయపడకూడదు. ధర్మాత్ముడై, నిర్బలుడైనను కూడా భయపడాలి. ఇంతేకాదు తన సమస్త సామర్థ్యముచే ధర్మాత్ములైన వారి ఉన్నతి కొరకు పాటుపడాలి. వారు చాలా అనాథలైనను, నిర్బలులైనను, గుణరహితులైనను వారిని రక్షిస్తూ,

ఉన్నతిని కలిగిస్తూ, ప్రియాచరణ కలిగియుండాలి. అధర్మాత్ముడైనవాడు చక్రవర్తియైనను, సనాథుడైనను, మహాబలాఢ్యుడైనను, గుణవంతుడైనను అతని నాశనంకొరకు, అవనతికొరకు ప్రయత్నించాలి. అనగా చేతనైనంత వరకు అన్యాయకారుల బలానికి హానిని, న్యాయకారుల బలమునకు ఉన్నతిని సర్వథా కలిగిస్తూండాలి. ఈ కార్యంలో అతనికి ఎంత దారుణ దుఃఖము ప్రాప్తించినను, ప్రాణాలు కూడా పోయినను. కాని ఈ మానవత్వ రూప ధర్మము నుండి ఎన్నడునూ వేరు కారాదు. దీనిని గురించి శ్రీమాన్ మహారాజైన భర్తృహరి వంటివారు శ్లోకాలను ఈ క్రింది విధముగా చెప్పారు. వాటిని వ్రాయుట ఉపయుక్తమని భావించి వ్రాయుచున్నాను.

1. నిందంతు నీతినిపుణా యది వా స్తువంతు ।
లక్ష్మీః సమావిశతు గచ్ఛతు వా యథేష్టమ్ ।
అద్యైవ వా మరణమస్తు యుగాంతరే వా,
న్యాయాత్పథః ప్రవిచలంతి పదం న ధీరాః ॥ (భ. హరి. నీతి. శత 84)

2. న జాతు కామా న్న భయా న్న లోభాత్,
ధర్మం త్యజే జ్జీవితస్యాపి హేతోః ।
ధర్మో నిత్యః సుఖదుఃఖేత్వనిత్యే,
జీవోనిత్యో హేతు రస్యత్వనిత్యః ॥ (మహా. భా. ఉద్యో. పర్వ 40/12)

3. ఏక ఏవ సుహృద్ధర్మో నిధనేప్యను యాతి యః ।
శరీరేణ సమం నాశం సర్వమన్యద్ధి గచ్ఛతి ॥ మను. 8-19 ॥

4. సత్యమేవ జయతే నానృతం సత్యేన పన్థా వితతో దేవయానః ।
యేనా క్రమన్త్యృషయో హ్యాప్తకామా యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్
॥ ముండ. 3-1-6 ॥

5. నహి సత్యాత్పరోధర్మో నానృతా త్పాతకం పరమ్ ।
నహి సత్యాత్పరం జ్ఞానం తస్మాత్ సత్యం సమాచరేత్ ॥ ఉ.ని. ॥

ఈ మహాశయుల శ్లోకాల అభిప్రాయానుసారంగా అందరు నిశ్చయించుకొనుట మంచిది.

ఇప్పుడు నేను యేయే పదార్థాలను ఏ విధంగా అంగీకరింతునో ఆయా వాని వర్ణనలను సంక్షిప్తముగా యిచట వ్రాస్తున్నాను. దానికి విశేష వ్యాఖ్యానం ఈ గ్రంథంలో ఆ ప్రకరణాలలో వ్రాయబడింది. వాని నుండి గ్రహించగలరు.

1. ప్రథమమున **'ఈశ్వరుడు'**. ఇతనికి 'బ్రహ్మ' అనియు, 'పరమాత్మ' అనియు నామము లున్నవి. ఇతడు సచ్చిదానందాది లక్షణ యుక్తుడు. ఇతని గుణ, కర్మ, స్వభావములును పవిత్రములు. ఇతడు సర్వజ్ఞుడు. నిరాకారుడు. సర్వవ్యాపకుడు, అజన్ముడు, అనంతుడు, సర్వశక్తిమంతుడు, దయాళువు, న్యాయకారి, సమస్త సృష్టికి కర్త, ధర్త, హర్త, సమస్త

జీవులకు కర్మానుసారంగా, సత్యంగా, న్యాయంగా ఫలితమొసగు ఫలదాత. ఇట్టి మున్నగు లక్షణాలు కలవాడు. అతనినే నేను పరమేశ్వరుడని అంగీకరింస్తాను.

2. **'చతుర్వేదా'** లను నిర్భ్రాంతమును కలిగించు స్వతః ప్రమాణాలని అంగీకరింతును. ఇవి విద్యతోను, ధర్మముతోను కూడిన ఈశ్వర ప్రణీతాలు. సంహితలు మంత్ర భాగాలు. ఇవి స్వయంగా ప్రమాణాలతో కూడి యున్నవి. అవే ప్రమాణాలని చెప్పుటకు మరి యే యితర గ్రంథాల అవశ్యకత లేదు. ఉదా :- సూర్యుడు కాని లేక ప్రకాశము గాని తను స్వరూపములతో స్వయముగా ప్రకాశించునట్టివి. పృథివి మున్నగువానికి కూడా ప్రకాశమొసగునట్టివి. అటులే నాలుగు వేదములున్నవి. ఇక నాల్గు వేదాలకు బ్రాహ్మణాలు, షడంగాలు, షడుపాంగాలు, చతురుపవేదాలు మరియు (1127) పదకొండు వందల ఇరువది యేడు వేద శాఖలున్నవి. ఇవన్నియు వేదాలకు వ్యాఖ్యాసరూపమై బ్రహ్మాది మహర్షుల ద్వారా రచింపబడిన గ్రంథాలు. వీనిని పరతః ప్రమాణాలుగా అనగా వేదానుకూలముగా నున్నవానిని ప్రమాణాలు గాను, ఇక వీనిలో వేదవిర్ధు వచనములున్నచో, వానిని అప్రమాణాలుగాను స్వీకరింతును.

3. పక్షపాతరహిత న్యాయాచరణం, సత్యభాషణాది యుక్త ఈశ్వరాజ్ఞ, వేదాలకు అవిరుద్ధం అయిన దానిని **'ధర్మ'** మనియు, పక్షపాత సహితమైన అన్యాయాచరణ, మిథ్యాభాషణాదులతో యుక్తమై, ఈశ్వరాజ్ఞకు భంగం కలిగించునట్టిదై, వేదాలకు విరుద్ధమైన దానిని **'అధర్మ'** మని అంగీకరింతును.

4. ఇచ్ఛ, ద్వేష, సుఖ, దుఃఖజ్ఞాన ప్రయత్నాది గుణాలతో యుక్తుడై, అల్పజ్ఞుడై, నిత్యుడైన వానిని **'జీవు'**డని, అంగీకరింతును.

5. స్వరూపముచే, భేదముచే జీవుడు మరియు ఈశ్వరుడు భిన్నులు. ఇక వ్యాప్య వ్యాపకత్వములచే, సాధర్మ్యముచే అభిన్నులు. అనగా ఉదా :- ఆకాశం నుండి మూర్తిత్వ పదార్థము లెన్నడు భిన్నం కాకుండెను, కావు, కాజాలవు. ఇక ఎన్నడు ఏకమై యుండకుండెను. ఉండవు. ఉండజాలవు. ఇదే విధంగా పరమేశ్వరుని మరియు జీవుని వ్యాప్య వ్యాపులుగాను, ఉపాస్య ఉపాసకులుగాను, పితాపుత్రుల సంబంధం కలవారిగాను విశ్వసింతును.

6. అనాది పదార్థాలు మూడు. 1. ఈశ్వరుడు 2. జీవుడు 3. ప్రకృతి. అనగా జగత్కారణము కలది. వీనిని నిత్యములని కూడ యందురు. నిత్య పదార్థముల గుణ, కర్మ, స్వభావములును కూడా నిత్యములు.

7. 'ప్రవాహముచే అనాది', సంయోగముచే ద్రవ్య, గుణ, కర్మ లుత్పన్నము లగును. ఇవి వియోగానంతర ముండవు. కాని ప్రథమ సంయోగముచే కలిగిన సామర్థ్యము వానిలో అనాది. ఇక దాని ద్వారా మాటి మాటికి సంయోగము, వియోగములుకూడ జరుగును. ఈ మూడింటిని ప్రవాహముచే అనాదిగా నంగీకరింతును.

8. 'సృష్టి':- వేర్వేరు పదార్థాలు, జ్ఞానం, యుక్తి పూర్వకంగా మిశ్రితత్వాన్ని పొంది (కలిసి) నానారూపము లేర్పడుటను సృష్టియందురు.

9. సృష్టి వలన ప్రయోజనమే మన ఈశ్వరుని సృష్టి నిమిత్తమై, అతని గుణ, కర్మ, స్వభావాలును సాఫల్యత గావించుట. ఉదా:- ఒకడు మరొకనితో నేత్రము లెందుకున్నవని? ప్రశ్నించెను. చూచుటకని అతడు చెప్పెను. అట్లే సృష్టిని సృజించుట యందే ఈశ్వరుని సామర్థ్య సాఫల్యత కలదు. ఇక జీవుల కర్మలకు యథావిధిగా ఫలితమును భోగింపచేయుట వంటి మున్నగునవి కూడ సృష్టి వలన కలుగు ప్రయోజనమే.

10. 'సృష్టి సకర్తృకము'! దీనికి కర్త పూర్వోక్త ఈశ్వరుడు. ఏలయన సృష్టి రచనను చూచుటవలన, జడ పదార్థము నందు తమంతట తాము యథాయోగ్యముగ బీజాది స్వరూప మేర్పడుటకు సామర్థ్యము లేదు. అందుచే సృష్టి యేర్పడుటకు సృష్టికి కర్త తప్పక యుండవలెను.

11. **'బంధము'**. సనిమిత్తికము అనగా అవిద్యా నిమిత్తముచే కలుగును. ఆయా పాపకర్మలు చేయుట అనగా ఈశ్వరభిన్నోపాసన, అజ్ఞానము మున్నగునవన్నియు దుఃఖఫలము నొసగునట్టివి. ఇందువలన ఇది 'బంధము' అనగా ఇష్టము లేకున్నను అనుభవింపవలసి వచ్చునది.

12. **'ముక్తి'** అనగా సమస్త దుఃఖాల నుండి విడిపోయి బంధరహిత సర్వవ్యాపకుడునగు ఈశ్వరుని యందు మరియు అతని సృష్టి యందు స్వేచ్ఛగా సంచరించుట, నియత సమయ పర్యంతము ముక్త్యానందము ననుభవించి మరల ప్రపంచమునకు వచ్చుట.

13. **'ముక్తి సాధనములు'** ఈశ్వరోపాసన అనగా యోగాభ్యాసం, ధర్మానుష్ఠానం, బ్రహ్మచర్యముచే విద్యను పొందుట, ఆప్త విద్వాంసుల సాంగత్యము, సత్యవిద్య, సువిచారం, పురుషార్థం మున్నగునవి.

14. **అర్థము:-** ధర్మపూర్వకంగా నార్జింపబడునదియే 'అర్థము'. అధర్మముచే సిద్ధమగుదాని ననర్థమందురు.

15. **కామము:-** ధర్మార్థములచే ప్రాప్తమగునది 'కామము'.

16. **వర్ణాశ్రమాలు:-** వర్ణాశ్రమాలను గుణ, కర్మల యోగ్యతను బట్టి నమ్ముచున్నాడను.

17. **రాజు:-** శుభ గుణ, కర్మ, స్వభావాలచే ప్రకాశమానుడు, పక్షపాతరహితుడు, న్యాయ ధర్మముల సేవించువాడును, ప్రజలతో పితృ తుల్యముగ వర్తించుచు వారిని పుత్రుల వలె భావించి వారి యున్నతి కొరకు సుఖాభివృద్ధి కొరకు సర్వదా ప్రయత్నము చేయువాడునగు నతడే రాజు అనబడును.

18. **ప్రజలు:-** మంచి గుణ, కర్మ, స్వభావములు గలవారు, పక్షపాత రహితమగు న్యాయ ధర్మములను సేవించుచు రాజప్రజల యున్నతిని గోరువారు, రాజద్రోహరహితులై, రాజుతో పుత్రుల వలె వర్తించువారును 'ప్రజ'లనబడెదరు.

19. న్యాయకారి:- సర్వదా ఆలోచిస్తూ అసత్యాన్ని త్యజించి, సత్యాన్ని గ్రహించువాడు, అన్యాయకారులను తొలగించువాడు న్యాయకారులను వర్ధిల్లజేయువాడు. తన ఆత్మ వలె అందరి సుఖాలను కోరువాడు నగు నతడే న్యాయకారి యనబడును. వానిని నేను గూడ యథాయోగ్యంగా అంగీకరిస్తున్నాను.

20. దేవాసురులు:- విద్వాంసులను 'దేవత' లని, పామరులను 'అసురు'లని, పాపాత్ములను 'రాక్షసు'లని, అనాచారులను 'పిశాచు'లని నమ్ముచున్నాడను.

21. దేవపూజ:- విద్వాంసులయిన మాత, పిత, ఆచార్యుడు అతిథి న్యాయకారి యగురాజు, ధర్మాత్ములగు జనులు, పతివ్రతా స్త్రీ, స్త్రీ వ్రతుడైన పతి వీరిని సత్కరించుటయే 'దేవపూజ'. దీనికి విపరీతమైనది అదేవపూజ యనబడును. మొదటి మూర్తులు పూజ్యము లనియు, నితర పాషాణాది జడమూర్తులు నితాంత మపూజ్యములనియు నమ్ముచున్నాడను.

22. శిక్ష:- 'శిక్ష' విద్య, సభ్యత, ధర్మాత్మత, జితేంద్రియత మున్నగునవి వృద్ధి బొందించుచు అవిద్యాది దోషాలను నశింపజేయునదియే శిక్ష.

23. 'పురాణాలు':- బ్రహ్మాదులచే రచింపబడిన ఐతరేయాది బ్రాహ్మణ గ్రంథాలనే పురాణ, ఇతిహాస, కల్ప, గాథా, నారాశంసీయాలని అంగీకరిస్తున్నాను. ఇతర భాగవతాదులను కాదు.

24. తీర్థాలు:- సత్యభాషణం, విద్య, సత్సాంగత్యం, యమాదులు, యోగభ్యాసం, పురుషార్థం, విద్యా దానాది శుభకర్మలు అను నివియే దుఃఖసాగరము నుండి తరింపజేయును. కాన వీనినే తీర్థాలని నమ్ముచున్నాడను. ఇతర జల స్థలాదులను కాదు.

25. పురుషార్థం:- 'పురుషార్థం ప్రారబ్ధమున కంటె గొప్పగా' అనగా దాని వలననే సంచిత ప్రారబ్ధము లొనగూడును. అది సవరింపబడిన వన్నియు సవరింపబడును, అది చెడిన అన్నియు చెడును. కావున ప్రారబ్ధమున కంటె పురుషార్థమే గొప్ప.

26. ప్రవర్తన:- మనుష్యుడు అందరితో యథాయోగ్యముగ, తనవలె జూచుచు సుఖ, దుఃఖ, హాని, లాభములందు వర్తించుట శ్రేష్ఠమనియు అన్యథా వర్తించుట నీచమనియు తలంచుచున్నాడను.

27. **సంస్కారాలు:-** దేనిచే శరీరము, మనస్సు ఆత్మ అనునవి ఉత్తమములగునో దానిని 'సంస్కార' మందురు. అది నిషేకాది శ్మశానాన్తము వరకు పదియారు విధములయి యున్నది. దీనిని కర్తవ్యమని తలచుచున్నాడను దహనానంతరము మృతినొందినవానికొర కేమియు చేయగూడదు.

28. **యజ్ఞం:-** ఎందు విద్వాంసుల సత్కారము యథాయోగ్యమైన శిల్పం - రసాయనమను పదార్థ విద్య, దాని ఉపయోగం, విద్యాది శుభగుణాల దానం అగ్నిహోత్రాదులచే వాయు

వృష్టి, జల ఓషధులను పవిత్రపరచి, జీవులందరకు సుఖము కలుగుజేయుట అనునవి కలుగునో అదియే యజ్ఞ మనబడును. కాన దాని నుత్తమమని దలంచుచున్నాడను.

29. **ఆర్యులు, అనార్యులు:-** శ్రేష్ఠ పురుషులను 'ఆర్యు'లనియు, దుష్టులను 'దస్యు'లనియు అనార్యులనియు నందురు. నేను కూడ నట్లే నమ్ముచున్నాడను.

30. **ఆర్యావర్తం:-** అది సృష్టి నుండి ఆర్యులిందు నివసించుచున్నారు. గాన నీ భూమికి 'ఆర్యావర్త' దేశమని పేరు. దీని యవధి ఉత్తరమున హిమాలయమువరకు, దక్షిణమున వింధ్యాచలము వరకు, పశ్చిమమున అటకు వరకు, పూర్వమున బ్రహ్మపుత్రానది వరకు గలదు. ఈ నాల్గింటి మధ్యనున్న భూభాగమునకు ఆర్యావర్త దేశమని పేరు. ఇంక నిందెల్లప్పుడుండువారిని కూడ ఆర్యులనుట కలదు.

31. **ఆచార్యుడు:-** సాంగోపాంగముగ వేదాలను చదివించువాడు. సత్యాచారాన్ని గ్రహింపజేయువాడు మిథ్యాచారాన్ని త్యజింపజేయువాడునగు నతడే ఆచార్యుడనబడును.

32. **శిష్యుడు:-** సత్యమైన శిక్షను, విద్యను గ్రహింపదగినట్టి ధర్మాత్ముడు విద్యా గ్రహణమం దిచ్చుగలవాడు, ఆచార్యునకు ప్రియుడైనవాడు నగు నతనిని 'శిష్యు'డందురు.

33. **గురువులు:-** తల్లియు, దండ్రియు, సత్యమును గ్రహింప జేసి, అసత్యమును త్యజింపజేయువాడు 'గురు'వనబడుచున్నాడు.

34. **పురోహితుడు:-** యజమానునకు హిత మొనర్చువాడు, సత్యోపదేష్టయు నగు నతడే 'పురోహితుడు'.

35. **ఉపాధ్యాయుడు:-** వేదము లందలి యొక భాగమును గాని అంగములు గాని చదివించువాడు "ఉపాధ్యాయుడు".

36 **'శిష్టాచారము':-** ధర్మాచరణ పూర్వకముగ బ్రహ్మచర్యముచే విద్యను గ్రహించి, ప్రత్యక్షాది ప్రమాణములచే సత్యాసత్యముల నిర్ణయించుకొని, సత్యమును గ్రహించి, అసత్యమును పరిత్యజించుటయే శిష్టాచారము. దీని నొనరించువాడు శిష్టుడనబడును.

37. **ప్రమాణములు:-** ప్రత్యక్షాది 'అష్ట ప్రమాణములను' గూడ నంగీకరించుచున్నాడను.

38. **'ఆప్తుడు':-** యథార్థము చెప్పువాడు, ధర్మాత్ముడు, అందరి సుఖము కొరకు ప్రయత్నము చేయువాడునగు నతనిని ఆప్తుడని చెప్పుచున్నాడను.

39. **పరీక్ష:-** అయిదు విధముల నగుచున్నది. (మొదటిది) ఈశ్వరుడు అతని గుణ, కర్మ, స్వభావములు, వేదవిద్య; (రెండవది) ప్రత్యక్షాదులగు నెనిమిది ప్రమాణములు; (మూడవది) సృష్టిక్రమము; (నాల్గవది) ఆప్తుల వ్యవహారము; (ఐదవది) తన యాత్మ జ్ఞానము పవిత్రత అను నీ పంచ విధ పరీక్షల చేత సత్యాసత్యములు నిర్ణయించుకొని సత్యమును గ్రహించి, అసత్యమును పరిత్యజింపదగును.

40. **పరోపకారము:-** దేనిచే మనుష్యులందరి దురాచారములు దుఃఖములు దూరమై శ్రేష్ఠాచారములు, సుఖములు వర్ధిల్లునో యటువంటి కార్యమును జేయుటయే పరోపకారమని భావి ంచుచున్నాడను.

41. **"స్వతంత్రుడు" "పరతంత్రుడు":-** జీవుడు తన కార్యము లందు స్వతంత్రుడు. ఇక నీశ్వర వ్యవస్థానుసారము కర్మఫలమనుభవించుట యందు పరతంత్రుడు. అటులే ఈశ్వరుడు తన సత్యాచారాది కర్మల యందు స్వతంత్రుడని యెరుగదగును.

42. **స్వర్గము:-** సుఖ విశేష భోగమును, తత్సామగ్రి ప్రాప్తిని "స్వర్గ"మని యందురు.

43. **నరకము:-** దుఃఖ విశేష భోగమును, తత్సామగ్రి ప్రాప్తిని "నరక"మని యందురు.

44. **జన్మములు:-** శరీరమును ధరించి ప్రకటమగుట 'జన్మము'. అది పూర్వ, పర, మధ్య, భేదముల బట్టి మూడు విధములని నమ్ముచున్నాడను.

45. **జన్మ మరణములు:-** శరీర సంయోగమునకు 'జన్మ'మని పేరు, అట్లే వియోగమే మృత్యువనబడుచున్నది.

46. **వివాహము:-** నియమపూర్వకముగా ప్రసిద్ధముగ స్వేచ్ఛానుసారముగ పాణిగ్రహణము చేయుటయే 'వివాహ'మనబడును.

47. **నియోగము:-** వివాహానంతరము మృతినొందుట మొదలుగా గల వియోగములందు గాని నపుంసకాది స్థిరరోగములందు గాని స్త్రీయో లేక ఆపత్కాలమందు పురుషుడో, స్వవర్ణమందుగాని తమ కంటె నుత్తమవర్ణము వారితో గాని సంతానముత్పన్నము చేయుట నియోగము.

48. **స్తుతి:-** గుణ కీర్తనము, శ్రవణము, జ్ఞానము ఇవి దేనిచే గలుగునో యది స్తుతి. దాని ఫలము ప్రీతి ఇత్యాదులు.

49. **ప్రార్థన :-** తన సామర్థ్యమునకు మించి ఈశ్వర సంబంధముచే లభించువిజ్ఞానాదుల కొరకు యీశ్వరుని యాచించుటయే ప్రార్థన. దాని ఫలము నిరభిమానాదులు.

50. **ఉపాసన:-** ఈశ్వరుని గుణ, కర్మ, స్వభావముల వలె దన గుణ, కర్మ, స్వభావములను పవిత్రము చేసికొనుట. ఈశ్వరుని సర్వవ్యాపకుడని, తను వ్యాప్యుడని యెరిగి ఈశ్వరుని సమీపమున మేమున్నాము. మా సమీపమందు ఈశ్వరుడున్నాడు, అను నిశ్చయము కలిగి యోగాభ్యాసముచే సాక్షాత్కారము చేసికొనుట యనునది 'ఉపాసన' యనబడును. దాని ఫలములు జ్ఞానోన్నతి మున్నగునవి.

51. **సగుణ నిర్గుణ స్తుతి - ప్రార్థనోపాసనలు:-** ఏ యే గుణములు పరమేశ్వరుని యందు గలవో ఆయా గుణయుక్తుడుగను, ఏవేవి లేవో వానికి వేరుగను. ఈశ్వరుని భావించి ప్రశంసించుటయే సగుణ నిర్గుణ స్తుతి. శుభగుణములు గలుగచేసి కొనవలెనను కోరిక

గలిగియుండుటయు, దోషముల దొలగజేయుటకు పరమేశ్వరుని సహాయము గోరుటయు, సగుణ నిర్గుణ ప్రార్థన యగును. ఇంక సకల గుణ సహితుడుగను, పరమేశ్వరుని నమ్మి, తన యాత్మ నతనికి నతని యాజ్ఞకు అర్పణ చేయుటయే సగుణ నిర్గుణోపాసన యనబడుచున్నది.

ఇట్లు సంక్షేపంగా మా సిద్ధాంతాలను తెలియపరచినాము. వీని విశేష వ్యాఖ్య నాచే రచింపబడి **'సత్యార్థ ప్రకాశము'లో** ఆయా ప్రకరణాలలో చూడగలరు. అట్లే ఋగ్వేదాది భాష్యభూమిక మున్నగు గ్రంథము లందును వ్రాసియున్నాము. అనగా ఏయే మాట లందరకు మాననీయములో వానినే అంగీకరించుచున్నాడను. సత్యము పలుకుట ఉచితము, అబద్ధము పలుకుట అనుచితము ఇది అందరకు సమానమైనది ఇట్టి సర్వమతాంగీకృత సిద్ధాంతాలనే స్వీకరించుచున్నాడను. మతమతాంతరాలలో గల పరస్పర విరుద్ధాలు నాను అనిష్టాలు. ఈ మతస్థులే తమ తమ మత ప్రచారము చేయుచు మనుష్యుల జిక్కించుకొని యొకరికొకరిని శత్రువులను చేసియున్నారు. కాని సీ యంశమును ఖండించి సత్యమును ప్రచురింపజేయుచు నందరనేక మతమున గూర్చుటకు ద్వేషము ద్యజింపజేసి పరస్పర దృఢప్రేమ యుక్తుల గావించి యందరతో అందరకు లాభం కలుగజేయుటకు మాత్రం నా ప్రయత్నమనియు అదియే నా యభిప్రాయమనియు గ్రహింపదగును. సర్వ శక్తిమంతుడగు పరమేశ్వరుని కృపాసహాయముల చేత. ఆప్తపురుషుల సహానుభూతి చేత 'ఈ సిద్ధాంతము' భూగోళమందంతట శీఘ్రముగ వ్యాపించుగాక! దాని వలన లోకులందరు అనాయాసముగ ధర్మార్థ కామ మోక్షాలను సిద్ధింపజేసికొని వృద్ధిబొందుచు సదా ఆనందమున నుందురుగాక! ఇదియే నా ముఖ్య ప్రయోజనము.

"అలమతివిస్తరేణ బుద్ధిమద్వరేషు" బుద్ధిమంతులకు విస్తరింప పనిలేదు.

ఓ౩మ్ శన్నో మిత్రః శం వరుణః । శన్నో భవత్వర్యమా ।
శన్న ఇంద్రో బృహస్పతిః । శన్నో విష్ణు రురుక్రమః ॥

నమో బ్రహ్మణే, నమస్తే వాయో, త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి,
త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మావాదిషమ్, ఋతమవాది
షమ్, సత్యమవాదిషమ్, తన్మా మావీత్, తద్వక్తారమా
వీత్ః, ఆవీన్మామ్, ఆవీద్వక్తారమ్ ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః

శ్రీమత్పరమహంస పరివ్రాజకులు, పరమ విద్వాంసులు,
శ్రీ గురు విరజానంద సరస్వతీ స్వాముల శిష్యులైన
శ్రీ మద్దయానంద సరస్వతీ స్వామి విరచిత
స్వ మ న్త వ్యా మ న్త వ్య ప్రకాశము సంపూర్ణము.

ఓం భూర్భువః స్వః। తత్సవితుర్వరేణ్యం భర్గో

ఓమ్

దేవస్య ధీమహి। ధియో యో నః ప్రచోదయాత్॥

సత్యాసత్యము తెలుసుకొనుటకై
స్వంత బుద్ధితో నడచుకొనుటకై

సత్యార్థ ప్రకాశం

చదవండి-చదివించండి

**సత్యాన్ని గ్రహించడానికి,
అసత్యాన్ని త్యజించడానికి
ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి**

- మహర్షి దయానంద సరస్వతి

వెల. ౬౦౦/-